విష్ణుమాయావిలాసము

(సుబోధిని వ్యాఖ్య)

కృతికర్త

ఎఱగుడిపాటి వేంకటకవి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి - 517 502

2013

VISHNUMAYA VILASAM
(Subodhini Vyakhya)

by

Sri Yeragudipati Venkatakavi

T.T.D. Religious Publications Series No.1006
© All Rights Reserved

First Edition : 2013

Copies : 1000

Published by :
L.V. SUBRAHMANYAM, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Office of the Editor-in-Chief
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

శ్రీకృష్ణదేవరాయలవారిచేత రాధామాధవకవిగా కొనియాడబడిన చింతలపూడి ఎల్లనార్యుడు విష్ణుమాయానాటకం అనే పేరుతో ఒక అపూర్వ పద్యకావ్యాన్ని రచించాడు. దాన్ని అనుసరించి కంకంటి పాపరాజు యక్షగానంగా, కంకంటి నారసింహరాజు ద్విపదకావ్యంగా, రోసనూరి వేంకటపతి పద్యప్రబంధంగా రూపొందించారు.

1700-1770 ప్రాంతంలో జీవించిన ఎరగుడిపాటి వేంకటకవి ఎల్లనార్యుని చిత్ర విచిత్ర కథలనే క్రమాన్ని మార్చి, వర్ణనలు పెంచి విష్ణుమాయావిలాస మనే పేరుతో ఐదాశ్వాసాల చంపూ ప్రబంధంగా వెలయించాడు.

విష్ణుమాయను అధిగమించడం బ్రహ్మరుద్రాదులకు గాని, నారదాది మహర్షులకుగాని శక్యంగాదు. సర్వవ్యాపకుడూ, సర్వజగత్కారణుడూ అయిన శ్రీమహావిష్ణువు యొక్క అఘటనఘటనా సమర్థమైన మాయా ప్రభావాన్ని నిరూపించే గాథలతో గూడిన ఈ ప్రబంధాన్ని వేంకటకవి నెల్లూరి సీమలోని బిట్రగుంటలో వెలసిన వేంకటేశ్వరస్వామివారికి అంకితమిచ్చాడు.

ఎరగుడిపాటి వంశస్థులందరూ నెల్లూరు సీమవారు; శ్రీనివాస భక్తులు. ఈ వేంకటకవి మనుమడైన వేంకటాచలం పంతులుగారు (1801-1874) అనేక దానధర్మములు, పెక్కు భగవత్కైంకర్యాలు చేసిన వదాన్యులు. వీరు నెల్లూరులోని రంగనాయకుల గుడికి గాలిగోపురం నిర్మించిన మహనీయులు. తమ తాతగారివలె గొప్పకవీశ్వరులు; రాసక్రీడలు, ముకుందశతకం మొదలైన పుస్తకాలు వ్రాసినవారు.

అలాంటి వేంకటాచలం పంతులుగారికి సాక్షాత్తూ పౌత్రు లయిన రామయోగి అనేవారి తనయుల్లో ఒకరైన ఎరగుడిపాటి భరద్వాజగారు తమ తండ్రిగారి పేరట ''శ్రీరామయోగి మెమోరియల్ ట్రస్టు''ను హైద్రాబాదులో స్థాపించి ప్రతిసంవత్సరం జనకుని జన్మదినోత్సవం జరుపుతూ ఎందరో పేదవిద్యార్థులకు ఆర్థికసహాయం అందించడమే గాక, కవులనూ, పండితులనూ సత్కరించే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. వారి అభ్యర్థన మేరకు విష్ణు తత్త్వవ్యాప్తికి దోహద పడగలదనే తలంపుతో సరళ టీకాతాత్పర్య సహితమైన ఈ విష్ణుమాయా విలాస ప్రబంధాన్ని తిరుమల తిరుపతి దేవస్థానముల స్వీయ ప్రచురణగా స్వీకరించి ప్రచురించడానికి సంతోషిస్తున్నాను. ఈ పుస్తకం పాఠకుల ఆమోదం పొందగలదని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

అర్చనం

శ్రీ విష్ణుమాయావిలాసమనే యీ రసవత్ ప్రబంధాన్ని రచించిన ఎఱగుడిపాటి వేంకటకవి - మా వంశీయుడని తెలుపుటకు ఆనందిస్తున్నాను. ప్రస్తుతం మా తరం వెనుకకు లెక్కించుకుంటే మా ముత్తాతగారైన వేంకటాచలంపంతులుగారు (1801-1874 సంవత్సరాల్లో వున్నందున) వారి తాతగారైన వేంకటకవిగారు (తరానికి 30 సం॥ చొప్పున లెక్కిస్తే) దాదాపు 1700-1770 ప్రాంతంలో వుంటారు. వీరి విష్ణు మాయావిలాస ప్రబంధాన్ని గూర్చి తెలుసుకున్న మేము 2005 సంవత్సరంలో శ్రీ వఝల వేంకటసుబ్రహ్మణ్యశర్మగారి సహాయంతో మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం నుండి ప్రత్యంతరం వ్రాయించి, తెచ్చి, ప్రకటించి ఈ ప్రబంధానికొక స్థితి కల్పించగలిగినాము. ప్రతి సంవత్సరం మేము శ్రీ ఎఱగుడిపాటి రామయోగి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో విష్ణుమాయా విలాసం గూర్చి పండితోపన్యాసాలను హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి పట్టణాల్లో ఏర్పాటుచేస్తే ఎందరెందరో కవులు, పండితులు పాల్గొని గ్రంథ ప్రాశస్త్యాన్ని తెల్పుతూ కవితా విశేషాలను వివరిస్తూ చక్కని ప్రసంగాలను చేసి అనేక నూతన విషయాలను ఆవిష్కరించిరి. ఈ విధంగా ఏర్పాటైన కార్యక్రమాల్లో ప్రసంగించిన కొందరు పెద్దల వ్యాసాలను సేకరించి '**సమాలోకనం**' పేరున 2009లో ఒక గ్రంథాన్ని ప్రచురించినాము. అది బాగా వ్యాప్తి చెందింది. మేము విష్ణు మాయా విలాసం ప్రకటించినప్పటి నుండి దీనికి ఒక సులభ వ్యాఖ్య వ్రాయిస్తే గ్రంథ విషయం సుగమంగా వుంటుందని పండితులెందరో తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచినారు. ఈ విధమైన వ్యాఖ్య వ్రాయించడానికి శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారు శ్రమించి పండితులను నిర్ణయించి, సుబోధకమైన ఈ వ్యాఖ్యను సిద్ధం చేయించినారు. ఇంతకు ముందే శ్రీ విష్ణుమాయా విలాసాన్ని ప్రచురించిన మాకు వ్యాఖ్యాయుతంగా

మళ్ళీ ముద్రించటం భారంగా పరిణమించటం వలన శ్రీ వేంకటేశ్వరార్పణమైన వేంకటకవి ఈ గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానాల వారు ప్రచురించి శ్రీ విష్ణుతత్త్వ వ్యాప్తికి దోహదం చేయగలరనే మా అభ్యర్థనను మన్నించి దేవస్థానం వారి ధార్మిక గ్రంథ ముద్రణ విభాగంలో దీన్ని చేర్చి వెలుగులోనికి తెస్తున్న తి.తి.దేవస్థాన కార్యనిర్వాహకులు శ్రీ లంకా వేంకట సుబ్రహ్మణ్యం, ఐఏయస్ గారికి, ప్రచురణల విభాగ ముఖ్యాధికారియైన ఆచార్య రవ్వా శ్రీహరిగారికి మా సంస్థ తరపున ధన్యవాదాలను తెల్పుకుంటున్నాను. గడచిన 5,6 సంవత్సరాల నుండి ఈ గ్రంథ పరిష్కరణ, ప్రకాశనం, ప్రసంగాల ఏర్పాటు, వ్యాఖ్యాన రచన మొదలైన విషయాలన్నిటిని ఎంతో శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తున్న పెద్దలు శ్రీ వఝల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు, డా॥ శ్రీరంగాచార్య గారల కృషి విస్మరించరానిది. వారికి ప్రత్యేక ధన్యవాదాలు, శ్రీ వఝల వేంకట సుబ్రహ్మణ్యశర్మగారు 90 సం॥ వయస్సు పైబడినప్పటికి వారు ఈ గ్రంథ వ్యాఖ్య వెలువడవలెననే పట్టుదలతో మిక్కిలిగా శ్రమించటం మాకే ఆశ్చర్యం కల్గిస్తున్నది. సాహిత్య సేవముందు వారి అనారోగ్యం తెలియకుండా వున్నది. ఇప్పుడు తి.తి. దేవస్థానాలవారు ప్రచురించే ఈ గ్రంథానికి**'సమర్పణం'** పేరున విలువైన పీఠికను సమకూర్చి, పుస్తక ప్రాశస్త్యాన్ని వెల్లడించిన శ్రీ శర్మగారికి, శ్రీ రంగాచార్యగారికి, వ్యాఖ్యానమును రచించిన పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు, ఈ గ్రంథ విషయంలో మిక్కిలి కృషిచేసిన మా కుమారుడు చి॥ గోపాలకృష్ణకు ఆశీస్సులు.

ఇక్కడ మనం మరొక ముఖ్యవిషయం గమనించవలసియున్నది, చాలా కాలం నాడు నెల్లూరు నుండి వెలువడే **'సంబోధిని'** వార పత్రికలో **'కొందరు నెల్లూరు గొప్పవారు'** శీర్షికలో శ్రీ ఒంగోలు వెంకటరంగయ్యగారు వ్రాసిన వ్యాసాల్లో ఎఱగుడిపాటి వేంకటాచలం పంతులుగారిని గూర్చి పెద్దవ్యాసం వ్రాసి దానిలో వేంకటకవిగారి విష్ణుమాయా విలాస ప్రసక్తి తెచ్చి, సాహితీలోకానికొక నూతన విషయాన్ని తెల్పి కృతజ్ఞతా పాత్రులైనారు. శ్రీ వేంకటాచలం గారు మా ముత్తాత, వారి ప్రపౌత్రుడైన రామయోగిగారి పుత్రుల్లో నేనొకడను, మా పూర్వులగూర్చి, మా వంశీకులకే గాక, సహృదయులైన వారికి తెలివిడిచేయవలననే సదుద్దేశ్యంతో**శ్రీరామయోగి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు**ను స్థాపించి, దీని ద్వారా ఎందరో బీద విద్యార్థులకు ఆర్థికసాయం చేయటం, కవులు, పండితులు, పెద్దలను ఆహ్వానించి సాహిత్యకార్యక్రమాల నిర్వహించి సన్మానించటం కూడా మా కార్యక్రమాల్లో ముఖ్యమైన విషయం. మా వంశానికి కీర్తి ప్రతిష్ఠలను అక్షరాకృతిగా కల్పించిన వేంకటకవిగారికి, వేంకటాచలం గారికి సవినయంగా నమస్సు లర్పిస్తున్నాను. ఇక శ్రీ వేంకటాచలంగారు ఆనాడు చేసిన దానధర్మాలకు లెక్కలేదు. సాంఘిక కార్యక్రమాలు అపరిమితం, ఎన్నెన్నో నిర్మాణాలు చేయించినారు. ఆయన ఎంతభక్తుడో అంత గొప్ప కవి.

పంతులుగారి రచనలు

1. **రాసక్రీడలు** - యక్షగానము - బమ్మెరపోతన కవితను పోలియున్నది.
2. సంస్కృతమున **'శ్రీసీతారామచంద్ర మానస పూజా విధానము'**
3. **ముకుంద శతకము**

పంతులుగారు చేసిన భగవత్కైంకర్యములు

1. చిత్రకూట వసంతోత్సవములు
2. రంగనాథుని గాలిగోపురం
3. బోడిగోపురం - ఇది మూలవిరాట్టు వేంచేసియుండు ఆలయమునకు - గాలిగోపురమునకు మధ్యయుండునది
4. మూలవిరాట్టు వేంచేయు విమానము
5. పుణ్యకోటి విమానవాహనము చేయించిరి
6. రంగనాయకుల పేటలో రథమునకు దక్షిణముగా నున్న సత్రము

7. రంగరాజపుర అగ్రహారము
8. నెల్లూరి రాజవీథిలో శంకరమఠము
9. తిరుపతి వేంకటేశ్వరునికి ఒక అర్చనను-సర్వకాలములకు ఏర్పరచిరి
10. రంగనాథస్వామివారికి నిత్యభోగము శాశ్వతముగా జరుపు ఏర్పాటు
11. వేదగిరి నృసింహస్వామి రథ కైంకర్యము

ఈనాడు విష్ణుమాయా విలాసం వ్యాఖ్యాయుతంగా వెలువడుతున్న సంతోష సమయాన మా వంశపూర్వులను స్మరిస్తూ... సెలవు తీసుకుంటున్నాను.

ఎఱగుడిపాటి భరద్వాజ
నిర్వాహకులు
ఎరగుడిపాటి రామయోగి మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్టు
తార్నాక, హైదరాబాద్ - 500 047.
ఫోన్ : 040-27019313-9893.

సమర్పణం

'శ్రీవత్సాంకిత కౌస్తుభోజ్వల లసత్ శృంగార విస్తారితా
లావణ్యాకర ! భద్ర భాస్వదలమేల్మంగాంగనా భాసమా
నావాసాయుత బాహుమధ్యమహనీయానంద మందస్మితా
శ్రీ విభ్రాజిత వక్త్రపద్మ ! సితరాజీవాక్ష భక్తాశ్రితా'

ఆంధ్ర సాహిత్య రంగంలో ప్రఖ్యాత, ఉత్పాద్య, మిశ్రములనే మూడు విధాలైన ప్రబంధాలను రచించి తమ ప్రతిభచేత వాటిని రాణింపచేసిన సుప్రసిద్ధ కవులెందరో వున్నారు. ఆ పరంపరలోనిదే **'మిశ్ర'** కథారీతి ప్రౌఢప్రబంధం **'విష్ణుమాయా విలాసం'** ఇది ఐదాశ్వాసాల పరిమితిగల ప్రౌఢ పద్య విచిత్రకల్పనా విశేషం చేత సాహిత్యలోకంలో ఒక 'కవిత్వ మామావిలాసం'. ఎంతో కాలంనుండి అసూర్యం పశ్యగానున్న యీ ప్రబంధం ఇటీవల వెలుగులోనికి రావటం. సాహిత్య ప్రపంచానికొక విశేషం.

కృతికర్త

ఇంతటి విశిష్టకృతి నిర్మాత ఎఱగుడిపాటి వేంకటకవి, దీని కృత్యాది యందలి కవివంశవృక్షాన్ని బట్టి లెక్కవేస్తే ఈయన సుమారు క్రీ.శ.1750 ప్రాంతంలో వుంటాడు. కవిగారి పౌత్రుడైన వేంకటాచలం పంతులుగారు సుప్రసిద్ధ భక్తుడు. గ్రంథకర్త. వేంకటకవిగారి పేరునే కొద్దిగా మార్చి వేంకటాచలం అని ఈయన పేరు పెట్టినారు. విష్ణుమాయా విలాసం వెలుగులోనికి రావటానికి ముఖ్యులైన శ్రీ ఎఱగుడిపాటి భరద్వాజగారు, పూర్వ పూర్వంనుండి ఇదానీంతనకాలంలోని తమ పౌత్ర, దౌహిత్రం వరకు పెద్ద వంశ వృక్షాన్ని సిద్ధం చేసినారు. దీనిలో మరొక విశేషం ఏమంటే - వ్యక్తులు, వారి భార్యలపేర్లు, వారి పుట్టిల్లు పేరు, స్త్రీ, పురుష సంతతిని (తెలిసినంతవరకు తేదీలతో) తెల్పి వంశవృక్షరచనలో నూతనత్వానికి బాటవేసిన భరద్వాజగారు.

దీనిని చలమయ్యగారినుండి ఆరంభించినారు. అంతేగాని వారికప్పుడు విష్ణుమాయా విలాసకృతిని గూర్చి తత్కర్తను గూర్చి తెలియనందున విష్ణుమాయా విలాసంలోని వంశవృక్షం దీనిలోనికి రాలేదు. ఈ రెండు వంశవృక్షాలను సమన్వయం చేసి వేస్తే ఒక సమగ్రత ఏర్పడగలదు.

చాలకాలంనాడు నెల్లూరునుండి వచ్చే'**సంబోధిని**' వార పత్రికలో '**కొందరు నెల్లూరు గొప్పవారు**' అనే శీర్షికన సుప్రసిద్ధ పరిశోధకులు శ్రీ ఒంగోలు వేంకటరంగయ్య గారు (1867-1949) ఎఱగుడిపాటి వేంకటాచలంపంతులు గారిని గూర్చి వ్రాసిన వ్యాసం విపులమై, విశేష విషయాలను వెల్లడి చేస్తున్నది. దానిలోనే వారు '**వీరి తాతగారు వేంకటకవిగారు**' విష్ణుమాయా విలాసము అను గ్రంథమును రచించిరి. ఈ గ్రంథము మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీయందు ఉన్నదని తెల్పినారు. వీరి ఈ వ్యాసం సుమారు 1930 నాటిది. ఇంత విలువైన పుస్తకం ఇటీవల కాలం వరకు వెలుగులోనికి రాకపోవటం విచారకరం.

విష్ణుమాయా విలాసంలో కవి తనను గూర్చి...

> **అట్టి నరసమంత్రికా వెంగమాంబకు**
> **పుత్రకుండ శుభచరిత్రకుండ**
> **విష్ణుభక్తి రతుడ వెంకటాఖ్యాతుండ**
> **సుకవిజన హితుండ సుమహిముడ' (1-41)**

అనటమేగాక. ఆశ్వాసాంతగద్యల్లో వేంకటాఖ్యప్రణీతము అని వ్రాసుకున్నాడు. ఈ ఎఱగుడిపాటివారు శ్రీవేంకటేశ్వర పాదభక్తులైనందున వెంకట నామధేయులధికం. ఇక ఇతని పౌత్రుడు వెంకటాచలం పంతులు (1801-1894) నెల్లూరు జిల్లా కందుకూరు సీమలోని కరేడు పట్టణంలో శాలివాహన శకవర్షములు 1723, దుర్మతివత్సర, భాద్రపద శు॥ 12 స్థిరవాసరం సరియైన తేది 19.9.1801నాడు జన్మించిరి. తండ్రి అప్పయ్య, తల్లి రఘుపతయమ్మగారు.

బాల్యం నుండి అసాధారణ మేధాశక్తిగల ఈయన సంస్కృతాంధ్రాల్లో పారీణత గలిగి పైతృకాదాయమైన కవితా సంపత్తితో అలరారినారు.

ప్రస్తుతం గ్రంథాన్ని వెలుగులోనికి తెచ్చిన భరద్వాజ గారికి వీరు ముత్తాత అనే విషయం గమనార్హం. వేంకటాచలం గారిని గూర్చిన ఎన్నో విశేషాలను ఇంతకు ముందు తెల్పినసం**బోధిని** పత్రికలో ఒంగోలు వెంకటరంగయ్యగారు కవిగారి జన్మ కుండలినిచ్చి ఆనాడు వారిని ప్రశంసిస్తూ ఆంగ్లేయాధికారులిచ్చిన ప్రశంసాపత్రాలను చేర్చినారు. ఒక విధంగా ఈ వ్యాసం వేంకటాచలంపంతులు గారి జీవితచరిత్ర అనవచ్చు. ఇట్టి వీరి పౌత్రుడు రామయోగి 'యోగి'గా రాణించినారు. వీరి పుత్రద్వయంలో ఒకరైన భరద్వాజగారు తమ పూర్వపూర్వుల సాహితీసౌభాగ్య భక్తి ప్రపత్తి వైభవంతో సహృదయులుగా రాణిస్తూ, విష్ణుమాయా విలాస ప్రబంధానికి సాహితీ సూర్యాలోక భాగ్యాన్ని కల్గించిన మహానుభావులు. ప్రతి సంవత్సరం రామయోగిగారి జన్మ దినోత్సవం జరుపుతూ, ఎందరో బీద విద్యార్థులకార్థిక సహాయం చేయటమేగాక, కవులు, పండితులను సన్మానించే ఆచారాన్ని కొనసాగిస్తూ **రామయోగి మెమోరియల్** ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా సాహిత్య, సాంఘికసేవ చేస్తున్నారు. వీరి పట్టుదల, సాహిత్యాభిమానాలలో తమ పూర్వులయందు ప్రఖ్యాతులైన వేంకటకవిగారి ప్రబంధము ముద్రాకృతి నందినది.

విష్ణుమాయా విలాసం

వేంకటకవి రచించిన ఈ గ్రంథం రెండు కాగితం ప్రతులు చెన్నై ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ఉన్నాయి. వీటిలో ఒకటి రాయల్ సైజు కాగితం మీద వ్రాయబడింది. లేఖనం స్పష్టంగా లేదు. మరియొకటి 1/8 డెమ్మీ సైజులో స్పష్టమైన లేఖనంతో వున్నది. ఈ రెండు ప్రతుల ఆధారంగా లిఖించుకున్న ప్రతియే ఈ ముద్రాకృతికి మూలం. చెన్నైలోని ఈ ప్రతులను శ్రమకోర్చి జీరాక్స్ తీయించి, శ్రీ వఝుల సుబ్రహ్మణ్యశర్మగారికి ఎంతో

సహకరించిన ప్రసిద్ధ పరిశోధకులు ఆచార్య సి.వి.రామచంద్రరావుగారి శ్రమ కృతజ్ఞతలకందనంత విశేషమైనది.

పుస్తకం పనిపై శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారు 2,3 పర్యాయాలు చెన్నైకి వెళ్ళి రామచంద్రరావుగారితో వుండి, ప్రతులను పరిశీలించుకుని వచ్చిన తర్వాత, సాపు వ్రాసి మేము దీనికి ఒకముద్రారూపం కల్గించటానికి 2 సంవత్సరాల సమయం పట్టింది. ఈ కాలంలో శ్రీ భరద్వాజగారు ఎంతగానో తోడ్పడ్డారు.

ప్రప్రథమంగా దీని మొదటి 2 ఆశ్వాసాలను ముద్రించి రామయోగిగారి 103వ జన్మదిన కార్యక్రమాల్లో ఆచార్య సి. నారాయణరెడ్డిగారి ద్వారా ఆవిష్కరించి, 2007లో రామయోగిగారి 104వ జయంతివేడుకల్లో మొత్తం ఐదు ఆశ్వాసాల గ్రంథాన్ని ముద్రించి ఆవిష్కరించటం ముదావహమైన విషయం. ఆనాటి నుండి దీన్ని పరిశీలించిన పెద్దలు. కనీసం సులభవ్యాఖ్యతోనైనా ఈ ప్రబంధం సుపరిష్కృత ముద్రణ వెలువడితే బాగుంటుంది అనే భావాన్ని వ్యక్తీకరించగా ఇంతకాలానికి '**సుబోధినీ**' నామక సులభవ్యాఖ్యతో వెలువడుతున్న ఈ విష్ణుమాయా విలాసము ఐదు ఆశ్వాసాలతో 1686 గద్యపద్యములతో అలరారుతున్న విచిత్ర కథాకావ్యం.

దీనియందు కవి తనను గూర్చి సకల **సుకవి** జనసఖ్య అని తెల్పుకున్న వెంకటకవి సంస్కృతాంధ్ర భాషలయందు ప్రవీణుడు, శాస్త్రవేది, వేదాంత, యోగవిద్యావేత్త. శైవ వైష్ణవ తత్త్వాలను బాగా అధ్యయనం చేసిన అభేద భక్తి ప్రపత్తులు గలవాడు. **ఐనా చదివినవాడగాను పదసంధులెరుంగను, వేంకటేశ సత్పదయుగ సత్త్వసంపద ప్రబంధము సేయుదు సత్కవుల్ ముదంబొదవగ తప్పు దీర్చి తగనొప్పుడు** (1-13) అని తన వినయవిధేయతల వెల్లడి చేసుకొని కావ్యకల్పన మహత్త్వాయత్తచిత్తుడై 'విష్ణుకథా ప్రసంగమపవర్గావాప్తి దానౌట మేలగునంచుచున్ మహాఖ్యానాన్ని రచింప బూని హరిచరిత్రము లెల్లకాలము మహాహ్లాదంబుతో నిత్యమాదరణీయ ప్రియ పూర్వకంబుగ సుధాధారాళ ధారావచోత్కర నైపుణ్యముచే బుధప్రకరచిత్తధ్వాంత విధ్వంసి (1-129)గా

నుండవలయుననే వాంఛతో ప్రబంధ నిర్మాణానికి కుపక్రమించినాడు.ఈయన కవిత్వంలో భారత భాగవత రామాయణాదులేగాక. శృంగారనైషథము, మను, వసు చరిత్రలు, కళాపూర్ణోదయాదుల రచనా ప్రభావం. అనుకరణలు కనబడుతున్నాయి. చిత్రకవితా విషయంలో గణపవరం వేంకటకవి ప్రభావం అధికం, కవి దీనియందు దేవతాస్తుతి, వంశచరిత్ర, షష్ఠ్యంతాలను చెప్పి కథా కథనానికి శ్రీకారం చుట్టినాడు. ఈ ప్రబంధ కథనంతా సూతమహర్షి చెబుతుండగా మునులు వింటూ మధ్యమధ్య తమ సంశయాలను వ్యక్త పరుస్తుంటే సూతుడు వాటికి సమాధానాలనిస్తాడు. ఇక్కడ కవిని సూతమహర్షిగాను, పాఠకులను మౌనులుగా భావించుకొని ప్రబంధ కథా పరిశీలనం చేసుకోవచ్చు, వెంకటకవి శ్రీ వేంకటేశ్వర భక్తుడైనందున **శ్రీయలమేలుమంగ నెదజెన్నుగదాల్చి**...(1-1) అని తెల్పటం, శ్రీ కృష్ణ దేవరాయల ఆముక్తమాల్యదలోని **శ్రీకమనీయహారమణి**.. పద్యాన్ని స్ఫురణకు తెస్తున్నది. ఉభయులకూ వేంకటభర్త వున్నాడు. ఆయనే నవ్యకావ్యాయతవాగ్విలాస మహిమాతిశయంబుల బ్రోచుగావుతన్' అని ప్రార్థించుకున్నాడు. ఇంతకు ముందు చెప్పుకున్న విధంగా ప్రాచీన కవులు ప్రభావం ఈయనపై అధికం. అందుకే **పోవుచు గాంచె నభగతభూరితరంగలదాని**..(1-82), **కాంచిరి భూనభో భరిత కాంచనరత్న ప్రపూరితో**.. (1-163), **కాంచెన్ కాంచనరత్న సంఘటిత శృంగారాద్భుతా సారమున్** .. (4-56), ఇత్యాది పద్యాలు '**ఆముక్త మాల్యద**' పోకడలను పట్టిస్తున్నాయి. శివుని వర్ణించేటప్పుడు '**గంగానదీబద్ధ కలితజటాజూటు**'శశికళా సంభృతాంచత్కిరీటు (1-197) ఇత్యాదిసీసం శ్రీనాథుని ఒరవడిలో తయారయింది. ఈ ప్రథమాశ్వాసంలోని దండకం చాలా విచిత్రమై కవిగారి ప్రతిభను వ్యక్తీకరిస్తున్నది.

ద్వితీయాశ్వాసంలో '**హరి పరమాత్మ కృష్ణకరుణాంబుధి సర్వశరణ్య శౌరి మందరధర**... ఇత్యాది పద్యం, శ్రీహరిని ఏడు విశేషణాలతో స్తుతించింది. ఈ ఏడు విశేషణాలు ఏడుకొండలవానికి సమర్పించినట్లున్నది. ఇక కవిగారి

హరిహరాద్వైతానికి ప్రతీకగా...**ఉద్యద్బ్రహ్మమునైన చిద్ఘనము**- (2-312), **నీవును నేనను భేదము / భావంబున నెంచవద్దు పరమేశ్వర యీ స్థావరజంగమమెల్లను/ నీవేనేనగుట వేరు నీ వెట్టులకో!** అంటాడు అట్లే బ్రహ్మతత్వాన్ని తెల్పే సందర్భంలో **'సర్వంబాత్మయకాని వేరొకటియెంచన్ లేదదెట్లన్నచో** అనే పద్యం, పుట్టుక, మరణం, ఆత్మనుండే ఆత్మ సత్యం (2-23) నేను నీవు సర్వం దానిలోనుండే వచ్చినాము. దానిలోనే కలిసిపోతాం అనే శ్రీమహావిష్ణు సూక్తి కవిగారి వేదాంత ధోరణికి ప్రతీక. పాత్రోచిత సంభాషణలో**సోమయాజులు వస్తిరా మనసూరుభొట్లు పిలిస్తిరా...** (4-85) ఇత్యాది యక్షగానచ్ఛాయలు గోచరిస్తాయి. కవిగారు తన నాటి సంస్కృతీసంప్రదాయాలను, ఆటలను, వెన్నెల కుప్పలను గొప్పగా వర్ణించి వేటను ప్రాచీనకవులకే ఆదర్శం చేసినాడు. ఈ విధంగా ప్రబంధాన్ని ఎంతైనా పరిశీలించే అవకాశం కలదు. పద ప్రయోగంలోను వేంకటకవి నూతన మార్గాన్ని చూపినట్లున్నాడు. 1 ఆశ్వా-**మంథశైలము, మంథగిరి**అన్నాడు. **మంథరశైలము, మందరగిరి** కావలెగదా !. ద్వితీయాశ్వాసంలో **అఘాత్యము** (26), **అఘాయిత్యం** అని వాడుక. **తరంగలు** (243), చతుర్థాశ్వాసంలో**సిబ్బితాస్యలు** (123), **చేలలు** (128), ఐదవశ్వాసంలో **ప్రొద్దుచ్చు** (7), **యామునీ (40) యమునానదిని** గూర్చి, నారికడము (49) **నారికేళం, హర్తుడు** (168) చంపినవాడు. ఈ విధంగానే మరికొన్ని సంస్కృతాంధ్ర పదాలను ప్రయోగించి ప్రజావ్యవహార పదాలను గ్రంథస్థం చేసినాడు.

వేంకటకవి దీనిని కథాకథనంలోనే గాక ఛందోవిషయంలోను చిత్రవిచిత్ర కవితా రామాభికృతిగా సిద్ధం చేసి తన ప్రతిభను నిరూపించుకున్నాడనటానికి ఆశ్వాసాల వారీగా ఈ విశేషచ్ఛందస్సులే ఒక ఉదాహరణ.

1 ఆ - 204, సమపాద చతుష్కదండకం, ప్రథమపాదం ముక్తపదగ్రస్తం. ద్వితీయపాదం యమకనియతి. తృతీయపాదం చక్రవాళం. చతుర్థపాదం ప్రథమాంశ రగడ. ద్వితీయాంశ స్రగ్విణీవృత్తం. తృతీయాంశభుజంగ

ప్రయాతం. చతుర్థాంశ స్రగ్విణీ గర్భిత భుజంగ ప్రయాతం, 230 - పంచవిధ సరసిజవృత్తం, 232 - మాలిని.

2 ఆ - 9,10 శోభన, 125 - మత్తకోకిల, 149- లయవిభాతి, 151- ధ్రువకోకిల, 199 - మానిని, 331- పుష్పమాలికా బంధం,332- లలితగతి.

3 ఆ - 103-లయగ్రాహి, 104-పంచచామర, 364-మత్తకోకిల, 365-స్రగ్విణి

4 ఆ- 23-లయగ్రాహి, 24-మాలిని, 26-లయవిభాతి, రగడ, 100-సరసిజం 385-గొమూత్రికా బంధం, 386-తోవక (గొమూత్రికబంధం)

5 ఆ - 45-మత్తకోకిల, 46-మాలిని, 367-మానిని, 368-అక్షర గుణింతము 369-చతుర్విధ కందం.

వెంకటకవి ఈ చిత్రకవితారచనకు, నెల్లూరు ప్రాంతంవాడైన గణపవరం వెంకటకవి ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసప్రభావం కావచ్చునేమో ! ప్రబంధ రాజ...లో అనేకానేక కవిత్వ సర్కసుఫీట్లున్నాయి. అది చిత్రకవిత్వ పరాకాష్ఠ దశ. దీనిలోని 808 నెం. పద్యాన్ని విడదీస్తే 40 గర్భితవృత్తాలు. 20 బంధాలుంటాయి. దానిలోని పద్యాల పేరే ఒక పేజీ వుంటుంది.

ఇదే విధంగానే దామెరల వెంగళభూపాలుడు తన ఉషాపరిణయంలో 1 పద్యంలో 108 కందాలు. ఇదే పద్యం 11 బంధాలకు (ఏకాదశ బంధగర్భ కంకణ బంధకందం) ఈ విధమైన చిత్రవిచిత్ర కవితాప్రభావం వెంకటకవి ప్రథమాశ్వాసంలోని 204 సమపాద చతుష్కదండక రచనకు ప్రోత్సాహం కావచ్చు. ఇట్లే మిగిలిన విశేష ఛందస్సులు.

విష్ణుమాయా విలాసమనే పేరు దీనిలో**'మాయా'** విశేష విషయాలున్నట్లు స్పష్టం చేస్తున్నది. సర్వవ్యాపకుడైన విష్ణువు. సర్వజగత్కారణుడు. ఆయన శక్తి ప్రభావం మాయలనుండి ఎవ్వరూ తప్పించుకోలేరు అని నిరూపించటమే ఈ పేరుగల రచనలలోని పరమార్థం. కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నాలు

కాబట్టి. ప్రఖ్యాత విషయం కొంత ఉత్పాద్యం కొంత చేర్చి కల్పనా విభూషావహమైన పూర్వ వృత్తాంతాన్ని సానలదీరిన జాతిరత్నంగా తీర్చిదిద్దటం. వెంకటకవి ముఖ్యోద్దేశ్యం కాబట్టి. చిన్న కథలను అనేకానేక వర్ణనలతో పెంచి పెద్దచేసినాడు. ఇది ఈయన వర్ణనా నిపుణత్వానికి ప్రతీక (వర్ణనా నిపుణఃకవి గదా) ఈ కృతిలో విష్ణువు విశ్వమయుడు సకల కార్య నిర్వహణ దక్షుడు అనే పరమార్థం శివుని ముఖతః నిరూపింపబడి సర్వం విష్ణుమయం జగత్ అనే కాకుండా, శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే, శివశ్చహృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః అనే శ్లోక పరమార్థం నిరూపితమైనదేగాని, పరస్పర నిందాదూషణాదులు ఏ మాత్రం లేవు. ప్రబంధం అంతా పరిశీలిస్తే విష్ణుమాయ వలన మోసపోయిన ప్రతివారూ అంటే నాయకుడో నాయికయో శృంగారపరంగానే మోసపోయినారు. ప్రతికథలోను విష్ణుమాయ ప్రధానాంశమైనందున శృంగార రసాభాసమనే లక్షణం పాఠకుని ఉత్సాహాన్ని చెడనీయలేదు. ప్రతికథకూడా ఒక స్వతంత్ర కల్పనాకథగా చిత్రితమైంది విష్ణుమాయా విలాస కథా కావ్యాలను రచించిన వారందరికీ స్కాంధపురాణం శ్రీమహాభాగవతంలోని మోహినీశివుల కథ ముఖ్యాధారాలు. మోహినీ శివుల కలయిక వలన కలిగిన పుత్రుని పేరు శాస్త అని స్కాందపురాణం తెల్పుతున్నా ఆ పేరును వేంకటకవి గ్రహించలేదు. ఇక వెంకటకవి విష్ణుమాయా విలాసకథాశ్రోతలు మునివరులు - వక్త - సూతుడు (ఇతర విష్ణుమాయా విలాసాలకు - శుక, వైశంపాయనులు వక్తలు. జనమేజయ పరీక్షిత్తులు శ్రోతలు) అందుకే

> **హరిచారిత్రములెల్ల కాలము మహాహ్లాదంబుతో నిత్య మా**
> **దరణీయ ప్రియపూర్వకంబుగ సుధాధారాళ ధారావచో**
> **త్కర నైపుణ్యముచే బుధప్రకర చిత్తధ్వాంత విధ్వంసివై**
> **కర మొప్పారుట నీకు తత్కరుణ గల్గంగాదె భవ్యాత్మకా 1-129**

అని సవినయంగా ప్రార్థించినారు. దానికి సూతుడు సమాధాన రూపంగా కొన్ని విషయాలను తెల్పి.

> **సకలమును విష్ణుమయమగు**
> **సకలమయుండగును విష్ణు సర్వజ్ఞత వే**
> **రొక వేల్పునందుగలదే**
> **ప్రకటింపగ సర్వలోక పాలురయందున్ 1-141**

అని చెప్పి, భవునికైనా పద్మభవునికైనా విష్ణుమాయను అధిగమించటానికి వీలుగాదు అని ఘంటాపథంగా చెప్పిన సూతుని వాక్కులు ఈ ప్రబంధ కథాక్రమానికి ముఖ్యమైన ఆధారాలు.

కృత్యాదియందు వేంకటకవి అనేక విషయాలను తెల్పినాడు. తన పూర్వుడైన గిరిమంత్రినుండి తమ వరకు (దాదాపు 7 తరాలు) వంశావళినిచ్చి ఎవరు ఎవరితో సంబంధ బాంధవ్యాలను నెరపిందీ వివరించటం ఒక గొప్ప విశేషం. తననాటి బిట్రగుంట, బిలకూటమనే అగ్రహారం బిట్రగుంటగా మారినదని 1-68, గౌరామహాదేవి తపస్సుచేసినస్థలమే గౌరవరంగా వ్యవహృతమైనదని తెల్పి, ఉదయగిరి, నెల్లూరు, కందుకూరు, గౌరవరం గ్రామాలను స్వర్ణముఖీ, పినాకినీ నదులను తెల్పి, తన కృతిని నవ్యకావ్యాయత వాగ్విలాసమహిమాతిశయంగల బిట్రగుంట వేంకటేశ్వరస్వామికి అంకితమొసంగినాడు.ఆ స్వామి విద్వన్మానసగేహుడు. అద్వైతాత్మాధిరోహుడు. తన యిష్టదైవాన్ని ప్రార్థించిన తర్వాత తెలుగు కవులలో నన్నయ, తిక్కన, ఎర్రన్నలను వర్తమానోత్తర కవులను స్తుతించి, సంస్కృతంలో వ్యాస, కాళిదాస, బాణుల మాత్రమే పేర్కొన్నాడు. తన కృతి పోతనగారి కృతివలె దైవాంకితంగా బట్టి కవితా విషయంలో

> **చదివిన వాడగాను పదసంధులెరుంగను వేంకటేశ స**
> **త్పదయుగ సత్త్వసంపద ప్రబంధము చేయుదు సత్కవుల్ ముదం**

బొదవగతప్పు దీర్చి తగనొప్పుడు బాలుడు ముద్దుముద్దుగా
కొదుకుచు పల్కు పల్కులకు కూరిమిసేయరె పెద్దలెంతయున్ 1-13

అని తన వినయాధిక్యాన్ని వెల్లడించుకున్నాడు.

తన పూర్వుల్లో ఒకరైన ఆ వెంకటార్య వర్యుడు

శ్రీ వేంకటనాథ పాదసేవారతుడై ..
కావించె శేషగిరిపై భూవిదితములైన ధర్మములు కడుబేర్మిన్ 1-20

అని విశేష విషయాన్ని తెల్పినాడు. అనగా ఆనాటి నుండియే వీరంతా తిరుమల శ్రీ వేంకటేశ భక్తులని స్పష్టమైనది. దీనికి తోడు వెంకటకవి శ్రీవైష్ణవ సిద్ధాంతానుయాయి కాబట్టి 'మాయ' ప్రాముఖ్యాన్ని ప్రబంధీకరించినాడు. శ్రీవైష్ణవంలో మాయ అంటే ఆశ్చర్యకరచేష్టలతో జీవులకు అద్భుతావేశాన్ని కల్గించేవాడని, అద్వైతంలో ఆవరణం, తెర అనే అర్థాలలో రూఢి. ఏది ఏమైనా లోకంలో 'కలయోవైష్ణవమాయయో' అనేది రూఢియైంది. అందుకే ప్రబంధంలో శివుడు, బ్రహ్మ, నారదుడు - విష్ణుమాయ యందు పడి ఎట్లా ప్రవర్తించింది. వివరంగా తెల్పటం ప్రబంధోద్దేశ్యం. దానికి ఎన్నో సామ్యాలు. వర్ణనలు సామెతలు, విశేషాలు చోటుచేసుకున్న అనేకానేక వర్ణనలు. దీనిలో కన్పిస్తాయి. ఇదంతా కవిగారి మాయామేయ కవితాజగత్తు, పింగళి సూరన కళాపూర్ణోదయం 30 పాత్రలతో నడిచిన విధంగానే వెంకటకవి దాదాపు 28 పాత్రల ద్వారా ఈ కథను నడిపినాడు.

దీనిలోని విష్ణుమాయా కథలు - కూచిమంచి తిమ్మకవి సర్పపురీ మాహాత్మ్యంలో నారదగర్వ భంగకథగా, స్త్రీ రూపాన్ని పొందిన నారదుని కథ కలదు. ఇక భావనారాయణస్వామి క్షేత్ర మాహాత్మ్యంలో (సర్పవరం) నారదసరస్సు అనేది అక్కడగల కోనేరుపేరని, ఈ కథనంతా ప్రకటించి దానికి సంబంధించిన చిత్రాలను చేర్చినారు. (గ్రంథముద్రణవత్సరంలేదు) ఇట్లా మన కవులు ప్రతికథను స్వస్థాన వేష భాషాభిమతానురూపంగా చెప్పదలచి, ప్రతి కథకూ ఒక ముని వక్త, వారి శిష్యులను శ్రోతలుగా చేర్చి కథా కథనం చేయటం వలన ప్రాబంధిక, మార్గ కవిత, వక్తృత్వ నైపుణ్యం వలన దేశి పద్ధతిలో చేరి, మునుల ప్రమేయం వలన భక్తితో అనుసంధించే రీతి ఏర్పడుతుంది. ఇదంతా పురాణ కథలకు దైవమాహాత్మ్యాలకు మనవారు ఏర్పరచుకున్న మార్గం.

వెంకటకవికి పూర్వం విష్ణుమాయా విలాసకథను ప్రబంధీకరించిన కవులు పల్వురున్నారు. ఆనుపూర్విగా - వారి రచనలు

1.	**విష్ణుమాయా విలాసం** -	**ప్రబంధం** -	రాధామాధవకవి	1933
2.	”	**యక్షగానం**	కంకంటి పాపరాజు	1955
3.	”	**ద్విపద**	కంకంటి నరసింహకవి	1865
4.	”	**ప్రబంధము**	రోసనూరి వెంకటపతి	1898
5.	”	**యక్షగానం**	పంకజలోచన నరసయ్య	
6.	”	**పద్యం**	వెలుగోటి వెంకటకవి	
7.	**సముద్రమథనం**	**ప్రబంధం**	చిలుకపాటి సీతాంబరం	1934

వీటిలో పంకజలోచన నరసయ్య, వెలుగోటి వెంకటకవి రచనలు ముద్రణ కాలేదు. వీటి వ్రాతప్రతులు. తంజావూరు, మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండా గారాలలో వున్నాయి. మొత్తంపైన తెలుగులో వచ్చిన ఈ కృతులన్నిటికీ చింతలపూడి ఎల్లన రచనయే ముఖ్య మాతృకగా భావించవచ్చు.

ఇటీవల 2011లో కంకంటి పాపరాజు యక్షగానాన్ని శ్రీ వఝుల వెంకట సుబ్రహ్మణ్యశర్మగారు తెలుగు గోష్ఠిద్వారా ప్రకటించినారు. కాని దీని పూర్వముద్రణ (వావిళ్ళ 1955) సమాచారం గాని, నేలటూరి వారిపీఠికా ప్రస్తావనగాని దీనిలో రాలేదు. మధ్య మధ్య పద్యాలుమొదలైన వాటికి వివరణ చేర్చినారు. (2011) కంకంటి నరసింహకవి ద్విపద కృతిని 2011లో ఉన్నం జ్యోతివాసు పరిష్కరించి విపుల పీఠిక బహువిషయ సమగ్రంగా ముద్రించినారు.

ఎఱగుడిపాటి వెంకటకవి నాటికి ఏకకథా విషయాలైన ఇన్ని కృతులు వచ్చినా తన గ్రంథంలో వీటి ప్రసక్తి లేదు. తనకు ముందున్న ఈ ప్రబంధాల ప్రభావమే కవిగారి విష్ణుమాయా విలాసరచనకు ప్రోత్సాహం అనుకున్నా ఎల్లనార్యుని కథలే దీనిలో చేరి కాస్తా కథాక్రమంలో మార్పులకులోనైనాయి. వర్ణనాధిక్యం వలన కథలోని పట్టుతప్పి పెరుగుదల కాస్కారమై, పాఠకుణ్ణి ఆలోపింపచేస్తున్నాయి (దీనికి ఒక ఉదాహరణ 5 ఆశ్వాసం చివర్లో నారదుడు స్త్రీ వేష విముక్తుడైన తదుపరి చేసిన వేదాంత విద్యా విషయాలు) వెంకటకవి తనను గూర్చిన సమాచారం ఈయకపోవడానికి ఆత్మస్తుతి వైముఖ్యం కారణమనుకున్నా నెల్లూరు శ్రీ రంగనాయకస్వామి ప్రసక్తిగాని, వెలుగోడు సంస్థానం, కవుల సమాచారం గాని కనీసం తననాటి రోసనూరి వెంకటకవి కృతి విషయంగాని తెల్పకపోవడం ఒక వైష్ణవమాయ అనుకున్నా, ఇప్పటవరకు వచ్చిన విష్ణుమాయా విలాసకథా కావ్యాలన్నీ నెల్లూరు జిల్లానుండే రావటం ఆశ్చర్యకరం. క్షేత్ర మాహాత్మ్యకథలను ప్రచురించినవారు ఈ కథల్లో కొన్ని సర్పవరం మొదలైన క్షేత్రాల్లో జరిగినట్లు ఆధారాలను తెల్పినారు. భావనారాయణ అనడం కూడా విష్ణు మాయల్లో ఒక భాగమేనట.

సుబోధినీ వ్యాఖ్య

వెంకటకవి యీ కృతిని ఎంతో శ్రమకోర్చి ప్రప్రథమంగా 2007లో మూలం మాత్రమే ముద్రణమొనర్చి సాహితీ లోకానికందించి కవి వంశీయులైన భరద్వాజగారు ఎంతో మేలుచేసినారు. దీనికి విపుల వ్యాఖ్యగాకున్నా విషయావగాహన కనుకూలంగా వుంచే సంక్షిప్త వ్యాఖ్యనైనా వ్రాయించవలెననే వారి కోరిక ఈనాటికి నెరవేరడానికి ముఖ్యకారకులు. శ్రీ వఝల వెంకటసుబ్రహ్మణ్య శర్మగారు. సంక్షిప్తంగా విషయాలను వెల్లడించగల పండితులను నిర్ణయించి వారిచేత ఇట్లా సుబోధిని వ్యాఖ్య వెలయించటానికి వీరి పట్టుదల ఎంతో కలదు. దీని వ్యాఖ్య వ్రాసిన పండితులు.

1 ఆ **శ్రీమతి రావినూతల (నీలంరాజు) భారతీదేవి**

2 ఆ **శ్రీ ఎన్.ఎస్.రాజు**గారు హైదరాబాద్, కేంద్రీయవిశ్వవిద్యాలయ ఆచార్యులు

3,4,5 ఆశ్వాసాలు శ్రీ **చింతగుంట సుబ్బారావు**గారు, రిటైర్డు లెక్చరర్

వీరు సిద్ధంచేసిన వ్యాఖ్యలను సరిచూచి, ఈ పద్ధతిలో డి.టి.పి చేయించి, ముద్రణ నిమిత్తం తిరుమల తిరుపతి దేవస్థానం వారికి సమర్పించినాము.

కృతికర్త - వేంకటకవి, కృతిభర్త - శ్రీ వేంకటేశ్వరస్వామి (బిట్రగుంట), వ్యాఖ్యానకృతి, స్వీకర్త - తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి, కృతి ప్రకాశకులు - తి.తి.దేవస్థానముల ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీ లంకా వేంకట సుబ్రహ్మణ్య మహోదయులు.

సర్వం శ్రీ వేంకటేశ్వర మయమైన యీ విష్ణుమాయా విలాసము, స్వామివారి మంగళాశాసన ప్రభావమున మరింత వ్యాప్తి చెందవలెనని ఆకాంక్షిస్తూ.. ఈ విధంగా మేము కొంతమేర సాహిత్య పరిశోధన చేసే అవకాశం కల్గించిన తి.తి.దేవస్థానముల వారికి, ఎరగుడిపాటి భరద్వాజగారికి కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాము.

హైదరాబాద్.

వఝల వేంకటసుబ్రహ్మణ్యశర్మ
డా॥ శ్రీరంగాచార్య

రంగనాయకుల స్వామివారి గాలిగోపురం, నెల్లూరు

విష్ణుమాయావిలాసము

ప్రథమాశ్వాసము

ఉ॥ శ్రీయలమేలుమంగ నెదఁజెన్నుగఁదాల్చి మహానురక్తిచే
బాయక భక్తలోకము కృపారస వీక్షణ సంప్లుతాత్ములం
జేయుచు బిట్రగుంట నివసించిన వేంకటభర్త నవ్యకా
వ్యాయతవాగ్విలాసమహిమాతిశయంబులఁ బ్రోచుగావుతన్ 1

శ్రీ అనగా జ్ఞాన ఆనందరూప పరబ్రహ్మము మాతృ భావముతో ఆరాధింపబడు మాయ మహాశక్తి సంప్రదాయ పద్ధతిని అనుసరించి ప్రారంభ పద్యములో ''శ్రీ'' శబ్దము పూర్వ ప్రయుక్తమైనది. మంగ జగన్మాత వేంకటేశ్వరుడు జగన్నాథుడు.

అర్థము : శ్రీ= శుభప్రదమైన, అలుమేలుమంగన్= ఆలర్ మేలు మంగను, పద్మమున జన్మించిన శ్రేష్ఠురాలైన '' మంగ '' అనెడి తాయారును, జగన్మాతను, పద్మావతీ నామధేయను, ఎదన్= ఱొమ్మున, చెన్నుగన్= అందముగా, తాల్చి=ధరించి, మహత్+ అనురక్తిచే= మిక్కిలి కూరిమిచే, పాయక= తెఱపి లేక, భక్తలోకము=హరిదాసుల సమూహమును, కృపారస వీక్షణ సంప్లుత+ఆత్మలన్= దయతో నిండిన కడగంటి చూపులచే ఆహ్లాదపరచు మనస్సులు కలవారుగ చేయుచు; బిట్రగుంట నివసించిన= బిట్రగుంటలో నివాసముండిన, వేంకటభర్త= వేంకటా చలపతి, నవ్యకావ్య+ఆయత= క్రొత్తదైన ఈ కావ్యమందు గల విరివియైన. వాక్+విలాస, మహిమ+పలుకుల పొందిక యొక్క అతిశయంబులన్= మేలిమి మెరుగులతో, ప్రోచు+గావుతన్= కాపాడుగాక!

వేంకటకవి, వేంకట భర్తను, హరిదాసులను కూరిమితో కాపాడుమని ఆశీర్వాదపూర్వకమైన ప్రార్థనను కావ్యాదిలో కావించెను.

భావము : శ్రీ అలమేలుమంగను, అందముగా కూరిమిచే ఱొమ్ముున ఎల్లప్పుడు ధరించి భక్తుల సమూహమును కడగంటి చూపులచే సంతసింపజేయునట్టి బిట్రగుంట నివసించు వేంకటాచలపతి ఈ నూతన కావ్యమందున్న శాబ్దికమైన సౌందర్య మహిమతో రక్షించుగాక!

విశేషార్థము :అలమేలుమంగ= ప్రసిద్ధురాలును, శ్రేష్ఠురాలునూ అయిన మంగ; అలమి+ఏలుమంగ= సర్వత్రా వ్యాపించి పాలించు శ్రీ మహాలక్ష్మి అంశగల మంగ; "మంగ"= తిరుమలేశుని భార్య; ఆమెను "మంగతాయారు" అని పిలుచుచున్నారు. తాయి అనగా తల్లి తాయితో "ఆర్" పూజ్యార్థకము చేరి తాయారు అయినది (అవ్వయార్ మొ॥), అలమేలు మంగ ఆలయము తిరుచానూరులో ఉన్నది. తిరు తాయి ఊరు (తిరుతాయిఊరు) వ్యవహారములో "తిరుచానూరు" అయినది.

మంగళాశాసనము : శ్రీవైష్ణవుల పరిభాషలో మంగళ+ఆశాసనము= ఆశీర్వాద శబ్దము. మంగళ శబ్దమునకు అర్థము పార్వతి. మంగ శబ్దమునకు అర్థము మహాలక్ష్మి

ఉ॥ **ఎవ్వరికిత్తు నీ కృతిని నెవ్వరు దీనికి దక్షులంచు నే**
నువ్విళులూరుచున్ వెదుక నుజ్జ్వలరత్న విభూషణాంగుడై
మవ్వముతోడ నా కలను మన్మథకోటి విలాసమూర్తితో
మువ్వలు నందెలున్ మొరయ మ్రోలను నిల్చిన కృష్ణుగొల్చెదన్ 2

అర్థము : ఎవ్వరికి+ఇత్తున్= ఎవరికి ఇవ్వాలి. ఈ కృతిన్ = ఈ కృతిని, ఎవ్వరు దీనికి= ఎవరు దీనికి, దక్షులు+అంచున్= తగినవారని తలంచుచు, ఉవ్విళులు+ఊరుచుండగన్= ఉత్సాహముతో త్వరపడుచు, వెదుకన్= యోచించుచుండగా, నా కలన్= నా కలలో, ఉజ్జ్వల రత్న విభూషణ+అంగుడై= తళ తళ మెరయుచున్న నగలను శరీరమందు గలవాడై, మవ్వముతోడ= చక్కదనముతో, మన్మథకోటి విలాసమూర్తితో= నూరు లక్షల వలపు రాజుల చక్కదనపు రూపముతో, మువ్వలు= కాలిగజ్జెలు, అందెలును= కాలి అందియలు (గుండ్రని గొలుసులు), మొరయున్= ఘల్లుఘల్లుమని ధ్వనింపగా, మ్రోలను= నా ఎదుట నిల్చిన, కృష్ణున్= మోహన రూపుని (ఆ కృష్ణ పరమాత్మను), కొల్చెదన్= సేవించెదను.

భావము : ఈ కావ్యమును ఎవ్వరికి సమర్పింపవలయును? దీని స్వీకారమునకు యోగ్యుడైన దేవుడెవరు? అని ఉత్సాహముతో త్వరపడుచు, ఆలోచన చేయుచుండగా నా కలయందు వెలుగులు వెదజల్లు రత్నాభరణములను ధరించినవాడై కోటి మన్మథుల సొగసుదనముతో, గజ్జెలు, అందెలు ధ్వనించుచుండగా ఎదుట ప్రత్యక్షమైన ఆ మోహనకృష్ణుని సేవించెదను.

చ॥ **గిరి సుతకున్ సగంబు హరికిన్ సగమొయ్యన దేహమిచ్చి సు**
స్థిరత మహాష్టమూర్తుల బ్రసిద్ధికి నెక్కి సమస్త దిక్కులన్
బరమదయామృత ప్రసర బంధుర సింధువునందు తేల్చు నా
వర పరమేశ్వరున్ శివుని భక్తిని గొల్తునభీష్ట సిద్ధికిన్ 3

అర్థము : గిరి సుతకున్= హిమవంతుని తనయకు, సగంబు= సగము, హరికిన్ సగము= హరికి సగము, ఒయ్యన=చక్కగా, దేహము ఇచ్చి= శరీరమును ఇచ్చి, సుస్థిరతన్= గట్టి నిలుకడతో, మహత్+అష్టమూర్తులతో= గొప్పదైన, పంచ భూతాలు (పుడమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము), సూర్యచంద్రులు, పురుషుడు అను ఎనిమిది ఆకారములతో, ప్రసిద్ధికిన్+ఎక్కి= గొప్ప దేవుడనెడు పేరుపొందిన వాడై, సమస్త దిక్కులన్= అన్ని దిక్కులందు, పరమ దయా+అమృత ప్రసర బంధుర సింధువు నందున్= ఉదాత్తమైన కృప, (అనెడి చల్లని జల్లులచే నిండిన తుంపరుల జడియందు) తేల్చున్= ముంచి, తృప్తినిచ్చునట్టి, ఆ పరమేశ్వరున్= శ్రేష్ఠుడైన గొప్ప ఈశ్వరుని శివుని, భక్తిన్= భక్తితో, అభీష్ట సిద్ధికిన్=కోరికలు ఈడేర్చుటకై, కొల్తున్= సేవించెదను.

భావము : పార్వతికి సగము, హరికి సగము సొంపుగా శరీరమును ఇచ్చి నిలుకడగా పంచభూతాలు, సూర్యచంద్రులు, పురుషుడు అను ఎనిమిది రూపాలు అలంకారాలై అన్ని చోట్లలో దయ అనెడి అమృతమును అమితముగా వెదజల్లుచు, భక్తులకు సంతోషము నొసగు ఆ పరమేశ్వరుని కోర్కెలు సిద్ధించుటకై సేవించెదను.

అర్ధనారీశ్వరుడు, హరిహరనాథుడు, అష్టమూర్తి స్వరూపుడు-పరమేశ్వరుడు ప్రార్థింపబడినాడు శివుని కరుణామయ తత్త్వము, సులభ వర ప్రదానత్వము గలదు.

మ॥ హర(వామాంక నివాసి వాసిగ బుధా)త్మాంభోరుహాగారశ్రీ
కర దుగ్ధార్ణవ మధ్యనీపవనికా క్రాంతైక సంతాన స
త్తరుమూల స్థిత(గాళికా సతి జగత్కల్యాణి దాక్షాయణిన్
హరితోబుట్టువు నన్నపూర్ణమదినే నశ్రాంతమున్ గొల్చెదన్ 4

అర్థము : హరవామ+అంకనివాసి= శివుని ఎడమతొడ ఒడిపై నివసించెడిదియును, వాసిగ= బాగుగ(స్పష్టముగ), బుధ+ఆత్మ+అంభోరుహ= ఆగారన్ విద్వాంసుల మనస్సులు అనెడి, కమలముల నడుమ నుండునదియు, శ్రీకర దుగ్ధ+అర్ణవ మధ్య నీపవనికా+ఆక్రాంత+ఏక సంతాన సత్ తరుమూల స్థితన్= శుభములను ఇచ్చునదియును పాలవెల్లి నడుమగల కడిమి చెట్ల అడవిచే చుట్టబడిన ప్రధానమైన సంతానమనెడి దేవతా వృక్షము యొక్క అందమైన చెట్టు వేర్లపై కూర్చున్నదియు, జగత్+కల్యాణిన్=అన్ని లోకములకు శుభముల నిచ్చునదియును, దాక్షాయణిన్= దక్షుని తనయను, హరితో పుట్టువున్= హరికి చెల్లెలును, అన్నపూర్ణన్= భక్తులకు ఎల్లరకు అన్నము తృప్తిగా ఇడునట్టిదియును, కాళికా సతిన్= పతివ్రతయు, శివుని ఇల్లాలు 'కాళిక' అను పేరు గల పార్వతీదేవిని, అశ్రాంతమున్= ఎల్లవేళలయందు, మదిన్= మనస్సులో నిల్పుకొని, నేన్= నేను (కొల్చెదను),

భావము : శివుని ఎడమ తొడపై ఆసీనురాలును, విద్వాంసుల హృదయ పద్మములందు బాగుగా నివసించునదియు పాలవెల్లిలో నడుమ విస్తరించిన కడిమిచెట్ల వనముచే చుట్టబడినట్టి సంతాన వృక్షము యొక్క వేర్లపై నుండునదియునైన దక్షుని తనయ, లోక కళ్యాణి హరిసోదరి, అన్నపూర్ణ, పతివ్రత 'కాళిక' నామధేయ అయిన పార్వతిని ఎల్లవేళలందు మనస్సులో నిల్పుకొని సేవించెదను.

(నెల్లూరు జిల్లా సుళ్ళూరుపేటలో 'చెంగాళమ్మ'(చెన్ను కాళమ్మ అందమైన కాళి అను తల్లి) నిరంతరము భక్త జనావళి పూజలను అందుకొనుచున్నది. ఆశక్తిని ఎఱగుడిపాటి వేంకటకవి మదిలో మెదలినదని ఊహించుటకవకాశమున్నది)

చ॥ సిరికిలు నాభి సంస్థ సరసీరుహగర్భమునం జనించి భా
స్వర సుజనానురక్తి ననిశంబును దన్నలినాంత కర్ణికో
పరి నివసించి గొంచక ప్రపంచము కల్పన సేయునట్టి నిన్
సరసిజసంభవున్ గొలుతు సత్కవితారచనానులబ్ధికిన్ 5

అర్థము : సిరికి ఇలు= లక్ష్మి పుట్టిన ఇల్లైనట్టిదియు, నాభి సంస్థన్= బొడ్డులో ఉండునట్టిదియును అయిన, సరసీరుహ గర్భమునన్= పద్మమనెడి కడుపులోపుట్టి, భాస్వర సుజన+అనురక్తిన్= ప్రకటమగు మంచి వారియెడ గల మక్కువతో, అనిశమున్= ఎల్లప్పుడును, తత్+నలిన+అంతకర్ణికా+ఉపరి= ఆ కమలము లోపల తామరదుద్దుపై నివసించి, కొంచక= వెనుదీయక (సంకోచం లేక) సరసిజ సంభవుల్= కమలమునందు పుట్టిన, నిన్= నిన్ను, సత్+కవితా రచన+అను లబ్ధికిన్ కొలుతున్= ఉత్తమ కవితారచనా శక్తిని పొందుటకై సేవించెదను.

భావము : లక్ష్మికి పుట్టిల్లైన బొడ్డులో నున్న కమలము నడుమ పుట్టి సుజనుల యెడ మక్కువతో ఎల్లప్పుడు తామరదిమ్మెపై నివసించుచు, విశ్వమును

సృష్టిచేయునట్టి, కమలమందు జనించిన నిన్ను ఉత్తమ కవితా శక్తిని పొందుటకై సేవించెదను.

1. సరసీరుహ గర్భము, 2. నలినాంత కర్ణికోపరి, 3. సరసిజ సంభవ

పై శబ్దములన్నియు బ్రహ్మ నుద్దేశించి ప్రయోగింపబడినవి. బ్రహ్మ కమలభవత్వము మూడుసార్లు ఆ వృత్తి చేయుటచేత దేవుడు ప్రపంచమును సృష్టించునట్లు తానును విచిత్ర చమత్కార రచనా కల్పనా శక్తిని ప్రదర్శింతునని కవి ధ్వనింపజేయుచున్నాడు.

ఉ॥ పంట వెలందికిన్ సవతి మంగళదేవత తాతతల్లి మి
న్నంటిన చల్ల వేల్పు చెలియల్ విరివిల్తుని కన్నలేమ పు
ట్టింటికి వన్నెయౌగరిత టెక్కుల చేడియ పేర్మి తమ్మి జే
జింట మెలంగు తొయ్యలి వసించు మదీయ గృహంబు నెప్పుడున్ 6

అర్థము : పంట వెలందికిన్ సవతి= భూదేవికి తోడికోడలు, మంగళదేవత= శుభముల నిచ్చు శక్తి, తాతతల్లి= బ్రహ్మకు తల్లి, మిన్ను+అంటిన చల్లవేల్పు చెలియల్= ఆకాశమందు వెలుగుచున్న చల్లని దేవుని చెల్లెలు, విరివిల్తుని కన్నలేమి= పూవింటి వాని (కాముని) కన్న కాంత, పుట్టింటికి వన్నెయౌ= అలంకారమైన, గరిత= నాతి, టెక్కుల చేడియ= చిలిపి పనులు చేయు చెలువ, పేర్మి తమ్మిజేజి+ఇంట మెలంగు తొయ్యలి= పెద్ద తనముతో బ్రహ్మ ఇంటిలో తిరుగు మగువ, మదీయ గృహంబునన్= నా ఇంటిలో, వసించు= ఉండుగాక!

భావము : ధరణిదేవికి తోడికోడలు, మంగళములను ఇచ్చు మహాశక్తి, బ్రహ్మకు తల్లి, చంద్రుని చెల్లెలు, కాముని కన్నకాంత, పుట్టింటికి పేరు తెచ్చిన పడతి, జిత్తులు చేయు చెలువ, గౌరవముతో బ్రహ్మ ఇంట మెలగు మగువ, ఎప్పుడును నా యింటిలో నివసించుగాక! ఈ పద్యములో వేర్వేఱు పేర్లతో మహాలక్ష్మిని వర్ణించి ఆ రమణి పేరిమిని రూపొందించిన రీతి రమ్యమై రుచించుచున్నది.

చ॥ కలశపయోధి కన్నియకు గాదిలికోడలు లచ్చిపట్టియౌ
చిలుక పఠాణి రౌతునకు చిన్ని మరందలు తమ్మి గద్దియన్
గొలువెపుడుండు తాతకును కూరిమి పత్ని మదీయమాత యా
పలుకులకల్కి నారసన బాయక నిచ్చ వసించుగావుతన్ 7

అర్థము : కలశపయోధి కన్నియ= పాల వెల్లిలో పుట్టిన కన్నె (లక్ష్మీదేవియొక్క), గాదిలి కోడలు= ప్రియమైన కోడలు, లచ్చి పట్టియౌ= లక్ష్మికి సుతుడైన, చిలుక పఠాణి రౌతునకు= చిలుక వాహనముగా గల సారథికి (మన్మథుని),చిన్ని మరందలు= చిన్న మరదలు (భర్తయొక్క తమ్ముని భార్య) తమ్మిగద్దియన్ కొలువు+ఎపుడు+ఉండు తాతకున్= కమలమనెడి పీఠమందు కొలువులో నుండు బ్రహ్మదేవునికి, కూరిమి పత్ని= ప్రియురాలైన భార్య, మదీయ మాత= నాకు తల్లి, ఆ పలుకుల తల్లి= ఆ మాటల కోమలి (సరస్వతీదేవి), నా రసన= నా నాలుకపై, పాయక= వదలక, నిచ్చ= సదా, వసించుకావుతన్= నిల్చుగాక, (నా వాక్కును నిర్వహించుగాక)

భావము : లక్ష్మీదేవికి ఇష్టమైన కోడలు, మన్మథుని చిన్న మరదలు, కమలమందు కొలువుదీరి యుండు బ్రహ్మదేవుని ప్రియపత్ని, నాకు తల్లి పలుకుల దేవత నన్ను విడనాడక నా వాక్కుల విలాసమును నిర్వహించుగాక!

కం॥ కొక్కుపఠాణిం గడువడి
నెక్కంగా బోయి యోప కిట్టుటు దిరిగే
ముక్కంటి ముద్దుపట్టిని
చక్కని గణనాథు మదిని సతతము గొల్తున్ 8

అర్థము : కొక్కు పఠాణిన్= వాహనమైన పందికొక్కును (పెద్ద ఎలుకను), కడువడిన్= ఎక్కువ వేగముతో, ఎక్కంగాన్ పోయి= ఎక్కబోయి, ఓపక= ఎక్కలేక, ఇట్టు+అటు= ఈ వైపు ఆవైపు తిరిగే, ముక్కంటి= శివుని, ముద్దు పట్టిని= ముద్ద కొడుకును, చక్కని గణనాథుని= అందమైన గణపతి దేవుని, మదిన్= మనస్సులో, సతతము=ఎల్లకాలము, కొల్తున్= సేవించెదను.

భావము : పందికొక్కును త్వరగా ఎక్కుటకు బోయి వీలుకాక ఇరువైపులా తిరుగు శివుని ముద్దుకొడుకును, శివగణాల నాయకుని ఎల్లవేళలా మనస్సులో ధ్యానించెను.

శ్రీ అలమేలు మంగా సమేతుడైన వేంకటేశ్వరుని, శ్రీకృష్ణుని, పరమశివునిగా కాళికాదేవిని, బ్రహ్మను, మహాలక్ష్మిని, సరస్వతిని, గణపతిని ఎనిమిది మంది ఇష్ట దేవతలను ప్రార్థించి, వేంకటకవి సకలసత్కవులను స్మరించుచున్నాడు.

వ॥ అని యిష్ట దేవతా ప్రార్థనంబు చేసి సకలసత్కవుల దలంచెద 9

సీ॥ విపులపరాత్మవివేకి వాల్మీకిని ।
బహుపురాణోక్తి విభాసు వ్యాసు
శుభకావ్య కృద్విలాసుని కాళిదాసుని ।
విమలకవిత్వ ప్రవీణు బాణు
మోహన సత్కవిముఖ్యు బాణాఖ్యుని ।
నంధ్రభాషాచార్యు నన్నపార్యు
శ్రీకరకృతివిరాజిని సోమయాజిని ।
ఈశ్వరార్చనధుర్యు నెఱ్ఱపార్యు

తే॥ మొదలు పూర్వకవీశ్వరముఖ్యులకును
వర్తమానోత్తమ కవీంద్ర వర్యులకును
ప్రణతి గావించి తత్కృపాభరిత మతిని
కావ్యమొక్కటి రచియింపఁ గడగినాడ 10

అర్థము: విపుల పరాత్మ వివేకి వాల్మీకిని= సర్వ వ్యాపకుడైన పరమాత్మను గూర్చి విచారించు తెలివితేటలు గల వాల్మీకిని, బహు పురాణ+ఉక్తి విభాసువ్యాసున్= పెక్కు పురాణ రచనలచే ఎక్కువగా ప్రకాశించు విన్యాసముగల కాళిదాసుని, విమల కవిత్వ ప్రవీణు బాణున్= పరిశుద్ధమైన

కవితా సృష్టి యందు నేర్పరియైన బాణుని, మోహన సత్కవిముఖ్యబాణాఖ్యున్= మనస్సును ఆకర్షించు గొప్ప కవులలో ప్రముఖులైన బాణుడు అనే బిరుదుగల, ఆంధ్ర భాషాచార్యున్ నన్న పార్యున్= ఆంధ్ర భాషకు ఉపాధ్యాయుడైన నన్నయ భట్టును, శ్రీకర కృతి విరాజిని సోమయాజిని= సర్వ ఐశ్వర్య ప్రదమైన ప్రబంధములచే తేజరిల్లు తిక్కన సోమయాజిని, ఈశ్వర+అర్చనాధుర్యున్= శివుని ఆరాధించు గొప్ప భక్తుడైన, ఎఱ్ఱపార్యున్= ఎఱ్ఱాప్రెగ్గడను మొదలు పూర్వ కవీశ్వర ముఖ్యులకును= మొదలుకొని కావ్యరచన చేసిన గొప్ప కవివరులను, వర్తమాన+ ఉత్తమ= నేటి ఉత్తమ ప్రతిభావంతులైన కవి శ్రేష్ఠులకును, ప్రణతి కావించి= నమస్కరించి, తత్+కృపాభరితమతిని= వారి దయనిండిన మనస్సుతో, కావ్యము+ఒక్కటి రచింపన్= ఒక్క కావ్యమును వ్రాయుటకు, కడగినాడన్= పూనుకొన్నాను.

భావము : సర్వవ్యాపి విష్ణువును గూర్చి విచారణ చేయగల జ్ఞాని వాల్మీకిని, పెక్కు పురాణ చరిత్రలను వ్రాయుటచే ప్రకాశించు వ్యాసుని, కావ్యకృతుల విన్యాసముగల కాళిదాసుని, శుద్ధ శబ్దార్థ సౌభాగ్య ప్రవీణతగల బాణుని, ఆంధ్రభాణుడుగా కీర్తి నార్జించిన ఆంధ్రభాషకు ఉపాధ్యాయుడైన వాగనుశాసనుడు నన్నయభట్టును, శుభప్రదమైన ప్రబంధములచే రాణించు తిక్కన సోమయాజిని, పరమేశ్వరుని పూజలందే నిమగ్నుడైన ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రెగ్గడను, మొదలుకొని ముఖ్యులైన ఆదికవులకు నమస్కరించి నేటి కవివరులకు నమస్సులు అర్పించి, వారి కృప నా మనస్సులో నిండుకొనగా ఒక్క కావ్యమును రచించుటకు సంకల్పించు కొన్నాను.

ఉ॥ మంచికి మెచ్చి యొప్పమి సమంచితలీలల దీర్చి చక్కగా
వించిన ధన్యుడే సుకవి వేమరు సర్వము తప్పులట్లుగా
నెంచును నిక్కమున్ కుకవి యిదుకు వేరె నుతించ నింద గా
వించగ నేల నైజములు విశ్రుతయై ధరమీరి పర్వగన్ 11

అర్థము : మంచికి మెచ్చి= మంచి రచనను మెచ్చుకొని, ఒప్పమి= తప్పినచో, సమచింతల లీలలన్= సరియైన రీతిని, తీర్చి చక్కగావించిన= దిద్ది చక్కచేసిన, ధన్యుడే సుకవి= మంచి కవి, ధన్యుడు (వాడే సుకవి), వేమరు= పలుమారులు, సర్వము = అన్నింటిని, తప్పులట్లుగా నెంచున్= సత్యము సైతము తప్పుగా తలచును, కుకవి=కుకవి, వేరె నుతించన్= వేరుగా నుతించుటగానీ (సుకవులను), నిందగావించగన్+ఏల= (కుకవులను) నిందించుటగానీ ఎందుకు?, ధరన్= ఇలలో, నైజములు= వారి స్వభావములు, మీరి పర్వగన్= అతిశయించి వ్యాపించును!

భావము : మంచి రచనను మెచ్చుకొని, తప్పినచో సరియైన రీతిని చక్కచేయువాడే సుకవి, పలుమారులు అన్నింటిని సత్యమును సైతము కుకవి తప్పుగా తలచును, కావున వేరుగా సుకవులను నుతించుటగానీ, అట్లే కవులను నిందించుటగానీ ఏల చేయవలెను? వారి స్వభావములు ఇలలో, అతిశయించి వ్యాపించుచున్నవి.

ఉ॥ తొల్లిటి కావ్యముల్ దెలియు తోషణ లేదట నూత్నకావ్యమున్
మల్లడి నొందనేల యనుమాట నిజంబను నట్టి వారు వీరు నా
కెల్ల రుచి ప్రబంధము గ్రహింతు రటంచును జేయువాడ నే
వెల్లడి గాగ నీక్రియ వివేకము గానె గ్రహించుడీ బుధుల్ 12

అర్థము : తొల్లిటి కావ్యమున్= పూర్వ కావ్యాలను, తెలియు= తెలిసికొనుటచే, తోషణ లేదట= సంతోషము కలుగలేదట, నూత్న కావ్యమున్= క్రొత్త కావ్యమును గురించి, మల్లడి నొందనేల= శ్రమ చెందుటయేల, అనుమాట నిజంబను నట్టివారు వారు వీరు కాక= అనక ఆ మాటకు వాస్తవమును వారు ఎల్ల= ఎల్లరు (అట్టివారందరు) (రుచి అనేది ఆలంకారిక పరిభాషలో చూడవలెను) రుచి ప్రబంధము= వైవిధ్య భరితము, రచిగల ప్రబంధమును, గ్రహింతురని= ఆదరింతురని, ఈ క్రియ= ఈ కృషిని, వివేకముతోడ= చక్కగా విచారించి, బుధుల్= ఓ విద్వాంసులారా! గ్రహించుడీ

భావము : తొల్లింటి కావ్యాలను చదువుటచే సంతోషము కలుగలేదట. కావున క్రొత్త కావ్యరచనకై శ్రమ యేల? ఇది వాస్తవమైన స్థితి యని కవి బృందము వచించుచున్నది. కాన వారలందరున వైవిధ్యము, రుచిగల ప్రబంధమును (శబ్దార్థ వైచిత్రిని) ఆదరింతురని ప్రశస్తమైన ఈ కృషి గూర్చి చక్కగా ఆలోచించి విద్వాంసులారా! చదవండి.

చ॥ చదివినవాడ గాను పదసంధు లెఱుంగను వేంకటేశస
త్పదయుగ సత్త్వ సంపద ప్రబంధము సేయుదు సత్కవుల్ ముదం
బొదవగ తప్పుదీర్చి తగ నొప్పుడు బాలుడు ముద్దు ముద్దుగా
కొదుకుచు పల్కు పల్కులకు కూరిమి సేయరె పెద్ద లెంతయున్ 13

అర్థము : చదివిన వాడన్+కాను= నేను ఎవ్వరి వద్దను చేరి చదువుకొనలేదు, పద సంధు లేరుంగను= శబ్ద ప్రయోగములు తెలియవు, వేంకటేశ సత్పదయుగ సత్త్వ సంపద= ఆ వేంకటేశుని, పూజ్యములైన పదద్వయ మహత్వ మహిమచే, ప్రబంధము+చేయుదు= ప్రబంధమును నిర్మించెదను, సత్కవుల్= సత్కవులు, ముదంబు+ఒదవగ= సంతోషము చెంది, తప్పులు+తీర్చి= తప్పులున్నచో సరిజేసి, తగనొప్పుడు= తగినట్లు మెచ్చుకొనుడు, బాలుడు ముద్దుముద్దుగా కొదుకుచు= ముద్ద ముద్దుగా తొట్రుపాటు పడుచు పల్కిన, పల్కులకు, పెద్దలు+ఎంతయున్= పెద్ద వారు పెద్ద మనసుతో, కూరిమి+చేయరే= మిక్కిలి మక్కువ చూపరా?

భావము : నేను ఎవ్వరి వద్దను చేరి చదువు కొనలేదు. శబ్ద ప్రయోగములు నాకు తెలియవు. ఆ వేంకటేశుని పూజ్యములైన పాదముల జంట యొక్క మహత్వ మహిమచే ప్రబంధమును నిర్మించెదను. సత్కవులు ముదము చెంది తప్పులున్నచో తీర్చి మెచ్చుకొనుడు. రచనలో బాలుడను కనుక పెద్దలయిన వారు బాలుని ముద్దు ముద్దుగా తొట్రుపాటు పడుచు పల్కిన పల్కులను చూచి మిక్కిలి మక్కువను చూపరా?

మ॥ తగ సర్వాంతర దిఙ్నివాసుడు జగద్వంద్యుండు నారాయణుం
డగుటన్ దత్కృప కావ్యకల్పనమహత్త్వాయత్తచిత్తుండ నే
నగుట న్విష్ణుకథా ప్రసంగ మపవర్గావాప్తి దానౌట మే
లగు నంచున్ రచియింపఁ బూనితి మహాఖ్యానం బనూనంబుగన్ 14

అర్థము : దిక్+నివాసుడు= నారాయణుడు (అన్నిదిక్కులలో నుండువాడు), సర్వాంతర= అన్నింటిలో నుండువాడు (అంతటా నుండువాడు) జగద్వంద్యుండు అగుటన్= జగత్తునందు పూజ్యుడు అగుటచే, తత్+కృప= ఆతని కృపతో, కావ్య కల్పన మహత్త్వాయత్త చిత్తుండన్= గొప్ప కావ్యనిర్మాణమునకై పూనుకొన్న మనసు కలవాడనగుట చేత, విష్ణు కథా ప్రసంగంబు= విష్ణు కథా ప్రవచనము, అపవర్గ ఆవాప్తితాన్+ఔటన్ మేలగునంచున్= మోక్షమును పొందుట తగినదగుటచే మేలు కలుగునని, మహాఖ్యానంబు+అనూనంబుగన్= గొప్ప కథాకథనమును ఉత్తమముగా రచియింప పూనితి.

భావము : నారాయణుడు అన్ని దిక్కులందు, అన్నింటిలోను ఉండువాడు. జగత్తునందు పూజ్యుడు. కనుక ఆతని కృపకు పాత్రుడనై గొప్ప కావ్యనిర్మాణమునకై పూనుకొన్న మనస్సు కలవాడనగుట చేత, విష్ణు కథా ప్రవచనము మోక్ష ప్రదమగుటచే మేలు కలుగునని గొప్ప కథను ఉత్తమముగా రచించుచున్నాను.

చ॥ ఇహపరసౌఖ్య సంపదల నియ్యెడ నెయ్యెడ నెట్టి వేల్పులన్
మహినసమర్థునాశ్రితుననూన విభూతి ధ్రువ ప్రముఖ్యులన్
మహిమఁ జెలంగునట్టి దగుమానస వీధిని నిశ్చయించి యీ
విహితము కావ్యసిద్ధి కని వెండి దలంచియు నర్మిలిట్టులన్ 15

అర్థము : ఇహ= ఈ లోకమున, పర= పరలోకమున, సౌఖ్య= సుఖములిచ్చు, సంపదలన్= సంపదలకై, ఇయ్యెడన్+ఎయ్యెడన్ నెట్టి= ఇప్పుడు ఎప్పుడును చేరనీయక త్రోసివేసి, వేల్పులన్= దేవతలను, మహిని= భూలోకములో, సమర్థులు+ఆశ్రితులు+అనూన విభూతిన్= యోగ్యులు, ఆశ్రయింపబడువారును, కొలదిలేని కీర్తి వైభవమును పొందినవారును, ధ్రువ ప్రముఖ్యులన్= ప్రముఖులైన ధ్రువుడు మొదలయినవారిని, మహిమ చెలగునట్టి= గొప్ప తనమునిండిన, మానస వీధిని= మనస్సునందు, నిశ్చయించి= పదిల పరచుకొని, అర్మిలి= ప్రేమతో, ఇట్టులన్, విహితము కావ్య సిద్ధికవి= కావ్యరచనకు మేలు కలుగునని, తలంచి= కోరిక కలుగగా (కావ్యరచనకు సంకల్పించుకొని)

భావము : ఈ లోకమున పరలోకమున, సుఖములొసగు, సంపదలను ఎప్పుడును కోరక దేవతలను, భూలోకములో యోగ్యులని పేరొందిన గొప్ప కీర్తివైభవము గల, భక్తులైన ధ్రువుడు మొదలగు వారి గొప్పతనము నిండిన మానసమును పదిలపఱచు కొని వారి కృపచే కావ్య రచనకు జయము కలుగునని కోరిక కలుగగా (కావ్య రచనకు సంకల్పించుకొని).

వ॥ అని నిశ్చయించి మదీయ వంశావతారంబు వర్ణించెద 16

అర్థము : అని నిశ్చయించి= అని సంకల్పించుకొని, మదీయ= నా యొక్క, వంశావతారంబు= వంశము అవతరించిన విధమును, వర్ణించెద= వర్ణించెదను.

భావము : కావ్య రచనకై సంకల్పించుకొని వంశము అవతరించిన విధమును వర్ణించెదను.

సీ॥ శ్రీ వనితాధీశ శృంగారరసనాభి పద్మగర్భంబున ప్రభవమైన
చతురాస్య ముఖజాతసద్బ్రహ్మకులవార్ధి జనియించి సత్కాంతి చంద్రుడైన
ఘనుడు భరద్వాజమునివరేంద్రునిగోత్ర సంభవు కశ్యపసంజ్ఞ దనరి
సకలకళానిధి యకళంకసువిశాలి సద్బుద్ధి దేవతాచార్యసముడు
సర్వసద్గుణమణిఖని సత్యధనుడు

భాగ్యసదనుండు యెఱగుడిపాటి ఘనుడు
అమలితాచారి సర్వసమ్మతవిహారి
మానితోదారి శ్రీగిరిమంత్రి శౌరి 17

అర్థము : శ్రీవనితా+అధీశ= శ్రీ మహాలక్ష్మీపతియొక్క, శృంగార రస= శృంగార రస నిలయమైన, నాభి= బొడ్డున, పద్మ గర్భంబున= కమలపు కడుపున, ప్రభవమైన= పుట్టిన, చతురాస్యముఖజాత= బ్రహ్మ ముఖము నుండి వెలువడిన, బ్రహ్మ కులవార్ధిన్= బ్రహ్మ కులమనెడి జలధిలో, జనియించి= పుట్టిన, సత్కాంతి చంద్రుడైన= కాంతిగల చంద్రుడై, భరద్వాజ ముని నరేంద్రుని= భరద్వాజ ముని శ్రేష్ఠుని వంశమందు పుట్టిన, కశ్యప సంజ్ఞ= కశ్యప అనే బిరుదు పొందినవాడు. సకల కళానిధి= సకల కళలకు నెలవు, అకళంక సువిశాలి= కళంకము లేని విశాల భావాలు కలవాడు, సద్బుద్ధి= మంచి బుద్ధులు కలవాడు, దేవతా ఆచార్యసముడు= బృహస్పతితో సమానుడు, సర్వ సద్గుణమణి ఖని= సమస్తమైన మంచి గుణములకు నెలవైనవాడు, సత్యధనుడు=సత్యవాక్కు గలవాడు, భాగ్యసదనుండు= సకల భాగ్యములును కలవాడు, అమలిన+ఆచారి= శుద్ధమైన జీవితమును నెరపువాడు, సర్వసమ్మత విహారి= అందరికీ ఇష్టుడై మెలగువాడు, మానిత+ఉదారి= అందరిచే గౌరవింపబడుదాత, ఎఱగుడిపాటి ఘనుడు= ఎఱగుడిపాటి మహనీయుడు.

భావము : శ్రీ మహాలక్ష్మి శృంగార రస నిలయమైన బొడ్డున వెలసిన కమలపు కడుపున పుట్టిన బ్రహ్మముఖము నుండి వెలువడిన బ్రహ్మ కులజలధిలో, చక్కని కాంతిగల చంద్రుడై జనించిన భరద్వాజుడు చాలా గొప్పవాడు (మానసపుత్రుడు) ఆ ముని వంశమందు పుట్టిన వాడు సాక్షాత్తూ విష్ణువే! శ్రీ గిరి మంత్రి 'కశ్యప' అనెడి బిరుదు పొందినవాడు, సకల కళలకు నెలవు, కళంకము లేని విశాల భావాలు కలవాడు. సద్బుద్ధులు కలవాడు, బృహస్పతితో సమానుడు, సమస్తమైన మంచి గుణములకు నెలవైనవాడు,

సత్యవాక్కు గలవాడు, సకల సౌభాగ్యములను కలవాడు శుద్ధమైన జీవితమును నెరపువాడు. అందరికినీ ఇష్టుడై మెలగువాడు. అందరిచే గౌరవింపబడుచున్న దాత ఆ మహనీయుడు ఎఱగుడిపాటి శ్రీగిరిమంత్రి.

చ॥ చిరమతి బర్ణశాల నరసింహపదాంబుజభక్తివాసనా
నిరతుడు స్వామికార్యహితనిశ్చలచిత్తుడు కార్యఖడ్గవి
స్ఫురతర ధైర్యమానసుడు భూరియశోవిభవాభిరాముడా
దరణసుధాకరుండు వనితానవమన్మథుడై చెలంగుచున్ 18

భావము : నిలకడైన మనస్సుతో పర్ణశాల నరసింహస్వామి పదకమలముల యందు భక్తి అనెడి సువాసనలతో ఎల్లప్పుడు వర్తించువాడు. తన యజమాని పనులందు అతని మేలు కొఱకు చలింపని చిత్తముతో నుండువాడు (స్వామి భక్తి కలవాడు) సమర్థనీయములైన రాచ కార్యములను ధీరతతో నిర్వర్తించునట్టి మనస్సు కలవాడు. అధికమైన కీర్తి శోభచే అందమైన వాడు, ఆదరింపబడే చంద్రుడు, వనితల మనస్సులలో నున్న మదనుడు.

చ॥ తనయుల గాంచె నిద్దరి మదద్విరదద్వయమో యనంగ భూ
జననుత సద్గుణాఢ్యులను సత్యవచోనయశీలధుర్యులన్
మనసిజసుందరాంగులను మంజులవాక్యవిలాసభాసులన్
ఘనులను వేంకటాఖ్యబుధకల్పును సూరనమంత్రిశేఖరున్ 19

భావము : పుడమి జనులు మత్తగజంబు లేమోయనునట్లు, మంచి గుణములు సత్య వాక్కు గలవారును, శీలవంతులు, నీతిమంతులు, మదనుని వంటి అంద గాళ్ళను, మృదువైన సొంపైన వాక్కులరీతిచే వెలయు వేంకటార్యుడు, సూరనార్యుడు అను ఇరువురు పుత్రులను పొందెను.

కం॥ ఆ వేంకటార్యవర్యుడు
శ్రీవేంకటనాథపాద సేవారతుడై

కావించె శేషగిరిపై
భూవిదితములైన ధర్మములు కడు బేర్మిన్ 20

భావము : ఆ వేంకట శ్రేష్ఠుడు శ్రీ వేంకటనాథుని పాదసేవయందు భక్తి కలవాడై శేషశైలమందు నిలిచియున్న ఆ దేవునికి అందరికీ తోడ్పడు సేవలు చేసెను. (భవన నిర్మాణము అన్న, విద్యాదానములు మొదలగునవి).

శా॥ సూరామాత్యుడు బంధుకైరవ బృహచ్ఛుభ్రాంశుబింబంబు గం
భీరాంభోనిధి దీన రక్షణ కళాభిజ్ఞుండు దుర్మంత్రిమం
త్రారంభైక విభేదకారి మహదుద్యత్కీర్తి నీతి క్రియా
ధౌరేయుండును కాంతిసోముడు మహాతత్త్వజ్ఞుడైరాజిలెన్ 21

భావము : సూరనార్యుడు చుట్టములనెడి కలువలకు గొప్ప మచ్చలేని చంద్రబింబము సముద్రము వలె గంభీరుడు (ఉదారమైన ఎదగలవాడు) సహాయము కోరువారిని కాపాడు నేర్పుగలవాడు. చెడ్డ కోరువారి ఆలోచనలను మొదటనే పసిగట్టి వాటిని రూపుమాపువాడు. మిక్కిలి వ్యాపించిన కీర్తిగలవాడు. రాజనీతి కార్యములను చక్కబెట్టు నేర్పరి. వెలుగుచున్న చంద్రుడు. ఆధ్యాత్మిక చింతన కలవాడై ప్రకాశించెను.

క॥ ధారుణి విస్సావంశ
క్షీరాంబుధిలక్ష్మి యనగ శ్రీకరసతి యా
సారసయన నంబాంబిక
సూరన ధరియించి కాంచె సుతయుగళంబున్ 22

భావము : సూరనమంత్రి, పుడమిలో పేరొందిన 'విస్సా' వంశమనెడి పాల సముద్రంలో పుట్టిన లక్ష్మియను విధమున, శుభములు చేయు పతివ్రత, కమలముల వంటి కన్నులు కల కోమలిని 'అంబాంబిక'ను పెండ్లాడి ఇరువురు సుతులను బొందెను.

ఉ॥ ఆసుతయుగ్మమందు దగ నగ్రజు డూర్జితవైభవుండు ప
ద్మాసనసన్నిభప్రకటమానిత శాస్త్రవివేక శాలియై
భూసురపాదపంకరుహపూజలు సంతత మన్నదానవి
ద్యాసురధేనువై పొలిచె ధన్యుడు బిట్టన మంత్రి ధారుణిన్ 23

భావము : ఆ ఇరువురు పుత్రులలో పెద్దవాడు (బిట్టనమంత్రి) పుడమిలో నిలకడైన సంపద కలవాడై బ్రహ్మ దేవునితో సాటి అయి స్పష్టముగా ఆదరింపదగిన శాస్త్ర పాండిత్యము కలవాడై భూ దేవతలయిన బ్రాహ్మణుల పాదకమలముల పూజలు ఎల్లప్పుడు చేయుచు అన్ని దానములను చేయుచు కామధేనువై ఆ పవిత్రుడు ప్రవర్తించెను.

మ॥ ఘను డా బిట్టనమంత్రివర్యుడు మహత్కల్యాణచారిత్రుడై
తనకుం బత్నిగ నాత్మకూరికులరత్నం బక్కనార్యాత్మజన్
వనితారత్నము ధీవిడంబ నరసాంబన్ వేడుకన్ బెండ్లియై
తనయద్వంద్వము కన్యకాయుగము మోదంబొప్పఁ గాంచెం దగన్ 24

భావము : ఆ బిట్టన మంత్రి గొప్పవాడు, మేలైన శుభగుణములతో జీవించుచు, ఆత్మకూరి అక్కనార్యుని తనయ, వంశమునకు వన్నె తెచ్చు శ్రేష్ఠురాలైన శ్రీమతిని, బుద్ధిమంతురాలైన నరసమాంబను ఉత్సాహముతో పెండ్లాడి ఇద్దరు కుమారులను ఇద్దరు కుమార్తెలను పొందెను.

సీ॥ అందగ్రజుండు శ్రీహరిభక్తినిరతుండు
భ్రాతృవత్సలుడును బంధుయుతుడు
కరుణాపయోధి నిష్కపటచారిత్రుండు
మానినీజననూత్నమన్మథుండు
బుధజనసంస్తుతాద్భుత సత్యశీలుండు
సకలసద్గుణగణసంభృతుండు
భూసురాశీర్వాదపూతసన్మార్గుండు
దానమానుషకీర్తిధనుడు ఘనుడు

తే॥ సరస మాధుర్య వాగ్విలాస ప్రసంగి
ధరణిపాలకసద్భుజాదండమగుచు
భూమిజనపాలనక్రియాహోముడైన
మంత్రికుధరుండు వేంకటమంత్రివరుడు 25

భావము : సుతులలో పెద్దవాడు వేంకటార్యుడు. హరి భక్తియందు ఎల్లప్పుడు మెలగువాడు, సోదరులయెడ ప్రేమ కలవాడు. బంధువులతో కలయువాడు, దయకు మున్నీరు (సముద్రము) మోసము చేయని నడవడిక గలవాడు. కాంతలకు క్రొత్త కాముడు. విద్వాంసులు పొగడునట్టి విశిష్టమైన మంచి నడవడిక గలవాడు. మంచి గుణములతో నిండినవాడు బ్రాహ్మణుల ఆశీర్వాదములచే పావనుడై మేలైన ప్రవర్తన కలవాడు. దానములచే మానవులు పొందెడి కీర్తి అనెడి ధనముకల గొప్పవాడు, రసవంతములు, తియ్యని చమత్కారములైన సంభాషణలు చేయువాడు. భూ మండలాధిపులకు బలమైన సహాయకుడై జనుల పాలన అనెడి యాగములలో హోమము చేయు మంత్రి శ్రేష్ఠుడు.

ఉ॥ పేశల తంత్రుడాత్మకురి పేరనమంత్రివరేణ్యు పట్టి రే
ఖాశశిబింబ బంధుజనకల్పకుజప్రతిబింబ భాసుర
శ్రీశుభలక్షణానుగతచిత్తభవాంబను అచ్చమాంబనున్
కౌశలమానసాబ్జ గజగామిని లచ్చమనామకన్యకన్ 26

భావము : నేర్పరి, రాజ్యతంత్రమును తెలిసిన వాడైన ఆత్మకూరు పేరనమంత్రి వరుని (కుమార్తె అచ్చమాంబను) చంద్రబింబరేఖను, చుట్టాలకు దేవతా వృక్షమును పోలినదియు, ప్రకాశించు, శుభకరములైన గుణాలను అనుసరించు మనసుతో పుట్టిన అంబ (పార్వతీదేవి) వంటిదియు మరియు నైపుణ్యము గల కమలము వంటి మనస్సు కలదియు ఏనుగువంటి నడక కలదియును అయిన లచ్చమాంబను.

చ॥ తనకును ధర్మపత్నులుగ దాల్చి నిరంతర సర్వధర్మవ
ర్ధన మహిత ప్రచారముల రంజిలుచున్ గృహమేధి సత్క్రియల్
దనరగ బంధుమిత్ర హిత తత్పరతన్ హరి భక్తియుక్తుడై
జననుత సత్క్రియా కలిత సత్యగుణోన్నత కీర్తికాముడై 27

భావము : వేంకటపతి వారిని తన పత్నులుగ చేసుకొని, ఎల్లపుడు ధర్మములను వృద్ధి చేయుచు, గొప్ప సమావేశాలచే ప్రకాశించుచు, ఇంటి యజమానిగ మంచి పనులు చేయుచు బంధువులు, మిత్రులు, హితుల యెడ శ్రద్ధ వహించుచు హరి భక్తితో జనులు నుతించునట్లు సత్కర్మలు చేయుచు సత్యగుణముచే గొప్ప కీర్తిని కోరువాడయి.

ఉ॥ తమ్ముడు రామమంత్రి నిరత మ్ముడురాజ విరాజకాంతిచే
గ్రమ్మి సమస్త కార్యములు గైకొని చేయ తదాత్మపత్ని బు
చ్చమ్మ సమస్తబాంధవహితాత్మకయై కడు ముద్దు ముద్దుగా
సమ్మతినెల్ల కృత్యముల జాలి మెలంగగ తుష్టచిత్తుడై 28

భావము : తమ్ముడు రామమంత్రి నక్షత్రముల రాజు చంద్రునివలె వెలుగుచు తనకు (అన్నకు=వేంకటార్యునకు) తోడుగా పనులన్నింటిని చక్కజేయగా (రామయార్యుని) బుచ్చెమ్మ జాలితో ముచ్చటగా చుట్టాలందరికీ మేలు చేయు ఇంటిపనులు చేయగా తృప్తి గలవాడయ్యెను.

ఆ॥ అగ్రభార్యయైన యచ్చమాంబికయందు
గాంచె నొక్కపుత్రు గడు పవిత్రు
సకలశాస్త్రధుర్యు సమధికనగధైర్యు
సరససుకవివర్యు నరసనార్యు 29

అర్థము : అగ్రభార్య కాంచె నొకపుత్రున్= పెద్ద భార్య ఒక కుమారుని పొందెను, కడు పవిత్రున్= మిక్కిలి పవిత్రుని, సకల శాస్త్ర ధుర్యున్ సరస సుకవి వర్యున్= అన్ని శాస్త్రములను పఠించువాని రసజ్ఞత గల మంచి కవిని.

భావము : పెద్ద భార్య అచ్చమాంబకు ఒక కుమారుడు కల్గెను అతడు మిక్కిలి పవిత్రుడు శాస్త్రములను పఠించువాడు పర్వతమువలె చలింపని ధైర్యము కలవాడు, రసము నెఱిగిన మంచి కవి అయిన నరసనార్యుని పొందెను.

మ॥ రమణీయాత్మకయౌ ద్వితీయమహిళారత్నంబు లక్ష్మాంబయం
దమృతాంశుప్రతిబింబసుందరుల విద్యాశాలురన్ శాశ్వతో
ద్యమితోదారులఁ బేరమంత్రివరు లింగామాత్యు రామప్రభున్
రమణీరత్నము సర్వలక్షణయుతన్ నారాయణమ్మన్ గనెన్ 30

అర్థము : రమణీయాత్మక ద్వితీయ మహిళారత్నము లక్ష్మాంబకు= రమణీయురాలైన రెండవ భార్యలక్ష్మాంబకు, అమృతాంశు ప్రతిబింబ సుందరులు= చంద్రుని వంటి అందగాళ్ళు, విద్యాశాలురు= విద్యావంతులు, శాశ్వత+ఉద్యమిత+ఉదారులన్= దృఢమైన ప్రయత్నాలలో ఉదారులు 1.పేరన, 2. లింగన, 3. రామన, రమణీ రత్నము= రమణులలో శ్రేష్ఠురాలు (నారాయణమ్మ).

భావము : రమణీయురాలైన రెండవ భార్య లచ్చమ్మకు (లక్ష్మాంబ) చంద్రుని వంటి అందగాళ్ళు, విద్యావంతులు, దృఢమైన ప్రయత్నాలలో ఉదారులు అయిన, ముువ్వురు పుత్రులు పేరస, లింగన, రామన, కుమార్తె నారాయణమ్మ కల్గిరి.

మ॥ స్తవనీయుండగుబిట్టమంత్రి సుతులన్ ధన్యాత్ములన్ ముువ్వురిన్
భువి నుద్వాహము సేయుచో సుగుణసంపూర్ణాఢ్యుఁ గౌండిన్యగో
త్రవరేణ్యున్ ఘను బ్రహ్మమంత్రివరపౌత్రశ్రేష్ఠు గంభీరు రా
ఘవమంత్రీంద్రునిపుత్రుఁ గొప్పరపురంగశ్రీనిధిం బ్రీతిమై 31

భావము : బిట్టన మంత్రి ముువ్వురు పుత్రులకు పెండ్లి చేయునప్పుడు తన తనయ (సూరమ్మ) ను మంచి గుణముతో కూడిన కౌండిన్య గోత్రానికి చెందిన శ్రేష్ఠుడైన ఘనుడైన బ్రహ్మమంత్రి పౌత్రుడైన రాఘవమంత్రి పుత్రుడు కొప్పరపు రంగమంత్రికి, ప్రీతితో

ఉ॥ కూరిమితోడి తెచ్చి సుమ కోమలి లక్షణలక్షితాంగియౌ
సూరమనామకన్య దగ శోభనదక్షిణపూర్వకంబుగా
వారక ధారవోసె నతివైభవవిశ్రుతసంభ్రమంబులన్
భూరితరప్రదానముల భూసురకోటుల తృప్తి సేయుచున్ 32

అర్థము : శోభన దక్షిణ పూర్వకంబుగా= శోభన శుభ సమయమందు దక్షిణగా, విశ్రుత సంభ్రమంబులన్= వేగిరపాటుతో (ఎల్లరు మెచ్చుకొనునట్లు) భూరితర ప్రదానములు = చాలా దానములను, భూసుర కోటులన్= ధరణీ దేవతలైన బ్రాహ్మణులను.

భావము : సర్వ శుభ లక్షణములు గల సూరమ్మను ఇచ్చి ప్రేమతో పెళ్ళి చేయు శుభ సమయమందు సౌభాగ్యముతో దానములను ఇచ్చి తృప్తులను చేసెను.

క॥ ఆ రంగమంత్రిమణికిన్
సూరాంబకు నతులితాంగసుందరు లగు పెన్
గారాబు కూతులిద్దరు
మారనిభుండైన యొక కుమారుడు గల్గెన్ 33

అర్థము : అతులిత+అంగసుందరులు= సాటిలేని అందమైనవాడు, మార విభుండు= మదనుని వంటివాడు.

భావము : ఆ సూరమ్మకు, రంగమంత్రికి సాటిలేని అందమైన మిక్కిలి ముద్దులొలుకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు కల్గిరి.

ఉ॥ అందుల నగ్రజాత సకలాంచితలక్షణ లక్షితాంగి ధీ
మందిర పేరమాంబికను మక్కువ బల్కురియెల్లమంత్రి మే
ల్పొంద వివాహమై కనియె పుత్రులనిద్దరి పుత్రికాయుగం
బందుల వేంగళార్యుడు మహామహుడై విలసిల్లె కీర్తులన్ 34

భావము : ఆ కూతుళ్ళలో పెద్ద కూతురు (పేరమాంబ) ఒప్పిదమైన గుణములు కలది. ధీరవనిత ప్రేమతో (పాల్కురికి ఎల్లన మంత్రిని) వివాహమాడి, మేలుపొంది, ఇరువురు కన్నియలను, ఇరువురు కుమారులను పొందెను. వారిలో వేంగళార్యుడు కీర్తులతో చాలా గొప్పవాడై ప్రకాశించెను.

సీ॥ శ్రీ కేశవస్వామి నాకల్పవైభవో
దంచితంబుగ ప్రతిష్ఠించినాడు
వెలయగ బంన్రెండు వేల చూతంబుల
విపులమౌ వనము గావించినాడు
బహుజలపూరితోత్పలవిలాసంబులౌ
పృథుతటాకములు గల్పించినాడు
బహుతరంబైనట్టి బ్రహ్మప్రతిష్ఠలు
నిరుపమోన్నతి భూమి నిల్పినాడు

తే॥ మఱియు బహువిధమైన ధర్మములు ధరణి
చిరతర స్థితి మెఱయంగ జేసినాడు
మంత్రిమాత్రుండె యల్లన మంత్రి సుతుడు
భాగ్యనిరతుండు వేంగళ ప్రభువరుండు 35

అర్థము : కేశవస్వామి= మదన గోపాలస్వామికి, అకల్పవైభవ+ ఉదంచితంబుగన్= దేవాలయము నిర్మించుట, వస్త్రాద్యలంకరణములు సమకూర్చుట=భాగ్యములను, చక్కగా పంన్రెండు వేల చూతంబుల వనము కావించె= పన్నెండువేల బహుజన పూరిత= బాగానీటితో నిండిన, ఉత్పల విలాసంబు+ఔ= కలువపూల కులుకుల ఆటలు గల, పథు తటాకంబులు= గొప్ప చెరువులను, బహుతరంబైనట్టి= దేశములో సాటిలేని విధంబున, బ్రహ్మ ప్రతిష్ఠలు= విష్ణుదేవుని ఆలయములు, నిరపమోన్నతి= ఉత్తమ పద్ధతిలో, నిల్పినాడు= నిర్మించినాడు.

భావము : వేంగళార్యుని సత్కార్యములు 1. మదన గోపాలస్వామి ఆలయమును నిర్మించి సర్వాలంకారములతో స్వామిని ప్రతిష్ఠించెను. 2. పన్నెండువేల మామిడి మొక్కలతో ఆమ్ర వనమును పెంచెను. 3. బాగా నీటితో నిండిన కలువపూల కులుకుల ఆటలుగల గొప్ప చెరువులను ఏర్పరచెను. 4. దేశములోని సాటిలేని విధమున, ఉత్తమ పద్ధతితో విష్ణుదేవుని ఆలయములు నిర్మించెను. 5. పెక్కు ధర్మకార్యములు చాలా కాలము కొనసాగునట్లు చేసెను. ఎల్లన మంత్రి సుతుడు వేంగళ ప్రభువు భాగ్యశాలి. సామాన్య మంత్రియా? మేటి పాలకుడు.

కం॥ ఆ రంగ మంత్రి రెండవ
గారాబు కుమారి నెలయ గడు వేడుకతో
నారూఢి వేంకటార్య కు
మారుండగు నరసమంత్రిమణి వరియించెన్ 36

భావము : రంగమంత్రి ప్రియమైన రెండవ కూతురు (వెంగాంబ) వేంకటార్య మంత్రి కుమారుని నరసనార్యుని వరించెను.

చ॥ స్ఫుటతరకీర్తి సర్వజనపూజితుడై తగు పేరమంత్రి ది
క్తటపరిశోభమాన సితకాంతి యశోనిధి చౌకుజర్ల వేం
కటసచివాగ్రణ్యుసుత కాంతితటిల్లత సద్గుణాన్వితన్
పటుమతి గోపమాంబికను భాసుర లీల వరించె వేడుకన్ 37

అర్థము : స్ఫుటతర కీర్తి= స్పష్టమైన యశస్సుతో, సర్వజన పూజితుడు పేర మంత్రి= సర్వజనులచే గౌరవింపబడిన పేరన మంత్రి, దిక్ తట పరిశోభమాన సిత కాంతి యశో నిది= దిగంతములందు శోభించు తెల్లని కాంతులనెడి కీర్తలకు నెలవైన (చౌకుచర్ల వేంకట మంత్రివరుని), సుతన్ కాంతి తటిల్లత సద్గుణాన్వితన్= మెరుపు తీగవంటి మంచి గుణములు కలదానిని (గోపమాంబికను) పరియించెను= వరించెను.

భావము : స్పష్టమైన యశస్సుతో సర్వజనులచే గౌరవించబడిన పేరనమంత్రి దిగంతముల యందు శోభించు తెల్లని కాంతులనెడి కీర్తులకు నెలవైన చౌకుచర్ల వేంకటవరుని కుమార్తెను, మెరుపు తీగవంటిది, మంచి గుణములు కలదానిని, మేధాశక్తి కలదానిని గోపమాంబికను గొప్ప ఉత్సాహముతో వరించెను.

ఉ॥ **సూనశరప్రమాణవర సుందరు డాశ్రితరక్షణ క్రియా**
నూనదయాప్రపూర్ణుడు మహోన్నత ధీనిధి లింగమంత్రి వి
స్సానరసార్యవర్యతనుజాతను పూతను కృష్ణమాంబికన్
మానితభూరివైభవసమన్వితుడై వరియించె వేడుకన్ **38**

అర్థము : సూనశర ప్రమాణ వరసుందరుడు(లింగనమంత్రి)= మదనుని వంటి సుందరుడు, ఆశ్రిత రక్షణ క్రియా+అనూన దయాపూర్ణుడు= తన్నుచేరిన దీనులను కాపాడుటయందు మిక్కిలి దయగలవాడు.

భావము : లింగనమంత్రి మదనుని వంటి సుందరుడు. తన్ను చేరిన దీనులను కాపాడువాడు దయామయుడు. గొప్ప బుద్ధిశాలిని వంశానికి చెందిన విస్సా వంశానికి చెందిన నరసమంత్రి తనయ, పవిత్రురాలు 'కృష్ణమాంబ'ను శోభతో వరించెను.

ఉ॥ **అన్నలకూర్మితమ్ముడు దయాళుడు నాశ్రితరక్షణుండు ని**
త్యోన్నతకీర్తిరామ సచివోత్తముడర్మిలి నాత్మకూరి వెం
గన్నకుమారినిన్ భ్రమరమాంబ ముదంబున పెండ్లియై దినం
(బన్నలు గౌరవింప మహిమాన్వితుడై నుతికెక్కె) ధారుణిన్ **39**

అర్థము : అన్నల కూర్మి తమ్ముడు= అన్నలకు ప్రియమైన తమ్ముడు, దయాళుడు= దయగలవాడు, ఆశ్రిత రక్షకుడు= ఆశ్రయించిన వారిని రక్షించెడివాడు, నిత్య ఉన్నత కీర్తి రామసచివోత్తముడు= నిత్యమైన కీర్తిగల ఉత్తముడైన రామమంత్రి ధారుణిన్= పుడమిలో, నుతికెక్కెన్= పొగడ్తలు పొందెను.

భావము : (రామమంత్రి) అన్నలకు ఇష్టుడైన తమ్ముడు, దయగలవాడు, ఆశ్రయించిన వారిని రక్షించెడివాడు. నిత్యము కీర్తి కోరువాడు. ఉత్తముడైన మంత్రి ఆత్మకూరు వెంగన్నకూతురు భ్రమరాంబను పెండ్లాడి అన్నలు ఆదరింపగా, పుడమిలో పొగడ్తలు పొందెను.

సీ॥ **మహితపాతివ్రత్యమహిమను (గొనియాడ**
నలవియే) జగతి విఖ్యాతిగలుగ
పావనా (చార సంపద నెన్నశక్యమే)
యత్యంత నిర్మలినాత్మయగుట
చుట్టాలసురభియంచును సంస్తుతింపంగ
నాదటు బహుబంధు లాశ్రయింప
కారుణ్యవతియని గణన జేయగ నెట్టు
లతిథి పుత్రునిబలె నరయుచుండ

తే॥ **పుట్టినిల్లును చొచ్చినయట్టియిల్లు**
వన్నెకెక్కంగ వినుతి గైకొన్న సాధ్వి
వేరె పొగడంగవలయునే విశ్వమందు
నరసనామాత్యు వెంగాంబ నయ విడంబ **40**

అర్థము : పాతివ్రత్య మహిమనున కొనియాడనలవియే!= ఆమె పాతివ్రత్య మహిమను పొగడుటకు వీలగునా? నిర్మల ఆత్మ= ఆమె మలినము లేని మనస్సు కలది, చుట్టాల సురభి= బంధువులకు ఆమె కామధేనువు (సురభి), కారుణ్యపతి= కృపగల కాంత, అతిథిన్ పుత్రుని బలెన్= ఇంటికి వచ్చిన వానిని తన పుత్రునివలె, పుట్టినిల్లును చొచ్చినయట్టి ఇల్లు= పుట్టింటికీ, మెట్టిన యింటికీ, వినుతి= మంచిపేరు, (నరసమాత్యుని వెంగాంబ)

భావము : నరసనామాత్య సతి వెంగాంబ పాతివ్రత్య మహిమను కొనియాడుటకు వీలుకాదు. విశేషమైన పొగడ్తలను పొందినది. మలినము

లేని మనస్సు కలది. చుట్టాలు ఆమెను కామధేనువు అని నుతించిరి. ఆ కృపగల కాంతను గణింపజాలము (కృపకు మితిలేదు) ఇంటికి వేళకు వచ్చిన వానిని పుత్రునివలె ఆదరించుచు, పుట్టింటికి, మెట్టినింటికి పేరు తెచ్చిన సుదతి.

ఆ॥ అట్టి నరసమంత్రికావెంగమాంబకు
పుత్రకుండ శుభచరిత్రకుండ
విష్ణుభక్తిరతుడ వేంకటాఖ్యాతుండ
సుకవిజనహితుండ సుమహితుండ 41

అర్థము : శుభ చరిత్రకుండన్= శుద్ధమైన ప్రవర్తన కలవాడను, విష్ణుభక్తి రతుడన్= విష్ణు భక్తి కలవాడను, సుకవి జనహితుడన్= సుజనులకు మేలు చేయువాడను (వేంకట నామధేయుడను)

భావము : నరసమంత్రికి వెంగాంబ దంపతులకు జన్మించిన శుద్ధమైన ప్రవర్తన విష్ణుభక్తి కలవాడను, సుకవి, సుజనులకు మేలు చేయువాడను వేంకట నామధేయుడను, నేను.

చ॥ అనుపమకీర్తి పేరసచివాగ్రణికిన్ సతి గోపమాంబకుం
దనయులు రాగమంత్రియును తమ్ముడు వేంకటనామధేయుడున్
కనకశుభాంగులై తనరు కన్యలు ముప్వురు గల్గిరందులో
ఘనుడగు వేంకటాఖ్యు సుతుగా గయికొంటి సమంత్రకంబుగన్ 42

అర్థము : అనుపమ కీర్తి= సాటిలేని కీర్తిగల, కనక శుభాంగులు= బంగారు వన్నెకల (కూతుళ్ళు).

భావము : సాటిలేని కీర్తిగల పేరన మంత్రికి, గోపమాంబకు కుమారులు రాగయ్య, వేంకటయ్యలు, బంగారువన్నెగల ముప్వురు కుమార్తెలు కల్గిరి, వారిలో ఘనుడైన వేంకటయ్యను నేను మంత్రపూర్వకముగా సుతునిగా స్వీకరించితిని (అపుత్రకుడ నైనందున).

చ॥ అనఘుడు రామమంత్రి భ్రమరాంబిక పుత్రకులక్కమంత్రియున్
ఘనమతి పద్మనాభుడు నిగర్వ శిఖామణి బుచ్చనార్యుడున్
ప్రణుత గుణాఢ్యులందు నయభాసురుడై తగు పద్మనాభునిం
దనకు గుమారుగా బెనిచె ధన్యుడు లింగన మంత్రి వేడుకన్ 43

అర్థము : ఘనమతి= గొప్ప మనస్సు కలవాడు, నిగర్వ శిఖామణి= గర్వము లేనివాడు, ప్రణుత గుణాఢ్యులు= నుతింపదగిన గుణములచే గొప్పవాడు.

భావము : రామమంత్రి భ్రమరాంబలకు లక్కమంత్రి, పద్మనాభుడు, బుచ్చన్న అను ముప్వురు కుమారులు కల్గిరి. లింగనమంత్రి అపుత్రకుడైనందున గుణవంతులైన కుమారులలో నీతిమంతుడై వెలుగు పద్మనాభుని తనపుత్రునిగా పెంచెను.

ఉ॥ ఇట్టు మదీయవంశమున కెంతయు నభ్యుదయాభివృద్ధిగా
గట్టుగ వేంకటేశ పదకంజ యుగార్పితమైన కావ్యమే
నిట్టు రచింప బూనితి మహీస్థలి చంద్రదివాకరంబునౌ
నట్టుగ సత్కవీశ్వరుల కాత్మముదంబుగ పెద్ద లౌనన్ 44

అర్థము : మదీయ వంశమునకు= నా వంశానికి, అభ్యుదయాభివృద్ధిగా= మేలు కలుగు ప్రకారము, వేంకటేశ పదకంజయుగార్పితమై= వేంకటేశ్వరుని పాదకమల ములకు సమర్పించిన కావ్యమును, చంద్రదివాకరంబుగ ఔనట్టుగ= సూర్య చంద్రులు ఉన్నంతకాలము, మహీస్థలిన్= ధరణిలో, ఆత్మముదంబుగ= మదిని సంతోషముతో, పెద్దలు ఔనన్= పెద్దలు ప్రశంసించునట్లుగా.

భావము : ఇట్లు మా వంశానికి ఎట్లు మేలు కలుగునో ఆ ప్రకారంబుగ వేంకటేశ పాదకమలములకు సమర్పించిన కావ్యమును నేను ధరణిలో సూర్యచంద్రులు వెలుగునట్లుగా సత్కవులు మదిని ముదముతో మెచ్చగా మా పెద్దలు ప్రశంసించునట్లు రచియించుటకు ఉద్యమించితిని.

వ॥ ఈ మదీయకృతి కథీశ్వరుండగు బిట్రగుంట వేంకటేశ్వరుల చరిత్రంబు
కొంత నేనెరింగినంత వివరించెద 45

భావము : మా వంశానికి 'ఇలువేలుపు' అయిన బిట్రగుంట వేంకటేశ్వర స్వామి చరితమును నేను ఎఱిగినంతవరకు కొంత వర్ణించెదను.

ఉ॥ ధారుణి నష్టవైభవ విధాన విభూతుల నిండి పర్వుచున్
భూరితరాగ్ర హారమగు పుణ్యపురంబున భూసురోత్తమా
గారమునందు డాసి బహుకాలము తత్పరిచర్య సేయుచో
వారిజనాభ భక్తిమతి వర్ధనునొక్క కుమారుగాంచినన్ 46

అర్థము : ధారుణిన్= ధరణిలో, అష్ట వైభవ విధాన= ఎనిమిది విధాలైన ఐశర్యాలు కల్గిన శోభతో నున్న, భూరితర అగ్రహారము= బ్రాహ్మణుల అగ్రహారము, బహు కాలము= చాలా కాలము, తత్ పరిచర్య చేయుచు= సేవలు చేయుచు, భక్తి మతిన్ వర్ధనున్= విష్ణుభక్తి కలవాడైన వంశమును వృద్ధిచేయు కుమారుని.

భావము : ధరణిలో గొప్ప బ్రాహ్మణుల అగ్రహారమిది. పుణ్యపురము. ఎనిమిది విధాలైన ఐశ్వర్యాలు కలిగిన శోభతో నున్నది. ఒక గృహస్థుడు. ఆ ఊరికి వచ్చి బ్రాహ్మణోత్తములకు సేవలు బహుకాలము చేయగా విష్ణుభక్తి కలవాడు, వంశమును వృద్ధి చేయువాడు కుమారుడొకడు జన్మించెను.

ఉ॥ నారదుడంచు వాని కొక నామము తద్గృహకర్త బెట్టె దై
వారగ బ్రోది సేయ బరివర్ధితుడై తగు శైశవంబునన్
పౌరకుమారవర్గముల బాయక దా పరిచర్య సేయుచున్
వారలయెంగిలిం గుడిచి వర్తిలుచుండెను గొంతగాలమున్ 47

అర్థము : దైవారగ= దైవ బలముతో, ప్రోదిచేయు= పోషింపగా, పరివర్ధితుడై= పెరిగి పెద్దవాడయ్యెను, శైశవంబునన్= పసివాడుగా నున్నప్పుడే, పౌరకుమార వర్గములను= పురమున గల కుమారులను, పాయక= వదలక, తాన్+

పరిచర్య సేయుచు= తాను వారి పనులు చేయుచు, వారల ఎంగిలిన్+ కుడిచి= వారు పెట్టిన అన్నము తినుచు (కొంతకాలముండెను)

భావము : ఆ బాలునికి నారదుడు అని పేరు పెట్టెను. దైవబలముతో ఆతడు పెరుగుచుండెను. పసివాడుగా నున్నప్పుడే పౌరుల కుమారుల యొద్ద చేరి వారి పనులు చేయుచు వారు పెట్టిన అన్నమును తినుచుండెను.

కం॥ నానాట బాల్యమెడలుచు
పూనిన యౌవనముతోడ బుద్ధియు విపులం
బై నారాయణచరణ
ధ్యానానందైక హృదయతామరసుండై 48

అర్థము : నారాయణచరణ ధ్యాన ఆనంద ఏక హృదయ తామరసుండై= నారాయణ పాదముల ధ్యానమే ప్రధానముగ వికసించిన హృదయ కమలము కలవాడై.

భావము : బాల్యము గడచిపోగా యౌవనుడయ్యెను. బుద్ధిమంతుడై నారాయణుని పాదముల ధ్యానమే ప్రధానముగ చేయుచు హృదయ కమలము కలవాడయ్యెను.

సీ॥ ఇంచు కలయక నెవ్వరేపని జెప్పిన
నతి శీఘ్రమున జేయు నాత్మ నలరె
ఎందుండి భూసురు లెందరేతించిన
నందర కుపచార మలరజేయు
తనదు దేహాయాసమును తా దలంపక
పని యేమి యని యిండ్లమొనసితిరుగు
హరి భక్తులను గన్న నత్యంతసంతుష్టి
తత్సంగతిని బాయ దలకు మదిని

తే॥ సంతతంబట్లు భూసురచరణసేవ
మదిని శ్రీహరిపదభక్తిమరపు లేక
జనని నటు డించి పోరామి జాల నొగిలి
బంధకవిముక్తికాపేక్ష పడుచునుండె 49

అర్థము : ఇంచుక అలయిక= కొంచెము కూడా అలసిపోనివాడై, ఆత్మన్+అలరె= మనస్సులో సంతసమును పొందెను, ఉపచారములు= సేవలు, దేహ+అయాసము తాన్ తలంపక= తన శరీరానికి అలసట అని తలంపక, ఇండ్ల మొనసి తిరుగుచు= ఇండ్లకు వెళ్ళి, తత్సంగతిని పాయదలచి మదిని= వారి చెలిమిని వదలుటకు మనస్సు కలత నొందుచుండెను. జననిని అటు దించి పోరామి= తల్లిని ఒంటరిగా వదలి పోజాలక, నొగిలి చెందెను= బాధపడెను.

భావము : కొంచెము కూడా అలసిపోనివాడై ఎవ్వరేపని చెప్పినను వెంటనే చేయుచు సంతన మందుచుండెను. ఇతర ప్రదేశములనుండి బ్రాహ్మణులు వచ్చినపుడు వారిని ఆదరించుచు సంతోషపరచును. తన శరీరానికి అలసట అని తలంపక అందరి ఇండ్లకు వెళ్ళి పనియేమైనా ఉన్నదా? అని ఉత్సాహముతో తిరుగును. హరి దాసులను చూచిన వెంటనే వారి చెంతనుండి తృప్తి కలిగి వారి చెలిమిని విడనాడుటకు మనస్సులో కలత నొందుచుండెను. ఎల్లప్పుడూ ఆ విధముగా బ్రాహ్మణ సేవ శ్రీహరి భక్తితో చేయుచు సంసార బంధమును వదలి పోదలచినవాడై తల్లిని ఒంటరిగా వదలి పోజాలక చాలా వెతనొందెను.

క॥ హరిపదభక్తులయెంగిలి
నిరతము భుజియించు నాత్మ నెమ్మి దలిర్పన్
హరిచరణయుగము గనుగొను
హరినామస్మరణసేయు ననిశము జిహ్వన్ 50

భావము : హరిదాసులు తినగా మిగిలిన అన్నమును ఎంతో ఇష్టముగా తినెను. హరి పదముల రెంటినీ కనుగొనుటకై ఎప్పుడూ అతడు తన నోటితో హరినామ స్మరణ చేయుచుండెను.

వ॥ ఇట్టు లనేకకాలంబు హరిచరణ స్మరణానురక్తుండునుహరిభక్తజనసేవా
నిరతుండు ను నైయున్నగొంతగాలంబునకు జననికాలవశంబునం
బరలోకగతురాలైన పరమా నందంబునొందిచప్పటలిడుచు నాట్యంబాడు
నారదునకు భూసురులిట్లనిరి 51

భావము : చాలా కాలమునకు హరి పాదములను స్మరించు వాడును, హరిదాసుల సేవచేయు వాడును, అయిన నారదుని తల్లి పరలోకము చేరెను. నారదుడు పరమానందముతో చప్పట్లు చరచుచూ నృత్యము చేసెను. ఆతనిని చూచి అగ్రహార బ్రాహ్మణులు ఇట్లనిరి.

క॥ తల్లికి మిక్కిలి దైవం
బెల్లెడ లేదనుచు శ్రుతుల నెన్నగ నకటా!
తల్లిచను దుఃఖ మెఱుగక
త్రుళ్ళుచు నటియింపనెట్లు దోచెను వత్సా! 52

భావము : ఓ బాలుడా! తల్లిని మించిన దైవము లేదని వేదాలు పలుకుచున్నవి గదా! తల్లి పోయినదని చింతింపక నాట్యము చేయుటకెట్లు తలచితివి?

ఉ॥ తొమ్మిదినెల్లు మోసి కడు దుర్భరమైన ప్రసూతివేదనన్
ముమ్మరమైన నొప్పి గడ ముట్టదునా యని చింతనొందుచున్
ఇమ్ముల నిన్ను గాంచి సుతు నెత్తిన వేడుక మిన్ను ముట్టి నీ
యమ్మ చనంగ వేడ్కఁ నిటులాడగ జెల్లునె నిర్దయుండవై 53

భావము : తొమ్మిది నెలలు నిన్ను కడుపులో పెట్టుకొని నీవు పుట్టునపుడు నొప్పి చెంది, ఈ నొప్పి తొలగునా అని బాధపడుచు, కన్న వెంటనే ప్రీతితో

కుమారుని చూచి, ఉత్సాహము ఆకాశమునంటిన అట్టి అమ్మ వదలిపోగా ఈ విధముగా ఆమె యెడ ప్రేమ లేనివాడవై ఆడుట తగునా?

చ॥ అన విని మీరు పెద్దలిటులాడిన నేమని విన్నవించెదన్
జనని గురుండు సోదరులు సత్పదమియ్యగ జాలువారలే
వెనకటు తల్లితండ్రులిటు వెంబడి నొక్కరు వచ్చిరా వృథా
తనువునకైన బంధ మిది తా విడగాంచుట యింతయొప్పదే 54

భావము : అనగా విని మీరు పెద్దలు ఇట్లు పలుకుటచే ఏమని మారుపలుకగలను? తల్లి గురుడు సోదరులు శాశ్వతమైన చోటు ఇవ్వగలరా? పూర్వమెప్పుడైనను మరణ కాలమందు ఎవ్వరైననూ తల్లిదండ్రులు వెంబడి నిలిచిరా? నష్టమగు ఈ శరీరముతో ముడిపెట్టుకొనుట కంటే దానిని వదలించుకొనుట సరియైన నిర్ణయము కదా?

క॥ ఇది యుత్సవకాలం బని
మది దోచిన దుఃఖ మణువుమాత్రము గలదా
సదయులరగుడని దానిన్
ముదమున దహియించి కర్మములు దీర్చి తగన్ 55

భావము : ఇది ఉత్సాహమును పొందవలసిన సమయమని నాకు తోచినది. కొంచెమైనను కలత నొందవలెనా? దయగల వారైచూడండి అని వారిని సమాధాన పరచెను. శరీరముపైగల మమకారమును సంతోషముతో త్రుంచి తల్లికి చేయవలసిన కర్మలు చేసెను.

శా॥ ఎందేనిన్ సుజనవ్రజానుగతి దానిచ్ఛావిహారక్రియా
నందుండై బుధసేవనానుమతి నానాపుణ్యావాసంబు లం
దందం గాంచుచు తత్కృపావశత దైత్యధ్వంసిపాదద్వయిన్
డెందంబందున బాదుకొల్పి తిరుగాడెన్ దివ్యదేశంబులన్ 56

అర్థము : ఎందేనిన్= ఏ చోటికైనను, సుజనవ్రజా+అనుగతిన్= మంచివారిని అనుసరించుటకై, తాన్+ఇచ్ఛా విహార క్రియన్= తన మనస్సుకు తోచిన రీతిని తిరుగుచు, బుధసేవన+అనుమతిన్= విద్వాంసుల సేవలయందు మనస్సు కలవాడై, తత్+కృపావశత= వారి కృపకు వశుడై, దైత్య ధ్వంసి పాదద్వయిన్ డెందంబునన్+పాదుకొల్పి= విష్ణుపాదములను ఎదలో నిలిపి, దివ్య దేశంబునన్ తిరుగాడెన్= పెక్కు దేవ నిలయములందు తిరిగెను.

భావము : ఎచ్చటికైనను మంచివారిని అనుసరించుటకై తన మనస్సుకు నచ్చిన రీతిని తిరుగుచు, విద్వాంసుల సేవలకై పెక్కుపుణ్య ప్రదేశంబులను చూచుచు వారి కృపకు వశుడై విష్ణుపాదములను ఎదలో నిలిపి పెక్కు దేవాయతనములందు తిరుగాడెను.

చ॥ తిరుగుచు నొక్క చోట వరదివ్యవిమానవిలాసభాసమై
మెరసి పినాకియుత్తరపు మేదిని పూర్వసముద్రసంగతిన్
గురుతరపర్వతంబు బిలకూపము గాంచి బిలేశ్వరాఖ్యుడా
హరునకు మ్రొక్కి తద్గిరిగుహాంతరవాసుల సన్మునీంద్రులన్ 57

భావము : తూర్పు సముద్రము సమీపమున ఒకచోట ఉత్తర పినాకినీ నదీ పరిసర ప్రాంతమందు గల గొప్ప కొండయందు, ఒక గుహ చావడిలో బిలేశ్వరుడు అనుపేరుగల శివునకు, అచట నివసించుచున్న మునివరులకు మ్రొక్కెను.

చ॥ వినయముతోడ జేరి కడు వేడుక దండము లాచరించి య
మ్మునిజనసమ్మతంబునను మ్రోలను నమ్రతనుండి మిక్కిలిన్
వినుతు లొనర్చి యిట్లనె "పవిత్రచరిత్రుల బుణ్యమూర్తులన్
గనుగొనగల్గె వీడె ఘనకల్మషమంతయు ముక్తి గాంచితిన్ 58

భావము : వినయముతో చేరి నమస్కరించి, వారి కోరిక మేరకు వారి ఎదుట వంచిన శరీరముతో వారిని పొగడి, ఇట్లనెను. పుణ్యవంతులైన మిమ్ము చూచు

భాగ్యము కల్గినది. నాలోని మలినమంతయు మాయమైనది. బంధ విముక్తి కలిగినది.

క॥ మిమ్ముల గన్నది మొదలును
నెమ్మది నుత్సుకత దెలుప నేరను ఇక నా
యుమ్మలికము నెడవాసెను
సమ్మతి గడతేరువాడ సత్యముగాగన్ 59

భావము : మిమ్ము చూచినప్పటి నుండి నా మనస్సులో పొంగిన ఉల్లాసమును తెలుపలేను. నా చింత తొలగెను. మీ అనుమతితో నా ఆశయము తప్పక సిద్ధించును.

మ॥ అని యమ్మౌనివరేణ్యసంఘముల నత్యాసక్తి సేవింపుచున్
దనరన్ వారు వసించియున్న గుహ చెంతన్ బంచ దానుండుచున్
దినమున్ దత్పరిచర్యసేయుచును తృప్తిన్ బొందుచు న్నుండగా
మునివర్యుల్ కరుణించి వాని భజనన్ మోదంబు సంధిల్లగన్ 60

భావము : అని, ఆ మునులను శ్రద్ధతో సేవింపుచు వారి గుహలో ఒక చిన్న గుడిసెలో తానుండి వారిని సేవించుచు తృప్తిని పొందుచుండగా మునులు కరుణ గలవారై అతని చర్యలకు మిక్కిలి సంతోషముతో...

శా॥ మేలయ్యేన్ భవదీయభక్తి మదికిన్ మెచ్చయ్యె నీకోర్కె దా
వాలాయంబుగ నియ్య నర్హ మగుచున్ వర్తిల్లె నేమన్నచో
చాలం బుల్కలు మేన నుప్పతిలగా సాష్టాంగమున్ జేసి నే
నేలాగుం గడతేరునట్లుగ దయన్ వీక్షించి రక్షింపరే 61

భావము : నీకు మేలు కలుగును. నీ భక్తి మాకు నచ్చినది, మెచ్చుకొంటిమి. నీ కోరికను తప్పక (వాలాయముగ) తీర్చుకొనుటకు నేడు తగినకాలము వచ్చినది అని వచింపగా నారదుడు గగుర్పాటు చెందినవాడై సాష్టాంగపడి నేను కడతేరునట్లు దయతో చూచి రక్షింపుడు అని ప్రార్థించెను.

తే॥ అనిన నీ మది లెస్సయౌ ననఘచరిత!
పావనుండవు హరి భక్తిపరుడవగుట
నర్హుడవు ద్వాదశాక్షరి కనుచు గరుణ
సచ్చరిత్రకు లుపదేశమిచ్చిరపుడు 62

అర్థము : అనఘచరితా= పవిత్రుడా! పావనుండవు= పుణ్యాత్ముడవు, హరిభక్తి పరుడవు= హరిభక్తి కలవాడవు, ద్వాదశాక్షరికి= ద్వాదశాక్షరీ మంత్రమునకు (ఓం నమో భగవతే నారాయణాయ)

భావము : పుణ్యాత్ముడా! నీ మనస్సు బాగుపడినది. పవిత్రుడవయితివి. హరిభక్తి కలవాడవగుటచే ద్వాదశాక్షరీ మంత్రోపదేశానికి యోగ్యత కల్గినది అని కరుణించి, ఉపదేశమిచ్చిరి.

స్రగ్ధర॥ ఆమంత్రోపాసనాప్తిన్ హరిపదభజనధ్యానపూజానురక్తిన్
భూమీధ్రాగ్రాచ్ఛభూమిన్ బుధజనకరుణన్ బూని నిశ్చింతవృత్తిన్
శ్రీమన్నారాయణాంఘ్రిస్థితవిమలమతిన్ శీతవాతోష్ణవృష్టుల్
హేమాద్రింబోలె శాంతిన్ హితసకలుడునై యిట్లు వర్తింపుచుండన్ 63

అర్థము : ఆ మంత్ర+ఉపాసన+ఆప్తిన్= ఆ మంత్రమును జపించుటచే, విష్ణు పూజను భక్తితో కావించుటచేతను, భూమీధ్ర+అగ్ర+అచ్ఛ+భూమిన్= కొండమీద, శుద్ధమైన నేలమీద.

భావము : ద్వాదశాక్షర మంత్రమును జపించుట చేతను, స్వచ్ఛమైన నేలపై కూర్చిండి పండితుల కృపచే, శ్రీమన్నారాయణుని పాదముల యెడ శుద్ధమైన మనస్సుతో చలిఎండ వానలకు చలింపక హిమవత్పర్వతమువలె ప్రశాంత భావముతో మేలు పొందువాడై వర్తించెను.

ఉ॥ కాలమనేకముం జనిన కంజదళాక్షుడు వాని భక్తికిన్
చాలమనంబులో నలరి సమ్మతితో నశరీర వాక్కుగా

నోలి వచించె నీవు జలజోదరునందు జనించి నన్ను సం
శీలమతిన్ నిరంతరము సేవ యొనర్చెదు నిక్క మింతయున్ 64

భావము : చాలా కాలము గడచిన పిమ్మట విష్ణువు, నారదుని భక్తికి మెచ్చి తృప్తి చెంది నిండు మనస్సుతో కనబడని వాడై ఇట్లనెను. నీవు బ్రహ్మ పుత్రుడవై పుట్టి నన్ను సేవింపగలవు. ఇది నిజము.

క॥ నీకీతనువున నెంతయు
వైకుంఠములేదు కేశవస్వామిని నీ
నీవీకుధరాగ్రస్థలమున
వీకఁ బ్రతిష్ఠించి కొలువు వెలయగ గోర్కుల్ 65

భావము : నీకు ఈ శరీరముతో విష్ణు స్థానము లభించదు. ఈ కొండమీద కేశవుని ప్రతిష్ఠించి నీ కోర్కెలు తీరునట్లు సేవింపుము.

తే॥ అనిన శబ్దంబు వీనుల వినగనైన
గట్టిగా జూడ నిప్పుడీ కాయమునను
ముక్తి లేకున్న నేమాయె మొనసి మీద
గలుగు శ్రీ హరి వాక్యంబు కల్లయగునె 66

భావము : ఆ మాటలు గట్టిగా వినబడెను. ఇపుడు ఈ శరీరానికి ముక్తి లేకపోయిన నేమి? ప్రయత్నించిన యెడల తర్వాతి జన్మలో తప్పక కలుగ గలదు? శ్రీహరి వచనము సత్యమగును.

చ॥ అని మది నిశ్చయించి హరియానతి యిచ్చినయట్ల నబ్బిలే
శునికిని బశ్చిమంబునను సుందరకాంచనమంటపంబులన్
దనర ప్రతిష్ఠజేసి ప్రమదంబున గేశవమూర్తి నిచ్చలున్
గనుకని గొల్చుచున్ ద్రికరణంబుగ సేవ యొనర్చు నర్మిలిన్ 67

భావము : అని నిశ్చయించి వెన్నుని ఆనతి ప్రకారము, ఆ బిలేశునికి పడమట దిక్కున అందమైన కాంచన (పొన్న) వృక్షముల నడుమ కేశవమూర్తిని ప్రతిష్ఠించి చిత్తశుద్ధి భక్తి కలిగి సేవించెను.

క॥ ఆ నారద మునివరు డభి
మానము బిలకూటముట్టు మహిభృద్వర సం
స్థానమగు నగ్రహారము
నానాటను బిట్రగుంట నా విలసిల్లెన్ 68

భావము : ఆ నారదముని అనురాగము ప్రసరించుటచే ఆ బిలకూటము బ్రాహ్మణులకు నెలవగు అగ్రహారమయి పెంపుదల కలిగి బిట్రగుంట అనెడి పేరుతో ప్రకాశించెను.

ఉ॥ భర్గవిరించిముఖ్యులు సుపర్వులునున్ మనువుల్ దిగీశుల
ట్లార్గురు చక్రవర్తులు బదార్గురు రాజులు జేరి సంతతా
నర్గళవైభవోన్నతి తదంఘ్రిసరోరుహభక్తియుక్తులై
వర్గచతుష్టయంబుల నవారణ నొందుదు రాస్థలంబునన్ 69

భావము : ఆ కేశవ స్వామి ఆలయమందు శివుడు, బ్రహ్మ, ప్రముఖ దేవతలు, మనువులు, దిక్పాలకులు, ఆరుగురుచక్రవర్తులు, పదునారుగురు రాజులు, అతి వైభవ విశేషములతో ఆ దేవుని పాదపద్మములందు భక్తి కలిగి పురుషార్థములను ఎట్టి శ్రమ లేక పొందెదరు.

వ॥ మఱియును 70

భావము : మఱియును

క॥ కలియుగమొకకొన్నేళ్ళకు
ఇలనొకలాంగూల గజపతీంద్రుని సైదో
డలఘుచరిత్రుడు విక్రమ
కలితుడు నరసింహనృపతి కరుణాన్వితుడై 71

భావము : కొన్నేళ్ళకు, లాంగూలగజపతి రాజు తమ్ముడు గొప్ప గుణవంతుడు, పరాక్రమవంతుడు నరసింహరాజు కరుణకలవాడై...

కII ఉదయగిరి రాజధానిగ
సదమలచరితుండు సర్వజగతీభరణా
స్పదభుజుడు శాత్రవానత
పదయుగళుడు లీల ధరణి పాలన సేయున్ 72

భావము : ఉదయగిరి రాజధానిగ మచ్చలేని ప్రవర్తన, జగత్తు భారమంతటిని మోయు భుజములు, వశమైన శత్రువుల పాదములు కలవాడు ధరణిని పాలించెను.

ఉII ఆ నరనాథ మౌళికి దివాకర తేజుడొకండు పుత్రుడున్
శ్రీ నిధి పాద పద్మయుగ సేవక మానస యొక్క కూతురున్
భూనుత కీర్తిచే దనర బుట్టిన పుత్రుని రాము డంచు నా
మానిని గౌరమాంబ యని మక్కువ బేరులు గల్గ బెంపగన్ 73

భావము : ఆ గొప్ప రాజునకు సూర్యతేజముగల సుతుడు, రామరాజు విష్ణుపాద సేవయందే మనసు కల్గిన గౌరమాంబ అనెడి తనయ కలిగిరి.

చII త్రిభువన సుందరంబు పటు తేజము చెల్వము నాటినాటికిన్
శుభకరలీల జెన్నొదవఁ జోద్యముగా జిగి ముద్దు గుల్కగా
నభినవ బాల్య లీలల విహారము సల్పుచు వర్ధమానులై
విభవము తోడ గూడుకొని వేడుక లుప్పతిలంగ బ్రోదియై 74

భావము : మూడు లోకములలో గొప్ప కాంతి, సౌందర్యము, మేలు చేయు విధమున చక్కగా, ఎక్కువగా, ఆశ్చర్యకరంగా శరీర లావణ్యము ఆకర్షింపగా, నూతనములైన బాల్య క్రీడలాడుచు పెరిగి వారు పెద్దవారైరి.

ఉII రామ విభుండు భాస్వదభిరామనృపాలకనీతిసద్గుణో
ద్దామవిభూతిచేఁ దనరి దారుణవిక్రమదోర్బలంబునన్
రాముని భీమునిం గడచి రమ్యతరాఖిలపూర్ణకీర్తిచే
భూమి బ్రసిద్ధి గాంచె పరిపూర్ణవిభాసురయౌవనంబునన్ 75

భావము : రామరాజు - అందగాడు, నీతిమంతుడు, సద్గుణములచే ఒప్పుచు భయంకరమైన భుజబలములో బలరాముని భీముని మించి సంపూర్ణ కీర్తిచే, ప్రకాశించు యౌవనముతో పేరు పొందెను.

శాII సౌరభ్యంబు దినప్రవర్ధనము పుష్పంబట్ల నానాటికిన్
గౌరాదేవి వయోవిలాసములు మేనన్ విష్ణుభక్తిన్ మదిన్
పూరంబై విలసిల్ల సద్గుణగణస్ఫూర్తిన్ విజృంభింపగా
గారా మొప్పగ దండ్రి ప్రేమ బెనుపం గళ్యాణి యొప్పెం గడున్ 76

అర్థము : దిన ప్రవర్ధనము పుష్పంబు+అట్లు= క్రమముగా వికసించెడి పువ్వువలె సౌరభ్యంబు నానాటికిన్= క్రమక్రమముగా సువాసన ఎక్కువగునట్లు.

భావము : క్రమముగా వికసించెడి పువ్వునందు సువాసన ఎక్కువగునట్లు క్రమముగా గౌరాదేవి శరీరము వయస్సుకు తగిన ఒయ్యారము కలదై మనస్సున విష్ణుభక్తి ఉప్పొంగెను. ఆ కల్యాణి, తండ్రి ప్రేమచే శుభాకృతితో ప్రకాశించెను.

కII జనపతి కొడుకుం గూతును
గనుగొని సంతుష్టినొంది కడు పొంగుచు నం
దనునకును కందుకూరును
తనయకు నెల్లూరొసంగె తాత్పర్యమునన్ 77

భావము : ఆ జనపతి సుతునకు కందుకూరును, సుతకు నెల్లూరును పాలనకై సమర్పించెను.

ఉII తా నుదయాద్రిరాజ్యము ముదంబున నేలుచు సర్వధర్మముల్
మానుగ నిల్పుచున్‌రిపుల మత్తునడంచుచు పూర్ణకాముడై
యా నరసింహభూవిభు డహర్పతితేజుడు పూర్వరాజులం
బోలి నయప్రచారముల భూభరణ క్రియ నొప్పె నెంతయున్ 78

భావము : ఆ నరసరాజు ఉదయగిరిని పాలించుచూ సర్వధర్మ కార్యములు చేసెను. శత్రువులను అణచెను. కోరికలన్నింటిని ఫలించుకొన్న వాడయ్యెను. సూర్యతేజము కల్గి, పూర్వరాజుల వలె చక్కని నడవడిచే వెలింగెను.

సీ॥ ఇచ్చలో శ్రీ వేంకటేశ్వరపాదార
విందసందర్శనావేశగరిమ
సతతంబు హరినామ సంస్మరణానంద
పరిపూర్ణమానస పరవశతయు
ననవరతంబు నారాయణశుభకథా
కర్ణనోత్పాదిత కౌతుకంబు
నిరతంబు వైష్ణవనిచయసంతర్పణా
పరిమితోత్సాహసంభరితహృదయ

తే॥ మలర నిత్యంబు వేంకటాచలమునందు
నుంచి తీర్థ ప్రసాదమ్ము లంచలంచ
లానికొని తేర గైకొనుటాత్మనియతి
గాగ గౌరమహాదేవి ఘనత మెఱసె 79

భావము : గౌరాంబ వేంకటేశ్వరుని పాదదర్శనమునకై ఉవ్విళ్ళూరెడిది. హరి నామమును జపించుచు ఆనందమును పొందిన మనస్సుతో తన్ను (తాను) మఱచిపోవు చుండెను. ఎల్లవేళలా నారాయణుని కథలను వినుటకు ఉత్సాహము చూపెడిది. విష్ణుదాసును ఆదరించి అన్నదానము చేసి సంతృప్తి పొందెడి ఎదగలది నిత్యము వేంకటాచలము నుండి తీర్థ ప్రసాదములను తెప్పించుకొని ఆరగించెడిది.

వ॥ ఇట్లనవరతహరిచరణస్మరణ ధ్యానార్చనానందహృదయారవిందయై
బ్రహ్మచర్య వ్రతంబు నలుపుచు మంత్రిముఖంబున నిజరాజ్య
పరిపాలనంబు గావింపుచునుండి యొక్కనాడు 80

భావము : గౌరాంబ కన్యగా విష్ణుపాద ధ్యాన, అర్చనాదులచే ఆనంద హృదయ కమలము కలదై, మంత్రి రాజ్యకార్యములు నిర్వర్తించుచుండగా ఒక్కనాడు.

కం॥ సూర్యోపరాగమరుదే
నార్యప్రేరణమువలన నంబుధి గ్రుంకన్
కార్యముగ వెడలి దినదిన
పర్యాయముగాను పూర్వపాథోనిధికిన్ 81

అర్థము : అర్య ప్రేరణము వలనన్= పెద్దల ప్రోత్సాహముచే, అంబుధి గ్రుంకన్= సముద్ర స్నానమునకై, పూర్వ పాథోనిధికిన్= తూర్పు సముద్రమునకు.

భావము : ఉదయకాలమందు పెద్దల ప్రేరణ వలన సముద్రస్నానమునకై ప్రతి దినము అలవాటును బట్టి తూర్పు సముద్రమునకు పోవుచు.

ఉ॥ పోవుచు గాంచె నభ్రగతభూరితరంగలదాని పూర్ణసం
జీవనమైనదాని బహుశీకరసంప్లుతభాసమానబు
క్షావలిదాని భూరిమనుజాగతసంజనితోత్సుకోరుసం
రావముదాని తీరతరురాజవిరాజముదాని వార్నిధిన్ 82

భావము : ఆకాశమును అంటు పెక్కు అలలు కలది, పెక్కు ప్రాణులు, ఔషధులు కలది! పెక్కు నీటి తుంపరులు, నక్షత్రముల వలె కన్పట్టునది వచ్చిపోవు జనుల పెద్ద కేకలు కలది, ఒడ్డున పెద్ద చెట్లు కలదియు అయిన సముద్రమును చూచెను.

క॥ వెరగందుచు జని తత్తట
పరివర్ధితనారికేళపనసామ్రకుజో
పరిసర్వపుష్పలతికా
పరిపూర్ణవనాంతభూమిభాగమునందున్ 83

భావము : ఉప్పొంగుచు వెళ్ళి ఆ సముద్ర తీరమందు పెరిగిన కొబ్బరి, పనస, మామిడి చెట్లపై పూలగుత్తులు నిండియుండు, వన సమీపమందుగల నేలను

చ॥ విడియుచు మంత్రపూర్వముగ వేదవిధిం దగుపుణ్యవేళలం
జడనిధి గ్రుంకి విప్రులకు సన్మతిదానధనాగ్రహారముల్
కడుముద మొప్పనిచ్చి యటకంధి మహత్త్వము శాస్త్రరీతి నే
ర్పడ విని నిత్యదర్శనము పర్వదినంబుల దాన మొప్పుటల్ 84

భావము : చేరి, మంత్రములు వల్లించి వైదిక పద్ధతిలో పుణ్యకాలమందు సముద్రములో స్నానమాడి, విప్రులకు దానాదులనిచ్చి సాగరుని మహిమను శాస్త్రములు చెప్పెడి విషయములను విని నిత్యదర్శన ఫలము, పండుగ దినాలలో దాన ఫలము పుణ్యప్రదమని తెలుసుకొని,

ఉ॥ తీరమునన్ వసింపగ మదిం గడు నిశ్చయమంది మంత్రితో
నీరధిదర్శనంబునకు నిల్వగ యోగ్యవిశాలసుస్థలం
బారసి యందుల న్నగర మంచితలీల ఘటించుమంచు న
వ్వారిజనేత్రి పల్క సచివప్రభు డారయనంతనొక్కచో 85

భావము : సముద్ర తీరమందే వసించుటకై మంత్రితో, అచట ఒక అనువైన చోట నగరమును నిర్మింపుమని కోరగా అతడు...

ఆ॥ కొమరు మిగుల బిట్రగుంటకొండకు నుత్త
రమున నొక్కతిప్ప రమ్యమగుచు
కడు విశాలభూమి గనుపట్టు తృణకాష్ఠ
జలసమృద్ధి వెలయు తలమునందు 86

భావము : బిట్రగుంటకు కొంత ఉత్తర భాగమున ఒక చిన్న తిప్ప ఉండెను. అది రమ్యమైనది, విశాలమైనది, గడ్డి, కట్టెలు, నీరు కావలసినంత ఉన్న చోటు చూచి

మ॥ కని యచ్చో ఘనరత్నకాంచనమయాగారంబులున్ సౌధముల్
వనముల్ బావులు దీర్ఘికల్ చెరువులున్ వాతాయన శ్రేణులున్
మొనయం దీర్చిన గోపురంబులు దగన్ మోసాలలున్ కేళికా
ఘనగేహంబులు పువ్వుదోటలును శృంగారంబు సంధిల్లగన్ 87

భావము : ఆ చోట రత్నములు,బంగారము, మెండైన కొట్టములు ఇళ్ళు, బావులు, దిగుడుబావులు, చెఱువులు, వాయు ప్రసారమునకై కిటికీల వరుసలు గల గోపురములు, మొగసాలలు, విలాసమునకై వినోదపు గృహములు పూదోటలు మొదలగు వానిని,

చ॥ అనవరతాధ్వర ప్రకటితావనిదేవగణప్రపూర్తిచే
ఇనశశివంశవర్ధనుల కెన్నికకెక్కిన రాజపంక్తిచే
ఘనతరసంపదం ద్రివిధకర్మవిశారదవైశ్యకోటిచే
జనవినుతాగ్రవర్ణపరిచారకతత్పరశూద్రకోటిచేన్ 88

భావము : ఎల్లప్పుడూ యాగాలను నిర్వహించు, బ్రాహ్మణులు సూర్య, చంద్ర వంశములకు చెందిన రాజులు నిత్యనైమిత్తిక కర్మలచే గొప్ప సంపదచే, త్రివిధ కర్మలందు నేర్పరులైన వైశ్యులు, అగ్రవర్ణములకు సేవచేయు శూద్రులు మొదలగు వారితో

క॥ కరిరథహయభటరాజిని
హరిహరనిలయోత్సవక్రియాపటువాద్య
స్ఫురితమహానినదంబుల
నిరతోత్సవసర్వమనుజనిలయంబులచేన్ 89

భావము : చతురంగ బలంబులు - హరిహర భజనలు చేయు వాద్యఘోషలు, ఎల్లప్పుడూ దేవతలకు ఉత్సవములు చేయు సామాన్య మనుజుల గృహములతో

మ॥ పరిపూర్ణంబగు పట్టణంబొకటి సంపాదించి మధ్యస్థలిన్
గరమొప్పంగ శివప్రతిష్ఠ సరవిన్ గౌరీశ్వరస్వామి సు
స్థిరతన్ నిల్పి మహోన్నతంబుగ గడున్ శృంగారసౌధంబు శ్రీ
కరశైలాగ్రమునన్ ఘటించి తెలుపన్ గౌరామహాదేవియున్ 90

భావము : సంపూర్ణమైన పట్టణము వెలసెను, మధ్య స్థలములో గౌరీశ్వర స్వామిని తిప్పపై శృంగార భవనమందు ప్రతిష్ఠించి, ఆ గౌరాంబకు తెల్పగా

చ॥ శుభదిన వార పక్షపరిశోభితమైన ముహూర్తమందునన్
విభవమెలర్ప భూమిసురవృద్ధజనార్చనపూర్వకంబుగా
శుభకరసూచకంబులను జూచుచు మిక్కిలి సంతసంబునన్
ప్రభ దగ భేరికాపటహభాంకరణన్ వసియించె సౌధమున్ 91

భావము : శుభముహూర్తమందు బ్రాహ్మణులను, పెద్దలను పూజించి, శుభ శకునములను చూచుచు, సంతోషముతో భేరులు మ్రోగుచుండగా గౌరాదేవి తన సౌధమును చేరి వసించెను.

వ॥ శ్రీ వెంకటాచలవల్లభుండు ఏడహోరాత్రంబులు మహోత్పాతంబగు
నిరంతర వృష్టిగురియించిన 92

భావము : వేంకటాచలపతి ఏడు పగళ్ళు రాత్రుళ్ళు వినాశకరమగు పెనువాన కురిపించెను.

క॥ ఉరుముల గుండెలు వగులగ
మెరుపులు దిక్తటమునిండి మిరుమిట్లుగొనన్
తెరిపి నిమిషంబు చూపక
కురిసెను వర్షమ్ము లశనికోటులతోడన్ 93

భావము : ఉరుములతో గుండెలు పగిలెను, మెరుపులు దిక్కులన్నింటిలో కన్నులు చెదురునట్లు చెలగినవి. కొంచెమైననూ వాన తగ్గలేదు. పిడుగులతో పెనువాన కురిసినది.

ఉ॥ స్వర్ణముఖిన్ బినాకినియు సర్వనదుల్ పరమాద్భుతంబుగా
ఘూర్ణతర ప్రవాహముల భూస్థలినంతట వెల్లినిండి యే
కార్ణవమై ధరిత్రిని చరాచరకోటుల ముంచి వారి సం
కీర్ణతచే యుగాంతమని కేవలమున్ ధర తల్లడిల్లగన్ 94

భావము : స్వర్ణముఖి పినాకినీ నదులు నీటితో పొంగిపొర్లి నేలనంతటిని సముద్రము వలె ముంచి ప్రవహించినవి. కలియుగము అంతమయినదేమో అని జనులు కలత నొందిరి.

క॥ భూచరఖేచరజంతువు
లేచక్కటి గదలమెదల నెడలేక గడున్
వాచరచి ప్రాణబాధల
భూచక్రము జీవకోటి పొలుపఱి చిక్కెన్ 95

అర్థము : వాచరిచి= మ్రొక్కుకొని, పొలుపు+అఱి= ధీరత తొలగి

భావము : నేలమీది, ఆకాశము మీది ప్రాణులు ఎచటకు కదలుటకు మెదలుటకు చోటు లేక దేవునికి మ్రొక్కుకొని ప్రార్థనలతో రక్షించుకొనుటకై బాధలు పడుటచే ధరణిలోని జీవములన్నియు చలించి దిగులొందినవి.

ఉ॥ భీకరవృష్టి లోకములు బెగ్గిల నేడుదినా లహర్నిశల్
భేకముఖాంబుధారల మహీస్థలివారిధినొక్కరీతిగా
కాకియు గద్దనాడ నెడగాని మహోద్ధతవృష్టి గుర్వగా
నా కమలాక్షి యెప్పటి మహానియతిం దనరార వేడుకన్ 96

అర్థము : భేకముఖ+అంబుధారల= మేఘముల నీటిచాలుతో, మహీస్థలి= లోకాలన్నియు, వారధి నొక్కరీతిగా= వర్షపుధార సముద్రమును నేలను ఒకే విధముగా నింపగా

భావము : భయంకరమైన జడివాన లోకాలు అదరి పడునట్లుగా ఏడుదినాలు మేఘములు నీటిచాలుతో (ప్రవాహము) నేలను, సముద్రమును ఒకే

విధముగా నింపుచు కాకి, గ్రద్దయు, తిరుగుటకు వీలుకాక గొప్ప వేగముతో కురియు గౌరాంబ ఎప్పటివలె నియమపూర్వకముగా

క॥ వానకు తొలుదినమును దా
స్నానము గావించి నియతజపతత్పరతన్
శ్రీనిధిపాదసరోజ
ధ్యానానందైకవశత దగ గూర్చుండెన్ 97

భావము : వాన మొదలిడిన మొదటి దినమే తాను స్నానమాడి చేయవలసిన జపమునకై విష్ణువును ధ్యానించు ఆనందమునకులోనై కూర్చుండెను.

ఉ॥ ఇటులయ్యేడు దినంబులున్ హృదయమొక్కింతైన చాంచల్యతన్
చిటులన్నీయక క్షుత్పిపాసలు దనుం జెందంగరాకుండ ను
త్కటభక్తిం భజియింపుచున్న దయ నా గౌరామహాదేవి వేం
కటశైలాధిపుడాత్మవాంఛల నిడంగా నెంచి తుష్టాత్ముడై 98

భావము : ఏడు దినములు తన హృదయము కొంచెము కూడ చలింపనీయక ఆకలి దప్పులు పొందక భక్తితో ధ్యానము చేయుచుండగా శ్రీవేంకటేశ్వరుడు ఆమె భక్తికి సంతృప్తి చెంది కోర్కెలను తీర్చుటకై ప్రత్యక్షమయ్యెను.

సీ॥ తిలకంబుకొన సోక జిలుగుచందురు కావి
మేలైన సొగసు రుమాలు గట్టి
సన్నంపుటపరంజి సరిపణి గుడితోడ
తారహారము లురఃస్థలిని మెరయ
జాతి నీలంబుల సరసను హురుముంజి
ముత్యాల చౌకట్లు ముద్దుగుల్క
కటిపంచకట్టుపై బటువుబంగరుదట్టి
వజ్రంపు పిడిబాకువలన మెరయ

తే॥ మెరుగుటపరంజి పనిబిళ్ళ మెట్లు దొడిగి
విల్లునమ్ములు చేబూని వేడ్కతోడ
నాల్గు వేదంబు వేపులు నడచిరాగ
వేటమార్గంబు వేంకటవిభుడు వెడలె 99

అర్థము : తిలకంబు కొనసోక జిలుగు చందురున్= అల్పాకారముతో (బొట్టు) తిలకముగానున్న చందురుని కొనలు నొసటి పై భాగమును తాకగా, కావి మేలైన సొగసు రుమాలు కట్టి= ముదిరిన ఎఱ్ఱని వన్నెకల మేలైన అందమైన తలగుడ్డను కట్టుకొని, సన్నము+అపరంజి సరిఫణిగుడితోడ= పలుచనైన ఉత్తమమైన బంగారు గొలుసుల వంకరల కాంతులు పైకొను, తారహారములు= నక్షత్రముల రూపాలతో నున్న అలంకరణములుగల మెడదండలు, ఉరంగస్థలిని మెఱయన్= ఱొమ్ముమీద వెలుగులు చిమ్మగా, జాతి నీలంబుల సరసన్= మిక్కిలిమేలైన నీలిమణులు దగ్గర ఉండగా, హురుమంజి చౌకట్లు ముద్దు కుల్కన్= పారసీక దేశపు ఎఱ్ఱని నాలుగు ముత్యాల చెవి పోగులు ముచ్చటగా ఇటునటు కదలుచుండగా, కటి పంచకట్టుపై బటువు బంగారుదట్టిన్= నడుమునకు కట్టుకొన్న ధోవతి మీద గట్టిదైన బంగారు వన్నెగల అడ్డగుడ్డయందు వజ్రము+పిడిబాకు= వజ్రాలు పొదిగిన పిడిగల చిన్న కత్తి తళుకులను నింపగా, మెఱుగు అపరంజి పనిబిళ్ళ పావుకోళ్ళను కాళ్ళకు తొడుగుకొని, విల్లును+అమ్ములు చేపూని, వేడ్కతోడ, నాల్గు వేదంబువేపులు= నాలుగు వేదాలు కుక్కలుగా, నడిచిరాగ= తన వెంట వచ్చుచుండగా, వేట మార్గంబు= వేట త్రోవలో వేంకట విభుడు వెడలెను.

భావము : అల్పమైన చంద్రాకారముతో నొసటి బొట్టు కలిగి కావి రంగుగల తలగుడ్డ, బంగారు గొలుసులతో వంకరలైన కాంతులు నిండిన నక్షత్రముల రూపాలతో నున్న చిన్న బిళ్ళలు గల మెడదండలు ఱొమ్మును అలంకరించగా, మేలైన నీలిమణులు, ఎఱ్ఱని నాలుగు ముత్యాల చెవిపోగులు, నలువైపుల

ముచ్చటగా ఇటునటు కదలుచుండగా, నడుము పంచెమీద కట్టిన దట్టియందు వజ్రాల పిడిబాకు వన్నెలను చిందగా బంగారు బిళ్ళలు బిగించిన పావుకోళ్ళను తొడుగుకొని, విల్లు అమ్ములు చేతులలోపూని వేదాలు కుక్కలుగా రాగా, వేటకై వేంకటేశుడు వెడలెను.

వ॥ ఇట్లు వేంచేసి **100**

భావము : ఇట్లు వచ్చి

కం॥ ఆ యాకృతి ప్రత్యక్షం
బై యొరపుమ్రోల నిల్వ నంగన మదిలో
బాయని శ్రీ వేంకటగిరి
రాయుని పాదాబ్జభక్తిరతి నున్నయెడన్ **101**

భావము : ఆ రూపము కన్పట్టి, ఓరగా నిల్చెను... ఎదుట కొంత ఆ అంగన మనస్సులో శ్రీ వేంకటేశుని పాదకమలముపై గల భక్తి భావము ఆసక్తి నిలకడగా నుండగా

శా॥ ఈరీతి న్నిజభక్తినున్న సతి దానీక్షించి యౌరౌర యీ
నారీరత్నము భక్తి మేలనుచునంతన్ మూర్తి మాయంబుగా
నా రామామణి విభ్రమంబునను నేత్రాబ్జంబులున్ విచ్చి శృం
గారాకార విలాసమూర్తి గని దిగ్గన్ లేచి నమ్రాస్యయై **102**

భావము : తన యెడ భక్తిగల ఆ వనితను చూచి ఈ శ్రేష్ఠురాలైన నారి భక్తి చాలా గొప్పది అని మాయమయ్యెను. ఆమె తత్తరపాటుతో కన్నులు బాగుగా తెఱచి ఆ శృంగార రూపమును చూచి,వెంటనే వంగిన ముఖము కలదై లేచెను.

వ॥ ఇట్లు గౌరాదేవి నిర్మితంబగుట నప్పట్టణంబుగౌరవరంబునా బ్రసిద్ధిగాంచె
నప్పురంబు తనకు రాజధానిగా మంత్రిముఖంబున సర్వజనరంజనంబుగా
రాజ్యంబు సేయుచు బహువిధ మహాధర్మంబులు మహి నిర్వహింపుచు

సంతత వేంకటేశ్వర చరణారవి మరందపానమత్తభ్రమరాయమాణమానసయై
తత్పాద తీర్థ ప్రసాద స్వీకార నిత్యవ్రత సమాధిఁ జెలంగుచు నిరంతరంబు
సముద్రదర్శ నంబును పర్వకాలంబున తత్కృతస్నాతయు నగుచునున్న
గౌరాదేవి నిశ్చల భక్తిభావంబరయందలంచి వేంకటేశు డెదుటనుండగా

103

భావము : ఆ విధమైన భక్తురాలు గౌరామహాదేవి నిర్మించిన పట్టణమునకు 'గౌరవరము' అను పేరు కల్గినది. ఆ గౌరవరమును రాజధానిగా చేసుకొని జనులు సంతసించునట్లు పాలించుచు, ధర్మకార్యములు చేయుచు, ఎల్లప్పుడు శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మముల సేవించుచు, తేనేలు గ్రోలుటచే మత్తుగొన్న తుమ్మెదల మనస్సు కలదై, ఆ దేవుని పాదతీర్థము ప్రసాదము పొందుచు నిత్యవ్రతములచే చిత్తమును పదిలపరచుకొని, వీడక, సముద్రమును చూచుచు, పండుగ దినములలో సముద్ర స్నానము కావించుచు ప్రవర్తించుచున్న ఆ గౌరమ నిశ్చలభక్తిని పరిశీలించుటకు వేంకటేశ్వరుడు ఎదుట నిలిచెను.

క॥ మీరెవ్వరు మిము గన్నను
పారములేకాత్మ మోదపారావార
శ్రీరంజిల్లెడు మదితో
నారోపణమూర్తిభేదమై కనుపట్టెన్ **104**

భావము : మీరెవ్వరు? మిమ్ముచూడగా మితిలేని మోదమనెడి సముద్రశోభతో నామది ఉప్పొంగుచున్నది. మీ రూపము మార్పుపొందినట్లు కన్పట్టు చున్నదే!

తే॥ అనిన హృదయంబుతోడ నేననవరతము
సేవదయసేయుచున్నట్టి శ్రీనివాస
మూర్తి నీకొర్కెలియ్య విస్ఫూర్తిమతిని
కణకవచ్చెను వేట వేంకటవిభుండు **105**

భావము : అని విన్నవింపగా నేను నీవు ఎల్లప్పుడూ సేవచేయుచున్న శ్రీనివాస మూర్తిని, నీ కోర్కెలు తీర్చుటకు ఉదారమతినై పూనికతో నీ కడకు వచ్చితి.

తే॥ చరణచరణాగ్రజజానువుల్ కరయుగంబు
చాపశరములు నేపులజాడ లలర
గోముఖంబున నంబువుల్ గ్రోలినాడ
వనిత దొనరాత చిహ్నముల్ వరుస గనుము 106

భావము : పాదములు, పాదములపైభాగమందు గల మోకాళ్ళు, రెండు చేతులు, విల్లు అమ్ముల, అధికమైన అందము ఒప్పగా మఱియు ఆవునుండి పాలను పీల్చి త్రాగిన దొనరాతిపై గుర్తులు చూడుము.

అర్థము : నేపులు= పాలపొడుగు నలిగిన గుర్తులు, వయస్సు= పాలు నీరు.

క॥ ఇదినల్లగండిమీదను
పదమొక్కటియూదినాడ భామామణి నీ
మదికోర్కె దెలుపుమన్నను
మద వతి నమ్మంగలేక మ్రాన్పడియున్ననన్ 107

అర్థము : గండి= కొండల నడుమ నందు

భావము : ఈ నల్లని గండిమీద పాదములను ఆనించినాను. ఓ భామా! నీ కోర్కె తెల్పుము అని వచింపగా ఆమె చలింపక కొయ్యబారి నిలిచెను.

సీ॥ బాలభాస్కరశతప్రభగల మకుటుంబు
నవరత్నమకరకుండలయుగంబు
ఖండేందునిభఫాలకస్తూరితిలకంబు
దరహాసకలితసుందరముఖంబు
రంగైన యలమేలుమంగ యొప్పెడుతాళి
గ్రైవేయభాసురకౌస్తుభంబు

కటువానశంఖచక్రములు హస్తంబుల
నతులితకాంతి పీతాంబరంబు

తే॥ చకిత నవరత్న మంజీర చరణయుగము
హారకేయూరమణినూపురాదిభూష
ణాంచితంబైన నీలనీలాంబుదాంగ
మలరనిల్చెను వేంకటాచలవిభుండు 108

భావము : లేతయైన నూరు సూర్యుల కాంతికిరణములు గల కిరీటములు నవరత్నాలు పొదిగిన మొసలి వంటి చెవి కమ్మలు, అర్ధచంద్రుని వలె నొసటిపై కస్తూరిబొట్టు, అందమైన నవ్వుముఖము, అలమేలు మంగ ధరించిన మంగళసూత్రము, మెడనున్న సరములో ప్రకాశించు కౌస్తుభమణి, చేతులలో దిట్టమైన శంఖచక్రములు, శరీరముపై విలువైన పచ్చని పట్టుబట్ట, నవరత్నములు నిండిన కాలి అందియలు, మెడలో దండలు, బాహువుల అలంకరణలో అమర్చిన మణులు, కడియాలు కలిగి నీలవర్ణపు శరీరము మెఱయగా ఎదుట వేంకటపతి నిల్చెను.

తే॥ వేదములునాల్గు మూర్తీభవించి చేరి
సన్నుతింపంగ వేల్పులు చదల పుష్ప
వృష్టి గురియంగ సన్మునుల్ వినుతి సేయఁ
దూర్ణముగ మింట దేవదుందుభులు మ్రోయ 109

భావము : నాలుగు వేదములు, ఆకారము దాల్చి పొగడగా ఆకాశము నుండి దేవతలు పూలవాన కురియగా మునివరులు విశేష స్తోత్రములు కావించుచుండ, మిక్కుటముగా దేవతలు నగారాలను మ్రోగించగా,

వ॥ కనియదద్భుతానందకందళితహృదయారవిందయైసాష్టాంగదండప్రణామంబు లాచ రించిపులకాంకురితశరీరయైకరకమలంబులు ముకుళించియిట్లు నిస్తుతియించె 110

భావము : అప్పుడు అధికమైన ఆనందముతో వికసించిన తామరపువ్వు వంటి ఎదతో ఎనిమిది అవయవములు నేలను తాకునట్లు వాలి నమస్కరించి, గగుర్పాటు పొంది అందమైన రెండు చేతులు జోడించి స్తతించెను.

సీ॥ అలమేలుమంగాంగనాత్మాంబుజానంద!
యబ్జాక్ష!శ్రీధర! హరి! ముకుంద!
కృష్ణ! దామోదర! కేశవ! గోవింద!
నుతపద్మజాది సన్మౌనిబృంద
రాజీవలోచన! రక్షితముచికుంద!
సతతకళ్యాణ! వందితసనంద!
విహగేంద్రవాహన! వేదలతాకంద!
యభయప్రదానహస్తారవింద!

తే॥ దేవదేవ! జగన్నాథ! దీనమంద
భాగ్యహరపుత్రవత్సలభావనంద!
దశననిర్జితశృంగారతరుణకుంద!
సతతనివసితవేంకటశైలకుంద! 111

అర్థము : ఆత్మ అంబుజ ఆనంద (మంగ) మనస్సనెడి అంబుజమును ఆహ్లాదపఱచువాడా, అబ్జ+అక్ష కమలమువలె కన్నులుగలవాడా!, నుత పద్మజ ఆది= పొగడునట్టి, బ్రహ్మ మొదలైన, సత్+మౌని బృంద= గొప్ప మునుల సమూహము కలవాడా, రాజీవలోచనా= పద్మమువంటి కన్నులు కలవాడా!, రక్షిత= రక్షింపబడిన, ముచికుందుని కలవాడా! సతత కల్యాణ= ఎల్లప్పుడును శుభము లొసగువాడా!, వందిత సనంద= నమస్కరించు సనందుని కలవాడా! విహగేంద్రవాహన= గరుడుని వాహనముగా కలవాడా! వేదలతాకంద= వేదాలనెడి తీగలకు మూలమైనవాడా! అభయ ప్రదాన హస్త అరవింద= భయము లేదని తెల్పు కమలములవంటి చేయి కలవాడా, దీనమంద

భాగ్యహర= దీనులయొక్క కష్టాలను పోగొట్టువాడా, దశన నిర్జిత శృంగార తరుణకుంద= తెల్లని పండ్ల వరుసలచే జయింపబడిన అందమైన లేతనైన మొల్లపూలు కలవాడా! సతత నివసిత వేంకట శైలకుంద= ఎల్లపుడు నివసించు, వేంకటమనెడి పర్వతమే నిధియైన వాడా!

సీ॥ పరమాత్మ! సర్వేశ! వరద! హృషీకేశ!
కరుణారసాపాంగ! కలుషభంగ!
సద్భక్తమందార! సాధుజనాధార!
నిరుపమాలంకార! నిగమసార!
గోవర్ధనోద్ధార! గోపికాజనజార!
సర్వాంతరావాస! సద్విలాస!
స్మరకోటిలావణ్య! సర్వలోకశరణ్య!
నిఖిలమాయాతీత! నిరత పూత!

తే॥ తామరసపత్రనేత్ర! సంతతపవిత్ర!
భువననిర్మాణసంకల్ప! భోగితల్ప!
సర్వసుందరసుఖరూప! శార్జచాప!
సరసదరహాస! వేంకటశైలవాస! 112

అర్థము : హృషీకేశ= ఇంద్రియములకు ప్రభువా, కరుణారస అపాంగ= కృపయనెడి భావముగల క్రీగంటి చూపుకలవాడా, కలుషభంగ= పాపాలను తొలగించువాడా, మందార= కల్పవృక్షమా, ఆధార= రక్షకుడా, నిగమసార= వేదాల బలిమిగలవాడా, ఉద్ధార ఎత్తినవాడా, జార= ఉపపతియైనవాడా, సర్వ అంతర అవాస= అన్నింటి యందు ఉండువాడా, మాయా అతీత= ఇంద్రజాలములకు లొంగనివాడా, పూత= పవిత్రుడా, భోగితల్ప= సర్పశయనుడా, శార్జచాప శార్ఙమనె విల్లుకలవాడా, నిరత పూత= ఎల్లప్పుడు పరిశుద్ధమైనవాడా!

ఉ॥ కంటిని మత్తపోఫలము గంటిని ముంగిట కామధేనువున్
గంటిని మూల పెన్నిధిని గంటిని కేశవనామరాగముం
గంటిని కొంగుమేల్పసిడి గంటిని తంగెటి జున్ను నిన్ను నే
గంటిని వేంకటాధిపతిఁ గన్నుల పండువుగాగ సమ్మతిన్ 113

భావము : నా తపః ఫలమును పొందితిని నా ఇంటిముందు కొర్కెలిచ్చు ఆవును చూచితిని, సర్వానికి మూలమైన పెద్ద నిధిని అందుకొంటిని కేశవనామముగల దేవుని ప్రేమ లభించినది, మేలైన బంగారు కొంగు నన్ను అలంకరించినది, చెట్టున కట్టిన, తేనే తుట్టెను చేకొంటిని నిన్ను వేంకటాచలపతిని నా కన్నులకు పండుగగా, మంచి మనస్సుతో తృప్తిగా దర్శించితిని, (కేళివన+అమరాగము= దేవతావృక్షము)

మ॥ నినువర్ణింపగలేరు బ్రహ్మముఖులున్ నేనెంతయున్ మానవిన్
ఘనకామాదినిషిద్ధదుర్గుణగణాక్రాంతన్ మదస్వాంత గాం
తను నే నీకరుణాకటాక్షరససద్ధారాళధారాభిషే
చన బూతాత్మకనైతి చాలదటె నిచ్చున్ గోర్కు లింకేటికిన్ 114

భావము : బ్రహ్మ మొదలైన వారు కూడా నిను వర్ణింపలేరు, నేను అల్పమైన మానవ కాంతను, గొప్ప కాముకులైన దుర్గుణాలతో నిండినదానను, మదము కలదానను, నీ కరుణతో కూడిన ద్రవరూపమైన ధారలచే పవిత్రురాలనైతిని. ఇది చాలదో? ఇంక వేరు కోర్కెలు కావలెనా?

క॥ భవదీయపాదభజనో
త్సవమింతియెకాని వేరెసత్ఫల మొకటిన్
వివరింప మదిని దోచదు
అవిరళమగు కరుణ నొసగుమయ్యా ముకుందా! 115

భావము : ఓ వేంకటేశ! నీ పాద సేవ జేయు కొలువే గానీ వేరొక మంచి ఫలము నా మనస్సులో తోచదు. నీ యొక్క పరిమితిలేని కృపను దయచేయుమయ్యా!

సీ॥ అన విని శ్రీవేంకటాధీశు డిట్లనె
మంచిది మగువ! నీ మానసంబు
నీ భక్తి మెచ్చితి నీవు గోరిన కోర్కె
కరుణ నిచ్చితిని నిక్కంబు వినుము
నా వచనము గొన్ని నాళ్ళట పతిగూడి
బహుభోగభాగ్య సంపదల బొదలి
యంతట నపవర్గమందెదు నందాక
మద్భక్తి మతి లోకమాన్యవగుచు

తే॥ వర్తిలుము నిందు కేశవమూర్తియందు
పూర్ణముగ నుండు నిర్ణయంబుగను నిందు
సంతతంబును తీర్థప్రసాదములను
గైకొనుచునుండు నాదు కైంకర్యనియతి 116

భావము : అని వచింపగా ఆ వేంకటేశ్వరుడు ఇట్లనుచున్నాడు. ఓ మగువా! నీ మనస్సు శుద్ధమైనది. నీ భక్తికి మెచ్చి. నా కరుణించితిని. ఇది నిజము. విను నా మాట కొన్నాళ్ళు లోక సుఖాలను చవిచూచిన తరువాత పరలోకము లభించును. అంత వరకు నా యందు భక్తి కలిగి లోకమందు గౌరవనీయవై జీవింపుము. నేనిచట కేశవ నామధేయముతో నుండుటకు నిర్ణయించుటచే నీ తీర్థ ప్రసాదములను నియమపూర్వక సేవలను స్వీకరించుచు ఉండెదను.

మ॥ అని యిట్లానతి యిచ్చి వేంకటవిభుండక్కేశవస్వామియం
దనుమోదంబున నావహించి భువనవ్యాపారపారీణతన్
దను దివ్యుల్ మనుజేశ్వరుల్ ముదముతోడన్ గొల్వ త్రైలోక్యమో
హనలీలన్ దగ వేంకటేశుడన విఖ్యాతిన్ జగత్కర్తయై 117
(కొన్ని పద్యాలు ఖిలమైనవి)

భావము : ఇట్లని వేంకటేశ్వరుడు గౌరవరమున కేశవస్వామియందు తన తేజమును నింపి లోకవ్యవహారములను చక్కజేయుచు తన్ను దేవతలు,

మానవులు కొల్వగా (సంతోషముతో) త్రిలోకములను ఆకర్షించు విలాసముతో జగత్తునకు కార్యకర్తయై వేంకటేశ్వరుడనే పేరుతో కీర్తిమంతుడయ్యెను.

షష్ఠ్యంతములు

క॥ శ్యామునకును భక్తాంబుధి
సోమునకును సర్వకాలశోభనవిభవో
ద్ధామునకు మహితతారక
నామునకును బిట్రగుంటనగధామునకున్ 118

భావము : నీలవర్ణుడు, భక్తులనెడి మున్నేటికి చంద్రుడు, ఎల్లకాలము శుభకరములైన సంపదలచే గొప్పవాడు, పూజ్యయైన తరింపజేయు పేరుగలవాడు, బిట్రగుంట కొండపై నుండువానికి.

క॥ నిరతునకును ప్రధ్వంసిత
దురితునకును లంబమానతులసీమాలా
భరితునకు విపులశాశ్వత
చరితునకును ఘనచతుర్భుజస్ఫురితునకున్ 119

భావము : శాశ్వతుడు, పాపగుణములను నశింపజేయువాడు, పాదములనంటే తులసిమాలను ధరించువాడు, నిలకడైన ప్రవర్తన కలవాడు, గొప్పవగు నాలుగు భుజముల ప్రకాశించువానికి.

క॥ పోషణునకు కౌస్తుభమణి
భూషణునకు సత్యమధురపూరితమృదు సం
భాషణునకు మునిజన సం
తోషణునకు ఖండితఖరదూషణునకున్ 120

భావము : విశ్వమును పోషించువాడు, కౌస్తుభమణిని నగగా గలవాడు, సత్యమైన తియ్యనైన, మెత్తనైన మాటలు కలవాడు, మునిజనులకు మోదము కూర్చువాడు, త్రుంచబడిన ఖరదూషణులనెడి రక్కసులు కలవానికి.

కం॥ పతగకులేశ్వరగతికిన్
హతదితిజపతికిని కాంచనాచలధృతికిన్
శ్రుతిసంస్తుతికిని సన్ముని
వితతిపతికి బిట్రగుంట వేంకటపతికిన్ 121

భావము : పక్షిలోకానికి నాయకుడైన గరుడుని వాహనయానము కలవాడు, చంపబడిన రాక్షస ప్రభువులు కలవాడు, బంగారు కొండను ధరించినవాడు, వేదములచే స్తుతించబడువాడు, శ్రేష్ఠులైన మునుల సమూహానికి నాయకుడు అయిన బిట్రగుంట వేంకటపతికి.

వ॥ సమర్పితంబుగా నాయొనర్పంబూనిన విష్ణుమాయావిలాసంబను
మహాప్రబంధంబు నకు కథాక్రమంబు 122

భావము : నేను రచించుటకు ఉద్యమించి, నాచే సమర్పింపబడుచున్న విష్ణుమాయా విలాస ప్రబంధానికి కథాక్రమంబు ఎట్టిదనగా,

సీ॥ విలసితమాధవావిర్భావతారుణ్య
మనుపమఫలకుసుమానుగణ్య
మఖిలలోకప్రదాయక వరకారుణ్య
మమితదివ్యోపవనాగ్రగణ్య
మద్భుతతరుపల్లవాంచితలావణ్య
మతులదివ్యస్థలాయతవరేణ్య
మాగమశాస్త్రసమాలోకనాగణ్య
మురుసింహశార్దూల కరివరేణ్య

తే॥ మబ్జభవవిష్ణుశివవర్ణనాతిగణ్య
మభ్యుదయవాంఛనావరయతిశరణ్య
మాశ్రితపురాకృతవిభాసితాత్మపుణ్య
మనుచు దగు నైమిశారణ్యమనగ ధరణి 123

భావము : వికసించెడి వసంతకాలము వచ్చుటచే, లేతదనమునకు కలదియు, సాటిలేని పళ్ళు, పూలు కలది. సమస్తలోకాలకు సమర్పించు శ్రేష్ఠమైన కరుణరసమును కలిగియు లెక్కలేని చాలా చక్కని తోటలలో మొదట ప్రశంసింప దగినదియు. ఆశ్చర్యకరములైన చెట్లు చిగుళ్ళచే వెదజల్లు వన్నెల సొగసు కలదియు సాటిలేని విశాలమైన దేవతా సంబంధమైన మైదానములతో గొప్పదియు మంత్రశాస్త్ర పరిశీలనమునందు విలువైనదియుపెద్దదైన సింహములు పులులు, బలిష్టములైన ఏనుగులు కలదియు బ్రహ్మ విష్ణు శివులును వర్ణింపలేనిదియును, సౌభాగ్య జీవితమును కోరువారికి గొప్పదియు మిక్కిలి చేరదగినదియు, ఆశ్రయించిన వారి పూర్వజన్మకృతమై, ప్రకాశించి, మహాత్ముల ప్రభ రూపమనదగు, నైమిశారణ్యము పుడమిలో వెలసెను.

చ॥ తనరెడు నవ్వనంబున నుదారత శౌనకముఖ్యసర్వస
న్మునులు గణంగి జాహ్నవిసమున్నతతీరపవిత్ర దేశమం
దనుపమసత్రయాగమహిమాన్వితదీక్ష వహించియున్నచో
ఘనుడు పరాశరాత్మజుని గాదిలి శిష్యుడు సూతుడయ్యెడన్ 124

భావము : అట్టి నైమిశారణ్యమున శౌనకుడు మొదలగు మునివరులు శ్రద్ధతో గంగానది యొడ్డున మలినము లేనిచోట గొప్ప సత్రయాగమును చేయుటకు దీక్ష వహించి యుండగా వేదవ్యాసుని ప్రియశిష్యుడు సూతమునీంద్రుడు వచ్చెను.

ఉ॥ వచ్చినయంత సర్వమునివర్గ మనర్గళసమ్మదంబునన్
మచ్చికతో నెదుర్కొని సమంచితగౌరవ మొప్ప నాసనం
బిచ్చినుతించి యిట్లనిరి యెల్లతపంబులునున్ ఫలించె నీ
వచ్చుట సత్రయాగమును వర్ధితమై నెరవేరె పావనా 125

భావము : అచ్చట నున్న మునులందరు చాలా సంతోషముతో స్నేహభావముతో తగిన విధముగ గౌరవించి, కూర్చుండుటకు పీఠమమర్చి

పొగడి ఇట్లనిరి. మీ రాకచే మా తపములన్నియు ఫలించినవి, ఓ పవిత్రుడా! ఈ సత్రయాగము సమాజ క్షేమమునకై ఏర్పడి ఫలవంతమైనది.

క॥ క్రతువునకు ఫలము సత్సం
గతి గల్గుట గాదె నేడు గంటిమి నిన్నున్
క్రతువులు వ్రతములు తపములు
సతులితగతి ఫలితమయ్యెనయ్య మహాత్మా! 126

భావము : ఈ యాగమునకు మంచివారితో కలయిక మొదటి ప్రయోజనము నేడు నిన్ను చూచితిమి. మహాత్మా! కనుక మా యాగము వ్రతాలు, తపములు అన్ని ఫలించినవి.

చ॥ అతులితసత్పురాణరచనామృతవారిధి వెల్లి దేల్చుచున్
సతతము సన్మునీంద్రబుధసత్తములం గడు మోక్షమార్గసం
గతులను జేయుచున్ వినుతి గాంచుచు శాశ్వతరోమహర్షణ
స్థితి దగ రోమహర్షణసుధీనిధియండ్రు భవద్గురుం దగన్ 127

భావము : సాటిలేని, పురాణ రచనలనెడి జడివాన జల్లుతో శ్రోతలను ముంచి తేల్చుచు ఎల్లప్పుడు మునివరులను మోక్ష మార్గమున పయనించుటకు తోడ్పడుచూ పొగడ్తలు పొందుచు వెంట్రుకలను పులకరింపజేయుటచే రోమహర్షణ పండిత శ్రేష్ఠుడని నీ తండ్రికి పేరు వచ్చెను కదా!

ఉ॥ నీవు తదీయపుత్రుడవు నిష్కపటుండవు సర్వమౌని సం
భావితసద్గుణుండవు కృపానిధి విద్ధవివేకశాలివిన్
పావనమూర్తివిన్ సకలభవ్యపురాణకథాప్రసంగవి
ద్యావదనుండ వూర్జితదయాళుడ వింతయు రోమహర్షణీ! 128

భావము : నీవు అట్టి వాని కుమారుడవు మోసము లేని వాడవు, చక్కగా ఆదరింపబడు గుణములు కలవాడవు. దయకు గని, మంచి చెడ్డలు బాగుగా

తెలిసినవాడవు, పవిత్రుడవు, అన్ని శుభప్రదములైనపురాణములను గూర్చి చెప్పగలిగిన విద్యకల్గిన ముఖము కలవాడవు

ఓ రోమ హర్షణీ! నీవు మా యెడ చాల దయగలవాడవు సుమా!

మ॥ హరిచారిత్రము లెల్లకాలము మహాహ్లాదంబుతో నిత్యమా
దరణీయప్రియపూర్వకంబుగ సుధాధారాళ ధారావచో
త్కర నైపుణ్యముచే బుధప్రకర చిత్తధ్వాంతవిధ్వంసివై
కర మొప్పారుట నీకుఁ దత్కరుణ గల్గంగాదె భవ్యాత్మకా! 129

భావము : ఓ పుణ్యాత్ముడా! హరికథలను ఎల్లకాలము చాలా ఉత్సాహముతో ప్రతి దినము ఎల్లరు ప్రీతితో ఆదరించునట్లు అమృతధారవలె అడ్డులేక నీ వాక్కుల నిపుణతచే విద్వాంసుల చిత్తాలలోని అజ్ఞానమును తొలగించి ఒప్పుట నీకు ఆ విష్ణు కృపగల్గుటయే కదా కారణము.

క॥ పారాశర్యకటాక్షసు
ధారసపరివర్ధమానధవళ హృదబ్జో
దారవచోమకరంద
శ్రీరతి సుజనాళిదృప్తి సేతువు కరుణన్ 130

భావము : ఆ వ్యాసుని కడగంటి చూపులనెడి అమృతబిందువుల సారముచే వికసించిన అచ్చమైన నీదైన ఎదయనెడి తామరపువ్వుల నుండి వెల్వడిన తేనెల సంపదలయందలి ఆస్వాదముచే సుజన సమూహము సుఖపడునట్లు చేయుదువు.

ఉ॥ ఎట్టి తపంబు చేసితిమొ యెట్టి వ్రతంబులు సల్పినారమో
యెట్టి మహార్హ కృత్యము లహీనత నెన్ని ఘటించినారమో
నెట్టన సత్రయాగమున నిష్ఠ దలంకొనియున్న మాయెడన్
దొట్టిన కూర్మిపెంపునను దూర్ణత వచ్చుటకున్ మహాత్మకా! 131

భావము : ఎట్టి యోగ్యమైన పనులు చేసినామో మేము నియమముతో చేయదలచిన వ్రతయాగమునకు మాయందుగల మిక్కిలి కూరిమితో గట్టి పూనికతో వచ్చుటకదా!

క॥ బంధురహృదయు డకారణ
బంధుండై యెపుడు సుజనపంక్తుల గరుణా
సింధుండై రక్షించువ
సుంధర మేఘుండ పోలె సుజనవరేణ్యా! 132

అర్థము : బంధుర హృదయుడు= ఒప్పిదమైన ఎద, అకారణబంధుడు= కారణము లేని చుట్టము, సుజన సంక్తుల కరుణాసిందుడు= మంచివారి యెడ కృపగల మున్నేరు.

భావము : సుజనులలో శ్రేష్ఠుడా! ఒప్పిదమైన ఎద, కారణములేని చుట్టమై ఎప్పుడును మంచివారి యెడ కృపగలిగి మున్నేరై రక్షించునట్టి మేఘుని వంటివాడవు.

ఉ॥ కావున నీవు మాయెడ నకారణబాంధవమొప్ప మమ్ములన్
బ్రోవగ వచ్చినావు వరపుణ్యపురాణరసాయనంబులన్
నీ వచనాచ్ఛహస్తముల నెమ్మిని వడ్డన సేయు దృప్తిమై
త్రావుదు మాత్మకర్ణపుటరాజితపాత్రల నిచ్చ ధీమణీ! 133

భావము : ఓ బుద్ధిమంతుడా! నీవు కారణము లేకయే మాకు బంధువై మమ్ము కాపాడుటకు వచ్చినావు. శ్రేష్ఠములైన పుణ్యములకు ప్రసాదించు పురాణములనెడి రసవంతములైన పానీయములను నీ వాక్కులనెడి చేతులతో ప్రేమకలిగి వడ్డించుము. తృప్తిగా శరీరమందలి చెవులనెడి పాత్రలచే మాకు ఇష్టమైన విధమున త్రాగెదము.

చ॥ అన విని సూతుడిట్లనియె నయ్య మహాత్ములు యజ్ఞశీలురన్
ఘనులు తపోధనాఢ్యులును కల్మషదూరులు నైన మీరలున్

విననిపురాణము ల్గలవె విశ్వములోపలనైన నాయెడం
దనరిన కూర్మి నిట్లడుగ ధన్యుడ నైతి ముదంబు జెందితిన్ 134

భావము : అట్లువారు చెప్పగా సూతుడు, అయ్యలారా! గొప్ప మనసుకలవారు యజ్ఞము చేయు నడవడి కలవారును, గొప్పవారు తపస్సనెడి ధనబలము కలవారు, మలినము లేనివారు అయిన మీరు ఈ ధరణిలో వినని పురాణములుండునా? నా యందు గల ప్రేమతో ఇట్లు కోరుచున్నారు. నా జీవితము పవిత్రమైనది. సంతోషము కల్గినది.

మ॥ వినిపింతున్ భవదీయవాంఛిత కథల్ వేర్వేర వ్యాస ప్రసా
ద నయోద్యన్మహిమాతిరేకమున దాత్పర్యంబునం బ్రీతిమై
వినుడంచున్ వచియించె సద్గురుని హృద్వీథిం దగన్ నిల్పి య
మ్మునివర్గంబు మనోత్సవంబుగ దగన్ మోదంబు సంధిల్లగన్ 135

భావము : మీరు కోరిన కథలను విడివిడిగా, వ్యాసునిచే ప్రసాదింపబడిన గొప్ప మహిమగల వానియందు మనస్సు నిలిపి, ప్రీతితో వినుడు, అని తన హృదయ పీఠమున వ్యాసుని నిల్పి మునుల సమూహము సంతోషముతో ఉప్పొంగునట్లు వచించెను.

క॥ అడిగిన కథ లెయ్యయ్యవి
కడువిస్తర ఫణితి దెలుపగా విని యెందున్
కడు జగములకాఢ్యుడు హరి
గడచిన వేల్పెందు లేమిగా మది దోచెన్ 136

భావము : అడిగిన కథలను ఎన్నింటిలో విపులముగా తెలుపగా విన్నాము. ఏ కథలలోనూ హరికి మించిన దైవమొకటి లేదని గ్రహించితిమి.

ఉ॥ తోచినయంత నిశ్చలత తోయభవాయతపత్రలోచనున్
బూచినమానసాబ్జముల బూర్ణత వాంఛితభక్తియుక్తులై

యేచిన వాంఛలన్జగదధీశ్వరు సచ్చరితంబులెంతయున్
చూచినయట్లదెల్ప విని సూతునకిట్లనిరద్భుతాత్ములై 137

భావము : అట్లు తోచినవెంటనే కమలము వంటి కన్నులు గల వానిని గూర్చి, వికసించి నట్టియు భక్తి కలవారై కోరికలు ఎగయుచుండ జగన్నాయకుని కథలు, చూచినట్లు తెల్పుడని సూతునకు మరియు శ్రద్ధగల హృదయులు కలవారలై ఇట్లనిరి.

క॥ లోకములకెవ్వడాఢ్యుడు
లోకము లెవ్వానిమాయ లోగొనియుండన్
లోకారాధ్యుండెవ్వడు
లోకంబులు గలిగె నెట్టులున్ ప్రభుమహిమన్ 138

భావము : ఈ లోకాలకు ఎవ్వడు గొప్పవాడు? ఎవ్వని మాయకు ఈ లోకాలు వశమైయుండును? ఈ లోకములందు పూజింపబడు వాడెవ్వడు? ఆ ప్రభువు మహిమచే లోకాలు ఎట్లు ప్రభవించినవి?

వ॥ అనిన శౌనకాది మహామునులకు రోమహర్షణి యిట్లనియె 139

భావము : ఆ మునులకు సూతుడిట్లనెను.

శా॥ పూర్వుండెల్ల మహాప్రపంచములకున్ బుట్టింప రక్షింపదా
సర్వంబున్ విలయింప గర్తయతడే సంకల్పమాత్రంబునన్
నిర్వాణస్థితుడాఢ్యుడచ్యుతుడు వానింగానిదొండుడునే
సర్వంవిష్ణుమయం జగత్తనెడు శాస్త్రంబుల్ వినం గ్రొత్తవే 140

భావము : ఆ విష్ణువే మొదటివాడు సర్వ ప్రపంచమును పుట్టించును, రక్షించును. ఒక్క తృటిలో తలచినంతనే సర్వమును తొలగించును. నాశములేనివాడై నిలకడగా నుండువాడు. ఆతనికి కానిదేమైనా ఉండునా? సర్వశాస్త్రములలో గల వాక్యాలు క్రొత్తవా?

క॥ సకలమును విష్ణుమయమగు
సకలమయుండగును విష్ణు సర్వజ్ఞత వే
రొక వేల్పునందుగలదే
ప్రకటింపగ సర్వలోకపాలురయందున్ 141

భావము : సకలమునందు విష్ణువు ఉన్నాడు. సకలమందున్న విష్ణు సర్వజ్ఞత, స్పష్టముగ దిక్పాలకులయందైనా వేఱొక దేవుని యందైనా కలదా?

ఆ॥ అట్టి విష్ణుమాయ నధిగమింపగ రాదు
భవునకైన పద్మభవునకైన
కార్యకారణుండు కపట నాటకసూత్ర
ధారి సర్వహృద్విహారిశౌరి 142

భావము : అట్టివాడైన విష్ణుమాయ నుండి శివుడైనా బ్రహ్మయైనా ఎవ్వరూ తప్పించు కొనలేరు. జగత్కార్యానికి మూలకారకుడు, కపటనాటకమాడు కార్యకుశలుడు, సమస్తమునందుండి తిరుగువాడు విష్ణువు.

సీ॥ అఖిలప్రపంచంబు నతనిమాయాకల్పనము
గాని వేరొక్క క్రమముగాదు
స్థూలసూక్ష్మ క్రియాశూన్యసృష్టిస్థితుల్
వాని సంకల్ప ప్రవర్ధనములు
క్షణములో బహుజన్మకర్మసంఘాతముల్
గల్పించు సుఖదుఃఖకరములుగను
బహుకాలజన్మసంపదలన్ని తృటికాల
పరిలిప్తముగ జేయు ప్రౌఢిమమున

ఆ॥ హరవిరించిముఖ్యసురలనుభ్రమయించు
మోహపఱచు రాగమున గరంబు

పరమభక్తజనులపాలిట వశ్యుడై
వారలాజ్ఞవలయు మీరడెందు 143

భావము : విశ్వమంతయును, అతని మాయచే ఏర్పడినది. దాని క్రమానికి ఇతరులు ఎవ్వరును కర్తలుకారు. పెద్ద, చిన్న, వస్తువులు, పనుల జీవుల పుట్టుక, బ్రతుకు, చావు ఆతని ఆలోచనముననే జరుగుచున్నవి. క్షణములో పెక్కుజన్మల కర్మ మొత్తమును సుఖదుఃఖములు కలుగునవిగ జేయును. శివుడు, బ్రహ్మ మొదలైన దేవతల మనస్సు చలింపజేయును. అమితమైన కామము కలుగునట్లు మోహింపజేయును. అయిననూ గొప్ప భక్తులకు వశుడై వారి ఆనలను ప్రకటనముగ నిర్వహించును.

సీ॥ శాత్రవులై నమ్మజాలక నిరతంబు
సరిబోరుచున్న రాక్షసులకైన
తనయుడై నాభిపద్మమున బుట్టి జగంబు
పటుగతి సృజియించు బ్రహ్మకైన
సగము శరీరంబు సమ్మతిగైకొని
యవిరళుండైనట్టి శివునకైన
సదమలభక్తిచే సంతతానందుడై
మదిజొక్కుచున్న నారదునకైన

తే॥ తాపసులకునైన దైవతతులకునైన
గాని వానిమాయ గానరాదు
సకలలోకసాక్షిసర్వమయుండునౌ
విష్ణుమాయగాక వేరుగలదె 144

భావము : శత్రువులై సమాన బలముతో పోరు రాక్షసులకైనను, తనకు తనయుడుగా లోకాలను పుట్టించు బ్రహ్మకైనను, తన శరీరములో సగముగా చేరిన శివునికైనను సదమల భక్తిచే ఎల్లప్పుడు భక్తిచే, సంతతానందుడై

మైమఱచు నారదునకైనను, తాపసులకైనను దేవతా సమూహమునకైన హరి మాయను చూడతరము కాదు. సర్వలోకమును చూచువాడయిన విష్ణు మాయయే సర్వము, వేరుకాదు.

ఆ॥ కాన విష్ణుమాయ గనరాదు భక్తిచే
శ్రవణకీర్తనముల దవిలినట్టు
పరమహితుడునైన పావనుడగు సూతు
గని మునీంద్రు లిట్టులనిరి ప్రీతి 145

భావము : కావున విష్ణుమాయను తెలుసుకొనుటకు వీలుకాదు. భక్తిచే వినుట, పాడుట యందు ఆసక్తికలవాడై మిక్కిలి మేలు చేయువాడై పవిత్రుడయిన సూతుని చూచి మునివరులు ఇట్లనిరి.

ఉ॥ నీవు మహానుభావుడవు నీ కృప విష్ణుకథాసుధారస
శ్రీవిభవోన్నతిన్ దనరి చిత్తములెంతయు దృప్తినొందనో
పావనమూర్తి! విష్ణుని యపారగుణావలు లిట్లు దెల్పగన్
నీవె కదయ్య పెన్నిధివి నిక్కము మాకును ధీవరోత్తమా! 146

భావము : ఓ ఉత్తమమైన ధీరుడా! నీవు గొప్ప భావాలు కలవాడవు. ఓ పవిత్రమైన రూపము కలవాడా! నీ కృపచే విష్ణుకథల అమృతపాన సంపత్తిచే మా చిత్తములు సంతసించి తృప్తి పొందునట్లు విష్ణుని అమిత గుణములను నీవె తెల్పగలవు. మాకు నీవొక పెద్ద నిధివి.

విష్ణు భక్తులు తమ్ముసేవకై అర్పించుకొను పద్ధతి

కం॥ వింటిమి భక్తిక్రమములు
వింటిమి సత్కథలు విపులవిక్రమమహిమల్
వింటిమి ప్రపత్తిమార్గము
వింటిమి తగ వినుట లేదు విష్ణుని మాయల్ 147

భావము : విష్ణుభక్తి విధమును విన్నాము. విష్ణుకథలు విస్తారమైన విష్ణుమహిమలు విన్నాము. ప్రపత్తిమార్గమును విన్నాము. విష్ణుమాయ లెట్టులో వినలేదు.

క॥ ఏ కాలంబున నెక్కడ
నే కరణిని యెవ్వరందు నెట్లొనరిచె దా
నోకారుణ్యపయోనిధి!
మా కానతి యీవె విష్ణుమాయ చరిత్రల్ 148

భావము : ఓ కారుణ్యపయోనిధి= ఓ కరుణకు నిలయమైన సముద్రుడా! ఏ కాలమున ఎక్కడ ఏ విధముగా ఎవ్వరిని తన మాయచే ఏమి చేసెనోకదా! మాకు విష్ణుమాయను గూర్చి చెప్పుదురు గాక!

వ॥ అని హరికథా శ్రవణకౌతూహల సాంద్రులగు నమ్మునీంద్రులకు సకల పురాణవ్యాఖ్యాన చతురతర వాగ్విఖ్యాతుండగు సూతుండిట్లనియె 149

భావము : హరికథలను వినుటకై అధికమైన ఉత్సాహము సంతోషముతోను ఉన్న ఆ మునివరులకు సమస్తమైన పుణ్య వ్యాఖ్యాన వివరణలను చేయు నేర్పరియైన సూతుడిట్లనెను.

ఉ॥ మౌనివరేణ్యులార! హరిమాయజరించినయట్టియద్భుతా
ఖ్యానము లెన్నియోగణన కగ్గల మబ్ధితరంగజాలముల్
గాని మితంబు దెల్పుటకుగాదు ఫణీంద్రునకైన నిక్కమౌ
నేననవెంతవాడ కడు నేర్పరి నంచు వచింపనెంతయున్ 150

భావము : మునివరులారా! హరి మాయ వలన కలిగిన గొప్ప కథలు ఎన్నియో! జలనిధి అలలను లెక్కించుటకు నిజముగా ఆదిశేషునికే వీలుకాదు. కావున నేర్పరినని వచించుటకు నే నెంతటివాడను?

ఉ॥ ఐన మదీయసద్గురుకటాక్షవిశేషమహావిభూతిచే
నేనొక కొన్నెరింగినవి నేర్చినయట్టుల విన్నవింతు స

న్మానము తోడ నిశ్చల సమాధి వినుం డిది మోక్షమార్గ సం
ధానము భక్తమానవనిధానము మౌనిజనాభిమానమున్ 151

భావము : అయిననూ నా గురువు యొక్క కడగంటి చూపుల బలముచే, కొన్ని నేను తెలుసుకొన్నవి, చెప్పగల వానిని తెల్పెదను. ఆదరముతో నిశ్చల మనస్సు కలవారై వినుడు, శ్రవణము, మోక్షమార్గమును చూపును. భక్త మార్గమునకు తగిన విధము మౌనివర్గమునకు ఇష్టమైనది (భక్తులైన మానవులకు గొప్ప నిధి)

ఆ॥ నరులయందు మౌనివరులందు వాగ్వధూ
వరునియందు త్రిపుర హరునియందు
విపులమగుచు జుట్టి విలసించుటయెకాని
విలయ మొందదాయె విష్ణుమాయ ॥ 152

భావము : విష్ణుమాయ నరులలోను మునులయందు, బ్రహ్మయందు, శివుని యందు విస్తరించి వారిని చుట్టివేసి నిలిచియున్నది దానికి నాశములేదు.

వ॥ అది యెట్లంటేని 153

భావము : అది ఎట్లనగా

సీ॥ ఉరుతరమౌనిశాపోద్ధతివాసవ
లక్ష్మివాసవుని తొలంగి చనిన
బలదర్పహీనుడై బలిచక్రవర్తికి
కడు పరాభవమొంది కడల దెరలి
తలచూప వెరచి చింతల మున్గి దీనుడై
ప్రాపు దాపైనట్టి ప్రభుడు లేక
హీనసంధిని నబ్బలీంద్రుని కడచేరి
పనులలో హృదయంబుపట్టనడచి

తే॥ మది విచారంబుబాయక నుదిలగొనుచు
హరిని దగ గొల్చి తదనుగ్రహంబు బడసి
మంతనం బానతిచ్చిన మార్గమునను
శక్రుడొక నాడు మెల్లన సమయమరసి 154

భావము : ముని శాపముచే ఇంద్రుని భాగ్యము తొలగిపోగా బలము, గర్వము లేక బలిచక్రవర్తిచే మిక్కిలి అవమానపడి కష్టములను అనుభవించి తల ఎత్తుకొని తిరుగలేక చింతలలో క్రుంగి రక్షించు ప్రభువు లేకపోవుటచే హీనమైన ఒడంబడిక చేసుకొని బలిచక్రవర్తిని చేరి పనులయందు ఎదయుంచి వర్తించుచు, మనసులోని దుఃఖమును విడువలేక వెతకలిగి హరిని ధ్యానించుచు ఆతని అనుగ్రహముచే ఏకాంతమున ఆనతిచ్చిన విధమున ఇంద్రుడు మెల్లగా సమయము కనిపెట్టి...

ఉ॥ అల్లన చెంతజేరి వినయంబున నబ్బలిపాదయుగ్మమున్
మెల్లననొత్తుచున్ మనసు మెత్తన జేయుచు సన్నుతింపుచున్
మల్లడిగానరానియటు మక్కువ నిట్లను దేవదానవుల్
చల్లగ నీ భుజప్రబల సంగతి నుండుట నెంత యొప్పెడిన్ 155

భావము : ఉచిత రీతిని బలి దగ్గర కూర్చుండి వినయముతో అతని కాళ్ళను రెంటిని పట్టుకొని ఒత్తుచు మనస్సును మెత్తబడునట్లు చేయుచు పొగడుచు శ్రమ పెట్టనియట్లు ప్రేమతో ఇట్లనెను. నీ భుజబలము వలన దేవదానవులము మేము చక్కగా జీవించుచున్నాము.

ఉ॥ నీవు సముండవందరికి నిన్ను ప్రభుండుగ గొల్చి సమ్మతిన్
భావుకమున్ ఘటిల్ల నిరుపక్షమువారలునిట్టులుండుటన్
శ్రీవిభవోన్నతుల్ కొదవె సేమము తక్కువె యిందుకున్ చిరం
జీవిత మబ్బెనేని యొక సేగియు మమ్మును జేర నేర్చునే 156

భావము : నీవు మా యెడ మీ వారి యెడ సమానమైన ప్రేమగల వాడవు, నిన్ను ప్రభువుగ ఇరు పక్షములు సహృదయులై (మైత్రితో) ఇట్లు సుఖముగ ఉండుటచే మాకు సంపదలు మేలు తక్కువగా లేదు. సుఖము తక్కువగా లేదు. ఇట్లుండగా మాకు మృతిలేని జీవితము లభించినచో ఒక్క కష్టమును మాకు రాదు.

క॥ కావున మా కయ్యమృతము
గావించు విధంబు నొకటి గల్పించు తగన్
శ్రీవిభవాయుర్వర్ధిత
మై వేడుకగూడియుందు మనురక్తిమెయిన్ 157

భావము : మేము అమృతము పొందుటకు తగిన వసతి కలుగజేయుము. సంపదలతో, సుఖముతో ఆయువువృద్ధి అగుచుండగా ఉత్సాహముతోను అనురాగముతోనూ కలిసియుందుము.

ఉ॥ ఉండుటకింత దోచెనిది యొప్పగునేనియు చిత్తగించి దో
ర్దండబలప్రభావముల దర్పితులై తగు దేవదైత్యరా
ణ్మండలి కానతిమ్ము హరిమన్నన దుగ్ధపయోధిద్రచ్చన
క్కాండనిధిం జనించు నొడికంబుగ నందమృతంబు లీలమై 158

భావము : చక్కగా కలిసి యుండుటకు ఈ పద్ధతి తోచినది ఇదిసరియైనదో భుజ బలముచే గొప్పవారైన దేవదానవుల నాయకులకు క్షీరసముద్రమును చిలుకుటకు ఆజ్ఞ యిమ్ము ఆ జలధి నుండి ఒప్పుగ అపూర్వమైన అమృతము వెల్వడును. (కాండనిధి=సముద్రము)

ఆ॥ అమృతసేవ జేసియాయురారోగ్యముల్
గలిగియున్న మనకు కలహమెట్టు
లొందనేర్చు కలహమొందిన సమబల్మి
కతన యోట మొకరికడను రాదు 159

భావము : అమృతము త్రాగి మృతిలేక ఆరోగ్యముతో నున్న మనకు జగడములు కలుగవు. కలిగినను సమానబలము కలవారగుటచే ఎవరికి ఓటమి యుండదు.

చ॥ అనవిని లెస్సయొప్పునిది యందరికిన్ సరి పాలవెల్లికిన్
మొనసిన కవ్వమెద్ది కడుమోపున నిల్పుటకేమి క్రిందటన్
పెనచి మథింపగా దగిన పెద్దయురజ్జువదేమి యింతకున్
వనజదళాయతాక్షు కృప బర్వినగాక నశక్యమేరికిన్ 160

భావము : అని వచింపగా విని బలి చక్రవర్తి అందరికీ ఇది మంచి పనే! పాలవెల్లిలో అమర్చుటకు తగిన కవ్వము ఏది? నీటిలో దానిని నిల్పుటకు దాని క్రింద బలమైన దేది? మరియు చుట్టి త్రిప్పుటకు పెద్దదైన బలమైన కవ్వపు త్రాడు తగినదేది? ఇవన్నియు ఆ విష్ణుకృప కలిగెనేని సమకూరగలవు. లేనిచో అవి లభింపజాలవు.

క॥ అనుచు బలీంద్రుడు బలికిన
మనమున నుప్పొంగి వజ్రి మరి యిట్లనియెన్
దనుజాధీశ్వర! యంతయు
ననుకూలంబగును పంకజాక్షునికరుణన్ 161

భావము : అని బలి పలికినంత మాత్రముననే ఇంద్రుడు మిక్కిలి సంతసించి, ఓ దానవేంద్రా! ఆ హరి కరుణచే అంతయును అనుకూలమగును.

వ॥ అని యనుజ్ఞాతుండై సకలదేవదానవసంఘంబులం గూర్చుకొని తదీయక్రమంబం తయు నెరింగించిన నందరు నానందకందళిత హృదయారవిందులై యమ్మందర నగంబు గొనితేర నుద్యుక్తులై చని 162

భావము : అని అనుమతిని పొంది దేవదానవులందరిని సమావేశపరచి కార్య క్రమమునకు తెల్పిన అందరు ఆనందముతో నిండిన హృదయములతో ఉప్పొంగిరి. వారెల్లరు మందరపర్వతము తెచ్చుటకు వెడలిరి.

ఉ॥ కాంచిరి భూనభోభరిత కాంచనరత్నరుచిప్రపూరితో
దంచితగండశైలశిఖరావృతమై ఫలపుష్పపూర్ణ స
త్కాంచనచూతముఖ్యకుజకాండసమృద్ధివిలాసభాసమై
మించి మదేభసింహమృగమేళనమై తగు మందరాద్రియున్ 163

భావము : భూమి, ఆకాశములను నిండిన బంగారు రత్నముల కాంతులు కలిగినదియు గొప్ప పెద్ద కొండకొమ్ములతో చుట్టబడి యున్నదియు, పూలుపండ్లు నిండుగానున్న కాంచనము మామిడి మొదలగునవి గొప్పచెట్లు అందముచే మిక్కిలి ప్రకాశించునదియు, మత్తగజాలు, సింహాలు మెండుగా కలదియు అయిన మందరాచలమును చూచిరి.

సీ॥ నిచ్చరాజసమున నచ్చరాంగనలుండ
రచ్చరాలైనట్టు పచ్చుఱాలు
కిన్నరీగాన ప్రసన్నరసార్ణవో
త్పన్నరాగానంద పన్నగములు
మండలీకృత మహాఖండలోపలభూరి
గండస్థ గైరిక మండలములు
గారుడమణిశృంగఘనసౌధవేష్టిత
చారుమందారశృంగారతరులు

తే॥ మలయపవమానమృదుయాన చలితసూన
గళితమకరంద వర్షిత కర్దమస్థ
కుంద కురువక మల్లికా బృందములును
పర్విగనుపట్టె నక్కుల పర్వతంబు 164

భావము : ప్రీతితో ఠీవితో దేవకాంతలు విశ్రాంతికై కూర్చుండుటకు పచ్చని ఱాలు కిన్నర వనితల అలరించు గానముల చక్కని ధ్వనులచే ఆనందమును పొందెడి పాములు, గుండ్రని పగుళ్ళులేని, గట్టివైన తిప్పలపై కాంతులు

చిమ్ము మణిశిలలు వృత్తాకార సముదాయములు గరుడపచ్చఱాలు గల కొమ్ములతో, ఎత్తైన మేడలను చుట్టుకొని యున్న సొగసైన మందార (దేవదారు) మామిడి తెల్లతెగడ చెట్ల నుండి వెడలిన గాలిచే మెల్లగా వానిపూల నుండి జారు తేనెల వానలచే కప్పబడిన మొల్ల, ఎఱ్ఱగోరింట, మల్లెల గుంపులును పర్వతమున విస్తరించియుండెను.

కులపర్వతాలు : 1. మెరుపు, 2. మందారము, 3. కైలాసము, 4. హిమాచలము, 5. నిషధము, 6. గంధమాదనము,7. రమణకము.

సీ॥ నీలగండ ప్రభాజాల తమిస్రంబు
లంబుజరాగ శృంగారుణంబు
తరుశిఖావరపుష్పతారకోపేతంబు
రవిశిలాకాంతి విరాజితంబు
ముకుళిత కిన్నరీ ముఖ పద్మనికరంబు
ఖగనిచయోద్ధిత కలకలంబు
వికసితాద్భుతహరివీక్షణకుముదంబు
నత్యున్నత విభాకరాస్తమయము

తే॥ నగుచు నద్భుత లీల సంధ్యాగమాత్మ
భ్రమకజనకంబు మరియు నభ్రంకషంబు
నయుతయోజన పరిమితం బంతలోతు
గలుగుమందరశైలంబు గనిరి మ్రోల 165

భావము : నీలవర్ణముగల బండలకాంతుల సమూహము యొక్క చీకట్లు పద్మముల యొక్క వన్నెలచే నిండిన కొమ్ముల ఎఱ్రదనము, చెట్ల కొమ్మల మేలైన పూవులనెడి నక్షత్రములు సూర్యకాంత శిలాకాంతుల వెలుగు ముడువడిన కిన్నెర కన్నెల ముఖములనెడి కమలముల సముదాయము, అతిశయించిన పక్షుల కిలకిలా రావములు, ఆశ్చర్యము కలిగించు సూర్యరశ్మి

సోకుటచే వికసించిన తామరపూవులు. తన ఎత్తుచే సూర్యుని కన్పట్టనీయనిదియై అద్భుతముగా సాయంసమయమైనదను తత్తరపాటును కలిగించుచు ఆకాశమును తాకుచు, పదివేల యోజనములు విస్తరించినదియు, అంతే లోతును కలిగినదియునైన మందరాచలమును చూచిరి.

మ॥ మరియునమ్మహనీయ మహీధరంబు బహుళ పరిమళ మిళిత నవ ప్రసవ విసరభరిత కుందకురువకమల్లికావల్లికా వేల్లీకృత చందనమందారచంపక పనసామ్రతరుపరివేష్టిత విశాల మంటపోపమానసురవరమణివేదికా ప్రదేశ శశి శిలామయ వేదికావృత నిరంతరలతాంత నిష్యందదురంత ప్రవాహ ప్రదేశ ప్రమర్దితకమలకుముద కల్హారకోకనవ ప్రముఖ కుసుమబృందమకరంద పానానంద మదవదిందిందిర సందోహ సంగీత సంగతానంద వీణావాద్య ప్రమాణానవద్యగాన విద్యాధరాంగనా కేళికా డోలికాకార మాధవీలతావితానయుత పుష్పగుల్మాయతన సందోహవిభాసితంబును,

సితకర కర విలసిత వివిధ కుసుమ వాసనాసంకలిత శీతలవాత పోత ప్రచార ప్రదేశమాకంద ఫల రసాస్వాదన నవ పల్లవ ఖాదనమోద శుకపిక నికర కల కల ధ్వాన సంకలితంబును.

కలిత కాంచన కల ధౌత కమల రాగ బలభిదుపల వజ్ర మయకందరాంతర శశి కాంత ప్రస్పృత జల ప్రవాహ తటనికట సైకత స్థల విలసిత సప్తపర్ణికా నిచయాంతర కర్పూరసార మిళిత క్రముక పున్నాగ నారికేళాగరుతరుమూల నిత్య ప్రసక్త మృగ మద సౌరభ ఘుమంఘుమిత దశ దిశావలయంబును

వలయీకృత ప్రచారచారణ సిద్ధ గంధర్వ విమానానేక సహస్ర పరి శోభిత నభోభాగ వరిచ్ఛన్న శిఖర స్థిత నవరత్న రుచి వితాన చిత్ర వర్ణ కేతనాభిరామంబును

రామణీయక విశాల శీతల మంద పవనోపహతవికీర్ణ నానా తరుశాఖా గళితప్రసవ వినిర్మాణ చంద్రకాంత వేదికాస్థల నానాచిత్రరంగవల్లికామధ్యా

నవరతామంద మహానంద వనేందిరాతాండవాలోకనాఖండలవేదండగామినీ కచనిచయనిరసిత ప్రచురతర తరుశిఖర సుఖవసిత శిఖి సముదయంబును,

సముదయా పరిమిత వర్షధారాముక్తాదామాభిరా మవితానాయ మానకాదంబినీ సంజనితముక్తా ఫలసంగ్రహణోత్సాహ చారణ కుమార లంఘనలాఘవ విహరణ సమయ ప్రచిత కాంచన చేలా విసరద్విద్యుల్లతా ప్రదీప్తంబును, ప్రదీప్తకనకరుచివిడంబితద్వార గేహళీయుత బహుళ గుహాభవన సింహనఖవిదళిత మత్తేభ కుంభ జనిత మౌక్తిక రంగవల్లికా విరాజమానబహిః ప్రదేశ భాసురంబై యొప్పు నమ్మందర పర్వతంబు గనుంగొని 166

అర్థము : ఆ మహనీయ కుధరంబు= ఆ గొప్ప మందర పర్వతము, బహుళ పరిమళ మిళిత నవప్రసవ విసరభరిత, ఎక్కువైన సువాసన కలిసి క్రొత్త విరిచియైన పూలతో నిండినదై, కుంద కురవక మల్లికావల్లికా వేల్లికృత= మొల్లల ఎర్రగోరింట, జాజిమల్లెల తీగెలచే చుట్టబడి, చందనమందార చంపక పనస ఆమ్ర తరువేష్టిత= గంధము, దేవదారు, సంపెంగ, పనస, మామిడిచెట్లు నలువైపుల విస్తరించిన, విశాలమంటప+ఉపమాన+ వెడల్పైన పర్ణశాలలను పోలినవైన, సురవర మణి వేదికా+శశి శిలామయ+వేదికా అవృత= ఇంద్రనీలమణుల, చంద్రకాంతమణుల తిన్నెల గుమిచేకూడినదై, నిరంతరలతాంత నిష్యంద దురంత ప్రవాహప్రదేశ= ఎల్లప్పుడును ఆయా తీగేల కొనలనుండి ఎడతెగక ప్రవహించు ఆయా చోట్లలో ప్రమర్థిత కమల కుముద కల్హార కోకనద ప్రముఖ కుసుమ బృంద= బాగుగా పెరిగిన, తెల్ల తామర, తెల్ల కలువ, ఎఱుపు తెలుపు కూడిన కలువ, ఎర్రని తామర మొదలైన పూలగుత్తు లందు, మకరంద పాన+ఆనంద మదవత్ ఇందిందర సందోహ= తేనెను క్రోలి పొందు సంతసముచే మైమరచి మదించిన, తేటుల గుంపుల, సంగీత ఆనంద వీణా వాద్య ప్రమాణ అనపద్యగాన= మృదువైన స్వరములు చేరిన ఆనంద భైరవిని అలాపించు ఉత్తమమైన వీణావాద్యముల పాటలతో, విద్యాధర+అంగనా కేళికా డోలికా+ఆకార= విద్యాధరయువతుల ఆటలు

గల ఊయలవలె చెలగుచున్న, మాధవీలతా వితానయుత పుష్పగుల్మ ఆయతన సందోహ విభాసితంబును= గురివెంద తీగెల సమూహముతో కూడిన పూలగుత్తుల పెక్కు పందిళ్ళతో వెలుగునదియు,

సితకరకర విలసిత= సూర్యుని కిరణములచే విప్పారిన, వివిధ కుసుమ వాసనా= పలురకాలైన పూల వాసనలచే, సంకలిత శీతల వాత పోత ప్రచార= చక్కగా కూడిన చల్లని పిల్ల వాయువుల తాకిడులు గల, ప్రదేశమాకంద ఫలరస+ఆస్వాదన= చోట్లలో మామిడిపండ్ల రసమును గ్రోలుట చేతను, నవ పల్లవ ఖాదన= క్రొత్తవైన చిగుళ్ళను తినుట చేతను, ముద= సంతోషమును పొందిన, శుకపిక నికర కలకల ధ్వాన సంకలితంబును= చిలుకలు, నెమళ్ళ గుంపుల యొక్క సందడి కలిగినదియు.

కలిత కాంచన కలధౌత= పొందిన బంగారు వెండి, కమలరాగ= ఎర్రని పద్మరాగములు, బలభిద్+ఉపల= ఇంద్రనీలములు, వజ్రములు=తెల్లని రవలు, కందర+అంతర=గుహలలోపలి భాగమున నున్న, శశికాంత= చంద్రకాంతమణుల శోభలచే ప్రసృత= నిండిన, జలప్రవాహ= నీటి ధారలు కలిగిన, తట నికట సైకతస్థల విలసిత= ఒడ్డు దగ్గర నున్న ఇసుక తిన్నెలపై ప్రకాశించు, సప్తవర్ణికానిచయ+అంతర= ఏడాకులు అరటిచెట్ల గుంపుల నడుమ నుండి వెల్వడు, కర్పూరసార మిళిత= కప్పురపు సువాసనలు కలిసిన, క్రముక= పోక, పున్నాగ= జాజి, నారికేళ= కొబ్బరి, అగరు= చందన, తరుమూల= చెట్ల మొదళ్ళలో, నిత్యప్రవక్త= ఎల్లప్పుడును కలుగు, మృగమద= కస్తూరి, సౌరభ= పరిమళములు, ఘుమంఘుమిత= ఘుమ్మని విస్తరించిన వాసనల జల్లులుగల, దిశావలయంబును= దిక్కుల గుండ్రని భాగంబులు,

వలయీకృత ప్రచార= చుట్టును తిరుగుచున్న చారణసిద్ధ గంధర్వ= ఆకాశ గమనులైన చారణులు, సిద్ధులు, గంధర్వుల, విమాన+అనేక

సహస్రపరిశోభిద= ఆకాశమందు చరించు పెక్కువేల తేరుల అందముతో, నభోభాగ పరిచ్ఛన్న= కప్పబడిన ఆకాశ ప్రదేశమందుగల, శిఖర స్థిత నవరత్న రుచివితార= కొండ కొమ్మలందు వెలుగు తొమ్మిది రకములకాంతుల సముదాయముల, చిత్రవర్ణకేతన+అభిరామంబును= వింతవింత వన్నెల పతాకములతో రమ్యమైనదియును

రామణీయక విశాల శీతల మందపవన= ఇంపైన ఇస్తరించిన చల్లని మెల్లగా వీచుగాలి, ఉపహత వికీర్ణ నానా తరుశాఖా= సోకుటచే బాగుగా క్రిందికి త్రోయబడిన పెక్కుచెట్ల కొమ్మలనుండి,గళితప్రసవ= జారిన పువ్వుల, వినిర్మాణ=చక్కగా ఏర్పడిన, చంద్రకాంత వేదికాస్థల= చంద్రకాంత శిలల తిన్నెలమీద, నానాచిత్రరంగ వల్లికామధ్య= పెక్కు వింతయైన ముగ్గుల వరుసల నడుమ, అనవరత+ఆమంద+మహత్+ఆనంద= ఎల్లవేళలా మితిలేని గొప్ప సంతసమును పొందు, వన+ఇందిరా తాండవ+ఆలోచన= వనలక్ష్మి ఆ వేళ నాట్యమును చూచు, ఆఖండల వేదండ గామినీ= ఇంద్రలోకమునకు చెందిన ఏనుగుల వంటి నడక గల యువతుల, కచనిచయ నిరసిత ప్రచురతర= జుట్టులచే నిరసింపబడిన (నెమళ్ళ కంటే అందమైన) ప్రచురతర తరుశిఖర= విస్తరించిన చెట్ల కొమ్మలపై, సుఖ వసిత శిఖ సముదయం బును= సుఖముగా విశ్రమించియున్న నెమళ్ళ సమూహమును కలదియును,

సముదయ+అపరిమిత వర్షాధార= మిక్కిలి ఎక్కువైన నీటి తుంపరుల జడి. ముక్తాదామ+అభిరామ వితానయామాన= ముత్యముల నరములవలె విందులై మేలు కట్టులై! కాదంబినీ సంజనిత ముక్తాఫల= మేఘముల నుండి పడుచున్న ముత్యములను, సంగ్రహణ+ఉత్సాహ= పొందుటకు త్వరపడు, చారణ కుమార= ఆకాశగమనులైన చారణ కుమారుల యొక్క, లంఘన లాఘవ విహరణ సమయ= సులభముగ ఎగురుచు తిరుగు కాలమున, ప్రచిత కాంచన చేలా= ప్రాగైన బంగారు కాంతిగల వస్త్రములు, విసరత్

విద్యుత్+లతా ప్రదీపంబును= వెల్వడించు మెరుపు తీగల వెలుగులచే బాగుగా మెరయుచున్నదియును.

ప్రదీప్త కనక రుచి విడంబిత= చక్కగా మెరయుచున్న బంగారు కాంతులతో వ్రేలాడు, ద్వారగేహాళీయుత= ఇంటి ముంగిళ్ళ గడపలతో, బహుళ గుహాభవన= మిక్కుటమైన గుహలుగా ఉన్న నివాసములలో, సింహనఖ విదళిత= సింహముల గోళ్ళచే చీల్చబడిన, మత్తేభ కుంభ జనిత= మదించిన ఏనుగుల స్థలముల నుండి వెల్వడి ఏర్పడిన, మౌక్తిక రంగవల్లికా విరాజమాన= ముత్యాల ముగ్గులతో ప్రకాశించు, బహిః ప్రదేశ భాసురంబై= బయళ్ళతో సుందరములై, ఒప్పు+ఆ+మందార పర్వతంబును కనుంగొని, ఈ వచనమందు దీర్ఘ సంస్కృత సమాసములు ఏడు ఉన్నవి. మొదటిది చాలా నిడుపైనది. ముక్త పదగ్రస్త శబ్దాలంకారములు కలదై శోభించుచున్నది.

భావము : ఆ గొప్ప మందర పర్వతము, మిక్కిలి సువాసనలు కలిగిన క్రొత్తవైన, విరివియైన పూలతో నిండినదై, మొల్ల ఎఱ్ఱగోరింట జాజిమల్లెల తీగెలచే చుట్టబడి గంధము, దేవదారువు సంపెంగ పనస, మామిడిచెట్లు నలువైపుల విస్తరించి చాలా వెడల్పైన పర్ణశాలలను పోలినవైన ఇంద్ర చంద్ర కాంతమణుల తిన్నెల గమిచే కూడినదై ఎల్లప్పుడును తీగేలందు ఎడతెగక పూలు గుత్తులపై నుండి తేనెను క్రోలుటచే మైమరచి పొందు సంతసముచే మదించిన తేటుల గుంపుల మృదువైన వాని స్వరములు చేరిన ఆనందభైరవి రాగమును ఆలాపించు విద్యాధరకాంతుల ఉత్తమమైన వీణావాద్య గానముల ఆటలతో చెలగుచు ఊయల వలెనున్న గురివెంద తీగల పూలగుత్తుల పందిళ్ళతో వెలుగుచున్నదియు.

సూర్యుని కిరణములచే విప్పారిన పలు రకాలైన పూలవాసనలచే చల్లని పిల్ల వాపుయుల తాకిళ్ళుగల చోట్లలో మామిడిపండ్ల రసమును క్రోలుటచే, క్రొత్తవైన చిగుళ్ళను తినుటచేతను, సంతసించిన చిలుకల నెమిళ్ళ గుంపుల

యొక్క సందడికలదియును, కప్పురపు సువాసనలు, ఇతర పరిమళముల జల్లులు దిక్కులలో వ్యాపింప జేయుచున్నదియును,

ఆకాశగమనులైన చారణ సిద్ధ గంధర్వుల వేలవిమానములు కలదియును

ఇంద్రలోకానికి చెందిన యువతులు విహరించుచుండగా, నానా తరుశాఖలపై సుఖముగా వసించు నెమిళ్ళ సముదాయము కలదియును,

మేఘముల జల్లులు నుండి పడునట్టి ముత్యాలను సేకరించుటకు వచ్చెడి చారణ కుమార విహారముల వలన, వారి వస్త్రకాంతుల మెరపు తీగెల జ్యోతులను తళతళమని ప్రసరింప చేయుచుండగా మెరయుచున్నదియును,

మత్తగజాల గండస్థలముల నుండి సింగములు వానిని చీల్చుట వల్ల క్రిందపడ్డ ముత్యాలు ముగ్గులై వెలుగుచు అందమును చిందుచున్నదియును అయిన మందర పర్వతమును దేవదానవులు చూచి.

ఉ॥ పట్టుడు చుట్టుడందరును పాదుగ దల్పుడు వారు వారలున్
నెట్టనపాదముల్ ధరణి నిల్పగనూదుడు వచ్చె నేడహో
గట్టిది నాగనెంత త్రిజగంబులు మ్రింగగజాలు వీరు లిం
దెట్టును నొక్కరొక్కరుని యేపుననార్చుచు చుట్టిరయ్యెడన్ 167

భావము : పట్టండి, చుట్టును చేరండి, కొండపాదమును క్రింది భాగమును కదిలించండి ఎవరికి వారు (వారు వారలును) గట్టిగా మీ పాదాలను నేలపై ఆనించి నిల్చుకొనుటకు ప్రయత్నించి, ఊపండి. నేడు అవకాశము వచ్చినది. ఇదెంత గట్టిదైననేమి? (నాగన్+ఎంత అనగా ఎంత) ఇందుగల వీరులు మూడు లోకాలను ఎట్టులైనను (ఏమైననూ సరే) ఒక్కొక్కరును మ్రింగగలవారు అని ఉద్రేకముతో అప్పుడు కేకలు వేయుచు కొండను చుట్టిరి.

వ॥ మరియును 168

సీ॥ సింహనాదము చేసి చెంగలించెటి వారు
పౌరుషంబుల చెడుబాడువారు
మట్టుమీరిన బల్మి మల్లులయ్యెడివారు
నేనెనేనెయటంచునిగుడువారు
యిందరేటికి తలడిందుకు ననువారు
మించి బాహువు లప్పళించువారు
నా బల్మికిది నిల్చునా చూడు మనువారు
కదలింతు మని యూచ గణగువారు

తే॥ నగచునగ్గిరిచుట్టు బాహాబలంబు
లుగ్గడించుచు గేరుచు నుప్పరంబు
లెగయుచును నొక్క పెట్టున నేపు మీరి
జవము లడరగ దేవదానవులు గడగి 169

భావము : గొప్ప ధ్వనులను చేసి, ఉప్పొంగువారు తమ పరాక్రమమును (పెడన్+పాడువారు) విపరీతముగా పాడువారును, (పొగడుకొను వారు) మితి మీరినబలము కలిగిన వారగుటచే తాము మల్లులమని(యోధులము) తలంచువారు. ఈ పనికి నేను తగుదును, నేను తగుదును అని వచించుచు నిక్కువారును, ఈ పనికి ఇందరు ఎందుకు? తొలగుడు (తలడు+ఇందుకున్) అనువారు, ఒడలు మరచి, భుజాలను చఱచువారును, నా బలానికి ఈ కొండ నిలుచునా చూడుము అనువారు కదలించెదము అని ఊచుటకు ప్రయత్నించువారును అరచుచు ఆ కొండ చుట్టూ తమ తమ భుజబలములను గొప్పగా చెప్పుకొనుచు (కేరు= ఉత్సాహించు) ఉత్సాహముతో పైకి ఎగురుచు, ఒక్కసారిగా, ఎక్కువగా, వేగిరపాటుతో తమ శక్తులన్నింటిని కలయజేసి దేవదానవులు సముద్రమును చిలికిరి.

ఉ॥ పట్టుమహార్భటుల్ చెలగ పాదము లూదుక యింత వంగి మేల్
పట్టుగ దేవదైత్యులిరుపార్శ్వములన్ దగబూని యొండొరుల్
తొట్టిన పౌరుషంబు జవ దోర్బలముల్ మెరయంగ ధీరులై
యట్టటు చూచి యెత్త నిసుమంత కదల్పగలేక ఖిన్నులై 170

అర్థము : పట్టు= పట్టు, మహత్+అర్భటుల్= గొప్ప హాహాకారములు చేయుచు, పాదమును ఊదుక= గట్టిగా ఆనించి, ఇంత వంగి= కొంత వంగినవారై, మేల్ పట్టుగ= మేలైన పట్టుగ బిగువుతో, దేవదైత్యులు=దేవతలు రాక్షసులు, ఇరుపార్శ్వములన్= రెండు వైపులందు, తగవూని, ఒండొరుల్= ఒకరికి ఒకరు, తొట్టిన= ఎక్కువైన, పౌరుషంబు జవదోర్భలముల్, మెఱయంగన్= పరాక్రమము, వేగము, భుజబలము ప్రకటముగా, ధీరులై= ధైర్యమువహించి, అట్టు అటు= ఇరువైపులను, చూచి ఎత్తన్= ఎత్తుటకు ప్రయత్నించగా ఇసుమంత= కొంచెము కూడ కదల్పజాలక, ఖిన్నులై= దిగులు చెందినవారై,

భావము : పట్టుదలతో గొప్ప అరుపులతో, పాదాలను నేలపై ఆనించి వంగినవారై బిగువుతో దేవదానవులు అతిశయించిన, తమ శక్తులతో ధైర్యముతో, ఇరువైపుల నుండి ఒక్కపట్టున ఎత్తుటకు ప్రయత్నించిరి. కానీ ఆ కొండను కొంచెమైనను కదల్చలేక చింతించిరి.

మ॥ పురుహూతుం గని యేమి కార్యమిది తెంపుం బెంపు వాటిల్లగా
సురలున్ రాక్షసు లందరున్ గణగి యెచ్చున్ బల్మి నీ శైలమున్
బరమాణంతయునుబ్బు నెత్తుటకు మోపంజాల రైరక్కటా
శరధిన్ వైచుటయెట్లు తర్చు టెటులున్ సర్వాఢ్యు లింకెవ్వరో 171

అర్థము : పురుహూతున్=ఇంద్రుని, కని, ఏమి కార్యము ఇది? మా పని ఇట్లయినదే (ఎత్త లేకపోయితిమే), తెంపున్ పెంపున్+పాటిల్లగాన్= సాహసము, అధిక్యము కలుగగా, సురలును రాక్షసులును అందరును,

కణగి= పూని, ఎచ్చున్ బల్మిన్= ఎక్కువ శక్తితో, ఈ శైలమున్= ఈ పర్వతమును, పరమాణువు అంతయున్= మిక్కిలి కొంచెమైనను, ఉబ్బున్= ఉత్సాహముతో ఎత్తుటకున్, ఓ పన్ చాలరైరి= తగిన శక్తిలేని వారైరి, అక్కటా= అయ్యో! శరధిన్= సముద్రములో వైచుట ఎట్లు= (దీనిని కొనిపోయి) ఎట్లు వేయగలము? తీర్చుట ఎటులన్= (సముద్రమును) ఎట్లు చిల్కగలము? సర్వ+ఆఢ్యులు+ఇంక+ఎవ్వరో?= అన్ని శక్తులు గలవారు ఇంక ఎవ్వరున్నారు?

భావము : ఇంద్రుని చూచి దేవదానవులు మేము ఈ సుందర పర్వతమును కొంచెమైనను కదల్పలేక పోతిమిగదా! అయ్యో! ఈ పర్వతమును సముద్రమునకు తరలించుట ఎట్లు? ఇంక సముద్రమును ఎట్లు త్రవ్వగలము? ఈ కష్టకార్యమును నిర్వహింపగల సర్వశక్తిమంతుడు ఎవ్వరున్నారో? అని పల్కిరి.

వు = పురుహూతుడు యజ్ఞములందు ప్రచురముగా పిలువబడువాడు.

చ॥ అనుసురదానవావలుల నందరగాంచి సురేశ్వరుం డనున్
మనముల నింత యేమిటికి మల్లడినొందగ నెట్టువేళలన్
మనలను బ్రోవనీశ్వరుడు మాధవుడుండగనంచునాత్మలో
వనజదళాయతాక్షుపదవారిజముల్ మది నిల్పి మ్రొక్కినన్ 172

భావము : సురల అసురల దండులను అందరిని చూచి ఇంద్రుడిట్లనెను. మనస్సులలో దీనికై ఇంత చింతతో బాధపడుట ఏల? ఏ సమయములోనైనను మనలను ప్రోచు మహావిష్ణువున్నాడు కదా! అని తనలో తలచి.

కమలాక్షుని కమలముల వంటి పాదములను మనస్సులో నిల్పి ప్రార్థన చేయగా,

ఉ॥ వారిజసూతితో నటకు వచ్చిన శ్రీహరి గాంచి పొంగి పా
కారి తదంఘ్రిపద్మముల కర్మిలి వందన మాచరించి దై
త్యారి బుధాత్మపంకజ విహారి ధృతాంబు భవారి శౌరి! యీ
భూరినగంబు నెత్తుటకు బోలదు బుద్ధి వహింప వేథయున్ 173

అర్థము : వారిజసూతితో= పద్మమందు పుట్టిన బ్రహ్మతో వచ్చిన శ్రీహరిన్, కాంచి= చూచి, పొంగి= మిక్కిలి సంతసించి, పాక్+అరి= పాకాసురుని శత్రువు ఇంద్రుడు, తత్+అంఘ్రి పద్మములకు= ఆ శ్రీహరి కమలముల వంటి పాదములకు, ఆర్మిలి= ప్రేమతో, వందనము+ఆచరించి= నమస్కరించి, దైత్య+అరి= ఓ రాక్షసులకు విరోధుడా! బుధ ఆత్మ పంకజ విహారి= సజ్జనుల మనస్సు అనెడి కమలములతో విహరించువాడా! ధృత+అంబుభవ+అరి= ఆదరింపబడు, నీటిలో పుట్టిన నివాత కవచులనెడి పేరుగల రక్కసులకు శత్రువైనవాడా! శౌరి= శ్రీహరీ, ఈ భూరినగంబున్= ఈ పెద్దకొండను, ఎత్తుటకు, పోలదు= సాధ్యముకాదు, దయతో, బుద్ధివహింపవే, ఈ కొండను పెకిలించి తీసుకొను ఉపాయము గూర్చి ఆలోచింపుమా?

భావము : బ్రహ్మతో కూడ శ్రీహరి దేవదానవుల కడకు రాగా ఇంద్రుడు చూచి ఆతని పాదములకు నమస్కరించు ఓ శ్రీహరీ, ఈ కొండను ఎత్తుకొని పోవుటకు మాకు సాధ్యము కాలేదు. ఈ విషయమై దయతో ఆలోచించి మాకు సాయము చేయుమా!

చ॥ అనిన యనంతునిం బిలిచి యద్రి పెకల్చి సురాసురాళితో
గొని కలశాబ్ధి తీరమునకున్ జను డన్న మహా ప్రసాద మం
చనుపమలీల జుట్టు దివిజాసురకోటికి నద్భుతంబుగా
మొనసి యనంతు డెత్త నది మోచుకుపోవుచు గాంచి రయ్యెడన్ 174

భావము : శ్రీహరి ఆదిశేషుని పిలిచి, కొండను కదిలించి పాలవెల్లి తీరానికి తీసుకొని పొమ్ము అని ఆనతియ్యగా, అనంతుడు సమ్మతించి, సాటిలేని

ఒయ్యారముతో కొండను చుట్టినవారై దేవదానవులు ఆశ్చర్యపడుచుండగా ప్రయత్నించి ఎత్తికొని పోవు సమయమున వారు క్షీరసముద్రమును కాంచిరి.

(వ్యు) కలశ+అబ్ధి= అమృతము కొఱకైన క్షీర సముద్రమును త్రచ్చుటచే కుండగా ఏర్పడినది.

మహాప్రసాదము : యజమానులు తమ సేవకులకు పనులు చెప్పినపుడు వారు తమ గొప్ప అనుగ్రహము (దయ) అని తమ సమ్మతిని తెల్పుదురు.

సీ॥ విశ్వంభరుండైన విష్ణుని సత్కీర్తి
పూనికె నతి శుభ్రమైనదాని
హరికథామాలిక లట్టుల మిన్నంది
యమితంబులగు తరంగములదాని
మహిమమించిన విష్ణుమాయ యిట్టదియన
నత్యంత గంభీరమైనదాని
శ్రీహరికృపకార్యసిద్ధియౌ నన్నట్లు
బహుతరంబగు మహార్భటులదాని

తే॥ కలిత విచలిత తిమి తిమింగిల విశాల
పుచ్ఛవిక్షేప జనిత విస్ఫుర సదమృత
కణవిమిశ్రిత నక్షత్రగణ విలాస
భాసమానోన్నతైకనభంబుదాని **175**

అర్థము : విశ్వంభరుడు+ఐన= విశ్వమును పాలించునట్టి, విష్ణుని సత్కీర్తి పూనికన్= విష్ణుని గొప్ప కీర్తియొక్క ప్రభావముచే, అతి శుభ్రమైనదానిన్, హరికథా మాలికలు+అట్టులన్= విష్ణు కథల నరములవలె, మిన్ను+అంది= ఆకాశము వరకు వ్యాపించి, అమితంబులగు తరంగముల దానిన్= మిక్కిలి ఎక్కువైన అలలు గల దానిని, మహిమమించిన గొప్పతనము ఎదిగిన, విష్ణుమాయ= విష్ణువు యొక్క విలాసాలు, ఇట్టిదె+అనన్= ఇటువంటిది

అనగా, అత్యంత గంభీరమైన దానిన్= మిక్కిలి లోతైనదియు, విస్తరించినదియు అయిన దానిని, శ్రీహరి కృప= విష్ణువు యొక్క దయచే, కార్యసిద్ధి అవున్= పనులు నెఱవేరును, అన్నట్లు, ఆ బహుతరంబకు= వివిధములైన మహత్ అర్భటుల దానిని= పెక్కు గొప్ప ఘోషలు కలదానిని, కలిత= చేరిన, విచలిత= మిక్కిలి చలించుచున్న, తిమి తిమింగలముల యొక్క, (సముద్రములో సంచరించు పెద్ద చేపలు) విశాల= పెద్దదైన, పుచ్ఛ= తోకల యొక్క, విక్షేప= వేగముగా తిప్పబడిన కదలికలచే, జనిత= కలిగిన, విస్ఫుర= మిక్కిలి గోచరించు, సత్+అమృతకణ= చక్కని నీటి తుంపరలతో, విమిశ్రిత= బాగుగా కలిసిన, నక్షత్రగణ విలాస భాసమాన= నక్షత్రముల సమూహముల సౌందర్యములతో ప్రకాశించు, ఉన్నత+ఏక నభంబుదాని= చాలా ఎత్తువరకు వ్యాపించిన, ఆకాశము కల దానిని.

భావము : విష్ణుని కృప వలన కల్గిన కీర్తియొక్క ప్రభావముచే శుభ్రమైన దానిని, విష్ణుకథల పరంపరలవలె ఆకాశమును తాకు లెక్కింపజాలని అలలు కల దానిని గొప్పవైన విష్ణుమాయలు ఇటువంటివని నిరూపించునట్టి లోతైన, విశాలమయిన దానిని విష్ణు కృప యున్ననే పనులు ఫలించునని చెప్పుటకై గొప్ప ధ్వనులు కల దానిని, తిమి తిమింగిలములు విరివిగా తిరుగుచుండగా వానిని తోకల వేగముచే కలిగిన నీటితుంపరులు, ఆకాశమందలి నక్షత్రముల గుంపులతో కలసి, ప్రకాశించు చాలా ఎత్తైన ఆకాశ ప్రదేశము కల దానిని (మరియును)

చ॥ తరల తరంగ సంభవ సుధాకర శీకర సిక్త శీతలో
త్కరతటవర్ధమాన ఘనకాంచన చూతకురంట చందనా
గరువట నారి కేళ తరుకాండ శిఖావృతకుందమల్లికా
స్ఫురితలవంగలుంగ పరిశోభితమై తగు దుగ్ధవార్నిధిన్ **176**

అర్థము : తరల తరంగ సంభవ= చలించుఅలలచే కలిగిన, సుధాకర శీకర శీతల+ఉత్కట= తెల్లని నీటి తుంపరలచే తడిసిన చల్లని ఎక్కువైన, తటా

వర్ధమాన ఘన తీరమందు పెరిగిన పెద్ద, కాంచన= పొన్న, చూత= మామిడి, కురంట= గోరంట, చందన=గంధము, అగరు= మంగళకరమైన పొడి, వట= మఱ్ఱి, నారికేళ= కొబ్బరి, తరుకాండ= చెట్ల బోదెల, శిఖా+అవృత= పై కొమ్మల చుట్టుకొన్న, కుంద మల్లికా= మొల్లలు, మల్లెలు, స్ఫురిత= కన్పట్టు, లవంగ లుంగ పరిశోభితమై= లవంగము మాదీఫలము మొదలైన వానిచే చక్కగా, తమ దుగ్ధవార్నిధిన్= ఒప్పునట్టి క్షీర సముద్రమును.

భావము : చలించు అలలచే కలిగిన తెల్లని నీటి తుంపరల చల్లదనముతో కలిసి, తీరమందు బాగుగా పెరిగిన వివిధ వృక్ష సముదాయముచే, చక్కగా అందము కలదైన ఆ క్షీర సముద్రమును.

క॥ కనుగొని యప్పర్వతమును
వననిధితీరమున డించి వనజాక్షునితో
నని రిందుకు సూత్రమునే
యనువున సాధింపవలయు నంబుజనాభా 177

భావము : చూచి, ఆ+పర్వతమును సముద్రతీరమందు దించిన, తర్వాత శ్రీహరితో దేవదానవులు ఇట్లనిరి, ఓ కమలముల వంటి కన్నులు కలవాడా! ఈ కవ్వమైన కొండకు అవసరమైన త్రాటిని ఏ ఉపాయముతో సాధింపగలవో!

చ॥ అన విని వాసుకిం గని సురాసురవర్యులకున్ హితంబుగా
ఘనకలశాబ్ధిదర్చుటకు కవ్వము మందర మీవు చిల్కు త్రా
డునునగు టొప్పు నెందుల గడున్ బలశాలివి నీవె కాక నే
ఘనుడును నోప డన్న ననుకంపముతో నత డుత్సహించినన్ 178

భావము : అని దేవదానవులు విన్నవింపగా వినిన శ్రీహరి వాసుకి సర్పరాజుకు చూచి, దేవతలకు దానవులకు మేలు చేయుటకై, పాలవెల్లిని త్రచ్చుటకు, కవ్వమై మందర పర్వతమును నీవు చిల్కు త్రాడుగా ఉండుటకు తగినవాడవు, ఎచట నైనను నీవే మిక్కిలి బలిశాలివి గదా! ఏ గొప్పవాడును

ఆ పనికి ఓపడు (తగడు) అని కోరగా (అనుకంపముతో) జాలి గలవాడై వాసుకి ఆ పనిచేయుటకు ఉత్సాహపడెను.

మ॥ సురలున్ రాక్షసులున్ వడిన్ గిరివిషాస్యుం జుట్టి దుగ్ధాబ్ధిలో
వరసత్వంబుల నెత్తి డించి వడి దర్వన్ బూనుచున్నంతలో
శరధిన్ మున్గి బుడుంబుడు ధ్వనుల నాశాచక్రమున్ లీలగా
భరమైనన్ శిలనాననలేకవిచలద్భావంబులం దీనులై 179

భావము : సురలును, రాక్షసులును వేగముతో (విష+ఆన్యున్) వాసుకిన్ గిరికి చుట్టి పాలవెల్లిలో తమ అధికమైన బలముతో ఎత్తి సముద్రములో దించి వేగముగా త్రచ్చుటకు పూనుకున్నంతలో ఆ పర్వతము సముద్రములో మునుగుచుండగా అప్పుడు కలిగిన బుడుం బుడుమను ధ్వనులు దిక్కులందు వ్యాపించినవి. ఆ పర్వతము భారమైనదగుటచే దేవతలు దానవులు దానిని పట్టుకొనలేక మిక్కిలి చలించిన వారై ఏమియు తోచక దిగులు చెంది...

శా॥ ఆహా! శైలము గ్రుంగె గ్రుంగె నిదెనీయంబోధిలో నింకమా
నాహాశక్తి సముద్ధరించి వడి నిల్వం జాల వీక్షించి మ
మ్మోహో కావుము కావుమయ్య తగ దీనోద్ధారకా శౌరియం
చాహాకారముతో సురాసురులు దైన్యం బంది తన్వేడినన్ 180

భావము : ఆహా! ఈ సముద్రములో ఈ కొండ క్రుంగి పోవుచున్నదే! ఇంక మా భుజబలము పోషించి (పెంచి) వేగముగా మునుగనీయక చేసి చక్కగా పరిశీలించి, మమ్ము ఓహో! (దయతో) తగినట్లు వెంటనే కాపాడుమయ్యా! దీనుల దుఃఖాలను తొలగించువాడా! శౌరీ! అనుచు హాహాకారాలు చేయుచు దిగులు చెంది తన్నువేడగా

సీ॥ ఉరుతరయోజనాయుత సంఖ్య వెడలుపు
నున్నతంబును వేయుయోజనములు

కడువజ్రమయమైన కర్పరంబును కుల
గిరులను గడుమించు చరణయుగము
గల మహాకూర్మమై కలశవారధి మధ్య
మందరశైలంబుక్రింద నిలిచి
చరణముల్ నాలుగు ధరణిగట్టుగ నూది
యుబ్బియెత్తిన నట యుర్విధరము

తే॥ కూర్మవిభువీపు చిప్పను కుదురుకొనిన
దేవదానవులెంతయు తెలివి మీర
చాలధైర్యంబు నాత్మల నూలుకొల్పి
కదలిరంబుధి దర్వ సమ్మదముతోడ 181

అర్థము : ఉరుతర+యోజన+అయుత సంఖ్య వెడలువు చాల పదివేల యోజనములు అంకెల వెడల్పు గలదియును (యోజన= 8 మైళ్ళు) వేయి యోజనములు, ఉన్నతంబును= ఎత్తును, కడు= మిక్కిలి, వజ్రమయంబైన కర్పరంబును= ఇంద్రుని ఆయుధము వజ్రము వంటి బలిష్ఠమైన తలచిప్పగలదియు, కులగిరులను కడుమించు= ఎనిమిది కులపర్వతాల కంటే పెద్దదైన, చరణయుగము= నాలుగు పాదములు (యుగము= నాలుగు (శ్ర.ర పుట 1078-పర్యాయ పదాలు) కల మహాకూర్మమై= మిక్కిలి గొప్ప తాబేలుగా, కలశ వారిధి మధ్య= పాలవెల్లి నడుమ మందర శైలంబు క్రింద నిలిచి, చరణముల్, నాలుగు, ధరణిగట్టుగన్= నేలను ఊతగా, ఊది= నొక్కిపట్టి, ఉబ్బి ఎత్తినన్= శరీరము పెంచి ఎత్తగా, అట= అచట, ఊర్విధరము= మందరము, కూర్మ విభువీవు చిప్పను= తాబేలు వీపు మీద, కుదురుకొనినన్= బాగుగా అమరగా దేవదానవులు, ఎంతయును తెలివిమీరన్= తమ తెలివితేటలు, చాల ధైర్యంబున్= తగిన ధైర్యమును, ఆత్మలన్= మరలా తమ తమ మనస్సులలో, నూలుకొల్పి= నిల్పుకొన్నవాడై,

అంబుధిన్= సముద్రమును, తర్వన్= త్రచ్చుటకు, సమ్మదముతోడ= ఎక్కువ సంతోషముతో, కదలిరి= సాగిరి...

భావము : విశాలమైన వెడల్పు అంతకంటే పదిరెట్లు ఎత్తు మిక్కిలి గట్టిదైన తలచిప్ప, కులపర్వతము వలె చెదరని నాలుగు పాదాలు కలిగి, గొప్ప ఆకారముతో తాబేలు మందర పర్వతము క్రిందజేరి దానిని పైకి ఎత్తినది. దేవదానవులు సంతోషముతో సముద్రమును చిల్కుటకు మొదలు పెట్టిరి.

నాలుగు : (పర్యాయపదాలు) గతి, యుగము వార్ధి మొదలగునవి.

కులపర్వతములు : ఆరు, ఏడు, ఎనిమిది సంఖ్య కలవు

చ॥ అమరులు మున్నుతోక తమదై వడిబట్టిన దైత్యదానవుల్
తమరు గ్రహింపబోదు రనితారె శిరంబులుబట్టబూన వి
క్రమ పటురోషముల్ మెరయ రాక్షసుల న్విషవహ్నిరాజి పె
ల్లుమియుటలన్ గ్రహిం పసుర లూదిరిపుచ్ఛమునాత్మసమ్మతిన్ 182

భావము : దేవతలు త్వరలో వాసుకి తోకను పట్టుకొనిరి. రాక్షసులు శిరస్సును, దేవతలు పట్టుకొందురని తామే తమ పరాక్రమము, రోషము పైకొనగా పట్టుకొనిరి. వాసుకి త్రచ్చునపుడు ఎక్కువగా విషమనెడి నిప్పు కణజాలమును ఉమియగా రాక్షసులు వాని వేడిమిని గ్రహింపవలె దేవతలు సంతసించినవారై వాసుకి పృచ్ఛమునే (తోకనే) పట్టుకొనిరి.

క॥ ఇట్టులగనుకొని పదములు
గట్టిగ నాలీఢనియతి గడునూది యహిన్
బట్టినపట్టులు కదలక
దొట్టున తమకమున దర్వ దొణగిరి కణకన్ 183

అర్థము : ఇట్టులన్= ఈ వాస్తవమును, కనుగొని తెలిసి కొనినవారై, (పాము విషమును క్రక్కునని) పదములు= కాళ్ళను గట్టిగన్= గట్టిగా, ఆలీఢ

నియతిన్ కుడికాళ్ళను ముందు నేలపై ఆనించి, కడున్ ఊది బాగుగానొక్కి, అహిన్= పామును, పట్టి పట్టులు, కదలక మార్చక (వదలక) తొట్టిన తమకములో అతిశయించిన ఉద్రేకముతో, కణకన్ పట్టుదలతో, తర్వన్ చిల్కుటకు, తొణగిరి మొదలిడిరి.

భావము : త్రచ్చునప్పుడు పామునోటి నుండి వెల్వడు ప్రచండమైన విషజ్వాల రాక్షసులను దహింపగలదని దేవతలు తలచి, కుడికాళ్ళను ముందు భాగమున నొక్కి పట్టి ఉద్రేకముతో, అందరు పాలవెల్లిని త్రచ్చుటకు ప్రారంభించిరి.

సీ॥ ఘుమఘుమధ్వనుల దిక్కుంభిసంఘుంబుల
శ్రవణరంధ్రంబులు చెవుడు పడగ
భుగభుగాయత మహాభూరిఫేనంబులు
హిమరజితాద్రులనేవగింప
గుభగుభోదగ్రాతిగుంభితారావంబు
లాదిమకూర్మంబునాత్మగలప
చెళచెళధ్వనిసుధాసీకరసారంబు
లుడుచంద్రువేర్పడకుండ బొదువ

తే॥ కమఠకర్పరగిరిరవకషణజనిత
ఘర్ఘరారావవిచలితకమఠమీన
మకరకర్కటఘూర్ణాయమానముగను
తరువజొచ్చిరి దేవతాసురులు వడిన్ **185**

అర్థము : దిక్+కుంభి సంఘుంబులు= ఎనిమిది దిక్కులలో నుండు, ఏనుగుల నన్నింటి శ్రవణరంధ్రములు= చెవులలోని బెజ్జాలు (చెవుడు పడగ) మహాభూరి ఫేనంబులు= మిక్కిలి పెద్దవైన నీటి అలలు, హిమరజిత+ అద్రులన్= హిమచలము ను, కైలాస పర్వతములును, ఏవగింప=

చిక్కుపెట్టగా, అతిగుంఫిత+ఆరావంబులు= మిక్కిలి చేలరేగిన భయంకర ధ్వనులు, సుధాకరసారంబులు= నీటి నుండి ఉబికిన జల్లులజడి, ఉడు చంద్రుడు= నక్షత్రములు, చంద్రుడు, ఏర్పడకుండన్= కంటికి కన్పట్టకుండ, పొదువన్= చిమ్మబడగా, కమఠకర్పర= తాబేలుచిప్ప, గిరివర= గొప్పకొండ, కషణ= రెండును ఒరయుటచే, జనిత= కలిగిన, ఘర్ఘర+అరావ= ఘల్ ఘల్ అనెడి ధ్వనులచే, విచలిత= అధికముగా ఊగిన, కమఠ= తాబేళ్ళు, మీన= చేపలు, మకర= మొసళ్ళు, కర్కట= ఎండ్రకాయలు, ఘూర్ణాయ మానముగను= నలువైపుల గిరగిరా తిరుగునట్లు.

భావము : ఘుమ, ఘుమ అనెడి ధ్వనులు, దిగ్గజాలకు చెవుడు కల్గునట్లు, భుగ భుగ అనెడి పెద్ద అలలు చెళ చెళ హిమవంతమును, కైలాసమును కలత పెట్టగా గుభగుభ అనెడి రొడలు అది కూర్మము యొక్క ఎదను కలచివేయగా భుగభుగ అనెడిపెద్ద అలలు చెళ చెళ అనెడి చప్పుళ్ళతో నీటి నుండి వెల్వడిన జల్లు జడి ఆకాశమందు, నక్షత్రములు చంద్రునివరకు వ్యాపించి, వానిని కానరానీయక చిమ్మబడగా, తాబేలు చిప్పను గట్టిదైన కొండ ఒరయుటచే కల్గిన ఝుర్ఝుర్ అనెడి నినాదములు సముద్రమందుగల జంతువులను, పలుసారులు తమకు తాము తిరుగుడు పడునట్లు వేగముగా, దేవదానవులు పాలవెల్లిని మథించిరి.

ఉ॥ నిగ్గుడు వెన్క దొక్కి కడు నేర్పున దివ్యనిశాచరావలుల్
తగ్గుడు ముందు ద్రొక్కుచును దర్పము లేర్పడ వెంట వెంటనే
తగ్గుడు నిగ్గుడు న్నని పదంబుల యొండొరు సంది ద్రొక్కి తా
రగ్గలికన్ మహోర్భటుల యంచితదోర్బలముల్ చెలంగగన్ **186**

అర్థము : దివ్య నిశాచర+అవళుల్= దేవతలు, రాక్షసుల గుంపులు, నిగ్గుడు వెన్కతొక్కి= వెనుకకు కాళ్ళను ఊని తొక్కి పైకి లేచుచు, కడునేర్పునన్= మిక్కిలి తెలివితేటలతో, త్రగ్గుడున్= క్రిందికి వాలుచును, ముందు

తొక్కుచును దర్పములు+ఏర్పడన్= తమ తమ బలములు కన్పట్టగా వెంట వెంటనే తగ్గుడు, నిగ్గుడున్= క్రిందికి వాలుడు పైకి లేపుడు అనెడి నినదంబులన్= కేకలతో, ఒండొరుల నంది త్రొక్కి= ఒకరి నుండి మరొకరు, సంది= నుండి (శ్రీహరి నిఘంటువు) వేర్పడక= గొట్టిగా త్రొక్కి నిలిచినవారై, అగ్గలికన్= ఉత్సాహముతో, మహత్+అర్భటుల= గొప్ప సహాకారములతో, అంచిత దోర్భలముల్ చెలంగగన్= ఒప్పైన భుజబలములు గోచరింపగా..

భావము : నేర్పుతో పైకి లేచుచు, క్రిందికి వాలుచు, దేవదానవులు తమ బలములు మెరయునట్లు తగ్గుడు, నిగ్గుడు అనెడి మాటలు పల్కుచు ఒండొరుల నుండి వారు ఉత్సాహమును పొంది, హాహా కారములతో క్షీరసాగరమును తమ భుజ బలములు ప్రకటితమగునట్లు ప్రవర్తించుచు,

శా॥ ఏలల్పాడుచు కేకలార్భటులచే హేలా గతిన్ దోర్బలా
భీలప్రక్రియ ప్రజ్ఞలాడుచును గంభీరాట్టహాసంబులన్
హాళిం జిత్తము లుల్లసిల్ల విపులాహంకారహుంకారముల్
సాలం బర్వనిశాచరు ల్గడగి రాశాచక్ర మల్లాడన్ 187

అర్థము : ఏలల్+పాడుచున్= శృంగార గీతాలను పాడుచు, కేకలు, అర్భటులచే= అఱుపులు, గొప్ప ఝుంకారములతో, హేలాగతిన్= వినోద క్రియగా, దోఃబల+అభీల ప్రక్రియ= భుజబల ప్రదర్శనకై భయంకరములైన చర్యలతో, ప్రజ్ఞలు+ఆడుచును= తమ శక్తులను పొగడుచు, గంభీర అట్టహాసంబులన్= వికృతములైన నవ్వులతో, హాళిన్= మిక్కిలి మక్కువతో, చిత్తముల్+ఉల్లసిల్లన్ మనస్సులు పొంగగా, విపుల+అహంకార హుంకారముల్= విరివియైన పెడబొబ్బలతో, చాలన్ త్వరన్= ఓపికతో చిల్కగా, ఆశాచక్రము+అల్లాడగన్= పది దిక్కులన్నియు తల్లడిల్లుచుండగా, నిశాచరుల్+కడగిరి= రాక్షసులు పూనిరి.

భావము : రాక్షసులు పాటలు పాడుచు, కేకలు వేయుచు సందడి చేయుచు, వినోద క్రియగా భుజబల ప్రదర్శనకై తమ శక్తులను పొగడుకొనుచు

అధికమైన, వికృతములైన నవ్వులతో, అమృతము నందు ఆసక్తి కలవారై, మనస్సులు ఉప్పొంగగా, హాహాకారములతో, ఓపికతో, దశదిక్కులు తల్లడిల్లుచుండగా సముద్రమును త్రచ్చుచుండిరి.

ఉ॥ రక్కసిమూక చేతను పరాభవమందిమహార్తి దీనుడై
యెక్కడబోయెనో త్రిభువనేశుడు శక్రుడు నేడువచ్చి యీ
యిక్కువ విష్ణుచే బడసె నిందుకు సందియ మేమి కల్గుబో
నిక్కముగా సుధారసమునేడని వేల్పులు ద్రచ్చి రాకటన్ 188

అర్థము : పరాభవము= అవమానము, మహా+ఆర్తిన్= గొప్ప దుఃఖముతో, త్రిభువన+ఈశుడు= మూడు లోకాలకు ప్రభువు, ఇక్కువ ఈ ఇక్కట్టును= సముద్రమును చిల్కు శ్రమను, అక్కరన్=కోరికతో శ్రద్ధతో)

భావము : ఇంద్రుడు రక్కసి గుంపులచే అవమానపడి దుఃఖించి ఏమియు తోచక, దిగులు చెంది అప్పుడు ఎక్కడపోయెను. నేడు వచ్చి ఈ సముద్రమును త్రచ్చు పనిని చేయుచున్నాడు. ఇందులో సందేహము లేదు. తప్పక అమృతము లభింపగలదని దేవతలు శ్రద్ధతో సముద్రమును చిలికిరి.

చ॥ చలమున నిట్టుల య్యుభయ సైన్యము మానమదాతిరేకమున్
బలములు శౌర్యసంపదలు పౌరుషముల్ బిరుద ప్రభాషల
గ్గలికలు ధైర్యముల్ మెరయగా గడు రోషము లగ్గలింపగా
నిలుపును నూరటంబడక నిష్ఠురతందరువంగనయ్యెడన్ 189

అర్థము : చలమునన్= పట్టుదలతో, ఇట్టుల=ఈ విధముగా, ఆ+ఉభయ సైన్యము= ఇరు సైన్యములు, మాన=అభిమానము, మద+అతిరేకమున్= ఎక్కువైన గర్వము, బలములు= తమ దేహబలములు, శౌర్యసంపదలు= వీరత్వ గుణములు, పౌరుషముల్= పరాక్రమము, బిరుదు ప్రభాషలు= బిరుదములను గూర్చి పొగడ్తలు, అగ్గలికలు= అతిశయములు, ధైర్యములు= ధీరత్వ గుణములు, మెరయగా= విశదమగుచుండగా, కడురోషములు=

తీవ్రమగు రోషములు, అగ్గలింపగా= ఎక్కువకాగా, నిలువును= నిలుపుటగాని, తెరపిగాని కొనక, ఊరటన్ పడక= విసుగు కొనక, నిష్ఠురతన్= చాలా పట్టుదలతో, తరువంగన్= చిల్కుతుండగా, ఆ+ఎడన్= ఆ సమయమున.

భావము : దేవ దానవుల సేనలు తమ తమ పరాక్రమములు, శౌర్య గుణములు శోభిల్లగా తీవ్రమైన రోషములతో, పనిని ఆపక విసుగు చెందక, కటువుగా సముద్రమును చిల్కుచుండగా ఆ సమయమున.

మ॥ బహుముష్ట్యుత్కటబద్ధతీవ్రజ మహాభారంబు సైరింప కా
యహినాథుం డతితీక్ష్ణదుర్దశ విషం బంభోధిలో గ్రక్కినన్
మహనియ్యోద్ధతధూమముల్ మిణుగురుల్ మంటల్ నభంబంది దు
ర్వహకాలాగ్నియపోవె బుట్టు రహిమీరన్ కాలకూటంబునన్ 190

అర్థము : బహుముష్టి+ఉత్కట బద్ధ= పెక్కు పిడికిళ్ళచే గట్టిగా పట్టుకొనబడు తీవ్రతచే కల్గిన గొప్ప బరువును (ఒత్తిడిని) సైరింపలేక= ఓర్వలేక, ఆ ఆహినాథుండు= ఆ సర్పరాజు, అతి తీక్ష్ణదుర్దశన్= మిక్కిలి బాధ చెందిన చెడ్డ స్థితిలో, విషంబు= తన శరీరము నుండి విషమును, అంబోధిలో= సముద్రములో, క్రక్కినన్= వాంతి సేయగా, మహనీయ+ఉద్ధత ధూమముల్= మిక్కిలి రేగిన పొగలు, మిణుగురులు= నిప్పురవ్వలు, మంటలు=సెగలు, నభంబు+అంది= ఆకాశమును అంటినవై, దుర్వహకాల+అగ్నియ పోలెన్= భరింపరాని ప్రళయకాలమందు ప్రసరించిన నిప్పువలె, రహిమీరన్= అతిశయించు, కాలకూటంబు+అనన్= కాలకూటమనెడి పేరు గలిగినది, పుట్టెన్= వెల్వడినది.

భావము : దేవదానవుల కవ్వపు తాడైన వాసుకిని తమ బలిష్ఠములైన పిడికిళ్ళతో గట్టిగా పట్టుకొని సముద్రమును చిల్కుచుండగా వారి గట్టి పట్టుల వల్ల బాధను సహింపలేక ఆ సర్పరాజు కష్టస్థితిలో నోటి నుండి విషమును

సముద్రములో క్రక్కెను. ఆ విషయ ప్రళయకాలాగ్నివలె పొగలు, రవ్వలు, మంటలతో కాలకూటము అనెడి పేరుగలదై అతిశయమై పుట్టెను.

సీ॥ పటుధూమజాలసంస్పర్శమంబరమార్గ
చరులన్నత్యంత మూర్ఛలను ముంప
చటచటధ్వనుల నుత్కటవహ్నికణజాల
మశనిపాశంబుల నధిగమింప
భుగభుగధ్వనులచే భూరితరార్చులు
గగనంబు దిశలను కలయ బర్వ
దుర్ధరతరతీక్ష్ణవర్ధిత ప్రభలచే
చిత్ర లీలాగతి ధాత్రిఁ బొదవి

ఆ॥ తరుల గిరులను కరులను పురవరముల
నకుల నసురుల సురల ఖేచరుల దిశల
కరుల శరధుల నదులను గెరలి తెరలి
యురలదరికొంచు విషవహ్నితిరుగ జొచ్చె 191

భావము : తీవ్రమైన పొగల గుంపుల తాకిళ్ళచే ఆకాశగమనులు (అంబరము ఆకాశము) ఊపిరి ఆడక సొమ్మసిల్లి పడిపోగా, చట చట ధ్వనులతో వెల్వడు నిప్పురవ్వల మొత్తము, పిడుగులను మించినట్లు చెలరేగగా (అశని=పిడుగు) భుగ భుగ మనెడి నాదములతో పెద్దదైన మంటలు ఆకాశమందు, దిశలందు, అన్ని చోట్లలో విస్తరించగా, ఓర్వలేని విధంబున వేగముగా ఎక్కువగుచున్న మంటల కాంతులు వింతలై పుడమియందు ప్రసరింపగా, (ప్రభలు= కాంతులు) చెట్లను, కొండలను ఏనుగులను, పెద్ద పులులను సకల రాక్షసులును, దేవతలు, ఆకాశ గమనులను, దిగ్గజములను, నదులను ప్రాకుతూ, వెడలుచూ చుట్టిముట్టి కాల్చుచు, విషము వలన నిప్పు సెగలు, అడ్డులేక అన్నింటియందు ప్రవేశించినవి.

వ॥ అప్పుడు 192

క॥ బిసరుహభవముఖసురవరు
లసురులు కడుభయమునొంది యాహాకారం
బెసగ మహోత్పాతం బిది
వెసదీని ధరించ ననుప వెదుకుండంచున్ 193

అర్థము : బిసరుహభవముఖ సురవరులు= పద్మమందు పుట్టిన బ్రహ్మ మొ॥ దేవతలు, మహాఉత్పాతంబు+ఇది= ఇది గొప్ప ఆపద, ధరించన్= అపుటకు, అనువన్= తొలగించుటకు, వెదకుండు= ఉపాయమును ఆలోచింపుడు.

భావము : అపుడు బ్రహ్మ మొదలుకొని దేవతలు, దానవులు, చాలా భయపడి బిగ్గరగా అరచిరి. ఇది గొప్ప ఆపద, వినాశమును కలిగించునది. దీనిని ఆపుటకు, తొలగించుటకు, ఉపాయమును త్వరగా ఆలోచింపుడు అని పల్కిరి.

ఉ॥ ఎవ్వరు దిక్కు దీని కిక నెవ్వరు నిల్పుట కాఢ్యు లార్తులన్
నొవ్వి దలంగ గావగ ఘనుండిక నెవ్వడు మృత్యువాదటం
దవ్వుల రామరాజ్యమను నట్టు విధం బిది దారుణం బహో
యివ్విషవహ్నిదప్పె నదెయింకసుధంగొనువాంఛబుట్టెడిన్ 194

భావము : ఈ విపత్తు నుండి కాపాడునట్టి దేవుడెవరు? ఈ మంటల సెగలను నిల్వరించగల నిపుణుడెవరు? తాను బాధపడి ఈ నిప్పుడు తొలగించి, కాచునట్టి ఉదారుడెవరు? చావునకు ఆవల దూరములో రామరాజ్యము అనెడి జన వాక్యము వలె ఇప్పటి గడ్డు కాలమున్నది. మహా భయమును కలిగించు దశ ఇది. అయ్యో! ఈ విషమమైన అగ్గి వలన ముప్పును తప్పించుకొన్న తరువాతనే అమృతమును పొందవలెననెడి కోరిక పుట్టును.

వ॥ అని వితర్కింపుచున్న యమరాసురలకు కమలభవుండిట్లనియె 195

ఆ॥ దీనరక్షకుండు దేవాది దేవుండు
సకలలోకభర్త సర్వమయుడు
విశ్వనాథుడుం డవిషవహ్ని ధరియింప
వెరవు గాన మనుచు వెరవ నేలా 196

భావము : దీనులను రక్షించువాడు, సర్వ దేవతలకు దేవుడు, సకలలోకాలకు నాయకుడు, సర్వము నందు కలవాడు, విశాల విశ్వానికంతా ప్రభువు విషాగ్నిని ధరించుటకు ఉన్నాడు గదా! కావున ఉపాయము లేదనెడు భయమెందుకు?

సీ॥ గంగానదీబద్ధ కలిత జటాజూటు
శశికళాసంభృతాంచత్కిరీటు
శూలపాశాభయస్ఫురితడమరుకహస్తు
త్రిభువనపూర్ణకీర్తి ప్రశస్తు
శతకోటి శుభ్రాంశుచంద్రికాంచితవర్ణు
ఫణిరాజకుండలాభరణకర్ణు
సజ్జనాత్మనివాసు సర్వాంగకవిలాసు
మహితసుందరతరమందహాసు

తే॥ నందివాహను సంతతానందవహను
పరమకారుణ్యసంపూర్ణు వరవితీర్ణు
త్రిభువనఖ్యాతు శ్రీపార్వతీ సమేతు
నంబుజాసను డతిభక్తి నాత్మ దలచె 197

అర్థము : గంగానదీ బద్ధ జటా జూటున్= గంగా నదితో కట్టబడిన జడల కట్టును కలవాడును, శశికళా సంభృత+అంచత్ కిరీటున్= చంద్రుని కళలతో బాగుగా నిండిన అందమైన కిరీటము కలవాడును, శూలము, పాశము (త్రాడు) డమరుకము (చిన్న చర్మ వాద్యము) తోనూ మరియు అభయ

సూచన (భయములేదనెడు) చేతులు కలవాడును. త్రిభువన కీర్తి ప్రశస్తున్= మూడు లోకాలలో వ్యాపించిన కీర్తిచే స్తుతింప బడువాడును, శతకోటి శుభ్రాంశు చంద్రిక+అంచిత వర్ణున్= నూరు కోట్ల పరిశుద్ధమైన వెన్నెల వెలుగుతో చక్కని వన్నెతో నున్న వానిని, ఫణిరాజ కుండల+అభరణ కర్ణున్= సర్పరాజుతో ప్రకాశించు చెవిపోగుల అలంకారములు గలవానిని సత్ జన ఆత్మ నివాసున్= మంచి వారి ఎదలలో నివసించువానిని, సర్వ అంగక విలాసున్= అన్ని అవయవముల సొగసు కలవానిని, మహిత సుందరతర మందహాసున్= చాల చక్కని సొంపైన చిరునవ్వు కలవానిని, వర వితీర్ణున్= గొప్ప దానగుణము గలవానిని...

భావము : శిరస్సున గంగ గల జడముడితోనూ, చంద్రుని కళలు గల కిరీటముతోనూ, చేతులలో శూలము, త్రాడు, ఢక్కితోనూ, అభయ హస్తమును కలిగినవాడును, మూడు లోకాలలో నతింపబడుచు, నూరుకోట్ల చంద్రకాంతుల శరీర ఛాయతోనూ, పాములు గల చెవిపోగులతోనూ, మంచివారి ఎదలో నుండు వాడును సొగసు వెదజల్లు అవయవములు, చిఱునవ్వు చిందించు ముఖము, నందిని వాహనముగా గల వాడును ఎల్లప్పుడు ఆనందముతో గోచరించుచు గొప్ప దయాగుణముతో నిండిన, ఉదారమైన వితరణము కలిగి మూడు లోకాలలో గొప్ప పేరుగలవాడును, అయిన శ్రీ పార్వతీ సమేతుడైన పరమేశ్వరుని బ్రహ్మ మిక్కిలి భక్తితో ధ్యానించెను.

వ॥ తలంచి సన్నిధానంబుగల్పించుకొని యిట్లని స్తుతియించె 198

భావము : ఆ పరమేశ్వరుని తన సమక్షమున నిలుపుకొని క్రింది విధముగా పొగడెను.

సీ॥ శ్రీగిరిజాధీశ! చిన్మయ! భవనాశ!
శశికోటిసంకాశ! శరణు శరణు

గంగాజటాజూటకలిత చంద్ర కిరీట
సదమల వృషఘోట శరణు శరణు
సకల వేదాగణ్య! సర్వలోక శరణ్య!
సంతతకారుణ్య! శరణు శరణు
గజచర్మపరిధానకామిత సంధాన!
సాధువృష్టినిధాన! శరణు శరణు

తే॥ లాలితాఖిలదాసకైలాసవాస!
సమదశాత్రవసంత్రాస! శరణు శరణు
మేరుకోదండదానవవైరికాండ!
శమితదండధరోద్దండ! శరణు శరణు 199

భావము : ఓ పార్వతీ పతీ! చైతన్యముతో కూడిన వాడా! జన్మమును నశింపజేసెడు కొన్నవాడా! నూరుకోట్ల చంద్రునితో సమానుడా! మమ్ముర్రక్షింపుమా! గంగను జడముడి యందు కలిగి చంద్రుని కిరీటము గలవాడా! శుద్ధమైన ఎద్దు ఱంకెలను కలవాడా! మమ్మురక్షింపుమా!

సకల వేదముల చేతను విలువ కట్టజాలనివాడా! సమస్త లోకములు ఆశ్రయింపదగిన వాడా! ఎడతెగని కృపగలవాడా! మమ్మురక్షింపుమా. ఏనుగు చర్మమును వస్త్రముగా గలవాడా! కోర్కెలను కూర్చువాడా! తాపసుల వృత్తికి నిధియైన వాడా! మమ్ము రక్షింపుమా!

బుజ్జగింపబడిన సమస్త సేవకులతో కైలాసమున వసించువాడా! మదించిన శత్రువులకు వెఱపు కలిగించువాడా! మమ్ము రక్షింపుమా!

మేరుపు విల్లైనవాడా! విష్ణువును బాణముగా కలిగినవాడా! యముని గర్వమును (త్రిపురాసుల సంహారగాథ) అణచిన వీరుడా! మమ్ము రక్షింపుమా!

ఉ॥ పాహిధనేశ్వరాత్మసఖ! పాహిరమారమణార్ధదేహ! మాం
పాహి శశాంకసూర్యశిఖి భాసుర లోచన! పాహి శంకరా!

పాహి సితాంశుభృన్మకుట! పాహి సమస్త జగత్స్వరూపకా!
పాహి దిగీశవంద్య! పద పాహి మహేశ్వర యంచునాత్మలోన్ 200

భావము : మమ్ము కాపాడుమా! కుబేరుని మిత్రుడా! హరి సగమైనవాడా! హరి సగమైన వాడా! సూర్యచంద్రాగ్నులు కన్నులుగా కలవాడా! సుఖమును ఇచ్చువాడా! తెల్లని కిరణములు ప్రకాశించు కిరీటము గలవాడా! సర్వ లోకములు తన రూపమైనవాడా! దిక్పాలకులచే నమస్కరింపబడిన పాదములు కలవాడా! ఓ మహాదేవా! రక్షింపుమా అనుచు మనస్సులో ధ్యానించెను.

వ॥ సన్నుతింపుచు తదేక నిష్ఠా పరవశుండైయున్నయెడ 201

భావము : ఆ విధముగా స్తోత్రము చేయుచు ఒడలు మరచి యుండగా..

సీ॥ గంగాతరంగసంగతబంధుసందోహ
మంబరచరమూర్ఛలపనయింప
గమనవేగజనిత కర సుధాకణములు
సవన భుజ్నికరంబు చల్లజేయ
విమలవాతాహతిఘుమఘుమధ్వనులతో
కరసంభరితడమరుకంబు మెరయ
పసిడంచుతోల్వన్నెపట్టుదుప్పటు
కొనకొంగు వేగంబున రింగురనగ

తే॥ కంఠఘంటానినాదంబు ఘణెలు మనెడు
గిబ్బతేజీమహోద్ధతినిబ్బరముగ
వాగె సడలించి ఘనమనోవేగమునను
వచ్చి శంభుండు నజుమ్రోల వ్రాలి నిలిచె 202

అర్థము : అంబరచర= ఆకాశమున తిరుగువారిని, మూర్ఛలన్= అలసటచే ఒడలు, మరుచుటను, అపనయింపన్= తొలగింపగా, కరసుధాకణములు=

తీక్షణమైన నీటి తుంపరలు, నవక భుక్+నికరంబు= యాగశాలల నిప్పు సెగలను, వాత+ఆహతి= గాలి తాకిడిచే, కర సంభరిత=చేతిలో చక్కగా నున్న, డమరుకము= ఢక్కి, కంఠ ఘంటా నినాదంబు= మెడలో నున్న చిఱుగంటల ధ్వనులు, గిబ్బతేజి= వాహనమైన నందిని, మహా ఉద్ధతిన్= గొప్ప వేగమును, నిబ్బరముగ= నిశ్చలముగ, వాగె సడలించి= పగ్గాలు చక్కబరచి, అజుమ్రోల= బ్రహ్మ ఎదుట,

భావము : గంగయొక్క అలల నుండి వెల్వడు నీటి బిందువులు ఆకాశవనులను మూర్ఛల నుండి తేరుకొనునట్లు చేయుగా, ప్రయాణవేగముచే కలిగిన వాడియైన నీటితుంపరులు, అగ్నిసెగలను యజ్ఞవాటికలందు చల్లచేయగా పరిశుద్ధమైన వాయువుయొక్క తాకిడిచే, ఘుమ ఘుమ ధ్వనులతో, చేతిలో అమరియున్న ఢక్కి మ్రోగుచుండగా, బంగారు అంచుగల తోలువన్నె, పట్టు దుప్పటియైన, అంగ వస్త్రపుకొన, రింగ్ రింగని తళుకులు వెల్వరించగా, మెడలో నుండు చిరుగంటలు ఘణిల్లని ధ్వనించుచుండగా, నంది వాహనము మీద గొప్ప తీవితో నిశ్చలముగా పగ్గాలను సవరించి పట్టుకొని మనోవేగముతో వచ్చి శంభుడు బ్రహ్మ ఎదుట దిగి నిలిచెను.

చ॥ నిలిచిన దిగ్గలేచి పదనీరజయుగ్మము ఫాలభాగసం
కలితముగాగ జాగి కరకంజయుగంబునుఁ మోడ్చి మైకడున్
బులుకలు నెట్టుమోగ ముదమం దగనిల్చి శ్రుతిప్రయుక్తిగా
జలరుహసూతి యిట్టు లని సన్నుతిచేసెను గద్గదోక్తులన్ 203

అర్థము : దిగ్గలేచి= వెంటనే లేచి, పదనీరజ యుగ్మము= కమలముల వంటి రెండు కాళ్ళను, ఫాలభాగ సంకలితముగాగన్= తన నొసటి తలను తాకునట్లు జాగి నేలపై సాగిలపడి, కరకంజయుగ్మమును= కమలముల వంటి రెండు చేతులను, మోడ్చి= ముడిచి, మైన్= శరీరమందు, కడున్=

మిక్కిలి, పులకలు= పులకరింతలు, నెట్టుమోక= మిక్కిలి మొలకెత్తగా, ముదమున్= సంతోషముతో, తగన్= సరియైన విధమున, నిల్చి, శ్రుతి ప్రయుక్తిగాన్= సుస్వర వేదములను వల్లించు రీతిని, గద్గద+ఉక్తులన్ బొంగురు పోయిన గొంతు నుండి వెల్వడు పదములతో, జలరుహసూతి= పద్మము నందు పుట్టినవాడు, బ్రహ్మ, ఇట్టులు+అని= ఈ విధముగా, సన్నుతి చేసెను= పొగడెను.

భావము : ఎదుట శంభుడు ఉండగా చూచి, తటాలున లేచి, ఆ దేవుని పాదములకు తన నొసటిని ఆనించి, నేలపై వాలి చేతులు ముడిచి, శరీరమందు గగుర్పాటు ఎడతెగక కలుగుచుండగా, సంతోషముతో ఉచిత రీతిని నిల్చి, బొంగురు పోయిన గొంతు నుండి మాటలు వెల్వడుచుండగా వేదమందలి పదజాలముతో స్వరయుతముగా బ్రహ్మదేవుడు మహాదేవుని స్తుతించెను.

దండకము

(సమపాదచతుష్కదండకము, ప్రథమపాదంముక్తపదగ్రస్తం, ద్వితీయ పాదంయమక నియతి, తృతీయపాదం చక్రవాళం, చతుర్థపాదం ప్రథమాంశరగడ, ద్వితీయాంశ స్రగ్విణీవృత్తంతృతీయాంశభుజంగప్రయాతం, చతుర్థాంశ స్రగ్విణీగర్భితభుజంగప్రయాతం)

శ్రీమద్భవానీ సతీమానసాం భోరు
హాగార మోదాంబు సంకల్పవీచీ ప్ర
యుక్తాంబు కేళీ విలాసానుమోదైక
హంస స్వరూపా! విరూపాక్ష పక్షీంద్ర
సద్వాహనాపత్య సౌందర్య కాయాతి
సౌరభ్య శుంభత్పటీర ప్రదానైక
ధౌరేయ వైశ్వానరాలంకృతో గ్రాల

కాక్షాభి రామాయుమాధీశ మాధీశ
ముఖ్యామరాది త్ర్యయక్షాసురానీ క
గంధర్వసిద్ధోరగాలోకమోత్కృష్ట
లీలామహాతాండవోల్లాస చంచత్క
లాంచజ్జటాం చత్కలాపా! శుభాలాప
సాలాపసంచారకస్థాయి విస్తార
కోద్వ్యల్లయోద్భాసకృన్నా రదోద్గీత
సత్సంగతోపాంగభూతాంబికాచారు
ధమ్మిల్లపుష్పాళినాదా వినోదాత్మ!
శ్రీ మన్మహావారణాసీ పురాధీశ
కోట్యగ్నిశుభ్రాంశుమార్తాండ సంకాశ
మౌనీంద్ర సంఘాతహృత్పద్మ సంవేశ
పాపాంధకార! ప్రణాశాంబుజాధీశ!
సంధ్యానటత్తాండవాడం బరాచార!
త్రైలోక్య సంరక్షణోదంచి తోదార
సర్వ ప్రపంచాత్మక ప్రస్ఫుటాకార!
సర్వాగమాంతాది సన్మార్గ సంచార!
హస్తాంబుజాతాగ్ర విశ్రాంత సారంగ
దీనావనోత్సాహసంశోభితాపాంగ!
సంపూర్ణ తాత్యంతసద్వైభవాభంగ
శైలేంద్ర జాతా ప్రయుక్తార్ధవామాంగ!
ధర్మార్థకామ! ప్రదౌదార్య మర్దాంత
రక్షజనధ్వంసవచ్చౌర్య త్రైలోక్య
సర్గస్థితిధ్వాంసవత్కార్య చక్రి ప్ర
ధానాఖిలామర్త్య రాడ్వర్గ దేవాధి

పా! మర్త్యగంధర్వ విద్యాధరాధీశ!
యక్షేంద్రముఖ్యామరోత్తం సమాణిక్య
సత్కాంతిగర్భీ కృతాంచత్ప్రభాపాద
పంకేజభక్తాధి సంతారతారాచ
లస్థాన మాణిక్య కూటో పరిప్రాంత
సత్సైకతావాస! సంజాత దివ్య ప్ర
భాజాల శుంభన్మదోర్వీజ సామీప్య
మాణిక్య నిర్మాణశుద్ధాంత శుద్ధాంత
రంగోపమానభ కేళీ వన ప్రాంత
సంతాన వాట్యండరోద్భాస దివ్యామృ
తాబ్జాకరాలోల! శైలాత్మజాయుక్త
కేళీ విలాసాత్మ సన్మానసన్మాన
సత్యక్త వైరాగ్య సంపూర్ణతా మోక్ష
మార్గానుసంధానయోగీంద్ర హృత్పద్మ
సత్కర్ణికామధ్య మాణిక్య సింహాస
నాసీన విభ్రాజితాదేవ దేవా! మ
హాదేవ! దీనార్ధి మందార దేవేశ్వ
రోద్ధార! ధీమానసాగార కైవల్య
సంధానకారీ! దయాగార సౌవర్ణ
శైలేంద్ర చాపా! శుభాకార హే దారు
ణేభాసురధ్వంస ధీధారణాధారు
ణ స్పందనాతాపసోద్ధారణా! దారు
కాంతారకాంతామనోహారణా! సార
సంసార దుస్సాగరోత్తారణాఢ్యాజ
యా వేద వేదాంత సంస్తోత్రపాత్రాజ

యా సేవకోద్యాన సమ్మోద చైత్రాజ
యాసామజాతాస్యషడ్వక్త్ర పుత్రాజ
యా మేనకాగర్భజాతాకలత్రా న
మో దీన మందార! నంది ప్రచారా! న
మో గాన సంతోష నాగ ప్రభూషా! న
మో!త్రాణ సరిదీప్త నారాయణాప్తాన
మో! ధ్యాన భాసాసనందాత్మవాసా
నమస్తే నమస్తేనమస్తే నమః **204**

అర్థము : శ్రీమత్+భవానీసతీ= సంపదలతో ఒప్పు శివుని యిల్లాలు, మానస+అంభోరుహ+అగార!= మనస్సు అనెడి కమలమును ఉనికిగా గలవాడా! మోద+అంబుసంకల్పవీచి= సంతోష జలధియందు, మనోవ్యాపారములనెడి అలతతో, ప్రయుక్త+అంబుకేళీ విలాస= కూడిన జలక్రీడల కదలికల యొక్క అనుమోద+ఏక హంస స్వరూపా= ఒప్పారిన మనస్సుగల పరమాత్మ ఆకారము గలవాడా! విరూపాక్ష= మూడు కన్నులు గలవాడా, పక్షి+ఇంద్రసత్ వాహన అపత్య= గొప్ప పక్షిని (హంసను) మేలైన వాహనముగా గలిగిన వానిని (కుమారస్వామిని) సుతుడుగా గలవాడా! సౌందర్యకాయ+అతి సౌరభ్య!= అందమైన శరీరము యొక్క మేలైన లక్షణములు కలవాడా! శుంభత్+పటీర ప్రదాన+ఏక+ధౌరేయ= శుభము లొసగు మేలైన గంధపు పూతను ముఖ్యముగా ధరించువాడా!

వైశ్వానర+అలంకృత+ఉగ్ర= అగ్నిచే అలంకరింపబడిన, భయంకరమైన, అలక+అక్ష+అభిరామా! = నొసటి వెంట్రుకల మధ్యగల నయనేంద్రియములతో అందమైన వాడా! ఉమా+అధీశ= ఉమకు పతియైనవాడా!, ముఖ్య అమరమాధీశ= ముఖ్యమైన దేవతలు, చదువుల తల్లికి పతియైన బ్రహ్మ, ఆదిత్య యక్ష అసుర+అనీక= సూర్యుడు,యక్షులు, రాక్షస గణములు, గంధర్వసిద్ధి+ఉరగ= గంధర్వులు, సిద్ధులు, సర్పములు

మొదలగువాని, ఆలోకన+ఉత్కృష్ట= శ్రేష్ఠములైన చూపులు ప్రసరించుచుండగా, లీలా మహాతాండవ+ఉల్లాస=వివిధ ప్రక్రియల తాండవ నృత్యముయొక్క ఉత్తేజముతో చం చత్ కళా అంచత్ జటా+అంచత్ కలపా= వివిధములైన మేలైన కాంతులతో ఒప్పుచున్న అభరణములు కలవాడా! శుభ+అలాపసాల+అవనీ= శుభకరమగు ధ్వనులతో సాలవృక్షములుగల నేలపై, చార= తిరుగుచు, స్థాయి= స్థిరమైన (చలనము లేక) విస్తారక+ఉద్యుత్= వ్యాపించిన, ఎక్కువైన, లయ= కలయికచే (నృత్య గీత వాద్యముల వంటి) ఉద్భాసకృత్= చక్కగా నుండు, నారద ఉద్గీత సత్సంగత ఉపాంతభూత= నారింజ చెట్లనుండి వెల్వరింపబడినట్టి, మేలైన గీతముల కలయిక గల చోట్లలో వెలయువాడా! అంబికా చారు ధమ్మిల్ల పుష్ప అళినాదా! = గిరిజ వెంట్రుకల ముడి యందున్న రమ్యమైన పూలలో గల తేనేటీగల గీతములు గలవాడా! వినోద+ఆత్మా= ఉల్లాస క్రీడలు గల హృదయము గలవాడా !

శ్రీమత్ మహా వారణాసీ పురాధీష= సంపదలతో మహిమలుగల, కాశీపురమునకు ప్రభువైనవాడా! కోటి+అగ్ని= నూరు లక్షల అగ్నుల, శుభ అంశు= పరిశుద్ధమైన కిరణములుగల, మార్తాండ= ప్రచండమైన సూర్యునితో, సంకాశ= సమానమైనవాడా! మౌని+ఇంద్ర సంఘాత=ముని వరుల సమూహముల యొక్క, హృత్+పద్మ= కమలముల వంటి ఎదలలో, సంవేశ= నెలకొన్న, పాప+అంధకార= పాపమనెడి చీకట్లను, ప్రణాశ అంబుజ+అధీశ తొలగించు, పద్మములకు ప్రభువైన సూర్యుడా!, సంధ్యానటత్+తాండవ+ఆడంబర ఆచార= సంధ్యాసమయమందు తాండవమనెడు నాట్యము చేయు ఉద్వేగము కల శ్రేష్ఠమైన ప్రవర్తన కలవాడా! త్రైలోక్య సంరక్షణ+ఉదంచిత ఉదార=మూడు లోకాలను కాపాడుటలో గొప్ప వితరణ గుణము కలవాడా! సర్వ ప్రపంచ+ఆత్మ+ప్రస్ఫుట+ఆకార= సమస్త విశ్వమునంతయు ఇముడ్చు కొన్న విశదమైన

స్వరూపము కలవాడా! సర్వ+ఆగమ+అంత+ఆది సత్+మార్గ సంచార= సమస్తములైన ఉపనిషత్తులు మొదలగు చక్కని త్రోవలో (వ్యాఖ్యానములలో) మెలగువాడా! వానిచే కీర్తింపబడువాడని భావము, హస్త+అంబుజాత+అగ్ర విశ్రాంత= కమలముల వంటి చేతియందు ముందు భాగమందు (అభయహస్తముతో) నిశ్చలముగా నున్న సారంగ= జింకను కలవాడా! దీన+అవన= సాయమవసరమైన జనులను రక్షించుటచే, సంశోభిత+అపాంగ= మిక్కిలి మెఱయుచున్న అందమైన కృపగల చూపుల క్రీ గన్నులు కలవాడా! సంపూర్ణత+అత్యంత సత్+వైభవ= చక్కగా, నిండైన మిక్కిలి గొప్ప శోభతో, అభంగశైల+ఇంద్రజాతా= స్వచ్ఛమైన, శ్రేష్ఠమైన పర్వత రాజునకు జన్మించిన పార్వతిని, ప్రయుక్త వామ+అంగ= తన శరీరములో చక్కగా ఎడమ భాగములో కలవాడా! ధర్మ+అర్ధ కామ= త్రివిధ పురుషార్థములను, ప్రద+ ఔదార్య = ఇచ్చునట్టి ఉదారుడా! దుర్దాంత రక్షోజన ధ్వంసవత్+చౌర్య= కష్టముతో మర్దింప కలిగిన రాక్షసులను తొలగించుటకై వంచక వ్యాపారము కలవాడా! త్రైలోక్య సర్గ స్థితి ధ్వంసవత్ కార్యచక్రి= మూడు లోకాలను నిర్మించుట, నిర్వహించుట, నిర్మూలన చేయుట అనెడి పనులతో కూడిన కార్యచక్రమును త్రిప్పువాడా! (గొప్ప వ్యవహారములు వాడా) ప్రధాన+అఖిల అమర్త్యరాట్ వర్గ దేవ+అధిపా= ముఖ్యులైన సమస్త దేవేశుల వర్గమైన దేవతల కెల్లరకు ప్రభువా!

మర్త్య గంధర్వ విద్యాధర+ఈశ= మానవులకు, గంధర్వులకు విద్యాధరులకు ప్రభువా! యక్ష+ఇంద్ర ముఖ్య= యక్షులకు రాజైన కుబేరుడు, అమర+ఉత్తంస= శ్రేష్ఠులైన అమరుల యొక్క మాణిక్యసత్+కాంతి గర్భీకృత= (కిరీటములయొక్క) రత్నాల మేలైన కాంతులు నిండిన, అంచత్ ప్రభా= ఒప్పుచున్న అందముచే, పాద పంకేజ= కమలముల వంటి పాదములచే, భక్త ఆధి సంతార= భక్తుల సాంసారిక చింతల నుండి విముక్తులను చేయువాడా! తార+అచల స్థాన మాణిక్య

కూట ఉపరి ప్రాంతసత్ సైకత+ఆవాస= వెండి కొండయందున్న రత్నాల ప్రాగుపై భాగామందుగల ప్రదేశమందు విస్తరించిన చక్కని ఇసుక తిన్నెలు నివాసముగా గలవాడా! సంజాత దివ్య ప్రభాజాల శుంభత్ మద+ఉర్వీజ సామీప్య= వెల్వడు దివ్యమైన కాంతుల వెల్లువతో శుభకరమైన సంతసంబునొసగు చెట్ల సమీపమునందు గలిగిన రత్నాలతో కట్టబడిన సౌధము గలవాడా! శుద్ధాంతరంగ+ఉపమాన+అభ, కేళీ వనప్రాంత= పరిశుద్ధమైన మనస్సుతో పోల్చదగిన ఆకాశము వరకు విస్తరించిన అరణ్య ప్రదేశము నందుగల సంతాన వాటి+ అంతరం+ఉద్భాస= సంతాన వృక్షముల పందిళ్ళ నడుమ ప్రకాశించు, దివ్య+అమృత అప్+జ+ఆకర= శ్రేష్టములైన సరస్సులతో, ఆలోల= అలరింపబడువాడా!

శైల+ఆత్మజా+యుక్త= హిమవంతుని తనయను కూడుటచే కలిగిన, కేళీ విలాస+ఆత్మ= శృంగార చేష్టలతో కూడిన మనస్సు కలవాడా! సన్మాన సన్మానస= అతిశయించిన కోరికలు ఏమియు లేక ఉత్తమ భావాలతో మోక్ష మార్గ+అనుసంధాన= ముక్తి తెరువును ఎన్నుకొన్న, యోగి+ఇంద్ర= శ్రేష్ఠులైన సన్యాసుల యొక్క, హృత్+పద్మ కర్ణికా మధ్య= హృదయములనెడి తామర దుద్దుల నడుమ, మాణిక్య సింహాసన+ఆసన= రత్నములు పొదిగిన పెద్ద పీఠమందు కూర్చున్న, విభ్రాజిత దేవదేవ= అధికముగా ప్రకాశించు దేవతలకు దేవుడా! మహాదేవా!= మిక్కిలి గొప్ప దేవుడా! దీన+అర్థి మందార= దిక్కులేని వారి కోరికలకు దేవతా వృక్షమా !దేవ+ఈశ్వర+ఉద్ధార= ప్రభువైన దేవతలకు రక్షించువాడా! ధీమాన+అగార కైవల్య సంధానకారీ!, బుద్ధిమంతులైన వారికి భగవంతుని సన్నిధానమును కల్గించువాడా!, దయా+అగార= దయకు నెలవైనవాడా! సౌవర్ణ శైలేంద్రచాపా= చక్కని వెన్నెలు కల మేరు పర్వతమును విల్లుగా గలవాడా! శుభ+ఆకార= మేలు చేయు స్వరూపము కలవాడా! హే దారుణ+ఇభాసుర ధ్వంస= ఓ భయంకరమైన చలనము కలవాడా! తాపన+ఉద్ధారణా= తపస్సు చేయువారికి సాయము చేయువాడా!

దారుకాంతర కాంతా మనోహరణా= దేవదారు వనమందున్న కాంత యొక్క మనస్సును హరించువాడా! సార సంసార దుస్సాగర ఉత్తారణ+ఆఢ్యా= విషయములతో నిండిన గృహస్థ జీవితమనెడి దాటుటకు వీలుకాని సముద్రము నుండి తొలగించు నిపుణుడా! జయా= ఎల్లప్పుడు జయము కలవాడా! వేదవేదాంత సంస్తోత్ర పాత్ర= వేదాలు స్మృతులు చక్కగా స్తుతించుటకు యోగ్యమైనవాడా! జయా= జయము కలవాడా, సేవక+ధ్యాన సమ్మోద చైత్ర్యా= భక్తుల ధ్యానములచే సంతోషము చెందు దివ్యమైన ఆలయమైనవాడా! సామజాత+ఆస్య, షట్ వక్త్ర పుత్రా= సామవేదమునుండి వెల్వడిన ఏనుగుమోము గలవానిని (వినాయకుని) ఆరుముఖములుగల కుమారస్వామిని పుత్రులుగా గలవాడా! మేనకా గర్భజాతా కళత్రా= మేనకాదేవికి గర్భమున జన్మించిన పార్వతిని భార్యగా గలవాడా! దీనమందార= సహాయము అవసరమైన వారికి వేల్పుచెట్టా! నంది ప్రచార= నందిపై నుండి తిరుగువాడా! గానసంతోషి= కీర్తనలకు సంతోషించువాడా! రాగా ప్రభుషా= పాములకు అలంకారములుగా గలవాడా! త్రాణ సందీప్త= రక్షణ కార్యముచే ప్రకాశించువాడా, నారాయణ+ఆప్త= విష్ణువునకు దగ్గరివాడా! ధ్యాన భాసా= భక్తుల ధ్యానముచే వెలుగువాడా! సనంద ఆత్మవాసా! = మానస పుత్రుడు సనందుని ఎదలో నివసించువాడా! నమ+తే నమస్కారము.

దండక విశేషం

ఈ దండకం ఆది నుండి అంతం వరకు తగణాలతో కూర్చింది కాబట్టి ఇది ఏక పాద దండకం అయినా దీనిలోని శబ్దాలంకార ప్రయోగాన్ని బట్టి సమ చతుష్పాద దండకంగా కూడా గుర్తించవచ్చు. 64 గణాల వరకు ఒక పాదంగా గ్రహిస్తే సమానమైన నాలుగు పాదాలు అవుతాయి. మొదటి మూడు పాదాలకు మకార ప్రాస చెల్లింది. 64 గణాలు ఉన్న పాదాన్ని 16 గణాలు గల 4 సమ భాగాలుగా విభజింపవచ్చు.

ప్రథమ పాదం ప్రథమ భాగం చివర 'విరూపాక్ష పక్షీంద్ర' అని ద్వితీయభాగం చివర 'ఉమాధీశ మాధీశ' అని, తృతీయభాగం చివర 'కలాపాశుభాలాప' అని చతుర్థ భాగం చివర 'నాదావినోదాత్మ' అని శబ్దాలంకార ప్రయోగం కన్పిస్తోంది. వీటిలో మొదటి రెంటిని ముక్తపద గ్రస్తానికే చివర రెంటిని అనుప్రాసకి లక్ష్యాలుగా చూపవచ్చు.

ద్వితీయ పాద ప్రథమభాగంలో పురాధీశ-సంకాశ-సంవేశ-అధీశ' అని ద్వితీయ భాగంలో ఆచార-ఉదార-ఆకార-సంచార అని, తృతీయభాగంలో సారంగ-అపాంగ- అభంగ-వామాంగ' అని దండకాన్ని బట్టి అంత్యానుప్రాస పాటించినట్లు చెప్పవచ్చు చతుర్థభాగంలో ఇటువంటి లక్షణం ఏమీ కనిపించదు.

తృతీయపాదంలోని ప్రథమ భాగం భక్తాధిసంతార తారాచ! ల' అని ద్వితీయ భాగం నిర్మాణ శుద్ధాంత! రంగ అని తృతీయ భాగం.

విలాసాత్మ సన్మాన నామాననాత్యుక్త అని చతుర్థభాగం 'విభ్రాజితా దేవదేవ! మహాదేవ!' అని ముగుస్తున్నాయి. ఇక్కడ అన్ని చోట్లా పూర్వ సమాసాంత్య పదం ఉత్తర సమాసాది పదంగా గ్రహింపబడింది. ఇలా సమాస అంత్యపదవర్ణ యుగళాన్ని గ్రహించి తరువాతి సమాసాన్ని ప్రారంభిస్తే చక్రవాళం అనే శబ్దాలంకారం అవుతుంది.

చతుర్థపాదంలో 'హే దేవ! దీనార్థి మందార.. శుభాకార హే దారణే' అని ఉన్న ప్రథమ భాగాన్ని అయిదు మాత్రల గణాలతో ఉండే ద్విరదగతి రగడపాదంగా గుర్తించవచ్చు. అలాగే '.. ణే భానుర ధ్వంస ధారణా..త్తారణాఢ్యాజ, యా' అని ఉన్న ద్వితీయ భాగంలో మొదటి గురువును వదిలిపెట్టి 'భాసుర' నుండి తృతీయ భాగం మొదటి గురువు 'యా' వరకు గ్రహిస్తే రగణాలు గల స్రగ్విణి వృత్త పాదంగా గుర్తించవచ్చు. తృతీయభాగంలో 'జయసేవ' నుండి 'కలత్రా' వరకు గ్రహిస్తే యగణాలు

గల భుజంగ ప్రయాతం ఉన్నట్లు అవుతుంది. ఈ విధంగా ఈ దండకం పాదానికి 64 తగణాలు గల 4 సమపాదాలు కలదిగాను మొదటి 3 పాదాలలో శబ్దాలంకారాలు, నాల్గవ పాదంలో ఛందోవిశేషాలు ఉన్న విశిష్టమైన రచనయని చెప్పవచ్చు.

ఉ॥ శర్వమహేశ్వరా! త్రిపుర సంహర! శాశ్వత! చంద్రశేఖరా!
సర్వశుభప్రదానకరచంద్రదివాకరవహ్నిలోచనా!
దుర్వహవైరిదర్పహరతోయజలోచనశాతసాయకా!
నిర్వహణ క్రియా చతుర నిర్మలగాత్ర పవిత్రకారణా! 205

అర్థము : సర్వశుభ ప్రదాన కర= సమస్త శుభములను ప్రసాదించు, చంద్ర దివాకర వహ్నిలోచనా= చంద్రుడు, సూర్యుడు, అగ్నిని కన్నులుగా గలవాడా! దుర్వహ= భరించుటకు వీలుకాని, వైరిదర్ప= శత్రువుల గర్వమును హరించునట్టివాడా! తోయజలోచన శాత సాయక= కమలముల వంటి కన్నులుగల విష్ణువును వాడియైన బాణముగా ధరించిన వాడా! (త్రిపురాసుర సంహారకథ) నిర్వహణ క్రియా చతుర= పనులు చేయుటయందు నేర్పరీ! నిర్మలగాత్ర= మలినములేని శరీరము గలవాడా! పవిత్రకారణా= శుద్ధములేన పనిముట్లు కలవాడా! (ఆయుధములు) (కారణము= ఉపకరణములు).

భావము : ఓ మహేశ్వరా! సూర్య చంద్రాగ్నులు కన్నులుగా గలవాడా! విష్ణువును బాణముగా గలవాడా! కార్యములను చేయుటయందు నిపుణుడా! మలినము లేని శరీరము కలవాడా! పావనములైన ఆయుధములు కలవాడా!

చ॥ సురగిరి కిన్నరుల్ సురలు శోషిల జొచ్చిరి సర్వ దిక్పతుల్
పరితపియించువారు దయవారగ జూచి తరింపరాని దు
ర్భరతర కాల కూట విషదర్ప మణంచి సముద్ధరింపవే
హర పరమేశ శంకర దయాకర శైల సుతామనోహరా! 206

భావము : పార్వతీ మనోహరా! హర, పరమేశ, దయాకరా! మహేంద్రా చలముపై నున్న కిన్నరులు, దేవతలు, మూర్ఛపోవుచున్నారు. సర్వ దిక్పాలకులు మిక్కిలి బాధపడుచున్నారు. దయతో చూచి, దాటజాలని, సహింపరాని, కాలకూట విషము యొక్క దట్టమైన పెంపును అణచివేసి మమ్ము కాపాడుమా!

చ॥ అని వినుతించినన్ సదయుడై పరమేశ్వరు డానతిచ్చె నో
వనరుహజాత! లోకులకవశ్యము సేయగనైన కార్యముల్
మనము వహింపగా వలదె మాన్పెద నిప్పుడె చూడు మంచు నా
ఘనతరకాలకూటశిఖి గాంచి విరించిముఖామరుల్ గనన్ 207

భావము : అని విశేషముగా పొగడగా దయగలవాడై పరమేశ్వరుడు ఓ బ్రహ్మదేవా జనులకు తప్పక చేయవలసిన పనులు మనము పూనుకొనవలయును. ఇప్పుడే ఈ చిచ్చును తొలగింతును చూడుము, అని భయంకరమైన కాలకూటాగ్నిని చూచి బ్రహ్మ మొ॥న దేవతలు చూడగా...

క॥ ముల్లోకంబులుదరికొని
తల్లడపడజేయు విషము తగుమాత్రంబౌ
నల్లోనెరెడుబండ
ట్లల్లన శంభుండు బట్టె హస్తాబ్జములన్ 208

అర్థము : దరికొని= కాల్చి, తల్లడ పడవేయు= కలవరపెట్టు, అల్లోనేరేడు పండు= పెద్ద నేరేడు పండు, అట్లు= మాదిరి, అల్లన= తేలికగా, హస్త అబ్జములన్= కమలముల వంటి చేతులతో, పట్టెన్.

భావము : మూడు లోకాలను దహించుచు తాపము కలుగజేయుచున్న విషమును పెద్ద నేరేడు పండు వలె చక్కగా కుదించి సులభముగా తన రెండు చేతులతో పట్టుకొనెను.

క॥ పట్టిన నట్టిటు చెదరుచు
జిట్టాడు హలాహలంబు శివు డణగ బిగన్
బట్టి వడి మ్రింగి గళమున
బెట్టెన్ లోగొన్న జగము బెగ్గిలునుచున్ 209

అర్థము : చిట్టాడు= చలించుచుండ, హాలహలంబున్= విషమును, గళమునన్= గొంతులో, లోకొన్నన్= కడుపులోనికి పోనిచ్చినచో, బెగ్గిలు+అనుచున్= బెదిరి మూర్ఛ పోవుననుచు,

భావము : పరమేశ్వరుడు పట్టుకొనగా, విషము నలువైపులా చెదురుచు, చలించు చుండెను. తన చేతులతో అణగునట్లు గట్టిగా పట్టుకొని వేగముగా మ్రింగి, దానిని కడుపులోనికి పోనిచ్చినచో సమస్త లోకములు, భయపడి చలనము లేని వగుననుచు గొంతులోనే పెట్టి అచటనే దానిని నిలిపెను.

మ॥ అవలీలన్ గరుణం జగద్భయదమౌ హాలాహలాహారమున్
శివు డెబ్భంగిని నిర్వహించె నహహా శీతాంశు డమ్మౌళిపై
నివసింపంగనొ యంచు నందరు మహానిర్విణ్ణులై యంతటన్
భవునిన్ మంగళ గీత నృత్తముల సంభావించి రింద్రాదులున్ 210

అర్థము : అవలీలన్= తేలికగా, ఏ భంగిన్ నిర్వహించెన్= ఏ విధముగా మ్రింగెనో కదా, శీత+అంశుడు= చల్లని కిరణములు కలవాడు, చంద్రుడు, మహా నిర్విణ్ణులై= మిక్కిలి చలించినవారై, సంభావించిరి= మెచ్చుకొనిరి.

భావము : తేలికగా దయతో లోకాలకు వినాశకరమైన మహా విషమును పరమ శివుడు ఆశ్చర్యకరముగా ఆహా! చంద్రుడు, శివుని శిరస్సుపై నుండుట, కనునట్లు ఎట్లో మ్రింగెను కదా! అని ఇంద్రుడు మొ॥న వారు మిక్కిలి చలించి, తర్వాత శివుని మంగళ గీతములతో, నృత్యములతో మెచ్చుకొనిరి.

క॥ అంత సుఖించె జగంబులు
సంతనమున నమరదైత్యసంఘము బొదలెన్

సంతుష్టినొందె శంభుం
డంతర్హితు డగుచు జేరె నారజతాద్రిన్ 211

భావము : అంత జగములు సుఖమును పొందినవి, సంతోషముతో దేవదానవుల సమూహములు శాంతించినవి. శంభుడు తృప్తిని పొంది, కానరానివాడై వెండికొండ చేరెను.

తే॥ ఫాలలోచనుండు కాలాగ్ని రుద్రుండు
నైన శంభుకంఠమందు నిలిచి
కందు జేసెగాని కారింపలేదయ్యె
నందు నీలకంఠు డయ్యె శివుడు 212

భావము : ప్రళయకాలమందు సర్వమును దహించు నల్లని వన్నెగల అగ్నిని నొసటియందు ధరించు రుద్రుడు అనుపేరుగల శంభుని (మేలు చేయువానిని) సార్థకనామునిని, కంఠమందు విషము నిలుపుటచే నల్లమచ్చల ఏర్పడెను. ఆ విషము శివునికి ఎట్టి బాధను కలిగింపలేదు. అది అచట నుండుటచే నీల కంఠుడు అను పేరు కల్గినది.

క॥ ఈ లీలనద్భుతంబగు
హాలాహలచరిత మెవ్వరైనను భక్తిన్
వాలాయము పఠియించిన
వ్యాళవిషానలభయంబు నొందరు కణకన్ 213

భావము : వాలాయముగ= పూనికతో, వ్యాళము= పాము

పరమశివుని అత్యాశ్చర్యకరమైన ఈ వినోదక్రీడను అనగా హాలాహల చరితమును పూనికతో చదివిన, పాము విషము నిప్పువలన ఆపదకలుగును.

(కణంగన్= కడంకన్)

క॥ అనినన్ సంతసమందుచు
మునివర్యులు సూతు జూచి ముందరి కథ యే

మన వినుపింప దొణంగెను
విను మని సూతుండు మదిని వేడ్క గణంగన్ 214

భావము : కథను ముగింపగా మునివరులు సంతసించి, సూతమునిని చూచి, తరువాతి కథ ఏమి, వినిపింపుడు అని కోరగా, ఆ పౌరాణికుడు మనసులో ఉత్సాహము కలుగగా, వినండి అని మొదలు పెట్టెను.

ఉ॥ అంత సురాసురుల్ సురగణాధిపు డంబుజసూతి జూచి లో
కాంతకదారుణంబయిన హాలహలానలభీతినిం గృపా
క్రాంతవిశేషచాతురి నకంపనలీల దలంగ గంటిన
త్యంతఫలంబు లబ్బె నిక నంబుధిదర్వ భయంబు జెందెడిన్ 215

భావము : కృప+అక్రాంత విశేష చాతురిన్= దయతో నిండిన మిక్కిలి నేర్పుతో, అకంపనలీలన్= ఎట్టి చలనము లేని విధముగా.

పిమ్మట దేవదానవులు దేవతలకు ప్రభువైన ఇంద్రుడు బ్రహ్మదేవుని చూచి లోకాలను మట్టుపెట్టు భయంకరమైన హాలాహలాగ్ని భయమును, చలింపక దయతో, మిక్కిలి నేర్పుతో శివుడు తొలగింపగా చూచితిమి.

చాలా గొప్ప ప్రయోజనము కలిగినవి (అందరును సుఖమును పొందిరి) ఇక మీదట సముద్రమును త్రచ్చుటకు భయము కల్గుచున్నదే?

మ॥ అనినన్ పద్మజుడేల యీ భయము సర్వాభీష్టముల్ చేకూరున్
ఘనవస్తు ప్రకరంబులీవనధిలో గల్గున్ సుధాకుంభమున్
గొని ధన్వంతరియుద్భవంబగును మీకున్ సేమమే వెంటన
వ్వనజాతాక్షుకటాక్ష మూరకనె పోవన్ నేర్చునే యెయ్యడన్ 216

అర్థము : అభీష్టములు= కోరికలు, ప్రకరము= మొత్తము

భావము : అనగా బ్రహ్మ మీకు ఈ భయము ఎందుకు? మన కోరికలన్నియు లభించును. గొప్ప వస్తువులు ఈ జలధి నుండి వెల్వడును. ధన్వంతరి

అనెడి దేవత అమృతము గల కుండను పట్టుకొని వచ్చును. మీకు వెంటనే మేలు కల్గును. ఆ కమలము వంటి కన్నులు గల విష్ణుదేవుని దయగల క్రీగంటి చూపు ఎప్పుడైనా సుఖమును ఇయ్యక, ఉపయోగము లేనిది యగునా?

క॥ వెరవక యుత్సాహంబుల
దరువుడు కలశాబ్ధియనిన దర్పోద్ధతులై
సురదనుజావలు లెప్పటు
సరణిన్ వడి దరువ దరువ జలనిధియందున్ 217

అర్థము : కలశ+అబ్ధిన్= పాల సముద్రమును, దర్ప+ఉద్ధతులై= ఎక్కువైన పొంగుతో, సుర దనుజ+అవళులు= దేవతల, రాక్షసుల సమూహములు, సరణిన్= విధమున.

భావము : భయము చెందక, ఉత్సాహముతో పాలవెల్లిని చిల్కండి, అని బ్రహ్మ బోధింపగా అతిశయించిన గర్వము కలవాడై దేవదానవులు అందరు ముందు మాదిరి వేగముగా సముద్రమును బాగుగా చాలా కాలము త్రవ్వగా అందుండి.

క॥ నవకము శుభలక్షణములు
ధవళాంగము గగనచరముదారముబలిమిన్
జవమునుదనరగ నుచ్చై
శ్రవ ముద్భవమయ్యే దుగ్ధజలనిధియందున్ 218

భావము : మృదువైనది, మంచి గుణములు, తెల్లని శరీరము, ఆకాశమందు తిరుగునది, బలిమిచే గొప్పది వేగము కలదియును, అగు ఉచ్చైః శ్రవము (నిక్కిన చెవులు కలది) గుఱ్ఱము, పాలవెల్లి నుండి పుట్టెను. ఇది ఇంద్రుని గుఱ్ఱము.

క॥ కైలాసకుధరమొక్కో
ప్రాలేయాచలమొ యనగ బటుకాయముతో
మేలగు సర్వాంగంబుల
పొలుచు నైరావతంబు సంభవయ్యేన్ 219

అర్థము : కుధరము= కొండ, ప్రాలేయ అచలము= తూర్పుకొండ, వటుకాయముతో= బలమైన శరీరముతో.

భావము : కైలాస పర్వతమా? ఉదయాద్రియా? అనెడి భ్రమ కలుగునట్లు, మిక్కిలి బలమైన శరీరమందు మేలైన అన్ని అవయవములతో అందమైన ఐరావతము అనెడి ఏనుగు అవతరించెను.

ఐరావతము : తూర్పు దిక్కునందుండు ఇంద్రుని ఏనుగు

సీ॥ బాలసూర్యప్రభాభాసురమకుటంబు
నతులాబ్జజితవదనాంబుజంబు
నరవిందయుగవరదాభయహస్తముల్
మండితమణికర్ణకుండలములు
ఘనకుచాచ్ఛాదితకనకోత్తరీయంబు
కటితటుభ్రాజితకనకచేల
మణిఘంటికోజ్వల మహనీయమేఖల
రజితనూపురశుభప్రదపదములు

తే॥ దనరకమలాంతకర్ణికాంతరమునందు
కలితపద్మాసనస్థయై గాంగతోయ
కలశభృత్కరయుగముతో కరుణదనర
నమృతవారిధి నుదయించె నాదిలక్ష్మి 220

అర్థము : బాలసూర్య ప్రభా భాసుర మకుటంబున్= లేత సూర్యుని కాంతులచే ప్రకాశించు కిరీటమును, అతుల అబ్జజిత వదన+

అంబుజంబున్= సాటిలేనిదైన కమలమును జయించిన కమలము వలె మెఱయు ముఖమును, అరవిందముగ, వరద+అభయహస్తముల్= రెండు పద్మ ముఖములను కలిగియున్న వరము లొసగునట్టి చేతులను, మండిత కర్ణకుండలములు= వెలుగునట్టి చెవుల ప్రోగులను, ఘన కుచ+ఆచ్ఛాదిత కనక ఉత్తరీయంబు= బిగువైన పాలిండ్లపై కప్పియున్న బంగారు పై కొంగును, కటితటి భ్రాజిత కనకచేలన్= మొలయందు ప్రకాశించు బంగారు వన్నెగల చీరను, మణి ఘంటిక+ఉజ్జ్వల= మణులు పొదిగిన చిఱు గంటలు కలిగి జ్యోతులను వెదజల్లు, మహనీయ మేఖల= విలువైన ఒడ్డాణమును, రజిత నూపుర శుభప్రద పదములు= వెండికాలి కడియములు శుభములొసగు పాదములు, తనర= అందమై ఒప్పగా, కమల+అంత కర్ణికాంతరమునందు= పద్మముయొక్క మధ్య భాగమందున్న దొద్దుపై, పద్మ+అననస్థయై ప్రత్యేకముగా ధ్యానమునకు తగిన విధమున కూర్చున్నదై, పద్మాసనము= కుడి పాదమును ఎడమ తొడపై, ఎడమ పాదమును కుడి తొడపై పెట్టి కూర్చుండుట, గాంగతోయ కలశభృత్ కరయుగ్మముతో= గంగజలముతో నిండిన రెండు చిన్న గిన్నెలను రెండు చేతులతో ధరించినదై, కరుణతర= దయను ప్రసరింపజేయు, అమృత వారిధిన్= పాలవెల్లి యందు ఆదిలక్ష్మి ఉదయించెను.

భావము : లేత సూర్యుని కాంతులచే ప్రకాశించు కిరీటము, కమలమును జయించు కమలము వంటి ముఖము, వరము లొసగుటకై భయము లేదను సూచించునట్టి కమలమును ధరించిన రెండు చేతులు, జ్వలించు చెవి ప్రోగులు, బిగి కలిగిన పాలిండ్లు, బంగారు వన్నె గల కొంగు మొలపై ధరించిన, బంగారు వన్నెగల చీర, చిరు గంటలు, మణులతో కూడి మెరయు ఒడ్డాణము, వెడి కాలికడియములతో ఒప్పారు శుభములొసగు పాదములు కలదై పద్మ మధ్య భాగమందున్న దుద్దుపై ప్రత్యేక ఉనికితో పద్మాసమున వెలయుచు గంగ నీరు కలిగిన చిన్న చెంబులను చేతులతో పట్టుకొన్నదై

దయను చిందించు చూపులతో పాల సముద్రము నుండి ఆదిలక్ష్మి వెలుపలికి వచ్చెను.

క॥ శరదిందుచంద్రికాప్రభ
కురుకొమ్ములు వలుదపొదుగు గొరిశెల కుదురున్
మెరుగుంగన్నుల తేటయు
స్థిరలక్షణములనుఁకామధేనువు బుట్టెన్ 221

అర్థము : శరత్+చంద్రికా ప్రభ= శరత్కాల ఋతువునందు చంద్రుని వెన్నెల వన్నెలతో కురుకొమ్ములు= పొట్టివైన కొమ్ములు, వలుద పొదుగు= వెడల్పైన పొదుగు, గొరిశెల కుదురున్= చక్కగా నెలకొన్న కాలిగిట్టల అమరికను, మెఱుగున్+కన్నున తేటయున్= మిరుమిట్లు గొలుపు కన్నుల చక్కదనముతోను (తెల్లదనముతోను), స్థిరలక్షణములను= మార్పు చెందని గుణములతో, కామధేనువు= దేవతల ధేనువు (వేల్పుటావు) పుట్టెను.

భావము : శరత్కాలపు వెన్నెల జిగిబిగి, కురచైనకొమ్ములు, వెడల్పుగల పాలపొదుగు, అందమైన కాలిగిట్టల అమరిక, మెరయు కన్నుల ప్రసన్నత మొ॥న గొప్ప గుణాల రాశి దేవతల ఆవు కామధేనువు పుట్టెను.

ఆ॥ పరుపుమెరుపు పుష్పఫలభరితంబులై
కామితార్థఫలదకలితమగుచు
నఖిలదీనజనులకాధారమై లీల
కల్పవృక్షపంచకంబు పుట్టె 222

అర్థము : పరువుమెరుపు= లేతదనపు తళతళలాడు, పుష్పభరితంబులై= పువ్వుల గుంపులతో నిండినవై, కామిత అర్థఫలద కలితము+అగుచున్= కోరిన వస్తువులను ఇచ్చునవై, అఖిలదీప జనులకు+ఆధారమై= సమస్త బలహీన ప్రజలకు పోషణకు గనియై, లీలన్= చక్కని కదలికలతో, కల్పవృక్ష పంచకంబు= ఐదు దివ్యములైన చెట్లు, పుట్టెన్=పుట్టినవి.

1.మందారము, 2.పారిజాతము, 3.సంతానము, 4.కల్పవృక్షము, 5.హరిచందనము

భావము : లేతదనపు మెరుపులు కల పూలగుత్తుల గలగలలతో కోరిన వానిని ఇచ్చునవి దిక్కులేని జనులకు రక్షకములు చక్కని కదలికలతో దేవతరువులు అయిదు, కల్పవృక్ష పంచకము పాలవెల్లి నుండి పుట్టినవి.

క॥ **నిస్తులగుణకలితంబై**
నిస్తరితమహాంధకారనిచయాభంబై
స్వస్తిప్రదభాసురమై
కౌస్తుభమణి బుట్టె పాలకడలిని వేడ్కన్ 223

అర్థము : నిస్తుల గుణ కలితంబై= గొప్ప గుణాలరాశిగా, నిస్తరిత మహత్+అంధకార నిచయ ఆభంబై= దట్టమైన చీకటి పెంపును తొలగించు గొప్ప జ్యోతియై, (సు+ అస్తి) స్వస్తి ప్రద భాసురమై= సుఖమగుగాక అనెడి ఆశీస్సును ఇచ్చు ప్రకాశములతో కౌస్తుభమణి = కౌస్తుభము అనెడి పేరుగల (అలంకారము) పాలకడలిని= పాల సముద్రమునందు, వేడ్కన్= చూచువారి మనస్సు ఉప్పొంగునట్లు, పుట్టెన్= పుట్టినది

భావము : గొప్ప లక్షణమునకు నెలవై దట్టమైన చీకట్లను పోగొట్టగల జ్యోతియై స్వస్తి అనెడి ఆశీస్సు నొసగునట్టి ప్రకాశముతో ఒప్పినదై, కౌస్తుభమణి పాలవెల్లిలో పుట్టెను.

కౌస్తుభము : విష్ణువు రొమ్మున నుండు మణి.

క॥ **భువిసమ్మోహనలీలా**
విభవము లలరంగ సకల విద్యానటనా
ప్రభ దనరగ రభసంబున
నభినవ సుందరులు బుట్టి రచ్చరకన్నెల్ 224

అర్థము : భువిన్ భువిలో, సమ్మోహన లీలా భవంబులు+అలరంగ= పూర్తిగా మనస్సును చలింపజేయు, మరపించు శరీర క్రీడల సౌందర్యములతో వెలుగుచు, సకల విద్యా నటనాప్రభ తనరగ= సర్వ విధములైన విద్యలందు నాట్యకళా నిపుణత కన్పట్టుచుండగా రభసంబున= సందరడితో, అభినవ సుందరులు= క్రొత్త అందాలతో అచ్చరకన్నెలు= కన్యలైన దేవవేశ్యలు పుట్టిరి.

భావము : ధరణిలో ఎల్లరును మైమరచునట్లుగా చేయు శరీర విలాస సంపదలతో చలిపంజేయు శోభ కలవారై సర్వనాట్య విద్యలందు ప్రవీణులైన అప్సరకన్నెలు సౌందర్యవతులు సందడితో పుట్టిరి.

అప్సరస : నీటియందు పుట్టిన దేవకన్య, అప్సరసలలో ఏడుగురు ప్రసిద్ధులు.

1.రంభ, 2. ఊర్వశి, 3. ఘృతాచి, 4. మేనక, 5. తిలోత్తమ,6.మంజుఘోష, 7.సుకేశి

ద్వాదశ, షోడశ అప్సరసలు పురాణాలలో ప్రస్తావింపబడ్డారు.

చ॥ **కువలయ జీవితేశ్వరుడు కోమల సీతకరుండు వర్ధనో**
త్సవఫలదాయకుండు హిమధాముడు సుందరమందిరుండు జ
క్కవకవవీడుకోలు సితకాయుడు రేమగ డంబుజారి మా
ధవమలయానిలాప్తుడు సుధానిధి చంద్రుడు బుట్టెనంబుధిన్ 225

అర్థము : కువలయ జీవిత+ఈశ్వరుడు= కలువల ఉనికికి ప్రభువు, కోమల శీతకరుండు= మృదువైన చల్లని కిరణములు కలవాడు, వర్ధన+ఉత్సవ ఫల దాయకుండు= జీవాలవృద్ధి వికాసాలను కూర్చువాడు, హిమనాధుడు= చల్లదనమునకు నెలవైనవాడు, సుందరమందిరుడు= అందమైన భవనాలను కలవాడు, జక్కవకవ వీడుకోలు= చక్రవాక పక్షుల జంటలను విడదీయువాడు, సితకాయుడు= తెల్లని శరీరము కలవాడు, రేమగడు= రాత్రికి పతి, అంబుజ+అరి= కమలములకు పగవాడు, మాధవమలయ+

అనిల అప్తుడు= వసంతునికి మలయ వాయువునకు ఇష్టుడు,సుధానిధి= అమృతమునకు స్థానమైనవాడు చంద్రుడు, అంబుధిన్= సముద్రములో పుట్టెను.

భావము : కలువలరేడు జీవముల మొత్తము పెరుగుటకు పోషకుడు, చల్లదనము నకు నెలవు, అందమైన ఇళ్ళను కలవాడు, చక్రవాకముల జంటలకు ఎడబాటు కల్గించువాడు, స్వచ్ఛమైన తెల్లని శరీరము కలవాడు, రాత్రికి రాజు, వసంతునకు మలయపవనునికి మిత్రుడు, అమృతమనకు స్థానమైన చంద్రుడు జలధిలో జన్మించెను.

మ॥ ఉరురత్నోజ్వల హేమదివ్యమకుటం బుష్ణాంశుబింబప్రభా
వరమాణిక్యసుకుండలద్వయము భాస్వద్రత్నభూషావలుల్
దరచక్రద్వయమున్ సుధాకలశహస్తద్వంద్వముం గల్గి శ్రీ
హరిధన్వంతరియై సుధాబ్ధి నొదవెన్ హాసప్రబోద్ధముడై 226

అర్థము : ఉరురత్న+ఉజ్జ్వల హేమదివ్యమకుటంబు= శ్రేష్ఠమైన రత్నాలతో జ్వలించు బంగారుతో చేయబడిన దేవతలు ధరించు కిరీటము, ఉష్ణ+అంశు ప్రభా= సూర్యుని తేజము కలిగినవై, వరమాణిక్య సుకుండల ద్వయము= మేలైన మాణిక్యములు పొదిగిన చక్కని రెండు చెవుల పోగులతో, భాస్వత్ రత్న భూష+అవళుల్= మెఱయు రత్నములు నిండిన అలంకారములు పెక్కింటితో, ధరచక్ర ద్వయమున్= పాంచజన్య శంఖము, సుదర్శన చక్రము రెండింటితో, సుధాకళశ హస్త ద్వంద్వము కల్గి అమృతముగల కుండను పట్టుకొన్న రెండు చేతులతోను.

శ్రీహరి= శ్రీ మహావిష్ణువు, ధన్వంతరి యై= ధన్వంతరి అనెడి పేరుగల దేవతల వైద్యుడు, సుధ+అబ్ధిన్= పాలసముద్రమందు, హాస ప్రభ+ఉద్దాముడై= నవ్వులను చిందు ప్రకాశముతో, గొప్ప లక్షణములు కలవాడై, ఒదవెన్= వెల్వడెను.

భావము : జ్వలించు రత్నములతో మెరయు బంగారు కిరీటము, సూర్యబింబము వలె తళతళలాడు రెండు చెవిపోగులు, రత్నముల అలంకారములు, శంఖచక్రములు అమృతము గల కుండను, రెండు చేతులతో కలవాడై మహావిష్ణువు దేవవైద్యుడైన ధన్వంతరియై చిఱునవ్వులను చిందించుచు మహోన్నతుడై పాలసముద్రము నుండి అవతరించెను.

ఉ॥ అమ్మహనీయమూర్తి గని యాత్మల సంతసమంది యందరున్
సమ్మతి జాగి మ్రొక్కి కరసారసముల్ ముకుళించి సంస్తుతుల్
నెమ్మి నొనర్చి మంథగిరి నిందగ నెప్పటిచోటనుంచి కా
ర్యంబు ఫలించి పొల్చిరి కరమ్మనురాగముతోడ నెంతయున్ 227

అర్థము : కరసారసముల్= కమలముల వంటి చేతులను, మకుళించి= ముడిచి, పోల్చిరి= మెలగిరి.

భావము : ధన్వంతరి యొక్క పూజ్యార్హమైన రూపమును చూచిఎదలో సంతసము నిండగా అందరును నిండు మనస్సుతో నేలపై అన్ని అవయవాలు తాకునట్లు వాలిన వారై మ్రొక్కి, ఆవల కమలములవంటి చేతులను మోడ్చి మేలైన పొగడ్తలు ప్రీతితో కావించి, మందర పర్వతమును పూర్వస్థానము నిల్పి, తమ కార్యము ఫలించుటచే (అమృతము వెల్వడుటచే) మిక్కిలి తృప్తి పొంది మెలగిరి.

వ॥ అనిన విని సమ్ముదితాంతరంగులైయమ్మునులు సూతునితోనవ్వలి కథాక్రమం బెట్లనిన 228

భావము : అట్లు సూతుడు హాలహల భక్షణ కథను విన్పింపగా మునులు చాలా సంతోషము నిండిన చిత్తములు కలవారై, సూత మునీంద్రుని ఆవలి కథా క్రమము వినగోరిరి.

క॥ గౌరాదేవీహృదయస
రోరుహసింహాసనాధిరూఢనిరూఢో

దారా! కారుణ్యామృత
సారా! బిలకూటకూటసదనవిహారా! 229

భావము : గౌరా దేవి కమలముల వంటి హృదయమే గొప్ప పీఠముగా చేసుకొని దానిపై కూర్చుండి నిలకడైన వితరణ గుణము కలవాడా! కృప అనెడి అమృతము కలవాడా! బిట్రగుంట సముదాయమును నెలవుగా గలవాడా!

క॥ **విద్వన్మానసగేహ!**
విద్విషమదదళితబాహవిహగసువాహ!
సద్వారిదనిభదేహ!
యద్వైతాత్మాధిరోహ! అఖిలామోహ! 230

భావము : విద్వాంసుల మనస్సులను నివాస గృహములుగా గలవాడా! విరోధుల గర్వమును తొలగించు భుజములు కలవాడా! గరుడుని గొప్ప వాహనముగా గలవాడా! పరిశుభ్రమైన నీటి నిచ్చు మబ్బుల వన్నెల వంటి శరీరము కలవాడా!

(నీల శరీరా!) అద్వైత భావముగల వారి ఎదలను ప్రవేశించువాడా!

పంచవిధసరసిజవృత్తం

శ్రీలక్ష్మీ శా! శ్రీకర చేలా! సితకరజితముఖ! చిరతరకరుణా!
ఫాలాక్షాప్తా! పాండవపాలా! పతగవరగమన! భవభయహరణా!
సాలంకారా! సద్గుణజాలా! సతతశుభవిభవ! సరసిజచరణా!
శైలోద్ధారా! సత్యవిశాలా! శతమఖనతపదసరసవితరణా! 231

భావము : 1. సంపదలొసగు లక్ష్మీదేవికి పతియైనవాడా!
2. శుభములు ప్రసాదించు వస్త్రములను ధరించువాడా!
3. సూర్యతేజమునుజయించు ముఖము కలవాడా!

4. ఎల్లప్పుడు కృప గలవాడా!
5. పరమ శివునకు చెలిమి కాడా!
6. పాండవులను రక్షించిన వాడా!
7. శ్రేష్ఠమైన పక్షిని (గరుడుడు) వాహనముగా గలవాడా!
8. భక్తుల సంసార భయమును తొలగించిన వాడా!
9. వివిధములైన ఆభరణములచే అలంకరింపబడిన వాడా!
10. ఉత్తమ గుణముల మొత్తము కలవాడా!
11. ఎల్లప్పుడు శుభములనిచ్చు శోభకలవాడా!
12. కమలములవంటి పాదములు కలవాడా!
13. గోవర్ధన పర్వతమును ఎత్తినవాడా!
14. విస్తరించిన సత్యలోకము కలవాడా!
15. వంచిన పాదములు కలిగిన (నమస్కరించుచున్న) మహేంద్రుని కలవాడా!
16. వరాలను ఇచ్చు వాడా!

గర్భ ప్రథమ కందం

శ్రీలక్ష్మీ శా! శ్రీకర
చేలా! సితకరజితముఖ! చిరతరకరుణా!
ఫాలాక్షా ప్తా! పాండవ
పాలా! పతగవరగమన! భవభయహరణా!

గర్భ ద్వితీయ కందం

సాలంకారా! సద్గుణ
జాలా! సతతశుభవిభవ! సరసిజచరణా!
శైలోద్ధారా! సత్యవి
శాలా! శతమఖనతపదసరసవితరణా!

గర్భ నీలోత్పల మాల

శ్రీలక్ష్మీ శా! శ్రీకర చేలా!
ఫాలాక్షాప్తా! పాండవ పాలా!
సాలంకారా! సద్గుణ జాలా!
శైలోద్ధారా! సత్యవి శాలా!

గర్భ మణిగణ నికరము

సితకరజితముఖ! చిరతరకరుణా!
పతగవరగమన! భవ భయ హరణా!
సతత శుభ విభవ! సరసిజ చరణా!
శతమఖనతపదసరసవితరణా!

మాలిని॥

ఆమలకమలనేత్రా! యభ్రవిభ్రాజగాత్రా!
శమితవిమతకోపా! సాధుచిత్తప్రదీపా!
శమనదమనమిత్రా! శత్రుదైతేయజైత్రా!
సమదకుముదవర్ణా! సంతతానందపూర్ణా! **232**

భావము : 1. మలినము లేని కమలముల వంటి కన్నులు కలవాడా!
2. ఆకాశమందు విశిష్టముగా ప్రకాశించు శరీరము కలవాడా!
3. అణచబడిన పగవారి కోపము కలవాడా!
4. మంచివారి మనస్సులకు గొప్ప మెరుగైనవాడా!
5. యముని గర్వమును అణచిన శివుని మిత్రుడా!
6. శత్రవులైన నల్లకలువల వన్నె కలవాడా!
7. ముదిరిన నల్ల కలువల వన్నె కలవాడా!
8. అన్ని వేళల ఆనందముతో నిండిన వాడా!

గద్య

ఇది
శ్రీమద్వేంకటేశ్వరవరలబ్ధకవిత్వరచనాచమత్కారభారద్వాజగోత్రపవిత్రసకల
సుకవిజనసఖ్య వేంకటాఖ్యప్రణీతంబైన విష్ణుమాయావిలాసంబను
మహా ప్రబంధంబు నందు ప్రథమాశ్వాసము. **233.**

ద్వితీయాశ్వాసము

శ్రీరంగదురోభాగ
స్మేరాననవికచనవ్యసిత కమలాక్షా
కారుణ్యానిలయ యదుకుల
వీరా భవవార్ధితరణ వేంకటరమణా 1

అర్థాలు : శ్రీ= లక్ష్మీదేవిచేత, రంగత్= ప్రకాశించుచున్న, ఉరోభాగ (ఉరస్ భాగ)= వక్షఃస్థలము కలవాడా!, స్మేర= చిఱునవ్వుతో కూడిన, ఆనన= ముఖమందు, వికచ= వికసించిన, నవ= కొత్తవైన, సిత=తెల్లనైన, కమలాక్ష= కమలాలవంటి కన్నులు కలవాడా!, కారుణ్యానిలయ= దయకు నెలవైనవాడా!, యదుకులవీరా= యాదవ వంశమునందు వీరుడా!, భవ= సంసారమనే, వార్ధి= సముద్రమును, తరణ= దాటించే, వేంకటరమణా= వేంకటా చలపతీ!

భావము : లక్ష్మీదేవిచేత ప్రకాశించే వక్షఃస్థలము కలవాడా! చిఱునవ్వుతో కూడిన ముఖముతో అప్పుడే వికసించిన తెల్లతామర వంటి కన్నులు కలవాడా! దయకు నెలవైనవాడా! యాదవ వంశమునందు శ్రేష్ఠుడా! సంసారమనే సముద్రమును దాటించే వేంకటాచల రమణా! (ఇది ద్వితీయాశ్వాస ఆరంభములో శ్రీ మద్వేంకటేశ్వరునికి చేసిన స్తుతి).

ఆ॥ అవధరింపు శౌనకాదిసన్మునులకు
సూతు డిట్టులనియె ప్రీతితోడ
నమర దైత్యు లిట్టు లమృతంబు మొదలైన
కలితవస్తువులను గాంచియున్న 2

భావము : శౌనకుడు మొదలైన మునిశ్రేష్ఠులకు సూతుడు ప్రీతితో ఈవిధముగా చెప్పుచున్నాడు. దేవతలు, రాక్షసులు అమృతము మొదలైన వానిని పొందియుండగా.

చ॥ సరసిజసంభవుండచట సర్వమయున్ హరి సంస్మరించినన్
కరుణదలిర్ప మ్రోల సమకట్టిన సంతసమంది దేవతా
సురులును దాను జాగి శ్రుతి సూక్తుల సన్నుతిజేసి యో మహా
పురుష! భవత్కటాక్షమునఁ బుట్టె మహత్తరవస్తు సంఘముల్ 3

అర్థాలు : సరసిజ సంభవుండు= పద్మమునందు పుట్టినవాడు - బ్రహ్మ, సర్వమయున్= అన్నిటియందు వ్యాపించియున్న, హరిన్= శ్రీమహావిష్ణువును, సంస్మరించినన్= తలచుకొనగా, కరుణ= దయా గుణము, తలిర్పన్= అతిశయించగా, మ్రోల= ఎదుట,సమకట్టిన= ఏర్పడగా, ప్రత్యక్షము కాగా, దేవతా అసురులను= దేవతలును, రాక్షసులునుతానును= బ్రహ్మ, చాగి= సాష్టాంగపడి, శ్రుతిసూక్తులన్= వేదమంత్రాలతో, సన్నుతిన్ చేసి= ప్రార్థనచేసి, ఓ మహాపురుష= ఓ దేవదేవా!, మహత్తరవస్తు సంఘముల్= గొప్పవైన ఈవస్తువులు (కౌస్తుభమణి, ఐరావతము మొ॥), భవత్‌కటాక్షమునన్= నీదయతో, పుట్టె= పుట్టెను.

భావము : బ్రహ్మ అన్నిటియందు వ్యాపించియున్న శ్రీమహావిష్ణువును తలచుకొనగా, ఆయన దయాగుణము ఒప్పుచుండగా ఎదుట ప్రత్యక్షమయ్యెను. అప్పుడు బ్రహ్మ ఇతరదేవతలు, రాక్షసులు సంతోషముతో స్తుతించి, "ఓమహాపురుషా! నీ దయతో గొప్పవైన కౌస్తుభము, ఐరావతము మొదలైనవి అన్నీ పుట్టినవి."

క॥ వీనిని యెవ్వరికెవ్వరి
కీనోపునోవారి వారి కిప్పించి రమన్
మానితకౌస్తుభరత్నము
మానుగ ధరియింపవలయు మాన్యచరిత్రా 4

అర్థాలు : మాన్యచరితా= గౌరవింపదగిన చరిత్రకలవాడా!, వీనిని= ఈవస్తువులను, ఎవ్వరికిన్, ఎవ్వరికిన్= ఎవరెవరికి, ఈనోపునో=

ఈయదగునో, రమన్= మహాలక్ష్మిని, మానిత= గౌరవింపదగిన= కౌస్తుభరత్నమున్= కౌస్తుభమణిని, మానుగన్= ఒప్పిదమగునట్లుగా, ధరియింపవలయున్= నీవు ధరింపవలెను.

భావము : "గౌరవింపదగిన చరిత్రకలవాడా! ఈ వస్తువులను ఎవరెవరికి ఈయదగునో వారివారికి,ఇప్పించిశ్రీమహాలక్ష్మినిగౌరవింపదగినకౌస్తుభ మణిని నీవు ధరింపవలెను."

వ॥ అని విన్నవించిన 5

భావము : అని విన్నవింపగా

సీ॥ అంబుజసంభవు, డాచార్యుడైయొప్పె
పేర్మి శక్రుడు పెళ్ళి పెద్దగాగ
వరుస దిక్పాలకుల్, పరిచర్య లొనరింప
నచ్చరకన్నియ లాడిపాడ
క్రందున ఘన దివ్యదుందుభుల్ మొరయంగ
మునిసతుల్ శోభనంబులును బాడ
తుంబురునారదాదులు గానములు సేయ
చదలవేల్పులు పూల జల్లు గురియ

తే॥ క్రమముతో మునులు వేదపాఠములు జదువ
గంగకాంచనకలశోదకంబు లిడగ
వారినిధిరాజు కన్నియ దారవోయ
హరి వరించెను ముదముతో నాదిలక్ష్మి 6

అర్థాలు : అంబుజసంభవుడు= పద్మములో పుట్టినవాడు, బ్రహ్మ;ఆచార్యుడై= పురోహితుడై, ఒప్పెన్= వ్యవహరించెను, శక్రుడు= దేవేంద్రుడు, పెళ్ళి పెద్దగాగ= పెళ్ళి పెద్దగా, వరుసన్= క్రమముగా, దిక్పాలకుల్= ఎనిమిది

దిక్కులను పాలించే దేవతలైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానుడు అనువారు;పరిచర్యలు= సేవలు, ఒనరింపన్= చేయగా, అచ్చరకన్నియలు= అప్సరసలు,ఆడిపాడన్= ఆడుచూపాడగా, క్రందునన్= ఎక్కువగు, ఘన= గొప్పవైన, దివ్యదుందుభుల్= దేవలోక వాద్యాలు, మొరయంగ= మ్రోగగా, మునిసతులు= మునికాంతలు, శోభనంబులును= మంగళగీతాలను, పాడన్= పాడగా, తుంబురు నారదాదులు= తుంబురుడు, నారదుడు మొదలైనవారు; గానములు= సంగీతములు, చేయన్= విన్పింపగా, చదల వేల్పులు= ఆకాశములోని దేవతలు, పూలజల్లు= పూలవానను, కురియన్= కురిపింపగా, క్రమముతో= ఒకవరుసలో, మునులు= మునులు, వేదపాఠములు= వేదమంత్రాలు, చదువన్= చదువగా, గంగ= గంగాదేవి, కాంచన కలశ ఉదకంబులు= బంగారు కలశముతో నీటిని, ఇడగన్= పోయగా, వారినిధిరాజు= సముద్రుడు, కన్నియన్= తనకన్యను,ఆదిలక్ష్మిన్= ఆదిలక్ష్మిని, ధారపోయ= నీటిని పోయుచు దత్తము చేయగా, హరి= శ్రీమహావిష్ణువు, వరించెను= భార్యగా పొందెను.

భావము : బ్రహ్మ పురోహితుడుగాను, దేవేంద్రుడు పెళ్ళిపెద్దగాను, వ్యవహరింపగా దిక్పాలకులు సేవలు కావింపగా అప్సరసలు నాట్య మాడుచు పాడుచుండగా దేవదుందుభులు మ్రోగుచుండగా, ముని కాంతలు మంగళగీతాలు పాడగా, తుంబురుడు నారదుడు సంగీతము విన్పింపగా, ఆకాశమునుండి దేవతలు పూలవాన కురిపింప మునులు వేదమంత్రాలు చదువగా, గంగాదేవి బంగారుకలశముతో, పవిత్రమైన నీటిని చల్లగా సముద్రుడు ఆదిలక్ష్మీదేవిని దానము చేయగా, శ్రీ మహావిష్ణువు సంతోషముతో వివాహమాడెను.

క॥ ఆ సమయంబున హరికిన్
భాసురమణిభూషణములు పటు కౌస్తుభ ము

ల్లాసముతో నరణము దగ
గా సరిదధిపతి యొసంగె గౌరవమెసగన్ 7

అర్థాలు : హరికిన్= శ్రీమహావిష్ణువునకు, సరిత్ అధిపతి= సముద్రుడు (నదులకు నాయకుడు), భాసుర= ప్రకాశమగు, మణిభూషణములు= మణులు పొదిగిన అలంకారములు, పటు= గట్టి దయిన, శ్రేష్ఠమైన లేదా విలువైన; కౌస్తుభమున్= కౌస్తుభమణిని, ఉల్లాసముతోన్= సంతోషముతో, అరణము= వధువు పుట్టింటివారు ఇచ్చే కానుక, తగగాన్= తగినట్లు, గౌరవము ఎసగన్= గౌరవము అతిశయించునట్లు, ఒసంగెన్= ఇచ్చెను.

భావము : ఆ సమయములో అల్లుడైన శ్రీమహావిష్ణువునకు మామగారైన సముద్రుడు ప్రకాశమానమగు మణులు పొదిగిన ఆభరణాలను శ్రేష్ఠమైన కౌస్తుభమును అరణపు కానుకగా సమర్పించెను.

వ॥ అచ్చరలిట్లని స్తుతియించిరి 8

భావము : అప్సరసలు ఈ క్రింది విధముగా స్తుతించిరి.

శో.వృ.॥ శోభనమే నగ సుస్థిరధృతికిన్
శోభనమే నయశోభితమతికిన్
శోభనమే ఫణిసూదన గతికిన్
శోభనమే నతసూరివితతికిన్ 9

అర్థాలు : శోభనమే= మంగళమగుగాక, నగ= పర్వతమును, సుస్థిరధృతికిన్= సుస్థిరముగా ధరించినవానికి, నయ= న్యాయము నుండి తప్పని, శోభిత= ప్రకాశించే, మతికిన్= బుద్ధి గలవానికి, ఫణిన్= సర్పమును, సూదనగతికిన్= మర్దించిన వానికి, నతి= నమస్కరించుచున్న, సూరి= పండితులు, వితతికిన్= సముదాయము కలవానికి.

భావము : మందర పర్వతమును సుస్థిరముగా ధరించినవానికి మంగళమగు గాక (కూర్మావతారం). న్యాయము తప్పని ధర్మమార్గ ప్రవర్తనశీలునకు

మంగళమగు గాక (శ్రీరామావతారం). కాళీయుని మర్ధించి నర్తనమాడిన వానికి మంగళమగు గాక (శ్రీకృష్ణావతారం). పండితులచే నమస్కృతులు పొందిన వానికి మంగళమగుగాక (బుద్ధావతారం).

ఇది విశేషవృత్తము. పాదానికి 12 అక్షరాలు. పాదానికి భ భ భ స అనే గణాలు. 7వ అక్షరము యతిస్థానము. ప్రాస నియమమున్నది.

శోభనవృత్తము (సరసగతి)

శ్రీకరమూర్తికి శ్రీవరదునకున్
నాకవిరోధి వినాశకరునకున్
లోకనివాసికి లోకధరునకున్
ప్రాకటసత్యకృపానిరతునకున్ 10

అర్థాలు : శ్రీకరమూర్తికిన్= శుభాలను కలిగించే స్వరూపము కలవానికి, శ్రీ వరదునకున్= సౌభాగ్యాలను ఇచ్చేవానికి, నాక విరోధి= స్వర్గానికి విరోధి అయిన వారిని, వినాశకరునకున్= నాశనము చేయువానికి, లోకనివాసికిన్= లోకములను నివాసముగా కలవానికి, లోకధరునకున్= లోకాలను ధరించువానికి, ప్రాకట= ప్రసిద్ధమైన, సత్య= సత్యమునందును, కృప= దయయందును, నిరతునకున్= ఆసక్తి కలవానికి.

భావము : శుభాలను కలిగించే స్వరూపము కలవానికి సౌభాగ్యాలను ఇచ్చేవానికి, స్వర్గవిరోధి అయిన వారిని నాశనము చేయువానికి, అన్ని లోకాలలోను నివసించువానికి, అన్ని లోకాలను పోషించు వానికి ప్రసిద్ధమైన సత్యమునందు, కరుణయందు ఆసక్తి కలవానికి మంగళమగు గాక.

వ॥ అప్పుడు బ్రహ్మ యిట్లని స్తుతియించె 11

భావము : అప్పుడు బ్రహ్మ ఇట్లు స్తుతించెను.

సీ॥ సకల ప్రపంచంబు సంకల్పమాత్రన
కల్పించు త్రిభువనకర్త వీవు
నిర్వికారుండవు నిర్గుణుండవు నాది
కారణుండవు నిరాకారమీవు
ఆధ్యాత్మకుడవాదిమధ్యాంతరహితుండ
వగణితుండవు మాయివఖిలమయుడ
వఖిలాత్మకుండవు నచ్యుతుండవు పర
బ్రహ్మంబును జగత్పావనుడవు

ఆ॥ పరుడవభవుడవును భగవంతుడవు నీవ
నిన్ను బొగడ నెట్లు నేర్తు నీశ!
సకలమందు నీవ సకలంబు నీమాయ
నిను భజింపగంటి నీరజాక్ష! 12

అర్థాలు : సకల ప్రపంచంబు= విశ్వమంతటిని, సంకల్పమాత్రను= తలంచినంతనే, కల్పించు= సృష్టించే, త్రిభువన కర్తవు= ఈ ముల్లోకాల నిర్మాతవు, నిర్వికారుండవు= మార్పులేనివాడవు, నిర్గుణుండవు= గుణాలు లేనివాడవు, ఆదికారణుండవు= సృష్టికి మొదట హేతువు అయినవాడవు, నిరాకారము= ఏఆకారము లేనివాడవు, ఈవు= నీవు, ఆధ్యాత్మకుడు= జీవాత్మకంటే అధికమైన వాడవు, ఆదిమధ్యాంత రహితుండవు= తొలి, నడిమి, కడలేనివాడవు; అగణితుండవు= లెక్కింపజాలనివాడవు, మాయివి= మాయకలవాడవు, అఖిలమయుడవు= అన్నియు నీవే అయినవాడవు, అఖిల ఆత్మకుండవు= అన్నిటియందు ఆత్మరూపములో ఉండేవాడవు, అచ్యుతుండవు= నాశనములేనివాడవు, పరబ్రహ్మంబును= అతిశ్రేష్ఠమైన బ్రహ్మదేవతవును, జగత్పావనుడవు= లోకమును పవిత్రము చేసేవాడవు, పరుడవు= అన్నింటికంటే ఇతరుడవును, అభవుడవు= పుట్టుకలేనివాడవు,

భగవంతుడవు= ఐశ్వర్యము కలవాడవు, నీవ= నీవే, ఎట్లు= ఏవిధముగా, పొగడనేర్తున్= పొగడ గలను?, ఈశ= ఓప్రభువా!, సకలమందు= అన్నింటియందు, నీవ= నీవే, సకలంబందు= ఈ సమస్త ప్రపంచము, నీమాయ= నీమాయయే, నీరజాక్ష= పద్మాలవంటి కన్నులు కలవాడా!, నిను= నిన్ను, భజింపన్ కంటి= పూజింప గలిగాను.

భావము : తలంచినంతనే విశ్వమును సృషించగల ముల్లోకనిర్మాతవు. మార్పు లేనివాడవు. గుణాలు లేనివాడవు. లోకాలు, పుట్టుటకు మొట్టమొదటి కర్తవు నీవు. ఏరూపము లేనివాడవు. జీవాత్మలకంటే అధికుడవు. ఆది-మధ్య-అంతములు లేనివాడవు. ఏవిధముగాను పరిగణించుటకు వీలులేనివాడవు మాయావివి అంటే టక్కులు కలవాడవు. అన్నియు నీవే అయినవాడవు. అన్నింటియందు ఆత్మరూపములో ఉండేవాడవు. నాశనములేనివాడవు. నీవే పరబ్రహ్మము. లోకాలను పవిత్రము చేయువాడవు. పరమాత్ముడవు. పుట్టుకలేనివాడవు. దేవదేవుడవు. అటువంటి ఓ ప్రభూ నిన్ను నేను స్తుతించగలనా! అన్నిటిలోను సమస్త ప్రపంచము నందు నీవే ఉన్నావు. ఈ సర్వము నీ మాయయే కదా! ఓ నీరజాక్ష! అటువంటి నిన్ను పూజచేయగలిగాను .

వ॥ ఇంద్రుడిట్లనియె 13

భావము : ఇంద్రుడు ఈ విధముగా పలికెను

ఉ॥ దీనుల నెందున న్వెదకి తెచ్చి మహాద్భుత ఘోర దుర్దశల్
మానిచి యీప్సితార్థములు మన్ననతో నొనగూర్చి నిశ్చలం
బైన దయారసంబు దగ నర్మిలి బ్రోతువు లేగ నావు స
న్మానముతోడ వెంబడిని మక్కువ గొంచుచునుండు నట్లుగన్ 14

అర్థాలు : దీనులను= దరిద్రులను, ఎందునన్= ఎక్కడ ఉన్నా, మహాద్భుత= మిక్కిలి ఆశ్చర్యకరమైన, ఘోర= భయంకరమైన, దుర్దశల్= చెడ్డ కష్టాలను,

మానిచి= తొలగునట్లుగా చేసి, ఈప్సిత అర్థములు= కోరిన కోరికలు, మన్ననతోన్= ఆదరముతో, ఒనగూర్చి= కల్గించి, నిశ్చలంబైన= స్థిరమైన, దయారసంబున్= దయాగుణముతో, తగన్= తగువిధముగా, అర్మిలిన్= ప్రీతితో, ప్రోతువు= కాపాడుదువు, లేగన్= లేగదూడను, ఆవు= తల్లి ఆవు, సన్మానముతోడన్= శ్రద్ధతో, వెంబడిని= వెన్నంటి, మక్కువన్= ప్రేమతో, కాంచుచుండు= కాపాడువిధముగా,

భావము : ''రక్షణ లేక సహాయము అవసరమైన వారిని ఎక్కడ ఉన్నప్పటికిని వెదకి తీసుకొనివచ్చి, వారి ఆశ్చర్యకరమైన, భయంకరములైన చెడ్డకష్టాలను, తొలగించి, కోరిన వానిని ఆదరముతో ఇచ్చి, నీ స్థిరమైన దయాగుణమునకు తగినట్లు ప్రీతితో రక్షింతువు. అదెట్లనగా లేగదూడను తల్లి ఆవు, శ్రద్ధతో, ప్రేమతో వెంబడించి కాపాడినట్లు, నీవు దీనుల యెడ ప్రవర్తించెదవు''.

వ॥ సురలిట్లనిరి **15**

భావము : దేవతలు ఇట్లు వచించిరి.

ఉ॥ సర్వజగంబులుం జఠర సద్మమునందు వసించియుండగా
సర్వజగన్నివాసివన సన్నుతికెక్కగ నిన్నుగాని దీ
సర్వజగంబులుం గలవె సర్వమయుండవు నీవు గాన నో
సర్వశరణ్య! మమ్ముల బ్రసన్నత గాచుట నీకు వింతయే **16**

అర్థాలు : సర్వజగంబులున్= లోకములన్నియు, జఠరసద్మమునందున్= నీ కడుపు అనే ఇంటిలో, సర్వజగత్ నివాసివి= లోకాలన్నింటిలో నివసించువాడవు, సన్నుతికి ఎక్కగన్= పొగడ్త కలుగగా, నిన్నున్ కానిది= నువ్వుకాకుండా, సర్వమయుండవు= సర్వము అయినవాడవు, ఓ సర్వశరణ్యా= అందఱిచే ఆశ్రయింపబడువాడా!, ప్రసన్నతన్= అనుగ్రహముతో, కాచుట= కాపాడుట, వింతయే= కొత్తకాదు కదా!

భావము : ''లోకాలన్నీ నీకడుపు అనే ఇంటిలో ఉండగా, లోకాలన్నిటి యందు నివసించువాడవని పొగడ్త కెక్కినావు. నీవు కాని సర్వలోకాలు ఉన్నాయా? సర్వము అయినవాడవు. కాబట్టి అందఱకు శరణుడవు. మమ్ము దయతో కాపాడుట నీకు కొత్తకాదు కదా!''

వ॥ మును లిట్లనిరి **17**

వచనము : మునులు ఇట్లు వచించిరి.

అర్థాలు : ఓ వనరుహ నాభ!= పద్మము నాభియందు గలవాడా!, అనిశంబును= ఎల్లవేళల, సనకసనందనాదులు= సనకుడు, సనందుడు మొదలగువారు; పదపద్మయుగ్మమున్= పద్మాలవంటి పాదాల జంటను, పాదుకొల్పి= నిల్పుకొని, కడు= మిక్కిలి, మన్ననన్ కాంచి= గౌరవమును పొంది, జగత్త్రయంబునన్= ముల్లోకాలలోను, వినుతిన్= మంచిపేరును, వహించి= పొంది, మోక్షపదవిన్= మోక్షమనెడి స్థితిని, తగన్= తగినట్లు, బాగుగా; కాంచినవారు, కాదె= పొందినవారే కదా!, ఆది= మొదటిదైన, పరవస్తువు= లోకానికి అతీతమైనది (పరబ్రహ్మము), నీవె కదయ్యా= నీవే కదా!

భావము : ''ఓ పద్మనాభా! ఎల్లవేళల సనక సనందనాదులు మీ పాద పద్మాలను మనస్సులో నిల్పుకొను గౌరవమును పొంది ముల్లోకాలలో కీర్తింపబడి మోక్ష పదవిని పొందిరి కదా! ఓ మాధవా మొట్ట మొదటి పరబ్రహ్మము నీవే కదా!''

వ॥ మఱియక్షగంధర్వ సిద్ధ సాధ్య కిన్నర కింపురుషపన్నగాదులు బహుప్రకారంబుల సంస్తుతించిన సంతుష్టాంతరంగుండైన హరియనుజ్ఞ కమలభవుండు **18**

భావము : ఆకాశగమనులు అందఱు బహువిధములుగా స్తుతింపగా సంతృప్తి చెందిన హరి అనుమతితో బ్రహ్మ

క॥ **దివిజేశ్వరునకు ఉచ్చైః**
శ్రవమమరె లేఖాప్సరసలసంతానములన్
రవిశక్రానుజునకునై తారా
ధవళాక్షి నొసంగ సుధను దనుజులు గొన్నన్ **19**

అర్థాలు : దివిజ ఈశ్వరునకున్= దేవతలకు రాజైన ఇంద్రునకు, ఉచ్చైః శ్రవము= తెల్లని గుఱ్ఱము, లేఖ అప్సరస= దేవ వేశ్యలు, సంతానములన్= సంతాన కల్పవక్షములు, అమరెన్= అర్పింపబడినవి, రవిశక్ర అనుజునకునై తార ధవళాక్షిన్= ఆదిత్య మహేంద్రులకు తమ్ముడైన ఉపేంద్రునకు (విష్ణువునకు) తెల్లని కన్నులు గల మహాలక్ష్మిని, ఒసంగన్= ఈయగా, దనుజులు= రాక్షసులు, సుధను= అమృతమును, కొన్నన్= తీసికొనగా.

భావము : ఇంద్రునకు తెల్లని గుఱ్ఱము, వేశ్యలు, కల్పవృక్షాలు అర్పింపబడినవి. విష్ణువునకు లక్ష్మిని భార్యగా ఇచ్చిరి. అమృతమును రాక్షసులు గ్రహించిరి.

ఉ॥ **అంత సురేశ ముఖ్య దివిజావలి గన్గొని పట్టు పట్లచే**
నెంతయు నిగ్గులాడుచును నిట్లని రీయమృతంబు మీర లి
ట్లంతయు గొంచుబోవ నగునా యన కల్గినవన్ని మీర లే
వంతునగొంటిరీ సుధ యవశ్యము మేము గ్రహింతు మన్నచో **20**

అర్థాలు : సురేశ= ఇంద్రుడు, ముఖ్య= ముఖ్యులయిన, దివిజావలి= దేవతల సమూహము, కన్గొని= తెలిసికొని, పట్టుపట్లచేన్= ఆవేశముతో (ఉద్రేకముతో), ఎంతయున్= మిక్కిలిగా, ఇగ్గులాడుచును= పెనగులాడుచు, ఇట్లనిరి= ఈవిధముగా అన్నారు, ఈ అమృతంబు= ఈ అమృతము, మీరలు= మీరు, ఇట్లు అంతయు= ఈ విధముగా అంతా, కొంచున్ పోవన్= తీసికొని పోవుట, అగునా= తగునా?,అనన్= అని పల్కగా, కల్గినవన్ని= ఏర్పడినవి అన్నీ, పుట్టినవి అన్నీ; మీరలు= మీరు, ఏ వంతునన్= ఏ ప్రకారముగా, కొంటిరి= తీసికొన్నారు?, ఈసుధన్= ఈ అమృతమును, అవశ్యము= తప్పక, మేము= మేము, గ్రహింతుము= తీసికొందుము, అన్నచోన్= అనగా.

భావము : అప్పుడు ఇంద్రుడు ఇతర ముఖ్యులైన దేవతలు, రాక్షసులు అమృతమును గ్రహించుటను తెలిసికొని ఆవేశములో వారితో పైనగు లాడుచు "మీరు ఈ విధముగా ఈ అమృతమును తీసికొనిపోవుట తగునా!" అని దేవతలు పల్కగా, రాక్షసులు "కల్గిన" వన్నీ మీరు ఎట్లు తీసికొన్నారు? ఈ అమృతమును మాత్రమే మేము తప్పక తీసికొందుము" అనగా అప్పుడు...

చ॥ **విడుడని దేవతల్ విడువరెందులకంచును దైత్య సంఘముల్**
కడు కలహింపగా దనుజ కంటకు డాత్మదలంచె దానవుల్
తొడిబడగొన్న మోసమిది తూర్ణముగా విడిపింతు నంచు దా
పడతుకరూపు గైకొనియె భావజమోహన సాయకంబనన్ **21**

అర్థాలు : విడుడు అని= విడిచిపెట్టండి అని, విడువరె+ఎందుకొ+అంచును= ఎందుకు విడువరు అని, దైత్య సంఘముల్= రాక్షస సమూహములు, కడు= తీవ్రముగా, దనుజ కంటకుడు= రాక్షస విరోధి అయిన శ్రీమహావిష్ణువు, దానవుల్= రాక్షసులు, తడబడిగొన్న= తొందరపాటుచే, తూర్ణముగాన్= త్వరగా, విడిపింతును అంచు= విడిపించెదను అని, భావజ= మన్మథుని యొక్క, మోహన= ఆకర్షించు, సాయకంబు అనన్= బాణమేమో అన్నట్లు, పడతుక= స్త్రీ, రూపు= రూపమును, కైకొనియెన్= పొందెను.

భావము : 'విడిచి పెట్టండి' అని దేవతలు, 'ఎందుకు విడువరు' అని రాక్షసులు తీవ్రముగా పోట్లాడుకోగా రాక్షస విరోధి అయిన శ్రీమహావిష్ణువు రాక్షసులు తొందరపాటు చేత చేసిన మోసమని త్వరగా అమృతమును విడిపించెదనని మన్మథుని యొక్క ఆకర్షించు బాణమా ఏమి? అనునట్లు స్త్రీ యొక్క రూపమును పొందెను.

సీ॥ అడుగులకెంజాయలలర చిగురుల
నడరు గోరుల తేటయుడుల మీట
జంఘలపోలిక జాలదు శాలిక
యూరుల సంరంభ మోర్చె రంభ
భారంపు జఘనంబు ధారుణికి ఘనంబు
మొనదేలు పాలిండ్లు మొనయు చెండ్లు
మోమొప్పు నెఱ చందమామడెందము గప్పు
కచభారమళిగమి కడల నంపు

తే॥ నొడలిజిగిపెంపు మురిపెంపు నడలసొంపు
సొలపుజూపుల తేలింపు సోయగంపు
కలువరేకుల నణగించు కనుల పెంపు
నలరి త్రిభువనమోహిని యనగ బొలిచె 22

అర్థాలు : అడుగులన్= పాదముల యందు, కెంజాయలు= కెంపు వన్నెలు, ఎఱుపురంగు; అలరన్= ఒప్పగా, చిగురులన్= చిగురుటాకులను, డాయన్= సమీపించగా, అదరు= అతిశయించగా, నఖములు= గోరులు, తేటఉడుల= నిర్మలములయిన నక్షత్రములను, మీటు= సవరింపగా, జంఘల= కాలిపిక్కలతో, శాలిక= సన్నని వరిపైరుతో, ఊరుల= తొడల, సంరంభము= పొంగు, రంభ= అరటి చెట్టు, ఓర్చెన్= సహించెను, భారంపు= బరువైన, జఘనంబు= పిఱుదులు, ధారుణికి= భూమికంటె, ఘనంబు= గట్టిది, మొనదేలు= పొంగిన, పాలిండ్లన్= చన్నులు, మొనయు= పూను, చెండ్లు= పూల బంతులు, మెనయు= పూను, నెఱ= నిండైన, చందమామ= చంద్రబింబము, చందము= వంటిది, కప్పు= నల్లనైన, కచభారము= బరువైన నిడుపైన జుట్టు, అళికులము= తుమ్మెదలను, కడలన్అంపు= చెదరిపోవునట్లు చేయును, ఒడలి= శరీరము యొక్క, జిగి= కాంతి యొక్క మేలిమి, మురిపెంపు= ముచ్చటైన, నడల= నడకల, సొంపు= ఒయ్యారము,

సొలపు= పరవశింపజేయు, చూపుల= చూపులయొక్క, తేలింపు= ఉల్లాసము, సోయగంపు= సొగసైన, కలువరేకులన్= కలువపువ్వు రేకుల అందమును, అణకించు= అణచివేయు, కనుల పెంపు= కనులసొగసు, అలరి= వికసించి, త్రిభువన మోహిని= ముల్లోకాలను మోహింప చేయగలది, అనగన్ అనునట్లు, పొలిచె= నిల్చెను.

భావము : పాదములు చిగురుటాకులవలె ఎఱుపువన్నె కలవి. గోరులు తెల్లనైన నక్షత్రములవంటివి. కాలిపిక్కలు వరిపంటవలె సన్ననైనవి. తొడలు అరటిచెట్లు వంటివి. పిఱ్ఱలు గట్టివి. మొనదేలిన చన్నులు పూలగుత్తుల వంటివి. ముఖము పూర్ణచంద్రుని వంటిది. నల్లనైన జుట్టు, తుమ్మెదల వన్నె కంటే మంచిదగుటచే వానిని చెదరిపోవునట్లు చేయును. మేలైన శరీరకాంతి, నడకలు ఉల్లాసపు చూపులు, వికసించు కన్నులు సొగసుతో ముల్లోకాలను మోహింపజేయు విధమున మోహిని నిల్చెను.

సీ॥ మందారకుసుమదామములు జుట్టిన వాలు
జడతుద బలుకెంపు మడమనొరయ
సీమంత వీథిని జేర్చుక్క ముత్యాల
బొట్టు కస్తూరి రేఖ పొలుపు మిగుల
గ్రైవేయ హారకకంకణమేఖలా నూపు
రంబుల నినదంబు రవళి మొరయ
కటికుచభారసంకట మన లేగౌను
గిటగిట వణకంగ నటన మొనయ

తే॥ సిబ్బితపు చూపులిరుగడ చివుకు చివుకు
చును నిశాచర దివ్యుల మనసు గలగ
గ్రుచ్చి పొరంగ చిరినవ్వుకోపులెత్త
ముగ్ధతన మెల్ల తనదు సొమ్ముగ గడంగి 23

అర్థాలు : మందార పుష్పముల యొక్క దామములు= మాలలు, దండలు; చుట్టిన= పెట్టుకొన్న, వాలుజడ= నిడుపైన జడయొక్క, తుద= కొన (చివఱ), పలుకెంపు= దట్టమైన కెంపు వర్ణముగల, మడిమన్= చీలమండలమునకు ఇరుప్రక్కల గల కాలిభాగమును, ఒరయన్= తాకగా, సీమంతవీధిని= పాపటయందు, ముత్యాలబొట్టు= ముత్యాల తిలకము, కస్తూరిరేఖ= కస్తూరి రేఖయొక్క, పొలుపు= అందమును, మిగుల= అతిశయించగా, గ్రైవేయహార= మెడయందు బంగారు దండలు, కంకణ= గాజులు, మేఖల= ఒడ్డాణము, నూపురంబుల= కాలి అందెలయొక్క, నినదంబు= ధ్వనుల, రవళి= హోరు, మొరయ= మెలగగా, కటి= మొల, కుచ= వృక్షోజాల, భార= బరువు, సంకటమన= శ్రమ కలిగింపగా, లేగౌను= సన్నని నడుము, గిటగిట= గిటగిట (వణకడాన్ని సూచించే ధ్వన్యనుకరణ శబ్దం), వణకంగ= వణకగా, నటన= నాట్యమువలె, మెరసి= ఒప్పి, సిబ్బితపు= నును సిగ్గుగల చూపులు, ఇరుగడ= రెండువైపుల, చివుకు చివుకుచును= ప్రసరింపజేయుచు, నిశాచర= రాక్షసుల, దివ్యుల= దేవతల, మనసున్= మనస్సును, కలగన్= కలత చెందునట్లు, గ్రుచ్చి= తపింపజేసి, పొరంగ= వర్తింపగా, చిఱునవ్వు= లేతనవ్వు, కోపులెత్త= అందాలు చిందించగా, ముగ్ధతనమెల్ల= అమాయికత్వమంతా, తనదు= తనయొక్క, సొమ్ముగన్= సంపదగా, కడంగి= పూన్కొని.

భావము : మందార పూల సరాలను చుట్టుకొన్న నునుపైన జడకొన, ఎఱ్ఱనైన కాలిమడమలను తాకగా, నొసటియందు ముత్యాల తిలకము, కస్తూరిరేఖవలె అందము పొందింపగా, మెడయందు బంగారు దండలు, గాజులు, మొలయందు ఒడ్డాణము, కాలిఅందెల ధ్వనియొక్క, హోరు, చన్నుల బరువు, శ్రమకలిగింపగా, సన్నని నడుము వణకుచు, నాట్యమాడగా మృదువైన సిగ్గుగల చూపుల తళుకులు ప్రసరింపజేయుచు, రాక్షసుల, దేవతల మనస్సులను కలవరపెట్టుచు మోహిని వారియెదుట నిల్చెను.

ఉ॥ చక్కెర తేనెయో సుధయొ చంద్రకరంబులొ ద్రాక్షలోయనన్
మక్కువమాధురీరససమన్వితమై తగుముద్దు పల్కులన్
చక్కెరబొమ్మయిట్లనె నిశాచర దివ్యులు నిందు మత్సరం
బెక్కగ పోరు బెట్టుకొన నేమి కతంబన దివ్యులిట్లనన్ 24

అర్థాలు : చక్కెరతేనెయో= చక్కెరపానకమో, సుధయో= అమృతమో, చంద్రకరంబులో= చంద్రుని కిరణములో (వెన్నెలయో), ద్రాక్షలో=ద్రాక్షపళ్లో, అనన్= అనునట్లు, మక్కువన్= ప్రేమతో కూడిన, మాధురీరస= తీయని ద్రవముతో, సమన్వితమై= కూడినదై, తగు= తగినట్లు, ముద్దుపల్కులన్= ముద్దులొలుకు మాటలతో, చక్కెరబొమ్మ= అందమైన ఆయింతి, ఇట్లనెన్= ఈవిధముగా పల్కెను, నిశాచరులును= రాక్షసులును, దివ్యులును= దేవతలును, ఇందు= ఇక్కడ, మత్సరంబు= అసూయ, ఎక్కగ= కలుగునట్లు, పోరు= తగవును, పెట్టుకొనన్= పెట్టుకొనుటకు, ఏమికతంబు= ఏమికారణము, అనన్= అని పల్కగా, దివ్యులు= దేవతలు, ఇట్లనిరి.

భావము : చక్కెర పానకమో, అమృతమో, వెన్నెలో ద్రాక్షపళ్లో అనేటట్లు ప్రేమతోను, మధుర రసముతోను కలిసిన ముద్దులొలికే మాటలతో ఆ అందమైన యింతి ఇట్లనెను. "రాక్షసులు, దేవతలు పరస్పరము అసూయ కలిగేటట్లు జగడమును పెట్టుకొనుటకు కారణఏమి?" అని అనగా దేవతలు ఇట్లన్నారు.

చ॥ అసురులు మేమునుం గలసి యంబుధి దర్చిన నందు నీ సుధా
రసము జనించె దాని గొని రాక్షసు లేగుచునున్నవారు మ
మ్మసదుగ జూచి నిన్ను గని యాత్మలు సంతసమందె మాకు నో
బిసరుహనేత్ర! నీ పలుకువెంబడి బోయెదమెట్లు నిక్కమున్ 25

అర్థాలు : ఓ బిసరుహనేత్ర= ఓ కమలాక్షి!, అంబుధిన్= పాల కడలిని, తర్చినన్= చిలుకగా, ఈ సుధారసము= ఈ అమృతము, అసదుగన్=

బలహీనులుగా, ఆత్మలు= మనస్సులు, నీ పలుకువెంబడి= నీ మాట ప్రకారము, ఎట్లు= ఎటులైనను.

భావము : "ఓ కమలాక్షి! రాక్షసులును, మేమును కూడి పాలకడలిని చిలుకగా దానిలో ఈ అమృతము పుట్టినది. రాక్షసులు మమ్మల్ని బలహీనులుగా భావించి దానిని తీసుకొని వెళ్ళిపోవుచున్నారు. నిన్ను చూడగానే మా మనస్సులు సంతోషించినవి. నీమాట ప్రకారము నడుచుకొందుము, తప్పక నీ నిర్ణయము ఎట్టిదైనా."

మ॥ అనినన్ రక్కసిమూకతో ననియె నిట్లాఘాత్యముల్ సేయగా
జనునే మీరలుకూడి మాడి నడువన్ సౌమ్యత్వ మీరం దగన్
నను మధ్యస్థముగా దలంచిన సుధం నా చేతి కిట్లిచ్చినం
దనుజా మర్త్యులకున్ సమంబుగను నే తథ్యంబుగా నిచ్చెదన్ 26

అర్థాలు : రక్కసిమూకతోన్= రాక్షస సమూహముతో, అఘాత్యముల్= అల్లరి పనులు, చనునే= తగునా, సౌమ్యత్వ= మెత్తదనము, మీరందగన్= కలుగగా, మధ్యస్థముగాన్= మధ్యవర్తిగా, దనుజ= రాక్షసులకు, అమర్త్యులకున్= దేవతలకు, సమంబుగను= సమానముగా, తథ్యంబుగాన్= తప్పక.

భావము : అని పల్కగా,ఆ కాంత రాక్షసులతో "ఈ విధముగా అల్లరిపనులు చేయతగునా, మీరందఱు కలిసికొని నన్ను మధ్యవర్తిగా భావించి, అమృతాన్ని నాకు ఇచ్చినట్లయితే మీకు సమానముగా నేను తప్పక ఇచ్చెదను"అని వచించెను.

మ॥ అనుమానింపక తెండు సంశయము లేదన్నంత నాకాంత మేల్
నునుబల్కున్ చెవి సోకినంత మది నెంతో సమ్మదం బొప్పగా
వనజాతేక్షణచేతి కిచ్చిరి సుధావాసంపుకుంభంబు గై
కొని దేవాసుర సేన కిట్లనియె గోర్కుల్ మీర మీరొద్దికన్ 27

అర్థాలు : సంశయము లేదు= సందేహింప వద్దు, ఆకాంత= ఆ వనిత యొక్క, మేల్= మంచి అయిన, నును పల్కున్= మెత్తని మాటలు, సోకినంత= వినగానే, ఎంతో= ఎంతగానో, ఒప్పగాన్= కలుగగా, సుధావాసంపు కుంభంబు= అమృతభాండమును, వనజాత ఈక్షణ= పద్మాలవంటి కన్నులు కలది అయిన ఆయింతి, కైకొని= తీసుకొని, కోర్కుల్ మీర= మీకోరికలు అతిశయించగా, ఒద్దికన్= అనుకూలముగా.

భావము : ఏ అనుమానము లేక ఇండనగా ఆవనిత యొక్క మధురమైన మెత్తని పల్కులు చెవి సోకగా వారు ఎంతో సంతోషించారు. వెంటనే అమృతభాండమును ఆమె చేతికి అందించారు. ఆమె దేవదానవులతో ఇలా అన్నది. "మీరు మీ కోరికలు అతిశయించగా స్నేహభావముతో", (తర్వాతి పద్యముతో అన్వయము)

ఉ॥ బంతులు గూడి మీరుభయ పార్శ్వములన్ సురదానవావళుల్
సంతసమంది యొండొరులు సంకటపాటొకయింతలేక న
త్యంత శాంతభావముల నట్టిటు బారకయుండు డిందు మీ
వంతులు దీరగా వరుస వడ్డన సేతు మనోహరంబుగన్ 28

అర్థాలు : బంతులు సాగి= వరుసలుగా ఏర్పడి, ఉభయ= రెండు, పార్శ్వములన్= ప్రక్కలయందు, సురదానవ+ఆవలుల్= దేవదానవ సమూహాలు, ఒండొరులు= ఒకరి కొకరు, సంకట పాటు= కష్టము, ఒకయింతలేకన్= కొంచమైనా లేక, అత్యంతము= మిక్కిలి, శాంత భావములన్= నిశ్చలముగా, ఉండుడు= ఉండండి, మీ వంతులు= మీ భాగాలు, తీరగాన్= తీరునట్లుగా, మనోహర ఆకృతిన్= అందమైన తీరులో, వడ్డన చేతు= వడ్డన చేసెదను.

భావము : "మీరు రెండు పక్కలయందు వరుసలుగా ఏర్పడి సంతోషముతో ఒకరికొకరు కొంచమైనా కష్టపడక శాంతభావముతో అటూ ఇటూ వెళ్లకుండా ఉండండి. మీ వంతుల ప్రకారము అందఱికి అమృతము ఇచ్చెదను".

సీ॥ అనుచు దానవకోట్ల నాశలకొందరి
కొందరి మదిలోని కూర్మిమెఱయ
కొందరి కనుసన్న కోపుల చూపుల
కొందరి గద్దిక కుదురుపరచి
కొందరి చిరినవ్వు పొందుల గరగించి
కొందరి సల్లాపకుతుకములను
కొందరి చే సన్న డెందంబులలరించి
కొందరి తేలింపు కందువలను

తే॥ బహువిధంబుల పలలభుక్ప్రతతి నటుల
నటన మధురోక్తి బల్మి మన్ననల గఱచి
యెందునుండెడివార లట్లందె యుండి
చేయునది లేక చిత్తముల్ చేర్చి కనగ 29

అర్థాలు : దానవకోట్లన్= రాక్షస సమూహమును, కూర్మి= (అమృతము పై) ప్రీతి, మెఱయ= వికసింపగా, కనుసన్న కన్నుల కోపుల= కనుసైగల అందమైన, గద్దికన్= అదల్పులతోను, కుదురుపరచి= శాంతింపజేసి, చిఱునవ్వుపొందుల= చిఱునవ్వు పొందికచే, కరగించి= మెత్తబరచి, శాంతింపజేసి సల్లాప= మాటలచే, చేసన్న= చేసైగలచేత, డెందంబులు= మనస్సులను, హృదయాలను; అలరించి= ఆనందింపజేసి, కుందువలను= చమత్కారపు చర్యలతో, తేలించి= ఉల్లాసపరచి, బహువిధముల= అనేక విధాలుగా, పలలభుక్ప్రతతి= (మాంసము ఆహారముగా కలవారి) రాక్షసులను, నటన= నాట్యముతోను, మధురోక్తి= తీయని మాటల, బల్మి= బలముతోను, మన్ననలకఱపి= మర్యాదలను తెల్పి, ఎందున్ ఉండెడివారు= ఎక్కడ ఉండేవారు, అందె ఉండి= అక్కడే ఉండి, చిత్తముల్=మనస్సులను, చేర్చి= ఏకాగ్రతలో ఉంచి.

భావము : తమ కోర్కెలు వికసింపగా, అమృతముపై ప్రీతితో నుండగా రాక్షస సమూహమును, ఆ వనిత తన కన్నుల అందమైన చూపులతోను, అదలింపులతోను, చిఱునవ్వులతోను, మంచిమాటల పొందికతోను , చేతిసైగలతోను, చమత్కారపు చేష్టలతోను పెక్కు విధములుగా తన కపటములతోను మెత్తని మాటల బలముతోను మర్యాదలను బోధింపగా రాక్షసులు అమృతమందు మనస్సులను నిల్పుకొని ఎచ్చటివారు అచ్చటనే కదలక యుండిరి.

చ॥ నిగనిగ గుబ్బచన్నుగవ నీగ పయెంట పరాకు రీతిగా
దగ సడలించు వెంబడిని దార్కొన జేయును రోమరాజియున్
సొగసువళుల్ బయల్ పడగ, జొక్కి మెలంగు చెలంగు వెన్నెలన్
జిగిదళుకొత్త నవ్వు, కడుసిబ్బెపుజూపుల జూచుచున్ రహిన్ 30

అర్థాలు : నిగనిగ= మెఱయునట్టి, గుబ్బచన్నుగవ= ఎత్తైన చన్నుల జంట, ఈగన్= ఉబ్బుచుండగా, పయెంట= పైటను, పరాకురీతిగా= పరధ్యానముతో నున్నట్లు, తగసడలించు= చక్కగా సవరించు, వెంబడిని= వెంటనే, తార్కొనన్= కప్పుకొనునట్లు, రోమరాజియున్= నూగారును, సొగసువళుల్= అందమైన పొట్టమీది ముడుతలు, బయల్ పడగ= కన్పట్టునట్లు, మెలంగు= ప్రవర్తించును, వెన్నెలన్= వెన్నెల కాంతులతో, చెలంగు= విజృంభించు, జిగి= కాంతి, తళు కొత్త= ఎక్కువగా ప్రకాశించునట్లు, సిబ్బెపు చూపులన్= సిగ్గుతో కూడిన చూపులతో.

భావము : నిగనిగ లాడుచు ఉబ్బుచున్న చన్నుల జంటను అదుపులో పెట్టుటకు, ఏమఱుపాటున పయ్యెదను సవరించినట్లు, వెంటనే వానిని కప్పివేయును. నడుము మీది నూగారు ముడుతలు కన్పట్టుగా పరవశించి నర్తించును. వెన్నెలకాంతులు విరివిరిగా వెదజల్లునట్లు నవ్వుల అతిశయమైన ప్రకాశముతోను సిగ్గు మిళితమైన చూపులతో చూచును.

వ॥ ఇట్లుభయపార్శ్వంబుల పంక్తులం గనుంగొని దక్షిణపు పంక్తి దివిజులకు
తూర్పు మొదలుగా నమృతం బొసంగుచుండ 31

భావము : రెండు ప్రక్కలలో నుండు దేవతల రాక్షసుల వరుసలను చూచి, దక్షిణదిక్కునున్న దేవతలకు తూర్పువైపు నుంచి అమృతము ఇచ్చుచుండగా,

సీ॥ బెళికించునోకదా బేడిసమీలను
నీటను ముంచేటి తేటకనులు
జారనిచ్చునోకదా జక్కవ గిబ్బల
నొగయించు గుబ్బలనొగయు పైట
బయలుగానిచ్చునో పటు తరంగల జల
ప్రాయంబుగా నెంచుబాగుధునులు
వినజేయునోకదా మొనయ జిల్కల పంజ
రములజేర్చెడి మధురంపు పల్కు

తే॥ లనుచు నువ్విళులూరుచు నబ్బురంపు
రూపయౌవనసౌందర్యరూఢి కలరి
భ్రమసి మోహిని వలలకు నమృత మడుగ
దెలియజాలక జూచె దైతేయగణము 32

అర్థాలు : బేడిసమీలను= బేడిస చేపలను, బెళికించునోకదా= చలింపజేయునో గదా, జక్కవగిబ్బల= శ్రేష్ఠమైన చక్రవాక పక్షుల, నొగయించు= బాధించు, గుబ్బల సొగసు పైట=వక్షోజాలపై గల అందమైన పయ్యెదను, జారనిచ్చునొకదా= తొలగ చేయునో గదా!, పటు= శ్రేష్ఠమైన, తరంగ తరణి= ఏటి అలలను, ప్రాయంబుగాన్ ఎంచు= తక్కువైనవిగా తలంచు (అల్పమైవవిగా), బయలుగా నిచ్చునో= ప్రకటించునోకదా!, బాగుధునులు= సౌందర్య విలాసాలు, మొనయన్= పూని, చిల్కల= చిలుకల, పంజరముల= గూళ్లలో, చేర్చు= చేర్చునట్టి, మధురంపు పల్కులు= తియ్యని మాటలను, వినజేయునో కదా= వినిపింపజేయునో కదా!, ఉవ్విళులూరుచు= తహతహలాడుచు, అబ్బురంపు= ఆశ్చర్యకరమైన, యౌవన= యౌవనమైన, సౌందర్య= సుందరమైన, రూఢికి= సిద్ధికి, భ్రమసి= భ్రమించి, వలలకు= ఎత్తులకు.

భావము : ఆమె స్వచ్ఛమైన తెల్లని నక్షత్రముల వంటి కన్నులను చూచి బేడిస చేపలు అవి తమకంటె, అందమైనవని నీటిలో మునిగి పోవునట్లు చేసినవి. ఆమె సొగసైన చన్నుల జంట చక్రవాక పక్షులను బాధించునట్టిది. ఉబికి పైనున్న పైయ్యెదను తొలగించి, జాఱిపోవునట్లు చేయునట్టిది. ఆమె శరీర సౌందర్య విలాసాలు (సోయగాలు) ఏటి లోని లేత అలల చలనములను (అల్పమైనవిగా) తక్కువగా జేసి, బయల్పడ నిచ్చునట్టిది. ఆమె తియ్యని పల్కులు, ప్రయత్నించి పంజరములో చిలుకలను చేర్చునట్టివై వినిపింపజేయుచున్నవి. అని ఆశపడుచు, ఆమె ఆశ్చర్యకరములైన రూపము యౌవనము సౌందర్యము యొక్క వైభవమునకు పరవశులై, భ్రమచెంది, ఆమె ఎత్తులకు చిక్కి, రాక్షసులు అమృతమును అడుగుటను మఱచిపోయిరి.

మ॥ దనుజుల్ జూచుచునుండగా నిమిషమాత్రన్ దేవతానీకమున్
దనియంగా సుధ పంచియిచ్చునెడ నాదైత్యాళిలోనుండి స
య్యన దేవాకృతి రాహుకేతువులు దివ్యశ్రేణిలో నేర్పుమై
నినశుభ్రాంశులదండనుండి యమృతంబియ్యంగ లోగొన్నచోన్ 33

అర్థాలు : తనియంగా= తృప్తి పడగా, దేవతా+అనీకమున్= దేవతా సమూహమును, ఆ దైత్యాళిలోనుండి= ఆ రాక్షస సముదాయము నుండి, చయ్యన= ఒక్కసారిగా, దేవాకృతిన్= దేవతారూపముతో, దివ్యశ్రేణిలో= దేవతల వరుసలో, ఇనశుభ్రాంశులు= సూర్యచంద్రుల యొక్క, దండ నుండి= సమీపమందుండి, లోగొన్నచోన్= నోటిలోనికి పోసికొనగా.

భావము : రాక్షసులు చూచు చుండగా ఒక్క నిముషములో దేవతలకు అందఱికి అమృతము తృప్తిగా పంచుచున్నపుడు రాక్షసుల నుండి

దేవతారూపమును ధరించి వేగముతో సూర్యచంద్రుల సమీపములో కూర్చుండి రాహువు, కేతువులు అమృతమును గొంతులో పోసికొనగా,

క॥ ఇనచంద్రుల కనుసన్నను
దనుజారి యెఱింగి చక్రధారను గళమున్
దునిమిన నమృతస్పర్శను
ఘనపదమున కెగసె తలలు గడురభసముననా 34

అర్థాలు : కనుసన్నను= కనుసైగతో, దనుజారి= రాక్షస శత్రువైన శ్రీమహావిష్ణువు, చక్రధారను= సుదర్శన చక్రపువాదరచే, గళమున్ తునిమిన= కంఠము ఖండించగా, అమృత స్పర్శను= అమృత ప్రభావముచే, కడురభసమునన్= మిక్కిలి వేగముతో, ఘనపదమునకు= ఆకాశమునకు.

భావము : సూర్యచంద్రుల కన్నుల సైగచే విష్ణువు తెలిసికొని, సుదర్శనచక్రపు వాదరచే, వాని తలల నఱికెను. అవి అమృతప్రభావమున, జీవముతో ఆకాశమునకు ఎగిరిపోయినవి.

ఆ॥ అంత నమృతకలశ మమరేంద్రునకు నిచ్చి
శౌరి కనుమొఱంగి చనియె నపుడు
యసురగణము దెలిసి యాహారవంబుల
భీషణాట్టహాసభాషణముల 35

అర్థాలు : శౌరి= శ్రీమహావిష్ణువు, కనుమొఱంగి= కన్పట్టక, చనియె= వెళ్ళెను, అసురగణము= రాక్షస బృందము, ఆహారవంబులన్= ఆహాకారాలతో, భీషణ= భయంకరముగా, అట్టహాస= పెద్ద పెద్దధ్వనులతో, భాషణము= మాటలతోను.

భావము : మోహినిరూపుగల విష్ణువు అమృత కలశమును ఇంద్రునకిచ్చి, కన్పట్టక వెళ్ళిపోయెను. రాక్షస సమూహము భయంకరములైన ధ్వనులతో అఱచుచు మాట్లాడిరి.

ఉ॥ పట్టుడు కొట్టుడయ్యమరపంక్తుల బోవగనీక యెల్లెడం
జుట్టుడు దానవుల్ సురల సూనృతముల్ గనవచ్చె నయ్యెడన్
కట్టుడటంచు పెల్లడరి కార్ముక శస్త్రగదాస్త్రపాణులై
బెట్టు గడంగ దేవతలు పేర్చిరి యార్చుచు ధీరచిత్తులై 36

భావము : "ఆదేవతల బృందాన్ని పట్టుకోండి, కొట్టండి. ఎక్కడికి వెళ్ళిపోనీయకుండా అన్ని వైపులా చుట్టుముట్టండి. దేవతల సత్యవాక్కులు రాక్షసులు చూడగలిగిరి. కట్టివేయండి" అని పలుకుచు మిక్కిలి చలించి చేతిలో ఖడ్గము, గదలు, బాణాలు కలవారై గట్టిగా ప్రయత్నించగా దేవతలు గట్టిగా కేకలు వేయుచు ధైర్యముతో విజృంభించిరి.

చ॥ పరిఘగదాసికుంతశితపట్టిసతోమరభిండివాల ము
ద్గరముసలాయుధోజ్జ్వలిత దారుణ హస్తమహోగ్రమూర్తులై
పరుషవచో భిమానముల పౌరుషముల్ దగ నట్టహాసముల్
ధరణియు మిన్ను గ్రక్కదల దారున నయ్యిరువారు నయ్యోడన్ 37

అర్థాలు : పరిఘ= ఇనుపకట్ల గుదియ, అసి= కత్తి, కుంత= ఈటె, శితపట్టిస= వాడియైన అడ్డకత్తి, తోమర= చిల్లకోల, భిండివాల=రెండు, మూడు చక్రాలు కల కత్తి; ముద్గర= సమ్మెట, ముకుర= దండము, ఆయుధ= ఆయుధాలతో, ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశమానమైన, దారుణ= క్రూరములైన, హస్త= చేతులు కలవారై, మహా ఉగ్రమూర్తులై= భయంకర రూపముకలవారై, పరుష= కఠినమైన, వచః= వాక్కులయందు, అభిమానముల్= ప్రీతితో, పౌరుషముల్= పరాక్రమాలు, అట్టహాసముల్= వికటమైన పెద్ద నవ్వులతో, (కదలన్+కదలన్) క్రక్కదలన్= మిక్కిలి కదలిపోవునట్లుగా, దారున= తటాలున (విరామము లేక), (ఆ ఇరువారు)అయ్యిరువారు= ఆ రెండు పక్షాలవారు, (ఆ ఎడన్) అయ్యేడన్= ఆ సమయమందు.

భావము : వేర్వేఱు ఆయుధములతో ప్రకాశించు భయంకరములైన చేతులు ఉద్రేకముగల ఆకారములతో కఠినములైన వాక్కులతో తమగొప్పలు

పొగడుకొనుచు కేకలు వేయుచు, భూమి, ఆకాశము కదలి పోవునట్లు వెన్వెంటనే ఆ ఇరుపక్షములు యుద్ధమునకు సిద్ధపడిరి.

ఉ॥ తార్కొని చివ్వు చివ్వన నుదగ్రత చాపము లెక్కువెట్టుచో
మార్కొని యొండొరుం గదిసి మార్గణజాలము లంబరంబునన్
బేర్కొన నిల్వు ని ల్వుమని పెల్లుగ మర్మము లంట నేయుచున్
కార్కొని మేఘమాలికల కైవడి గప్పె మహాంధమై తగన్ 38

అర్థాలు : తార్కొని= కలియబడి, చివ్వచివ్వనన్= అతివేగముగా, ఉదగ్రతన్= కోపముతో, చాపముల్= విల్లులను, ఎక్కువెట్టుచోన్= ఎక్కుపెట్టునప్పుడు, మార్కొని= ఎదుర్కొని, ఒండొరున్= ఒకరినొకరు, కదిసి= సమీపించి, మారణజాలములు= బాణ సమూహాలు, అంబరంబునన్= ఆకాశములో, పేర్కొని= నిండగా, నిల్వుమని= ఆగుమని, పెల్లుగ= ఎక్కువగా, మర్మములు= జీవస్థానములు, అంటన్ ఏయుచున్= తగులునట్లు వేయుచు, మేఘమాలికలకైవడి= మేఘాల వరుసల వలె, కార్కొని= నల్లదనము వ్యాపించి, మహాంధమై= దట్టమైన చీకటి, కప్పెన్= అన్నివైపులా వ్యాపించెను.

భావము : దేవతలు, రాక్షసులు తగినట్లు ఎదుర్కొనుచు వేగముతో, ఉద్రేకముతో విండ్లు ఎక్కుపెట్టుచూ సమీపించి వేగముగా బాణములను ఆకాశము నిండునట్లు, ''నిల్వండి నిల్వండి'' అనుచు జీవస్థానము లంటునట్లు వేయగా, అవి మేఘముల వరుసవలె నల్లనివై ఆకాశమంత చీకటితో నిండునట్లు కప్పినవి.

క॥ బృందారకాసురావలి
సందడికయ్యంబు గొంతసలుపుచు మఱియున్
స్యందనవారణహయభట
సందోహము గూర్చిరమరసన్నాహములన్ 39

అర్థాలు : బృందారక= దేవతల, అసుర+ఆవళి= రాక్షసుల సమూహాల, సందడి= సంకులమైన, కయ్యంబు= యుద్ధము, కొంతసలుపుచు= కొద్దిగా చేయుచు, మఱియున్= పిదప, అమర= దేవతల, సన్నాహములన్= యుద్ధ ప్రయత్నాలను, స్యందన= రథాల, వారణ= ఏనుగుల, హయ= గుఱ్ఱాల, భట= సైనికుల, సందోహముతో= సమూహముతో, కూర్చిరి= చేర్చిరి.

భావము : దేవతలు, రాక్షసులు విచ్చలవిడిగా మూకుమ్మడిగా ఒకరినొకరు క్రమములేక యుద్ధము చేసిరి. తర్వాత రథాలు, ఏనుగులు, గుఱ్ఱములు, కాలిబంటులను సమకూర్చుకొని దేవతలు యుద్ధమునకు సిద్ధపడగా,

ఉ॥ బారులుమొగ్గరంబులుగ బన్ని తదగ్రములందు ముఖ్యులౌ
వీరులు నిల్పిశంఖముఖవిశ్రుతనాదము లుప్పతిల్లగా
దారుణలీల కేతనవితానము మింట మహోద్ధతాకృతిన్
మీరగ సింహనాదముల మిన్ను బగల్చుచు డాసి రుగ్రులై 40

అర్థాలు : బారులు= వరుసలు, మొగ్గరంబులుగన్= సైనికులను వ్యూహములుగా, పన్ని= ఏర్పాటుచేసి, అగ్రములందు= ముందు భాగములందు, ముఖ్య= ముఖ్యులైన, వీరులు= పరాక్రమవంతులు, శంఖముఖ= శంఖమునుండి, విశ్రుత= బిగ్గఱగా, నాదము= ధ్వని, ఉప్ప తిల్లిగా= వెల్వడునట్లు, దారుణలీలన్= భయంకరముగా, కేతనవితానము= పతాకాల సముదాయము, మింటన్= ఆకాశమునందు, మహా+ఉద్ధత+ ఆకృతిన్= గొప్పతీవ్రమైన రూపముతో, మీరగ= ఎక్కువ కాగా, ఉగ్రులై= భయంకరులై, సింహనాదములన్= సింహముల వంటి అఱపులతో, మిన్నున్= ఆకాశమును, పగుల్చుచు= పగలగొట్టుచు, డాసిరి= సమీపించిరి.

భావము : వరుసలుగా సైన్యమును నిలిపి, వ్యూహాలను పన్ని, వాని ముందు భాగాలలో వీరులను నిలిపి, శంఖధ్వనులు వెల్వడగా, భయంకరముగా పతాకాలు ఆకాశములో గొప్ప ఆకారములతో కదలుచుండగా, భయంకరులై సింహాలవలె అఱచుచు ఆకాశాన్నిపగులగొట్టునట్లు శత్రువులను సమీపించిరి.

వ॥ అట్టియెడ 41

భావము : ఆ సమయమందు.

చ॥ అసురులు మొగ్గరంబెడలి యాహవవీరవిహారధుర్యులై
వెస రథసంఘముల్ బరపి వేయుడు కమ్ముడు దుర్విచారులై
యసదుగ నెంచి నారమృత మంటగ నియ్యక మండలంబులన్
బొసగుటలెల్ల పెల్లడరుబో యల వీరిని దివ్యులందురే 42

అర్థాలు : అసురులు= రాక్షసులు, మొగ్గరంబు= వ్యూహమును, ఎడలి= విడిచి, ఆహవ= యుద్ధమునందు, వీరవిహారధుర్యులై= శౌర్యప్రకటనలో శ్రేష్ఠులై, వెసన్= వెంటనే, రథసంఘముల్= తేరులను అన్నిటిని, పఱపి= నడిపించి, కమ్ముడు= చుట్టుముట్టండి, దుర్విచారులై= దుర్బుద్ధి కలవారై, అసదుగ= బలము లేనివారని, ఎంచినారు= తలచినారు, అమృతము= అమృతమును, అంటగన్= తాకనీయక, ఇయ్యక మండలంబులన్= వలయాకారపు వ్యూహాలను, పొసగుట= కూడుటలు, పెల్లు+అడరు= మిక్కిలి అతిశయించు, బోయలన్= కిరాతకులను, దివ్యులు= దేవతలు, అందురే= అంటారా?, పొసగుడు= ముందుకు పోయి ఎదిరించండి.

భావము : "రాక్షసులు తమ వ్యూహములను వదలి యుద్ధభూమి యందు వేగముగా తమ శౌర్య ప్రకటనలపై శ్రద్ధ వహించి, తేర్లను నడిపించి బాణాలను వేసి "దేవతలను చుట్టుముట్టండి. చెడ్డబుద్ధి కలవారై, బలము లేని వారని తలచినారు. అమృతమును తాకనీయక వలయముల వలె సైన్యాలను తీర్చి, అతిశయించు కిరాతకులను ఎదిరించండి. ఇట్టి నీచులను దేవతలనుట తగునా!"

శా॥ ఏనాడైనను దేవతల్ మనకు మేలింతైన రానిత్తురా
యేనాడైనను దేవతల్ మనము పొత్తెంతేని కావింతుమా
యీనాడున్ బలి చక్రవర్తి కపటం బింతైన చింతింప కి
ట్లా నీచం డగుశక్రుమాయ లకు లోనై యింత గావింపడే 44

అర్థాలు : మేలు ఇంతైన= మేలు ఈ కొంచమైనా, పొత్తు ఇంతేని= పొత్తు ఈ మాత్రమైనా, కావింతుమా= కలిగిఉంటామా, ఈనాటన్= ఈరోజున, బలిచక్రవర్తి= బలిచక్రవర్తి, కపటం= వారిమోసము, ఇంతైన= ఈ కొంచమైనా, శక్రుమాయలకు= ఇంద్రుని మాయలకు, లోనై= లొంగి పోవుటచే.

భావము : ఎప్పుడైనా దేవతలు మనకు ఏకొంచెమైనా, మేలు చేసినారా! ఎప్పుడైనా దేవతలు మనము స్నేహముతో కలిసి ఉండగలమా! ఈనాడు బలిచక్రవర్తి దేవతల మోసము కొంచెముకూడా తలంపక ఇట్లు ఇంద్రుని మోసానికి లొంగిపోవుటచే ఇట్లు మనకు కీడు చేసినాడుకదా!

క॥ పగవాని చేర్పవద్దని
తగ చెప్పిన వినక కూర్మి తథ్యంబనుచున్
నగవైరి పెంచి యింతగ
పగగొని తెచ్చుకొనె వేయు బలుకగ నేలా? 45

భావము : "శత్రువును దగ్గఱకు రానీయవద్దని చక్కగా చెప్పినప్పటికి, వినకుండా స్నేహము తగినదని ఇంద్రుని ఎక్కువ చేసి ఇంత విరోధమును తెచ్చుకొన్నాడు. ఇక పెక్కు మాటలు ఎందుకు?"

వ॥ అని యొండొరులు రోషావేశంబుల వీరాలాపంబులు పలుకుచు ననిమిషులు పై వడివడిదరియంజొచ్చిన దివిజులునయ్యమృత సేవా విశేషంబునంజనిత జవసత్త్వ సంపన్నులై యెదురునడచి రథము రథమును గదియ నియమించిసారథుల హెచ్చరించిశంఖంబులుపూరించి భేరీపటహదుందుభులు మొరయించి కోదండంబులు గుణనినాదంబులుగా సారించి సాయక పరంపరలు నిగుడింపుచుం దలపడి 46

భావము : ఒకరికొకరు కోపము, అహంకారము, పరాక్రమ వచనాలు పలుకుచు వేగముతో సమీపించుచు రాగా దేవతలు, అమృతపానము చేయుటచే పుట్టిన వేగము, బలము కలవారై ఎదురువెళ్ళి రథమునకు మఱొక రథమును దగ్గఱగా ఉండునట్లు చేసి సారథులను ప్రోత్సహించి శంఖము పూరించు భేరులు తప్పెటలు డోళ్లు మ్రోగించి బాణాల వరుసలను విడుచుచు ఎదుర్కొనిరి.

సీ॥ **పెక్కుశరంబు నొక్కొక్క వీరుని**
నెరుక లంటగ నేసి నిలుపు వారు
నొక్కబాణంబున పెక్కు వీరుల యెదల్
దూఱిపారగ నేసి మీఱు వారు
సారథుల్ బడిన దోస్సారంబు లేర్పడ
సారథుల్ తామయై పోరువారు
వివిధాస్త్రనిహతుల విరథులై మొన వీక
నసిచర్మహస్తులై యెసగువారు

తే॥ **పటురయంబుల కహకహార్భటుల భటుల**
చటులతరి ముష్టినిహతుల నిటలతటలి
పాటనోత్కటకార్యసంభరితు లగుచు
మచ్చరంబున నొండొరుల్ మెచ్చ కడరి 47

భావము : పెక్కు బాణాలతో ఒక్కొక్క వీరుని భుజములను తగుల్కొనజేసి నిలిపెడివారు, ఒక్క బాణముచే పెక్కు వీరుల గుండెలు చీలి చెదరిపడి పోవునట్లు చేసి, అతిశయించువారు. తేరు నడుపువారు కూలిపోగా, భటులు తమ భుజ బలములు ప్రకటమగునట్లు తామే తేరులను నడుపుచు పోరాడేవారు అనేకాయుధములచే కొట్టబడి తేర్లు లేనివారై కత్తి, డాలు మాత్రమే ధరించి ఉత్సాహముతో ముందుకు దూకువారు. మిక్కిలి వేగముతో గొప్ప అట్టహాస ధ్వనులతో భటులు, శత్రువుల నొసటి ప్రదేశాలను గట్టిపిడి

గుద్దులతో పగులగొట్టు పనులయందు ఉద్రేకముకలవారు అసూయతో ఎవరిని మెచ్చక అతిశయించినవారు

సీ॥ **కుంతంబులను గుదుల్ గ్రుచ్చి మీదికి నెత్తి**
కడబార జిమ్ముచు నడరువారు
గొరకులు చేబూని గోరించి మొనచొచ్చి
రవిసోమ వీథులేర్పరచువారు
పటుగదాహస్తులై భద్రేభఘటలకు
గదిసి తుత్తెనలుగా జదుపువారు
అసిచర్మహస్తులై యడరి యాశ్వికులను
వేటాడి దిన్నెలుగా వేయు వారు

తే॥ **మఱియు బహువిధ సమర నిర్మథితమహిత**
వీరవిక్రమసంభృతావేశకౌశ
లానుసంచారధౌరేయు లగుచు నిగిడి
రణము సల్పిరి సురదైత్యగణములడరి 48

భావము : బల్లెములు కుదుళ్లుగా కట్టి పైకి ఎత్తిపట్టి చివరి వఱకు వెదజిమ్ముచు విజృంభించువారు, బాణాలు చేతితో పట్టుకొని సైన్యములో ప్రవేశించి, సూర్యచంద్రుల పేర్లతో వీధులను ఏర్పాటు చేయువారు. చేతులలో గదలను కలవారై పట్టపు టేనుగుల గుంపులను సమీపించి ముక్కలు ముక్కలుగా చిదిమెడివారు, కత్తి, డాలు కలవారై విజృంభించి గుఱ్ఱపు రౌతులను వేటాడి అరుగులను అమర్చెడివారు పెక్కు విధములైన యుద్ధ రీతులలో భాగముగా పైబడు శత్రువులను కలవారై, గొప్ప వీరత్వ పరాక్రమమును, ఉద్రేకము, నేర్పు, గమనము కలవారై, దేవదానవులు అతిశయించి యుద్ధము చేసిరి.

వ॥ **అప్పుడు** 49

భావము : ఆ సమయమందు ఇంద్రుడు ఇట్లనెను.

సీ॥ కదియించు నీవేడి గదగొని హుతవహ
ధరియించు దండముద్ధతిని శమన!
కమ్ము నీమాయలొక్కొట నంత నిరురుతి!
సన్నద్ధమగుము పాశమున వరుణ!
పటుజవంబున దలపడుము ప్రభంజన!
దర్పంబుజూపు మెంతయును ధనద!
శూలంబుగొని రణాభీలుండవగు శర్వ!
వజ్రంబుగొని యిందువత్తునేను

తే॥ బహుల భీషణ చతురంగ బల యుతాత్మ
భుజబలాకీర్ణ విక్రమస్ఫురణ నష్ట
దిశలు వడి గమ్ముడిక నెందు తెరలిచనగ
గలరు దైతేయులనుచు లేఖర్షభుండు **50**

భావము : "ఓ అగ్నిదేవా! నీ వేడి గదతో కలయబడుము. ఓ యముడా! నీ గదా దండమును వేగముగా ధరించుము ఓ నైరుతీ! వెంటనే నీ అన్ని మాయలతో చుట్టుముట్టుము. ఓ వరుణదేవా! నీ పాశముతో సిద్ధపడుము. ఓ వాయుదేవా! బలీయమైన శక్తితో ఎదుర్కొనుమా. ఓ కుబేరా! ఎంతైనను నీ శౌర్యమును చూపుము. ఓ ఈశానా! శూలముతో భయంకరుడవగుము. నేను వజ్రాయుధముతో వచ్చెదను. అనేకములైన భయంకరములైన, రథములు, గజములు, తురగములు, భటులు మొదలగు సైన్యములతో మీమీ భుజముల పరాక్రమములు ప్రదర్శించుచు, వెంటనే వేగముగా అన్ని దిక్కులు ఆక్రమించండి. ఆ రాక్షసులు ఎట్లు తప్పించుకొని పోగలరు" అని ఇంద్రుడు పల్కెను.

ఉ॥ పైజనకుండ ఖేచరుల బల్మిని గ్రమ్మగ నిల్పి యుగ్రతన్
తేజము విక్రమస్ఫురణ ధీరతయుం బల మగ్గలింపగా

నాజి గణంగి ముద్గరశరాసనతోమరభిండివాల వి
భ్రాజితహస్తులై కణగి రాక్షస కోటులు చిత్ర లీలలన్ **51**

భావము : దేవతలను (ఖేచరులు) తమపై రానీయక, బలముతో చుట్టును వారిని అడ్డగించి, రోషముతో తమ ప్రభావము, పరాక్రమ ప్రదర్శనము, ధైర్యము, శారీరకబలము అతిశయింపగా రణమున పూని, సమ్మెటలు, విండ్లు, ఈటెలు పెద్ద గదలతో ప్రకాశించు చేతులతో రక్కసి మూకలు చిత్రవిచిత్రము లుగా ఎదుర్కొని(రి).

ఉ॥ కొంచక త్రుంచి యే పడచి కొట్టి వధించి కలంచి త్రెంచి గో
రించి యడంచి త్రోచియు హరించి విదల్చియు చివ్వి చివ్వి ధ
ట్టించి పెకల్చి కూల్చి ప్రకటించి పరాక్రమలీల గేలి గా
వించి సుధాంధసుల్ దనుజ వీరుల గ్రమ్మి రణంబు సల్పగన్ **52**

భావము : అయినను అమృతము తాగినారు (సుధ అంధసులు)దేవతలు జంకనివారై, తెగనటికి, వారి పెంపును అణగకొట్టి, చంపి, కలచివేసి, చీల్చి పైకెగయ చేసి, క్రిందికి త్రోసివేయుచు, తొలగించి, తెగగొట్టి, చిలికి చిలికి పైకిదూకి చీల్చి క్రింద పడవేసి తమ వీరత్వ విలాసముతో దానవ వీరులను ఆక్రమించి (దేవతలు) వినోదముగా యుద్ధక్రీడను కావించిరి.

ఉ॥ దానవనాథు వీరులతిదర్పము లేర్పడ తమ్ము జుట్టిరా
బూని వధించు దిక్పతుల పూనిక రాక్షసకోటియందు పెన్
దీనత చూచి వెర్వకని దిక్పతి కొక్కని కొక్క వీరుడై
యాని యదల్చి నిల్వుమని యార్చి యెదిర్చిరి యర్చులోయనన్ **53**

భావము : అప్పుడు బలి చక్రవర్తి యొక్క ప్రముఖ సేనా నాయకులు తమ బలమును చుట్టి వచ్చు ఎనిమిది దిక్కుల పతుల పట్టుదలను, రాక్షస సమూహాము పొందిన బలహీనతను చూచి (రాక్షసులతో) "భయపడకుడు" అనుచు ఒక్కొక్క దిక్పతిని ఒక్కొక్క వీరుడు ఎదిరించి, బెదిరించి "నిల్వుడు" అని బొబ్బలిడి, అగ్ని జ్వాలలో ఏమో అని తోచునట్లు ఎదుర్కొనిరి.

అర్థాలు : వజ్రి= ఇంద్రుడు, వహ్ని= అగ్నిదేవుడు, ధనదుడు= కుబేరుడు.

వ॥ అందు ప్రతి వజ్రుండు వజ్రిని యనలాక్షుండు వహ్నినిదండోద్ధతుండు దండిని మాయావి నైరుతినిమహాబాహుండు వరుణుని పృథుకాయుండు వాయువును వికటాక్షుండు ధనదుని వికృతాంగుండు నీశానుని యెదుర్కొని పోరు సమయంబున 54

భావము : ప్రతివజ్రుడు ఇంద్రుని, అనలాక్షుడు అగ్నిని, దండోద్ధతుడు యముని, మాయావి నిరృతిని, మహాబాహుడు వరుణుని, పృథుకాయుడు వాయువును, వికటాక్షుడు కుబేరుని, వికృతాంగుడు ఈశానుని ఎదుర్కొని యుద్ధము చేయునప్పుడు

మ॥ ప్రతి వజ్రుండతిదారుణాస్త్రములు పైపై భూనభోమధ్య ను
ద్ధతి నిండన్ నిగుడింపుచున్ సురపతిం ధట్టించి నిన్నిల్వు నీ
ధృతి మాయింతు మదీయ శాతశరవృద్ధిన్ నేడు నే సర్వ ది
కృతులన్ గూల్తును మెప్పొనర్తు చివికిన్ బా గొప్పగా నిల్వుమీ 55

అర్థాలు : భూనభోమధ్యము= భూమి ఆకాశముల మధ్య, ఉద్ధతి= గర్వము, నీధృతిమాయింతును= నీ గర్వము పోగొట్టెదను, శాతశరవృద్ధిన్= వాడి బాణ పరంపరచేత.

భావము : ప్రతివజ్రుడు మిక్కిలి భయంకరములైన ఆయుధాలను భూమ్యాకాశములంతయు నిండగా ప్రయోగించుచు ఇంద్రుని గద్దించి "నిల్వుము" నీధైర్యమును నేడు నా వాడియైన బాణముల వర్షముచే తొలగించెదను. దిక్పాలకులందఱిని చంపెదను. యుద్ధక్రీడకు మెప్పు తెచ్చెదను. నీ గొప్పతనము ఒప్పునట్లు నిల్వుము."

మ॥ అని యైరావతకుంభయుగ్మమున ఘోరాస్త్రంబు లీరేడు స
య్యన నాటించి బిడౌజు పెన్నురము వ్రయ్యన్ క్రూర నారాచముల్

జొనుపన్ మూర్ఛిలి శక్రు డశ్వసమితిన్ సూతుం ధనుష్కాండమున్
తునిమె న్నాలుగు రెండు నొండు శరముల్ దోడ్తో వడిన్ వ్రేయుచున్ 56

అర్థాలు : ఈరేడు= పదునాలుగు, బిడౌజు= ఇంద్రుడు, పెన్నురము= విశాలమైన వక్షఃస్థలము, నారాచముల్= బాణములు, శక్రుడు= ఇంద్రుడు, సూతున్= రథసారథిని, ధనుష్కాండము= వింటిబద్ద.

భావము : అని ఐరావతమను పేరుగల ఏనుగు రెండు చెక్కిళ్ల యందు క్రూరములైన పదునాలుగు బాణములను నాటించి, ఇంద్రుని విశాలవక్షమును చీల్చునట్లు బాణములు వేయగా అతడు మూర్ఛిల్లెను. ఇంద్రుడు తేరుకొని వడిగా గుఱ్ఱాలను నాలుగు బాణాలతోను సారథిని రెండు బాణాలతోను, వింటికఱ్ఱను ఒక్కబాణముతో నాశనము చేసెను.

మ॥ విరథుండై ప్రతివజ్రుడాగ్రహముతో వేవేగ వాల్పల్కయున్
గర మొప్పారగ భూమికిం దుమికి దోర్గర్వం బఖర్వంబుగా
కరికుంభస్థలివ్రేయ బెట్టెగయ బాకధ్వంసి వజ్రాహతిన్
శిరముం దెంచిన గూలె వాని సుభటానీకంబు చీకాకుగన్ 57

అర్థాలు : విరథుడు= తేరును కోల్పోయినవాడు, దోర్గర్వంబు= భుజగర్వము, అఖర్వంబుగా= అధికమగునట్లుగా, పాకధ్వంసి= ఇంద్రుడు.

భావము : రథమును పోగొట్టుకొన్న ప్రతివజ్రుడు మిక్కిలి కోపముతో త్వరత్వరగా కత్తిని, పలకను (డాలు) చేత చక్కగా పుచ్చుకొని, క్రిందికి దుమికి, తన భుజబలమును పూర్తిగా వినియోగించి ఐరావతము యొక్క చెక్కిలిని కొట్టగా అది పైకి ఎగసెను. అప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధముతో ప్రతివజ్రుని తలను తెగనఱుకగా, అతడు నేలపై పడెను. వాని సైన్యము చెల్లా చెదరై తొలగి పోయెను.

చ॥ అట నినలాక్షు డగ్గిశిఖ లంబరముం దిశలెల్ల గప్పగా
పటుగతి దేరువో విడిచి బాణపరంపర లోలి గ్రమ్ముచున్

చటులత నగ్గి పైగవయు శాతశిలీముఖ పంచకంబునన్
నిటలము నుచ్చిపో జొనుప నీల్గె నతండు మహాద్రియో యనన్ 58

అర్థాలు : శాత= వాడియైన, శిలీముఖము= బాణము, నిటలము= నుదురు.

భావము : మఱొకచోట అనలాక్షుడు, నిప్పుమంటలు ఆకాశమందు అన్నిచోట్లను నిండగా మిక్కిలి వేగముతో తేరు నడుపుచు బాణముల వరుసలను ఎడతెగక వర్షించుచు తీవ్రముగా అగ్నిదేవుని ఎదుర్కొనగా, వాడియైన ఐదుబాణాలు అతని నొసలు చీలునట్లు నాటగా ఆతడు గొప్ప కొండవలె క్రిందపడెను.

క॥ **దండోద్ధతుండు వడి మా**
ర్తాండతనూభవుని గదిసి దారుణకరభృ
ద్దండము ద్రిప్పుచు నిట్లనె
దండధరద్వయము ధరణి తలమున గలదే? 59

భావము : దండోద్ధతుడు సూర్యపుత్రుడైన యముని వడిగా సమీపించి, బలిష్ఠమైన చేతి గదను త్రిప్పుచు ఇట్లనెను. "దండధరులు అనెడివారు ఇరువురు ధరణిలో కలరా?"

క॥ **నీవొండెను నేనొండెను**
భావింపగ నిలువు మిపుడె బాహాశక్తిన్
నీ విఖ్యాత మడంచెద
దేవత్వము నేటితోను దీరగ ననుచున్ 60

భావము : "ఆలోచింపగా నీవైనను, నేనైనను (ఒకరే ఉండుట తగును) ఉండవలెను. ఎదుట నిలువుము. ఇప్పుడు నాబాహు బలముచే, నీదైవత్వమును నేటితో తొలగిపోవగా నీకీర్తిని అణచెదను".

చ॥ **బహు శరజాలముల్ మహిష భానుజు కాయములందు గప్పుచున్**
మహి దివి దిక్కులుం గలయ మార్గణజాలము నించి యార్చి దు

స్సహ విపులాట్టహాసమున సాహసముం దనరంగ దాకినన్
మిహిరతనూభవుం డతులనిష్ఠురశాత శిలీముఖంబులన్ 61

అర్థాలు : మార్గణజాలము= బాణసముదాయము, భానుజుడు= యముడు, మిహిరతనూభవుడు= సూర్యునిపుత్రుడు, యముడు.

భావము : పెక్కు బాణముల మొత్తమును దున్నపోతు మీద, యముని శరీరమందు గ్రుచ్చుకొనగా, వాడు భూమి ఆకాశము, దిక్కులందు తిరుగునట్లు బాణములను ప్రయోగించి, అఱచుచు, భరింపరాని పెడబొబ్బలతో తన తెగింపు ఒప్పుచు ఎదుర్కొనగా, సూర్యునిపుత్రుడు యముడు సాటిలేని వాడిమిగల బాణాలతో

ఆ॥ **విల్లు ద్రుంచి సూతు ద్రెళ్ళించి హయముల**
నుగ్గు చేసి సిడము మ్రగ్గజేయ
బెట్టి రోషమున గభీరు గదా హస్తు
డగుచు ధరణి కుఱికి మిగుల నార్చి 62

భావము : పగవాని వింటిని, సూతుని గుఱ్ఱాలను పిండిచేసి, పతాకము తెగినేల పడిపోవునట్లు చేసెను. ఆతడు తీవ్రమైన కోపమువహించి గంభీరుడై (గభీరుడు ఎంత బాధించినను నొప్పిని భరించు శరీరము గలవాడు) గదను ధరించి నేలపైకి దుమికి, ఎక్కువగా అఱచుచు యముని (సమీపింపగా).

చ॥ **కదిసిన, కాసరేంద్రమును కాలుడు పైనుఱికించినంత ను**
న్మదగతి ఘంటికా ఘణనినాదము మేదుర లీల మ్రోయగా
గొదగొనివచ్చు దాని గదకొద్దిని వ్రేయ బదారుతున్కలై
యది తుమురైన నేసె మహిషాధిపు డేర్చుచు దండి కొమ్ములన్ 63

అర్థాలు : కదిసినన్= సమీపింపగా, కాసరము= దున్న, మేదుర= దట్టమైన, కాలుడు= యముడు, దండి= దండుని, కొమ్ములను= బాణములను.

భావము : (దండోద్ధతుడు) సమీపింపగా, పెద్దదున్నను యముడు దండోద్ధతునిపై తోలగా, అతి భీకరముగా దున్న మెడ యందున్న ఘంటల ఘణఘణధ్వనులు అత్యధికముగా మ్రోగుచుండగా ఉద్రేకముతో తనపై దూకు దానిని తన గద అంచు తగులునట్లు కొట్టెను. కాని ఆగద పదునాఱు తున్కలై ముక్కలైనది. వెంటనే యముడు విజృంభిచుచు బాణములను ఆ దానవునిపై వేయగా

క॥ **ఏసిన యేటుల నల్గులు**
బోసిన తిత్తగుచు కొమ్ము ముం దల వ్రేలన్
గాసిల చిమ్మెను మింటికి
నాసవితృడు సుతుని విజయమభినుతిసేయన్ 64

భావము : వ్రేలాడుచు బాధచెందగా పిండిని పూసి ఒలిచిన తోలుగా ఆతని శరీరమును బాణము నాటిన తలను మింటికి ఎగయకొట్టెను. అప్పుడు సూర్యుడు తనసుతుని విజయమును పొగడెను.

ఉ॥ **మాయి గణంగి నైరృతిని మార్కొని దుర్మదవృత్తికృత్రిమో**
పాయములన్ విచిత్ర గతి బల్విడి గ్రమ్మి బహు ప్రకారతన్
సాయక వృష్టి ఘోరముగ స్వాతి గతార్క నిరూఢి దెల్పగా
మాయలు పెక్కువహ్నిజల మారుత ముఖ్య విడంబ చర్యలన్ 65

అర్థాలు : కణంగి= పూని, సాయకవృష్టి= బాణవర్షము, నిరూఢి= నిశ్చయము.

భావము : మాయావి యుద్ధక్రియకు మొదలిడి నైరృతిపై తలపడి అతిశయ మదముతో ఉపాయాలను కల్పించి ఆశ్చర్యకరముగా, తీవ్రముగా చుట్టి పెక్కు విధాలుగా అమ్ములవాన భయంకరముగా వర్షించుచు స్వాతికార్తె యందు సూర్యుని స్థితిని తెల్పగా (దానవుడు) నిప్పు, నీరు, గాలి ఆకారములతో మాయలు చేయుచు

మ॥ **భ్రమయింపంగను లీల నన్నియు తృణప్రాయంబు గావించుచున్**
సమరోత్సాహముతో సురాసురుల కాశ్చర్యంబు వాటిల్ల సం
క్రమణాదృష్ట శిలాప్రపాత శలహర్యక్షేభశార్దూలదు
ర్దమరూపంబుల బోరజొచ్చిరి కడుం దైత్యేంద్ర గీర్వాణుడున్ 66

భావము : మతి భ్రమింపచేయగా ఆతని మాయలన్నింటిని విలాసముతో గడ్డిపోచగా భావించి, ఫలము లేనివిగా జేయుచు దేవదానవులకు ఆశ్చర్యము కలుగుచుండగా వేగముగా ముందుకు పోవుచు రాళ్ళవానతో మఱియు (శల) ముండ్లపంది, సింహములు, ఏనుగు, పెద్దపులి మొదలుగు సహింపలేని రూపములతో రాక్షసప్రభువును నైరృతియును భయంకరముగా యుద్ధము చేసిరి.

వ॥ **ఇట్లు పోరుచో నయ్యిద్దరికొకరి కొకరు** 67

భావము : ఈ విధముగా వారు ఎవరును వెనుకాడక పోరాడుచు

సీ॥ **ప్రకటకంటకమహారణ్యాకృతుల్ దాల్చి**
దవవహ్నులై మహోద్ధతుల పేర్చి
ప్రళయాగ్నులై దిశల్ గలయంగ బర్వుచో
బహువృష్టితతుల రూపఱగ నిగుడి
అతిఘోరవృష్టుల నణగంగ నమ్మహా
శైలంబులగుచు నిశ్చలతనోర్చి
శైలపాతంబులునోలి గావింపుచో
తొడరి వజ్రంబులై తుమురుచేసి

తే॥ **మఱియు బహువిధ మృగఖగమహిష శరభ**
గండభేరుండ వేదండకాండచండ
భండనోద్దండ నిపుణత బరుషఘర్ష
ణముల బోరిరి యద్దైత్య నైరుతులును 68

భావము : వారు భయంకరములైన మహారణ్యములుకాగా, వానిని అగ్నులై విజృంభించి నశింపజేసిరి. వారు ప్రళయకాలమందలి మిక్కిలి వేడిమిగల అగ్నులై అన్ని దిక్కులలో ప్రసరింపగా గొప్ప వర్షధారలచే వానిని తొలగించు ప్రవర్తించిరి. మఱియు గొప్పవర్షధారలను అడ్డగించుటకై గొప్ప కొండలై చలింపక సహించిరి. మఱియు రాళ్ళవాన కురిపింపగా వానిని వరుసగా తొలగించుటకై వజ్రాయుధముతో ముక్కలు చేసిరి. అంతేగాక పెక్కుజంతువులు, పక్షులు, దున్నలు, శరభములు, గండభేరుండములు, ఏనుగుల మొత్తములై తీవ్రమైన గొప్ప యుద్ధనైపుణ్యమును ప్రదర్శించుచు ఆ మాయావియు నైరృతియును పోరాడిరి.

తే॥ మాయిమాయలు మాయంగ మాయమగుచు
నంబరంబున కెగసె తానశని వితము
నగుచు పైబడి నిరురుతి యశ్వసమితి
సూతుతోగూడ ననిచెను ప్రేత పురికి 69

భావము : ఆ మాయావి తన మాయలన్నియు, ఉపయోగపడక పోవుటచే తాను కన్పడక ఆకాశమునకు ఎగసిపోయెను. పిడుగై నైరుతి దానవునిపై పడి ఆతని గుఱ్ఱాలను, సూతునితో కూడా యమపురికి పంపెను. (వానిని వధించెను).

మ॥ వరుణుం బోరదురంత శౌర్యుడు మహావర్ధిష్ణు రౌద్రాకృతిన్
శరసంధానవిమోచన క్రియలుగా నన్మానచాతుర్యమున్
హరిసూతధ్వజ చక్రరక్షకులతో నాశావలిం గప్పుచున్
మెరుగుంబోలెను తోచుచున్ మొఱగుచున్ నేర్పొప్ప వర్తించున్ 70

భావము : వరుణుడు యుద్ధక్రీడలో భరింపజాలని పరాక్రమవంతుడు. గొప్ప బలవంతుడైన పగవానిని, అధికరోషము నిండిన రూపముతో బాణమును ఎక్కుపెట్టుచు, ప్రశంసింపదగిన నేర్పుతో రాక్షసుని గుఱ్ఱములను సూతుని

టెక్కములను, సైన్యవ్యూహములను రక్షకులతో కూడా దిక్కులన్నింటిని చుట్టుముట్టి మెఱపుల వలె తళతళ ప్రకాశించుచు శబ్దములు కావించుచు నేర్పును చూపుచూ మెలగగా,

ఉ॥ అహవ కేలిన ప్రతిమహాగ్రహవృత్తి గణంగి యామహా
బాహుశరావలుల్ దునిమి పగ్గములం దెగవ్రేయ వాజులం
దాహవభూమికిం దొలగ నత్తరి సారథి వేరె పగ్గముల్
వాహములం దమర్చుకొని వచ్చె రణస్థలి కద్భుతంబుగన్ 71

భావము : యుద్ధక్షేత్రమందు అతిశయించిన మిక్కిలి కోపముతో నిండిన చర్యలతో పూని ఆ మహాబాహువు బాణముల నెల్లను, తేరుకు కట్టిన పగ్గాలను త్రెంచివేయగా గుఱ్ఱాలు యుద్ధభూమినుంచి పాఱిపోయినవి. అప్పుడు తేరు నడుపువాడు పగ్గాలను గుఱ్ఱాలను అమర్చగా ఆశ్చర్యకరముగా వరుణుడు యుద్ధభూమికి మరల వచ్చెను.

ఉ॥ వచ్చిన నాల్గు బాణముల వాహములం దెగటార్చి సారథి
న్మెచ్చుల కొర్కిచే దునిమి నిష్ఠుర శాత శరత్రయంబు రొ
మ్ముచ్చి చనంగ నేయనిల నోపక తేరటుడిగ్గి యార్తుడై
చచ్చెరబారె తూలుచు నిశాచర కోటులు తల్లడిల్లగన్ 72

భావము : వచ్చి వెంటనే వైరి గుఱ్ఱాలను నాలుగు బాణములతో ప్రశంసకై సారథిని కూడా వధించి కఠినమైన వాడియైన మూడు బాణాలను ఱొమ్ము చీలునట్లు వేయగా నిలువలేక తేరుదిగి బాధతో రాక్షసులు మిక్కిలి దుఃఖింపగా తూలుచు రాక్షసుడు వడిగా వెడలిపోయెను.

మ॥ పృథుకాయుం డతిరోషదారుణ మహాభీమాక్షుడై యార్చి సా
రథితో నిట్లను నీ ప్రభంజనుని బోరన్నేడు మాయింతు నా
రథమున్ వానిపయిన్ వడిం బరపు వీరవ్రాతమున్ మెచ్చగా
సుధ గ్రక్కించెద నేనె యద్దివిజులన్ జొప్పారెచ్చెదన్ మించెదన్ 73

భావము : పృథుకాయుడు మిక్కిలికోపోద్రేకముతో భయము కొల్పు కన్నులతో కేకలుపెట్టి సారథితో ఇట్లనెను. "ఈ వాయుదేవుని నేడు తుదముట్టించెదను. నాతేరును వాని మీదకి తోలుము. వీరులందఱును మెచ్చునట్లు ఆతడు త్రాగిన అమృతమును అతని నుండి క్రక్కించెదను. నేనే ఆ దేవతల ఉనికిని అడ్డగించి వారిని అతిశయించెదను" అని సారథితో పలికెను.

క॥ అని వీరాలాపంబుల
ననిలునిపై గదిసి యొక్కయాగ్నేయంబున్
గొనయమునగూర్చి విడిచిన
ననిలునిపై నెక్కదయ్యె ననుంగుజెల్మిన్ 74

భావము : వీరవచనములతో అనిలుని సమీపించి, వింటిలో ఆగ్నేయాస్త్రమును సంధించి విడువగా ఆతడు తన మిత్రుడగుటచే అది అతనిని అంటలేదు.

మ॥ అది వమ్మైన మహాహిబాణము సమంత్రారూఢిగా నేయ ను
న్మదవృత్తిన్ ఫణి కోట్లురా గరుడబాణస్ఫూర్తిచే ద్రుంచె బో
ర దవాగ్నిన్ గడుమించుకోలను మహోరస్థానముం జించినన్
కదనోర్విం బడి ప్రాణముల్ విడిచె రాకాసుల్ వడిం బాఱగన్ 75

భావము : అట్లు ఆగ్నేయాస్త్రము ఫలింపక పోవుటచే నాగాస్త్రములను మంత్రించి వేయగా, మదించిన పాములు మిక్కుటములై తాకగా వానిని వాయుదేవుడు గరుడాస్త్రముచే సంహరించెను. దావానలమును మించు ఆగ్నేయాస్త్రముచే పృథుకాయుని ఱొమ్మును చీల్చగా అతడు రణరంగమున కూలి ప్రాణాలను వదలెను. రాక్షససేన వడివడిగా పరుగిడి పోయినది.

క॥ వికటాక్షుడు ధనదుపయిం
బ్రకుపితుడై యార్చి రథము బర పిట్లనె ము
న్నొకనాడు నిలువ వెదుటను
అకటా యమృతంపుబల్మినా ధృతిగల్గెన్ 76

భావము : వికటాక్షుడు కుబేరుని కని కోపము వహించి, అఱచి తేరును అతనిపై పోనిచ్చి, ఇట్లనెను. "ఇంతకు ముందు ఎప్పుడును నీవు నాఎదుట నిలువలేదు. ఓహో! ఇది అమృత పానము వలన ధైర్యము కల్గెనా ఏమి?"

చ॥ కలిమియు బల్మియుం గలిగె కంటక వీర కుమార వర్యులన్
కలన జయింతు నంచు పటు గర్వముతో జనుదెంచి నావహో
నిలు మిక పోక నా యెదుటనిష్ఠుర శస్త్ర శరాది సాధనం
బుల కుశలత్వము న్నొఱపు పోవగఁ జేసెద నెందుజొచ్చినన్ 77

భావము : "సంపద, బలము సమకూరినది. శత్రువీరులను, యుద్ధములో జయింపగల ననెడి గట్టి గర్వముతో ఆహా! యుద్ధానికి వచ్చినావు కదా! నా ఎదుట కదలక నిల్వుము. నీ కఠినములైన ఆయుధాలు, బాణాలు మొదలైన ఉపకరణముల నేర్పు వాడిమిని వీడునట్లు చేసెదను."

మ॥ అని రథ్యంబులనాల్గిటం శిరము నొంటారమ్ములం సూతు ద
త్తను వేడింటను గాడనేసి వడితో దర్పంబు పాటించినన్
ధనదుండార్చి మహార్చిబాణము సమంత్రస్ఫూర్తి సంధించి య
ద్దనుజాధీశుపయిం వడిం బఱప నుద్యద్భాతి ఘోరాకృతిన్ 78

భావము : అని గుఱ్ఱాలను నాల్గు, తలను ఒక, సూతుని ఆఱు, ఆతని తనువును ఏడు బాణాలతో తపింపజేసి వేగముతో గర్వమును చూపగా ఆ కుబేరుడు అఱచుచు, ఆగ్నేయాస్త్రమును మంత్రించి ఆ దానవ నాయకునిపై వడిగా వేయగా గొప్ప వెల్గుతో భయంకరమైన రూపముతో

ఆ॥ మంటలాకసంబు నంట ద్విగ్వలయంబు
భూరితీక్ష్ణహతిని బొనుగుపడగ
గ్రమ్మి దనుజశర నికాయాహుతులు బేర్చి
దరికొని వికటాక్షుదగ్ధజేసె 79

భావము : అగ్నిజ్వాలలు ఆకాశమును అంటగా దిక్కుల వలయమంతయు తీవ్రమైన వేడిమిచే మాడిపోవుచుండగా దానవుని బాణముల మొత్తమును మంటలు మించినవై మండుచు వికటాక్షుని కాల్చివేసినవి.

మ॥ వికృతాంగు డతిఘోరరౌద్రమహిమావిర్భావభావంబునన్
సకలాశాంతరఘూర్ణమానపటురోషధ్వానముల్ జేసి సా
యకజాలంబులు బెట్టగా గురిసె వీరాలాపముల్ పౌరుష
ప్రకటోక్తుల్ కడుబల్కుచున్ హరుని దుర్వారోద్ధతిం దాకినన్ 80

భావము : వికృతాంగుడు మిక్కిలి భయంకరమైన కోపాతిశయము కల్గుటచే సకల దిక్కులయందు ధ్వనించు బలము తీవ్రత కఠినత్వము గల అఱపులతో బాణవర్షమును ఎక్కువగా కురిపించెను. వీరవచనములను పల్కుచు, ఈశానుని భరింపరాని విధమున ఎదుర్కొనెను.

చ॥ నిలునిలు రాక్షసాధముడ! నీ భుజగర్వము నీదుశౌర్యమున్
గలుగగ నీ దురుక్తులకు కారణమేమి మహాస్త్రశస్త్రదో
ర్బలనిపుణత్వమున్ నెఱపు పాయక నిల్వుమటంచు సాయకా
వలులు నిగిడ్చినం గెరలి వాడు గుణధ్వని చేసి యుగ్రుడై 81

భావము : "ఓ రాక్షసాధముడా! నిలునిలు. నీ భుజబలము, నీ పరాక్రమములను వెల్లడి చేయు ఈ చెడ్డ పనులకు కారణమేమి? నీ ఆయుధముల, బాణముల, భుజ బలము యొక్క నేర్పును చూపుమా! రణము నుండి తొలగి పోక నిల్వు" అని బాణముల మొత్తమును వానిపై కుమ్మరింపగా ఆ దానవుడు కోపముతో వింటి నారిని మ్రోగించి తీవ్రమైన కోపము గలవాడై

క॥ బెడిదంపు నారసంబుల
సిడమున రథ్యముల గ్రుచ్చి శితసాయకముల్
మృడునియురంబున నాటిన
వెడ నవ్వొలయంగ నసురవీరుని మీదన్ 82

భావము : క్రూరమైన బాణములతో టెక్కెపు కంబమును, గుఱ్ఱాలను కొట్టెను. అపుడు, ఈశానుని ఱొమ్మున వాడియైన బాణాలు నాటుకొనగా, వికృతముగా నవ్వుచు రాక్షసవీరుని మీదికి

ఆ॥ శక్తి బూనియు వైవ జదల మంటలు గ్రమ్మి
చూడ్కులదర ఘోరశూలహస్తు
డగుచు దారుణాట్టహాసంబుతో విక్ర
తాంగు దాకి కూల్చె నాక్షణంబ 83

భావము : "శక్తి" అనే ఆయుధమును వేయగా ఆకాశమున మంటలు రేగి చూపులు చెదరగా, భయంకరమైన శూలమును చేత పట్టుకొని పెద్ద అఱపులతో ముట్టుకొని వికృతాంగుని చంపెను.

వ॥ ఇట్లష్ట దిగీశాది సురవర్యు లమృతసేవాసంజనిత ప్రబల ప్రవర్ధమాన శౌర్యాతిధుర్యులై దానవ వీరుల బహువిధ చిత్ర రణ వీర విహారకౌశలంబులునెఱపిన తెఱపిగొని వెఱచఱచి హతశేషులు బలిదానవనాథుపాలికిం జని 84

అర్థాలు : వెఱచఱచి= భయపడి, హతశేషులు= చావగా మిగిలినవారు.

భావము : ఇట్లు ఎనిమిది దిక్కుల పాలించు ఇతర దేవతలు అమృత పానముచే పొందిన గొప్ప బలముచే ఎక్కువైన శౌర్యముచే రాక్షసవీరులపై పెక్కువిధములైన యుద్ధక్రీడలతో వీరత్వమును ప్రదర్శింపగా తేఱుకొని భయపడి పాఱిపోయిన వారిలో బ్రతికిన వారు బలిచక్రవర్తి యొద్దకు వెడలినవారై

ఉ॥ దేవరయాజ్ఞ మీరకను దేవగణంబుల తోటి పొత్తుచే
నావనరాశి ద్రచ్చి సుధ నందుల గాంచితి మా సుధారసం
బావల మాకు నీయ కమరావలికిన్ హరియిచ్చె నందుకున్
గా వడిబోర దానవుల గయ్యమునం బరిమార్చి రేమనన్ 85

భావము : ''ఓ ప్రభూ! తమ ఆనతి ప్రకారము దేవతలను మేమును స్నేహముతో కలసి, ఆ సముద్రమును చిలికి అమృతమును పొందితిమి. దానిని మాకు ఇయ్యక ఆ విష్ణువు దేవతలకే ఇచ్చెను. ఆ కారణముచే వారితో మేము వడిగా పోరాడగా వారు యుద్ధమున రాక్షసులను చంపినారు. ఇంకేమనవలెను''.

ఆ॥ వలవదన్న వినక వాసవుతో పొత్తు
సేయబట్టి యింతచేటు బుట్టె
కృత్రిమంబు బన్ని గెడపె వృత్రాసురు
వాని నాత్మ నమ్మవచ్చునెట్లు 86

భావము : ''మేము వద్దన్నను వినక మీరు ఆ ఇంద్రునితో స్నేహము చేసినందువల్ల ఇంత చేటు కలిగినది. ఆ ఇంద్రుడు వంచనచే ఆవృత్రాసురుని చంపెను కదా! వాని మనసును ఏల నమ్మవలెను?''

శా॥ ఏనాడైనను దేవదైత్యులకు పొత్తెంతేనియుం గల్గునా
ఏనాడైన నిశాచరేశ్వరులు మున్నీయింద్రుని న్నమ్మిరా
ఏనాడైనను శౌరియున్ మనకు మేలింతైన రానిచ్చునా
ఈ నాడున్ భవదీయనిష్కపట మిట్లింతయ్యె దైత్యేశ్వరా! 87

భావము : ''ఏనాడైనను దేవతలకు దానవులకు పొత్తు ఏమాత్రమైనా కల్గునా?(కల్గదు) ఏనాడైనను రాక్షస ప్రభువులు ఈ ఇంద్రుని నమ్మినారా? ఏనాడైనను ఆహరి మనకు మేలు కొంచెమైనను రానిచ్చునా? ఈనాడును తమ వంచనలేని చర్యచే ఇంత కష్టము కల్గినది కదా!''

వ॥ అనిన విని 88

భావము : అనిన వినిన వాడై

శా॥ ఏమేమీ సురలింతగా నెదిరి మిమ్మీరీతి భంగించిరా
తామర్యాద దలంగి యింద్రుడు మహాదర్పోద్ధతుం డాయెనా

ప్రామాణ్యంబున నాప్తునింబలెను పోరాముల్ కడుం బల్కి సం
గ్రామోర్విన్ మిము గెల్చెనే యమృత సార స్ఫూర్తి దుర్వర్తియై 89

భావము : ''ఆశ్యర్యముగా నున్నదే! ఏమేమి దేవతలు మిమ్ము ఎదిరించి, ఈ విధముగా అవమానపఱచిరా? మర్యాదను వదలి ఇంద్రుడు గొప్ప గర్వముచే విజృంభించెనా ఏమి? సత్యము పలుకుచున్నానని స్నేహితుని వలె మంచి చెడ్డలు పలికి యుద్ధభూమి యందు మిమ్ము అమృతపానముచే కల్గిన సత్త్వముచే జయించినాడా!''

క॥ క్రక్కించెద నమృతంబును
మక్కెలడంచెదను దివిజమండలి నెల్లన్
దిక్కులరాజులతో గడు
సృక్కించెద నింద్రు నసురశేఖరులారా! 90

భావము : ''రాక్షస రాజులారా! వారు త్రాగిన అమృతమును వాంతి చేసుకొనునట్లు చేసెదను. దేవతల ఎముకలను అన్నింటిని విఱుగగొట్టెదను. ఇంద్రుని ఇతర దిక్కుల రాజులతో బాధించెదను.''

వ॥ అని మహదాజ్యాహుతి గొన్న కాలానలంబు చందంబున గడు ప్రజ్వరిల్లి ప్రయాణభేరి వేయించిన 91

అర్థాలు : ఆజ్యము= నెయ్యి, ఆహుతి= వేయబడిన.

భావము : అని అధికముగా వేయబడిన నేతిచే మండు ప్రళయాగ్నివలె మిక్కిలి మండిపడుచు, యుద్ధప్రయాణానికి ఢంకా మ్రోగింపగా,

సీ॥ జగతిబీటలు వారి సప్తవారాశులు
బుడుబుడు ధ్వనులతో నుడుకు వట్టె
పవనతంతులు పటాపంచలై ధరమీద
విడుపు గానక ఘోర వృష్టి గురిసె

చెవులు చిందరవట్టి చెదరిన గుండెల
భ్రమ జెంది దిక్కరుల్ పరువు లెత్తె
పద్మభవాండంబు బహిరంబువులు వాడు
పగిది నిట్టట్టుగా బెగడి తిరిగె

తే॥ సకలలోకంబు లార్తిని సంచలించె
కుండలేశ్వరుడెంతయు బెండు పడియె
దిక్కులన్నియు దిర్దిర దిరుగజొచ్చె
భీషణంబగు ప్రస్థానభేరి మ్రోత 92

అర్థాలు : చిందరవట్టు= పగుళ్లను పొందు, కుండలేంద్రుడు= ఆదిశేషుడు

భావము : భూమి పగుళ్ళను పొందినదై చుట్టునున్న ఏడుసముద్రాలు బుడబుడ మను ధ్వనులతో ఉడికినవి. వాయు ప్రసారాలు చెల్లాచెదురైనవై నేలమీద విడుదలను పొందక పోవుచుండగా తీవ్రమైన వర్షము కురిసినది, (వర్షముచే వాయు ప్రసారములు అడ్డగింపబడినవి) చెవులు చీకాకుతో పగుళ్లు పొంది గుండెలు అదరిపోయినవి. అట్లగుటచే దిగ్గజాలు పరుగిడినవి. బ్రహ్మాండముమీద గల జలములు ఇంకిపోవునట్లు అన్ని వైపులా చెదరిపోవుచు తిరిగినవి. అన్ని లోకాలు బాధతో ఊగిపోయినవి. పుడమిని మోయు ఆదిశేషుడు దిగులు చెందెను. అన్ని దిక్కులు "దిర్‌దిర్" అను ధ్వనులతో తిరుగు చుండినవి. పై విధముగా యుద్ధప్రయాణ సమయమందు మ్రోయించిన భేరి అమితమై భయంకరమయ్యెను.

క॥ ఇట్టుల రణభేరి దగన్
బెట్టుగ మ్రోయించి దనుజ వీరులతోడన్
ఇట్లనె వేలుపు మూకల
జుట్టుడు శివ పద్మభవుల సురుగింతు వడిన్ 93

భావము : ఈ విధముగా రాక్షస వీరులచే యుద్ధభేరి భయంకరముగా మ్రోగించి బలి యిట్లనెను. "దేవతల గుంపును చుట్టుముట్టండి. ఆ శివుని, బ్రహ్మను పరుగెత్తి పోవునట్లు చేయుదును."

చ॥ వెడలుడటంచు ఘోరగతినేగు హయంబు లమర్చి తేరుపై
కడువడి నెక్కి తీక్ష్ణగతి కాహళదుందుభి శంఖనాదముల్
కడ లదరంగ మ్రోయ భుజగర్వములం బహుదైత్యదానవుల్
కడలియు బోలి మిన్నదరగా గదలన్ బహు ళాద్భుతాకృతిన్ 94

భావము : "బయలు దేరండి" అని బలిచక్రవర్తి భయంకరమైన విధమున వేగముగా గుఱ్ఱాలను అమర్చుకొని, తేరుపై కూర్చుండి, ఊదబడు వాద్యములు, భేరులు, శంఖముల ధ్వనులు అతి తీవ్రముగా మ్రోగుచుండగా దిక్కులు అదరుచుండగా తమతమ భుజముల గర్వముతో అనేకులైన దితిసుతులు, దనువుసుతులు సముద్రము వలె విస్తరించి పెక్కు భయంకరాకారములతో, ఆకాశము అదరిపోవునట్లు బయలుదేరగా

ఆ॥ నేల యీని నట్ల నిష్ఠురత మహా
ప్రళయకాల రుద్రుభంగి మెఱయ
భీమసింహనాదబిరుదాట్టహాసహుం
కార ఘోర దుర్నివారమగుచు 95

భావము : భూమినుండి వెలువడినట్లు కఠినుడై ప్రళయకాలమందు ఉగ్రుడైన రుద్రునివలె ప్రకాశించుచు భయంకరములైన కేకలతోను, బిరుదుల పేర్కొనుచు గొప్ప నవ్వులు హుంకార ధ్వనులతోను, అతి భయంకరులై నివారించుటకు వీలుకాని వారగుచు.

ఉ॥ కోటులసంఖ్యరాత్రివరకుంజర వీరగణంబు భీమమై
హాటకరత్నశోభిత మహారథమత్తగజాశ్వసద్భటో
ద్ధాటనపాటవ ప్రకట దారుణమై చతురర్ణవావృతో
ద్ధాటిత్రిలోక భీకరమద స్ఫురణోన్నతి మీరి పర్వగన్ 96

భావము : కోటుల సంఖ్యలో రాక్షస వీరశ్రేష్ఠుల సమూహము అతిశయమై బంగారముతోను, రత్నములతోను, అలంకరింపబడిన, గొప్ప రథములు, మదగజములు, అశ్వములు, సద్భటులు, శత్రువులను చీల్చు తమ నేర్పు గోచరమగునట్లు క్రూరమై, నాలుగు సముద్రాలచే చుట్టబడిన మూడులోకాలకు భయము కొల్పురీతిగా తమ గొప్పతనము గోచరింపగా

చ॥ హయఖురజాతరేణువు మహాగజహస్తచలోర్ఝితాంబువుల్
భయమభయంబునూల్కొలిపె బద్ధ విముక్తుల మాటి మాటికిన్
రయమున నాత్మతోయ శరరాజికినంచుననభ్రగంగసం
శయమడరించె నాగమదసంప్లుత ధాత్రిబిలం బిదెంతయున్ 97

అర్థాలు : హయఖురజాత= గుఱ్ఱపు గిట్టల వలన పుట్టిన, రేణువు= దుమ్ము, మహాగజహస్తచల ఉఝిత అంబువుల్= గొప్పవైన ఏనుగుల తొండములనుండి వెల్వడు నీరు, నూల్కొలిపె= కుదురుపరచె

భావము : గుఱ్ఱపు గిట్టల వలన పుట్టిన దుమ్ము మఱియు గొప్ప ఏనుగుల తొండములచే విడువబడిన నీటితుంపరలు (సంసారులకు) బద్ధులకు భయము, విముక్తులకు (యోగులకు) అభయము కలుగునట్లుగా ఆకాశగంగ తన నీటిని వారుణాస్త్రములుగా జేసి మాటిమాటికి వేగముగ భూమిపై ప్రయోగించుచున్నదా ఏమి అని ఏనుగుల మదజలముతో తడిసియున్న రణరంగమును గూర్చి సందేహమును కలుగజేసెను.

క॥ ఇటువలె చతురంగబలో
త్కటమగు నద్దైత్యసేన కడు రభసమునన్
పటుతరమహదార్భటులను
పటువైఖరి మిన్ను నేల పట్టక నడచెన్ 98

భావము : ఈ విధముగా చతురంగ బలములతో కూడిన ఆ రాక్షసుల సేన మిక్కిలి వేగముగా గొప్ప హాహాకార ధ్వనులు చేయుచు గట్టి పట్టుదలతో మిన్నును, మన్నును సందులేక నింపుచు యుద్ధమునకు నడచెను.

వ॥ ఇట్లు కమలభవాండంబు పిక్కటిల్లి ఫక్కునం బగులునో యను తలంపుల సకల నిలింపుల పెంపు దక్కి సకంపనులై గుంపులు గొని తెంపువాటింపుటకు నలవిగాక బదరికాశ్రమవాసులైన నరనారాయణుల శరణుజొచ్చి వేడిన నప్పరమ పురుషులు సురగణంబులతో వచ్చియున్న హరిహయుని మ్రోల 99

భావము : ఈ విధముగా భూమి పగిలిపోవునో అనెడి తలంపులతో దేవతలు పొంగు తొలగి వణకుచు గుంపులై సాహసమును చూపుటకు ఉత్సాహము లేనివారై పురాణ పురుషులైన నరనారాయణ మహర్షులను రక్షింపుడని ఆశ్రయింపగా, దేవతల సముదాయముతో తమ్ము చేరిన మహేంద్రుని సమక్షమున

సీ॥ పటుశరద్ఘనరసప్రావృడభ్రాంగులు
మహిత పింగళ జటా మకుట ధరులు
ఉరుతరోజ్జ్వలిత భస్మోద్ధూళితాంగులు
నాజానుబాహు లత్యమితబలులు
శరణాగతత్రాణబిరుదాంక భూషణుల్
సంగరాంగణ భీమ సాహసులును
బాణబాణాసనాభరణైక హస్తులు
నంబుజనాభ నిజాంశ భవులు

తే॥ మునులు సర్వంసహాభారమోచనోత్సు
కాత్మకమలులు నస్త్రవిద్యాకుశలులు
నమితసత్త్వులు కరుణామృతాన్వితులును
నమరగణముల కపుడు ప్రత్యక్షమైరి 100

అర్థాలు : పటుశరత్= దట్టమైన శరత్కాలమందు, ఘనలసత్= కర్పూరము వంటి తెల్లనైన, సంగరాంగణము= యుద్ధభూమి, పింగళజటామకుటధరులు= గోరోజన వర్ణముగల జడలే కిరీటములైనవారు.

భావము : శరత్కాలమందు కర్పూరము తెల్లని మబ్బుల వంటి శరీరము కలవారు. గోరోజన వర్ణము గల జడలముడులే కిరీటములైన వారు. ప్రకాశించు బూడిద పోడి అలమిన అవయవములు కలవారు. పొడవైన భుజములు, అమితమైన బలము కలవారు. శరణు పొందిన వారిని కాపాడిన వారను బిరుదులున్న గుర్తులు గల్గి ఆభరణములు కలవారు, యుద్ధభూమి యందు భయంకరమైన తెగువ కలవారు. బాణాలు చిందర వందర చేయువారు. బ్రహ్మదేవుని అంశమున జన్మించినవారు నరనారాయణ మహర్షులు భూమి వహించు భారమును విడిపించుటకు ఉత్సాహము చూపు కమలము వంటి ప్రసన్నమైన ఆత్మలు కలవారు, అస్త్రవిద్య యందు నిపుణులు, అధికమైన సత్త్వగుణము కలవారు దేవతల ఎదుట కానవచ్చిరి.

వ॥ ఇట్లు ప్రత్యక్షంబైన నరనారాయణుల చరణ కమలంబుల కెఱగిన నమర విభునియెత్తి తద్వృత్తాంతంబంతయు విని సుర గణ పరివృతులై యవ్వైరోచని కెదురు నడచిన 101

వచనము : ఈవిధముగా గొప్పతేజస్సుతో ప్రత్యక్షమైన నరనారాయణుల పాదపద్మాలకు ఇంద్రుడు వంగినమస్కరించెను. ఆతనిని వారు పైకెత్తి వారి విషయమును విని, దేవతల సమూహముతో చుట్టబడినవారై బలిని ఎదుర్కొనుటకు వెడలగా

క॥ నరనారాయణ దోర్బల
పరిరక్షిత దివిజ గణము బర్జన్యుడు వే
పురికొలుప రాత్రి చరులను
బరిమార్పగ జొచ్చి రమిత బాహాబలిమిన్ 102

భావము : ఆ నరనారాయణుల భుజబలముచే రక్షితులగుచున్న దేవతలు ఇంద్రుడు పురికొల్పగా, ఆ రాక్షసులను చంపుటకు గొప్ప భుజబలముతో ముందుకు సాగిరి.

క॥ బలిదైతేయ మహాభుజ
బల సంగతి నసురవరులు పౌరుష శౌర్యో
త్కలితప్రౌఢిమ బోరిరి
బలసూదనముఖ్య ఘనసుపర్వులతోడన్ 103

భావము : మహా భుజబలము కలిగిన బలి కూడుటచే రాక్షసవీరులు పౌరుషము, వీరత్వము నేరిమిని చూపుచు ఇంద్రుడు మొదలైన దేవతలతో పోరాడిరి.

చ॥ తలకొని మింటినంటుజలదంబులకైవడి కొండలట్టులన్
గలను మహార్భటుల్ చెలగ కార్ముక ఖడ్గగదాసితోమరో
త్కులిశ రథాంగశూల శరకుంతకుఠారకఠారసంభృతో
త్కలితసుహస్తులై కణగి దర్పములేర్పడ బోరి రయ్యెడన్ 104

అర్థాలు : కలను= యుద్ధభూమి, కార్ముకము= విల్లు, ఖడ్గము= కత్తి, అసి= చిఱుకత్తి, తోమర= చిల్లకోల, ఉత్కులిశ= మేలైన వజ్రాయుధము, రథాంగము= చక్రము, కుంత= ఈటె, కుఠారము= గొడ్డలి, కఠారము= చాలా పెద్ద కత్తి, కణగి= పూని, ఉత్కలిత= ఉత్కంఠ, ఉత్సాహము.

భావము : ఎదుర్కొని ఆకాశము నంటు గొప్ప అఱపులతో, మేఘరాశులవలె (నల్లని వారు రాక్షసులు) కొండలట్లు యుద్ధభూమిలో వివిధములైన ఆయుధాలను ధరించిన అందమైన చేతులు కలవారై పూని వారి వారి బలములు గోచరించునట్లు పోరాడిరి.

సీ॥ గుణరవస్ఫూర్తి దిక్కుంభములగలించి
ఆలీఢపాదులై యధివసించి
కరలాఘవంబున శరజాలము నిగిడ్చి
యక్షయాస్త్రనిరూఢి నతిశయిల్లి

యుడుగు వృథాబాణ ప్రయోగ ధౌరేయులై
పటు శక్తి కృత్రిమ ప్రబలులగుచు
నతులిత మాయా విహారసంరంభులై
ఘనతపఃశక్తి ప్రకాశులగుచు

తే॥ పటహకాహళభేరికా పణవగోము
ఖాదిమహనీయనాద దిగంతులగుచు
వీరవితరణ బిరుద ప్రవీణగద్య
పద్యబాహాట చారణ ఫణితి మెఱయ 105

భావము : అల్లె త్రాటిని మ్రోగించి అష్టదిగ్గజాలను వాని స్థానముల నుండి చలించునట్లు చేసి, కుడి కాలు ముందుకు చాచి నిలిచి చేతి నేర్పుచే బాణాలను వింటిలో ఎక్కుపెట్టి ఎడతెగని ఆయుధాలతో విజృంభించి, అవి నిష్ఫలము కాగా వీరత్వముతో కూడిన బలమైన శక్తితో కల్పించుకొన్న బలము కలవారై వర్తించుచు సాటిలేని మాయలతో కూడిన సంచారములతో, గొప్పతపో మహిమతో ప్రకాశించు పలు విధములైన యుద్ధవాద్యముల నినాదములు దిగంతముల వఱకు వ్యాపించుచుండగా "నేర్పుగల వీరత్వము గలవారు'' అనెడి బిరుదులు గల గద్యలతోను, పద్యములతోను ప్రశంసింపబడువారై గోచరమగుచున్న ఆకాశగమనుల వలె మెఱయుచు

ఉ॥ ఖేటకరాసియుద్ధ పరిఖేలనశౌర్యపరాక్రమక్రియా
స్ఫోటకిరీట కుండలవిభూషిత మస్తక ఖండన క్రియా
పాటవవీరరాహుతుల ఖండనతాండవచండదోర్బలో
ద్ఘాటనమై రణంబు కడు దారుణ లీల ఘటిల్లె నెంతయున్ 106

అర్థాలు : ఖేటకర= డాలు, అసి= కత్తి, పరిఖేలనము= యుద్ధ క్రీడ

భావము : డాలుతోను, కత్తితోను చేయు యుద్ధక్రీడ యందు వీరత్వ సామర్థ్యమును ప్రదర్శించునపుడు ధరించిన కిరీటములు, కుండలములు

గల తలలను తెగగొట్టు వీరులైన రౌతుల యుద్ధమందు చేయు అధికమైన విన్యాసములలో తీక్ష్ణమైన గర్వము, భుజబలముతో సైనికుల వినాశము కలదై యుద్ధము వినోదక్రియగా జరిగెను.

ఉ॥ ఆహవరంగరంగదభియాతిచమూహయమత్తదంతి సం
దోహరథప్రకాండముల ద్రుంచి తెరల్చి మరల్చి నుగ్గుగా
సాహసవృత్తి చెంది బలుచందములన్ ధరగూల్చిరా హయా
రోహకు లూర్జిత ప్రకటరోష విభీషణరక్త నేత్రులన్ 107

భావము : యుద్ధరంగమందు వివిధ వర్ణముల కాంతితో సంచరించు గుఱ్ఱములు, మదగజములు తేరుల మొత్తాలను ముక్కలుగా చేయుచు వానిని వెనుకకు మరల్చి, పిండి యగునట్లు, మిక్కిలి తెగువతో, పెక్కు రీతులతో ఆశ్వికులు (గుఱ్ఱముపై నుండి యుద్ధము చేయువారు) పొంగుచున్న, కన్పట్టుచున్న కోపాతిశయముతో భయంకరములైన ఎఱ్ఱని కన్నులతో (నాలుగు రకాల సైనికులను) కూల్చివేసిరి.

మ॥ మహదద్రిప్రకరంబులో యన మహామత్తేభయూథంబుపై
మహనీయాశ్వికవర్గమద్భుతగతిన్ మార్కొంచు చిత్రాకృతిన్
బహుమార్గంబుల దాటి దూటి వెనకై పట్టీక లంఘింపుచున్
మహితప్రౌఢిమకుంభముల్ వొడిచి శుంభల్లీల గోరింపుచున్ 108

భావము : గొప్ప కొండల సముదాయము వలె నున్న చాలా పెద్దవైన మదించిన ఏనుగుల గుంపును, మేలైన ఉత్తమ అశ్వదళము ఆశ్చర్యకరముగా ముట్టడించి పలు విధములైన అచ్చెరువు కొల్పురీతులలో, అన్ని దారులలో ప్రవేశించి దూకి, ఆక్రమించి, వాని వెనుక ఉండి ఏమాత్రము ఎదుర్కొనుటకు అవకాశమియ్యక దుముకుచు గొప్ప నేర్పుతో చెక్కిళ్లను పొడుచుచు ప్రకాశముతో ఎగయుచు

చ॥ మదగజరాజి దేరులకు మావుతులుం బురికొల్పి వ్రేల్మిడిన్
గొదగొని యశ్వసూతరథకోటులనున్ వడి జుట్టి మోదుచున్
గదిసిన దంతిరాజిరుధిర ప్రకరంబులు కుంభయుగ్మముల్
మెద డెగయంగ జించి రణమేదిని ముత్యపుముగ్గు దీర్చుచున్ 109

భావము : మదించిన ఏనుగు మొత్తముపై, తేరులపై అశ్వారోహకులను పూనించి త్వరితముగా, గుఱ్ఱాలను, రథాలను, తేర్లను చుట్టి బాగుగా మర్దించుచు, అప్పుడు కలిగిన ఏనుగుల రక్తప్రవాహములతో చెక్కిళ్ళ జంటలు మఱియు మెదడు వెలువడునట్లు తెగగొట్టగా వెల్వడిన ముత్యాలు (ఏనుగు కుంభస్థలమున ముత్యములుండునని కవి సమయము) రణభూమి యందు ముగ్గులై కన్పట్టుగా.

చ॥ రథము రథమ్ము డాసి గుణరావము దిక్కుల బిక్కటిల్ల సా
రథులనుహెచ్చరించి సురరాక్షసయోధులు దివ్యబాణముల్
రథికులు మెచ్చ దోర్బల పరాక్రమలీల గణంగి రథ్యసా
రథిగుణకేతుయోధుల శరంబుల గ్రుచ్చుచు చిత్రలీలలన్ 110

భావము : రథము రథమును సమీపించి అల్లెత్రాడు ఘోష దిక్కులను భేదించునట్లు మ్రోగగా, తేరునడుపు వారికి జాగరూకతను వహించుండని ఆజ్ఞలు ఇచ్చుచు దేవతలు, రాక్షసులు మంత్రములచే ప్రయోగించు బాణాలను రథముపై కూర్చుండి యుద్ధము చేయు వీరులు మెచ్చుకొనునట్లు భుజబలము, వీరత్వము ప్రదర్శించు విధమున పూని గుఱ్ఱాలను, సారథులను, పగ్గాలను, పతాకములను, భటులను బాణాలతో గ్రుచ్చుచు ఆశ్చర్యకరముగా

మ॥ ధనువుం ద్రుంచుచు వేఱె కార్ముకము లందందన్ వడిం దాల్చుచున్
తనువుల్ నాటుచు మూర్ఛలొందుచును యంతం తేఱి బల్ ధీరులై
ఘనరథ్యంబుల సూతులం గెడపుచున్ ఖడ్గాసికుంతాది సా
ధనముల్ గైకొని బీఱువో కడరు చుద్దామ క్రియం బోరుచున్ 111

భావము : వింటిని త్రుంపగా, వడిగా వేఱొక వింటిని ధరించి, శరీరమందు బాణాలు నాటినను, మూర్ఛలు కలిగినను వెంటనే ధైర్యముతో గుఱ్ఱాలను, రథము నడుపు వారిని చంపుచు, పెద్దకత్తి, చిన్నకత్తి, ఈటె మొదలైన యుద్ధసామగ్రిని గ్రహించి అతిశయించుచు అడ్డులేని విధమున పోరాడుచు

క॥ ఒక్కొక డందరి గూల్చుచు
పెక్కుమదేభాశ్వభటుల పేర్చుచు మఱి యం
దొక్కని జుట్టుచు కూల్తురు
పెక్కుమహారథికవరులు భీమాకృతిమై 112

భావము : ఒక్కొక్కడు చాలా మందిని వధించుచు, పెక్కు మదగజాలను, గుఱ్ఱాలను, భటులను అతిశయించుచు అందులో ఒక్కరిని చుట్టి శ్రేష్ఠులైన రథికులు భయంకరమైన రూపముతో కూల్చుచుండిరి.

వ॥ ఇట్లు దారుణంబగు మహారణంబున బడు మత్తేభంబులును బొడియగు రథంబులును కడికండలౌ హయంబులును తుండంబులౌ భటతండంబులును తునుకలౌ ఘనకేతనంబులును నుగ్గునూచమౌ పగ్గంబులును తెగిపడిన నొగలును ఖండంబులగు కోదండంబులును విఱిగి పడిన యిరుసులును చెక్కలగు చక్రంబులును శకలంబులగు సకల పరికరంబులును డొల్లు శిరంబులును పొరలు కళేబరంబులును పరువులెత్తు మొండెంబులును బొబ్బలిడు మస్తకంబులును తుమురగు భూషణంబులును అమేయ ప్రమాణంబులగు నవయవంబులునునై మస్తిష్కకర్దమంబును ఎమ్ముల శిలలును కళేబర మీనంబులును చికుర శైవాలంబు లును రుధిరజల పూర్ణంబును సితచ్ఛత్ర పుండరీకంబులును చామరరాజహంసంబులును గల్గి మహాకమలాకరంబును బోలె గ్రాలుచున్న రణస్థలంబున నోలలాడుచు మేధో మస్తిష్క మాంసంబు లాపూర్ణంబుగా మెసవి కసివోక కసి మెసంగుచు భూతప్రేత పిశాచ ఢాకినీ శాకినీ కూష్మాండముఖ భూతగణంబుల కహకహార్భటకలకలహాస మహాట్టహాస ప్రముఖ సంకులారావ కోలాహలంబైన రవంబు భీషణంబయెనయ్యెడు113

భావము : ఇట్లు కడు భయంకరంబగు మహాయుద్ధమందు కూలిపోవు మత్తగజాలు, పొడియగుచున్న తేరులు, ముక్కలగుచున్న గుఱ్ఱాలు, బంటులు తునుకలైన, బలిష్ఠములైన పతాకాలు, నలిగిపోవు కట్టుత్రాళ్ళు తెగిపడిపోయిన కాడిమానులు, ముక్కలైన పెద్దవిండ్లు, విఱిగి పడిన బండి చక్రాలు. ముక్కలైన అన్ని ఆయుధాలు దొర్లుచున్న తలలు, పొరలుచున్న శవాలు, పరుగెడుచున్న తలలేని శరీరాలు (మొండెము) అఱచుచున్న తలలు, చిన్నచిన్న తునుకలైన నగలు, మిక్కిలి గొప్ప ఆకారములతో నుండు అవయవములతో, మెదడులు అనెడి బురదతో, ఎముకలు అనెడి రాళ్ళతో, శవాలు అనెడి చేపలతో, వెంట్రుకలు అనెడి నాచు తీగలతో, రక్తము అనెడి నీటితోను (నిండినదై) తెల్లని గొడుగులనెడి తెల్లతామర పూలతోను, వీవనలు అనెడి గొప్ప హంసలతోను, పెద్దదైన సరస్సువలె తోచుచున్న యుద్ధభూమిలో విలాస గీతములతో ఆడుచు గొప్ప తెలివితేటలు గల మెదడు గల మాంసంబులు పూర్తిగా తిని, కోరిక తీరక విజృంభించుచు భూతములు, పిశాచములు హాహాకారములతో అఱపులతో పెద్దపెద్ద వెఱ్ఱి మోతలతో సందడి చేయగా, ఆ రణభూమి భయముతో కంపితమై శబ్దమయ మయ్యెను.

చ॥ మఱిమఱి చేగరేగి సురమండలిచండ పరాక్రమక్రమ
స్ఫురణబల ప్రవర్ధతను పోరు నెడన్ నిలుపోపలేక సం
గరవిముఖాస్యులై విఱిగి సర్వ నిశాచర కోటి నెక్కొనున్
వెఱవకు డేను గల్గ నని వీరుడునబ్బలి ఘోర మూర్తియై 114

భావము : మిక్కిలి చేవతో దేవతల సమూహము అతిశయ వీరత్వము ప్రకాశమగునట్లు బలము వృద్ధి పొందుచుండగా పోరునప్పుడు వారిని అడ్డగించుటకు శక్తిలేని వారై, యుద్ధము చేయుటకు కోరికలేని వారై చీలిపోయి రాక్షసులందఱును నిలబడిపోగా ఆ వీరుడు బలి చక్రవర్తి భీతిగొల్పు రూపము కలవాడై " ఓ సైనికులారా! భయపడవద్దు. నేనున్నాను కదా!" అని పల్కి

ఉ॥ సారథి నెచ్చరించి గుణశబ్ద వికీర్ణ దిగంతరాళుడై
వారిదనిస్వన ప్రకటవాక్యములం దివిజేంద్రముఖ్యబృం
దారక సంఘమున్ గినిసి నవ్యశిలీముఖజర్జరాంగులై
పారగ నేయుచుం గనలి బంధుర లీలను విక్రమింపగన్ 115

భావము : తేరునడపు వానిని హెచ్చరించుచు అల్లెత్రాటి ధ్వని దిక్కులకొనలు వ్యాపించునట్లు మ్రోయించుచు మబ్బులు (ఉఱుములు) చేయు ధ్వనులుగల స్పష్టమైన పదజాలముతో దేవతలను కోపముతో (దూషించుచు) క్రొత్త బాణముల వాడియైన కొనలచే, గాయపడిన అవయవములు కలవారలను చేసి యుద్ధరంగము నుండి తప్పించుకొని పరుగులెత్తి పోవునట్లు చేయుచు మఱియు కోపముతో గట్టిదైన పట్టుదలగల ఉత్సాహముతో పరాక్రమమును ప్రదర్శించగా,

క॥ ఆ యెడ దివిజులు నరనా
రాయణుల మఱుగుచొచ్చి రక్షింపుడు మ
మ్మాయతబలుడగు బలిపై
చేయాడదు గుండె లగలె చేడ్పాటొందెన్ 116

భావము : ఆ దుర్దశలో దేవతలు నరనారాయణుల చాటుచొచ్చి (రాక్షసులకు కనబడక) "ఓ మహర్షులారా! మమ్ము కాపాడండి. చాలా బలవంతుడైన బలితో యుద్ధము చేయుటకు మాకు చేయాడదు. గుండెలు చెదరినవి. గుండె బలము చివికిపోయినది."

తే॥ అనిన నారాయణుడు కెంపావహించు
కన్నుగొన లొప్ప బలిదైత్యు గాంచి నిలుము
రాక్షసాధమ! యిటు చక్కరమ్ము దివిజ
గణముపై చేర్పు తీవ్రత గుదియు మనుచు 117

భావము : అని వారు దీనులై తమ నిస్సహాయతను ప్రకటింపగా, ఆ ఋషులు కోపముతో వాడిన కన్నుల జంటను కలవారై "ఓ నీచుడైన రాక్షసుడా! నిలువు. ఈ చోటికి రా! దేవవీరులపై ప్రయోగించు తీవ్రత తగ్గించుకొనుము" అనుచు

**క॥ పలికిన వెడ నవ్వొలయగ
బలి యిట్లనె మౌని వృత్తి బవనాశనులై
మెలగుచునుండెడి మీరీ
వలవని కయ్యంబు సేయ వచ్చితి రహహ 118**

భావము : ఆ పల్కులను విని వెఱ్ఱినవ్వు గోచరించగా బలి యిట్లనెను. "మునుల వృత్తిలో నున్నవారై వాయు భక్షణులై జీవితమును నెఱవుచున్న మీకు(తగని) అవసరము లేని యుద్ధము చేయవచ్చితిరి! ఆహా! ఇది ఆశ్చర్యము కలిగించు చున్నది."

**సీ॥ ప్రణవాదిసన్మంత్ర పఠనంబు గాదుగా
ఘనధనుర్వేదవాక్కౌశలంబు
జపమాలికాక్రమ చాతురి గాదుగా
బాణసంధాన సత్ప్రౌఢిమంబు
లసదాత్మవద్ధ్యాన లక్ష్యంబు గాదుగా
శాత్రవకంఠ లక్ష్య ప్రసక్తి
ఘనతాపసాభివందన రూఢి గాదుగా
తామస ప్రత్యాహతాహవంబు**

**తే॥ సవనపరికరస్రుక్స్రువాజ్య ప్రముఖ్య
కలిత పరిదాన సంప్రయోగంబు గాదు
బహువిధాయుధ సంభృత ప్రధననిపుణ
సాధనప్రౌఢిమముగాని సంయమీంద్ర! 119**

భావము : "ఓ మునివరా! ఓంకార మాదిగా గల గొప్పమంత్రాలను పఠించుట కాదు కదా! గొప్ప విలువిద్య యందు నేర్పరితనము, రుద్రాక్షమాలలు త్రిప్పు

తెలివికాదు కదా! బాణములను ఎక్కుపెట్టు మేలైన తెలివి, ప్రకాశించు ఆత్మతో ధ్యానము (ఏకాగ్రతతో స్తుతి) లక్ష్యము కాదు కదా! పగవారి మెడల యందు చూపును పెట్టుట గొప్ప తపస్సంబంధమైన నమస్కారము(మొక్కు) కాదు కదా! శత్రువులను వధించు యుద్ధము యజ్ఞమున ఉపయోగించు ఉపకరణములైన స్రుక్కు, స్రువము నేయి మొదలైన ముఖ్యములైన వానితో దాన(అర్పించుట)ములను ఇచ్చుట కాదు కదా! పెక్కు విధాలైన ఆయుధములతో కూడిన యుద్ధ వ్యూహమందు ప్రదర్శించు సాధనముల నేర్పు.

**శా॥ నీతో బోరి జయింపనోడిన మహానీచంబు వాటిల్లుటన్
నీతో మార్కొనగాదు దేవతలకై నీవిట్లురా నోర్వరా
దైతే నీ శరచాపకౌశలము విద్యా ప్రౌఢిమ ప్రక్రియా
ఖ్యాతుల్ జూపిన (జూ చెదన్ వెనక చెయ్యాడింతు చిత్రాకృతిన్ 120**

భావము : "నిన్ను జయించుటకై నీతో పోరాడితే, నీవు ఓడిపోయినచో అది నాకు నీచకార్య మగును. కనుక నీతో నేను యుద్ధము చేయుట తగదు. కాని నీవు దేవతలకై ఇట్లు యుద్ధానికి రాకూడదు. దీనిని సహింపరాదు. అయినా నీవు వచ్చితివి. కనుక నీ విలువిద్యా నైపుణ్యము, పాండిత్యము, ప్రయోగ సామర్థ్యము చూచెదను. తర్వాత నేను యుద్ధానికై చిత్ర విచిత్రములుగా, నా చేతిని కదలించెదను. (యుద్ధమును ప్రారంభింతును)

**శా॥ మీర ల్భూరితపోమహత్త్వమున నెమ్మిన్ గోరుచున్నట్టి యా
స్వారాజ్యాధిపుడైన శక్రుడు సదా సంప్రీతితో గొల్వగా
ధీరోదాత్తత మూడులోకములు సందీప్తంబుగా నేలితిన్
మీరా నన్నెదిరించువార లహహ మెచ్చందగున్ మిమ్ములన్ 121**

భావము : "మీరు మీ తపస్సు యొక్క మహత్త్వముచే నిండు మదితో క్షేమమును కోరుచున్నట్టు ఆ స్వర్గాధిపతి ఇంద్రుడు ఎల్లప్పుడు ప్రీతితో

ధీరోదాత్తుడై నన్ను సేవింపగా, మూడులోకాలను, తేజస్సుతో పాలించితిని. నా సేవకుడైన ఇంద్రుని కొఱకు మీరా ఎదిరించువారు! ఆశ్చర్యకరముగా ఉన్నదే! ఆహా! మీ ప్రయత్నము మెచ్చదగినదా! (నిందింపదగినది. ప్రయోజనము లేనిది.) (మెచ్చందగున్ అని నిందార్థము. వ్యాజస్తుతి.

క॥ మిత్రద్రోహుల దివిజుల
బాత్రముగానెంచి చెలిమి పాటించి మహా
శాత్రవుని నన్ను మార్కొన
చిత్రంబగు పడుచు బుద్ధిచేసితి రకటా 122

భావము : "దేవతలు మిత్రులైన మాకు కీడు తలపెట్టినారు. తగిన వారని తలంచి, వారి యెడ చెలిమితో వారికి గొప్ప శత్రువైన నాతో యుద్ధము చేయుటకు సిద్ధమగుట అర్థమగుటలేదు. ఇట్లు తలపడుట మీ మందబుద్ధి అగుచున్నది. అయ్యో!"

క॥ మునులకు రోషద్వేషము
పనిలే దికనైన సత్త్వ పరిణతులగుచున్
జని పుణ్యనదీతీరం
బున నాత్మధ్యానగరిమమున నుండదగున్ 123

భావము : "మునులైన మీరు అన్నింటిని త్యజించినవారు మీకు కోపము, పగ ఉండరాదు. ఇకనైనను మీరు సత్త్వగుణముతో (మీ నిర్ణయము మార్చుకొని) మార్పును పొంది, ఏదైనా ప్రఖ్యాత నదీతీరమున పరమాత్మను ధ్యానించుచు గొప్పవారై ఉండుట మంచిది".

వ॥ అనిన విని 124

భావము : అని చెప్పగా విని (మునులిట్లనిరి)

మ.కో.॥ దానవేశ్వర యేల యిట్టి వృథా ప్రలాపము లాడగా
భూనుతుండవు శౌర్యసంపద భూరిదోర్బల శాలివై

మౌనివృత్తి పరాక్రమంబును మార్కొనం దెలివయ్యెడిన్
గాని చూపుము నీ మహాశరకార్ముకా బల మియ్యెడన్ 125

భావము : "దానవుల ప్రభూ! ఉపయోగములేని వెఱ్ఱిమాటలు (అర్థములేని) ఏల పలుకుచున్నావు? భూమండలములో నుతులు పొందువాడవు? గొప్ప భుజబలశాలివై మౌని వృత్తిలో నున్న వారి పరాక్రమములను ఎదిరించు తెలివి కలిగినది. కావున నీ వింటి శక్తి ఇప్పుడు మాపై చూపుమా!"

క॥ హరిశిఖి భానుజ, నైరృతి
వరుణానిలధనదహరుల, వారించుటలున్
వరవిక్రమమని యెంచకు
దురమున నా యెదుట నిలువు దోర్బల శక్తిన్ 126

భావము : ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానులను యుద్ధమందు అడ్డగించితినని అదియే నీ పరాక్రమమని తలంపకుము. నీ భుజబల శక్తితో నా ఎదుట నిలువుము"

చ॥ అన విని యాగ్రహంబున మహానలసన్నిభ దివ్యబాణమున్
గొనయమునందు గూర్చి యిదిగో కడు నేర్పరివైన దీనికిన్
వెనుకకు బోక తప్పుకొను వేగమె నీ దగు ప్రాణవాయువుల్
గొనునని వ్రేయ వాని నొక కోలన గూలగ నేసె నయ్యెడన్ 127

భావము : అని చెప్పగా విన్నవాడై బలి కోపముతో గొప్ప అగ్ని జ్వాలవంటి బాణమును వింటి నారిలో కూర్చి, "ఇదిగో, నేర్పరివైన దీనిని మరలిపోక తప్పించుకొనుము. ఇది నీ ప్రాణాలను తప్పక హరించును." అని దానిని ప్రయోగింపగా ఆ ముని ఒక బాణముతో దానిని సులభముగా తొలగించెను.

మ॥ మఱి యందొక్కనిశాతసాయకము భీమ ప్రౌఢినేయన్ వడిన్
మెఱుగుందూపున దాని ద్రుంచి బలియు న్నేయంగదా నన్నిటిన్

చెరుకుంగోలలలీలఁ ద్రుంచి విపులార్చింబోలు ఘోరాంశుగం
బురమున్ దూఱగ నేయన య్యసుర నత్యుగ్రాకృతిం గ్రాలుచున్ 128

భావము : మరల తన వింటిలో మఱొక వాడియైన బాణమును కూర్చి భయంకరమైన విధమున నేర్పుతో వేయగా, ముని దానిని మెఱయుచున్న బాణముతో త్రుంచి బలి చక్రవర్తిపై తాను కొన్ని బాణములను ప్రయోగింపగా, వానినన్నింటిని చెఱకుగడల వలె విలాసముగా విఱుగగొట్టి వెడల్పైన అగ్నిజ్వాలను పోలు భయంకరమైన శరీరమున వాని ఱొమ్మును దూఱునట్లు వేయగా, ఆ రాక్షసుడు మిక్కిలి కోపము చెంది భయము కొల్పు రూపముతో కన్పట్టుచు

మ॥ మహదాగ్నేయశరంబు దోనిడుచు సన్మంత్ర ప్రయుక్తంబుగా
బహుతీవ్రక్రియ నేయ ధూమములు శుంభద్విస్ఫులింగంబులున్
మహదర్చుల్ దశదిక్కులం బొదువ భీమ ప్రక్రియం బేర్చి దు
ర్వహమై నేలయు మిన్ను నేకముఖ ఘోరంబై పయిన్ వచ్చినన్ 129

భావము : గొప్ప ఆగ్నేయ శరమును వెంటనే అల్లెత్రాటిలో ఉంచి, శక్తిమంతమైన మంత్రమును ఉచ్చరించుచు మిక్కిలి తీవ్రతతో వేయగా పొగలు, ఎగయు నిప్పురవ్వల సెగలు మిక్కుటములై పది దిక్కులయందు ప్రసరించి భయంకరముగా లేచి భరింపరాని యట్లు నేలను, నింగిని ఒకటిగా చేసి, దారుణముగా పై పడి ఆక్రమింపగా

క॥ నారాయణుండు వేగమె
వారుణబాణంబు మంత్రవత్తుగ నేయన్
భూరితరవారిపూరము
వారకనాగ్నేయ శరము వారించె వడిన్ 130

భావము : నారాయణుడు వరుణాస్త్రమును మంత్రముతో వేయగా, అది వెంటనే ఆగ్నేయాస్త్రమును తొలగించెను.

చ॥ జలధరబాణ మయ్యసురశౌర్యత నేసిన కారు కమ్ముచున్
జలధరమాలికల్ భువన సంచలతం బొదువంగ గమ్ముచున్
తలుకు మెఱుంగులుం పిడుగుతండములుం కడు గర్జితంబులున్
పెలుచ ఘటిల్ల జీకటుల చేర్చుచు రా గని ధీరచిత్తుడై 131

భావము : ఆ రాక్షసుడు బలి తానును వరుణాస్త్రమును శూరత్వమును ప్రదర్శించుచు వేయగా, భూమి యంతయు చీకటితో నిండిపోయి మబ్బుల వరుసలు తోచుచు, చలించుచు వ్యాపించి, అంతటను చొచ్చి తళుకులతో మెఱపులు గర్జనలు చేయుచున్నవై చీకటులు దట్టమై వచ్చుటను చూచి నిలుకడైన మనస్సుతో

శా॥ వాయవ్యాస్త్రము మంత్రపూర్వముగ దైవజ్ఞుండు నారాయణుం
డేయన్ దారుణ వాయుసంఘములు మిన్నెల్లం బ్రకంపింపగా
బాయం జేయుచు దూదిపింజన బటాపంచై పయోదావలున్
మాయంబై చన చిందు కూర్చె నసురామర్త్యుల్ వెరం గందగన్ 132

భావము : నారాయణ మహర్షి శుభాశుభములను ఎఱిగిన జ్ఞాని, వాయవ్యాస్త్రములను మంత్రించి వేయగా, భయంకరమై గుంపులు గుంపులై వాయువులు ఆకాశమంతటిని బాగుగా వణకునట్లు చేయగా వర్షధారలు దూది పింజల వలె నశించి కనబడక మాసిపోవునట్లు చిందర వందరయ్యెను. అసురులు, అమరులు ఆశ్చర్యముతో ఆ దృశ్యమును చూచిరి.

ఉ॥ చూచి మహాహిబాణ మరి జొన్పి సమంత్రక మొప్పపూని వై
రోచని యుగ్రతన్ విడువ రోదసి నిండె మహాహిపంక్తి పె
ల్లేచి విషానలార్చు లొగినెచ్చిన ధూమములున్ మిణుంగురుల్
చూచు సురాసురావలికి చోద్యముగా గడుమీరి పర్వినన్ 133

భావము : బలి సర్పబాణమును మంత్రించి ఉగ్రుడై వేయగా, ఆకాశమంతయును పాముల వరుసలు క్రమముగా విషముతో నిప్పు పొగ రవ్వలు చెలరేగి వ్యాపింపగా చూచుచున్న దేవతలు దానవులు అబ్బురపడిరి.

మ॥ గరుడాస్త్రంబు సమంత్రకంబుగను జక్కంజూచి దోశ్శక్తిమై
బరుపం దార్క్ష్యగణంబు భీషణ మహాపక్షాహతి న్లీలగా
వరవజ్రప్రతిమానతుండనఖర వ్రాతంబులన్ చాచియుం
పరియల్ చేసి విదల్చి త్రుంచి గెడపెన్ నాగ ప్రకాండంబులన్ 134

భావము : నారాయణుడు గరుడాస్త్రమును మంత్రించి భుజబలముతో చక్కగా పరిశీలించి ప్రయోగింపగా గరుడపక్షుల సమూహము తమ ఱెక్కలను భయంకరముగా కదలించుచు విలాసముగా శ్రేష్ఠములైన వజ్రములతో సమానములై న ముక్కులతో, చాచిన గోళ్ళ మొత్తములతోను పాముల గుంపులను విదల్చి ముక్కలుగా చేసి, తెగగొట్టి వధించెను.

చ॥ మఱిమఱి దివ్య ఘోరశరమండలి మెండుగ చండ విక్రమ
స్ఫురణ దలిర్పగా బరుప బోరున దత్ప్రతిశాంతి దేవతా
శరనికరంబుచే నణచి శౌర్య పరాక్రమదోర్బలంబునం
నెరకులు గాడ భూరితర నిష్ఠురబాణము లేయ దైత్యుడున్ 135

భావము : ఇంకను భయంకరములైన బాణముల సమూహమును మెండుగ వాడియైన పరాక్రమ ప్రదర్శనముతో ప్రయోగింపగా, అఱపులతో ఆయా బాణాలకు ప్రతికూలమైన శమింప చేయగల దివ్యములైన అమ్ములను తన వీరత్వ భుజబల మహిమచే ఆముని వేయగా అవి జీవస్థానములలో నాటినవి అపుడు ఆ బలిదైత్యుడు

ఉ॥ పూచిన మోదు గట్టులను భూరితరాస్త్రతనుప్రకాశుడై
యేచిన కోపవహ్ని గెరలింపుచు ఘూర్ణిలి శక్తి యొక్కటిన్
బూచి మహాట్టహాసమున బోరన నార్చుచు భీషణాకృతిన్
వైచిన మిన్ను నేల ఘన వహ్ని కణంబులు నిండ బర్వుచున్ 136

భావము : పూలు పూచిన మోదుగ చెట్టు (రక్తవర్ణము కలది) వలె పెక్కు ఆయుధాల చేత కొట్టబడిన శరీరముతో బాగుగా కన్పట్టుచు పొంగుచున్న

కోపమనెడి మంటచే విజృంభించుచు, తిరుగుచు "శక్తి" అనెడి ఒక్క ఆయుధమును గొప్ప పెడబొబ్బలు పెట్టుచు వడిగా కేకలు వేయుచు రౌద్రమూర్తియై వేయగా, ఆకాశమును, భూమిని నిప్పురవ్వలు నిండి ఎగసెను.

తే॥ ఘోరగతి మీద బరపెడు కోలలెల్ల
మేరుగిరిగహ్వరంబును మీరు నోరు
దెరచి మ్రింగుచు కోఱలు దీటుకొనుచు
వచ్చి నారాయణుని రొమ్ము గ్రుచ్చుకొనియె 137

భావము : ఆ శక్తి అనెడి ఆయుధము భయంకరముగా తన మీద వేయు బాణాలను మేరుపర్వత గుహను అతిశయించు విధమున తన నోటిని తెఱచి వానిని మ్రింగి వేయుచు కోఱలు సరిచేసు కొనుచు వచ్చి నారాయణుని ఱొమ్మున గుచ్చుకొనెను. (కోఱ నిడుపైన దంతములు)

క॥ అట్టి ఘనశక్తి తాకును
నట్టిటు చలియించి తూలి యాలో తెలివిన్
బట్టి మది ధైర్యమూదుక
తొట్టిన ధైర్యమున నసురతో నిట్లనియెన్ 138

భావము : ఆ గొప్ప శక్తి తాకుటచే నారాయణుడు ఈ ప్రక్కకు ఆ ప్రక్కకు కదలిన వాడై కొంచెము క్రిందికి వాలిపోయి, వెంటనే తెలివితో తేఱుకొని, మదిలో ధైర్యమును నిల్వరించి, కల్గిన ధైర్యముతో రాక్షసునితో ఇట్లనెను.

ఉ॥ మేలు నిశాచరేశ్వర! భ్రమింపగజేసితి నీదు శక్తిచే
వాలుమగండ వౌదువిదె వచ్చె మదీయ నిశాత బాణముల్
వీలక బీరువోక దల వీడగ పారగ నిల్వు ముందరన్
గాలుని ప్రోల నెమ్మదిని కాపురముంచెద వేల్పులార్వగన్ 139

భావము : "మెచ్చితిని ఓ రాక్షసుడా! నీ శక్తిచే నన్ను చలింపచేసినావు. క్రూరుడైన వీరుడవగుదువు. ఇదిగో చూడుము. నా మిక్కిలి వాడియైన బాణములు నీ

మీదికి వచ్చుచున్నవి. బెదరక, బలమును వదలక ఈ రణరంగమును విడిచి పెట్టిపోక నా ముందు నిల్వుము. నిన్ను మెల్లగా యముని నగరములో దేవతలు సంతోషముతో అఱచునట్లు కాపురము చేయించెదను.''

మ॥ అని యొక్కమ్మున సారథిం బడగ నొంటారమ్ములన్ జక్రమున్
గనదష్టాస్త్రము లశ్వముల్ గొడుగునొక్కంటన్ వెసం గూల్చి త
త్తనువుం దొమ్మిదివాలుదూపులను చిత్ర ప్రౌఢి నోనాటినన్
ఘనరోషోజ్జ్వలితారుణాక్షు డగుచున్ గట్టల్క ధట్టించుచున్ 140

భావము : అని బాణముతో సారథిని కూల్చెను. ఏడమ్ములతో చక్రమును, ప్రకాశించు ఎనిమిది ఆయుధాలతో గుఱ్ఱాలను ఒకదానితో గొడుగును కూల్చి దైత్యుని శరీరమందు చిత్రముగా తొమ్మిది బాణాలు నాటగా, గొప్ప రోషముచే వెలుగుచున్న ఎఱ్ఱని కన్నులు కలవాడై, నిలుకడైన కోపముతో గద్దించుచు

క॥ కరవాలు ఖేటముం గొని
ధరణికి లంఘించి వచ్చు దైతేయుని ని
ష్ఠుర కర నిహతి బలుకయు
కరవాలును దునిమి పొదివె ఘన శరశతమున్ 141

భావము : చేతికత్తి, డాలు ధరించి తేరునుండి పుడమి మీదికి దూకి వచ్చు బలిని చుఱకత్తి, కఠినమైన చేతి దెబ్బ చేతను మఱియు పలకను చేతికత్తిని త్రుంచివేసి బరువైన నూఱు బాణములను ఆతనిపై ప్రయోగించెను.

వ॥ ఇట్లువిరథుండునువిచలితహృదయుండును విగతాయుధుండునునై
నిర్వహింపనల విగాక పరిభ్రమించి వెనక ముందరగా తలవిడం బారిన 142

భావము : ఈ విధముగా రథము లేక బాగా కలతచెంది, ఆయుధ మేదియును లేక యుద్ధము చేయజాలని వాడై (బలహీనుడై) వెనుకకు ముందుకు తిరుగుచు ఆ చోటును విడిచి పోగా

ఉ॥ పోకసురేంద్ర! నీ విటులబోయిన నీ సరివారు నవ్వరే
పాకవిరోధి ముఖ్యసురపంక్తుల గెల్చిన పౌరుషంబునున్
పోకడబెట్టి తాపసుల బోరుట గాదను నట్టినీ మహా
భీకరమంతయున్ విడిచి భీరుడవై యిటు పాఱ జెల్లునే 143

భావము : ''ఓ అసురేంద్రా! పోకుమా! నీవు ఇట్లు పరుగిడి పోయిన నీతో సమానులైన వారు నవ్వెదరు కదా! ఇంద్రాది ముఖ్యులైన దేవతల నెల్లను గెల్చిన గర్వమును విడనాడి, తాపసులతో పోరుట సరికాదన్న వాడవైన నీవు నీ భయంకరత్వమును పూర్తిగా వదలిపెట్టి పిఱికి వాడవై ఇట్లు వెనుకకు మరలిపోవుట తగిన పనియా!'' (ఆలోచింపుము. యుద్ధమందు మరణమును కోరుకొనుమని భావము)

క॥ అని నారాయణు డాడిన
ఘనరోషోక్తులకు వినని కైవడి నెంతే
తనువెరియబారె నన్నరు
మునుమొనలను దనుజ వీర ముఖ్యులు పేర్మిన్ 144

భావము : అనుచు నారాయణుడు పల్కగా ఆతని కఠినములైన మాటలను వినని వాని వలె ఎంతగానో తన శరీరము నొప్పి చెందగా వెడలిపోయెను. తర్వాత ఆ నరముని ముందు రాక్షసయోధులు అతిశయముతో,

చ॥ రథములు మత్తదంతిహయరాహుతులుం గడుగమ్మి దొమ్మియై
ప్రథననిరూఢి జిత్రముగ బాణగదా పరిఘాసిముద్గరా
యుధఘనహస్తులై ప్రకటితోజ్జ్వల దోర్బల విక్రమక్రియా
విధి దగనొక్క పెట్ట బలువేడిమి చూపుచు పోర నుగ్రుడై 145

భావము : తేర్లు, ఏనుగులు, గుఱ్ఱాలు, భటులు, గుంపులుగా యుద్ధనిపుణతతో ఆశ్చర్యకరముగా బాణములు, గదలు, గుదియలు, కత్తులు, సమ్మెటలు మొదలైన ఆయుధములు ధరించిన గొప్ప చేతులతో

గోచరమగు ఉబుకుచున్న భుజబల పరాక్రమ క్రీడల పద్ధతిలో తగినట్లు ఒక్కసారిగా తమ వివిధములైన విక్రమమును చూపుచు పోరాడగా, మిక్కిలి ఉద్రేకము కలిగిన కోపముతో,

మ॥ నరుడొక్కించుక కన్ను గెంపడరగా నక్తంచర వ్రాతమున్
శరసంధానదృఢప్రయోగ నిపుణాశ్చర్య క్రియాధుర్యుడై
శిరముల్ ద్రుంచుచు మేనులు న్నఱకుచున్ చేతుల్ విఖండింపుచున్
చరణంబుల్ దునుమాడుచున్ పృథుల వక్షమ్మున్ వడిం జించుచున్

భావము : నరముని కన్నులయందు కొంచెము ఎఱ్ఱదనము సోకగా, బాణాలను సంధించి గట్టిదైన ప్రయోగ నైపుణ్యముతో ఆశ్చర్యకరమైన క్రీడలను ప్రదర్శించుచు వారి తలలను తెగగొట్టుచు శరీరాలను నఱకుచు, చేతులను ముక్కలు చేయుచు, కాళ్ళను చీల్చుచు పెద్ద ఱొమ్ములను చించుచు,

చ॥ కరుల దెరల్చి స్యందన నికాయములన్ నురుమాడి వాజులుం
న్నఱికి భటాలి జెండి కదనంబున వీర విలాస చాతురిన్
మెరయుచు నెందు దానె యయి మృత్యు విధంబున గాల రుద్రు భీ
కర నిపుణత్వముం దనరగా దనుజావలి గూల్చె నెల్లెడన్ 147

భావము : ఏనుగులను తేరులను గుఱ్ఱాలను, భటుల సమూహమును యుద్ధములో బంతి ఆటవలె వీరత్వ కౌశలముతో వధించుచు, మెఱయుచు ఎల్లఎడల తానే అయి, మృత్యు దేవతయో! అనునట్లు ప్రళయకాలమందు రుద్రుడైన ముక్కంటి భయంకరమైన సామర్థ్యమును కలిగి రాక్షసుల ప్రాణాలు తొలగజేసి నేలపై పడవేసెను.

వ॥ ఇట్లు 148

భావము : ఈ విధముగా

లయవిభాతి॥ నరుని పటు బాణహతి ధరణి బొరలాడు మద
కరిఘటలు నెత్తురులు దొరుగు తురగంబుల్
నురుమగు రథంబులును పొరలు భటవర్యులును
తెరలు ధనువుల్ మఱియు తుఱుమగు విభూషో
త్కరములును గల్గి ఘన గిరులు తరుజాలములు
వరరుధిర వారినిధి కరమరుదునౌచున్
వెఱపు గొని మింటికిని బరచు దనుజాంగతతి
గురియు రుధిర ప్రకటవరుషము ఘటిల్లన్ 149

భావము : నరముని బాణాల తాకుడుచే పుడమిపై పొరలుచున్న ఏనుగుల గుంపులును, రక్తము వెల్వడు గుఱ్ఱములును, పొడియగు తేరులును, నేల ప్రాకిపోవు శ్రేష్ఠులైన కాల్బంటులును, నేలపై కదలుచున్న విండ్లు, మఱియు తునుకలగు అలంకరణములును నిండిన ఆ రణ భూమి పెద్దకొండలు అడవులు, రక్తంపు సముద్రమువలె ఎప్పుడులేని విధమున కన్పట్టుచు, భయపడి ఆకాశమునకు పరుగిడిపోవు రాక్షసుల శరీరముల నుండి నెత్తుటి వాన నేలపై పడినది.

చ॥ తఱచు మెరుంగుటాయుధ వితానము బాయు మెరుంగు దీగలున్
మెరసెడు సింహనాదముల మ్రోతలు పెన్నురముల్ విభూషణో
త్కరతతిగాంచె రత్నకళికల్ దగనప్పుడు కాలమేఘవి
స్ఫురణ వహించె దైత్య సురపుంగవ వీర రణంబు ఘోరమై 150

భావము : ప్రళయకాల మేఘమువలె అతి క్రూరమై దేవదానవుల రణ రంగము కన్పట్టెను. ఎట్లనగా - బహుళమైన ఆయుధముల మొత్తము మెఱవు తీగలను ప్రసరింపజేసెను. వీరుల సింహనాదములు ఉఱుములయ్యెను. వీరుల పెద్ద ఱొమ్ములపైనుండి జాఱు రత్నములు రాళ్ళయ్యెను. మేఘములు దట్టమైనప్పుడు మెఱపులు ఉఱుములు రత్నకళికలజల్లుగా మారెను.

ధ్రువకోకిల॥ పరగ నయ్యెడ దానవుల్ నరుబారి కోర్వక భీతియై
తెరలి కావగ దిక్కులే కతి దీనతం నలుదిక్కులన్
బరచి ముక్కులు వ్రేళ్ల చేతులు పాదముల్ చెవులుం దెగన్
సొరిది నెత్తుట దోగి పాఱుచు జొచ్చి రంబుధి గొందరున్ 151

భావము : (భీకరమైన దేవదానవుల రణము) జరుగగా, అప్పుడు నరముని దాడులను సహింపలేక భయపడి బయలుదేరి తమ్ము రక్షించు వారెవరును లేకపోవుటచే (బలి భూమి నుండి పోవుటచే) దిగులుచెందినవారై నాలుగు దిక్కులకు పోవుచు, ముక్కులు, వ్రేళ్ళు, చేతులు, కాళ్ళు, చెవులు తెగిపోగా క్రమక్రమముగా నెత్తుటిచే తడిసినవారై కొందఱు పరుగెత్తి సముద్రములో తమ కోపమును చల్లార్చుకొనుటకు దూకిరి.

క॥ కొందరు పాతాళంబును
కొందరు గిరిగుహలు మఱియు గొందరు బొదలన్
గొందరు మహాటవులనుం
కొందలపడి యొకరినొకరు గూడక పరువన్ 152

భావము : కొందఱు పాతాళమునకు, కొందఱు కొండ గుహలకు, కొందఱు చెట్లపొదలకు, కొందఱు గొప్ప అడవులకు, వారు ఎవరికి తోచినట్లు వెళ్ళివారై చింతచెంది పరుగిడిరి.

వ॥ ఇట్లు హతశేషులైన దైత్యగణంబు బలీంద్రుని గూడి వకావకలై చెదరి తలలూడం బాఱిన 153

భావము : యుద్ధమందు బ్రతికిన రక్కసిమూకలు బలిచక్రవర్తితో కూడ బెదరిపోయి చలించినవారై (నిలుచుటకై ధైర్యములేక) రణరంగమును వీడిపోగా

క॥ నరనారాయణులయ్యెడ
శరణాగత రక్షణైకసత్కరుణావి

స్ఫురమతి దివిజావలిసం
గరకేళికి మాన్పి శక్రుగని పల్కిరొగిన్ 154

భావము : నరనారాయణ మహర్షులు ఆ సమయమందు శరణు జొచ్చిన వారిని కాపాడుటయే ముఖ్యమైన గుణము కలవారై, కృప నిండిన మనసు కలవారై దేవతలను యుద్ధ ప్రయత్నము నుండి మాన్పి ఇంద్రునితో ఇట్లనిరి.

చ॥ జయము ఘటిల్లె మీకు దనుజ ప్రకరంబు హతావశేషమున్
రయమున దోర్బలం బెడలి రాక్షస నాథుని తోడ బాఱె నీ
దయిన తలంపు చేకురె మహా విభవంబున మూడు లోకముల్
నయముగ నేలుచున్ దివిజ నాయక! నాకమునన్ సుఖింపుమీ 155

భావము : "ఓ స్వర్గలోక నాయకా! మీకు విజయము కలిగినది. యుద్ధమందు చావక మిగిలిన రాక్షసులెల్లరును వేగముగా భుజబలము నీరసించి వారి నాయకునితో (బలితో) గూడ పాఱిపోయిరి. ఇంక నీ తలంపు నెఱవేఱినది. మహావైభవము లభించినది. మూడులోకాలను నీతితో పాలించుచు దేవతలతో లోకములో సుఖముగ నుండుమా!"

క॥ వెనకటిదుర్దశ లించుక
మనమున నెంచకుము విష్ణుమన్నన నీకున్
ఘనతరశుభంబు లొందుట
కనుమానమె విష్ణుభక్తి కాఱడి గలదే 156

భావము : గడిచిపోయిన కష్టములను కొంచెము కూడ మనస్సులో పెట్టుకొని బాధపడవద్దు. వచ్చు కాలమున విష్ణువు యొక్క అదరము వలన గొప్ప శుభములు కలుగగలవు. సంశయమును విడిచిపెట్టుము. విష్ణు భక్తికి "కొఱత" (ఆఱడి) ఉండునా?" (అది ఎడతెగక కలుగునని ఆశీస్సు)

చ॥ అనిన భవత్కటాక్ష మహిమాతిశయంబున శోభన స్థితుల్
గనుటకు చోద్యమే! వినుము కంజదళాక్షనిజాంశ జన్ములన్

గని శరణంబు చొచ్చిననుగాని ప్రయోజన మొండుగల్గునే
మునివరులార యీ త్రి జగముల్ దగ నిల్పితి రింతయొప్పదే! 157

భావము : అని వచింపగా, "ఓ! మహాఋషులారా! మీ యొక్క కడగంటి చూపుల గొప్పతనము ఫలముగా మంగళకరములైన జీవన స్థితులు కలుగుట ఆశ్చర్యమా! వినండి. ఆ విష్ణు అంశగా అవతరించిన మిమ్ము కాపాడుమని కోరగా ఏదైనా ఉపకారము కల్గక పోవునా? (తప్పక రక్షింతురని భావము) ఇప్పుడు దైత్యులను శిక్షించి మూడు లోకాలను సరియైన విధమున నిల్పితిరి. ఇది యెంతయో మంచిది!"

చ॥ అని వినుతించి శక్రుడు దిశాధిప ముఖ్యులతోడ కూర్మి న
మ్ముని వరపాదపద్మయుగముల్ నిటలంబులు సోక మ్రొక్కి దీ
వనలను గాంచివీడ్కొని ధ్రువంబుగ స్వర్గరమావినోదియై
ఘనతవహించె నబ్బదరికావన భూమికి బోయి రమ్మునుల్ 158

భావము : ఇట్లు స్తుతించి, ఇంద్రుడు ముఖ్యులైన దిక్పతులతో కలిసి ప్రేమతో ఆ మునుల కమలముల వంటి పాదములు నొసటి భాగములు సోక మ్రొక్కి, వారి దీవెనలు పొంది స్వర్గలక్ష్మిని అనుభవించు వినోదముతో గొప్పవాడై ప్రవర్తించెను. ఆ నరనారాయణులు ఇరువురు తమ నెలవైన బదరికావన భూమికి వెళ్ళిరి.

ఉ॥ కావున విష్ణుమాయ గనగాదు జగత్త్రయమందు నెవ్వరున్
భూవిదితంబు లోకముల బొల్పగు రాక్షసమాయలొడ్డిన
ద్దేవ విరోధులం గలచి ద్రిమ్మరజేయు మహాప్రభావతన్
శ్రీ విలసిల్లనంతట వసించు మహత్వము దీనికే తగున్ 159

భావము : కావున విష్ణుమాయను ఎవరును తెలిసికొనలేరు. ఇది లోకములలో అందఱికి తెలిసిన సత్యమే ! రాక్షసుల మాయలు (వంచనలు) సంభవించినను, వారిని కలత చెందించి, తన మహా ప్రభావముతో నిలుకడ లేక

వెఱ్ఱివారివలె తిరుగజేయును. శుభములు సమకూరునట్లు చేయుచు అన్నిచోట్ల విష్ణు ప్రభావము కన్పట్టును. అట్టి మహత్తర శక్తి విష్ణువునకే తగును. (ఇతరులకు ఆ గొప్ప శక్తి లేదనుట)

వ॥ అనిన సూతుండిట్లనియె 160

భావము : నైమిశారణ్య శ్రోతలు పై విధముగా పల్కగా, శౌనకాది మునులతో సూతుడు ఇట్లు పల్కెను.

తే॥ జనులకీ కథ వినిన వ్రాసిన పఠింప
నాయురారోగ్య పుత్రపౌత్రాభివృద్ధి
ధనకనకవస్తువాహనధాన్యవృద్ధి
కామితార్థంబు తుద ముక్తి గలుగు నిజము 161

భావము : "ఓ మునులారా! ఎవరైతే ఈ కథను వినెదరో, వ్రాసెదరో, చదివెదరో అట్టి జనులకు ఆయువు, ఆరోగ్యము, పుత్రులు, పౌత్రుల వృద్ధి కలిగి, ధనము, బంగారము, విలాస వస్తువులు, వాహనములు, ధాన్యములు కోరినవెల్లను మఱియు జీవితాంతమున సంసార బంధాల నుండి విడివడి మోక్షము పొందెదరు ఇది నిక్కము.

చ॥ అనిన మహాప్రమోదభరితాత్మకులై విని సూతుతోడ ని
ట్లనిరి భవద్వచోమృత రసాయన పానముసేయ వీనులం
దనివి ఘటిల్ల దెంతయు ముదంబున శంభుడు విష్ణుమాయచే
మునిగె నటంటి రెట్టులది మోదముతో దగ నానతిమ్మనన్ 162

భావము : అనగా విని, చాలా సంతోషముతో నిండిన ఎదలు కలవారై సూతునితో ఇట్లు వచించిరి. "తమ యొక్క వాక్కులనెడి అమృత రసము త్రాగుటచే చెవులకు తృప్తి ఏమాత్రము కల్గుటలేదు. (అనగా ఇంకను వినవలెనను కాంక్ష ఉన్నదని భావము) మీరు సంతోషముతో విష్ణుమాయచే

శంభుడు మోసపోయె నంటిరి కదా! అది ఎట్లు జరిగినదో ఇంపుగ విన్నవింపుడు'' అనగా

శా॥ సూతుండిట్లనె శౌనకాదుల కహో చోద్యంబు మీ భక్తి సం
ప్రీతిన్ సత్రము పావనంబగుచు వర్తిల్లెన్ మహోత్కృష్టమై
చేతోమోదము సంఘటిల్లె శుభముల్ సిద్ధించె సుజ్ఞానవి
ద్యాతత్త్వోన్నతు లొందు మోక్షము కరస్థంబౌ నిజం బిందులన్ 163

భావము : సూతుడు ఇట్లు శౌనకమునిబృందానికి బదులు చెప్పెను. ''మీ భక్తి వర్ణించుటకు వీలుకానిదై ఆశ్చర్యమును కలిగించుచున్నది. మీకు చాలా తృప్తిగా ఈ సత్ర యాగము పరిశుద్ధమై జరుగుచున్నది. నా మనస్సునకు సంతోషము కల్గినది. శుభములు సిద్ధించినవి. సుజ్ఞానము, లౌకిక విశేష జ్ఞానము కలుగును. మోక్షము చేతికి అందును. ఈ విషయము సత్యము''.

వ॥ సమాహిత చిత్తులరై వినుండని యిట్లనియె 164

భావము : ''శ్రద్ధకల మనస్సుతో వినుడు'' అని సూతుడు ఇట్లనెను.

క॥ నారదముని త్రిభువనసం
చారుండై యొక్కనాడు శంకరపదసే
వారతి మతి నుత్సుకుడై
తారాచలమార్గమున ముదంబున జనుచున్ 165

భావము : నారదముని మూడులోకాలను సందర్శించుచు పోవుచు ఒక్కనాడు పరమేశ్వర సేవయందు ఆసక్తిగల మనస్సుతో ఉత్సాహమును పొంది, వెండి కొండకు పోవు త్రోవలో సంతోషముతో పయనించుచు.

ఉ॥ కాంచె నిజ ప్రభాపటల కల్పిత శంకసుశోభనోత్సవ
ప్రాంచిత సత్సుధారుచిర భాసుర సర్వ దిగంత భిత్తికా
సంచయమైన వాని శశి సంభృత భవ్య శిఖాప్రకాశమై
మించిన వాని రిక్షపదమిశ్రిత భూజము దాని నెంతయున్ 166

అర్థాలు : రిక్తపదము= ఆకాశము, భూజము= చెట్టు, (దూరము నుండియే పరిసరములను ఈ క్రింది విధముగా చూచెను) కైలాస పర్వతము తన తేజస్సు యొక్క గొప్ప జ్యోతులచే ఏర్పడిన మంగళకరమైన వేడుకచే ఒప్పుచున్నట్టి దానిని, మేలైన సున్నపు వెలుగులచే ప్రకాశించుచు దిక్కులకొనల వఱకు గోడలచే కన్పట్టు దానిని, చంద్రకాంతులతో శిఖరముల ప్రకాశము కలదై అతిశయించు దానిని, ఆకాశములో కలియు చెట్ల వరుసలు కల దానిని.

సీ॥ సతతగతాగతచారణ గంధర్వ
నిచయవిమానఘూర్ణితము దాని
వితతవిద్రుమలతా విభ్రాజితోత్తుంగ
సౌధ సన్నిభగండచయము దాని
గోపురనిభకూట కోటీరమణికుంభ
కల్పిత పద్మరాగముల దాని
నిరత కళ్యాణ సన్నిహితతోరణ రూప
లలిత చూత ప్రవాళముల దాని

తే॥ కలిత మృగమద ఘన సారగంధసార
మిళిత సురతరునవపుష్పగళిత గంధ
గంధవహమందసంచారకలిత కుసుమ
నిచయ సుర పుష్పవర్ష సన్నిభము దాని 167

భావము : ఎల్లప్పుడు పోవుచు, వచ్చుచున్న ఆకాశగమనుల సముదాయము యొక్క విమానముల రాకపోకలచే కూడినది, విరివియైన చెట్లు, వానిపై నుండు తీగలచే ప్రకాశించు ఎత్తైన మేడల వలెనున్న పెద్ద శిలల సమూహము కలది, గోపురములు కొలువు కూటములు కొండ కొమ్ములమయమై కుంభములతో (కలశము) కల్పించబడిన పద్మరాగములు కలది, ఎల్లవేళల

వివాహ సమయమందు గ్రుచ్చు మాలికలలో లేత మామిడి చిగుళ్ళు కలది, కస్తూరి, గంధము, కర్పూరము కలిసిన దేవతా వృక్షముల క్రొత్తవైన పూల నుండి వీచుచున్న సువాసన గల వాయువు కలది. కల్ప వృక్ష సముదాయ పుష్ప వర్షము కలది అయిన (వెండికొండ)

చ॥ **మఱియును పద్మజాండదృఢమండిత కర్పర చుంబితోన్నతా**
వరణ శిఖా ప్రకాండముల వర్తిలు దాని సదాలకాపురి
స్ఫురదురుభేరికాపణవ ఘూరిరవ ప్రతినాద సంభృతో
త్కరబహుగహ్వరంబులును గల్గిన రాజిత శైల రాజమున్ 168

అర్థాలు : కర్పరము= కొన

భావము : మఱియును బ్రహ్మాండమందు ప్రకాశించుచున్న శిరోభాగమును తాకుచున్న ఎత్తైన చుట్టుగోడల వలెనున్న ఆచ్ఛాదనములతో కప్పబడిన కొండకొమ్ముల సమూహములతో కూడి ఎల్లప్పుడు కుబేరుని రాజధానియైన అలకాపురిలో (సమీపమున నుండే నగరము) మ్రోగుచున్న గొప్ప ఢంకాలు, ఢక్కలు (చేతితో మ్రోగింపబడునవి) మొదలైన వాద్యములు నాదప్రతి నాదములచే నిండిన (శివార్చనకై కుబేరుడు కావించు వాద్యధ్వనులు) కొండయుందుండు గుహలు కలదియును అయిన ప్రకాశించు గొప్పపర్వతమును

ఉ॥ **కాంచి నభోపథానుగత కాంచన దివ్య విపంచి వాత ధూ**
తాంచిత వాద్య లీల నజినాంబర పింగ జటాక్షమాలికల్
మించిన చంద్రకాంతరుచి మేను వెలుంగగ పంకజోదరా
చంచల భక్తి సంభరిత సత్పులకాంకుర పూర్ణ దేహుడై 169

భావము : చూచి, ఆకాశమార్గమును అనుసరించుచున్న స్వర్ణమయమైన పవిత్రమైన తన వీణ “మహతి” నుండి వెల్వడు వాయువుతో కలిసిన తన వాద్య విలాసముతో, పులి చర్మమే వస్త్రమైన వాడై, గోరోచన వర్ణ

జపమాలికలతో చంద్రకాంతమణుల కాంతితో శరీరము మెఱయుచుండగా, విష్ణువు నెడ చలింపని భక్తి నిండిన, ఎక్కువైన పులకలతో కూడిన శరీరము కలవాడై

చ॥ **చనిచని యమ్మహీధరు విశాలపు వక్షపు తాళి బిళ్ళనా**
ఘనతర మధ్య దేశనవకాంచన పూగరసాలకేతకీ
పనసకురంట ముఖ్య తరుపంక్తి పరీతమణి ప్రభా లస
త్కనకవిశాల సంవరణగౌరవగోపురమంటపంబులన్ 170

భావము : ముందుకు పోవుచు, ఆ వెండికొండ యొక్క విశాలమైన ఱొమ్మునకు తాళిబొట్టేమో అనునట్లు నడిమి చోటి గొప్పవైన, క్రొత్తవైన పొన్న, పోక, మామిడి, మొగిలి, పనస, గోరంట మొదలైన ప్రధానములైన చెట్ల వరుసలు కలదియు, చుట్టునున్న మణులతో ప్రకాశించు బంగారు వర్ణముకల వెడల్పైన ఆచ్ఛాదనములతో, గొప్పవైన గోపురములు, మంటపములు కలదియు అయిన పెద్ద నగరిని చూచి.

ఉ॥ **కల్పితమైన పెన్నగరుగాంచి తదంతర మంటపంబునన్**
కల్పకమూల సంస్థిత సనందమునీంద్ర సురావృతైకసం
కల్పసురత్న పీఠిక సుఖస్థితి గొల్వుననున్న సంతతా
నల్ప విభూతి వైభవ ఘన ప్రతిభా శుభమూర్తి శంకరున్ 171

భావము : నిర్మితమైన పెద్దనగరిని (అంతఃపురము) చూచి, దానిలోని శాలయందు కల్పవృక్ష పాదమందు సేవించుచున్న సునంద మునీంద్రుడు, దేవతలు కలవాడై చక్కగా అమర్చిన మంచిరత్నాల ఆసనమందు ప్రశాంతముగా సంతోషముతో ఆసీనుడై ఉన్న ఎడతెగని అధికమైన సౌందర్యముతో విశిష్టమైన బుద్ధితోను శుభకరమైన రూపముతో కన్పట్టు శంకరుని (చూచెను).

ఉ॥ కాంచి తదీయపాదుకయుగంబు లలాటము సోక మ్రొక్కి ని
శ్చంచలభక్తి హస్తజలజంబులు మోడ్చి శ్రుతిప్రయుక్తిగా
నంచిత లీల సన్నుతి పదాంబురుహార్చన చేసి తత్కృపం
గాంచి యనుగ్రహంబు తగ గైకొని చెంత వసించియున్నెడన్ 172

భావము : చూచి, ఆ శివుని పాదమ్ముల జంటను నొసలు తాకునట్లు మొక్కి చలింపని భక్తితో కమలముల వంటి చేతులను ముడిచి వేదస్వరముతో తగిన తీరున స్తుతితో కమలముల వంటి పాదములను పూజించగా, ఆ దేవుడు దయతో ప్రసన్నుడై తన్ను చూడగా, ఆ దేవుని అనుమతి పొంది సమీపమున కూర్చుండగా

వ॥ శంభుడిట్లనియె 173

భావము : ఆ శంభుడు ఇట్లు అనెను

ఉ॥ ఎక్కడనుండి రాకడ మునీశ్వర! లోకములందు నెందు నీ
త్రొక్కని చోటు లేదు పరితుష్టుడ వెప్పుడు నాత్మలోపలన్
నెక్కొన విష్ణుభక్తిని వినింద్య చరిత్రుడ వాత్మయోగపున్
చక్కటి నీకె యొప్పు మునిసత్తములందున నెందు నారదా! 174

భావము : "మునీశ్వరా! ఎక్కడి నుండి ఇక్కడికి వచ్చినారు? లోకాలలో నీవు తొక్కని చోటు లేదు. ఎప్పుడును సంతోషము కలవాడవు. నీ మనస్సులో నిలిచిన విష్ణు భక్తిచే (నిందింపరాని) స్వచ్ఛమైన నడవడి కలవాడవు. మునిశ్రేష్ఠుల ఆత్మయోగము నీలో చక్కగా కుదురుకొని ఒప్పుచున్నది. (ఉత్తములైన మునులలో ఆత్మపరమాత్మల సంయోగ సిద్ధిలో నీవే మేటివి)"

చ॥ అనిన భవత్కటాక్ష మహిమాతిశయంబున నొందినట్టి నే
గనుగొనరాని దొక్కటియు గల్గునె సర్వజగన్నివాసివై
జనన లయస్థితుల్ ప్రకటచర్యలుగా నటియించు నిన్ను నే
వినుతియు సేయ నేర్తునటె విక్రమసాయక విశ్వనాయకా! 175

భావము : అని శంభుడు వచింపగా ఆ మునీంద్రుడు "తమ కడగంటి చూపు వలన పొందిన గొప్ప ప్రభావముచే నేను తెలియజాలనిది యొక్కటియును లేదు. సర్వలోకములందు నివసించుచు, పుట్టుట కూల్చుట, ఉనికిని నిల్పుట మొదలగు గొప్ప చర్యలతో వర్తించుచున్న నిన్ను స్తుతించుటకు నాకు నేర్పు కలదా? బలమైన

వ॥ అనిన సంతుష్టాంతరంగుండై పరమేశ్వరుడు నారదున కిట్లనియె 176

భావము : నారదుడు వచింపగనే సంతోషించిన మనస్సు కలవాడై ఆ పరమ శివుడు ఇట్లనెను

చ॥ అమరులు దైత్యులోలి యమృతాంబుధి దర్వగ కాలకూట ము
గ్రముగ జనింప దానిగొని కంఠ బిలంబుననుంచి వచ్చితిన్
క్రమమున నందు నెయ్యదియు గల్గెనె వాని గ్రహించి రెవ్వరం
దమరమునీంద్ర యా వివరమంతయు దెల్పుము మాకు నేర్పడన్ 177

భావము : "దేవతలు రాక్షసులు పరాక్రమముతో పాలసముద్రమును చిల్కినపుడు కాల కూట విషము ఉగ్రమై వెల్వడిన దానిని గ్రహించి గొంతు ముడిలో నిల్పి వచ్చి వేసితిని. వరుసలో ఆపాల సముద్రము నుండి ఏవేవి వెల్వడినవి? వానిని ఎవరెవరు తీసికొన్నారు? ఓ దేవమునివరా! ఆ విషయాలన్నియు మాకు చక్కగా తెల్పవే"

మ॥ అన నమ్మౌనివరేణ్యు డిట్టులనె లోకాధీశ! హాలాహలం
బును భక్షించి జవంబునన్ ఘనదయాంభోరాశివై బ్రోచి స
య్యన మీరిందుల రాగ నంబునిధిలో నావిర్భవింబయ్యె శో
భనతారుణ్య విలాస సంపదలకుం బట్టైన మేల్ వస్తువుల్ 178

భావము : అట్లు చెప్పగా మునిశ్రేష్ఠుడు ఇట్లనెను "జగన్నాయకా ! మీరు హాలాహలమును గ్రహించి దయకు సముద్రుడవై దేవరాక్షసులను రక్షించి,

వెంటనే మీరు కైలాసానికి తిరిగి వచ్చితిరి. తర్వాత సముద్రము నుండి మంగళకరములైన నూతనములైన విలాస సంపదకు నిలయములైన, మేలైన వస్తువులు వెల్వడినవి''.

సీ॥ శ్రీకౌస్తుభంబుల చేకొనె విష్ణుండు
చౌదంతి మఱియు నుచ్చైఃశ్రవంబు
నచ్చరలను కల్పకాగంబులను దేవ
వల్లభునకు నిచ్చి రుల్లమలర
సుగ్రీవులకు నోలిసుధ నొసంగి తావ
నందుల కసుర లత్యాగ్రహమున
ఘనసుధాకుంభంబు గైకొన్న శ్రీహరి
మోహినీరూపున మోసపరచి

తే॥ దానవులనెల్ల గలచి సుధారసంబు
నమరులకు బంచి దైత్యుల నటమడంచి
దివిజులై వచ్చి రాహుకేతువులు గొనిన
వారి గళములు ద్రెవ్వంగ వైచి చనియె 179

భావము : ''కౌస్తుభ రత్నమును విష్ణువునకు, ఐరావతమును తెల్లని గుఱ్ఱమును అప్సరసలను (దేవలోకవేశ్యలు) దేవతరువులను ఇంద్రునికి ఇచ్చిరి. మనస్సులు వికాసముతో ఉప్పొంగునట్లు దేవతలకు క్రమముగా త్రాగుటకు అమృతమును ఇచ్చిరి. ఆ కారణముచే రాక్షసులు సుధ కల కలశమును బలవంతముగా తీసికొనగా శ్రీహరి మోహినీ రూపమును ధరించి దానవుల మనస్సులను చలింపజేసి అమృతమునంతటిని రాక్షసులను మోసగించి దేవతలకే ఇచ్చెను. అప్పుడు దేవతల రూపములో వచ్చిన రాహువు, కేతువులు కొంత అమృతము తాగగా విష్ణువు వారి గొంతులను నఱికి మాయమయ్యెను.''

క॥ అందులకుగాను దైత్యులు
బృందారక కోట్లతోన బెనగి పరువ నా
సందువ బలి విని కణగిన
నందఱినిం దఱిమె బదరికాశ్రమమౌనుల్ 180

భావము : ''అకారణముచే రాక్షసులు దేవతలు పోరాడిరి. బ్రతికిన రాక్షసులు బలితో విన్నవింపగా ఆతడు రాక్షసులతో కలిసి సమరానికి పూనుకొనెను. వారినందరిని బదరికావన మందు వసించు నరనారాయణులు తఱిమివేసిరి.''

క॥ ఇది వృత్తాంతంబన్నను
హృదయంబున వెఱగునొంది యీశ్వరుడనియెన్
మదినెఱుగరైరి దైత్యులు
ముదమున విష్ణుండు తానె మోహిని యగుటన్ 181

భావము : ''జరిగినది అంతే!'' అని చెప్పగా ఆశ్చర్యముతో ఈశ్వరుడు ఇట్లనెను ''ఆ రాక్షసులు సంతోషముతో ఆమెను చూచి మనస్సులలో ఏ మాత్రము మోహిని విష్ణువని ఎఱుగ లేకపోయిరి కదా!?

చ॥ అన విని నారదుండు భువనాధిప! నీవిటు లానతిచ్చితే
మనదగునెట్లు విష్ణుకృతమై తగు మాయనెఱుంగ శక్యమే
వనరుహసూతికైన ఫణివర్యునకైనను మీకునైన ని
ట్లన మది కోపగించకుము అవ్విభు మాయ దరింతురే యనన్ 182

భావము : ఆ పల్కులను విని నారదుడు ''లోకాధిపతీ! నీవు ఈ విధముగా వచించుటను ఏమని తలంపవలెను! విష్ణు మాయను తెలిసికొనుటకు బ్రహ్మకైనను, ఆదిశేషునకైనను మీకైనను సాధ్యమా? ఈ మాటలకు నీ మనస్సులో కోపము పూనకుము. ఆ ప్రభువు మాయను ఎవ్వరు దాటలేరు''

మ॥ విని యొక్కించుక కోపమూదినమదిం విశ్వేశ్వరుం డిట్లనెన్
మునిదైతేయసుపర్వపన్నగులు సమ్మోహంబును జెందిరం

చనరా దేను నెఱుంగజాలనె కటా యావిష్ణువున్ ధాతయున్
గనగా జాలుదురే మదీయ మహిమాగాంభీర్యము న్నారదా! 183

భావము : ఆ పల్కులు విని కొంచెము కినుక చెందిన మనస్సుతో విశ్వనాయకుడు ఇట్లు వచించెను. "మునులు, రాక్షసులు, దేవతలు, సర్పరాజులు భ్రాంతిచెందిరని మోహము చెందిరని ఏల వచింతువు? అయ్యో, ఇదేమి ఆ మాయను నేను తెలిసికొనలేనా? ఆ విష్ణువుగాని, బ్రహ్మగాని పూర్వము ఓనారదా (ఆలోచించుమా !) నా ప్రభావమును, గాఢమైన లోతైన శక్తిని తెలిసికొనిరా?

క॥ ఆ నాడురులింగాకృతి
నైనను హరి పద్మభవులు అంఘ్రులు మౌళిం
గానగ కిటిహంసాకృతి
పూని కను గొనరె నేడు బుట్టెనె వింతల్ 184

భావము : పూర్వము చాలా పెద్దదైన నా లింగాకారమును కనుగొనుటకు పాదములను విష్ణువు, శిరస్సును బ్రహ్మ వరుసగా పంది, హంస రూపాలను ప్రయత్నముతో పొంది! విఫలమయిరి కదా! ఆ వింత వృత్తాంతము నేడు పుట్టినదా?"

తే॥ భక్తిపారవశ్యభావంబునను నీవు
వినుతి సేయుటింత విహితమగును
విష్ణునకును నాకు వేఱుగా మది నెంచి
పలుక దగునె నీకు కలహకారి! 185

భావము : విష్ణు భక్తియందు మైమఱచి నీవు అతని మహిమను ఇట్లు నుతించుట ఎంత మేలు కలుగును? ఓ కలహకారుడా! విష్ణువు నా కంటె ఇతరుడని నీ మదిలో తలంచి నీవు పలుకుట తగునా? (విష్ణువు తన సృష్టిలోని వాడని శంకరుని భావము)

చ॥ అన విని దేవ! నీవు మదినాగ్రహముంచకు విన్నవించితే
ఘనుడగు పద్మసంభవుని గర్వమణంపగ నట్లు చేసెనా
డనుపమమైన విష్ణుమహిమాతిశయంబులు లెక్కవెట్టగా
జనునె ఫణీశ్వరాదులకు సత్యము సత్యము పార్వతీశ్వరా! 186

భావము : అనగా విని నారదుడు "ఓ పార్వతీపతీ! ఇట్లు విన్నవించినందుకు కోపింపకుము ఆనాడు గొప్పవాడైన బ్రహ్మ గర్వమును అణచుటకై అట్లు చేసెను. సాటిలేని విష్ణువు యొక్క అత్యధికములైన మహిమలను ఆదిశేషుడు మొదలైనవారికి కూడ లెక్కించుటకు సాధ్యముకాదు. ఇది సత్యమైన వాక్కు మాటి మాటికి చెప్పవలసిన వాస్తవము"

మ॥ అనినన్ మంచిది నీవు నేనరిగి యందవ్విష్ణు సమ్మోహినీ
తను సౌందర్య విలాస విభ్రమ కళా ధౌర్యంబులుం గాంచినన్
గనవచ్చున్ నను విష్ణువుం దెలియ నిక్కంబయ్యెడిం నీ మదిం
నిను బల్మాఱును గాదనంగ వలెనే నేనంత యజ్ఞుండనే! 187

భావము : అని నారదుడు నొక్కి చెప్పగా శివుడు "మంచిది నీవు నేను వెళ్ళి విష్ణు సమ్మోహినీ సౌందర్య విలాసలీలలను వివిధ శిల్పకాంతుల రీతులను చూచినచో అప్పుడు, నీ మదిలో నాచలింప లేని మనశ్శక్తి విష్ణువు యొక్క ప్రభావము నాపై ఎంత తక్కువో నిక్కముగా నీవు స్వయముగా చూడగలవు. పలుసారులు నీమాటలను ఏల కాదనవలెను. నా మాట నిజము. నేను ఏమియు తెలియని వాడనా?"

విశేషము : "సమ్మోహిని" చాలా గొప్పదై మైమఱపింపజేయునట్టిదని సూచన.

వ॥ అనిన విని నారదుండిట్లనియె 188

భావము : ఆ మాటలు విన్న నారదుడు ఇట్లు అనెను

సీ॥ అఖిల ప్రపంచంబునందు దా దనయందు
నఖిల ప్రపంచంబు నణగియుండు

దనమాయ నఖిలంబు దగుల మాయకు
వ్యతిరిక్తుడై సర్వగతుడు నగుచు
సృష్టి సంస్థితి లయాధిష్ఠితుండయ్యును
నిర్వికారత్వంబు బర్వి మెఱయు
కర్తృభోక్తృత్వంబు గలిగి యీశ్వరు డయ్యు
కర్మ సాక్షిత్వంబు గాంచి మెఱయు

ఆ॥ నట్టి మాయలాడు నచ్యుతుం డాఢ్యుండు
యఖిలలోకసాక్షి యవ్యయుండు
వాని మాయ చేత వర్తించు సర్వంబు
గడవ వశమె యెట్టి ఘనునకైన 189

భావము : "సమస్త ప్రపంచమందు తాను, తనయందు సమస్తమును అణగియున్నది. తనమాయ సమస్తమునకు తగిలినను తాను మాత్రము ఆ మాయకు వ్యతిరేకముగా అన్నింటియందున్నాడు. నిర్మాణము నిర్వహణము, నిర్మూలన కార్యాలకు అధిపతియైనను, ఏ విధమైన మార్పు లేక సమస్తమునందు అధిష్ఠించి మెఱయుచున్నాడు. కర్తయు, భోక్తయు అయిన లోకాలకు ప్రభువు, జీవుల కర్మలను కాంచుచు సాక్షిగా వెలుగుచున్నాడు. అట్టి మాయాజాలము కలవాడు, సర్వశక్తిమంతుడును అన్ని లోకాలను చూచువాడు తానే. ఎట్టి హెచ్చుతగ్గులు లేనివాడు. ఆ విష్ణుమాయ చేతనే సమస్తము నడచుచున్నది. ఆ సర్వమయుని మాయను అతిక్రమించుటకు ఎట్టిగొప్పవానికైనను సాధ్యమగునా?"

సీ॥ కమలామహాదేవి కాముకత్వమెకాని
వాని మాయ యొకింత గానలేదు
స్రష్ట సర్వంబును సృష్టి సేయుటగాని
వాని మహత్వంబుగాన లేడు

వేదవేదాంతముల్ వినుతి చేయుటగాని
నిక్కంబు వాని వర్ణింపలేవు
కరకంఠ! విను తారకము జపింతువుగాని
యమ్మహామహు దెలియంగలేవు

తే॥ ఆది మధ్యాంతరహితుండు నగణితుండు
నప్రమేయు డనంతుండు సుప్రసన్ను
డతని దయగాని ప్రజ్ఞచే నరయుటకును
గలుగు నెవ్వడు మూడు లోకములయందు 190

భావము : "మహాలక్ష్మి విష్ణువును కామించినదేగాని అంతమాత్రముచేత ఆ మహావిష్ణువు మాయను కొంచెమైనను చూడలేదు. ఆ బ్రహ్మ తాను సర్వమును సృష్టించెనేగాని ఆ విష్ణు మహత్వమును చూడలేదు. వేదములు వేదాంతములు వానిని స్తుతించుచున్నవి. ఆ మహావిష్ణువును పూర్తిగా వర్ణింపలేవు. ఓ విషకంఠా! (వ్యాజస్తుతి - అలం) నీ జన్మ తరింపజేయు విష్ణువు ద్వాదశాక్షరిని వల్లింతువేగాని, ఆమహామహుని మహిమ నీవు ఎఱుంగలేవు! పుట్టుక ఉనికి, తుది లేనివాడు. గణింపవీలులేని వాడు, పరిమితి లేనివాడు, అంతములేని వాడు అయినను అనుకూలమైన మనస్సు కలవాడు. అతని దయలేని తెలివితో మూడు లోకాలలో ఎఱుగుటకును ఎవ్వరున్నారు ? (ఎవ్వరును, ఆ విష్ణువు అనుగ్రహించిననే అతని తెలుసుకొను శక్తిని పొందగలరని భావము)

సీ॥ నీ వరంబున గ్రొవ్వి నిఖిలంబు నిర్జించు
రావణాసురుని యే దేవుడణచె
నీ కృపచే మీరి నిన్ను మార్కొన్న యా
బాణుని గర్వమే ప్రభువణంచె
నీవయౌ దూర్వాసు చేవ నీ భక్తుని
చేత నేమేటి నిర్జింపజేసె

నీదు ప్రమథ గణము నీవును రక్షింప
ఏశౌరి హంసుని ఏపడంచె

ఆ॥ అట్టి ఘనుడు పురుషుడై చేయు మాయల
మునిగి భువనములును మనము దిరుగ
మీరి యతడె మోహినీ రూపు దాల్చిన
కరగకుండు వాడు గలడె యెందు 191

భావము : "ఓ మహాదేవా! నీవు ఇచ్చిన వరములచే కండకావరముతో క్రొవ్వి సర్వమును జయించిన రావణాసురుని ఏ దేవుడు వధించెను? నీవు కరుణించి నీ సుతునివలె వర్తించిన ఆ బాణాసురుడు నిన్ను ఎదుర్కొనగా అతని గర్వమును ఏ ప్రభువు నాశము చేసెను. నీ అంశమున జన్మించిన దుర్వాస మహర్షి తపశ్శక్తిని తన భక్తుడైన అంబరీషుని చేత ఏ శ్రేష్ఠుడు జయింపజేసెను. నీ సేవకులైన ప్రమథగణము భృంగిరిటి కుండోదరులు రక్షింపగా ఏ శూరుడు హంసుని మదమును అణచెను? అట్టి మహాశక్తియుతుడు, పురుషోత్తముడు, చైతన్యవంతుడు కావించు మాయలందు మునిగి లోకాలన్నియు మనము వర్తించుచున్నాము. మోహినీ రూపము ధరింపగా ఎవరి మనస్సైనను చలింపకుండునా?

క॥ పడతి యెడనున్న పురుషుడు
కడు శిఖి కడనున్న ఘృతము కరగక యున్నే
యడరుచు హరి మోహినియై
పొడచూపిన మోహపడక పో నీవశమే? 192

భావము : "పక్కన మగువయుండగా మగవాడు మిక్కిలి సమీపమున నున్న అగ్ని చెంత నెయ్యివలె ద్రవించిపోవును. ఆ హరియే మోహినియై కన్పట్టిన నీవు మోహింపక యుండుట నీ వశముకాదు"

క॥ మునుగౌడుల తొయ్యలికై
మనసించుక నిలుప లేక మగ్నుదవగుచున్
చని దాని మగడు వచ్చిన
ఘనభీతిం జొరవె కల్లుకడవం దభవా! 193

భావము : "ముందు గౌడ పడతికై మనస్సును నిలుపుకొనలేక ఆమెను వలచిపోయి, దాని మగడు రాగా గొప్ప భయముతో కల్లు కడవలో దాగుకొంటివి కదా!"

ఉ॥ నీ మన సేనెఱుంగ నటె నిక్కము మోహిని రూపు చూచితే
కామశరాగ్ని జర్జరితకాయుడవై ధృతియించు కేనియున్
ధీమతి నిల్వ లేక కడు ద్రిమ్మరుచుండగ నేనె చూచెదన్
నా మనవించు కేని మది నాటదుగా తుదిగాన నయ్యెడిన్ 194

భావము : "ఓ పరమ శివా! నీ మనస్సు ఎట్టిదో నాకు తెలియదా ఏమి? మోహిని యొక్క అత్యద్భుత రూపము చూచిన వెంటనే ఆ మదనుని బాణాగ్నిచే సడలిపోయిన శరీరము కలవాడవై ధైర్యమును కొంచెమైనను లేక వివేకము నశించి మనస్సును వశము చేసుకొనక మిక్కిలి వెఱ్ఱివానివలె నీవు తిరుగుటను నేను చూచెదను సుమా! నీ మదిలో నా విన్నపము చేరుటలేదు. నీ ఆలోచనకు ఫలమును అనుభవించవలసినదే!"

ఉ॥ కావున నీదు చిత్తమిక గాదనరాదు మనోనురాగివై
శ్రీ వనితాధినాయకుని జేరగబోవుట కాత్మనెంచినన్
బోవుద మన్న దా ప్రమథ పుంగవులుం గొలువంగ నందిపై
తేవ వసించున్ బసవటెక్కెము రాజిల నేగె వేడుకన్ 195

అర్థాలు : తేవ= ఒప్పు, బసవ= నంది

భావము : "నీ చిత్తమును వ్యతిరేకించుటకు వీలుకాదు. నీ మనస్సున అనురాగము కలుగుటచే మహాలక్ష్మీపతిని చేరుటకై నీవు తీర్మానించినచో

బోవుదము'' అనగా ఆ శివుడు తాను ప్రమథగణము కొలుచు చుండగా నందివాహనముపై ఒప్పుగా ఆసీనుడై నందిపతాకము జెపజెపలాడుచు కదలుచుండగా ఉత్సాహముతో పయనమయ్యెను.

వ॥ ఇట్లు మోహినీసందర్శన కుతూహలాయమానమానసుండై గగనమార్గంబున వైకుంఠపురానుగమనుండై నడువనడుమ నాయాలోకంబులనున్న సురగరుడ గంధర్వ కిన్నరకింపురుషాదిసురగణంబులెక్కడెక్కడనెదుర్కొని సేయువందన వినుతోపచారం బులు గైకొనుచు నారద గీతానంద పరవశుండై చని వైకుంఠపురంబు గనుంగొని 196

భావము : ఈ విధముగా మోహినీ రూపమును చూచు ఉత్సాహముతో ఉప్పొంగుచున్న మనసు కలవాడై ఆకాశమార్గమందు వైకుంఠమునకు పోవుటకై పయనించుచుండగా, నడుమ దారిలో ఆయా లోకాలలో ఉన్న దేవగణంబులు ఆయా చోట్లలో తన్ను చూచి చేయు నమస్కారములు, స్తుతులు స్వీకరించుచు నారద వీణా వాద్య సంగీతమును వినుచు మైమఱచుచు పోవుచు వైకుంఠపురమును చూచి

సీ॥ అల్లవిగో మహదావరణాత్యున్న
తోత్కటంబగు చతుర్వ్యూహములును
అల్లవిగో మహదంబరచుంబిత
మాణిక్య గోపురమంటపములు
అల్లవిగో మహదాలయప్రాంగణ
ధగిత హోమ ధ్వజ స్తంభములును
అల్లవిగో శిఖరాగ్రమండిత పద్మ
రాగనిర్మిత కుంభరాజి గములు

తే॥ అల్లయదె భద్రకారణోత్ఫుల్ల పద్మ
చూత పల్లవ మిళిత విస్ఫురిత రత్న

మండితకవాట విభ్రాజమానసింహ
నామక ద్వారగేహళీసీమ గరిమ 197

భావము : చక్కగా కన్పట్టుచున్న నగరిని చుట్టియున్న ఆచ్ఛాదనము లోపల శ్రేష్ఠములైన, పటిష్ఠములైన నాలుగు విధములైన సైనికుల వరుసలు. అవిగో గొప్పవైన ఆకాశమును తాకు మాణిక్యములు పొదిగిన గోపురములు, విశాల విశ్రాంత స్థలములు. అవిగో గొప్ప దేవాలయ అంతర్భాగములందు వెలుగుచున్న హోమము చేయుటకై అమర్చియున్న ఎత్తైన స్తంభములు. అవిగో సౌధములపైన ధగధగ మెఱయుచున్న పద్మరాగ (ఎఱ్ఱని) మణులతో చేయబడిన మేలైన చిన్న కుండల మొత్తములు, అల్ల అదిగో శుభకరములై వికసించు కమలములు, మామిడి చిగుళ్ళు కలిపిన రత్నాలతో అలంకరించ బడిన, మిక్కిలి ప్రకాశించుచున్న సింహ (అనే పేరుతో) ద్వారపు గడపల సొగసు

సీ॥ మందార కుసుమ మరందానుమోదితేం
దిందిరానిచయసానందరవము
మాకంద పల్లవానీకఖాదనమోద
కోకిల ప్రాకటానేకరవము
చారు రసాల విస్తార సత్ఫల రస
పూరితానందైకకీరరవము
కామకాహళనిభచారు కంఠస్ఫూర్తి
శారికానిచయ శృంగారరవము

తే॥ మహితకలరవకులరవమధురమృదుల
పనసవిచలిత పున్నాగ పత్ర చిత్ర
భళభళారావ కలితమై సకల కుసుమ
ఫలశలాటులను పవన మలరె గంటె 198

అర్థాలు : కాహళము= ఊదువాద్యము

భావము : మందారపుష్పములలో గల తేనెను త్రాగుటచే తృప్తిచెందిన తేనెటీగల సంతోష ధ్వనులు. మామిడి చిగుళ్ళ మొత్తమును మెక్కుటచే సంతసించుకోకిల పక్షుల స్పష్టమైన పెక్కు ధ్వనులు, అందములైన విరివియైన చక్కని మామిడి పండ్లరసమును పూర్తిగా గ్రోలిన చిలుకల ధ్వనులు (మత్తిల్లిన) మదమును పూరించు వాద్య నాదముతో సమానమగు గొంతునుండి వెలువడు గోరువంకల శృంగార రసముల ధ్వనులు, గొప్పవైన పెక్కు పావురముల సుస్వసముల మార్దవము కూడి పనసచెట్లపైవీచుచు, పొగడమాను ఆకుల చిత్రములైన భళభళ అనెడి శబ్దములతో కలసి సమస్తములైన పూలు, పండ్లు, కాయల కదలికల చప్పుళ్ళతో మందముగా వాయువు పయనించుచుండగా ఆ ద్వారము మనోహరముగానున్నది. చూచితివా?"

మానిని॥ మేరునగంబుల మీర రచించిన మేటి శిలోచ్చయ మేళనమై
పారసుధారసబంధురకుల్యలపజ్జల వర్ధిలి పర్విన మం
దారలవంగ లతా పరివేష్టిత తామరసాకరజ్యోతులనన్
మారుత సంగతి మై శ్రమ వాయ సమంచిత కౌతుక మానసులై 199

భావము : (మాలిని) మేరు పర్వత సముదాయము మీద ఏర్పడినట్టి శిలల సమూహముతో కూడి పారలుచున్న తెల్లని జల ప్రవాహముగల కాలువగట్టులందు మొలిచి పెరిగి వ్యాపించిన పారిజాతములు లవంగముల తీగలతో చుట్టుకొని యున్న కమలముల మొత్తము గొప్ప వెలుగులా ఏమి అని తోచు ఆ ప్రకాశము సోకుచుండ కుతూహలముగా ఉత్సాహము నిండిన మనస్సులు కలవారై.

వ॥ లయగ్రాహి కుందముల భాస్వదరవిందముల జాజి సుమ బృందముల జారు మకరంద రస పానేందేందిరరవంబులను డెందముల రంజిలు ముకుంద పద పద్మయుగవందన నిజాత్మానందసనకాదిముని బృందసురసంఘకృత వందన కుతూహల మతిం దనరు శ్రీ గోవింద

చరణాబ్జయుగ సుందర సుచిహ్నముల నందమగు నవ్వనమునందు జన గ్రోలన్ 200

భావము : మొల్లలు, వికసించిన కమలములు, సన్నజాజి పూలగుత్తుల నుండి స్రవించు తేనెల ద్రవమును త్రాగు తేనెటీగల స్వరములచే ఎదలు వికసించుచున్న ముకుందుని కమలముల వంటి పాదముల జంటలకు నమస్కరించు తమ ఆత్మలలో ఆనందము నిండారిన సనకసనంద సుజాతులచే దేవతల సంఘముచే అర్చింపబడిన నమస్సులచే పొంగుమదితో తేలుచున్న శ్రీ గోవిందుని పాద పద్మముల జంటల అందములైన జాడలతో అలరారు అవనమందు పోవును ఎదుట,

ఉ॥ మించుచు వేయి వన్నియల మేల్మి పసిండి మెఱుంగు కోట రా
జించు సరోజరాగమణినిర్మితమై వెలుగొందు కొమ్మ ల
త్యంచిత వజ్రరత్న ఘటితాద్భుత భూరికవాటయుగ్మమున్
నించిన రత్నపుత్తళుల నింగిని ముట్టిన గోపురంబులన్ 201

భావము : ప్రకాశించుచు వేయివన్నెల మేలైన బంగారు కాంతిని మించెడి కోటయందు శోభించు పద్మరాగమణులను జయించునట్టి వెలుగు కొమ్ములతో ఒప్పుచున్న వజ్రాలు, రత్నములు కూర్చిన ఆశ్చర్యకరములైన పెద్ద ద్వారపు తలుపులను రత్నపు బొమ్మలు నిండిన ఆకాశమును అంటు చాలా ఎత్తైన గోపురాలను (కనుచు)

క॥ కలిగిన నగర ద్వారము
తొలగం ద్రోయంగరాని దోతోపులచే
కలహాశనుడును దానును
విలసిత మతి జొచ్చి రాజ వీధిని రాగన్ 202

భావము : కలిగిన ద్వారములలో తొలగింపలేని బలమైన త్రోపులతో (బరువైన ద్వారముల తలుపులను కష్టముతో తోసి లోపలికి వెళ్ళిరి) నారదుడు, శివుడును వికసించిన మతులతో వెళ్ళి, రాజ వీధులలో వచ్చుచుండగా.

ఉ॥ అందఱునుం జతుర్భుజులు నందఱు చక్రగదాబ్జ విస్ఫుర
న్నందకపాణు లందఱుకనత్కనకాంబరు లందఱున్ మణి
స్పంద కిరీట మండల విభాసిత సుందరు లందఱున్ మహో
త్కందనిభాంగు లప్పురిని గల్గినయట్టి మహాత్ము లందఱున్ 203

భావము : అచ్చటనున్న వారు అందఱు నాలుగు చేతులు కలవారు, అందఱును చక్రము, గద, పద్మము, కత్తి, (నందకము) చేతులందు కలవారు. అందఱు బంగారుతో చేయబడిన వస్త్రములను ధరించినవారు. అందఱును మణుల చలనము గల కిరీటముల ప్రభలతో ప్రకాశించు అందమైన రూపములు కలవారు. అందఱును గొప్ప తామరదుంపల వంటి బలమైన శరీరములు కలవారు. ఆపురమందున్న వారందఱును గొప్పవారే!

వ॥ అట్టి చతుర్విధముక్తులగు పురుషుల గనుంగొనుచు యచ్చతురహర్మ్యంబులుం
గడచి యన్నడుచక్కియున్న యున్నత పదంబగు నగరంబు గాంచి
తదీయ ద్వారపాలకులగు జయ విజయులు దమ రాక శ్రీ హరికి
విన్నవింపను తత్సమయంబు నరయుటకు బంపినం జని యొక్కించుక
దడవునకు వారలు వచ్చి యిట్లనిరి 204

భావము : అట్లు నాలుగు విధములైన ముక్తిని పొంది వైకుఠమందున్న పురుషులను చూచుచు అచటి మేలైన మేడలను దాటుచు, వాని నడుమ ఎత్తైన చోటుననున్న ఆ నగరమును చూచి, అచటనున్న ద్వారపాలకులైన జయవిజయులు తమ రాకను శ్రీహరికి విన్నవింపను, కలుసుకొన వలసిన సమయమును తెలిసికొనుటకు లోనికి పంపగా వారు వెడలి కొంత సేపటికి మరల వచ్చి ఇట్లు చెప్పిరి.

చతుర్విధముక్తులు 1. సాలోక్యము, 2.సామీప్యము, 3.సారూప్యము, 4.సాయుజ్యము.

ఉ॥ శంకర! మీ మహామహిమ సన్నుతి చేయ నశక్యమేరికిన్
పంకజ లోచనుండు హరిభావజ కోటి విలాస మూర్తి క్షే

మంకరు డాత్మకేళి వన మంజుల దివ్య కుజాంతరాళస
త్పంకజవాస సైకత విభాసిత చంద్ర శిలావితర్దికన్ 205

భావము : "ఓ శంకరా! మీ మహిమను చక్కగా నుతి చేయుటకు ఎవ్వరికైనను సాధ్యము కాదు. కమలలోచనుడు, మహావిష్ణువు కోటి మదనుల విలాస స్వరూపము కలవాడు, క్షేమములు కూర్చువాడు, తన క్రీడావనమందలి ఇంపైన మేలగు చెట్ల నడుమ కమలములతో వెలయు ఇసుక యుండుచోట వెలుగు చంద్రశిలలతో అమర్చిన అరుగు మీద",

తే॥ ఇందిరా దేవితో గూడి యిష్ట సఖులు
యుపచరింపగ సంప్రీతి నుండు టరసి
మీరువచ్చుట వాకిటి మెరుగు బోణి
నంపి విను పింప తోడి తెమ్మనియె మిమ్ము 206

భావము : "ఇందిరాదేవితో కూడి, ఆమె ప్రియసఖులు సేవింపగా సంతృప్తితో నుండుట తెలిసికొని మీరాకను వారికి ఒక సేవికను పంప, మిమ్ము తెమ్ము అనిరి"

శా॥ మీరల్ ధన్యుల రిట్టి వేళలను సంప్రీతిన్ మిమున్ రమ్మనెన్
రారండంచును వేగ కేలి వనదుర్గ ద్వారమార్గంబునన్
వారిం దోడ్కొని పోవ నంతిపుర సంవాసాంగనా సంగతిన్
జేరం బోయి ప్రమోదబాష్ప పులకల్ జెన్నొంద సంప్రీతులై 207

భావము : "మీరు ఎంతో పుణ్యము చేసికొన్నవారు. ఇట్టి సమయమందు సంతోషముతో మిమ్ము రమ్మనెను. "రారండి" అనుచు వడిగా కేళివన దుర్గ ద్వారపు దారిలో వారిని తోడ్కొని పోవుచు లోనగరిలో వసించి వనితలతో కలసి అందు చేరగా, పెల్లుగా పొంగు సంతసముచే కన్నీరు, పులకలు (గగుర్పాటు) తమ్ము పరవశింపజేయగా, చాలా తృప్తి చెంది

చ॥ అనుపమకల్పనాంతర సుధాచ్ఛసరోవర తీర యంత్రసం
జనిత తుషార శీతల నిశాపతి కాంత వితర్దికోటియా
వనవనితోపచార సుఖవర్తనుడై కడు వేడ్క నిందిరా
వనరుహపాణితోన నతివైభవుడై కొలువున్న శౌరికిన్ 208

భావము : సాటిలేని కూర్పులతో నడుమ తెల్లని, అచ్ఛమైన(స్వచ్ఛము) సరోవర తీరమందు యంత్రములచే వెల్వడుచున్న తుంపరల చల్లదనము కలిగిన పెక్కు చంద్రకాంత శిలల తిన్నెల యందు ఉద్యానవన వనితల సేవలచే సుఖముతో మెలగుచు, మిక్కిలి ఉత్సాహము కలవాడై కమలముల వంటి చేతులు కల లక్ష్మీదేవితో కూడి సకల భోగములతో కొలువులో నున్న ఆ శ్రీహరి,

మ॥ హరమౌనీంద్రులు జాగి మ్రొక్కి మదిలోనానందముం జెందగా
గరముల్ మోడ్చి శ్రుతి ప్రయుక్తి వినుతుల్ గావించి మోదంబునన్
హరి చేసన్న యథార్హ పీఠముల నత్యాసన్నులై యున్నచో
వరదుం డచ్యుతు డానతిచ్చె కరుణావారాశియై శంభుతోన్ 209

భావము : శివుడు, నారదుడు నేలపై వ్రాలి సాగి మ్రొక్కి మనస్సులో ఆనందము నిండగా, చేతులు ముడిచి వేదములు వల్లించుచు (స్వరయుతముగా) స్తుతులు కావింపగా ప్రసన్నుడై హరి, చేతిసైగలచే తగిన ఆసనముల మీద వారు తన దగ్గఱగ కూర్చుండగా, వరములిచ్చు దేవుడు లోపరహితుడు కరుణయనెడి జలనిధియై (హరి) శంభునితో ఇట్లనెను.

ఉ॥ వచ్చుట కేమికారణ మవారణ నిద్దరు నాత్మభక్తిచే
మచ్చికతోన యొండొరుల మానస వీధుల నిల్పి యుండగా
నిచ్చటి కిట్లు రావలయు టిచ్చను దొట్టిన కూర్మిచే గదే
వచ్చుట లెస్స ఏమిపని పంచిన జేసెద నానతిమ్మనన్ 210

భావము : "మీరు ఇద్దఱు ఇచ్చటికి వచ్చిన కారణమేమి? మీ మనస్సులలో, నా యెడ భక్తి, ప్రేమ నిల్చి యుండుటచే, మీరు వచ్చుట కారణమగును.

స్నేహభావముతో మీరాక చాలా మంచిది. మీరేది చెప్పినా చేసెదను. దయతో చెప్పండి."

చ॥ హరి! పరమాత్మ కృష్ణ కరుణాంబుధి సర్వ శరణ్య శౌరి! మం
దరధర! వాసుదేవ! వసుధావర సజ్జనలోకరక్షకా!
శరధిశయాన దైత్యహర సన్ముని వందితపాదపంకజా!
సరసిజనాభ పాపహర! సారస పత్ర విశాలలోచనా! 211

అర్థాలు : హరి! పరమాత్మ, కృష్ణ, కరుణ అంబుధి= కృపయనెడి జలనిధి, సర్వశరణ్య= అందఱును ఆశ్రయింపదగిన వాడవు, శౌరి, మందరధర= మందర పర్వతమును ధరించినవాడా!, వాసుదేవ, వసుధావర= పుడమిలో శ్రేష్ఠుడా!, సజ్జనలోకరక్షకా= మంచివారినెల్లను కాపాడువాడా!, శరధిశయాన= సముద్రమే శయ్యగా గలవాడా!, దైత్యహర= రాక్షసుల హరించినవాడా!, సన్మునివందిత పాదపంకజ గొప్పమునులచే నమస్కరింపబడు కమలముల వంటి పాదములు కలవాడా!, సరసిజనాభా= బొడ్డులో పద్మము కలవాడా!, పాపహర= పాపాలను తొలగించువాడా!, సారసపత్రవిశాలలోచనా= పద్మముల వంటి వెడల్పైన కన్నులు కలవాడా!

ఉ॥ నిన్ను మనంబులోపలను నిచ్చలు పూజ యొనర్చుచుండియున్
కన్నుల జూడగా మదిని కాంక్ష జనించిన వచ్చినాడ నో
పన్నగ శాయి! నీ మహిమ బ్రస్తుతి చేయ నశక్య మేరికిన్
నిన్ను భజించువారలకు నీవు వశుండవు గాదె శ్రీ హరీ! 212

భావము : "నిన్ను మనస్సులో ఎల్లప్పుడు పూజలు చేయుచున్నను స్వయముగా నా కన్నులతో చూచుటకై మనస్సులో కోరిక కలుగుటచే వచ్చినాను. ఓ సర్పశయనా! నీ మహిమను స్తుతించుటకు ఎవ్వరికిని శక్యము గాదు. నిన్ను కీర్తించు దాసులకు నీవు వశుడవు. అగుచున్నావు కదా! ఓ శ్రీహరి!"

క॥ శరణాగత జన రక్షణ
బిరుదును ముంజేతగట్టి భీమాసురసం
హరణ ధురీణత గల వే
ల్పరయగ నే లోకమందు నైనను గలడే 213

భావము : "రక్షణకై తన్ను ఆశ్రయించిన వారిని రక్షించువాడు, శరణ ఆగతరక్షకుడు అనెడి బిరుదమును చేతిలో కంకణమందు కట్టుకొని భయంకరములైన రాక్షసులను సంహరించు భారమును వహించిన దేవుడు వేఱొక లోకమందైననూ కలడా?"

క॥ ప్రేరేచి దేవదైత్యుల
వారిధి దరువంగ జేసి వడి నమృతముకై
పోరగ మోహినివై దే
వారుల గరగించి యమృత మమరుల కీవే! 214

భావము : "దేవతలను, దైత్యులను ప్రోత్సహించి వారిచే సముద్రమును మథింపజేసి అమృతము వెల్వడగా, దానికై వారు వేగముగా పోరాడగా మోహినివై, దేవ విరోధుల మనస్సు దోచుకొని (మోసముతో) సుధను దేవతలకు ఇచ్చితిరి కదా!"

ఉ॥ కావున మోహినీ తను వికాసము చూడగ కాంక్ష జెంది యీ
దేవమునీంద్రుడుం దెలుప దేవర పాలికి వచ్చి నాడ నీ
సేవక వాంఛితార్థ ఫల సిద్ధికి మూలము నీదు పాద రా
జీవయుగార్చనంబు గదె సిద్ధము కైటభ దైత్యమర్దనా! 215

భావము : "అట్లగుటచే మోహిని శరీర సౌందర్యమును చూచుటకై కోరిక కలిగి, ఈ నారదుడును తెల్పగా తమ కడకు వచ్చిన వాడను. నీ సేవకుని కోరిక ఫలించుటకు నీ పాదముల జంటను పూజించుటయే ప్రధానము గదా! అది లభించినది. కైటభ రాక్షసుని మర్దించినవాడా!"

తే॥ అనిన దరహాస చంద్రికాననముతోడ
శంకరుని జూచి పల్కె నో శైలజేశ!
నాకు నీకును భేదమెన్నటికి గలదె
వింత సేయుచు నన్నింత వేడదగునె 216

భావము : అన్నంతనే చిఱునవ్వుతోడి ముఖముతో, శంకరుని చూచి ఇట్లు పలికెను. "ఓ పర్వతరాజ పుత్రిక పతీ! నీకు నాకు భేదమెప్పుడైన కలదా? వింత చేయు ఈ చిన్న విషయమును నన్ను కోరవలయునా?"

చ॥ నిరతదయాప్రపూర్ణుడవు నిష్కపటుండవు నీవు నాయెడన్
పరమహితుండవౌట మది బర్విన కోరిక దీర్పకున్నచో
హరిహరులం దభేదమను నాగమముల్ వినగల్ల యౌనటే
పరువడి నీ మనంబు నిలబట్టగ లేవను చింత నొందెడిన్ 217

భావము : "ఎల్లప్పుడును దయతో నిండినవాడవు. కపటము(వంచన, మోసము) లేనివాడవు. నీవు నాకు మిక్కిలి మేలు చేయు వాడవగుటచే నీమనసులో పుట్టిన కోర్కెను తీర్పని యెడల హరిహరులు ఒకరే (భేదములేదు) అనెడి శాస్త్రములు అసత్యములగును కదా! మోహ ప్రభావ వేగముచే నీ మనస్సు చెదరుటచే నీ వశములో పెట్టుకొన జాలవనెడి చింతకలుగుచున్నది."

క॥ అనిన విని శంభుడిట్లను
కనకాంబర! తెలిసి భ్రమయగా వెంగలినే
మనసు న్నిలుపుట కెంతటి
పని మదివాంఛితము దీర్పు పద్మాక్ష యనన్ 218

భావము : అని వచింపగా శంకరుడు ఇట్లనెను. "బంగారు వస్త్రము ధరించినవాడా! తెలిసి, మనస్సు చెదరక దానిని నిలుపుట ఎంత పని. ఓ కమలాక్షా! నా కోరికను నెఱవేర్చుమా!"

ఉ॥ ఎప్పటి ధైర్య మప్పుడొకయించుక నిల్పుట చోద్యమందు లో
గప్పిన మోహము న్నిలుపగాదు సరోజ భవాదులందు నే
జెప్పిన మాట నిక్కమని చిత్తములోపలనుంచు మిందుకై
తప్పుగొనంగ లేదు యిది తథ్యము నీకు నశక్యమెంతయున్ 219

భావము : "(ఏపాటి) ఎట్టి ధైర్యమునైనను మోహిని దర్శనమున కొంతసేపు నిల్పుట ఆశ్చర్యమే! ఎదలో నున్న వలపు (అజ్ఞానము)ను బ్రహ్మాదులును అడ్డుకొని ఆపలేరు. నేను చెప్పినమాట సత్యము అని మనస్సులో నిలుపుకొనుము. ఈ మాట తప్పు అని తలంపవద్దు. ఇది వాస్తవము. వలపును నిలుపుకొనలేవు"

వ॥ అనిన మహేశ్వరుండిట్లనియె 220

భావము : శ్రీహరి యిట్లనగా మహేశ్వరుడు ఇట్లు పలికెను.

చ॥ పలుమరు నీవు దీని నొక బ్రహ్మము సేయుచు నానతిచ్చినన్
పలుకుట లెట్టు లాత్మ ధృతి బట్టుటకెంత విచారమయ్యా నా
వలన గటాక్షమొప్ప మది వాంఛితముం దగ దీర్పవే హరీ
జలజదళాక్ష దాసజన సంఘము పాలిటి దాత వెంతయున్ 221

భావము : "పలుమాఱ్లు ఈ విషయమును ఒక పెద్దదిగా (అసాధ్యమని) చెప్పుచు వచించు చుండగా ఏమని సమాధానమియ్యగలను? నాచే నా మనస్సును నిలుపుటకు అంత ఆలోచన అవసరమా! అయ్యా! (ఓ ప్రభూ)" ఓహరి! నీ కడగంటి చూపుతో నా మనస్సులోని కోరికను తగిన విధమున తీర్పుమా! కమలాక్ష! నీ భక్తుల కోర్కెలు తీర్చు (దయగల) దాతవు కదా!"

మ॥ అనినన్ శ్రీ హరి శంభుతో ననియె నీ యందంతనే లాతినే
మనసొక్కించుక నేనెఱుంగుటకు నీమార్గంబునుం బల్కితిన్
నిను వర్ణింపగ బ్రహ్మవేదచయమున్ నేనైననుం జాల నిం
దనుమానింపక నిల్వు మీదెఱిగి నీవత్యంత వేగంబునున్ 222

భావము : అనగా, శంభునితో హరి ఇట్లనెను. "నీ విషయములో నేను వేఱొకడనా? (ఇతరుడనా?) నీ మనస్సు ఎఱుగుటకు ఈ విధముగా పల్కితిని. ఓ ఈశా! నిన్ను వర్ణించుటకు బ్రహ్మ వేదములన్నియును, నేనును కూడ నేర్పులేని వారము. నీ కోర్కెను తీర్చుటకు సిద్ధముగా ఉన్నాను. నీవు సందేహింపక మోహినిని చూచుటకు జరుగబోవు ఫలమును గ్రహించి, నీవేగపడు మనస్సును నిల్పుమా!"

క॥ అని గౌరీశ్వర నారద
మునివరుల నటుంచి భవనమునకుం దావే
జని నారదు బోవంగా
బనుపుచు హరిమాయ శివుని భావము గప్పెన్ 223

భావము : అని వచించి, శివుని, నారదమునిని అచ్చటనే నిలిపి తాను తన నగరిలోనికి వేగముగా వెళ్ళి, నారదుని పోవునట్లు చేసి, శివుని తన మాయలో ముంచెను.

సీ॥ మదననాటకమాడ మాయా ప్రకల్పిత
త్రిభువన మోహన దీప మనగ
సమయ వర్షాగమ సరస వనాంబుద
మధ్యచంచల్లతామాలి కనగ
కాల దశానన కల్పిత శివ కుజా
కాంక్షిత మాయా మృగం బనంగ
కాయజాంతక మాన ఖండితమానస
క్రూరాంగ భవ ఖడ్గరోచి యనగ

తే॥ చెంత శృంగారవనవాటికాంతరాళ
లలితమోహన కరనవలక్ష్మి యనగ
అంధతమమున పెను మెఱ పంబుదమును
జొచ్చి మిఱుమిట్లు గొను క్రియ సుదతి బొలిచె 224

అర్థాలు : కుజ= పుడమిలో పుట్టినది (సీత)

భావము : మదన నాటక ప్రదర్శనమునకై మాయచే కల్పింపబడిన మూడులోకాలను వశము చేసికొను (ఆక్షరించు) ప్రజ్వలించు ద్వీపమా! వానవచ్చు సమయమందు ఇంపైన నీటి మబ్బుల నడుమ తళుకుగా కన్పట్టు విద్యుత్తు తీగెల వరుసలా! కాలమనెడి రావణుడు శివుడను సీతను మోసగించుటకై కల్పించిన జింకయా! మదనుని మాడ్చిన కోపముచే, విఱిగిన మనసు గల క్రూరుడైన మదనుని శరీరమునుండి వెల్వడిన కత్తి కాంతియా! సమీపమందును ఉద్యానవనపు పొదల నడుమ, మృదువైనదియు, మోహింపజేయునదియు (ఆకర్షింపజేయునది) నవ్యమైనదియునైన లక్ష్మీదేవియా, అనునట్లు చీకటిలో పెద్ద మెఱపు మబ్బులలో ప్రవేశించి, కన్నుల చెదరుగొట్టునట్లు కాంతి గోచరమయ్యెను.

క॥ కనుగవకద్భుతమైనను
వెనకటి కథ నెడసి దాల్మి వీటిం బోవన్
మనసిజ సంహరు డెంతయు
తనువుం బరవశమునొందె తన మదిలోనన్ 225

భావము : తన కన్నుల జంటకు ఆ పడతి అద్భుతమై కన్పట్టగా ముందే జరిగిన మాటలను మఱచి (తొలగగా) తన ఓరిమి నష్టమగుటచే (మదన సంహరుడు) శివుడు శరీరమంతయు పులకరింపగా మోహమందు మునిగి తన మనస్సులో

క॥ ఎక్కడి మెఱపెక్కడి తళు
కెక్కడి తళ తళన తెలియ నెక్కడికాంతి
ట్లెక్కడి మోహనమో యని
యెక్కడి దెలియంగ లేక నెనసిన భ్రమతోన్ 226

భావము : "ఈ మెఱపు ఎక్కడిది? ఈ తళుకు ఎక్కడిది? ఈ తళతళ జిగి ఎక్కడిది? తెలిసికొనుటకు ఈ కాంతి ఎక్కడిదో? ఎట్టి మోహనరూపమో అని తెలిసికొనలేక మిక్కిలి చంచలమైన మనస్సుతో

చే॥ చేతోన్వితమై చూడ్కులు
యా తరుషండముల మలయ నఫలత్వము వి
ఖ్యాతి గను తదవలోకన
కౌతూహలహృదయుడగుచు కనుగొనుచుండెన్ 227

భావము : మనస్సులో ఇమిడిపోయిన చూపులు మరల మరల ఆ చెట్ల గుంపులందు చెలగగా ఆ ఆకారము మేలిమి చూచు కోరికతో ఆసక్తి నిండిన ఎద కలవాడై మాటి మాటికి, అందు ఆ యువతి కన్పట్టు నేమో అని, ప్రయత్నించుచు చూచుచుండెను. (శివుని చూపులు మోహిని రూపమును చూడ మిక్కిలి ఉత్సాహము చెందెను)

సీ॥ తనుకాంతి కమ్మిన వన భూజముల చుట్టు
తళుకు మేలపరంజితళుకులుగను
తళుకులపై వ్రాలు మెఱుగారు జూపుల
కాటుక రేఖలు కలయ బర్వ
కాటుక రేఖల గమ్మి ముద్దుల చిన్ని
నవ్వు వెన్నెల తేట నివ్వటిల్ల
వెన్నెల తేటపై వెదజల్లి నట్టుల
హస్త పల్లవ కాంతు లలము కొనగ

తే॥ మదన సామ్రాజ్య తారగానదను దెలిసి
చైత్రు డత్యంత సంతుష్టి చిత్ర పటము
లలవరించినక్రియ వన మంద మొంద
మ్రోలగను పట్టె నానవ మోహనాంగి 228

భావము : శరీర లావణ్యము ప్రసరించుటచే ఉద్యానవన భూముల చుట్టు తళుకుల జిగి మేలైన శుద్ధమైన బంగారు కాంతులైనవి. ఆ కాంతులపై వెలసిన కన్నుల నుండి వెల్వడు నల్లని కాటుక వరుసలై అంతటను వ్యాపింపగా, కాటుక రేఖలను ముద్దాడుకొనుచు చిఱునవ్వు అనెడి వెన్నెల తేట కన్పట్టగా, వెన్నెల విలాసములపై చక్కగా చల్లినట్లు చేతుల చిగుళ్ళ ఎఱ్ఱనికాంతులు పూతగా అంటుకొనగా మదనుని సామ్రాజ్యమందలి గొప్ప నటనతారయా అనునట్లు సమయమెఱిగి, చైత్రుడు (వసంతుడు) మిక్కిలి సంతోషముతో చిత్రపటమును తీర్చినట్లు వనమంతయు అందము పొఱగా ఆ నవ మోహిని ఎదుట తోచెను. ఆ వనము ఆమె శరీరలావణ్యముచే మేఘములలో కన్పట్టు బంగారువన్నె తళతళలు, కన్నుల కాటుకచే నల్లని కాంతులు, నవ్వులచే తెల్లని, చేతులచే ఎఱ్ఱని కాంతులు వెల్వడు జేయచు నాట్యతారగా గోచరింపగా ఆ వనము వసంతుడు చిత్రించిన పటమువలె ప్రకాశించెను.

క॥ కనుపట్టి సర్వమోహన
జనితోత్సాహంబు వదన సరసిజ మందున్
పెనగొనగ నల్ల నల్లన
వనజాయత నేత్రి కేలి వనమున దిరుగన్ 229

భావము : అట్లు సర్వమును ఆకర్షించుటకై వెల్వడు ఉత్సాహమును, కమలము వంటి ముఖమందు ఊగుచుండగా, మెల్లమెల్లగా ఆ కమలాక్షి ఆ క్రీడా వనమందు తిరుగుచుండగా

ఉ॥ కన్నుల కద్భుతంబయిన కాయజుసంహరుడాత్మలోపలన్
కన్నదిగాదు మౌని సురకాండము లెంతయు సన్నుతింపగా
విన్నదిగాదు ఇట్లు వనవీధి నపూర్వ విలాస భాసమై
కన్నులపండు వయ్యె నిది కన్గొన నంచును భ్రాంత చిత్తుడై 230

భావము : మదనుని మర్దించిన శివుడు, తన కన్నులకు ఆ మోహిని మిక్కిలి ఆశ్చర్యకరమైన ఆకృతితో గోచరించగా, తన మదిలో "మునులు దేవతలు చూచిన రూపము కాదిది. బాగుగా నుతింపబడిన రూపమును కాదు ఇట్లు ఒయ్యారముతో వనముల త్రోవలలో తిరుగుచు పూర్వము కానని శరీర విలాసముతో భావ ప్రకటనలతో సంచరించు ఆ రూపమును చూచుటకు కన్నుల పండువయినది కదా" అని చలించిన మనస్సు కలవాడై

క॥ మానిని పొక్కిలి సరసిన్
స్నానము గావించి త్రివళిసోపానగతిన్
మానితకుచ గిరి వరులను
పూని జపం బాచరించె పురహరు చూడ్కుల్ 231

భావము : త్రిపురాసుర సంహరించిన శివుని చూపులు ఆ పడతి నడుమ గల బొడ్డు అనెడి నీటి గుంటలో (మూడువళులు) స్నానమాడి మూడు గీఱల వెంట్రుకలనెడి మెట్ల దారిలో పయనించి, పైన, అందమైన చన్నులనెడి చిఱుకొండలపై నిలిచి ధ్యానము చేసినవి.

చ॥ కనుగొనుచుండగానె తొలుకారు మెఱుంగననొప్పి మావిచం
దనఘనసారచంపకవితానములం గను పట్టి మల్లికల్
బెనగొని ద్రాక్షపందిరుల పెంపు వహించిన కానలోనికిన్
జనిన పురారి మానసము ఝల్లన నచ్చట జేరబోవగా
మనసిజు డార్చివేగ రిపుమార్కొన నెంచి నుదగ్రచిత్తుడై 232

భావము : చూచుచుండగా వర్షఋతువు ప్రారంభించు కాలములో (తొలికారు) కన్పట్టి త్రుటిలో తొలిగిపోవు మెఱపేమో అన ఒప్పుచు మామిడి (మావి) చందన, కర్పూర, చంపక వృక్ష ప్రకరములందు తిరుగుచు కనబడుచు, తీగెలు పెనగొనగా ద్రాక్ష పందిరుల సొగసులతో వెలయు వనములోనికి పోగా శివుని మానసము తల్లడిల్లి (బాగుగా కదలి) అచ్చటికి చేరుటకై

యత్నింపగా మదనుడు వేగముగా తన పగవానిని ఎదుర్కొనుటకు ఉద్రేకము కల మనస్సు కలవాడై

మ॥ వెనువెంటన్ మొనమల్లె మొగ్గములుకున్ వెయ్యా రు నాటింపులన్
కనుమాటై చనజొచ్చె తొల్లిటి మహోగ్రజ్వాలలన్ దగ్ధుడై
తనువుం గైకొన లేమి భీతియును చిత్తం బందు తద్రోషమున్
బెనగొంచున్ మొనపాఱ వెన్క చనగా మైకొన్న డెందంబునన్ 233

అర్థాలు : మొన వ ముందు, వెయ్యాఱు వ అఱువేలు

భావము : మొదలు మల్లె మొగ్గల బాణాలను ఆఱువేలు శివుని నాటించుచు కన్పట్టక పోవుచు, తొల్లి ముక్కంటి నిప్పుల మంటలచే కాలిన శరీరమును పొందలేక పోవుటచే భయము శివునిపై రోషము దట్టమై నిండగా తన వ్యూహము ప్రసరించగా(సిద్ధించగా) వెనుక పరవశించు ఎదతో శివుడు పోగా, (వచనముతో అన్వయము)

వ॥ ఇట్లు మదన వశ ఖిన్న మానసుండగు చింతన మనంబున 234

భావము : ఈ విధముగా మోహముచే ఆవేశమును పొంది మదనునికి వశమై చింతించెను. పదిమన్మథావస్థలు 1. దృష్టి, 2. మనస్సంగము, 3. సంకల్పము, 4. జాగరము, 5. కృశత్వము, 6. అరతి, 7. అలజ్జ (ప్రలాపము), 8. ఉన్మాదము, 9. మూర్ఛ, 10. మరణోద్యోగము.

సీ॥ పుత్తడి బొమ్మయో! పుత్తడి బొమ్మైన
చేతన స్థితిని రాజిల్లు టెట్లు
మదనుని బాణమో! మదను బాణంబైన
నంగాంగ సౌష్ఠవం బమరు టెట్లు
సౌదామినీలతో సౌదామినైనను
నిశ్చలత వదలి నిలుచు టెట్లు
రతి పల్కు చిల్కయో! రతి పల్కు చిల్కయిన
నంబరాభరణాంగి యగుట యెట్లు

తే॥ అహహ త్రిభువనములకు నత్యద్భుతముగ
సకలశృంగారరసములు సంగ్రహించి
యువిద గావించెనో పద్మభవుడు గాక
కలుగనేర్చునె యిట్టి శృంగార మెందు 235

భావము : "బంగారు బొమ్మయా అయినచో ఎట్లు జీవముతో నుండును? మదనుని బాణమా అయినచో శరీర అవయవములు చక్కని కూర్పు ఎట్లు సాధ్యమగును? విద్యుల్లతయా అయినచో విశేష చలనమును వదలి ఎట్లు నిలుచును? రతీదేవి మాట్లాడు చిలుకయా అయినచో వస్త్రాలను, నగలను శరీరమెట్లు కలదగును? ఆహాహా! మూడు లోకాలందు గల అత్యధిక, అద్భుతముగా సమస్త శృంగార రసములను ప్రోగు చేసి బ్రహ్మ ఆ పడతిని సృజించెనో ఏమో! అట్లు కాని యెడల ఈ విధమైన అపూర్వమైన శృంగారము ఎందైనా కలుగునా?"

క॥ దరహాసము కలకలనయు
తరుణీమణి చెక్కులందు తళ తళనయునుం
మెఱుగుంగుబ్బల నిగనిగ
దరమగునే పొగడ మేని తళ తళ లెందున్ 236

భావము : "మోహిని చిఱునవ్వు కావించు కలకల ధ్వనిని (కలకలన = ధ్వన్యనుకరణ) చెక్కులందు మెఱయు కాంతిని, మేలైన, ఎత్తైన చనుగుబ్బల సొంపును శరీర సౌందర్య ప్రకాశమును పొగడుటకు సాధ్యమా!"

క॥ పవడంపులతిక కాంతులు
చివురాకుల మృదువు తమ్మి చెలువము లెల్లన్
కవగూర్చి బ్రహ్మదేవుడు
నవలాపదయుగము చేసినాడేమొ కదా 237

భావము : "పగడపు తీగల నుండి వెలువడే కిరణముల కాంతులను, చిగురాకు మెత్తదనమును, తామరపువ్వుల సొగసును అంతటిని జతచేసి బ్రహ్మ, ఆ నవ వనిత పాదముల రెంటిని చేసినాడేమో కదా"

క॥ తమ్ములు తమ ఘన విఖ్యా
తమ్ములు దిగనాడి కడుముదంబున గొలువన్
తమ్ముల యొప్పెఱుగుటకుం
దమ్ముల గైకొనియె చెలి పదమ్ముల రేఖల్ 238

భావము : "తామర పువ్వులు తమ గొప్ప (ప్రసిద్ధి) తనమును వదలిపెట్టి మిక్కిలి సంతసముతో సేవింపగా ఆ తామరల అందము ఎట్టిదో ఎఱుగుటకు మోహిని పాద రేఖలు (విలాసములు) ఆ తామరల అందమును పొందినవి.

ఉ॥ నెయ్యముతోన పద్మజుడనే కృషికుండు నిరంతరంబునున్
దియ్యని సుందరాంబువుల దీర్చిన మేల్తను కుల్య శాలికల్
తొయ్యలి జంఘలట్లగుటలున్ తగదన్నను కూర్మయుగ్మమె
ట్లయ్యె బదోర్ధ్వ భాగములు అబ్జములౌనె పదంబు లెంతయున్ 239

భావము : "బ్రహ్మ అనే సేద్యగాడు స్నేహముతో, ఎల్లప్పుడు తియ్యని అందమైన నీటి ధారలతో తయారు చేసిన మేలైన పగడపు వన్నెతో పెరిగిన కాలువలయందుండెడి వరి ధాన్యముల వలె ఆమె కాలి వెనుక భాగములు (పిక్కలు) ఆ విధముగా ఉండుట తగదన్నచో పాదములపై స్థలములు తాబేళ్ళ జంటవలె ఎట్లైనవి? మఱియు పాదములు రెండును కమలములగునా? కాలిపిక్కలు పండిన వరిగింజల కంకుల (కొడలు) వంటివి. పాదముల పై భాగములు తాబేళ్ళవంటి పద్మముల వలె ఎట్లు ప్రకాశించును?"

తే॥ చానమీగాళ్ళు మరుకేళి చక్రయుగళి
కాంత జంఘలు అపరంజికాహళములు
అబలయూరులు మొలచిన యనటి తరులు
సఖి నితంబంబు బంగారు సైకతంబు 240

భావము : "మోహినిపై కాళ్ళు మదనుని కేళికైన చక్రవాక పక్షుల జంటలు ఆమె వెనుకటి కాళ్ళు మేలైన బంగారు వన్నెగల ఊదువాద్యముల వంటివి. కొత్తగా మొలచిన అరటి మొక్కలు ఆమె పిఱుదులు బంగారు కాంతిగల ఇసుక తిన్నెలు."

క॥ మెఱుగుంబోడి నితంబము
కరికుంభము లగుట నిజము కాదేని మదో
త్కరమైనమందయానము
కరియానంబగుట యెట్లు గణుతింపగన్ 241

భావము : "ఆ మెఱుగుకాంత పిఱుదులు ఏనుగు చెక్కిళ్ళే అగుట నిజము. అట్లు కానిచో మదించిన ఏనుగుల వలె ఆ మెల్లని బరువైన గమన విలాసమును ఎట్లు కలిగనదని తలంప గలము?" (ఆమె గమనము మత్తగజము వలె అబ్బురము కొలుపుచున్నది).

చ॥ మదనగృహాంగణంబున నమర్చిన బంగరు రంభలూరులౌ
మదవతికట్లుగాని యెడ మారుడు నిచ్చ వసించియుండగా
తదుభయపార్శ్వకాంచన వితర్దికలున్ విలసిల్ల నేర్చునే
యుదుట నితంబ సంజ్ఞ మహిమోన్నత లీల విలాస వైఖరిన్ 242

అర్థాలు : ఉదుటన్= ఉల్లాసముతో (ఉత్సాహముతో), సంజ్ఞ= పేరు

భావము : "మదనుని ఇంటిముందు మంటపమందు అమర్చిన బంగారు అరటి చెట్లు ఆ మదవతికి (మోహినికి) తొడలైనవి. అట్లు కాని యెడల ఆ కాముడు స్వేచ్ఛగా ఎడతెగక వాసము చేయునట్లు ఆమెకు రెండువైపులను బంగారు కాంతిగల తిన్నెలు (పిఱుదులు) పిఱుదులనెడి పేరుతో ఆశ్చర్యకరమైన ఉల్లాసముతో ప్రకాశించునా?"

చ॥ సరస విహార మం దలరి జక్కవ లంబర వీథి కేగగా
చరణములందు జుట్టు కొని సాగగ నియ్యని నాచుదీగ నా
సరసిజపాణికిం దనరె చక్కనియారు నురోజయుగ్మమున్
నిరుపమనాభి కాని యెడ నెక్కొనునే వళులుం దరంగలై 243

అర్థాలు : అంబరము= ఆకాశము, జక్కవ= చక్రవాకపక్షి, ఆరు= బొడ్డు మీది వెంట్రుకలు, ఉరోజయుగ్మము= చన్నుల జంట, వళులు= కడుప మీది ముడుతలు

భావము : మోహిని అందమును చూచిన చక్రవాక పక్షులు ఆస్వాదించి, సంతసించినవై ఆకాశమునకు శృంగార రస మొప్పంగ జంటలై వినోద విహారమందు మనస్సుకలవై వెడలి పోవుటకు ప్రయత్నింపగా వాని కాళ్ళకు చుట్టుకొని ముందుకు పోనీయని సన్నని తీగలేమో నాచు అన్నట్లు, ఆ పద్మములవంటి చేతులు గల కాంతకు బొడ్డుమీద వెంట్రుకలు, చక్రవాకముల వంటి చనుగుబ్బలు, అందమైన లోతైన బొడ్డులు అమరినవి. కానిచో ఆమె బొడ్డు మీద ముడుతలు, ఆ బొడ్డు గుంటపై అలలవలె నిలుచునా? (చక్రవాకముల గుండ్రని తనము కుచములకు కలిగెనని భావము.)

ఆ॥ సకియ రోమరాజి జవబిగిమానంబు
కాక కానరాని కౌనుదీగె
విపుల కుచకటి ప్రవృద్ధి భరింపంగ
నలవి యెట్టుల నసియాడుచుండ 244

అర్థాలు : కౌను తీగ= తీగ వంటి సన్నని నడుము, ప్రవృద్ధి= ఉబ్బు, పెంపు, అసియాడు= చలించు, ఇటునటు కదలు

భావము : మిక్కిలి సన్నమైన (కానరాని) తీగవంటి నడుము, పెద్దవైన కుచముల ప్రాంతము వాని ఉబ్బును ఏ విధముగను సహింపలేక బాగుగా చలించు చుండెను.

క॥ తరుణీమణికటిసీమకు
తరమగునే సైకతంపుదరులుం గిరులున్
మెఱుగుమొనవాడి మించిన
గురుకుచముల సరియె పసిడిగుండ్లున్ గిండ్లున్ 245

అర్థాలు : గిండ్లు= మర చెంబులు (పాత్రలు), పసిడి= బంగారు

భావము : "ఆ వనిత మొలగల భాగమునకు ఇసుక తిన్నెలు, గుహలు, తిప్పలు (కొండలు) సమానములగునా? ఆ, పడతి అందమైన చనుకొనల బలిమిని (దృఢత్వమును) అతిశయించిన పెద్దవైన చనులకు బంగారు గుండ్లకు, చెంబులు సాటియగునా?"

ఉ॥ ఆముకురాస్యచారు మధురాధరశర్కరవాసనాప్తిచే
నామహనీయనాభి మహిమంతయు వెల్వడ చన్నుగొండలం
రామణిహార నిర్ఝరులు రా గని దాటగలేక నిల్చెనో
చీమలబారు నా బొలిచె చెల్వగు నారు మనోహరాంగికిన్ 246

అర్థాలు : నిర్ఝరులు= సెలయేళ్ళు, చీమలబారు= చీమల వరుసలు, ఆరు= బొడ్డుపై వెంట్రుకలు

భావము : "అద్దము వంటి మొగము గల మెలత, అందమై, తీయనైనదియునైన పెదవులపై గల చక్కెర వాసనను సోకుటచే తన గొప్పదైన బొడ్డు యొక్క సొగసునంతటిని వెలువడ చేయుచూ (కనపడునట్లు) కొండల వంటి చన్నులు, మీదికి రాగా, వాని పైనున్న మణులు గల దండల నుండి కిరణములు (కాంతులు) సన్నని జల ప్రవాహములై అడ్డుకొన్నవి. అట్లగుటచే ముందుకు సాగిపోజాలక అచటనే నిలిచిపోవునేమో అనునట్లు చీమల వరుసల వలె వెంట్రుకల వరుసలు (కటి ప్రదేశమునందు) ప్రకాశించుచున్నవి.

మ॥ మదహస్తి ప్రతిమానయానకుచముల్ మాంగల్యశోభాకృతిన్
బదియార్వన్నెల పైడిపూతెసగు కుంభల్లీల గాదన్నచో

విదితంబై మెఱుగెక్కగా చికిలి గావింపంగ తద్రేణువుల్
పొదల న్నేర్చునె కక్షకాంతులుగ నంభోజాక్షికిన్ సాక్షిగన్ 247

అర్థాలు : పైడి= బంగారము, కక్ష= చంక, రేణువు= పొడి

భావము : "మదగజమువలె నడచు మెహిని పాలిండ్లు, మంగళకరమగు వెలుగు రూపముతో గొప్ప విలాసవంతములై, పది ఆఱు వన్నెల బంగారు వన్నె గల పూతతో మెఱసెను. కాదన్నచో, వాని నుండి వెలువడిన బంగారు పొడులు చికిలించినట్లు ఆమె చంకల కాంతులు స్పష్టముగా మెఱుగులై సాక్షులుగ ప్రకాశింపగలవా?

ఆ॥ కఠినగుణముమొనలు కడువక్రు వలు నయి
లక్కపూతఛాయ లలవి కొనియె
చానకుచయుగంబు సత్కాంతి లేదని
జాలినొంది బొంగరాలు దిరుగు 248

అర్థాలు : వక్రువ= వంకర, అలవికొనియె= ఆక్రమించెను

భావము : "ఆమె చనుమొనలు గట్టివి పలు వంకరలతో లక్కపూత వన్నెలను పొందెను. ఆమె చన్నుల జంటలలో మేలైన కాంతి లేదవి, అవి (చన్నుల కొనలు) చింతతో ముడుతలను పొంది బొంగరాలై తిరిగినవి".

ఆ॥ మేలుబంతులయ్యె మెలతుకచనుదోయి
సకల సృష్టికర్తజలజజునకు
మేలుబంతులయ్యె మీన కేతనుహస్త
లాఘవ క్రియా విలాసములకు 249

అర్థాలు : మేలు బంతి= వ్రాత నేర్చుకొనుట మొదట వ్రాయబడిన చక్కని అక్షరముల శ్రేష్ఠమైన పంక్తి (బంతి), జలజము= పద్మము, జలజుడు= పద్మముతో పుట్టిన బ్రహ్మ, మేలు బంతులు= ఆటలాడుటకు మంచి చెండులు (కందుకములు)

భావము : "ఆ మోహిని చన్నుల జంట సర్వమును సృష్టించిన ఆ బ్రహ్మకు వరవడి (మాదిరి) ఆనందించుటకు ఏర్పడినది." చేపను పతాకమందు గల మదనుని చేతులతో తాను కావించు చిలిపి పనులకు మంచి చెండ్లు (చన్నుల గుబ్బలు) కల్గినవి.

శా॥ కాంతారత్నము బాహుయుగ్మ మవురా కంజాతసంజాతుడీ
సంతానద్రుమవల్లులన్ తగ సృజించన్ బోలు గాకున్నచో
నెంతేహస్తతలంబులున్ చిగురులౌనే సర్వ సౌభాగ్యకున్
నంతే ప్రౌఢిమ వన్నె యెక్కువగునే నవ్య ప్రభావోన్నతిన్ 250

అర్థాలు : కంజాత సంజాతుడు= పద్మమందు పుట్టినవాడు, ప్రౌఢిమ= నేర్పు

భావము : ఆశ్చర్యము బ్రహ్మ ఆ అందమైన అతివ భుజముల జంటకు సంతాన మనెడి పేరుగల దేవతా వృక్షముల తీగెలను చూచి అట్లే వానిని సృష్టించెను. కానిచో ఆ భాగ్యవంతురాలి చేతులపై భాగములు ఆకు చిగుళ్ళవలె అందమైన విలాస తేజములతో మహా నేర్పరితనము కలవై గోచరించునా?

చ॥ సుదతి యొకించుకైన చెయి జూపిన జాలు దదానువర్తినై
బ్రదికెద నన్న కెంజిగురు బారగ దోలిన రోషితాత్మయై
మదనుని గొల్చి తానతని మన్నన వేళ్ల గుఱించి వాడిమై
కదలక చెయ్యి చూతునని కాచుకనున్నది మత్సరంబునన్ 251

అర్థాలు : కెంపు చిగురు= కెంజిగురు ఎఱ్ఱని చిగురుటాకు, వాడి= తాపము

భావము : మోహిని కొంచెము తన చేతిని ముందుకు చాచి చూపినట్లయితే, దాని అందమును కొని, దానిని సేవించుచు, జీవించెదనని ఎఱ్ఱని చిగురుటాకు తలచి ఆమె దగ్గఱకు రాగా దానిని చూడకనే గెంటి వేసినది. అట్లు మోహిని అవమానించుటచే కోపము కలిగిన మనస్సు కలదై ఆ చిగురుటాకు, ఆ కాంత చేతి వ్రేళ్ళ అందమును గుఱించి, మమకారముతో

(ప్రీతితో) మదనుని కొల్చి, ఆతని ఆదరముతో వానిని చూడగలనని, తాపముతో కదలక

(నిశ్చలముగా) ఒక్కచోటనే అసూయతో నుండి తపస్సు చేయుచున్నది.

ఆ॥ భామవేళ్లు పచ్చి పవడంపులతికలౌ
నట్లు గాకయున్న హస్తపద్మ
రాగకలితమగుచు రమణీయ నఖ వజ్ర
మణి విరాజమానమహిమ గలదె 252

భావము : ఆ భామ వేళ్ళు లేత చిగుళ్ల తీగల వలె ఉన్నవి. అట్లు కాకపోయినచో ఆమె ధరించిన పద్మరాగమణుల కాంతులతో తెల్లని వజ్రముల వంటి గోళ్లు (నవరత్నాలలో నొకటి) ఎట్లు కెంపువన్నె సొగసు కలవగును?

ఆ॥ పూగఫలము దరము భూజాగ్రమును నీట
వ్రేలి మునిగి దపము చాల జేసి
గళముసరికి బెనగ గామిని నమలియు
పార నూదె క్రముకవారిజముల 253

అర్థాలు : పూగఫల= పోకపండు (వక్కచెట్టు), దరము= శంఖము, భుజ అగ్రము= చెట్టుకొన, గళము= మెడను, సరికి= పోల్చుటకు, వారిజము= నీటిలో పుట్టినది (శంఖము) పెనగ= శ్రమ పడగా

భావము : పోకపండు, శంఖము రెండును క్రమముగా (చెట్టు) తన చెట్టు కొనను వంచి నీటిలో వ్రేలాడ చేసినది (శంఖము) నీటిలో పూర్తిగా మునిగి పోయినది. అవి మోహిని అందమును పోలుటకై తపస్సు కావించినవి. వాని తపమును మెచ్చి వాని కోరికను మన్నించెనేమో అన్నట్లు ఆ కామిని, పోకపండును నమిలి ఉమ్మివేసెను. శంఖమును ఊదెను. పోకచెట్టు శంఖము రెండును తృప్తి చెందినవి.

ఉ॥ ఆనన సత్కళాకలన నంటగనియ్యదు మత్సరంబునన్
మానిని యంచు రోషమును మానుచు హస్త పదద్వయంబులున్
దీనతచే పదింబదిగ నెక్కొని పట్టెనొ చందమా మనం
గా నఖజాల మొప్పె సిత కాంతుల చంద్రిక లీనుచుండగన్ 254

అర్థాలు : సత్ కళాకలనన్= శ్రేష్ఠమైన కాంతుల నిలయమును, దీనతచే= బలము తొలగుటచే, పదింపదిగ= గట్టిగా, నెక్కొని= ప్రయత్నించి, నఖజాలము= చేతుల కాళ్ల గోళ్ల మొత్తము, చంద్రికలు= కిరణములు

భావము : తన యెడ అసూయతో ఆ కాంత తన శ్రేష్ఠమైన కాంతుల నిలయమైన తన మోమును, అంట నియ్యదుకదా అని చందమామ, చేతులను పాదాలను ఆమె అందమును చూడదలచి, బలహీనుడై గట్టిగా ప్రయత్నించి పట్టుకొనెనేమో అన్నట్లుగా ఆమె చేతులకాళ్ళ మొత్తము తెల్లని కాంతుల వెన్నెల వంటి కిరణములతో చక్కగా ప్రకాశించినవి

శా॥ బాలారత్నము నవ్వు సేయ సుధయై పాలయ్యె లేబక్వమై
నాళీకాసనుడంత వేఱె ముదురుం బక్వాన జంద్రాఖ్యపున్
రాలుం జంద్రుడుకప్పురంబయిన గారాదంచు పక్వంబునం
చాల న్వెన్నెలచేసి చేసెను మహాచాతుర్య ధౌరేయుడై 255

అర్థాలు : బాలారత్నము= రత్నము వంటి ఆ కన్య, సుధ= అమృతము, లేపక్వము= తక్కువ వన్నె కలదై, నాళీక ఆసనుడు= పద్మము ఆసనముగా కలవాడు బ్రహ్మ, చంద్ర ఆఖ్యపున్= చంద్రుని పేరుతో నున్న, రాలన్= శిలలను, రాతిని (చంద్రకాంతమణిని)

భావము : ఆ రత్నము వంటి కాంతులు వెల్వడ చేయు ఆ కన్య లేత నవ్వు అమృతమువలె చల్లనిది. పాలవలె తెల్లనిది అనగా శైత్యము, శ్వేతము కలదై పరిమితిగల వన్నెతో వికసించినది. సృష్టికర్త బ్రహ్మ దానిని రక్షింపవలెనని ముదురు పాకముతో (ఎక్కువైన వన్నెతో) చంద్రకాంతమణిని, (చంద్రుని

పేరుతో) సృజించి . అతని వన్నెలన్నియు వాని యందే మిళితము కారాదని, నిపుణుడైన బ్రహ్మ ఆ బాల నవ్వులు ఆధారముగా అతిశయించిన వెన్నెల కాంతులు ఈనునట్లు ఆ మణిని చేసెను.

విశేషము : ఆ బాల చల్లని తెల్లని నవ్వు బ్రహ్మ చంద్రకాంతమణి సృష్టికి కారణమని కవి కల్పన.

ఉ॥ దాడిమబీజ పంక్తియె రదంబులు తత్సహజాత మిత్రతన్
చేడియ ముద్దు మేల్పలుకు జిల్కకరస్థ శుకంబు గెల్చినం
చూడదుగాక భీతి దగ జూచెను ముక్కున నొక్కి మెల్లనే
జాడలనైన గైకొనగ జాలదె బేలతనంబు దక్కినన్ 256

అర్థాలు : దాడిమ బీజ పంక్తి= దానిమ్మ గింజల వరుసలు, రదంబులు= దంతములు, కరస్థ= చేతిలోనున్న, శుకంబులన్= చిలుకను, సహజాతము= తనతో పుట్టినది, జాడలు= సైగలు, కన్నుల కదలికలు, బేలతనంబు= తెలివి లేమి, అజ్ఞానము, తక్కినన్= తొలగగా

భావము : ఆ పడతి పండ్ల వరుసలు దానిమ్మ గింజలు వరుసలవలె ఇంపుగా వెలుగుచున్నవి. ఆ అందగత్తె, పండ్ల వరుసల సాయముతో ఉచ్చరించిన పల్కులచే తన చేతిలో నున్న తన మిత్రమైన చిలుక పల్కులను కంటే మెంగుటచే తోనే గెల్చినది. తాను ఓడిపోవుటచే ఆ చిలుక తన్న ఇంక చూడదేమో అని భయపడి చక్కగా చూచుచు, తన ముక్కుతో త్రొక్కి మెల్లగా ఏ సైగల చేత నయినను తన్ను చూడదా అని, తన తెలివి లేమిని గ్రహించి ఆమెపై దృష్టి సారించెను.

సీ॥ కలిత సద్గళ నాళ కలకంఠసానంద
కలిత రావంబున మలసి మలసి
రదకుందకుట్మలరాజిత సద్గంధ
బంధురోన్నతిజాల ప్రబలి ప్రబలి

మధురాధరాధరమహనీయతర సుధా
మాధుర్యరసమున మరగి మరగి
దరహాసచంద్రికా సరససన్మృదుయుక్త
ఘనశీతలంబున మునిగి మునిగి

తే॥ మఱియు సత్త్వాంబు వర్ధితమానసాబ్జ
రాగమకరందరసబంధురప్రవాహ
బహులకేళీ విలాస సంపదల బొదలి
పొలుచు విరిబోణి పలుకులు పొగడ దరమె 257

అర్థాలు : సత్‌గళనాళ= మంచి గొంతు అనెడి క్రోవి, కలకంఠ= కోయిల, రదకుంద కుట్మల= సగము విరిసిన మల్లె మొగ్గల వంటి పండ్ల వరుస, అధర అధర= క్రింది పెదవి, అంబు= నీరు, రాగ= అనురాగము

భావము : "చక్కని గొంతు అనెడి క్రోవి నుండి కోకిల కూజితములను వినుటచే పొందిన ఆనందముచే వెల్వడిన సుస్వనము కలవైన (పలుకులు). సగము విరిసిన మొల్ల మొగ్గలవలె పండ్ల వరుసల సొంపుచే తాంబూలముచే మేలైన సువాసనల అతిశయముచే బాగుగా నిండినవై (పలుకులు) తియ్యనైన క్రింది పెదవి స్పర్శచే నోటిలోని రుచిగల నీటిని పెక్కుసార్లు ఆస్వాదించుటచే పలుకులు. చిఱునవ్వులు అనెడి వెన్నెల జడిచే చక్కగా మెత్తనివై కాంతులతో కూడి, వాని చల్లదనమందు పలుసార్లు మునుగుచున్నవై సత్త్వగుణము అనెడి నీటిలో పుట్టినవై మనస్సు అనెడి పద్మమందు, అనురాగమనెడి తేనె యొక్క ప్రవాహముతో, పెక్కు ఆటల విలాసముల అతిశయములతో, పరవశించి కన్పట్టు ఆ పూవుబోడి పలుకులను పొగడుటకు సాధ్యమా?"

సీ॥ రుచులు గైకొనుగాని రూఢిగా బవడంబు
మృదువు గైకొనుటకు నొదగదయ్యె
రుచియు మృదువును గల్గి ప్రచురమై చిగురాకు
మధురిమ దాల్పక మట్టుకొనియె

రుచిమృదుమధురత రుజువయ్యు బింబంబు
మతి విచక్షణ దగి మలయదయ్యె
రుచి మృదుమధుర మతి చర రసాయనం
బాకృతి బలుచన గాకపోయె

తే॥ అహహ సుందరి మధురాధరంబునకును
బోల్ప నింకొక్క వస్తువు భూమి గల్ప
నంబుసేయగ బ్రహ్మవశంబె యెందు
కలవు గుణముల న్నియును నిక్కంబుగాను 258

అర్థాలు : చరము= కదలునది

ఫవడము : కాంతిని స్వీకరించును. కాని పవడము గట్టిది. మెత్తదనము లేదు. దానిని పొందుటకు తగిన నేర్పులేని దయ్యెను.

చిగురాకు : కాంతి మృదుత్వము కలది. కాని, తియ్యదనము లేదు. దానిని పొందుటకు అర్హత లేని దయ్యెను.(అడగిపోయినది)

దొండపండు (బింబము) : కాంతి, మృదుత్వము, తియ్యదనమును కలది. కాని రుచుల వ్యత్యాసమును గ్రహించు తెలివిలేనిది. వానిని పొందుటకు యోగ్యత లేనిదయ్యెను.

రసాయనము : (ఔషధము-ద్రవము. రోగమును పొగొట్టుమందు) కాంతిని, మెత్తనను, తియ్యనను, మతిని కలది. కాని కదలుచుండు స్వభావము కలది. కదలని పై గుణములను పొందుటకు తగిన పలుచనైన ఉనికి లేనిదయ్యెను.

ఆహాహా! ఆ సుందరి మధురమైన క్రింది పెదవితో పోల్చుటకు అన్ని గుణములున్న మఱొక వస్తువును సృష్టించుటకు బ్రహ్మకు వశమా! ఆ గుణములన్నియు నిక్కముగా ఒక్కచో ఎచట ఉన్నవి?(ఆమె పెదవిలోకాక)

శా॥ ఆటల్ సేయుచు నింద్రియ వ్రజము నాయాజ్ఞన్ గడం ద్రోచె నె
ప్పాటన్ బాల్యపునాటివాడనుచు లేబ్రాయంపు విశ్వాసి బల్
మేటౌ మన్మథుడంప నంగపురిం బాళిం జేరి నిల్పెం గదా
కోటేరన్నటు నాస యొప్పె సతికిన్ గోర్కెల్ విడంబింపగన్ 259

అర్థాలు : ఇంద్రియవ్రజము= మనస్సు, కన్నులు, చెవులు, నాలుక, శరీరము (స్పర్శ) ముక్కు మొదలగు, విశ్వాసి= విశ్వాసము కలవాడు, శ్వాసక్రియ లేక జీవించువాడు మదనుడు

భావము : ఆటలాడుచుండగా, ఇంద్రియములన్నియు తన, మాటలను తిరస్కరించుచున్నవని, మదనునిచే పంపబడిన రతిదేవియే, (వసంతుడు) లేత వయసులో చెలికాడు, నమ్మకము కలవాడు, ఆ కాంత మేలైన శరీరమును వలచి, ఆసక్తితో అందు నగ్నముగా నిలచిన "కోటరి" వలె నాగలి రూపమున నున్న సంపెంగ పూవుగా చూపుల కోర్కెలను అతిశయింప చేయుచు ఆ సతి యందు, ఆమె నాన (ముక్కు) ఘ్రాణేంద్రియము అందమై గోచరించెను.

విశేషము : ముఖమందు, ముందు ముక్కు ముఖ్యమై ముచ్చటగా కన్పట్టును. దానిని నగ్న స్త్రీగా కవి భావించి మఱియును నాగేటి వలె ఉన్నదనియు వర్ణించినారు. ఇది అద్భుతమైన విశిష్టమైన కల్పన.

ఆ॥ నిండుజందురుండు నెమ్మోము సరిబోల
బోల రెండు ఖండములుగ జేసి
బడసి రెండు గడల బడవైవ చెక్కులై
యాశ్రయించె ముఖకళాభిలాష 260

భావము : పూర్ణచంద్రుడు, పూర్ణబింబము కలవాడు. ఆ మోహిని ముఖకాంతులతో తానును సమానమైన శోభను పొందవలెను అనెడి కోర్కెతో తన్ను రెండు సగభాగములుగా చేసికొని, ఆమె రెండు చెక్కిళ్లను ఆశ్రయించి తృప్తిచెందెను.

విశేషము : ఆమె చెక్కిళ్ళు చంద్రకాంతిని వెల్వరించు చున్నవని భావము

సీ॥ కలువరేకులు జిగిచెలువంబుగనెగాని
బెళుకువహింపంగ దెలియవయ్యె
క్రొవ్వాడితనము గైకొనె మారు శరములు
తళుకు బిత్తరమును గొల్పదయ్యె
తళుకు బిత్తరమును దాల్చెగాని మెఱుంగు
నీలంపుచకచకల్ నేరదయ్యె
బెళుకు నేరిచెగాని బేడిసమీలెందు
క్రొవ్వాడితనము గైకొనగలేదె!

తే॥ చెలువమును బెళ్కు క్రొవ్వాడితళుకుదనము
చాకచక్యంబు నెలవును చంచలంబు
బిత్తరంబును గల్గిన బిసరుహాక్షి
వాలుగన్నుల సరిబోల్ప వసుధ గలదె **261**

అర్థాలు : చెలువము= అందము, బెళుకు= ఒయ్యారము, క్రొవ్వాడితనము= తీవ్రత, తళుకుబిత్తరము= తళతళ చలనము, నీలివర్ణంపు చకచకల్= నీలివన్నె యొక్క నేర్పరితనము.

భావము : కలువరేకుల కాంతి, అందమైనదే కాని, అది ఆమె ఒయ్యారమును (చక్కని కదలిక) గ్రహింపలేకపోయినది. మదనుని బాణాలు ఆమె తీవ్రమైన కాంతిని పొందకల్గెను, కాని ఆమె తళతళల చలనమును సేవింప లేకపోయినది. మెఱుపుతీగలు ఆమె తళతళల చలనమును ధరించినవి. కాని ఆమె నీలివన్నెల మేలైన నిగనిగను నేర్వలేదు.

బేడిసచేపలు ఆమె ఒయ్యారమును నేర్చినవి కాని, ఆమె తీవ్రమైన వాడిమిని పొందలేని వైనవి. అందము, ఒయ్యారము, తీవ్రత, తళతళ, నేర్పరితనము యొక్క నిలుకడ చలించు బెదురురీతి, ఇవన్నియు కల్గిన ఆ

కమలముల వంటి వెడల్పైన, వంకరలై యున్న కన్నులతో పోల్చుటకు ఏదియను పుడమిలో లేదు. ఇది ఆశ్చర్యము.

తే॥ బొమలకును సింగణీవిండ్లబోటి చేసి
యెక్కువెట్టిన బిగువుచే నేపు చూపు
తమకు నక్కఱ దీర స్వధర్మ మరసి
గుణము విడుపింప వెనకకు కుదిసిపోవు **262**

భావము : ఆమె కనుబొమ్మల వలె నుండుటకై సింగిణీవిండ్లను (విలాసవంతములైనవి) పోటీకై బాణములను తొడిగి ఎక్కుపెట్టినపుడు, అవి వాని అందమును (ఏపు అతిశయమును) చక్కగా చూపును. అవి తమ ధర్మమును ఎఱుగుటచే అల్లెత్రాటి నుండి బాణమును విడిచిన వెంటనే, తాము పూర్వము మాదిరి, కుదిసి తృప్తిపడినవి.

క॥ శ్రీకారము లక్షర సు
శ్రీకరరేఖాకృతులును జెన్నువహింపన్
చేకూరె శ్రుతి విలాసం
బాకలికి కటాక్ష దృష్టి నండగొనంగన్ **263**

భావము : ఆమె చెవులు, ''శ్రీ'' అనెడి అక్షరముల వలె చక్కగా అమరియున్నవి. ''శ్రుతి'' అనగా చెవి వేదము'' అనెడి అర్థములు గల పదము.

వేదములను వినుటచే, మంగళకరములైన ఆకారములను, వంపుల సొగసుల విలాసములతో కడగంటి చూపుల కలయికతో, ఆమె చెవులు చెన్నుగ (చక్కగా) చెలగుచు మెఱసినవి.

విశేషము : మోహిని చెవులు వేదముల రూపము కలవై యుండుననుటచే ఋషుల ఋక్కుల ప్రభావమును ప్రదర్శించు చున్నవని కవి చమత్కారము.

క॥ అరబింబమగుచు నాకృతి
సరియై జిగి చాలకున్న సత్కళనెంచున్
మఱి యురువై నుదుటికి దా
సరిరా బోదీ వదనము చందురు డహహా 264

భావము : అరబింబమగుచు చంద్రుడు, ఆమె నొసటి ఆకారమునకు సరిగానున్నను అందుగల "జిగిజిగి" తో సరిగాక, దానివలె నుండుటకు చక్కని జిగిజిగిని చక్కని కళను (కాంతిని) పొందుటకు ప్రయత్నించును. ఆహా! ఆమె నుదుటికే చంద్రుని సగభాగమే సమానము కాదు. అట్టి మోము కలదై మోహిని కన్పట్టెను.చంద్రుడు ఎట్లు ఆమె ముఖమునకు సరియగును?

సీ॥ ఎట్టివేళల కళాహీనుండుగాకున్న
తమ్ములపై కాకదార్చకున్న
ప్రకటమైన నిశాచరత్వంబు లేకున్న
పాంథ హింసాప్తి చేబడకయున్న
సొలసి చక్రంబుల జోడు వాపకయున్న
మృదుఛాయ వేల్పులు మ్రింగకున్న
విషరాశిలోన నావిర్భవింపకయున్న
క్రూరాహి విషమున గూడకున్న

తే॥ కుతుకమొక్కింత డెందంబు గుదియకున్న
లోకములయందు జననింద లేకయున్న
చందమామను నొక్కింత సాటి సేయ
వచ్చు గాబోలు ఈ భామవదనమునకు 265

భావము : కొన్నిరోజులు తన కాంతులను కోల్పోకయున్నచో తామరపూవులపై తన కాకను (వేడిమిని) చూపకున్నచో రాత్రులందు స్పష్టముగా సంచారము చేయకున్నచో (చోరులవలె), రాత్రులలో బాటసారులను, తనవెన్నెలచే విరహ

వేదనను కల్గించి తాపమును కల్గింకున్నచో, అలసిపోయిన చక్రవాక పక్షుల జంటలను విడదీయకున్నచో తన మెత్తని కాంతులచే దేవతలను మైమఱచున్నట్లు చేయకున్నచో, విషము(విషము జలమునీరు) వెల్వడిన జలధిలో పుట్టుక లేక యున్నచో క్రూరులైన రాహుకేతువులు మ్రింగుటచే, వారి విషము సోకకున్నచో వంచన కొంచెము ఎదలో చేరకున్నచో (గురుద్రోహి) లోకాలలో జనుల తిట్లు పొందకున్నచో (చంద్రుని మదన తాపముచే, పలువురు దూషింతురు) ఆ మోహిని మోముతో సాటి యగునని పోల్చవచ్చును. ఇన్ని దోషముల పుట్ట చంద్రుడు ఆమె ముఖముతో పోల్చుటకు ఏవిధముగా చూచినను తగడు.

సీ॥ నీలంపు సరులు దా రాలగట్టిన రాలు
తుమ్మెదల్ గీపెట్టి దిమ్మదిరుగు
చీకటిబట్టంగ చేతి కందకపోవు
జలధరంబులు వెలవెలగ బారు
నల్లగలువలు నీట వెళ్లక ముదమున
కేకిపింఛంబు లీకెలు గణింప
కాటుక చేనంట కడు జిడ్డుకొనునెందు
కాలసర్పము విషకలిత మరయ

తే॥ తరుణినును సోకు కుటిలకుంతలములకును
ఈడు జోడు సరిసాటి యింపుసొంపు
కలిమిబల్మిని నెందైన గాననగునె
కల్పములకైన మూడు లోకములయందు 266

భావము : ఇంద్రనీలమణులను దారాలలో కట్టినప్పుడు ఆ సరముల నుండి అవి రాలిపోవును (ఆమె వెంట్రుకల నల్లనను చూచి, చింతతో బాధపడునని భావము)

తుమ్మెదలు, వెంట్రుకల నల్లదనము చూచి సంతోషముతో, వాని చుట్టును మైమఱచి తిరుగును. చీకటియే, కురుల నల్లనను పట్టుకొనుటకు ప్రయత్నింపగా దాని చేతులకు వశము కాలేదు. నల్లని మబ్బులు కూడా, ఆ నల్లనను చూచి తాము దిగులు చెంది, తమ వన్నెను కోల్పోయి, తెల్లదనమును పొందుచున్నవి. నల్ల కలువలు మోహిని నల్లని కురులను చూచి సంతోషముతో నీటిలోనికి పోక, నెమలిఈకెల నీలిమగొప్పదా లేక మోహిని కురుల నల్లన గొప్పదా అని పరిశీలించుచున్నవి. కాటుకను తాకినచో దానికిగల జిడ్డు చేతికి అంటుకొనును. ఆమె కుంతలములు ఆ దోషము లేనివి. నల్లని త్రాచు పాము, నల్లదైనను, దానిలో విషమున్నది. ఆ నల్లన మెచ్చుకొనుటకు తగనిది. ఆ యౌవనవతి మృదుత్వము గల వంకరలైన వెంట్రుకలు సమానములైనవి, జతగానుండ దగినవి, ఇష్టమైనవి, ముచ్చటైనవి, ఎచ్చటనైనను, వేర్వేరు యుగములందు మూడు లోకాలలో చూచుటకు ఉన్నవా? అట్టి అందమైన కురులు లేవని భావము

తే॥ కంధరంబున కుత్తుక గదిసి పట్టి
క్రమ్మగ పయోధరములను కుమ్ము దొడగి
తుదను వెల్వెలబారెను తోయదములు
కచభరంబున సరిబోల గలుగునెట్లు **267**

అర్థాలు : పయోధరము= మబ్బు, పాలిండ్లు, కంధరము= మెడ

భావము : ఆమె మెడయందు గల గొంతుకు దగ్గఱ నుండి పట్టుకొని, ఆక్రమించుచు, చన్నులను కుమ్ముచు నల్లని మబ్బులు ఆమె జడ యందు గల నల్లదనమును చూచి, నీరసించి తమ నల్లనను కోల్పోయినవి.

మోహిని జుట్టున (జడను, వెంట్రుకలముడి) గల నల్లదనమును పోలినది ఏదియులేదు.

సీ॥ చిగురులు తాబేళ్లు జిగిమణుల్ కాలికల్
కదళులు దరి నింగి నదము ఫణియు
తరగలు తలమును గిరులు దోశ్లబ్జముల్
పెసరిగాయ లుడుముల్ పసిరవలును
దరము బింబంబు కుండంబులు చిల్క వె
న్నెలముకురములు శ్రీ తిలసుమంబు
తమ్ములు శరములు ధనువులు శశిరేఖ
కమలారి చీకటి కనకరుచియు

ఆ॥ రావిచిగురునయ్యె రమణి ముప్పది మూడు
చిరతరాంగకములు సేయగాను
మిగిలినవియు పిప్పి జగ దుపకారకంబు
కొఱకు ధరణి నసగ కొమ్మ బొలిచె **268**

ఉపమానములు	**ఉపమేయములు**
1. చిగురులు	చేతులుకాళ్లు
2. తాబేళ్లు	మీగాళ్లు (కాళ్ల పైభాగములు)
3. జిగిమణులు (నీలిమణులు)	వ్రేళ్ల కాంతులు
4. శాలికలు (వరిపైరు)	జంఘలు
5. కదళులు	తొడలు
6. దరి(గుహ)	బిలము కలది-నాభి
7. నింగి (ఆకాశము)	నడుము
8. నదము (పడమటి దిక్కునకు ప్రవహించునది)	శరీరము 9
9. ఫణి (నీలాహి)	జడముడి (నల్లత్రాచు)
10. తరగలు	వళ్లి (ముడుతలు)
11. తలము(తాటి)	నిడుపైనజడ

12. గిరులు	కుచములు
13. తోళ్లు(టెక్కెములు)	చెక్కిళ్లు
14. అబ్దములు(నల్లని కలువ)	కన్నులతళుకు
15. పెసరగాయలు	వ్రేళ్లు
16. ఉడుములు	పిఱుదులు
17. పసిరవలు (లేత వజ్రముల)	కొనగోళ్లు
18. దరము(శంఖము)	కంఠము
19. బింబము(దొండపండు)	క్రిందిపెదవి
20. కుందంబులు	పండ్లవరుసల వికాసము
21. చిల్క	పల్కులు
22. చంద్రుని కిరణాలు	నవ్వులు
23. ముకురము(అద్దము)	ముఖము
24. అక్షరము	చెవులు
25. తిల సుమము(నువ్వుపూలు)	నాసిక
26. తమ్ములు (కమలములు)	కాళ్లు, చేతులు
27. శరములు(బాణములు)	చూపులు
28. ధనువులు(విండ్లు)	కనుబొమ్మలు
29. శశిరేఖ (అర్ధచంద్రుడు)	నొసలు(నుదురు)
30. కమలారి (చంద్రుడు)	ముఖము
31. చీకటి	వేణి(జడ)
32. కనకరుచియు(బంగారువన్నె)	శరీరకాంతి
33. రావిచిగురు	పెదవులు

ఈ వస్తువులను ఉపయోగించి మోహినిని చక్కని అవయవములు చేయబడినవి. మిగిలిన పిప్పి, సారములేని ఉపకరణములు. ఆవిధముగా ధరణిలో మోహిని అనెడి అందగత్తె మెఱసెను.

సీ॥ నిలుచుండి హొయలుగా నెఱివేణి విదళింప
నీలంపు చకచకల్ నిలువుడేసి
కన్నులల్లార్చి క్రీగంట వీక్షించిన
కలువ రేకులు పెద్ద గాదెడేసి
శుకముతో ముచ్చటనొక పల్కు పల్కెనా
ఖండ చక్కెరపొళ్ళు గంపెడేసి
తళుకునెమ్మేను చిత్తరమొప్ప గుల్కెనా
నాకారు మెఱుంగులు కాగెడేసి

తే॥ చెలువ ముద్దులుగుల్కు చిఱినవ్వు నవ్వెనా!
కొదమ వెన్నెలలును గుంపెడేసి
మదచకోరనయన మలయుచు సొలయుచు
మసలు నప్పుడొదవి దెసల బర్వ **269**

భావము : నిలుచుకొని నర్తకి భంగిమలో, జడను కదలింపగా, నీలివన్నెల కాంతులు నిలువెత్తు ప్రసరించినవి.కన్నులను ఇటునటు అల్లాడ చేసి కడగంటి చూపులతో చూడగా, అవి పెద్ద కలువరేకుల నల్లన గాదెడేసి (బానెడు) వెలువడినవి.పెంపుడు చిలుకతో ముద్దుగా నొకమాట పల్కగా, తియ్యని కలకండ చక్కెర పొడులు గంపెడంత గుంపులై విస్తరించినవి.జిగిజిగి కల శరీరమును చిత్తరువులట్లు కులికినచో, మబ్బులలోని మెఱుపుతీగలు (కిరణములు) పెద్ద కాగుల నుండి ఎక్కువగా మెఱసినవి. ఆ అందగత్తె ముద్దులు చిందించు చిఱునవ్వులను కురిసెనా లేత వెన్నెల వన్నెలు గుంపులు మతిని మించును. మదించిన చకోరపక్షుల వంటి కన్నులు గల ఆ చలపలాక్షి అటుఇటు వంగుచు, పొంగుచు నడచుచుండగా, నాలుగుదెసలందు జడల నీలికాంతులు, చూపుల కలువరేకుల నల్లన పల్కుల తియ్యన మేని మెఱుపులు, నవ్వుల వెన్నెలు వ్యాపించినవి.

వ॥ అని వర్ణింపుచు తదేక ధ్యానంబున నమ్మోహనాంగియవయవంబులు
చింతింపుచు నిట్టులనియె 270

భావము : అని ఆమెను వర్ణించుచు ఆమె యందు మనసు కలిగి ఆ మోహనాంగి అవయములనే చింతింపుచు ఇట్లు పల్కెను.

సీ॥ తూపులో కలువలయేపులో నీలంపు
శోచులో చెలి బెళ్కు చూపులొక్కొ
తూతులో తగు తేనె తేటలో రతివీణె
పాటలో చెలి ముద్దు మాటలొక్కొ
టెక్కులో యపరంజినక్కులో కపురంబు
చెక్కలో తరుణినున్ జెక్కులొక్కొ
నీలమో నవ్యశైవాలమో చీకటి
కాళియో సతి కచజాలమొక్కొ

తే॥ బింబమో సతియధరోష్ఠబింబమొక్కొ
తమ్ములో మోహనాంగి పదమ్ములొక్కొ
తెలియరాదంచు మది నెంచు ధృతిని డిందు
తమకమున మించు చరియంచు తత్తరించు 271

భావము : చూపులు : బాణములా? కలువపూల విరిసిన వికాసమా? నీలి వన్నెలా? ఆ చెలి చలింపు చూపులు ఎట్టివో?

మాటలు : పిల్ల గ్రోవిరవమా?(తూతు పిల్లనగ్రోవి) తేనెల తేటలా? రతీదేవి వీణెల రవళియా? ఆ చెలిముద్దు మాటలు ఎట్టివో?

చెక్కిళ్లు : మదనుని ధ్వజమందలి పతాకములా? శుద్ధమైన బంగారు బిళ్లలా? కర్పూరపు చెక్కలా? ఆమె మృదువైన చెక్కిళ్లు ఎట్టివో?

జడలవెంట్రుకలు : నీలమణియా? నవ్యమైన నాచుతీగయా? నల్లని త్రాచుపామా? ఆ సతి వెంట్రుకల సమూహము ఎట్టిదో?

క్రిందిపెదవి : గుండ్రని క్రిందిపెదవి దొండపండా ఏమి?

పాదములు : మోహనాంగి పాదములు తామరపువ్వులా ఏమి? తెలియదయ్యెను కదా అని మదిలో తలచి నిలుకడ తొలిగ మించెడి మోహమున క్రుంగుచు, చలించుచు తొట్రుపాటు చెందును.

సీ॥ అట్టట్టు గదల నియ్యవుగదా తరళాక్షి
తరుణ దృక్పాశ బంధములు మదిని
మఱవ నియ్యవుగదా మహనీయనతనాభి
చేష్టాతరంగముల్ చెలువచూపు
నిలువ నియ్యవుగదా నీలాహిరోమాళి
తనువల్లిరుచులాత్మ ధైర్యగరిమ
తెలియనియ్యవుగదా త్రిభువనమోహినీ
సౌందర్య మితరవాంఛల నొకింత

తే॥ ఎట్లుతాళగవచ్చు నీ యిందు వదన
సరస కరుణాకటాక్షవీక్షణలవంబు
నన్ను జెందక నిమిష మెన్నంగ కల్ప
మగుచునున్నది మరుమాయ మిగుల గమ్మి 272

భావము : ఆమె చలించు కోమలములైన చూపులనెడి త్రాళ్లు కట్టివేసినవి. నేను అలసిపోవుటచే కదలలేక ఉన్నాను.ఆమె చెలువ చూపెడి లోతైన గొప్పదైన తనువనెడి తీగపై గల ముడుతలు అనెడి అలల కదలికలు మఱచిపోలేక ఉన్నాను.ఆమె నల్లనైన బొడ్డుపైగల నల్లని త్రాచువంటి వెంట్రుకల వరుసలు నామనస్సు యొక్క నిలుకడను నిల్పుకొనుటకు అవకాశము ఇచ్చుటలేదు.మూడులోకాలను పరవశింప చేయు ఆమె సౌందర్యము ఇతరములైన కోరికలను కొంచెమైనను తెలిసికొన నీయక నన్ను వశము చేసికొన్నవి. ఈ విరహ వేదనను ఎటు సహింవ గలను? ఆ చంద్రవదన

దయతో కూడిన చూపు కొంచెమైనను, కొంతకాలమైనను పొందనిచో ఆ క్షణకాలము మదనుని మాయచే, ఒక యుగము వలెనున్నదే! ఏమి చేయగలను అని చింతించెను.

వ॥ అని వితర్కింపుచున్న సమయంబున 273

భావము : అని తనలో తాను శివుడు తర్కించుకొనుచున్న ఆ సమయ మందు,

సీ॥ నీటుముత్తెము లలాటపట్టిక గోలె
నిటలంబు శ్రమ బిందుపటలి నెఱయ
గండభాగద్యుతుల్ కుండలచ్ఛవిగమ్మి
తండ తండంబులై తాండవింప
కటి కుచ భార సంకటపటుదైన్యత
గిట గిట గౌను ఝుంకించి వణక
కుచకుంభశోభిత కుంకుమాచ్ఛాదిత
ఘనతారహారముల్ గునిసి యాడ

తే॥ కలిత కరకంకణధ్వనుల్ కలయ బర్వ
కేలికాకందుకాద్భుతఖేలనోత్సు
కాభిముఖమానసాంభోజయగుచు దమిని
పైట సవరించ నెఱుగని భామ గనియె 274

భావము : ఆ మోహిని నుదురు, స్వచ్ఛములైన తెల్లని ముత్యాల పట్టికను అమర్చినట్లు, చెమట నీటి బిందువులతో మెఱయగా,ఆమె చెక్కిళ్ల యందు గల కాంతులు, చెవిపోగులలో గల కిరణములచే కలసి మెలసి గుంపులు గుంపులుగా నటనలు చేయగా, ఆమె నడుము, చన్నుల భారముచే బాధపడుచు, బలహీనమై కృశించుచు చలించుచు వణకుచుండగాపాలిండ్ల శోభతో కుంకుమపూతలు, నక్షత్రముల వంటి ముత్యాలహారములు

కులుకుచు నృత్యము చేయగా చేతిని అలంకరించిన కంకణముల(గాజుల) ధ్వనులు అంతటను ప్రసరించుచుండగా, కందుక క్రీడయందు అచ్చెరువు కలుగునట్లు ఆట్లాడి, ఉత్సాహము గల కమలము వంటి మనస్సుతో, మిక్కిలి ఆసక్తి కలదై జాఱినపైట చెంగును సవరించుకొనని మోహిని కుచములను శివుడు చూచెను.

వ॥ ఇట్లు కందుక క్రీడా విచక్షణదక్షత నుభయపక్షంబులుం దానయై సాక్షిగామున్ను ప్రార్థించ సాక్షాత్కరించిన యిక్షు కోదండకాయంబుచందంబున తమకు దాపొర వెడలి పొరి బొరి గ్రుమ్మరిలు ఏడాకుటనటుల మొదళ్ల దిన్ననై యున్న యున్నతంబు సన్నకప్పురంపు తిన్నెపై చెన్నగుపుప్పొడి తిప్ప నడు చక్కి కడునుడుపతిరేఖ యొడికంబునం గళల గడు విడంబించు నూతన కేతకీదళంబు నుపలక్షింపుచు తత్క్రమా క్రమచక్రంమణహతి హత చతురతర సంఖ్యానంబు లుభయ పార్శ్వంబుల లిఖియింపుచు హస్తతలావనీతల మధ్యోద్బంధ కందుకంబునకు శంబర వైరి కుశలంబున నిడిన విప్రసూత్రంబునకు నద్భుతంబంది శుకపికశారికా నికరంబులు కలకలధ్వనుల నలరి వినుతించు చందంబునం గ్రందుకొని మాకందదారు మందార ముఖ తరు బృందాగ్రంబులం బలుక నిజకరతల ఘట్టన వేగంబున చేతప్పి కడంబడిన వడి చప్పుడున బెదరి బెదరి గుప్పున లేచు నప్పులుగు గమి రమణీయ నినదంబు తన తప్పునకుంగా చప్పటలిడుచు ఘొల్లున నవ్విన క్రియ దోప తెల్లనైన యాననపుల్లాంబుజంబున తమకంబు ప్రకాశంబుగా దిగ్గన లేచి కందుకం బందుకొనుటకు మందయానంబున జనుచు నరవింద కుముద కల్హారముఖ కుసుమ పరిమళ మిళితంబును కలహంస కలకంఠ చక్రవాక బలాకసారస టిట్టిభ లోక ముఖ జలవిహంగవిహరణ విరాజమానంబును చంపక కర వీరపున్నాగ పాటలి కుందమందార ముఖతరుశిఖరాచ్ఛాదిత మాధవీ మల్లికావికాసమాన నిధ్యాన వన తరుశాఖా విగళితలలితబహు విధ విచిత్ర వర్ణ కుసుమ విసరనవరత్న నిర్మితరంగ వల్లికా తటపటు సైకత ప్రదేశంబును

నగునమృత సరసి దరుల నరయుచు పదపల్లవంబుల ఘళ్లు ఘల్లన కనక మణి ఖచిత మంజీరమంజురంజితా రావంబులకు నిజ కేలికాకలహంసగము లరయుచు మరుముక్కునం బొక్కు బొక్కున నటించుచు వెంటనంటి గెంటని మమతలంగూడి రా మణి ఘటికాఘణం ఘణలు మద గజ పదగమన ప్రకాశ మాన ఘంటికారావంబుల నేవగింప పుడమిని కొండలను జతగట్టి కమల భవనాటకుండు భ్రమర రూపంబున దిగంగనలు వెఱగు కనుంగొన భ్రమయించు పూనిక కౌనుదీగ యల్లలనాడ విరహమృగ సంగ్రహణ కౌతూహల మదన ఖేటక నిబద్ధ యౌవన వన వాటికాంతర నిర్మిత భృంగ పక్షమాలికా ప్రకాశ మాన రోమరాజి తేజరిల్ల కుచకుంభ కుంకుమ మృగాంక పంక సంకలిత ముక్తాహారంబులు పయ్యెదగీము తెరవాకిలిగా నిడి పాంథజనమానసఖగంబులు చేర చిక్కని గుబ్బజక్కవలం గట్టిన విలంబమానసూత్రంబుల చందంబున గునిసియాడ మణిఘృణి పరిశోభిత కనత్కనక నిరుపమ కంకణఝుణఝుణ నినాదంబు లంబమాన కచ భార నీరదాంగ జనిత మానసోత్సుక కేంకృతులన మొనసి మొరయు సుందర వదనారవింద గంధ బంధుర కళా మకరంద పానానంద జిత మదవదిందిందిర సందోహంబును నందంద కెందలిరాకు కేలం దలగ విసరుచు నిటల తటంబునం బటు ముత్తియంబుల నటన గను పట్టునిర్మల ఘర్మజల కణంబులు నీటు కొనగోటం జిటుక్కునం గడబార మీటుచు కందుకం బరయు చందంబున సుందర నయనేందీవరంబు లల్లార్చి వ్రేలన నల్లగల్వరేకులు వెదచల్లుచు మండితగండ ప్రచండదీధితు లొండొండ కుండలచ్ఛాయల మీద గండు మిగిలి మెండుకొని తాండవింప గంధబంధుర దివ్య కుసుమ మాలికాలంకృత గళిత వేణీ భరంబునుం జక్క దురుముచు కుంకుమపంకాలంకరణమకరికాపత్ర పరిశోభి తోత్తుంగంబులగు మెఱుంగు చనుంగవ పయ్యెద సవరించ నెఱింగియు నెఱుంగని యంతరంగంబున నుప్పొంగు తమింగను పట్ట నెట్టకేలకు కేలం గీలింపుచు తడవులకు విడివడి నడయాడు పదనిగళ నినదంబును బ్రక్కలనుక్కు మీరి పెక్కు మొరయు ఘంటానాదంబులు పెనగొన గొదగొని తిరుగు మదనుని మదగజంబు విధంబున

విహరించు బింబాధరి వెంబడింబడి కడలుకొని చిడిముడి నుడుప నెడలేని తమకంబున నంబికానాథుండు భరంబైన మోహసంరంభంబునం బఱతెంచు సమయంబున **275**

భావము : ఇట్లు బంతి యాటను పరిశీలించు నేర్పుతో రెండు పక్షంబులును తానే అగుచు సాక్షిగా ముందే కోరగా వచ్చిన మదనుని ఆయుధముల వలె పొరలు క్రమక్రమముగా వెల్వడ చేయుచున్న ఏడాకు అరటిచెట్ల మొదళ్లలో మనోహరములై చక్కగా నుండు మేలైన పలుచని కర్పూరపు అరుగులపై, అందముగా అమరియున్న పూవుల పొడి చిన్న ప్రోగుల(తిప్ప), నడిమిచోట, మిక్కుటమైన చంద్రుని వెన్నెలవంటి ఆ కాంతులను అతిశయంబుగా అనుకరించుచు, క్రొత్తవైన మొగలిరేకులను చక్కగా చూచుచు వానితీరును ఆక్రమించుటకై దుముకుచు దూకుడుచే కొట్టబడిన రమ్యములైన ప్రక్కలను తానే కల్పించుకొనుచు బంతిని తన చేతులతో క్రిందికి పైకి ఎత్తి వేయుచు పట్టుకొనుచు మదనుడు మధ్యలో పెట్టిన తీగల సరాలను జల్లెడ వంటి త్రాడునకు ఆశ్చర్యపడి చిలుక, కోకిల గోరువంక మొదలగు పక్షుల మధురధ్వనులతో సంతసించుచు వానిని పొగడునట్లు అతిశయించి (క్రందుకొని) మాకంద (మామిడి) దారు (దేవదారు) మందార (బాడిస) మొదలైన వృక్షముల మొత్తము యొక్క ఎత్తైన పైనున్న కొనలయందుండి కూయుచుండగా, తన చేతులో కొట్టబడిన వేగంబున, చేతినుండి తప్పి దూరముగా పడిన శబ్దముచే బెదరిపోయి తటాలున లేచు, ఆ పులుగుల (చిలుక, కోకిల, గోరువంక) ఇంపైన స్వనముల తన తప్పునకు గాను అవి చప్పటలు చేయుచు ఘొల్లున నవ్వినట్లు తోపగా బాగా తెల్లనైన కమలముల వంటి ముఖముచే తన ఆట యందలి ఆసక్తి స్పష్టముగా తెలియు విధమున వెన్వెంటనే లేచి బంతిని అందుకొనుటకై మెల్లగా నడచిపోవుచు (ఎఱ్ఱని) కమలము, కలువ (నలుపు, ఎఱుపు, తెలుపు గల కలువ) మొదలైన సుమముల సువాసనల కలిసినట్టియు, రాజహంసలు కోకిలలు,

పావురములు, జక్కవలు పెద్ద కొక్కెరలు (కొంగలు) బెగ్గురు (చిన్న కొంగలు) చెకుముకి పక్షుల తుమ్మెదల తిరుగుళ్లచే వెలుగుచున్నవియును, సంపంగి, గన్నేరు సురపొన్న కలిగొట్టు,మల్లి, బాడిస మొదలైన చెట్ల పైభాగములచే కప్పబడిన గురువింద మల్లియ తీగల పెంపుచే కన్పట్టుచున్న వనమందలి చెట్లకొమ్మల నుండి జాఱిపడుచున్న లేతయై మృదువులై మనోహరములైన పెక్కు రకములైన అచ్చెరువు కొల్పు వన్నెలు గల పువ్వుల గుత్తులతో తొమ్మిది రకాల రత్నములతో కట్టబడిన ముత్యాల వరుసల నెలవుల వలె గట్టివైన ఇసుకనేలలు కల తెల్లనైన సరస్సుల ఒడ్డులను వెదకుచు చిగుళ్ళ వంటి పాదములు గజ్జెలు ఘల్లుఘల్లని ధ్వనించుచుండగా, బంగారు మణులను కూర్చిన అందియల మెత్తనివై ఇంపుగా పులకరింప జేయుచున్న స్వరంబులతో తనతో రాజహంసల మొత్తములు ఉప్పొంగుచుండగా(సంతసముతో) కులుకుచు ముక్కుతో పొక్కుచు నడయాడుచు వెంటపడి, వీడలేని అనురాగముతో తన వెనుకరాగా తన్నుకూడి, చిఱుగంటల ఘణఘణ ధ్వనులు మత్తగజ పదగమనముల పెద్దఘంటల శబ్దాలను నిరసింపగా, పుడమి కొండల జతచేసి బ్రహ్మ అనెడి నటుడు తానే తుమ్మెద రూపమును ధరించి, దిక్పాలకుల సతులు ఆశ్చర్యపడి చూచు విధమున భ్రమరింప చేయుచు తీగవంటి నడుము చక్కని సడలికలతో కదలాడుచుండగా విరహము చెంది విహరించు మృగాలను ఆకర్షించు శక్తి కుతూహలము గల మదనుని డాలు (పలక) చే బద్ధమైన (కట్టబడిన) క్రొత్తవైన లేతవైన చెట్లగుంపుల పొదల నడుమ కట్టబడిన తుమ్మెద రెక్కల వంటి నల్లనతో ప్రకాశించు వెంట్రుకలు తేజోవంతములై నూగారుతో సన్నని నడుము అందముగా నుండగా కుండల వంటి పాలిండ్లు కుంకుమ చందనపు తడితో కూడి ముత్యాల సరాలు పయ్యెదనెడి ఇంటి (గీము), ముందుండి తెఱచుకొను వాకిలి తలుపువలె నుండి బాటసారుల మనస్సులనే పక్షులు చేరుటకైన గుబ్బల జక్కవలతో కట్టిన వ్రేలాడు దారాలవలె కునుకుచు తూగాడు చుండగా మణుల కాంతులతో వెలుగుచున్న చలించు బంగారు

చేతి అందియల ఝణఝణ ధ్వనులు, కదలుచున్న జడల మబ్బుల రాకతో మానసమందు కల్గిన ఉబ్బుతో చేయు క్రేంకారములుగా ధ్వనించుచున్న అందమైన నోళ్లతో వాసనలతో నిండిన తామర పువ్వుల రేకుల నుండి (కళల కాంతులతో అలరి, అందుండి) తేనెను క్రోలుచు ప్రకాశించు మదించిన తేనెటీగల మొత్తమును కలదై అచ్చటచ్చట ఎఱ్ఱని చిగురుటాకులను చేతులతో పట్టుకొని విలాసముగా త్రిప్పుచు నొసటిపై అంతటను మేలైన ముత్యాల నర్తనము కన్పట్టు శుద్ధమైన చెమట నీటి తుంపరలు చక్కగా కొనగోటితో తటాలున తొలగించుచు సవరించుచు, బంతిని వెదకునట్లు అందమైన, నల్లనైన కలువల వంటి కళ్లను కదలించుచు వేలితో పట్టుకొన్న నల్ల కలువరేకులను చల్లుచు వెలుగుచున్న చెక్కిళ్ల వాడిమి గల వెలుగులు క్రమక్రమముగా చెవిపోగుల కాంతులు అతిశయించి నిండినవై తాండవ నృత్యము కావింపగా సువాసనలతో కూడిన అతిశ్రేష్ఠములైన అలంకరింపబడిన జాఱిన పూలున్న జడల పూవుల దండనుండి జడల బరువును సరిచేయుచు కుంకుమ తడితో అలంకరణమై యున్న మొసలిరూపు ఆకులతో శోభించుచున్న ఎత్తైన మెఱయుచున్న రెండు పాలిండ్లు పైనుండు పయ్యెదను సర్దుకొనవలయునని తెలిసియు, తెలియని విధమున ఎదలో ఉప్పొంగు మోముతో చేతులు తగులునట్లు చేసికొనుచు మెల్లమెల్లగా చేతులను విడిపించుకొని నటించు విధమున నడచుచు, పాదములకు కట్టిన గొలుసుల చప్పుడులతో రెండు ప్రక్కలందు అతిశయించి ఎక్కువగా పెద్దపెద్ద గంటలు ధ్వనులు చక్కగా ప్రసరింపగా త్వరపడి ఆ మదనుని మదించిన ఏనుగు వలె విహరించుచు దొండపండు వంటి అధరము గల ఆ మోహిని వెంటపడి కామోద్రేకముతో బాగుగా తపన చెంది చెప్పుటకు వీలుకాని అత్యాసక్తితో పార్వతీపతి మోహము యొక్క తీవ్రతతో ఆమెను సమీపించు సమయమందు.

ఉ॥ చిక్కితి నిల్వు నిల్వు మును చిచ్చఱ కంటను జూచి నట్లనా
దిక్కిటు చూడు నేడు గద దేవర మార్కొన గంటి నింక నీ

వెక్కడి కేగువాడవని యేపున కోయని కేక వేయుచున్
చక్కెరవింటిజోదు కడుసాహసవృత్తి మహోగ్రమూర్తియై 276

భావము : "నిల్వుము నిల్వుము ముందు నిప్పుకంటితో (తృతీయనేత్రము) చూచినట్లు నావైపు చూడుమా, ఈ దినము కదా నిన్ను సులభముగా ఎదుర్కొను సమయము దొరికినది. ఇప్పుడు నీవెక్కడికి పోగలవు?" అని పొంగుతో "కో" అని అఱచుచు ఆ చెఱకు గడ విల్లు కలవాడు మదనుడు మిక్కిలి భయము లేని చర్యగా ఎక్కువ కోపము కలవాడై.

ఉ॥ తుమ్మెదనల్లమూక గడు దొమ్మిగ ముందర నడ్డగింప లే
కమ్ముడటంచు బంచి కలకంఠరవంబుల కంచు కొమ్ము లొ
క్కుమ్మడి మ్రోయ తెమ్మెరల కుంభి ఘటంబులబుప్పొడుల్ దుమా
రమ్ముగ గప్పగా ననిచి రాణువ నంచెల నంచెల న్చెలన్ 277

భావము : నల్లని వన్నెగల తుమ్మెద గుంపులను అతిశయించి సందడితో (దొమ్మిగా) ముందర అడ్డగించుటకై "లెండు, శివునిపై దండెత్తండని" ఆజ్ఞ యిచ్చి పంపగా, కోకిల రవములు, కంచుక్రోవులు యుద్ధవాద్యములై ఒక్కసారి మ్రోగగా, పిల్ల వాయువులచే కలిగొట్టు పూవుల మొత్తముల పుప్పొడి దట్టమై అంతటను నిండగా తన బంటులను వరుసలు వరుసలుగా పంపగా,

మ॥ ఇరువంకం గొరువంక పాఠకులు మిన్నెల్లన్ బ్రకంపింపగా
బిరుదుం బద్యము లుగ్గడింప పటుదోర్వీర్యం బవార్యంబుగా
గిరిగొ న్మీనపతాకము న్మెలసి టెక్కెంబున్ విడంబింపగా
చురుకుంజిల్క పఠాణి ఢీ యని వడిం జొచ్చెన్ మరుండుద్ధతిన్ 278

భావము : ఇరువైపుల గోరువంకలనెడి పాఠకులు (సంగీతము పాడువారు) ఆకాశమందంతయు గొప్ప ధ్వనులను నింపగా బిరుదు గల పద్యాలచే స్తోత్రములు చేయగా, భుజబలము అడ్డులేనిదిగా కాగా, అన్ని వైపుల తిరుగుచున్న పతాకములు ఱెపఱెపలాడుచుండగా వానిని అనుకరించు

వానివలె ఉత్సాహము తన్ను పోత్సహింపగా చుఱుకైన చిలుక వాహనుడు "ఢీ" అనెడి శబ్దముతో త్వరపడుచు పయనమయ్యెను.

ఉ॥ చొచ్చి బిరాన పచ్చవిలు జోడెము వెట్టి నవ ప్రవాళపున్
మెచ్చులు కోరి నారి నిడి మించి హయంబును నంటదోలి బల్
మచ్చరముల్ గడల్కొనగ మార్కొని విల్ తెగనిండ దీసి రొ
మ్ముచ్చి చనంగ నేసె కడు నుగ్రుడు జాగ్రతమాలి తూలగన్ 279

భావము : శివుడున్న ప్రదేశంబును ప్రవేశించి వడిగా వింటియందు అల్లెత్రాటిలో క్రొత్తవైన చిగుళ్లను చేర్చి పొగడ్తలను కోరినవాడై విజృంభించి తన వాహనమును శివుని సమీపమునకు పోనిచ్చి తన ద్వేషము నిండారగా శివునిపై వేయుటకు అల్లెత్రాటిని పూర్తిగా లాగి రొమ్మును చీల్చి లోనికి పోవునట్లు ప్రయోగించెను. ఆ ఉగ్రుడు జాగరూకత లేనివాడై తూలిపడెను.

ఆ॥ తూలి సొమ్మసిల్లి కూలి యాలో నింత
తెలివినొంది దిశలు కలయజూచి
ధైర్యమెడలి సిగ్గుదలగిపో తరలాక్షి
నంతనింత జార నరిగి మదిని 280

భావము : వాలిపోయి మూర్ఛిల్లి నేలపై కూలి అంతలోనే మూర్ఛనుండి తేఱుకొని తెలివి కలిగి అన్ని దిక్కులను చూచి నిలుకడ తొలగి, సిగ్గు పూర్తిగా లేనివాడై ఆ చంచలాక్షిని కొంచెము కొంచెముగా అనుసరించుచు (ఇట్లు తలచెను)

ఉ॥ ఈ నవ మోహనాంగి హృదయేశ్వరుడై సదయానురక్తుడై
మానసమున్ గరంచి పలుమాఱును మారునికేళిదేల్చి స
న్మానముతోడ నేలుకొనుమాన్యుడు ధన్యుడుగాడె నిక్కమున్
వాని తపోబలంబు తగ వర్ణనసేయ నశక్యమేరికిన్ 281

భావము : "ఆ నూతనమైన మోహింపజేయు అవయవము గల మానిని హృదయానికి ప్రభువై ఆమె దయ అనురాగముతో మనస్సును కరగించి పలుమాఱును మదనక్రీడలో పాల్గొని ఆమెను తృప్తిపరచి, గొప్ప ఆదరముతో ఆమెను పాలించు మాననీయుడు నిక్కముగా ధన్యుడే! వాని తపోబలమును వర్ణించుటకు ఎవ్వరికిని సాధ్యమగునా?"

సీ॥ సతిపతిన్యాయంబు సలుపుచు పరిచర్య
సేయ నేపుణ్యంబు జేసెనొక్కొ
అంతరంగంబిచ్చి యానుకూల్యము మది
మెలగంగ నేతపో ఫలితమొక్కొ
సరససల్లాపకౌశల విలాసముల మే
నొరయంగ నేనోము నోచెనొక్కొ
మోముమోమున జేర్చి ముద్దిడి కెమ్మోవి
యాన నే సుకృత మాహాత్మ్యమొక్కొ

తే॥ రమణి నెద జేర్చి మదన సామ్రాజ్యలక్ష్మి
తనివి చాలక నలర నేధర్మమొక్కొ
వాని పుణ్యంబు తపమును వాని వ్రతము
వాని సుకృతంబు ధర్మంబు వశమె పొగడ 282

భావము : "ఆ సతికి, భర్తయై తగిన విధమున ఆమెను సంతోషింపజేయుచు, సేవలు చేయగలవాడు ఏ పుణ్యము చేసెనో? తన హృదయమును అర్పించి అనుకూలముగా మనస్సు మెలగునట్లు వర్తించుటకు ఏ తపము ఫలమో? రసవంతములైన చక్కని చమత్కారభాషణముల నేర్పుతో ఆమె శరీరమును ఒరసికొనుటకు అతడు ఏ వ్రతము చేసెనో? తన ముఖమును ఆమె ముఖమున చేర్చి ముద్దాడుకొనుచు ఆమె పెదవిని ఆస్వాదించుటకు ఏ (మంచిపని) సుకృతము చేసెనో? రమణిని తన ఱొమ్ముతో కలిపి మదన

క్రీడతో తృప్తి చాలక వినోదించుట ఏ ధర్మకార్యఫలమో? వాని పుణ్యము, తపము, వ్రతము, సుకృతము, ధర్మము పొగడుటకు సాధ్యమా?"

క॥ పతిగల సతి యీ గతి నే
కతమున విహరించు నిట్లు కానన వీధిన్
మతినెన్న గన్యకామణి
గతినున్నది మర్మ మెట్లు గననయ్యెడినో 283

అర్థాలు : కతము= కారణము, కాననము= అడవి

భావము : "భర్తయున్న యెడల ఈ సతి ఈ విధముగా ఏ కారణముచే ఈ అడవి త్రోవలలో ఇట్లు విహరించును. ఆలోచింపగా శ్రేష్ఠురాలైన ఈమె కన్యయే కావచ్చును. ఈ కిటుకు ఎట్లు తెలుసుకొనగలనో?"

చ॥ పిలిచినబల్కునో పలుక బెగ్గిలి సిగ్గున చాటు కేగునో
పిలువనిచో గృహంబునకు పిల్వ నరుంగునొ కాక యిచ్చటం
నిలిచిన దీని చొప్పరసి నెచ్చెలు లిచ్చటికేగు దెంతురో
తెలియదు పల్కరింతునని ధీరతతో సతి డాయబోవుచున్ 284

భావము : "పిలిచిన పల్కునో? పలుకుటకు భయపడి, సిగ్గుతో మఱుగునకు పోవునేమో? పిలువని యెడల నన్ను పిలుచుటకై ఇంటికి పోవునా? లేక ఇచ్చటినే నిలిచిన యెడల, ఈమె ఎచ్చటనున్నదో కనుగొనుటకు ఆమెతో స్నేహితురాండ్రు ఇచ్చటకే వచ్చెదరేమె! ఏదియును తెలియటలేదు. ఆమెను నేనే మాట్లాడెదను", అని నిశ్చలముగా ఆ సతి చెంతకు పోవుచు,"

క॥ ఈ నడుమీ యొడ లీతొడ
లీనడ లీజిగియుబిగియు ఈ మురుపొరపున్
ఈ నయ మీప్రియమీ హొయ
లీ నటనం బీపటుత్వ మెందును గలదే 285

భావము : “ఈ నడుము, ఈ మేను ఈ తొడలు, ఈ నడకలు లావణ్యము. ఈ బిగువు అందము నిపుణత, వినయము, తియ్యదనము, ఒయ్యారము, ఈ నర్తనములు(నడకలో నాట్యభంగిమలు) ఈ నేర్పు ఏ పడతిలోనైనా కలవా?”

సీ॥ ఈలతాతన్వి నన్నేలయించి సొలయించి
కౌగిట గదియింప గల్గునొక్కొ
యీ మధురాధరి ప్రేమతో కెమ్మోవి
పచ్చితేనియలాననిచ్చు నొక్కొ
యీకీరసల్లాప రాకొట్టి పిలుచుచు
పలుక తేనియలొల్క బల్కునొక్కొ
యీయిందువదన మోమిచ్చిన జక్కగా
దరహాస చంద్రిక దనుపునొక్కొ

తే॥ కలువకంటికటాక్షంబు గల్గునొక్కొ
పద్మనిభపాణినన్ను చేపట్టునొక్కొ
లికుచకుచనన్ను యెదను గీలించునొక్కొ
యలరు నతనాభకేళి నోలార్చునొక్కొ **286**

భావము : “ఈ తీగల వంటి శరీరము గల కాంత నన్ను ఆసక్తితో కలిసి పరవశింపజేసి తన కౌగిలిలో ఇముడ్చుకొనునా? ఈ తియ్యని పెదవిగల కోమలి ఆమె ఎఱ్ఱని పెదవి తడితీ తేనెను పీల్చుకొననిచ్చునా? ఈ చిలుక పల్కుల కొమ్మ(వనిత) “రా రా” అని తేనెలు సోకు మాటలు ఉచ్చరించునా? ఈ చంద్రముఖి నేను ముఖమును ఇయ్యగా చక్కగా చిఱునవ్వుల వెన్నెలను కుమ్మరించి తృప్తిని కలుగజేయునా? కలువల వంటి క్రీగంటి చూపులు నాపై ప్రసరింపచేయునా? పద్మముల వంటి చేతులు గల ఆకలికి నన్ను ఇష్టపడునా? గజనిమ్మ పండ్లవంటి పాలిండ్లు గల ఈ పడతి నన్ను, ఆమె ఎదలో చేర్చుకొనునా? ఒప్పు లోతైన నాభితో ఆడనిచ్చునా?”

సీ॥ నలినాక్షికుచ దుర్గములు నాకు చేపడ్డ
కైలాసదుర్గ సాంగత్యమేల
కిసలయనిభపాణికెమ్మోవి రుచి గొన్న
సిద్ధ రసాయన సేవ యేల
భద్రేభనిభయాన పలుకులు చెవిసోక
నారద మృదులగానంబు లేల
జలజాంఘ్రిదరహాస చంద్రికపై బర్వ
శశికళాసంభృతాసక్తి యేల

తే॥ కాంతరతికేలి నన్నేలగలిగెనేని
వెలయత్రిభువన సామ్రాజ్యవిభవ మేల
భామ యెడలక నన్ను జేపట్టెనేని
ప్రకటమగు నర్ధనారీశ్వరత్వ మేల **287**

భావము : “ఈ కమలాక్షి కోటల వంటి పాలిండ్లు నా చేతికి అందినచో ఆ కైలాస పర్వత దుర్గము ఎందుకు?ఈమె చిగుళ్ల వంటి చేతుల గల ఆమె ఎఱ్ఱని పెదవిరుచి లభించినచో సిద్ధులు (ఆయుర్వేద వైద్యులు) చేయు (రసాయన ఔషధములు) సేవ ఎందుకు? ఏనుగుల వంటి నడక గల ఆమె పలుకులు చెవికి తగులగా మృదువైన నారద సంగీత గానము (అల్పమైన శ్రావ్యత కలది) ఎందుకు? పద్మము వంటి కాళ్లు గల ఈమె నవ్వుల వెన్నెల వెలుగులు ప్రసరింపగా నా శిరస్సున ఎల్లవేళల నుండు నిండు చంద్రుని కళలందు (అల్పమైన కాంతి కలది) అనురాగ మెందుకు? ఆ కాంత రతిక్రీడలో నన్ను తేల్చినచో, మూడులోకాల సామాజ్య సంపద యెందుకు? నన్ను వదలక ఆభామ ఆదరించిన ప్రసిద్ధమైన అర్ధనారీశ్వరమెందుకు? (సగభాగమైన పార్వతిని విడిచెదనని భావము)’

క॥ ఏటికి కైలాసంబిక
నేటికి ధనదానురక్తి యేటికి విభవం

బేటికి గిరిజాసంగమ
మేటికి భువనాధిపత్యమేటికి నిన్నిన్ 288

భావము : "ఇంక ఏల కైలాస వాసము? ఏల కుబేరుని స్నేహమందు మక్కువ? ఏల ఇప్పటి సౌభాగ్యము? ఆ పర్వత కన్యతో ఏల సంగమము? ఏల ఈ లోకాల ప్రభుత్వము? ఏల ఇవి అన్నియు?"

క॥ బాలామణి నను బంటుగ
నేలిన గడులెస్స హృదయ మియ్యదయేనిన్
చాలింతు నెల్లమహిమలు
వాలాయం బెపుడు దీని వాకిటనుందున్ 289

భావము : "(ముగ్ధ) శ్రేష్ఠురాలైన బాల, నన్ను బంటుగా గ్రహించినట్లయిన, చాలా మేలు. ఆమె తన హృదయమును నాకు ఈయనిచో నా శక్తులన్నింటిని వదలిపెట్టి ఎల్లప్పుడు ఆమె వాకిటిలో ఆమె దయకై ఎదురు చూచుచుందును."

ఉ॥ చెప్పకయున్నచో పనులు సేయుదు జిత్తము మెచ్చునట్లుగా
నెప్పుడు సర్వకార్యముల నేమఱకుందు తదీయ సన్నిధిం
కప్పురగంధినెచ్చెలుల గైకొని యిష్టధనంబు లిత్తు నే
నెప్పని నైన గాంతదయ నేలెడుడునట్టుల సంచరించెదన్ 290

భావము : "ఆమె ఆదేశించిక పోయినను ఆమె పనులను చేయుదును. ఆమె మెచ్చునట్లు అన్ని పనులను పొరపాట్లు లేక ఎల్లప్పుడు చేయుదును. ఆ సువాసనలు వెదజల్లు శరీరము గల, ఆమె చెలికత్తెలను దగ్గఱకు పిలిచి వారికి ఇష్టమైన ధనములు ఇచ్చెదను. ఆమె దయ ఎల్లప్పుడును పొందునట్లు ఏ పనియైనను చేయుచు ఆమెను సేవించెదను."

శా॥ ఏ నేర్పైన ఘటించి యీ సుదతి పొందేకందు, గాకున్నచో
సూనాస్త్రాశుగవహ్నికీలలను నే జొత్తున్ మరు ప్రీతిగా

ప్రాణంబు ల్విడనాడి భూషణమణివ్రాతంబునం దోడుగా
పౌనర్భా వమునొంది కందు తను సంపర్కంబు నిక్కంబుగాన్ 291

అర్థాలు : సూనాస్త్రుడు= మదనుడు, ఆశుగము= బాణము, వహ్ని= అగ్ని

భావము : "ఎట్టి నేర్పుతో నైనను ఈ చక్కని దంతములు కల కాంతను పొందెదను. లేనిచో మదనుని బాణాగ్ని జ్వాలలలో ప్రవేశించి అతనికి సంతోషము కలుగుటకైనా అలంకారములన్నింటితో నా ప్రాణాలను వదలి, మరల జన్మించి, ఆ సతి తనువును తప్పక పొందగలను."

మ॥ అనుచున్ నిశ్చలచిత్తుడై సుదతి డాయంబోవ నంతంత నొ
య్యన దూరంబుగ పోవు పోయి సొలసున్ హారంబులుం గానరా
మినుకుంగుబ్బలపైటయున్ నొరపు ధమ్మిల్లంబునుం జారగా
జనుచుం గాంచన కందుకం బరయు కోసం బంత నెంతేనియున్ 292

భావము : అనుచు గట్టి మనస్సుతో ఆ మదవతి దగ్గఱకు పోగా ఆమె అంతలో మెల్లమెల్లగా దూరముగా పోయి, కొంచెము అలసటను నటించుచు, తన మెడలో దండలు కనబడగా చనుగుబ్బలు ఉబుకుచు రాచుకొను పైచీర, జడ జాఱునట్లు ఇటునటు ఆ బంగారు వన్నెగల బంతిని వెదకునట్లు కదలిపోవు చుండగా అంతలో,

ఉ॥ మించిన లోపరాకునను మిక్కిలియౌ తమకంబు చేత శో
ధించుచు నాచరించు నెడదేరి కుజంబున పువ్వుగుత్తిగ
న్పించిన చేరబోయి కడునిక్కి కరంబున కొమ్మబట్టి తా
వంచుక పువ్వు గుత్తికి చవాలున పైకుబుకంగ నెవ్వడిన్ 293

భావము : ఎక్కువైన ఆసక్తితో మిక్కిలి వేగముతో వెదకుచు నడుచుచు కొంతసేపు ఆగి, ఒక చెట్టులో పూల గుత్తిని చూచి దగ్గఱకుపోయి బాగుగా పాదాలను పైకెత్తి వ్రేళ్లపై నిలిచి(నిక్కి) చేతితో కొమ్మను పట్టుకొని వంచి అందకపోవుటచే దానికై తటాలున మిక్కిలి వేగముతో పైకి ఎగయగా

ఉ॥ పైదలికోక పోక ముడిపట్టు విడం దిగజారిపడ్డ యు
న్మాది విధంబునన్ శివుడు మానిని పైబడరాగ మారుడుం
గేదకిరేకుబాకు వలకేల ఝరీనను దూసి పెన్నురం
బాదటగుమ్మి కోయనుచు నార్చిన వైళమ మేని చేదనన్ 294

భావము : చీరకు కట్టిన ముడిపట్టు వీడిపోగా ఆ చీర దిగజారినది. ఆ దృశ్యమును చూచి వెఱ్ఱివాడై శివుడు, ఆమెపై పడుటకు ముందుకురాగా ఆ మారుడు (హింసించువాడై) కుడి చేతిలో మొగలిపూవురేకు అనెడి బాకును వెంటనే ఝుంఝుం ధ్వనులతో తీసుకొని ఆతని పెద్ద రొమ్మును గ్రుచ్చి శ్రద్ధతో ''కో'' అని కూయగా శరీరములోని ''తిక్క'' (చేదు) (కామమనెడి వెఱ్ఱి) వేగముగా

చ॥ మెదడును మజ్జగాయమున మిక్కిలిగా గురియంగ జొచ్చినన్
హృదయము ఝల్లనం గరగి యంతయు తేజము జారి యేరులై
గొనగొని పార జొచ్చె గడుకుంభినికై తదనంతరంబునన్
మది దెలివంది శూలిహరిమాయ గ దా యని బుద్ధి దోచినన్ 295

భావము : శరీరములో, మెదడులోను ఎముకలు గాయములతోను (తిక్క) మిక్కిలియై కురియగా శివుని ఎద ఝల్లని కరగుటచే, అంతటను వీర్యము వెల్వడి నదులుగా తెలిపిలేక పుడమిపై ప్రవహించెను. వెంటనే తెలివి తెచ్చుకొని తన బలహీనతను గుర్తించి ''ఇది అంతా ఆ శ్రీహరి మాయగదా'' అని తన బుద్ధికి తోచినది.

ఉ॥ ఆ సమయంబున హరి నిజాకృతి గైకొని మ్రోల నిల్చినన్
మోసము వచ్చె నారదుడు మొఱ్ఱలిడన్ వినవైతినే కదా
వేసట లేక నెయ్యమున విష్ణువు దెల్ప నెఱుంగనైతి నా
యాసముజెందె నూరకనె హా వెడబుద్ధి గడంగె నెంతయున్ 296

భావము : ఆ సమయమున హరి తన నిజస్వరూపమును పొంది శివుని ఎదుట నిల్చెను. ''మోసము జరిగినది. ఆ నారద మహర్షి ప్రార్థించినను

నేను వినలేదు కదా! విసుగు లేక స్నేహముతో విష్ణువు హెచ్చరించినను గ్రహింపలేక పోయితిని. అవసరములేక పోయినను ఈ శరీరము చాలా అలసినది. ఆహా! వెఱ్ఱి నా బుద్ధిలో చేరి యిట్లయితిని.

వ॥ అని వితర్కించున్న సమయంబున 297

భావము : అని శివుడు తన మనస్సులో చర్చించు కొనుచుండగా

చ॥ హరిహరపద్మజాత్మకు డహర్పతికోటి సమాన తేజుడున్
స్ఫురదురుకుండలుండు ఘనశూలధరుండు కపాల మాలికా
భరణుడు సద్భుజాష్టకవిభాసురమూర్తి జటోత్తమాంగుడై
హరిహరసన్నిధిం బ్రభవమయ్యెను భైరవదేవు డుద్ధతిన్ 298

భావము : త్రిమూర్తుల శక్తి కోటిసూర్యుల ప్రకాశము. వెలుగుచున్న చాలా పెద్ద చెవిప్రోగులు బలిష్ఠమైన మూడు మొనలు గల శూలము(ఆయుధము) ఎముకల పుఱ్ఱెల సరాలు చక్కని ఎనిమిది భుజముల ప్రకాశించు జడల శిరస్సు కలవాడై ''భైరవదేవుడు'' శివకేశవుల ఎదుట వెంటనే అవతరించెను. అతడే మోహినీ పరమశివుల సంతానమై ప్రసిద్ధుడయ్యెను.

క॥ వనజోదరునియనుజ్ఞను
జనుదెంచిరి పద్మజాది సర్వామరులున్
మునులును వసువులు యక్షులు
ననుమోదముతోడ జయజయధ్వను లెసగన్ 299

భావము : ''జయ జయ'' అనెడి నాదములు అతిశయముగా మ్రోగుచుండగా సంతోషముతో, హరి అనుమతితో బ్రహ్మ మొదలుకొని దేవతలు అందఱును, మునులును, వసువులు, యక్షులు (భైరవుని జనన కాలమందు అచ్చటికి వచ్చిరి)

శా॥ భేరుల్ మ్రోగెను దుందుభుల్ మొరసె గంభీరాబ్ధిరావంబులున్
బోరంచుం దగ దివ్య కిన్నరమునుల్ ఘూషించి రొక్కుమ్మడిన్

శౌరిన్ శంకరు, బూజ చేసి రపు డాశానాథు లద్దేవులన్
సౌరాభ్యాంచిత పుష్పజాలముల భాస్వద్వేదమంత్రంబులన్ 300

భావము : భేరులు దుందుభుల వాద్యఘోషలతో చెలగినవి. విరివియైన సముద్రతరంగముల నాదములు వెలసినవి. గొప్ప రవములతో దేవతలు కిన్నరులు మునులు ఒక్కసారిగా శౌరిని, శంకరుని స్తుతించిరి. ఆ దిక్పతులు అప్పుడు ఆదేవులను ఇరువురిని సువాసనుల క్రమ్మియున్న అందమైన పూలగుత్తులతోను శ్రేష్ఠములైన వేదమంత్రాలతోను పూజ చేసిరి.

క॥ వారిజభవహరిహరులా
భైరవుసంస్తుతులు చేసి ప్రభుడవు నీవే
యారేడు జగములకును
వారక నీవాజ్ఞసేయువా రఖిలంబున్ 301

భావము : బ్రహ్మ హరిహరులు అవతరించిన భైరవదేవుని చాలా చక్కగా స్తుతులు కావించి, "నీవే పదునాల్గు లోకాలకు ప్రభువు. సమస్త జీవులు నీ ఆనను అడ్డులేక పాటించెదరు."

వ॥ అని నియమించి చిన్నబోయియున్న చిన్ని వెన్నెల దొర పాపలదాల్పుని మన్ననం గని వెన్నుం డిట్లనియె 302

భావము : అని ఆనతి యిచ్చి గర్వము అణగిపోవుటచే దీనుడై యున్న శివుని ఆదరించుచు వెన్నుడు ఇట్లు వచించెను.

ఉ॥ కారణ మిట్టులుండగను గాదన నీకును నాకు శక్యమే
భైరవజాత హేతుక నిబద్ధకృతంబిది చోద్యమిందుకై
భూరివివేక చిత్తమున బొల్పరి యుండగ నీకు నాయమే
మారమదాపహార! మునిమానసచార! దయారసాకరా! 303

భావము : "గొప్ప వివేకము కలవాడా! భైరవదేవుడు జననము కారణముగా ఏర్పడిన కార్యము ఈ శ్రీహరి మాయ. ఇది ఆశ్చర్యమే! అవమానకర

కార్యమని తలంపరాదు. మదనుని మదమును హరించినావాడా! మునుల మనస్సులలో సంచరించువాడా! దయయనెడి భావమునకు నిలయమైనవాడా!

చ॥ జగములు నీ యధీనములు సర్వమయుండవు నీవు నీదు రూ
పగు ధరవారివహ్నిపవనాంబరసూర్య నిశాకరాద్యు లో
నగవరచాప ! యీ త్రిభువన ప్రతిపాదక కారణంబు నీ
దగు నటనం బిదింతనగ నౌనె యజాది సురాళికెంతయున్ 304

భావము : "లోకాలన్నియు నీకు వశమై యున్నవి. అన్నింటి యందును ఉన్నవాడవు. నీ రూపములే 1) నేల, 2) నీరు, 3) నిప్పు, 4) నింగి, 5) గాలి, 6) ఆకాశము, 7) సూర్యుడు, 8) చంద్రుడు మొదలైనవారు. మేరుపర్వతమును బాణముగా ధరించినవాడా! త్రిపుర సంహారంబు ఈ మూడు లోకాల పుట్టుకకు నీ నటనయే కారణము. ఇది ఇట్టిదని తెల్పుటకు బ్రహ్మకు ఇతర దేవతలకును వీలగునా?"

సీ॥ అఖిలదిక్కులరాజు లందరు నీదు కో
కలబొక్కసము కాపుకాండ్రు గారె
భూతసృష్టికినాది భూతమైతగు మిన్ను
తోరంపు పువ్వులతోట గాదె
సృష్టికర్తయినట్టి స్రష్టముఖంబులు
బిగువైన గుజ్జాలపాగ గాదె
సిరిపుట్టి నిల్లగు క్షీర సముద్రంబు
పొదలు నీ యమ్ములపొదియు గాదె

తే॥ అమిత చతురాస్యమండలహారయోగ్య
చారుమాణిక్య ఘన ఘనస్థలము గాదె
చక్రవాళంబు నీ తేరుచాటుగాను
కుదురుకొల్పిన వలయంపుగోడ గాదె 305

అర్థాలు : కోక= వస్త్రము, బొక్కసము= భద్రపఱిచెడి చోటు, ముఖము= ఇంటి ముందు భాగము ముంగిట, చతుర ఆస్యమండలము= నాలుగు దిక్కులు గల గుండ్రని భూమి, ఘన= గొప్పదైన, ఘనస్థలము= గట్టిదైనది (కైలాస పర్వతము)

భావము : "ఎనిమిది దిక్కుల పాలకులు, నీ వస్త్రాలను, ఎఱ్ఱకలువ ఎఱ్ఱతామర సరస్సుల స్థలములను కాచెడివారుకదా! సృష్టిలో మొదటిదైన ఆకాశము చాలా పెద్దదైన నీ పువ్వుల ఉద్యానవనము కదా! సృష్టికర్త ముంగిళ్లలో నీ గుఱ్ఱాల శాలలు, ఆ నాలుగు ముఖములచే రక్షింపబడు చున్నవి కదా! లక్ష్మీదేవి పుట్టిన పాల సముద్రము నీ బాణములను భద్రపఱచెడి విశాలమైన ప్రదేశము కదా! నాలుగు దిక్కులు గల భూమండలమందు దండలలో ధరింపదగిన అందమైన మాణిక్యములకు నెలవు. గొప్పదైన, గట్టిదైనది నీ కొండయే కదా(కైలాసుమందే, మేలైన మాణిక్యములు లభించునని భావము) నీ తేరును రక్షించుటకై (కనబడనీయక) చక్రవాళ పర్వతము గుండ్రని కోటగా నున్నది కదా!"

క॥ **కరిదనుజ తారకు సుతుల**
సురపతి దైతేయముఖ్యసురవిద్విషులన్
బరిమార్చి జగము లన్నియు
నిరతము రక్షించువేల్పునీవె కదయ్యా **306**

భావము : "గజాసురుడు తారకుని సుతులైన త్రిపురాసురులను (కమలాక్ష, తారాకాక్ష విద్యున్మాలి), ఇంద్రుని దేవతలలో ప్రముఖుడైన బ్రహ్మ మొదలగు దేవతలకు శత్రువులైన వారినెల్లను వధించి లోకాలను కాపాడిన దేవుడవు నీవేకదా!"

మ॥ **నిను వర్ణింపగారామి చోద్యమె కటా నీ భక్తులెందైననుం**
ఘనులైయుండగ నెట్టులో యనిన మార్కండేయముఖ్యుల్ గడున్

ఘనకల్పాంతములందునుం దగ జగత్కళ్యాణసంచారులై
ప్రణతుల్ గాంచుట సాక్షిగాదె గిరిజా ప్రాణేశ! లోకాధిపా! **307**

భావము : "నిన్ను వర్ణించుటకు సాధ్యము కాదు అనుట ఆశ్చర్యమును కల్గింపదు. అయ్యో! అది చాలా కష్టమైన కృషియగును" నీభక్తులు ఎచ్చటనైనను ఎట్లు ఉన్నారని ప్రశ్నించినచో, మార్కండేయుడు మొదలగువారు ,అతిశయించి, గొప్పవైన యుగాంతముల వఱకు లోక కల్యాణమునకై జీవించి, నుతింపబడుటయే సాక్ష్యము కదా. పార్వతీపతీ! లోకాధిపతీ!"

చ॥ **మనమున చింత దక్కు మసమానమహత్వ నిరూఢి నంచు దా**
ననిశము విఱ్ఱవీగు కలహాశను డొందెడు నట్టిభంగమున్
గనుగొను వాడ వంత యని గౌరవమొప్ప గిరీశుకేలు కే
లున దగ గీలుకొల్పి మదిలోపలి చింత దలంగజేయుచున్ **308**

భావము : "మనసులోని చింతను విడువుము. సాటిలేని ప్రభావము నిలుకడగా నున్నదని తాను ఎల్లప్పుడు గర్వముతో పలికెడి ఆ కలహమే భోజనముగా గల నారదుడును పొందనున్న అవమానమును నీవే చూడగలవు." అని మర్యాదతో శివుని చేతిని తన చేతితో గట్టిగా పట్టుకొని అతని మదిలోని బాధను తొలగచేయుచు,

ఉ॥ **అంతి పురంబులోనికి దయామతి తోడుకోపోయె యిందిరా**
కాంతయు దాను నాత్మకుతుకంబుల బూజలు చేసిన న్నిజ
స్వాంతము సంతసిల్లి పురసంహరు డంబుజనాభుతోన నీ
యంతటి మాయలాడు జగమందున నెందును గల్గ నేర్చునే **309**

భావము : దయగల మనసుతో నగరిలోనికి తనతో తీసికొనిపోయెను. లక్ష్మియు తానును (శ్రీహరి) మనసార ఉత్సాహముతో శివుని పూజింపగా హృదయము సంతసముతో ప్రసన్నముకాగా శివుడు "నీ వంటి మాయలను కల్పించువాడు నేర్పరి లోకములలో ఎచ్చనైనను కలడా?"

క॥ నీ రోమ కూపమందున
వారిజజాతాండకోట్లు వసియింపగ నం
దారయ నొక్కండము లో
నోరను కైలాసశిఖరి నుండెడు వాడన్ 310

భావము : "నీ వెంట్రుకలు మెండుగా నుండెను. నూతులలో కోట్లకొలది బ్రహ్మండములు(ప్రపంచములు) నివసించు చున్నవి. అందులో ఒక చిన్నదైన నెలవుగా ఒక ప్రక్క కైలాస పర్వతముపై ఉన్నవాడను (అంతమాత్రమే నా ఉనికి అని భావము)

క॥ నేనెక్కడ నీవెక్కడ
పోని యహంకారమహిమ బుద్ధి నెఱుంగం
గా నేరనైతి నకటా
నేనా నీమాయ దెలియ నేర్చినవాడన్ 311

భావము : "నేను ఎంతటివాడను? (చాలా చిన్నవాడను) నీవు ఎక్కడ? (చాలా పెద్దవాడవు, గొప్పవాడవు) నశింపని గర్వమునకు వశమైన నా బుద్ధిచే నీ మహత్వమును ఎఱుగలేక పోయితిని. అయ్యో! ఇది చింతింపదగినది. నేను నీ మాయను గుర్తింపగల నేర్పరినా?"

శా॥ ఆద్యంతాంతరశూన్యమై యఖిల మాయా కల్పనారూఢమై
విద్యావిద్యలునయ్యు నిర్గుణమునై వేదాంత విజ్ఞానమై
ఖద్యోతానల చంద్రతేజరహితాకాశ ప్రపూర్ణంబునై
యుద్యద్బ్రహ్మమునైన చిద్ఘనము నీవో దీన రక్షామణీ! 312

భావము : "దీనజన రక్షక శ్రేష్ఠుడా! ఆది, అంతము అంతరము (పుట్టుక, తుది, ఉనికి) లేనివాడవై మాయలను కల్పించుచు ప్రసిద్ధి పొంది, నీవే విద్యయు, అవిద్యయు నిర్గుణమును, వేదాంత విజ్ఞానమును అయి, సూర్యుడు (ఖద్యోతుడు) అగ్ని, చంద్రుడు, కాంతిహీనులు కాగా, అంతయు అంతరించినప్పుడు అంతటిని ఆక్రమించి సర్వము నీ చైతన్యముతో చాలా పెద్దదైనదియు దృఢమైనదియుగా నీవే పరబ్రహ్మముగా ఆకారములేక యుండెదవు."

క॥ నినుగాని వస్తువొక్కటి
కనబడదేయెడల సర్వగతుడ నీవే
వనజోదర! నిన్నింతని
యనగా శక్యంబె యస్మదాదుల కెందున్ 313

భావము : "నీవు కానట్టి వస్తువు ఏదియు ఎక్కడను కనబడదు. నీవే, అన్నింటి యందున్నావు. కమలము బొడ్డులో కలవాడా! నీవు ఇంతటి వాడవని వచించుటకు మా వంటి వారికి సాధ్యమా!"

క॥ గర్వగ్రస్తుండెందును
నిర్వాహకుడగునె యెట్టి నెఱవాదైనన్
సర్వేశ! భక్తవత్సల!
దుర్విషయములందు నన్ను దొలగింపగదే 314

అర్థాలు : గర్వగ్రస్తుడు= గర్వి, నెఱవాది= చక్కగా వాదించువాడు

భావము : సర్వమునకు ప్రభువా! భక్తుల యెడ వాత్సల్యము(ప్రేమ) కలవాడా! గర్వముచే నిండినవాడు. ఎంతటి తార్కికుడైనను కార్యాలను చక్కపెట్టగలడా? నన్ను చెడ్డ తలంపులనుండి తొలగింపుమా!"

శా॥ నీ మంత్రంబు నిరంతరంబు రసనన్ బ్రేమం జపింపన్ సదా
నీమూర్తిన్ హృదయాబ్జమధ్యనెపుడున్ నిల్పంగ నైనట్టియా
సామర్థ్యంబు నిజంబుగా నొసగు మీశత్వంబునుం గాల్పనే
యేమిం జాల సముద్ధరింపుము రమాధీశా! జగద్వల్లభా! 315

భావము : "నీ అష్టాక్షరీ మంత్రమును, ఎల్లప్పుడు ప్రేమించి, నాలుకతో పలుమాఱు వచింపగా నీ మూర్తిని ఎల్లప్పుడు, కమలము వంటి ఎదలో

నిలకడగా నిల్పు. శక్తిని తప్పక ఇమ్ము''. నా ఈశత్వము (పాలన) నిరుపయోగము. దేనికిని నేను తగిన వాడను కాను. లక్ష్మీపతీ లోకనాయకా! తెలివిలేక వర్తించి దిగజారిన నన్ను లేవనెత్తి పవిత్రుడగునట్లు చేయవే''

ఉ॥ నేరములెన్ని మా వలన నీవు సహింపకయున్నచోట నె
వ్వారునులేరు దిక్కు దయవత్సను నాకలి దీర్చి ధేనువే
మారక వెంట వెంట బలుమాఱు వృకాది భ యాపహరి సం
చారము సేయు చందమున సమ్మతి బ్రోవుము భక్తవత్సలా! 316

భావము : ''మేము చేసిన తప్పులు ఎన్నింటినో నీవు సహించి క్షమింపక పోయినచో మమ్ము ఎవరును కాపాడువారు లేరు. దూడను దాని ఆకలి తీర్చు(పాలిచ్చి పోషించు) తల్లి ఆవు దాని వెంట వెంట (వెనుక) పలుమాఱ్లు తోడెళ్లు మొదలైన క్రూరజంతువుల వలన భయమును పాగొట్టుకై సంచరించు రీతిగా, నా వెంట నుండి కాపాడుము. నీవు దయతో నిండు మనస్సుతో నన్ను కాపాడుమా!'

క॥ లోకంబులనుచు మమ్ముల
లోకేశ్వరులనుచు మాయలో ముంపకు నీ
లోకమగు నాత్మనుండెడు
లోకము మాకొసగు భక్తలోక శరణ్యా! 317

భావము : ''ఓ భక్తజనులను రక్షించువాడా! లోకములు అనుచు, మమ్ము లోకేశ్వరులనుచు అజ్ఞానమనెడి వంచనలో ముంచవద్దు. నీలోకమైన ఆత్మ ఎదలో నుండెడి లోకమునే మాకు ఇమ్ము.''

మ॥ పులిచర్మంబు జటా కిరీటమును బూతిన్ సుప్రలేపంబు చి
ల్వల సొమ్ముల్ జపమాలయుం గలిగి చాలం బిల్లిశీలంబయో
తలప న్నీకరుణాకటాక్షమును చెందన్‌లేని నాయాదులున్
కలహప్రీతుడు నీ కటాక్షమహిమన్ గాంచెంగదా జ్ఞానమున్ 318

అర్థాలు : ప్రలేపంబులు= శరీరమును అలదికొను పొడులు, న్యాయము (ప్రకృతి)-నాయము(వికృతి) తర్కశాస్త్రము

భావము : ''మునులు, పులిచర్మము, జడల కిరీటము బూడిద, మైపూతలు పాముల నగలు, జపమాల చాలా కలిగినను, వారిది పిల్లి గుణమే! (పాలు త్రాగిన పిల్లి త్రాగనట్లు కన్పట్టును). నిక్కముగా వారిది కపటమైన నటనయే. అయ్యో! నీ క్రీగంటి చూపు పొందలేని తర్కశాస్త్రము మొదలైన వానిలో వారి పాండిత్యము దేనికిని ఉపయోగపడదు. ఆ కలహప్రియుడు నారదమహర్షి దివ్యజ్ఞానమును నీక్రీగంటి చూపు యొక్క మహిమచే పొందగల్గెను.''

వ॥ అని బహుప్రకారంబుల సన్నుతింపుచు వేడుకొన్న నమ్మహాదేవుని సగౌరవం
బుగా కౌగిలించుకొని హరి ఇట్లనియె 319

భావము : అని పెక్కు విధములుగా స్తుతించుచు ప్రార్థించు చున్న ఆ మహాదేవుని, గౌరవముతో కౌగిలిలో చేర్చి శ్రీహరి యిట్లనెను.

క॥ నీవను నేనను భేదము
భావంబున నెంచవద్దు పరమేశ్వర యీ
స్థావర జంగమములెల్లను
నీవే నేనగుట వేఱు నీవెట్టులకో 320

భావము : ''నీవు, నేను వేఱు అను భావమును తలపులో పెట్టవద్దు. ఓ పరమేశ్వరా! కదలనివి, కదలునవి(జీవములు) అన్నియు నీవు నేనును కలసి యుండుటచే నీవు ఎట్లు వేఱు అగుదువు?''

శా॥ సర్వంబాత్మయకాని వేఱొకటి యెంచం లేద దెట్లన్నచో
సర్వంబెందును బుట్టు నెందు లయమో సంకల్పమాత్రంబునన్
సర్వంబాత్మనెపుట్టి నాత్మననగున్ సత్యంబు సత్యంబహో
సర్వంబందును నీవు నేను వెలియే శైలాత్మజా వల్లభా! 321

భావము : "ఓ హిమవంతుని పుత్రియైన పార్వతీపతీ! సర్వము "ఆత్మ" యే (పరబ్రహ్మము-మహాచైతన్యము). ఆలోచింపగా వేఱొకటి లేనేలేదు.

అది ఎట్లనగా, తలంచిన క్షణములో సర్వము అందు పుట్టును. అందు క్షణములో తొలగిపోవును. కావున ఆ మహాచైతన్యమందు సర్వము మొలిచి అందే అణిగిపోవుట సత్యము. ఆహా! అన్నింటిలో, నీవుని నేనును వేఱుగా నున్నామా! కలిసియే యున్నాము. ఇది పరమసత్యము."

ఆ॥ ఆత్మవయ్యు నీవు యన్యుడపోలెను
నీవు నేను నాది నీది యనుచు
అందు నిందు ననుచు హంకారమును బొంద
వలదు నిన్న నీవె తెలుసుకొమ్ము 322

భావము : "నీవు పరమాత్మ వయ్యును వేఱైన వాడుగా "నీవు నేను" "నాది నీది" అనుచు "అచ్చట ఇచ్చట" అనుచు నేను అని భేదభావమును పొందవలదు. (అహమ్ నేను) నీవు నేను ఒకటే అని తెలివిని పొందుమా!"

క॥ లోకంబెక్కడనున్నది?
లోకేశ్వరుడెవ్వడిందులో కన కొంచెం
బేకరణి గాననయ్యో వి
వేకము లేకుంటవలన వేఱై తోచెన్ 323

భావము : "లోకమెక్కడ ఉన్నది? లోకములలో లోకనాయకుడు ఎవ్వడు? చూడగా! కొంచెమనునది ' ఏవిధముగా కన్పట్ట గలదు? సరియైన విచారము (ఆలోచన) లేకపోవుట వలన నీవు నేనను భేదము తోచుచున్నది."

ఆ॥ సకల కర్మచయము సంజాత హేతువు
కర్మలయము మోక్ష కారణంబు
కానన్నిటికిని మానసమే గుఱి
కాది తరము కర్మ కారణంబు 324

భావము : "ఆయాజీవులు చేయుపనులే జీవుల పుట్టుకకు కారణము. ఆ కర్మఫలము (పుణ్యాపాపములు) తొలగగా,వానికి లోకముతో సంబంధము (కట్టబడుట) విడివిడి ముక్తి కలుగుటకు కారణమగును. కావున అన్నింటికిని మనస్సే, బంధము మోక్షములకు లక్ష్యము. ఇతరము ఏమాత్రము కర్మలకు కారణము కాదు."

వ॥ అని యనేక విధంబుల వైరాగ్య జ్ఞానమార్గంబుల శైలజా వల్లభు నుపలాలించి యిట్లనియె 325

భావము : అని అనేక విధములైన వైరాగ్య జ్ఞానముల పద్ధతులను ఉపదేశించి ఓదార్చుచు పార్వతీపతికి శ్రీహరి యిట్లు వచించెను.

ఆ॥ నీవు చూడగానె దేవమునీంద్రుని
మాయముంచి మమత మరులుకొల్పి
భంగపరతునన్న బ్రణమిల్లి శంభుండు
చనియె రజత గిరికి సంభ్రమమున 326

భావము : "నీవు చూచునట్లు ఆ దేవతల ముని శ్రేష్ఠుని నారదుని మాయలో ముంచి, సంసారమందు మోహము పురికొల్పి అవమానించెదను." అనగా, హరుడు నమస్కరించి తన వెండికొండకు వడిగా వెడలిపోయెను.

క॥ కమల భవుండును మునులును
నమరులు శ్రీ హరికి మ్రొక్కి యా భైరవుతో
తమతమనెలవుల కరిగిరి
కమలాసని శౌరి ప్రేమ గదిసి యిటులనెన్ 327

భావము : బ్రహ్మమునులు, దేవతలు శ్రీహరికి నమస్కరించి అప్పుడు జన్మించిన భైరవునితో తమ తమ నివాసములకు వెడలి పోయిరి. మహాలక్ష్మి (పద్మము)

ఆ॥ యువతినయ్యు జాల నువ్విళులూరితి
మోహినీ విలాసమునకు ప్రేమ
చపల హృదయుడైన శంకరుడన నెంత
దేవనీదు మాయ దెలియుటకును 328

భావము : "నేను వనితనయినను మోహినీ రూప విలాసమును చూడ ఉవ్విళ్లూరి భ్రమ చెందితిని. ఆమెను చూచి నీ మాయ తెలియక లోబడుటకు చలించు ఎదగల శివుడు ఎంతటివాడు? నీ మాయను తెలిసికొనక చలింపక యుండుట సాధ్యము కాదు."

ఉ॥ కావున నీయనుగ్రహము గల్గినదాక జగత్రయంబునన్
ధావన మాత్ర మెల్ల జపదాన తపోవ్రత మౌన శీల వి
ద్యా వినయ ప్రభావ బహు ధర్మములారయ నెన్నియేనియున్
పావనమైన మీదు పదపంకజ భక్తిని బోల నేర్చునే 329

భావము : "కావున నీ దయ కల్గునంతవఱకు ఈ మూడు లోకములందు మనస్సును శుద్ధిచేయు జపములు, దానములు, తపములు, వ్రతములు మౌనము, నడవడిక, విద్య, వినయము, భాగ్యము, గొప్పతనము, పెక్కు విధులు చూడగా ఎన్నియైనను, పవిత్రమైన మీ పాద పద్మముల యందు గల భక్తికి సమానమగునా?"

చ॥ ఇహపరసౌఖ్య సంపదల నియ్యగ నేర్చిన వేల్పవీవె ని
ర్వహణధురీణతా మహిమ వారిజ సూతికి నెన్న శక్యమే
మహిమ విభీషణున్ధ్రువుని మన్పుటలున్ శుక వామదేవులన్
మహిజనక ప్రముఖ్యు లపవర్గము నొందుట సాక్షి గావునన్ 330

భావము : "ఈ లోకమందు, పరలోకమందు సంపదలను ఇయ్యగల పరమదేవుడవు నీవే! మీ కార్యముల నిర్వహించు నేర్పులో గల (పటిష్ఠత) శక్తిని బ్రహ్మయును విలువ కట్టగలడా?తమ మహిమతో విభీషణుని ధ్రువుని,

శుకుని వామదేవుని వృద్ధిచేసితిరి కదా! ధరణిలో ఆ జనక మహారాజు మొదలైన ముఖ్యులు(గొప్పవారు) మోక్షమును పొందుట మీ శక్తికి సాక్ష్యములు కదా!"

వ॥ అని బహు ప్రకారంబుల సంస్తుతించుచున్న ప్రాణవల్లభను గౌగిలించి సరససల్లాప విలాసంబుల చతుర వాక్యంబుల నత్యంత సంతుష్టి గావింపుచు దామోదరుండు మహదానుమోదంబున నుండెనని చెప్పి 331

భావము : అనుచు పెక్కు రీతులుగా తన్ను పొగడుచున్న తన ప్రాణమైన భార్యను కౌగిలించుకొని రసవంతములైన చమత్కార వచనములతో మిక్కిలి సంతోషింప చేయుచు శ్రీహరి అతిశయమైన ఆనందముతో వినోదించు చుండెను. అని కథను పూర్తిచేసి,

క॥ ఈ యాఖ్యానం బెవ్వరు
పాయక వ్రాసినను విన్న పఠియించినచో
నాయువు శ్రీ విద్యాతి
శ్రేయోన్నతులగుచు ముక్తి జెందుదురు తుదిన్ 332

భావము : "ఈ పురాణ కథను ఎవరు వదలిపెట్టక శ్రద్ధతో వ్రాసినను చక్కగా విన్నను, చదివినను, ఆయుస్సు, సంపద, విద్య అధికమైన శ్రేష్ఠములైన సుఖాలను అనుభవించి జీవితాంతమున ముక్తిని తప్పక పొందెదరు."

తే॥ అనిన కౌతుహలాత్ములై యఖిల మునులు
సూతు నాత్మానురక్తి సంస్తుతులు జేసి
పలికి రిట్లని గర్వమే పగిది నొందె
నలువ తద్విధమంతయు దెలుపుమనిన 333

భావము : అని చెప్పగానే, వినుటకు ఉత్సాహము సంతోషము కల మునులందఱును, సూతమునిని హృదయమందున్న ప్రేమతో చక్కగా

పొగడి ఇట్లని పలికిరి.''ఆ బ్రహ్మ గర్వమును ఎట్లు పొందెను? ఆ విధమంతయు తెలుపుడు'' అని కోరిరి.

శా॥ **శ్రీవత్సాంకితకౌస్తుభోజ్జ్వల లసచ్ఛృంగార విస్తారితా**
లావణ్యాకర! భద్రభాస్వదలమేల్మంగాంగనా భాసమా
నావాసాయతబాహుమధ్యమహనీయానందమందస్మితా
శ్రీ విభ్రాజిత వక్త్రపద్మసిత రాజీవాక్ష! భక్తాశ్రితా! **334**

అర్థాలు : శ్రీవత్స+అంకితకౌస్తుభ+ఉజ్జ్వల= శ్రీవత్సము అనెడి పేరుగల కౌస్తుభమణిచే ప్రకాశించు వాడా!, లసత్+శృంగారవిస్తారితాలావణ్య+ ఆకర= మెఱయుచున్న యౌవనము యొక్క అందము వెదచల్లు వెలుగులకు స్థానమైన శరీరము కలవాడా!, భద్రభాస్వత్+అలమేల్‌మంగ+ అంగనాభాసమాన+ఆవాస+ఆయతబాహుమధ్య= దృఢమైన శోభతో నుండు అలమేల్ మంగ అనెడి యువతితో, ప్రకాశించు నివాసమందు విశాలమైన భుజముల నడుమ, మహనీయఆనందమందస్మితా= విశిష్టమైన అతిశయమైన ఆనందము వెలయించు, చిఱునవ్వు యొక్క, శ్రీవిభ్రాజితవక్త్రపద్మసితరాజీవ+అక్ష= విలాసము విశేషముగా వెల్వడు ముఖము అనెడి కమలమందు తెల్లతామర పువ్వుల వంటి కన్నులు కలవాడా!, భక్త+ఆశ్రితా= భక్తులచే ఆశ్రయింప బడువాడా!

భావము : విశాలమైన ఱొమ్మున కౌస్తుభమణి ప్రకాశించుచున్నది. ఆ మణి ఎఱ్ఱని కాంతిచే, శరీరమందు శృంగార భావములు గోచరించుచున్నవి. బాహువుల మధ్య ఱొమ్మున అలమేల్‌మంగ కూర్చుండియున్నది. అట్టి స్థితిలో మహానందము వెలయు పద్మము వంటి ముఖమందు చిఱునవ్వు యొక్క విలాసము అతిశయమై ప్రకటితము కాగా, తెల్ల తామరపూల వంటి కన్నులు క్రీగంటి చూపులు కృపతో, ఆశ్రయించు భక్తులపై ప్రసరించుచున్నవి.ఈ పద్యమందు సంబోధనలు ఆశ్రయించు భక్తుల కోర్కెలు ఇచ్చువాడని అభిప్రాయము స్పష్టముగా ఉన్నది.

క॥ **సంతత కరుణాధారా!**
సంతానద్రుమనిరాస చతురోదారా!
సంతుష్టాత్మవిచారా!
శాంతరసాపూర సబిల శైలవిహారా! **335**

భావము : ఎల్లప్పుడును దయను ధరించినవాడా! సంతానమనెడి వృక్షమును (పుత్ర పౌత్ర పరంపర) తిరస్కరించు వాడా! (సంసార బంధమును తొలగించువాడు- బంధవిముక్తికి కారకుడు). నేర్పరియైన వితరణ గుణము గలవాడా! (నేర్పుతో కావలిసిన వరాలను ఇచ్చువాడా!) సంతృప్తి చెందిన మనస్సును గుఱించి, ఆలోచించువాడా! (మంచి మనసు కలవారికి ముక్తి నొసగుటకు సిద్ధపడువాడు) మేలైన శాంతరసభవముతో నిండిన వాడా! ఎల్లప్పుడు ప్రశాంతమైన గుహయైన గల కొండయందు విహరించువాడా!

చ॥ **వరద! ర మారతా! భువన వంద్య! తపోత్సుక సేవకా వనా**
దరధర! శూర! మోక్షద! సుదంతిదయాన్విత! పాతకాంతకా!
కరధర! నారదాప్త! కనక ప్రకటాంబర హారధారణా!
హరి! భరితారిహంత! హరిహంసహయార్చిత! పూతకాంతకా! **336**

అర్థాలు : వరద= వరములు ఇచ్చువాడా! రమారతా= లక్ష్మియందు ప్రేమ (ఆసక్తి) కలవాడా!, భువనవంద్యా= లోకాలలో అందఱి చేత నమస్కరింప బడువాడా!, తప ఉత్సుక సేవక+జనఅవనా= తపస్సు చేయు కార్యమందు పూనుకొన్న సేవకులను రక్షించువాడా!, మోక్షద= మోక్షమిచ్చువాడా!, సుదంతి దయాన్వీత= గొప్ప ఏనుగును గూర్చి దయతో నిండినవాడా!, పాతక+ అంతకా= పాపులను వధించువాడా!, కరధర= చేతియందు కొండను ధరించినవాడా!, ధర (పుం). (గోవర్ధన గిరిధారి) నీరద+ఆప్త= నారదమునికి రక్షకుడా!, ప్రకట+అంబంహారధారణ!= గొప్పగోచరించు వస్త్రములను, మాలను ధరించినవాడా! హరి= ఓ హరి!, భరిత+అరి+హంత= నిండిన

శత్రువులను చంపినవాడా!, హరి= ఇంద్రునిచేత, హంసహయ= హంసను వాహనముగా గల బ్రహ్మచేతను, అర్చిత= పూజలు కొనువాడా!, పూతక+ అంతకా= పూతన అనెడి రాక్షసిని అంతమొందిచినవాడా!

లలితగతి॥ కలిత భూషణ లలిత భాషణ! కంసదానవ శోషణా!
దళితదూషణ దివిజ పోషణ! తాపసానిశతోషణా!
కలుషవారణ ఖగ విహారణ! కాంచనాంబరధారణా!
చలితవారణ భయనివారణ! శత్రుసంఘువిదారణా! 337

అర్థాలు : కలితభూషణ=ఆభరణములు కలవాడా!, లలితభాషణ= మృదువైన మాటలు కలవాడా!, కంసదానవశోషణ= కంసుడు అనెడి దుష్టుని మర్దించినవాడా!, దళితదూషణ= హింసించు వారిని నిందించువాడా!, దివిజపోషణ= దేవతలను పోషించువాడా!, తాపస+అనిశతోషణ= మునులకు ఎల్లప్పుడును సంతోషమును ఇచ్చువాడా!, కలుషవారణ= మాలిన్యమును తొలగించువాడా!, ఖగవిహారణ= పక్షిపై నుండి (గరుడుని వాహనముగా) విహరించువాడా!, కాంచన+అంబరధారణా= బంగారు వన్నెగల వస్త్రములను ధరించువాడా!, చలితవారణ= చలించిన ఏనుగు, భయనివారణ= భయమును పొగొట్టిన వాడా!, శత్రుసంఘువిదారణ= శత్రువుల మూకను చీల్చువాడా!

లలితగతి : ఛందస్సు. నభ నభ, రస(లగ) వ (20 అక్షరాలు)

యతి - 13వ అక్షరము.ప్రాసనియమము కలదు. **338**

గద్యము : ఇతి శ్రీ వేంకటేశ్వర వరలబ్ద కవిత్వ రచనా, చమత్కార సుజన భజనాచార్య, భరద్వాజ గోత్ర పవిత్ర నరసనామాత్య పుత్ర సకల సుకవిజన సఖ్య వేంకటాఖ్య ప్రణీతంబైన విష్ణుమాయా విలాసంబను మహా ప్రబంధంబు నందు, ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

శ్రీ సత్యాకుచకుంకుమ
భాసితబాహాంతరాళపరమకటాక్షా
వాస నిరంతర శాంతో
ర్వీ సన్నిభ బిట్రగుంట వేంకట రమణా! 1

ప్రతిపదార్థము : శ్రీసత్యా= మహాలక్ష్మీ సమురాలైన సత్యభామయొక్క, కుచకుంకుమభాసిత= చన్నులపైనున్న కుంకుమతో ప్రకాశించు, బాహాంతరాళ= బాహువులమధ్యగల, పరమ= దివ్యమైన, కటాక్షావాస= కడ కంటి చూపులోనుండి, నిరంతర= ఎడలేని, శాంత= శాంతమునకు, ఉర్వీసన్నిభ= భూమితో సమానమైన, బిట్రగుంట= బిట్రగుంట యను ఊరిలో వెలసిన, వేంకటరమణా= వేంకటేశ్వరా!

భావము : మహాలక్ష్మీ సమురాలైన సత్యభామాదేవిని కౌగిలించు కొనగా ఆమె చన్నులపైని కుంకుమపూత నీ ఱొమ్మును అంటియున్నది. అప్పటి ప్రసన్నమైన నీకడకంటి చూపులో ఎడలేని శాంతము గోచరించును. నీవు భూదేవి సముడవు, అని ఇట్లు కవి ఆశ్వాసారంభమున తన ఇష్టదైవమగు శ్రీవేంకటేశ్వరుని తాను బిట్రగుంటలో నిత్యము దర్శించుమూర్తిని ధ్యానించుచున్నాడు.

విశేషము : తిరుపతి వేంకటేశ్వరుడును బిట్రగుంటలోని స్వామియు ఒక్కరేయైనట్లు, వేంకటరమణుడు విష్ణువే, కనుక ఈ సత్య ఆ మహాలక్ష్మియే. అమ్మవారి ప్రసన్నతయే అయ్యవారి ప్రసన్నత అని కదా వైష్ణవసంప్రదాయము. ఈ భావమే స్వామి ప్రసన్నతను భూదేవి శాంతముతో పోల్చుటలో గ్రాహ్యము. ఇచట ఈ జగత్పితరులు ఐక్యస్థితిలోనే దర్శింపబడుట గమనార్హము. లక్ష్మి విష్ణుని శక్తి. ఆమె సత్యరూపములో ప్రేమాధిదేవతగా అభివ్యక్తమైనది మఱియు భూదేవిగా శాంతిసహనముల వ్యక్త శక్తి. ప్రకృతిగా అన్ని

అభివ్యక్తులలోను ఆమెకు తాదాత్మ్యవే, ఆమె వాని శరీరవే. నామరూపభేదములు ప్రాకృతములు.

ఆ॥ అవధరించు శౌనకాది సన్మునులకు
సూతు డిట్టులనియె బ్రీతితోడ
పరగ విష్ణుమాయ బ్రహ్మాదులకు నైన
మృడునకైన తెలియబడదు నిజము 2

అర్థాలు : అవధరించు= శ్రద్ధగావిను, పరగవసాగుచుండగా, మృడుడు= శివుడు.

భావము : విష్ణుమాయ క్రమ్మినప్పుడు, అది బ్రహ్మరుద్రులకైన తెలియరాదు. ఇందాశ్చర్యము, అతిశయోక్తి లేవు సుమా! అని వినుచున్న మునివరులకు సూతుడు ఇట్లు తెల్పెను.

విశేషము : పరగ, శివుడు అను శబ్దము లీ పద్యములో సార్థకములు.

చ. కమల భవుండు బ్రహ్మ పద గౌరత సర్వ నిసర్గనోత్సుక
క్రమమహిమాతి రేకమున గర్వము జెందిన ధర్మపత్ని వా
గ్రమణి యనేకముందెలుప గాదని పోయి దురంత దుఃఖియై
భ్రమసి యజాండముల్ దిరిగి పడ్డ యవస్థలు దెల్ప శక్యమే! 3

అర్థాలు : కమలభవుండు= బ్రహ్మ, పదగౌరత= తన స్థానముయొక్క గొప్పతనముచేత, నిసర్గన= సృష్టి చేయుటలోని, ఉత్సుకక్రమమహిమాతి రేకమున= ఔత్సాహికుని పద్ధతిలో ఆవేశముతో, వాగ్రమణి= సరస్వతి, అజాండముల్= బ్రహ్మాండములు, విశ్వములు

భావము : "బ్రహ్మ, తాను సృష్టికర్త అనెడి గొప్పతనము యొక్క ఆవేశములో గర్వము చెంది ధర్మపత్ని వాస్తవాలను తెల్పి వారించినను వినక భ్రమచెంది విశ్వములన్నియు తిరిగి, పొందిన కష్టాలను తెల్పుటకు సాధ్యముకాదు."

ఆ॥ ఎంతవారలైన శాంతి వహింపక
గర్వ మందిరేని గట్టిగాను
విష్ణుమాయ క్రమ్మివెతలను బెట్టంగ
మునిగి దుఃఖపడుదు రనిన మునులు 4

అర్థాలు : ఆత్మతా= ఆత్మభావమును, ఆత్మలక్షణమును, పోషకంబు= పెంచునది.

భావము : 'ఎవరైనా శాంతి లేక గట్టిగా గర్వించినచో, వారు విష్ణుమాయచే కష్టాలను పొంది దుఃఖపడుదురు.' అనగా మునులు.

క. ఏరీతి విష్ణుమాయా
వారిధుల మునింగి దుఃఖవశుడై దిరిగెన్
వారిజ భవు డే క్రమమున
నారయ తనపదముజెందె నానతి యీవే! 5

భావము : "బ్రహ్మ ఏవిధముగా విష్ణుమాయ యనెడి సముద్రములో మునిగి దుఃఖించి, ఎట్లు తన పదవిని పొందెనో తెలియజేయుము."

క॥ శ్రీమన్నారాయణచరి
తామృతరసపాన మాత్మతాపోషక మా
శామతి మరి మరి గోరెదు
ధీమతి గడు విస్తరముగ దెలుపవె కరుణన్ 6

భావము : "శ్రీమన్నారాయణుని చరిత్ర మనెడి అమృతరసపానము ఆత్మతత్త్వ మెఱుగుటకు తోడ్పడును. ఓ బుద్ధిమంతుడా! ఆశతో మనసు వినదలిచి యున్నది. కనుక పూర్తిగా దయతో తెల్పుము."

విశేషము : అమృతము అమరత్వమును ప్రసాదించునది. కాని, ఆత్మతత్త్వ జ్ఞానము దేవతల అమరత్వమునకు మించినది. ఈ పద్యములో స్వస్వరూప జ్ఞానావబోధము ఉద్దిష్టమని గ్రాహ్యము.

వ॥ అనిన నమ్మౌని సూతుండిట్లనియె 7

భావము : సూతుడు ఇట్లు తెల్పుటకు మొదలిడెను.

సీ॥ పరమేష్ఠియొకనాడు పలుకుల కల్కితో
సరసరహఃకేళి చతుర మతిని
తగు హంసతూలికాతల్పంబునందున
నతులితానందామృతాంబునిధిని
దేలుచు వాణి కపోల భాగంబుల
నిజ కౌశల క్రియా నిపుణ మొప్ప
మకరికా దళ వినిర్మాణంబు గావించి
ముకురంబు చూపిన మోహనాంగి

తే॥ విభుని చతురత్వమున కాత్మ వెఱగునొంది
సిబ్బితిని యూరకుండిన చెలువ యేమె
తగదు గాబోలు నీదు సౌందర్యమునకు
పలుక కుండుట కిది యేమి తెలుపు మనిన 8

అర్థాలు : పరమేష్ఠి=బ్రహ్మ, పలుకులకల్కి= సరస్వతి, రహఃకేళి= రహస్యక్రీడ, శృంగార చేష్ట, కపోలభాగంబులు= చెక్కిళ్ళు, ముకురంబు= అద్దము, ఆత్మ= తనలో, వెఱగున్= ఆశ్చర్యమును, సిబ్బితిని= సిగ్గుచేత.

భావము : బ్రహ్మ యొకనాడు పత్నితో క్రీడించి, సంతోషముతో, ఆమె చెక్కిళ్ళపై మొసలిని చిత్రించి ఆమె ముఖమును అద్దంలో ఆమెకే చూపెను. విభుని నిపుణతకు ఆశ్చర్యపడి సిగ్గుచేత ఆమె స్పందింపలేదు. 'చిత్రరచన నీ సౌందర్యమునకు తగినట్లు లేదా ఏమి? ఏల పలుక కున్నావు తెల్పుమా?'

చ॥ అతులిత వైఖరిం ద్రిభువనాంచిత సృష్టి వినిర్మితక్రియా
చతురుడవైన నిన్నిటుల సన్నుతి సేయగ నెంతదాన నా

ప్రతిభకు నిట్లదెంతయని భావములో దలపోయు దాన నీ
చతురత నేడు క్రొత్తలటె సర్వమయుండవు కావె వల్లభా! 9

అర్థాలు : అతులిత= సరితూచరాని, అంచిత= గొప్పదైన, వల్లభా= స్వామీ! (భార్య భర్తను పిలుచు తీరు)

భావము : "స్వామీ! త్రిభువన సృష్టికర్తవు. నిన్ను స్తుతించుటకు నా తెలివి చాలా తక్కువ. నీ నేర్పు క్రొత్తదా? సర్వమునందు నుండు వాడవు కదా!"

చ॥ అన విని యా చమత్కృతి నియామక మింకొక వింత వింటి వా
జనతతి ముఖ్యమైన చరజంతుముఖంబులు నన్ని వింతలై
తనర సృజించునట్టి వితత క్రియలెస్స యెరింగి నావె నీ
వన నొక చిన్ని నవ్వొలయ నంగన యిట్లనె ప్రాణనాథుతోన్ 10

అర్థాలు : చమత్కృతి= చతురత, జనతతి= మానవుల సమూహము, చరజంతు= చలనముగల ప్రాణులు, తనర= ఉండునట్లు, వితత= వ్యాప్తమైన, విస్తారమైన, లెస్స= బాగుగ, అంగన= స్త్రీ, సరస్వతి.

భావము : అనగా విని బ్రహ్మ "నా సృష్టిలో ఒకవింతను విన్నావా! తిరుగుచున్న జీవుల ముఖముల నన్నింటిని, వింతవింతగా సృష్టించెడి నా పనులను గూర్చి నీవు తెలిసికొన్నావా?" అని ప్రశ్నింపగా, వాణి, ఆ మాటలు నచ్చకపోవుటచే చిఱునవ్వుతో పతితో ఇట్లని బదులుపల్కెను.

ఉ॥ చేరెడు మోములో బహువిచిత్రములన్ సృజియించినట్టి నీ
నేరుపు వన్నెకెక్కె కడు నీరజ తంతువు సూక్ష్మమైన శా
రీరములందు నేను బహురీతుల నాదము లొంద జేయు టె
వ్వారు నుతింపరైరి యిది వాదము గాదు సుమీ మనోహరా! 11

భావము : "ఓ మనోహరా! చిన్న ముఖమందు, మీరు పెక్కు చిత్రములను చెక్కినారు. మీ నేర్పు వన్నెకెక్కినది. తామరతూడుల వంటి సన్నని నాడిలో

మధురమైన నాదములను కల్గించుచున్నాను. కాని నా నేర్పును ఎవ్వరును తలంచుట లేదు. ఈ మాటలు వాగ్వాదమునకు నేను చెప్పుటలేదు!"

విశేషము : బ్రహ్మసృష్టిలో స్థూలశరీరములలో అన్నింటికంటె ముఖ్యమైనది ముఖము. ఈ ముఖములలోని వైవిధ్యము ఆశ్చర్యకరము. కనుక దీని రచనాచాతుర్యము చాల ప్రసిద్ధమైనది. ఈ బ్రహ్మసృష్టించిన శరీరములలో నాదసృష్టి చేసినది సరస్వతి. ఈ నాదము నాభినుండి వెడలి చెవులకు వినరాని దశనుండి, కంటికి కనరానంత సన్నని నాడివెంట వెడలుచు సుస్పష్టమైన మధురమైన వాక్కుగా వ్యక్తమగుచున్నది. స్థూలసృష్టిలోని చాతుర్యము నెంతగనో అభినందించిన లోకములు సూక్ష్మనాదసృష్టిలోని చాతుర్యమును గుర్తించరైరి కదా అని సరస్వతి భావము. చేరెడు మోములో అనుదానితో నీరజతంతుకు సూక్ష్మమైన అనునది ఈ స్థూలసూక్ష్మముల భేదమును వ్యక్తము చేయును.

చ॥ **అన విని నిక్కమీ పలుకు లారయ నీ మహిమంబు నెన్న నీ**
జననమదెట్టులో తెలియజాలితి వా నిను నీవె యింతగా
వినుతి యొనర్పగా నగు వివేకమునుం గలదందు నక్కటా
కనకశరీర నావలన గల్గియు నీవిటు నన్ను గేరెదే 12

అర్థాలు : నిక్కము= నిజము, నావలన కల్గియు= నాచే సృష్టింపబడిన దానవైయుండియు, కేరెదే= హేళన చేయుదువా? గేలి సేయుదువా?

భావము : "నీ పలుకులు నిజమే! నిన్ను నీవే పొగడుకొను చున్నావు. నీ పుట్టుకను గుఱించి నీవు తెలిసికొంటివా? నిన్ను నీవే పొగడుకొను తెలివి కల్గియున్నావే! (ఇది తగనిదని సూచన). బంగారు వన్నె శరీరము కలదానా! నా వలన పుట్టి నన్నే గేలిచేయుచున్నావా?" (ఇది తగదని హెచ్చరిక).

విశేషము : వ్యంగ్య ప్రధానమైన పద్యమిది. బ్రహ్మ తాను భారతిని గేలిసేయుచు, ఆమె తన్ను గేలిచేసినదని నెపము జూపుచున్నాడు. సరస్వతికి

ఆమె పుట్టుకను గుర్తుజేయుచున్న బ్రహ్మకు తన జననము గుర్తురాలేదు. సరస్వతి మాటలలో స్వోత్కర్షము కనిపించినది, కాని బ్రహ్మకు తన మాటలలోని అహంకారము కనబడలేదు. ఇది మాయ లక్షణము. తనలోని దోషములను ఎదుటివారిలో కనిపెట్టుట.

క॥ **సకల ప్రపంచమంతయు**
శుకవాణి మదీయ మాయ జూపట్టంగా
నక టకట నాకు బ్రతియై
వికటంబులు పల్కె దెంతబేలవు తెలియన్ 13

అర్థాలు : శుకవాణి= చిలుకపలుకులవలె మధురముగ మాటలాడుదానా!, మదీయ= నాయొక్క, ప్రతియై= పోటిగా, వికటంబులు= (ఎదిరించి), వినరానివి, బేలవు= అమాయికవు.

భావము : "విశ్వమంతయు, నామహిమయే! నాకే పోటీగా, వంకరమాటలు పల్కుచున్నావు. నీవు ఎంతటి తెలియనిదానివో!"

విశేషము : మాయ అనుదానికి 'మహిమ' అనునర్థమున ప్రయోగము. అహంకారమను మాయలోబడిన బ్రహ్మకు ఆ మాయచే భ్రాంతి కలిగినది. శుకవాణి, బేలవు, అను పదములు బుజ్జగింపుమాటలు.

చ॥ **వనితరో! హాస్యకేళి నెటు పల్కిన కూరిమి పెంపునింపునై**
నను భవదీయ మానసము నం దొకయించుకహంకృతిం బలెన్
మనమున దోచుచున్న యది మామకమాయ జగత్త్రయంబుగా
నొనరగ నీకునుం దెలియ నూల్కొనునే మతి లెస్స యుగ్మలీ! 14

అర్థాలు : హాస్యకేళివ సరసములాడుటలో, కూరిమివ ప్రేమ, పెంపున్వ పెరిగినందున, ఇంపునైనను తియ్యగానైనను, భవదీయవ నీ, మామకవ నాదైన, నూల్కొనువ కలుగు, యుగ్మలీవ ఓ ఆడుదానా!

భావము : "ఓ ఆడుదానా! నవ్వులాటకై ప్రేమాతిశయముతో తియ్యగా నీవు పల్కినను, నీ మనసులో కొంచెము అహంకార మున్నట్లు తోచుచున్నది. నా మాయచే మూడు లోకాలు చక్కగా సృజింపబడినవి. నీ మదిలో స్పష్టముగా అది స్ఫురణకు రాలేదా!"

విశేషము : 'తప్పులెన్నువారు తమ తప్పులెఱుగరు'అన్నట్లు, బ్రహ్మతాను అహంకరించి మాటలాడుచు సరస్వతిలో అహంకారము కనబడుచున్న దనుచున్నాడు. తన మాయను ఆమె తెలియలేకున్నదని జాలిపడుచున్నాడు. ఓ ఆడుదానా! అనుటచే వివేకవతి కాదని ధ్వని.

వ॥ అనిన వాణి విభుని దురాగ్రహంబునకు కటకటంబడుచు నల్లన యిట్లనియె 15

భావము : వాణి పతి అధికమైన కోపానికి చాలా బాధపడి మెల్లగా ఇట్లనెను.

చ॥ మగని నెదిర్చి పల్మరును మారులు పల్కుట ధర్మ వృత్తియే
మగువల కెందునైన పరమంబగు ధర్మము దెల్పు వేళలన్
దగు బలుమారు నిట్టులను తావక జన్మమదెట్లు గల్గెనో
జగదధినాథ! తెల్పు మిది సత్యముగా నన బల్కెకిన్కతోన్ 16

అర్థాలు : తావక= నీయొక్క, కిన్కతోన్= కోపముతో.

భావము : "ఓ లోకనాయకా! భర్త మాట కెదురు మాటాడుట భార్యకు తగదు. ఇది సాధారణ ధర్మము. అలౌకికమైన ధర్మప్రసంగమున మాత్రము ఇట్లు మరల మరల గూడ భార్య మాట్లాడవచ్చును. ఇది విశేషధర్మము. దీని ననుసరించి నేను మాట్లాడుచున్నాను. తమ జన్మము ఎట్లు కల్గెనో సత్యమును తెల్పుము" అనగా, కోపముతో బ్రహ్మ యిట్లనెను.

క॥ బాలామణి! నీ మనమున
నీలాగున దోచియున్నదే వేదంబుల్

వేలుపు పెద్ద స్వయంభువు
వాలాయం బెవ్వరనుచు వర్ణింపదగన్ 17

అర్థాలు : వేలుపు= దేవత, స్వయంభువు= తనకుతానై వెలసిన, వాలాయంబు= తప్పక, తగన్= తగిన విధముగ.

భావము : "ఓ బాలా! దేవతలకు పెద్ద బ్రహ్మ. తనకు తానే జన్మించెనని వేదములు స్పష్టముగా వర్ణించుచున్నవి కదా! ఆశ్చర్యము. నీ మనసులో ఇట్లు తోచెనే!"

క॥ నేనె స్వయంభువుగానే
మానిని యీ సకల సృష్టిమహిమాతిశయం
బేనెట్ల పూన్పువాడను
పూనునె మరి యొక్క వేల్పు భువనములందున్ 18

అర్థాలు : పూన్పు= కలిగించు, పూను= సామర్థ్యము గలిగియుండు.

భావము : ఓ మానిని! నేను స్వయముగా జన్మించినవాడనై, ఈ సృష్టిని కావించు చున్నట్లు, మహిమచే మఱొక దేవత, ఈ లోకాలలో చేయలేడు.

శా॥ నామాయా మహిమాతిరేకమున నీ నానా విధంబైన స
ర్వామర్త్యాహిమనుష్యలోకములు మూడై యుండు బధ్నాలుగై
సోమార్కానల భాసమై సకల వస్తు వ్రాత సంపూర్ణమై
గ్రామాద్యాకృతితో చరాచరమునై బ్రహ్మాండ మిట్లొప్పదే 19

అర్థాలు : అమర్త్య= దేవతలు, అహి= పాములు, సోమ= చంద్రుడు, అర్క= సూర్యుడు, అనల= అగ్ని, భాసమై= వెలుగుచు, వ్రాత= సమూహముతో, గ్రామాది ఆకృతితో= గ్రామము మొదలగు రూపములతో.

భావము : "నా మహిమచే మూడులోకాలు, పద్నాలుగు భువనములు చరాచరములు అన్ని ఏర్పడినవి. అదియే బ్రహ్మాండముగా నున్నది."

విశేషము : లోకములు మూడు - దేవలోకము, మనుష్యలోకము, అహి(నాగ) లోకము. అహిలోకము అనగా పాతాళము, కాగా, మనుష్యలోకము భూలోకము. ఇది కేంద్రముగా పైన ఊర్ధ్వలోకము దేవలోకమనియు, క్రింద అధోలోకమనియు పాతాళమనియు లోకోక్తి. మఱియొక విధమున, భూర్భువస్సువః అని భూలోకము, భువర్లోకము, సువర్లోకము(స్వర్లోకము) అనుటలో పాతాళాది అధోలోకములు కాక భూమినుండి భువము, స్వర్గము మాత్రమే చెప్పబడినవి. పాతాళాదులు తలములుగ చెప్పబడినవి. అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళములేడు. ఇవియును, భూలోక, భువర్లోక, మహర్లోక, జనర్లోక, తపోలోక, సత్యలోకములు ఏడును, కలిపి పదునాలుగు లోకములు చెప్పబడినవి. ఇది బ్రహ్మ సృష్టియగు విశ్వము. బ్రహ్మలోకము (సత్యలోకము)న కిది యంతయు దిగువనుండు నదియే.

ఆ॥ నాతి వినవె బ్రాహ్మణ సమూహము నుడువు
నట్టిచదువుతుదలయర్థ నియతి
సకలలోక మౌళి సత్యలోకంబును
నది యెఱుంగ వేమె విదితమగుట 20

అర్థాలు : చదువుతుదలయర్థనియతి= వేదాంతార్థము, సకలలోకమౌళి= అన్ని (పదునాలుగు) లోకములకు పైనున్నది, విదితము= తెలిసినది.

భావము : "బ్రాహ్మణుల విద్యలందు వేదములకు అర్థము అన్ని లోకాలకు శిరస్సుగా, సత్యలోకమున్నదని, ఇది విశదమేకదా! ఓ వనితా నీవు వినలేదా!"

క॥ నా సృష్టిలోని వారిని
వాసవ శివ విష్ణు ముఖులు వనితా మణి! నీ
వీ సందేహము మానుము
నా సరి వేల్పెందు గల్గునా భువనములన్ 21

అర్థాలు : నాభిపంకేరుహంబున= నాభినుండి మొలచిన పద్మములో, మఱియొకవిధమున, నాభి (బొడ్డు) అను పద్మములో, శ్రుతులు= వేదములు, చతురాస్యుడు= నాల్గు ముఖములు గల బ్రహ్మ, క్రొవ్వాడి మిగిలి= పదును మీరి, తీవ్రముగ.

భావము : "ఓ కాంతా మణీ! నా సృష్టిలోని వారే ఇంద్రుడు, శివుడు, విష్ణువు మొదలైన ముఖ్యులు. నీ సందేహమును వదలి పెట్టుము. ఈ లోకాలలో నాకు సమానుడైన దేవుడు ఉండునా?"

సీ॥ అనిన భారతి యిట్టులనియెనో సర్వేశ!
యఖిలంబు సృష్టించునట్టి నీకు
హరినాభి పంకేరుహంబున బుట్టుట
కమలజుండనుచు ప్రఖ్యాతిగనుట
కేమి కారణమిది యింత మాత్రమె గాదు
హరియనంతుండను నట్టి విధము
మది సర్వమును విష్ణు మయమను నియతియు
కడు విష్ణుమాయదుర్ఘటముననుట

తే॥ నిట్లు శ్రుతులెల్ల బలుకుట కిందుకేమి
గతి మహాత్మక యిది లెస్సగా వచింపు
డనుచు బలికిన చతురాస్యు డాగ్రహమున
వాణి కిట్లని పల్కె క్రొవ్వాడి మిగిలి 22

భావము : భారతి ఇట్లనియె. "ఓ సర్వేశ! నీవు హరి బొడ్డులో నుండి పుట్టితివి. కమలజుడని పేరు. సర్వము విష్ణుమయము. ఆతని మాయను దాటుటకు సాధ్యముకాదు. వేదాలు ఇట్లు తెల్పుచున్నవే! దీనికేమి కారణము. మహాత్మా! చక్కగా వివరింపవే!" అనగా బ్రహ్మ తీవ్రకోపముతో కటువుగా ఇట్లనెను.

ఉ॥ దారువులందు బుట్టు శిఖి దారువులే యశనంబుగా గొనున్
దారువు పావక క్రియల దానొక యించుక మాన్పనేర్చునే
యారయదారుజాతము హుతాశనునందొక దూషితంబె య
వ్వారిజ జాతమెంచ గొదవా మదవారణ మందచారణా! 23

అర్థాలు : దారువు= కొయ్య, శిఖి= అగ్ని, అశనంబు= ఆహారము, పావక క్రియల= అగ్ని చేష్టలను, దారుజాతము= కొయ్యలోపుట్టుట, హుతాశనుడు= అగ్ని, దూషితంబె= దోషమా? మదవారణమందచారణా!= మదించిన ఏనుగువలె మెల్లగా నడచుదానా!

భావము : "అగ్ని దారువులో జన్మించి సర్వమును దహించినను అతనిలో దోషములేదు. అట్లే తన జన్మలో అది దోషమా?"

విశేషము : అహంకారిలో అన్నియు దోషములేయనినట్లు, బ్రహ్మకిప్పుడు తాను సృష్టించిన కొయ్యలోని అగ్నిని తాను సృష్టించలేదని తెలియదు. చైతన్యతేజో విశేషమగు అగ్ని సాక్షాత్ పరమేశ్వరుని అంశగా అన్నిటను అంతర్యామి యని తనకు తెలియదు. విష్ణుని నాభికమలమున తాను కలిగితినని తెలియదు. కాని తన్ను సృష్టించినది విష్ణువని బోధములేదు. సరస్వతిని మదవారణమందచారణా! అని సంబోధించుటలో ఆమెకు మదమెక్కినదనియు ఆమెలోని వివేకము మందగించినదనియు ధ్వని.

ఆ॥ విష్ణు భక్తులెల్ల విష్ణుమాయనియంద్రు
సరవి శివునిమాయ శైవులంద్రు
కలికి వినవె బ్రహ్మగారడంబన గాదు
యరయ నిందు సందియంబు గలదె 24

అర్థాలు : సరవిన్= క్రమముగా, గారడంబు= మాయ.

భావము : "విష్ణుమాయ, శివునిమాయ అని అనుచున్నారు. "బ్రహ్మమాయ" అను మాటలేదు. ఇందు సందేహములేదు."

ఉ॥ చూడుము నా మహామహిమచోద్యము చేసెద నీకు నిప్పు డీ
రేడు జగంబులందు వసియించిన మామక భూరితేజమున్
నేడు గ్రహించి యొంటిమెయి నిల్చెద విష్ణువు గిష్ణు వంతటన్
గూడగ బెట్టి సృష్టి యొనగూర్చుచు నుండగ నేనె చూచెదన్ 25

అర్థాలు : ఈరేడు= ఏడేడు, పదునాలుగు, మామక= నాదైన, భూరి= గొప్ప, విశాలమైన ఒంటిమెయి= ఒక్క శరీరముగా, గిష్ణువు అనునది శబ్దపల్లవము. విష్ణుని చుల్కన చేయుటకు వాడబడినది.

భావము : "చూడుము నా చాతుర్యము. నా గొప్పతేజస్సును తొలగించి, ఒకే యొక్క శరీరముతో నిల్చెదను. ఆ అల్పుడు విష్ణువు ఎట్లు తనశక్తిని కూడగట్టుకొని సృష్టిచేయునో ఆ విధానమును గమనించెదను."

క॥ నాకన్న వేలుపెవ్వడు
నాకొలది యెరుంగలేక నా మన్ననచే
నీ కిట్లాడగ జెల్లెను
గాకున్న యొరుండు బల్కి గడతేఱు నటే 26

భావము : "నాకన్న పెద్దవారెవ్వరు? నాశక్తి తెలియక నీ వట్లనుచున్నావు. నా ఆదరముచే, నీ విట్లు మాట్లాడినను సహించితిని. ఇట్లు పల్కిన ఇతరుడు బ్రతుకగలడా!"

క॥ జగములు నాకు నధీనము
జగములకే భర్తనయ్యు జగము సృజింపన్
మిగులనెఱనాది గావున
తగు స్రష్టత్వంబు మరియు తగ దెవ్వరికిన్ 27

అర్థాలు : నెఱ= నేర్పు, గొప్పతనము.

భావము : "నేను లోకాలకు ప్రభువును.అవి నాకు వశమై యున్నవి. ఆ శక్తి ఇతరులకు లేనే లేదు. వారు అర్హులు కారు."

ఆ॥ నేను వ్రాసినట్టు నియతిని బోషించు
విష్ణువెల్లవేళ విశ్వములను
నేను వ్రాసినట్టునియతిని విలయించు
శివుడు నింతకన్న జేయలేరు 28

అర్థాలు : నియతిని= నియమమును, క్రమమును, విలయించు= నశింపచేయు.

భావము : "నా నియమమున విష్ణువు నిర్వహించును.శివుడు నశింపజేయును. ఇంతకుమించిన శక్తి వారికిలేదు."

ఉ॥ కావున ముజ్జగంబులకు గర్తను భర్తను భోక్తనెంతయున్
దేవుడనేనె కాక మరి దేవుడు లేడది యెట్టు లన్నచో
జీవుల కర్మ సంగతి సృజించిన దేవ మనుష్య ముఖ్య నా
నావిధ జంతుజాలము లనంత చరాచర కోటులై తగున్ 29

అర్థాలు : కర్మసంగతి= కర్మ సంబంధమున, కర్మననుసరించి.

భావము : "ముల్లోకాల్లో కర్తను, భర్తను అనుభవించు వాడైనదేవుడను నేను. వాని, వాని కర్మలచే సమస్తము, అమితమై ఆ చరాచరములు కలిగినవి. వాని కర్మలను బట్టి వానిని నేను సృజించితిని."

క॥ ఇంతకు మిక్కిలి లేదను
టెంతయు దుర్గర్వమునకు యెదురుండదని యొ
క్కింత యెఱుంగక పల్కిన
కాంతామణి కలఁకు గల్గె కారణమగుచున్ 30

భావము : బ్రహ్మ తనకంటె అధికుడు లేడను వాదమెంతయును తనచెడ్డ గర్వమునకు ఎదురుండదనియే, కొంచెము కూడ ఆలోచింపక పల్కుట, సరస్వతి మనస్సు కలత చెందుటకు కారణమయ్యెను.

వ॥ ఒక్కింత వారించి నానా నేర్పుల దెలుపంగా వినని పక్షంబునుభవింపశీఁరదని
తన విధున కిట్లనియె 31

అర్థాలు : నాయము= న్యాయము, చివ్వ= కలహము, కవ్వ= పోట్లాట, కొఱగాములు= దోషములు.

భావము : పెక్కు విధములైన నేర్పు మాటలతో పల్కినను, వినకపోవుటచే కష్టాలను విభుడు అనుభవింపక తప్పదని తలచి ఇట్లనెను.

ఉ॥ నవ్వులకే ఛలోక్తి దగ నాయము బల్కిన యట్టి పల్కులే
చివ్వకు మూలమాయె నిక జెప్పెడిదేమి మహత్ప్రభున్ హరిన్
గవ్వకుగాక యుండ కొరగాములు నీ యెడబుట్టె నేటి కె
ట్లెవ్వరు మెత్తు రీ పలుకు లెట్లు దురాగ్రహమెందు గల్గనే 32

భావము : "కేవలము నవ్వులతో, చమత్కారముగ మంచిమాటలు చెప్పగా అవియే కలహమునకు మూలకారణమైనవి. ఇక చెప్పవలసినదేమున్నది? మహానాయకుడు హరితో పోట్లాడుటకే, యిప్పుడు నీలో చెడ్డ లక్షణములు గల దోషములు కల్గినవి. ఏలనో! ఏవిధముగా ఎవ్వరైనను నీ మాటలను మెచ్చుకొందురా? ఈ చెడ్డ కోపము ఎందుకు కల్గెనో కదా!"

సీ॥ అఖిలాండకోటి మహాండనాయకుడన
వర్ణనో వేదాంత నిర్ణయంబొ!
అచ్యుతానంతనారాయణాఖ్యాతముల్
వర్ణనో వేదాంత నిర్ణయంబొ!
మరి సర్వమును విష్ణుమయమను విఖ్యాతి
వర్ణనో వేదాంత నిర్ణయంబొ!
బహుమస్త కేక్షణపాణిపాదుండన
వర్ణనో వేదాంత నిర్ణయంబొ?

ఆ॥ సర్వమయుడు భర్త సర్వాత్మకుండును
విష్ణుభక్తిగాని విపులమైన
జ్ఞానమొదవదనెడు చదువులు వ్యర్థమే
పదరకాత్మ జూడు ప్రాణనాథ! 33

అర్థాలు : అఖ్యాతములు= చెప్పబడినపేర్లు, బహుమస్తకేక్షణపాణిపాదుండ= లెక్కలేనన్ని తలలు, కన్నులు, చేతులు, కాళ్ళు గలవాడు, పదరక= కోపించక, ఆక్షేపించక, తొందరపడక.

భావము : "సర్వమయుడుసర్వాత్మకుండు" అను మాటలు అర్థములేనివా? ఓ నాథా! త్వరపడక చూడుము".

విశేషము : ఈ సీసపద్యమున మొదటి పాదమొక వేదోక్తిని జెప్పి రెండవ పాదము ఇది కవివర్ణనమా? వేదాంత జ్ఞానమా? అని పునరుక్తిగా నడుగుట వలన సంవాదశైలి పరిపుష్టమై నాటకీయత సమకూడినది. 'బహుమస్తకేక్షణపాణి పాదుండు' అనునది భగవద్గీతలోని విశ్వరూపసందర్శనమును గుర్తు చేయునది. నాలుగు వేదములు తన నాలుగు మోములనుండి వెలువడుచున్నను, బ్రహ్మకు వాని అర్థమునం దాసక్తి తప్పినది. కనుకే సరస్వతి జ్ఞాపకము చేయబూనినది. ఐనను అహంకారమువలన బ్రహ్మకు ఆత్మజ్ఞానము మసకబారినది.

క॥ వలవని దుర్గర్వంబున
గలుగునె సర్వేశ్వరత్వకం బీలోకం
బులనొక్కలోక విభుతను
మెలగెడు మనమెంత వినుమ మహితుండతడున్ 34

అర్థాలు : వలవని= తగని, కూడని, పనికిరాని, విభుత= అధికారము, ఆధిపత్యము.

భావము : "తగని చెడ్డ అహంకారముచే సర్వలోకాధిపత్యము కలుగునా? పదునాలుగు లోకాలలో ఒక లోకమునకు అధికారము కల్గి ప్రవర్తించు మన మెంతటివారము వినుమా! హరి చాలా గొప్పవాడు."

సీ॥ కొండతో తగరు ఢీకొని మూర్ఖతను దాక
నొప్పిని బడుగాక దా నికేమి?
సార్వభౌమునితోడ జానపదుండల్ల
తా స్రుక్కుగాక నాతనికి నేమి?
మదపు టేనుంగుతో మశకంబు పోరెనా
తా నశించునుగాక దానికేమి?
తరణితోడుత మిణుంగురుబుర్వు రహిబూన
తా నణంగునె కాక దానికేమి?

తే॥ ఎదురుదన్నును దానింత యెరుగ వలదె
వెరసి సన్నిధి నెట్టి వివేకియైన
యెడము లేని యహంకార మెడయవలయు
విశ్వసింపుము నా మాట విమలమతిని 35

అర్థాలు : స్రుక్కు= దుఃఖించు, తగరు= పొట్టేలు, జానపదుండు= గ్రామీణుడు, మశకంబు= దోమ, తరణి= సూర్యుడు, ఎడయ= తొలగ.

భావము : "కొండను పొట్టేలు పొగరుపోతై తన కొమ్ములతో పొడిచినను, దానికే నొప్పి కల్గును. కొండకేమి నష్టము లేదు! మహా సామ్రాజ్యధిపతిని ఎదిరించిన పల్లెవాడు దుఃఖముల పాలగును. ప్రభువున కేమియు కష్టము కల్గదు! మదించిన ఏనుగును ఎదిరించిన దోమ నాశనమగును. ఏనుగునకు ఏమి బాధకల్గును? సూర్యునితో వైరము పెట్టుకొన్న మిణుగురు పురుగు మాడిపోవును. కాని సూర్యుని వేడిమి తగ్గునా? ఎదుటి వాని బలమును తాను కొంత ఎఱుగవలెను. సారమేమనగా ఎట్టి తెలివి కలవాడైనను, ఎక్కువైన

అహంకారమును వదలిపెట్టవలెను. శుద్ధమైన మనస్సుతో నా మాటను నమ్ముము."

క॥ అని యెంత విన్నవించిన
తన మదినంతంత కోపతాపములడరన్
గనలుచు తనదు ప్రభుత్వము
తన సతికిం జూప దలచి తహతహతోడన్ 36

అర్థాలు : అడరన్= అధికముకాగా, కనలుచు= కోపముతో మండుచు, తహతహతోడన్= తొందరపాటున.

భావము : ఎంత చెప్పినను వినక కోపము ఎక్కువకాగా బ్రహ్మ ఆవేశముతో త్వరలో తన శక్తిని చూపదలచెను.

మ॥ విను మోతన్వి! యనన్య సంఖ్యము మహావిశ్వంభర ప్రౌఢిమం
బును నేనిప్పుడు నీకు నిక్కముగ జూపున్ వాడ నీవిచ్చటం
గనుగొంచుం నిలుమం చదృశ్యుడయి లోక వ్రాత సంఘాఢ్యమౌ
తనతేజంబును దా గ్రహించి చనె నుద్యత్క్రోధఘూర్ణాత్ముడై 37

అర్థాలు : తన్వి= మెఱుపుతీగవలె తళుకు మనునది, సన్ననిది, స్త్రీ, విశ్వంభర ప్రౌఢిమంబును= విశ్వమును భరించుశక్తిని, లోకవ్రాతసంఘాఢ్యమౌ= అన్ని లోకములలోని తేజస్సమూహముల కలయిక అయిన, ఉద్యత్ క్రోధఘూర్ణాత్ముడై= ఎక్కువగుచున్న కోపముచే నిండినవాడై.

భావము : "ఓ వనితా! వినుమా! బహుళమైన విశ్వమందు గల నా నేర్పును, నీకు ఇప్పుడే చూపగలను. ఇక్కడే ఉండి చూడుము" అనుచు లోకమునందున్న తన తేజమును వెనుకకు తీసికొన్నవాడై మిక్కుటమగు చున్న తీవ్రకోపముతో చలించుచున్నవాడై పయనమయ్యెను.

మ॥ చని లోకంబులు భూమియున్ కులగిరుల్ సప్తాంబుధుల్ ద్వీపముల్
వన దుర్గంబులు చక్రవాళమును లీలం దాటి పోబోవగా

ఘనగాఢాంధతమఃప్రపూర్ణమగు లోకవ్రాత శూన్యస్థలిన్
వనజాతాసను డొక్కచో నిలిచె దుర్వారాత్మగర్వంబునన్ 38

అర్థాలు : కులగిరుల్= మహాపర్వతములు, చక్రవాళము= భూమినిచుట్టి యున్న మండలము, లీలన్= సులభముగా, వనజాతాసనుడు= బ్రహ్మ.

భావము : పయనమై, లోకములు, భూమండలాలు, మహాపర్వతములు, పదునాలుగు లోకాలు, పలు ద్వీపాలు, వనములు, దుర్గములు, చక్రవాళమును సులభముగా దాటి చిమ్మ చీకటిగల చోట బ్రహ్మ గర్వముతో నిలిచెను.

విశేషము : పోతనగారు భాగవతములో "అలోకంబగు పెంజీకటి" యని చెప్పిన ప్రదేశమే ఇక్కడి "గాఢాంధతమఃప్రపూర్ణమైనది" లోకవ్రాత శూన్యస్థలి.

క॥ అంతట నక్కడ వాణీ
కాంతారత్నంబు ప్రియుడు కను మొఱగినచో
సంతానవాటికాంతర
కాంతార విహార శైలకంధరతతులన్ 39

అర్థాలు : కనుమొఱగినచో= కనుమఱుగైనప్పుడు, సంతాన వాటికాంతర కాంతార విహారశైల కంధర తతులన్= సంతాన వృక్షములు గల ప్రదేశముల నడుమ దట్టమైన తోటలతో విహరించుటకు అమరిన కొండల సమూహము.

భావము : బ్రహ్మ కనబడకపోగా, వాణి అతనికై దట్టమైన అడవులు, క్రీడాశైలములను వెళ్లి చూచెను.

శా॥ కెళీగేహములన్ సరోవరములన్ క్రీడా విలాసోర్వరన్
యేలాలుంగలవంగ గుల్మములప్రాణేశున్ వితర్కింపుచున్
బాలారత్నము నాథుగానక తపింపం జూచి యా నెచ్చెలుల్
జాలుం జాలు మరేల నాథునకునై సంతాపముం జెందెదో? 40

అర్థాలు : కేళీగేహములన్= ఆడుకొను ఇండ్లు, క్రీడావిలాస+ఉర్వరన్= విలాసముగ తిరుగు స్థలములు, ఏలాలుంగలవంగగుల్మముల= ఏలకి మాదీఫలము, లవంగము మొదలగు తీగపొదలలో.

భావము : వేర్వేఱు చోట్లను తోటలను చేరి పతిని గానక చింతతో తపించెను. అపుడు చెలులు ఆమెను ఇంక చింతను మానుమని కోరిరి.

ఉ॥ మాటలలోన మేలగునె మానవతీమణివయ్యు యింత నే
డేటికి పెచ్చురేగి హృదయేశుని చిత్తమెరుంగలేకనే
మాటకు మాట గూర్మెడలి మాటికి మాటికి మర్మభేదులన్
గాటపునిష్ఠురోక్తులను కారియబెట్టిన మేలుగల్గునే 41

అర్థాలు : కూర్మి+ఎడలి= ప్రేమను వదలి, మర్మభేదులన్ గాటపు నిష్ఠురోక్తులను= మర్మాన్ని భేదించునట్టి తీవ్రమైన కఠినపుమాటలతో, కాఱియబెట్టిన= కష్టపెట్టిన, బాధించిన.

భావము : "మాటలతోనే మేలు కలుగునా? మానవతివి అయ్యును ఆవేశముతో ప్రాణేశుని మనసును గ్రహింపక కఠినములైన మాటలచేత బాధించితివి కదా! అది మేలు చేయునా ఏమి?"

చ॥ అపుడు ప్రవాహ వేగమున నాడి విభుం డెడబాసియున్నచో
నిపుడు కలంగి చింతిలిన నిందుకు నెవ్వరు మెత్తురమ్మ ని
ష్కపటవివేకముం దెలుపగావలెనేని మృదూక్తులన్ ముదం
బుపగత మౌ విధంబున నయోన్నతి బల్కుటలొప్పుగాక యి
ట్లపహసితోక్తులన్ మగని నారడి బెట్టుట నీకు జెల్లునే? 42

అర్థాలు : కలంగి= కలవరపడి, ఉపగతమౌ= కలిసియుండు, నయోన్నతి= వినయముతో ఆరడిబెట్టుట= నిందించుట.

భావము : "అమ్మా! మిక్కిలి వేగముతో మాట్లాడి, భర్త వెడలిపోగా ఇట్లు చింతించుట ఎవ్వరు మెచ్చెదరు? శుద్ధమైన తెలివితో తెలియచెప్పవలెనన్నచో,

మెత్తని పలుకులచే, సంతోషము కలుగునట్లు చక్కని వినయముతో పల్కవలెను. కాని గేలి చేసినట్లు మగని బాధించితివి. అది తగునా?"

చ. అనవిని యొక్క ప్రోడ తగవాడితి లెస్సగ నీతిమంతురా
లనదగు నిన్ను కీడెవరిదాయెను నాథుని కొక్కవేళ దా
మనమున నీతి దోచ కభిమానమునన్ పెడబుద్ధి జెందితే
విను ప్రియకాంత మాతవలె పేర్మిని బుద్ధులు చెప్పరాదటే? 43

అర్థాలు : ప్రోడ= ప్రౌఢ, పేర్మిని= ప్రేమతో.

భావము : అను మాటలు విని ఇట్లనెను. ఒక నిపుణమతి, "తగిన మాటను చక్కగా చెప్పితివి . నీతిమంతురాలవు నీవు. నీభర్త నీ నీతిని వినక, దుష్టబుద్ధి యైనచో కష్టమెవ్వరికి కలుగును? వినుమా, భార్య తల్లివలె ప్రేమతో, బుద్ధి చెప్పుట తగును."

వ॥ అని యత్యంత చింతాక్రాంతయు నిర్వచనయునై యున్న శారదాదేవి నుపలాలింపుచు మరియు నిట్లనియె 44

భావము : కాని చింతచే మాట్లాడకపోవుటచే మఱియు శారదాదేవిని బుజ్జగించి ఇట్లనెను.

మ॥ తన శ్రేయస్సునకై హితోక్తులు కడుం తథ్యంబులుం బల్కినన్
మనమేరీతిని కల్కచెంది పతి కన్మాటైన నీవిట్టులన్
వనితా చింతిల నేల నమ్మ పతి సర్వజ్ఞుండు నీయందు మ
న్ననయుం గూరిమి నన్ను క్రొత్త యనుమానం బేల నీకియ్యెడన్ 45

భావము : "తనమేలుకై, తగినమాటలు, వాస్తవాలను దెల్పగా ఏవిధముగానో కలతచెంది పతి కనబడకపోవుటచే ఇట్లు ఏల చింతచెందెదవు? అమ్మా నీపతి అన్నియు తెలిసినవాడు. నీ యందు ఆదరము, ప్రేమను చూపుట క్రొత్తయా? ఈ విషయమందు ఇప్పుడు సందేహమేల?"

క॥ నీ మనసు చూచుకొరకై
తామరసోద్భవుడు నెందు దాగినవాడో
రామామణి పదవమ్మా!
నీ మేడకు ననిన వాణి నిజ హృదయమునన్ 46

భావము : "ఓ వనితలలో ఉన్నతురాలా! నీ మనస్సును పరిశీలించుటకై నీ పతి ఎచ్చట దాగెనోకదా! నీ మేడకు పొమ్ము" అనగా వాణి తన హృదయమందు.

ఉ॥ లోగన సర్వసమ్మతము లోక హితంబును నాత్మసేమమున్
గా గడునొత్తి తెల్ప కొఱగాములుగా మదినెంచె నక్కటా
కాగల దుష్టకర్మ ఫలకారణమున్ దొలగింప శక్యమే
కాగ వియోగ మాత్ర మన గాదె మహోత్కట దుఃఖమందెడిన్ 47

భావము : "పరిశీలన చేయగా తన క్షేమమునకై, మేలగు మాటలు చెప్పగా దోషములుగా తలంచెగదా! అయ్యో! దుష్టకర్మల ఫలమునకు గల కారణములను తొలగింప సాధ్యముకాదు. భర్త ఎడబాటు భరించుట కష్టము. తీవ్రమైన దుఃఖమును కలిగించును గదా!"

వ॥ అనుచు నత్యంత చింతాక్రాంతయై యుపవనంబును నగరంబును కలయ నాలోకించిన నీరసంబును నిస్తేజంబును నిర్గత ప్రభయు నిరుపమ మాలిన్యంబును నిరుత్సుక శుక పిక శారికాభ్రమర నినాదంబును నశుభజ్యోత్స్నాఖిల కాంచన మణి హర్మ్య గోపురాలయ మంటపంబును నశోభిత సకల సంపత్తియు నసంతుష్ట సర్వ దాస దాసీజన నివహంబు నునై యత్యంత దైన్య భావంబునొంది యుండుటకు వెరగు పడి పద్మ సంభవుండుండిన పద్మంబు నట్టుల నిర్వైభవంబై యుండునే విభుండు కడదొలంగుట నిశ్చయంబని తలంచి 48

అర్థాలు : నిర్గతప్రభ= గతించిన, తప్పిన, కళ, నిరుత్సుక= ఉత్సాహములేని, అసంతుష్ట= తృప్తిచెందని, నివహంబు= సమూహము, వెఱగుపడ= ఆశ్చర్యము జెంది, పద్మసంభవుండు= బ్రహ్మ.

భావము : చింతతో శారద ఉపవనమును నగరమును చూచెను. సర్వము కాంతి హీనమైయుండెను. పక్షుల నాదములు లేవు. శోభలేని భవనములు మొదలైనవి. దిగులు చెందిన పరిచారికలు, అంతట జాలి పడదగిన స్థితిని ఆశ్చర్యపడి, బ్రహ్మ కూర్చుండు పద్మము ప్రకాశము లేనిదై యుండుటను చూచి, పతి తన్ను వీడి వెళ్లెనని నిశ్చయించెను.

ఉ॥ ఇందుకునేమి సేతునిక నెవ్వరు దిక్కు మహా విరోధమున్
జెందెడు వేళ నాప్తుడిటు చేరగవచ్చియు నన్నుగాచు గో
విందుడు యాత్మనిందితుని వీరడి దుర్మదు గావ జూచునే
సందడిబోవ దీ పని నిజంబు తదంఘ్రులు చేరకుండినన్ 49

అర్థాలు : ఆత్మనిందితుని= తనను నిందించినవానిని, వీరడి= వెఱ్ఱివాని, వెంగలిని, దుర్మదు= అహంకారిని, సందడిపోవదు= నెఱవేరదు, తదంఘ్రులు= వాని పాదములు.

భావము : "ఇప్పుడు ఈ స్థితిలో ఏమి చేయవలెను? గొప్ప పగను పెంచుకొన్న సమయములో రక్షకుడు ఎవరు? ఆ గోవిందుడు మా మేలుకోరువాడు. నన్ను కాపాడును. కాని తన్ను నిందించు బ్రహ్మను, మదముగలవానిని కాపాడునా? ఆతని పాదములను పట్టుకొనకపోయినచో, ఇప్పుడు ఈ స్థితి చక్కబడదు."

ఉ॥ ఈ పని కొద్దిలో నజునకిచ్చను దోచదు శౌరిమాయచే
నేపరి స్రుక్కి చిక్కితన కెయ్యవి చేయగ శక్తి లేక తా
నాపద బొంది తప్త హృదయాన్వితుడైనను గాచు నెంతయున్
శ్రీ పతి పాద పద్మయుగ చింతన గర్వులకబ్బ నేర్చునే 50

అర్థాలు : కొద్దిలో= సులభముగ, తేలికగ, అజునకు= బ్రహ్మకు, ఇచ్చను= మనస్సును, శౌరి= విష్ణువు, ఏపరి= బలము తొలగి, స్రుక్కి= సొక్కి, తప్తహృదయాన్వితు డైనను= తపించిన మనస్సు గలవాడైనచో, మనస్తాపము జెందినచో.

భావము : "విష్ణువును గూర్చి చింత, బ్రహ్మకు సులభముగ తోచదు. హరి మాయచే కష్టాలను అనుభవించి తపించిన హృదయము కలవాడైనచో, తప్పక ఆతని దుర్దశను తొలగించును. గర్వితులైన వారికి విష్ణుపాద ధ్యానము చేయు మనస్సు కలుగునా?

ఉ॥ నేరుపులేనిబాలకుడునేరమిదెంతనికావజూచునో
యీరసమూదిగర్వమణగింతునటంచునుకోపగించునో
శౌరిమనంబురంజిలగసమ్మతిజేసిపునఃప్రతిష్ఠయీ
వారిజ సూతి నెప్పటి నివాసమునన్ దను నిల్ప జూచునో 51

అర్థాలు : నేరుపులేని= తెలియని, అజ్ఞాని, ఈరసమూది= ద్వేషము హెచ్చి, వారిజసూతిన్= బ్రహ్మను, నివాసమునన్= తన స్థానములో.

భావము : "నేర్పరి కాని బాలకుడితడు, అని రక్షించునా? కోపముతో గర్వమును అణచెదనని కోపమును చూపునా? హరి మనస్సున ప్రసన్నమైనపుడు ప్రీతితో మరల తన నివాసమందు తన్ను నిల్పునా?"

గీ॥ ఏమి గానున్నవాడొ కో యిట్టివేళ
నితని బోధింపగల్గువా రెవ్వరింక
కొద్దినెంతయు నితనికి బుద్ధి మరల
దెంతయిడుముల నొందునో కొంతు డకట 52

భావము : "ఇట్టిదశలో ఏ కష్టములను ఎదుర్కొనునో? అతనికి బోధించు వారెవ్వరో! అతని బుద్ధి కొంచమైననూ మారదే! ఎన్ని కష్టములను పొందునోకదా!"

వ॥ అని తన విభునకు శ్రేయస్కరంబుగా హరి భజనంబు సేయు దాన నని తలంచి కృతస్నాతయై శుభ్రవస్త్ర పరిధారియు హరి ప్రముఖ ప్రక్షాళనయు కుంకుమ రేఖాలంకృతయు, మిత భాషణ భూషితయు నుత్తరీయ సంవృతయునై యుపవ నాంతరామృత సరోవర నికట స్థల పిప్పల

తరుమూల చంద్రకాంత శిలావితర్దికా మధ్యంబున కుశ పరిస్తరణంబున పద్మాసనాసీనయై దశేంద్రియంబుల ద్వారంబులు బంధించి మనంబును నిశ్చలవృత్తి నలవరించి సమశిరోగ్రీవ శరీరిణియై నాసాగ్రంబున షడంగుల పరిమితాకాశ భాగంబున చూపులం గాపురంబుంచి హృదయాబ్జోపరిభాగంబున సూర్య చంద్రాగ్ని మండలాంతరంబునం గనక సింహాసనా సీను నవయవనిశిత సౌందర్య సర్వశృంగార పరిపూర్ణు శంఖ చక్రకౌమోదకీ నందకా యుధ భరిత చతుర్బాహు కిరీట కుండల గ్రైవేయహార కౌస్తుభ రత్న కంకణ కేయూర పీతాంబర మేఖలాశింజిత మంజరీముఖ్య భూషణ భూషితు దరహాస చంద్రికా సుందర వదన సంపూర్ణ చంద్రు కరుణాకటాక్ష వీక్షణామృత పరిశోభిత నయన యుగళు కోటి సూర్య ప్రభా భాసమాను నవయౌవన వయోవిలాసాగణిత నవమన్మథ జిత సౌందర్యవిగ్రహు ఆదిలక్ష్మీ సంస్థిత వామాంకుగా శ్రీ మన్నారాయణమూర్తి నిజాంగుష్ఠ ప్రమాణ దేహునింగా నిలిపి షోడశోపచార క్రమ పూజానంతరంబునం దత్పాదారవింద నిష్యంద మకరంద పానానంద మదవదింది రాయమాన మానసయై తత్పరవశంబున బాహ్యంబు మరచి తచ్చరణ సంస్మరణంబు చేయుచున్న కొంత కాలంబునకు కోడలి తపో మహత్వంబునకు సంతుష్టాంతరంగుడై పరమేశ్వరుండు లక్ష్మీ సమేతంబుగా గరుడవాహనారూఢుండై వచ్చి ప్రత్యక్షంబైన యమ్మగువ నిజ హృదయ కమల మధ్య సింహాసనానువర్తియగు నమ్మూర్తి ధ్యానానంద మత్త చిత్తయై యున్నయత్యద్భుతంబంది యిందిరాదేవి ముఖంబు గనుంగొని యనుంగు కోడలి నిశ్చలాంతరంగంబునకు నుత్సుకుండై యయ్యంగనామణితో నిట్లనియె. 53

అర్థాలు : విభునకు= భర్తకు, కృతస్నాతయై=స్నానము చేసినదై, పరిధారియు= చుట్టుకొనినదియు, హరిప్రముఖప్రక్షాళనయు= కడిగిన ముత్యమువలెను, సంవృతయునై= కప్పుకొనినదై, నికటస్థల=దగ్గఱలోనున్న, వితర్దికా= అరుగు, కుశపరిస్తరణంబున= దర్భతో అల్లిన చాపమీద, సమశిరోగ్రీవశరీరిణియై=

శిరస్సును, మెడను, క్రింది శరీరమును ఒకే రేఖలో నుండునట్లు చేసినదై, నాసాగ్రంబున= ముక్కు చివఱ, షడంగులపరిమితాకాశభాగంబున= ఆఱు అంగుళములలో వ్యాపించిన ఆకాశ ప్రదేశమున, హృదయాబ్జోపరి=హృదయ పద్మముపైన గల, మేఖలాశింజిత= మొలనూలు నందు మ్రోగుచున్న, నిజాంగుష్ఠప్రమాణ దేహునింగా= తన బొటనవ్రేలియంత శరీరముగల వానిగా, తత్పాదారవిందనిష్యందమకరందరసపానానంద మదవదిందిరాయమాన= వాని పాదములనబడు పద్మములనుండి చిందు చున్న పూదేనెను త్రాగుటచేత కలిగిన ఆనందముతో మత్తెక్కిన తుమ్మెదవలెనైన.

భావము : తనపతి క్షేమమునకై విష్ణు భజన చేసెదనని, స్నానమునకు తగిన వస్త్రములను ధరించి ఉపవనమందున్న సరోవర సమీపమందు, అరుగుపై దర్భతో అల్లిన చాపమీద పద్మాసనయై, ఇంద్రియములను బంధించి, చూపులను ఆఱు అంగుళముల కొలతతో ముక్కుమీద నిలిపి, తన హృదయ మనెడి పద్మము మీద సౌందర్యమూర్తియైన, ఆదిలక్ష్మీ సహితుడైన శ్రీమన్నారాయణమూర్తిని, తన బొటనవ్రేలియంత శరీరము కలవాడుగా నిలుపుకొని పూజయైన పిమ్మట అతని పాదపద్మముల నుండి వెల్వడు ఆనందమనెడి తేనెను తాగి మదించిన తేనేటీగ వంటి మనస్సు కలదై ఒడలు మఱచి ధ్యానము చేయుచుండగా మహావిష్ణువు, లక్ష్మితో గరుడవాహనముతో వచ్చి వాణియెదుట ప్రత్యక్షమయ్యెను. అపుడు వాణితో మహాలక్ష్మి ముఖమును చూచుచు ఇట్లనెను.

విశేషములు : ఐదు కర్మేంద్రియములు : 1.పాయువు, 2.ఉపస్థ, 3.హస్త, 4.పాద, 5.వాక్కు. పాయువు : మూత్రము స్రవించు భాగము. ఉపస్థ : పుట్టుటకు స్థానము. పనిచేయు చేతులు, నడచు కాళ్ళు, మాట్లాడు నోరు. జ్ఞానేంద్రియములు : శ్రోత్రమ్, త్వక్, చక్షుష్, జిహ్వా, నాసిక, అనగా వినుటకు చెవి, స్పర్శకు చర్మము, చూపునకు కన్నులు, రుచికి నాలుక, వాసనకు ముక్కు. నాసాగ్రమనగా ముక్కు మొదలగు ప్రదేశము. ఇది కనుబొమ్మల

మధ్యనుండునది. ఈ పద్యమున ధ్యానము చేయు విధానము చెప్పబడినది. షోడశోపచారములు ధ్యానమున భాగముగ భగవంతునకు చేయు పదునాఱు సేవలు : ఆవాహనం, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం,

శా॥ లేవే భారతి నీతపోమహిమ చాలింపందగున్ లెమ్ము! నీ
భావం బెల్ల నెరుంగుదున్ భువిని దౌర్భాగ్యానుకూల్యంబుగా
నీవీరీతి కృశింపగావలసె నా నీచాత్మ గర్వంబు దా
నేవేళన్ నశియించునప్పుడు గదా యిందుండ నర్హుండగున్ 54

భావము : "ఓ భారతీ! చాలించు నీ తపము. లేవమ్మా! నీమనస్సును ఎఱుగుదును. చెడ్డకాలమున నీవిట్లు బాధపడవలసి వచ్చినది. నీచుడైన నీభర్త గర్వము నశించినప్పుడే సత్యలోకమున ఉండుటకు తగినవాడగును.'

ఆ॥ అనిన దిగ్గలేచి యత్యంత భయ భక్తి
వినయ సంభ్రమార్తి విహిత మతిని
వందనంబు చేసి సుందరి తలవాంచి
తరువు మఱువునందు తనువు చేర్చి 55

భావము : అన్నంతనే వెంటనే లేచి భయము భక్తి వినయము తత్తఱపాటుతో మంచిమనసుతో నమస్కరించి చెట్టు చాటున నుండగా

క॥ ఉన్న తన చిన్ని కోడలి
మన్నన వీక్షించి నీదు మానిత గుణసం
పన్నత యెంతని పొగడుదు
కన్నియ విభుగూర్తు వాని గర్వాంతమునన్ 56

భావము : అట్లున్న తన చిన్న కోడలిని ఆదరముతో చూచి "గౌరవింపదగు నీ సుగుణములను ఎంతని పొగడగలను! నీ విభుని గర్వము తొలగగా ఓ పిల్లా! నీ భర్తను నీకడకు చేర్చెదను."

తే॥ అంత పర్యంత మీవు మీ యత్త యొద్ద
నుండు కతిపయ దినముల నుత్పలాక్షి!
ప్రీతి నీదగు సచ్చరిత్రాతిశయత
బ్రహ్మపట్టణ మేలుదు పతిని గూడి 57

భావము : "ఓ కలువల వంటి కన్నులు కలదానా! అంతవఱకు నీ అత్త యొద్దనే కొన్నిదినము లుండుము. నీ పరిశుద్ధమైన జీవితము కారణముగ మరల పతినిచేరి బ్రహ్మలోకమును పాలింపగలవు."

క॥ ఈ నీ నిస్తేజంబగు పురి
నో నెలతుక యేకతంబ యుండగ నేలా
మానిని! మత్సన్నిధి స
న్మానంబున నుండు నీదు మందిరమదియున్ 58

భావము : "ఈ తేజము లేని నగరమందు ఉండుటకు కారణము లేదు కదా! కావున ఓ మానినీ! మా యింటిలో ఆదరముతో నుండుమా! అదియు నీ ఇల్లే కదా!"

వ॥ అని యనేక విధంబుల గోడలి నూరడించి సమ్మతి గావించి హంస వాహనారూఢగా ననుజ్ఞదయచేసి యచ్చెలులతో దోడ్కొని వైకుంఠ పురంబున కరిగిన నప్పలుకుల కలికి లక్ష్మీ కటాక్ష వీక్షణాభిలాషిణియై యత్తగారికి విహితోపచారంబుల మనసు పట్టి వర్తింపుచుండె ననిన విని శౌనకాది సన్ముని గణంబు లబ్జభవుండక్కడ నేమయ్యె సవిస్తరంబుగా నాన తిమ్మనిన సూతుండు మోదో పేతుండై యమ్ముని వ్రాతంబున కిట్లనియె 59

భావము : విష్ణువు కోడలిని చాలా ఊరడించెను. ఆమె తన హంసవాహనముపై రాగా ఆమె చెలికత్తెలను కూడా తోడ్కొని వైకుంఠపురమునకు వెడలిపోయెను. అచట వాణి అత్తగారికి సేవ చేయుచు అనుకూలముగా వర్తించెను. బ్రహ్మ వృత్తాంతమును చెప్పుమని మునులు సూతుని కోరగా మోదముతో మునులకు ఆవలి కథను తెల్పెను.

సీ॥ పరమేశ్వరుండును పరిపూర్ణు డఖిలాత్ము
డచ్యుతుండైన నారాయణుండు
బ్రహ్మతేజఃస్ఫూర్తివాని నిసర్గమై
పొనుగున పడియున్న భువనములును
యతినిగూఢ స్థితినంధ తమమ్ములో
డాగియుండిన యవ్విధాతనెరిగి
గల మాయ జూచిన కన్పట్టె నదియునా
సత్యలోకమునట చక్రిమాయ

తే॥ శారదాపద్మగర్భుల సరణి దాల్చి
బహుతరైశ్వర్య వర భోగ భాగ్యములను
ఘనచతుర్విధ భూతసద్గ్రామముఖ్య
సృష్టి నిర్మాణ చతురతల దనర్చె 60

అర్థాలు : పొనుగున= శూన్యమున, కాంతిహీనమై, నిగూఢస్థితి= రహస్యముగా, విధాత= బ్రహ్మ, శారదాపద్మగర్భుల= సరస్వతీ బ్రహ్మల, సరణి= విధము చతుర్విధభూతసద్గ్రామముఖ్యసృష్టి= నాలుగ విధముల ప్రాణసమూహముల సృష్టియొక్క, చతురతల= చాతుర్యములచే, నిపుణతతో, నిసర్గమై= వెడలుట కారణముగ.

భావము : విష్ణువు చిమ్మచీకటిలో దాగియున్న ధాతను గుర్తించి కాంతిహీనమైన సత్యలోకమును హరి నేర్పుచే పూర్వమువలె, నిర్మాణ కౌశలముతో ఉంచెను.

చ॥ కమలజ శక్తి నిర్గత జగత్రయమప్పుడు మాయికా భవ
త్కమలజభూరి శక్తి సుభగస్థితి బర్వి సమస్త లోకముల్
ప్రముదిత భోగభాగ్యనయరాగ రసప్రతిభావిలాస వి
భ్రమజయనాఖ్య ధర్మ పరిపాలన శీలత నొప్పె నెంతయున్ 61

అర్థాలు : కమలజశక్తి నిర్గత= బ్రహ్మశక్తినుండి పుట్టిన, జగత్త్రయము= మూడులోకములు,అప్పుడు, మాయికాభవత్= మాయావియైన హరి గొప్పశక్తిచే, సుభగస్థితి పర్వి= మంగళకరమైన స్థితిలో నుండి, ప్రముదిత= సంతోషించిన, భోగభాగ్యనయ= భోగభాగ్యముల సౌందర్యము, రాగరస= అనురాగముల స్రవంతియగు, ప్రతిభావిలాస= తేజోవిలాసముల, విభ్రమజయమాఖ్య= అతిశయవిజయమనుపేరుతో, ధర్మపరిపాలనశీలత= ధర్మపరిపాలనలక్షణముతో, ఎంతయున్= ఎంతగనో, చాలా ఎక్కువగా, ఒప్పెన్= ప్రకాశించెను.

భావము : బ్రహ్మ, సృష్టి యందు తన తేజమును తొలగించుకొని, వెడలిపోగా, విష్ణుమాయచే విజయమనెడి పేరుతో, ధర్మపాలన చక్కగా జరిగినది.

చ॥ మరియును మాయ భాస్కరసమప్రభవ ద్యుతిరమ్య దేహమున్
దరహసితాననం బరుణధాతుజటా మకుటంబు భూరివి
స్ఫురణ శుభాంగకంబు పరిపూర్ణతపోమహిమంబు గల్గి యా
హరి హర పద్మ సంభవులకగ్గలమౌ ప్రభనొక్క మౌనియై 62

అర్థాలు : భాస్కరసమప్రభవ= సూర్యునితో సమముగా పుట్టిన, ద్యుతిరమ్యదేహమున్= కాంతితో రమ్యమైన శరీరమును, దరహాసిత+ ఆననంబు= చిఱునవ్వుగల మోము, అరుణధాతుజటా మకుటంబు= లోహపు ఎఱుపుతో జడలుగట్టిన జుట్టు కిరీటముకాగా, భూరివిస్ఫురణ= గొప్పగా ప్రకాశించు, శుభాంగకంబు= శుభ్రమైన శరీరము, పరిపూర్ణతపోమహిమంబు గల్గి, యా హరి హరపద్మ సంభవులకు= విష్ణురుద్రబ్రహ్మలకు, అగ్గలమౌ= మించిన, ప్రభన్= కాంతితో, ఒక్క మౌనియై.

భావము : మఱియును విష్ణుమాయ ఒకముని రూపమును పొందినది. ఆరూపమిట్లున్నది. శరీరము సూర్యకాంతితో సమానము, మోమున చిఱునవ్వు, లోహపు ఎఱుపుగల సిగ కిరీటమువలె తలపై జడ గట్టి

ముడివేయబడినది. అవయవములు శోభాయమానములు. తపో గరిమతో వెలుగుచున్న, ఆ మౌని తేజస్సు బ్రహ్మ విష్ణు తేజస్సును మించి యున్నది.

ఉ॥ వారిజ సూతి కవ్వల నవారణదారుణ బంధురాంధ వి
స్తారతమః ప్రకీర్ణమగుతావున సంతతి గల్గ పూర్ణ శృం
గారతపోవనంబొకటి కల్పన చేసి తమః ప్రముక్తిన్
భూరితరాబ్జ రాగమణి పుష్కరరత్నము కాంతి శోభిలన్ 63

అర్థాలు : వారిజసూతికి= బ్రహ్మకు, అవ్వల= అవతల, అవారణ= అదుపులేని, దారుణబంధురాంధ విస్తార= భయంకరమైన నూనెమడ్డివలె చిక్కనైన, వ్యాప్తమైన, కాంతి చొరబారని, తమఃప్రకీర్ణమగు= చీకటితో దట్టమైన, తావున= చోట, సంతతి= విరివి, తమఃప్రముక్తికిన్= చీకటి తొలగుటకు, భూరితర+ అబ్జరాగ మణిపుష్కరరత్నము= గొప్ప పద్మరాగమణి రత్నము, కాంతి శోభిలన్.

భావము : బ్రహ్మ ఉండు చిమ్మచీకటి చోటు సమీపమందు శృంగార తపోవనమును, విరివియై దానిని సృష్టించి అచ్చటి చీకటి తొలగించుటకు గొప్ప పుష్ప రాగమణి రత్నము ప్రకాశమును ప్రసరింప జేయుచుండెను.

చ॥ తను జనితానురూఢిని సుధానిధి కోటి సమాన సుందరా
ననము చకచ్చక ప్రచురనాకపురీశ్వర రత్నపుంజముల్
మొనసిరువంక గ్రుమ్మరిలు మోహననేత్రయుగంబు చక్కెరల్
దనుపు మృదూక్తులున్ మొగడ దమ్మి కుచంబులుమందహాసమున్ 64

అర్థాలు : సుధానిధి= చంద్రుడు, చకచ్చకప్రచుర= ప్రకాశము ప్రకటముగా, నాకపురీశ్వర= స్వర్గపతియొక్క, రత్నపుంజముల్= రత్నములరాశులు, మొనసి= పూనుకొని, మొగడతమ్మి= తామర మొగ్గ.

భావము : బలిసిన శరీరమందు కోటిచంద్రులవంటి సుందరమగు ముఖము, అందు ప్రకాశముగా మహేంద్రుని యొక్క రత్నముల కాంతులన్ని కలిసి

రెండు కళ్లు మోహనమై కన్పట్టగా, చక్కెరవంటి మెత్తని మాటలు తామర మొగ్గల వంటి చన్నులు, చిఱునవ్వుతో

క॥ నడబెడగు మృదుపదంబులు
జడనిడుసోగయును పిరుదు చక్కనమరువున్
యొడికపు నునుమెడలును మెరు
గొడలుం గౌను చిన్ని యొప్పుల పలుకుల్ 65

అర్థాలు : నడబెడగు= నడకల అందము, పిఱుదు= పిఱ్ఱ, మరువు= కొండ, ఒడికపు= అందమైన, కౌను= నడుము, ఒడలు= శరీరము.

భావము : నడకల అందముగల మెత్తని పాదములు, నిడుపైన జడయొక్క సొగసు, చక్కనైన కాండలవంటి పిఱుదులు, ఒప్పుచున్న సన్నని వెలుగు శరీరము, సన్నని నడుము, ఇంపైన పలుకులు.

చ॥ తనరెడు కన్యకామణియు దాను నిజాశ్రమ పర్ణశాల న
మ్మని వసియించియున్న నటమున్నె సరోరుహ సంభవుండు దా
మనమున నెంచి వచ్చి నిజమానసమున్ బహువత్సరంబులున్
జనగ నొకింతలోకముల చర్య వినంబడనయ్యె నేమొకో 66

భావము : కలిగిన కన్యమునియు ముందే పర్ణశాలలో నివసించి యుండిరి. బ్రహ్మ చాల సంవత్సరములు అయినవని తలంచి కొంతసేపు చూచి "లోకముల చర్య వినబడుచున్నదే! దీనికి కారణమేమి? అని

సీ॥ నాతేజమున గాదె భూతేశ్వరునకును
శివలోక సామ్రాజ్య సిద్ధి మహిమ
నా తేజమున గాదె శ్రీ తరుణీపతి
విలసిత వైకుంఠ విభవ మెల్ల
నా తేజమున గాదె నలినాప్త చంద్రులు
కాలనిర్ణయ శక్తి జాలు టెల్ల

నా తేజమునగాదె నయతరాష్టదిగీశ
వరులదిక్పాలక వైభవములు

తే॥ అట్టి నాతేజమాత్మ నే నపనయించి
వచ్చి యిచ్చోట దాగినవాడ నింక
వారి వైభవము సాగి వచ్చు నెట్టు
లందరును శ్రుక్కి నిశ్చేష్టు లైరి గాక 67

అర్థాలు : భూతేశ్వరునకు= శివునకు, శ్రీతరుణీపతి= విష్ణువు, నలినాప్త= సూర్యుడు, అష్టదిగీశవరుల= ఎన్మిదిమంది దిక్పాలకుల, అపనయించి= ఉపసంహరించి, శ్రుక్కి= శుష్కించి, నీరసించి, నయతర=మహనీయులైన.

భావము :"నావలననే కదా శివలోకమునకు శివుడు, వైకుంఠమునకు విష్ణువు, సూర్యచంద్రులు, ఎనిమిది మంది దిక్పాలకులు ప్రభువులై ఉన్నారు. అట్టి నా తేజస్సును తొలగించుకొని యిచ్చట దాగినాడను. కనుక వారి మహిమలన్నియు నశించి చేష్టలుడిగిన వారై యుందురు కదా!"

చ॥ కటకట నాదు చొప్పరయగా బహురీతుల సంచరింపుచో
నిటు చనుదేరకుండుదురె? యిందుకు సాక్షి యిదే నిజంబు నే
నటు చని సర్వలోక పతులారడి యెంతయు చూడగా దగున్
ఇటువలె గాక వారలొక యించుక యేని మెలంగ గల్గిరా! 68

అర్థాలు : చొప్పు= విధానము ఆరడి= బాధ, దీనస్థితి, ఆర్తి.

భావము : "అయ్యో! వారందఱు, నేనేమైనాను అని వెదకుటకు అన్ని విధాలుగా ప్రయత్నింపకుందురా? దీనికి సాక్షిగా నేనే స్వయముగా వెడలి లోకపాలకుల బాధను చూచుట సరియైన చర్య. అట్లు కొంచెమైనను ప్రవర్తింపగల్గిరా యని తెలిసికొందును."

వ॥ అని చూడ నుద్యుక్తుండైయున్న యవసరంబున 69

వచనము : అట్లు బ్రహ్మ చూడదలచి యున్న సమయమున

ఉ॥ సన్నపుచుక్కబోలె యొకచాయ యొకించుకఛాయదోచి మా
య న్నలినోద్భవుండు మహదద్భుతమం దిపుడిందు నేమొకో
కన్నుల దోచినట్టులయి కానకనైతిని క్రమ్మరంగ దా
మున్నుదలంచు దాని కడుమేకొని యిచ్చను చూచు చుండగన్ 70

అర్థాలు : ఛాయ= నీడ, చాయ= వైపు, మేకొని= పూని

భావము : సన్ననైన చుక్కవలె, ఒకవైపు నీడ కొంత కన్పింపగా ఆ మాయను బ్రహ్మ ఆశ్చర్యముతో చూచెను. కాని వెంటనే 'దానిని మరల చూడలేక పోయితిని గదా!' అని తలంచి ఆ చుక్కను చూచు కోరికతో ప్రయత్నించి చూచుచుండెను.

క॥ మఱియు నొకించుక తేజ
స్ఫురణముగల చుక్కవోలె పొలపరి కదియన్
మెరమెర మనుచును గన్నుల
కరుదై కనుపట్టె నంత కగ్గలమగుచున్ 71

అర్థాలు : పొలపరి= బాటసారి, కదియన్= దగ్గఱకు రాగా, మెరమెరమనుచున్= సందేహాస్పదముగ, అరుదు= ఆశ్చర్యము, అగ్గలము= అధికము.

భావము : మఱియు తేజస్సు మెఱయు చుక్కవలె ఆ బాటసారిని సమీపింపగా అది కన్నులకు ఆశ్చర్యము అధికమగుచు కన్పట్టెను.

క॥ కనుపట్టిన యామిణుగురు
గని కని తలపోసె నేను గడదొలగినచో
వనజాక్షు డాది దివ్యులు
నను వెదకం గురుని బంపినారేమొ కదా 72

భావము : కనబడిన ఆ మిణుగురు పురుగును చూచి 'బ్రహ్మ , విష్ణువు మొదలైన దేవతలు తన్ను వెదకుటకై దేవగురువును పంపినారేమో' అని తలచెను.

క॥ కాకున్న యిట్టి తేజము
నాకన్నుల కంధతమమునై దోపంగా
నీ కాంతిగలది యిచ్చట
నాకందువ వచ్చు దివ్యనాయకగురుడే 73

భావము : 'అట్లు కాని యెడల, ఈ తేజము నా కన్నులకు ఏల చీకటిని కల్గించు చున్నది? ఈ తేజము నా కడకు వచ్చునది. తప్పక ఆ దేవతల నాయకుడు బృహస్పతియే!'

చ॥ నిజమని చూడజూడగనె నిర్మలకాంతి మరిన్ స్ఫురింప న
క్కజమగు శుక్రుడాతడగు గానియెడన్ మహదద్భుతంబుగా
నిజరుచి సన్నవెన్నెలల నింపగ నేర్చునె యిట్టి తేజమే
యజరులయందు గల్గు ననలాబ్జదినేంద్రులయందు దక్కగన్ 74

అర్థాలు : అక్కజమగు= ఆశ్చరము కలుగు, నిజరుచి= తనకాంతి, అజరులయందు= దేవతలలో, అనలాబ్జ దినేంద్రులయందు తక్కగన్= అగ్ని, చంద్రుడు, సూర్యుడు, వీరిలో కాక.

భావము : 'నిర్మల కాంతిని చూడగా, అది రాక్షస గురువు శుక్రుడగును. కానిచో ఇట్టి తేజము ఇట్లు సన్నని వెన్నెలలను ప్రసరింపజేయగలదా! ఇట్టి కాంతి అగ్ని, చంద్ర, సూర్యులందే కన్పడును. ఏ ఇతర దేవతలలో కలదు?'

వ॥ అని వితర్కింపుచు. 75

భావము : అన్ని హేతువులతో ఆలోచింపుచు,

ఉ॥ చూచుచునుండ డెందమున చోద్యముగా గడు తెల్విమై దిశల్
రోచులు గ్రమ్మి చీకటి నిరోధము చేసెడి యగ్గలించు న

ట్లేచు మరీచి జాలముల నచ్చటగాంచి విరించి తథ్యమీ
ప్రాచుర కాంతిమూర్తి సితభానుడు గాదగునంచు జూడగన్ 76

అర్థాలు : డెందమున= మనస్సులో, తెల్వివైౖ= వెలుగువలన, రోచులు= కాంతులు, అగ్గలించు= వ్యాపించు, అటు+ఏచు= అట్లు చెలరేగు, మరీచి జాలముల= కిరణసమూహముల, విరించి= బ్రహ్మ, ప్రాచురకాంతిమూర్తి= ప్రకటమైన కాంతిగలమూర్తి, సితభానుడు= తెల్లని కిరణములు గలవాడు చంద్రుడు.

భావము : చోద్యముగా చీకటిని తొలగించునట్లు వ్యాపించుచు చెలరేగు కిరణములను చూచి 'చంద్రుడే ఆకాంతివమూర్తి అగును' అని, చూచుచుండగా

ఉ॥ గౌరమరీచికా ఘన వికాసము నుచ్చయదీర్ఘికార్చులై
దూరమునందు వచ్చుగతి దోచిన తోయజమూర్తి యక్కటా
ఆరయ జాలనైతి నితడగ్ని మహార్చులు మిన్నుముట్టగా
జేరగవచ్చువాడనుచు సిద్ధముగా మది నెంచుచుండగన్ 77

అర్థాలు : గౌరమరీచిక= తెల్లని కాంతికిరణముల యొక్క, ఘన= దట్టమైన, వికాసము= వ్యాప్తి, ఉచ్చయదీర్ఘిక+అర్చులై= నడబావులందు ప్రతిఫలించు కాంతికిరణముల సమూహములై, తోయజమూర్తి=బ్రహ్మ, ఆరయజాలనైతి= తెలిసికొనలేకపోతిని, మహార్చులు= గొప్పజ్వాలలు.

భావము : చాలా తెల్లని కిరణముల వ్యాప్తి, ఎత్తునగల నడబావులలో ప్రతిఫలించు గొప్ప మంటల సమూహము సమీపించుటను చూచి బ్రహ్మ యిట్లనెను ''నేను తెలుసుకొనలేక పోయితిని ఇతడు అగ్నిదేవుడు. మహాజ్వాలలు ఆకాశమును అంటు రీతిని చేరగ వచ్చుచున్నవనుట నిజము''. అని తలంచెను.

ఉ॥ ఇన్ని విభేద తేజముల నీరసమాడుచు నెల్లదిక్కులన్
బన్నిన చీకటిన్ విరిసి పార గదుష్ణము మాత్రలేని తే
జోన్నతి చూచి భాస్కరుడహో యితడీతని మండలాంతరా
సన్నులు విష్ణులిద్దఱును సమ్మతిగా భజియింప వత్తురో 78

అర్థాలు : ఈరసమాడుచు= తక్కువచేయుచు, విరిసి= తొలగి, పార= పారిపోగా, కదుష్ణము= కవోష్ణము, ఇంచుక వేడిమి, మండలాంతర+ ఆసన్నులు= వేర్వేఱు సూర్యమండలములలోనివారు.

భావము : ఇట్లు బృహస్పతి, శుక్రుడు, చంద్రుడు, అగ్ని మొదలైన వారి తేజమును, తక్కువ చేయుచు మించి ఎల్ల దిక్కులందు గల చీకటి తొలగి పోవునట్లు, తేజమును కని, కొంచెము కూడా ఉష్ణము లేని ''సూర్యుడా! ఆహా! ఇతడు సూర్య మండలమందు గల విష్ణువులు ఇద్దఱు నన్ను సేవించుటకు వచ్చుచున్నారేమో!''

వ॥ అని నిశ్చయించి కనుంగొనుచున్న యవసరంబున 79

భావము : బ్రహ్మ వరుసగా బృహస్పతి, శుక్రుడు, అగ్ని, చంద్రుడు, సూర్యుడు వచ్చుచున్నారని తలంచి, పిమ్మట వారుకాదని విష్ణువులు వచ్చిరని నిశ్చయముతో చూచు చుండగా,

సీ. సురగిరిసుమభాస్వదరుణ జటాబద్ధ
మకుటంబు చెవినక్షమాలికయును
దండత్రయంబు కమండలువును పంచ
గవ్యముల్ మైభూతి కక్షపాల
యోగపట్టయు మెడ నురు జన్నిదంబులు
ధవళచంద్రిక లీను దంతపంక్తి
కాషాయ వస్త్రముల్ కడుద్వాదశోర్ధ్వ
పుండ్రంబులు శోణితాభంబుకనులు

తే॥ వెలయు త్రిభువనసామ్రాజ్య విభవవిజిత
భూరి మహిమాతిశయ తపః స్ఫూర్తి దనర
చండ వీధి నాతండె మార్తాండుడనగ
మ్రోల గనుపట్టె నమ్మాయమునివరుండు 80

అర్థాలు : సురగిరిసుమభాస్వత్= మేరుపర్వతముపై పూచిన పుష్పములవలె ప్రకాశించుచున్న, అక్షమాలిక= రుద్రాక్షమాల, దండత్రయంబు= మోదుగ కాడలు భూతి= బూడిద, కక్షపాల= సన్న్యాసుల చంకలోనుండు సంచి, యోగపట్ట= మునులు జందెమువలె వేసికొను పట్ట, జన్నిదంబులు= జందెములు, ధవళచంద్రికలు+ఈను= తెల్లని వెన్నెలవంటి కాంతినిచిమ్ము, ద్వాదశోర్ధ్వపుండ్రబులు= పన్నెండు పంగనామములు, భూరి= గొప్ప, మార్తాండుడు= సూర్యుడు, మ్రోల= ఎదుట.

భావము : మేరు పర్వతమువలె మెఱయు ఎఱ్ఱనివన్నె గల జడలచే కట్టబడిన కిరీటము, చెవిపై అక్షమాల, మూడు మోదుగ కాడలు, చేతిపాత్ర, పంచగవ్యములు (పాలు, పెరుగు, నెయ్యి, మూత్రము, పేడ). శరీరముపై బూడిద, సంచి, యోగ పట్టము, జందెములు. తెల్లని కాంతులను వెదజల్లు పండ్ల వరుస, కెంపు వర్ణముల బట్టలు, పన్నెండు నిడుపైన నామములు, ఎఱ్ఱని కాంతుల కన్నులు కలిగి, మూడు లోకాలను జయించు తపశ్శక్తితో ఆకాశమందు సూర్యుడేమో అనునట్లు ఒక మాయా మునివరుడు ఎదుట ప్రత్యక్షమయ్యెను.

తే॥ ఇట్లు నిలిచిన తన తేజ మెల్లనణగి
పంజుకిందట కొద్ది దీపంబువోలె
కిచకిచల ధ్వని మర్కటక్రియ దలిర్ప
యొదిగి యజుడుండ నమ్మౌని యుల్లమడరె 81

భావము : ఇట్లు తన ఎదుట నిలిచిన ముని ఎదుట దివిటీలోని చిన్న దీపమువలె తాను కిచకిచలతో నొప్పు కోతివలె బ్రహ్మ కుదించుకుని యుండెను. అపుడు ఆ ముని మనస్సు సంతసముతో నిండెను

క॥ ఇట్టుల నిలిచిన యమ్ముని
చుట్టును దశయోజనముల జూపట్టి కడున్
బట్టబయలయ్యె మాయల్
ఎట్టును దొడ్డగునె జగములెల్లను దాగన్ 82

భావము : పదియోజనముల దూరము వఱకు ఆముని చుట్టును విశ్వమున గల మాయలు చక్కగా తెలిసినవి. లోకములు అతని కంటెను గొప్పవగునా?

వ॥ ఇట్లు ప్రకాశింపుచున్న యమ్మాయాతాపసుం డా వేల్పు పెద్ద కిట్లనియె 83

భావము : ఈ విధముగా ప్రకాశించుచున్న ఆ ముని బ్రహ్మతో ఇట్లనెను.

అర్థాలు : అక్కఱ= అవసరము, సందర్భము, నిలయంబు= ఉండుచోటు, నిక్కము= నిజము, గాఢతర నిష్ఠురభూరి తమఃప్రపూర్ణమౌ= దట్టమై కష్టమును కలిగించు గొప్పచీకటితో నిండిన, చక్కిట= ప్రదేశమున, ఒకపాటి సంయముల్= అంతంతమాత్రపు మునులు (సామాన్యులైన)

ఉ॥ ఎక్కడనుండిరాక యిట కెక్కడికేగుదు రిందునుండగా
నక్కర యేమి నీదు నిలయంబది యెక్కడ నెవ్వడండ్రు నిన్
నిక్కము దెల్పు గాఢతర నిష్ఠురభూరితమః ప్రపూర్ణమౌ
చక్కిట నేకతంబ నిలజాలుదురే యొకపాటిసంయముల్ 84

భావము : "మీరెవరు? దట్టమైన చీకటిలో సామాన్యులైన మునులు ఏల నిలిచెదరు?"

క॥ నలుమొగము లలరుచుండగ
నలువవలెన్ దోచుచుండె నామనమునకున్
కలరూపు దెలియ జెప్పుము
కులనామస్థలవిశేష గుణముల నన్నన్ 85

భావము : "మీరు నాలుగు మెగముల బ్రహ్మవలె నున్నారు. మీనిజ స్వరూపమును దెల్పండి." అనగా

ఉ॥ మా తెరగెంత బ్రహ్మకును మానసపుత్రుడ బ్రహ్మమౌనినే
హేతువు గల్గు నిందు వసియింపగ భద్రకుడండ్రు నన్ను నీ
రీతిని నున్నవాడ వివరింపు భవత్కుల నామవాస వి
ఖ్యాతచరిత్రముల్ మిముల గన్నను భాస్కరునట్ల దోచెడిన్ 86

భావము : "మా విషయము అంత యింతయే. నేను బ్రహ్మ మానస పుత్రుడను. బ్రహ్మర్షిని. ఇచ్చట నివసించుటకు కారణమున్నది. నాపేరు భద్రకుడు. ఇట్లున్నాను. మీ చరిత్రను తెల్పండి. మీరు సూర్యుని వలెనున్నారు."

శా॥ కాదేనిట్టి మహా ప్రకాశమమరంగా నేమి కార్యంబు స
మ్మోదం బొప్పగ నిందు రావలయు టేమో నిన్ను వీక్షింప నా
హ్లాదంబాత్మ గడంగుచున్న యది నీ వాయబ్జమిత్రుండవో
కాదే నొక్కమునీంద్రశేఖరుడవో కారుణ్య శోభాత్మకా! 87

భావము : "కరుణతో శోభించువాడా! నీవు సూర్యుడవు లేకున్నచో ఇట్టికాంతి ఎట్లు కలుగును? నన్ను చూచుటకు సంతోషముతో ఇచ్చటికి ఏల వచ్చితివి? నాకు ఆహ్లాదము కలిగినది. నీవు సూర్యుడవా కానిచో ముని వరుడవా!"

క॥ కావున మీ కులగోత్ర
శ్రీవిభవములెల్ల దెలియజెప్పు మటన్నన్
ప్రావీణ్యత మాయాముని
యావేధకు ననియె తననియామక మెల్లన్ 88

భావము : "మీ కులగోత్రములు వైభవములు చెప్పుడు" అని బ్రహ్మ కోరగా మాయాముని నేర్పుతో తన్ను గూర్చి తెల్పెను.

తే॥ సంయమివరేణ్య విను జగచ్చక్షువందు
గలిగి నిజయోగమహిమా ప్రకాశములను

హరిహరబ్రహ్మ లస్మదీయానుగతిని
మెలగివర్తింతు రఖిలసమ్మేళనమున 89

భావము : "ఓ మునివరా నేను జగత్తును చూచువాడను. నాయొక్క మహిమచే త్రిమూర్తులు సర్వవిశ్వకార్యనిర్వహణమందు నే చెప్పినట్లు నడుచుకొందురు."

శా॥ భేదం బించుక లేక చిత్తముల సంప్రీతిన్ ననున్ జూడకా
హ్లాదంబున్ చిగురొత్త జేయుచు వినోదాకారనామక్రియా
నాదస్త్రీవిభవ ప్రభేదముల నానందంబుగా జూపగా
గాదే మాయికుడండ్రు నన్ను దగ లోకఖ్యాతిగా భద్రకా! 90

అర్థాలు : వినోదాకారనామక్రియానాదస్త్రీవిభావప్రభేదముల= ఉల్లాసము కలిగించు ఆకారములు, పేర్లు, కార్యములు, ధ్వనులు, స్త్రీ పురుష వైభవముల భేదములను

భావము : "నేను కనబడను. కాని రాగద్వేషములు లేకుండా అందఱియందును ఆకారములచేత, నామములచేత, కార్యములచేత, ధ్వనులచేత, స్త్రీపురుష భేద లక్షణములచేత, వినోదమును కలిగించువాడను నేను. మాయికుడను పేరుతో ప్రసిద్ధుడను."

సీ॥ కులశీలమానుషోజ్జ్వలకీర్తిమంతుల
సత్క్రియాచార ప్రచారమతుల
నభిమానవంతుల నతుల గుణాఢ్యుల
బహు సుధర్మాధర్మపాలకులను
విగతహీనాధిక విజ్ఞానవంతుల
సురపుణ్యకర్మసంగ్రహణమతుల
వ్రతదానమహిమాప్రవర్ధనశీలుర
క్రతుతీర్థయాత్రాది కర్మఠులను

తే॥ యోగవిద్యామహాత్ముల నున్నతోన్న
తప్రతిష్ఠార్జితాత్ముల తాపసులను
సకలశాస్త్రార్థచర్యావిశారదులను
బొంది నేనంద వర్తింతు భూరిమహిమ 91

అర్థాలు : కులశీలమానుషోజ్జ్వలకీర్తిమంతుల= పుట్టువు, ప్రవర్తనముగల మానవులలో గొప్ప కీర్తిగలవారిని, సత్క్రియాచారప్రచారమతుల= మంచి కార్యములను చేసి, పదిమందికి తెలియజెప్పు బుద్ధిమంతులను, విగత హీనాధికవిజ్ఞానవంతుల= తక్కువ, ఎక్కువను భావము నశించిన జ్ఞానులను, సురపుణ్యకర్మ సంగ్రహణమతుల= దైవకార్యములను చేయువారిని, క్రతుతీర్థయాత్రాదికర్మఠులను= యాగములు, తీర్థయాత్రలు మొదలైనవాని యందు సక్తులగు కార్యశూరులను.

భావము : "అన్ని విధముల గుణవంతులు, కీర్తిమంతులు, సదాచార పరాయణులు, భేదబుద్ధిలేని జ్ఞానులు, కార్యశూరులు, ఇట్టి వారితో కలిసి నేనిచటనే యుందును."

తే॥ మరియు నాగమశాస్త్ర మర్మ ప్రయుక్త
ముద్రధారణ విముఖితాత్ములను మఱియు
నిత్యనైమిత్తిక వ్రత నీరసులను
స్వప్నమందైన స్పృశియింపజాల సుమ్ము 92

భావము : కులమును, గోత్రమును నాలుగు వర్ణములకు చెందిన నడవడికలను వదలిపెట్టి నడుచుకొను వారిని, నాలుగు ఆశ్రమములు ఆచారములను పాటించనివారిని, ఎదుటివారి బలమెఱుగక, అతిశయించు అహంకారులను, వేదములు చెప్పిన విధులను దూరముగా నుంచువారిని, స్వర్గము, ముక్తి మొదలైన పరలోక వాంఛలపై మనసు లేని వారిని, ప్రసిద్ధములైన యాగములు తీర్థయాత్రలు చేయనివారిని, దేనిని

గ్రహింపవలెనో, దేనిని గ్రహింపరాదో తెలియని వారిని, ఏ వస్తువు నెట్లు ఉపయోగింపవలెనో, ఏ కాలమున ఏపని చేయవలనో భేదములను తెలియక వర్తించువారిని, ఆగమ శాస్త్రమందు చెప్పబడిన రహస్యములను తెలిసికొని ముద్రలను ధరించుట యందు శ్రద్ధలేనివారిని, నిత్యము చేయవలసిన పూజలను ప్రయోజనము ఆశించి చేయు వ్రతములు చేయనివారిని, కలలో నైనా ముట్టుకొనను సుమా!"

విశేషములు : ఆశ్రమాచారములు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములనునవి నాలుగాశ్రమములు. ఈ వరుసలో స్వీకరించవలసినవి. ఆయా ఆశ్రమాలలో వ్యక్తి చేయవలసిన విధులు బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ శూద్రులను, నాలుగు వర్ణములవారికి వేఱుగ నుండును.

వేదోక్తసత్కర్మలు : కర్మచేయక తప్పదని తెలిసి, వ్యక్తి చేయు కర్మలను క్రమబద్ధము చేసి నియమములను ఏర్పఱచినవి వేదములు. ఇవి వర్ణాశ్రమధర్మముల ననుసరించునవి. విహితకర్మలు.

స్వర్గాదిలోకాపవర్గము : కామ్యకర్మలలో సత్కర్మల చేయుటవలన స్వర్గము మొదలగు లోకములలో జీవునకు దేహాంతమున నివాస మేర్పడును. కర్మఫలముగ వచ్చునదిది. దీనిని కొంతకాలము అనుభవించి మరల భూమిపై జన్మించును. ఇది నిరంతరము జరుగుచుండునది. ఈ జన్మ కర్మల సంకెలలను త్రెంచివేయుటచే లభించునది ముక్తి.

గ్రాహ్యాగ్రాహ్యములు : అనగా వ్యక్తి సందర్భమును, తన అధికారమును తెలిసి ప్రవర్తించవలెను. ఆ జ్ఞానము లేనిచో నవ్వులపాలగును. అట్లే వస్తువుల నుపయోగించు పరిజ్ఞానమును, ఏపనికేది తగిన సమయమో తెలిసి మెలగుటకూడ.

ముద్రధారణ : వైష్ణవమతానుయాయులు కొందఱు పాటించు నియమము. విష్ణువు యొక్క సుదర్శనచక్రముద్రలను కాల్చి భుజములపై

ముద్రించుకొందురు. వీనిని చక్రాంకితములని అందురు. వీని శాస్త్రీయత ఆగమములందు చెప్పబడినది.

క॥ ఈ విధి నిజవ్రతంబుగ
గావింపుచు నే తమోంధరహితాశ్రమమం
దే వసియించినవాడను
ధీవర! నిజ మింత నీకు దెలిపితి నింకన్ 93

భావము : "ధీరుడా! ఇది నా సహజ నియమము. చీకటిలేని ఆశ్రమమందు నివసించుచున్నాను. ఈ నిజమంతయు తెలిపితిని."

క॥ మాయాశ్రమ మిట చేరువ
మాయందు ననుగ్రహంబు మదినుంచదగున్
నాయము మీకాతిథ్యము
సేయుట మాకగుట కరుణసేయు మటన్నన్ 94

భావము : "మా ఆశ్రమము దగ్గఱలో ఉన్నది. మా యందు దయయుంచి రావలెను. మిమ్ము అతిథిగా ఆదరించుట మా ధర్మము. రండి."

మ॥ వరమాయావృతమానసుం డగుచు బూర్వస్మారకాజ్ఞుండునుం
పరుషోగ్రాంధతమః ప్రకల్పిత భయభ్రాంతుండునై మాయికా
దరణీయోక్తుల చాలరంజిలియు నుద్యద్వాసనావాసిగా
పరమోత్సాహతబల్కె మాయికునితో ప్రజ్ఞావిహీనాత్ముడై 95

భావము : గొప్ప మాయకు లోనైనవాడు, తన పూర్వచరిత్రను మఱచి మిక్కిలి యైన తాను కల్పించుకున్న చీకటి వలన భయముచే తెలివి తప్పి మాయాముని ఆదరించు మాటలకు సంతసించి చిగురించుచున్న ప్రత్యాశతో, అతిశయమైన ఉత్సాహముతో, బ్రహ్మ మాయావితో మాట్లాడెను.

తే॥ యుష్మదాకారతేజోనయోన్నతములు
గాంచి యుత్సుకులైనట్టి ఘనులకెందు

యుష్మదాశ్రమ దర్శన యోగమునను
వలచు నిష్టము లరుదె పావన చరిత్ర 96

భావము : "ఓ పవిత్ర చరిత్రా! మీ యొక్క గొప్ప స్వరూపము, తేజము, మృదుత్వము చూచి ఉత్సాహము పొందిన పుణ్యులకు, మీ ఆశ్రమము దర్శించు బలము వలన వారి కోరికలన్నియు సిద్ధింపగలవు గదా!"

వ॥ అని యానుకూల్యోపచార వాక్యంబు లుపన్యసించి వనజభవుదోడ్కొని చన తంతు నిబద్ధసత్త్య సంచలిత పవనసుత వాలసంగత ఘంటాప్రాయుండై వెనువెంటం జని చని 97

అర్థాలు : అనుకూల్యోపచార వాక్యంబులుపన్యసించి= అనుకూలమైన సంతోషమును కలిగించు మాటలు మాట్లాడి, తోడ్కొని చన=తీసికొని పోగా, పవనసుత వాలసంగత= హనుమంతుని తోకకు కట్టబడియున్న, ఘంటాప్రాయుండై= గంటతో సమానమైనవాడై.

భావము : తగిన మర్యాదతో మాట్లాడి తీసికొని పోగా బ్రహ్మ, హనుమంతుని తోకకు తాడుచే కట్టబడిన గంట వలె, అతని వెంట వెడలి

సీ॥ మిన్నంట బెరిగిన పొన్నలగ్రమ్మిన
గొజ్జంగి పూబొద కోటదనర
కోటవెంబడిగుమి గూడి యంతట జుట్టు
కొని బిడారమునకై కోరుపులులు
పులికూనలను మెల్లపుట్టలనెక్కించి
పొలిచ్చు నయ్యేడవాలుగములు
నాచు తేగల నెల్లనడవిలోమెట్టల
వెలయ పచ్చికమేపు వృకచయంబు

తే॥ వృకచయమ్ములు తమ నీడ విశ్రమింప
తుండ జలముల శ్రమదీర్చుచుండు కరులు

చండవేదండ తతిగండమండలములు
చేరి నఖముల దువ్వెడు సింగములును 98

అర్థాలు : మిన్నంట= ఆకాశమంటునట్లు, బిడారము= విడిది, అయ్యెడ= అచట, వాలుగములు= అడవిపందులు, వృకచయంబు= తోడేళ్ళగుంపు, తుండజలముల= తొండములనుండి కురియునీరు, చండవేదండతతిగండ మండలముల= బలమైన ఏనుగుగుంపుల చెక్కిళ్లను, నఖముల= గోళ్ళతో

భావము : చాలా ఎత్తుగా పెరిగిన పొన్నచెట్లపై వ్యాపించిన గొజ్జంగి పూపొదలు కోటలుగా ఒప్పెను. అట్టి కోటలయందు కలసి అంతటను వసించుచు, విడిదిని కోరు పులులు, అచట పులిపిల్లలను మెల్లగా పుట్టలను ఎక్కునట్లు చేసి పాలిచ్చు అడవిపందులు, అడవిలో నాచుతీగలు, ఏయే మెట్ట ప్రదేశము లందు ఉండునో వానిని గుర్తించి ఆ పచ్చికను (నాచును) మేయుటకు తోడ్పడు తోడేళ్లు. తోడేళ్లు ఎండ వేడిమిలో తమ నీడ యందు విశ్రమింపజేయుటకై తమ తొండముల నుండి నీటిని స్రవింపజేసి వాని తాపమును తొలగించు ఏనుగులు, బలమైన ఏనుగు కపోల స్థలములను తమ గోళ్లతో దువ్వి ఆహ్లాదమిచ్చు సింహములు.

సీ॥ సంప్లుత స్వరగతోచ్చారణ క్రమనియా
మకగతి ఋగ్వేద మహితపఠన
తరళితోదాత్తానుదాత్త ప్రచయముఖ
స్వరయజుర్వేద విస్ఫురణ మెరయ
గానప్లుతానందకర గీతికాయుత
సామవేదోక్త సుస్వరమృదూక్తి
జృంభితోచ్చారణ గంభీరసుస్వర
సుమహితాథర్వణసూక్తు లమర

తే॥ చారు పిక కీర కలరవ శారికములు
సంతతంబును వేర్వేర సరసనియత

వేదపారాయణంబులు పాదపాభ
విపులతర మంటపంబుల వెలయుచుండ 99

భావము : ప్లుతము అనెడి స్వరముతో క్రమము తప్పని గొప్ప ఋగ్వేద సంచలనముతో, ఉదాత్త అనుదాత్త స్వరములతో విశదమైన యజుర్వేద గానముతో, ఆనందమిచ్చు గీతములు గల మెత్తని సామవేదముతో, వేగముతో మిళితమైన ఉచ్చారణగల ఉదాత్తమైన అథర్వణ వేదముల పఠనములతోను, శాశ్వతమైన కోయిలల యొక్కయు చిలుకల యొక్కయు గోరువంకల యొక్కయు నాదములతోను, ఎల్లప్పుడు వేర్వేఱు చోట్లలో, రసవంతములైన వేదపారాయణము లతో విరివియైన చెట్లకాంతులతో మండపములు మెఱయుచుండగా

తే॥ తనరు నయ్యాశ్రమ ద్వార ఘనకదంబ
కముల నిరుగడ ఫలపుష్ప కలితమగుచు
చూతపల్లవతోరణస్ఫురణ వెలయ
ద్వారపాలక నియతి గంఠీరవములు 100

అర్థాలు : కదంబకములను= కడిమి చెట్లను, ఇరుగడ= రెండు ప్రక్కల, కలితము= కలిగినది, చూతపల్లవతోరణస్ఫురణ= మామిడి చివురుల తోరణముల శోభ, కంఠీరవములు= సింహములు.

భావము : ఒప్పుచున్న ఆశ్రమద్వారమందు గొప్ప కడిమి చెట్లు ఇరుప్రక్కల పండ్లు పూలతో నిండి మామిడి చివుళ్ల తోరణముతో ప్రకాశించెను. అచ్చట సింహములు ద్వారపాలకులై ఉండినవి.

క॥ కలిగిన యాద్వారంబున
జలజాతభవుండు మాయసంయమి జొరగా
నల దివ్యకుసుమవాసన
వలపుందెమ్మెరలు మెల్లవారినెదిర్చెన్ 101

భావము : అట్టి ద్వారమున బ్రహ్మయు మాయామౌనియు ప్రవేశించగా ఒక దివ్యమైన పుష్పవాసనతో గూడి ప్రేమను బుట్టించు మెల్లని గాలి వారికి సోకెను.

సీ॥ కనకరంభాచూతకాంచనాగ్రములతో
దట్టమై కలయంగ జుట్టు కమ్మి
నిండంగ బూచిన బొండుమల్లియ మంట
పంబుల పూదేనె పారు లంట
పెరిగిన పున్నాగ తరులతాంతరముల
సారంగనాదానుసారసరణి
మాకంద పల్లవానీకఖాదనమోద
కోకిలారావముల్ వీక మెఱయ

తే॥ శారికాకీరకేకిశృంగారనాద
కలితకలరవనినదముల్ కలయ బర్వ
కలకలధ్వని మది కౌతుకము దలిర్ప
నద్భుతానందపరవశుడగుచు జనిన 102

అర్థాలు : కనకరంభాచూతకాంచన+అగ్రములతో= పచ్చఅరటి, మావిచివురు బంగారు కొనలతో, పున్నాగతరులతాంతరసారంగనాదానుసారసరణి= పున్నాగచెట్ల పూవులలో తుమ్మెదఝుంకారముల ననుసరించు పద్ధతితో, మాకందపల్లవానీక ఖాదనమోదకోకిలారావముల్= మావిచివుళ్ళను మిక్కుటముగ తినుటచే సంతోషించిన కోకిలల కూతలు, వీక= ఉత్సాహము, శారికాకీరకేకిశృంగారనాద= మైనా, చిలుక, నెమలి మొ॥ పక్షుల శృంగారవిలాసముల నాదములతో, కలితకలరవనినదముల్= కూడిన మధురధ్వనుల ప్రతిధ్వనులు, కలయపర్వ= అంతటను వ్యాపింపగా, కౌతుకము= కుతూహలము తలిర్ప= అతిశయింప.

భావము : పూదేనెను గ్రోలి చేయు తుమ్మెదల నాదములను అనుసరించుచు కోకిలల ధ్వనులు అతిశయింపగా, గోరువంకల, చిలుకల, నెమిళ్ల మధుర నాదములు కలియగా ఉత్సాహముతో ఆనందముతో పరవశించి బ్రహ్మ మాయామునితో వెళ్లెను.

లయగ్రాహి॥ కుందములమీరి మకరందముల జాఱుయర
విందతతిబారి చని పొందుగలదారిన్
కుందవిరులంపు బలువిందుల మతింతమకు
డెందముల నింపు పిక బృందములసొంపున్
గ్రందుకొను తావుల పిఱుందనడబావులర
విందముల తావులవనేందిరసుభావా
నందమున నాడ సురబృందములు చూడదగు
చందమొనగూర్చి తగు నందములతోడన్ 103

అర్థాలు : కుందము= మొల్ల, అరవిందము= కమలము, విరులు= పూలు, పిక= కోయిల, వన+ఇందిర= అడవి సంపత్తి(వనలక్ష్మి) సురబృందము= దేవతల సమూహము.

భావము : మొల్ల పూలను మించి, తేనెను స్రవింపజేయుచున్న కమలముల వరుసలను దాటి పోవుచు, ఆకర్షించు దారియందు మొల్లలు చల్లు విందులైన పరిమళములపై మనసు మరల్చి తమ ఎదలలో వానిని చేర్చుకొనుచున్న కోయిలల సొగసును. అతిశయించిన తావులలో వనలక్ష్మి శుభకరములైన శోభలతో, ఆనందనిలయమై లాస్యము చేయగా, దేవతలు మెచ్చుకొను విధమున హెచ్చిన అందచందములతో ఆ ప్రదేశము అలరెను.

పంచచామరము

చ॥ వనాంతరంబునందునన్ జనన్ లవంగమల్లికా
ఘనప్రసూనవల్లికానికాయవేష్టితోరుగో

స్తనీ మహీరుహ ప్రకాండ సన్మృగీ మదాచ్ఛవా
సనల్ గుబుల్ కొనంగ నల్ల సంయమీంద్రుతో జనన్ 104

అర్థాలు : ప్రసూనవల్లికానికాయ= పూలతీగెల గుంపుచే చుట్టబడిన, ఉరు= పెద్దదైన, గోస్తనీమహీరుహప్రకాండ= ద్రాక్షమొక్కల బోదెలు, సత్‌లి+మృగీమద+అచ్ఛ= మేలైన కస్తూరి యొక్క శుద్ధమైన, గుబుల్‌కొనంగ= ప్రసరింపగా.

భావము : సుందర వనమందు పోవుచు లవంగముల యొక్కయు, మల్లెల యొక్కయు మిక్కుటమైన పూలతీగెల గుంపులచే చుట్టుకొనబడియున్న ద్రాక్షమొక్కల బోదెల పైనుండి, మఱియు కస్తూరి వాసనలు క్రమ్ముకొనునవి సోకుచుండగా, బ్రహ్మయు మాయామునియు ముందుకు సాగిరి.

సీ॥ గొజ్జంగిపూబొదల్ గురిసిన హిమవారి
  కోలముల్ ద్రవ్విన కుల్యసరణి
జారిన వారి కేదారముల్ పూరించి
  చెంగల్వకొలను లుప్పొంగ నిండి
ఘనసారకాంచనక్రముకపంక్తుల వచ్చి
  పసిడి గేదగిమడిపట్ల నెఱసి
కురువేరుమరువంపుగుంపుల నలరించి
  ద్రాక్షపందిరులలో దావు కొనుచు

తే॥ పర్ణశాలాంగణావృత పారిజాత
చందనాగరుముఖతరుబృందమూల
చంద్రకాంతోపలంబుల సరవి జుట్టు
వెలయ సంతతశీతలస్థలములందు 105

అర్థాలు : కోలముల్= ఎలుకలు, కుల్య= కాలువ, సరణి= రీతి, వారి= నీరు, కేదారముల్= వరిమళ్ళను, ఘనసారకాంచనక్రముకపంక్తుల= కర్పూరకాంచనములు పోకచెట్ల వరుసల, కేదగిమడిపట్లనెఱసి= మొగలి పొదలపాదులలో ప్రకాశించి, కురువేరుమరువంపు= వాలకచెట్లు మరువపు చెట్ల, తావుకొనుచు= నెలకొనుచు, పర్ణశాల+అంగణావృత= కుటీరపు ముంగిట చుట్టుకొనియున్న, పారిజాత చందనాగరుముఖ తరుబృందముల= పారిజాతము, మంచి గందము, అగరు మొదలైన చెట్ల మొదళ్ళను, చంద్రకాంత+ఉపలంబుల సరవి= చంద్రకాంతమణుల వలె చుట్టు విస్తరించిన, ఎల్లప్పుడు చల్లగా నుండు స్థలములవలె లలనా ప్రియమ్ కచామోదమ్ (వస్తు గుణ ప్రణాళిక). కురువేరు తమిళనాడులో విరివిగా లభించును.

భావము : గొజ్జంగి పూవుల పొదలు రాల్చిన పూలతో చల్లని నీరు ఎలుకలు త్రవ్విన కాలువలలో ప్రవహించి వరిమళ్ళలోని నీటితో కలిసి, వానిని పూరించెను. ఇదియు ఎఱ్ఱ తామర సరస్సును కూడ పొంగునట్లు కలిసినవి. కర్పూరము, సురపొన్న, పోక చెట్లు వరుసలను చేరి బంగారు వన్నెగల మొగలి పూల పాదులలో నెలవుకొని ప్రకాశించుచు వాలకపు, మరువపు మొక్కలందు, నిలిచినదై చుట్టుకొనియున్న పారిజాతము, మంచి గంధము, అగరు చెట్ల వేర్ల గల చంద్రకాంతమణులను పఱచిన ఎల్లవేళలందు చల్లగానుంచు చోట్లలో.

వ॥ ఒక్కింత విశ్రమించుచు నత్తోయజాసనునకు మాయిక మౌని యిట్లనియె106

భావము : కొంతసేపు విశ్రమించి పోవుచుండగా బ్రహ్మతో మాయాముని యిట్లనెను.

సీ॥ పంచభేదంబుల పంక్తులై విపులత
  గనుపట్టునవి వికల్పకములు సుమ్ము
కల్పకోర్వీజసంఘాతమధ్య సరో
  వరరాజ మిది సుధాసరసి సుమ్ము

ఈ సుధాసరసి విలాస తీరస్థల
　　లతలు సంజీవనీ లతలు సుమ్ము
సంజీవనీలతా కుంజావృతాఖిలౌ
　　షధు లెల్ల సర్వవశ్యములు సుమ్ము

తే॥ మరియు నీ యాశ్రమాష్టది జ్మండలంపు
రసములణిమాది సిద్ధవిరాజితములు
నబ్జభవపుత్ర! యిట్టి యీ యాశ్రమంబు!
కలితమామక యోగ ప్రకల్పితంబు 107

అర్థాలు : వికల్పకములు= విశిష్టములైన వృక్షములు, కల్పక+ఉర్వీజసంఘాతమధ్యసరోవరరాజము= కల్పవృక్షముల సమూహముల మధ్యగల పెద్ద సరస్సు, సుధాసరసి= అమృతసరస్సు, విలాసతీరస్థలతలు= విహరించుటకు ఉయోగించు తీరములలోని తీగెలు, సంజీవనీలతాకుంజ ఆవృతాఖిల ఔషధులు= సంజీవనీలతలపొదరిళ్ళు చుట్టును గలవి ఓషధులు, సర్వవశ్యములు= అన్నిటిని వశపర్చుకొను శక్తిగలవి, ఆశ్రమాష్టదిజ్మండలంపు= ఆశ్రమము యొక్క ఎనిమిది దిక్కుల ఊటబావులలో నున్నవి, రసములు= ద్రవములు, పానీయములు, అణిమాది సిద్ధవిరాజితములు= అణిమాది ఎన్మిది సిద్ధులను పొందించు శక్తిని కలవి, అబ్జభవపుత్ర= ఓ బ్రహ్మకుమారా!, కలితమామకయోగప్రకల్పితంబు= నా యొక్క యోగశక్తి చేత సృష్టింపబడినది.

విశేషము : అష్టసిద్ధులు : అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము.

భావము : అవి ఐదు రకములైన చాలా గొప్ప కల్ప వృక్షముల వరుసలు చూడుము. ఆ కల్ప వృక్షముల నడుమనున్నది అమృత సరస్సు సుమా! ఆ సరుస్సు తీరములో నున్నవి సంజీవనీ తీగెలు సుమా! ఆ లతలు చుట్టియుండునవి. రోగ నివారకములైన మూలికల మొక్కలు సర్వమును

వశము చేసికొనగలవు సుమా! మఱియు ఈ ఆశ్రమమందు ఎనిమిది దిక్కులందున్న ఊటలలోని పానీయములు ఎనిమిది సిద్ధులను పొందు శక్తిని గలవి. ఈ ఆశ్రమము నా యోగ శక్తిచే సృష్టింపబడినది.

చ॥ అనుచు నిజాశ్రమస్థలమహత్తరసంపద లెల్ల దెల్పుచున్
జనునెడ గాంచె ధాత రుచి సంపదలన్ నవరత్నదీధితుల్
దనరెడు కల్పవృక్షనయదారుసుమచ్ఛద నిర్మితంబులై
యనుపమచిత్ర శిల్పమహనీయ మహత్త్వ సువర్ణశాలలన్ 108

భావము : అనుచు తన ఆశ్రమములో గల విలువైన గొప్ప సంపదలను గుఱించి తెల్పుచుండగా బ్రహ్మ ప్రకాశించు వస్తువులలో నవరత్నాల, యొక్క జ్యోతులతో నిండిన కల్పవృక్షముల చక్కని కొయ్యలు పూవులు ఆకులతో నిర్మింపబడిన, సాటిలేని చిత్తరువులు కల శిల్ప సౌందర్యముతో అలరెడి బంగారు కాంతులు నిండిన శాలలందు.

సీ॥ పద్మరాగచ్ఛవిపత్రంపుజొంపలు
　　కేకిపింఛచ్ఛదాకీర్ణ లేఖ।
అమృతాంశుశోభాదళాంచిత భిత్తులు
　　గారుడమణిపత్ర తోరణములు
జాతిపచ్చలవన్నెచదురగు కప్పులు
　　మేల్మి వన్నియలాకు మేలు కట్లు
వజ్రాభపత్రకవాటంపు తడికెలు
　　పవడంపు వన్నెకంబములు దనర

తే॥ మరియునరవిరి తెరగంటు విరుల సరుల
పాలవెల్లుల మధురసపాన మత్త
సంభ్రమభ్రమరారావసంకులంబు
గలుగు మొగసాల యల్లన గడచి చనగ 109

అర్థాలు : పద్మరాగ+ఛవి= పద్మరాగమణులకాంతితో, పత్రంపు= ఆకుల, జొంపములు= గుత్తులు, కేకిపింఛఛద+కీర్ణలేఖ= నెమిలిపింఛములు కప్పబడి నిండిన, చిత్రరచనలు, అమృతాంశుశోభాదళ+అంచితభిత్తులు= చంద్రుని శోభతోదట్టమైన గొప్ప గోడలు, గారుడమణిపత్ర= గరుడపచ్చ వన్నెలు గల ఆకులు, చదురగు= చాతుర్యముగల, మేలుకట్లు= తడికెలు, వజ్రఆభపత్ర కవాటంపు= వజ్రమునుపోలిన ఆకు తలుపుల, కంబములు= స్తంభములు అరవిరి= సగమువిచ్చిన, తెరగంటు విరుల సరుల= దేవతాపుష్పముల దండలతో చేయబడిన, మధురసపానమత్త= పూదేనెను త్రాగుటవలన మత్తెక్కినట్టి, సంభ్రమభ్రమరారావసంకులంబు= సంభ్రమము గల తుమ్మెదల ఝుంకారములతో సందడిగల, మొగసాల= ముంగిటి ప్రదేశము, గడచి= దాటి.

భావము : 1 పద్మరాగ మణుల కాంతిగల ఆకుల గుత్తులు. 2 నెమలి ఈకల నీల వర్ణము గల చిత్తరువులు. 3 చంద్రుని వెన్నెల శోభగల గోమేధికము (పసుపు) వర్ణముగల గోడలు 4. గరుడ పచ్చని గారుడ మణి (మరకతము) గరిమగల గడప ముందు వాకిలిలో నిడుపైన కంబములకు కట్టిన ఆకుల సరములు. 5. లేత పచ్చని రంగుగల మాణిక్య వర్ణము గల (అశోక వృక్ష వత్రములు) ఇంటిలోని పైకప్పులు. 6. నేర్పరి తనము గల వైడూర్యమణి వర్ణముగల, (పిల్లికన్నురంగు) కప్పుల గోడలంటు నట్లు చిత్రమైన సన్నని వస్త్రముల సముదాయపు మేలికట్లు. 7. తెల్లనైన రంగుకల సూర్యుని కిరణముల వంటి వజ్రాల వర్ణముతో తలుపులుగా నున్న ఆకుల తడికెలు. 8. గోధుమ కాంతిగల పగడపు వర్ణముగల, స్తంభములు. 9. సగము విచ్చిన దేవతా పుష్పములు ముత్యాల (వెండి వంటి) కూర్పులలో తేనెను తాగి మదమెక్కి, వేగిరపాటుతో తిరుగు తుమ్మెదల ఝుంకారములతో సందడి గల వాకిలిని దాటి. (వాకిలి నవరత్నముల కాంతులు కలది.) 1. పద్మరాగమణి, 2. నీలమణి, 3. గోమేధికము, 4. గారుడమణి, 5. మాణిక్యము, 6. వైడూర్యము, 7. వజ్రము, 8. పగడము, 9. ముత్యము.

తే॥ సర్వశృంగారమయ చతుశ్శాల నడుమ
రంగమంటపపార్శ్వాంతరస్థలమున
సరసమృగమదసిక్త విశాలభూమి
చారుతరమైన ద్వారదేశంబునందు 110

భావము : సమస్తమైన శృంగారముతో (అందముతో) ప్రకాశించు, నాలుగు గోడల మధ్యగల, రంగస్థల మండపమందు ప్రక్కల గల స్థలములో, కస్తూరి వాసనలతో తడిసిన విశాల ప్రదేశమున గల ద్వారభాగమందు.

సీ. విబుధేంద్ర మణికాంతివేణికాంతర దివ్య
కుసుమసౌరభమెంతొ గుబులుకొనగ
చెలుల కెచ్చరికలు దెలుపుచో నునుమృదు
పలుకుల చక్కెర లొలుకుచుండ
కలికికన్నుల తుదబెళకుచూపుల నింద్ర
నీలంపు చకచకల్ నెరసిపార
భరిత షోడశకళాపరిపూర్ణసౌందర్య
ముఖచంద్రికలు దిశల్ మొనసి నిండ

తే॥ లలిత భావజ సామ్రాజ్య లక్ష్మి యనగ
హస్తపంకజముల నమృతాంబు పూర్ణ
కనకరత్న వినిర్మితకలశ మమర
నున్న యోగిని గనె నజు డుల్లమలర 111

అర్థాలు : విబుధేంద్రమణికాంతివేణికాంతరదివ్యకుసుమసౌరభము= ఇంద్రనీల మణికాంతిగల జడలోని దివ్యపుష్పముల సుగంధము, ఎచ్చరికలు= జాగ్రత్తలు, హెచ్చరికలు, చకచకల్=వెలుగులు, నెఱసి= నిండి, భరితషోడశ కళాపరిపూర్ణసౌందర్యముఖచంద్రికలు= నిండిన పదునాఱు కళలతో సంపూర్ణమైన అందముగల ముఖముయొక్క వెన్నెల కాంతులు,

మొనసి= తాకి, లలితభావజసామ్రాజ్యలక్ష్మి= మృదులమైన మన్మథసామ్రాజ్యలక్ష్మి, హస్తపంకజముల= కమలములవంటి చేతులలో, అమృతాంబుపూర్ణ కనకరత్నవినిర్మితకలశము= అమృతముతో నిండిన బంగారు రతనములతో చేయబడిన పాత్ర.

భావము : నల్లని జడలో పువ్వులవాసన ప్రసరించుచుండగా చెలికత్తెలకు సూచనలు ఇచ్చునప్పుడు మెత్తని పలుకుల తియ్యదనము తెలియగా, కన్నుల నుండి నీలిమల వెలుగులు వెదజల్లబడగా, ముఖమందు పదునాఱుకళలు అన్ని దిక్కులకు వ్యాపించి మదనుని సామ్రాజ్యలక్ష్మియా అనెడి విధమున చేతులలో అమృతము నిండిన బంగారుపాత్రతో నున్న కన్యను యోగినిని బ్రహ్మ చూచెను.

విశేషము : షోడశకళలు : చంద్రునికి మొత్తము పదియాఱు కళలు కలవనియు, అవియే వృద్ధిచంద్రునిలో నానాటికి చేరుచుండుననియు, పూర్ణిమనాడు కళాపూర్ణుడగుననియు చెప్పబడినది. ఆ కళలు ఇవి! అమృతా, మానదా, పూషా, తుష్టిః, పుష్టీ, రతిః, ధృతిః, శశినీ, చంద్రికా, కాంతిః, జ్యోత్స్నా, శ్రీః, ప్రీతిః, అంగదా, పూర్ణా, అమృతా అనునవి. కాని వీనిలో మొదటిది, చివఱిది కూడ అమృతా ఒక్కటేయని గమనింతుము. కనుక లెక్కకు పదునైదు మాత్రమే వచ్చుచున్నవి. ఈ పదునాఱవ కళ 'అమా' యని, ఇది కలిగిన చంద్రుడు అమావాస్య చంద్రుడని, కనుక మనకు అనుభవమునకు వచ్చు చంద్రకళలు పదునైదు మాత్రమే. దీనికి సంబంధించియే, ఆ చివఱి కళ 'అమా' శివుని శిరస్సునలంకరించి యుండునని కాళిదాసుడు చమత్కరించి నట్లు చెప్పుదురు.

వ॥ ఇట్లు పూజితాహ్వానోపకరణ సంభరిత హస్తలగు పరిచారికా ప్రశస్తల నడుమ తారకామధ్యసంశోభిత పూర్ణచంద్ర బింబంబును బోలె భాసిలుచున్న యమ్మత్త కాశినిం జూచి తత్సౌందర్యతేజో విలాస విభ్రమకళా సంపూర్ణ యౌవనంబునకు మనంబు నందాశ్చర్యంబు నొందుచున్న యవసరంబున 112

అర్థాలు : పూజితాహ్వానోపకరణసంభరితహస్తలగు= పూజ్యుని ఆహ్వానించుటకు ఉపయోగపడు వస్తుజాలములతో నిండిన చేతులు గలవారగు, పరిచారికాప్రశస్తలనడుమ= ప్రశస్తులైన పరిచారికల మధ్య, తారకామధ్యసంశోభితపూర్ణచంద్ర బింబంబునుబోలె= చుక్కల మధ్య వెలుగుచున్న పున్నమి చంద్రునివలె, మత్తకాశినిన్= యౌవన మదముతో నున్న స్త్రీని, తత్సౌందర్య తేజోవిలాస విభ్రమకళాసంపూర్ణయౌవనంబునకు= ఆమె సౌందర్యము, తేజస్సు, ఒయ్యారములతో వృద్ధియైన కళలతో నిండిన యౌవనమునకు, అవసరంబున= సమయమున.

భావము : పూజించుటకు వలయు వస్తువులను కలిగిన పరిచారికల నడుమ పూర్ణచంద్రుని వలె నున్న మదవతిని చూచి ఆమె సౌందర్యాతిశయమునకు ఆశ్చర్యము పొందెను. అప్పుడు

ఆ॥ అంచగమన యవ్విరించి నల్లన జూచి
యంచితాస్య మల్ల వంచి చేరి
యర్ఘ్యపాద్య ముఖ్యమగు విధులను నజు
జనకు బూజచేసె సమ్మదమున 113

అర్థాలు : అంచగమన= హంసవలె ఒయ్యారముగ నడుచునది. విరించిన్= బ్రహ్మను, అల్లనన్= మెల్లగ, అంచితాస్యము= అందమైన ముఖము, అల్ల= మెల్లగ, అర్ఘ్యపాద్యముఖ్యమగు విధులను= అర్ఘ్యము, పాద్యము మొదలైన కర్తవ్యకర్మలను, సమ్మదమున= సంతోషముతో, అర్ఘ్యము= పూజకు పనికివచ్చు శుభ్రమైన నీరు మొదలైనవి. పాద్యము= కాళ్ళు కడుగుకొనుటకు అతిథులకిచ్చు నీరు.

భావము : ఆ హంసవంటి గమనము కల భామ బ్రహ్మను చూచి తలవంచి పూజా విధులను సంతోషముతో, బ్రహ్మకు జనకునికి నిర్వర్తించెను.

క॥ ఆజవ్వని యయ్యిద్దరి
బూజలు గావించి యంతిపురికరిగిన యా

రాజీవభవుడు నమ్మని
రాజుం దగ నరిగి మధ్యరంగమునందున్ 114

భావము : ఆ యౌవనవతి ఆ యిరువురికి పూజలు కావించి, అంతపురికి వెడలి పోయినంతనే బ్రహ్మ, మాయామునివరుని కడకువెళ్ళి రంగస్థలము నడుమ

మ॥ నవరత్నోజ్జ్వలవర్ణవల్కలకృతానర్ఘ్యాచ్ఛనేత్రాంబుజో
త్సవచిత్రాసన వాసులైన యతి స్రష్టం జూచి మాయామునీం
ద్రవరేణ్యుండనె నేడు గాదటె భవత్పాదాబ్జరేణు స్పృశన్
రవిరశ్మిన్ సకలంబునుం బలె బవిత్రంబయ్యె బ్రహ్మాత్మజా! 115

అర్థాలు : నవరత్న+ఉజ్జ్వలవర్ణవల్కలకృతానర్ఘ్యాచ్ఛనేత్రాంబుజోత్సవచిత్రాసన వాసుడైన= నవరత్నముల కాంతితో వెలుగుచున్న రంగుగల వస్త్రములచే చేయబడిన ఎక్కువ వెలగల నిర్మలమైన కన్నుల పండువైన చిత్రాసనముపై కూర్చొని యుండగా, యతిస్రష్టన్= మౌని బ్రహ్మను, భవత్పాదాబ్జరేణుస్పృశన్= తమయొక్క పాదపద్మముల ధూళి సోకుటచే, రవిరశ్మిన్= సూర్యకిరణములచే.

భావము : విలువైన మహనీయమైన చిత్రమైన ఆసనమందు ఇరువురు కూర్చున్న సమయమందు, ఋషియైన బ్రహ్మను చూచి మాయా మునీంద్రుడు ఇట్లనెను. "బ్రహ్మతనయుడా! మీ పాదపద్మముల నుండి వెల్వడిన ధూళి (దుమ్ము) సోకుటచే సూర్యకిరణముల తాకుచే సర్వము పరిశుద్ధమగునట్లు ఇప్పుడు అంతయు పవిత్రమైనది."

క॥ నీవెక్కడ మేమెక్కడ
నీ విటకున్ వచ్చు టెట్లు నిను బూజింపన్
గావలయుట మాకోర్కెల
శ్రీవెలయుట గాదె నేడు సిద్ధముగాగన్ 116

భావము : "ఎక్కడనో నుండు వాడవు నీవు. మేము ఎక్కడనో ఉందుము. నీవు ఇచ్చటికి ఎట్లో వచ్చితివి. నిన్ను పూజించుటకే అయినది. మా కోర్కెలు ఫలించు సౌభాగ్యము మాకు కలిగినది కదా!"

చ॥ అని వినయోపచార వినుతామృత వాక్యపయోధి దేల్చుచుం
డిన వనజాత సంభవుని డెందము చందము యోగినీ సతీ
తనురుచి రూప విభ్రమవితానములన్ వసియించి యుండుటల్
తన మదిలో నెరింగి యిక ధాత గలంతు నలంతునం చెదన్ 117

అర్థాలు : వినయోపచారవినుతామృతవాక్యపయోధిన్= వినయముతో కూడిన కీర్తింపదగిన అమృతమువంటి ఉపచారవాక్యముల సముద్రములో, డెందము చందము= మనసు విధమును, యోగినీసతీతనురుచి= యోగిని యొక్క శరీరకాంతి, రూపవిభ్రమవితానముల్=రూపవిలాసముల సమృద్ధితో, ధాతన్= బ్రహ్మను, కలంతును= బాధింతును, అలంతును= అలయునట్లు చేయుదును.

భావము : ఆ ఉపచారములచే స్తుతులు కల తియ్యని పలుకులచే ఉల్లాసమును కూర్చుచున్నను బ్రహ్మ మనసు యోగిని సౌందర్యముపై నున్నదని తలచి కలత కలిగించి అలసిపోవునట్లు ఇంక చేయుదునని తలచి.

ఉ॥ సంతసమందె మాయికుడు సారససంభవు డాత్మలోన న
క్కాంతనితాంతకంతు నవకాండవిలాసవినోద చాతురీ
స్వాంతముతోన నంతిపురసద్మము చేరిన దానిచొప్పు నే
నంత యెరుంగుటెట్లు మహదద్భుత మీనవలా విలాసమున్ 118

భావము : మాయావి సంతసించెను. ఆ బ్రహ్మ మదిలో ఆకాంతవలన ఎడలేని మదనుని బాణ పరంపరల వినోదచాతుర్యములు నిండిన హృదయము గల వాడై "ఆమె ఎవరో ఎట్లు తెలిసికొనగలను. ఈ మోహిని సొగసు ఆశ్చర్యకరముగా నున్నదే"

శా॥ ఆ నారీమణి యే మహామహుని భార్యా రత్నమో యే మహా
మౌనీంద్రాగ్రణి కన్యకో త్రిజగతీ సామ్రాజ్య శ్రీదేవిగా
గానంగా దగె నీ మునీంద్రు నడుగంగా వచ్చునో రాదొకో
నానాసర్గములందు నిట్టి హృదయానందాకృతుల్ గల్గెనే! 119

భావము : "ఆ నారీమణి ఏ మహనీయుని పత్ని, ఏ మునివరుని కుమార్తెయో! త్రిలోకాధిపతి సామ్రాజ్య సౌభాగ్యలక్ష్మిగాదగును. మునివరుని అడుగదగునా

సీ॥ అమృతంబుకొఱకునై యసురులహరి మాయ
గలచిన మోహినీ కాంత రూపు
ఆ రూపుచూడ నహంకరించిన శివు
గలచిన హరి మాయ కలికి రూపు
ఆనాడు నే శ్రమగలరి చూచిన యట్టి
దాక్షాయణీ దేవి తరుణి రూపు
అమృతాబ్ధిలోపల నపుడు జన్మించిన
లావణ్యఖని యాది లక్ష్మి రూపు

తే॥ మఱియు గంధర్వ కిన్నరమనుజనాగ
కన్యకావలి యప్సరోగణము రూపు
లన్నియును నేను జూడని యవియు లేవు
యిట్టి సౌందర్యమును గంటినే తలంప 120

భావము : "రాక్షసులను కలత బెట్టిన హరిమాయయైన మోహినీరూపము శివుని కలత చెందించిన హరిమాయయైన మోహన రూపము, తాను శ్రమపడి చూచిన దక్షసుత సతీదేవి యౌవనరూపము పాల సముద్రములో జన్మించిన లావణ్యనిధి ఆదిలక్ష్మి రూపము, మఱియు గంధర్వాదుల రూపములు, దేవవేశ్య రూపములు నేను చూడనివి లేనేలేదు. ఆలోచింపగా ఇట్టి సౌందర్యమెందును చూడలేదు!"

తే॥ అనుచు దలపోయు నుసురను నలమటించు
నలయికను బోలె తపియించు నగ్గలించు
తాపము నణంచు నిలువక తత్తఱించు
మాయికుని జూచు భయమున మాటుకొంచు 121

భావము : ఆ యోగినిని తలంచుచు నిట్టూర్పు వహించును. చింతించును, అలసినట్లు తపించును. అతిశయించు తాపమును అణచుటకు యత్నించును. నిశ్చలముగా నుండ లేక తొట్రుపాటు పడును. మౌనిని సంక్షోభముతో చాటుగా చూచును.

క॥ అడిగెదనని గమకించును
నడిగిన నితనికిని కోపమడరిన యేనిన్
కడు జగములతో నేని
ప్పుడె మడియుదు ననుచు భీతి బుర బుర బొక్కున్ 122

భావము : అడిగెదనని ముందుకు సాగును. అడిగినపుడు అతని కోపము రేగినచో అన్ని లోకాలతో కలిసి నేను మాడిపోవుదును అని భయపడుచు బాగా దుఃఖము చెందెను

విశేషము : ఈ పద్యము పోతన "అడిగెదనని కడువడి" పోలియున్నది.

వ॥ ఇట్లు తపియింపుచు యన్నలువం గనుంగొని తానెరుంగని వాడునుం బోలె మాయికుండు తత్తోయజా సనునితో నిట్లనియె. 123

భావము : తపించుచున్న బ్రహ్మను చూచి ఏమియు తెలియని వాని వలె మాయాముని ఇట్లనెను.

ఆ॥ అయ్య లెండు తీర్థమాడంగ దడవాయె
బడలినారు గమన భారమునను
బూజితుండ వగుచు భోజనోత్తరమున
విశ్రమింప లెస్స విధికుమార 124

భావము : "అయ్య, ... విధికుమార! స్నానము చేయుటకు ఆలస్యమైనది. అలసి పోయినారు. పూజలందుకొని భోజనము చేసిన తరువాత, విశ్రమింపదగును."

సీ॥ అనుచు దోడ్కొని పోయి యభ్యంతర స్థలి
నగరుసాంబ్రాణి ధూపాయుతంబు
ప్రసవితమందార కుసుమాభిరామంబు
మృగమదసిక్తంబు నగుచు నలరు
మంటపంబున దివ్యమణిపీఠముననుంచి
సరసామృతాభిషేచనము చేసి
అనుపమవస్త్రమాల్యాభరణాలంకృ
తంబు గావించి మోదంబుతోన

తే॥ గంధపుష్పాక్షతాద్యలంకారములను
ధూపదీపాదికముల సంతుష్టి చేసి
సూక్తములు చెప్పి చాల సంస్తుతుల జేసి
సరసముదమున గూర్చున్న సమయమునను 125

భావము : అని వచించి, లోపలికి కొనిపోయి మఱుగైన చోట సువాసనలీను అగరు సాంబ్రాణి కలిసిన ధూపము పూచిన మందారపుష్పములతో అందమై ఒప్పుచున్న శ్రేష్ఠమైన, అనువైన పీటపై కూర్చుండబెట్టి చక్కగా స్నానము చేయించి సాటిలేని వస్త్రములు, పూలమాలలు, నగలతో అలంకరించి, సంతోషముతో గంధము, పుష్పము, అక్షతలు మొదలగు అలంకరణలతోను సాంబ్రాణి పొగపెట్టి దీపమును చూపి సూక్తములను వల్లించి, స్తుతించి ఆనందముతో నున్న సమయమందు.

క॥ నడబెడగు ముద్దుమోముల
ముడిబిగి కీల్గంటు నగవుమొనసిన టెక్కున్

కడుబిగి కుచములు జఘనము
ఒదికపుమృదుపదములలర యోగిని కడకన్ 126

భావము : నడక ఒయ్యారము, అందమైన పెదవులు, జాఱు వెంట్రుకలు, జడముడి బిగువు, చిఱునవ్వు వెల్వడు విలాసము, మిక్కిలి గట్టివైన స్తనములు, పిఱుదులు, ఒప్పారు మెత్తని పాదములు ఇంపుగా కన్పట్టు చుండగా యోగిని ఉద్దేశ పూర్వకముగా

ఉ॥ కట్టిన చీర వెల్గురికి గాంచన ధీధితు లగ్గలింపగా
చుట్టున పయ్యెదన్ మరుగుచొక్కపు గుబ్బలు నిక్కు జూపగా
పట్టిన మోహపాత్రికల పాకవు తావులు గ్రమ్ము దేరగా
పెట్టిన భూషణద్యుతుల బెక్కుగ దిక్కులు పిక్కటిల్లగన్ 127

భావము : కట్టిన చీరకాంతి వెల్లువై బంగారు కిరణములతో అతిశయింపగా చుట్టును అంతటను పైటలో మఱుగున నున్న అందమైన చన్నులు తమ గడుసు దనము చూపగా, చేతులలోగల ఆకర్షణీయమైన గరిటిలలో వంటల వాసనలు వ్యాపింపగా, ధరించిన ఆ నగల వెలుగులచే దిక్కులు మెఱయుచుండగా,

చ॥ కనకపు పళ్ళెరంబులు జొకాటపు గిన్నెలునున్ సుధాంబువుల్
నినిచిన పైడికంబులను నెమ్మి నమర్చుచు కామధేనుసం
జనితవనీ రసాయన రసస్థితి పాక సమంచితాన్నముల్
వినయవిచక్షణ ప్రియ వివేకత వడ్డన సేయ ప్రీతిమై 128

అర్థాలు : కనకపు= బంగారపు, నెమ్మి= ప్రీతితో, పైడికంబు= కానుకలను, చొక్కటపు= శుభ్రమైన

భావము : బంగారు పళ్ళెములు, శుభ్రమైన గిన్నెలు, చక్కని పాలు నింపిన బంగారు పాత్రలను ప్రీతితో అమర్చుచు కామధేనువు నుండి కలిగినట్టి, అడవులనుండి తెచ్చిన ద్రవ్యములు గల పానీయములైన ద్రవములతో

వండినట్టి చక్కని అన్నములతో,వినయము, మెలకువ, చుఱుకుదనములతో ప్రీతితో వడ్డింపగా.

క॥ భుజియించి లేచి వార్చుచు
నజమాయికు లల్ల మంటపాంతరమందున్
రజనిచరరత్నవేదిక
నిజమానస తాప మోద నిబిడత లెసగన్ 129

భావము : ఉత్తరాపోశనము చేసి (ఆచమించి) భోజనము చేసి బ్రహ్మ మాయాముని ఇరువురు, అటనున్న మండపము యొక్క నడుమ నున్న చంద్రకాంత మణులు పొదిగిన వేదికపై తమ తాపము (బ్రహ్మ) ఆహ్లాదము (ముని) క్రమముగా అతిశయింపగా

ఉ॥ ఉండిన బాలికామణులు నొయ్యన వీడ్యము లంగరాగముల్
వెండిపసిండి పాత్రలను వేగమ తెచ్చి యటుంచ మాయికుం
డండజవాహనుం గదిసి యామహనీయ విలేపనంబు మై
నిండ నలంది వీడియము నెమ్మి నొసంగి నుతించి యిట్లనెన్ 130

భావము : అట్లు వారుండగా, మెల్లగా అందమైన బాలికలు తాంబూలాదులను ఒంటికి పూయు ద్రవ్యములను తెచ్చి అచ్చట ఉంచిరి. వేగముగా ఆ మాయికుడు బ్రహ్మను సమీపించి గొప్ప పూతలను, అతని శరీరము మీద పూసి ప్రీతితో తాంబూలమిచ్చి, అతని పొగడి ఇట్లు వచించెను.

క॥ కడునేకతంబు సుఖమ
దె డు మిమ్ముల దెచ్చి రాయడింప దగులుడున్
బడితిరి చాలగ మైశ్రమ
యడగగ శయనించు డనుచు హిత వచనములన్ 131

భావము : "ఏకాంతమున సుఖించుచున్న మిమ్ము ఇక్కడికి తెచ్చి ఒత్తిడి చేయగా, చిక్కులను పొందితిరికదా! శరీరశ్రమ తొలగగా పండుకొనుడు" అని మేలుకోరు మాటలతో,

వ॥ ఉపచారంబులు చెప్పి మరియు నిష్టాలాపంబులనున్న నజుం డిన్నియు
పచారంబులుం గాంచియు తుష్టి లేని హృదయంబునన్ దలంచుచుండి
యల్లన మాయికునితో నిట్లనియె 132

భావము : ఓదార్చి ఇష్టమైన సంభాషణములను కావించినను బ్రహ్మ ఇవన్నియు తృప్తినియ్యని ఎదతో తన తలపులు కలవాడై మెల్లగా మాయావితో ఇట్లనెను.

మ॥ మనకున్ వడ్డన చేసినట్టి యువతీమాణిక్య మేసంయమీం
ద్రునికిం గూతురొ యే మహామహుని కారోపించినారో ప్రియాం
గనగా నాఘను పూర్వజన్మకృతభాగ్యం బెన్నగా శక్య మే
వనజాతాలయ వాణి గౌరి సరిగా వర్ణింపగా దింతికిన్ 133

భావము : "మనకు భోజనము వడ్డించిన గొప్ప యువతి ఏ ముని కుమార్తెయో! ఏ గొప్పవానికి భార్యగా ఇచ్చినారో? అతని పూర్వజన్మకృతమైన పుణ్యమును గణింప సాధ్యముకాదు. ఈమెతో, మహాలక్ష్మి, సరస్వతి మహాదేవియు అందమందు సాటిరారు."

తే॥ అనిన మీ కరుణా కటాక్షాతిశయత
గలుగ నెంచినవారు నిక్కంబుగాగ
నింతకును జాలియుండుట వింతలగునె
బాల యిది నాతనూభవ భవ్యశీల! 134

భావము : బ్రహ్మ అనగా,"ఓ చక్కని నడవడికకలవాడా! మీ దయ, క్రీగంటి చూపుల మహిమ కలుగగా ఇంతకును ఆమె తగియుండుట, నిజమే. ఇట్టి సౌందర్యము వింతలగునా? ఈ బాల నాకుమార్తె!"

మ॥ ఒకకాలంబున నే దపోనియతి నిందుండంగనా మానసో
ద్వికచాంభోజమునందు నీ సుదతి యావిర్భావమయ్యెన్ సఖీ

ప్రకరావేష్టిత యౌచు నే గనులు విప్పన్ మ్రోల గన్పట్టి మా
మకపాదంబుల వ్రాలినన్ గరుణ నేమన్నించితిం గూతుగాన్ 135

అర్థాలు : సఖీప్రకర+ఆవేష్టిత= చెలులతోగూడి, మ్రోల= ఎదుట, మామక= నాదియైన, కూతుగాన్= కూతురుగా

భావము : "ఒకప్పుడు నేను తపోనిష్ఠలో నుండగా నా వికసించిన పద్మము వంటి మనస్సులో పుట్టెను. కన్నులు తెఱవగా చెలులతో నా ఎదుట కనబడి నా పాదములకు మొక్కినది. నేను దయతో నా కుమార్తెగా ఆదరించితిని"

ఉ॥ మన్ననసేయుచుం బెనుప మానిని మా నియతానువర్తియై
సన్నుత చర్యలన్ సకల శాస్త్ర విచారణ లాగమార్థ సం
పన్నత సద్వివేకమును నుక్తి విచక్షణమార్య సేవకా
త్యున్నత చిత్తముం గలిగి యొప్పుచునుండు మదీయ శిక్షచే 136

అర్థాలు : పెనుప= పెంచగా, మానిని= స్త్రీ, నియతానువర్తియై= మా నియమము లెఱిగి వానికి అనుకూలమైన ప్రవర్తన కలిగి, సన్నుత చర్యలన్= మెచ్చదగు ప్రవర్తనతో, ఆగమార్థ సంపన్నత= ఆగమశాస్త్రముల అర్థముల జ్ఞానము కలిగి, ఉక్తి విచక్షణము= సందర్భ శుద్ధిగా ఉచితానుచితముల నెఱిగి మాటలాడుట, ఆర్య సేవకాత్యున్నత చిత్తము= ఆర్యులను సేవించవలెనను మంచి మనస్సు, మదీయ శిక్షచే= నేను ఇచ్చిన శిక్షణ వలన, ఒప్పుచునుండును= వికసించుచున్నది.

భావము : "ఈ బాల 'నేను పెంచగా, నియమవంతురాలై సకలవిద్యలను అర్జించి వివేకము, మాటలనేర్పు, ఆర్యులను సేవించు ఉన్నత చిత్తము కలదై నా శిక్షణచే పెద్దదైనది."

చ॥ మహితతపోనిరూఢి నసమాన మహోన్నత యోగవిద్యలన్
సహజములైనయట్టుల ప్రసన్నత గాంచి మహాష్ట సిద్ధులన్

మహిమలు నన్ని నేర్చె నిది మాన్య చరిత్ర పవిత్ర దీనికిన్
మహితగుణాఢ్యుడైన పతి మానస వీథిని జింత సేయుదున్ 137

భావము : "గొప్ప తపశ్శక్తిచే సాటిలేని యోగవిద్యచే స్వభావముచే కలిగినట్లు ప్రసన్నురాలై ఎనిమిది సిద్ధులను మహిమలను ఈ కన్య నేర్చినది. ఆదరింపదగిన ప్రవర్తన కలది. పవిత్రురాలు. ఈమెకై ఒక వరుని గూర్చి ఆలోచించుచున్నాను."

ఉ॥ మౌని కుమారులన్ సురకుమారుల నాగకుమారవర్యులన్
మానిత యోగ శాస్త్ర మహిమాకృతి ముఖ్య సమస్త భూరివి
ద్యానిపుణ ప్రయుక్తులను నారసి నిచ్చలు దోడితేరగా
మానిని దా తిరస్కరణమానసయై కనుగొంచు నుండగన్ 138

అర్థాలు : మానిత= సమ్మానింపబడిన, యోగశాస్త్రమహిమాకృతి ముఖ్యసమస్త భూరి విద్యా నిపుణ ప్రయుక్తులను= యోగశాస్త్రముల మహిమ యొక్క రూపములైనట్టియు ముఖ్యమైన అన్ని గొప్ప విద్యలలో ప్రయోగ నిపుణతను పొందినవారిని, తోడితేరగా= తీసికొని రాగా.

భావము : "మునుల, దేవతల, నాగుల కుమారులను, సర్వ విద్యా నిపుణులను తీసికొని రాగా అందఱిని తిరస్కరించినది."

శా॥ ఏమే యోగిని! సర్వలోక చరులందే నిట్ల విద్యాతపః
శ్రీమాన్యస్థిరయోగ శాస్త్ర ధనులన్ శృంగార రేఖామహో
ద్దామాకారుల బూర్ణయౌవనుల విద్వద్వర్యులన్ దెచ్చినన్
సామాన్యస్థితి నెంచి పల్కవిక నీ చందం బిదేట్లన్నచో! 139

అర్థాలు : సర్వలోకచరులందేన్= అన్ని లోకములలో యథేచ్ఛగా తిరుగగల వారియందైన, విద్యాతపఃశ్రీమాన్యస్థిర యోగ శాస్త్రధనులన్= విద్యలలో, తపస్సులతో, వైభవములో మన్నింప దగిన యోగశాస్త్రజ్ఞానమున స్థిరులైన వారిని, శృంగార రేఖామహోద్దామాకారుల= శృంగార భావములను ప్రకటించు

రూపము గల వారిని, పూర్ణ యౌవనుల= యౌవనము నిండిన వారిని, చందంబు= పద్ధతి, అందఱినినిరాకరించుట, ఇట్లు ఉన్నదే= వింతగానున్నదే!

భావము : "ఏమే! యోగిని! సర్వలోకములను తిరుగువారిలో విద్యా వంతులైన తాపసులను శాస్త్రజ్ఞులను, శృంగార మూర్తులను, పూర్ణ యౌవనులను, గొప్ప విద్వాంసులను తీసికొని రాగా, వారిని సామాన్యుల వలె తలంచి మాట్లాడవు. ఈ పద్ధతి వింత గదా!"

క॥ తలవాంచి యూరకుండిన
జలజాయతనేత్రి జూచి సకల వివేకో
జ్జ్వలమానసవైయుండియు
పలుకనిచో నెట్లు నీదు భావము దెలియున్ 140

అర్థాలు : జలజాయత నేత్రిన్= పద్మముల వంటి పెద్ద కన్నులు గలదానిని, వివేకోజ్జ్వల మానసవై= వివేకముతో ప్రకాశించుచున్న బుద్ధిమంతురాలవై

భావము : తలవంచుకొని ఊరకున్న కుమార్తెను చూచి "వివేకము, బుద్ధి కలిగిన నీవు పల్కనిచో నీ భావము ఎట్లు తెలియును"

క॥ కులగోత్రశాస్త్ర పౌరుష
కలితవయోరూపములును గలిగినవారిన్
తెలిసి యొనగూర్ప మాకగు
కలకంఠీ! నీదు హృదయగత మెయ్యదియో 141

భావము : "మంచి కులము, గోత్రము, శాస్త్రవిజ్ఞానము, కార్యశూరత్వము, ఇన్నిటితో వయస్సు రూప సంపదలను కలిగిన వారిని కూర్చుట మాకు సాధ్యమే! కలకంఠీ! నీ అభిప్రాయమేమో తెల్పవే తియ్యని పలుకులదానా!"

తే॥ తెలియజెప్పితేని త్రిభువనములయందు
కలయ వెదకి తెత్తు నలువనైన

వాని తెరగు దెలియ వచియింపుమన్ననా
కలికి బలికె నాదు కరుణ దెలిసి 142

భావము : "మూడు లోకాలను వెదకి బ్రహ్మనైన తేగలను, ఎట్టివానిన కోరెదవో తెల్పుము" అనగా నా దయను గ్రహించి ఆ కన్య ఇట్లనెను.

మ॥ జనకాధీనము కన్యకామణిగదా సర్వజ్ఞులై యుండి యి
ట్లనన న్నేమని విన్నవింతు భవదీయాత్మానుసారంబుగా
మనమందుం గలదొక్కటే భువన నిర్మాణైక చాతుర్యమున్
ఘనసర్గస్థితినాశకారణుని లోకత్రాణ పారీణునిన్ 143

అర్థాలు : జనకాధీనము= తండ్రి చాటుది, భవదీయాత్మానుసారంబుగా= తమ ఇష్టముననుసరించి, భువన నిర్మాణైకచాతుర్యమున్= భువనములను నిర్మించగల అపూర్వమైన నేర్పును, ఘనసర్గస్థితి నాశకారణుని= గొప్ప సృష్టికి, స్థితికి, నాశనమునకు కారణమైనవానిని, లోకత్రాణపారీణునిన్= లోకములను రక్షించుటలో శక్తి జ్ఞానము గలవానిని.

భావము : "కన్యక తండ్రికి విధేయురాలు మీ యిష్టమును బట్టి సృష్టి స్థితిలయ కారుని, లోకాలను రక్షించు ప్రవీణతగల లోక నిర్మాణ నైపుణ్యముచే లోకాలను రక్షించువానిని"

క॥ తన మాయచేత జగములు
మునుగం దనకరుణయందు మొనయును వానిన్
మనుచును నే ఘను డాతని
మనమున జింతింతు నేను మగనిం గాగన్ 144

భావము : "తన మాయచేత ఎవడు లోకాలను, పుట్టించునో, పెంచునో అట్టి ఘనుని నేను మగనిగా చింతించుచున్నాను"

ఉ॥ ఇట్టిది నా మనోగతమిదిందుకు నీ హృదయానుసారిగా
నెట్టు ఘటింపగా నగునొ యెట్టి విచారమొ దానిసేత దా

నెట్టన సర్వలోక హిత నిశ్చయమింతకు మించలేదు నా
గుట్టది నీకు దెల్పితిని కోవిదవర్య మహార్యసంస్తుతా! 145

అర్థాలు : కోవిదవర్య= పండిత శ్రేష్ఠుడా! మహార్యసంస్తుతా= సజ్జనుల చేతనుతింప బడువాడా!

భావము : "ఇదియే నా ఆలోచన. మీరు తగినట్లు చేయండి. సర్వలోకములు మేలు చేయునది నా మదిలో నున్న రహస్యము మీకు తెల్పితిని. ఇంతకంటె ఎక్కువ నా మదిలో లేదు."

ఆ॥ అనిన నాటగోలె నాత్మలో జింతింతు
అట్టి ఘనుడు దా స్వయంభు వనెడు
నేడు నిన్ను గంటి నీవే స్వయంభువై
మదిని దోచు కతన మాన్యచరిత! 146

భావము : "అట్లనగా అప్పటి నుండి అట్టివాని కొఱకై చింతించుచున్నాను. గౌరవనీయుడా! అట్టిఘనుని తానే స్వయంభువు అనెడి, నీవు అట్టి వాడవని నేను నిన్ను చూచితిని."

చ॥ ఇది పనిగాగ నిన్నిటకు నే గొనివచ్చితి నీ మహత్త్వ మీ
సుదతికి దెల్పి యిద్దరికి శోభనముం దగ జేయువాడ నా
మదినిది నిశ్చయంబని కుమారిని జేరగబోయి దాని నిం
పొదవగ దోడితెచ్చి తనయూరువునందున నుంచి యిట్లనున్ 147

భావము : "అదే పనిగా, నిన్ను ఇచ్చటకి తీసికొని వచ్చితిని. నీ గొప్పతనమును తెల్పుము. అంగీకరించినచో పెండ్లి చేయగలను. ఇది నా నిర్ణయము" అని వచించి ఆ కన్యను తొడపై కూర్చుండబెట్టుకొని ఇట్లనెను.

ఆ॥ అబల! నీ తపోమహత్త్వంబువలన నీ
ఘనుడు వీడు వలను గాననయ్యె

విను మహాత్మ నీదు వివరంబు దీనికి
తెలియబలుకు లెస్స తేటగాను 148

భావము : "ఓ అమ్మాయి! నీ తపశ్శక్తిచే ఈ గొప్పవాడు, నీకు తగినవాడుగా కన్పట్టెను. ఓ మహాత్మా! నీ విషయమంతయు ఈ కన్యకే వివరముగా తెల్పుము."

వ॥ అనిన వనజోద్భవుం డిట్లనియె 149

భావము : ఆ మాటలు విని బ్రహ్మ యిట్లనెను

ఉ॥ చల్లకు వచ్చి ముంత మరి చాటున దాచగ నేల నేన యీ
యెల్ల జగంబులీల సృజియింపుచు బెంపుచునే లయింపుదున్
వల్లభుడన్ స్వయంభువుడ వారక నాదగు మాయ లోకముల్
పెల్లుగ గమ్మియున్న యది పేర్కొన నిందొక వేల్పు గల్గనే 150

అర్థాలు : చల్లకు= మజ్జిగ కావలెనని, లీల= శ్రమలేకుండ, లయింపుదున్= నాశము చేయుదున్, వల్లభుడన్= స్వామిని, స్వయంభువుడ= నా యునికికి వేఱు కారణము లేని వాడను, వారక= ఎడతెగక, పెల్లుగ= అధికముగ, కమ్మియున్న యది= చుట్టుకొని యున్నది, పేర్కొన= చెప్పుటకు, ఇందొక వేల్పు= ఈ సృష్టి స్థితి లయముల కార్యములలో దేవతయనదగు వాడొకడు, ఉన్నాడా!

భావము : "నేనే, స్వయంభువుడను! సృష్టి స్థితి లయ కార్యములు చేయగలవాడు మఱొకడు లేడు."

క॥ నేనెట్లు నిర్ణయించిన
తానట్టుల బ్రోచు నింతె తామరసాక్షుం
డే నెట్ల నిర్ణయించిన
తానట్టు లయించు శూలి తథ్యముగాగన్ 151

అర్థాలు : ప్రోచు= కాపాడు, తామరసాక్షుండు= విష్ణువు, శూలి= రుద్రుడు

భావము : నేను చెప్పినట్లు విష్ణువు రక్షణ చేయును. రుద్రుడు లయము కావించును.

మ॥ **ధర నావ్రాతకు తప్పు లేదనెడు శాస్త్రవ్రాతముల్ గల్గ లే**
దొరు లింకెవ్వరు నన్ను గాదని జగత్తుల్ వేరే కల్పింపగా
హరిరుద్రాదులు భక్తి సన్నుతులు సేయన్ భక్తులిట్లాడ నీ
పరమంబైన యజత్వ మెవ్వరికి సంభావింప నైజంబగున్ **152**

భావము : లోకములో నా వ్రాతకు ఏ జీవి ఎప్పుడెట్లుండవలెనో నిర్ణయించి, ఆయా ప్రాణుల నుదుటిపై నేను వ్రాసిన దానికి విరుద్ధముగా, శాస్త్రముల సమూహములు లేవు. ఎవరును నన్ను కాదని జగములను సృష్టింపలేరు. హరి శివుడు మొదలైనవారు నన్ను స్తుతించుచున్నారు. నా భక్తులును ఇట్లు పల్కుచున్నారు. అన్నింటికంటె ఉన్నతమైన, అజత్వము బ్రహ్మస్థితి, ఆలోచింపగా నాలో సహజ సిద్ధముగానున్నది.

ఉ॥ **ఇందుకె కాదె వాణి యొక యించుక సంశయచిత్తయైన నా**
మందమదేభగామినికి మామకశక్తి నిజంబు సేయనే
నిందు వసించినాడ నిక నెవ్వరి శక్తిని సృష్టి సంస్థితుల్
జెందునో చూతమంచు మునిశేఖర! యింత నిజంబుగా దగున్ **153**

భావము : ఈ విషయమందు, వారికి సందేహము కలుగగా, ఆ మందయానకు నా శక్తిని నిరూపించుటకై, ఇంక ఎవ్వరి శక్తిచే, సృష్టి స్థితి లయ కలుగునో చూడదలచి ఇచ్చట నివసించుచున్నాను. ఓ మునివరా! ఇది సత్యవచనము సుమా!

చ॥ **అన విని చిన్ని నవ్వొలయ నల్లన యోగిని యిట్లనున్ మహా**
ఘనుడవు సర్వశక్తుడవు గావున నీఘనశక్తి నేర్పునన్

బెనుపున వచ్చి యుండుటను బెగ్గిలి లోకములార్తి నొందలే
వన మనుసూతి! నీమహిమవర్ణన సేయ నశక్యమెంతయున్ **154**

భావము : బ్రహ్మ మాటలను విని యోగిని, ఆతని అవివేకమునకు ఆక్షేపణగా చిన్ననవ్వును ప్రదర్శించి ఇట్లనెను. "నీవు గొప్పవాడవే. సర్వశక్తి గలవాడవే! నీ గొప్ప శక్తి యొక్క నేర్పుచే, పోషణచే ఏర్పడిన లోకములన్నియును, భయపడి ఎట్టి బాధలను పొందక పోయినవి కదా! అగుటచే ఓ బ్రహ్మదేవా! నీ గొప్పతనమును వర్ణించుటకు శక్యము కాదు కదా!"

విశేషము : ఇందు "వ్యాజస్తుతి" అనెడి అలంకారమున్నది. స్తుతితో కూడిన నింద.

క॥ **ఏమును నీ యాశ్రమమును**
నీ మహిమాసృష్టివలన నిర్మాణంబై
నామో మఱి యొక్కటనై
నామో తెలియంగ బలుకు నాళీకభవా! **155**

భావము : "ఓ దేవా! మేము ఈ ఆశ్రమమును మీ మహిమవల్ల సృష్టింపబడ్డామో లేక మఱొకరి సృష్టియా వివరింపుమా!"

క॥ **నీవలన గల్గియుండిన**
మావివరంబంత నీకు మది దెలియు గదా
దేవర నీ సృష్టికి వెలి
గావించిన సృష్టి యొండు గలదో లేదో! **156**

భావము : "నీ వలన సృష్టింపబడినట్లయితే, అది అంతయు నీకు తెలియవలెగదా, తమ సృష్టికాని మఱొకటి యున్నదా లేదా?" ఇది మఱొక సృష్టి కదా అని సూటి ప్రశ్న.

చ॥ **అన విని యేమియుం బలుక కంబుజ సంభవు డూరకున్న నా**
వనరుహనేత్ర యిట్లనియె వారిజసంభవ నీదు సృష్టిలో

ఘనుడగు కౌశికుండు మును కల్పన సేయడె వేరె సృష్టి యా
మునివరు సృష్టి మాన్ప బలముం గలదేని నిజంబు బల్కుమా 157

భావము : ఆ మాటలు విని ఏమియు పలుకక యుండెను. అప్పుడు ఆకాంత ఇట్లనెను. "ఓ దేవా! పూర్వము విశ్వామిత్రుడు నీ సృష్టిలో వేఱొక సృష్టి చేసెను కదా! వానిని మాన్పుటకు నీకు బలముండెనా నిజము తెల్పుము."

చ॥ ఇది యిటులుండ నిమ్ము విను మిమ్మహిలోపల విప్రమౌళికిన్
బదుగురుపుత్రులై గురుడు నాకమునొందిన వారలగ్రజున్
గదియుచు జీవనం బడుగగా దను వేడుచురా నజత్వమున్
తుది నడిగించి వారలును తొమ్మిదిరీతుల సృష్టిచేయరే 158

భావము : మఱొక విషయము వినుము. ఒక బ్రాహ్మణ శ్రేష్ఠునకు పదిమంది కుమారులు కలిగిరి. గురుడు (పెద్దవాడు) మరణింపగా, వారలు వెళ్ళి పెద్దవానిని రక్షణకోరగా, వారు తొమ్మిది విధములుగా సృష్టి చేసినారు". ఆ నవ బ్రహ్మల సృష్టిలో ప్రమేయము మీకు లేదే అని ఆక్షేపము.

వ॥ అన విని 159

వచనము : ఆ మాటలు విని

ఆ॥ తపముబల్మి నిట్లు ధరణి నొక్కొకచోట
స్వల్పమైన సృష్టికల్పనంబు
సేయ నదియు దొడ్డుచేసెద వోబాల
ముగ్ధ లగుట దెలిసె ముదిత లనిన 160

భావము : "ఓ బాలా! ధరణిలో తపోబలముచే అట్టి సృష్టి జరుగును. దానిని గొప్పగా చెప్పుచున్నావు. వనితలు ఏమి తెలియని వారనుట నీ మాటల వలన తెలిసినది."

ఆ॥ అది తపోమహత్త్వమంటిరి గానిమ్ము
తపము కెవ్వరచట దక్షులైరి

యట్టు దైవమొక్క డవ్వల నుండగా
నీ మహామహత్త్వ మేమియనిన 161

భావము : అట్లనగా, ఆమె, "తపస్సు యొక్క మహత్వమన్నారు. సరే! తపస్సన్నారుగా, దానికి ఫలముల నిచ్చు దాత ఎవ్వరు! వారిని కరుణించు దైవమే వేఱుగా నుండగా నీది గొప్ప మహిమ ఎట్లగును?"

క॥ సకలము నేను సృజింపగ
సకలములో వారె కారె సరిదైవంబుల్
సకలోర్వీపతియాజ్ఞను
ప్రకటితముగ మంత్రులెల్ల ప్రాజ్ఞులు గారే 162

భావము : "సర్వమును నేనే సృజింతిని. ఆ దేవతలందఱును, నా లోకములోని వారే. సకలమునకు స్వామియైన నా ఆజ్ఞను కన్పట్టునట్లు మంత్రులు జ్ఞానులుగా వర్తింతురు". బ్రహ్మ ఆ చర్యలన్నిటికి తన కార్యకర్తలే కారణమని వివరించినాడు.

ఉ॥ కావున నంతకన్న నధికారి జగత్సృజనాధురీణునిన్
దేవుని సర్వలోక భువి దివ్యలలాము స్వయంభువుం జగ
జ్జీవను జూపలేవు నను జేకొని సర్వజగత్ప్రభుత్వమున్
నీవు వహించు సంతతము నీకనుసన్నల నే మెలంగెదన్ 163

భావము : "నాకంటె మించిన సృష్టికర్తను, సర్వలోక దేవతా విభుని, శ్రేష్ఠుని చూపలేవు. కావున నన్ను భర్తగా సర్వలోకాధిపత్యమును వహించుము. నీవు చెప్పినట్లు నడుచుకొందును"

ఆ॥ వాణి నీయనుజ్ఞవర్తింప చేసెద
సకల దివ్యమౌని సంచయంబు
నిన్ను గొల్వ వేల్పునెలతలు సేవికా
జనముగాగ మహిమ దనరు యెలమి 164

భావము : "వాణి ముని సముహంబులు దేవతా స్త్రీలు, ప్రీతితో నీకు సేవకులై యుందురు".

ఉ॥ నీ మదినెట్లు గోరితివి నిక్కము నట్టుల గైవశంబుగా
భామిని నీ తపోమహిమ బ్రస్తుతిసేయగ శక్యమే కటా
నా మది వాంఛ వాణివిడనాడి భవత్పద పద్మసేవనా
శ్రీమహనీయసౌఖ్య మది జెందుదు నిందె వసింతు నంతకున్ 165

భావము : "నీవు కోరినట్లు పూర్తిగా నీ వశమయ్యెదను. అక్కటా! నీ తపోమహిమను వర్ణింపను సాధ్యముకాదే! నా మదిలోని కోరిక యిది. వారిని విడిచిపెట్టి, నీ యొక్క పాదపద్మముల సేవించు భాగ్యమును పొంది ఇచ్చటనే నివసించెదను. "

చ॥ అన విని యోగినీ యువతి యబ్జ భవుండిక చిక్కె చిక్కెబో
కనుకని వీని పెక్కుగతి గాఱియబెట్టి మదంబణంచి నా
వెనక జరింపజేసి జని విశ్వములన్ విధిరుద్ర విష్ణులన్
గనుగొన జేసి యవ్వలను గర్వమణంతు నటంచు నిట్లనెన్ 166

భావము : ఆ యోగిని బ్రహ్మ తన వలలో చిక్కెనని, పట్టుదలతో కష్టములను కలిగించి మదమును అణచి తన వెనుక తిరుగునట్లు ఆ విశ్వములందు గల బ్రహ్మ రుద్ర విష్ణువులను చూచునట్లు చేసి, గర్వమును పూర్తిగా తొలగించెదను అని తలచి యిట్లు బ్రహ్మతో వచించెను.

మ॥ ఒకనాడేను సమాధి నిశ్చలత నిందుండంగ నా మానసం
బకలంక స్థితి నీ ప్రపంచ మిదె యంతంచున్ మదిందోచి యూ
రక విక్షేపమునొందె నొంది మరి యీ బ్రహ్మాండ మిట్లుండగా
ప్రకటంబై మరి యొక్క యండము దగన్ భావంబునం దోచినన్ 167

అర్థాలు : అకంలంక స్థితి= మార్పులేని ఉనికిలో, విక్షేపంబు= వ్యాప్తి, ప్రకటంబై= రూపనామగుణములతో స్పష్టమై

భావము : "ఒకనాడు నేను నిశ్చలమైన సమాధిలో నుండగా ఆ నిర్వికారమగు స్థితిలో, ఈ ప్రపంచమంత యిదేనా అని తోచినది. తర్వాత అది వ్యాప్తిని పొందినది. ఈ విశ్వమిట్లుండగా, మఱొకటి నా మనస్సులో కనబడినది."

ఉ॥ అందుల బ్రహ్మవిష్ణు శివు డాదిగ దివ్యులు ముజ్జగంబుల
య్యిందు దినేంద్రభానులు దిగీశులునుం బదునాల్గులోకముల్
మందర మేరు ముఖ్యనగమండలవార్ధులు సర్వజీవులున్
పొంది చరాచర ప్రకట భూతచయస్థితి నివ్విధంబులున్ 168

అర్థాలు : దివ్యులు= దేవతలు, ఇందు దినేంద్రభానులు= చంద్రుడు, పగటికి రాజైన సూర్యుడు, దిగీశులు= ఎన్మిది దిక్కులకు అధికారులైన దిక్పాలురు, మందరమేరుముఖ్య నగ మండల= మందర పర్వతము, మేరు పర్వతము మొదలైన పర్వత పంక్తులు, వార్ధులు= సముద్రములు, చరాచర ప్రకట భూతచయ స్థితి= చలనము కలవి, లేనివి, కన్పట్టు జీవుల యొక్క ఉనికి

భావము : ఆ విశ్వమందు బ్రహ్మ, విష్ణు, రుద్రులు దేవతలు, మూడు లోకాలు చంద్ర సూర్యులు, దిక్పాలురు, పదనాల్గు లోకములు, పర్వతములు, సముద్రములు సర్వజీవులు వాని వివిధములైన స్థితిలో

ఉ॥ సర్వముగాననై యవల జక్కగ జూచిన యిట్టియండముల్
దుర్వహలీల మిక్కిలిని దోచుచునుండిన నందు నిందు నీ
సర్వజగత్ప్రపంచము బ్రసన్నత దోచుచు దాని దానికిన్
బర్వె దశోత్తరోచ్చయత పద్మభవాండమునుం బ్రపంచమున్ 169

భావము : "ఇట్లు సర్వము కన్పట్టగా, ఆవల చక్కగా మరల చూడగా అట్టివే విశ్వములు అద్భుతములు ఎక్కువగా గోచరించినవి. ఆ ప్రపంచమంతయు యొక్కొక దానికంటె మఱొకటి పదిరెట్లు మించియుండెను."

ఆ॥ చూచి చూచి మనసు చోద్యంబు నొందుచు
తానె తిరిగి వచ్చితావు చేరె

నంత నే సమాధినెంతయు చాలించి
చూడ నెప్పు డున్న చోటు నున్న 170

భావము : "వానిని చూచి, ఆ నిర్మాణమునకు ఆశ్చర్యము చెందగా ఇంతలో నా మనసు నేనుండు తావునకు మరలి వచ్చినది. అంతటితో నా సమాధి స్థితిని సమాప్తి కావించుకొని, కన్నులు తెఱచి చూడగా అప్పుడు ఉన్న చోటుననే ఉన్నాను."

మ॥ ఇది యేమద్భుతమంచు గొంత వడి నేనిచ్చన్ విచారించి యీ
విదితంబైన మహాండజాలమును నే వీక్షించు నట్టప్పుడున్
మదిలో దోచుచునున్న దీ మహిమసామాన్యంబు గాదంచు నా
పదవిం జూడగ నాత్మయోగ మహిమాప్రావీణ్య మేపారగన్ 171

భావము : "మహాద్భుతమది అని ఆలోచించి వేగముగా విచారణ చేయగా, ఆ బ్రహ్మాండ సమూహము యొక్క ఆయా స్థానముల మహిమను నా యోగ శక్తి నైపుణ్యముతో చూచుటకు అది సామాన్యము కాదని తోచినది."

క॥ జని యాయా బ్రహ్మాండము
లను దత్తద్గర్భనిలయులను దన్మహిమల్
మనమున దోచిన రీతిని
కనుగొంటి యథార్థముగను కంజాతభవా! 172

భావము : "ఓ బ్రహ్మదేవా తెలిసికొంటిని! ఆయా బ్రహ్మాండములను, ఆయా విశ్వములలోనున్న నివాసులను వారి మహిమలను తృప్తిగా చూచి సత్యమని తెలిసికొంటిని."

ఉ॥ అంత ప్రవర్ధమానముగ నంతకు నంతకు మించుచుండ నే
నంతయెరుంగ గాదనుచు నప్పుడె వచ్చితి దీనికాఢ్యులన్
స్వాంతమునందు నారయుదు సత్యము దీనికి నేమి బుద్ధి మా
పంతముచెల్ల నీదయిన భావము రంజిల నానతీయవే 173

అర్థాలు : ప్రవర్ధమానముగ= వృద్ధియగుచు, మించుచుండ= అతిశయించు చుండగా, కాదనుచు= సాధ్యముగాదనుచు, ఆఢ్యులన్= అధికారులను, స్వాంతము నందు= మనసులో, అరయుదు= తెలిసికొన వలెను, బుద్ధి= మీ వాఖ్యానము, వివరణ, పంతముబెల్ల= ప్రతిజ్ఞకు తగినట్లు, భావము రంజిల= మనస్సు ఆనందించునట్లు, ఆనతీయవే= చెప్పుము

భావము : "ఆ బ్రహ్మాండము ఇంకను వృద్ధియగుచు అతిశయించుచుండగా చూచుటకు సాధ్యము కాదని విరమించుకొంటిని. ఈ బ్రహ్మత్వమునకు అధికారులెవరను సత్యమును తెలిసికొనవలెను. ఈ విషయములో మీ అభిప్రాయమేమి? మా ప్రతిజ్ఞకు తగిన విధముగా నీవే సర్వ సర్వసమర్థుడవని మా మనస్సులు సంతృప్తి చెందునట్లు వివరణ దయసేయవే.'

క॥ నీకన్న పెద్దలెవ్వరు
ఈ కరణిం దెలియు వారలిక సత్యముగా
లోకేశ్వర! యీ వివరము
నాకుం దెలియంగ జెప్పి నను గైకొనుమా! 174

భావము : "నీ కంటె పెద్దలు ఎవరైనా ఉన్నారా? ఆవిషయవములను తెలిసినవారు సత్యమైనవారుకదా! (శౌర్యవంతులని భావము) ఈ విషయములను తెల్పి నన్ను స్వీకరించుమా!" అనుచు

చ॥ అన వినయానురాగ మహిమాతిశయంబులు దోచ బల్కినన్
మనమున నద్భుతంబొదువ మ్రాన్పడి యించుక యూరకుండి తా
ననియె మనోహరాంగి! ముద మందితె నీ ఘన విద్య నీవు నే
మునివర శిక్ష నేర్చితివి మోహనజాలమహత్త్వ మింతయున్ 175

భావము : "అతిశయించిన వినయము, ప్రేమ గొప్పతనముతో పల్కగా, ఆశ్చర్యపడి, నిశ్చలుడై, కొంతసేపు ఊరకుండి "ఓ సుందరీ ఈ మోహన కపట విద్యా మహత్వమును అంతకుముందు ఏ మునివరుని శిక్షణతో నేర్చితివో!"

తే॥ నన్ను భ్రమయింప జూచితె నాతి నీవు
తనమనోరాజ్య మెవ్వండు తథ్యముగను
జూచు కలలోని సంపదమెక్కినట్లు
గాదె నీ పల్కు లిప్పుడు కమలనయన! 176

భావము : "ఓ పద్మముల వంటి కన్నులు గలదానా! నాకు భ్రమను కల్గించుచున్నావు. ఎవరు తన మనస్సులో చూచిన రాజ్యమును నిజమైనదిగా చూడగలరు? నీ పల్కులు కలలోని సంపదలను అనుభవించినట్లున్నది." (అది వాస్తవముకాదు)

క॥ మునిరాజ కన్యవనుచును
యనుపమతర సద్వివేకి వననృత వనుచున్
ఘనతరవిద్యానైపుణి
వని వింటిని యిందువలన నంతయు దెలిసెన్ 177

భావము : "మునివరుని కన్యవని, సాటిలేని వివేకముగలదానవని, అసత్యము నెఱుగని దానవని, గొప్పవిద్యావంతురాలవని విన్నాను. నీ మాటలవలన నీవు ఎట్టిదానివో అంతయు తెలిసినది."

క॥ కొండంత బొంకు బొంకితి
వండజనిభయాన యెవ్వరైనను వింటే
పాండిత్యమనరు కొఱగా
కుండా నాడుదురు కసవుకొక్కింతైనన్ 178

అర్థాలు : బొంకు= అబద్ధము, అండజనిభయాన= హంసవలె నడచుదానా, కొఱగాకుండా= అసందర్భప్రలాపివని అర్థములేకుండా పిచ్చి ఊహలతో మాట్లాడుదువని, ఆడుదురు= నిందలు వేయుదురు, కసవుకు= చెత్తకు, ఒక్కింతైనన్= కొంచెమైనను.

భావము : "చాలా పెద్ద అబద్ధమాడితివి. ఎవరైనా నీ మాటలు విన్నచో, దీనిని నీ పాండిత్యమని మెచ్చరు. ఉత్తచెత్త మాటలని నీవు చెప్పిన దానిని కొట్టిపారవేసి, నిన్ను నిందితురు."

విశేషము : యోగిని మాటలకు తానాపాదించిన దంతయు తన మాటలకు వర్తించునని బ్రహ్మకు తోచలేదు. ఆమె యోగసాధనలో అణిమాది అష్ట సిద్ధులను సాధించిన మహితమూర్తియని ఆ మాయాయోగి చెప్పినదంతయు మఱచినాడు. ఆమె అసత్యవాదియను నిందను తానే అంటగట్టినాడు. తన పురుషాహంకా రమునకు ఆమె సాధారణ స్త్రీవలె తోచినది.

శా॥ నీవు న్నిప్పుడు నీ గురుండు కనగన్ నీవెట్లుగా బల్కినన్
లావణ్యాననమందు చోద్యముల లీలం దోచు నింతే బుధుల్
భావజ్ఞుల్ ఘనయోగసిద్ధిరతులౌ బ్రహ్మర్షివర్యుల్ కటా
నీవాక్యంబులు విన్న నేమగును యానిందోక్తు లిట్లేటికిన్ 179

అర్థాలు : లావణ్య+ఆననమందు= అందమైన ముఖములో, బుధుల్= పండితులు, భావజ్ఞులు= మాటలకు బాహ్యార్థమునే గాక అంతరార్థములను గూడా తెలిసినవారు, ఘనయోగసిద్ధిరతులౌ= గొప్ప యోగసిద్ధితో ఆనందించు వారు.

భావము : "ఇప్పుడు నీ తండ్రి ఎదుట ఎట్లు పల్కినను, అవి అందమైన నీ ముఖమునుండి వెల్వడినవి. కాని దానికి వ్యతిరేకమై చిత్రములుగా నున్నవి. అంతమాత్రమే! అకటా, పండితులు నీ భావములను ఎఱిగినవారు యోగసాధనలో ఆసక్తులు బ్రహ్మర్షులు నీ వాక్యములను విన్నంత ఏమని తలచెదరో! (నిందింతురు) ఏల నన్ను నిందించెదవు. ఇంకనైనను మానుమా."

ఆ॥ కల్లలాడి నన్ను గాదనిపించగా
దలచినావు మదిని తలిరుబోడి!
కల్ల లెందునైన గణనకు నెక్కునా
వట్టిపూన్కి మేలు వచ్చునెట్లు? 180

అర్థాలు : తలిరుబోడి= చివురుటాకు వంటి అందము గలదానా!

భావము : "నన్ను వలదని తలంచుచున్నావు కదా! అసత్యములను ఎవరైనను లెక్కజేయుదురా! ఉపయోగము లేని ప్రయత్నము వలన మేలుకలుగునా?

క॥ నెరవాది వౌదు వెంతయు
సరసిజనిభపాణి చాలు చాలును తెలిసెన్
కరుణించి యింకనైనను
గురుననుమతి నను వరించు కూరిమితోడన్ 181

భావము : "పద్మముల వంటి చేతులు కలదానా! నీవు చాలా నేర్పరివని తెలిసినది. అట్టి మాటలను (నిందలను) మానుము. నీ తండ్రియనుమతితో దయ యుంచి ప్రేమతో నన్ను వరింపుము."

మ॥ అన నయ్యోగిని స్త్రీలు ముగ్ధలు గదా యవ్యక్తముల్ బల్కుటల్
అనుమానంబె మహత్ప్రభుత్వమును సర్వాఢ్యత్వ సర్వజ్ఞతల్
ఘనతల్ గాంచిన మీరుగాగ తెలియంగా నోపి నారింతయున్
గనుకే మీ నిజశక్తిలోకములలో కన్నీక యిట్లుండుటల్ 182

అర్థాలు : ముగ్ధలు= అనుభవములేనివారు, అవ్యక్తముల్= అమాయికపు మాటలు, ఉన్నది లేనిది తెలియనివిషయములను గూర్చి, మహత్ప్రభుత్వమును= గొప్ప అధికారమును, సర్వాఢ్యత్వ=అన్నిట కౌశలమును, సర్వజ్ఞతల్=అన్నిటి గూర్చిన జ్ఞానము, ఓపినారు= శక్తి గలిగియున్నారు, కన్నీక= లోటురానీయక.

భావము : యోగిని ఇట్లనెను. "స్త్రీలు అమాయికులు కదా! తగని మాటలను పల్కుటలో సందేహమా! కాని మీరు గొప్ప పరిపాలన చేసినవారు. సర్వశక్తి మంతులు. సర్వమును ఎఱిగినవారు. గొప్ప మహిమ కలవారు. మీరు నా మాటలను సహించినారు. అయితే ఇంతకును, ఈ లోకాలలో మీ శక్తి ఏమాత్రము కన్పట్టక యున్నదే!"అలంకారము స్తుతి నింద: స్తుతిరూపమున నింద.

క॥ మీ వంటి వారిముందర
భావింపగ లోక సాక్షి పలుకగ నగునా
నా వంటిది గురు సన్నిధి
గావున బలికితిని నిజముగా వాగీశా! 183

భావము : "ఓ బ్రహ్మదేవా! నీవంటి వారి యెదుట నిల్చి సూర్యదేవుడును మాట్లాడగలడా? నేను తండ్రి వశమై యున్నదానను. కనుక సంకోచించక నా మదిలోని మాటలను నిజమని తలంచి పల్కితిని."

క॥ నే నాడుదాన నైతిం
గానీ మజ్జనకునైన గనుగొన్నావా
నానాపోకిళ్లిక్కడ
పూనుక పచరింప సాగబోవునె యెందున్ 184

అర్థాలు : మజ్జనకు= నా తండ్రిని, నానాపోకిళ్లు= రకరకాల పోకడలు, (పిచ్చి పిచ్చి వేషాలు, నోటికి వచ్చిన కూతలు), పూనుక పచరింప= పట్టుబట్టి ప్రవర్తించినచో.

భావము : "నేను ఆడుదానను అన్నది నిజమే గాని ఇక్కడ నాతండ్రి యున్నాడని మర్చిపోయావా? పిచ్చి పిచ్చి మాటలు ఇక్కడ సరిపోవునా? పూనికతో ఇట్లు పనికిమాలిన మాటలు వల్లించుట ఎంతమాత్రము ఫలవంతమగునా?"

విశేషము : బ్రహ్మను మందలించుచున్నది. తనకు భయములేదని చెప్పుటకై స్పష్టముగా పిచ్చిమాటలు వద్దని హెచ్చరించినది.

ఆ॥ కల్లలౌట లెస్స కడముట్ట దెలియక
వేగిరింపరాదు విబుధజనులు
భారతీశ! యిది మరో రాజ్యమగునైన
తెలియజూడు నీకు తేటపరతు 185

భావము : "ఓ బ్రహ్మ! నా మాటలు కల్లలన్నారు. మంచిదే! విద్వాంసులు అంతటిని విచారించవలెను. తొందరపడరాదు. ఇప్పుడు, ఇది మఱొక రాజ్యమగు నని నేను నీకు నిరూపించెదను."

క॥ ఈ రీతి యోగినీ సతి
వారిజసంభవుడు మిగుల వాదింపంగా
వారించి మాయికుండనె
నేరుపరుల్ వాదు మీకు నీతియె చెపుడా! 186

భావము : ఇట్లు యోగిని బ్రహ్మ, వాదములు చేయగా ఆమాయాముని వారి మాటలను ఆపించి ఇట్లని ప్రశ్నించెను "నేర్పరులు మీరు, ఇట్లు వాదించుకొనుట సరియైన పనియా?"

ఉ॥ యోగినివంచు బెక్కుగతి నూరకె మామెడ కంచు గంటవై
వాగుదు నేడుగా నిను నవశ్యముగాను పరీక్షకై మహా
భాగుడు వచ్చి నాడిచట భ్రామిక చేష్టలు చెల్లబోవునీ
యోగవిశేషమార్గములనొందిన లోకములన్ని జూపుమా! 187

అర్థాలు : మహాభాగుడు= గొప్పవాడు, భ్రామికచేష్టలు= పిచ్చిపనులు, యోగవిశేష మార్గముల నొందిన= యోగశక్తి విశేషముగ ఉపయోగించి దర్శించిన.

భావము : "యోగినివై ఎక్కువగా, అవసరములేకపోయినను మెడలోని కంచుగంట మోగినట్లు ప్రేలుచున్నావు. నేడే నిన్ను పరీక్షించుటకై గొప్పవాడు వచ్చినాడు. పిచ్చిచేష్టలు తగవు. నీ యోగసిద్ధిచే కనుగొన్న లోకములన్నింటిని అతనికి చూపుము."

క॥ కాదేని చేతగాదని
వాదము లిక మాని నేను బంచిన రీతిన్
బోదగు విను మీ జగదు
త్పాదిని వరియించి కాంచు పలుసౌఖ్యములన్ 188

అర్థాలు : పంచిన రీతిన్= నిర్ణయించిన విధముగా, జగదుత్పాదిని= జగత్తును సృష్టించినవానిని, కాంచు= పొందుము,

భావము : "అట్లు చేతకాని యెడల వాదింపక నేను చెప్పినట్లు వినుము. ఈ సృష్టికర్తను పెళ్లాడి పెక్కు సుఖములు అనుభవింపుము."

చ॥ అన పరమేష్ఠి జూచి మహిమాన్వితమూర్తివి సర్వ శక్తివిన్
ఘనుడ వజాండ వీ తరుణి గల్లలు పల్కినదంచు మాటకె
ట్లనదగు నయ్య నేరుపు నీనంగనపల్కు నజాండ సంఘముల్
గనుగొన మెప్పుగాని యొడగాదనరాదె తదుత్తరంబులన్ 189

అర్థాలు : పరమేష్ఠి= బ్రహ్మ, కల్లలు= అబద్ధములు, మాటకు= మాటవరుసకైనను, అజాండసంఘముల్= బ్రహ్మాండములు, విశ్వములు, ఒడగాదు= సరికాదు

భావము : ఆ మాయాముని వచించి, బ్రహ్మను చూచి "గొప్పమహిమలు కల రూపము కలవాడవు. సర్వశక్తులు కలవాడవు. చాలా శ్రేష్ఠుడవు. పుట్టుకలేనివాడవు. ఈయువతి అసత్యములాడెనని మాటలసందర్భమున ఎట్లన వచ్చును? అయ్యా! ఆ యోగిని తెలివిని, ఆమె తెల్పు బ్రహ్మాండములను చూచుటకు యత్నించుట, మెచ్చుకోదగినచర్య. ఆమె సమాధానాలను. సరికాదని మాటలతో కొట్టివేయుట సరియైన పద్ధతికాదు."

ఉ॥ మాటల ప్రొద్దుబుచ్చుచును మాటకి మాటకి కాదు కాదనా
నేటికి సాక్షినేనె వినుడిద్దరికిం బరిపూర్ణతా మహా
త్పాటవ మీవుదెల్పు ప్రతిపద్మభవాండము లుండునట్లుగా
బోటిరో! నీవు చూపుమిక బోలదు మీకును వట్టి వాదముల్ 190

అర్థాలు : పరిపూర్ణతామహా+ఉత్పాటవము= పరిపూర్ణత్వమునకు చెందిన గొప్పసామర్థ్యమును, ఈ= నీవు, ప్రతిపద్మభవాండములు= బ్రహ్మసృష్టియైన

విశ్వము కాక ఇతరములను బ్రహ్మసృష్టియైన విశ్వములు, బోటిరో= అమ్మాయీ!, పోలదు= తగదు.

భావము : మాటలతో "కాదు కాదు" అని ప్రొద్దును పోగొట్టుచున్నారు. నేటికి మీయిద్దఱికి మధ్యవర్తిని. ఓబాల! ఇతరములైన బ్రహ్మాండములు ఉన్నవని అవి సంపూర్ణమైన మహనీయములైన నైపుణ్యము కలవని చూపుము. ఇంక ఏమాత్రము ఉపయోగపడని వాదనలు తగవు."

సీ॥ అనిన నయ్యోగినీవనిత దిగ్గన లేచి
యంతి పురంబున కరిగి తిరిగి
స్నాతయు గడుశుచిర్భూతయు కమనీయ
ధౌత పీతాంబరోపేత పరిమి
తాభరణాలంకృతాంగి భస్మోద్ధూ
ళినభిరామయు త్రిపుండ్రాలయయును
వేణికాబద్ధయు విపుల స్వరూపియు
పరమోత్సుకానంద భరిత మతియు

తే॥ నగుచు నొయ్యన వచ్చిదర్భాసనమున
మౌననియతి పద్మాసనాసీనయగుచు
పరమయోగానుసంధానభరితమతిని
నొక ముహూర్తము మాత్ర నట్లుండు నంత 191

అర్థాలు : దిగ్గన= తటాలున, స్నాతయు= స్నానముచేసినదియు, శుచిర్భూతయు= శుచియైనదియు, కమనీయ= అందమైన, ధౌతపీతాంబర+ ఉపేత= ఉతికిన పట్టువస్త్రముకట్టినదియును, పరిమిత ఆభరణ అలంకృతఅంగి= తక్కువ సొమ్ములు అలంకరించుకొన్న శరీరము కలదియు, భస్మోద్ధూళిన్= భస్మముతో, అభిరామయు= అందముగనున్నదై, త్రిపుండ్రాలయయును= వట్టెనామములు పెట్టుకొన్నదియునై,

వేణికాబద్ధయు= సిగముడివేసినదై, పరమోత్సుకానందభరిత= చాలా ఉత్సాహానందములు కలదియు, మౌననియతి= మాటలాడక, పరమయోగానుసంధానభరితమతిని= స్థిరమైన యోగమున ఆత్మను అనుసంధానము చేసిన మనస్సుతో, ముహూర్తము= క్షణము.

భావము : ఆ యోగిని వెంటనే లేచి, స్నానముచేసి, ఉతికిన బట్టలు ధరించి, ఆభరణములతో విభూతితోను, పంగనామాలతోను ముడివేసుకొన్న జడతోను, విశదమైన రూపముతో ఉత్సాహానందముతో దర్భలపై కూర్చుండి మౌనముగా ముహూర్త కాలము సమాధి స్థితిలో నుండగా

మ॥ తరుణార్కద్యుతి దీప్తమై కనకరత్నవ్రాత నిర్మాణమై
సురపుష్ప వ్రజ శోభితోజ్జ్వలితమై శుంభద్వయోదేవతా
తరుణీసంవృతమై ఘణంఘణరవోద్యద్ఘంటికాబద్ధమై
కర మొప్పారెడు దివ్యపుష్పకము జక్కన్మోల గన్పట్టగన్ 192

అర్థాలు : తరుణారుణద్యుతి= ప్రొద్దెక్కినప్పుడు వెలుగులువిరజిమ్ము సూర్యునికాంతితో, దీప్తమై= వెలుగుచు, కనకరత్నవ్రాత నిర్మాణమై= బంగారము, రత్నముల సమూహముచే చేయబడిన కట్టడమై, సురపుష్పవ్రజశోభితోజ్జ్వలితమై= దివ్య పుష్పముల శోభ అతిశయించినదై; శుంభద్వయోదేవతా తరుణీ సంవృతమై=వెలుగొందుచున్న యౌవనవతులైన దేవతాస్త్రీలచేచుట్టుకొనబడినదై, ఘణంఘణరవోద్యద్ఘంటికాబద్ధమై= కట్టబడిన గంటలు చెలగి ఘణఘణ మ్రోగుచున్నదై, కరమొప్పారెడు= చాలా శోభించుచున్న, దివ్యపుష్పకము= దివ్యమైన పుష్పకమను విమానము.

భావము : లేత సూర్యుని వెలుగుతో బంగారు రత్నములతో చేయబడినదై దివ్యమైన పూల సొగసుతో ప్రకాశించు యువతులైన దేవతాస్త్రీలు కలదై ఘణంఘణ ధ్వనులతో మ్రోగుచున్న అతిశ్రేష్ఠమైన పుష్పకవిమానము ఎదుట నిలిచెను.

ఆ॥ మౌనిపుత్త్రి లేచి యానంబు వలగొని
వందనంబు చేసి డెంద మలరి
పద్మభవుని వదన పద్మంబు గనుగొని
యిట్టులనియె ముదము నెట్టుకొనగ 193

అర్థాలు : యానంబు= ప్రయాణ సాధనమును, వలగొని= చుట్టుప్రదక్షణము చేసి, నెట్టుకొనగా= హెచ్చుగా, పొంగగా.

భావము : ఆ మౌని కుమార్తె లేచి విమానమునకు ప్రదక్షిణముచేసి వందనమర్పించి బ్రహ్మను చూచి సంతోషము ఎక్కువకాగా ఇట్లనెను.

మ॥ ఇదిగో దివ్య రథంబు చూచితివె యిందీడేరు మీ కోర్కెలిం
పొదవుం గార్యము లెల్ల జేకురును సమ్మోదంబుజెందుంగడున్
హృదయం బచ్చెరువందు నంచన భళీ యాతన్వి సామర్థ్యమి
ట్లది యేమో చని చూతమం చరద మందెక్కెం దమశ్చిత్తుడై 194

అర్థాలు : ఈడేరు= తీరును, ఇంపొదవున్= సంతోషమును కలిగించును, తన్వి= స్త్రీ, తమశ్చిత్తుడై= తమోగుణముతో నిండిన మనస్సుగలవాడై.

భావము : "ఓ దేవా! దివ్యమైన అరదమిది. చూచితిరిగదా! మీ కోర్కెలు సిద్ధింపగలవు. ఇష్టములైన పనులన్నియు ఫలించును. మీ హృదయమునకు సంతోషము, ఆశ్చర్యము కలుగును" అని చెలువ చెప్పగా బ్రహ్మ "భళా! ఆ తన్వి సామర్థ్యము! ఆమె ఏమి చూపునో చూచెదను" అని తమోగుణముచే నిండిన చిత్తముతో

ఉ॥ ఎక్కిన చిన్నినవ్వొలయ నిందునిభానన ధాత జూచుచో
జక్కగ మాయికుం గదిసి జాగి నమస్కృతి జేసి దీవెనల్
మక్కువ గాంచి తన్నియమమార్గమెరింగి యనుజ్ఞనొంది యం
దొక్కెడ నొక్క రత్నరుచిరోజ్జ్వలపీఠమున న్వసించినన్ 195

అర్థాలు : ఇందునిభానన= చంద్రముఖి, ధాత= బ్రహ్మ, కదిసి= చేరబోయి, జాగి= సాగిలబడి, ఒక్కెడ= ఒకచోట, రత్నరుచిరోజ్జ్వలపీఠమున= రత్నకాంతులతో వెలుగుచున్న పీఠముపైన, వసించినన్= కూర్చుండగా.

భావము : బ్రహ్మ విమానమెక్కగా, చిఱునవ్వుతో ఆ యోగిని బ్రహ్మను చూచుచుండగా మాయామునిని సమీపించి నమస్కరించి, ఆశీస్సులు పొంది ప్రేమతో తండ్రి సూచనలను ఎఱింగినదగుట అనుమతి పొంది అరదములో, రత్నకాంతులతో గల పీఠముపై కూర్చుండెను.

ఉ॥ అందున నున్న వేల్పు జవరాండ్రు భయాన్విత భక్తి మీరగా
సందడి మాని నల్ దిశల జక్కగ గమ్మి వసింప నందులో
గొందరు చామరంబు లిడ గొందరు తిన్నగ నాడి పాడగా
గొందరు లోక వార్తలను గూరిమి దెల్పగ తీవి నొప్పగన్ 196

అర్థాలు : వేల్పుజవరాండ్రు= దేవతాయువతులు, భయాన్వితభక్తి= భయముతో కూడినభక్తి, సందడిమాని= చప్పుడు చేయక, నల్ దిశల= నాలుగు దిక్కుల, చామరంబులిడ= వీవెనలు వేయగా.

భావము : విమానమందున్న యువతులు భయభక్తులతో సందడి చేయక చుట్టునుచేరి కూర్చుండగా, కొందరు వీవెనలు విసిరిరి. కొందరు ఆడుచూ పాడిరి. కొందరు లోకవార్తలను ఆమె గౌరవమునకు తగినట్లు ప్రీతితో తెల్పగా,

మ॥ కమనీయాకృతి నెన్నగా నడచె సద్ఘంటానినాదంబులున్
ప్రమదాగానమృదంగతాళనటనారమ్యప్రణాదంబులున్
చమరీవాలకరాంగనావలయచంచచ్చారునాదంబులున్
సమతన్ మ్రోయగ పల్కు కల్కి మనుపున్ సంతోషముం గూర్పగన్ 197

అర్థాలు : ప్రమదాగానమృదంగతాళనటనారమ్యప్రణాదంబులున్= స్త్రీల గానము, దానికి సహకారముగ మృదంగవాద్యము, వీనికి సరిగా నాట్యము, ధ్వనులు, చమరీవాలకరాంగనావలయచంచచ్చారు నాదంబులున్=

చమరీమృగముల తోకలలో గల వెంట్రుకలతో చేయబడిన వింజామరలను చేతిలో పట్టుకొని యున్న స్త్రీల కదలికల అందమైన ధ్వనులు, సమతన్= సమానముగ, మ్రోయగ= మ్రోగునట్లు, మనుపున్= తృప్తిని.

భావము : అందముగా మాటల సవ్వడితో యువతుల పాటల, ఆటల ధ్వనులు, చామరముల నాదములు సమానముగా మ్రోగగా కాంత పలుకు సంతోషమును తృప్తిని ఇయ్యగా బ్రహ్మ పయనించెను.

వ॥ ఇట్లు త్రిభువన సామ్రాజ్యలక్ష్మియుం బోలె నత్యంతరాజసంబును నతులితవిలాసంబును ననుపమ వైభవంబును నతి సౌందర్య విభ్రమ విరాజితంబును శోభిల్ల నచ్చపు పచ్చి తేనియల విడెం బిచ్చి మెల్ల నెచ్చెలులతో నిచ్చలంబులు దోప ముచ్చటలాడుచు ప్రకటిత విద్యా చమత్కృతులకు నొక్కక్క వేళన కెలకుల పంకజాస్యల పొంకంబులు గనుంగొను కడకంటి చూపుల సాంద్రతరేంద్ర నీలమణిమేచకచకచ్చ కితరుచినిచయంబు గ్రుమ్మరింపుచు సమయోచితహసనాస్పద రచనా ప్రచురతర వచన నిచయంబులకు నపరంజి నిక్కుల నుక్కణంచు చక్కని చెక్కుటద్దంబుల నెక్కి చిందులు ద్రొక్కు మందహాస చంద్రికా సమ్మోహంబులం బందిరు లిడుచు నవయౌవన విజృంభిత మదన మదద్విరదంబు చందంబున డంబు మించి మించిన హొంబట్టు లొడలిపై దిరుగుచు పసమించు కాంచనతను సంజనిత చంచలలతికల దిశలం బచరింపుచు నిగ నిగని తగటుపసిండి నిగ్గుగల గుబ్బి గుబ్బలఁపయ్యెద నొయ్యనొయ్యననొయ్యారంబుననరుణ కిరణ స్ఫురణ మెరయు కరాంగుష్ఠ మధ్యమంబుల నొరపు మెరయ సవరింపుచు లీలా విలాసంబున భాసిల్లు నమ్మత్త కాశిని గనుంగొనుచున్న సమయంబున 198

అర్థాలు : అతులితవిలాసంబును= సరిరాని ఒయ్యారమును, విడెంబు= తాంబూలము, నిచ్చలంబులు= ఇష్టాగోష్ఠి, కెలకుల= దగ్గఱనున్న, పంకజాస్యల= పద్మముఖుల, పొంకంబులు= అందములు,

సాంద్రతరేంద్రనీలమణిమే చకచకచ్చకితరుచినిచయంబు= దట్టమైన ఇంద్రనీలమణుల నల్లని ప్రకాశము, సమయోచితహసనాస్పదరచనాప్రచురతరవచన నిచయంబులకు= సందర్భమునకు తగినట్లు నవ్వుకొను గర్వముయొక్క, ఉక్కు అణంచు= తీవ్రత నడగించు, చెక్కుటద్దంబుల నెక్కి= చెక్కిళ్ల, బుగ్గలపై; మందహాసచంద్రికా సమ్మోహనంబులన్ పందిరులు ఇడుచు= చిఱునవ్వు వెన్నెలల ఆకర్షణలతో పందిళ్లు పఱచుచు, నవయౌవనవిజృంభితమ దనమదద్విరదంబుచందంబున= క్రొత్తగా ఉబికిన యౌవనముచే వృద్ధియైన మన్మథుని మదగజమువలె, డంబుమించి= సౌందర్యము అతిశయించి, హొంబట్టులు ఒడలిపై= పట్టుబట్టలు శరీరముమీద, పసమించు= వెలుగు మీరు, కాంచనతను= బంగారువంటి శరీరమునుండి కాంతితో, సంజనితచంచల లతికలన్= పుట్టిన మెఱపు తీగెలను, పచరింపుచు= వ్యాపింపచేయుచు, తగటుపసిండి నిగ్గు= పూతబంగారు వెలుగు, గుబ్బిగుబ్బల= చన్నుల, కరాంగుష్ఠ= చేతివ్రేళ్ళ, ఒరపు= రాపిడి, మత్త కాశిని= యౌవనవతిని.

భావము : మూడులోకాల సామ్రాజ్యమునకు మహారాణివలె ఠీవి, విలాసము, శోభ సౌందర్య ప్రభలు వెదజల్లుచు, తాంబూలమును ఇచ్చు చెలికత్తెలతో తృప్తిగా ముచ్చటించుచు, వారు ప్రదర్శించు విద్యలతో, చమత్కారములతో, మఱియు ఒక్కొక్క సమయమున వారి అందమును చూచెడి కడగంటి చూపులతోను, నల్లని మణులకాంతులను క్రుమ్మరించు జడల సొంపుతోను, సమయమునకు తగినట్లు నవ్వులతో వాక్కులు వెలువరించే, స్వచ్ఛమైన బంగారు యొక్క అతిశయకాంతిని అణచునట్టి సుందరములైన అద్దములవంటి చెక్కిళ్లపై (బుగ్గలపై) నటించు ఆకర్షణగల నవ్వుల పందిళ్లు ఏర్పాటుచేయుచు, వేగిరపాటుతో సంచరించు మదనుని మదగజమనగా, డంబము ఎక్కువైన మేలైన పట్టుబట్టలు రేగుచుండగా, శరీరమునుండి వెల్వడు స్వర్ణకాంతులు చలించుచున్న లేత తీగలవలె ప్రసరించుచుండగా,

నిగనిగలాడు పూతబంగారు వన్నెగల ఉబ్బియున్న చన్నులపై పైటయొక్క అందమైన కదలికలను ఎఱ్ఱని కాంతికిరణములు మెఱయగా, చేతిలో బొటనవ్రేలు నడిమి వ్రేళ్లతో వాని రాపిడిని సర్దుకొనుచు శృంగారచేష్టల, క్రీడలతో మెలగు ఆ మదవతిని బ్రహ్మ చూచుచుండగా

క॥ అగ్రజుడనకే మనసిజు
డాగ్రహమున కేతకీ కరాసి యురమ
త్యుగ్రత నేసె స్వయంభువు
జాగ్రత నెడబాసి పడియె స్యందన వేదిన్ 199

అర్థాలు : అగ్రజుడనకే= అన్నగారని ఆలోచించక, మనసిజుడు= మన్మథుడు, కేతకీ కరాసి= చేతిలోనున్న మొగలిపువ్వనెడి కత్తితో, ఉరము= హృదయము, అత్యుగ్రత= తీవ్రముగ, ఏసె= కొట్టెను, స్వయంభువు= తాను స్వయంభువునని చెప్పికొనుచున్న బ్రహ్మ, ఎడబాసి=తొలగి, స్యందనవేదిన్= తేరు తిన్నెపై, పడియెన్= పడిపోయెను.

విశేషము : మొగలు పూవు మదనుని బాణములలో ఒకటి.

భావము : మదనుడు తనకంటె పెద్దవాడైన బ్రహ్మపై మొగలిపువ్వు అనెడి ఖడ్గమును ప్రయోగించెను. జాగ్రత్త తొలగి ఏమఱుపాటుచే బ్రహ్మ తేరు తిన్నెపై చతికిలపడెను.

ఆ॥ పడి మనంబులోన బొడమిన యళుకున
దిగ్గలేచి దిశలు దేరి చూడ
యోగినీ లలామ యొయ్యన నిట్లనె
బయలు గప్పె నేమొ పవ్వళించు 200

భావము : పడుటచే పుట్టిన బెదురువలన చివాలున లేచి నలుదిక్కులను చూచెను. యోగిని ఇట్లనెను. "ఆకాశ ప్రయాణమువలన తలదిరిగె నేమో

విశ్రమించండి." బయలు గప్పుట అనగా, ఆకాశమున, సముద్రముపై ప్రయాణించు వారికి ఏర్పడు తలతిరుగుడు.

చ॥ అనుటకు చిన్నబోయి కమలాసను డందర బారజూచి యే
మనుటకు యుక్తిలేక వికచాంబుజ పత్ర విశాల నేత్రపై
మనము మరల్ప లేక కడు మార్కొని యెంచు మనోజధాటికిన్
దనుకుచు తాను బోయెడి పథంబు నెరుంగక భ్రాంతి నుండగన్ 201

భావము : అట్లనగా చింతించి, బ్రహ్మ అందఱిని చక్కగా చూచి, ఏమియు బదులు చెప్పుటకు తోచక, విశాలనేత్రయైన యోగినిపై గల మనస్సును మరల్చుకొనలేక, పీడించుచున్న హెచ్చిన మదనతాపమునకులోనై చింతచే తాను అనుసరించవలసిన త్రోవను తెలియక, చలించెను.

వ॥ యోగినీ దేవికత్యంతానురాగిణియైన యొక్క చతురిక యిట్లనియె 202

భావము : అప్పుడు చాల ప్రేమపాత్రురాలైన, ఇష్టురాలైన, చమత్కారి, సఖి యోగినితో ఇట్లనెను.

తే॥ ఎవ్వరమ్మ యీతడించుక తేజస్వి
చెలువుగల్గి మోము చిన్నబోయి
కడు వికార చేష్ట గనుపించుచున్నది
యిది యనన్యసాధ్య మెట్లు వచ్చె 203

భావము : "ఈతడెవరమ్మా! ఈ దివ్యరథమున కెట్లు వచ్చినాడు? ఇది మహామహులకే సాధ్యమైనది కదా! కొద్దిపాటి అందము కలవాడు ఇతడు. ముఖము ముడుచుకొన్న ఈతని వికృతమైన రూపము కన్పట్టుచున్నది."

ఉ॥ వచ్చిన నీవు సమ్మతిని వారక దివ్యరథంబు మీదికిన్
దెచ్చితి వేల నమ్మ సుదతీమణి నీచను వారలెల్లరా
వచ్చు నటమ్మ నిన్నచట వారలు ఏమనుకొందురమ్మ యీ
మచ్చికలెందు గల్గె నిది మంచిదిగాదు తలంచి చూడగన్ 204

అర్థాలు : వారక= రావద్దనక, చనువారలు= చెల్లుబడి కలవారు

భావము : "నీ యొద్దకు వచ్చిన వానిని వలదనక ఒప్పుకొని ఈ దివ్యమైన రథము మీదికి తెచ్చితివి కదమ్మా! నీతో మెలగు వారెవరైనను ఇట్లు రావచ్చునా! (నీవు పిలుచుకొనిరాదగదు). నిన్ను అచటనున్న వారు ఏమనుకొందురో! అమ్మా ఇట్టి స్నేహము మంచిదిగాదు."

తే॥ ఎంతపని కైన నాతోన నెరుక సేయ
కెంతపని సేయవకట నేడేమొ కాని
యింతపని చేసితివి గురు డిచ్చగించ
నేమి హేతువొ తెలియదు యిందువదన! 205

భావము : "ఓ చంద్రవదన! ఏ పనియైనను నాకు తెల్పక చేయవుకదా! నేడేమో ఇట్టి పనిచేసినావు. నీ తండ్రి ఏల ఇష్టపడెనో కారణము తెలియుట లేదే.

క॥ ఇందుకు మన కవమానము
నిందయు రాగలదు సుమ్ము నేడీ బడుగున్
విందువలె దెచ్చుటకు నో
సుందరి! నామాట నేడు చూడుమటన్నన్॥ 206

అర్థాలు : బడుగున్= బలము లేనివానిని, విందువలె= అతిథివలె.

భావము : "ఇట్లు ఆతని తెచ్చి ఓ బలహీనుని అతిథివలె ఆదరించుటచే మనకు అవమానము నిందవచ్చును. నీవు నా మాట నిజమని నమ్ముము."

విశేషము : పద్యము 203 నుండి ఇంతవరకును మోహితుడైన బ్రహ్మకు తన శక్తి ఏ పాటిదో తెలుపుటకు యోగినితో చెలికత్తె ఇట్లు మాట్లాడినది. "ఇంత శక్తిలేనివానిని ఈ దివ్యరథములో నెక్కించి అతిథిమర్యాదకోసము అంత దూరము విశ్వాంతరముల ప్రయాణము చేయించుటకు ఆ పెద్దాయన (తండ్రి) ఒప్పుకొనుటకు కారణముండవచ్చును. కాని తోడుగా తీసికొనిపోవు మనము మాత్రము ఆ విశ్వాంతరవాసులైన దివ్యమూర్తుల వలన మాటబడ వలసి వచ్చుట నిజము." ఈ మాటలన్నిటిని బ్రహ్మను తూలనాడుటకై ఆతడు వినునట్లు, మాట్లాడినది. బ్రహ్మ లజ్జ లేనివాడై వినుచున్నాడు. కామాతురునకు లజ్జయుండ దనుట స్పష్టము.

వ॥ యోగిని యిట్లనియె 207

భావము : యోగిని ఇట్లు అనెను

ఉ॥ నాదు ప్రతిజ్ఞయుం దెలిసి నావు గదా జనకుండు దానికై
యాదరణీయతం జగములారసి యీ రసికావతంసమున్
శ్రీ దళుకొత్త దెచ్చెను వరించు మటంచును నీవు నాయెడన్
గాదిలి పొత్తు కత్తియవు గావటె నీ కెరిగించ కుందునే? 208

అర్థాలు : ఆదరణీయతన్= ఆదరముతో, జగములారసి= లోకములు చూచి, రసికావతంసమున్= రసికులలో శ్రేష్ఠుని, శ్రీ దళుకొత్త= వైభవము ప్రకాశించగా, గాదిలి= ప్రియమైన, పొత్తుకత్తియవు= చెలికత్తెవు.

భావము : "నా ప్రతిజ్ఞ తెలిసి నా తండ్రి వరింపుమని కొనితెచ్చినాడు. ఇంతే! నీవు నా ఇష్టమైన చెలివి నీకు చెప్పకుందునా!"

ఆ॥ బ్రహ్మదేవుడితడు బ్రహ్మాండమున కెల్ల
యీశ్వరుడు స్వయంభుడితడు సుమ్ము
ననువరించ వచ్చినాడు గావున నిమ్మ
హానుభావు మహిమ లరయవలసె 209

భావము : "ఈతడు బ్రహ్మ తానై పుట్టెను. నన్ను వరించవచ్చెను. ఈతని మహిమలన్నియు తెలిసికొనవలసి యున్నది."

క॥ తెచ్చితి నిందవమానము
వచ్చిన రానిమ్ము గురుడు వంచిన పనికే

నిచ్చ గలంగగ నేటికి
చెచ్చెర మన కోర్కె నేడు చేకురనయ్యేన్ 210

భావము : "ఈతని తేరుపై తెచ్చితిని. అవమానము రానిమ్ము. తండ్రి చెప్పిన పనికై చిత్తమందు కలతను ఏల పొందవలెను? త్వరలో మన కోర్కె ఫలింపగలదు."

ఆ॥ నలిన నేత్ర నీ మనంబున నిది లెస్స
తెలియజూచి పల్కు తేటగాను
ఇంతకన్ననాకు హితవరు లెవ్వరు
రమణి బుద్ధిమంతురాలవనిన 211

భావము : "ఓ పద్మము వంటి కన్నులు కల చెలియా! నీవిట్లు వచించుట నీ మనస్సునకు తగినదే. ఆలోచించి చక్కగా మాట్లాడు. ఓ రమణీ! నీకంటె నాకు మేలు కోరువా రెవరున్నారు? నీవు బుద్ధిమంతురాలవు సుమా!"

వ॥ ఒక్కింత విచారించి యక్కలికి ఇట్లనియె 212

భావము : ఆ చెలికత్తె ఆలోచించి యోగినితో ఇట్లు పల్కెను

సీ॥ ఈ అఖిలేశ్వరుడింతి! నీ ప్రాపపే
క్షించిన దయనాదరింప రాదె
యోయజుండీరీతి నీ యొఱపునకును
భ్రమజెంద మిగుల చేపట్ట రాదె
యీ స్వయంభువు నీదు భాస్వరాకృతికిని
మరులు జెందిన కూర్మిమనుప రాదె
యీ సర్వశక్తి నిన్నెనయంగ జింతింప
పలుకు తేనెల శ్రమబాప రాదె

తే॥ ఇంతకన్నను సర్వజ్ఞుడెందు గలడు
జనకవాక్యంబు మీరంగ జనదు సుమ్ము

పడతి నీ కోర్కె లీడేరె పక్వమయ్యె
ప్రేమ నీ ఘను మదిని వర్తింపవమ్మ 213

అర్థాలు : ఓ అఖిలేశ్వరుడు= ఒక సర్వేశ్వరుడు, ప్రాపు= ప్రేమ, అపేక్షించిన= కోరినచో, ఒఱపునకును= అందమునకు, భాస్వరాకృతికిని= ప్రకాశించు రూపమునకు, మరులుజెందిన= ప్రేమకలిగిన, కూర్మి= ఇష్టముతో, మనుపరాదె= కోరికతీర్చరాదా?, ఎనయంగ= పొందుటకు, శ్రమపాపరాదె= అలసటను తొలిగింపరాదా?, జనవాక్యంబు= ప్రజాభిప్రాయము, మీరంగచనదు= కాదనుట చెల్లదు, ఈడేరు= తీరును, పక్వమయ్యె= పండినది, మదిని వర్తింపవమ్మ= మనసెఱిగి మసులుకోవమ్మా.

భావము : "ఒక సర్వమునకు అధిపతి నీప్రేమను కోరినచో దయతో ఆదరింపవలసినదే! బ్రహ్మ నీ అందానికి భ్రమ చెందగా అతనిని పెళ్లాడ వలసినదే! తానై పుట్టినవాడు ఇతడు బాహ్యసౌందర్యానికి వశుడైన, ప్రీతితో కోర్కె తీర్చవలసినదే. శక్తిమంతుడు ఇతడు నిన్ను పొందుటకై చింత కలవాడైన తేనె వంటి పలుకులతో అలసటను తొలగించవలసినదే! ఇంతకంటె గొప్పవాడు సర్వమును తెలిసినవాడు ఎచ్చట ఉన్నాడు? ప్రజావాక్యమును అతిక్రమింప రాదు. ఓ చెలియా! నీ కోర్కె ఫలించెను. నీ ప్రేమ పండినది. ఈ గొప్పవాని మదిలో మెలగు మమ్మ."

క॥ అని మర్మోక్తులు బలికెడి
వనితను తన హితవెకాగ వగచుచు మాయా
ఘనపటలావృతమతియై
కనగుడ్డిన్వినగ చెవుడుగా నున్నంతన్ 214

అర్థాలు : మర్మోక్తులు= వ్యంగ్యధ్వనితో పలుకు మాటలు, హితవెకాగ= ఇష్టమైన ప్రసంగమైన కారణముగ, వగచుచు= చింతించుచు, మాయాఘన పటలావృతమతియై= మాయయొక్క దట్టమైన మబ్బులయొక్క

సమూహముచే కప్పబడియున్న బుద్ధిచే, కనగుడ్డి న్వినగ చెవుడుగా నున్నంతన్= చూచుటకు గుడ్డివాడు, వినుటకు చెవిటివాడుగ నుండగా.

భావము : చెలికత్తె మాటలు తనకు ఇష్టమగుటచే మాయచే, వాని యందలి మర్మమును గ్రహింపక తెలివిలేక యుండెను.

మ॥ చనియెన్ బుష్పకమయ్యజాండకటకాచ్ఛాదంబు భేదించి ది
గ్గన తద్బాహ్యమహాజలాంతరగతిన్ గాఢాండజ గ్రాహ కూ
ర్మనితాంతోరగకర్కట ప్రకర సంరంభ ప్రఘూర్ణోద్ధత
ధ్వనికిం బెగ్గి విధాత మూర్ఛిల సతుల్ తచ్ఛాంతి గావింపగన్ 215

అర్థాలు : దిగ్గన= చివాలున, తద్బాహ్యమహాజలాంతరగతిన్= దానిభుజము గొప్ప జలములో ప్రయాణించుటలో, గాఢాండజగ్రాహకూర్మనితాంత+ ఉరగకర్కట ప్రకరసంరంభప్రఘూర్ణ ఉద్ధతధ్వనికిన్= తీవ్రమైన పక్షుల యొక్కయు, మొసళ్ళ యొక్కయు, తాబేళ్ళ గుంపులయొక్కయు, పాముల యొక్కయు, ఎండ్రకాయల సమూహముల యొక్కయు ధ్వనికి, బెగ్గిలి= భయపడి, విధాత= బ్రహ్మ, మూర్ఛిల= మూర్ఛపోగా= తత్‌శాంతికావింపగాన్= ఆ మూర్ఛతేర్చుటకు చేయదగిన పనులు చేయగా, అజాండ కటక ఆచ్ఛాదనంబు భేదించి= బ్రహ్మాండమైన విశ్వము యొక్క నడుము భాగమందుగల ఆవరణము చీల్చుకొని.

భావము : పుష్పక విమానము బ్రహ్మాండ భాండము యొక్క నడుముభాగమున గల ఆవరణమును చీల్చుకొని వెంటనే దాని ఇరుప్రక్కలా, గొప్ప నీటి సమూహమందు పయనించు చుండగా పక్షులు, మొసళ్లు, తాబేళ్లు, ఎడతెగని పాములు, ఎండ్రకాయలు మొదలైన వాని సమూహముల యొక్క అలజడులచేతను తిరుగుడుల తీవ్రతలవలనను కలిగిన గొప్ప ధ్వనులచే బెదరిపోయి బ్రహ్మ మూర్ఛిల్లెను. అచ్చట యువతులు ఆ దేవుని మూర్ఛనుండి తేల్చిరి.

ఉ॥ అంబు లొకింత పుష్పకము నంటక గెంటక చక్కనాత్మవే
గంబున బోయి యొక్క ఘనకంజభవాండము కర్పరంబులీ
లం బెడబాసి చొచ్చి యవలన్నిబిడాంధతమఃప్రయుక్తమా
ర్గంబున గొంత దవ్వరుగ గాంచిరి కప్పరితెల్వి భూమియున్ 216

అర్థాలు : అంబులొకింత= నీరు కొంచెమైనను, ఆత్మవేగమున= తన సహజవేగముతో, ఘనకంజభవాండము= గొప్పబ్రహ్మాండము, కర్పరంబులీలన్= పెద్దబానవలె, పెడపాసి= విడివడి, చొచ్చి, ప్రవేశించి, నిబిడాంధతమఃప్రయుక్తమార్గమున= దట్టమైన చీకటిముసిరిన త్రోవన, కప్పరి తెల్వి= కనుచీకటి తొలగి వెలుగు.

భావము : నీళ్లు విమానమును అంటక అడ్డుకొనకపోవుటచే అది వేగముచే చక్కగా పయనించి, గొప్పదైన బ్రహ్మాండమును, పెద్దబానవలె, ప్రకాశించి, విడివడి, ఆవల దట్టమైన చిమ్మచీకటి నిండిన లోయలోపోగా, కొంతదూరమున చీకటి తొలగి వెలుగుగల భూమిని చూచి.

క॥ ఆ తేజమంత కంతకు
చేతోముద మొసగ బయిలు చేకొని పోవన్
పీతాది సర్వవర్ణో
పేతంబై కాననయ్యె మృదుగిరి మ్రోలన్ 217

అర్థాలు : చేతోముదము= మనస్సుకు సంతోషము, బయిలు= ఆకాశము, పీతాదిసర్వవర్ణోపేతంబై= పసుపు మొదలగు అన్ని రంగులతో కూడి, మృదుగిరి= మార్దవమైన కొండ, మ్రోలన్= ఎదుట.

భావము : వారు కాంచిన కాంతి సంతోషమియ్యగా, కొంతకాలము బయలులో పయనించగా పసుపు మొదలగు అన్ని రంగులు గల బంగారు కాంతి నిండిన నున్ననైన కొండ ఎదుట కన్పడెను.

ఆ॥ ఆ గిరీంద్ర మరయ నంబర చుంబియై
యున్న జవమునరయుచుండె నజుడు
అంతలోన శైలమధిగమించెను పుష్ప
కంబు వలను దోచె కంధియొకతె 218

అర్థాలు : గిరీంద్రము= శ్రేష్ఠమైన కొండ, అంబరచుంబియై= ఆకాశమును ముద్దిడుచున్నట్లు ఎత్తైనదై, జవము= వేగము, శైలమధిగమించెను= కొండను దాటెను, కంధియొకతె= సముద్రమొకటి.

భావము : ఆ కొండ ఆకాశమునంటు ఎత్తు కలిగియున్నట్లు తోపగా, బ్రహ్మ విమానవేగమును గమనించుచున్నంతలో అది ఆ కొండను దాటెను. ఆవల ఒక సముద్రము కన్పట్టెను.

చ॥ చూచి వెఱంగు నొంది విధి సుందరి యీయచలంబు నా మహా
వీచుల వార్ధిదేమి యని వేడిన నిట్లనె నీకెరుంగరా
దేచతురాస్య! నీకు మునుదెల్పిన యట్టి యజాండమయ్యె దీ
ర్ఘాచలరాజ మెన్న వలయాద్రి సముద్రము దీని గంటిరే 219

అర్థాలు : వెఱంగునొంది= ఆశ్చర్యపడి, మహావీచుల వార్ధి= గొప్ప అలలుగల సముద్రము, చతుర ఆస్య= నాలుగు ముఖములు గలవాడా!

భావము : ఆ కొండను చూచి ఆశ్చర్యపడి బ్రహ్మ "ఆ పర్వతము, గొప్ప అలలు గల యీ సముద్రమేమియో తెల్పుము" అని కోరగా యోగిని ఇట్లనెను. "నీకు తెలియదా? అయినను నేను ముందు తెల్పిన బ్రహ్మాండమిది. ఈ నిడుపైన కొండ గుండ్రనిది, "వలయాద్రి" సముద్రమును చుట్టి యున్నది.

చ॥ దశగుణితంబులై మెఱయు ధారుణి శైలము లంబుధుల్ నదుల్
విశదములైన లోకములు వేధయు భాస్కర చంద్రఋక్షముల్

పశు మృగ పక్షి దంష్ట్రి వృక పన్నగ వృక్ష పిపీలికంబులున్
నిశియు నహంబు వేదములు నీరదవృష్టులు నాగ సర్వమున్ 220

అర్థాలు : దశగుణితంబులై= పదిరెట్లయి, విశదములైన= సృష్టములైన, వేధయు= బ్రహ్మమును, భాస్కరచంద్రఋక్షముల్= సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, పశుమృగపక్షినక్రవృకపన్నగవృక్ష పిపీలికంబులున్= మచ్చిక చేయబడి మనుష్యులకు కార్యములలో సాధనములుగ నుపయోగపడు జంతువులు, జింకలు, చీమలు పిట్టలు, తోడేళ్ళు, మొసళ్లు, పాములు, చెట్లు, వేదములు ఋక్ యజుస్, సామ, అధర్వణ పాఠములు నాలుగు వేదములు, నీరదవృష్టులు= మబ్బుల నుండి వానలు, నాగ= అనగ.

భావము : పదిరెట్లు ఎక్కువగా ప్రకాశించు పుడమి, కొండలు, సముద్రము, నదులు సృష్టముగానున్న లోకములు, బ్రహ్మయును, సూర్యచంద్ర నక్షత్రములు, చెట్లు, పెంపుడు జంతువులు, జింకలు, పక్షులు, మొసళ్లు, తోడేళ్లు, పాములు, చెట్లు చీమలు, రాత్రియు పగలును, వేద పాఠములు, మేఘముల నుండి వానలు అనువానిని అన్నింటిని.

చ॥ కనుగొను మంచు బల్క విని కంజభవుండు సమస్తజీవులన్
కనునెడ నున్నతోన్నత వికాసతను ప్రతిభా విశేషని
స్వన రస దృష్టి తేజములు వర్ధిత శక్తియు నంత కంతకున్
దనరగ నంతలోపలను దానొక కీటమువోలె దోచినన్ 221

అర్థాలు : ఉన్నతోన్నతవికాసతను ప్రతిభావిశేషనిస్వనరసదృష్టితేజములు= చాలా గొప్పగా పరిణామము జెందిన శరీరము, మనస్సులయొక్క శక్తి, కంఠధ్వనులు మఱియు తియ్యదనపు చూపులును తేజస్సులును, వర్ధితశక్తియు= వృద్ధి చెందిన శక్తియును, అంతకంతకున్ తనరగ= ఒకదానిమించి మఱియొకటి మించగా, అంతలోపలను= వాని యన్నింటిలో, కీటము= పురుగు.

భావము : "చూడండి" అని పల్కగా, బ్రహ్మ సమస్త జీవులను చూచునప్పుడు, గొప్పవృద్ధి, ప్రతిభతో నిండిన కంఠధ్వనులతో తియ్యనిచూపులు శరీరతేజము సమృద్ధి ఎక్కువగుచున్న శక్తియు క్రమక్రమముగా మించగా వానిలో తాను అల్పమైన శక్తిచే నున్న ఒక చిన్నపురుగుగా తోచెను.

ఆ॥ అణగియుండి భాస్కరాతపతీక్ష్ణవి
స్ఫురణకోర్వలేక పుండరీక
భవుడు సొమ్మసిల్లి పడిన నయ్యోగిని
యమృతజలనిషేచనమున దేర్చె 222

అర్థాలు : అణిగి= ఒదిగి, బడాయికిపోక, భాస్కర+ఆతపతీక్ష్ణవిస్ఫురణ కోర్వలేక= సూర్యుని ఎండ తీవ్రతకు తాళలేక, పుండరీకభవుడు= బ్రహ్మ, సొమ్మసిల్లి= స్పృహతప్పి, అమృతజలనిషేచనమున తేర్చె= అమృతమును చిలకరించి (వానిని) స్పృహ వచ్చునట్లుచేసెను.

భావము : తానొక పురుగై తోచుటచే అణగియుండి బ్రహ్మ ఎండ వేడిమిని సహింపలేక తెలివితప్పి పడెను. యోగిని చల్లని నీటిని చల్లి తెలివి వచ్చునట్లు చేసెను.

ఉ॥ ఈగతి లోకముల్ గడచి హెచ్చి మనోగతి సత్యలోకమున్
వేగమ డాసినంత మది వేడుక పుష్పక మల్ల డిగ్గియ
య్యోగిని ధాత దోడుకొని యొయ్యన నన్నగరంబువాకిటన్
రాగని ద్వారపాలకకులు రంజిలి యోగిని గాంచి వేడుకన్ 223

అర్థాలు : సత్యలోకమున్వ బ్రహ్మలోకమును, డాసినంత వ చేరబోయినంత, డిగ్గివ దిగి, ధాతవ బ్రహ్మను, తోడుకొనివ తీసికొని, మొయ్యనవ మెల్లగా, రాకనివ వచ్చుట చూచి, రంజిలివ సంతోషించి.

భావము : ఇట్లు లోకాలను దాటిపోయి వేగముతో సత్యలోకమును విమానము చేరగా ఆ యోగిని దిగెను వెంటనే ద్వారపాలకులు సంతోషించి ఉత్సాహముతో

ఉ॥ వచ్చితివమ్మ నేటికిని వాణి భవన్ముఖ వీక్షణాప్తిచే
నిచ్చవచించు రావనుచు నెయ్యముతో జనుమంచు వెంబడిన్
వచ్చిన ధాత జూ చెచటివాడవు నిల్వు మటంచు ద్రోచినన్
ముచ్చముడింగి బైటనొక మోడును బోలెను నిల్చియుండగన్ 224

అర్థాలు : వాణి= సరస్వతి, భవన్ముఖవీక్షణాప్తిచే= నిన్ను చూడవలెనను కోరికతో, ఇచ్చ వచించు= ఆసక్తితో, ఎంతో అనుకొనును, నెయ్యముతో= స్నేహముతో, చనుమంచు= వెళ్ళుమనుచు, వెంబడిన్= వెంట, ముచ్చముడంగి= మిక్కిలి ముడుచుకొని, మోడును పోలెను= ఎండిపోయిన చెట్టువలె, కాంతిలేని వాడై.

భావము : "నేటికి వచ్చితివి. వాణి నీవు రాలేదని నిన్ను చూడదలచి ఎంతో ఎదురు చూచును. స్నేహముతో లోపలికి పొమ్ము, అనుచు ఆమెతో వచ్చిన బ్రహ్మను చూచి, "నిల్వుము నీవెవరు" అని నెట్టివేసిరి. అట్లు చేయుటచే సంకోచముచే ఎండిన చెట్టు వలె కాంతి తొలగి అచ్చటనే నిలబడెను.

ఆ॥ తిరిగి చూచినంత తెలివి దప్పిన మోము
దీనభావమరసి తెరవమరలి
ద్వారపాలకులకు కూరిమి నిట్లనె
మత్సఖుండు లోకమాన్యు డితడు 225

అర్థాలు : తెఱవ= స్త్రీ, మత్సఖుండు= నా మిత్రుడు, లోకమాన్యుడు= లోకములకు గౌరవనీయుడు

భావము : యోగిని వెనుకకు తిరిగి చూచి బ్రహ్మ తెలివితప్పిన ముఖము జాలిగొల్పు ఉనికిని గ్రహించెను. ఆమె ద్వారపాలకులతో ప్రేమతో ఇట్లనెను. "ఈతడు నాచెలికాడు. లోకములందు గౌరవనీయుడు."

క॥ పరమేష్ఠిదర్శనమునకు
నరుదెంచినవాడు మత్సహాయమున న్నీ

పురుషుని రానిండని తన
కరమున దత్కరము వేగ గైకొని చనియెన్ 226

అర్థాలు : పరమేష్ఠి= బ్రహ్మ, అరుదెంచినాడు= వచ్చినాడు, మత్సహాయమునన్= నాకు సహాయముగా, తోడుగా.

భావము : పరమేష్ఠి దర్శనమునకై నాకు తోడుగా వచ్చినాడు అని బ్రహ్మచేతిని తనచేతితో పట్టుకొని "రానియ్యండి" అని లోనికి తీసికొని పోయెను.

వ॥ ఇట్లు యోగినీదేవి దొడ్కొని చనగ నభ్యంతరంబులు గడచి పోవు సమయంబున నొక్కమహోన్నత దివ్య రత్నకాంచన సభామంటప మధ్యంబున 227

భావము : ఈవిధముగా యోగిని తోడ్కొని లోపలి భాగములను దాటుచు పోగా ఆసమయమునందు ఎత్తైన, దివ్యములైన రత్నములు పొదిగిన బంగారముతో నిర్మితమైన మండపము మధ్యభాగమందు

సీ॥ చింతామణిస్ఫుట సింహాసనోపరి
గనకాద్రినిభశుభాంగంబు వాని
త్రిభువన సామ్రాజ్య విభవ శోభిత వచః
కామినీ వామ భాగంబు వాని
నాలుగు మోముల నలుగడ నధ్యాత్మ
విద్యా ప్రసంగియై వెలయు వాని
చతురబోధావచఃశ్రవణకౌతూహల
మతియతి సంచయావృతము వాని

తే॥ సకలసురమునిజనగణ సర్వవేద
పంక్తి భాస్వత్సభామంటపంబు వాని
భువననిర్మాణచాతుర్య భూరి శక్తి
భరిత సామ్రాజ్యకలితవైభవము వాని 228

అర్థాలు : చింతామణిస్ఫుట= చింతామణివలె ప్రకాశించు, కనకాద్రినిభ= బంగారుకొండను, మేరుపర్వతమును పోలిన, వచఃకామినీ వామభాగంబువాని= ఎడమప్రక్క వాగ్దేవత కలవానిని, అధ్యాత్మవిద్యా ప్రసంగియై= ఆత్మ-పరమాత్మల గుఱించిన జ్ఞానమును ఉపన్యసించుచున్న వానిని, చతురబోధావచః శ్రవణకౌతూహలమతియతి సంచయావృతమువాని= నిపుణతతో బోధించు మాటలను వినవలెనను ఉత్సాహముతో నున్న యతులసమూహములతో చుట్టబడినవానిని,సకలసురమునిజనగణసర్వవేద పంక్తిభాస్వత్స భామంట పంబువాని= దేవతలు, దేవర్షులు, వేదసూక్తులు ప్రకాశించుచున్న సభాస్థలము గలవానిని, భువన నిర్మాణ చాతుర్యభూరిశక్తి భరితసామ్రాజ్య కలితవైభవమువాని= విశ్వసృష్టి చేయుటలో గొప్ప శక్తినైపుణ్యములు గలగిన రాజసము గలవానిని.

భావము : దేవమణివలె ప్రకాశించు సింహాసనముమీద మేరు పర్వతమువంటి శుద్ధమైన శరీరము కలవానిని, త్రిభువన సామ్రాజ్యముచే శోభించు వాణిని ఎడమ భాగమునందు కలవానిని, నాలుగు మోములందు నాలుగు వైపులా వేదాంత ప్రసంగము చేయువానిని, నిపుణతకల ఉపన్యాసములను వినుటకై ఉత్సాహవంతులైన మనస్సులు గల సన్న్యాసుల బృందముచే చుట్టబడిన వానిని, దేవతులు దేవమునులు అందఱు నాలుగు వేదములు వల్లించుచుండ, ప్రకాశించు మండపమునందున్న వానిని విశ్వమును నిర్మించు కౌశలముగల గొప్ప శక్తితో సామ్రాజ్యాధిపతి అయిన తేజము కలవానిని

చ॥ హరిచరణారవిందయుగళార్చిత భక్తి నిరంతర వ్రతా
చరణ మునీంద్రకీర్ణనిజ సన్నిధి వాని సమస్త దేవతా
పరిచరణీయ వైభవ శుభస్థితి మించిన వాని సద్గుణా
కరు పరమేష్ఠిగాంచి యనుకంపముతో సతి మ్రొక్కి నిల్చినన్ 229

అర్థాలు : హరిచరణారవిందయుగళార్చిత భక్తి నిరంతరవ్రతాచరణ= విష్ణుపాద పద్మములను భక్తితో ఎల్లప్పుడు పూజించు వ్రతముగల, మునీంద్రకీర్ణ నిజ సన్నిధివాని= ముని శ్రేష్ఠులతో దట్టముగ నిండియున్న సభ గలవానిని, సమస్త దేవతా పరిచరణీయ వైభవ శుభస్థితి= దేవతలందఱిచేత సేవింపబడు వైభవముగల మేలైన ఉనికి, మించినవాని= అతిశయించినవాని, సద్గుణకరు= సుగుణములకు పుట్టినిల్లయినవానిని, అనుకంపముతో= ప్రేమతో

భావము : మహా విష్ణుపాద సేవయందు భక్తిగల మునివరులు సభయందు కలవానిని, సర్వదేవతల సేవలచే, గొప్పతనమును అతిశయించిన మంగళకరమైన ఉనికి గలవానిని, సద్గుణములకు నెలవైన పరబ్రహ్మదేవుని చూచి యోగిని ప్రేమతో మ్రొక్కి ఎదుట నిల్వగా

ఉ॥ ఆ పరమేష్ఠి గాంచి చతురాస్యుడు సిగ్గున మోముదమ్ములన్
రూపరి చిన్నబోయి తను రోయుచు మోమును వంచి యున్నచో
నా పురుషాగ్రగణ్యుడు తదాకృతి గైకొని యోగినీసతిన్
కాపురుషుండు ఎవ్వ డిటుగైకొని తెచ్చుట కేమియో యనన్ 230

అర్థాలు : చతురాస్యుడు= చతుర్ముఖ బ్రహ్మ, మోముతమ్ములన్ రూపరి= పద్మములవంటి ముఖములు వికృతములు కాగా, రోయుచు= అసహ్యించుకొనుచు, తత్కృతి గైకొని= వాని ఆకారమును చూచి, కాపురుషుండు= అల్పుడు.

భావము : బ్రహ్మ ఆసనముపైనున్న తేజోవంతుడైన పరబ్రహ్మను చూచి, అచటికి వచ్చిన, కామముచే పీడింపబడు తన ముఖ పద్మమును సిగ్గుతో వంచి, వికారరూపముతో తన్ను దూషించుకొనుచు ఎదుట నిల్వగా ఆ పరమేష్ఠి వాని వికృత రూపమును పరిశీలించి యోగినితో "అల్పుడైన పురుషుడు ఎవ్వడు? ఇక్కడికి ఏల కొని తెచ్చితివో?" అని ప్రశ్నింపగా,

మ॥ సతి బల్కెన్ భయభక్తియుక్తముగ నో సర్వేశ నావిన్నపం
బితడొక్కండములోన బ్రహ్మ మదిలో నీర్ష్యత్వముం బొంది తా
నతిగాఢాంధతమఃప్రకృష్టమగు ఛాయన్ వచ్చి యున్నంత నీ
చతురాస్యున్ గురు డర్థిదెచ్చి దయతో సంప్రీతి బూజింపగాన్ 231

అర్థాలు : అండములోన= విశ్వములో, ఈర్ష్యత్వమున్ పొంది= ఈర్ష్యజెంది, అతిగాఢాంధతమఃప్రకృష్టమగు ఛాయన్= మిక్కిలి దట్టమైన చీకటి అతిశయించిన రీతిగా, గురుడు= నా తండ్రి, గురువునైన యోగి, మాయికుడు, అర్థిన్= కోరి, స్నేహముతో.

భావము : "ఓ సర్వేశా! ఇతడు బ్రహ్మ. ఈర్ష్యతో చిమ్మ చీకటిలో వసించుచుండగా నా తండ్రి కొనితెచ్చి ప్రీతితో పూజించెను.

మ॥ ఇతడుం దానును గొంత కొంతవడి వారిష్టానులాపక్రియా
న్వితులై మజ్జనకుండు నన్ బిలిచి తన్వీ నీ ప్రతిజ్ఞార్హ తా
మతి నెంచన్ వచియించు వాడితని సామర్థ్యంబు నీ చిత్తసం
గతిగా నారసి చాలె నేని పతిగా గైకొమ్ము నా నెంతయున్ 232

అర్థాలు : ఇష్టఅనులాపక్రియాన్వితుడై= ఇష్టపడిన సంభాషణములు చేయుచు, తన్వీ= ఓ అమ్మాయీ! నీ ప్రతిజ్ఞార్హతామతి నెంచన్ వచియించువాడు= నీవు ప్రతిజ్ఞ చేసిన మేరకు అర్హతలున్నవని చెప్పికొనువాడు, చిత్తసంగతిగా= మనసున కెట్లు తోచునో, అరసి=తెలిసికొని, చాలెనేని= నీకు సరియైనవాడుగా తోచినచో, నాన్= అనగా

భావము : "ఈతడు నా తండ్రియు కొంతకాలము మాట్లాడిరి. తర్వాత నా తండ్రి నా ప్రతిజ్ఞకు తగిన అర్హతగల, నామతి మెచ్చుగా, ఆతని నైపుణ్యమును మనసునకు తగినట్లు పరీక్షించి తగినవాడని తోచినచో పతిగా వరియించుము" అనగా,

ఆ॥ చర్చచేసి చూడ సర్వేశ్వరుండును
తానె సర్వశక్తి దా ప్రభుండ
హరిహరాదిదివ్యులందఱు తనయాజ్ఞ
మెలగువార లనుచు మీరి పలుక 233

అర్థాలు : హరిహరాది దివ్యులందఱు= విష్ణువు, శివుడు మొదలుగా గల దేవతలందఱు, తన యాజ్ఞ మెలగువారలనుచు= తన ఆజ్ఞను పాలించువారేయని, మీరి= మితిమీరి, అతిశయముతో

భావము : ''చర్చ చేయగా తానే అందఱికంటే అధికుడనని తన ఆజ్ఞలకు వశులై వర్తించువారని ప్రేలుచున్నాడు.''

క॥ నేనా నేర్పుల చూడం
గానే తానే ప్రభుండగాక నొకండెం
దైనా గలడే యనగా
నేరని విధిదాన గాన నీ సన్నిధికిన్ 234

భావము : ''నేను ఆ నేర్పులను అడుగగానే, తానే ప్రభుడను మఱొకడు కలడా అనుటచే ఏమియును తెలియని దానిని అగుటచే, తమ కడకు కొని వచ్చితిని.''

ఉ॥ తెచ్చినదాన నేరమగు దేవరచిత్తమనుజ్ఞలేక నా
యిచ్చ ప్రతిజ్ఞయుం దెలిసి యీ ఘను డంతకు జాలియుండెనా
చెచ్చెర నానతిమ్ము నిను జిత్తములో నెరనమ్మినాను నా
వచ్చిన కార్యమింత నెరవాదులు లేరిక మీకు మిక్కిలిన్ 235

భావము : ''తమ అనుమతిలేక తెచ్చుట నేరమే! నా మనసులోని ప్రతిజ్ఞ తెలిసిన మీరు ఈ గొప్ప దేవుడు నాకు తగినవాడా! వెంటనే ఆనతిండు మిమ్ము పూర్తిగా నమ్మినాను. నేను వచ్చిన పని యిదే! మీకంటే మించిన నేర్పరులైన సంవాదము చేయువారు లేరు కదా!''

ఆ॥ అనుచు విన్నవింప విని యష్టవదనుండు
యోగినీ ప్రియోక్తి నొయ్యనొయ్య
శాంతమూర్తి యగుచు చపలాక్షి యీ నీచు
నచట గాద నాక నగునె తేను 236

అర్థాలు : అష్టవదనుండు= ఎనిమిది ముఖములు గల బ్రహ్మ, ఒయ్యనొయ్య= మెల్లమెల్లగా, చపలాక్షి= చంచలములైన కన్నులు గలదానా! గాదనాక= 'కాదు' అనక, తేను= తీసికొనిరాగా,

భావము : అని యోగిని విన్నపము చేయగా ఆ ఎనిమిది ముఖములుగల పరమేష్ఠి ఆమె ప్రియమైన మాటలకు క్రమక్రమముగా కోపమణచుకొని మెత్తబడి ''ఓ చపలాక్షి! ఈ నీచుని అచటనే తిరస్కరింపక ఇచ్చటికి తేతగిన వాడా?'

సీ॥ హరిభక్తిహీనుడెందైనను నీచుండు
హరిభక్తిహీనుడెందైన ఖలుడు
హరి భక్తి హీనుడె యాచారరహితుండు
హరి భక్తిహీనుడే యధము డెందు
హరిభక్తిహీనుడే పరమనికృష్టుండు
హరి భక్తి హీనుడె యంత్యజుండు
హరిభక్తిహీనుడే యఖిలదుష్కర్ముండు
హరిభక్తి హీనుడె పురుష పశువు

తే॥ పరమహరిభక్తిహీనుడె పాతకుండు
కటికి హరిభక్తిహీనుడే కుటిలతముడు
నెలత! హరిభక్తిహీనుడె నిందితుండు
సతతహరిభక్తిహీనుడే పతితు డెందు 237

భావము : ఓ నెలతా! హరిభక్తి లేని వాడు, నీచుడు క్రూరుడు, ఆచార రహితుడు (సత్ప్రవర్తన లేనివాడు), అధముడు (అందరికంటె తక్కువవాడు), నికృష్టుడు (పాప చింత కలవాడు), అంత్యజుడు (కడ జాతికి చెందినవాడు), దుష్కరుడు (చెడ్డ పనులు చేయువాడు), పురుష పశువు (పురుష రూపములోనుండు జంతువు), పాతకుడు (గొప్ప పాపములు చేయువాడు), కుటిలతముడు (వక్రమార్గములు కలవాడు), నిందితుడు (నిందకు తగినవాడు), పతితుడు (దివ్యమార్గము నుండి జారినవాడు).

విశేషము : హరిభక్తిలేనివాడు అన్ని దుర్గుణములకు మూలకోశము.

క॥ గర్వగ్రస్తుండైనను
దుర్వర్తనుడైన పరమదూషకుడైనన్
సర్వాఘపూర్ణుడైనను
నిర్వాహకు డతడె హరి మనీషకుడైనన్ **238**

అర్థాలు : గర్వగ్రస్తుడైనను= గర్వము కలవాడైనను, దుర్వర్తనుడైన= చెడ్డ ప్రవర్తన కలవాడైనను, సర్వ+అఘపూర్ణుడైనను= అన్ని పాపములు నిండినవాడైనను, నిర్వాహకుడు= సమర్థుడు, హరిమనీషకుడైనన్= విష్ణునియందు మనసు కోర్కెతో నున్నట్లయిన

భావము : హరి భక్తి గలవాడు ఎట్టివాడైనను కార్యనిర్వహణ సమర్థుడే!

క॥ హరి భక్తిగలిగి సద్గుణ
భరితుండగు నేని పసిడి పరిమళమగుచున్
హరి భక్తిగలిగి దుర్గుణ
పరివర్తనుడైన యతడు పావనుడెందున్ **239**

అర్థాలు : హరిభక్తి గలిగి= విష్ణు భక్తుడై, సద్గుణ భరితుండగునేని= మంచి గుణములు నిండుగా ఉన్నవాడైనచో, పసిడి= బంగారము, పరిమళము+

ఎసగున్= సువాసనగలదగును, దుర్గుణ పరివర్తనుడైన= చెడ్డ గుణముల నుండి మార్పు జెందిన వాడైనచో, పావనుడు= పవిత్రుడు.

భావము : హరి భక్తుడు గుణవంతుడైనచో బంగారము సువాసన కలిగినట్లగును. చెడ్డగుణముల నుండి ముక్తుడైనచో పవిత్రుడగును.

ఉ॥ కావున భక్తి హీనుడును గర్వియు దుర్మదుడున్ దురాగ్రహుం
డీవిధిదుర్గుణాత్ముడగు టింతి యెరుంగక తోడి తెచ్చెనే
నీ విభు జేయ మాయికుడు నెమ్మి వివేకి వటందువెప్పుడున్
ఏవిధి డాంబికుం దెలియ రెంతటి వారు పయోజలోచనా! **240**

అర్థాలు : దుర్మదుడు= అహంకారి, దురాగ్రహుండు= సరియైన కారణము లేకుండ కోపగించువాడు, విభుచేయ= మగనిగా చేయ, నెమ్మి= ప్రీతితో, వివేకినిఅందువు= మంచి చెడులను తెలిసికొన గలుగు వాడవు అందువు కదా, డాంబికున్= గొప్ప చెప్పికొను వానిని, పయోజలోచనా= పద్మముల వంటి కన్నులు గలదానా !

భావము : "ఓ అమ్మాయి! నీ తండ్రి చెడ్డ వానిని ఈ బ్రహ్మను నీకు మగనిగా చేయుటకు తెచ్చెను గదా, ఈతడు మోసగాడు సుమా, ప్రీతితో మీ తండ్రి వివేకి అని చెప్పెదవు కదా! ఓ కాంతా! ఎట్టి వారైనను డంబము కలవానిని తెలియలేరు."

క॥ కొంచెపు సిరికింగా గ
ర్వించి దురాగ్రహము జెంది నిక్కుచు దిరిగే
కించనునకు విను తుద బ్రా
పించున్ బహుదుఃఖచయము పెక్కువ యగుచున్ **241**

అర్థాలు : సిరి= సంపద గలిగి, నిక్కుచు= పొగరుతో తిరుగు, కించనునకు= సామాన్యునకు, ప్రాపించున్= కలుగును, బహు దుఃఖచయము= ఎన్నో దుఃఖముల సముదాయము, పెక్కువ= ఎక్కువ

భావము : అల్పమైన సంపదచే గర్వించి, కోపించి తిరుగు సామాన్యుడు, పెక్కు దుఃఖములను అనుభవించును

శా॥ తానెంతో తన సంపదెంతో తెలియన్ తానున్న లోకంబనం
గా నెంతో తన వైభవం బనగ నిక్కంబెంతో చర్చింపగా
తానెన్నోజననంబు లెత్తినను మీదన్ వచ్చు నింకెన్నియో
తానా శ్రీహరి నేలువాడకట యీ దౌరాత్మ్యముం గల్గెనే! 242

అర్థాలు : ఏలువాడు= శాసించువాడు, దౌరాత్మ్యమున్ కల్గెనే!= ఇంతటి చెడ్డ మనస్సుకల్గినదే.

భావము : "తన స్థితిని తెలియక తన వైభవ మెంతయో విచారణ చేయక, తానెన్ని జన్మలెత్తినను ఇంకెన్నియో వచ్చుచుండును కదా! ఈతడు తానా, హరిని పాలించువాడు! ఆశ్చర్యము! ఆతని మనస్సు ఎంత చెడ్డదై పాడై పోయెనో కదా!"

క॥ హరికి పరాఙ్ముఖులై యె
వ్వరు గడతేరిరి గణింప వారిజనేత్రీ!
హరి భక్తియుక్తులై యె
వ్వరు చెడిపోయిరి నిజంబు వర్ణింపగన్ 243

అర్థాలు : పరాఙ్ముఖులై= నిరాకరించినవారై, కడతేరిరి= చివఱివఱకు సుఖముగనుండిరి, గణింప= ఆలోచింపగా.

భావము : ఓ వనితా! హరిని మఱచి ఎవ్వరు సుఖపడిరి? హరిని తలచిన వారెవరు చెడిపోయిరి?

ఉ॥ ఈతని చేటు గాలమిది యింతియే కాని విశేషమెద్ధి యీ
రీతని భంగపోయి కడు రిక్తత నొందినవార లెందరో
నాతి యటుండ నిమ్ము మరి నన్ను భ్రమింపదె తొల్లి వీని దు
ర్నీతి యదెట్టు లన్న విను నిశ్చల చిత్తముతోన యుగ్మలీ 244

అర్థాలు : భంగపోయి= గర్వభంగమై, రిక్తత= పనికిమాలినతనము, భ్రమింపదె= భ్రమ పడునట్లు చేయలేదా, దుర్నీతి= చెడ్డనీతి

భావము : "ఈతని కిప్పుడు చెడ్డ దినాలు. అనుభవింప వలసినదే! ఇందులో చెప్పవలసినవి క్రొత్తవి ఏమియు లేవు. ఈ విధముగా గర్వించి అవమానముచెంది పనికిమాలిన వారైన వారెందరో ఉన్నారు! ఓ కాంతా! అది అట్లుండనిమ్ము! పూర్వము, ఈతడు అవలంబించిన చెడ్డనీతియే నన్ను కూడ చలింపజేసినది. ఆ విషయమంతయును చెప్పెదను. ఏకాగ్రతతో వినుము.

సీ॥ ఈశాన ముఖ్య దిగీశ్వరుల్ గ్రహములు
దేవతాబ్రహ్మర్షి దివిజయక్ష
గంధర్వ కిన్నర గరుడ భూతవ్రాత
ఖచర కింపురుష దిగ్గజ సురారి
కులశైలనదనదీజలధివేద పురాణ
పన్నగాబ్దాయన పర్వమాస
పక్ష వాసర మేఘరుక్షర్తుమహదహో
రాత్రాప్సరోవసురాజవరులు

తే॥ సాత్త్వికవ్రతవరపుణ్యసత్యమతులు
యాగయోగాగమాదివిద్యలును మంత్ర
తంత్రయంత్రాదులును సర్వధర్మములును
వేష్టితంబున మూర్తీభవించి గొలువ 245

అర్థాలు : ఈశానముఖ్యదిగీశ్వరుల్= ఈశానుడు మొదలైన దిక్పతులు, దేవతాపురాణబ్రహ్మర్షిదివిజయక్షగంధర్వకిన్నరగరుడభూమివిలసితఖచరకింపురుష దిగ్గజ సురారికులశైలనదనదీజలధివేదపురాణ- పన్నగఅబ్దఅయినపర్వమాస పక్షవాసరమేఘరుక్షర్తుమహదహోరాత్రాప్సరోవసురాజవరులు= దేవర్షులు,

బ్రహ్మర్షులు, యక్షులు, గంధ్వరులు కిన్నరులు, గరుడులు, వివిధప్రాణులు, ఆకాశమున సంచరించువారు, కింపురుషులు, దిగ్గజములు, రాక్షసులు, కులపర్వతములు, నదులు, నదములు, సముద్రములు, వేదములు, పురాణములు, సర్పములు, సంవత్సరములు ఉత్తరదక్షిణాయనములు, పర్వములు, మాసములు, పక్షములు, వారములు(దినములు) మేఘములు, నక్షత్రములు, ఋతువులు, మహత్తు, పగళ్లు, రాత్రులు, దేవ వేశ్యలు, వసురాజ శ్రేష్ఠులు (వసువులు), సాత్త్వికవ్రతవరపుణ్యసత్యమతులు= సత్త్వగుణ ప్రధానములైన వ్రతశ్రేష్ఠములలో వర్తించు పుణ్యవంతులు, సత్యవంతులు, యాగయోగాగమాదివిద్యలును= యాగము, యోగము, ఆగమము మొదలగు విద్యలు, మంత్రతంత్ర యంత్రాదులును= మంత్రములు, తంత్రములు, యంత్రములు మొదలగునవి, సర్వధర్మములును, వేష్టితంబున= సభలో, మూర్తీభవించి= సాకారమై, కొలువన్= సేవింపగా.

భావము : ఈశానుడు మొదలైన దిక్పాలకులు విశ్వమందు ప్రభువులైన వన్నియును ఖచర కింపురుష దిగ్గజ సురారి, కులశైల నద నదీ జలధి వేదపురాణ పన్నగాదులు సభలో ప్రత్యక్షమై ఆ కొలువులో సేవలు చేయగా,

చ॥ త్రిభువనపాలన ప్రకటదీక్ష నచంచలవైభవంబునన్
ప్రభుత వహించి యీ భువన భార దురంధర సంపదోన్నతిన్
యభిమతసిద్ధి విస్ఫురణ నాత్మమహత్వము నాకు నాకె స
న్నిభమిక నెందు లేరనుచు నిశ్చలమై యొక వృత్తిదోచినన్ 246

అర్థాలు : త్రిభువనపాలనప్రకటదీక్షన్= మూడు భువనములను పాలించుటలో రూపుగట్టిన దీక్షతో, భువనభారధురంధరసంపదోన్నతిన్= భువనముల భారములను మోయుసంపద వృద్ధిచే, అభిమతసిద్ధి= కోర్కెలను దీర్చు, విస్ఫురణన్= స్ఫూర్తితో, ఆత్మమహత్వము= నా గొప్పదనము, సన్నిభము= సాటి, వృత్తి= నడవడిక.

భావము : "మూడు లోకాలను దక్షతతో వైభవముతో పాలించితిని. ఇట్లు భారము వహించుటచే నా గొప్పతనమునకు సాటిలేదను నిశ్చయముతో నా నడవడిక ప్రవర్తించినది. ముల్లోకములందు గొప్పవారు లేరని నాకు తోచినది.

ఆ॥ పొంగి సంతసించి భూరి యహంకార
పటిమ గర్వమడరి ప్రభుడ నేనె
కాని లేరు ముజ్జగంబుల నని మది
దోచె విశ్వ వినుత తోయజాక్షి! 247

భావము : "ఓకాంతా! అతిశయించిన సంతసముతో, అహంకార బలముతో గర్వము కలిగి నేనే ప్రభువును అని తోచినది."

క॥ ఈ రీతి దోచి నంతనె
బోరున యశరీరవాణి భూరితరసభా
వారము వినుచుండ దగన్
చేరుకొని వచించె దివ్యభేరి ధ్వనితోన్ 248

అర్థాలు : బోరున= బిగ్గఱగా, అశరీరవాణి= శరీరము లేనిదైన శబ్దము మాత్రము (ఆకాశవాణి), భూరితరసభావారము= గొప్ప సభలోనున్న మేమందఱము, పేరుకొని= పిలిచి, విషయమును ప్రస్తావించి, దివ్యభేరిధ్వనితోన్= దేవలోకపు దుందుభి మ్రోగినట్లు.

భావము : "ఇట్లు నేను తలంచినంతనే ఆకాశమునుండి భేరులు మ్రోగునట్లు, మాటలు వినిపించినవి."

క॥ వింటివె విధాత నీ మది
నంటిన దుర్గర్వమెడయ నరిదిగ దానిన్
గెంటించు బహువిధంబుల
తంటలదుఃఖముల నింక తగులకు సుమ్మీ 249

అర్థాలు : ఎడయ= తొలగిపోగా, అరిదిగ= సహింపక, గెంటించు= నెట్టివేయుము, తంటల= అధర్మముల, చిక్కుల, వంచనలకు, తగులకు= చిక్కుకొనకు.

భావము : "ఓ బ్రహ్మ! విన్నావా నీ మదినుండి సహింపరాని గర్వమును విడిచిపెట్టుము. చిక్కుల వలన కలుగు దుఃఖములకు నీవు వశము కావద్దు."

క॥ వలవదు దురహంకారము
బలియులు బహుజనులు దీన భ్రష్టయిరి వృథా
కలక మది మాని తగ నా
పలుకుల గతి దీని విడిచి బ్రతుకుము వత్సా 250

అర్థాలు : వలవదు= వద్దు, బలియులు= బలవంతులు, బహుజనులు= అనేకులు, దీన= ఈ దురహంకారమువలన, భ్రష్టయిరి= చెడిరి, కలక= కలత.

భావము : "ఓ వత్సా! చెడ్డదయిన అహంకారమును వదలి నేను చెప్పినట్లు జీవింపుము."

తే॥ అదియు నెట్లన్న వినుము మహాత్ముడొకడు
భర్మడను పేర వెలయును బ్రహ్మవేత్త
యోగవిద్యాధురంధరు డున్నవాడు
మేరుగిరి గుహ జనగ సంప్రీతిజేయు 251

భావము : "భర్మడను పేరుగల బ్రహ్మవేత్త మేరు పర్వతగుహలోనున్నాడు. యోగవిద్యా నిపుణుడు. నీవు అచ్చటకు పొమ్ము. నీకు సంతోషము కలుగును."

సీ॥ అనిన సభాసదులందరు విని మది
నాశ్చర్యమును జెంది యనిరి నన్ను

యిది యేమి సర్వేశ యీ నభోవాక్యంబు
తలచితే యేమైన తలపులోన
ననిన నే భయమంది యమ్మహామునులతో
నంటి నింతయు నిజమాత్మలోన
త్రిభువనసామ్రాజ్యవిభవగర్వితుడనై
ప్రభుడ నేననునట్టి భావవృత్తి

తే॥ తోచుటయె నిక్కమని దిగ్గ లేచి నేను
సర్వసభికుల వీడ్కొని సరగ మునుల
తోన జని మేరువంతయు మ్రొక్కి చూచి
తద్గుహద్వార మొయ్యన దరియ జొచ్చి 252

అర్థాలు : నాత్మలోన= నా మనస్సులో, త్రిభువనసామ్రాజ్యవిభవగర్వితుడనై= మూడు లోకముల సామ్రాజ్యవైభవముచే గర్వించి, ప్రభుడ= స్వామిని, భావవృత్తి= భావవికారము, తోచుటయె= కలుగుటచే, సరగ= త్వరగా, తఱియచొచ్చి= సమీపించి.

భావము : "ఓ ప్రభూ! ఆకాశవాణి మాటలు విన్నారుకదా! ఏమని తలంచితిరి" అనగా నేను గర్వించుట నిజము కనుక వెంటనే లేచి త్వరగా మేరు పర్వతము చేరి మ్రొక్కి దాని గుహ ద్వారము సమీపించి,"

వ॥ బహుప్రకారంబుల సన్నుతించిన నమ్మహానుభావుండు ప్రసన్నుడై వందనంబు లొనర్చినిలిచి యున్నంగనుంగొని కూర్చుండ నియమించి యిట్లనియె 253

భావము : "పెక్కు విధముల స్తుతింపగా, ఆ మహానుభావుడు ప్రసన్నుడయ్యెను వందనములు అర్పించిన నన్ను చూచి కూర్చుండ నిచ్చి ఇట్లనెను."

చ॥ తలపున నేమి గోరితి విధాతవు నీవు జగత్ప్రభుత్వమున్
వెలయు ఘనుండవయ్యు నను వేడ కొఱంత యొకింత గల్గనే

తెలియగ నీచ దేహమున ద్రిమ్మరువాడను నిత్యకాయుడన్
జలగతబుద్బుదస్థితిని చంచల జీవితవర్తి నెంతయున్ 254

అర్థాలు : తలపున= మనస్సులో, విధాతవు= బ్రహ్మవు, కొఱత= లోపము, న్యూనత, త్రిమ్మరువాడను= తిరుగుచుండువాడను, జలగతబుద్బుదస్థితిని= నీటిలోని బుడగ వలె, చంచలజీవిత వర్తిని= నిలుకడలేని జీవితములో ప్రవర్తించుచుండువాడను, అనిత్యశరీరకాయుడన్= నశించు శరీరము కలవాడను.

భావము : "ఘనుడవు నీవు. నన్ను కోరవలసి వచ్చుటకు ఏదైనా కొఱత ఉన్నదా? నశించు శరీరము కలవాడనై నీటి బుడగవంటి నిలుకడ లేని జీవితముతో మెలగుచున్నాను."

తే॥ ఏమికారణంబు ఈ మహామునులతో
వచ్చినాడవష్టవదన యనిన
కరయుగంబుమోడ్చి పరమ పావన విను
మనుచు నిట్టు లంటి వినయమునను 255

భావము : "ఎనిమిది తలలు గల బ్రహ్మదేవా! ఏల వచ్చితివి అని అడుగగా ఈ మహామునులతో ఇట్లు పల్కితిని."

చ॥ త్రిభువనసృష్టి వైభవ విధిజ్ఞత నా మదిదోచె నేనె పో
ప్రభుడ నటంచు నందుకు సభాసదులందరు వించునుండగా
నభము వచించె నీ మదిని నాటెను గర్వము దాని బాసితే
నభయుడ వౌదు కాని యెడ నంధతమంబున జిక్కు దెంతయున్ 256

అర్థాలు : త్రిభువనసృష్టివైభవవిధిజ్ఞత= మూడులోకముల సృష్టియొక్క వైభవమును విధించు (నిర్ణయించు) వాడను నేనే యను జ్ఞానము, ప్రభుడ= సర్వాధికారిని, పాసితే= తొలగితే, అభయుడ వౌదువు= భయములేనివాడవ గుదువు.

భావము : "నేనే మూడులోకాలకు ప్రభువునని వైభవముతో నుండగా ఆకాశవాణి, గర్వమును వదలితే భయములేని వాడవగుదువు. కానియెడల చిమ్మచీకటిలో చిక్కి బాధపడెదవు."

క॥ కావున నీదుర్వాసన
దేవనగావాసి భర్మ ధీనిధి తెలుపం
గా విను మంచును బలికిన
నే వచ్చితి కరుణ సేయు నిర్మలచరితా 257

అర్థాలు : దుర్వాసన= చెడు సంస్కారమును గుఱించి, దేవనగావాసి= మేరు పర్వతమున నివాసముండు నట్టి, భర్మధీనిధి= భర్ముడని పేరుగల బుద్ధిశాలి.

భావము : "నీలోని చెడ్డతనమును గుఱించి, మేరుపర్వత నివాసి, బుద్ధిశాలి తెల్పగా వినుము, అనుటచే ఇచ్చటికి వచ్చితిని. ఓ పవిత్రుడా! కరుణింపుము."

వ॥ అనిన నమ్మహానుభావుడిట్లనియె నిందుకు మత్పూర్వ చరిత్రంబు గలదు
దాని విన నీయహంకారంబు దీరునని యిట్లనియే 258

అర్థాలు : కమలభవాండంబు= బ్రహ్మాండము, విశ్వము, ధర= భూమిపై, ధరణిసురుని= బ్రాహ్మణుని, భర్మధర్మాఖ్యుల= భర్ముడు, ధర్ముడు అనుపేర్లతో, సంసారకాంక్ష= సంసారముపై కోరికను ఎడలి= విడిచి, దైవవశత= దైవనిర్ణయము ప్రకారము, మహిత= గొప్ప, శృంగార= అందమైన, బాలభాస్కరతేజోవిశాలమూర్తి= ఉదయించిన సూర్యుని కాంతితో వ్యాపించిన తేజస్సంపన్నుని.

భావము : ఆ భర్ముడు ఇట్లనెను. "నా పూర్ణచరిత్రమును వినుము దానిని విన్నచో నీ అహంకారము తొలగును" అని ఇట్లు వచించెను.

సీ॥ గతకాలముననొక్క కమలభవాండంబు
ధర సౌమ్యుడను నొక్క ధరణిసురుని

కూర్మినందనులము ధర్మధర్మాఖ్యుల
బరగిన వారము బాల్యమాది
దుర్వర్తనము లేక సర్వసమ్మతముగా
సంచరింతుము చాల సఖ్యమునను
కొన్నినాళ్ళకు మాదు జనకుండు పరలోక
గతుడైన సంసారకాంక్ష యెడలి

తే॥ ధరణి దిరుగంగ నొకచోట దైవవశత
మహిత శృంగార ఋష్యాశ్రమ స్థలమున
బాలభాస్కర తేజో విశాలమూర్తి
గంటి మొయ్యన శోణకాఖ్యాతమౌని 259

భావము : సౌముద్యను మునికి ధర్మధర్ములను పేరుగల మేము కుమారులము. మేము చక్కని నడవడికతో స్నేహముతో నడచుకొంటిమి. మా తండ్రి గతింపగా మేము సంసారకాంక్ష లేని వారమై తిరుగుచుండగా ఒక ఋష్యాశ్రమ మందు బాలసూర్యునివలె తేజముగల "శోణకుడు" అను పేరుగల మునివరుని చూచితిమి."

క॥ కనుగొని మే మామునిపద
వనజాతద్వంద్వమునకు వందనములు చే
సిన గనుగొని మీరెవ్వా
రని యడిగిన పూర్వవివరమంతయు దెలుపన్ 260

భావము : అతని పాదపద్మములకు నమస్కరించి మా పూర్వచరిత్రమును తెల్పగా

ఆ॥ కరుణ జూచి శిష్యగణములలో చేర
గా ననుగ్రహింప కలసి భక్తి
మిగులసేవ సేయ మెచ్చి యాశోణక
మౌని మదిని ప్రేమ బూని పిలిచి 261

భావము : ఆ ముని దయతో శిష్యులుగా చేర్చుకొనగా భక్తితో సేవచేసితిమి. అతడు మెచ్చుకొని ప్రేమతో పిలిచి యిట్లనెను.

ఉ॥ మామకశిష్యులెల్లనొక మంత్రము తంత్రము తత్త్వమార్గమున్
తాముపదేశమై కణక తత్క్రియ లభ్యసనంబు సేయుచున్
సేమము నొంది రెంతయు విశేషము మీ మదినేమి గోరినా
రో మతిమంతులార! కొమరుల్ తగ దెల్పుడు ఈప్సితంబనన్ 262

అర్థాలు : మామక= నాయొక్క, కణక= పూనికతో, తత్క్రియలు= ఆయా మంత్ర, తంత్ర తత్త్వమార్గములను, ఈప్సితంబు= కోరిక.

భావము : "పూర్వము నా శిష్యులు ఉపదేశమును పొంది నేను చెప్పిన కర్మలను చేసి సుఖమును పొందిరి. ఓ వివేకులారా! మీరు ఏ విశేషమును కోరుచున్నారు? మీకోరికలేమి? తెల్పండి."

క॥ వినుడు వివాహము విద్యయు
ధనమున్ సంపదలు సుతులు ధరణియు మఱియున్
ఘనలోకాంతరపదవులు
విను తగ సిద్ధులును నెవ్వి వేడిననిత్తున్ 262

అర్థాలు : ఘనలోకాంతరపదవులు= గొప్పవైన ఇతరలోకముల అధికారస్థానములు, సిద్ధులును= ఎనిమిది సిద్ధులుగా చెప్పబడిన అణిమాదులు

భావము : "మీరు ఏది కోరినను వివాహము, విద్య, ధనము, సంపదలు, సుతులు, పుడమి, పరలోక పదవులు, ఇచ్చెదను."

వ॥ అనిన విని 264

భావము : అనగా విని, (వారిట్లు కోరిరి)

చ॥ కరములు మోడ్చి యో మునిశిఖామణి యో కరుణా విధేయ! మీ
చరణ సరోజ సేవ యిది చాలదె సర్వశుభప్రదాయకం
బురుతరముక్తి సంఘటిత మొక్కటి వేఱె ఫలంబు గోరగా
కొరత మనంబునం గలదె క్రూరభవాటవి దావపావకా 265

అర్థాలు : మునిశిఖామణి= మునులకు తలమానికమైనవాడా!, చరణసరోజసేవ= పాదపద్మములను సేవించుట, సర్వశుభప్రదాయకంబు= అన్ని శుభములను ఇచ్చునది. ఉరుతరముక్తిసంఘటితము= అన్నిటికంటెను ముక్తిని ప్రసాదించునది, కొఱత= లోటు, క్రూరభవఅటవీదావకపావక= సంసారము అనబడు అరణ్యములకు కార్చిచ్చు వంటివాడా!

భావము : "ఓ మునివరా! మీ పాదసేవయే చాలును. మఱొకటి కోరుటకు లోటు ఉండునా? బాధించు సంసారమనెడి అడవిని కాల్చు అగ్నీ!"

క॥ మీరానతిచ్చినవి సం
సారాంధతమఃప్రవృద్ధి జలదంబులు ని
ష్కారణ శాత్రవులని ముసు
పేరోసి భవత్పదంబు ప్రేమం గనుటన్ 266

అర్థాలు : ఆనతినిచ్చినవి= పేర్కొనినవి, వివరించినవి, సంసారాంధతమః ప్రవృద్ధిజల దంబులు= సంసారము అను కటికచీకటిని వృద్ధిచేయు మేఘములు, నిష్కారణశాత్రవులు= కారణములేని శత్రువులు, మునుపే= అన్నిటికంటె ముందుగనే, రోసి= అసహ్యించుకొని, వదలి, భవత్పదంబు= తమ పాదములను (ఆశ్రయమును).

భావము : "మేము ఇతరములైన వానిని వదలి మిమ్ము చూచి మీ పాదములను ప్రేమతో సేవించుటకై వచ్చితిమి."

ఆ॥ మిమ్ము నాశ్రయించి యిమ్ముల సంసార
వాంఛసేయు వెర్రివా డు గలడె

చాలు నాదిలేని సంసారభారంబు
మోయజాల మయ్య మునివరేణ్య! 267

అర్థాలు : ఇమ్ముల= ప్రీతితో, సంసారవాంఛచేయు= సంసారమును కోరుకొనునట్టి, ఆదిలేని= మొదలులేని, మోయజాలము= మోయలేము, మునిరేణ్య= మునులలో శ్రేష్ఠుడా!

భావము : "ఓ మునివరా! మిమ్ము ప్రేమతో చేరినవాడు సంసారమును కోరు వెఱ్ఱివాడు కలడా? సంసారభారమును మోయలేము."

వ॥ అది యెట్లంటేని 268

భావము : "సంసారము" ఎట్టిదో దయతో వినండి.

సీ॥ వదనదుర్గంధసంవర్ధితాధరలాల
తియ్యని యమృతంపు తేట యనుచు
కక్షజాతస్వేదకర్దమరోమాళి
కాంచనమయకనత్కణము లనుచు
రక్తదుర్మాంసచర్మస్ఫురద్గంధులు
చన్నులు బంగారు గిన్నె లనుచు
మలగర్తదుర్గంధ కలిత మూత్రద్వారమొగి
మృదువగురావి చిగుర టంచు

తే॥ నరము లెమ్ములు ప్రేవులు పలల మెనయు
మురికితోల్తిత్తి తొలకరి మెఱుప టంచు
హేయముల కెల్ల నిల్వలౌ యింతులందు
బద్ధమతులకు నిహమును బరము గలదె 269

అర్థాలు : వదనదుర్గంధసంవర్ధితాధరలాల= నోటిదుర్వాసనతో వృద్ధియగు పెదవులనుండి కారు లాలాజలము(ఉమ్మి), కక్షజాతస్వేదకర్దమరోమాళి=

చంకలో పుట్టిన చెమట అనెడి అడుసులో వెంట్రుకలు, కాంచనమయ కనత్కణములు= బంగారు మేల్మిగా వెలుగు రజము, రక్తదుర్మాంసచర్మ స్ఫురద్గంధులు= రక్తము, మాంసము, చర్మము, వీనితో వెల్వడు, మలగర్తదుర్గంధకలితమూత్రద్వారము= మలముతోడి గుంటయైన దుర్వాసన గొట్టములు గల విసర్జన ద్వారము, ఒగి= చక్కని, మృదువగు= మెత్తని, ఎమ్ములు= ఎముకలు, పలలము ఎనయు= మాంసము కలిసిన, తోల్తిత్తి= తోలుతోచేసిన సంచి, హేయములు= అసహ్యముగనుండునవి, ఇంతులందు= స్త్రీలపై, బద్ధమతులకు= గట్టిగా నిలిచిన బుద్ధి కలవారికి, ఇహమును= ఈలోక సుఖమును, పరమును= పరలోక సుఖమును కలుగునా?

భావము : "పెదవుల నుండి వెల్వడు ఉమ్మి అమృతమనుచు, చంకలనుండి జారిన చెమటనీరు గల బొడ్డుపై వెంట్రుకలు, బంగారుపొడు మనుచు రక్తము, మాంసములతో నిండి వెలిగెడి బలమైన చన్నులు బంగారు గిన్నెలనుచు, దుర్వాసన గల మూత్రద్వారము(యోని) రావిచెట్టు చిగురులనుచు, నరములు, శరీరము, ఎముకలు, ప్రేగులు, మాంసము, కలిసిన తోలుతిత్తి తొలకరి మెఱపుతీగ యనుచు సహింపరాని వానికి నెలవులైన వనితలందు లగ్నమైన వానికి ఇహమును పరమును - ఎట్టి సుఖమును కలదా?"

ఆ॥ ఇట్టి హేయమునకు నెంతయు భ్రమజెంది
దున్ని దోకి తిరిగి దోరగిల్లి
పడనిపాట్ల బడుచు కడతేరగా లేని
విపులదుఃఖ మనుభవింపలేము 270

అర్థాలు : హేయమునకు= అసహ్యకరమైనదానికై, దున్ని= శ్రమించి, దోకి= పాకులాడి, తిరిగి= నిలకడ లేక, దోరగిల్లి= వ్రాలి(కృశించి), కడతేరగాలేని= బైటబడలేని, తప్పించికొనలేని, విపులదుఃఖము= పెక్కుచింతలు.

భావము : "ఇట్లు హీనమైన జీవనమునకై చలించి సంసారమనెడి పుడమిని శ్రమించి (దున్ని) దాని వృద్ధికై పాకులాడి అడ్డంకులను తొలగించుకొని (భూమిపై నున్న మొక్కలను చెక్కివేసి) నిలకడలేక సంచరించి, సరియైన ఫలము లేకపోవుటచే నీరసించి కృశించి వ్రాలిపోయి(బోరగిల్లి) సహింపలేని కష్టములను పడుచు, తప్పించుకొనజాలని పెక్కు చింతలు గలుగు దుఃఖములను మేము అనుభవింపలేము."

విశేషము : సంసారము సేద్యము వంటిది. ఇచ్చట ఉపమానము చక్కగా అమరినది.

తే॥ అనిన గరుణించి మేలు మాయన్నలార!
మంచిమార్గంబు తెలియ మీ మనసు లెస్స
సర్వమయుడగు శ్రీహరి చరణసేవ
కన్న మరి లేదు ముక్తికి నఖిలమునను 271

భావము : అనగా, ఆ ముని దయతో "మంచిమార్గమును తెలిసికొనుట చాలా మంచిది. ఓ వత్సలారా! విశ్వమందు సర్వమయుడైన హరిపాదసేవ తప్ప ముక్తికి మఱొకటిలేదు."

క॥ హరిభక్తిగాని హృదయము
పరిశుద్ధము గాదు హృదయ పరిశుద్ధములే
కరయడు తానెవ్వడ నని
యరయక సద్గురు కటాక్ష మబ్బునె యొకటన్ 272

భావము : "హరిభక్తి లేని హృదయము శుద్ధము గాదు. తాను ఎవరో హరిభక్తి లేనివాడు తెలిసికొనలేడు. తానెవరో తెలిసికొనని వానికి గురువుయొక్క కడగంటి చూపు దయ లభించునా?'

ఆ॥ గురుని కరుణగాని కూడదు తన్ను దా
దెలియనట్టి మహిమ నలువకైన

తన్ను దెలియు తెలివి తత్త్వంబు నదిముక్తి
గాన తెలియ వినుడు గట్టిగాను 273

భావము : "గురువు కరుణ వలననే కాని, తానెవరో తెలిసికొను తెలివి బ్రహ్మకైనను ఒనగూడదు. తన్ను తెలుసుకొను తెలివి యొక్క మనస్సే ముక్తి. కావున చక్కగా దానిని తెలుసుకొనుటకై నిశ్చలమైన బుద్ధితో వినండి."

వ॥ అని నారాయణాష్టాక్షరీ మంత్రంబు మాకిద్దరికి రహస్యంబులుగా నుపదేశంబు చేసి తన్మూర్తి సర్వమయుండును సర్వపూర్ణుండు గావున సర్వమయుండును గగనసదృశుండునుంగా ధ్యానంబు సేయుచు తన్మంత్రంబు నిరతంబు జపంబు గావింపుచుండుడని యానతిచ్చిన నానందంబు నొందగా నేనుంట మదీయా నుజుండగు ధర్ముండు గురుస్వామి కిట్లనియె 274

అర్థాలు : నారాయణ+అష్టాక్షరీమంత్రంబు= "ఓం నమో నారాయణాయ" అను ఎనిమిది అక్షరములు గురూపదేశము వలన శ్రద్ధాళువునకు మంత్రమై రక్షసేయును, తన్మూర్తివ ఆ మంత్రమునకు అధిష్ఠానదేవత, సర్వమయుండువ అన్నియు తానే అయినవాడు, సర్వపూర్ణుండువ అన్నింటిని తనలో నిమిడ్చికొనినవాడు, గగనసదృశుండునుంగావ ఆకాశమును పోలినవానినిగా, నిరతంబువ ఎడతెగక, మదీయ అనుజుండగువ నాతమ్ముడైన.

భావము : "అష్టాక్షరీ" మంత్రము ఉపదేశించి జపము కావింపు మని ఆనతిచ్చెను. అప్పుడు ధర్ముడు ఆస్వామికి ఇట్లనెను.

విశేషము : ఓమ్ నారాయణాయ (ఓమ్ వాసుదేవాయ). శ్రీ విష్ణు సహస్రనామస్తోత్రము. ఇది మహామంత్రము - రచన వేదవ్యాసుడు. అనుష్టుప్ ఛందస్సు. శ్రీ మహావిష్ణువు పరమాత్మ ఈ దైవము నిర్గుణ బ్రహ్మము. శ్రీమన్నారాయణుడు దేవత. దైవము, సగుణ బ్రహ్మము. ఇది శ్రీమద్

మహాభారతము అనుశాసనిక పర్వమున, భీష్ముడు, ధర్మరాజునకు ఉపదేశించెను. విష్ణు సహస్రనామ స్తోత్రధ్యానము మోక్షప్రాప్తికి సాధనము.

ఆ॥ అఖిల పూర్ణుడనుచు నంబరాకృతియంచు
నట్టి దగును శ్రుతులు నట్ల పలుకు
అట్టి మూర్తికొద్ది యంతరంగంబున
నిలుపు టెట్లు లెస్స తెలుపు మనిన 275

అర్థాలు : అఖిలపూర్ణుడనుచు= అన్నిటితో గూడియున్నవాడనుచు, అంబరాకృతి= ఆకాశమే ఆకారముగా గలవాడు, శ్రుతులు= వేదములు, కొద్ది= చిన్నదైన, అంతరంగబున= మనస్సులో, నిలుపుటెట్లు= భావించుటెట్లు.

భావము : "మనస్సు చిన్నది, విష్ణుని ఆకారము చాలా పెద్దది కదా, చిన్నదానిలో పెద్ద ఆకారమును నిలుపుట సాధ్యమా? అనుదానిని తెల్పుము."

ఉ॥ అంతకు జాలకున్న విను మాత్మ సరోరుహకర్ణికోపరిన్
శాంతదయాప్రపూర్ణదరచక్రగదాంబుజహస్తశోభితున్
సంతతయౌవనున్ కుసుమసాయకకోటి విలాసమూర్తి శ్రీ
కాంతు నితాంతభూషణుని కాంచనవాసు విలాసుగా మదిన్ 276

అర్థాలు : అంతకుచాలకున్న= విష్ణుని ఆకాశరూపునిగా భావించి నీ మదిని నిల్ప లేకున్నచో, ఆత్మసరోరుహకర్ణికోపరిన్= సహస్రారమను పద్మముయొక్క మధ్యగల పీఠముపైన, శాంతదయాప్రపూర్ణ= శాంతము దయ నిండుగా గలవానిని, దరచక్రగదాంబుజహస్తశోభితున్= శంఖము, చక్రము గద పద్మముగల చేతులతో వెలుగొందువానిని, సంతతయౌవనున్= ఎల్లప్పుడు (నిత్య) యౌవనుడైనవానిని, కుసుమసాయకకోటివిలాసమూర్తి= కోటిమంది మన్మథులతో సమానమైన సౌందర్యమూర్తిని, శ్రీకాంతు= లక్ష్మీదేవికి భర్తయైనవానిని, నితాంతభూషణుని= సంపూర్ణముగ అలంకరించుకొనిన వానిని, కాంచనవాసు= బంగారు వస్త్రము యొక్క, విలాసునిగా= శోభకల వానినిగా.

భావము : "వినుము. అట్టి విశ్వాకారుని మనస్సులో నిల్పలేకున్నచో సహస్రార పద్మము పీఠముమీద, శాంతుని, దయగలవానిని శంఖ చక్రాదులను ధరించిన వానిని, నిత్యయౌవనుని, సుందరమూర్తిని, లక్ష్మి భర్తను, అలంకారములను గల వానిని, బంగారు వస్త్ర కాంతి గలవానిని'

ఆ॥ పాదుకొల్పి నియత భక్తి పూజావిధి
చేత తత్పదాంబుజాతలగ్న
మానసుండ వగుచు మంత్రంబు జపియింప
గలుగు తత్కటాక్షగరిమ నీకు 277

అర్థాలు : పాదుకొని= నిల్పుకొని, నియతభక్తిపూజావిధిచేత= శాస్త్రములు, సంప్రదాయము సిద్ధపరచిన విధానములను భక్తితో షోడశోపచారములతో, పూజను చేయుటచేత, తత్పదాంబుజాతలగ్నమానసుండవు= ఆవిష్ణుని పాదపద్మములయందు మనస్సును నిల్పినవాడవై.

భావము : "గట్టిగా నిల్పుకొని, నియమముతో పూజావిధులను ఆతని పాదపద్మములందు మనసుగలవాడవై ఆ మంత్రము జపియింపుము. ఆదేవుని కడగంటి గొప్పచూపు లభించును."

మ. అని బోధించిన సంతసించి గురువాక్య ప్రక్రియావర్తియై
చని భర్మాచలకంధరస్థలిని వర్షాకాలముం బైట శీ
తున నీరంబులలోన గ్రీష్మములయందుం జాల బంచాగ్ని మ
ధ్యను వెయ్యేండ్లు తపం బొనర్ప హరి ప్రత్యక్షంబుగా బ్రీతుడై 278

అర్థాలు : గురువాక్యప్రక్రియావర్తియై= గురువుగారు చెప్పిన పద్ధతిలో ఆచరించి, భర్మాచలకంధరస్థలిని= మేరుపర్వతము యొక్క గుహలో, శీతున= శీత(చలి)కాలములో,

భావము : శోణకముని బోధనవిని, సంతసించి, గురువు ఆదేశించినట్లు ఆచరించుచు, మేరుపర్వతగుహలో వర్షాకాలము వెలుపల, చల్లనికాలమున నీటిలో, ఎండకాలము అగ్నుల నడుమ కూర్చొని వెయ్యేండ్లు తపస్సు చేయగా హరి ప్రత్యక్షమయ్యెను.

విశేషము : వేసవిలో పంచాగ్నుల మధ్య అనగా నాల్గు దిక్కులందు అగ్నిని ఉంచి ఎండలో సూర్యుని వేడిమి సోకుచుండగా తపము చేయుట ఒక నియమము.

ఉ॥ వందన మాచరించి శ్రుతివాక్యములన్ నుతి చేసినంత గో
విందుడు సంతసించి దయ వేడుము వత్స మనోరథంబు నిం
పం దగ నిత్తు నన్ననతడర్మిలి వేడ పితామహత్వమా
నందముతోన నిచ్చి చన నాతడొకండములోన బ్రహ్మయై 279

అర్థాలు : శ్రుతివాక్యములన్= వేదవాక్యములతో, నుతి= స్తోత్రము, అర్మిలి= మనసార, వేడ= కోరగా, ఇంపు అందగ= ఇష్టమగునట్లు, పితామహత్వము బ్రహ్మత్వము, బ్రహ్మయగు స్థితిని, అండములోన= బ్రహ్మాండములో

భావము : నమస్కరించి వేదవాక్యములతో స్తుతింపగా గోపాలుడు సంతసించి 'నీకోరికను నీ యిష్టమునకు తగినట్లు ఇచ్చెదను' అనగా బ్రహ్మ పదవిని కోరెను. దానినిచ్చెను. ఆతడు ఒక అండమునకు బ్రహ్మ అయ్యెను.

చ॥ సమధికసృష్టి నిర్మితి విశారదుడై పదునాల్గులోకముల్
తమమున నేలుచుండి త్రిజగత్ప్రభుతన్ మది విఱ్ఱవీగుచో
నమరమునీంద్రపన్నగదిశాధిపముఖ్యులు గొల్వ కొల్వులన్
సముచితలీల నుండగ ప్రసంగవశంబున లోకనాథులన్ 280

అర్థాలు : సమధికసృష్టినిర్మితి= గొప్ప సృష్టిని చేయుటలో, విశారదుడై= సమర్థుడై, తమమున= తమోగుణవృద్ధిలో, ప్రసంగవశంబున= సంభాషణ క్రమమున.

భావము : పదునాల్గు లోకాలను పాలించుచు, మూడు లోకాల పాలనచే తమోగుణముచే నిండి గర్వముతో నిక్కుచుండగా అందఱు నిండియున్న కొల్వులో లోకనాయకుల గూర్చి ప్రసంగము వచ్చెను.

చ॥ వరుసగ నెన్నుచో బరమవైష్ణవముఖ్యుడు విష్ణుశర్మదా
హరిబ్రణుతించుచోట జగదాఢ్యుడు సర్వమయుండు సర్వసం
భరితుడు సర్వసాక్షిభవపాశ విముక్తుడు వాని మాయచే
దరి గనలేరు శంభుముఖ దైవము లందఱు నామమాత్రులై 281

అర్థాలు : జగత్+ఆఢ్యుడు= జగమున సంపన్నుడు, సర్వసంభరితుడు= అన్నిటితోను, అన్నిటను నిండియున్నవాడు, సర్వసాక్షి= అన్నిటిని చూచుచుండువాడు, భవపాశవిముక్తుడు= సంసారబంధముల నుండి విడుదల పొందినవాడు, దరి= ఒడ్డును, శంభుముఖదైవములు= శివుడు మొదలైన దేవతలు, నామమాత్రులై= పేరుకు మాత్రము శక్తిమంతులు.

భావము : మాటల సందర్భమున లోకనాయకులను లెక్కించునపుడు విష్ణుశర్మ- విష్ణువును స్తుతించునపుడు "అతడే అందఱికంటె గొప్ప. అతని మాయను ఎవరూ చూడలేరు. శివుడు మొదలైన వారు అతనితో పోల్చగా బలము లేని వారే!"

ఆ॥ విష్ణుమయము సుమ్ము విశ్వంబిదెంతయు
విష్ణుకన్న మఱియు వేల్పులేడు
విష్ణుశబ్దముననె విశదమై యుండంగ
వేరె పొగడ నేల విష్ణుమహిమ 283

భావము : "విశ్వము విష్ణుమయము. విష్ణువు కంటె గొప్పదేవుడు లేడు. విష్ణువను పేరులోనే సర్వవ్యాప్తి అని విశదము కదా! వేఱుగా అతనిని పొగడవలెనా?"

వ॥ అన శివశర్మయిట్లనియె 284

వచనము : అనగా శివశర్మ యిట్లనెను.

మ॥ శివుడే దైవముగాక వేరెయొకనిం జెప్పంగ రాదెంతయున్
శివుడే కాడె ప్రపంచమంతయును భస్మీభూతముం జేసి యు

త్సవ లీలన్ నటియించు నంతమున భాస్వల్లీల నట్లౌటగా
ప్రవచించెన్ లయకాల రుద్రుడని శుంభత్కీర్తి లోకంబులన్ 285

అర్థాలు : భస్మీభూతమున్= బూడిదగా, ఉత్సవలీలన్= ఉత్సాహముతో, నటియించున్ అంతమున= ప్రళయ కాలమున నాట్యము చేయును, భాస్వల్లీల= ప్రకాశించునట్లు, శుంభత్కీర్తి= వ్యాప్తించిన కీర్తి.

భావము : "శివుడే గొప్పదైవము. విశ్వమును బూడిదగా చేసి తాండవనృత్యము చేయును. కనుక "లయకార రుద్రుడు" అని కీర్తి వచ్చెను గదా!"

వ॥ అని హరిహరతారతమ్యవిచారంబున విష్ణుశర్మ శివశర్మలు వాదింప నుభయ పక్షంబులునై సభవారు తదనుసరణ వాక్యంబు లుపన్యసింపుచు తన్ను దలపక యున్న ధర్మనామధేయ పితామహుండు విష్ణుశివశర్మల కిట్లనియే 285

భావము : శివకేశవుల భేదమును (హెచ్చుతగ్గులను) గుఱించి చర్చించుటలో, బ్రహ్మయైన తన్ను ప్రస్తావించక పోవుటచే ధర్ముడను పేరుగల బ్రహ్మ, విష్ణుశర్మ శివశర్మలతో ఇట్లనియెను.

క॥ హరి యేరీతి ప్రపంచము
పరిరక్షణ సేయుచుండు భవు డేరీతిన్
హరియించు సర్వజగములు
మఱియానిర్ణయము లేశమది యూహింపన్ 286

భావము : "తలపగా హరి కావించు విశ్వరక్షణము, శివుడు కావించు సర్వనాశనము అనెడి చర్యలు చాలా అల్పమైనవి."

శా॥ నే నిర్మాణము చేసినట్టులను మన్నించున్ లయించుం గడున్
గా నాఢ్యత్వముబొందిరాహరియు గంగా భర్తయున్ వారికిన్
గా నీరీతి వివాదమేల త్రిజగత్కర్తన్ ననుం జూడకే
నా నిర్మాణములోన నాఢ్యులు గదా నారాయణాదుల్ గడున్ 287

భావము : "నేను విశ్వమును సృష్టింపగా, అధికారము కలవారై హరియు, హరుడు రక్షణ, లయము కావింతురు. వారికై ఈ వాదమెందుకు? త్రిలోక కర్తయైన నన్ను గణింపక ఈ వాదమేల? నేనే అందఱికంటె అధికుడను. నా సృష్టిలోని నారాయణాదులు మిక్కిలి గొప్పవారే!"

తే॥ హరిహరుల తారతమ్యంబు లరయు చోట
సర్వకర్తృత్వమును జెప్ప జనదు మీకు
నుభయ కర్మంబులందున నుత్తమాధ
మములు లెక్కింప దగుగాని మౌనులార! 288

భావము : "మునులారా! హరి హరులవ్యత్యాసమును పరిశీలించునపుడు వారిలో ఒకరును సమస్తమునకు కర్తయనరాదు. ఇద్దఱు చేయు పనులలో ఏది గొప్పది, ఏది తక్కువది అని మాత్రమే చూడవలెను.'

వ॥ అనిన విని సభాసదులందరు విస్మితులై యేమియు ననంజాల కూరకున్నం
గనుంగొని విష్ణుశర్మ యిట్లనియె. 289

వచనము : అట్లు గర్వముతో ధర్ముడు పల్కగా, సభలోని వారు ఆశ్చర్యపడి ఊరకుండిరి.

క॥ మా మనసు తెలియు కొఱకై
యీ మాటలు బలికినారొ యిది నిజమో స
ర్వామర విద్వన్మౌని
స్తోమమునకు సమ్మతంబె చూడుడు తెలియన్ 290

భావము : అప్పుడు విష్ణుశర్మ ఇట్లనెను. "మా మనసులోని అభిప్రాయమును తెలిసికొనుటకై ఇట్లు అన్నారా? ఇదినిజమా? సర్వదేవతలకు, విద్వాంసులకు మునుల సమూహమునకు మీ మాటలు అంగీకరింపదగినవో చూడండి."

చ॥ హరిహరతారతమ్యముల నాగమశాస్త్ర పురాణ సంఘముల్
పరిపరి రీతులం దెలుప భక్తులు వారికి వారు పక్ష వి

స్ఫురణ నుతింపుచుండుదురు చూడరు మూలము ముట్టశాస్త్రముల్
హరిపరమాత్ముడౌటకు ననంతుడు విష్ణువునట్ల శ్లాఘ్యుడున్ 291

అర్థాలు : హరిహరతారతమ్యములు= విష్ణురుద్రుల హెచ్చుతగ్గులను, ఆగమశాస్త్రపురాణసంఘముల్= ఆగమశాస్త్రములు, పురాణములు, పరిపరిరీతులన్ తెలుప= అనేక విధములుగా చెప్పగా, పక్షవిస్ఫురణ= తమవాదమును సమర్థించుటకు, మూలము ముట్ట= లోతుగా, అనంతుడు= అంతములేనివాడు, విష్ణువు= సర్వవ్యాపి, శ్లాఘ్యుడున్= స్తుతింపదగినవాడు.

భావము : "శాస్త్రములు, పద్మ, విష్ణుపురాణాదులు హరిహరుల వ్యత్యాసములను పెక్కు విధములుగా తెల్పుచున్నవి. భక్తులు తమ పక్షములను సమర్థించుటకు నుతింతురు. లోతుగా విచారింపరు. హరియే పరమాత్మ. అంతములేనివాడు. సర్వవ్యాపియై స్తుతింపబడుచున్నాడు."

విశేషములు : ఆగమశాస్త్రములు: ఇవి శైవవైష్ణవాగమములుగ ప్రసిద్ధములు. దేవపూజా విధానమును, దేవాలయనిర్మాణాదిక్రమములును, దేవతామూర్తుల, ఆయుధ వాహనాదుల విషయములను సంప్రదాయకముగ నిర్ణయించి చెప్పు. శాస్త్రములు, మంత్రములు గూడా ఇందు భాగముగ కొందఱు పేర్కొందురు. "ఆగంతం శివవక్త్రేచ గతం చ గిరిజాశ్రుతిః" అనగా, శివుని ముఖమున వెలువడి పార్వతిచే వినబడినవి ఆగమములని ఒక సంప్రదాయ నిర్వచనము.

పురాణములు : "అజో నిత్యః శాశ్వతోయం పురాణః" అని భాగవత నిర్వచనము. అనగా, పుట్టుకలేనిది, నిత్యసత్యమైనది, శాశ్వతమైనది పురాణము అని భావము. పురాణములు పదునెనిమిది, వ్యాసనిర్మితములు. వీని లక్షణములు ఐదు (పురాణం పంచలక్షణం), 1) సర్గము (సృష్టి) 2) ప్రతిసర్గము 3) వంశము 4) వంశానుచరితము 5) మన్వంతరము. ఈ ఐదింటి వర్ణనలుండును. పదునెన్మిది పురాణములు : ఇవి

1.బ్రహ్మపురాణము, 2.పద్మపురాణము, 3. విష్ణుపురాణము, 4.శివపురాణము, 5.భాగవతపురాణము 6.నారదపురాణము, 7.మార్కండేయపురాణము, 8.అగ్నిపురాణము, 9.భవిష్యపురాణము, 10.బ్రహ్మవైవర్తపురాణము, 11.లింగపురాణము, 12.వరాహపురాణము, 13.స్కాందపురాణము, 14.వామనపురాణము, 15.కూర్మపురాణము, 16.మత్స్యపురాణము, 17.గరుడపురాణము, 18.బ్రహ్మాండపురాణము

ఆ॥ అందుకేమి వచ్చె నది యటులుండ ని
మ్మిపుడు మీరలానతిచ్చినట్టి
యుత్తరంబు చాల చిత్త సంక్షోభంబు
చేయుచున్న దేమి సేయువాడ 292

అర్థాలు : మీరలానతిచ్చినట్టి ఉత్తరంబు= మీరు చెప్పిన సమాధానము, చిత్తసంక్షోభంబు= మనస్సునకు కలవరపాటును.

భావము : "ఆ విష్ణువు సర్వాధికుడను విషయమును గూర్చి ఇంకేమియు చెప్పరాదు. అది అట్లుండ నిండు. మీ మాటలు నామనస్సుకు తీవ్రమైన బాధను కల్గించినవి. ఏమి చేయగలను?"

శా॥ సర్వజ్ఞుండవు స్రష్టవున్ సుగుణవున్ సద్బుద్ధివై యుండియున్
పూర్వాపూర్వము చింతసేయకనె తెంపున్ బూని యీ రీతిగా
గర్వగ్రస్తులు బల్కినట్లు బలుకంగా నీకు నాయంబటే
సర్వం విష్ణుమయం జగత్తనెడు శాస్త్రంబుల్ వృథల్ సేతురే 293

అర్థాలు : స్రష్టవున్= సృష్టించువాడవు, తెంపున్ పూని=తెగించి, గర్వగ్రస్తులు= గర్వించినవారు.

భావము : "అన్నియు తెలిసినవాడవు. ముందు వెనుకలు ఆలోచింపక గర్వించిన వారు పల్కునట్లు మాట్లాడుట తగునా! ఇది న్యాయ్యమా? "సర్వమ్ విష్ణుమయమ్ జగత్" అనెడి శాస్త్రములను తిరస్కరింతురా?'

ఆ॥ భక్తిచేత నేను బలుకంగనౌ సభా
సమ్మతంబు లే దసమ్మతంబు
సాధుమౌనిలోకసమ్మతంబగు నట్ల
పలికినాడ నిజము దెలిసి కొమ్ము 294

భావము : "విష్ణుభక్తి చేత నేను పలికితినన్నను. మీ మాటలకు సభ అంగీకరింపదు. మీమాటలు ఇష్టమైనవికావు. నేను సాధువులు మునులు మెచ్చుకొనునటుల వచించినాను. కాన నిజమును గ్రహింపుము."

క॥ నీదు ముఖాముఖినెవ్వరు
గాదనగా లేరుగాన కఠినోక్తులకున్
వేదములు పంచభూతము
లీ దిశ లెట్లోర్చు వ్రస్సి యెడయక యనినన్ 295

భావము : "మీ మాటలను, మీ ఎదుట మీ యెడ గౌరవముచే ఎవరును కాదనరు. మీ మాటలు చాలా కటువైనవి. వేదాలు, పంచభూతాలు దశదిశలు మీ అభిప్రాయాలను నిరాకరింపక ఎట్లు సహింపగలవు?" (మీ మాటలు తగినవికావు)

ఆ॥ కటములదర ధర్మక ప్రజాపతియిటు
లనియె నాత్మకోపమతిశయింప
విష్ణువెంతవాడు వినుము నీ వెంతవా
డవు మదీయ శక్తి దవిలి కాక 296

అర్థాలు : కటములు= చెక్కిళ్ళు, ధర్మకప్రజాపతి=ధర్మకబ్రహ్మ, తవిలి కాక= తగిలి కాక.

భావము : చెక్కిళ్లు అదరగా ధర్ముడు కోపముతో "విష్ణువు ఎంతవాడు? వినుము ఇట్లు తలచుటకు నీవు ఎవడవు? నీవును నాశక్తి చేతనే సృష్టింపబడితివని తెలిసి కొనుము."

క॥ సర్వము నేను సృజింపక
సర్వేశత్వంబు నాకు సమకూరునటే
పర్వని నానియమంబున
నిర్వాహముసేయ విష్ణునకు నెట్లగునో 297

అర్థాలు : పర్వని= వ్యాపించని, నియమంబున= ఏర్పాటులో(సృష్టిలో) అనగా నేను సృష్టిచేయనిచో, నిర్వాహముచేయున్=నిలబెట్టుటకు, విష్ణునకెట్లగునో= విష్ణువునకు సాధ్యమా?

భావము : "సర్వమును నేను సృష్టింపనిచో, సర్వేశ్వరత నాకు కల్గునా? సర్వమును సృష్టించుటచే సర్వేశ్వరుడనైనాను. నేను చేయని ఏర్పాటును విష్ణువు పాలింపగలడా?'

చ॥ వలని దురుక్తులుం బలుకవల్వదు లెమ్మిక చాలు చాలు నీ
కలిత వివేకముం దపము గానగ నయ్యెను ఇట్టి భక్తులున్
గలిగిన వేల్పులెందు కొఱగాములు నొందుటకుం గొఱంతలే
తలగుము నేను కోపమును తాళ నటన్నను మౌని యిట్లనెన్ 298

అర్థాలు : వలని= తగని, దురుక్తులున్పలుకవల్వదు= చెడ్డమాటలు (అసత్యములు) మాట్లాడతగదు, కలితవివేకమున్ తపము= పొందిన వివేకము, తపము, వేల్పులెందు కొఱగాములు నొందుటకున్ గొఱంతలే= దేవతలు దోషులగుటకు తక్కువేమి?, తలగుము= వెళ్లిపో!

భావము : "ఆసత్యములాడ వద్దు. నీ వివేకము, తపస్సు తెలిసినవి. నీవంటి భక్తులుండగా దేవతలు దోషులుకాక తక్కువగుదురా? వెంటనే వెళ్లిపో. కోపమును సహింపలేను" అని యిట్లనగా ఆ ముని బదులిచ్చెను.

ఉ॥ కోపము రాక మానునటె క్రూరమనస్కుల కెందునైన నీ
కోపమదేమి సేయు మది గొంకక విష్ణు నిరాకరించు నీ
పాప మహానిలోద్ధతిని బర్వి భవద్విభవాటవిం గడున్
కోపదవానలంబు దరిగొల్పక పోవునె దుర్మదాత్మకా! 299

అర్థాలు : క్రూరమనస్కులకు= దయలేని మనస్సుగలవారికి, కొంకక= సందేహించక, నిరాకరించు= త్రోసివేయు, పాపమహా అనిల ఉద్ధతిని పర్వి= పాపము అను గొప్ప వాయువు చెలరేగి, భవద్విభవఅటవిన్ కడున్= నీ వైభవము అనబడు అడవిని మిక్కిలి, కోపదవానలంబు= కోపము అను కార్చిచ్చు, దరిగొల్పక పోవునె= కాల్చివేయదా?, దుర్మదాత్మకా= మదము బలిసినవాడా!

భావము : "ఓ దురాత్మా! నీవు క్రూరమైన మనస్సు కలవాడవు. నీకోపము వలన ఏమి ప్రయోజనము. సంకోచములేక నీవు విష్ణువును నిరసించుచున్నావు. అది మహాపాపము. పాపమనెడి వాయు ప్రసారముచే నీ వైభవము అనెడి కార్చిచ్చు కాల్చివేయకపోవునా?"

క॥ సిరితొలగి నీవు వేగమె
తరుచరయోనిం జనించు ధారుణి ననుచున్
పరమ ముని శాపమిచ్చిన
పరమేష్ఠి దలంకి యిట్లు బలికెన్ బ్రీతిన్ 300

అర్థాలు : సిరి= సంపద, ప్రీతి= స్నేహము

భావము : "నీవు వెంటనే సంపదను విడనాడి చెట్లలో తిరుగువాడుగా పుడమిలో పుట్టుము" అని శాపమిచ్చెను. ఆ పరమేష్ఠి భయపడి స్నేహముతో ఇట్లనెను.

ఉ॥ నీకును శాపమిచ్చుటకు నేను సమర్థుడనౌదు నైననే
నాకగు శాపముం దలగ నా మది గోరిన వాడ గావునన్
నీకిక శాపమీయ విను నిష్ఠురమైన మదీయ శాపమున్
గైకొన పాయు నెప్పటికి గర్వ మడంగెను నన్నుగావవే 301

భావము : "నీవు నాకిచ్చిన శాపమునకు ప్రతిశాపము నే నియ్యగలను. కాని నాకు తగిలిన శాపమును బాపుకొనుట నా కోరిక. నీకు శాపమీయను. నేను

అనుభవించు శాపమెట్లు తొలగునో కదా! నా గర్వము నశించినది. నన్ను రక్షింపుమా!'

వ॥ అని దైన్యంబు నొంది వేడినను విష్ణుశర్మ గరుణించి యిట్లనియే 302

వచనము : అని దీనుడై వేడగా విష్ణుశర్మ దయతో ఇట్లనెను.

ఉ॥ మానితదేహివయ్యు హరిమన్నన వేలుపు మేను దాల్చియున్
మ్లానములేని బ్రహ్మ పద మొంది మదించి యెఱుంగ కింతలో
లేని యహంకృతిన్ హరిని లేశము మాత్ర గణింప కక్కటా
కాని దురుక్తులుం బలుకగా నిటు లయ్యెను చింత యేటికిన్ 303

అర్థాలు : మానితదేహివయ్యు= గౌరవింపదగిన, శరీరముకలవాడవై, హరిమన్నన్= విష్ణుని దయవలన, వేలుపుమేను= దేవ శరీరము, మ్లానము లేని= వాడిపోని, బ్రహ్మపమొంది= బ్రహ్మ పదవిని పొంది, లేశము మాత్ర గణింపకక్కటా= కొంచెమైనను లెక్క చేయక ఔరా!, కాని దురుక్తులున్= తగని చెడ్డ మాటలను, చింత= విచారము.

భావము : "గౌరవింప దగిన శరీరము కల దేవుడవై, ఎల్లప్పుడు వికసించు బ్రహ్మ పదము పొంది, మదించి హరిని దూషించుటచే ఇట్లయితిరి. చింత ఏల?"

క॥ తరుచరయోనిం బుట్టియు
హరిభక్తిస్ఫురిత మానసాంభోజుడవై
పరగుచు కొన్ని దినంబుల
హరికరుణన్ బ్రహ్మపదము నందెద వనుచున్ 304

భావము : "చెట్లమీద తిరుగు కోతిగా పుట్టి, హరి భక్తిచే ప్రకాశించు మనస్సు అనెడి పద్మము కలవాడవై జీవించుచు, కొన్ని రోజులకు విష్ణుని దయవలన బ్రహ్మపదవిని పొందెదవు" అని తెల్పెను.

ఆ॥ శాపమోక్షమిట్లు సమ్మతి దయచేసి
విష్ణు శర్మ చనియె విను యథేచ్ఛ
ధర్ముడంత మేను దలగి వానరయోని
బుట్టె హనుమదాఖ్య బూని ధరణి 305

భావము : శాపమెట్లు తొలగునో తెల్పి విష్ణు శర్మ తన కిష్టమైన చోటునకు వెడలిపోయెను. ధర్ముడు తన శరీరమును విడిచి వానరుడై హనుమంతుడను పేరుతో పుడమిలో పుట్టెను.

ఉ॥ ఏనిట సద్గురుండు గదియించిన రీతిని సర్వపూర్ణుగా
ధ్యానము సేయుచున్న యెడ నాత్మను దోచెను విష్ణువంతగా
నేనన నెవ్వడన్ననుచు నేనట సద్గురు జేరి యింతయున్
మౌనికి విన్నవింప భళిమంచిది నీ మతి యంచు యిట్లనెన్ 306

భావము : నేను ధర్ముడను, గురువు చెప్పినట్లు హరిని వెంటనే ధ్యానించితిని. ఆత్మలో హరి ప్రత్యక్షమయ్యెను. 'నేను అనగా ఎవ్వడను' అనుచు గురువును చేరి విన్నవింపగా ఆ ముని 'నీ మనసు మంచిది చాలా సంతోషము' అని ఇట్లనెను.

క॥ నీవన విష్ణు వనంగా
భావింపగ వేఱు లేరు బ్రహ్మంబంతా
యావిధుని నామరూపము
లే వెరవున నీకు దెలియని లేశము గలదే 307

భావము : "నీవు అనగా విష్ణువే. తలపగా, వేఱులేరు. ఈ విశ్వమంతయు పరబ్రహ్మ యొక్క (విధుని) సృష్టిలో వేర్వేఱు పేర్లుగల రూపములు కలిగి ఉన్నవి. ఏ విధముగా నైనను నీకు తెలియనిది కొంచెమైనను కలదా?"

చ॥ ఇరువదినాల్గుతత్త్వముల నెంతయు నయ్యెడు నద్వయంబు ని
ట్లరయగ స్థూల సూక్ష్మముల నజ్ఞతకారణదేహమైతగున్

సరవిని మూర్తికిం బరమ సాక్షి విలక్షణ మీవు సర్వమున్
బరమగు రజ్జువందు నహి భాతిని నీయెడ దోచె లేనిదై 308

అర్థాలు : తత్త్వములన్= స్వభావములు, మూల పదార్థములు, సద్ద్వయంబు= స్థూల ప్రకృతి, సూక్ష్మ ప్రకృతియను రెండు, అజ్ఞత= అజ్ఞానము, కారణదేహము= మఱియొక జన్మకు కారణమైన వాసనా రూపమైనది, సూక్ష్మదేహము, సరవిని= క్రమముగ, మూర్తికిన్= క్రియాశీలము గల పదార్థములకు, సాక్షి విలక్షణము= చూచు వాడవు, చూచుచుండు లక్షణము (గుణము) కలవాడవు, ఈవు= నీవు, పరమగు= ఇతరములైన, రజ్జువందు= త్రాడులో, అహిభాతిని= పామువలె, నీయెడ= నీ విషయమున, తోచె లేనిదై= లేనిదే ఉన్నట్లు తోచుచున్నది.

భావము : "ఇరువది నాలుగు మూలకములతో స్థూల ప్రకృతులు రెండు ఏర్పడి, వీనితో అజ్ఞానము చేరి కారణదేహముగా సిద్ధమగును. క్రమముగ క్రియాశీలముగల జీవునకు సాక్షిత్వమేర్పడును. అట్టి సాక్షివి నీవు. నీకు తోచిన దంతయు లేనిదే. ఐనను ఉన్నట్లు అనిపించును. త్రాడు పాముగా తోచినట్లు."

విశేషములు : తత్త్వములు సృష్టికి మూల పదార్థములు ఇరువదినాల్గని శ్రౌతము. ఇవి ప్రళయకాలము వఱకు అట్టేయుండి జీవులకు సుఖ దుఃఖముల కలిగించును. ఈ తత్త్వము సంఖ్య వేర్వేఱు మతములు వేర్వేఱుగా చెప్పినవి. ఆగమములు మూడుగ చెప్పినవి. శ్రౌతము ఇరువది నాలుగు అని (ముప్పదియారు అని మతాంతరము) సాంఖ్యము ఇరువది యైదుగ పేర్కొనెను. పాతంజలము ఇరువదియారు అనినది. పాశుపతము ముప్పది యొకటిగ లెక్కజెప్పినది. శాక్తము ముప్పదియారుగను, శైవము ఏబది యొకటిగను, చెప్పినవి. మతాంతరమున తొంబదియాఱు. ఈ వివరములిట్లున్నవి.

ఆగమములు : (1) ఆత్మ (2) అవిద్యా (3) శివ తత్త్వములు

శ్రౌతము : (1) పంచ భూతములు, (2) జ్ఞానేంద్రియములు ఐదు, (3) కర్మేంద్రియములైదు, (4) విషయాలు ఐదు, మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము. (24)

మతాంతరమున : పంచభూతములు (5) తన్మాత్రలు (5), జ్ఞానేంద్రియములు (5), కర్మేంద్రియములు (5), మనస్సు (1), అహంకారము (1), మహత్తు (1), అవ్యక్తము ప్రకృతి (24),

శాక్తేయము : భూతములు (5), తన్మాత్రలు (5), ఇంద్రియములు (10) ధాతువులు (7), పంచప్రాణములు (5), మాయా విద్యా (2), మహేశ్వరసదాశివులు (2) (36)

సాంఖ్యము : భూతములు (5), ఇంద్రియములు (10), విషయములు (5), మనస్సు (1), మాయా (1), విద్యా (1), మహేశ్వర సదాశివులు (2), (25)

మతాంతరము : ప్రధానము (ప్రకృతి) (1), మహత్తు (1), అహంకారము (1), భూతములు (5), ఇంద్రియములు (10), విషయములు(బుద్ధి) (5), మనస్సు (1), పురుషుడు (1), పరమాత్మ పరిపూర్ణ చేతనుడు (1) (26)

పాతంజలము : భూతములు (5), ఇంద్రియములు (10), విషయములు (5), మనస్సు (1), విద్యా (1), మహేశ్వర సదాశివులు (2), శివశక్తి మేళనం (1), మాయా (1) (26)

పాశుపతము : పైవి 26, కాలము (1), నియతి (1), రాగము (1), విద్య (1), కళ (1), అను ఐదు కంచుకములు కలిసి (31)

మతాంతరము : ఇంద్రియములు (10), ప్రాణములు (5), విషయములు (5), భూతములు (5), మనస్సు (1), బుద్ధి (1), చిత్తము (1), అహంకారము (1), స్థూల దేహము (1), సూక్ష్మ దేహము (1), కారణదేహము (1), జాగ్రత్ (1), స్వప్న (1), సుషుప్తి (1) మొత్తం (35)

శైవ పురాణములు : భూతములు (5), తన్మాత్రలు (5), ఇంద్రియములు (10), ప్రాణములు (5), కంచుకములు (5), ధాతువులు (7), గుణములు (3), మనస్సు (1), అహంకారము (1), ఖ్యాతి (1), ప్రకృతి (1), పురుషుడు (1), మాయా (1), విద్యా (1), మహేశ్వర సదాశివులు (2), శివ, శక్తి (2), మొత్తం 51

మతాంతరము : పై జెప్పినవి 51. ఉపప్రాణములు (5), కామాదిశక్తులు (8), వచనాది శక్తులు (8), నాడీశక్తులు (14), రేచకాది శక్తులు (5), శీతోష్ణాదిశక్తులు (5), మొత్తం 96 (లేక) శాక్తేయములో చెప్పిన 36, భావములు (6), ఊర్మలు (6), కోశములు (6), అరివర్గము (6), జీవులు (3), గుణములు (3), కర్మత్రయము (3), శక్తులు (5), సంకల్పము (1), అధ్యవసాయము (1), అభిమానము (1), అవధారణ (1), ముదితాది చతుష్టయము (4), దిక్కు, వాయువు, అర్కుడు, వరుణుడు, అశ్వినుల, వహ్ని ఇంద్రుడు, చంద్రుడు, ఉపేంద్రుడు, చతుర్ముఖుడు, రుద్రుడు, క్షేత్రజ్ఞుడు, ఈశ్వరుడు, మృత్యువు (14) మొత్తం 96.

ఈ లెక్కలను జూడగా, ఒకరిని మించి ఒకరు మతములు, సంప్రదాయములును సూక్ష్మాతి సూక్ష్మ విశ్లేషణ జేయుటకు ప్రయత్నించిరనుట సత్యము.

స్థూల సూక్ష్మములు ప్రకృతి మనకు కన్పించు రూపమున నున్నది స్థూలము. దీనికి కారణమై మనకు ఇంద్రియ జ్ఞానమునకు అందనిది సూక్ష్మము. ఈ రెండును **సద్ద్వయము**, సత్ (సత్తు) అసత్

అజ్ఞానము : సత్యమును గుర్తించలేకపోవు లక్షణము. ఇది సత్తుతో కలిసినప్పుడు విషయ భోగము కలిగి, సుఖ దుఃఖములు కలుగునందురు. రజ్జువందు అహిభాతిని ఇది ప్రసిద్ధమైన ఉపమానము, త్రాడును చూచి పాముగా భ్రమించుటవంటిదే, ఈ సుఖ దుఃఖమయ సంసారము. ఉన్నది

త్రాడు, లేనిది పాము, త్రాడు పామువలె కన్పడుట భ్రమ. భ్రమకు కారణము అజ్ఞానము. ఉన్నది త్రాడు అను తెలివి తప్పుట, భ్రమ తొలగినచో, సత్యము గోచరమగును. ఇట్టిదే సంసారము. ముత్యపు చిప్పలో వెండి భ్రమ. స్వప్నమందు అనుభవము అసత్యము. ఆభరణములు బంగారం నుండి వేఱుకావు. నీటి బుడగలును నీటి నుండి వేఱుకావు. అట్లే పరమాత్మ ఆత్మలు ఒక్కటే.

ఉ॥ కావున నీవు బ్రహ్మమని గట్టిగ తత్త్వము నాకు దెల్పినన్
దైవము నేను నంచు ద్వివిధంబుగ దోచక నీ ప్రపంచ మి
ట్లావమునైన లేక బహిరంతర పూర్ణత దేశకాలవ
స్త్వావలి భేదము న్నెడలి యంతయు నేనయి తోచు నిక్కమున్ 309

అర్థాలు : బ్రహ్మము= పరమ సత్యము, తత్త్వము= సత్యము, ఆవము= పాదు, బహిరంతరపూర్ణత= బైటను లోపలను పరిపూర్ణత్వముతో, దేశకాలవస్త్వావధి భేదమున్నెడలి= ప్రదేశము, కాలము, వస్తుజాలము, ఇట్టి భిన్నత్వ బుద్ధి మాసిపోయి.

భావము : 'నీవే బ్రహ్మమని గట్టిగ నమ్మినచో దైవము రెండుగా కన్పట్టక ఒకే మూలముతో అన్నియు ఒక్కటే అని వేర్వేఱు కావనే భావము కలుగును. అంతయు నేనే అని తోచును. సత్యము పరమాత్మ. సర్వ వ్యాపి అని ఎఱుగవచ్చును.'

వ॥ అప్పుడు 310

విశేషము : "తత్త్వమ్అసి" "అహమ్బ్రహ్మాఅస్మి" అని వివేకము నిర్ధారణ అగును

చ॥ కనుగవబాష్పము ల్దొరుగ కాయమునం గడు పుల్కలొప్పగా
తనువు భుజంబులుం బెరుగ తాల్పగ శక్యముగాని మోదముల్

మనమున నుప్పతిల్ల దగి మౌనికి వందన మాచరించి నే
వినుతి యొనర్చి దన్నియతవృత్తిని యమ్ముని గాంచి యీ క్రియన్ 311

భావము : ఆ సమయమందు "కన్నీరు వెల్వడినది. శరీరము గగుర్పాటు చెందినది. శరీరము భుజములన్నియు ఉబికినవి. అమితమైన ఆనందము పొంది మునికి వందనమాచరించి నుతి చేసితిని.'

క॥ ఆనందమాత్రమై యా
మేనుం బ్రారబ్ధవశత మెలగగ నేనున్
నా నీయధ్రువ తనువున
మానసమున దీనికి నభిమానంబేలా? 312

భావము : "నేను ఆనందము పొందిన వాడనని తెలిసి పూర్వ జన్మలలో చేసిన కర్మలకు ఫలమననుభవించుటకు ఈ శరీరముతో నుంటినని ఇది అశాశ్వతమని గ్రహించి ఈ శరీరము మీద అభిమానము ఏలనో అని ఆలోచన చేసితిని."

ఆ॥ అనుచు నిట్లు సర్గమందుల నిను గాన
నీ శరీర మెత్తు టెన్న డొక్కొ
యానతిమ్ము నీ మహత్వమంతయు మాకు
భర్మధీవరేణ్య పరమపుణ్య! 313

భావము : ఇట్లు అంటిని, బుద్ధిశాలీ, భర్ముడా ! నీ సృష్టిలో నిన్ను చూచుటకు ఈ శరీరముతో మరల ఎప్పుడు పుట్టెదనో మహాత్మా తెల్పుము.'

వ. అని నేను విన్నవింప భర్ముండిట్లనియె 314

వచనము : అని నేను విన్నవింప భర్ముడు ఇట్లు అనెను.

క॥ నిను వంటి బ్రహ్మలీవర
కును విను తొమ్మండ్రు చనిరి కొదవ గణింపన్

జనునటె నిటువలె నల్పపు
తనువిది కడు పేర్చు బుద్బుదప్రాయమునన్ 315

భావము : "ఇప్పటి వఱకు తొమ్మిదిమంది పాలించినారు. మిగిలిన వారిని లెక్కింప సాధ్యమగునా! ఇట్లు కొంతకాలము మాత్రమే జీవించునట్టి శరీరమిది. నీటి బుడగ వలె మిక్కిలి చలించును."

ఆ॥ బ్రహ్మతనువు లెన్ని భర్గదేహము లెన్ని
హరికళేబరములు నరయ నెన్ని
మనుజతిర్యగాది తనువులు లెక్కయే
జీవికిని వచింప సిద్ధముగను 316

అర్థాలు : భర్గ= శివుని, హరి= విష్ణుని, కళేబరములు= జీవము లేని శరీరములు, మనుజ తిర్యగాది= మనుష్యులు, ఇతర ప్రాణులు మొదలగు వాని, తనువులు= శరీరములు, సిద్ధముగన్= తటాలున, వచింపలెక్కయె= చెప్పుటకు లెక్కలు లేవు.

భావము : "బ్రహ్మ శివుడు హరి ఎన్ని కళేబరములయిరో మనుజులు పక్షులు మొదలైనవి ఎన్నియో లెక్కింపలేము. జీవునికి ఎన్ని జన్మలు కలుగునో వెంటనే లెక్కించుటకు సాధ్యము కాదు."

శా॥ నీవీ బ్రహ్మశరీరమాత్ర కకహా నిష్ఠించి గర్వింపగా
నా విష్ణుం డఖిలాండకోటిమహదండాధీశుడై యుండి తా
నీవంటిన్ విధిరుద్రుగర్వము తగన్నిర్మించి పోషించు ని
ట్లే వెంటన్ విలయించు చెల్లదటె నిన్నెంతేని భంగింపగన్ 317

భావము : నీవు అల్పమైన బ్రహ్మ శరీరము మీద మోహము పెంచుకొంటివి. అయ్యో! పట్టుదలతో (నిష్ఠించి) ప్రవర్తించి గర్వింపగా, సమస్తమైన కోట్లకొలది అండములకు నాయకుడు మహావిష్ణువు నీవంటి బ్రహ్మ రుద్రుల గర్వమును

వృద్ధి చేసి, వెన్వెంటనే, వారి ఉద్రేకమును అణచివేయును. అట్లు నీవును అతిశయ గర్వివైౖ దాని భంగమునకు తగిన వాడవైతివి (తప్పక అవమానము చెందగలవు).

క॥ కావున విష్ణునిరోధము
గావింపగరాదు నిఖిలకారణుడగుటన్
శ్రీవరపదపద్మద్వయ
సేవారతివైన నొందు సేమము నీకున్ 318

అర్థాలు : విష్ణు నిరోధము= విష్ణుని ఎదిరించుట, కావింపగరాదు= చేయకూడదు, నిఖిలకారణుడగుటన్= అన్నిటికి కారణమైనవాడు విష్ణువగుట వలన, శ్రీవర పద పద్మద్వయసేవారతి వైనన్= లక్ష్మీదేవి వరించిన వాని పాదపద్మములను సేవించుటలో ఆసక్తిగలవాడవై నట్లయితే, సేమము= క్షేమము, నీకున్ఒందున్= నీకు కలుగును.

భావము : "కావున విష్ణువును ఎదిరించరాదు. అతని సేవింపుము మేలు కలుగును.'

క॥ తొంటిమదీయ చరిత్రము
వింటివి గద తెలుపదగ్గ విధమేమైనా
నుంటె యడుగం దగు నన నే
నంటిని వందనము చేసి హర్షము తోడన్ 319

అర్థాలు : తొంటి= తొల్లింటి, మదీయ= నాదైన, హర్షముతోడన్= సంతోషముతో

భావము : "నా పూర్వచరిత్రము విన్నావు కదా ! ఏమైన నే తెల్పదగినదున్నచో అడుగుము" అని వచింప సంతోషముతో వందనము చేసి ఇట్లు అంటిని.

చ॥ మనమునున్న నా దురభిమానము దీరెను నీ కృపావశం
బున బరిశుద్ధమై కణగి బుద్ధి గురుండవు నీవే నీదు బో

ధను హరి భక్తినా మదిని దావలమయ్యె త్వదంఘ్రిసేవచే
ననుపమ తత్త్వసంపద రయంబున నొందెద బోయి వచ్చెదన్ 320

అర్థాలు : మనముననున్న= మనసులో నున్న, కృపావశంబున= దయచేత, కణగి= పూని, తావలమయ్యె= స్థానమైనది, త్వదంఘ్రిసేవచే= నీ పాదములను సేవించుటచే, అనుపమతత్త్వ సంపద= సాటిలేని సత్త్వ సంపదను.

భావము : "నా బుద్ధి నీ కృప వలన పూని పరిశుద్ధమైనది. నా గర్వము తొలగినది. నీవే నా గురుడవు ఈ ఉపదేశము వలన విష్ణుభక్తి నా మనసులో నిలిచినది. నీ పాద సేవవలన సాటిలేని తత్త్వ సంపదను త్వరలో పొందగలను పోయి వచ్చెదను."

వ॥ అని పునఃపునఃప్రణామంబు లాచరించి తిరిగి వచ్చి తదారంభంబున హరి
భజనంబు సేయుచు నిట్లున్న వాడని మఱియు నిట్లనియె 321

అర్థాలు : పునఃపునః ప్రణామంబులాచరించి= మరల మరల నమస్కరించి, తదారంభంబున= అది మొదలుకొని,

భావము (వచనము) : "పెక్కు సార్లు నమస్కరించి నా చోటికి వచ్చి హరిని పూజించుచున్నవాడను" మఱియును ఇట్లనెను.

చ॥ హరి పరమాత్ము డవ్యయు డనంతుడు శాశ్వతు డచ్యుతుండునున్
పరు డపరుండు పూర్ణుడగు బ్రహ్మముతోన విరోధియైన యీ
పరమనికృష్టు దుర్మదుని పాపమనస్కుని నిందు దెచ్చుటల్
తరుణి! మహాపరాధము పదంపడి చేసితి విట్లు నాయెడన్ 322

అర్థాలు : పరమాత్ముడు= అన్నిటికి ఆత్మయైనవాడు, అవ్యయుడు= నశింపులేనివాడు, అనంతుడు= అంతము లేనివాడు, అచ్యుతుండునున్= మార్పు లేనివాడు, పరుడు= ప్రకృతికి లొంగనివాడు, అపరుండు= ప్రకృతిలో ఉన్నవాడు, ఇందు= ఇక్కడకు, తరుణి= ఓ అమ్మాయీ

భావము : "ఓ కాంతా ! పాపిని తొందరపడి తెచ్చి నా విషయములో పెద్ద తప్పు చేసితివి సుమా"

ఉ॥ వీని ముఖంబు చూచి పదివేలు హయాధ్వరముల్ ఘటించినన్
మానునె వాని పాపములు మామక సన్నిధినుండగూడ దీ
హీనుని ద్రోయుడంచు మొగమివ్వల ద్రిప్పినయంతలోన నా
స్థానము వేత్రహస్తులు వెసం దలవాకిలి వెళ్ల ద్రోచినన్ 323

అర్థాలు : హయఅధ్వరముల్= అశ్వమేధ యాగములు, ఘటించినన్= చేసినను, మామక= నాదైన, సన్నిధిన్= చేరువన, త్రోయుడు= నెట్టివేయుడు, మొగమివ్వల త్రిప్పియంతలోన= ముఖము నిటువైపు త్రిప్పినంతలో, ఆస్థానము వేత్రహస్తులు= ఆ స్థానము (కొలువు)లోని దండధారులు, వెసన్= వెంటనే, తలవాకిలి= సింహద్వారము, వెళ్ళన్= బైటకు

భావము : "ఏమి చేసినను వాని పాపములు తొలగవు. ఇతడు నాముందు ఉండరాదు. ఇతనిని త్రోసి వేయండి" అనగానే ఆ బ్రహ్మను వారు తలవాకింటికి గెంటివేసిరి.

ఉ॥ వచ్చి చతుర్ముఖుండు తలవాకిట బైటను ఖిన్నచిత్తుడై
ముచ్చెముణింగిపోవుటకు ముందును వెన్కయు గాన రాక తా
పెచ్చుపెరుంగుదుఃఖమున జేరి మహత్తరమైన లజ్జచే
నిచ్చ దలంచ నిట్లనుచు నెంతయు నెవ్వగ నొంది దీనుడై 324

అర్థాలు : ఖిన్నచిత్తుడై= దుఃఖము నిండిన మనసు కలిగి

భావము : బ్రహ్మ, ద్వారము ముందు దుఃఖముల వెల్లువలో మునిగి మితిలేని సిగ్గుతో చాలసేపు చింతలో నుండి ఇట్లని తలంచెను.

చ॥ కటకటలేని పోని వెడ గర్వము నొందిన యట్టి యా ఫలం
బిటువలె భంగ పెట్టకది యేటికి నూరక పోవునెందులన్

కుటిల విచారమానసుని కోపము తాపము పాపమంద్రు నే
డటువలె నయ్యో నాయెడ మహత్తర దుర్దశ నంది తేమనన్ 325

అర్థాలు : కటకట!= ఔరా!, వెడ= వికారమైన, కుటిల విచారమానసుని= వక్రముగా ఆలోచించు మనస్సుగలవానిని, నా యెడ= నా విషయమున, మహత్తర దుర్దశ= గొప్ప చెడు స్థితిని

భావము : "ఔరా! గర్వము చెంది నేను వక్రముగా ఆలోచించినవాడను దాని వలన ఫలము అనుభవింపక తప్పునా? నా తాపము నా పాప ఫలమే. నేడు చాల నీచమైన దశను పొందితిని కదా!"

ఉ॥ ఎక్కడనుండి వచ్చె ముని యెక్కడి యాశ్రమమేను గంటి నే
నెక్కడియోగినీ సతికి నిచ్చ గలంగితి నందుకై కటా
యెక్కడి కిట్లుదెచ్చె సతి యెక్కడబోవుదు నేది దిక్కు నే
డిక్కడ నన్నెరుంగుటకు నెవ్వరు లేరిక నేమి చేయుదున్ 326

భావము : "ఈ ముని ఎక్కడనుండి వచ్చెనో! ఎక్కడో నున్న ఆతని ఆశ్రమమును నేను చూచితిని. నేను ఎక్కడిదో అయిన యోగినీసతిని చూచి కలత చెందినాను. అయ్యో! ఆమె ఎక్కడికి తెచ్చినదో కదా! ఎక్కడికి పోగలను? రక్షకుడు ఎవరు? నేడు ఇక్కడ నన్ను ఎఱుగువారు లేరె? ఏమి చెయవలనో తెలియకున్నదే!"

క॥ కలితాష్టవదనుడగు నీ
నలువ ప్రభావంబు లోకనాయకమహిమల్
విలసితలోకోన్నతములు
తెలియ న్నొక కీటమాత్రదేహుడ నైతిన్ 327

అర్థాలు : కలితాష్టవదనుడగు= ఎనిమిది ముఖములు గల, నలువ= బ్రహ్మ, ప్రభావంబు= శక్తి సామర్థ్యములు, విలసిత= ప్రకటమైనవి, కీటమాత్ర దేహుడనైతిన్= పురుగువంటి జీవినైతిని.

భావము : ఈ ఎనిమిది ముఖములు గల బ్రహ్మ, ఈ లోక నాయకుని ప్రభావము, మహిమలు చాలా గొప్పవి. నేను ఒక పురుగును మాత్రమే అయితిని.

శా॥ నా సామర్థ్యము లేమి సాగు నిచటన్ నానా విధైశ్వర్యవి
ద్యాసారస్వత భక్తితత్త్వసుమహత్ప్రఖ్యాతి భూరి ప్రభా
వాసాలంకరణోన్నతోన్నత మహత్త్వ శ్రీ విలాస క్రియో
ల్లాసస్థానములందు హస్తిమశకశ్లాఘ్యంబు లిందందులన్ 328

అర్థాలు : నానా విధైశ్వర్యవిద్యాసారస్వత భక్తితత్త్వ సమహత్ప్రఖ్యాతి= అనేక విధములైన ఐశ్వర్యముల విద్యలు, సారస్వతములు, భక్తి తత్త్వముల చేత చాల గొప్ప కీర్తిలోను, భూరి ప్రభావాసాలంకరణోన్నతోన్నత మహత్త్వ శ్రీ విలాస క్రియోల్లాసస్థానములందు= గొప్ప కాంతిమంతమైన నివాసముల అలంకరణలతో చాల గొప్ప వైభవాతిశయముతో విలసిల్లు విహార విలాస స్థానములలో, హస్తిమశక శ్లాఘ్యంబులు= ఏనుగుకు దోమకు ఉన్నంత వ్యత్యాసముతో ఎన్నదగినవి, ఇందు అందులన్= ఈ అష్టముఖ బ్రహ్మ విశ్వ సృష్టిలోను, ఆ నా విశ్వసృష్టిలోను

భావము : "ఇచ్చట నా శక్తి దేనికి ఉపయోగపడును? ఈ బ్రహ్మ సృష్టి అతి శ్రేష్ఠమైన శోభను విలాసములను ఉల్లాసములను పొంది యున్నది. నా సృష్టిలోని నిపుణత దానిలో పోల్చగా ఏనుగు దోమకు గల వ్యత్యాసము కన్పట్టును."

ఉ॥ ఎక్కడికేగువాడ తెరువెయ్యది యెవ్వరు దిక్కునాకు నే
నిక్కడనుండుటెట్టు లొకయించుక చిత్తము సాకరించదే
ఎక్కడివాడవం చడుగ నెందరికిన్ వినిపింతు నావిధం
బక్కట యెంతకయ్యొ మదినంటిన గర్వ మికేమి సేయుదున్ 329

భావము : ఎక్కడికి పోగలను మనస్సున ఉపాయము తోచుటలేదు. రక్షకుడు ఎవరు? ఇక్కడ ఎట్లు ఉండగలను. సరియైన సూచనలిచ్చి సహకరించుట లేదే! ఎక్కడి వాడవనుచు అడిగినవారికి ఏమని తెల్పగలను! గర్వమంటుటచే కష్టస్థితి కలిగినది. అయ్యో ఇట్లయ్యెనే, ఏమి చేయగలనని.'

క॥ ఏగతి నోరుతు నంచును
వాగీశుడు తల్లడింప వైళంబున నా
యోగిని వచ్చిట్లను నో
హో గురువైభవుల రిట్టులుండవలయునే 330

అర్థాలు : ఏగతిన్= ఏవిధముగా, ఓరుతు= ఓర్చుకొనగలను, వాగీశుడు= సరస్వతీపతి బ్రహ్మ, తల్లడింప= కలత చెందగ, వైళంబున= వేగముగా, గురువైభవులరు= గొప్ప వైభవము గల మీరు

భావము : "ఎట్లు ఈ కష్టాలను సహింపగలను?" అని బ్రహ్మ కలతతో నుండగా యోగిని వచ్చి "ఓహో గొప్ప వైభవముగల ప్రభువులు ఇట్లు దిగులుపడుచున్నారే?" అని ఎత్తి పొడిచి పరిహాసమాడినది.

ఉ॥ చూచితె యీయజాండమును శోభిలు నీ పదునాల్గులోకముల్
భూచరఖేచరాంబుచరభూజచరాది సమస్త జీవులన్
ప్రాచురతాష్టదిక్పతుల భానుశశాంక సురేశ మౌనులన్
ధీ చతురాష్టవక్త్రు సురదివ్య ఋషీశ్వరులన్ మహాత్ములన్ 331

అర్థాలు : చూచితె= చూచితివా?, భూచరఖేచరాంబుచర భూజచరాది= భూమిపై సంచరించునవి, ఆకాశమున సంచరించునవి, నీటిలో బ్రతుకనవి, చెట్లపై సంచరించునవి, మొదలైన, ప్రాచురతాష్టదిక్పతుల= భాసిల్లు దిక్పతుల నెన్మిదిమందిని, భానుశశాంక సురేశమౌనులన్= సూర్య చంద్రులను, ఇంద్రుని, మునులను, ధీచతురాష్టవక్త్రు= బుద్ధి చాతుర్యము గల ఎన్మిది ముఖములు గల బ్రహ్మను, సురదివ్య ఋషీశ్వరులన్= దేవర్షి మహర్షులను

భావము : "ఓయీ ! బ్రహ్మాండమందు శోభతో నిండిన పదునాల్గు లోకాలలోని జీవులను దేవతలను మునులను చూచితివా?" (ఏక వచనముతో సంబోధనము తీవ్ర నిరసనద్యోతకము)

ఆ॥ మున్నె దెలిపినట్టి ముచ్చట లన్నియు
గంటిరయ్య లెస్సగాను ఇంక
సంశయంబు గలదె చాలునొ నిక నన
నబ్జసూతి యిట్టులనియె సతికి 332

భావము : “ఇంతకు ముందే తెలిసిన ప్రియమైన విషయములన్నింటిని చక్కగా చూచితిరా? సందేహములు ఉన్నవా? ఇంక చాలునా?” అనగా బ్రహ్మ యిట్లనెను.

ఉ॥ కాలినవాని గోర్వులను గైకొని చూడగ నీవె యోగినీ
చాలును చాలు నే నిలువజాలను మామకలోక మింకనే
లీల గనుంగొనన్నగు నిలింపుల నెట్టుల గూడు కొందునో
బాలకురంగ లోచన! కృపామతి నందరి జేర్చి కావవే! 333

అర్థాలు : కాలినవాని= ఒకనికి శరీరము కాలగా, కొర్వులను= కొరువులను, గైకొనిచూడగ= పరీక్షించుటకు, లేరు, నిలువజాలను= సహించియుండలేను, మామక= నాదైన, ఏ లీల= ఏ విధముగ, నిలింపుల= దేవతలను, బాలకురంగలోచన= జింక పిల్ల వంటి కన్నులు గలదానా! కృపామతిన్= దయతో

భావము : “ఇప్పటికే నా గర్వము నన్ను కాల్చివేసినది. దానిని నిప్పంటించిన కట్టెలతో చూచుట తగునా ? ఇంక చాలించి, నా వారిని ఎట్లు కనుగొనగలను? దయతో కాపాడుమా?”

క॥ అన విని కన్నులు మూయుము
వనజోద్భవ! యనిన రెప్పవాలిచి నంతన్
మునుపటి చీకటి నేతా
వునునుండెనొ యచ్చోట నెళవునను నుండెన్ 334

భావము : అనగా విని, “ఓ బ్రహ్మదేవా! కనులు మూసికొనుము” అని చెప్పినంత బ్రహ్మ ఱెప్పలను వాల్చెను. వెంటనే బ్రహ్మ తాను మునుపటి వలె తనచీకటి చోటున నుండెను.

వ॥ ఇట్టు నిమిషమాత్రంబున తను చనిన యెల్లలోకంబులు గడచి మున్ను తానున్న బంధురాంధకారంబునకు వచ్చుట కాశ్చర్యంబునొంది తన మనంబున నిట్లని వితర్కించె 335

అర్థాలు : నిమిషమాత్రంబున= ఒక్క నిమిషములో, తను చనిన= తాను వెళ్ళిన, కడచి= దాటి, ప్రయాణించి, బంధురాంధకారంబునకు= దట్టమైన చీకటిగల ప్రదేశమునకు, వితర్కించె= కార్యకారణములను సమన్వయించి కొనుచు ఆలోచించెను

భావము : ఒక్క నిముషములో తానున్న చోటునకు వచ్చుట ఆశ్చర్యమును కలిగించినది. దానిని గూర్చి ఆలోచించెను.

ఉ॥ కానక మోసపోతి ప్రియ కాంత నయోక్తు లొకించుకైన నే
వీనుల బెట్ట కిట్లనుభవించితి మున్గితి దుఃఖవార్ధిలో
నేనిక నొయ్య నన్నరిగి యెవ్వరుగానకయుండగా నిజ
స్థానము చేరి యందు సురసంయములెక్కడికేగి రన్నచోన్ 336

అర్థాలు : కానక= తెలిసికొన లేక, ప్రియకాంత నయ ఉక్తులు= ప్రియురాలైన సరస్వతీ దేవి చెప్పిన మంచి మాటలను, వీనులబెట్టక= చెవి బెట్టక, వినిపించికొనక, లెక్కసేయక, దుఃఖవార్ధిలో = దుఃఖములలో, ఒయ్యనన్= వెంటనే, అరిగి= వెళ్ళి, సురసంయములు= దేవతలు మునులు

భావము : “తెలివి లేక వాణి చెప్పిన మాటలు వినక దుఃఖమును అనుభవించితిని. ఎవరును చూడకుండునట్లు వెంటనే నా చోటు చేరెదను. దేవతలు, మునులు ఎక్కడికి వెళ్లితిరి అని అడిగినట్లయితే”

క॥ అప్పటి కొకనేర్పున నే
తప్పుకొనన్వలయుగాని తడవిట నుంటి
టొప్పదు పోయెదనని చని
యప్పరమేష్ఠి తనలోకమటు చేరంగన్ 337

అర్థాలు : అప్పటికొక నేర్పుననే తప్పుకొనంగవలయు= ఆ సమయమునకు తగిన ఉపాయముతో తప్పించి కొనవలయును, తడవు= ఎక్కువసేవు, ఇటనుంట= ఇక్కడ నుండుట, ఒప్పదు= సరికాదు, పరమేష్ఠి= బ్రహ్మ.

భావము : "నేర్పుతో సమాధానమిచ్చి వెంటనే తప్పించుకొనవలెను." ఆ బ్రహ్మ ఆలస్యమిక చేయక తన సత్యలోకము చేరెను.

ఉ॥ పోవుచు సర్వలోకములు పూర్ణములై బహుభోగ భాగ్యసం
జీవన భూరితేజముల శ్రీ దళుకొత్తుట చూచి యాత్మలో
నీవిభవ ప్రభామహిమలెవ్వరి శక్తి జనించెనో కటా
నా వివిధ ప్రయత్నములు నష్టములై చెడిపోయె నెంతయున్ 338

అర్థాలు : పూర్ణములై= నిండియుండి, బహుభోగభాగ్య సంజీవన భూరి తేజముల= చాల భోగములతో, భాగ్యములతో, జీవకళ గల గొప్ప తేజస్సుతో, శ్రీతళుకొత్తుట= వైభవము ప్రకాశమానమగుట, ఆత్మలో= తనలో, ఈ విభవప్రభా మహిమలు= ఈ వైభవము, కాంతి, మహిమలు(గర్వము నశించలేదనుట కీ యూహ సాక్ష్యము. ఇంకను బ్రహ్మకు జ్ఞానము కలుగలేదు. వాని మనస్సులో ఒక మూల, తాను లేనందువలన తన సత్యలోకము బ్రహ్మాండమంతయు నిస్తేజమై జడమై యుండునను భావన యున్నది.)

భావము : తాను లేకున్నను లోకములన్నియు సుఖములతో, తేజస్సుతో వెలుగుట చూచి తనలో ఇదంతయు ఎవరి శక్తి వలన కలిగెనో కదా ! తన యత్నములు నష్టమై పోయినవని వగచెను.

ఆ॥ సత్యలోకమిట్లు సంపూర్ణమై సిరి
దనరుచుండునొక్కొ తక్కి విభవ
శూన్యమైన నాదు చొప్పరయుచును వాణి
యెంత దుఃఖపడెనొ? యేమి సేతు? 339

అర్థాలు : సత్యలోకము= బ్రహ్మలోకము, సిరిన్= సంపదతో, తనురుచుండు నొక్కొ= విలసిల్లుచుండునా, తక్కి= తక్కువయై, విభవ శూన్యమైన= వైభవము లేనిదగుటచే, నాదు చొప్పు= నా స్థితి.

భావము : "సత్య లోకము కూడ ఇతర లోకముల వలె సంపదలతో నుండునా? వైభవము లేని స్థితిని కనుగొనుటకు వాణి యెంత దుఃఖించెనో కదా! ఏమి చేయగలను?"

మ॥ అని చింతించుచు పోయి కాంచె విభవానందైక సంపూర్ణమై
మునిదివ్యోత్తమ పుణ్య భూపజనసంపూర్ణంబునై సేవకా
జననా నాముఖ సర్వకృత్య బహు సంచారాతి వేగంబునై
ఘనభేరీపణవాదినిస్వన దిశాకంపాయమానంబునై 340

అర్థాలు : కాంచె= చూచెను, విభవానందైక సంపూర్ణమై= వైభవానందములతో ఏ కొదువ లేకుండ సమృద్ధియై, ముని దివ్యోత్తమ పుణ్యభూపజన సంపూర్ణంబునై= మునులు, దేవతలు, ఉత్తములు, పుణ్యవంతులైన బ్రాహ్మణులతో నిండినదై, సేవకాజననానాముఖ సర్వకృత్య బహు సంచారాతివేగంబునై= సేవకులచే, వేర్వేఱు ఇంటి ద్వారములందు వేగముతో పనులను అన్నింటిని చేయుటకై ఎక్కువగా తిరుగు వారితోను, ఘన భేరీ పణవాది నిస్వన దిశాకంపాయమానంబునై= గొప్ప భేరి, పణవము మొదలగు తాళవాద్యముల ధ్వని దిక్కులలో ప్రకంపనలను కలదై

భావము : అని చింతతో వెళ్ళి సత్య లోకమును చూచెను. కాని అది సౌభాగ్య వైభవములతో నుండెను. సేవకులు వేగముతో తమ పనులను చేయుచుండిరి. వాద్య ధ్వనులతో సత్యలోకము కంపించుచుండెను.

చ॥ బహుతరసర్వసంపదల బర్విన దివ్య విమానవాహినీ
బహులగతాగతోద్ధతనిబద్ధపదంబగు దాని వైభవో
ద్వహనమహత్త్రభాగరిమ దావలమై తగ దోచు దాని స
న్మహిమ నపూర్వశక్తిబరమంబగు దానిని సత్యలోకమున్ 341

అర్థాలు : బహుతర సర్వసంపదల పర్విన= అనేకమైన సంపదలన్నియు కలిగిన, దివ్యవిమానవాహినీ బహుల గతఆగతఉద్ధతనిబద్ధపదంబగు= దివ్య విమానములు అసంఖ్యాకములై వచ్చుచు పోవుచుడుంటచే రాజసముతో వెలుగుచున్న ప్రదేశమైన, వైభవోద్వహనమత్త్రభాగరిమ= వైభవము వెల్లి విరియు గొప్ప కాంతి, ఆలావాలమై= స్థానమై

భావము : సర్వసంపదలు పెక్కు విమానములు వచ్చుచు పోవు సందడి కలదై, వైభవ వికాసమునకు నెలవై సత్వతేజముతోను, గొప్ప శక్తులతోను అత్యుత్తమముగా గోచరించు సత్యలోకమును

చ॥ కని వెఱగంది యింతకును గారణమేమియొ విష్ణుభక్తిచే
వనజదళాక్షిమద్గృహిణివాణి మదీయ నియామకంబునన్
దనర యథాప్రకారముగ దాను ప్రభుత్వము చేయుచున్నదో
గనుగొన బోలునంచు మది కౌతుకమొప్పగబోవు నత్తఱిన్ 342

అర్థాలు : వెఱగంది= ఆశ్చర్యపడి, వనజదళాక్షి= పద్మపత్రములవలె విశాలమైన కన్నులు గల, మద్గృహిణి= నా భార్య సరస్వతి, మదీయ నియామకంబునన్తనర= నా స్థానములో నుండగా, యథాప్రకారముగ= పూర్వమున్న విధముననే, ప్రభుత్వము= పరిపాలన, కనుగొనపోలున్= చూడవలెను, కొతుక మొప్పగ పోవు నత్తఱిన్= కుతూహలము కలిగి చూచి, ఆశ్చర్యపడి పోవు చున్న ఆ సమయమున

భావము : తన భార్య విష్ణు భక్తిచే నా పదవిలో నుండి పాలించుచున్నదేమో అని చూడవలెనని ఉత్సాహముతో పోగా

ఉ॥ ద్వారమునందు పాలకులు వారిజ సంభవు జూచి మీరలె
వ్వా రెటు పోవువారు ప్రభువాక్యములేక చనంగ వచ్చునే
ద్వారము చొచ్చి నిల్వుమన దానొక యించుక చింత చేసి దౌ
వారికులం గనుంగొని భవత్ప్రభువీక్షణకాంక్ష వచ్చితిన్ 343

అర్థాలు : వారిజ సంభవున్= బ్రహ్మను, ప్రభువాక్యము లేక= ప్రభుని అనుమతి లేక, చొచ్చి= ప్రవేశించి, దౌవారికులన్= ద్వారపాలకులను, భవత్ప్రభువీక్షణకాంక్ష= మీ యొక్క ప్రభువులను చూడవలెనను కోరికతో

భావము : ద్వారము వద్ద పాలకులు బ్రహ్మను అడ్డగించి "మీరెవరు? ఎక్కడికి పోవుచున్నారు? మా ప్రభువు ఆనతి లేక ద్వారమును ప్రవేశింప వచ్చునా? నిల్వుము" అనగా కొంచెము ఆలోచించి "మీ ప్రభువు దర్శనమునకై వచ్చితిని"

ఆ॥ బ్రహ్మఋషిని నన్నువారింపజన దన
వారు శాపభీతి వల్వదనక
పోవనీయ జొచ్చి పోయి కన్గొనె మహా
మహిమదివ్యరత్నమంటపమున 344

అర్థాలు : వారింపన్ చనుదు= అడ్డగింపరాదు, వల్వదనక= వద్దనక, మహామహిమ దివ్యరత్నమంటపమున= గొప్ప మహిమగల దివ్యమైన రత్నములు పొదిగిన మండపమందు

భావము : "నేను బ్రహ్మ ఋషిని అడ్డగింపవద్దు" అనగా వారు లోపలికి పోనిచ్చిరి. అచట దివ్యమైన గొప్ప రత్నకాంతులు గల మంటపమందు

క॥ చింతామణిసింహాసన
వంతున్ మౌనీంద్రమధ్యవాదీకృత వే
దాంతున్ హరిపద భజనా
స్వాంతున్ ధీమంతు కపట వాణీ కాంతున్ 345

అర్థాలు : చింతామణి సింహాసనవంతున్= చింతామణియను పేరు గల సింహాసనమున నున్న వానిని, మౌనీంద్ర మధ్యవాదీకృత వేదాంతున్= ముని శ్రేష్ఠుల వేదాంతచర్చలో మధ్యవర్తిగవాదించు వానిని, హరిపద భజనా స్వాంతున్= విష్ణు పాదములను మదిలో ధ్యానించు వానిని, ధీమంతు= బుద్ధిశాలిని, కపట వాణీకాంతున్= సరస్వతీ దేవికి భర్తయైన బ్రహ్మవలె నున్న వానిని

భావము : మండపమున చింతామణియనెడి పేరు గల సింహాసనముపై కూర్చుండి వేదాంత చర్చలలో పాల్గొన్న వానిని, విష్ణు భక్తుని, వాణి పతివలె నటించుచున్న మాయా బ్రహ్మను చూచెను.

చ॥ కనుగొని గ్రక్కునన్ మరలి కంజభవుం డతిదుఃఖితాత్ముడై
తనువెరియంగ మిక్కిలిగ తాపమునొంది కృశించి పొక్కుచున్
జని హిమవన్నగాగ్రమున సందడిలేని రహస్య భూమి నొ
య్యన వసియించి నెవ్వగల వందుచు నిట్లను నాత్మలోపలన్ 346

అర్థాలు : కనుగొని= చూచి, గ్రక్కునన్= వెంటనే, మరలి= వెనుకకు తిరిగి, కంజభవుండు= బ్రహ్మ, ఎరియంగ= మండగా, పొక్కుచున్= బాధపడుచు, హిమవన్నగాగ్రమున= హిమాలయ పర్వతపు కొప్పున, సందడిలేని= శబ్దములేని, నెవ్వగల= తీవ్ర దుఃఖములతో, వందుచు= తపించుచు

భావము : వెంటనే, మిక్కిలి దుఃఖముతో శరీరము వేడెక్కగా ఆ వేడిమి భరింపలేక చిక్కిపోయి, బాధపడుచు హిమవంతుని పర్వత శిఖరముపై సందడి లేని చోట దుఃఖములతో తపించుచు ఇట్లు తలచెను

సీ॥ హరినాభిపద్మంబునందు బుట్టిన పుట్టు
వెరుగక తిరిగిన తెరగు మఱచి
ఆక్లేశమణగిన న్నర్మిలి దపము
వింప బంపిన యట్టి బెంపు మఱచి

ఈ జగత్సృష్టికి నింత నేరుపు గల్గ
మతి యొసంగిన మహామహిమ మఱచి
బహుతరరాక్షసబాధలనెడబాపి
పరిరక్షణము చేయు కరుణ మఱచి

తే॥ గతము నొందిన దుర్లభగరిమ మఱచి
కార్య మహిదుంబు లెల్లను కాలబెట్టి
నిర్నిమిత్తంబు మాధవునింద జేసి
తేరకూరకె పగగొని తెచ్చుకొంటి 347

భావము : విష్ణువు తామర బొడ్డులోని తన పుట్టుకను గుర్తింపక తిరిగిన తీరు, ఆ తప్పును మఱచి పొందిన తీవ్రదుఃఖమును తొలగించి, ప్రేమతో తపము చేసుకొనుటకు పంపిన గొప్పతనము మఱచి సృష్టి చేయుటకు నేర్పును ఇచ్చిన, ఉన్నతమైన ప్రభావమును మఱచి, రాక్షసుల బాధలను (మధు కైటభులనుండి) తొలగించి రక్షించిన కరుణను మఱచి, పూర్వము లభించిన సులభ సాధ్యము కాని ఉన్నత పదవిని మఱచి, తాను కావించిన శ్రేష్ఠములైన పనులను మఱచి, కారణములేకయే, విష్ణువును నిందించి, తేలిక కాగా పనిలేక పగ తెచ్చుకొన్నాను కదా!"

చ॥ పలుకులరీతినే మెలగు ప్రాణపదంబు నిరంతరంబుగా
తలపున బాయె దెట్లు వనితామణి సుందరియుం బతివ్రతా
తిలకము సర్వలక్షణసుధీనిధి మానిని ప్రాణవల్లభా
పలుకులకల్కి యెందు పరుపంచలనున్నదొ యేమి సేయుదున్ 348

అర్థాలు : పలుకుల రీతినే మెలగు= చెప్పినట్లే నడచుకొను, ప్రాణపదంబు= ప్రాణ స్థానము, తలపున పాయదు= మఱపురాదు, సర్వలక్షణ సుధీనిధి= అన్ని మంచి లక్షణములుగల, బుద్ధికి గని, పలుకుల కల్కి= వాగ్దేవత, సరస్వతి, పరుపంచలన్= ఇతరుల ఇళ్లలో

భావము : చెప్పినట్లు నడచుకొను నా ప్రాణస్థానమైట్టి వాణి ఎల్లప్పుడును తలపున నుండి తొలగిపోదు. ఆ సుందరి పతివ్రతలలో మిన్న. సర్వ లక్షణములుగల మంచి బుద్ధికి నెలవు. సర్వ లక్షణములతో గల ఆత్మగౌరవము కలది నా ప్రియురాలైనభార్య, ఆ పలుకుల కలికి ఎచ్చట ఇతరుల ఇండ్లలో ఎట్లున్నదో! ఇప్పుడు నేను ఏమి చేయగలను?"

చ॥ చిలుకకు జెప్పి నట్ల చెవిజేరి ప్రయోక్తుల గార్యభాగముల్
దెలియగ సర్వసమ్మతము ధీకలితంబు నయంబు మీరగా
పలికిన భారతీవచన పద్ధతులన్ని విషంబు లట్టుగా
దలపున బెట్టి దుర్మదము దార్కొని యింతకు దెచ్చుకొంటిగా 349

అర్థాలు : ప్రయోక్తుల= కార్యనిర్వాహకుల, కార్యభాగముల్= బాధ్యతల విభాగములను, సర్వసమ్మతము= అందఱు అంగీకరించుచున్న దానిని, ధీకలితంబు= వివేకముతో కూడినది, నయంబు మీరగా= చాలా మృదువుగా, భారతీవచన పద్ధతుల= సరస్వతి మాటల సూచలను, తలపున పెట్టి= ఊహించి, దుర్మదము తార్కొని= మించు గర్వమును కూడబెట్టుకొని.

భావము : చిలుకకు చెప్పినట్లు వివిధ కార్యములను ప్రయోగింపచేయు తెలివికలది. అందఱు అంగీకరించు విధులను మృదువుగా చెప్పు బుద్ధిశాలిని. సరస్వతి మాటల రీతులను పూర్తిగా విషము వలె తలచి మించు మదమును పొంది అనిష్టములైన కష్టాలను తెచ్చుకొంటిని కదా!

ఉ॥ లోకములెల్ల నే దిరిగి లోకుల గన్గొని లజ్జనొందుచున్
లోకవిభుల్ ప్రభుత్వమున లొంగక తన్ను నిరాకరించగా
నాకరమెందు లేక సుగుణాత్మకు డొక్కడు చేర దీసినా
గైకొని వాని పంచబడి కష్టత నే ఘటియించు టేలకో 350

అర్థాలు : లజ్జనొందుచున్= సిగ్గుపడుచు, లోకవిభుల్= లోక పాలకులు, ఆకరము= ఆశ్రయము, ఉండుటకు తావు, సుగుణాత్మకుడు= సుగుణశీలి పంచబడి= ఇంట వసించుచు, ఘటియించుటేలకో= సృష్టించుకొనుట ఏల?

భావము : "లోకములన్నిటిని తిరిగి, లోక పాలకులు తన్ను నిరాకరింపగా, సిగ్గుపడుచుండగా, ఎవడైన గుణవంతుడు జాలిపొంది, ఉండుటకు తావు లేని నన్ను చేరదీసినను అతని ఇంటిని చేరి కష్టాలను క్రొత్తగా ఏల సృష్టించుకొన వలెను?'

క॥ పగదీర్చు మంచు పలువుర
దగులుచు బతిమాలుకంటె దాయిపదంబుల్
తగ బట్టుకొన్న మేలగు
భగవంతుని విడిచి యొరుల ప్రాపది యేలా? 351

అర్థాలు : పలువురతగులుచు= ఎందరినో వెంటబడి, దాయి(దాత) పదంబుల్, ప్రాపు= అండ, సహాయము.

భావము : "పగను తొలగించండి అని ఎందరినో బ్రతిమాలు కొనుటకంటె దాయి (దాత= రక్షకుడు), వరములిచ్చు హరి పదములను చక్కగా పట్టుకొన్న మేలగును. ఆ పరమాత్మను విడిచి ఇతరుల సహాయమెందులకు?"

వ॥ అని నిశ్చయించి మదం బడగి గర్వంబు సర్వంబునుం బూర్వ పక్షంబై తప్త హృదయుండును నత్యంతదీనుండును బహుతరార్తి సమన్వితుండు నునై యొక్క విజనప్రదేశంబున సంపాదిత సర్వసాధ నుండై శ్రీశ్రీ హరిపాదారవింద యుగళ సంస్థిత హృదయకమలుండై తపోనిష్ఠ నచంచల మానసంబునం గన్నులు మూసి నిరంతర హరిచరణ ధ్యానానంద పరవశుండై యుండె నట వైకుంఠపురంబున శారదాసతీ రత్నంబు బహుప్రయత్నంబుల లక్ష్మీ కటాక్ష వీక్షణాపేక్ష బహు కాలంబు తత్పరిచర్య గావింపుచునుండి యొక్కనాడు ధ్యాన వనాంతరామృత సరసితట నికటాశ్వత్థ మూల నివాసినియైయున్న సమయంబున తన మనంబున 352

అర్థాలు : పూర్వపక్షంబై= వాదము తొలగ గొట్టబడి మునుపటిదికాగా, తప్తహృద యుండును= తాపము జెందినమనస్సు గలవాడును, బహుతరార్తి

సమన్వితుండును= గొప్ప జాలి బాధతోనున్న వాడును, విజన ప్రదేశంబున= ఎవ్వరు లేని చోట, సంపాదిత సర్వసాధనుండై= కావలసిన వస్తువులన్నిటిని సేకరించినవాడై, హరి పాదారవిందయుగళ సంస్థిత హృదయ కమలుండై= విష్ణు పాదములందు నెలకొన్న హృదయముగలవాడై, అచంచలమానసంబున= చలించని మనస్సుతో, లక్ష్మీ కటాక్షవీక్ష+అపేక్ష= లక్ష్మీ దేవి కడకంటి చూపును కోరి, తత్పరి చర్య= ఆమె సేవలు, ధ్యానవనాంతరామృత సరసితట నికటాశ్వత్థ మూలనివాసియై= తపో వనంబులోని అమృత సరస్సు ఒడ్డునకు చేరువన గల అశ్వత్థ వృక్షము మొదలున కూర్చొని. (లక్ష్మీ కటాక్షము సులభ సాధ్యమనియు. ఆమె చూపు సోకనిదే విష్ణుని దయ కలుగదనియు వైష్ణవ విశ్వాసము)

భావము : గర్వము తొలగి జనులు లేనిచోట నిశ్చల హృదయంబునందు హరి పాదముల జంటను నిల్పుకొని ఆనందముతో తపోనిష్ఠలో పరవశించి యుండెను. వైకుంఠమునందు శారదాదేవి లక్ష్మీ యొక్క కడగంటి చూపునుకోరి చాలాకాలము సేవల చేసెను. ఒకనాడు ధ్యానవనమందు రావి చెట్టుకింద నుండగా తన మనస్సులో

ఉ॥ ఎన్నడు వీడు నా యిడుమ లెన్నడు నా విభుగూడు కొందు నే
నెన్నడు హాయినొంది తలయెత్తుదు నా సరివారిలోన ని
ట్లెన్నడు పద్మసూతి దయ నిచ్చ మెలంగుదు గాపురింతు నా
కిన్నియు నేల? ప్రాణ విభు డెక్కడ నే దురవస్థ చెందెనో! 353

భావము : 'నా కష్టాలు ఎప్పుడు తొలగునో? ఎప్పుడు నా భర్తను కలిసికొందునో? నా సరివారలలో ఎప్పుడు మునుపటివలె గౌరవముతో సుఖపడుదునో ? ఎప్పుడు ఆ బ్రహ్మ దయతో నా మనస్సునకు సంతోషము కలుగునట్లు తిరుగుచు కాపురము చేయునో! ఇప్పుడు ఆ విషయములు ఏల? నా ప్రాణమైన పతి ఎక్కడ ఎన్ని కష్టాలను అనుభవించుచున్నడో కదా!'

ఉ॥ సేమముతోన నున్న నిటచేరక యొక్క నిమేషముండునే
తామరసాక్షుమాయ తను దార్కొని చిక్కులబెట్టి త్రిప్పగా
నేమయిపోయెనో యెచట నే క్రియ జిక్కిటు రావశంబుగా
కామహితాత్ము డే పగిది నా పద బొందెనొ యెందు జిక్కెనో 354

భావము : "క్షేమముతో ఉన్నచో ఇక్కడ చేరక ఒక్క నిముషమైన ఉండునా? విష్ణుమాయకు లోనై ఎన్ని చిక్కులు పడెనో! ఏ మయ్యెనో? ఏ పనిలో చిక్కి ఇక్కడికి రాలేని విధముగా ఆ గొప్ప మనసు కలవాడు, ఆపదపొంది బాధ పడుచున్నాడో?"

వ॥ అని తపియించుచు నవ్విరహ వేదనాయుతమానసయై నిల్పుట కాకళింప రాని తాపంబునుం బొంది తత్పరవశాత్మకయై కన్నులు మూసి తదాకార చేష్టా విలాస విభ్రమకళాసౌందర్యంబులు దలపోయిచు నుండె నా సమయంబున శ్రీ మన్నారాయణ కరుణాకటాక్ష విశేషంబున కృత్రిమబ్రహ్మ మాయంబైన కాలంబున వాణీ పితామహుల మానసంబులు నే త్రేంద్రియ వశగతంబులై కన్నులు విచ్చిచూచు నప్పుడు 355

అర్థాలు : వేదనాఉదితమానసయై వ విరహవేదనచే మిక్కిలి తాపము కలిగిన మనస్సు గలదై, నిల్పుట కాకళింపరాని తాపంబును వ (మనసును) నిల్పుటకు వశమునకు రాని, తత్పరవశాత్మకయై వ ఆ బ్రహ్మ దేవునియందు వశవర్తియైన, ఆత్మగలదియై, తదాకారచేష్టా విలాస విభ్రమ కళా సౌందర్యంబులు తలపోయుచు వ వాని రూపమును, చేష్టల సోయగమును, కళాత్మకతను, అందమును ఆలోచించుచు, నేత్రేంద్రియవశగతంబులై వ కన్నులకు వశమై.

భావము : ఆ విధముగా చింత చెందుచు విరహమున కలిగిన వేడిమిచే మనస్సు వశము కాకపోవుటచే ఒడలు మఱచి కన్నులు మూసుకుని పతి సుందర రూపమును కనుచుండ శ్రీమంతుడైన నారాయణుని కరుణవలన

కపటబ్రహ్మ కనుమఱుగయ్యెను. అప్పుడు వాణియు, బ్రహ్మయు ఇరువురు కనులను తెఱచి చూడగా

సీ. ఒకకేలదర్పణ మొకకరంబున వాణి
యుత్తరీయాంశుక మొక శయాన
మున వాణిచుబుకంబు పుణుకుటయును గల్గి
ధాతయు భారతీ తరుణి తనదు
కుచములపయ్యెద గుదియబట్టిన కేలు
పతి చేష్ట వారించు పాణి గల్గి
మకరి కాపత్ర నిర్మాణార్థ పరికర
జాలంబు నంతంత సరవి దిరుగు

తే. బాలికలు గల్గి నిజలోక భద్రరాజ
మందిరాంతర కేళికానంద భవన
తరుణతరహంసతూలికా తల్పమునను
వన్నె మీరుచు తరుణిటు లున్నయంత **356**

భావము : వాణి ఒక చేతిలో అద్దము మఱొక చేతిలో తన పైట కొంగును పట్టుకొని ఉండెను. ఒకే పడకపై బ్రహ్మ వాణి గడ్డమును తాకుచు, తన చన్నులను గట్టిగా కప్పుకొన్న పయ్యెదను అదుముచును అతని చేతి చిలిపి పనిని అడ్డగించిన చేయి కలదయ్యెను. ఆమె చెక్కిళ్ళపై మొసలి బొమ్మను చిత్రించుటకై వెలయు సామాగ్రి నంతయు కూర్చుచు బాలికలు త్వరత్వరగా తిరుగగా హంస ఈకెలచే నిర్మితమైన తల్పముమీద

ఆ॥ దిశలు కలయజూచి తెలివియై యొండొరు
లాత్మ వెఱగునొంది యతిముదమున
కరుణ నలము కొనగ గాఢతరాలింగ
నముల నొంది విడని మమత లలరి **357**

అర్థాలు : దిశలు= దిక్కులు, కలయజూచి= చుట్టూ జూచి, వెరగునొంది= ఆశ్చర్యముజెంది, ముదమున= సంతోషముతో, గాఢతరాలింగనమున= బిగి కౌగిలిలో

భావము : అట్లు ఒక శయ్యపై దంపతులు తమ ఉనికిని గుర్తించి ఆశ్చర్యము చెంది సంతోషముతో, దయనిండగా, మోహముతో, బిగి కౌగిలిలో విడిపోని ఆసక్తితో మెలగిరి.

వ॥ అత్యంత సంతోషంబుతో నంతరంగంబులుండ వాణీశ్వరుండు ప్రాణేశ్వరితో నిట్లనియె **358**

భావము : అట్లు వారి అంతరంగములు అత్యంత ఆనందమయమగుచున్న సమయమున బ్రహ్మ తన ప్రియురాలితో ఇట్లనెను.

క॥ ఓహో యీ విధమింతయు
శ్రీహరిమాయా విశేష చేష్టలు గదె యీ
దేహం బెక్కడ నుండెను
ఈ హర్మ్యతలంబు చేరె నీక్షణమాత్రన్ **359**

భావము : ''ఓహో! ఆశ్చర్యము! అనుభవించినదంతయు ఆ హరి మాయా విలాసచర్యలు కదా! ఈ శరీరమెక్కడనో ఉండెను. ఒక్క క్షణములో ఇక్కడ మేడ మీదికి చేరెను కదా!'

వ॥ అని తనపడిన పూర్వ వృత్తాంతంబంతయు బ్రియకాంతకుం దెలియజెప్పి తద్వృత్తాంతంబంతయు దానివలన తానెరింగి విష్ణుమాయగడవ నెవ్వరికి వశంబని శ్రీ హరి పద పద్మభజనానురక్తుండై సుఖంబుండెనని శౌనకాదులకు సూతుండట్లనియె **360**

భావము (వచనము) : బ్రహ్మ తన పూర్వ వృత్తాంతమును వాణికి తెల్పి, ఆమె వృత్తాంతము తెలిసికొని, శ్రీ హరి మాయను దాటుటకు ఎవరికిని

సాధ్యము కాదని హరి భజన యందు శ్రద్ధ గలవాడై సుఖముగా నుండెనని మునులకు తెల్పుచు సూతుడిట్లు వచించెను.

క॥ ఈ కథ నెవ్వరు వ్రాసిన
వాక్రుచ్చిన విన్న సకలవాంఛిత ఫలముల్
చేకురు జ్ఞానం బొదవును
ప్రాకటముగ ముక్తి కాంత పరిణయ మబ్బున్ **361**

భావము : ''ఈ కథను ఎవ్వరు వ్రాసినను తెల్పినను, విన్నను వారి కోరికలన్నియు లభించును. జ్ఞానము కలుగును. తప్పక ముక్తికాంతతో వివాహమగును (ముక్తి కలుగును)''

తే॥ అనిన సంతసించి యమ్మునివర్యులు
విస్మయంబునొంది విష్ణుమాయ
దవిలి నారదుండు తరుణియై దుఃఖించి
పూర్వదేహ మెట్లు బొందె ననిన **362**

భావము : అని కథను చెప్పగా ముని వరులు సంతోషించి ఆశ్యర్యముతో ''నారదుడు విష్ణు మాయచే తాను వనితయై మరల పూర్వ శరీరమును బొందిన విధానము తెల్పుము'' అని కోరిరి.

శా॥ గౌరీ సంతతజప్యనామ రిపులోక వ్రాతదృగ్భీమ దు
ర్వారాఘౌఘ విరామ సంభరిత దివ్యస్తోత్ర కంఠావృతో
దార శ్రీకరహారదామ నత కందస్వామి భక్త వ్రజా
క్షీరాంభోనిధి పూర్ణ సోమ విజయ శ్రీరామ దివ్యోత్తమా **363**

అర్థాలు : గౌరీసంతతజప్యనామ= పార్వతిచేత ఎల్లప్పుడు జపింపబడు పేరు కలవాడా!, రిపులోక వ్రాతదృక్ భీమ= శత్రువుల గుంపుల చూపులకు భయమును కల్గించువాడా!, దుర్వార+అఘ+ఓఘ విరామ= సులభముగా తొలగించుటకు వీలుకాని పాపముల యొక్క రాశులను తొలగించినవాడా!, సంభరిత దివ్య స్తోత్ర కంఠ ఆవృత్త ఉదార= మిక్కుటమైన దేవతల, మునుల మధురములైన వేద సూక్తులు స్తోత్రములు చేయువారిచే చుట్టబడి ఉప్పొంగిన ఎదలో ఔదార్యము ప్రదర్శించువాడా!, శ్రీకరహారదామ= శుభములను కల్గించు ముత్యముల సరములు, పూల మాలలు ధరించినవాడా!, నత కందర్పాదిభక్తవ్రజ= నమస్కరించుచున్న మన్మథుడు మొదలైన భక్తుల సమూహమును కలవాడా! (శివభక్తుల సమూహము కలవాడా, కందస్వామి, కుమారస్వామి తండ్రి శివుడు), క్షీర+అంభోనిధిసోమ= పాల సముద్రమున పుట్టిన చంద్రునివంటివాడా!, విజయశ్రీరామా= విజయములతో లక్ష్మీదేవిని రంజింపజేయువీరుడా! దివ్య+ఉత్తమ= దేవతలలో శ్రేష్ఠుడా!

భావము : గౌరిచే ఎల్లప్పుడు జపింపబడువాడా శత్రువులకు భయంకరుడా! పాపములను నాశనము చేయువాడా! దేవతలు, మునులచే స్తుతింపబడు ఉదారుడైనవాడా! శుభకరములై ముత్యాల పువ్వుల యొక్క దండలు ధరించినవాడా! నమస్కరించుచున్న మన్మథుడు మొదలైన విష్ణు భక్తుల యొక్కయు, శివ భక్తుల యొక్కయు సమూహమును కలవాడా? పాల సముద్రమున జనించిన చంద్రుని వంటి కాంతికలవాడా! విజయములచే మహాలక్ష్మిని ఉల్లాస పఱచు మహావీరుడా! దేవతలలో ఉన్నతుడా!

మత్త॥ వాసుదేవనిరంజనాసుర వైరి గర్వవిభంజనా
శ్రీసతీవనితాకరా మదచిత్తశాత్రవ భీకరా
దాసమానసతోషణా హిత దైత్యవర్గవిశేషణా
భాసురాంబుజలోచనా భవపాశబంధవిమోచనా **364**

అర్థాలు : వాసుదేవ= వసుదేవకుమారా! సర్వమును నిండియున్న దైవమా!, నిరంజనా= దేనితోగాని సంగము లేనివాడా! సురవైరి గర్వవిభంజన= దేవతలకు శత్రువులైన వారి గర్వమును త్రుంచువాడా! శ్రీ సతీవనితాకరా=

లక్ష్మీ దేవికి నెలవైన వాడా! మద చిత్త శాత్రవభీకరా!= మదించిన మనస్సులు గల శత్రువులకు భయము పుట్టించువాడా! దాసమానస తోషణా= దాసుల మనస్సులను సంతోష పెట్టువాడా!, హితదైత్య వర్గ విశేషణ= హితులైన రాక్షస పక్షములను పోషించువాడా!, భాసురాంబుజలోచనా= వెలుగుచున్న పద్మములవంటి కన్నులు గలవాడా!, భవపాశబంధవిమోచనా=సంసారమను సంకెళ్ళ బంధమును తొలగించువాడా

స్రగ్విణి॥ హరీ వారిజాక్షా దయావాసపద్మో
దరా శారదేశార్చితా చక్రపాణీ
పరాకార మానాథ భాస్వద్విలాసా
సురాధారసర్వేశ॥ సుత్రామవంద్యా! 365

అర్థాలు : దయావాస= దయకు నెలవైనవాడా!, పద్మోదరా= ఉదరమున (నాభియందు) పద్మము గలవాడా!, శారదా+ఈశఅర్చితా= బ్రహ్మచే పూజింపబడువాడా! చక్రపాణీ= చక్రాయుధమును ధరించువాడా!, పరాకార= ప్రాకృతముకాని దివ్యాకారము గలవాడా!, మానాథ= లక్ష్మీపతీ!, భాస్వత్ విలాసా= ప్రకాశించు విలాసములు గలవాడా!, సురాధారసర్వేశ= దేవతలకు ఆధారమైన సమస్తమునకు ప్రభువైనవాడా!, సుత్రామవంధ్యా= ఇంద్రునిచే నమస్కరింపబడువాడా!

ఇతి శ్రీ మద్వేంకటేశ్వర వరలబ్ధ కవిత్వ రచనాచమత్కార
సుజన భజనాచార భారద్వాజ గోత్ర పవిత్ర నరసనామాత్య పుత్ర
సరససుకవి జన సఖ్య వేంకటాఖ్య ప్రణీతంబైన విష్ణుమాయా
విలాసంబను మహా ప్రబంధంబునందు తృతీయాశ్వాసము.

చతుర్థాశ్వాసము

శ్రీ దయితా హృదయేశ్వర!
నాదప్రియ భక్తవరద నలిన దళాక్షా!
యాదవవంశ శిఖామణి!
వేదోద్ధర బిట్రగుంట వేంకటరమణా! 1

అర్థాలు : శ్రీదయితాహృదయ+ఈశ్వర= లక్ష్మీదేవి యొక్క ఎదకు ప్రభువైనవాడా!, నాదప్రియ= సంగీతమందు ప్రీతికలవాడా!(నారదగాన సంగీత లోలుడు), భక్తవరద= భక్తులకు వరములిచ్చువాడా!, నలినదళ+ అక్షా= కమలము వంటి కన్నులు కలవాడా!, యాదవవంశశిఖామణి= యాదవుకులము నందు తలమానికమైనవాడా!, వేద+ఉద్ధార= వేదాలను సోమకాసురుని వధించి కాపాడినవాడా!

విశేషములు : ఈ పద్యములో మొదటి సగమున విష్ణుని, 3వ పాదమున అవతారమూర్తియైన కృష్ణుని, నాల్గవ పాదమున వేదోద్ధారకుడు, అనగా జ్ఞానమునుద్ధరించిన మత్స్యావతారుని స్మరించి, వీరందఱను బిట్రగుంటలోని వేంకటేశ్వరుని మూర్తిలో భావించి, కవి నమస్కరించుచున్నాడు.

లక్ష్మికాంత్యభిమాని. విష్ణువు స్థితికారకుడు. వీరిద్దఱు ఒకరిని విడిచి మరొకరు మనలేరు. వీరి కలయికలోనే ప్రణవనాదము(ఓంకారము) జనించుట. అందుండే సృష్టి. ఇది కాంత్యుద్భవము. కాంతి జ్ఞానమునకాలంబనము. ఇట్లే మూడును పెనవేసికొని యున్నవి. కాంతి, స్థితి, జ్ఞానము మూడింటిని సర్వవ్యాపియగు విష్ణుని యందు కవి దర్శించినాడు. 'వెంకటరమణా' అనగా 'లక్ష్మీనాథా' అనుటేకదా.కృష్ణుడు జన్మించిన వంశమునకు యదువు మూలపురుషుడు. వానినుండియే యదువంశమను పేరు కలిగినది. కవి జన్మసార్థక్యమునకు కోరినది ఈ జ్ఞానకాంతినే. ఈ కావ్యవస్తువు కూడా ప్రతి ఆశ్వాసమున మాయ అనగా

ప్రకృతి నుండి పురుషుని తెలిసికొను జ్ఞానముననే పర్యసించును, అనగా, వ్యవస్థితమైన ప్రకృతినుండి దాని స్థితిమూలకమునకు సాగును. ఇట్లీ కావ్యాది ఇష్టదేవతా స్మరణము సార్థకము. 'భక్తవరద' అనగా భక్తులకు వరములిచ్చు వాడని కాగా, భక్తవరులకు (శ్రేష్ఠులకు) ఇచ్చువాడనియు అర్థము. అనగా, సాధారణ భక్తులకు ఐహికమును, శ్రేష్ఠులకు ఆముష్మికమును ఇచ్చువాడను విశేషార్థధ్వని యేర్పడును.

ఆ॥ అవధరించు శౌనకాది సన్మునులకు
సూతుడిట్టులనియె బ్రీతి తోడ
వినుడు ధాతకైన విష్ణుమాయ చరిత్ర
ములును గణన సేయ దరముగాదు 2

అర్థాలు : అవధరించు= శ్రద్ధగా విను, ధాతకైన= బ్రహ్మకైన, గణనసేయ= లెక్కించుటకు, పొగడుటకు.

భావము : వినుచున్న శౌనకుడు మొదలైన గొప్పమునులతో సూతమహర్షి ప్రీతితో ఇట్లనెను. "బ్రహ్మకైనను విష్ణుమాయల కథలను లెక్కించి చెప్పుటకు గాని, ఎంతో గొప్పవని ప్రశంసించుటకు గాని సాధ్యము కాదు."

విశేషము : బ్రహ్మ సృష్టికర్త కనుకను, అతని నాలుగు ముఖములు వేదములు చదువుచుండును కనుకను, అతడు జ్ఞానమూర్తియని భావించినను, వాని జ్ఞానము రజోగుణముతో చేరినందున సమగ్రము కాదు. అందువలన విష్ణుమాయావిలాసము పరిధిని గాని, మహత్వమును గాని తెలిసికొనలేము.

ఉ॥ నారదుడంగనాకృతిని నాథుని గైకొని సర్వ సంపదల్
మీరగ భోగభాగ్యముల మించి కుమారుల గాంచి యంతటన్
వారని దుఃఖముల్ బొరసి వారిజలోచను సత్కృపామృత
శ్రీరతుడయ్యె గర్వమును చెందిన వారలు సేగి నొందరే! 3

అర్థాలు : అంగనా+ఆకృతిన్= ఆడుదాని రూపములో, వారని= దాటలేని, పొరసి= పొంది, అనుభవించి, సత్+కృపా+అమృతశ్రీరతుడయ్యె= మేలైన దయ అను అమృతసంపదలో ఆసక్తి కలవాడాయెను, సేగి= కష్టము, దుఃఖము.

భావము : నారదుడు స్త్రీయై, భర్తను సంతానమును, సంపదలను పొంది, ఆపై భరింపరాని దుఃఖమును అనుభవించి, పిమ్మట విష్ణుకృపకు పాత్రుడు కావలెనను కోరిక గలవాడాయెను. గర్వమును పొందినవారు దుఃఖములను పొందరా?

విశేషము : ఈ ఆశ్వాసమున రాగల కథావిశేషమును కవి ఈ పద్యములో రేఖామాత్రముగ చెప్పినాడు. దీనివలన విను వారి ఉత్సుకత పెరుగును.

వ॥ అనిన సూతునకు నమ్మునీంద్రు లిట్లనిరి 4

వచనము : అనగా ఆ మునీంద్రులు సూతునితో ఇట్లనిరి.

ఉ॥ నారదు డెట్టులంగనగు నాథుని గైకొను టెట్లు సంపదన్
మీరుట లెట్లు పుత్రులను మిక్కిలి గాంచుట లెట్లు యంతటన్
వారనియట్టి దుఃఖమున వర్తిలుటెట్టులు శౌరిసత్కృపన్
భూరివివేక! యెట్టులను బొందె నిజాకృతి చోద్య మయ్యెడిన్ 5

అర్థాలు : వర్తిలుట+ఎట్టులు= ప్రవర్తించు విధమేమి?, శౌరి= కృష్ణుడు, విష్ణువు, భూరివివేక= గొప్పవివేకము గలవాడా!, నిజ+ఆకృతి= తనదైన రూపమును, చోద్యము= విచిత్రము, ఆశ్చర్యము.

భావము : నారద మహర్షికి స్త్రీరూపము, భర్త, సంపద, సంతానము ఇవన్నీ ఎట్లు వచ్చినవి? దుఃఖకారణమేమి? మరల తన నారదరూపాన్ని పొందిన వృత్తాంతము ఆశ్చర్యము.

విశేషము : నారదుడు బ్రహ్మమానస పుత్రుడు. నారాయణ నామస్మరణ తప్ప ఏ కోరిక లేనివాడు. ఆ మహాత్ముడు ప్రాకృతుల వలె ఇన్ని కష్టసుఖాలు అనుభవించుట ఆశ్చర్యము కదా!

క॥ శరణంబులు బుధకర్ణా
భరణంబులు దురితతిమిర భాస్కరసుమహ
త్కిరణంబులు భవకంధి
స్తరణంబులు విష్ణునామ సంస్మరణంబుల్ 6

అర్థాలు : బుధకర్ణ+ఆభరణంబులు= జ్ఞానుల చెవులకు సొమ్ములు (సదా వినకోరునవి), దురితతిమిర= పాపము అనెడి చీకటిని, భాస్కర= సూర్యుని యొక్క, సుమహత్= గొప్పవైన కిరణంబులు, భవకంధిస్+తరణంబులు= సంసారమనెడు సముద్రమును దాటుటకు

భావము : ఆశ్రయింప తగినవి. జ్ఞానులు వినగోరునవి. పాపమనెడి చీకటిని నశింపజేయునవి. సంసార సముద్రము యొక్క దుఃఖములను నివారించునవి. విష్ణునామ ధ్యానములు.

ఉ॥ పావనముల్ పవిత్రములు భక్తజనాత్మసరోజసంఘు సం
జీవనముల్ ఉదాత్తము లశేషశుభోదయకారణంబులున్
శ్రీ విభవప్రదంబులు ప్రసిద్ధములై విలసిల్లునట్టి రా
జీవదళాయతాక్షుని యశేషచరిత్రము లానతియ్యవే 7

అర్థాలు : భక్తజన+ఆత్మసరోజసంఘుసంజీవనముల్= భక్తుల ఆత్మలనెడు పద్మములను చైతన్యవంతము చేయునవి.

భావము : విష్ణుచరిత్ర విశేషములు స్వయముగా పవిత్రములు, వినువారిని పవిత్రుల జేయునవి. భక్తుల ఆత్మలను చైతన్యపఱచునవి. శుభప్రదములు. సిరిసంపదల నిచ్చునవి. గొప్పవైన విష్ణుకథలను పెక్కింటిని మాకు విన్పింపుడు.

ఆ॥ అనిన శౌనకాది మునివర్యులకు రౌమ
హర్ష ణిట్టులనియె నాత్మ నరసి
కమలనయను పద కమలముల మది నిల్పి
గురుల దలచి భక్తి కుదురు పరచి 8

అర్థాలు : రౌమహర్షణి= రోమహర్షణునిసుతుడు, ఆత్మన్+అరసి=దివ్యదృష్టితో చూచి,

భావము : అనగా విని సూతుడు దివ్యదృష్టిని సారించి, విష్ణుని పాదపద్మము లందు మనస్సు నిల్పి (ధ్యానించి). విష్ణుభక్తిని నిల్పుకొని ఇట్లు వచించెను.

క॥ వినుడీ భూలోకంబున
దనరున్ పశ్చిమపయోధిదరి ద్వారకనా
ఘనికనకవస్తువాహన
వనితావనజాతనిలయవాసం బగుచున్ 9

అర్థాలు : తనరున్= ఉన్నది, పశ్చిమపయోధిదరి= పడమటి సముద్రము ఒడ్డున,

భావము : వినుడు. భూలోకములో పడమటి సముద్రతీరాన ద్వారక యున్నది. అది శ్రీకృష్ణుని యొక్క బంగారు, విలువైన వస్తువులు, చతురంగ బలములు అందగత్తెలు, చక్కని వనములకును నివాస భూమియై విలసిల్లుచున్నది.

సీ॥ అష్టసంపదలంచు నన నెట్లు పదియారు
వేలుగా శ్రీ లక్ష్మి వెలసి మెరయ
చతురంగబలముల సంఖ్యాన మెంతన
జగతి భారము దీర్చ జాలి తనర
సుందరీజనముల సొబగు లెన్నగ నెట్లు
శ్రీ వల్లభుడు జారశేఖరుండు

కమలాకరముల శృంగార మేమనవచ్చు
క్షీరాంబునిధిశాయి క్రీడ సల్పు

ఆ॥ ప్రకటమూర్తి యగుచు ప్రద్యుమ్నుడు చరింప
మలయపవనచైత్రజలజవైరి
శుకపికాళి హంసనికరంబు లుండవె
కాపురముగ ద్వారకాపురమున 10

అర్థాలు : జార= విటులలో, క్షీరాంబునిధి= పాలసముద్రము, కమలాకరముల= సరస్సుల, ప్రకటమూర్తి= అవతారమూర్తి, జలజవైరి= పద్మముల శత్రువుగా చంద్రుడు, శుక= చిలుక, పిక= కోకిల, అళి= తుమ్మెద, నికరంబులు= సమూహములు

భావము : కృష్ణుని భార్యలైన పదియాఱువేల గోపికా మూర్తులుగా లక్ష్మీదేవి వెలసియున్నది. కనుక కృష్ణునకు అష్టైశ్వర్యములున్నవని చెప్పుట పొసగదు. జగత్తులో లెక్కలేనన్ని దుష్టులను శిక్షించుటకు తగిన సైన్యమెంతో యున్నది. కనుక చతురంగ బలములను లెక్కపెట్టుట పొసగదు. విటులలో మొనగాడైన కృష్ణుడున్నాడు. కనుక స్త్రీల అందంచందములను వర్ణించుట వృథాప్రయాస. పాలసముద్రములో పవ్వళించిన విష్ణువే కృష్ణుడై వినోదించు చున్నాడు. అచ్చటి సరస్సుల శృంగారవిలాసాలను వర్ణింపగలమా? చక్కని రూపముతో, (ప్రద్యుమ్నుని) మదనుడు తిరుగుచుండగా అచ్చట మలయ పవనుడు (వాయువు) వసంతుడు, చంద్రుడు, చిలుకలు, కోకిలలు, హంసలు ద్వారక యందు వెంటనంటి యుండవా?

విశేషాలు : ప్రద్యుమ్నుడనునది మన్మథుని పేరు. ఇతడు విష్ణుకుమారుడు. మన్మథుడును వసంతుడును మిత్రులు. కనుక ఒకరికొకరు తోడు తోడుగా నుందురు. ఇచట ద్వారకలోగూడ కలిసియే యున్నారని తాత్పర్యము.

అష్టలక్ష్మి మూర్తులుగా శ్రీలక్ష్మి అర్చింపబడుచున్నది. ఆ రూపములివి: 1.ఆదిలక్ష్మి, 2.ధ్యానలక్ష్మి, 3.ధైర్యలక్ష్మి, 4.గజలక్ష్మి, 5.సంతానలక్ష్మి, 6.విజయలక్ష్మి, 7.విద్యాలక్ష్మి, 8.ధనలక్ష్మి. ఈ ఎనిమిది సంపదలుగా భావింపబడుచున్నవి.

ఒకరాజు సైనిక బలము నాల్గుగు విధాలు రథ, గజ, అశ్వ కాల్బములు. ఈనాడు కూడా కాల్బలమున్నది. రథములకు బదులు నేడు శతఘ్నులు అశ్వగజ దళములకు బదులుగా వైమానిక నౌకా దళములు వచ్చినవి.

సీ॥ గజకర్ణవాత ప్రకంపితంబులు గాని
వాతాహతులుగావు కేతనములు
వాతాయనముల ప్రవర్తించుటయె గాని
పవనునకును నోడి బయలుగాదు
బయలుగా శశిరవి బాధకాంతులె గాని
సోమ సూర్యులకాంతి సొగయ దంద్రు
కాంతి మించిన రత్నకాంచన సౌధముల్
గాని సున్నపుటిళ్లు గానరావు

తే॥ కలితబహువస్తు విపణి మార్గములగముల
కోటి కెత్తిన పడగలుకోటి కెత్తి
నట్టి సింహతలాటంబు లంగడులను
నిక్కి కనుపట్టు లెక్కకు మిక్కిలగుచు 11

అర్థాలు : గజకర్ణవాత= ఏనుగులు చెవులాడించుటవలన పుట్టిన గాలిచే, ప్రకంపితంబులుగాని= కదిలించబడినవే, కేతనములు= జెండాలు, పతాకములు, వాత+ఆహతులుగావు= ప్రకృతి సహజమగు గాలి తాకున కదలినవి కావు, వాతాయనముల= కిటికీల, పవనుకున్ ఓడి= వాయుదేవునకు ఓడిపోయి, బయలుగాదు= భయభీతములు కాదు,

బాఢకాంతులై= దట్టమైన వెలుగులే, సోమ= చంద్రుని, సొగయదు= ప్రసరింపదు, కలితబహువస్తువిపణి మార్గములగముల= సేకరించబడిన అనేక వస్తువులుగల వర్తక వ్యాపార కేంద్రముల, కోటికి+ఎత్తిన= కోటికొక్క పడగ చొప్పున, పడగలకోటికి+ఎత్తినట్టి= ప్రతిష్ఠింపబడిన కోట్లకొలది నాగపడగల ప్రతిమలు, సింహతలాటంబులు= సింహ విగ్రహములు.

భావము : పతాకములు, ఏనుగుల చెవులు ఆడించుట వలన కదలుచున్నవే! అవి సహజవాయు ప్రసారము వలన కాదు. ఆ కదలికలు, గవాక్షముల యందు ప్రవర్తించుచున్నవే! అవి వాయువునకు భయపడి అచట దాగుకొనుటకై కాదు. బహిరంగ ప్రదేశాలలో చంద్రకాంత, సూర్యకాంత మణుల దట్టమైన వెలుగులు వెల్లువయే! అచ్చట చంద్రుని సూర్యుని కిరణములు ప్రసరింపవు. (అతిశయించిన) రత్నములు స్వర్ణముల కాంతులను వెదజల్లు మేడలే! సున్నపు కట్టడములు కానరావు. పెక్కు వస్తువులు కల పెక్కు త్రోవలు, టెక్కెములు కోటీశ్వరులు ప్రతిష్ఠించుకొన్న నాగప్రతిమలతో కోట్లకొలది సింహ ప్రతిమలతో, అలంకరింపబడిన పూబంతుల కాడలు కలవై వ్యాపార కేంద్రములు(అంగళ్లు) చాల ఎత్తున లెక్కకు వీలుకాక కన్పట్టుచున్నవి.

విశేషము : అలంకారములు : ముక్తపదగ్రస్తము అతిశయోక్తి.

ఉ॥ సంతతయజ్ఞధూమములు జాలబిలోద్గతరేఖ లొప్పు న
శ్రాంతము నాత్మరాజ్యలయసంభవభీషణధూమకేతువి
భ్రాంతి సురేశ్వరుండు మదిబాయని వేదన నొందె నేటితో
నెంతయు నూరు నిండె నని యిచ్చ గలంగ నభోంతరంబులన్ 12

అర్థాలు : సంతతయజ్ఞధూమములు= నిరంతరమైన(తెఱపిలేని) యజ్ఞకుండముల నుండి వెలువడు పొగలు, జాలబిలోద్గతరేఖలు+ఒప్పు= కిటికీల నుండి పైకిపోవు చాళ్లుగ కన్పించును, అశ్రాంతము= ఎల్లప్పుడును,

ఆత్మరాజ్యలయసంభవభీషణధూమకేతువిభ్రాంతి= తన రాజ్యమును హరించునట్టి భయంకరమైన తోకచుక్కయేమో అను భ్రమతో, సుర+ఈశ్వరుండు ఇంద్రుడు, నభః+అంతరంబులన్= అంతరిక్షమున.

భావము : ఆ పురిలో యజ్ఞము లెప్పుడున్ను సాగుచుండుట వలన ఆకాశమునకు పొగలెగయుచుండును. అవి తోకచుక్క వలె తోచును. ఆ పొగల బారును చూచి తోకచుక్క యని భ్రమించి, తానింక ఇంద్రపదవి నుండి తొలగిపోవలసిన సమయము వచ్చినదేమో యని దేవేంద్రుడు వేదన చెందును.

విశేషము : ఇంద్రునకు శతమఖుడని పేరు. అనగా నూరు యజ్ఞములు చేసినవాడని అర్థము. ఆ పురమున యజ్ఞములు తెఱపి లేకుండ నుండుటచేత, ఆ నూరు యజ్ఞములందు పూర్తి చేసి, ఇంద్రపదమునకు అర్హతను పొంది వేఱొకరు సిద్ధమగుచున్నారని ఇంద్రుడు భావించును. ఈ నిమిత్తము దుఃశకునమై యజ్ఞముల పొగలు బారులు గట్టి ఆకాశమున తోకచుక్క వలె కన్పించును. తోకచుక్క పుట్టినచో, ఒక చక్రవర్తి నశించుటయో, ఒక మహాపురుషుడు పుట్టుటయో సంభవమని నమ్మకము. తోకచుక్క పేరు ధూమకేతువు. ఇందలి ధూమశబ్దమునకు పొగయని అర్థము. కనుక యజ్ఞముల పొగ, ధూమకేతు భ్రాంతికి కారణమైనదనుట స్వభావోక్తి. ఇది ఇంద్రునకు దుర్నిమిత్త మనుటకు సహజోక్తియే.

ఉ॥ గోపురమౌళిరత్నమయకుంభము లద్భుతకాంతకాంతితో
నాపరిఘాంబుబింబితములై ఫణిరాజు ఫణి ప్రభూషణ
స్థాపితరత్నజాలమను సంశయము దగ దీరు నందుపై
రేపును మాపుగాగ మదమెక్కి తడిన్ విదళించుహస్తికల్ 13

అర్థాలు : గోపురమౌళిరత్నమయకుంభములు+అద్భుతకాంతకాంతితోన్= గోపురముల పైభాగమున గల రత్నములు పొదివిన కుండల వంటి

ఆకారములు గలవి. అద్భుతమైన గొప్పకాంతితో, ఆపరిఘ+అంబుబింబితములై= కోటగనులలోని నీటిలో నీడలై లేచుట, ఫణిరాజు= ఆదిశేషుని యొక్క, ఫణి= పడగలలోని, ప్రభూషణస్థాపిత= అలంకారములుగ నున్న, తడిన్= మదద్రవమును, హస్తికల్= ఏనుగులు.

భావము : రత్నములు తాపించిన కుంభములు గోపురాగ్రముల నుండి వింత కాంతులీనుచుండగా, వాని ప్రతిబింబములు ఆకోట అగడ్తల(గవనుల)లోని నీటిలో ప్రకాశించుచు, ఆదిశేషుని పడగలలోని మణుల కాంతియా అను సందేహమును కలిగించును. ఆ కోటలో రేపగళ్లు మదమెక్కిన ఏన్గులు మదము చెక్కిళ్లనుండి స్రవింప చేయుచుండును.

విశేషము : ఆ కోటకు ఆదిశేషుడే కాపున్నాడేమో యను భ్రాంతి, ద్వారకలో శ్రీకృష్ణుడు విష్ణుని అవతారమూర్తి కనుక, సముచితమే.

మ॥ కనదుద్యన్మణికాంచన స్థగితరంగత్సౌధ సంచారికా
స్తనలిప్తాంచిత గంధసంకలితవాతంబుల్ వియద్వాహినీ
కనకాబ్జాతవిహార భృంగముల నాకర్షింపవే వచ్చి యం
దనిశంబున్ సుదతీనిరీక్షణ మిళిందాకారమై క్రుమ్మరున్ 14

అర్థాలు :కనత్+ఉద్యత్+మణికాంచనస్థగితరంగత్+సౌధసంచారికాస్తనలిప్త+అంచితగంధసంకలితవాతంబుల్= వెలుగులను ఎగజిమ్ముచున్న మణులతో బంగారముతో తాపితమై ప్రకాశించుచున్న మేడలలో సంచరించు పరిచారికల పాలిండ్లను అంటిన మంచిగందపు వాసనలతో కూడిన గాలులు, వియత్+వాహినీకనక+అబ్జాతవిహార+భృంగములన్= ఆకాశగంగలోని సువర్ణకమలములపై విహరించు తుమ్మెదలను, వే= వేగముగ, సుదతీనిరీక్షణమిళింద+ఆకారమై= సుందరాంగుల చూపులు అనబడు తుమ్మెదల రూపమున, క్రుమ్మరున్= చుట్టి తిరుగును.

భావము : ఆ పురమున మేడలలో సంచరించు పరిచారికల పాలిండ్లపై గల గంధపు పూతల వాసన గాలివాలున సోకగా, ఆకాశ గంగలోని బంగారు

పద్మములపై విహరించు తుమ్మెదలు అచట నుండి దిగి వచ్చి ద్వారకలోని అందమైన కామినుల కంటి చూపుల రూపమున అక్కడక్కడనే చుట్టి తిరుగునట్లున్నవి.

విశేషము : అందగత్తెల నల్లని వెంట్రుకలు గల కళ్లనుండి వెల్వడు కాంతులను తుమ్మెదలతో పోల్చుట సంప్రదాయమే! ''నానాసూనవితానవాసనల నానందించు...'' అనే పద్యములో ముక్కు(నంది) తిమ్మన గారి వర్ణన''పూనెన్ ప్రేక్షణమాలికామధుకరీపుంజంబు నిర్వంకలన్'' అన్నది ప్రసిద్ధ వర్ణన.

ఉ॥ ఆ పురిలోపలం గల మహాంధతమంబు నణంపగోరి తా
రేపున జక్రవాళగిరియెక్కియు నోపక సూర్యచంద్రులు
దీపితమైన తేజముల దీర్చిరిగా తమనాయకంబులన్
గోపురసౌధరత్నములకోటిమహోన్నతి దెల్ప శక్యమే 15

అర్థాలు : చక్రవాళగిరి= పురాణప్రసిద్ధమైన ఒక పర్వతశ్రేణి, ఓపక= చేయలేక, రేపున= ఉదయవేళ, తమనాయకంబులన్= తమవైన సూర్యకాంత, చంద్రకాంత మణులచే,

భావము : ఆ పురిలోని చీకటిని పారద్రోలుటకు ఉదయవేళ సూర్యచంద్రులు చక్రవాళగిరి నెక్కి, అందుకు అసమర్థులై తమ మణులచే మేడలు, గోపురములలో పొదివిన రత్నములలో కాంతులు నించి రనగా ఆ మేడలు గోపురము లెంత ఎత్తైనవో చెప్పతరమా?

విశేషము : చక్రవాళగిరి అనునది పురాణ ప్రసిద్ధమైన ఒక పర్వతశ్రేణి. ఇది భూమిని చుట్టి ఉండుననియు, ఇది వెలుగు చీకట్లను లేర్పఱచు గోడవంటిదని అరుగుదేర= రాగా, నాగనవ+ఊఢాశ్రీకరశిరో విభూషా+ఆలోకనమును= నాగకన్యల శిరస్సులందు క్రొత్తగా బుట్టిన మణిభూషణములను చూచుట గూడ, గ్రీవపరిఘలో= చుట్టునున్న అగడ్తలో

కII ఆ కోట వెంబడిగ దిగ
నాకాంగన లరుగుదేర నాగవధూ
శ్రీకరశిరోవిభూషా
లోకనమును గ్రీవ పరిఘలో సమకూరున్ 16

భావము : ఆ పురి కోట సమీపమందు స్వర్గస్త్రీలు దిగగా, వారికి కోట చుట్టున ఉన్న అగడ్తలో పాతాళము నుండి నీటిపైకి వచ్చిన, క్రొత్తవారైన ముద్దరాండ్రగు నాగకన్యల శిరస్సుల పడగలలో మొలిచి మెఱయుచున్న శుభకరములగు మణుల కాంతులను చూచి ఆనందించుటకు అవకాశము కలుగును.

విశేషము : స్వర్గస్త్రీలు గగనవాసులగుటయు, నాగకన్యలు పాతాళవాసుల గుటయు పురాణ ప్రసిద్ధము. ఇదియే ఔచిత్యము.

ఉII అంబరవాహినీ ప్రవిమలాంబువులన్ ప్రతిబింబ భానుతే
జంబులు పద్మరాగమణిజాలములం గలయంగ బర్వినన్
పంబిన సాంధ్యరాగమను భ్రాంతిని జూతురు నిచ్చనిచ్చ సౌ
ధంబులయందసంధ్యలను తామరసాక్షులు ముగ్ధలౌటచేన్ 17

అర్థాలు : అంబరవాహిని= ఆకాశగంగ, పంబిన(రూ. పమ్మిన)= అతిశయించిన, క్రమ్మిన, నిచ్చనిచ్చ= నిశ్చయముగా

భావము : ఆకాశగంగ యొక్క నిర్మలమైన నీటిలో సూర్యుని కిరణములు ప్రతిఫలించినవి. సౌధములందు పద్మరాగమణులు ఎఱ్ఱని కాంతులు, ప్రకృతియందు కన్పట్టినవి. అది సంధ్యాకాలము కాదు. మేడలందున్న ఎండ కన్నెరుగని ముద్దరాండ్రు, సంధ్యా సమయమని భ్రాంతితో నిశ్చయముగా ప్రకృతిని చూచెదరు.

కII గోపురగోవత్సంబులు
గోపురముల పచ్చరాలకొణిగల భానా

రోపితమతిచే డాయును
గోపురముల పొడవు దెలుప గోచరమగునే 18

అర్థాలు : గోపుర= గొల్లపల్లెల, గోవత్సంబులు= ఆవుదూడలు, గోపురముల= మేడలగోపురముల యొక్క, కొణిగల(రూ. కొణిగె)= ముంజూరులను, భాన+ ఆరోపితమతిచే= వెలుగులచే కలిగించబడిన బుద్ధితో, డాయును= చేరును.

భావము : మేడల గోపురముల ముంజూరులలో పొదుగబడిన పచ్చల కాంతి ఎంతదూరము వ్యాపించినదనగా, దూరమున నుండు గొల్లపల్లెలలోని ఆవుదూడలు ఆ పచ్చదనము జూచి పచ్చిగడ్డియేమో యను ఆశతో ఆ మేడలను చేరవచ్చును. ఇట్లగుట ఆ గోపురముల ఎత్తు ఎంతయని చెప్పగలము?

విశేషము : 'గో' శబ్దము యొక్క అర్థముపై శ్లేష గోవత్సములు చరించి (కదలి)యే కదా గోపురములను చేరవచ్చును. కనుక గోచరమైనట్లే కదా, అని "గోచరమగునే" అను దానికి ఒక ధ్వని. ఐనను, అది గోచరము కాదనియే (అనగా, అర్థము కాదనియే) వాచ్యార్థము. ఇట్లు 'గోపుర', 'గోచర' శబ్దములలో శబ్దార్థశ్లేష ఇంపుగనున్నది.

నానార్థములు : గో : ఆవు, కన్ను, చూపు, భూమి, వాక్కు, మొదలగునవి.

గోచరము : ఇంద్రియనిగ్రహము, అగపడుట.

ఉII అందరు సోమయాజకులు నందఱు సంతతపూర్ణకాములున్
అందఱు వేదవిగ్రహము లందఱు సుందర సూనబాణులే
యందరు విష్ణుభక్తిరతు లందఱు భూతదయాప్రపూర్ణులం
దందరు బ్రహ్మవేత్త లపరిగ్రహు లప్పురి బ్రాహ్మణోత్తముల్ 19

అర్థాలు : సూనబాణులు= మన్మథులు, అపరిగ్రహులు= దానము పట్టనివారు

భావము : ఆద్వారకలో అందఱును యజ్ఞములు చేసినవారే, అన్నియు ఉండుటచే కోరికలు లేనివారే, వేదవేత్తలే, మన్మథాకారులే, విష్ణుభక్తులే, భూతదయకలవారే, బ్రహ్మవేత్తలే, దానము పట్టని నియమము కలవారే!

సీ॥ వారణశత్రుదుర్వారబలులే కారు
వారణశత్రుదుర్వారబలులు
సంగరహితమహాశౌర్యపరులే కారు
సంగరహితమహాశౌర్యపరులు
భవవార్ధిజితభూరిభరితగణ్యులె కారు
భవవార్ధిజితభూరిభరితగుణులు
ధర్మవిద్యావిబుధప్రణుతులే కారు
ధర్మవిద్యావిబుధప్రణుతులు

తే॥ నౌర రిపుజయ సుబలసహాయరణవి
హారసంపత్సుగుణమహత్వధర్మ
శాస్త్రకార్ముకనైపుణచర్య లలరు
రాజశేఖరు లప్పురరాజమునను 20

అర్థాలు : వారణశత్రు= ఏనుగునకు శత్రువైన సింహము, వారణ= ఎదిరించునట్టి, శత్రు= శత్రువులకు, దుర్వార= నివారించరానంత, సంగరహిత= యుద్ధమునకు తగిన, సంగరహిత= నిరపేక్షకులై, జిత= స్వార్థమును జయించిన, భూరిభరిత గుణులు= గొప్పసత్త్వగుణము కలవారు, ధర్మవిద్యావిబుధ ప్రణుతులె= ధర్మములందును విద్యలందును పండితులచేత మెప్పుబొందినవారు, రిపుజయనబలనహాయరణ విహారసంపత్సుగుణ మహత్వధర్మశాస్త్ర కార్ముక చర్యలుఅలరు= శ్రతువుల జయించు బలముతో యుద్ధమున వీరవిహారము చేయు సుగుణ సంపత్తి అను గొప్ప ధర్మశాస్త్ర ధనుస్సంధానమున నిపుణత గల, భవవార్ధిజితభూరి

భరితగుణులెకారు= సంసారమనెడి సముద్రమును ఈది జయించిన కామక్రోధాది దుర్గుణములను వదలిన గొప్ప గుణములు కలవారు.

భావము : అక్కడి రాజులు సింహబలులే కాక, ఎదిరించు శత్రువులు వారింపలేని బలము కలవారు. యుద్ధమందు చాలిన శౌర్యవంతులే కారు. ప్రతిజ్ఞలను నిలుపుకొనునట్టి పౌరుషము కలవారు. సంసార సముద్రమును జయించుటకై ఆఱు సుగుణాలను వదలిన గొప్ప గుణవంతులే కాక, సంసారమను సముద్రమును ఈది జయించుటకై అలవఱచుచున్న గొప్ప సత్త్వగుణ సంపన్నులు. ధర్మశాస్త్రములందు అన్ని విద్యలందును పండితులచే నుతింపబడువారే కాక, దేవతల చేతను మెప్పు పొందినవారు. శత్రువులను జయింపగల బల సహాయముతో యుద్ధమందు పరాక్రమ ప్రదర్శనముతో విహరించు గొప్ప శక్తి సంపత్తి అనెడి గొప్ప ధర్మశాస్త్రము గల ధనుర్విద్య యందు నైపుణ్యము గలిగి బాణప్రయోగ కౌశలము కన్పట్టునట్టి గొప్ప క్షత్రియులు ఆపురమందు ఎందఱో కలరు.

విశేషము : పదముల నానార్థములపైనను, వ్యాకరణ విశేషాన్వయముపైనను, ఆధారితమైన అర్థశ్లేష ఈ కవి పాండిత్యగరిమకు నిదర్శనము.

సీ॥ పోకకు పుట్టెడు బోడిరాజనములు
కృషి విచక్షణము లెక్కింపరాదు
త్రొక్కుడు బండలందుల చిన్నరవ లెల్ల
బేహారమింతన పేరు గలదె
శ్రుతిమూలమగు నందసుతుడు గోపాలుడు
గోగణంబుల లెక్కగొన వశంబె
నవనిధానంబులు నానాట బెరుగంగ
క్రయ విక్రయ క్రియగణన కగునె

తే॥ మణియు నిరతంబు కౌస్తుభమణిశమంత
కములు విలువల దలపోయు ఘను లనంగ

వైశ్యకోటులు నప్పురవరమునందు
సంపదలు వర్ణనము సేయ స్రష్ట తరమె 21

అర్థాలు : పోకకు= వక్క ముక్కకు, బోడిరాజనములు= వడ్లలో ఒకజాతి ధాన్యము, కృషివిచక్షణము= రైతుల శ్రమను, త్రొక్కుడుబండలు= నడచు త్రోవలు, బేహారము= వ్యాపారము, శ్రుతిమూలము= వేదములకాధారము, గోగణంబుల= ఆవుల మందలను(గో శబ్దమునకు వేదమనియు అర్థము), నవనిధానంబులు= తొమ్మిది విధములైన సంపదలు, నిధులు, నానాట= దినదినము, క్రయవిక్రయక్రియ= అమ్ముట కొనుట అను కార్యములు, కౌస్తుభమణి= శ్రీకృష్ణుడు వృక్షమున ధరించుమణి, శమంతకము= దివ్యమణి, సూర్యుని మెప్పించి సత్రాజిత్తు సంపాదించినది, తన కుమార్తె సత్యభామతో కృష్ణున కిచ్చినది, దినమునకు నూరు బారువుల బంగారమును ప్రసాదించునని పురాణకథ, స్రష్ట= బ్రహ్మ.

భావము : మంచి జాతి ధాన్యము పుట్టెడుకారు చౌకగా ఒక పోకచెక్కకు దొరకు ననగా రైతులు పండించిన దెంతయని చెప్పగలమా? నలుగురు నడచు త్రోవలలో చిన్న చిన్న రవ్వలు దొరకుననగా వ్యాపారమెంత జరుగుచున్నదో చెప్పగలమా? కృష్ణుడు వేదములకు మూలమనగా, వేదము లెన్నియో! ఆతడనంతుడు కదా! అట్లే అతడు గోవులను పాలించుననగా గోవులను లెక్కపెట్టగలమా? దినదినవృద్ధిగా నవనిధులున్నవి అనగా బేరసారములను ఊహించవలసినదే! అక్కడి వైశ్యులు కృష్ణుని కౌస్తుభమణి, శమంతకమణి విలువలను భావింతురనగా వారి సంపదలను లెక్కించుటకు సాధ్యమా!

విశేషములు : నవ నిధులు 1) మహాపద్మము, 2)పద్మము, 3)శంఖము, 4)మకరము, 5)కచ్ఛపము, 6)ముకుందము, 7)కుందము, 8)నీలము, 9)ఖర్వము.

ఉ॥ అద్రులు ధైర్యసంపదల నాహవరంగవిభంగకేళిని
ర్నిద్రులు విప్రవంశపదనీరజ భక్తిపరంపరాత్మసం
భద్రులు బాహుశక్తి బలభద్రులు సత్కరుణాసముద్రు ల
క్షుద్రులు సర్వకార్యముల శూద్రులు దానసురాద్రు లప్పురిన్ 22

అర్థాలు : అద్రులు= కొండలు, ఆహవరంగవిభంగకేళినిర్నిద్రులు= యుద్ధరంగ మందు వీరవిహారమున అప్రమత్తులు, విప్రవంశపదనీరాజ భక్తిపరంపర ఆత్మసంభద్రులు= బ్రాహ్మణుల పాదపద్మముల యందు ఎడలేని భక్తితో మెలగు మనస్సు కలవారు.

భావము : ద్వారకలోని శూద్రులు ధైర్యంలో కొండంతవారు. యుద్ధంలో అప్రమత్తులు, బ్రాహ్మణభక్తిలో సదాచారులు, భుజబలములో బలరాము నంతటివారు, కరుణ గలవారు, ఏమాత్రము తక్కువవారుకారు, దానమున మేరు పర్వతమంతటివారు.

విశేషము : బలరాముడు తన భుజబలముతో నాగలిని ఉపయోగించి యమునా నదిని రెండు పాయలుగా చీల్చివేసినాడని పురాణగాథ.

లయగ్రాహి॥ నింగిజరియించు సురపుంగవులకుత్సవము
లం గడలుకొల్పు మహిమం గనలు మేత్తే
రుంగములు సంచలిత తుంగ కులశైలముల
నం గలిగి ఘోరరణరంగములో మా
తంగములు వేగపుకురంగముల నంచితవి
హంగముల మీరెడు తురంగములును కార్యా
భంగకృతచర్యలను సంగరకుతూహలము
లుం గలుగు వీరభటపుంగవుల నొప్పున్ 23

అర్థాలు : నింగిన్= ఆకాశమున, సురపుంగవులకు= దేవతలకు, కడలుకొల్పు= ఎక్కువ చేయు, కనలు= దీపించు, తేరుంగములు= రథముల

గుంపులు, తుంగ= ఎత్తైన, కులశైలములు= గొప్పకొండలు, మాతంగములు= ఏనుగులు, కురంగములు= జింక, విహంగము= పక్షి, మీరెడు= మించిపోవునట్టి, తురంగములు= గుఱ్ఱములు, కార్య+అభంగకృతచర్య= కార్యము చెడకుండ చేయబడిన పని, సంగర= యుద్ధము.

భావము : ఆకాశమున సంచరించు దేవతలలో ఉత్సాహమును అతిశయింప చేయు మేలైన రథములు, కులపర్వతములనదగిన ఏన్గులు, వేగములో జింకలను పక్షులను మించిపోవు గుఱ్ఱములు, వీరభటులు కలిగిన చతురంగ బలములున్నవి.

విశేషము : కులశైలములు : 1. మహేంద్రపర్వతము, 2.మలయపర్వతము, 3.సహ్యాద్రి, 4.శుక్తిమాన్, 5.ఋక్షపర్వతము, 6.వింధ్యము, 7.పారియాత్రము, గొప్ప ఏనుగులను ఈ గొప్ప పర్వతములతో పోల్చుట పరిపాటి.

లయగ్రాహి లక్షణము ప్రతి పాదమున గణములు భ జ స న భ జ స న భ య. ప్రతిపాద ప్రాస నియమము. ప్రాసయతి 10-18-26 అక్షరస్థానాలలో. మొత్తము ప్రతిపాదానికి 30 వర్ణములు.

ప్రాసవర్ణము 'గ' వర్ణము 16 సార్లు ఆవృత్తమైనది. ఇంకను కొన్నిచోట్ల 'గ' కారము ప్రయోగము కన్పట్టుచున్నది.

**మాలిని॥ సారసకైరవసత్కమలారుణసద్రుచితోయజసంస్థితమై
సారసటిట్టిభచక్రబకాంచితసద్విహగవ్రజసంకులమై
చారుతరానిలజాతతరంగవశంగత నీరజ సంచరమై
సారసరోవర జాలములం దగు షట్పదరాగరసస్ఫుటమై 24**

అర్థాలు : సారస= తెల్లతామరల, కైరవ= తెల్లకలువల, సత్కమల= మేలైన పద్మముల అరుణసత్‌రుచి= ఎఱ్ఱనికాంతుల, తోయజసంస్థితమై= నీటిలో పుట్టిన వానితో నిలిచి, సారసటిట్టిభ= బెగ్గురు చెకుముకీ, చక్రబక=

చక్రవాకము కొంగలచే, అంచిత సద్విహగవ్రజ= అందమైన, సంకులమై= శ్రేష్ఠములైన పక్షుల సందడిచే, చారుతర+అనిలజాతతరంగవశంగతనీరదసంచరమై= మనోహరములైన వాయువులచే ఏర్పడిన అలలతో కలసిపోయి తిరుగాడు జలచరములు కలవై, సారసరోవరజాలములన్= చక్కని సరస్సుల సమూహములతో, తగుషట్‌పద= ఇంపైన తుమ్మెదల, రాగరవస్ఫుటమై= ఝుంకార నాదములతో స్పష్టమై.

భావము : ఇది సరస్సుల వర్ణన. తెల్ల తామర, తెల్ల కలువ, ఎఱ్ఱదామరల కాంతితోను, బెగ్గురు, చెకుముకి, చక్రవాక, బకములాది పక్షుల సందడితోను, చల్లని గాలిచే కలిగిన చిన్న అలల సందులలో తిరుగుచున్న చేపలతో తుమ్మెద ఝుంకారములతోను సాకారమైన సరస్సులు ఉన్నవి.

మానినీవృత్తలక్షణము : ప్రతిపాదమున భగణము లేడును. ఆపై గురువు కలిగి, 13వ అక్షరము యతిమైత్రితో, ప్రతిపాద ప్రాసతో నాల్గుపాదములు గలది. మొత్తము 22 వర్ణములు.

**మ॥ మెఱుగుంబోణు లనేటి వాక్యము లయో మిథ్యల్ గదా తత్పురిన్
కరిపోతశ్రుతివాతనిర్దళితమై కాదంబు లార్తిం జనన్
స్థిరలం దిగ్గి పయోధరాఖ్యముల నెంతేనిన్ నిజస్థానముల్
పరితోషింపుచు సంచరించు మెఱుగుల్ ప్రత్యక్షమై యుండగన్ 25**

అర్థాలు : కరిపోతశ్రుతవాతనిర్దళితమై= ఏనుగు పిల్ల చెవులు విదలించగా వచ్చిన గాలిచే కొట్టబడిన, కాదంబులు= (కలహంసలు) మబ్బులు, అర్తిన్+చనన్= బాధచెందినవై, స్థిరలందిగ్గి= నేలపై దిగి, పయోధరాఖ్యముల= పయోధరములను పేరుగలవి, (నీటిని ధరించు మబ్బులు పాలను ధరించు పాలిండ్లు), మెఱుగున్= మెఱుపులు, తటిల్లతలు.

భావము : ఆ ద్వారకాపుర మందు స్త్రీలను మెఱుగు బోణులు అనెడి వర్ణను సరియైనవి కావు. ఏనుగు పిల్లలు చెవులు కదలికలచే కొట్టబడిన మబ్బులు,

వాని వేగానికి, భయపడి చెదరి నేలపైకి దిగి, తమ పేరు గల పాలిండ్లను చూచి సంతోషించుచు తమ మెఱుగులను వానిపై చల్లుచు వర్షించును. ఆ యువతులు మబ్బుల వలన కలిగిన మెఱపులచే వారి పాలిండ్లు మెఱయుచుండెనని భావము. నిక్కముగా వారిలో మెఱయు కాంతి లేదని ఉత్ప్రేక్ష.

లయవిభాతి॥ జడలనిడుసోగలును కడుమరుని సింగిణుల
యొడికమగు కన్బొమల వెడవిలుతు తూపుల్
వడిసడలుచూపులను నుడువులను చక్కెరల
పొడులురులు మక్కువలనిడు విధునిగోమున్
కడునిగుడుమోములను యెడనిడని చన్గవల
కడుపు దళమెక్కు జిగి నడరు నునుఛాయల్
పిడికిటికి లేమియగు నడుముల నితంబభర
మడరి తడబాటు నడపడతుల జెలంగన్ 26

అర్థాలు : నిడుసోగలు= చాలపొడవైన వరుసలు, మరుని= మన్మథుని, సింగిణుల= విండ్ల, ఒడికము+అగు= అందమైన, వెడవిలుతు= తామరతూడును విల్లుగా జేసికొనిన మన్మథుని, తూపుల్= అమ్ములు, నుడువులను= మాటలలో, ఉరులు= రాలు, రాలిపడు, విధుని= చంద్రుని, గోమున్= కోమలత్వము, దళమెక్కు= దళసరియగు, జిగి= శోభ, నునుఛాయల్= లేతకాంతి, నితంబభరము+అడరి= పిఱుదుల బరువు మిక్కుటమై.

భావము : నిడుపైన జడల వరుసలు మదనుని విండ్ల వలెనున్న ఒప్పగు కనుబొమ్మల నుండి మరుని అమ్ముల వలె వడివడిగా చలించు చూపులు చక్కెరపొడులు చిమ్ము తియ్యని మాటలు, వలపెక్కించు చంద్రుని వెన్నెల చిందించు, కోమలమైన ముఖములు, ఎడము లేక ఒత్తుకొనుచున్న చన్నుల జంటలతో దళసరియగు కడుపుసొంపులతో అతిశయించు లేత

శరీరకాంతులు పిడికిటిలో ఇమిడిపోవు నడుము, పిఱుదుల బరువుతో తడబడుచు వనితలు ఆపురిలో వసింతురు.

విశేషము : ఈ పద్యమందు 'విభుని, ఛాయ, నితంబభరము' సంస్కృత పదాలు.

లయవిభాతి లక్షణం న స న న స నన స నన స గ గణాలు ప్రతిపాదమున, 4 పాదములు. ప్రాస నియమమున్నది. ప్రాసయతి 11-20-29 అక్షరస్థానాలు.

34 వర్ణములు. ప్రాస వర్ణము 'డ' కారము కనుక 'డ' వర్ణము నాల్గుపాదములలో 16 సార్లు ఆవృతమైనది. ఇంకను, కొన్నిచోట్ల 'డ' వర్ణము ప్రయోగింపబడినది.

పుష్పలావికలనగా పూలనమ్ము పడుచులు. వీరికి, పూలు కొనవచ్చిన వారికి మధ్య సరస సంభాషణము శృంగారహాస్య రస సమ్మేళనము. ఆ వర్ణన ఇట గానవచ్చును.

పుష్పలావికలు

చ॥ కలికిరొ చెండ్లవైన తలకట్టగు సూడిదముట్ట నీవదే
చెలువగు తావులం బొదువ చేకొనవచ్చు నేకొద్ది నెవ్వరున్
మెలతుకరో వెలెంత మది మెచ్చిన వేడ్కకు విల్వలందురా
చెలువుడ యంద్రు జాణలును చేడియలుం దగ పువ్వలంగడిన్ 27

అర్థాలు : చెండ్లు+అవి+ఐన= పూల మాలలు అవే ఐనచో, (ఇది వాచ్యార్థము. వ్యంగ్యార్థమున 'పాలిండ్లు' ధ్వనితములు), తలకట్టు+అగు= తలదిండుగ పనికివచ్చును, సూడిదముట్ట= బహుమతిగా, చెలువు+అగుతావులన్= ప్రేమగల చోటులందు, పొదువ= అలంకరిచుటకు, ఏకొద్ది= ఏ కొంతయైన, ఎవ్వరున్= ఎవరైనను, జాణలన్= మాటకారులు, చేడియలున్= స్త్రీలు

భావము : 1. యువకుడు : ఓ పడుచుపిల్లా! ఇవేనా(పూల) చెండ్లు? అబ్బో! తలకాయంతవిగా ఉన్నాయే! తలదిండుగా ఉపయోగపడతాయి.

ఈ మాటలు ఆ పూలనమ్మే పడుచు చన్నులకును వర్తించును.

2. యువతి : నీవు బహుమతిగా అందమైన చోట్లలో తుఱుముకొనవచ్చునుగా!

3. యువకుడు : ఎవ్వరికైననూ ఏ కొంచమైనా! ఈ చెండ్ల విలువెంత? (నీ వెల ఎంత? అని వ్యంగ ధ్వని)

4. యువతి : మనసుకు నచ్చిన సరదా విషయములో విలువలను గుణించి ఆలోచించెదరా ఎవరైనా, సరసుడా!? (పూలచెండు వెల అడగకుండా కొనలేని లోభివి. నా వెల నీవేమీ ఇయ్యగలవులే! అని వ్యంగధ్వని)

పువ్వులమ్మే చోటు నేర్పరులైన రసికులు, పువ్వులను విక్రయించు విలాసవంతులైన నెలతులకు జరిగిన మాటల క్రమము ధ్వనిపూరితమై సరసముగా నున్నది.

చ॥ సరివెలలిత్తు నీ సరికి సమ్మతి గాదటె ముద్దుగుమ్మ! నీ
మురువిది చాలదే విలువ ముద్దియనైనను మేలెఱుంగ నే
గరిమకు వేడ్కకున్ విలువగద్దటె నీదయవాడ దందు వా
సరసుడ యంద్రు జాణలును చానలు నప్పురి పువ్వులంగడిన్ 28

అర్థాలు : సరి= పూలదండ, సరిపోయినంత, మురువు= ప్రేమ, మురుగు(చేతికి అలంకారముగా తొడిగే బంగారు ఆభరణము), చానలు= స్త్రీలు.

భావము : ఈ పద్యమును చతురసంభాషణయే, పై పద్యములో యువతీ యువకుల సంభాషణే కొనసాగుతుందను కోవచ్చును. లేక, ఈ జంట వేఱనియు భావించవచ్చును.

1. యువకుడు : నీ పూల దండకు సరియైన (నేర్పునకు) వెలను ఇచ్చెదను. సరసురాలైన ముద్దుగుమ్మా నీకు సమ్మతమేనా?

మఱొక అర్థము : నీకు సరిపోయినంత ఇచ్చెదను అని వ్యంగధ్వని

2(ఎ) యువతి : నీ ప్రేమ చాలదా! విలువ ఏముందిలే! (మురువు= ప్రేమ)

మఱొక అర్థము : నీవు ముంజేతిలో ధరించిన (మురువు) బంగారు కంకణమే విలువ దానినే వెలగా ఇమ్ము అని వ్యంగధ్వని

2(బి). ముద్దరాలైనను ఏది ఎంత విలువో, మేలైనదో తెలియదా నీకు?

3. యువకుడు : నీ గుబ్బెతతో (గుబ్బచన్నుగవ) కొంతసేపు మాత్రము వినోదించుటకు అంత విలువ కలదా! (అంత విలువయా అని ధ్వని)

4. యువతి : నీ దయ వాడక యుండునా! తాత్కాలికము కదా! వాడిపోదని ఓ సరసుడా తెల్పగలవా! 'వేడ్క' అన్న పదానికి కొద్దికాలము కోసమే కదా ఈ పూలచెండు. ఎలాగూ త్వరగా నలిగి వాడిపోయేదే కదా! అని ఆ యువకుని భావమును గ్రహించినట్లయితే, ఆ యువతి సమాధానము, ఓహో! నీ ప్రేమ(దయ) కూడా అట్లే వాడిపోయేదే కదా!, సరసుడా!?'' అని భావించవచ్చును. కామసుఖము కొద్దికాలమే అని భావము పై విధముగా నేర్పరులైన విటులకు, పూలమ్మెడు విలాసవతులకు సంభాషణ సాగినది.

మ॥ మనప్రౌఢత్వములేమి వ్రేతలిడు గోమాకాముకున్ ధన్యగా
తనుసౌందర్యవిలాసవిభ్రమకళాధౌర్త్యంబులన్ మెచ్చువా
రని తత్కౌశలమందవచ్చిరని రంభాద్యప్సర స్త్రీలనన్
గననై రప్పురివారకామినులు శృంగారప్రభాపూర్ణతన్ 29

అర్థాలు : పౌఢత్వము= నిపుణతలు, ఏమి= ఎంతమాత్రము, వ్రేతలు+ఇడు= గోపస్త్రీలు సమర్పించు, గోము+ఆకాముకున్= ప్రేమ ఆ కాముకుని, తనుసౌందర్య= శరీర సౌందర్యము, ధౌర్త్యంబులన్= ధూర్తలక్షణమును

(సరసతను), తత్+కౌశలము= ఆ నేర్పరితనము, అందవచ్చిరనియున్= నేర్చుకొనుటకు వచ్చిరని, వారకామినులు= వేశ్యలు

భావము : మన నిపుణతలు ఎంతమాత్రము? (తక్కువే) ద్వారక యందుగల గోపవధువులు కాముకుడైన శ్రీకృష్ణుని ధన్యునిగా చేయుటకై అనురాగమును సమర్పించెడి నగరవేశ్యలు తమ సౌందర్యము, విలాసములను శృంగార చేష్టలను కపటములగు సరస సంభాషణములు మెచ్చువారని తలంచెడివారై. ఆ పడతుల నేర్పరితనము, నేర్చుకొనుటకై రంభాది దేవవేశ్యలు వచ్చెదరని సంపూర్ణమైన శృంగార ప్రభలతో అచట వారకాంతలు కన్పట్టెదరు.

విశేషము : ''మన నైపుణ్యము ఎంత మాత్రము అని'' దేవవేశ్యలు భావించుటచే ''అతిశయోక్తి'' అలంకారము. దేవలోక వారాంగనలకు శృంగారక్రీడలు మెలకువలను నేర్పెడి కౌశలము గలవారు ఆ నగర వేశ్యలు.

మ॥ మునిమాపున్ మణిహేమగేహములమేల్ ముంగిళ్లనున్ తిన్నెలన్
ననవిల్కాడు తరంబు లేర్పఱచి బాణంబుల్ వెసం నిల్పెనా
తనుసౌందర్యవయోవిలాసముల పాంథశ్రేణి గాఱింపగా
ననుపన్ వేడుకకాండ్రలున్ నిలుతు రత్యంతంబు వారాంగనల్ 30

అర్థాలు : మునిమాపున్= సాయంకాలమున, గేహముల= ఇండ్లలో, ననవిల్కాడు= పువ్వులే అమ్ములుగా గల మన్మథుడు, తరంబులు= వరుసలు, వెసన్= వడిగా, నిల్పెనాన్= నిల్పెననగా, తను= శరీరము, పాంథశ్రేణిన్= బాటసారులను, కాఱింపగాన్= బాధపెట్టుటకు, అనుపన్= వీడ్కొలుపుటకు, వేడుకకాండ్రులున్= విటులను

భావము : సాయంకాలము మాపటివేళ మణులు బంగారు వర్ణములు ప్రకాశించు మేలైన ముంగిళ్లలోను, ముందుండే తిన్నెలపైనను, మదనుడు తరతరములుగా తమ బాణములుగా కళావతులను నిల్పెనా అన్నట్లు తమ సౌందర్య విలాసములచే బాటసారులను బాధపెట్టుటకు పంపగా వారిలో

వేడుక కొఱకు విటులు, వారాంగనలతో సంభోగ క్రీడ ముగియు వఱకు నిలిచెదరు.

విశేషము : బాటసారులలో కొందఱు సామాన్యులు. వారు వారకాంతలను చూచినను, మోహము లేనివారగుటచే ఆకర్షింబడరు. కొందఱు రసికులు వ్యామోహముచే మనస్సు చెదరినను, ధనలోపమో లేక కార్యాంతర వ్యగ్రులో, తమ కామమును అణచుకొని వెడలిపోవుదురు. వీరు బాధితులు. మూడవ తెగకు చెందినవారు. కామోద్రేకము కల శృంగార పురుషులు అచటనే ''రత్యంతము'' నిలిచెదరు.

సీ॥ ప్రావిటులంపిన పటు భూషణాదులు
చెలులకు కనుసన్న దెలియపరచి
నూతనవిటులను ప్రీతి గైకొని కల్కి
క్రీగంట చూపుల గెళవపరచు
వారకంబుల విటుల్ వచ్చినవారికి
వ్రతదినం బనుచు పరాకు చేసి
రాకుమారకులగు రట్టడివిటకాంఢ్ర
మరలించుటకు నిజమాత జూ౦

తే॥ గుత్తకాండ్లకు నలుక నూల్కొల్పి త్రిప్పి
ననువుచెప్పెడి విటుల మన్నన నటించి
యెదుటి పడతులు విటుల సంపదలు చూచి
తలతు రవ్విటవర్గంబు దగులుపరుప 31

భావము : వారాంగనలు. పాతవిటులు కానుకలుగా పంపిన గొప్ప ఆభరణములు మొదలైన వానిని, చెలికత్తెలకు కంటి సైగలచే గ్రహించి పంపివేయుడని సూచించి, క్రొత్తగా వచ్చిన విటులను ప్రీతితో ఆదరించి కడగంటి చూపులచే వారిని మనస్సులో మోహమును రేకెత్తించి, వెడలుగొట్ట

తలచిన విటులను (వృద్ధులను) వ్రతదినమని సాకులు చెప్పి మోసగించి, రాజకుమారులైన దూషింప తగిన విటులను మరలిపోవునట్లు చేయుటకు తమ తల్లులను నియోగించి, తార్పుడుగాండ్రకు (విటులను పంపెడివారు) కోపమును చూపి త్రిప్పి పంపి, ప్రేమ చూపెడి విటులను గౌరవించునట్లు నటనలను ప్రదర్శించి, తమ సాటి కాంతల వారి విటుల సంపదలను లెక్కించుచు, విటుల సమూహమును తమ్ము వలపింపజేయుటకు పెక్కు రీతుల ప్రవర్తింతురు.

ఉ॥ తమ్మికొలంకులన్ మెలగి తామరపుప్పొడి రేచి తొంగుచున్
కమ్మిన చందనప్రకటకాననవీథుల గేలి సల్పుచున్
కొమ్మల గబ్బిచన్గవల కుంకుమతావులనానిమిక్కిలిన్
ముమ్మరమై వధూవరుల మూంగి కడుం దమి రేచు దెమ్మెరల్ 32

అర్థాలు : రేచి= రేగునట్లు చేసి, తొంగుచున్= వాలుచు, వలపుకొమ్మల= యౌవనవతుల, మూంగి= మూగి, వ్యాపించి, తమి= వలపు

భావము : తామరపూల సరస్సులలో తిరిగి, తామర పుప్పొడిని రేగగొట్టి, చందనపు చెట్ల అడవి దారులను హేళన చేయుచు, యువతుల బలిసిన చన్నులపై పూసిన కుంకుమ వాసనలును పీల్చి, వధూవరులను కమ్ముకొని పరస్పరము(అపేక్ష) వలపు కలిగించు చల్లని గాలులు వీచును.

వ॥ ఆ పట్టణంబున కధీశ్వరుండు 33

భావము : ఆ పట్టణమునకు ప్రభువై

సీ॥ తెలిదమ్మిరేకుల తేటనీటై పొల్చు
తులలేని గొప్పకన్దోయివాడు
శరదిందుశతకోటి మెరుగు మించిన చిన్ని
ముద్దులగులికెడు మోమువాడు

కమలామహాదేవికాపురంబుండంగ
నొరపుగన్పట్టు పెన్నురమువాడు
చండదిగ్వేదండతుండంబులను గేరు
మండితబాహాయుగ్మంబువాడు

ఆ॥ కరుణగడలుకొనెడు కడకంటిచూపుల
వాడు మొగులు మెరుగువన్నెవాడు
దేవకీ సుతుండు దేవ దేవుడు కృష్ణ
దేవు డొప్పు వాసుదేవు డనగ 34

అర్థాలు : నీటు= అందము, ఒఱపు= అందము, పెన్నురము= వెడల్పైన ఱొమ్ము, చండ= భీకరమైన, దిక్ వేదండ= దిగ్గజముల, తుండంబు= తొండము, కేరు= గేలిచేయు, మండిత= అలంకరింపబడిన, మొగులు= మబ్బు

భావము : తెల్ల తామర రేకులు సారమైన అందము పొందిన కన్నుల జంట కలవాడా! శరత్కాలమందు గోచరించు చంద్రుని నూఱుకోట్లకు మించిన, చిన్న ముద్దులు చలించు ముఖము కలవాడా! లక్ష్మి కాపురముండుటచే అందమైన వెడల్పైన ఱొమ్ము గలవాడా! భయంకరములైన దిగ్గజముల తొండముల వంటి బలమైన భుజముల జంట కలవాడా! కరుణ నిండిన కడగంటి చూపులు కలవాడా! నల్లని మబ్బులవన్నె కలవాడా! దేవకిసుతుడు దేవదేవుడు కృష్ణుడు వాసుదేవుడను పేరుతో ద్వారకకు రాజు.

సీ॥ విషకుచ ద్రుంచి బర్వీడి బండి రక్కసు
బడదన్ని సుడిగాలి బడలు పఱచి
మద్దుల నగలించి యొద్దికతో బాలు
వెన్నలు ద్రుచ్చిలి వ్రేతలందు
మమతలు గల్పించి మఱిదానవుల ద్రుంచి
లీలతో గ్రేపుల నాల గాచి

చాణూరుముష్టికు సమయించి కువలయ
గజము గీటణగించి కంసుద్రుంచి

తే॥ దేవకీ దేవి యా వసుదేవుగాంచి
వందనాలింగనముల నానందమొసగి
మధురలో నుగ్రసేనుని మహిపుజేసి
ద్వారకాపట్టణంబున దా వసించి 35

అర్థాలు : విషకుచ= విషపు చన్నులు కలది, పర్విడి= పరుగెత్తి, బడలుపఱచి= శ్రమపెట్టి, అగలించి= చీల్చి,కూల్చి, ముచ్చిలి= దొంగిలించి, వ్రేత= గొల్లభామ, క్రేపుల= దూడల,లేగల, మహిపు= రాజును

భావము : ఆ శ్రీకృష్ణుడు పసితనములోనే కంసుడు పంపగా వచ్చిన రాక్షసి పూతన విషపు చన్నుల పాలు త్రాగి, దాని ప్రాణాలు హరించినవాడు. శకటాసురుని పడదన్ని, తృణావర్తుడను రాక్షసుని చంపి మద్దిచెట్ల రూపములో నున్న గంధర్వులకు శాపవిమోచనం కావించి పాలు, వెన్న దొంగిలించి గొల్లభామలకు ప్రేమపాత్రుడై, రాక్షసులను చంపి, ఆవులను, దూడలను కాచి కంసుని ఆస్థాన మల్లయుద్ధ ప్రవీణులు చాణూరుడు, ముష్టికుడు అను వారిని చంపి, కంసుని ఏనుగైన కువలయపు మదమును అణచి, కంసుని జంపి, కంసుని చెఱలోనున్న దేవకీవసుదేవులను (తన్ను కన్నవారిని) చెఱనుండి విడిపించి కంసుడు బంధించిన వాని తండ్రియగు ఉగ్రసేనుని మధురలో మరల రాజుగా అభిషేకించి, తాను ద్వారకలో వసించుచు,

క॥ తలిదండ్రులు దురవస్థల
దలగి మహోత్కృష్ట పదవిధము లాలింపన్
బలకృష్ణులు కడు వేడుక
నలరుచు యాదవకుమారకాన్వితులగుచున్ 36

అర్థాలు : తలగి= తప్పి, తొలగి

భావము : తమ తల్లిదండ్రులు బాధలు తొలగిపోయి మిక్కిలి గొప్పస్థితిలో ఉండగా, బలరామకృష్ణులు యాదవులతో గూడి సుఖముగ నుండిరి.

క॥ కరితురగరథారోహణ
వరనైపుణి దనర సకలవైభయుతులై
మెలగుచును గరటిసాధన
ధరణీశకుమారవర్యు లదల కడచి తగన్ 37

అర్థాలు : కరటి= ఏనుగు, అడల= భయపడగా,

భావము : ఏనుగులను, గుఱ్ఱములను, రథములను ఎక్కుటలో నిపుణులై సౌభాగ్యములతో రాజకుమారులు భయపడక సాటిలేనివారై చక్కగా వర్తించిరి.

సీ॥ పటుతరాంచితమత్స్యపుటములు గాలించు
కడుపర్వతముల సంగడము లెత్తు
గురుతరాంగంబున నెరమన్నుగోరారు
మొనమించి నరసింహమన మెలంగు
గుజ్జరీతిని మేనుకుంచి మానబెనంగు
పరశుసాధనమహత్ప్రౌఢి దనరు
కోదండదీక్షాదిగురు వన నుతిం గాంచు
ముసలాయుధాభ్యాసమున దనర్చున్

తే॥ బుద్ధి చతురత వింతలద్భుతము సేయు
కలికితనమున తోడివారల గలంచు
పూర్వవాసన లవి వృథబోవు నెట్లు
యఖిలచర్యలు ప్రత్యక్షమగుట గాక 38

అర్థాలు : మత్స్యపుటములు= మల్లవిద్యలో ఒక అంశము, సంగడములు+ ఎత్తు= మల్లవిద్యాసాధనలో భాగమైన పెద్ద ఇనుపగుండును పైకెత్తి వేయుట, గురుతర+అంగంబున= తలతో, కోరారు= త్రవ్వుచు, మొనమించి=

నాయకత్వము వహించి, గుజ్జు= మరుగుజ్జు(పొట్టివాడు), కుంచి= తగ్గించి, మానన్= బూరుగు చెట్టుతో, పెనంగు= పెకిలింప చూచును, పరశుసాధన= గండ్రగొడ్డలిని ఆయుధముగ ఉపయోగించుటలో సాధనను, కోదండదీక్షా= ధనుర్విద్యలో, ఆదిగురువు= మొదటివాడు, ముసల+ఆయుధ+ అభ్యాసమున= రోకలివంటి ఆయుధమును ఉపయోగించుటలో, బుద్ధిచతురత= వివేకముతో, కలికితనమున= జాణతనముతో,

భావము : మల్లవిద్యలోను, వ్యాయామములోను, నాయకత్వములోను, బలప్రదర్శనలోను, వివిధాయుధ ప్రయోగములలోను, అస్త్ర విద్యలలోను వివేకములోను, జాణతనములోను కృష్ణుడు పూర్వవాసనలను గుర్తు చేసికొనును.

విశేషము : ఈ పద్యమున దశావతారములు పొడకట్ట జేసినాడు కవి.

దశావతారముల ప్రస్తావన

1. మత్స్య మొదటి అవతారము
2. పర్వతములెక్కుట కృష్ణావతారము
3. మన్ను వరాహావతారము
4. నరసింహ మనమెలగు నృసింహావతారము
5. గుజ్జురీతిని వామనావతారము
6. పరశుసాధనమున తనరు పరశురామావతారము
7. కోదండదీక్షాది గురువన రామావతారము
8. ముసలాయుధాభ్యాసము- బలరామావతారము
9. బుద్ధిచతురత బుద్ధావతారము
10. కలికితనము కల్కిఅవతారము

క॥ చిత్రసాయుధ చిత్రాతి
సూత్రంబున మల్లయుద్ధశుంభత్క్రియలన్

చిత్రములు మఱియు పెక్కులు
వృత్రారి కశక్యమైన వింతలు మఱియున్ 39

అర్థాలు : వృత్ర+అరి= వృత్రాసురుని శత్రువగు ఇంద్రుడు,

భావము : అనేక రీతుల ఆయుధములతో పోరాటమును, మల్లయుద్ధపు వివిధాంశములను ఎన్నియో విచిత్ర విద్యలను ఇంద్రునకు సాధ్యము కాని వెన్నియో వింతలను సాధనచేసి నిపుణుడై,

వ॥ బహువిధచిత్రవైఖరులం గసిమసంగి అరుణోద్వేల భాసురాంగంబు
బాలభాస్కర తేజోమయంబుగా వెలుగొందు శుభాంగంబున నొప్పుచు 40

భావము : పెక్కురీతులుగా, వికాసమును పొంది బాలసూర్యుని తేజముగల శరీరముతో ప్రకాశించుచు

క॥ చల్లాడము రత్నంబుల
కుళ్ళాయా మూపు మీద గునియ నును గురుల్
మొల్లమగు సరిగె దుప్పటి
ఘల్లను నాదము చెలంగ గరిడిన్ వెడలెన్ 41

అర్థాలు : చల్లాడము= తొడలాగు,నిక్కరు, కుళ్ళా(యి)= చిన్నటోపి, మూపు= భుజము, గునియ= కదలగా, మొల్లమగు= దట్టమైన, గరిడి= సాము కూటము

భావము : నిక్కరు, మణులు పొదిగిన టోపి, అందమై తలవెంట్రుకలు భుజముమీద, కదలుచుండగా, దట్టమైన సరిగ గల దుప్పటితో, ఘల్లని కాలి అందెల ధ్వని మ్రోగగా, సాముచేయు కూటము నుండి వెడలి వచ్చెను.

క॥ పొదలికల హొయలు యొఱపును
ఉదుటును బిగి చిత్తరంపు ఉరువున్ మురుపున్
కుదురును బరువును మెఱపును
విదితంబుగ వీధి రాగ వెలదులు ప్రీతిన్ 42

భావము : శరీర వృద్ధి వికాసము శృంగార చేష్టల వేగము, గట్టితనము, ఆశ్చర్యకరమైన రూపము, అందము, నిలుకడ, గౌరవము తళతళ స్పష్టముగా కన్పట్టునట్లు వీధిలో నడచునప్పుడు గోపకాంతలు ప్రీతితో చూచిరి. (పద్యమందు గల పదముల కన్నింటికి అర్థాలు భావములో నున్నవి.)

సీ॥ తాటంకమాణిక్య ధగధగగోజ్జ్వలకాంతి
హారతు లిచ్చె నొయ్యారి యొర్తు
వెన్నెలనిగ్గులై వెదచల్లు చిరినవ్వు
చెలువ పావడ వేసె సఖియ యొర్తు
కలికికాటుల తేటకన్నులు బెళకించి
కలువల మేల్కట్టు గట్టె నోర్తు
ఉరము నిక్కించుచో మొరయ చన్గవ నిమ్మ
పండ్లను కాన్కగా పట్టె నోర్తు

తే॥ చెక్కుటద్దంబులెదుటన్ జేర్చెనోర్తు
చిగురుకెంగేల సురటి కైజేసె నోర్తు
వెలయు కుంతలచామర వీచె నోర్తు
కాంక్షలురియాడ యాదవాగ్రణికి మ్రోల 43

అర్థాలు : తాటంక= చెవికమ్మల యొక్క, పావడ= పరికిణీ (స్త్రీలు మొలకు కట్టుకొను వస్త్రము), చెలువ(చెలువంపు)= అందముగల, బెళకించి= తళతళలాడించి,

భావము : చెవికి బెట్టిన కమ్మలలో పొదువబడిన మాణిక్యముల వెలుగుతో నొకతె హారతి పట్టింది. వెన్నెలవలె విరిసిన చిఱునవ్వుల అందాల అతివ పావడ నొకతె మొలకు గట్టింది. వేఱొకతె కాటుక కన్నుల కాంతులతో కలువలు పూచినట్లు చూచింది. ఱొమ్ము ఉబ్బగా ఆవేశపడునప్పుడు నిమ్మపండ్ల వంటి చన్నులు నిగుడించి స్వాగతించిన దొకతె. చేతిలోని

అద్దమును చెక్కుటద్దమునకు చేర్చిన దింకొకతె. ఎఱ్ఱని చేతి విసనకఱ్ఱతో విసరెయొకతె.

చ॥ వలపులు దెల్పు ముద్దియల వాలికచూపుల లేతనవ్వులన్
పలుకుల హస్తనైపుణుల భావవిలాసములన్ ఛలోక్తులన్
సొలపుల భ్రూవిశేషముల చోద్యముగా గడు సమ్మతింపుచున్
వలపులరాజు గన్న యదువంశశిఖామణి వచ్చు చెల్వమున్ 44

భావము : తమ వలపులను(మోహమును) తెల్పు గోపకన్యల వాలుచూపులను లేతనవ్వులను, మాటలను, కరతలమును ఆడించు నిపుణతను మనసులోని భావముల సారములను చమత్కారపునుడులను శృంగారచేష్టలను కనుబొమ్మలు ఆడించు రీతులను అబ్బుర పఱచుచుండగా, మనసార చూచి అంగీకరించుచు మదనుని కన్న యాదవ వంశశ్రేష్ఠుడు వచ్చు సోయగమును,

తే॥ దేవకీదేవి యావసుదేవు డలరి
సౌధముననుండి కన్నులు చల్లగాను
గాచుచో శైశవక్రీడ గలుగుమేలు
నొందె నందయశోదల నోముఫలము 45

భావము : దేవకీ వసుదేవులు మేడపై నుండి చూచి, నంద యశోదల నోము ఫలమైన కృష్ణుని పసితనపు మురిపెముల సంతోషమును పొందిరి.

మ॥ అని వీక్షింపుచు తల్లిదండ్రులు మహాహ్లాదంబునం జొక్కగా
ఘనతన్ రుక్మిణి సత్యభామమొదలౌ కాంతాష్టకంబర్మిలిన్
దనకున్ బట్టపుదేవులై తనరగా ధాత్రీశకన్యామణుల్
కనకాంగుల్ బదియాఱువేలు దను నాకాంక్షించినన్ బెళ్లియై 46

భావము : తల్లిదండ్రులు సంతోషించుచుండగా శ్రీకృష్ణుడు రుక్మిణి, సత్యభామ మొ॥ ఎనమండుగురిని పట్టపురాణులుగా స్వీకరించి, తన్ను కోరిన రాజకన్యలను పదియాఱు వేలమందిని పెండ్లాడి,

కృష్ణుని అష్టభార్యలు : 1. రుక్మిణి,2. సత్యభామ, 3.జాంబవతి, 4.మిత్రవింద, 5.భద్ర, 6.కాళింది, 7.యాజ్ఞజితి, 8.లక్షణ.

ఉ॥ కాంతలకొక్కరొక్కరికి కాంచనరత్నవిచిత్రనిర్మితా
భ్యంతరసౌధగోపురమహాలయమంటపవేదికాంగణ
క్రాంతవిలాసకేలి వనకల్పిత శైలసరోవరాళి గ
ల్గంతిపురంబు లేర్పరచి యందఱినిన్ సమకాంక్ష నేలుచున్ 47

అర్థాలు : సమాకాంక్షన్= సమానమైన ప్రేమతో, (అనగా, దక్షిణ నాయకుడగుచు),

భావము : భార్యలందఱుకు ఎవరికి వారికే విడివిడిగా అన్ని సౌకర్యాలతో, వారి రాజసానికి తగినట్లు సౌధాలు, గోపురాలు, మండపాలు, వేదికలు, కేళివనములు, క్రీడాపర్వతాలు, సరస్సులు, అన్నీ కలిగిన అంతఃపురముల నేర్పఱిచి, అందఱిని సమానమైన ప్రేమతో అలరించుచుండెను.

తే॥ అఖిలజనములకాహ్లాద మతిశయిల్ల
భక్తజనముల రక్షించి బలునిగూడి
శ్రీపురంబున జేయును కాపురంబు
ద్వాపరమున హరి ద్వారకాపురమున 48

అర్థాలు : బలుని= బలరాముని

భావము : అందఱికి సంతోషమును కలిగించుచు, భక్తుల రక్షించి, బలరామునితో గూడ సర్వసంపదలు గల ద్వాపర యుగములో కృష్ణుడు ద్వారకాపురములో కాపురముండెను.

యుగములు నాలుగు : 1.కృతయుగము, 2.త్రేతాయుగము, 3.ద్వాపరయుగము, 4.కలియుగము.

వ॥ ఇట్లు చతుర్దశభువనోదరుండగు వనజోదరుండు భూభారనివార కారణుండై తన స్వరూపంబుస మానసోల్లాసంబుగా దేజరిల్లుచు సకలదివిజమునిజనదనుజ

పన్నగాదులను దనమాయాచ్ఛాదిత మానసులంగా మెలపుచు నిఖిలంబు తానయై తనుంగాని వానింబోలె బహుభోగభాగ్యసంపన్నుండై సర్వకాలపరిపూర్ణయౌవన శృంగార రేఖాలంకృతుండై పదియాఱువేలన్నూట యెనమండ్రుడు సుందరీ జనంబుల కందరి కన్నిరూపులై తత్తద్గృహానందమహ దిందిరా మందిరమణిమయ హర్మ్య నిర్మల కమలాకర కృతకాచల సైకతస్థలకలిత పల్లవ మందిర వినిర్మిత లతాడోలికా కేలికాంతార తరుగుల్మధను కదళికా చంద్రకాంత విలాస వితర్దికాది బహువిచిత్ర మారవికార ప్రేరితోత్కట ప్రదేశంబులం గ్రీడ సల్పుచు నవ్వుచుం బ్రేలుచు నాడుచుం బాడుచు విహరింపుచు శయ్యలకు దార్చుచు ముద్దులిడుచు కచకుచపరి రంభణంబు లాచరింపుచు కళలు రేచుచు కౌగిళ్లం గౌరవింపుచు నధరంబు లానుచు దృష్టివడక వేడుచు తిలకంబులు దిద్దుచు ముకురంబులు చూపుచు శృంగారింపుచు రూపయౌవన విలాస విభ్రమ కళా నిరూఢల నొకరి నొకరు మెచ్చుచు కలయుచు మెలయుచు మెలగుచు తాళవృంతబుల విసరుచు ప్రణయ కలహ విముఖులగుచు పదరుచు తమకుచు నువ్విళ్లూరుచు తారుచు దూరుచు నదల్పుచు ఝుంకించుచు వేడుచు కదియుచు నొగయుచు మొగము మొగమున గదియింపుచు లాలింపుచు పునఃపునరాలింగనంబులు గావింపుచు పెనంగుచు బహు విధబంధ భేదచమత్కృతుల గలయుచు నందఱి కన్నివిధంబుల ననుపుకాండై పోండిమి చూపుచు తనమాయా వినోదంబున నొక్కొక్క వేళనందఱ నెనయక తను ప్రచురనియమ వసనంబున నెలయుచు విచిత్ర మార్గంబులం బ్రవర్తింపుచు లీలానాటక సూత్రధారి యగు శౌరి సంపూర్ణకాముని గోమున సకలసామ్రాజ్య వైభవోన్నతుండై తనరుచు నొక్కనాడు 49

అర్థాలు : చతుర్దశభువనోదరుండు+అగు= పదునాల్గు లోకములను తన బొజ్జలో గలవాడై, వనజ+ఉదరుండు=పద్మగర్భుడు, మాయ+ఆచ్ఛాదితమానసులంగా= మాయచేత కప్పబడిన మనస్సులు కలవారినిగా, మారవికార+మన్మథతాపముచే, ప్రేరిత+ఉత్కట=ప్రోత్సహింపబడిన విశాలమైన, కచకుచపరిరంభణంబులు= తలవెంట్రుకల ముడిని, పాలిండ్లు,

వీనిని కౌగలించుటలు, తాళవృంతంబుల= తాటియాకు విసనకఱ్ఱలతో, తమకుచు= తహతహపడుచు, తారుచు= చేరుచు, దూఱుచు= తప్పులెన్నుచు, అదల్చుచు= విదిలించుకొనుచు, ఝంకించుచు= రొదబెట్టుచు, పెనంగుచు= పెనుగులాడుచు, అనువుకాండై= నేర్పరియై,

భావము : కృష్ణుడు సాక్షాత్ పద్మగర్భుడైన విష్ణువే. లోకములన్ని వానియందున్నవే. ఐనను దుర్మార్గులను రాక్షసులను సంహరించి భూమికి శాంతిని ప్రసాదించుటకై అవతరించి అన్ని వర్గముల వారిని తన మాయచే కప్పి ప్రవర్తింపజేయుచు, తాను గూడ వారిని పోలినవాడైనట్లు నటించుచు తన పదియాఱు వేల నూటయెనమండ్రుగు భార్యలతో శృంగారకేళి దేలుచు, కోరికలన్నియు ఫలించిన మానవునివలె (పూర్ణకాముడై) సకల సామ్రాజ్య భోగముల ననుభవించుచుండెను. అంతనొకనాడు,

మ॥ చెలులుం జుట్టలు మంత్రులం గొలువగా శ్రీ రుక్మిణీ సత్యభా
మలతోగూడ మహోత్సవంబున సుధర్మామధ్య సింహాసనా
స్థలినీలాంబరయుక్తుడై కరుణ నిచ్చం బూర్వ చారిత్రముల్
దెలియం జెప్పుచు పెద్దకొల్వు హరి సందీప్తాస్యుడై యున్నచోన్ 50

అర్థాలు : చుట్టలు= చుట్టములు, ఇచ్చన్= స్వేచ్ఛగా,ఇష్టపడి, సందీప్త+ ఆస్యుడై= వెలుగుచున్న ముఖముతో

భావము : మిత్రులు బంధువులు, మంత్రులు సేవించగా రుక్మిణీ సత్యభామలతో గూడి నీలిరంగు వస్త్రములు ధరించి, పూర్వపు ముచ్చటలు వారందఱికి చెప్పుచు పెద్దగా కొలువుదీరి హరి సంతోషముగ నున్న సమయమున "సుధర్మ"యనగా దేవసభకు పేరు. శ్రీకృష్ణుని సభకు గూడ అదేపేరు.

సీ॥ అంతంత నెంతయు నాత్మపద్మంబున
నెక్కొన్న హరి గాంచి చొక్కి చొక్కి

యక్కడక్కడ తత్కథాలాపమాధుర్య
మహిమచే దనమేను మఱచి మఱచి
యప్పటప్పటికి దదంఘ్రిసంస్మరణాప్తి
చెందంగ నానంద మంది యంది
యాడాడ దత్కృత క్రీడా విలాసముల్
దలపోసి సంతుష్టి జెలగి చెలగి

తే॥ భక్తిమదమత్తచిత్త విభ్రాంతి మించి
తాళనినదంబు ఘంటికాధ్వానముగను
దండెనాదంబు మదగంధతత్పరమున
మొనయ చనుదెంచు తుమ్మెద మ్రోతగాగ
నభ్రగజ మట్లు నారదుం డరుగుదెంచె 51

అర్థాలు : నెక్కొన్న= నెలకొన్న, చొక్కి= పరవశించి, తత్ అంఘ్రిసంస్మరణ+ ఆప్తి= హరి చరణ స్మరణవలన పొందిన, ఆడ+ఆడ= ఆడగా, దండెనాదంబు= వీణానాదము, అభ్రగజము+అట్లు= అభ్రము అను ఏనుగువలె.

భావము : హరినామ స్మరణచే పులకించి, ఆత్మలో హరిని దర్శించి పులకించుచు, హరికథలను పాడుటచే పరవశించి, హరి పాదస్మరణముచే ఆనందముచే ఆడుచు ఆతని ఆటపాటల విలాసములను తలచి, తృప్తిచెంది ఇట్లు భక్తి పారవశ్యమున నారదుని చిఱుగంటల ధ్వనులు ఏనుగు ధరించు మెడగంటల వీణానాదములు, మదగజ ఘణఘణ వలెను మద గంధ వాసనను ఆస్వాదించుటకై మూగు తుమ్మెదల ఝుంకారపు మ్రోతలుగను ఉండగా నారదుడు ఐరావతము వలె అచటికి అరుదెంచెను. అభ్రగజము అనగా తెల్లఏనుగు ఐరావతము. పాలసముద్రమున పుట్టినది. తూర్పుదిక్కున నున్న ఇంద్రుని ఏనుగుకు "అభ్రమువు" అనిపేరు.

క॥ అరుదెంచి జాతిపచ్చల
బురణించెడి తోరణముల బొనరెడి రంభా

తరువుల బంగరు జిగి చి
త్తరువుల గోపురము చొచ్చి తగ జను నెడలన్ 52

అర్థాలు : పురణించు= వర్ధిల్లు, విజృంభించు, రంభాతరువుల= అరటిచెట్ల

భావము : అట్లు వచ్చిన నారదుడు జాతిపచ్చల వలె వెలుగుచున్న తోరణములు గల అరటి స్తంభములను బంగారు కాంతులను వెదజల్లు బొమ్మలు గల గోపురాలను ప్రవేశించి చక్కగా పోవుచుండగా

ఉ॥ కెంపులతో తలంటి కడుగీల్కొను నీలపుటంచు చంద్రకాం
తంపు విశాలభిత్తికల తళ్కు వసింప మెఱుంగు చిత్ర వ
ర్ణంపుమురారిలీలలను రాజిలు చిత్తరు లద్భుతంపు నీ
లంపు వితర్ధికాంతర విలాసపు మౌక్తిక రంగవల్లులన్ 53

అర్థాలు : కీల్కొను= తగుల్కొను, భిత్తికల= గోడల

భావము : నారదుడు చూచిన భవన సౌందర్య వర్ణనమిది. కెంపులు(ఎఱ్ఱనివి) నీలవర్ణ చంద్రకాంత శిలలు అతికిన వెడల్పైన గోడలు కాంతులీను చుండును. కృష్ణుని లీలాగాథలను చిత్రములుగా చిత్తరువులుగా ప్రదర్శించిన విధము నీల వర్ణపు తిన్నెల మధ్య ముత్యాల ముగ్గులచే అద్భుతముగా నున్నది.

మ॥ వరరత్నోజ్జ్వలసౌధవీథివిలసద్వాతాయనశ్రేణులన్
స్థిరలావణ్యవిలాసవిభ్రమకళాశృంగారపూర్ణాంగులై
తరుణుల్ దివ్యరథాంతరంబుల తమిన్ తద్వారకానాయకున్
హరి జూడం జనుదెంచి నిల్చిన నిలింపాబ్జాక్షులం బోలగన్ 54

అర్థాలు : వాతాయనశ్రేణులన్= కిటికీల వరుసలలో, దివ్యరథాంతరంబుల= దివ్యమైన రథములలోనుండి, తమిన్= కోరికతో, నిలింప+అబ్జ+అక్షులన్= దేవతాస్త్రీలను

భావము : రత్నముల వెలుగుతో నిండిన సౌధములు గల వీధిలో, ప్రకాశించు చున్న కిటికీల వరుసలలో నుండి స్థిరమైన సౌందర్యవిలాసములను, శృంగార కళానైపుణ్యమును గల స్త్రీలు అందమైన రథములలో నుండి ఆ ద్వారకాపతి యైన కృష్ణుని కోరికతో చూడ వచ్చిన దేవతాస్త్రీలను పోలియుండిరి.

మ॥ కనుగొంచున్ వరనారికేళతరుసంగచ్ఛాయలన్ శ్రేణికా
గణభాగంబులరత్నకంకణఝణత్కారంబు లింపారగా
గణనల్ సేయుచు గామకంబుల దగంగా నాడుచుం బాలికా
మణు లత్యద్భుతమంది చూడ రణభుఙ్మౌనీంద్రు డేతెంచుచున్ 55

అర్థాలు : శ్రేణికాగణ= పొదరిండ్ల గుడారములందు, గణనల్సేయుచు= లెక్కబెట్టుచు, గామకంబులన్= గమకములతో, రణభుఙ్మౌని+ ఇంద్రుడు= నారదుడు.

భావము : అట్లు నిల్చియున్న అందగత్తెలను చూచుచు, కొబ్బరిచెట్ల యొక్క నీడలందు, గుడారములందు, చేతులకు ధరించిన రత్నకంకణములు (గాజులు) ఘణ ఘణ మను ధ్వనులు చేయుచుండగా కొబ్బరి కాయలను లెక్కించుచు వేర్వేఱు భంగిమలలో పాడుచు, ఆడుచు ఆశ్చర్యముతో చూచుచుండగా కలహభోజనుడు నారదుడు వచ్చుచుండెను.

నారదునకు 'కలహభోక్త' యని పేరున్నది. అదే అర్థముతో, కలహము, రణము పర్యాయములనదగినవే కనుక, రణభుక్ మౌని ఇంద్రుడు అనుట తగును. కలహభోజనుడు నారదుడనుట.

శా॥ కాంచెన్ కాంచనరత్నసంఘటితశృంగారాద్భుతాసారమున్
పంచాస్యప్రతిమాన వీరభట సంపర్కాతిదుర్వారమున్
ప్రాంచన్మంగళతూర్యనాదయుత శుంభద్భేరికారావమున్
చంచత్కాంచనకాంతిసారమును రాజద్వారముం దోరమున్ 56

అర్థాలు : పంచాస్యప్రతిమానవ సింహములకు సరిజోడులగు,

భావము : అట్లు వచ్చుచు నారదుడు రాజద్వారమును చూచెను. ఆ ద్వారము బంగారము, రత్నములు పొదుగబడినది. సింహముల వంటి వీరభటులచే రక్షింపబడుచున్నది. మంగళవాద్యములతో భేరీనాదము కలిసి బంగారు కాంతులు ప్రసరింపజేయుచుండెను

**క॥ మఱి గజఘటముల ఘీంకృతి
వరహయహేషలును సకల వసుధేశ్వర దు
ర్భరతరవాద్యధ్వనులును
సరవిన్ మ్రోయంగ మిగుల సందడి దనరన్ 57**

అర్థాలు : హయహేషలను= గుఱ్ఱముల సకిలింపులు, సరవిన్= క్రమముగ,

భావము : అక్కడ ఎందఱో రాజులు వచ్చి యుండుటచేత, వారివారి ఏనుగుల ఘీంకారములు, గొప్పగుఱ్ఱముల సకిలింపులు, వారి వారి చిహ్నములనదగు వాద్యధ్వనులు, కలిసి మ్రోగుచుండగా పెద్ద సందడి కలిగినది.

**ఉ॥ క్రిక్కిరియున్న సందడి వికీర్ణమహామిహిరంబు సూర్యుచే
చక్కగ విచ్చురీతి గడుచాలిన తేజము పర్వె దిక్కులన్
బిక్కటిలంగ వచ్చుటకు బెగ్గిలి వాకిటివారు వేగమే
యక్కమలాయతాక్షునకు నమ్ముని వచ్చుట విన్నవించినన్ 58**

భావము : చాలా దట్టమైన పరిజనుల సమూహపు కలకలమును సూర్యుని రాకచే నలువైపుల ప్రసరించియున్న మంచు చెదరిన విధముగా ఆ తేజము అన్ని దిక్కులను చీల్చుకొని వ్యాపించుచుండగా భయపడిన వాకిటి నుండు ద్వారపాలకులు వెంటనే లోపలికి వెళ్లి ముని రాకను శ్రీకృష్ణునకు తెల్పిరి.

**ఉ॥ అంతట రా గనుంగొని రయంబున రాముడు సత్యరుక్మిణీ
కాంతలు దా మెదుర్కొని వికాసముఖాంబురుహంపుకాంతిచే
స్వాంతము కూర్మి తేటపడ జక్కగ మ్రొక్కిడి యర్ఘ్యపాద్యముల్
మంచిగ నిచ్చి రత్నమయమంచికనుంచి నుతించి వేడుకన్ 59**

అర్థాలు : రాముడు= బలరాముడు, రత్నమయమంచికన్= పొదిగిన ఆసనముపై

భావము : అంతట కృష్ణుడు బలరామునితో రుక్మిణీ సత్యభామలతో ఎదురేగి తమ తమ సంతోషంబులు తమ తమ ముఖములందు ప్రతిఫలించినట్లు నవ్వుచు స్వాగతము బలికి, నమస్కరించి, అర్ఘ్యపాద్యములిచ్చి ఉచితాసనమున ఉంచి స్తుతించిరి. ఆర్ఘ్యము అనగా పూజ కొఱకును, పాద్యము అనగా పాదములు కడుగు కొనుటకును ఇచ్చునీరు.

**క॥ మౌనియనుజ్ఞను దారా
సీనులరై క్షేమమడిగి చిరతరకరుణాం
భోనిధి! పావనమయ్యెను
మానిలయము మీపదాబ్జమహిమాన్వితమై 60**

భావము : నారదుని అనుజ్ఞతో వారందఱు కూర్చుండి, క్షేమమడిగి, ''మీరాకచే మీ మహిమచే మా నిలయము పవిత్రమైనది.''

**చ॥ త్రిభువనముల్ చరించును ధీవర! భాస్కరు బోలి నేడు నన్
శుభయుతుగా దలంచి కడుచోద్యము మీరిటులేగుదెంచినా
రభిమతసిద్ధులున్ శుభము లన్నియు జేరెను నానతిమ్ము దై
న్యభయవిదూర! చేతు భవదాజ్ఞ శిరంబున దాల్చి నిక్కమున్ 61**

అర్థాలు : అభిమతసిద్ధులు= సంకల్పసిద్ధులు, కోరినవి వెంటనే లభింపజేసికొనజాలినవారు

భావము : ''దైన్యము భయము లేనివాడా! సూర్యుని వలె మూడులోకములు సంచరించు తాము నా భాగ్యవశమున ఇట్లు వచ్చినారు. నాకింక అన్నియు శుభములే. మీ ఆజ్ఞను మీరు కోరినది చేయగలను'' అని కృష్ణుడనెను.

**మ॥ అనినన్ సంతసమంది యో నిఖిలలోకాధీశ యోనందనం
దన! యోపంకజనాభ! యోవరద! యోదైత్యారి! యోనిత్య పా**

వన సర్వంబును మీ మహామహిమచే వర్తించు క్షీణించు సం
జననంబందును నీదు మాయ గడవన్ శక్యంబె లోకేశ్వరా! 62

అర్థాలు : కడవన్= తప్పించుకొనుటకు

భావము : అట్లు కృష్ణుడనగా సంతోషించి నారదుడిట్లనెను "నీ మహిమ చేతనే సర్వము నడచుచున్నది, క్షీణించుచున్నది. ఇది మరల పుట్టుచున్నది. నీ మాయను దాట వశము గాదు."

చ॥ సరసిజసంభవ ప్రముఖ సర్వసురల్ భవదీయమాయచే
దరి గనలేరు నీ కరుణ దార్కొనజేసి సముద్ధరించు నీ
చరణసరోజభక్తి మది శాశ్వతమయ్యె తరించినాడ నీ
నిరుపమమైన మాయ సితనీరజ పత్ర విశాలలోచనా! 63

అర్థాలు : సరసిజసంభవ= బ్రహ్మ, సితనీరజపత్రవిశాలలోచనా= తెల్లని పద్మపత్రముల వంటి విశాలమైన కన్నులు గలవాడా!,

భావము : "బ్రహ్మ మొదలైన దేవతలందఱు నీ మాయకు మొదలు తుదలు తెలియలేరు. నీవు కరుణించి వారిని సముద్ధరింతువు. నీ పాదపద్మములందు నా భక్తి శాశ్వతమైనది. నీ మాయను నేను దాటగలిగితిని."

క॥ ఓ గుణనిధి! భువనంబులు
నీ గర్భమునందు దాల్చి నిరతము నీవే
యోగ క్షేమము లరయగ
యోగక్షేమంబులరయ నొప్పునె నిన్నున్ 64

భావము : "ఓ మహానుభావా! అన్ని లోకములను నీ గర్భములోనే ధరించి అందఱి యోగక్షేమములను కాపాడు నిన్ను నేను యోగక్షేమములడుగుట సరికాదు" "యోగక్షేమం వహామ్యహమ్" అను కృష్ణుని గీతావాక్యమిచ్చట స్ఫురించును

చ. హరికళతోన భూమిభరమంతయు దీర్పగ బుట్టి దుష్టదైత్యసం
హరణము సేయ బుట్టిన మహాహి వనంతుడ వయ్యు నిక్కమున్
సురలును మౌనివర్యులును శోభనులై సుఖియింతు రెప్పుడున్
వరద! భవద్బలంబున వివర్ధన సంపద రోహిణీసుతా! 65

అర్థాలు : హరికళతోన= విష్ణువు అంశతో, మహాహిని+అనంతుడవు+అయ్యు (అయియు)= గొప్ప సర్పమైన అనంతుడవై

భావము : "రోహిణీదేవి కుమారుడవైన బలరామదేవా! నీవు విష్ణుని అంశలో బుట్టినవాడవు. నిజమునకు నీవు దుష్టరాక్షస సంహారము జేయుటకై మహాసర్ప రూపమున "అనంతుడు" అను పేరున్న ఆది శేషుడవు. నీ బలము కారణముగ దేవతల భోగసంపదలు, మహర్షుల తపస్సంపదలు విశేషముగ వృద్ధియగుచు సర్వదా వారు శుభావహులగుచున్నారు."

మ॥ అని రామానుజు రౌహిణేయులను నిత్యానందసుస్వాంతులన్
వినుతుల్ జేయుచు సత్యరుక్మిణిని దా వీక్షించి లోకంబులన్
వనితారత్నములార! మిమ్మెకద యెవ్వారున్ మహాలక్ష్మి భూ
వనజాతేక్షణ యంచు నెంతు రది సర్వంబున్ నిజంబే కదా! 66

అర్థాలు : రామ+అనుజ= బలరాముని తమ్ముడైన కృష్ణుని, రౌహిణేయులను= రోహిణీదేవి కుమారుడగు బలరాముని.

భావము : ఇట్లు బలరామ కృష్ణులను పొగడుచు సత్యభామను రుక్మిణిని చూచి "వనితా రత్నములారా! అమ్మా సత్యభామాదేవీ! నీవు సాక్షాత్ భూదేవివని, ఈ రుక్మిణీదేవి సాక్షాత్ శ్రీమహాలక్ష్మియని లోకులు అనుకునే మాట నిజమే."

ఆ॥ అట్టుగాకయున్న హరి పదియారువే
లబ్జముఖులయందు నష్టమహిషు

లందు బెద్దజేసి యనిశంబు మిమ్మిట్లు
కూడి పాయకుంట గురుతు గాదె 67

అర్థాలు : అనిశంబు= ఎల్లవేళల, పాయక+ఉంట= విడువకుండుట,

భావము : "ప్రజలు అనుకునేది సత్యమే అనుట కొక నిదర్శనము పదియాఱు వేల గోపికలు భార్యలై, ఎనమండుగురు పట్టపురాణులుండగ, కృష్ణదేవుడు ఎల్లవేళల మిమ్ము ఇరువురుని విడువక మీతో నుండుట, విశేషగౌరవ మిచ్చుట - ఇది ఋజువే సుమా!"

క॥ అని యిష్టాలాపంబుల
జనితమహోత్సాహులైన సభ్యుల కలితా
ననములు మునివరభాస్వ
ద్ఘనతేజము గమ్మి కడు వికాసము నొందెన్ 68

అర్థాలు : కలిత+ఆననములు= నిర్మలమైన ముఖములు, మునివరభాస్వ ద్ఘనతేజము= నారదుని గొప్పతేజస్సు.

భావము : ఇట్లు నారదుడనిన మాటలకు సభ్యులు మహోత్సాహము గలిగిన వారైరి. వారి ముఖములు నారదుని తేజస్సు కమ్ముకొనగా వికాసము పొందినవి.

వ॥ ఇట్లు సంతుష్ట మానసులై యుండునప్పుడు 69

భావము : ఆ విధముగా సంతృప్తి చెందిన మనస్సు కలవారై యుండగా

క॥ బలరామనారదులమై
ధళధళలును సతుల కాంతితళతళలును శ్రీ
సలినాక్షు మేని నిగనిగ
కలయగ బర్వెన త్రివేణిగతి సభయొప్పెన్ 70

అర్థాలు : త్రివేణిగతి= త్రివేణీ సంగమమువలె

భావము : బలరామ నారదుల దేహకాంతులు, (తెల్లని) రుక్మిణీ సత్యభామల సౌందర్యకాంతులు,(ఎఱ్ఱని) కృష్ణుని శరీరకాంతులు (నల్లని) కలిసి ఆ సభ త్రివేణీ (నల్లని) సంగమమువలె ప్రకాశించెను.త్రివేణి యనగా గంగా, యమునా, సరస్వతీ యను మూడు నదులు. ఈ మూడు కలిసినది త్రివేణీ సంగమము.ఇది ప్రయాగ పుణ్యక్షేత్రమైనది అని యొక భావము కాగా, జీవుని విడువని గుణములు మూడు. అవి సత్త్వము, రజస్సు, తమస్సు అనునవి. సత్త్వసంకేతము తెలుపురంగు, రజస్సునకు ఎఱుపురంగు, తమస్సు నలుపురంగు. ఈ మూడును కలగలిసిన సభ సత్త్వ, రజస్తమో గుణములకు ఆటపట్టయిన జీవునివలె ప్రకాశించినది. ఇదియును త్రివేణిభావమున పరమకర్తృ పురుషుడు కృష్ణుడు (పురుషోత్తముడు కదా), క్రియాదర్శినీ ప్రకృతి రూపులైనవారు రుక్మిణీ సత్యభామలు, బలరామ నారదులు నిమిత్తకర్తలు. ఈ ముప్పురు కలిసినదే జగత్తు, సంసారము. ఈ సభ అట్టిది. త్రివేణి యనగా భ్రూమధ్యమని యోగశాస్త్రార్థము. ఇది ఆజ్ఞాచక్ర స్థానము. కృష్ణుడు సుధర్మయను పేరుగల సభలో కొలువు కాగా, ఆ సభ త్రివేణి, అనగా, ఆజ్ఞా చక్రము అను గురుజ్ఞానస్థానముగ ప్రకాశించినదని భావింపబడినది.

వ॥ ఆ సమయంబున 71

భావము : ఆ సమయమందు

అర్థాలు : వనీపకుడు= తోటమాలి, కురంట= పచ్చగోరింట, కుంద= మొల్ల, చూత= మామిడి, కదళీ= అరటి

ఉ॥ నూతనకేలికావన వినోదము దెల్ప వనీపకున్ దగన్
జాతిపునుంగుకప్పురము చాల జవాదియు కస్తురిం దగన్
జాతికురంటకుందముఖసర్వసుమంబులు ద్రాక్షపళ్ళు మేల్
చూతఫలంబులన్ బనసలున్ కదళీఫలరాజముల్ దగన్ 72

భావము : అప్పుడు క్రొత్తగా నిర్మించిన కేళీవనమును గూర్చి చెప్పుటకు తోటమాలి వచ్చెను. ఆతడు పునుగు, కర్పూరము, జవాది, కస్తూరి మొదలైన

సుగంధలేపనములను, పచ్చ గోరింట మొదలైన పూవులను, ద్రాక్ష, మామిడి, పనస, అరటి పండ్లను కానుకలుగా తెచ్చెను.

ఆ॥ జుంటిపచ్చితేనె చొక్కమౌ తెరతేనె
పుట్టతేనె చాలపువ్వుతేనె
సాగు చెరుకు గడలు చలువ గొజ్జగి నీరు
పుష్పరజము సరులు పూలచెండ్లు 73

అర్థాలు : చొక్కమౌ= స్వచ్ఛమైన, తెరతేనె= తరగల తేనె, పుష్పరజము= పుప్పొడి, సరులు= దండలు, చెండ్లు= బంతులు.

భావము : తేనెటీగలు పెట్టిన పట్టుతేనె, తరగల పుట్టతేనె పూవులతోని తేనె విరివియైన చెఱకు గడలు, పన్నీరు, పుప్పొడి, పూదండలు, పూలగుత్తులు కానుకలుగా తెచ్చెను.

ఉ॥ ఆదిగ నవ్వనంబు తొలియామని గల్గిన సర్వవస్తువుల్
ప్రోదిసహస్రభారవహులుం గొనితేర వనీపకుండు దా
మోదరు సన్నిధిం నిలిపి యొయ్యన జక్కగ జాగి మ్రొక్కి యో
నాదవినోద! నూతనవనప్రభవంబులు చిత్తగింపవే 74

అర్థాలు : ఆమని= వసంతము, ప్రోది= పోషించి, ప్రోగుచేసి, సహస్రభారవహులున్= వేయిమంది మోయువారు, కొనితెర= తీసికొనిరాగా, ఒయ్యన= తిన్నగ, సాగి= సాగిలబడి

భావము : పైచెప్పిన కానుకలను వెయ్యిమంది మోసికొని రాగా, వనపాలకుడు కృష్ణునకు సమర్పించి, సాష్టాంగమాచరించి, ''స్వామి! ఇవి తమ క్రొత్త వనములోని తొలికాపు. స్వీకరింపుడు'' అనెను.

క॥ ఆ రైవతగిరిచర మగు
సౌరభమృగరాజికృతకశైలబిలంబుల్

చేరి చరింపగ గల క
స్తూరిజవాదియు పునుంగు చూడు మురారీ! 75

అర్థాలు : రైవతగిరిచరము= రైవతకాద్రిపై సంచరించునట్టి, సౌరభమృగరాజి కృతకశైలబిలంబుల్= కస్తూరి మృగములు రైవతకాద్రి గుహలలో

భావము : మఱియును, రైవతకమను కొండపై కస్తురి మృగములు గుహలలో తిరుగునప్పుడు ఏర్పడిన కస్తూరి, జవ్వాది పునుగు మొ॥ వానిని పరిశీలింపుడు'' అనియెను. కస్తురి మృగముల నాభినుండి స్రవించి గడ్డకట్టినది కస్తూరి. ఒకజాతి పిల్లుల నుండి వెల్వడునది పునుగు.

తే॥ మఱియు ఫలపుష్పములు సామి తరమె పొగడ
ననలు పువ్వులు పిందెలు ఘనశలాటు
వులు ఫలంబులు పూదేనె లలరనందు
నెందు నుండు వసంతుండు నిరతముగను 76

అర్థాలు : ననలు= మొగ్గలు, శలాటువులు= కసుగాయలు, ఎందున్= ఎచ్చటను, నిరతము= ఎల్లప్పుడు

భావము : ''స్వామీ! ఇంకను అక్కడ పూలు, పండ్లు, మొగ్గలు, పిందెలు కసుగాయలు, పూదేనె ఎన్నియో ఉన్నవి. అచ్చట ఎల్లప్పుడు వసంతుడు ఉండును.

ఉ॥ మావుల పైడితంగెడుల మల్లెలనున్ గృతకాద్రిపట్టులన్
సావినకారుపుట్టలను సంతతముంగల పుట్టుతేనియల్
వావిరిపువ్వుదేనెల ప్రవాహము చంద్రశిలాదితావులున్
బావుల చెల్వగొజ్జగిసుమప్రభవాంబువు నిండి వెల్వడున్ 77

అర్థాలు : మావుల= మామిళ్ళను, కృతకాద్రిపట్టులన్= కృత్రిమముగ ఏర్పఱచిన క్రీడాపర్వతములలో

భావము : మామిడి, తంగెడు గుబుర్లు, మల్లె పొదలు గల క్రీడాశైలములలో దట్టమైన పుట్టలందుగల తేనెపట్టు నుండి వెల్లువలై వెల్వడు తేనెలు, వెల్లుగ వెల్వడులై పూల తేనియలు ధారలు గల చంద్రకాంత మణులును మఱియు బావులందు గొజ్జంగి పూలు పడుటచే, వాని వెలుగులచే నీరు నిండిపోయి పైకి దొరలుచున్నది.

క॥ అని చెఱుకు గోలయొక్కటి
కనుపునకున్ విఱిచి మౌక్తికము పాలకుఁడొ
య్యన మురరిపుముందర నిడి
మనవి పరా కనుచు జూపి మరి యిట్లనియెన్ 78

భావము : వనపాలకుడు ఒక చెఱకుగడను, కనుపు దగ్గఱ విఱిచి అందున్న మణిని తీసి కృష్ణునకు ఇచ్చి "పరాక్" అనుచు మనవిచేసి ఇట్లనెను. చెఱకు గడలలో మణులుండునని కవుల వర్ణనము.

క॥ పుప్పొడితెప్పలు గొప్పగు
కప్పురపుం దిన్నియలను గైకొని వేల్పుల
కప్పురగంధులు వెన్నెల
కుప్పల నాడుదురు సరకు గొనరిట మమ్మున్ 79

అర్థాలు : తిన్నియలను= తిన్నెలపై (కుప్పలపై), వేల్పులకప్పురంగంధులు= దేవతాస్త్రీలు, సరకుగొనరు= లెక్కచేయరు.

భావము : "తెప్పలై రాలిన పుప్పొడి కుప్పలపై దేవతాస్త్రీలు రాత్రివేళల వెన్నెలలోన కుప్పలాటలు ఆడెదరు. మమ్ము లెక్కచేయరు"

ఉ॥ కాలువపువ్వుదేనియలు గ్రమ్ముక చిమ్మన గ్రోవులన్ గడున్
హేళిని గేళి సల్పుదు రొకప్పుడు గొజ్జగి నీటబావులన్
వ్రాలుచు నోలలాడుదురు వారక పూపొదరిండ్లలో లతా
డోలల నూగుచున్ మది గడుందలపోయరు వారు కాలమున్ 80

అర్థాలు : చిమ్మనగ్రోవులన్= పిచికారి చేయు పరికరములతో, హేళిని= పరిహాసముతో, కేళి=ఆట, ఓలలాడుదురు= ఈతగొట్టుచుందురు, లతాడోలల= తీగల ఉయ్యాలలో

భావము : "కాలువలు గట్టిన పూదేనెలను పిచికారీలలో నింపుకొని ఒకరిపై నొకరు చల్లుచు, పరిహాసములాడుచు ఆడుచుందురు. పూల పరిమళాలతో గుబాళించు బావినీటిలో దిగి ఈదులాడుదురు. పూలపొందరిండ్లలో పూదీవెలతో ఊయలలూగుదురు. కాలమునే తలపోయరు." చాలాసేపు ఆడుదురని భావము.

క॥ గంధర్వాంగన లైతే
బంధుర నవరత్నకేలి భవనములందున్
గంధవహానిల సంగతి
సంధుల వీణియలు మీటు సందడి మిగులన్ 81

అర్థాలు : గంధవహఅనిల+సంగతి= పూల సువాసనలు మోయు గాలిలో యమునానదీ తీరమున, సంధుల= సంధ్యాకాలమందు.

భావము : ఆ వచ్చిన దేవతాస్త్రీలలో గంధర్వస్త్రీలు కేళీభవనములలోను యమునానదీ తీరమున సుగంధభరితమైన గాలిలోను సంజవేళలందు వీణలు మీటుచు చాల సందడి చేయుదురు.

రూపాంతరములు : సంధ్య-సంధు, సంద, సందె, సంజ మొ.

ఉ॥ ఎప్పుడు వత్తురో తెలియ దెక్కడిత్రోవల నేగుదెంతురో
యెప్పుడు బోదురో మరల నించుక వచ్చుట పోవు జాడలే
చొప్పున గానరావు మది జోద్యము లయ్యెడు పోతుటీగకుం
దప్పి చనంగరాదు నిరతంబును మాకిక బుద్ధిదెల్పవే 82

భావము : "ఈ దేవతాస్త్రీలు ఎప్పుడు వత్తురో, ఎప్పుడు పోదురో తెలియదు. ఎటునుండి వత్తురో తెలియదు. వచ్చి వెళ్ళిన గుర్తులు కానరావు. చాల

ఆశ్చర్యముగ నున్నది. స్వామీ! మా కాపలాలో లోపములేదు. పోతుటీగ కూడ మా కంటబడక తప్పించుకొనదు. మాకు వారిని గుర్తించు తెలివి దయతో తెల్పండి.'

మ॥ అను నంతన్ వనపాలకాగ్రణిని నెయ్యం బొప్ప వీక్షించి మ
న్ననతాంబూల ధనాంబరాభరణ సన్మానంబులన్ దృప్తి చే
సి నయంబొప్పగ సేవకావలులకున్ శృంగారవస్త్రంబులున్
ధనముల్ చాలనొసంగి యంత మది నుత్సాహంబు సంధిల్లగన్ 83

అర్థాలు : నెయ్యంబు ఒప్ప= స్నేహముతో,

భావము : అని విన్నవించిన వనపాలకుల నాయకుని స్నేహభావముతో చూచి, తాంబూలమిచ్చి, ధనము, వస్త్రములు, ఆభరణములు ఇచ్చి సన్మానించి ఇతర సేవకులకు గూడ చక్కని వస్త్రములు ధనము చాల ఇచ్చి తన మనస్సులో ఉత్సాహము ఉప్పొంగగా

క॥ వనజాక్షుండు పురోహితు
కనుగొన్నను చిత్త మెఱిగి ఘుక్కున పురి గ
ల్గిన విప్రవరులనైదువ
లను దోడ్తెమ్మనుచు చారులకు నతడనియెన్ 84

అర్థాలు : ఐదువలను= ముత్తైదువులను, చారులను= దూతలను

భావము : కృష్ణుడు పురోహితుని వైపు చూడగా, ఆతడు స్వామి మనసులోని తలపు తెలిసికొని, ఆ నగరమున గల బ్రాహ్మణులను వారి భార్యలను తీసికొనిరండని దూతను పంపెను.

రగడ

సోమయాజులు వస్తిరా? మన సూరుభొట్ల బిలిస్తిరా? రామచంద్రయ వింటిరా? మన రాఘవయ్యను గంటిరా?

దర్భతేజయ రాకపోయెను, ధర్మడుంబది ఘడియలాయెను, దుర్భిబ్రహ్మడు కొద్దికాడా? ధోవతీయడు నేడు రాడా?

మల్లుశాస్త్రి పురాణమిప్పుజు మానినాడా! నదిని చెప్పడు యెట్టు లొజ్జలు నేడు పర్వమిదేమియో ననువారు సర్వము

పిలువ పంపగ పోయినారము, పిన్నలటురానేల దూరము? పలువరంగని పిలువబోకుడు, పట్టు పట్టగు నగరి కీడు,

వాడు విను గోపంబు చేసును, పదరకంటగనీడు కాసును, నేడు సర్వశోభనముగద, నీవె వస్తివి వేగ పద పద,

దర్భముడి వుంగరము వేలను తొడుగ కళగలిగింది చాలను, గర్భమున పట్నూలె తోరము, కాంతిమించిన దొర తోరము

నన్ను నేడైనాను మరువకు నాగశాస్త్రులు రాను చొరవకు, ఎన్నడును నీ మేలుగానము, ఇప్పుడిప్పించొక్క దానము,

ఇరుగుపొరుగున నున్నవారము, ఇట్టియుపకృతి మరువనేరము, వరదశాస్త్రికి నగరి కట్టడ వచ్చునా? ఇది బ్రహ్మకట్టడి,

వెనక నన్ననవద్దు, పాయక వెంటనే రాగిల్లు సేయక, కనకడడిగిన వానితోడను కామశాస్త్రిప్పించినాడను.

నగరి కట్టడ వారికిత్తురు, నాటివలె మీరేల వత్తురు? తగదు మాతో వాదు, దొరవా? దండ దాపిక మాకు కరువా?

వెనకచిక్కుడు శొంఠికాయలు విడి పరీక్షలు చనవు మాయలు, పనస పది వల్లించు వానికి భాగ్యమేటికి వట్టి పూనికి.

అనుచు నొకరొకరాడుకొంచును, ఆడువారలరమ్మనంచును, వెనుక ముందర గూడి నిల్చుచు, వేగ రమ్మని సతుల బిల్చుచు

కురుచ బాలుర బ్రహ్మచారులు కొమరప్రాయపు సొకుమారులు, సరిగృహస్థులు, సోమయాజులు, శాస్త్రులుంగడు యోగ్యులార్యులు

కన్నియల్, దగుచిఋతప్రాయపు కాంతలును, గడువయసుపడతులు, చెన్నుమీరిన బిడ్డతల్లులు, చెలగు పెద్దలు మిగుల వృద్ధులు,

ముందువెన్కల జేరిపిల్చుచు, మద్దియలరమ్మని యదల్చుచు, పొందుకత్తెలు గుములుగూడుచు, పొరపు వెడలిన హితవులాడుచు,

అక్కబిడ్డలవెంటబెట్టుకొ యపుడపోయెను, పదవె కూతుర, తక్కువెక్కువ నిమిషమింతే తాళవే తొక్కేవుపోతరి,

కూడనియ్యవె సుబ్బి యిదిగో కోకగట్టుకో వత్తునిదిగో, తోడివారందఱును పోగా, తోవగానవు గాలు చెప్పుడె,

ఉదయరాగము చీరరంగైయున్న దెప్పుడు పుచ్చుకొంటివె? అదె మెఱుంగని పెళ్లిలో మాయన్న యిచ్చెను, నేడు గంటివె!

అక్కమొన్నటి యజ్ఞమట, మురారివంటి కొడుకదెక్కువ, పొక్కేవు తిరుపాలుదాదికె పుట్టిన వయసేమి తక్కువ?

అంబికూతురు పిన్నదటవే? యాడురూపింతైన బుట్టదు, డంబుమాత్రమె, అత్తకుం గోడలికి పంతముచాల, బెట్టదు.

డ్రొబ్బకే నను చంటిపాపడు దోషకారీ! చెయ్యి జారును, అబ్బురపు బిడ్డలను గంటివి, అవునె యెవతవె నన్ను పోరను?

దొమ్ములాడక పద, సందడి దొరకనియ్యరు ముందు ముందుగ, అమ్మ నేడిదియేమి నగరిని? అందఱుని బొయ్యేము విందుకు,

భూరిదానము విస్తునాడట పూతనాఘనప్రాణహారుడు, వారువీరన కెల్లవారికి ద్వారకాపట్టణవిహారుడు,

పదపదండని వత్తురప్పురి బ్రాహ్మణాంగన లాత్మమోదము, యెదురు గాదే వేగరమ్మని యొచ్చి పిల్చిరి, ద్విజవినోదము,

పొగడదరమే యిట్లు వచ్చిన భూమిసురలను సతుల నందఱ తగ గనుంగొని కృష్ణదేవుడు దానమియ్యదలంచి ముందర **85**

అర్థాలు : పదరకు= వాగకు, తొందరపడి మాట్లాడకు, పట్నాలె= పట్టునూలు, తోరము= వ్రతదీక్షకు గుర్తుగా కట్టుకొను సూత్రము, చక్కనిది, నగరి కట్టడ= నగరమున విధిగా లభించు గౌరవము, గిల్లు= బెట్టు, వాదు= పోట్లాట, వాగ్వాదము, దండదాపు= అండ, బలము, పనస= వేదములలో ఒకభాగము (50 పదములు గలది-పంచాశత్ అను సంస్కృతశబ్దము), చెన్ను= అందము, పొందుకత్తెలు= స్నేహితురాండ్రు, గుములు= గుంపులు, పొరపు= వైరము, పాతర= నర్తకి, పొక్కకే= గట్టిగ మాటాడకే, డంబు= దంభము, డ్రొబ్బకే= త్రోసివేయకు, దొమ్ములాడక= పోట్లాడక, సందడి= చాలమంది చేరినపుడు కలుగు కలకలము ఇది రగడ, అనగా, గుంపులు గుంపులుగా చేరినవారు, వారువారు మాట్లాడుకొను సందర్భము. కనుక ప్రతి రెండు పాదములకన్వయమే తప్పు, మొత్తమునకు కలిపి సమన్వయార్థముండదు.

భావము : సోమయాజులూ, వచ్చారా? మన సూరుభోట్లను కూడ పిలిచారా? అని ఒక బ్రాహ్మణుడు మరియొకని నడుగగా, అతడు, రామచంద్రయ్యా! ఇదిగో! మన రాఘవయ్య కన్పించాడా?, అని యడుగును.

బ్రహ్మాడు మరీ లేనివాడా యేమిటి? మొన్న ధోవతి ఇవ్వలేదు, అని యొకడు, పది ఘడియలైనా ఇంకా దర్భతేజయ్య, ధర్ముడు రానేలేదు, అని మరియొకరు ఇట్లే స్త్రీపురుషులు ఒకరినొకరు పలుకరించు కొనుచూ, చాడీలు చెప్పుకొనుచు, మాటకు మాట నువ్వంటే నువ్వేతవె అనుచు పొట్లాడుకొనుచు, బ్రాహ్మణులు అన్ని వయసుల వారును గుంపులు గుంపులుగా తరలిరాగా, శ్రీకృష్ణుడు దానమియదలచి ముందుగా-

రగడ యనునది సార్థకమైన పేరుగల ఒక ఛందోవిశేషము దేశీయము. ఇందు ద్విరదగతి, వృషభగతి, హయగతి, తుంగవల్గన అని ఇట్లనేక భేదములున్నవి. వీని నడకలు భిన్నభిన్నములుగ పాడుకొనుటకు వీలుగనుండును. ప్రతిరెండు పాదములు ఒకవాక్యముగ భావింపబడును. కాని సాధారణముగ పాదార్థమే'' ఒకవాక్యము కావచ్చును. ఈ రెండు పాదములకు ప్రాసనియమున్నది. అందముకొఱకై పాదాంత్యప్రాసములను, పాదాంతరప్రాసములను కవులు కూర్చుట కద్దు. ఈ ప్రస్తుత రగడ తిశ్ర చతురశ్ర కలిసిన మిశ్రజాతి నడక గలది. (రామచంద్రయ) ఇట్లు ఏడు మాత్రల నడకగలిగినవి నాలుగు గణములు ప్రతిపాదమున నుండును.

వైదిక బ్రాహ్మణులు, వారి పత్నులు, సంతానము, ఇతరులు ఫలదానములకై ఏవిధముగా స్పందింతురో కవి కన్నుల గట్టినట్లు వర్ణించెను.

వ॥ ఇట్లు ఫల దానమియ్యం దలంచి నారదుని చాల బూజించి లేపనా లాపనమధుర ఫలహారంబులం దృప్తుల జేసి వచ్చిన భూసురోత్తము లకు దక్షిణ పూర్వకంబులుగా ఫలదానంబులు చేసి భూసురాంగనల బాలలు దత్తత్ప్రీతి యానుకూల్యంబులుగా ననేక వస్త్రాభరణంబులతో ఫలంబుల పరిమళ ద్రవ్యంబులు నొసంగి బంధుమిత్రా మాత్యవర్గంబు లకు యథేష్టంబుగా ఫలపుష్ప సుగంధ ద్రవ్యంబు లొసంగి యా వన విహార కౌతూహలమానసుండునుం బోలె నారదు గర్వంబుడుపం దలంచి దారకు నవలోకించి రథమాయితంబు గావించి తెమ్మని నియమించిన 86

అర్థాలు : లేపన+ఆలాపన= మైపూతలతో (గంధపుపూత మొ॥) ప్రియసంభాషణములతో, దక్షిణ= దానమిచ్చిన వస్తువులతో చేర్చి యిచ్చిన ధనము, గర్వంబు ఉడుపన్ తలంచి= గర్వమును పోగొట్టవలెనని సంకల్పించి, దారకుని= సారథిని

భావము : (సులభముగ) రథసారథిని తేరును తెమ్మనెను

తే॥ అతిరయంబున నేగి గట్టాయితముగ
సైన్యసుగ్రీవ మేఘపుష్పకవలాహ
కముల దగ బూన్చి సకలాయుధముల నుంచి
గరుడకేతనమెత్తి శృంగారలీల 87

అర్థాలు : కట్టాయితముగ= పూనికతో, సిద్ధముచేసి, ఆలస్యముచేయక, గరుడకేతనము= గరుత్మంతుని గుర్తున్న జెండా.

భావము : వేగముగ పోయి ఆ సారథి, ఏ మాత్రము ఆలస్యము చేయక, గుఱ్ఱములను పూన్చి, రథములలో ఆయుధములన్నిటిని పెట్టి, రథముపై జెండాను ఎగురవేసి, రథమును సిద్ధపఱచెను.

వ॥ మోహనంబైన రథము ముందరను నిల్వ 88

భావము : మిక్కిలి మెఱుగైన తేరు ముందు నిల్వగా

అర్థాలు : సోముడు= చంద్రుడు, పూర్వాది= తూర్పుకొండ

క॥ ఆ మౌనీంద్రుడు మున్నుగ
రాముడు దేవులును చెలులు రా రథము పయిన్
తామరసాక్షుడు బొలిచెను
సోముడు పూర్వాద్రి మీద జూపట్టు క్రియన్ 89

భావము : నారదుడు ముందుగ బలరాముడు రాణులను వారి చెలులును రాగా కృష్ణుడు ఉదయాద్రిపై వెలుగు చంద్రునివలె రథము ఎక్కెను.

ఉ॥ దారకు డల్లనల్ల ప్రమదంబున దేరటువోవనియ్యె శృం
గారవనంబుమార్గమున గారకులున్ మును మున్ను వారగా
పౌరసతుల్ ముదంబుల శుభప్రదలాజలు నక్షతంబులున్
చారుమణి ప్రభాపటలసౌధములందుల నుండి చల్లుచున్ 90

అర్థాలు : అల్లనల్ల= మెల్లగా, ప్రమదంబున= సంతోషముగ, వారగ= ప్రక్కగా, లాజలు= పేలాలు.

భావము : సారథి మెల్లమెల్లగా తేరును సంతోషముతో అట్లు పోనియ్యగా శృంగారవనము త్రోవన ముందుగా పట్టణమందలి పాటలు పాడువారు, ప్రక్కగానుండి పౌరవనితలు సౌధముల నుండి కొందఱు పేలాలు, అక్షతలు, శుభములను కోరుచు చల్లిరి.

ఆ॥ రథమునందు నున్న రామ రామానుజ
సత్యరుక్మిణులను సంయమీంద్రు
జూచి పారిజాత సుమము రుక్మిణి కిచ్చి
మున్ను కలహమిడిన ముచ్చు తపసి 91

అర్థాలు : ముచ్చు (ముచ్చు)= దొంగ, తాపసి= ముని

భావము : రథములోని బలరామకృష్ణులను, సత్యభామారుక్మిణీ దేవులను, వారితో కలిసియున్న నారదుని చూచి, "మునుపు పారిజాత పుష్పమును స్వర్గమునుండి తెచ్చి రుక్మిణికిచ్చి, సత్యభామ కోపమునకు కారణమైన దొంగముని నారదుడు కదా!"

మ॥ ఇదుగో నేడును వచ్చి వీరిగొని తా నెందేగుచున్నాడొకో
మది నీ కృష్ణుడు వాదకూట తపసిన్ మర్యాద గాదంచు దా
వదలంజాలడు పెళ్లి పేరటమొ పర్వంబో సుహృత్ప్రీతియో
సుదతీ! వీరలిదెందు వోయెదరు ముచ్చున్ మౌని ప్రేరేపగన్ 92

అర్థాలు : వారకూట= తగవులకు నిలయమైన నారదుడు, సుహృత్= మిత్రులయెడ, ప్రీతియో= ప్రేమయో!

భావము : "నేడుకూడ ఆ నారదుడు వచ్చి వీరిని తీసికొని పోవుచున్నాడు. ఎక్కడికో తెలియదు. కృష్ణుడేమో మర్యాదకాదని ఆ నారదుని వదలడు. ఎక్కడైన పెండ్లియో, ఉత్సవమో, మిత్రుని వద్దకో, వానితో పోవుచున్నారు."

క॥ నేడు గద యొకటి బుట్టును
చూడుండని యొకరికొకరు చోద్యంబనుచున్
మేడలవాడల ప్రోడలు
నాడుకొనన్ వినుచు కృష్ణుడల్లన నగుచున్ 93

భావము : "నేడు తప్పక ఏదియో ఒకటి (వింత) జరుగును." అని ఊరి వనితలు ఒకరికొకరు చెప్పికొను మాటలు వినుచు చిఱునవ్వుతో ప్రౌఢ (ప్రకృతి) పోడ(వికృతి) మధ్య వయసు వనితలు.

చ॥ తను గని కాంక్షలన్ మొనయు తామరసాయతపత్రనేత్రలం
గనుగొనుచున్ నిరీక్షణ వికాసముఖాంబుజహాస హస్తసం
జనితనయాభిమార్గముల సంతసమందగ జేయుచున్ ముదం
బున మునిరాజుతో నలరి ముచ్చటలాడుచు రాముతో ననున్ 94

అర్థాలు : కాంక్షలన్ మొనయు= కోరికలతో పెనగుచున్న, వికాసముఖ అంబుజహాసహస్తసంజనితనయాభిమార్గములన్= వికసించిన ముఖమున నవ్వులతోను, చేతిసంజ్ఞలతోను, రాముతో= బలరామునితో

భావము : తనవైపు కోరికతో చూచుచున్న యువతులను చిఱునవ్వులతోను, చేతి సంజ్ఞలతోను సంతోషపెట్టుచు, ఆనందముగా నారదునితో మాటలాడుచు, బలరామునితో నిట్లనెను.

ఉ॥ ఈ మునిలోక మౌళి దరమే నుతియింపగ ముజ్జగంబులన్
తామరసాప్తుడో యన ఘనద్యుతి దిక్కుల బిక్కటిల్లగా
ప్రేమ నిజేచ్ఛలం దిరుగు భిక్షులలో గణుతింప నెంతయున్
మామకమాయ గెల్చిన సమర్థుడితండె జగత్త్రయంబునన్ 95

అర్థాలు : తామరసాప్తుడో= సూర్యుడో, ఘనద్యుతి= గొప్పకాంతి, నిజేచ్ఛలన్= తన ఇష్టము ననుసరించి, భిక్షులలో= సన్న్యాసులలో

భావము : "ఈ నారదుడు మునులందఱకు శిరోధార్యుడు, తలమానికము. సూర్యునివలె వెలుగుచున్నాడు. వీనిని పొగడుట సాధ్యమా! తన బుద్ధి బుట్టిన చోటికి ముల్లోకములలో ఎక్కడికైనను ఎప్పుడైనను అడ్డులేక పోగలడు, రాగలడు. అట్టి సర్వసంగపరిత్యాగులైన సన్న్యాసులలో ఈతడొక్కడే నా మాయను గెల్చినవాడు."

విశేషము : కృష్ణుడు గర్వియైన నారదుని ముఖసుత్తిచే ధ్వని యుతముగ హేళన చేయుచున్నాడు.

మ॥ అనుచుం బోయెడుచో నెదుర్కొనియె పుల్లాంభోజకల్హారకాం
చనమందార కురంటజాజిముఖ పుష్పవ్రాత గంధంబులున్
ఘన కస్తూరి జవాదివాసనలు దా గైకోలుతో గొంచు వీ
కను శ్రీ కృష్ణుని భక్తి గంధవహు డుత్కంఠన్ గడుం బొంగుచున్ 96

అర్థాలు : పుల్ల+అంభోజకల్హార= వికసించిన పద్మములు, ఎఱుపు తెలుపు గలిగ సువాసనలీను కలువపూలు, పుష్పవ్రాత= పుష్పసమూహముల, కైకోలుతో= సమ్మతితో, గంధవహుడు= గాలి, వాయుదేవుడు.

భావము : అని మాటలాడుచు పోవుచుండగా వికసించిన పద్మములు కలువలు, మందారములు, జాజులు మొ॥ పూవుల వాసనలు, కస్తూరి జవాది మొ॥ సుగంధద్రవ్యముల వాసనలను మోసికొని గంధవహుడను పేరు సార్థకముగ వాయుదేవుడు కృష్ణునికి స్వాగతము ఇచ్చెను. (సువాసనలతో గాలివీచెను)

ఉ॥ అంతట బోవుచో గనియె హాటకగోపుర శృంగచుంబితా
నంతము మన్మథాప్తబలనాథ విజృంభితదివ్య దంపతీ
స్వాంతము సంతతాశ్రిత వసంతము రైవతశైలభూరుహా
క్రాంతము కేళికావన శిఖాంతము పూరిత భూనభోంతమున్ 97

అర్థాలు : హాటక= బంగారు, శృంగచుంబితానంతము= గోపురములపై భాగముచే ముద్దిడబడుచున్న (తాకబడుచున్న) ఆకాశమును, మన్మథ+అప్త= మన్మథునిచే పొందబడిన, బలనాథవిజృంభిత= సేనానులతో విజృంభించిన (దేవతాదంపతులు విహరించు), పూరితభూనభోంతముల్= నింపబడిన భూమ్యాకాశముల మధ్య ప్రదేశముగల దానిని

భావము : అట్లు పోవుచు, లెక్కలేనన్ని ఆకాశమును తాకుచున్న బంగారు వన్నెగల గోపురమును మదనుని సన్నిహితులైన సేనా నాయకుల (మలయపవనుడు, చంద్రుడు) సంరంభములచే పరవశించుచున్న హృదయములు గల దేవకాంతలను ఎల్లప్పుడు ఎడలేని స్థిరమైన వసంతము కలదైన రైవతకమనెడి పేరు గల పలు చెట్లతో నిండియున్న పర్వతమును నేలకు నింగికి నడుమనున్న క్రీడావనమును చూచెను.

ఈ పద్యములోని 'చూంబితానంతము', 'దంపతీస్వాంతము', 'భూరుహా క్రాంతము', 'శిఖాంతము', 'భూనభోంతమున్' అను పదబంధముల ప్రాభవము పోతనామాత్యుని భాగవతశైలిని తలపించుచున్నది.

క॥ కాంచి మహోన్నత మణిమయ
కాంచన గోపురము దరియగా జని మహిమో
దంచితులై రథముల్ దిగి
మించిన తమి రామమౌని మీనాక్షులతోన్ 98

అర్థాలు : దరియగా= చేరువగా

భావము : కృష్ణుడు అట్లు కేళీవనములను చూచుచు ఎత్తైన బంగారు గోపురము చెంతకు పోయి, ఉత్సాహముతో తేరుల నుండి దిగిన బలరామ నారద నారీజనముతో,

ఉ॥ ద్వారము చొచ్చి పోవునెడ ద్రాక్షలతాదృతచూతపూగమం
దారరసాలచందన వితాన వినిర్మితశీతలావనిన్

పాఱెడు పువ్వుదేనియలపాదుల గొజ్జగి నీటికాల్వల
దీరిన చంద్రకాంతముల తిన్నెల నించుక విశ్రమింపుచున్ 99

భావము : ద్వారమును ప్రవేశించి పోవుచు లక్ష తీగలచే (ఆదృత= ఆదరింపబడిన) కూడిన మావి, పొన్న, పారిజాత మద్ది, చందన వృక్షముల సమూహములు చుట్టును ఉండునట్లు నిర్మించిన చల్లని నేలయందు పాఱుచున్న పువ్వుదేనెలు, గొజ్జంగి పూలకాల్వులు కల చంద్రకాంత మణుల తిన్నెలపై విశ్రమించిరి.

సరసిజం

కీరాలాపశ్రీలలితంబై కృతక కుధరవరకిసలయతరుశృం
గారాగారానందితకేకీకలనవపిక మృదుకలితరవమునై
నీరాగారాంభోరుహ మందానిలవిలసితపరిమళమిళితమునై
తారుణ్యో ర్వీజాతలతాంతోత్కరమధుఫలరసఝురులను మెరయన్ 100

అర్థాలు : కీర+ఆలాపశ్రీలలితంబైవ చిలుకల రవముల సంపన్నతచే ఆకర్షించినదై, కృతకుధరవ క్రీడా శైలమందుగల, కిసలయతరుశృంగవ చిన్న చిగుళ్లున్న చెట్లకొనలపై, శృంగార+అగారవ అందమైన చోట్లలో, ఆనందితకేకీవ ఆహ్లాదమును పొందుచున్న నెమళ్ల యొక్కయు, కలనవవ మధురములైన, క్రొత్తవైన, పికవ కోయిల యొక్కయు, మృదుకలితరవములైవ మృదువైన స్వరమును గలదై, నీర+అగార అంభోరుహవ నీటి తుంపురులతో నిండిన చెట్లనుండి వీచు, మంద+అనిలవిలసితపరిమళవిలసితమునైవ మందమైన వాయువులతో కలసి సువాసనలు వెదజల్లుచున్న, తారుణ్యఉర్వీజాతవ ఋతుమతి యైన లేత వయసుగల చెట్లయందు, లతాంతవ పువ్వులయొక్క, ఉత్కరమధుఫలరసవ అధికములైన తేనెలు, పండ్లరసముల ఝు రులనువ= చిన్న చిన్న కాలువలను

భావము : క్రీడా శైలము చిలుకల రవములతోను చెట్లపైనుండి మెక్కు నెమళ్ల కోయిలల గుంపులతో గానములతోను నీటి తుంపురులు గల మలయ పవనముల సువాసనలతోను లేత వయసున నున్న పూవు తేనెల, ఫలరసముల సన్నవైన కాలువలు కలదైయుండెను.

విశేషము : కేకీపికములను కలిపి చెప్పుటవలన సంగీత స్వరములైన షడ్జపంచమ స్వరములను చెప్పినట్లయినది. నెమళ్ళు 'స' అని కూయగా, కోకిలలు 'ప' అని పలుకును. గాయకులు పాడుటకు ముందు 'సపస' అని శ్రుతిని ఆధార, పంచమ, తారస్థాయిలకు కంఠమును సరిజేసికొను ప్రక్రియ ఇట స్మరించదగును.

చ॥ కపురపుకుప్పలన్ బొదలు కైరవకోకనదాబ్జవాసమౌ
విపులసరస్సులన్మెలగి విశ్రుతచంద్రశిలావికీర్ణతో
యపరివిహారముల్ సలిపి యల్లన కిన్నరకన్యకాకుచా
గ్రపరివిలిప్త గంధములు గైకొని లీల మెలంగు దెమ్మెరల్ 101

అర్థాలు : కపురపు కుప్పలన్= కర్పూరపు కుప్పలలో, పొదలు= వర్ధిల్లు, కైరవ= కలువపూవులు, కోకనద అబ్జ= కలువలు తామరలు, వాసము+ ఔ= నివాసమగు, కిన్నర= కిన్నరలను పేరుగల ఒక జాతి దేవకాంతులు, పరివిలిప్త= పైన పూయబడిన, విశ్రుత= ప్రసిద్ధమైన, తెమ్మెరల్= చల్లని గాలులు

భావము : కర్పూరపు దిబ్బలలో పెరుగునట్టి తెల్ల కలువలు, కమలములు నుండు తామరలకు నెలవైన విశాలమైన సరస్సులపై ప్రసరించి, ప్రసిద్ధములైన చంద్రశిలలు బహుళముగా గల నీటిపై విహరించి, కిన్నరస్త్రీల చన్నులపై గల గంధపు పూతల సువాసనలతో చల్లనిగాలులు వీచినవి. యక్షులు, కిన్నరులు, కింపురుషులు, గంధర్వులు మొ॥ వారు దేవతలలో కొన్ని జాతులు.

క॥ ఆ వలపుల తెమ్మెరలను
భావజపరివార మృదుల భాషణలను సం

భావించుచు హరినిజ కే
లీవనవిహరణము సల్పె లీలాత్మకుడై 102

అర్థాలు : భావజపరివార=మన్మథుని కుటుంబము, సంభావించుచు= ఆనందించుచు, లీలా+ఆత్మకుడై= ఒక ఆటను ఆనందించు(నడిపించు) ఆత్మగలవాడై

భావము : ఆ సుగంధభరితమైన చల్లని గాలులను, వానిలో తేలి మదనుని బంటులైన వానినుండి వెల్వడు ఆహ్లాదకరమైన ధ్వనులను విని సంతోషించుచు, కృష్ణుడు ఆటలలో ఆనందించువాడై తన కేళీవనమున విహరించెను.

విశేషము : భావజపరివారము (మన్మథ పరివారము) అనగా రతీదేవి, వసంతుడు, వసంతకాలము, వృక్షములు, పక్షులు (చూ. పద్యం100). లీలాత్మకుడు (లీలావినోది) అని కృష్ణుని వర్ణించుటలో రాబోవు నారద గర్వభంగ కథ సూచితము. మాయా మోహమునకు తాను అతీతుడై యుండి, మాయాకేళి ప్రాణులనెట్లాడించునో చూచు సాక్షిమాత్రుడు కృష్ణపరమాత్ముడు. కనుకే కృష్ణుడు మాయి, మాయను ప్రయోగించువాడు.

ఉ॥ **అప్పుడు రుక్మిణీసతియు నంబురుహానన సత్యభామయుం**
కప్పురగంధులం గలసి క్రమపు చందనకుందబృందముల్
కప్పురపుంటనంటులను కాంచన భూజములన్ రసాలముల్
గప్పుచు నాడుచుం జెలగె గైకొనుచున్ విహరింపుచుం దమిన్ 103

అర్థాలు : అంబురుహానన= పద్మమువంటి మోములు, కప్పురగంధులన్= కర్పూరపు మేని వాసనలు గల స్త్రీలను, క్రమపు= ఇంపైన, కప్పురపుంట నంటుల= కర్పూరకదళీవృక్షములు, (కర్పూర అరటి), రసాలముల్= మామిడిచెట్లు, కప్పుచు= దాగుకొనుచు, చాటుచేసికొనుచు, తమిన్= ఆసక్తితో

భావము : అప్పుడు రుక్మిణీ సత్యభామలు, వారితో వచ్చిన మిగత స్త్రీలు కలిసి చందనవృక్షములు, మల్లెపొదలు, కర్పూరపు అరటిచెట్లు, మామిడిచెట్లు మొ॥ చెట్ల, పొదల మధ్య ఆడుచు, వాని పువ్వులను, పండ్లను తీసికొని విహరించుచు సంతసించిరి.

ఉ॥ **కొమ్మల పువ్వుదేనె జడి గొజ్జగిపూపొద మంచు సోనలున్**
కమ్మిన కీరశారికపికధ్వని కప్పల పిండు మ్రోతగా
నెమ్మిగముల్ కుజాగ్రముల నీరదపంక్తులు తద్రవంబులే
పమ్మిన గర్జలై వనము భాసిలె జూడగ వానకాలమై 104

అర్థాలు : జడి= ధార, పిండు= గుంపు, కుజ+అగ్రముల= చెట్లచిటారు కొమ్మలలో, నీరదపంక్తులు= మబ్బులగుంపులు, పమ్మిన= క్రమ్మిన, అతిశయించిన, గర్జలై= ఉఱుములై

భావము : కొమ్మలనుండి పూదేనెలు ధారలుగా వర్షింపగా మొగిలి, పూపొదలలో పుప్పొడి మంచు, పక్షుల కలకలారావములు, కప్పల బెకబెకలు, నెమళ్ళ చెట్ల చివరజేరి మబ్బుల వలెను, వాని ధ్వనులు ఉఱుములుగా తోచుచుండగా, వనము వర్షాకాలమై వెలుగులు చిమ్మెను.

వర్షర్తువులో మబ్బును చూచి మగనెమలి పురివిప్పి ఆడుచు, కూతపెట్టగా, ఆడునెమలియు కూయునని ప్రసిద్ధి.

క॥ **అయ్యారె వనేందిర మొక**
మొయ్యారము మీర తిలకముంచిన రీతిన్
యయ్యలదామరమీదను
తొయ్యలి గనుగొందు గండుతుమ్మెద మెఱసెన్ 105

అర్థాలు : అయ్యారె= ఔరా! వహా!, వన+ఇందిర= వనలక్ష్మి, మొకము= ముఖము, ఎలదామర= లేతతామరపువ్వు (అప్పుడే విచ్చిన), తొయ్యలి= ఇంతి(పత్ని)

భావము : చూపరులకు అబ్బురమగునట్లున్నది. వనలక్ష్మి వినోదము కొఱకై తన ముఖముమీద బొట్టు పెట్టుకొన్నట్లు తామరపూవు మీద తన పత్నిని వెదకుచు గండు తుమ్మెద దానిపై వాలెను. నల్లని గండు తుమ్మెద తామరపూవు మీద కూర్చుండుట వనలక్ష్మి తాను నల్లని తిలకమును ధరించినట్లు ఉత్ప్రేక్ష.

ఉ॥ మావులజొట్టు పోకనునుమ్రాకుల బ్రాకుచు వీక మూగుచున్
తేవల నూగుచున్ విరులతేనియ లానుచు పువ్వు గుత్తులున్
వావిరి గోయుచున్ శుకనినాదములున్ పికకూజితంబులున్
చేవ దలిర్ప గేరుచు వచింపుచు నాడుచు బాడుచుం దమిన్ 106

అర్థాలు : వీక= ఉత్సాహముతో, వావి= అధికముగ, కేరుచు= సంతోషముతో అఱచుచు, చేవ= ఉత్సాహము

భావము : మామిడి బోదెలను కౌగిలించుచు, పోకచెట్ల పైప్రాలుచు ఉత్సాహముతో గుమిగూడుచు, తీవల ఊయెలలూగుచు, పూదేనెల రుచుల చూచుచు, పూలగుత్తులను త్రుంచుచు, చిలుకల పలుకులను కోయిల కూతలను ప్రోత్సాహముతో నిరసించుచు అనుకరించుచు ఆడుచు ఆసక్తితో మెలగిరి.

సీ॥ మాకందముల నీడమాకందములు చూడ
మాకంద నీవెలే మాయలాడి
లేమావిచిగురాకులే మావి గైకోకులే
మావి రసమేల లేమలకును
చూతమందరమును చూతమందఱమును
చూతమవారల జూచి పల్కు
కీరసాలము చూడకీ రసాలము చూడ
కీరసాలము చూడ కీరవాణి

తే॥ అనుచు లేగుజ్జుమామిళ్ల నెరసి మొనసి
పదరి మదమున గదురు కోపముల గినిసె
మదనువిడిదల విడివడ మదగజముల
నుదుటున బొదలి రెంతయు నువిదలలరి 107

అర్థాలు : మాకందము= మామిడి, లేమ= ఆడుది, లేతది, చూతము= మామిడి, రసాలము= మామిడి, కీరవాణి= చిలుక పలుకులు గల కాంత

భావము : మామిడి చెట్ల నీడ యందు మేము వాని అందమును చూచుటకై మాకు ఓ మాయలాడీ! అవకాశము ఏల యియ్యవు? (నీవే దానిని చూచి ఆనందించవలెనా?)

లేతమామిడి చిగురాకులే, మేముకోసి కొన్నవి. అవి మావి. తీసికోవద్దు. లేతయౌవనవతులైన లేమలు, మీకు మామిడి రసము యొక్క అవసరమేమి? మామిడిచెట్ల సమూహమును (మందరము) అందఱము కలసి చూచెదముగాక! ఏమి! చూతమా! (చూచెదమా) ప్రక్కనున్నవారిని చూచి (యొకతె) పల్కెను. (కీరసాలము) చిలుకల గుంపున్న మద్దిచెట్లను చూడకు (చూడవద్దు) ఈ (రసాలమును) మామిడి చెట్టు అందమును చూచుటకై దానిని చూడకుమని హెచ్చరిక. ఈ (కీరసాలము) చిలుకలు నిండిన మామిడిచెట్టును చూడుము. చిలుకలపలుకులు కలదానా! అనుచు చెలులు లేత పొట్టిమామిడి మొక్కలను వెదకి ప్రయత్నించి, ఇష్టమువచ్చినట్లు మాట్లాడుకొనుచు యౌవనమదముచే కలుగు కినుకతో అలుగుచు మదనుని చెఱనుండి విడుదలపొందిన మదగజముల వలె విజృంభించుచు యువతులు విచ్చలవిడిగా చెలరేగిరి.

క॥ నెమ్మి తుదకొమ్మ నదిగో
నెమ్మిని వసియించినదియు నీరదవాంఛన్
నెమ్మది బెదిరించినచో
నెమ్మెయి మాయింతు మిమ్ము నిప్పుడె సుదతీ! 108

అర్థాలు : నెమ్మి= నెమలి, నీరదవాంఛన్= మేఘముపై కోరికతో, నెమ్మది= నిదానము, తొందరవద్దు, (తన మనసున అని అర్థము చెప్పి 'నీరదవాంఛన్' అనుదానితో అన్వయించవచ్చును), ఎమ్మెయి= ఏవిధముననైనను, మాయింతు= శిక్షింతును.

భావము : "చిటారుకొమ్మన అదిగో నెమలి. అది మబ్బుకోసము ఆశతో ప్రేమతో ఎదురు చూచుచున్నది." అని యొకతె యనగా, "మెల్లగా, దాన్ని బెదరగొట్టినట్లయితే, మిమ్ము శిక్షించక మానదు సుమా!" అని యొకతె హెచ్చరించినది.

సీ॥ తలిరులకై నీవు దాయకు పికవాణి
కొమ్మ మున్ రామానుకూల మాయె
ఘనకదళీతరుల్ గదియకు గజయాన
మొనసె నీ హరిమధ్య ముందుగాను
అలరు గొమ్మకు మూగవలదు బంభరవేణి
చంపకగంధియే మొదల చాచె
ఘనచందనము పెనగొనకు రోమాళి
శిఖిపించకేశ వసించె మున్నె

తే॥ భీకరా రావ మత్తేభ పింగళాక్ష
భ్రమర కాంచన ఫణికేకిబలము లరయ
కెదురు దన్నును నెఱుగక తలర వలదు
కాక మొనసిన తర్వాత గానవచ్చు 109

అర్థాలు : తలిరులకై= చిగురుటాకుల కొఱకు, దాయకు= దగ్గఱకు వెళ్ళకు, పికవాణి= కోయిల కంఠముకలదానా!, రామ+అనుకూలము+ఆయె= పడుచుకు స్వాధీనమైనది, కదియకు= చేరువకుపోకు, గజయాన= ఏనుగు వలె హుందాగా నడచుదానా (మెల్లగా నడచుదానా), హరిమధ్య= సింహపు

నడుమువలె సన్నని నడుము గలదానా!, బంభరవేణి= తుమ్మెదల వలె నల్లని జుట్టు గలదానా!, చంపకగంధి= సంపంగి వాసనవంటి మేని సువాసనగలది, రోమాళి= జడవెంట్రుకల సమూహము కలదానా!, శిఖిపించకేశ= నెమలి పింఛము వంటి ఒత్తైన జట్టు కలదానా!, భీకరారావ= గంభీరమైన భయము పుట్టించునట్లు ధ్వనిచేయు, పింగళ+అక్ష= పచ్చని కన్నులు గల కోతులు, కాంచనఫణి= బంగారు వన్నెగల పడగ గల పాము, ఎదురుదన్నును= ఎదుటివారి బలమును, తరలవలదు= పోవద్దు.

భావము : "ఓ యువతీ! చివురాకుల కొఱకు నీవటు వెళ్ళకు. ఆ చివురులున్న కొమ్మను ఈ అందగత్తె ముందే ఎంచుకున్నది. పెద్ద అరటిచెట్ల వద్దకు వెళ్ళకు. ఈ నడుము సన్నపిల్ల ముందే 'అవినావి' అంటూ వెళ్ళినది. పూల కొమ్మ కొఱకు గుంపుకూడవద్దు. ఈ సంపంగి వాసనచే ఆ పిల్ల ముందే వానికొఱకు చేతులు చాచింది. గంధపు చెట్టును కౌగిలించకుము. నెమిలిపింఛమంత జుట్టున్న ఈమె ముందే అక్కడున్నది. భయంకరముగా ఘీంకరించు మదపుటేనుగులు కోతులు, తుమ్మెదలు, నాగుపాములు, నెమళ్ళు ఈ వనములో నున్నవి. చూడక వాటి బలము తెలిసికొనక ఏ దిక్కునకు వెళ్ళవద్దు. వెలుగు వచ్చిన తర్వాత చూడవచ్చు."

వ॥ అని యొకరికొకరు సరసనల్లాపంబు లాడుచు విహరించునప్పుడు 110

భావము : ఆ విధముగా సరసముగా మాట్లాడుచు విహరించు సమయమున

ఉ॥ కెందలిరాకుజొంపమున కేకిని చూడను పొంచి పొంచి తా
కుందలతాంతగుచ్ఛమునకున్ దలయెత్తిన చెంతమావి మో
కందనరారు కీరము చొకాటపు వాతెర బింబవాంఛ డా
యం దరలాక్షి బెగ్గడిల హాయని పల్కిరి తోడి చేడియల్ 111

అర్థాలు : కెందలిరాకుజొంపమున= ఎఱ్ఱని చిగురుటాకు గుత్తులలో, కేకిని= నెమలిని (ఆడుది), కుందలతాంతగుచ్ఛమునకున్= మల్లెపూవుల గుత్తులకు,

మావిమోకన్= మామిడి మొక్కపై, తనరారు= ఉన్న, చొకాటపు= అందుబాటులోనున్న, వాతెర= పెదవిని, బింబవాంఛ= దొండపండుపై కోరికతో, డాయన్= చేరరాగా, తరలాక్షి= చలించు కన్నులు గల యువతి, బెగ్గడిల= భయపడగా, చేడియల్= యువతులు

భావము : ఎఱ్ఱని చివురు గుత్తులలో ఉన్న నెమలిని చూడగోరి దాగియుండి ఒక యువతి మల్లెపూల గుత్తి కొఱకు తలయెత్తినప్పుడు ప్రక్కనే ఉన్న మామిడి మొక్క మీద ఉన్న చిలుక ఆ యువతి ఎఱ్ఱని పెదవిని చూచి దొండపండు దొరికినదని ఆశగా ఆ పెదవినందుకొనబోగా ఆమె భయపడినది. చెలులు 'హాయ్‌హాయ్' అనుచు గేలిచేసి సరసమాడిరి.

ఉ॥ కన్నియ యోర్తు పూచి బెడగై కయివ్రాలిన గుజ్జు ప్రాయపున్
పొన్నకు కాంతలన్ మొఱగి పోయి సుమంబులు గోయ తుమ్మెదల్
చెన్నగు మోముతావి తమి జేకొన ఝుమ్మని వచ్చి మూగినన్
క్రొన్నన బోడి భీతిలుచు కొమ్మలు నవ్వగ వచ్చె నెప్పటన్ 112

అర్థాలు : ఓర్తు= ఒకతె, బెడగై= అధికముగ, కయివ్రాలిన= చేతికి అందునట్లు వంగియున్న, గుజ్జుప్రాయపున్= చిన్నవయస్సులోని, మొఱగి= కన్నుగప్పి, చెన్ను+అగు= అందమైన, క్రొన్ననబోడి= క్రొత్తమొగ్గ వలె అందమైన యువతి, కొమ్మలు= యువతులు, నెప్పు= స్థానము

భావము : ఒక యువతి మిగతావారికి తెలియక బాగుగ పూచి, చేతికి అందునట్లు వంగియున్న చిన్ని పొన్న చెట్టు దగ్గఱకు పోయి, పూవులు కోయగా తుమ్మెదలు ఝుమ్మనుచు లేచి ఆమె అందమైన పద్మము వంటి ముఖములోని తేనెను త్రాగుటకై మూగినవి. ఆమె భయపడినది. కాగా, ఆమెను చూచి మిగతావారు నవ్వగా, తనచోటికి వచ్చెను. ఆ యువతి ముఖమొక పూవువలె నున్నదనియు, తుమ్మెదలు భ్రమించినవనియు భావము.

ఉ॥ కొందఱు మందయాన లొక కోమలికిం జడ లల్లి కప్పురం
బందపు భూతి బూసి నిటలాంచిత కస్తురి కావు బొట్టు పెం
పొందగ సజ్జపుష్పరసపుం జిగి కావులు గట్టి కుంచ చే
కందువ నిచ్చి తెచ్చినను గైకొని రందరు సిద్ధురాలిగన్ 113

అర్థాలు : మందయానలు= మెల్లగ నడచు యువతలు, భూతి= విభూతి, నిటల+అంచిత= నుదుటనున్న అందమైన, కావుబొట్టు= మాంత్రికులు పెట్టుకొను నల్లని బొట్టు, సజ్జపుష్పరసపుంజిగి= సర్జమను మద్ది వృక్షపు పూల నుండి లభించు రసము యొక్క శోభ, కావులుగట్టి= వశీకరణ తిలకము వలె పెట్టి, కందువ= బిడ్డ,

భావము : కొందఱు యువతులు ఒక యువతికి జడలల్లి, కర్పూరము విభూతివలె (బూడిదవలె) ముఖమున పూసి, నుదుట మాంత్రికుల నల్లనిబొట్టు పెట్టి కుంచెను చేతికిచ్చి మిగతావారి కడకు రాగా వారు చూచి "ఓహో! ఈమె సిద్ధురాలా?! " అని నవ్విరి.

వ॥ మఱియు నొకరి కొకరు 114

భావము : మఱియును ఒకరికి మఱియొకరు

చ॥ తరుణిరొ కంటిరమ్మ పికదంపతు లొయ్యనమావికూటమం
దొరపుగ మాధవీలతల నుయ్యల లూగుచు లేజిగుళ్ల ని
ర్భరగతి ముక్కులం గమిరి పల్క రెదుర్కొని యొండొరుల్ ప్రియో
త్కరవతి నిచ్చుచున్ బలుకు గగ్గతికిన్ వగకూర్మి పెంపునన్ 115

అర్థాలు : మావికూటమందు= మామిడి గుబురులో, ఒరపుగ= రాయిడిగా, కమిరి= కఱచి, గగ్గత్తికన్= వణకుచున్న గొంతుతో

భావము : "ఓ చెలీ! చూచితివా అమ్మా ఆ కోయిల దంపతులను మావి గుబురులలో ఉత్సాహముతో మాధవీలతల ఊయెలలూగుచు, లేత

చిగురుటాకులను ముక్కులతోపట్టుకొని చాలాసార్లు కలహించి అనంతరము ప్రేమాతిశయముచే, ఆడుకోయిల వణకుచున్న గొంతుతో స్నేహమును ప్రకటించుచు కూసినది.'' ప్రణయ కలహమందు ఆడువారే ముందు కోపమును వదలిపెట్టెదరని భావము.

ఉ॥ తామరపువ్వులాన నవదంపతు లొయ్యన పువ్వుదేనె దా
రామతొపొత్తునం గుడువ నందుకు నోర్వక వచ్చి దుండగీం
డై మఱియొక్క భృంగము రయంబున నంచును ద్రొక్కి వచ్చినం
తా మధువెల్ల జిందిన మహాహవ మయ్యెను చూడు నెచ్చెలీ 116

అర్థాలు : రామతో= అందగత్తెతో, కుడువ= త్రాగగా, భంగము= తుమ్మెద, మహా+ఆహవము= పెద్ద యుద్ధము.

భావము : ''తామరపువ్వుతేనెను త్రాగుటకు వచ్చిన క్రొత్త తుమ్మెదల జంటను చూచి ఓర్వలేక వేఱొక తుమ్మెద తుంటరితనముతో వేగముగా వచ్చి ఆ పువ్వురేకల అంచును త్రొక్కగా, ఆ రెండు తుమ్మెదలకు పెద్ద యుద్ధము జరిగినది చూడవే చెలీ!'', అని యొక యువతి తన సఖితో పల్కినది.

సీ॥ క్రొమ్మావినే బట్టుకొన్నది నేరమా
కంకేళివన్నెవు కంజనేత్ర
క్రోవికౌగిటజేర్పకూడదా వోచెలి
తమి వకుళంబుపై నుమిసె దీవు
గోగు మంచిది యంచు గొనియాడ దోసమా
కాంక్షజూచెదు తిలకంబు తరుణి
అరసి ప్రేంఖణమును నానతి జేసితే
నిర్గుండిపై నూర్పు నించె దీవు

తే॥ చంపకమునకు ముఖవిలాసంబు జూప
పొన్నవవ్వేవు హాస్యంబు పోల్కి సకియ

అనుచు వనకేళి దేలుచు నబ్జముఖులు
దోహదక్రీడ నెనసిరి మోహనముగ 117

అర్థాలు : కంకేళితన్నేవు= అశోకవృక్షమును తన్నుచున్నావు, కంజనేత్ర= పద్మముల వంటి కన్నులు గలదానా!, క్రోవి= ఎఱ్ఱగోరంటను, వకుళంబుపై= పొగడ చెట్టుపై, ఉమిసెదు+ఈవు= ఉమ్మివేయుదువు నీవు, గోగు= కొండ గోంగూర, తిలకంబు= బొట్టును (నువ్వు మొక్క), ప్రేంఖణమును= ప్రియంగు వృక్షమును, నిర్గుండిపై= వావిలి చెట్టుపై, దోహదక్రీడ= చెట్లకు చేయు ఒక క్రియాకలాపము.

భావము : నేను మామిడి చెట్టును పట్టుకొనుట (స్పర్శ) దోషమా? నీవు అశోకమును తన్నలేదా? ఎఱ్ఱని గోరంటను కౌగిలించకూడదా? పొగడపై నీవు ఉమ్మివేసినావు కదా, (అది చెయ్యదగునా?) కొండగోగు మంచిది యని మెచ్చుట (సల్లాపము) తప్పా? నీవు బొట్టును తీక్ష్ణముతో కోరికతో (ప్రియుని చూచినట్లు) చూచుట లేదా? ప్రియంగువునకు(ఆనతి) మ్రొక్కెదవేల? నీవు వావిలిని తాకి నిట్టూర్చలేదా? సంపంగికి నేను ముఖసౌందర్యమును విలాసముగా చూపుచుండగా, ఇదేమియో హాస్యాస్పదమా నీవు పొన్నను చూచి నవ్వుచున్నావేమి?''- అని యిట్లు ఆ యువతులు ఒకరినొకరు పలకరించికొనుచు వనకేళిలో ఆ యా వృక్షములకు దోహదములను చేసిరి

విశేషము : పూలచెట్లు సకాలములో పూయుటకు, పండ్లచెట్లు కాయుటకు ఆయా సాముద్రిక లక్షణములు గల స్త్రీలు నిర్ణీతమైన కొన్ని దోహదక్రియలను ఆ యా వృక్షములకు చేయుదురు. ఉదాహరణకు, అశోకమును కాలితో ఒకజాతి స్త్రీ మెత్తగా తన్నిన, ఆ వృక్షము పులకించి చక్కగా పూయునని నమ్మకము, కాళిదాస మహాకవి తన ''మాళవికాగ్నిమిత్రమ్'' అను నాటకమున ఇట్టి ప్రస్తావన చేసినాడు. ఈ పద్యమున విలక్షణలైన స్త్రీలు వన విహార సమయమున వేర్వేఱు వృక్షములకు వేర్వేఱు దోహదక్రియలను చేయుట యను పూర్వాచారము వర్ణింపబడినది.

దోహదక్రియలు 1. మామిడి - స్పర్శ, 2. అశోకము - పాదతాడనము, 3. ఎఱ్ఱగోరంట - ఆలింగనము, 4. పొగడ - ఉమ్మి, 5. గోగు - సల్లాపము, 6. తిలకము - చూపు(తీక్షణము). 7. ప్రేంకణము - మ్రొక్కు(పాటు), 8 .వావిల - నిట్టూర్పు, 9. సంపంగి - ముఖరాగము, 10. పొన్న - హాసము(నవ్వు)

వ॥ ఇట్లు విహరింపుచు 118

భావము : అట్లు ఆ వనితలు విహరించుచు

ఉ॥ పయ్యెదకొంగు లొయ్య కటిభాగములం బిగ జుట్టి కొప్పులం
జయ్యన జక్కగా దుఱిమి సంగడికత్తెల నెచ్చరింపుచో
నయ్యెడ నొండొరుం గదిసి యందియ లంఘ్రుల మ్రోయ హారముల్
నెయ్యముతో గుచంబులును నృత్యము లాడగ జేరి నవ్వుచున్ 119

అర్థాలు : కటిభాగము= నడుములకు, చయ్యన= ఉత్సాహముతో, సంగడికత్తెల= స్నేహితురాండ్రను, కదిసి= తాకి, అంఘ్రుల= పాదములను, నెయ్యముతో= స్నేహముతో

భావము : పైటకొంగులు నడుములకు కట్టుకొని జుట్టును సరిజేసి కొప్పులు పెట్టుకొని స్నేహితురాండ్రను కవ్వింపుచు ఆడుచుండగా, వారి పాదములపై అందెలు కదలిమ్రోగినవి. వారి మెడలోని హారములు జతగూడి చన్నులుగూడ నాట్యము చేయగా నవ్వుచు

క॥ కమ్మని పూదేనెపాయల
గమ్మిరుగడ బారులగుచు కాంతామణులున్
జమ్మిన గ్రోవులహాళిం
జిమ్ముచును వసంతకేలి జెలగిరి వేడ్కన్ 120

అర్థాలు : ఇరుగడ= రెండువైపుల, చిమ్మనగ్రోవుల= ఒకరొకరిపై నీళ్ళు చల్లుకొనుటకు ఉపయోగించు పిచికారివంటి సాధనము, హాళిన్= పరిహాసముగా

భావము : తియ్యని పూదేనెల పిల్లకాలువులున్న చోట్లలో రెండు ప్రక్కల నుండి వరుసగా ఆ యువతులు చిమ్మన క్రోవులతో ఒకరిపై ఒకరు నీరు చిమ్ముచు వసంతక్రీడలలో మెలగిరి.

ఉ॥ తారుచు దూఱుచుం గెలన దాటుచు దూటుచు చౌకళింపుచున్
బారుచు వెంటనంటి వెనుబాయక పోవుచు కమ్మి చిమ్ముచున్
కేరుచు మించి పూబొదల క్రేవల బొంచి వసించి తమ్ము నం
దారయ చేరిరా జెలగి హాయని మోముల నిండ చేయుచున్ 121

అర్థాలు : తారుచు= తొలగుచు, దూఱుచు= తిట్టుచు, కెలన= ప్రక్కన దూటుచు= దుముకుచు, చౌకళింపుచున్= ఎగురుచు, పాఱుచు= పరుగెత్తుచు, చెలగి= రేగి

భావము : తొలగిపోవుచు, తిట్టుకొనుచు, ప్రక్కకు దాటుచు, దుముకుచు, ఎగురుచు, పరుగెత్తుచు, వెంటబడి వదలక కమ్ముకొని చిమ్మన క్రోవుల చిమ్ముచు, అఱచుచు, పూపొదలలోన దాగియుండి, తమను చూచి చేరవచ్చువారిపై చెలరేగి వారి ముఖముల నిండ చిమ్ముచు-ఇట్లాడిరి.

క॥ చెలరేగి పువ్వుబోణులు
తొలకరిమెఱుగుల విధంబు దోపం తమాలం
బుల బొంచుచు వెలువడి కడు
మెలగుచు జిమ్ముదురు మెఱయుమేనులు దోగన్ 122

అర్థాలు : పువ్వుబోణులు= పువ్వులవలె అందమైన యువతులు, మెఱుగులు= మెఱుపుల, మెఱుగు= ప్రకాశించు, తోగన్= తడిసిపోగా

భావము : పూలవంటి పడుచులు తొలకరి మెఱుపులవలె తమాలవృక్షముల మాటున దాగుకొని తటాలున కనబడుచు కాంతిమంతమైన నీటిని చిమ్మి వారిశరీరములు తడిసిపోవునట్లు చేసిరి.

ఉ॥ అప్పుడె తేనెచల్లుల నిజాంశుకకంచుకముల్ శరీరముల్
కప్పియు కప్పనట్టులను గానగనైనను సిబ్బితాస్యలై
పుప్పొడితిప్పలం గదిసి పొంగుచు సంగడి జల్లులాడుచున్
గప్పిరి చేలముల్ మిగుల గప్పుగ మేనుల కంబుజాననల్ 123

అర్థాలు : నిజ+అంశుకకంచుకములో= తన వస్త్రముల(చీరలలోని) రవికలలో, సిబ్బితాస్యలై= సిగ్గుపడిన ముఖములు గలవారై,

భావము : తేనెలు చల్లుకొని తడిసిన తమ వస్త్రముల నుండి శరీరము కన్పడి కన్పడనట్లున్నందున సిగ్గుపడుచు, పుప్పొడి కుప్పలవద్దకు పోయి ఉత్సాహముతో స్నేహముతో చల్లుకొనుచు వస్త్రములు నిండగా ఆయువతులు పుప్పొడి కప్పుకొని సంతసించిరి.

వ॥ ఇట్లు వనక్రీడావిహారంబుల నలసిన సమయంబున 124

భావము : ఈ విధముగా అందములైన ముఖాలు కల అంగనలు ఆటలాడి అలయగా

ఉ॥ శీతలవారిదోగి సరసీరుహ పుష్పమరందవాసనల్
ప్రీతివహించి తద్దరుల బిట్టుగ గమ్మిన పువ్వుదోటలన్
జాతులమల్లెలం బొదవి చక్కని మావుల విశ్రమింపుచున్
నూతనవాతపోతము లనూనగతిం జనుదెంచె నయ్యెడన్ 125

అర్థాలు : తత్+దరుల= వాని యొడ్డులను, బిట్టుగ= అధికముగా, నూతనవాతపోతము= క్రొత్తపిల్లగాలి.

భావము : చల్లని నీటిలో మునిగి, తామరపూల తేనెవాసనలు మోసికొనుచు, ఆ సరస్సుల యొడ్డున దట్టముగ నున్న పూదోటలలోని పలు జాతుల పూవుల, మల్లెలను తాకుచు, మామిడి చెట్లలో విశ్రమింపుచు నిర్మలమైన పిల్లగాలులు వీచినవి.

ఉ॥ వచ్చినవాతపోతము వారిజ పత్ర విశాలలోచనల్
మచ్చిక గారవింపుచు క్రమం బెడలింపగ పంకజాకరం
బిచ్చట నున్న పొల్పు యెఱిగింపగ నిట్లరుదెంచి చూడరే
మచ్చికతోడ నీ మలయమారుతమంచును నంబుకేళికై
చెచ్చెర చేర నేగి సరసిన్ విహరింత మటంచు బోవుచున్ 126

భావము : ఆ చల్లని గాలిని గౌరవించుచు ఆస్వాదించి “చూచితిరా, చెలులార! ఇంత చక్కని సరస్సు ఈ చేరువనే కలదని మనకు తెలియజేయుటకే ఈ గాలి వచ్చిన” దనుచు ఆ సరస్సునందు నీటిలో ఆట్లాడుదము అనుచు ఆ యువతులు చెరచెర చేరి పోవుచు

సీ॥ అందమై లసదరవిందమై చలదళి
బృందమై లోచనానంద మగుచు
సారమై మహిమాంబుపూరమై హంససం
చారమై యమిత శృంగార మగుచు
భాసమై యిందిరావాసమై సురజనో
ల్లాసమై కుసుమవిలాస మగుచు
పూతమై జలఖగవ్రాతమై త్రిభువనా
ఖ్యాతమై మదన సంకేత మగుచు

తే॥ విపులతటవరపటుతరువిసరశిఖర
కలితకలరవకలకంఠకులకలకల
నినిదసంకులభరితమై నిరుపమమున
కరము దళుకొత్తు పంకజాకరము గనిరి 127

అర్థాలు : లసదరవిందమై= ప్రకాశవంతమైన తామరలై, చలదళిబృందమై= సంచరించుచున్న తుమ్మెదల గుంపుపై, ఇందిరావాసమై= లక్ష్మీనిలయమై, భాసమై= కాంతిమంతమైన, పూతమై= పవిత్రమై, జలఖగవ్రాతమై=

నీటిపక్షుల గుంపుకలదై, విపులతట= విశాలమైన తీరములపై, కరము= మిక్కిలి, పంకజఆకరము= తామరకొలనును

భావము : అందమై పద్మములందు తిరుగుచున్న తుమ్మెదల గుంపు కన్నుల పండుగాను శుభ్రమైన నీటితో హంసల గమనములతో సుందరముగాను ప్రకాశించుచు లక్ష్మినివాసమై దేవతలకు ఉత్సాహమును కలిగించు పూల కదలికలు కలదగుచు పవిత్రమై నీటిపక్షుల గుంపులలో మూడులోకాలలో కీర్తిని పొందినదై మదనునిచే ఏర్పడిన దగుచు, విశాలమైన తీరములలో, శ్రేష్ఠములైన పెక్కు చెట్ల పైభాగములందు గల మధుర ధ్వనులు చేయుచున్న కోయిలల సందడిచే నిండి సాటిలేనిదై మిక్కిలి ఇంపైన తామరకొలనును ఆ యువతులు చూచిరి.

క॥ వనజాతలోచనలు యౌ
వనమదలాలసవిలాసవర్ధితలగుచున్
వనకేలి బడలి కెడలగ
వనకేళిని నోలలాడ వాంఛిత లగుచున్ 128

అర్థాలు : బడలిక+ఎడలగ= అలసట తీరగా, వనకేలి= వృక్షముల తోటలో కలిగిన, వనకేళిని= జలకాలాటలలో (వనమనగా పూతోట యనియు, అరణ్యమనియు, నీటికొలను అనియు అర్థములు.)

భావము : పద్మాక్షులకు ఆ సరస్సును చూడగా, పుష్పవనమున ఆటలచే పొందిన అలసట తొలగుటకై నీటిలో క్రీడింపవలెనను కోరిక కలిగినది.

క॥ మును గోపికలును బృందా
వనమున జలకేలి సిగ్గుపడ గొనియెగదా
వనజాక్షుడు చేలలతో
మనముం జలమాడుటకును మర్యాదనుచున్ 129

అర్థాలు : వనజాక్షుడు= కృష్ణుడు, చేలలు= వస్త్రములు

భావము : పూర్వము గోపికలును బృందావనిలో (వివస్త్రలుగా)జలకేళిలో నుండగా కృష్ణుడు వారు సిగ్గు చెందునట్లు వారి వస్త్రములను దొంగిలించెను కదా, కనుక మనము జలక్రీడకు దిగునప్పుడు చీరలు ధరించుట మర్యాదని తలచుచు

ఉ॥ గట్టున నిల్చి పయ్యెదలు గట్టిగ జేర్చి చెరంగులం బిగం
గట్టిగ జుట్టి ఒందొరులు కైకయి గొట్టుచు పందెమాడుచున్
గట్టున నేనెనేనె దుముకంగలదానను దూర మంచు లో
దొట్టిన వేడ్కలన్ బెనగ ద్రొక్కుచు బల్విడి యొక్క బల్వడిన్ 130

అర్థాలు : కైకయి= చేయిచేయి, బల్విడిన్= ప్రయత్నముతో, పల్వడిన్= మిక్కిలి వేగముతో,

భావము : కొలనిగట్టుపై నిలిచి పైటకొంగుల గట్టిగా కట్టుకొని ఒకరి చేతిని మఱొకరు పట్టుకొని, పందెము వేసి నేనంటే నేను దూరము దూకగలనని పెనగులాడుచు అందఱు ప్రయత్నముతో ఒడలు మఱచి మిక్కిలి వేగముతో నీటిలోనికి దుమికిరి.

చ॥ గుభులున నందఱుం దుముక గుప్పున నీరము మింటి దాయగన్
రభసమునం గలంగి తరురాజి ఖగంబులు విభ్రమంబునన్
నభమున బర్వు లెత్త హరిణంబులు నీరము గ్రోలగాన కా
త్మభయమునం గనుంగొనగ తమ్ముల తుమ్మెదలుం భ్రమింపగన్ 131

అర్థాలు : నభమున= ఆకాశమున, హరిణంబులు= జింకలు, తమ్ముల= పద్మముల

భావము : గుభిల్లున అందఱును ఒక్కసారిగా దూకినప్పుడు, ఆ కొలని నీరు మింటినంటినది. ఆ హఠాత్పరిణామమునకు భయపడి చెట్లలోని పక్షులు దిక్కుతోచక అఱచుచు ఆకాశమున నాల్గుదిక్కులకు ఎగుర జొచ్చినవి. నీరు

త్రాగుటకు వచ్చిన జింకలు బెదరిపోయి ఏమైనదాయని దిక్కులు చూచినవి. కొలని పద్మములపై వ్రాలియున్న తుమ్మెదలు తటాలున లేచి అటునిటు తిరుగజొచ్చినవి.

ఆ॥ లేచి మొగము లెత్తి లేమలు ముంగురుల్
కడకు నొత్తినపుడు గాననయ్యె
ముఖము లంబుదములు మొగి గమ్మి విచ్చిన
పూర్ణచంద్రబింబములును బోలి 132

అర్థాలు : లేమలు= యువతులు, ముంగురుల్= ముందుండు వెంట్రుకలు, కడకు= ప్రక్కకు, నొత్తినపుడు= నెట్టినపుడు, అంబుదములు= మబ్బులు

భావము : అట్లు దుమికిన యువతులు నీట మునిగి లేచి, చెదరిన ముఖములను కప్పిన వెంట్రుకలను ప్రక్కకు నెట్టునప్పుడు మబ్బుల వీడిన చంద్రబింబముల వలె వారి ముఖములు కన్పడినవి.

ఉ॥ ఆననపద్మపద్మచయ మంబుజపల్లవజాలమధ్యలన్
గానగ నైన భృంగములు గమ్మిరు వాగులయందు వ్రాలినన్
మానిను లబ్జముల్ బెరికి మాటికి వేటుల బాయ వీచుచున్
మానసముల్ చెలంగ దమి మక్కువ లెక్కువ లెక్కువై తగన్ 133

అర్థాలు : భృంగములు= తుమ్మెదలు, కమ్మి+ఇరువాగులయందు= మూగి రెండుప్రక్కలను

భావము : అట్లు ఆ యువతులు తామర కొలనలో దుమికి ఆడునప్పుడు అటనున్న తామరతంపర సందులలో వారి ముఖములు పద్మములవలె గన్పడగా తుమ్మెదలు పద్మములపైనను వారి ముఖములపైనను వ్రాలబోవ, తామర తూండ్లను పెఱికి వానితో తుమ్మెదలను తోలుకొనుచు జలక్రీడ సల్పిరి.

సీ. కైరవం బిది మున్నె కైకొంటి నీవందు
కై రవళింపకే కలువకంఠి!
కోకంబునే బొంచి గైకొందు నీవురా
కో కంబుకంధరి కేకలిడుచు
తామరలవి నావి తలగు మన్నను వని
తా మరలుము నీకు తగవు గాదె
కలువలు నిను సరిగావు దవ్వులనుండు
కలువలు వలదమ్మ కమలనయన!

తే॥ నాచులో నాతి కెందమ్మినాచుకోక
కోకనద మేల నీవు కైకోక మరలు
మరలు రాయంచ చిక్కదు మరు లదేల
యేల లటు బాడ కీచలమేల బాల! 134

అర్థాలు : కైరవము= తెల్లకలువ, కోకంబు= జక్కవ పిట్ట, కంబుకంధరి= శంఖము వంటి మెడ కలదానా!, తలగుము= తప్పుకొనుము, తగవుగాదు= తగదు, మర్యాదకాదు, దవ్వుల= దూరమున, నాచు= నీటిలోనుండు తృణవిశేషము, కెందమ్మిని+ఆచుకోకు= ఎఱ్ఱతామరను దొంగిలించకు, కోకదనము= ఎఱ్ఱకలువ, చలము= పట్టుదల, మరులు= మోహము

భావము : "కలువ కంఠీ! ఈ తెల్ల కల్లువను ముందు తీసికొన్నాను. దానికై చేయాడింపకుమా!

కంబు కంధరీ! నేను జక్కవపిట్టను. పొంచియుండి పట్టుకొందును. దానికై కేకలు పెట్టుకొనుచు రావద్దు.

ఓ వనితా! ఆ తేమపూలు నావి. తొలగిపొమ్ము. దానికై ప్రయత్నించుట పద్ధతికాదు. మరలిపొమ్ము.

ఓ కమలనయనా! నీకు సమానమైనవి కావు. వానికి దూరముగా ఉండుమా. అవి నీకు వద్దు.

ఓ నాతి! నాచులో ఎఱ్ఱని తామరను తీసుకొనక, ఎఱ్ఱకలువను ఏల ఆశించెదవు?మరలిపొమ్ము. అవి నీకు వద్దు.

రాజహంస నీకు చిక్కదు. మరలిపొమ్ము. దానిమీద మోహమేల నీకు? ఏలలు పాడక ఇట్లు దానికై పట్టుదల ఏల?

విశేషము : ఏలపాట లనునవి జానపదులు పాడుకొను పాటలు. అందు యాల, ఏల అను మాటలు ఊతపదములుగ వచ్చుచుండును. ఈ పద్యరచనలో శబ్దాలంకారములు విరివిగా, అనుప్రాస, ముక్తప్రదగ్రస్తము, శ్లేషవాడబడినవి.

సీ॥ వాలవాలం బొక్కనీలాహి వేణిక
కడు వెంట బడె బర్హి కచ యొకర్తు
కరికుంభకుచయొర్తు మఱి వెన్కకీడ్వంగ
హరి మధ్య యొర్తు పై కురికి ముంచె
పద్మ హస్తయొకర్తు పై నీళ్ళు జల్లిన
భద్రేభయాన కేల్ బట్టి ద్రిప్పె
యలివేణి యొర్తు కో యనుచును రవళింప
కణగి త్రెళ్ళగవైచె కనకనాస

తే॥ ఒక్కబింబోష్ఠి చిగురుల యొదిగి దాగ
కీర సల్లాప మొక్కతె చేరి పట్టె
మొనసి యొక సైకతనితంబి కినిసియెత్త
సరసి సుమనాభ యొక్కతె సరసి ముంచె 135

అర్థాలు : వాల= వాలమృగము, అడవిపంది, వాలంబు= తోక, నీల+అహివేణిక= నల్లత్రాచువంటి కేశసంపద గల యువతి, బర్హికచ=

నెమలిపింఛము వంటి జుట్టుకలది, కురికుంభకుచ= ఏనుగుతలవంటి పాలిండ్లు గల యువతి, హరిమధ్య= సింహము వంటి సన్నని నడుముగలది, భద్ర+ఇభయాన= ఏనుగు నడక గల యువతి, కణగి= పూని, త్రెళ్ళగవైచె= పడవేసె, బింబ+ఓష్ఠి= దొండపండు వంటి పెదవిగలది, సైకతనితంబి= ఇసుక తిన్నెవంటి పిఱుదు కలది,

భావము : అడవిపంది తోక వలె నిడుపైన, నల్లత్రాచు వంటి నల్లనైన జడగల యొక యువతి మఱొక నెమలి ఈకల వర్ణము గల యువతి వెంటబడెను. ఏనుగుల తలలవలె పాలిండ్లు ఉన్న యువతి ఈడ్వగా మఱొకతె సింహము వంటి నడుము కలది, పైకి దుమికిన నీటిలో ఆమెను ముంచెను.

పద్మము వంటి చేతులు గల యువతి పైన నీళ్లు చల్లగా ఆ యువతి చేతులను పట్టుకొని ఏనుగువంటి గమనము గల దాని చేతులను త్రిప్పినది.

తుమ్మెదల వంటి వెంట్రుకలు గల యువతి 'కో' అనుచు అఱవగా, బంగారం వంటి ముక్కు గల యువతి పడతిని పడునట్లు తోసివేసినది. ఒక దొండపండు వంటి పెదవులు గల యువతి చిగుళ్లలో దాగుకొనగా మఱొకతె చిలుకల పలుకులను అనుకరింపగా కోపముతో ఇసుకతిన్నె వంటి పిఱుదులు కల చెలికత్తె ఎత్తగా పద్మముల వంటి కాంతి గల యువతి నీటిలో ముంచెను.

విశేషము : యువతులకు విడివడిగా సమానార్థకముల ప్రయోగము సరసముగా ఉన్నది.

తే॥ కరయుగము మోడ్చి యొక మెత్తి కమలనయన
యొకతె నిలనంత పదముల నొయ్యె నిడగ
పూర్ణచంద్రోదయంబున పుండరీక
మపుడు ముకుళీకృతంబైన యంద మొందె 136

అర్థాలు : కరయుగము= రెండు చేతులు, మోడ్చి= చేర్చి, నిల= నిల్వగా, పుండరీకము= తెల్లతామర, ముకుళీకృతంబైన= ముడుచుకొనగా

భావము : ఒక యువతి ముఖము పైకెత్తుకొని నిలిచి యుండి కరములు చేర్చిన భంగిమ చంద్రుడు ఉదయించగా ముడుచుకొన్న తెల్లతామరను తలపించినది.

క॥ **నిడుదజడ మడమ నంటగ**
పడతుక మొగ మెత్తి కళలు భాసిల్లంగా
వడినీడ్చి నపుడు రాహువు
యుడురాజు బట్ట దపమునోజ దలిర్చెన్ **137**

భావము : మడమలను తాకి జడను, మొగము పైకెత్తగా అది కాంతులను వెదజల్లుచున్నట్లు వేగముతో ఈడ్చు, ఈ దృశ్యము చంద్రుని పట్టుకొనున్నటకై రాహువు తపము చేయుచున్నట్లు కన్పట్టెను.

మ॥ **తరుణీరత్న మొకర్తు ముందరికి నీడ్వం జక్కగా నీటిపై**
పిఱుదున్ మించిన వేణి దండముగ సంపెంగల్ తదూర్ధ్వంబునన్
వరుస న్నిల్పిన మెట్లుగా నిశిత సౌవర్ణాభమై మూర్ధమున్
పిఱుదున్ కాయలు గాగ వీణె పగిదిం బెంపొందె నప్పద్మకున్ **138**

అర్థాలు : వేణి= తలకట్టు, దండముగ= వీణె దండెగా, నిశితసౌవర్ణాభమైవ మెఱుగుపెట్టబడిన బంగారముతో సమానమై, మూర్ధము= తల, పిఱుదున్= మొల(పిఱ్ఱ), కాయలు= వీణకు రెండు చివరల నుండు కాయలు (బుఱ్ఱలు)

భావము : నీటిలో ఈదుచున్న ఒకయువతి జడ, తల, పిఱుదులు నీటిపై తేలుచు కనబడుచున్నవి. జడపై సంపంగి పూలు తుఱుముబడి యున్నవి. చూచుటకు, ఆజడ వీణ దండెవలెను, అందలి పూలు వీణదండెపైనుండు మెట్ల వలెను, ఆమె తల, పిఱుదులు వీణకొసల నుండు రెండు కాయల వలెనుండి అది యొక వీణ నీట తేలుచున్నట్లుగా ఆ యువతి గోచరించెను.

వ॥ **మఱియు బహువిధజలవిహరణవిహితవిలాసంబుల నంబు సంచరణంబు సేయుచుండి రటమున్న** **139**

భావము : పెక్కు రీతులుగా ఆ యువతులు విహరించు విలాసములతో నీటిలో మెలగగా ముందే

ఉ॥ **రాముడు సాత్యకిన్ నృపులు రాజితరత్నవిలాస కేళికా**
ధామములన్ విశాలహిమధామశిలాతల వేదికాంతరో
ద్దామహిమాంబుపూరితనదంబులరైవతశైలకందర
స్థేమరసాల వాటికల దిన్నని పొన్నల విశ్రమింపుచున్ **140**

అర్థాలు : కందర= గుహలంలో, స్థేమ= బలమైన

భావము : అప్పుడు బలరాముడు సాత్యకి, రాజులు, ప్రకాశించు రత్నాలున్న క్రీడా విలాస స్థానములందు విశాలములైన చల్లనైన రాళ్ల తిన్నెల మధ్య భాగములలో మంచు తుంపరలు వెల్లువలున్న రైవతము అనెడి కొండ గుహలందు బలమైన మామిడి చెట్ల పొన్న చెట్ల పొదలలో విశ్రమింపుచు

చ॥ **మఱిమఱి పూబొదల్ కలయ మక్కువ జూచుచు మాధవీలతా**
పరివృతచంపకాగ్రమతరుపంక్తులు జుట్టిన ద్రాక్షపందిరుల్
తరు చగు పోకబోదియల దార్కొని కమ్మిన జాజిపూబొదల్
కరమరుదార నవ్వనము గన్గొనుచుండగ నంత నక్కడన్ **141**

అర్థాలు : తఱుచు+అగు= దట్టమైన, తార్కొని= పట్టుకొని, కమ్మిన= పెనవేసుకొనిన, కరము+అరుదు+ఆర= మిక్కిలి అరుదైన

భావము : మరల ఇంకను పూల పొదలను అంతటను చూడ తలంచిన వారై గురివెంద పువ్వుల తీగెల చుట్టుకొన్న సంపంగి చెట్ల వరుసలు ఎక్కువైన ద్రాక్ష, తీగలు నిండిన పోకచెట్లను, వ్యాపించి సాగుచున్న జాజిపూల పొదలను మిక్కిలి అరుదగు ఆ వనసంపదను చూడగా అంతటను

ఉ॥ వారిజలోచనుండు మునివల్లభుడున్ వట పారిజాత ఖ
ర్జూరతమాలసాల నవచూతకురంటకమాతులుంగ మం
దార శిరీష పాటలవితానములం గర మొప్పుచున్న శృం
గారవనానుకూల్యమగు కాననలో దమి సంచరింపుచున్ 142

అర్థాలు : వట= మఱ్ఱిచెట్టు, సాల= మద్దిచెట్టు

భావము : కృష్ణుడు, మునివరుడు నారదుడు, మఱ్ఱి పారిజాత, ఖర్జూర, చీకటి మాకులు, మద్ది క్రొత్తదైన మామిడి, పచ్చగోరంట, మాదీఫల, బాడిద, దిరిసెన, కలిగొట్లు చెట్ల మొత్తముతో మిక్కిలి సౌందర్యముతో వెలుగుచున్న కానలో అనుకూలమైన ప్రదేశములలో విహరింపుచు

చ॥ మఱి మఱి కుంజపుంజగృహమంజులరంజితమల్లికాదులన్
పరిమళకుందపుష్పయుతబంధుర బంభరగీతనాద సం
భరిత శుకపికార్భటుల భాసిలు కోకలు చూచుచున్ మదో
త్కరవరకేకికేంకృతులు గల్గి చెలంగు వనాంతరంబులన్ 143

అర్థాలు : కుంజపుంజ= పొదరిండ్ల సమూహము, బంభరగీతనాద= తుమ్మెదల ఝుంకారము, కొనలు= ప్రదేశములు, కేంకృతులు= నెమిలి అఱపులు

భావము : మఱియు ఎన్నో పొదరిండ్లలో మనోహరముగా పెరుగుచున్న మల్లెలు మొదలైన వానిని సువాసలను చల్లు మొల్లలందు దట్టములైన తుమ్మెదల పాటల ధ్వనులతో నిండిన చిలుకలు కోయిలల గొప్ప కూతలు కలవియునైన కొండకోనలు చూచుచు మదించిన నెమిళ్ల క్రీంకారములు కలవైన వనముల లోపల భాగములందును మెలగుచు,

ఉ॥ క్రుమ్మరుచున్ బటీరముల క్రేవల గేవలమైన తావులన్
గమ్మిన కేతకీ వకుళకాంచన దివ్యలతాంతవాసనల్
ఘుమ్మన నాసికేంద్రియ సుఖంబు నయమ్ముగ జిత్తగింపుచున్
యమ్ముని చంద్రు డిట్లనె మురాంతకుతో గడు చోద్య మందుచున్ 144

అర్థాలు : క్రుమ్మరుచున్= తిరుగుచు,పటీరముల, క్రేవల= చందనవృక్షముల చేరువన, లతాంత= పూవుల, ముర+అంతకుతో= మురయను రాక్షసిన చంపిన కృష్ణుడు

భావము : తిరుగుచు, చందనపుచెట్ల ప్రక్కలలో ప్రత్యేకమగు సందులలో మొలిచిన మొగిలి, పొగడ, నాగకేసర మొదలైన శ్రేష్ఠములైన పూల వాసనలు, ఘుమ్మని ముక్కులందు ప్రసరించుటచే వానిని మృదువుగా పీల్చుచు ఆముని వరుడు, ఆ వనసౌభాగ్యమునకు ఆశ్యర్యపడి శ్రీకృష్ణునితో ఇట్లనెను.

చ॥ త్రిభువనచారినై యెపుడు ద్రిమ్మరుచుం గనుగొందు దేవతా
ప్రభువరకాండవంబు నట రంజిలునే మధుమాసమై బటుల్
శుభకరమై ప్రవాళబహుసూనమరందశలాటు పక్వసౌ
రభఫలపూర్ణమై యిటుల రాజిలునే యట పద్మలోచనా! 145

అర్థాలు : దేవతాప్రభువర= ఇంద్రుని, ఖాండవంబు= ఖాండవమను పేరు గల వనము, మరంద= పూవుతేనె, శలాటు= కాయలు, పక్వ= పండిన

భావము : "ఎప్పుడును మూడులోకాలందు తిరుగుచు, కనుగొంటిని ఇంద్రుని ఖాండవనము. ఆ వనమందు ఇచ్చట నున్న వసంతకాల శోభ శుభకరమై, చిగుళ్లతోను పెక్కు పూవుల తేనెలతోను కాయలు, పక్వములైన సువాసనలు గల పండ్లు మెండై కన్పట్టునా? ఓ కమలనయనా?" (దీని కంటే తక్కువ శోభ కలదని భావము)

మ॥ అన మోదంబు ఘటిల్లెనే యిటుల లోకాధీశ్వరోద్యానముల్
ఘనకైలాస హిమాద్రి మేరువుల దిక్పాలాంచితోద్యానముల్
గనుగొంటిన్ ఫణిరాజలోకమును వీకన్ గంటి కేలీవనుల్
గనలే దిట్టి విచిత్ర వైఖరుల శృంగారంబు లుద్యానముల్ 146

భావము : "ఒక్క ఇంద్రుని ఖాండవమునే కాదు, ఆయాలోకాధిపతుల ఉద్యానవనాలను కూడ చూచినాను కైలాసము, హిమాలయము,

మేరుపర్వతములందలి వనములను, అష్టదిక్పాలకులు విహరించే వనములను చూచినాను. నాగలోకమును సైతము చూచినాను. కాని ఇట్టి కేళీవనమును మున్నెక్కడను చూడలేదు."

చ॥ వలపులరాజు నీ కొడుకు వాని బలంబులు చైత్రచంద్రమా
కలరవకీరశారికపికవ్రజ శీతలవాతపోతముల్
నెలకొనియుండు టేమరుదు నీదగు మాయ వచింప శక్యమే
తెలియనివాడనే మఱియు దేవరవింతలు నేడు కొత్తలే! 147

అర్థాలు : వలపులరాజు= మన్మథుడు, ఏమి+అరుదు= ఏమి వింత?

భావము : "మన్మథుని తండ్రివి కదా నీవు. అతని బలగము వసంతుడు చంద్రుడు, చిలుకలు, గోరువంకలు, కోయిలలు, చల్లనిగాలులు, కనుక ఇవన్ని ఇక్కడ ఉండుట వింతకాదు, విశేషము కాదు. నీ మాయనే నెఱుగనా? క్రొత్తయేమున్నది? ఎంతని చెప్పగలను?" (మీ వింతలలో నీ వన మొక విశేషము అని ధ్వని)

విశేషము : నారదుడు విష్ణుమాయను "తెలియనివాడనా" అని గర్వముతో పల్కినాడు అది కృష్ణునకు నచ్చలేదు.

ఆ॥ అనిన నల్ల నవ్వి ఔనయ్య నీ మహా
మహిమ దెలియ చంద్రమౌళి కైన
జలజభవున కైన శక్యంబె దేవతా
మునివరేణ్య! సాధుజన శరణ్య! 148

అర్థాలు : చంద్రమౌళి= చంద్రుని తలపై దాల్చిన శివుడు, జలజభవుడు= పద్మమందు పుట్టినవాడు బ్రహ్మ.

భావము : అని నారదుడనగా, కృష్ణుడు "ఔనౌను. నీ వెఱుగనిదేమున్నది దేవమునీ! నీ మహిమను ఆ శివుడైనను బ్రహ్మయును పొగడగలరా!

సాధువులకు ఆశ్రయమైన వాడా! అని స్తుతి. ఇందులో హేళన ధ్వనించుచున్నది.

క॥ అని యిష్టాలాపంబుల
మన మలరింపుచును శౌరి మౌనివరేణ్యున్
తన మాయగమ్మి తోడ్కొని
చనియె మహారణ్యమునకు క్షణమాత్రమునన్ 149

భావము : అని ఇట్లు ప్రియ వచనములతో మనస్సును సంతోషపెట్టుచు, కృష్ణుడు నారదుని తన మాయచే కప్పి వశపఱచుకొని, ఒక్క నిమిషములో ఒక మహారణ్యమునకు తీసికొనిపోయెను.

వ॥ ఇట్లు చని చని ముందర 150

భావము : ఇట్లు పోవుచు తమ ఎదుట

సీ॥ తమ్మిలేదూళ్ల మత్తాగొన్న రాయంచ
గములు తరంగ సంగతుల నూగు
వడికంకణంబులు వడిన తమ్మి చిగుళ్ల
కని యుర్కు దంటచక్రంబు లునికి
రెపరెపరేచిన విపరీతరవమున
బెదరి క్రౌంచము లభ్రవీధి బఱచి
కేంక్రృతు లిడి నీరు కెలన గ్రోలుచునున్న
లేటి మొత్తంబు లాలించి చెవులు

తే॥ రిక్కరించుకొ భీతిని ఱెప్ప లిడక
చూచు నద్భుతమును గాంచి చొరక వెనక
నిలుచు మృగముల దవ్వుల తెలియ గనుచు
నరిగి కాంచిరి యొక కమలాకరంబు 151

అర్థాలు : తమ్మిలేదూళ్ళ= లేత తామర తూండ్ల వలన, మత్తాగొన్న= మత్తెక్కిన, కంకణంబులు= నీటిబొట్లు, దంటచక్రంబులు= చక్రవాకముల జంట, అభ్రవీధి= ఆకాశమున, కెలన= దాపున, లేటి= లేడి, చొరక= ప్రవేశింపక

భావము : తామర లేత కాడలను ఆకలిచే తిని మత్తెక్కిన హంసల గుంపులు చక్కని కదలికలతో ఊగుచున్న వేగముతో నీటి బిందువులు పడిన తామరచిగుళ్లను చూచి, చక్రవాకముల జంటలు తామున్న చోట్ల నుండి పరుగెత్తుచున్నవి. రెపరెపమని రెక్కలు ఆడించుచు అవి లేచిన ఎక్కువైన శబ్దాలచే క్రౌంచ పక్షులు బెదరిపోయి క్రీంకారమలు చేయగా, చెంత పక్షులలో నీరు త్రాగుచున్న జింకల సమూహములు ఆ ధ్వనులకు బెదరిపోయి కనురెప్పలు మూయక చూచునట్టి అద్భుతమును చూచి, ముందుకు పోవుటకు సంకోచించిన వాని వెనుక నిలుచున్న కొన్ని జింకలు దూరముగా నుండుట గుర్తించి పోవుచు ఒక పద్మములు గల సరస్సును చేరిరి.

ఆ॥ కనిన నారదునకు కాంక్ష జనింపగ
నమృతరసముబోలె నంబువులను
తానమాడుటకును దగ ననుష్ఠానంబు
దీర్ప దాహమార్ప దివురు మదిని **152**

అర్థాలు : అంబువులను= నీటిలో, తివురు= కోరుచున్న,

భావము : ఆ సరస్సును చూచి నారదులకు అందు దిగి స్నానమాడి అనుష్ఠానము చేసికొనవలెనని దాహమున కా నీరు త్రాగవలెనని కోరిక మదిలో మెదలినది.

వ॥ ఉత్సుకుడై హరికిట్లనియె **153**

భావము : ఉత్సాహముతో నారదుడు కృష్ణునితో ఇట్లు వచించెను.

సీ॥ తెందేపలై వచ్చు ఇందిందిరమ్ముల
దియ్యగ పెల్లుబ్బి తియ్యనైన

తేనియసోన లెంతేని యెల్లప్పుడు
కమలంబులను జారి కమల ముచ్చి
ఏఱులై నలుగడల పాఱుకాల్వలనంటి
తరుచైన పుష్పిత తరుచయములు
మలయమారుతములు మలయ క్రిందటి చంద్ర
కాంతులు పర్వదిశాంతరముల

తే॥ విరివి చిత్రవర్ణంబుల విరిచయంబు
రంగవల్లుల విధమమరంగ రాలి
సంతతానందమైన వసంతకలిత
వనము గమ్మిన కొలను గన్గొనుము కృష్ణ! **154**

అర్థాలు : తెందేపలై= సమృద్ధిగా, ఇందిందిరమ్ములన్= తుమ్మెదలను, పెల్లుచ్చి= అతిశయించి, తరుచైన= దట్టమైన, విరివి= మిక్కిలి, కమలము+ ఉచ్చి= కమలము నుండి వెడలి, మలయ= వీచగా, రంగవల్లులవిధము+ అమరంగ= ముగ్గులు పెట్టినట్లు

భావము : తెఱపి లేక వచ్చు తుమ్మెదల వలన వెల్లువైన తేనెలు కమలముల నుండి స్రవించి ఏఱులై కాలువల చెంతనే దట్టముగ పెరిగిన పూసిన చెట్ల గుంపులు, మలయ మారుతములచే చంద్రకాంతులు, కల రంగు రంగుల పూవులు ముగ్గులు బెట్టినట్లు అన్ని వైపుల రాలినవి. ఇట్లు అవి ఎల్లవేళలను ఆనందము నిచ్చు వసంతమైన కొలనును చూడుము.

క॥ మధ్యాహ్నసమయమాయెను
మాధ్యాహ్నిక మాచరింప మరి వేళయ్యెన్
బుధ్యానతిమ్ము జగదా
రాధ్యా! శుభగుణవిశాల! రాధాలోలా! **155**

అర్థాలు : మాధ్యాహ్నికము= మధ్యాహ్నమున విధిగా చేయు సంధ్యావందన కార్యక్రమము, బుద్ధ్వా+అవతి+ఇమ్ము= సంతోషముతో నాకు ఆజ్ఞనిమ్ము.

భావము : "కృష్ణా! మధ్యాహ్నమైనది. ఇక ఇప్పటి విధులను ఆచరింపవలెను కదా! సంతోషముతో అందులకై నాకు ఆజ్ఞనిమ్ము లోకములందు పూజింపబడువాడా! శుభగుణములచే ప్రకాశించువాడా! రాధతో క్రీడించువాడా!"

చ॥ అని ముని విన్నవింప హరి యల్లన నవ్వుచును నానతిచ్చె నో
మునివర! యీ మహామహిమముం దెలియంగను యిప్పుడేమి యీ
ఘనతరవారి దోగినను గాంచెదు చిత్రవిచిత్రమార్గముల్
తనువు విలాసముల్ చెలువు నజ్ఞతయున్ సుమహత్ప్రభావమున్ 156

అర్థాలు : దోగినను= స్నానమాడినను, మునిగినను, అజ్ఞత= తెలివిలేమి

భావము : "అనిన నారదుని మాటలు విని, శ్రీకృష్ణుడు మెల్లగా నవ్వి, "నారదా! ఈ సరోవర మహిమ ఇప్పుడే యేమి తెలియును? ఈ నీట మునిగిన నీవు చిత్ర విచిత్రానుభవమును పొందుదువు. శరీర విలాసములు అందమును తెలివిలేమి, ప్రభావములు చూడగలవు."

క॥ ఇది సిద్ధరసము దీనిన్
విదితంబుగ దెలియలేరు విధిరుద్రాదుల్
సదమలహృదయుడ వగుటను
ముదమలరగ నీకు గల్గె మునికులవర్యా! 157

భావము : "ఈ కొలను నీరు సామాన్యమైనది కాదు. ఇది సిద్ధులను ప్రసాదించగల శక్తిమంతమైన దివ్యరసము. దీని శక్తి ఇంతయని బ్రహ్మకు రుద్రునకు గూడ తెలియదు. నీవు మలినములేని మనస్సు కలవాడవు కనుక దీని మహత్తు ఎఱుగగలవు."

ఆ॥ వేగతానమాడి వెడలి రమ్మన్న యా
మౌనివరుడు చే కమండలంబు
పుండరీకచర్మమును దండెతాళంబు
తీరమున నటుంచి వారి జొచ్చి 158

అర్థాలు : పుండరీకచర్మమును= పులితోలును దండె= వీణ, తాళము= కంచు చిఱుతలు, (పాడునపుడు ఉపయోగించునవి)

భావము : వెంటనే స్నానము చేసి రమ్మని కృష్ణుడనగా, నారదుడు తన చేతిలోని కమండలమును, చంకలోని పులిచర్మమును వీణను, చిఱుకంచు తాళములను ఒడ్డున బెట్టి, నీటిలో దిగెను.

క॥ మునిగి ముని లేచినంతను
మనసిజజనకుండు దరిని మాయాంగన నొ
య్యన పరికరముల నుంచియు తా
గను మొరగిన నతడు లేచె గాంతామణియై 159

అర్థాలు : మనసిజ జనకుండు= మన్మథుని తండ్రియగు కృష్ణుడు, దరిని= ఒడ్డున, కనుమొఱగిన= కంటబడక తప్పుకొనగా

భావము : నారదుడట్లు సరస్సులో దిగి మునిగి లేచునంతలో కృష్ణుడు కొలని యొడ్డున మాయాంగనను ఆ వస్తువులను ఉంచి, తాను కంటబడక తప్పుకొనెను. నీట మునిగి పైకి లేచిన నారదుడు స్త్రీ రూపమును పొందెను.

క॥ నునుగురులు నగుమొగంబును
చనుగవగమకంబు కౌనుసన్నదనంబున్
ఘనజఘన మొరయదొడలును
తనుమెఱుపును మృదుపదములు దగి జిగి మెరయన్ 160

అర్థాలు : నునుకురులు= మెత్తని వెంట్రుకలు, గమకంబు= పెద్దవైన, కౌను= నడుము, ఒరయు= తాకు (రాయిడి గల) రాయిడి, (ఒకదానినొకటి తాకునట్లుండుట)

భావము : మెత్తని వెంట్రుకలు గల జడ నవ్వు ముఖము, చన్నుల జంటల ఉబ్బు, నడుము సన్నదనము, పెద్ద పిఱుదులు, రాసుకొనుచున్న తొడలు, మేని తళతళ, కోమలములైన కాళ్లు అమరిన లావణ్యము అతిశయించిన రూపముతో మెఱసెను.

క॥ తలయెత్తి నాల్గుదిక్కులు
కలయం గనుగొనుచు దరిని గాంచెను మాయా
జలజాక్షి నదియు నిట్లని
పలికెన్ మునికన్యజూచి బాళి దలిర్పన్ 161

భావము : ఆ అంగన సరసున నీటిలో నిల్చి తలయెత్తి నాలుగు దిక్కులను పరికించి చూచెను. ఆమెకు ఆ సరస్సు ఒడ్డున నున్న మాయా వనిత కనబడినది. ఆమె ఈ విధముగ ఆ మునికన్యను చూచి ఆమె యెడ కాంక్ష కలదై యిట్లనెను.

క॥ వలిగొంటి నీటిలోపల
చిలుకలకొలి కిట్టు లాలసింపగ దగునే
చల మేల చేతు వీవో
కలకంఠీ! తడవు విడిచి కట్టుమఱుంగున్ 162

అర్థాలు : వలిగొంటి= చలికి వణకుచున్నావు, చలము= ఆలస్యము, కట్టు= కట్టుకొనుము, మఱుంగన్= ఉతికి ఆరవేసిన పొడిచీరను,

భావము : ''ఓ అమ్మాయి! నీటిలో ఇంతసేపు నిలువదగునా? చలికి వణకుచున్నావు కదా! ఇంక ఆలస్యము చేయక, వెంటనే ఈ పొడిబట్టలు కట్టుకో''

వ॥ అనిన విని 163

భావము : ఆ మాటలను విని

సీ॥ మొగమున గమ్మిన ముంగురుల్ కెంగేల
బాయగ చెవికొన పాదుకొల్పి
వలదగుబ్బల సన్నవలిపె పయ్యెద జేర్చి
నెఱిగురుల్ వలకేల దొరక బట్టు
కటిమేఖలాలంబ ఘంటికల్ మొరయంగ
కంకణఝుంకృతుల్ కలయ బర్వ
కౌనుదీగసియాడ కర్ణకుండలముల
ధగధగల్ చెక్కుల తాండవింప

తే॥ గిలుకుమట్టెలు పదపద్మములను మెఱయ
పటముపై నంటి యంగముల్ బయలు గాగ
నడబెడంగున నడుగులు తడబడంగ
దరికి చనుదెంచె నొయ్యన తలిరుబోడి 164

అర్థాలు : ముంగురుల్= తలపై ముందు భాగమున నున్న వెంట్రుకలు, కెంగేల= చేతితో, వలదగుబ్బల= పెద్ద చన్నులపై, వలిపై= వస్త్రము, వలకేల= కుడిచేత, కటి= నడుమున ఉన్న, మేఖలా+ఆలంబ= ఒడ్డాణము (మొల నూలు)నకు వ్రేలాడుచున్న, మొరయంగ= మ్రోగగా, గిలుకు= సన్నగా ధ్వని చేయుచున్న, పటముపై= చీరపై, తలిరుబోడి= చిగురాకువలె సుకుమారమైన అందము గల యువతి

భావము : ముఖముపై పడుచున్న జుట్టును చేతితో సవరించి చెవికొనలకు దువ్వి, పెద్ద చన్నులపై సన్నని పైటను గప్పి, కుడిచేతితో కొప్పుపెట్టి నడుమున కట్టిన ఒడ్డాణమున ఉన్న చిఱుగంటలు సన్నగా మ్రోయ, ఆ ధ్వనితో చేతికున్న కంకణముల ధ్వని చేరి మ్రోగుచుండగా సన్నని నడుము ల్లాడ, చెవులకుండలములు ఊగు నప్పుడు వాని కాంతులు చెక్కిళ్ళ మీద నాట్యమాడగా, కాలి మట్టెలు మెఱయుచు నడచునప్పుడు గిలుకు గిలుకుమని ధ్వనిచేయగా,తడిసిన చీర ఒంటికి అంటుకొని అవయవములు

కన్పడుచుండగా, నడకల ఒయ్యారము తడబడుచు ఆ మాయాంగన చెంతకు ఆ కాంత వచ్చి నిల్చెను.

క॥ వచ్చిన మాయాకోమలి
చెచ్చెర దువ్వలువ మడుగు చేనొసగినచో
నచ్చెలి తడవూడ్చుచు జిగి
కుచ్చిళు లడుగులను జేర కొమరుగ గట్టెన్ 165

అర్థాలు : చెచ్చెర= వెంటనే, దువ్వలువమడుగు= ఆరవేసి విలువైన సన్నని బట్ట, కొమరుగ= అందముగ, తడవు ఊడ్చుచు= ఆలస్యమును వారించుచు

భావము : అట్లు వచ్చిన మునికన్యను చేరదీసి ఆ మాయాంగన వెంటనే విలువైన సన్నని బట్టలు, తడిపి ఆరవేసి చేతికిచ్చెను, ఆ మునికన్య ఆలసింపక ఆ చీరను కుచ్చిళ్లు పట్టి చక్కగా సవరించి పొందికగా కట్టుకొనెను.

ఉ॥ పంకజపాణికిం గురులు బాగుగ నార్చుచు కొప్పునన్ విరుల్
పొంకగ జుట్టి కస్తురిని బొట్టిడి పాపటబొట్టు దిద్దె మేల్
కుంకుమగంధమున్ వలుదగుబ్బల నించి మనోహరాకృతిన్
కంకణ నూపురాంగదముఖప్రియ భూషణరాజి దీర్చినన్ 166

భావము : చీరగట్టిన మునికన్యను ఆ మాయాంగన, తడిసిన జుట్టును గాలికి ఆరునట్లు విడదీసి, కొప్పులలో పువ్వులను పొంకముగ చుట్టి, కస్తూరి తిలకము నొసట నుంచి, పాపటబొట్టు దిద్ది మేలైన కుంకుమ గంధమును పాలిండ్లపై చల్లి చేతికి కంకణములు, కాలికి అందెలు భుజాల వఱకు వంకీలు ముఖానికి తగిన సొమ్ములు పెట్టి మనోహర రూపమును పొందునట్లు అలంకరించెను.

శా॥ ఏలా చిన్కుకు తాళదాయె తలశాటింతైన గాదాయెనే
గాలిం దేలి చలించు టాయె కడుకంపంబూర్జితం బాయె చం
డాలిస్పర్శము మిక్కిలాయె తన దేహంబందు తారాడుటే
మేలంచుం దరి చేరి నిల్చిన రమామీనాక్షియో నా గడున్ 167

అర్థాలు : తాళదాయె= ఓర్చుకొనదు, తలశాటు= తలకట్టు, కంపంబు+ ఊర్జితంబు+ఆయె= వణకు పుట్టినది, చండ+అలి= విజృంభించిన తుమ్మెదల, తారాడుటే= సంచరించుటే, రమామీనాక్షి= లక్ష్మీదేవి.

భావము : చిక్కులకు సహించుటకు తలకుగల దుప్పటి చాలకపోయినను, చల్లగాలని తాళలేక చలించుటచే వణకుట ఎక్కువైనది. వేడియైన ఎండల తాకుళ్లు విరివియగుటచే సహింపజాలదు. అట్టి కాంత శరీరమందు ఉండుట మంచిదని లక్ష్మీదేవి ఆశ్రయించెనేమో అన్నట్లు ఆ కన్య సర్వలక్ష్మీ గుణసంపన్ను రాలుగా కన్పట్టెను

వ॥ ఒప్పుచున్న యక్కన్యం గనంగొని 168

భావము : అట్లు అందముగా నున్న ఆ కన్నెను చూచి

ఉ॥ కూతుర నీవు నీరముల గ్రుంకిడ బోయిటు లాలసించితే
నాతరమా తరించుటకు నాథుడు నం దిగనాడిపోవ నే
నాతురనయ్యు నిన్ను గని యాత్మ నొకించుక నూరడిల్లగా
అతి మనంబు దానవయి ఊయిడి బెట్టె దంచు నెంతయున్ 169

అర్థాలు : దిగనాడిపోవ= విడిచిపోగా, ఊయిడిబెట్టెదు+అంచు= అల్లరి పెట్టుచున్నావనుచు

భావము : "తల్లీ! నీ విట్లు సరసులో స్నానమునకు పోయి ఇంతగా ఆలస్యము చేసిన నేనేమి చేయుదును? నీ తండ్రి నన్ను విడిచిపోవుటచే ఆయనతో నేను పోవలెనని మనసులో కోరిక యున్నది. నిన్ను చూచి కొంత ఊరట పొందు చున్నాను. నీవు జాలి లేక నన్నిట్లు అల్లరిపెట్టుచున్నావే"

ఆ॥ మరులుకొల్పుచున్న యా
విలాసినితోన నిట్టులనియె తోయజాక్షి!
అమ్మ జనకుడెవ్వ రథివాస మెయ్యది
మనము వచ్చుటేమి యనిన నతివ 170

భావము : తన్ను ఆకర్షించుచున్న ఆ మాయాంగనతో మునికన్య ఇట్లనెను "అమ్మా! నా తండ్రియెవరు? మన నివాసమెక్కడ? మనము ఇక్కకడికి ఏల వచ్చితిమి?" అనగా ఆ మాయావతి

క॥ వనజాయతాక్షి! విను నీ
జనకుడనంతుండు సర్వసౌభాగ్యయుతుం
డనుకూలుడు నాయెడలను
నిను గాంచితినమ్మ నమ్మహాత్ముని కూర్మిన్ 171

భావము : "నాకు అనుకూలుడైన భర్త సౌభాగ్యవంతుడు ఆయనకు నాయందు గల ప్రేమ వలన నిన్ను పొందాను.'

సీ॥ కల్పించు తనదు సంకల్పమాత్రంబున
నఖిలచరాచరంబైన సృష్టి
పోషించు పదునాల్గుభువనంబు లలతిమై
లీల కటాక్షాంశలేశమునను
విలయించు నొక్కింత వేడిచూపులమాత్ర
నిఖిల ప్రపంచంబు నిమిషమునను
కావించు వెలిలోను లోపల సర్వంబు
పరిపూర్ణమహిమా ప్రభావమునను

తే॥ బ్రహ్మవిష్ణుమహేశ్వరుల్ పరమునగుచు
నఖిలజగములు దనమాయ నాక్రమించి
వెలయ కీర్తి ననంతుండు విష్ణు వనగ
బాల! నీతండ్రి యతడు నా ప్రాణవిభుడు 172

అర్థాలు : అలతియై= అనాయాసముగ, విలయించు= నశింపజేయును, కావించు= చేయును

భావము : "తాను తలించినంతనే విశ్వమందలి సమస్తమును సృష్టించి తన కడగంటి కొద్దిపాటి చూపు చేత పదునాల్గు లోకాలను పోషించును. తన వేడి చూపులచే, ఒక నిమిషములో సర్వప్రపంచమును కాల్చివేయును. వెలుపల. లోపల సర్వమును తన మహిమచే ప్రకాశింపజేయును. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల కంటె వేరై వారి కంటే అతిశయించిన వాడై సకల జగత్తు తన మాయకు వశము కాగా నీ తండ్రి వెలయువాడు అనంతుడు నా భర్త."

ఉ॥ అమ్మహనీయమూర్తి సదయాళుడు లోలుడునై నిరంతరం
బిమ్ముల గారవింపగ సుఖింపుచు నవ్వనభూమి భక్తిమై
నెమ్మది నిచ్చలుంబనులు నేర్పున చిత్తమువచ్చునట్లు పా
దమ్ముల సేవసేయుచు ముదంబుననుండి నను్రగహార్థినై 173

అర్థాలు : ఇమ్ముల= ప్రేమతో, ఇచ్చట= ఇష్టప్రకారముగ

భావము : "ఆ మహాత్ముడు దయతో ప్రేమతో నన్ను మన్నించుచుండగా, ఆ తపోవనములో సుఖముగ నుండి సంతోషముతో సేవచేయుచు వారి అనుగ్రహమును కోరి నివసించితిని"

చ॥ చిలుకలకొల్కి యాఘనునిసేవనిరంతర మాచరింపుచున్
శిలగనివేల్పుగా ధర వసించిన చెట్టులయాకు పత్రిగా
తలపున నెంచి నోములు వ్రతంబులు మిక్కిలి నాచరించగా
కలిగితి వమ్మ యమ్ముని శిఖామణి సత్కరుణా విభూతిచేన్ 174

అర్థాలు : పత్రిగా= పూజకు ఉపయోగించు ఆకు, విభూతి= సంపద

భావము : "అట్లు సేవించుచు, భూమిపై గల శిలను దేవునిగా భావించి, చెట్ల ఆకులను ఆ దేవుని పూజకు తగినవిగా భావించి, ఎన్నో నోములు, వ్రతములు చేయగా, ఆ మహాత్మునకు నాపై దయ కలిగినది. నిన్ను నాకు ప్రసాదించినాడు"

క॥ నిను సద్యోగర్భంబున
గని నప్పుడ యింక దపము గావింపంగా
జనియెను నిజేచ్ఛ నీవీ
తనయామణి బెనుపు మనుచు తానును కోరెన్ 175

అర్థాలు : సద్యోగర్భంబున= సద్యఃఅనగా వెంటనే యని, కాని వెంటనే (దంపతుల తొలి కలయికలోనే) అని అర్థము కావలెను. కాని సద్యోగర్భమనగా గర్భధారణయు, శిశుప్రసవమును వెంటనే జరిగినట్లు అర్థము చెప్పుట పరిపాటి. సంకల్పసిద్ధుల విషయమున విశ్వాసమే తప్ప తర్కమునకు తావు లేదు, పెనుపుము= పెంచుము.

భావము : "నిన్ను వెంటనే పొందగా నీతండ్రి నిన్ను పెంచుమని నాకాజ్ఞ యిచ్చి, తపస్సు చేసికొనుటకు వెడలిపోయెను."

శా॥ నీపైకూరిమి నిన్ను డించి చనగా నేనేరకిట్లుంటి నే
భూపాలాగ్రణికైన సర్వగుణసంపూర్ణున్ వితర్కించి ని
న్నాపట్టంపుమనోహరాంగిగను నే నర్పించి నీశోభన
శ్రీ పెంపుం గని ప్రాణనాథుకడకే జేరంగ బోదున్ సఖీ! 176

భావము : "నీపై నాకు గల ప్రేమవలన నిన్ను విడిచిపోలేక, గుణవంతుడు, సంపన్నుడైన ఏ రాజకుమారునికైన నిన్ను భార్యగా ఇచ్చి, నీవృద్ధిని చూచి సంతోషముగ నేను నా భర్త వద్దకు పోయెదను"

మ॥ అని కెంగేలను కేలు గీల్కొలిపి నెయ్యం బొప్పగా కూరిమిన్
నెనరుం బ్రేమమమత్వమాప్తమును సందీప్తంబుగా జేయుచున్
మునికాంతం దనవెంట బట్టుకొని సమ్మోదంబుతో నేగుచో
ననియెం దా నదె మత్తపోవనము భామా! చూడు మేపారగన్ 177

అర్థాలు : నెనరు= స్నేహము, ఆప్తము= బంధుత్వము, సన్నీతంబుగా= ఒకచోజేర్చునట్లు

భావము : అని చెప్పుచు, ఆ మాయాంగన ఆ మునికన్య చేతిని తన చేతితో పట్టుకొని, ప్రేమయు, స్నేహమును, మమకారమును, చుట్టరికమును, అన్నియు నొక్కచోట చేరునట్లు, తనవెంట కొని కొంతదూరము పోయి "అదిగో నమ్మా! చక్కగా చూడుము. అది నా తపోవనము" అని వచించెను.

సీ॥ ఈ పొన్నపొగడల నీచంపకంబుల
నీ మొల్లపొదలను నీవనముల
నీ సరోవరముల నీనెత్తముల గమి
నీ కేతకీ శ్రేణి నీ స్థలముల
నీ కోనలందుండు నీచెల్మ బావుల
నీ సప్తపర్ణికావాసములను
నీ బ్రహ్మతరువుల నీ పిప్పలంబుల
నీ హేమదుగ్ధసందోహములను

తే॥ పుష్పఫలపత్రనీవారములను కంద
మూలములు దర్భ గొనిపోవ చాలశిష్యు
లందువిహరింతు రెప్పుడు నిందువదన
సంతతంబుండు నిందు వసంతు డెలమి 178

అర్థాలు : చంపక= సంపెంగ, నెత్తముల= పచ్చికబయలులు, కేతకీ= మొగలి, చెల్మ= నదులు, వాగులు త్రవ్విన మంచినీటి గుంటలు, నీవారము= నివ్వరి యను నొకజాతి గడ్డి గింజలు, బ్రహ్మతరువు= గంగరావిచెట్టు.

సీ॥ సోనలై పూదేనెవానల గడు నిండి
వెలువడు చెంగల్వకొలను దరుల
కోలముల్ ద్రవ్వియు కాలువలందుచ్చి
పారునీరంబుల ప్రబలమైన

క్రముకరంభాచంపకంబులపై నిండ
 గ్రమ్మిన నును మల్లికావితాన
మాధవీకుందశుంభ ల్లతామంటప
వల్లికా డోలికా వాసమును

తే॥ శారికాకీర పంక్తుల శబ్దశాస్త్ర
సామగానానుమోదిత సర్పములును
హరిణశార్దూలనాగహర్యక్షముఖ్య
జంతువులు జూడు నిర్వైర సంగతములు 179

అర్థాలు : కోలముల్= అడవిపందులు, క్రముకము= పోకచెట్టు, శబ్దశాస్త్రసామగాన+అనుమోదిత= శబ్దశాస్త్రముననుసరించి నిర్మింపబడిన సామవేద భాగములైన సామలను పఠించగా ఆ శబ్దమున కానందపడిన, నిర్వైరసంగతములు= విరోధము లేక మెలగుచున్నవి.

భావము : పూదేనెల ప్రవాహములు నిండిన ఎఱ్ఱకలువల కొలని తీరములను అడవిపందులు త్రవ్వుటచే కాలువలను చీల్చుకొని వెల్వడు ఎక్కువైన నీటి వెల్లువలను పోక, అరటి, సంపంగి చెట్లపై పాకు కోమలములైన మల్లెల తీగలును, గురివెంద, మొల్లల తీగెల వెలుగుచున్న పందిళ్లలో గల ఊయెలల ఉనికిని గోరువంకలు, చిలుకల గుంపుల శబ్దశాస్త్రములను సామవేద గానములను ఆనందముతో ఆలకించుచున్న పాములను, జింకలు, పులులు, ఏనుగులు, సింహములు మొదలగు గొప్ప జంతువులు వైరము లేనివై కలసి మెలసి తిరుగుచున్నవి. చూడుమా!'

చ॥ బడగరమున్న కొర్వులను భద్రగజంబుల జూచి తమ్మ యె
య్యెడ నెడ లేక షట్పదము లింపుగ బాడెడు సామగానముల్
పడతుక వింటివమ్మ శుకపంక్తులు బల్కెడు రామనామపున్
నుడువుల మాధురీరసవినోదము లాత్మ ముదంబు జెందెడిన్ 180

అర్థాలు : బడగరమున్నకొర్వులు= బలమైన కట్టుకొయ్యలు, ఎడలేక= సందులేకుండ, షట్పదములు= తుమ్మెదలు, ఇంపుగ= చెవికి సుఖముగ, సామగానముల్= సామవేద గానము, పడతుక= యువతి, నుడువులు= మాటలు

భావము : "బలముగపాతిన కట్టుకొయ్యలచే కట్టబడిన ఏనుగులను, చూచితివమ్మా! సందులేకుండ తుమ్మెదలు చేయు సామగానముల ఝుంకారము వింటివమ్మా! చిలుకలు రామనామమును పలుకు మధురరసముల వినోదములు ఆత్మకు ఎంతో సంతసమును ఇచ్చుచున్నవి."

చ॥ సరసుల గంటివే కుముదసారసకోకనదారవిందముల్
తరుణ మరందపాన మదతత్పర షట్పదజాల నాదముల్
గురుతర చక్రవాకబకకుక్కుటముఖ్య జలాండజాతముల్
తరళతరంగ డోలికల దార్కొని యూగెడు హంససంఘముల్ 181

అర్థాలు : కుక్కుటముఖ్య= కోడి మొదలైన, జలాండజాతముల్= నీటిపక్షులు

భావము : "సరస్సు నందు తెల్లకలువలు, తెల్లతామరలు, ఎఱ్ఱకలువలు, ఎఱ్ఱతామరలు తేనెను త్రాగి మదించి, ఆసక్తితో కావించుచున్న లేత వయసు గల తుమ్మెదల ఝుంకారములను బలిష్ఠములైన చక్రవాక పక్షులు, కొంగలు, కాకులు మొదలైన నీటి పక్షులను నీటి అలలే ఉయ్యాలలుగా వానిపై ఊగు హంసల గుంపులను చూచితివా"

విశేషము : ఇక్కడ చెప్పిన కోడి నీటికోడి యని చెప్పవలె. లేకున్న అన్నిటిని కలిపి నీటిపక్షులు అనుట పొసగదు.

సీ॥ త్రేతాగ్నులతులవర్ధిత యాజకుల నొప్పు
యజ్ఞవాటికలివి యబ్జవదన
అతిథి సంతర్పణ మతిసమార్చన సేయు
భోజనాలయమిది పువ్వుబోడి

శ్రీపతి పద షోడశోపచార విధాన
　　పూజాగృహంబిది పూవుబోణి
కందమూలఫలాదిక గ్రాస పరిపక్వ
　　పాక మందిరమిది పద్మనయన.

తే॥ ఇదియు జపమంటపమ్ము సుమ్మిదియు వత్స
కూటమిచ్చోటు శతపద వాటి సుదతి
యిదియు దగు శారదాస్థానమిదివిలాస
వేశ్మ మిందీవరేక్షణ వింటివమ్మ 182

భావము : "త్రేతాగ్నులివి, యజ్ఞశాలలివి, వీరు ఋత్విజులు, అతిథుల నర్చించి సంతర్పణము జేయు భోజనశాల యిది, శ్రీమహా విష్ణువునకు షోడశోపచారములు చేయు పూజాగృహమిది, కందమూలాది ఆహారములను వండు వంటశాల యిది, ఇది జపము జేసికొను మందిరము, ఇది వత్సకూటము, ఇది శతపథవాటి, ఇది శారదామందిరము, ఇది విలాసమందిరము. తెలిసెనా?"

విశేషాలు : త్రేతాగ్నులు : 1. దక్షిణాగ్ని దీనినే వ్యానవాయువనియు, అన్వాహార్యపచనాగ్ని యనియు నందురు. 2. గార్హపత్యాగ్ని. దీనిని అపానవాయువనియు నందురు. 3. ఆహవనీయాగ్ని. ఇది ప్రాణవాయువు. యాజకులు యజ్ఞము చేయించువారు. వీరిని ఋత్విక్కులనియు ఋత్విజులనియు అందురు.

షోడశోపచారములు : 1. ఆవాహనము, 2. ఆసనము, 3. పాద్యము, 4.అర్ఘ్యము, 5. ఆచమనీయము, 6. అభిషేకము, 7.వస్త్రము, 8.యజ్ఞోపవీతము, 9. గంధము, 10. పుష్పము, 11. ధూపము, 12. దీపము, 13. నైవేద్యము, 14. తాంబూలము, 15.ప్రదక్షిణము, 16.నమస్కారము- ఇవి సేవావిధులు. వత్సకూటము ఏడాది లోపు వయస్సుగల లేగదూడలుండు చోటు.

శతపథవాటి బ్రాహ్మణులు శుక్లయజుర్వేదభాగమైన శతపథ బ్రాహ్మణమను దానిని చదువుటకు కూర్చుండు చోటు.

క॥ వీరలు నాతోనాడెడు
నారీమణులమ్మ దినము నవ్య విలాసో
దారమతి వీరితోడ వి
హారము గావించి మెలగు మాత్మచెలంగన్ 183

భావము : "వీరు నాతో ఆడుకొనుచుండు స్త్రీలు. నిత్యము వీరితో క్రొత్త విలాసములతో నీ యిష్టము వచ్చినట్లు ఆత్మకు సంతృప్తి కలుగునట్లు విహరించుము."

క॥ అని మందిరంబు చేరిచి
దినదినమొక క్రొత్త మమత తేటపడంగా
మునివనిత చంద్రరేఖయు
తనపూర్వము దెలియకుండ తగ వర్తించెన్ 184

భావము : అని ఇట్లు తన నివాసమునంతయు పరిచయము చేసి ఆ మునికన్యకు చంద్రరేఖయని పేరు పెట్టి రోజుకొక క్రొత్తగా కోరికలు ప్రకటము కాగా, కాలము గడచుచుండగా, గతచరిత్ర తెలియక ఆమె ప్రవర్తించెను.

వ॥ ఇట్లు విహరింపుచు 185

భావము : అట్లు విహరించుచుండ

సీ॥ పురుషోత్తమాసక్తి బొడముటయేకాని
　　పురుషోత్తమాసక్తి బొడమదాయె
మహిమానవానందమతి జరించుటెకాని
　　మహిమానవానంద మతిదొలంగె
ఆత్మభూజవిశేషమరయుటయే కాని
　　యాత్మభూజవిశేషమరయ మఱచె

నవశుభాభరణేశన క్రమక్రియగాని
నవశుభాభరణేశనత్వముడిగె

తే॥ సకలలోకవిలోకనాసక్తి గాని
సకలలోక విలోకనాసక్తి సడలె
నిత్య పరవస్తుసంగ్రహనియతి గాని
నిత్యపరవస్తు సంగ్రహ నియతి మరచె **186**

అర్థాలు : పురుష+ఉత్తమ+ఆసక్తి= మగవారిలో ఉత్తముడెవరో యను ఆసక్తి, పొడముటయే కాని= కలుగుటయే తప్ప, పురుష+ఉత్తమ+ఆసక్తి= కర్తలలో ఉత్తముడైన దేవుని గూర్చి ఆసక్తి, (పురుషుడనగా వేదాంత పరిభాషలో ప్రధానుడు. భగవంతుడు ఒక్కడే పరమకర్త.), మహి= భూమిపై, మానవ+ ఆనంద+మతిన్= మానవులకు సహజమైన ప్రాకృతిక ఆనందములో చలించు బుద్ధియే తప్ప, మహిమా నవ+ఆనందమతి= విష్ణుమహిమ(మాయ) వలన క్రొత్తగా పుట్టిన ఆనందమందు బుద్ధి, తొలంగదు= మరలదు, ఆత్మభూజ= భూమియైనవాని, విశేషము= తన పుట్టుకను గూర్చి విశేషమును, అరయుటయే కాని= తెలిసికొనుటే తప్ప, ఆత్మభూజవిశేషము= పరమాత్మ తానను జ్ఞానమును తెలిసికొనుటకు మఱచెను. నవశుభ+ఆభరణ+ ఈశనక్రమక్రియగాని= క్రొత్తమంగళకరమైన ఆభరణసంపదను సంపాదించికొను ప్రయత్నము తప్ప, నవ= క్రొత్తవైన, శుభ= శుభములను, ఆభరణ= చక్కగా పోషించు, ఈశనత్వము= ఈశ్వరత్వమును, సకలలోకవిలోకన+ఆసక్తిగాని= లోకము సంపదను చూడవలెనను ఉత్సాహము తప్ప, అన్నిలోకములలోను విష్ణుని చూడవలెను (పూర్వము నారదుని) ఆసక్తి, నిత్య= దినదినమును, పరవస్తు= ఇతర వస్తువులను, సంగ్రహ= తీసుకొనుట, నియతిగాని= శ్రద్ధ, నియమము తప్ప, నిత్యము, పరవస్తునియతి= ప్రకృతి కంటె పరమము, చరమము అయిన శాశ్వత సత్యతత్త్వమును గ్రహించు ప్రయత్నమును మఱచిపోయెను.

భావము : శ్రేష్ఠుడైన మగని కొఱకు ఆసక్తియే కలదు. పురుషులలో ఉత్తముడైన ఆ విష్ణువును గూర్చి వాంఛ కలుగలేదు. (పరము) ధరణి యందు మానవులు ఆశించు సంతోషము నందు మనస్సే కలదు (ఇహము). విష్ణుమహిమయైన, క్రొత్తదైన బ్రహ్మాండమందు మనస్సు కలుగలేదు(పరము) తన పుట్టుకను గూర్చి తెలిసికొను చింతయే కలదు (ఇహము) పరమాత్మ స్వరూపమును గూర్చి చింతయే కలుగదు (పరము) స్వస్వరూప జ్ఞానచింత, క్రొత్తవైన స్వచ్ఛమై ఆభరణముల పొందవలెనను ప్రయత్నమే కలదు(ఇహము) క్రొత్తదైన మంగళకరమైన పరమాత్మ పోషకత్వ ఈశత్వము గుఱించి ఆలోచన లోపించినది. సకలలోకమందు గల సౌందర్యవీక్షణ మందుకోరికయే కలదు. సకల లోకములందు వ్యాపించిన విష్ణువును దర్శించవలెనన్న కాంక్ష కలుగలేదు. నిత్యము ఇతర వస్తువులను సమకూర్చుకొనవలెనను నియమమే కలదు. శాశ్వతమైన పరమును కాంక్షించు నియమము కలుగలేదు.

విశేషము : నారదుని పూర్వశీలమునకు నేటి స్త్రీరూప నారదుని శీలమునకు గల భేదమును శ్లేషమూలమున కవి చెప్పుచున్నాడు. "యతులు చేయు పనులన్నియు నేనును చేసితిని గాని వారికి లభించిన సత్ఫలము నాకు లేకపోయెనని" ఒక సంసారి యేడ్చెనని భర్తృహరి తన వైరాగ్య శతకమున చెప్పినట్లు శబ్దములవియేగాని ఇట అర్థములు (పొందిన ఫలములు), వేఱుగా ఉన్నవి. ఆఱు పాదములలో పూర్వభాగము ఇహమునకు పరభాగము పరమునకు చెందినది.

**చ॥ అకట కటాబ్జసంభవభవాదుల కైనను నిక్కమే క్రియన్
ప్రకటిత విష్ణుమాయ నెడబాయగ శక్యమె తత్కటాక్షమిం
చుక ప్రసరింప కూరకనె శుద్ధమనస్కులమున్ తపోధనో
త్యుకుల మటంచు గర్వమున చొప్పడుచుండ జగత్రయంబునన్ 187**

అర్థాలు : అబ్జసంభవభవ+ఆదులకు= బ్రహ్మరుద్రులకు మొ॥, చొప్పడుచుండ= సాగుచుండ

భావము : "ఔరా! బ్రహ్మరుద్రులకైన విష్ణుమాయను దాటుటకు సాధ్యమా! విష్ణుకృప లేకు మేము శుద్ధమనస్కులము, తపోధనులము" అని గర్వముతో చెప్పుకొనుటచే ఎవరికైన మూడులోకములలో మాయను గెలువశక్యమా?!"

శా॥ ఈరీతిం దగ కొన్నినాళ్ళడవిలో నిచ్ఛావిహారంబులన్
నారీరత్నము లాత్మవాంఛలు మహానందంబుగా గూర్పగన్
సారోదారజలావగాహవనసంచారంబులం బ్రొద్దువో
గారా మొప్పగ బూర్వయౌవనము శృంగారంబు శోభిల్లగన్ 188

అర్థాలు : జల+అవగాహ= జలక్రీడలు, వనసంచారంబు= వనవిహారము,

భావము : ఇట్లు తొలి యౌవనము సౌందర్యమొప్పగా ఆ ముని కన్య చంద్రరేఖ ఇష్టానుసారము కొంతకాలమడవిలో తన పరివార స్త్రీలతో గూడి జలక్రీడలు, వనక్రీడలు ఆనందముగ అనుభవించెను.

వ॥ ఇట్లు తనదుపూర్వ మెరుగక వనములో మగువ వెదకుచుండె మగని ననిన వినుచు వెఱగు నొంది మునివర్యులవ్వలి రీతిదెల్పు మనిన సూతుడనియె 189

భావము : ఇట్లు నారదుడు స్త్రీరూపమున తనకు తగిన వరునికై వెదకుచుండెనని సూతుడు చెప్పగా, విని శౌనకాది మునులు ఆపై నే మాయెనో తెలుపుమనగా, వారికి సూతుడిట్లు చెప్పెను.

సీ॥ భములతో నొరయు కుంభములతో సద్విరే
ఫములతో దగు మదేభములతోడ
కొమ్ముతో మేరునగమ్ముతో మీఱు ఛ
త్రమ్ముతో రథనికరమ్ముతోడ
విమలతరోజ్జ్వల విస్ఫుట గతివిహ
గములతో సరితురంగములతోడ
ద్యుతులతో మదగజతతులతో ఘనమృగ
పతులతో మొనయు రాహుతులతోడ

తే॥ విధుల సద్వర్తనల బ్రహ్మ విదులతోడ
వరలు రవిరాజవంశ భూవరులతోడ
కులగిరిసమనిధుల వైశ్యకోటితోడ
గణనకగ్గలమగు శూద్రగణముతోడ 190

అర్థాలు : భములతో= మేఘములతో, ఒరయు= తాకు, కుంభములతో= పెద్దతలలతో, ద్విరేఫములతో= తుమ్మెదలతో, మద+ఇభము= మదించిన ఏనుగు, కొమ్ముతో= శిఖరముతో, మేరునగమ్ముతో= మేరుపర్వతముతో, మీఱు= మించిన, ఛత్రముతో= రాజలాంఛనమగు గొడుగు, సరి= సరియగు, సమానమైన, ద్యుతులతో= కాంతికిరణములతో, మృగపతులతో= సింహములతో, మొనయు= పోటీపడు, రాహుతులతోడ= గుఱ్ఱపు రౌతులతో, భూవరుల= రాజుల, కులగిరిసమనిధుల= కులపర్వతములతో సమానమైన నిధులు గల, గణనకు, అగ్గలమగు= లెక్కకు మిక్కిలియైన

భావము : ఆకాశమున నుండు మబ్బులను రాయు తలలనుండి (కుంభములు) స్రవించు చున్న జలమును త్రాగి మత్తిలు తుమ్మెదలను గల మదపుటేనుగులతో, మేరుపర్వతములను దాని శిఖరములను అతిశయించు గొడుగులు తేరుల గుంపులతో, స్వచ్ఛములైన ప్రకటములైన గమనములు గల పక్షుల వలె ఎగురు గుఱ్ఱములతో, దృఢమైన శరీరకాంతులు వెదజల్లుచు, మదగజములతోను సింహములతోను సాటియగు గుఱ్ఱపు రౌతులతోను మంచి నడవడిక గల బ్రహ్మవేత్తలైన బ్రాహ్మణులతో సూర్యవంశపురాజులతో, కులపర్వతముల వలె పెద్ద ధనసంపదలు గల వైశ్యులతో, లెక్కలేనంత మంది శూద్రులతో

విశేషము : విధులు ఏ వర్ణమునకు తగినరీతి ఆ వర్ణమునకు సమాజమున గల పౌరులకు చేయవలసిన కర్తవ్యములు. బ్రాహ్మణ విధులు

వేదాధ్యయనము, అధ్యాపనము, యజ్ఞనిర్వహణ, దేవతాపూజ, అతిథి సత్కారము, ఇత్యాదులు. ఈ విధులను నిర్వర్తించువాడే సద్బ్రాహ్మణుడు. బ్రహ్మవేత్త యనగా సచ్చిదానంద స్వరూపమైన ఆత్మను దర్శించినవాడు. అరుదైనవాడు.

కులగిరులు : 1. మహేంద్రపర్వతము, 2. మలయపర్వతము, 3. సహ్యాద్రి, 4. శుక్తిమంతము, 5. ఋక్షపర్వతము, 6. వింధ్యపర్వతము, 7. పారియాత్రము.

ఈ సీసపద్యము 4 పాదములలో గజ, రథ, తురగ, పదాతులు అనబడు చతురంగ బలముల వర్ణనయు, తేటగీత 4 పాదములలో బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్ర నిర్మిత సమాజ స్వరూపవర్ణనయు చేయబడినవి.

చ॥ స్థిరతరమై చెలంగు రుచి చేవదలర్చిన మేనిరంగులన్
సరసిజపల్లవోల్లసిత సన్మృదుపాణుల నీలవేణులన్
సరసరుచిప్రకాశమున జక్కవగిబ్బల గేరు గుబ్బలన్
గురుతర పుష్పితంబయిన కొమ్మలకెక్కుడు ముద్దుగుమ్మలన్ 191

అర్థాలు : జక్కవగిబ్బల= చక్రవాక పక్షుల, కేరు= పరిహసించు(సరిపోలు), గుబ్బలన్= చన్నులను, ఎక్కుడు= మించిన

భావము : మాయని దేహకాంతితో, చివురాకు చేతులతో, నల్లని జడలతో, చక్రవాకములకు సరిపోలు చన్నులతో, పూలకొమ్మల మించిన సౌందర్యవతులను

చ॥ మిహిర హిమాంశు లోకములమించిన పువ్వుదోటలున్
బహుజలపూరితంబులుగ భాసిలు బావులు నోలి రావులున్
గుహశిఖిమిత్రులం దెగడ గోరెడు శూరులనత్యుదారులన్
మహదుడుమండలం బొరసి మార్కొను మేడల నొప్పు వాడలున్ 192

అర్థాలు : మిహిర= సూర్యుడు, హిమఅంశు=చంద్రుడు, ఓలి= వరుసగ, రావులున్= రావిచెట్లు, గుహ= కుమారస్వామి, శిఖి= అగ్ని, మిత్రులన్= సూర్యులను, తెగడగోరెడు= మించిపోవలెననికోరు, ఉడుమండలంబు= ఆకాశము.

భావము : సూర్యలోకము, చంద్రలోకములను మించిన పూదోటలు, నీరు నిండుగ నున్న బావులు, వాని చెంత రావి చెట్లు, కుమారస్వామి, అగ్నిదేవుడు, సూర్యుడు వీరిని ఈసడించు శూరులు, ఆకాశమను తాకుచున్న మేడలు గల పురములు.

చ॥ రతనపుగోడలన్ పటికరాగపు బోదెలు నీలరత్నపున్
వితతవితర్దికల్ దనరు వీథుల పచ్చలతోరణంబులున్
జతనుఋవైన ముత్తియపు జల్లులు నెల్లెడ మేల్మి చిత్తరుల్
చతురనటీనటాకృతుల జాలిన సూత్రపుబొమ్మలిమ్ములన్ 193

భావము : రత్నకాంతులు వెల్వడు గోడలు, పద్మరాగపు ఎఱ్ఱని కాంతులు ఈను కంబములు, నీలమణులు గల వెడల్పైన అరుగులు, వీధులలో గరుడపచ్చల తోరణములు, కూడినవైన తెల్లని ముత్యాల జల్లులు వెలువడు వర్షించు మేలైన చిత్రపటములు, నేర్పరితనమును ప్రదర్శించు నటుల నటీమణుల రూపములతో ఉన్నత ప్రమాణములు గల వస్త్రములు ధరించిన (తోలు) బొమ్మలు శిల్పములును

సీ॥ ఏవేళచూచిన దేవతాలయ నిత్య
వైభవోత్సాహప్రవర్తనంబు
నెచ్చోట వీక్షింప పచ్చతోరణముల
నిత్యకళ్యాణ సన్నిహితమహిమ
యెక్కడ గనుగొన్న దిక్కుల నేతెంచు
ఘనరాజభేరికానినదములును

నే చక్కిగాంచిన వాచామగోచరా
ధ్యయన పాఠోత్కరధ్వనివినోద

తే॥ మెందు దర్శింప సుమహిత భేదవిపుల
శబ్ద శాస్త్రార్థ వాగ్విలాస ప్రసంగ
మగుచు విలసిల్లు పుడమి తొయ్యలి యురంబు
జిగి దొళకు తా సత్యక నగరమౌళి 194

అర్థాలు : చక్కి= ప్రదేశమున, వాచామ్+అగోచర+అధ్యయన+పాఠ+ఉత్కర+ధ్వని+వినోదము= మాటలకు అందని దానిగూర్చి తెలిసికొనుటకు చదువుచున్న గొప్ప శబ్దములే వినోదమైనది, భేదవిపుల= విస్తార విశ్లేషణాత్మకమైన, శబ్దశాస్త్ర+అర్థవాక్+విలాసప్రసంగము= శబ్దార్థముల గూర్చిన శాస్త్రసూత్రముల అర్థముల చర్య.

భావము : ఆ సత్యక నగురమున ఎప్పుడు చూచినను నిత్యోత్సవములతో, వైభవముగ నుండు దేవతాలయముల శోభయే, ఎచట నైనను రాజభేరీ ధ్వనులు, ఎటుచూచినను వాక్కుల కందని పారలౌకిక విషయముల విశ్లేషణములే, ఎక్కుడ చూచినను విస్తారమైన శాస్త్రార్థచర్చలే.

క॥ ఆ పట్టణంబు నేలెడు
భూపాలుడు సకలరాజపుంగవమకుట
స్థాపితమణినీరాజన
దీపిత పదకమలు డతులతేజుడు మహిమన్. 195

భావము : ఆ సత్యపురమును పాలించు ప్రభువు, సకల రాజశ్రేష్ఠుల కిరీటములందు మంచి హారతులచే ప్రకాశించు తన పద్మముల వంటి పాదములు కల తేజోవంతుడు.

మ॥ పరనారీజనసోదరుండు సుమహత్పంచాస్త్రసౌందర్య వి
స్ఫురవిభ్రాజితు డార్తరక్షణ కళాపూర్ణుండు త్రైలోక్య భా

స్వరకీర్తి ప్రియు డింద్ర వైభవుడు సర్వజ్ఞుండు సర్వంసహా
పరిరక్షుం డగుచు చంద్రకేతు ధరణీపాలుండు లీలాగతిన్ 196

భావము : అన్యస్త్రీలను సోదర భావమున చూచువాడును, అందమున మన్మథుని మించినవాడును, నిస్సహాయులను రక్షించువాడును, మూడులోకములలో సత్కీర్తి గలవాడును, దేవేంద్రునంతటి వైభవము గలవాడు, జాగరూకత గల జ్ఞాని. ఆ నగరమును ఉల్లాసముతో పాలించు రాజు చంద్రకేతువు.

పంచాస్త్రములు : 1.అరవిందము, 2. అశోకము, 3.చూతము, 4.నవమల్లికా, 5.నీలోత్పలం

వ॥ సకలప్రజారంజనంబుగా రాజ్యంబు సేయుచు నొక్కనాడు 197

భావము : సకల జనులను తృప్తిపఱచుచు పాలన చేయు కాలమున ఒక్కనాడు

సీ॥ వేదాంత వేద్యులౌ విద్వాంసు లొకవంక
నుత్తమసత్కవు లొక్కవంక
రమణీయ సరసపౌరాణికు లొకవంక
నుచితజ్ఞ సన్మంత్రు లొక్కవంక
ప్రత్యక్షముఖ శయ్యాపాఠకు లొకవంక
నురుతరగాయకు లొక్కవంక
ననుపమనవరస హాసకు లొకవంక
పెక్కు నటీనటు లొక్కవంక

తే॥ అవసరములోకమల్ రాయసము లొక్క
వంక సామంతులొకవంక వసుమతీశ
సచివగణంబు లొకవంక నుచితనియతి
నలరు నొకనాడు కొలువున్న యవసరమున

సీ॥ బొమిడిక గురువిందపూసలకుచ్చులు
జేగురుబొట్లపై చిందులాడ
కారెపోగులదండ కడుమించు జిగి గువ్వ
గుత్తిపూసల మొంట్లు కొమరు మిగుల
కరుకుమీసలు మెలిదిరిగి నిట్రించుక
పొట్టేలు కొమ్ముల పొందికలర
దంతంపు సందడి దండల దిగువను
గురువిందపట్టెడ కొమరుమిగుల 198

అర్థాలు : వేదాంతవేద్యులౌ= ఉపనిషత్తుల అర్థములను ఎఱిగినవారు, రాయసములు= వ్రాయసకాండ్రు, వ్రాతపనివారు, శయ్యపాఠములు= పదముల నడకలు, ఎఱిగి నుతులు పాడువారు, హాసకులు= నవ్వించు విదూషకులు

భావము : ఆ చంద్రకేతుడు, విద్వాంసులు, కవులు, పౌరాణికులు, మంత్రులు, స్తోత్రపాఠకులు, గాయకులు, విదూషకులు, నటీనటులు, వ్రాయసకాండ్రు, సామంతులు, వారి మంత్రులు కూడి కొలువై యుండగా

నవరసములు : 1.శృంగారము, 2.హాస్యము, 3.కరుణము, 4.రౌద్రము, 5.వీరము, 6.భయానకము, 7.బీభత్సము, 8.అద్భుతము, 9.శాంతము. -ఇవి కావ్యరసములు వీనికి వాత్సల్యరసమును జేర్చి దశరసములనుటయు కద్దు.

తే॥ చంకకడవిండ్లు నమ్ములు చంకనిఱికి
అరిదికొన్కలు గొంచు నెయ్యంబుతోడ
పుట్టగోచులపై నొంటి కట్టుగుడ్డ
లలర వచ్చిరి యెరుక లత్యమితబలులు 199

అర్థాలు : బొమిడిక= కిరీటము, జేగురు= ఎఱ్ఱని, కారెపోగుల= ఉప్పుగడ్డి పోచలతో అల్లిన, గువ్వగుత్తి= నలికము అను గడ్డి, మొంట్లు= సరులు, కొమరుమిగుల= అందగించగా, నిట్రించుక= నిగిడి, అరిది= అరుదైన

భావము : తమ కిరీటములైన గురువింద పూల కుచ్చులు, తమ ఎఱ్ఱని నొసటి బొట్టులపై నర్తించినవి. నల్లనైన ఉప్పుగడ్డి పోచలతో అల్లిన దండలు అతిశయించు గువ్వగుత్తి పూసల సరములతో అందమై ఒప్పినవి. వాడియైన మీసములు మెలి తిరిగి, పైకెగసి, పొట్టేలు కొమ్ములవలె పొంకముతో నుండినవి. ఏనుగు దంతముల సందడి గల దిగువ గురువింద పూల పట్టెడలు (పట్టెలతో చేయబడిన హారములు) పెట్టుకొని ఎఱుకలు వచ్చిరి.

మ॥ బెదరుంజూపుల కన్నుబొమ్మలెగయన్ బెగ్గిళ్లుపో జూచుచున్
పొదిగా గూడుచు నొండొరుం గదియుచున్ భూపాలకాస్థాన మం
దెదుటన్ చేరి చెరంగులన్ వెదకుచుం ముందేని పోబోవుచున్
వదనంబుల్ గిరిగహ్వరాళిపగిదిన్ వావిచ్చి వీక్షింపుచున్ 200

అర్థాలు : బెగ్గిళ్ళు= భయము, పొదిగా= గుంపుగా, గిరిగహ్వరాళి= కొండగుహలు, పగిదిన్= వలె, వావిచ్చి= నోళ్ళు తెఱచి.

భావము : బెదరు చూపులతో భయము తొలగుటకై కనుబొమ్మలు ఎగురవేయుచు, భయముపోయినట్లు చూచుచు, గుమిగూడుచు, రాజు కొలువులో ప్రవేశించి, కొండగుహల వంటి నోళ్ళు తెఱచి చూచుచు ఎఱుకలు వచ్చిరి.

క॥ ఇవ్విధి సభచేరం జని
యవ్వనచరనాయకుండు నవనీశునకున్
మవ్వమున మొక్కి కానుక
లవ్విభునకు వేఱువేఱ నన్నియు వరుసన్ 201

అర్థాలు : మవ్వమున= మెల్లగా (వినయముతో)

భావము : అట్లు సభలో ప్రవేశించిన ఎఱుకల నాయకుడు రాజునకు వినయముతో వంగి నమస్కరించి తాను తెచ్చిన కానుకలను వేర్వేఱుగా నర్పించెను.

ఉ॥ తేనియ సారపప్పు పసిదిండి మెకంబుల గోళ్ళు పీలిచెం
డ్లేనికగొమ్ములున్ నెమలిఈకలు చిల్కల పున్గుపిల్లలున్
మానితవేణుమౌక్తికసమాజము కస్తురివేణువాదిగా
కానుకలన్నియున్ నృపుడు గానగ నిచ్చుచు తోడివారలున్ 202

అర్థాలు : పసిండిమొకము= పులి, పీలిచెండు= పిట్టల ఈకల కుచ్చులు, కొమ్ము= దంతము, వేణువు= పిల్లనగ్రోవి

భావము : ఆ ఎఱుకల నాయకుడు తేనె, సారపప్పు, పులిగోళ్ళు, పిట్టల కుచ్చులు, ఏనుగు దంతములు, నెమలి ఈకలు, చిలుకలు, ఏనుగు పిల్లలు, మేలైన వెదుర్ల నుండి వెల్వడిన ముత్యములు, కస్తూరి, పిల్లనగ్రోవి, మొదలగు కానుకలను రాజు చూచుచుండగా ఇచ్చెను. తోడివారు మ్రొక్కిరి.

క॥ మ్రొక్కుడు మీరగ నటు నిటు
చిక్కువడం జాగి లేచి చేతులతో దా
రక్కులు కప్పుకొని కాళు
లొక్కటిగా బెనచి నిలిచి యున్నెడ వేడ్కన్ 203

అర్థాలు : చాగి= సాగిలబడి, అక్కులు= ఱొమ్ములు

భావము : మీరును నమస్కరింపుడని తమ నాయకుడనగా మిగతా ఎఱుకలను సాగిలబడి మ్రొక్కి, ఒకరినొకరు త్రోయుచు తమ చేతులతో ఱొమ్ములను కప్పుకొనుచు, కాళ్లు పెనవేసికొనుచు నిలిచిరి.

క॥ భూమీసురు డిట్లనియెను
మీమీ పక్కణములందు మీకెల్లరకున్
సేమమె కద యిటు వచ్చుట
కేమి కతం బనిన రాజుకిట్లని రెరుకల్ 204

అర్థాలు : పక్కణములందు= ఎఱుకల గూడెములలో

భావము : అప్పుడు రాజు వీరినుద్దేశించి, "మీ గూడెములలో అందఱు క్షేమమే కదా? మీ రాకకు కారణమేమి?" అని యడిగెను. వారు రాజుతో ఇట్లనిరి.

సీ॥ అవసరమప్పుడె అందందు కురియంగ
వింతగ సస్యముల్ వీగి పండ
కొలుచునప్పుడు పొంకములుగ పుట్టెడు తూగు
నడిగెడు వారెందు నరుదుగాగ
ప్రోది ధేనువులు ముప్పొద్దును బిదుకంగ
మందలనావులు మట్టుమీర
చిగురుపువ్వులుపిందెలు గఱ గాయలు పండ్లు
వితరణముగా వననిచయ మొప్ప

తే॥ సకలసంపదలను ప్రజసంతసింప
కాయగసురుల కొక్కింత కఱవుగలదె
సేగి యెటువలె మమ్ముల జెందు సామి
వచ్చుటలు మిమ్ము బొడగనవచ్చు టింతె 205

అర్థాలు : పుట్టి= 20 తూముల ధాన్యము, (తూము 16 ముంతలు), ప్రోది= పుష్టిగ మేతయుండుటచే, మట్టుకఱకాయలు= గట్టికాయలు, మట్టు= మితి, సేగి= కీడు,కష్టము,

భావము : "అవసరమైనప్పుడు సరియైన కాలంలో వానలు అచటచ్చట కురియును. వింతగా ధాన్యములు ఎక్కువగా రేగి పండును. కొలుచునప్పుడు ముచ్చటగా పుట్టెడు కొలతకు తక్కువలేక ఉండును. కొనుటకు వచ్చెడివారు లేరు. మంచిమేతచే పాడి ఆవులు మూడు ప్రొద్దులును పాలు ఇచ్చును. మందలలో ఆవులు మితిమీరి ఉన్నవి. చిగుళ్లు పువ్వులు, పిందెలు, గట్టికాయలు, పండ్లు మొదలగు వానితో అడవులన్నియు చక్కగా వృద్ధి పొందిఉన్నవి. సకల సంపదలచే ప్రజలు హాయిగా ఉండగా, కాయలు

కూరలకు కొఱతలేదు. ఓ స్వామి! మాకు కష్టము ఏల కలుగును? కేవలము మీ దర్శనముకై వచ్చినాము.

క॥ మెకములు మేయగ జిక్కిన
సకల విధంబైనపైర్ల సమకూర్పంగా
నొకటొకటి మిన్నుముట్టుచు
ప్రకటితమై వెలయుధాన్యరాశులు ధరణిన్ **206**

అర్థాలు : మెకములు= మృగములు, మేయగచిక్కిన= తినగా మిగిలిన, పైర్ల= పంటలు

భావము : మృగములు తిన్నంత తినిపోగా మిగిలిన పంటలు కోసి కుప్పలు వేసినప్పుడు, ఆ కుప్పలు ఆకాశమును స్పష్టముగా తాకుచు ఎత్తుగా ఉండును.

క॥ ఇత్తెఱగున గడుపైరులు
కుత్తుకబంటిగను మేసి క్రొవ్వినమెకముల్
మొత్తము లెక్కడజూచివి
మత్తిలి యెల్లెడల నిండి మందలు గొనియెన్ **207**

భావము : "ఇట్లు పైరులను గొంతుదాకా మిక్కుటముగా తిన్న జంతువులు బాగా బలిసి గుంపులై అంతటను తిరుగుచున్నవి."

క॥ సామీ యేమనిచెప్పుదు
మామెకములపోతరమ్ము లాముకవియుచున్
భూమెల్ల నిండియున్నది
తోమినగుఱ్ఱాలరీతి తుటుములు గొనుచున్ **208**

అర్థాలు : పోతరమ్ము= పొగరు, ఆము= మదము, కలియుచున్= వ్యాపించుచు, తోమిన= మాలీసు చేసిన, తుటుములు, కొనుచున్= గుంపులై

భావము : "స్వామీ! ఏమని చెప్పుదును? ఆ మృగములు మదముతో వ్యాపించి, గుంపులు గుంపులుగా నేల యీనినట్లు పొగరుగా తిరుగుచున్నవి."

చ॥ మెకములమాత్ర మాపొరుగు మించినపుల్గులు తండతండమై
యొకటికి నొండెదుర్కొనుచు యోరలుపొద్దును మమ్ముజూచి యో
డక కడు పోరు నిచ్చలు కడంకను మార్కొను కోళ్ళుడేగలున్
పకపకనవ్వు కౌజులొకపాటి మెకంబుల దన్ను నెత్రితల్ **209**

అర్థాలు : ఏపారగ= అతిశయింపగా, పుల్గులు= పక్షులు, ఓరలు= ఓరకంట, ఓడక= భయపడక, కడంకను= ధైర్యముతో, కౌజులు= ఒక జాతిపిట్టలు, ఒకపాటి= పెద్దవైనను, మరీపెద్దవి గానివి

భావము : మృగములు మాత్రమే కాదు, వానికంటె ఎక్కువగా మించి తండోపతండంబులై పక్షులు ఒకదానితో నొకటి పోరాడును. మమ్ము జూచి భయపడక, ఓరకంట జూచి నిర్లక్ష్యముగ ధైర్యముతో పోరాడును. కోళ్ళు, డేగలు, కౌజులు(పకపక నవ్వే పిట్టలు) మఱియు పెద్దవి గాని మృగములను తన్నుకొంగలు,

క॥ పరిగెలు చేటలజెరిగిన
పరుగిడు నెడలేనిగుములు పాదులు వలలున్
నురులున్ దేనికి చేతికి
దొరకున్ కోటానుకోట్లు తొలుదొల్త నృపా! **210**

అర్థాలు : పరిగె= ఒక జాతి పిట్టలు, ఎడలేని= తెఱపిలేని, గుములు= గుంపులు, పాదులు= పట్టుకొను సాధనములు

భావము : "చేటలచే చెరిగినపుడు రాలిన వరి యెన్నులను తినుటకు పరుగెత్తెడి పఱిగ పిట్టల దట్టమైన గుంపులు చేతులకే ఎన్నియైనను దొరకును. వానిని పట్టుకొనుటకై (వేటాడుటకై) ఉపయోగించు ఉపకరణము పాదులు త్రాళ్ల అక్కఱలేదు." (ధాన్యము పుష్కలముగా పండెననుట)

వ॥ అని విన్నవించి 211

భావము : అని విన్నవించిన వారై

ఉ॥ కందమునందు నల్లపొడగాళ్ళను గౌరతతెల్ల గోళ్ళు ము
క్కందము నడ్డయీాకె ఇగురుగందపు మాకుల నుబ్బు చెక్కలున్
అందము రిక్కునట్లును నొయారము చెల్వము కాకివాతలున్
గ్రందుపటుత్వమున్ కణిసరంబును చేతికినిచ్చి యట్లనున్ 212

అర్థాలు : నల్లిపొడ= పికిలిపిట్ట, గౌరతతెల్ల= స్వచ్ఛత, తెల్లనైన, కందము నందు= నల్లదనమును పొందిన,

భావము : అటవీ సంపదయైన వివిధ వస్తువులను కృష్ణునకర్పించెను. నల్లని పికిలిపిట్ట యొక్క కాళ్ళు, గోళ్ళు, ముక్కునకు అందముగా దూర్చుకొను ఈకెలు, మేలైన గట్టియైన చందనపు చెక్కలు, సొగసైన నల్లని జింక చర్మములు, గట్టివైన ఎఱ్ఱనైన అడవికాయల దండలు, రాజునకు అర్పించి, ఇట్లు వచించెను. వాతమృగము గాలికి ఎగురుచు నడిచెడి జింక వంటి జంతువు. దీని చర్మము నల్లని వన్నెలతో ప్రకాశించును.

క॥ పెద్దయ్యకు మున్నిచ్చితి
గద్దరివారణము దాని గను మేమందున్
పొద్దొకవింతలు వేటల
పొద్దుచనగరాజు మమ్ముపోసనచేయున్ 213

అర్థాలు : గద్దఱివారణము= పొగరుమోతు ఏనుగు, పోసణ= పోషణ

భావము : "మునుపు పెద్ద రాజుగారికి పొగరు మోతు ఏనుగు నిచ్చినాను. అది నేర్పరి. వేటలో రోజు రోజు వింతలు చేసెడిది. రాజు మమ్ము పోషించువాడు."

చ॥ కనసరివారిణంబులు చొకాటపుబేరులు సాళ్వమాదిగా
గణనకు నగ్గలంబు పొడకట్టుటకుం తగినట్టి డేగలున్

కనక చిగుళ్ళ మొత్తములు గన్గొన వేడుకలయ్య చూడ ధా
రుణీ గన మెన్న డీయదనురూఢి గణంగుము వెంటకియ్యేడన్ 214

అర్థాలు : చొకాటపు= స్వచ్ఛమైన, భేరులు= భేరుండములు, సాళ్వము+ ఆదిగా= ఒక జాతి డేగ మొ॥, పొడకట్టుటకు= కనబడుటకు, కణంగుము= బయలుదేఱుము, వెంటకు= వేటకు

భావము : "చూడముచ్చటైన ఏనుగులు, భేరుండపక్షులు, డేగలు, చివురుగుత్తులు వేడుకగా చూచుట కిది సమయము. పుడమిపై ఇట్టివానిని చూడలేము. కనుక వెంటనే ఓ రాజా! వెడలిరమ్ము"

ఉ॥ దేవరవారు వేట కరుదెంచినజాలును చూడమమ్ములన్
చేవదలిర్ప బెబ్బులుల జేకొని దాళువలూడజిల్కుచున్
కావరమేచుసింగముల గండ్రలుసేయుచు కొమ్ముటేన్గులన్
బోవగనీక కూల్తు మొకపాటున నున్న మెకంబులడ్డమే 215

అర్థాలు : చేవదలిర్ప= శక్తి కన్పడగ, దాళువలు ఊడన్ చిల్కుచున్= దౌడలూడ లాగుచు, కావరము+ఏచు= గర్వము పొగరున మించు, గండ్రలుసేయుచు= ముక్కలు చేయుచు

భావము : "తమరు వేటకు వచ్చిన, చాలును. మాశక్తి తెలియునట్లు బెబ్బులుల దౌడలూడ లాగుదుము, పొగరున మీద కుఱుకు సింహములను నఱికి ముక్కలు చేయుదుము. దంతములున్న ఏనుగులను నిలువున కూల్చివేయుదుము. ఇవొక లెక్కగాదు. మీరు ఊరక చూచుచున్న చాలు.

సీ॥ కోల్పులివడి బట్టి కుదెగట్టి యీాగోళ్ళు
పెరికి తెచ్చిన వాడు యెరుకవీడు
గొరకతో యానాది కొమరుండు మదమునే
నుగుగ్రుమ్మిపడద్రోచె నుగ్గుగాను

ఈబోయ చిన్నవాడెదిరిన సింగంబు
చే కత్తి పెనుబోర చించి కూల్చె
కారెనుపోతుల గదిసి యీ చెంచుడు
తోడ్తోడ కొమ్ములు తొడరి విరిచె

తే॥ వీరిపనియేమి యిటనున్నవారు కొద్దె
నేడువేటకు విచ్చేసి చూడమమ్ము
నిజము గావింతు మింతయు నేర్పు మెఱసి
పగ్గెలాడుట గాదు మీపాదమాన 216

అర్థాలు : కుదెగట్టి= మడిచికట్టి, గొర= బాణము, చేకత్తి= చేతికత్తి, పెనుబోర= పెద్దపొట్ట, తొడికొని= పట్టుకొని, తొడరి= ఎదిరించి, పగ్గెలాడుటగాదు= ప్రజ్ఞలు పలుకుట కాదు, డంబములు చెప్పుటకాదు

భావము : "పెద్దపులిని పట్టి, మడిచికట్టి, ఈ గోళ్ళు పీకి తెచ్చినవాడు వీడే. మదపుటేనుగును గుద్ది పడగొట్టిన ఈ ఏనాది కొడుకు. ఈ చిన్నవాడు మీద బడిన సింహమును చేతికత్తితో పొట్టచీల్చి చంపిన బోయవాడు. ఎనుబోతుల పట్టుకొని కొమ్ములు విఱిచిన వాడు ఈ చెంచువాడు. ఇదేమి గొప్ప? వీరిని మించినవారు గూడెములోని వారు. మీరు వేటకు వచ్చి చూచిన, ఇదంతయు సత్యమని తెలియును. బడాయికాదు, మీతోడు! ఈ వచ్చిన వారిలో ఎఱుకలతో బాటు, ఏనాదులు బోయలు చెంచెలు ఉన్నారు."

మ॥ అనినన్ భూపతి వీరినందఱిని నెయ్యం బొప్ప వీక్షించి మ
న్నన నిష్టార్థము లిచ్చి మంత్రి కనుసన్నన్ వేటకుంబోవు సొం
పును దెల్పంగని యత్తెఱంగునను రేపున్ వేట విచ్చేయగా
జననాథుండు దలంచినా డనుచు దా జాటింప బంపెం బురిన్ 217

భావము : అని ఆ ఆటవికనాయకుడు చెప్పగా, రాజు అందఱిని స్నేహముతో చూచి, గౌరవముతో, వారి కిష్టమైన వాని నిచ్చి, మంత్రి, రాజు చూపుల

అర్థమును గ్రహించి, మఱునాడు వేటకు రాజు వచ్చునని చాటింపు వేయించుటకు నగరికి దూతల పంపెను.

వ॥ ఇట్లు ప్రొద్దున వేట బోవుటకు వేటకాంద్ర బయనంబుగా నియమించి కొలువు చాలించి యంతఃపురంబు ప్రవేశించి సుఖచర్యల వర్తింపుచు దినశేషంబు గడపి మఱునా డరుణోదయంబున మేల్కాంచి నిత్యకృత్యంబుల నిర్వర్తించి 218

భావము : ప్రొద్దుననే వేటకు పోవుటకు వేటగాండ్రును నియమించి, కొలువు చాలించి రాజు మఱునాడు ఉదయమే మేల్కొని చేయవలసిన పనులను చేసి

సీ॥ తళుకు వజ్రంపు నిద్దా మేలు కుళ్లాయి
యొఱపైన హరుమంచి యొంట్లు చెవుల
తాళియు హంవీర తాయెతల్ సంగతి
దంతలు హొంబట్టు దట్టిచుట్టి
రత్నంపు బటువుల రాజిల్ల దాలిచి
పలువన్నె జిగియంచు పంచకట్టి
పచ్చరాపిడిబాకు పంచల జేరిచి
కరతలంబున గుద్దు కత్తిమెఱయ

తే॥ నీటు చద్దరు శాల్వవల్లెవాటు చెంగ
మేలుపవడంపుపావాలు మెట్టియొక్క
యూడిగంబును దండ యూనివచ్చి
నీటు దళుకొత్తమొగసాల నిలిచె నంత 219

అర్థాలు : నిద్దా= అందమైన, కుళ్ళాయి= చిన్నటోపి, ఒఱపైన= సానబట్టిన (మెఱయుచున్న), హరుమంచి= అందమైన, ఒంట్లు= మగవారి చెవిపోగులు, తాళియు= పతకము, హంవీర=శూరుల, రాజుల, తాయెతల్= తాయెత్తులు,

సంగతి= యుక్తముగ, దంతలు= ఏనుగు దంతములు, హంబట్టు= జరీపట్టు, దట్టీ= కాసెకోక, బటువుల= ఉంగరములను, జిగియంచు= శోభగల అంచు, చద్దరు= పొడవైన లాగులు, పావాలు= పాదుకలు, ఊడిగంబును= సేవకుని

భావము : తలపైన టోపి, చెవులకు పోగులు, శూరుల తాయెత్తులు, ఊగు దంతాలు, జలతారు పట్టు దట్టీ, వ్రేళ్ళకు ఉంగరాలు, పంచ పచ్చల పిడిబాకు, చేత చురకత్తి, వల్లెవాటు పావుకోళ్ళు, నిడుపైన లాగులతో అలంకరించుకొని ఒక సేవకుడు చేయూతతో రాజు వచ్చి నిల్చెను.

సీ॥ గిఱిగొను గుజరాతికెంపుల మొగముట్టు
చికిలిపచ్చల తళుకు కలప పట్టె
సరిలేని బుడుతఖలీనంబు రంజిల్లు
పల్లముముత్యాలపటుతలాట
మును చొకాటపు నీలములయంక వన్నెలు
యడుగుల ఘల్లను నందియలును
కణకణ బలికెడు కంచుమువ్వలపేరు
ధృతి నుక్కుకళ్ళెంబు దిష్టి దండ

తే॥ ఇరుగడ మెఱుంగుటమ్ముల తరకసాలు
సింగిణీవిండ్లు మెచ్చు ఫిరంగి మొరయ
బూన్చి కైజానమర్చి మెల్ల నొకశ్వ
రత్నమును నిల్పె సాహిణిరాజు మ్రోల 220

అర్థాలు : గిఱికొను= ప్రకాశించు, మొగముట్టు= గుఱ్ఱమునకు ముఖాలంకారము, చికిలిపచ్చల= చికిలి చేసిన పచ్చల, ఖలీనంబు= గుఱ్ఱపు కళ్ళెము, పల్లము= గుఱ్ఱపు జీను, తలాటమును= తురాయిని, తరకసాలు= అమ్ముల పొదులు, సింగిణీవిండ్లు= కొమ్మువిల్లులు, కైజానమర్చి= కళ్ళెమునకు తగిలించు పగ్గమును వెనుకకు లాగికట్టి, సాహిణి= గుఱ్ఱపువాడు

భావము : మెఱయుచున్న ముఖాలంకారమును కళ్ళెమును, జీనును, తురాయిని అమర్చి, పగ్గములను వెనుకకు లాగి కట్టి, రెండుప్రక్కలను అమ్ముల పొదులను నిల్పి విండ్లను వానిలో నుంచి మేలైన ఫిరంగి మ్రోగుచుండగా, గుఱ్ఱమును సిద్ధము చేసి తెచ్చి రాజు ముందు నిల్పెను.

క॥ నిలిపిన యత్తురగంబును
వలగొనుచు నమస్కరించి వాగియ డాచే
చెలగ జివుక్కున నెక్కెను
వలపుల దొర చిలుకతేజి వడిసెక్కు క్రియన్ 221

అర్థాలు : వాగియ= గుఱ్ఱపు నోటికి తగిలించిన పగ్గము, డాచే= ఎడమచేతిలో,

భావము : అట్లు సాహిణి తెచ్చిన గుఱ్ఱమును ముందుగా నమస్కరించి ఉదుటున నెక్కిన రాజు చిలుకనెక్కిన మన్మథునివలె ఉండెను.

విశేషము : గుఱ్ఱమునకు నమస్కరించుట, భారతీయులు తమకు సేవచేయు జంతువులను సైతము దైవభావన చేయు సత్సంప్రదాయమును తెలుపుచున్నది.

శా॥ ఆలో నల్గురునుం గుమారులు నమాత్యశ్రేణి బంధుల్ దొరల్
మేలశ్వంబుల నెక్కి యుక్కున మహోర్మివ్రాతమున్ బోలె హే
రాళంబై తను జుట్టురా భటు లుదారప్రక్రియన్ ముందరన్
హేలాలీలల సింహనాదములతో నేపారుచున్ బారులై 222

అర్థాలు : ఆలో= అంతలో, మహా+ఉర్మివ్రాతమున్‌బోలె= పెద్ద అలను పోలి, హేరాళంబై= బహుళమై, అధికమై, హేలాలీలల= విలాసముగ

భావము : అంతలో ఆ రాజు కుమారులు నలుగురు, మంత్రులు, బంధువులు, నాయకులు, మేలైన గుఱ్ఱములను ఎక్కి పౌరుషముతో ఒక పెద్ద అలవలె ఉత్సాహమున కదలి, భటులు తమ చుట్టు రాగా విలాసముగ గర్జించుచు వరుసలుగా,

తే॥ నడువ గురికాండ్రు నొండొరుల్ యుడిగములును
మేలు కైజీతమును దొరల్మెరసి మేమె
మేమె చాలుదు మెంతటి మెకము గముల
నిలిచి ధట్టించి గెంటింప నిముషమునను 223

అర్థాలు : గుఱికాండ్రు= వేటగాళ్ళు, ఉడిగములు= సేవకులు, కైజీతములు= బత్తైకాండ్లు, (ఆహార పదార్థములను తెచ్చువారు) ధట్టించి= అదలించి, గెంటింప= పాఱిపోవునట్లు చేయుటకు

భావము : నడువగా, వేటగాళ్ళు, సేవకులు, ఆ బత్తైకాండ్రు అడవి దొరలు మేమే ఎట్టి క్రూరమైన జంతువునైనను తఱిమి వేయగలమని తమ గొప్పలు చెప్పికొనుచు సాగిరి.

క॥ అని పెల్లేచి వచింపుచు
మును పెద్దయ్య ముదిబిరుదములు గనుగొనుమో
జననాథ మురువు సరిపెన
ఘనసారము లనుచు చేరికల నడువంగన్ 224

అర్థాలు : పెల్లు+ఏచి= తేజరిల్లి, చెలరేగి, మురువు= మురుగు (నగ), సరిపెన= బంగారు గొలుసు, ఘనసారము= చాలా గొప్పది, చేరికల= స్నేహమున

భావము : ఇట్లు చెలరేగి మాట్లాడుచు, పూర్వము పెద్దరాజుగారు మాకు మెచ్చి యిచ్చిన బంగారు మురుగు, గొలుసు చాలా గొప్పవి చూడుమని చూపుచు స్నేహమున నడచిరి.

చ॥ వలలును బోనులున్ జిగురువాలికలున్ నునుపోగుకట్టలున్
కొలదికి మించినట్టి యరి కోలలు పాదులు దీముపిట్టలున్
చలుదులచిక్కముల్ గొలుసు జాగిలముల్ కడు గంచు పీకలున్
గలిగిన వేటకాండ్రు తొలగన్నెడలేకనె రా ముదంబునన్ 225

అర్థాలు : దీముపిట్టలున్= పక్షులను బట్టుటకుపయోగించు పిట్టలు, పోగులు= త్రాళ్లు, చలుదులచిక్కముల్= చల్దియన్నమును మోయుటకు వీలగు సాధనము, జాగిలముల్= వేటకుక్కలు, అరికోలలు= పాదలు, ఏఱులు దాటు సాధనములు

భావము : వలలు, బోనులు, బెత్తములు, వేటాడుటలో నుపయోగించు త్రాళ్ల కట్టలు వేటాడుటకు తోడ్పడు వేటకుక్కలు, ఊదుపీకలు తీసికొని వేటకాండ్రు నడిచిరి.

సీ॥ కంచుగంటతుపాకి కాౘ్రేడుబైరేడు
చిలుకగద్దరికాడు చిచ్చుపిడుగు
మెకముల పటుగారు మెలుపరి పొలుపరి
పచ్చిమిర్యము రాచమెచ్చు వెండి
గుండు బెబ్బులి మిత్తికోపు కాపరికాండు
రేగాడు మొనగాడురెక్కపచ్చి
వేగరికమికాడు విడిబట్టు నెఱవాది
ఉక్కుగుండు పిరంగి యెక్కటీడు

తే॥ మొదలుగాగ నా బిరుదాంకములును వెలయ
జాగిలంబుల గొలుసులు సంగ్రహించి
యూడిగపు బోడికలు గుమిగూడి నడచి
యవనిపతి వెంట వెడలిరి యతిరయమున 226

అర్థాలు : ఊడిగపుబోడికలు= సేవకులు

భావము : కంచుగంట, తుపాకీ, కాౘ్రేడు, బైరేడు, చిలుకగద్దరికాడు, చిచ్చుపిడుగు, మెకముల పటుగారు, మెలుపరి, పొలుపరి, పచ్చిమిర్యము, రాచమెచ్చు, వెండిగుండు, బెబ్బులి మిత్తికోపు, కాపరికాడు, రేగాము, మొనగాడు, రెక్కపక్షి, వేగరి, కమికాడు, విడిబట్టు, నెఱవాది, ఉక్కుగుండు,

ఫిరంగి, ఎక్కటీడు - మొదలైన బిరుదులు గల వేట కుక్కల గొలుసులు పట్టుకొని సేవకులు వెంటరాగా రాజు వేటకు వెడలెను.

శా॥ ఈరీతిం గడు సంభ్రమంబునను రాజేంద్రుండు దానశ్వ సం
చారక్రీడలజోడనల్నటములున్ చాల్చాపుటుల్ వేడెముల్
పేరంబు ల్తురికీసవారుగతులన్ బేర్వేర ద్రొక్కింపుచున్
మేరల్మీరిన సేనతో గదలె నెమ్మిం భేరులున్ మ్రోగగన్ 227

భావము : గుఱ్ఱము కదనుద్రొక్కు గతుల భేదములతో రాజు ఉత్సాహముగ జోడనలు, నటములు, చాల్చాపుటులు, వేడెములు, పేరంబులు, తురికీసవారు గతులను పేరుపేరున తానెక్కిన గుఱ్ఱమును కదను త్రొక్కించుచు గొప్పసేనతో భేరులు మ్రోగగా కదలెను.

వ॥ ఇట్లు గదలి మహారణ్యంబు చొచ్చి 228

భావము : "ఈ విధముగా గొప్ప అడవిలో ప్రవేశించి

అర్థాలు : రాణువ= పరిజనము, సైన్యము, తేజిపై= గుఱ్ఱముపై, ఏజ= తేజస్సు, చక్కి= వైపు, చోట.

సీ॥ వాద్యంబులొకచక్కి వలలొకచక్కిని
పోగు దీర్పొకచక్కి పొందుపఱచి
గుఱికాండ్రనొకచక్కి దొరలందరొకచక్కి
కాల్బలమొకచక్కి గ్రందుకొనగ
రౌతులనొకచక్కి రాణువ నొకచక్కి
భటులందరొకచక్కి పదిలపరచి
వేగులనొకచక్కి వేటరులొకచక్కి
రేచులనొకచక్కి పూచి నిలిపి

తే॥ బంధులళ్ళుళ్ళు సుతులిరు పార్శ్వములను
బారులై నిల్వ నొకపెద్దపంది వలకు

దార్చి మృగములదెమ్మని తరువు బెట్టి
నిలిచె నపుడు తేజిపై నేజ పూని 229

భావము : ఒకచోట వాద్యములను, ఒకచోట వలలను, ఒకవైపు పోగుతీరులు, ఒకవైపు గుఱికాండ్రను, అడవిదొరల నొకవంకను, కాల్బలము నొకచోట, గుఱ్ఱపు రౌతులొక వంక, పరిజనమొకవంక, వేటకుక్కలు(రేచుకుక్కలు) ఒకవంక కూడి, పూన్చి నిలిపి, రాజు తన బంధువులు అల్లుళ్ళు, కొడుకులు ప్రక్కల బారులై నిల్వగా, ఒక పెద్ద పెంపుడు పందిని వలలో ఉంచి, మృగముల రాకకై చూచుచు, తన గుఱ్ఱముపై నిలిచెను.వేటసంరంభమును వర్ణించుట ప్రబంధలక్షణము.

శా॥ భేరీభాంకృతులున్ మహార్భటులు గంభీరాట్టహాసంబులున్
దారల్ బూరలు తమ్మటమ్ములును నుద్యత్సింహనాదంబులున్
ఘోరంచుం దిశలున్ నభంబు దగ నంభోధుల్ గడున్ ఘూర్ణిలం
గా రేకెత్తి వనంబు గల్చిరి కడున్ గర్వోద్ధతుల్ మీఱగన్ 230

అర్థాలు : తమ్మటమ్ములును= తప్పెటలు, నభంబు= ఆకాశము

భావము : భేరిధ్వనులు, ఆర్భాటములు, నవ్వులు, పీకలు, బూరాలు, తప్పెటలు, గర్జింపులు, ఈ ధ్వనులన్ని కలసి ఆకాశము, సముద్రములు, హోరెత్తునట్లు వారందఱు అరణ్యమును కలచివేసిరి.

క॥ ఇటు లొక్కుమ్మడి మ్రోసిన
కిటికరి శార్దూల శరభకేసరిహరిమ
ర్కటమహిషముఖ్యమృగములు
పటుగతి నట్టటుల చెదరి పరువులు వారెన్ 231

అర్థాలు : కిటి= పంది, కరి= ఏనుగు, శార్దూల= పులు, శరభ= ఎనిమిది కాళ్ళు, నెత్తిమీద కన్నుగల మృగము (ఇది సింహమును చంపునని నమ్మకము, పురాణ, జానపద కథలలో దీని ప్రస్తావన), కేసరి= సింహము, హరి= గుఱ్ఱము.

భావము : ఇట్లు హఠాత్తుగ ఒక్కసారిగ కలిగిన ధ్వనికి అడవిలోని పందులు, ఏనుగులు, పులులు, సింహములు, శరభములు, గుఱ్ఱములు, కోతులు, దున్నలు, మొదలగు జంతువులు చెల్లాచెదరై పరుగులు పెట్టినవి.

క॥ పసవడి నిగ్గెడువేపుల
వెసపట్టెడలూడ్చి కడక విడిచిన వేగన్
మసలు నొకకొమ్ముపందిని
కసిమసగుచు బట్టె మెదలగా నీని యదనన్ 232

అర్థాలు : వేపుల= కుక్కల, అదనున= సమయమందు, పట్టెడలు= మెడత్రాళ్ళను

భావము : శక్తితో వేగముగ తొందరపడుకు కుక్కల మెడల పట్టెడలను విప్పి విడిచిన, అవి అందున్న యొక అడవి పందిని రోషముతో చుట్టుముట్టి కదలనీయక చంపజూచిన సమయమున.

ఉ॥ చీదరకొట్టి చెంత నొక చెట్టుకరింగిన వేగ కూల్చిదా
మీదికి దూకినంత కిటి మీదికి జివ్వున జౌకళింపుచో
నూదిన పట్టు గార్లక్రియ నుక్కణగన్ గబళించి వేపులా
జాదులు మెచ్చగా వెనకజొచ్చి పిఱుందను కొన్ని బట్టగన్ 233

అర్థాలు : చీదరకొట్టి= బుసకొట్టి, కిటి= పంది, చౌకళింపుచో= దూకినప్పుడు, ఊదిన= నొక్కిన, ఉక్కణగన్= పొగరు తగ్గగా, కబళించి= నోటకఱచి, పిఱుందను= వెనుకను.

భావము : బుసకొట్టి ఆ పంది, చెంతనున్న చెట్టునాశ్రయింపగా, వేగముగా దానిపై కుక్కలు మీదికి దూకినవి. అంత ఆ పంది చివ్వున పైకి లేచినది. వెంటనే పట్టుకార్లతో పట్టినట్లు కుక్కలు దానిని పట్టగా, కుక్కలు కొన్ని వెనుకనుండి వచ్చి దానిని పట్టుకొన్నవి.

క॥ వెఱవక వేపుల నీడ్చుక
గొరగొర తనపైకివచ్చు గురుకిటివరమున్
గొరకన్ గుమ్మిన నొక్కొక
2సరిగుదియ కటారి జిమ్మె సద్భటు డొకడున్ 234

అర్థాలు : వెఱవక= భయపడక, గొరకన్= చిన్నబల్లెముతో, కుమ్మిన= పొడిచిన, కటారి= చిన్నకత్తి, గొరగొర= వేగముగ.

భావము : ఐనను భయపడక, కుక్కల నీడ్చుకొని వేగముగ తనమీదకు వచ్చు ఆ పెద్ద పందిని చిన్నబల్లెముతో భటుడొకడు పొడువగా, అది ఒక్కసారి క్రింద కుదియబడెను. అంతట మఱియొకడు చేకత్తితో దానిని పొడిచెను.

మ॥ తెరపేటన్ కులగోత్రగాత్రి యొకపోత్రిస్వామి ఘోరాకృతిన్
కరిపోతంబన వచ్చుదాని గని వీకన్ వేట కాడొక్క డ
త్తరి పట్టెడలడించి రేచుల విడన్ దర్పంబునం జివ్వనన్
కరికుంభస్థలికిం గడంగు హరి సంఘం బట్ల లంఘించినన్ 235

అర్థాలు : తెరపేటన్= తెరగా కట్టిపట్టెను, కులగోత్రగాత్రి= బలమైన యొక జాతిగల, పోత్రిస్వామి= గొప్పపంది, కరిపోతంబన= ఏనుగు పిల్లవలె,

భావము : రక్షణకై తెరగా కట్టిన పట్టెను చీల్చుకొని కులగోత్రములు గల బలమైన శరీరముతో ఒక పెద్ద పంది ఏనుగు పిల్ల భయంకరముగా వచ్చుట చూచి, ఒక వేటగాడు, మెడ పట్టెడలను ఊడదీసి వేటకుక్కలను విడువగా, అవి పౌరుషముతో చివ్వన ఎగిరి ఏనుగు మీదికి సింహముల గుంపువలె ఆ పందిపై బడినవి.

క॥ వీపుల బ్రక్కల వెనుకను
మూపున చెవిక్రింద బట్టి బొరియలుగా ర
క్తాపాతంబుగ గండలు
పైపై గడువెరికి వైవ పటురోషమునన్ 236

భావము : ఆ కుక్కలట్లు ఆ పందిపై పడి వీపును, పక్కలను, వెనుకను, ముట్టెను, చెవిక్రిందను పట్టుకొని పేలగింజలై, నెత్తురోడుచున్న కండలు కండలుగ ఆ పందిని పీకినవి. అంతట ఆ పంది రోషముతో

ఉ॥ మానిసిగాలికిం దొడరి మాటున మార్గముకొద్దిఁ(బ్రా)కులన్
దానొక యేటునం బడ నుదగ్రత నేయుచు వచ్చు నక్కిటిన్
బూని భటుండు బల్లెమున పొత్తియు హత్తగ గుమ్మి పట్టినన్
దానది లెక్క సేయక పదంపడి నొక్కుకొ రాగ భీతుడై 237

అర్థాలు : తొడరి= ఎదిరినిల్చి, నొక్కుకొరాగ= నెట్టుకురాగా,

భావము : మనుష్యుడు ఉన్నాడని ఊహించి రేగి, త్రోవలోని చెట్లను పడగొట్టుచు, వచ్చు ఆ పందిని భటుడొకడు బల్లెముతో పొత్తికడుపులో పొడిచినను, అది లెక్కచేయక త్రోసుకు రాగా అతడు భయపడెను.

ఉ॥ మోటున బల్లెముల్ మొదలు మోపి తటాలున నోరయై వలన్
వాటపుబాకు దూసుకొని వక్కలుగా నది వీపు చించినన్
కాటుక కొండరీతి బడగా నట రేచులు డిగ్గి యేలికన్
గాటపు వేడ్క సేయుచును గమ్మెను వాడటు మేను దువ్వగన్ 238

అర్థాలు : మోటు= కృత్రిమమైన మానవాకారము,

భావము : అడవి పంది వేటలో పంది దృష్టిని మరల్చుటకు ఏర్పఱచిన కృత్రిమ మానవాకారము మాటున బల్లెములతో సిద్ధముగ నుండి, చప్పున పంది చేరువకు రాగానే ప్రక్కవాటుగా వలవేసి బాకుతో పొడిచిన, దాని వీపు వక్కలుకాగా అది కాటుక కొండవలె నేలపై కూలినప్పుడు కుక్కలు మూగి దానిని చంపినవి. ఆ కుక్కలను పెంచినవాడు మిక్కిలి మెచ్చుకోలుగా వాని శరీరమును దువ్వెను.

ఉ॥ బెబ్బులి యొక్కటార్భటుల భీషణ రోష విషాద మొప్పగా
గబ్బితనంబునం కుధరగహ్వరము వెడ లేగుదెంచినన్

గబ్బున, నొక్కజాగిలము గాలికి సిగ్గిన వేటకాడు దా
గొబ్బున పట్టెదుల్చిన నకుంఠితలీల పిఱుందుబట్టినన్ 239

అర్థాలు : గబ్బితనంబునన్= ధైర్యముతో, కుధరగహ్వరము= కొండగుహ, గబ్బున= వాసనకు, సిగ్గిన= చలించిన, గొబ్బున= వెంటనే,

భావము : ఒక బెబ్బులి ఆర్భాటముగా భయంకరరోషముతో ధైర్యముగా కొండ గుహనుండి బైటకు రాగా, ఆ వాసనను గుర్తించిన వేటకుక్క ఉత్సాహము చూపగా వెంటనే దానిని పెంచిన వేటగాడు దాని మెడకున్న పట్టెడను ఊడదీసెను. అది మిక్కిలి వేగముతో పోయి దాని పిఱుదును పట్టుకొనెను.

క॥ గురికాడ డప్పులి దగ్గరి
కురుచ కటారెడమచేత గొని నోటికిని
చ్చి రయమునంగూడి కైనొక
మెరకుంతము దానిబొడిచి మేదిని ద్రోచెన్ 240

అర్థాలు : డగ్గరి= దగ్గఱికి పోయి, మెరకుంతము= బల్లెము, మేదిని= భూమిపై

భావము : గురికాడొకడు ఆ పులి చెంతకు పోయి, చిన్న కత్తిని తన ఎడమ చేత పట్టుకొని ఆ పులి నోటి కందించి, వేగముగా చేతనున్న బల్లెముతో దానిని పొడిచి భూమిపై పడవేసెను.

క॥ మదగజమొక్కటి యక్కడ
గదగొని చనుదేర రౌతు గుఱ్ఱముపైగా
నుదుటున బఱపుచు నేజన్
గదియుచు కుంభస్థలంబు గాడగ నేసెన్ 241

అర్థాలు : గొదగొని= విజృంభించి, ఏజన్= ఉత్సాహముతో

భావము : మదించిన ఏనుగొకటి విజృంభించి రాగా గుఱ్ఱముపై నొక రౌతు ఉదుటున పరుగెత్తి వచ్చి దాని తలపై నాటునట్లు తన చేతిలోని కత్తితో, తటాలున పొడిచెను.

మ॥ అది యాయేటునకుం మహాగ్రహముతో నారౌతుపై వచ్చినన్
మదియుప్పొంగగ దూకి దాటి వెనకై మత్తేభవాలంబు సొం
పు దలిర్పన్ గరవాలుచే దునిమి తెంపుంబెంపు వాటిల్లగా
నదిమళ్ళన్వె సతుండమున్నఱికె కొండట్లన్ ధరన్ గూలగన్ 242

అర్థాలు : ఏటునకున్= ఆ దెబ్బకు, కరవాలుచే= చేతికత్తిచే, తునిమి= తెగవేసి, తెంపుపెంపువాటిల్లగ= తెంపరితనము కలుగగా, మళ్ళన్= వెనుకకు తిరుగగా, వెస= వేగముగా,

భావము : ఆ దెబ్బకు ఆ ఏనుగు అమితకోపమున ఆ రౌతుపైకి వచ్చినది. ఆతడు చప్పున తప్పుకొని దాని వెనుకకు దూకి దాని తోకను తన చేకత్తితో నఱికి, తెంపరితనముతో అది వెనుకకు తిరుగగా, దాని తొండమును నఱికెను. అంతట ఆ ఏనుగు కొండవలె నేలపై పడినది.

చ॥ భరమగు పెద్దపంది వల బద్దలుగా గడు చించి చెంగటన్
గురిగొని కాచుకొన్న రణకోవిదులం గని హుంకరింపుచున్
గొరగొర పైకిరా నొకడు కోయని యార్చి కరాసి నేసినన్
చెరుకునుబోలె కత్తి నెరసేయగ కూలెను రెండుకండలై 243

అర్థాలు : కరాసిచే= కత్తి, కాచుకొన్న= వేచిన

భావము : చాల బరువైన పెద్ద పంది తన్ను పట్టుకొన్న వలను చించి, చేరువన వేచియున్న యుద్ధనిపుణులను చూచి గర్జించి, వేగముగ పైకి రాగా, వారిలో ఒకడు 'కో' యని అఱచి, కత్తిని విసరివేయగా, ఆ కత్తికి వశమై ఆ పంది రెండు ముక్కలై పడెను.

ఉ॥ రాజట తేజిపై నిలచి రట్టడిబెబ్బులి చేరవచ్చినన్
వాజి నదల్చుచో కెళవువారు తటాలున లేచు నంతలో
రాజిలు ఖడ్గ ధారగళరంధ్రము జిమ్మన గ్రోవిబోలె పె
ల్లోజగరక్తధారలసి నొందగ దవ్వగ నేసె నుగ్రతన్ 244

అర్థాలు : కెళవు= ప్రక్కన, ఖడ్గధార= కత్తివాదర, పెల్లోజగ (పెల్లు+ఓజగ)= వెల్లువరీతిగా, అసినొందగ= కత్తిని అంటగా.

భావము : రాజు గుఱ్ఱముపై నిలిచి, బెబ్బులి దాపునకు రాగా, గుఱ్ఱమును అదలించు నప్పుడు ప్రక్కనున్నవారు తటాలున లేచునంతలో కత్తివాదర ఆ పులి గొంతులో దిగి చిమ్మనగ్రోవి వలె నెత్తుటి వరదరీతిగా పొంగి కత్తిని అంటుచు ఉబికి వచ్చునట్లు దూరముగ ఆ పులిని పడవేసెను

సీ॥ పుండరీకంబుల బొరిబొరి పోకార్చె
చెచ్చెర వేటాడె చెండుకరణి
కేసరిసంఘంబు గెడపె బాలురు తమ్మి
కేసరంబుల ద్రుంచు క్రియ దలిర్ప
గండభేరుండసంఘాతంబు బడగూల్చె
గండభేరుండాంఘ్రి ఖండములుగ
శరభనికాయంబు సంహరించెను మహా
శరభయాకలిత జర్జరితముగను

తే॥ ఇతర మృగముల వధియించుటేమి లెక్క
భూరిబలుడైనహాలికుండు పోడునరికి
నట్ల బడుగును బేకయై యడవి గూలె
మాంస మస్తిష్క శోణితమయముగాను 245

అర్థాలు : పుండరీకంబుల= పెద్ద పులులను, పోకార్చె= చంపెను, గెడపె (కడపె)= తొలగించెను, తమ్మికేసరంబుల= తామరపువ్వుల కేసరములను,

లీల= తేలికగా, శరభయ+ఆకలిత= బాణముల భయము వలన కకావికలైన, జర్జరితముగను= బాగుగా వయసు మళ్ళినట్లు కాగా(అనగా, బలహీనము కాగా), భూరి= గొప్ప, హలికుండు= నాగలిబట్టి దున్నునట్టి రైతు, పోడు= పొదలు, తుప్పలు గల భూమి, పడుగును= వస్త్రమును నేతలో పొడవు నూలుదారముగా, పేకయై= వస్త్రము నేతలో అడ్డనూలుగా, శోణితము= నెత్తుటిచే ఎఱ్ఱగ చేయబడినది.

భావము : పెద్దపులులను బంతులవలె సింహములను బాలురు సులభముగా తామర పువ్వులలోగల కేసరములను త్రుంచినట్లు చంపెను. గండభేరుండ పక్షులను కూల్చెను. శరభముల కాళ్ళను ముక్కలుగా చేసి, భయముచే బలహీనులైన వానిని చంపెను.

సీ॥ కఱకుబాణంబుల నెఱకులంటగ నేసె
ఘోరాస్త్రముల గొన్నిగుదులు గ్రుచ్చి
పదినైదునొక్కట బలుమెకంబుల నేసి
కొన్నిటి నేచన గూలగుమ్మి
హయఖురహతి గొన్ని యణగగ ద్రొక్కించి
వాలుచే గొన్నిటి లీల నఱికి
శశముల బ్రక్కలు జాఱ గీటణగించి
వేళ్ళనంటగ దోలి కీళ్ళుగడపి

తే॥ మఱియు పటుచండవేదండ మండలోరు
తుండకాండంబులను ఖండతుండములుగ
చెండు బెండాడి విదళించి చిక్కుబరచి
హాళి మృగయాగతనందకేళి సలిపె. 246

అర్థాలు : ఎఱకలంటగనేసె= ఱెక్కలు తెగనేసె, గుదిగ్రుచ్చు= గుత్తులుగా చేర్చు, ఏజాన= అతిశయింపగా, హయఖురహతి= గుఱ్ఱపు గిట్టల దెబ్బకు,

వాలుచే= కత్తితో, శశముల= కుందేళ్ళ, కీటడగించి= పొగరణచి, వేదండము= ఏనుగు, హాళి= సంతోషమున, మృగయా+ఆగత+నంద+కేళి= వేటవలన కలిగిన ఆనంద క్రీడను

భావము : కొన్ని పక్షులను ఎగురచుండగ పడగొట్టి, కొన్నిటి ఱెక్కలు త్రెంచి, పదియునైదు మృగములను ఒకేసారి చంపి, కొన్నిటిని గుఱ్ఱపు గిట్టల క్రింద అణగత్రొక్కించి, కత్తితో కొన్నిటిని నఱికి, కుందేళ్ళ ప్రక్కలు చించి, కీళ్ళను సడలించి, ఏనుగుల తొండములు ముక్కలు జేసి ఇట్లు వేటాడుట పొందిన ఆనందక్రీడలో వినోదించెను.

శా॥ ఈరీతిన్ బహుచిత్రమార్గముల వన్యేభాళి దుర్దాంత దు
ర్వారోదగ్రమహామృగవ్రజము సర్వం బాయరణ్యంబునన్
క్రూరోదాత్తత నీడ్చి కూల్చియును చక్కుల్చేసి ఖండించి క్రొ
వ్వారన్ తుండెలు తుండెమొండెములువ్రయ్యల్‌చేసెచీకాకుగన్ 247

అర్థాలు : వన్య+ఇభాళి= అడవి ఏనుగులను, దుర్దాంతదుర్వారఉదగ్ర మహామృగవ్రజము= వారించుటకు వీలుకాని మదించిన మహాక్రూరమృగముల సమూహమును, వ్రయ్యల్= ముక్కలు.

భావము : ఇట్లు చిత్రవిచిత్ర గతుల అడవిలోని ఏనుగులను, ఇతర భయంకర జంతువులను క్రూరముగా ఈడ్చి కూల్చి ముక్కలు కావించి తెగగొట్టుచు, వాని కొవ్వు వెల్వడునట్లు వాని ముక్కలు మొండెమును తునుకలుగాచీల్చి అన్నిటిని చిందరవందఱ చేసెను.

క॥ పచ్చడికి నఱికి నట్లవి
యచ్చరు లచ్చెరువు నొంద నతి ఘోరంబై
యచ్చట చెలికాండ్ర నెలవు
నిచ్చలముగ దెలియరాక నిబిడీకృతమై 248

అర్థాలు : పచ్చడికి= చట్నీకోసము (నఱికినట్లు), వియచ్చరులు+అచ్చెరువునుబంద= ఆకాశమున సంచరించు దేవగణములు ఆశ్చర్యపడగా, (మఱియొక విధమున) ఆ+చరులు+అచ్చెరువునొంద= అచ్చట తిరుగువారు ఆశ్చర్యపడగా, నెలవు= ఉన్నచోట, నిబిడీకృతమై= దట్టమై

భావము : ఆ జంతువులు, పక్షులు పచ్చడి చేయుటకై చితుకకొట్టినట్లైనవి.

వ॥ యుండునట్లుగా బహు ప్రకారంబుల మృగవిశసనంబు గావింపుచు
మఱియును **249**

భావము : ఆ విధముగా, పెక్కురీతులుగా, మృగములన్నింటిని చంపినవారై, మఱియును

సీ॥ ఇరుముల పొడకట్టు తెరుపుల నురులొడ్డి
చెలములదరి పొదు లలవరించి
కడుపచ్చికలగూడి కాలువల్తగ దిద్ది
తీవుదారులవలల్ తెఱపి దీర్చి
చిగురు గుల్మంబుల జిగురు గండె లమర్చి
వేటగువ్వల గూళ్ళ వాటపఱచి
కంచుబీకెలనూదగా చెంత నియమించి
పెనుగంత వలలు నేర్పున ఘటించి

తే॥ పులుగు పల్కుల నీలలు వెలయజేసి
మీటలెసగించి గూళ్ళపై మేటి యురులు
పన్ని నాళంపు గ్రోవు లేర్పఱచి నిలిచి
పులుగువేటాడ జొచ్చి రేపునను దనరి. **250**

అర్థాలు : ఇఱుముల= మఱుగుచోటులను, తెరువుల= పద్ధతులను, ఉరులుబడ్డి= ఉచ్చులు బిగించి

భావము : ఇది పక్షుల వేట వర్ణన. పక్షులు కనిపెట్టలేని మఱుగులను తెలిసికొని, పద్ధతిగా ఉరులు బిగించి, నీరు త్రాగు నీటి గుంటల చెంత పక్షులను పట్టుటలో శిక్షణగల పిట్టలను ఏర్పాటు చేసి, పచ్చిక నేలలలో కాలువలు తీసి తీగల దారిలో వలలు పన్ని, చివురుటాకు గుత్తులలో జిగురుగా నుండు పదార్థములను అమర్చి (పక్షుల వ్రాలగనే వాటి కాళ్ళు ఎగురుటకు వీలుగాక అతుకుకొనునట్లు) వేటలో ఉపయోగించు గువ్వలను గూళ్ళలో అనుకూలముగ ఉంచి కంచు పీకలను ఊదువారిని నియమించి, వలలను పఱచి, పిట్టల కూతలవంటి ఈలలు వేయుచు, ఇట్లు సన్నాహముతో పక్షుల వేటను సాగించిరి.

ఉ॥ డేగల ముష్టికిం గొని వడిం గుఱికెంబులు చోపు గఱ్ఱలున్
వేగమె చోపుచుం దమిని వేయక నిల్కడ మేటి కౌజు పై
జాగి చనంగ వేళ గని చక్కగ వేసిన వేటు తోడనే
లాగుగ బట్టి వాలిన చెలంగుచు నూడ్చుచు వేటలాడుచున్ **251**

అర్థాలు : ముష్టికిన్‌కొని= పిడికిటిపై వ్రాలుటకై పిలిచి, కురిపెంబులు= త్రవ్వు పనిముట్లను, చోపుగఱ్ఱలున్= పక్షులను పారద్రోలు కఱ్ఱలు

భావము : డేగలను ముంజేతి పిడికిటిపై వ్రాలగ పిలిచి త్రవ్వు పనిముట్లను పక్షులను బెదరగొట్టు కఱ్ఱలను తీసికొని, కౌజుపిట్టలు పైకి ఎగురపోయిన వేళను చూచి, వేసిన వ్రేటుతో వాలగనే సులభముగ పట్టుకొని, ఉత్సాహముతో, వానిని ప్రోగుచేసికొనుచు వేటాడిరి.

ఉ॥ బైరుల పెద్ద చెఱ్ఱు బకపంక్తులపై విడువంగ రింగునన్
వారక మింటిపై దిరుగ వాలిన భీతి బకంబులన్నియున్
తారుచు లేవ రెక్కలు పదంబులు రాకనె చిక్కి లావులున్
బారగజూచి తన్ను కొన బట్టుదు రప్పుడు వేటగాండ్రొగిన్ **252**

అర్థాలు : బైరుల= ఒక జాతి డేగను, బకపంక్తులపై= కొంగలపై, రింగునన్= గుండ్రముగ, వలయాకారముగా, తారుచు= వ్యాపించుచు, లావులన్= ఱెక్కల మొదళ్లు, పారగ జూచి= పొడవుగా చాచి.

భావము : "బైరి" అను పేరు గల ఒకజాతి డేగలను పెద్దచెఱువులలో నుండు కొంగలపైకి వదలగా, అవి ఆకాశమున ఎగురుచు వలయములై తమను చుట్టుకొనగ చూచిన కొంగలు, ఆ డేగలు తమను తన్నుకొనిపోవుననెడి భయముతో చెల్లాచెదరుగ లేవబోవ కాళ్ళు ఊడిరాక ఱెక్కల కొనలు చిక్కుకొని తన్నుకొనుచుండగా చూచి వేటగాండ్రు వెంటనే వానిని పట్టుకొందురు.

ఉ॥ **మీటలజేరు లెక్కకును మిక్కిలి పుల్గులు మాటు లేకనే**
వాటపు తోపుదాటివల వచ్చెడి గువ్వలు పాదులొడ్డగా
మోటమిసేయు కౌజు లురు లొడ్డగ వేసట బట్టు కొక్కెరల్
మాటికి మాటికిన్ వల లమర్చగ పొందెడి కోళ్ళు నై తగన్ **253**

అర్థాలు : మీటల= ఏతపు మ్రాని క్రింది భాగములందు, పుల్గులు= పిట్టలు, మాటులేకనే= వలలు వేయకపోయినను, తోపు= తోట, దాటి ఇవల= దాటి ఇవతలకు, పాదులొడ్డగా= పాది పిట్టలను విడువగా

భావము : ఏతపు మానుల క్రిందికి లెక్కకు మించి, చేరు పక్షులు వలలను ఉపయోగించక పోయినను దొరకును. అనుకూలముగ తోటలను దాటి వచ్చెడి గువ్వలు-పాదులు ఏర్పాటు చేయగా, మొండిగా నుండు కౌజులు త్రాళ్లను వేయగా వేగముగా పట్టు కొంగలు, మాటిమాటికి వలలను చక్కగా అమర్చగా లభించిన కోళ్లు.

వ॥ **మఱిమఱి బహువిధోపాయంబుల మృగ ఖగ విసర విశసన వ్యసనంబుల మసలిక లేక కసిమసంగి బిరుదాంకంబు లుగ్గడింపుచు పేరులు చెప్పుకొనుచు। నేనుంగుల కుఱికి మానిత దండంబులం దాళువులనుం బెరికిరా పెకలించి పోగులు వేయు వారును। వారి మెచ్చక హెచ్చిన కోల్పులుల మత్సరంబుల**

విచ్చలవిడి జొచ్చి హెచ్చరికలం గేడించి కొంచి లగించుక సంచలించని హృదయంబుల గుదియంబట్టి పదముల నాల్గు గదియంగ నొకకేలం గీల్కొల్పి గోళ్ళుగోళ్ళను గిల్లి యప్పులుల విడుచువారును। వారిని మీఱి జవంబులం జమరీమృగంబుల తెగల కొగిం గదిసి తవిలి యవలీలం బట్టుక చామరంబు లేమరక గైకొనువారును వారల భంగించి సింగంపు పదువులకుం గదీసి గొదగొని పట్టుకొక్కటి పెనలు వేయువారును। నై యిన్నియును జనపాలు సన్ముఖంబున నిడి మెచ్చు లందవలెనని యిచ్చలం దలంచి మచ్చికలం బెచ్చు పెరుంగుచు। హెచ్చిన మార్తాండ చండకిరణంబుల బెండుపడి నీరువట్టిన చెట్టు, మట్టిమీరిన దప్పుల చొప్పు వెదకుచు నక్కడక్కద కొలంకుల దరుల శీతాలావనీజాత వ్రాత నితాంతచ్ఛాయలం బదుండ్రు నూర్వురు గుములు గూడుకొని విశ్రమించుచు. నమృతమయంబులగు విమల జలంబులు గ్రోలుచు। జలావగాహనంబులు చేసి చలందులు భుజియించి। విలాసంబుగా నారికేళాసవంబులు దించి కలశంబుల నిడుకొని పొగరుగల మృగంబుల నదలించి తెగగల కదుళ్ళ వగ వగ చిదురుపలు వేగ గ్రుచ్చి పొగసొగయక కనగనమను ఖాదనంబు లంగారకంబుల మీద పక్వంబులుగా నమర్చి పసుపు టాకుల నిడుకొని పోకపొత్తియల దొన్నియల నాసవం బించుక గ్రోలుచు। నొక్కొక్కరు కుట్టుల మెసవుచు పక్వంబులకు మెచ్చి యొకరికొక రందిచ్చుచు। బుడ్లకొలందిం ద్రావి మత్తిల్లి చొక్కుచు సోలుచు నేలలు బాడుచు। హాళిమృగాళిదూలించిన లీలలు వీరాలాపంబులు బలుకుచు కన్నుల కెంపు సొంపు పెంపు వహింప కొలదిగాని మదవిహ్వాలంబు బహుళంబుగ వెనకటి మత్సరంబుల పెచ్చుపెరిగి యిచ్చలదలంచి మించిన కొంచెపు వాక్యంబుల జగడించుచు మత్తిల్లిన చిత్తంబుల హత్తి కత్తులు దూసి పారవైచి వరలు గైకొని బవరంబునకుం గదియుచు। కవయు నెడ గడు ప్రోడలగువారు నెడనెడ నుడుపుచు కడకు దోయ నుడుగక కడువడి నడరు నడుగు లిడునెడ పూరిపుడకైన దాకిన నిల నలవిగాక నిల దెరలుచు తెరలి కడు నెట్టకేలకు లేవ నంకించి కొంకువడి లేచి చుట్టుకొ పుడమిం బడుచు హుంకరింపుచు గ్రుడ్లు వెలికుఱిమి పెదవులు గొఱుకుచు నివ్విధంబున నాసవపానవిలాస వికారసంచార సల్లాపంబుల దేలుచుండి రయ్యెడ **254**

అర్థాలు : విశసన= చంపుటయను, మసలిక= మాంద్యము, కేడించి= త్రోసివేసి, కొండి= ఇనుపగొండ్లెము, లగించుక= ఇమిడించి, ఒగిన్కదిసి= క్రమముగా సమీపించి, చామరంబులు= చమరీ మృగముల తోకలు, భంగించి= నిరసించి, చుల్కనజేసి, పదవులకున్ కదిసి= నివాసముల చెంతకు పోయి, పెనలు వేయు= జంతువులను ఒకదానితో నొకటి ముడి(లంకె) వేయు, బెండుపడి= నీరసించి, నీరువట్టిన= నీరు నిల్వజేసిన, మట్టిమీరిన= శుభ్రమైన, దర్వుల= నీటిదొరువుల, చొప్పు= జాడ, కొలంకుల దరుల= కొలనుల ఒడ్డున, చలందులు= చల్దియన్నము, ఖాదనంబులు= తినుబండారములు, కుట్టుల= ఒకజాతి పక్షులను, మెసవుచు= తినుచు, వరలు= కత్తులను పట్టియుంచు తొడుగులు, బవరంబునకు= యుద్ధమునకు, కవయునెడ= కలబడునప్పుడు, ప్రోడలగువారు= నిపుణత గల అనుభవశాలురు, అంకించి= ఉద్దేశించి, ప్రయత్నించి, కొంకువడ= జంకి, భయపడి, గ్రుడ్లు= కనుగ్రుడ్లు, వెలికి+ఉఱిమి= వెలుపలికి వచ్చునట్లు వెడల్పుగా తెఱచుచు, ఆసవపాన= సారాయి త్రాగుటయను

భావము : పై విధముగా ఉపాయములచే జంతువులను పక్షులను వధించి, వేటగాండ్రు తమ బిరుదములను చెప్పుకొనుచు ఏనుగులను, పెద్దపులులను, చమరీ మృగములను సమీపించి, వాని తోకలను సేకరించువారును సింగపు పిల్లలను పట్టుకొనువారును అయిన వేటగాండ్రు వానిని రాజునకు సమర్పించి మెప్పును పొందిరి.

వేటగాండ్రు బాగుగా జంతువులను కాల్చి తిని, నారికేళవృక్షముల నుండి స్రవించిన కల్లు త్రాగి, మత్తులో మైమఱచి అసూయతో బండొరులు పోట్లాడిరి. సురాపానమధికమగుటచే, తాకిన పడిపోవుచు, లేచుచు హుంకారములతో కన్నుల గ్రుడ్లు వెలికి వచ్చి కన్పట్టుచుండగా పెదవులను కొఱుకు కొనుచు వికృతములైన చేష్టలతో వేటగాండ్రు మెలగిరి.

క॥ **పెనుపంది యొకటి నృపమణి**
కనుగవ కద్భుతముగాగ గనుపట్టిన నే
యను గమకించిన నదియును
చనె నేటుకు లోనుగాక జవమున నెడగాన్ 255

భావము : రాజు కన్నులకొక పెద్దపంది అద్భుతమై కన్పించిన, దానిని వేటాడుటకు ప్రయత్నింపగా, అది ఏటును తప్పించుకొని ప్రక్కగా పరుగెత్తిపోయెను.

చ॥ **పెనుకొని రాజు వాజి చొరవేసిన వెంబడి మంత్రివర్యుడా**
యన చను జాడనశ్వము రయంబున బోవగ నిచ్చెనాక్రియన్
మును కిటివెంట భూపవరముఖ్యుడు వెంబడిమంత్రియైచనన్
మొనయుచు దాటుచుంజనుచు ముందర దోచుచుబోవబోవగాన్ 256

భావము : రాజు ఆ పందిని వదలక వెంటబడి గుఱ్ఱము నదలించి పోగా, వెనుకనే మంత్రియు సాగెను. ఇట్లు ముందు పంది, వెనుక రాజు, వెనుక మంత్రి, పందిని తఱుముచు పోయిరి.

క॥ **గిరిగహ్వరంబు చొచ్చిన**
నరపతి కిటి గానకచట నడయాడంగా
సరవి సచివోత్తముడు నట
కరుదెంచి నృపాలు జేరె నతిరభసమునన్ 257

భావము : ఆ పంది పరుగెత్తి, పరుగెత్తి, వారి కన్నుగప్పి ఒక కొండగుహలో దాగెను. వెనుక వచ్చిన రాజు పంది కనబడక, అక్కడే తచ్చాడుచుండగా, మంత్రి వేగముగా వచ్చి రాజును కలిసెను.

ఉ॥ **ఆయెడ నా నృపాలమణి యాయటవిం దమి యగ్గలించి లో**
బాయనిచో నమాత్యు డధిపా యని గాదు వినోద మింతటన్
నాయము తృప్తినొందుటకు నా యమునా ఘనతీర భూరుహ
చ్ఛాయల విశ్రమించి పురి ఛాయల బోదగు వేగ మియ్యడన్ 258

అర్థాలు : అగ్గలించి= కలచి, అనికాదు= (ఇది) యుద్ధముకాదు, నా= అనగా, భూరుహ= చెట్లయొక్క

భావము : అప్పుడు రాజు ఆ అడవిని కలయజూచి, పందికొఱకు అడవిలోనికి పోవలె ననుకొనగా, మంత్రి రాజుతో "రాజా! ఇది యుద్ధము కాదు, వినోదము మాత్రమే. కనుక శత్రువును వెంటనంటినట్లు ఈ పందిని వెంటబడించుట తగదు మన మింతట తృప్తిపడి యమునా తీరమున చెట్ల నీడలో కొంత విశ్రమించి మన నగరమునకు పోవుట మంచిది" అనెను.

చ॥ అన విని రాజుప్రాణప్రదమైన యమాత్యుని నీతి వాక్యముల్
మనమున బాదుకొల్పి యట మంజుల కుంజలతా వితాన కాం
చన ఘనసారసారపనసక్రముకామలకాది వృక్ష సం
జనిత నిరంధ్ర శీతల విశాల నదీతట సైకతంబులన్ 259

అర్థాలు : క్రముక= పోకచెట్టు, ఆమలక= ఉసిరిక చెట్టు, నీరంధ్ర= దట్టమైన

భావము : అనగా విని, రాజు తనకు ప్రాణమైన మంత్రి మాటను మన్నించి, అక్కడ నున్న వివిధ వృక్షములవలన కలిగిన చల్లని గాలికి సేదతీరగా యమునాతీరమున ఇసుక తిన్నెలపై,

ఉ॥ అల్లన చేరి నిల్చి శ్రమనార్చుచు నా యమునానదీలస
త్ఫుల్ల సరోజ షండముల డాగిన తెమ్మెర గ్రమ్మలించగా
చల్లని నీరు గ్రోలి యొకచందన భూరుహ మూల చంద్రకాం
తోల్లసితాచ్ఛవేది సచివోత్తముతో దగ విశ్రమించినన్ 260

భావము : మెల్లగా చేరి శ్రమను తొలగించుటకు అచ్చట నిలువగా ఆ యమునా నదిలో వికసించిన పద్మముల దాగిన గాలి వీచుటచే తేరుకొని చల్లని నీరు త్రాగి ఒక గంధపు చెట్టు మొదలున నున్న చంద్రకాంత శిలావేదికపై మంత్రితో విశ్రమించెను.

చ॥ అలసినవాడుగాన సచివాగ్రణి యించుక నిద్రనొందినన్
తెలుపుట గాదటంచు జగతీపతి జాగ్రతనున్న యంత మా
యలమునికాంత యౌవనవిహారము సల్పుచు పూలు గోయుచున్
మెలతలు దాను మచ్చికల మేలములాడుచు గ్రీడ సల్పుచున్ 261

అర్థాలు : మెలతలు= యువతులు, మేలములాడుచు= హాస్యములాడుచు,

భావము : అలసియుండుటవలన మంత్రి నిద్రించెను. మంత్రిని లేపుట తగదని రాజు తాను మేల్కొని యుండగా మునికన్య చంద్రరేఖ వనవిహారము చేయుచు, పూలుకోయుచు, చెలికత్తెలతో పరిహాసములాడుచు ఆ చోటికి వచ్చెను.

క॥ రాయంచ బోవ పెనకొని
రాయంచు వచించి రాణ రమణీయముతో
కాయజ సమ్మోహిని యన
గాయజు నైపుణ్యమంతగల కలకంఠిన్ 262

అర్థాలు : రాయంచ= రాజహంస, పెనకొని= వెంటపోయి, రాయంచు= రమ్మనుచు, రాణ (రమణ)= ప్రీతితో, కాయజసమ్మోహిని= మన్మథుని వలె మోహింపజేయునది.

భావము : రాజహంస యొకటి అటు రాగా "రా" అని ప్రీతితో రమణీయముగా నటించునట్టి మదనుని సమ్మోహన శక్తియా యని భ్రమింపచేయు ఆతని నైపుణ్యమంతయు కలిగిన రమణిని చూచెను.

వ॥ కనుగొను సమయంబున 263

భావము : ఆ సమయమందు

క॥ తొలకరిమెఱపుంబోలెను
తళుకున గనుపట్టి నీరదము భాతి గడున్

నలుపగు తమాలపుంజము
కలహంసము వెంట జొచ్చి కనుపడకున్నన్ 264

అర్థాలు : నీరదము= నల్లని వానకారుమబ్బు, భాతి= వలె, తమాలపుంజము= తమాల వృక్షముల గుంపు

భావము : తొలకరి మెఱపువలె తళుక్కున మెఱసి, మబ్బు వలె నల్లనైన తమాల వృక్షముల దెస రాజహంసను వెదకుచుపోవు మెలత కనబడక పోవుటచే,

వ॥ తనమనంబున 265

భావము : (రాజు) తన మదిలో

సీ॥ కలకంటినో కదా కలగను టేరీతి
యేయెడ కనుఱెప్ప మూయుటెరుగ
కనుమొరంగో కదా కనుమొరం గేరీతి
నంగసౌష్ఠవము గానంగనయ్యె
భ్రమజెందెనో కదా భ్రమజెందు టేరీతి
తలపున నింతుల తలపలేదు
వనలక్ష్మియో కదా వనలక్ష్మి యెటువలె
హంస వెన్కొని వచ్చునట్టు లయ్యె

తే॥ నహహ నిదియేమి యాశ్చర్యమనుచు నంత
తహతహను జెందు మఱిమఱి తమకమొందు
నబలబోయిన బొడగాంచవలయునంచు
ననిమిషత్వము నొందు తానాత్మ గుందు 266

భావము : ఆ రాజు తనలో ఇట్లు తర్కించెను - "కలగంటినా? కన్నులు మూయనే లేదే! ఇదేమైన మోసమా? అదెట్లు! ఆమె శరీరాంగముల

సౌందర్యమును స్పష్టముగ చూచితిని కదా! నేను భ్రమపడితినా? నా మనసులో స్త్రీ చింత లేనే లేదే, భ్రమ కల్గుటెట్లు! ఆమె ఈ వనదేవతయేమో! హంస వెనుకనే వచ్చిన వనిత వనదేవత యనుటెట్లు! ఔరా! ఇదేమి వింత"- ఇట్లని తహతహలాడుచు, మనసును నిలువరించి, ఆమె వెళ్లిన జాడ తెలిసికొన వలయునని ఱెప్పవాల్చని వాడై చూచుచు, కలత జెందెను.

శా॥ ఈ రీతిం గనుగొంచునుండ పొదనుం డెంతే రయం బొప్ప శృం
గారంబుల్ సమకూడెనో యనగ వీకన్ మేనికాంతిన్ తరుల్
సారంబైన పసిండిభూజములు గాంచెన్ ఝల్లనేరీతిగా
నారీరత్నము మ్రోల నిల్చి, కనె భూనాథున్ మనోహారునిన్ 267

భావము : ఇట్లు చూచు చుండగా పొదమాటునుండి అతివేగముగ ఆ యువతి శృంగార దేవతయో యనునట్లు రాగా, ఆమె మేని కాంతితో అక్కడి చెట్లు బంగారు చెట్లయినవి. గుండె ఝల్లమనునట్లు ఆరాజును మనోహరాకారుని చూచెను.

క॥ చూచినచూపు మరల్పగ
నా చిగురుంబోడి నేరకత్యద్భుతమై
నాచెలువం బా హొయలును
నా చక్కదనంబు సోయగాకృతి కాత్మన్ 268

భావము : అట్లు ఆ రాజును చంద్రరేఖ చూచి, చూపు మరల్పలేక, ఆతని సౌందర్యమునకు, ఆశోభకు, శరీర దృఢత్వమునకు ముగ్ధురాలై తనలో ఇట్లనుకొనెను.

సీ॥ శృంగారవనవాటి చెంగలింపగ మేటి
సన్మూర్తి గైకొన్న చైత్రు డొక్కొ
శశివసంతులతోన జగతిలో విరహుల
గారింప వచ్చిన కాంతు డొక్కొ

మారచంద్రవసంతమహితసౌందర్యంబు
నధిగమించిన యా జయంతు డొక్కొ
చైత్య జయంతుల చంద్రమారుల సాటి
ఆ నలకూబర యక్షుడొక్కొ

తే॥ కాక యిటువంటి శోభన కాంతి మోహ
నాంగవైఖరి సౌందర్య మరయ నరిది
చూడజూడంగ మతిమతి చోద్యమగుచు
గాన నయ్యెడు వీని శృంగార మహిమ 269

అర్థాలు : చెంగలింపగ= సంచరించుటకు, చైత్రుడొక్కా= వసంతుడేమో!, కారింప= బాధించుటకు, కాంతుడొక్కా= మన్మథుడా!, మార= మన్మథుని, అఱిది= అసాధారణము.

భావము : 'శృంగారము అను వనములో ఆనంద విహారము చేయుటకు వసంతుడు మూర్తీభవించినాడా! చంద్రుడు వసంతుడు అను మిత్రులతో లోకములోని విరహులను బాధపెట్టుటకు వచ్చిన మన్మథుడా! మన్మథ, చంద్ర, వసంతుల గొప్ప సౌందర్యములను మించిన జయంతుడా! వసంత జయంత చంద్రమదనులకు సాటియైన ఆ నలకూబరుర యక్షుడా ఏమి? కాకున్న ఈ సౌందర్యము, సమ్మోహనము అసాధారణము కదా! చూచిన కొలది వీని సింగారము ఆశ్చర్యకరమై చూడముచ్చట కలిగించుచున్నది.'

వ॥ అని వితర్కింపుచున్న యన్నవమోహనాంగి గనుంగొని 270

భావము : అని తలచుకొనుచు మోహింపచేయుచున్న శరీరము గల ఆ కోమలిని చూచి.

సీ॥ వనలక్ష్మి నిక్క మీవనితాలలామంబు
కాకున్నచో హస్త కమల యగునె
మదనుపట్టపురాణి మానినీ తిలకంబు
కాకున్న మోహనాక్రాంతయగునె

లలితవిద్యుల్లతా లలనాశిరోమణి
కాకున్న శంభత్ప్రకాశ యగునె
యతనుని సమ్మోహనాస్త్రంబు కోమలి
కాకున్న విభ్రమకారి యగునె

తే॥ గరుడగంధర్వసురకామినులను
కిన్నరోరగ రాక్షసకన్నియలను
కందుమెందైన నిటు వంటి సుందరాంగి
కనియు వినియును నెఱుగ లోకంబులందు 271

భావము : అంతలో ఆమెను జూచిన రాజు- "ఈమె వనలక్ష్మి కాబోలు, కాకున్న కమలముల వంటి హస్తములుండునా (హస్తమున కమలముండునా)! ఈమె రతీదేవి కాబోలు, కాకున్న ఇంతటి మోహన రూపముండునా! ఈమె మెఱుపుదీవెయై యుండును. లేదేని ఈ శరీరకాంతి యుండునా! మన్మథుని సమ్మోహనము అను పేరు గల అస్త్రమేమో! కానిచో విభ్రమమును కలిగించగలదా! గరుడ, గంధర్వ, కిన్నర, నాగ, రాక్షస కన్యలను నేను ఎంతమందిని చూచితిని. కాని ఇంతటి సుందరి లేనేలేదు. విననూ లేదు" అని ఆలోచింపసాగెను.

విశేషము : గరుడగంధర్వకిన్నరోరగరాక్షసలోకములన్నియును ఈ రాజు తిరిగియుండెనని భావించవలసి యున్నది. లేకున్నచో ఇది యొక ప్రబంధలక్షణమైన వర్ణనమాత్రమనిపించును.

ఈ పద్యమున రాజు మనోగతమును ముందటి సీస పద్యమున చంద్రరేఖ భావములును ఒకే విధమున నున్నవి. వీనిపై పూర్వప్రబంధ కవుల ప్రభావము కన్పడుచున్నది. అల్లసాని వారి "ఎక్కడివాడొ వీడు" అను పద్యము స్మరణకు వచ్చును.

క॥ అని యిట్లు వెరగునొందగ
ననవిలుతుడు నడుమ నిలిచి నారీనృప దృ

గ్ఘన శరముల నయ్యిరువుర
మొనయుచు సవ్యాపసవ్యముల కడు నేసెన్ 272

అర్థాలు : ననవిల్తుడు= మన్మథుడు, దృగ్ఘనశరముల= చూపులు అను గొప్ప బాణములను, సవ్య+అపసవ్యముల= కుడి, ఎడమ చేతులతో

భావము : అని ఇట్లాశ్చర్యపడుచు చంద్రరేఖయు, రాజు చంద్రకేతును అట్లుండగ కాముడు వీరిద్దఱి మధ్య నిలిచి, వారిద్దరి చూపులనే తన బాణములుగా చేసికొని తన రెండు చేతులతోను వారిద్దఱిని సమీపించి వానిని ప్రయోగించెను.

ఉ॥ ఏసిన యేటునన్ బ్రమసి యించుక డిల్లముపోయి గోడలన్
వ్రాసిన భర్మ పుత్త్రళుల వన్నియ చేష్టలు దక్కియున్నచో
నాసఖు లామనోహరి రయంబున జేరి నృపాలుగాంచి ప
ద్మాసుతు చేష్టగా దెలిసి మానిని నిట్లని పల్కి రయ్యెడన్ 273

అర్థాలు : భర్మపుత్త్రళులవన్నియ= బంగారు బొమ్మలవలె, పద్మాసుతు= మన్మథుని

భావము : అట్లు మన్మథుని బాణములకు కొంత దిగ్భ్రమజెంది, కదలక లేక యున్నప్పుడు, చంద్రరేఖను వెదకుచు ఆమె చెలికత్తెలు వచ్చి వారిద్దఱిని చూచి, అది మన్మథుని పనిగా గుర్తుంచి, చంద్రరేఖతో ఇట్లు అనిరి.

సీ॥ రాజహంసము బట్టరాక చింతించె దా
నీ నడకల వాంఛ నిలుచునమ్మ
చెలులు సందడిసేయ దలగు నంచెన్నెదో
చతురాస్య శిక్షానుసరణిసుమ్ము
తగవెంచి నను నేలదాయు నెట్లనియెదో
నీరు బాలేర్పడ నేర్చునమ్మ

నెనరెంచి వేగాన నెనయు టెట్లనియె దో
ఘనధర్మ పక్షినిన్ గదియునమ్మ

తే॥ యేల చింతింప నింతగానేల తలక
తనకు దామదిలో చింతదలగునమ్మ
నిను మఱింగినమానసి చనునె యెడసి
యబల యౌవనకేళికి నలరవమ్మ 274

అర్థాలు : తలగు= తొలగు, చతురాస్య= బ్రహ్మదేవుని, శిక్ష+అనుసరణి= శిక్షణన నుసరించి, రాయున్= చెంతకు వచ్చు, నెనరు= స్నేహము, ఎడసి= విడిచి, ధర్మపక్షి= సత్సంగము కోరినది.

భావము : ఇది ప్రశ్న- సమాధానము (సంవాద) రూపమున ఉన్నది. ఒక్క చెలులందఱు మాటాడిరనవచ్చు - "రాజహంసమును పట్టుదమన్న, చిక్కలేదని చింతయా నీకు? నీ నడకలు చూచినది కదా. ఆ హంస మరల నిన్ను చూడవచ్చును లెమ్ము - మా అఱపులకు తొలగిపోయినదను కొనుచున్నావా? బ్రహ్మదేవుని వాహనము కదా, ఆ శిక్షణ అట్లే యుండునులే, (బ్రహ్మవ్రాసిపెట్టినట్లే జరుగును కదా) దానిని తఱిమినారు కదా! ఆ తగవును మనసులో పెట్టుకొని భేదభావముచే అది చెంతకు ఏల వచ్చును అందువా? అది ఏది మంచిదో అది చేయును. హంసకు పాలు-నీరు వేఱు చేయు సామర్థ్యమున్నది లేవమ్మా. స్నేహభావము నిజముగ నున్నచో వెంటనే వచ్చునా అని ఏల నీ ఆలోచన? నిన్ను తాను విడువదు. ఇంతగా చింతించవలదు. నీకున్న చింత ఆ హంసకు ఉండకపోదు. నిన్ను చూచిన తర్వాత అది విడిచిపోదులే. వనకేళికి రావమ్మా."

విశేషము : ఈ పలకరింపు అటు చిక్కక పోయిన రాయంచకును, ఎదుటనున్న రాజు చంద్రకేతును అన్వయించును. నీ అందమునకు చిక్కినవాడు ఇంకెక్కడకు పోవును కాన ఆలసింపక ఆటలకు రమ్మని చెలుల భావము.

క॥ అని యక్కోమలి దోడ్కొని
చని యిష్టాలాపములను సరసోక్తులచే
నెనరొత్తి యెన్నిచెప్పిన
వనితామణి మనసు వేఱె వర్తింపగన్ 275

భావము : అని చెలులు ఆ చంద్రరేఖను తీసికొనిపోయి, ఆమె మనసును మరలించుటకు ప్రయత్నించి సరసములాడి, ప్రియములు పలికి, ఎన్ని చేసినను, ఆమె మనసు మఱొక విధముగ ఉండెను.

ఉ॥ ఆటలకేల రావె తరలాయతలోచన! యెన్ని చెప్పినా
మాటలు వీనులం జొరని మార్గమిదేమి సఖీజనంబు స
య్యాటలు దెల్పవేల ముఖమందు శ్రమాంబుకణంబు లల్లనన్
పాటలగంధి గోట కడబారగ జిమ్మ వదేమి తెల్పుమా 276

భావము : "ఆటలకు రావేమి చెలీ! మాగోడు మాదే గాని నీ చెవికెక్కదేమి? మాటకు మాట రెట్టించి పలుకవేమి? ముఖముపై నున్న చెమటను గోటితో తొలగించుటకు ఏల ప్రయత్నించుట లేదు?"

సీ॥ తంత్రులు శ్రుతిగూర్చి తానమానక్రియ
మెచ్చుగా వీణియ మీట వేల
పాణినితో శబ్దపాఠంబు వల్లించు
చిలుకల బిలువంగ పలుక వేల
ముద్దుమాటలతోన ముచ్చటలాడంగ
శారికపోతంబు జీర వేల
పాలు బోయుమటంచు పనివడి నిను జుట్టు
హరిణకపోతంబుల నరయ వేల

తే॥ నలరి నిచ్చలు నీతోన నాటలాడు
చెలులతో దేనె లొలుకంగ బలుక వేల

కలసి యెప్పటివలె బొత్తుకత్తియలను
ఆదరింపుచు లీల చెండ్లాడ వేల 277

అర్థాలు : శబ్దపాఠంబు= వ్యాకరణపాఠమును, శారికపోతంబు= గోరువంక పిల్లను, చీరవేల= పిలువవేల, హరిణకపోతంబుల= జింకపిల్లలను, పొత్తుకత్తియలను= చెలికత్తెలను, చెండ్లాడవేల= బంతియాటలాడవేల?

భావము : "తీగెలను శ్రుతిచేసి, తాన తాళములతో వీణ వాయించవేల? పాణినీయ పాఠములను వల్లెవేయు చిలుకలు పిల్చినను పలుకవేల? గోరువంక పిల్లలతో మాటాడవు, నీ చుట్టు తిరుగుచున్న జింకపిల్లలకు పాలు పట్టవు. ఎప్పుడూ నీతో హాయిగా ఆటలాడు చెలులతో మాట్లాడవు, కలిసి పూర్వము వలె ఏల బంతియాటలాడవు?" పాణిని మహర్షి సంస్కృత వ్యాకరణమును సూత్రబద్ధము చేసినవాడు.తానమానక్రియ-వీణ వాయించుటలో తాళము వేయు తీగలు వేఱుగా ఉండును. వానిని మ్రోగించుచు రాగమును 'అనంత' నామమున వివిధగతుల తన్నకారము ఊతగా పాడు విధము తానము. రాగము, తానము, పల్లవి, కీర్తన సంపూర్ణరాగాంగ గానము.

శ్రుతిగూర్చుట : ఆధారషడ్జము, పంచమము, తారషడ్జము ఒకటిగ కలిసి చెవికి భిన్నత్వము లేక వినబడునట్లు తీగలను బిగించుట.

శా॥ ఏలమ్మా మది చింత నీకొదువ నిట్లేలా లతా డోలలన్
బాలా యుయ్యల లూగగా వలదె శుంభ చ్చంద్రకాంతా స్థలిన్
బాళిన్ వెన్నెల కుప్పలాడ వలదే బాహు ప్రమోదోన్నతా
కేళీ లాస్యము చూడగా వలదె యాఖిన్నత్వ మేలే సఖీ 278

అర్థాలు : లతాడోలలన్= తీగెల ఉయ్యాలలో, వెన్నెలకుప్పలు= పిల్లలాడుకొను ఒక ఆట, బాళిన్= ఆసక్తితో, ఖిన్నత్వము= విచారము

భావము : "మనసులో నీకెందుకమ్మా చింత? పూదీవెల ఉయ్యాలలూగ వలెను. చంద్రకాంతలున్నచోట, వెన్నెల కుప్పలాడుకోవలెను. ఎన్నోవిధముల

నాట్యములాడవలెను. ఇదంతయు మన వయస్సునకు తగినది కదా! అన్నీవదలి నీ కెందుకీ విచారము?!"

క॥ అన వినియు వినని యట్టుల
మనుజాధిప గాఢ లగ్న మానస యగుచున్
కనగుడ్డిని విన చెవుడై
తను గానిం దాని వలెను తన మదిలోనన్ 279

భావము : అని పలుకుచున్న చెలికత్తెల మాటలను వినియును విననియట్లే, అది తనకు సంబంధించిన విషయము కానట్లే, ఆ చంద్రరేఖ చంద్రకేతు మహారాజుపై చెదరక నిల్చిన మనసు కలదయ్యెను.

ఉ॥ ఎంత యొయార మెంత సొగ సెంత సుఖోన్నతి యెంత మోహనం
బెంత కళావిశేష కరమెంత గభీరత యెంత సోయగం
బెంత పటుత్వ మెంత రుచి యెంత కుమారత యెంతముద్దు హే
మంత కుమారు మన్మథుని కింతిగ నేసతి నోచియున్నదో! 280

అర్థాలు : గభీరత= గాఢమైన (లోతైన భావము), కుమారత= సౌకుమార్యము

భావము : "ఈ రాజకుమారుని సొగసు, ఒయ్యారము, గాంభీర్యము, సోయగము, శరీర దృఢత్వము, సౌకుమార్యము, చూడ ముద్దుగ ఉన్నవి. బంగారు వన్నెగల మదనుని భర్తగ పొందుకు ఏ యువతి నోచినదో కదా!"

సీ॥ రాజాస్యుడైన యారాజునింకొకమారు
కన్నుల జూడంగ గల్గు నొక్కొ
కరుణాకటాక్ష వీక్షణుడైన నరనాథు
చూపులు నామేన సోకు నొక్కొ
మందహాసోల్లాస సుందరవదనుడౌ
నధిపు సమక్షములబ్బు నొక్కొ

మధురాధరుండైన మనుజవల్లభుపల్కు
వీనులు చల్లగావించు నొక్కొ

తే॥ ఎట్లు గనుగొందు కారుణ్య మెట్లు జెందు
నెట్లు సమ్ముఖమందు పల్కెట్లు విందు
కటకటా యిన్నిటికి సాధకంబు గాను
కలుగగా నెట్టు లెవ్వారు కలరు దిక్కు 281

భావము : "చంద్రబింబము వంటి ముఖము గల రాజును ఇంకొక మారు నేను చూడగల్గుదునా? వాని కరుణ నిండిన చూపులు నాపై వ్రాలునా? చిఱునవ్వు గలవాని సన్నిధి నాకు లభించునా? వాని తియ్యని పలుకులు వినగలనా? ఇవన్నియు సాధ్యమగునట్లు చేయగల వారెవ్వరు? నాకు అండగా నిల్చి తోడ్పడువారెవరు?"

ఉ॥ ఎక్కడ నుండి వచ్చెనొ సురేంద్ర కుమార కుమార మారులన్
చెక్కిలిగొట్టి పుట్టి నివసించు విలాసరసప్రపూర్ణుడౌ
చక్కదనంబు జవ్వనము చందము సోయగ మింపు సొంపులున్
నిక్కము బోల నేర్తురె ఫణిక్రతుభుఙ్నరవర్యులెవ్వరున్ 282

అర్థాలు : సురేంద్రకుమార= దేవేంద్రుని కుమారుడైన జయంతుడు, కుమార= కుమారస్వామి, మారులన్= మన్మథులను, చెక్కిలిగొట్టి= చెంపదెబ్బగొట్టి (మించు) ఫణి= శేషుడు, క్రతుభుక్= అగ్ని

భావము : ఈ రాజకుమారుడు డెక్కడివాడో! జయంతుడు, కుమారస్వామి, మన్మథుడు వీని చక్కదనము ముందు దిగదుడుపే సుమా! ఈ రాజకుమారుని అందము వారి కంటే మించినది. ఆదిశేషుడైనను, అగ్నియైనను ఇతనికి తేజస్సున సరిరారు కదా! 'తలదన్ని' అను ప్రయోగమునకు సమానార్థకమైన గౌరవసూచకమైన పదబంధము

'చెక్కిలిగొట్టి'. కుమారస్వామి, అగ్ని, ఆదిశేషుల ప్రసక్తియున్నం దున కవి తన భావమును మృదువుగా చిత్రించెననవచ్చును.

ఉ॥ కన్నులతేట నెమ్మొగము కాంతి నిరూఢి లలాట రేఖ సం
పన్నత ఱొమ్ము మందమును బాహుల దీర్ఘత కౌను సన్నమున్
తిన్నని మేనిచాయ కటినిండు తనంబును యూరులందమున్
కన్నులగట్టి నట్టుమది గానగ నయ్యెడు నేమి సేయుదున్ 283

అర్థాలు : నిరూఢి= నిశ్చయము, లలాటరేఖ= నుదుటికాంతి, ఊరుల= తొడల

భావము : "ఆ రాజు కన్నులలోని తేటతనము, ముఖకాంతి, నిశ్చయమును తెల్పునుదురు, విశాలమైన దృఢమైన వక్షము, పొడవైన బాహువులు, నిండైన నడుము, దేహపురంగు, తొడల అందము, అన్నియు నాకు కన్నులకు కట్టినట్లు స్పష్టముగ కన్పడుచున్నది. మనస్సు మరలకున్నది కదా, ఏమి చేయుదురు?"

ఆ॥ ఏడనుండి వచ్చెనీ రాజ హంసంబు
దాని వెంట నేల తవిలి పోతి
నమ్మహాత్ముడేల యరుదెంచె నచటికి
వచ్చి యచట నుండ వలయుటేల 284

భావము : "ఈ హంస ఎక్కడ నుండి వచ్చినదో! వచ్చినది సరే, నేనెందుకు దానిని ఆశించి వెంటబడి పోనేల? పోయినను, ఆరాజు అక్కడికెందుకు రానేల? వచ్చినను, నా కంటబడునట్లు అక్కడ ఏల ఉండెనో?"

ఉ॥ కారణమేమియో తెలియ గాదని తా దనివోని కాంక్ష ని
ట్టూరుపు నించు నుస్సురను నూరక వేచు నలంత నొందు నె
వ్వారిని జీర కొంటి జను వచ్చిన మార్గమె జూచు బిల్చినన్
సారెకు వేసటం బలుకు జవ్వని వేదన నొవ్వనొందుచున్ 285

అర్థాలు : వేచు= ఎదురుచూచు, అలంత= అలసట, చీరక= పిలువక, వేసటంబలుకు= అలసియున్నట్లు మాట్లాడు, సారెకు= మాటికి

భావము : ఆ చంద్రరేఖ బాధకలుగునంతగా వేదనపడును. నిట్టూర్పులు, ఊరకనే ఎదురుచూపులు, ఎవరిని గాని తోడుగ రమ్మనక ఒంటిగ ఎక్కడికో వెళ్ళును. వెనుకక తిరిగి ఎవరికోసమో యన్నట్లు చూచును. పిలువగా పిలువగా మాటిమాటికి అలసిపోయినట్లు ఇట్లు సమాధానము ఇచ్చును. ఆ జవ్వని విరహవేదన బాధను తీవ్రముగా పొందెను.

శా॥ ఈ రీతిన్ వెతనొందు తొయ్యలిని దా మీక్షించివే జల్లబో
రారే యీసుకుమార వారిజముఖీరత్నంబు యత్నంబు నె
వ్వారుం గావగ లేరు మారతనుజ వ్యాపార భారావహం
బెరీతిన్నిజ మింతయున్ సఖులు లేరే శాంతి గావింపరే 286

అర్థాలు : తాముఈక్షించి= తాముచూచి, వేచల్లపోరారే= వేగముగా చల్లదనమును కల్గించుటకు ఎవరును రారే, మారుఅతనుజభారఆవహంబు= శరీరము లేని మదన తాపభారము మోయు (కోమలిని)

భావము : ఈ విధముగా వేదన చెందుచున్న చంద్రరేఖను చూచి ఆమెను చల్లచేయుటకు ఎవ్వరును రారేల? శరీరము లేని మదన తాపభారము నుండి, ఆ కోమలమైన కమలముల వంటి ముఖము కల కోమలిని ప్రయత్నముతో ఎవ్వరైనను కావగలేరా! ఇదంతయు నిజము. శాంతింపచేయు చెలికత్తెలు లేరు. ఆశ్చర్యము(అని ఆలోచించిరి).

వ॥ అనిన నచ్చేడియలకు ప్రౌఢ యిట్లనియె 287

భావము : అనిన ఆ చెలికత్తెలకు ఒక నడిమి వయసు కల వనిత యిట్లు వచించెను

మ॥ ననబోడు ల్వినరమ్మ వేగమున నీ నారీ శిరోరత్నమున్
గొనిరం డొయ్యన చైత్రమాస విలసత్కుంజ ప్రసూన ప్రవా

ళనితాంతోజ్జ్వల శారికాశుకపికోల్లాసంబునై యొప్పు నీ
వనకేళిం దగ పొద్దు పుత్తము లసద్వ్యాపార పారీణతన్ 288

అర్థాలు : ననపోతులు= పూవుల వంటి కోమలములైన, విలసత్కుంజప్రసూన ప్రవాళనితాంతఉజ్జ్వల= వికాసముతో నుండు పొదల యందు, పూలు, చిగుళ్లతో ప్రకాశించు చోట్లలో, లసత్వ్యాపారపారీణతన్= గొప్ప నేర్పరితనము గల ఆటలతో

భావము : "ఓ కాంతలారా వినండి. తర్వగా ఈ గొప్ప కన్యను తీసికొని రండి. వసంతకాలమందు వికసించిన పొదల యందు గల పూలు, చిగుళ్లు ప్రకాశించుచుండగా గోరువంకలు, చిలుకలు కోయిలలు ఉల్లాసముతో తిరుగుచున్నవి. ఈ వనములో నేర్పుతో మాట్లాడుకొనుచు ఆట్లాడుకొనుచు విహరింతుము

క॥ **అని యమ్మానిని దోడ్కొని**
చని పుష్పోపచయమునకు సమకొల్పి వనిన్
ఘనసార పుష్ప పల్లవ
ఘన మకరందాంబుజాత కళికోన్నతముల్ 289

అర్థాలు : మానిని= మానవతియైన వనిత, పుష్ప+ఉపచయము= పూల మొక్కలకు ఉపచర్యలు చేయుట, సమకొల్పి= సిద్ధము చేసి, ఘనసార= కర్పూరపు అరటిచెట్లు,

భావము : అట్లు చంద్రరేఖను తీసికొని పోయి పూల చెట్లకు చేయతగిన ఉపచర్యలు చేయుటకు ప్రోత్సహించి, వనమందు గల కర్పూరపు అరటిచెట్లు పూలు, చిగుళ్లు, అతిశయించిన తేనె బిందువులు వెల్వడు పెద్దవైన మొగ్గలను

ఉ॥ **చూపుచు మల్లికావకుళ సూనమరంద మదాళిజాలముల్**
జోపుచు కీరశారికలసూక్తులు వీనులు సోక జేరినన్
దాపుచు మావి మోకనును దట్టపు నీడల చల్ల గాలికిన్
బూపుచు సంచరించుటకు బూనిన మానినికిన్ విరోధముల్ 290

అర్థాలు : చోపుచు= తోలుకొనచు, దాపుచు= సమీపించుచు, పూపుచు= ప్రయత్నించుచు

భావము : అన్నిటిని చూపుచు, పూలపై గల తుమ్మెదలు మూగిన వానిని తోలుచు, చిలుక, గోరువంక, కోయిల పాటలు వినుటకు చెంతకు పోవుచు మామిడి మొక్కల నీడలలో చల్లగాలికి విశ్రమించుచు, విహరించుటకు ప్రయత్నించుచు ఆ చర్యలను చేయగా అన్నియును ఆచంద్రరేఖకు ప్రతికూలము అయినవి.

సీ॥ **మల్లెపువ్వులు హస్త పల్లవ పుటినిడ**
కడుపొక్కెనని వేగకడను చల్లు
తలిరాకు పత్తి మెత్తన చూడ నిచ్చిన
క్రొవ్వాడులని తలకుచును వైచు
మాధుర్యమెంత యీ మకరందమని యిడ
నుడుకంచు బెగ్గిలి విడిచి వేయు
కలువ గొజ్జగి నీరు చిలికిన నెమ్మేను
కందెననుచును నాగ్రహము సేయు

తే॥ **చల్లగాలి నెదుర్కొన తల్లడిల్లు**
పికశుకాళి రవంబుల బెగ్గడిల్లు
ఇందుకాంతోపలస్థలి నేవగించు
మదనశర ఖిన్నహృదయయై పదరు లాడు 291

అర్థాలు : కడను చల్లు= దూరముగ పారవేయును, తలిరాగు= చిగురాకు, పత్తి= పత్త్రి, క్రొవ్వాడులని= అప్పుడే పదునుపెట్టిన కత్తులని, తలకుచును= తప్పుకొనుచు, భయపడి, వైచు= పారవేయును, ఉడుకు+అంచు= వేడియనుచు, బెగ్గిలి= భయపడి, కందెను= వాడిపోయెను, ఎఱ్ఱబడెను, ఏవగించు= అసహ్యించుకొను, పదరులాడు= తత్తఱపడును.

భావము : మల్లెపూలు ఆమె దోసిటపోయగా, అమ్మో! చెయ్యి పొక్కి పోయెనని ప్రక్కన విసరివేయును. చివురాకు మెత్తదనమును చూడుమని చేతికిచ్చిన, అమ్మో! కోసుకుపోవును చేయి,పదునుగా ఉన్నవే! అని భయముతో పారవేయును. ఎంత తియ్యదనమో చూడుమని పూదేనెపెట్టగా, అమ్మో! వేడిగా ఉన్నదని విడుచును. ఆమెపై పన్నీరు చల్లగా, శరీరము కమిలి ఎఱ్ఱబడినదని కోపగించును. చల్లగాలి తియ్యని కోయిలల చిలుకల కూతలకు భయపడును. చంద్రకాంత శిలావేదికలను ఆశ్రయింపదు. మదనతాపమున చెదరిన ఎదతో ఏమేమో వెఱ్ఱిమాటలను చెప్పును.

వ॥ ఇట్లున్న యంగనం గనుంగొని **292**

భావము : ఇట్లు ఉన్న ఆ చెలిని చూచి

తే॥ కటకటా యెన్ని యుపచారకములు చేయ
నన్నియును విరోధములెకాని యానుకూల్య
మగుట లేదాయె నింక నేమమ్మ యనిన
పలికె నొకప్రోడ యాకొమ్మ భావమరసి **293**

భావము : "అయ్యో! ఎన్ని ఔపరిచారిక క్రియలు చేసినను, అనుకూలము కాకపోయెనే! అన్నియు విరోధములాయెనే! ఇప్పుడేమి చేయవలెనమ్మా" అని చంద్రరేఖ చెలులు విచారములో నుండ ఒక నిపుణురాలు ఇట్లనెను.

చ॥ జగములు మూడు కెంజిగురు చాయ నవారిగ గెల్చి శూలికిన్
పగబడి కంటిమంటలను భస్మమునయ్యును మానడయ్యెనే
చిగురుకటారి వీరుడు ప్రసిద్ధుడు మానిని జోపు వాడు నే
డగు నిజమట్లు కొత్త శివమక్కట యూరక పోవనేర్చునే **294**

అర్థాలు : శూలికిన్= శివునితో, పగబడి= శత్రువై, కంటిమంటలను= (శివుని) జ్ఞాననేత్రాగ్నిలో, చిగురుకటారివీరుడు= కాముడు, కొత్తశివము= కొత్త ఆవేశము.

భావము : "పూలబాణాలతో మూడులోకములను గెల్చి, శివునికి శత్రువైవాని కంటిమంటలో కాలి బూడిదయైనను, ఈ అనంగుడు యువతులను బాధించుట మానలేదు. నిజమిదే. ఈ చంద్రరేఖను మదనుడు ఊపుచున్నాడు కాన ఆమెకు పూర్వానుభవములేని క్రొత్త ఆవేశమిది. ఇది ఏమిచేసినను తొలగదు."

వ॥ అని చేతోజాతుని ప్రీతిగా జాతర చేయ దలంచి **295**

వచనము : అని మదనపూజకై ఏర్పాటు చేయుటకు నిర్ణయించి

సీ॥ పూచిన మల్లెలపొద తదాలయముగా
మఱి మ్రోల లేమావి మంటపముగ
కావించి గొజ్జగి తావినీరము చల్లి
చిగురు తోరణములు తగనమర్చి
కలువరేకుల మేలికట్టుల సవరించి
వరలు పుప్పొడి రంగవల్లి దీర్చి
చిగురు విల్తుని కత్తి మొగిలి రేకందుంచి
యతను దేవతనందు నావహించి

తే॥ అలరు పూజల మధుపుపాహారములుగ
కోకిలారావములు కంచుకొమ్ములుగను
తరుదళానిలరావంబు తప్పెటలుగ
చిగురువిలుకాని జాతర చేసి రెలమి **296**

అర్థాలు : అతనుదేవత= శరీరములేని ఆ దేవుని, ఆవహించి= ఆహ్వానించి, జాతర= ఉత్సవము, మేలుకట్లు= మెట్లు.

భావము : మల్లెపొదను ఆలయముగను, లేతమామిడి చెట్టును మండపముగను, పన్నీరు శుభ్రపఱిచి, చివురాకు తోరణములను కట్టి,

కలువరేకులను మెట్లుగా అమర్చి, పుప్పొడితో ముగ్గులు పెట్టి, మొగిలి పువ్వురేకును మారుని కత్తిగా పెట్టి, అనంగదేవతను అందురమ్మని ఆహ్వానించి, పూజించి, మధువును నైవేద్యముగా అర్పించి కోయిల పాటలే బూరాలుగా, చెట్ల ఆకుల సవ్వడులే తప్పెటలుగా వారు మదనోత్సవమును నిర్వహించిరి.

క॥ ఈరీతి కొలిచి సన్నిధి
చేరి తదాత్మానుకూల సిద్ధికి నెంతో
కూరిమి నవ్వోఢం గని
మారుని మది నుద్వహించి మఱి యిట్లనియెన్ 297

అర్థాలు : తత్ఆత్మానుకూలసిద్ధికి= చంద్రరేఖ మనస్సునకు అనుకూల పరిస్థితులు కలుగుగాక యని, ఆ+వోఢన్= ఆ(తాపభారమును) మోయుచున్న చంద్రరేఖను, ఉద్వహించి= భావించి.

భావము : ఇట్లు కాముని పూజించి ఆ చంద్రరేఖ కోరిక తీరుటకు ఎంతో ప్రేమతో, చెలికత్తెలు ఆమెను చూచి, మదనుని మనసులో నిలిపి ఇట్లని ప్రార్థించిరి.

సీ॥ ఈకంబు కంఠి రక్షింపవే సుమధన్వి!
కపట జయసూచక ప్రకట గనుక
ఈమచ్చెకంటి మన్నింపు మహావీర!
భాసుర బిరుదాంక బాల గనుక
ఈ కిసలయపాణి చేకొమ్ము రణశూర!
సేవికానియత కాంక్షేయ గనుక
ఈ లసత్ భ్రూయుగ పాలింపు రతిరాజ!
తారుణ్యకార్ముకధారి గనుక
తే॥ వినుము భవదీయ పరికర వితతి దాల్చి
సేవక క్రియ ననిశంబు చేరి కొల్చు

వంచనము లేని పడతిపై వైరమేల
బాల దయజూడు మయ్యయో భావజన్మ! 298

అర్థాలు : కంబుకంఠి= శంఖము వంటి మెడగలది, సుమధ్వని= పుష్పబాణుడైన మదనుడా!, కపటజయసూచకప్రకట= కపటము తెలియని బాల, మచ్చెకంటి= చేపలవంటి సొగకన్నులు కలది, బిరుదాంక= బిరుదైన (చేప) గుర్తు కలది, సేవికా+నియతకాంక్షేయ= సేవికుల సౌభాగ్యము, లసత్భ్రూయుగ= ప్రకాశించు కనుబొమలు కలదానిని, తారుణ్యకార్ముకధారి= యౌవనమను ధనుస్సును ధరించినది, పరికరవితతి= సాధనముల, అనిశంబు= ఎల్లవేళలా, భావజన్మ= మనసులో పుట్టినవాడా!

భావము : "పూల విల్లు కలవాడా! ఈమె శంఖము వంటి మెడ గలది. తన మెడచే నీ వంచనకు వశమైనట్లు ప్రకటించుచున్నది, రక్షింపుమా! (మెడ మదనుని విజయశంఖము) మహావీరుడా! ఈమె మీనముల వంటి కన్నులు కలది. ఆ కన్నులు నీచేపలు గల పతాకములే కదా! "మీనకేతుడ!" ప్రకాశించు బిరుదమును కలవాడా! ఆమెను క్షమింపుమా. యుద్ధములో శూరుడా! ఈమె చిగురుటాకుల వంటి అరచేతులు కలది. నీ సేవకురాండ్ర సౌభాగ్యము కోరునట్టిది నీకు సేవకురాలుగా గ్రహింపుమా! (కాముడు వసంతకాలమందు చిగుళ్లను తన హస్తములుగా ధరించువాడు.) ఓ రతీపతీ! ఈమె విలాసవంతములైన కనుబొమల జంట కలది. యౌవనమనెడి వింటిని ధరించినది. నీ విండ్లే ఆమె కనుబొమలు. (ఆమె కనుబొమల వలె ఆతని విల్లు వంపు కలదై యున్నది.) ఆదరింపుమా! ఈమె నీ పరికరములను ఎల్లను (శంఖము, మీనకేతనము, చెట్లచిగుళ్లు, పూలవిండ్లు) ఆమె తనయందు, ధరించి, సేవకురాలై నిన్ను ఆశ్రయించి, ఎల్లప్పుడు పూజ చేయును. కనుక, కపటము తెలియని పడతిపై నీకు పగయేమి? లేత వయసు గల లేమ! ఓ అయ్యా దయతో కరుణింపుమా! నీ ధాటికి తట్టుకొని నిన్నెదిరించునట్టిది కాదు సుమా!"

తే॥ ఆ మరునివెత శాంతిలేకబ్జవదన
పరితపించుచు చింత చేడ్పాటు నొంది
ఉస్సురుస్సురటంచు నిట్టూర్పు నించి
తలకుమది విరహార్తయై తాల్మి డించి 299

అర్థాలు : చేడ్పాటునొంది= కష్టములలో పడి, తాల్మి= ఓర్పు

భావము : ''మదనవేదనలో ఈమె మనశ్శాంతి లేక వేదన చెందుచు బాధలతో ఓర్పుచెడి ప్రియవిరహముతో ఉస్సుఉస్సురనుచు నిట్టూర్చుచున్నది.''

క॥ సిబ్బితి మునుంగనంతన్
గొబ్బున కడగొట్టి గోల కొలకుల కన్నీ
రబ్బాల చిమ్ముకొంచును
నిబ్బరముగ జూడ చెలులు నివ్వెఱ తోడన్ 300

అర్థాలు : సిబ్బితి= సిగ్గు, గొబ్బున= వెంటనే, కడగొట్టి= ప్రక్కకు నెట్టివేసి, కోల= ముద్ధ(బాలిక), కొలకుల= కనుల చివఱల, నివ్వెఱ= నిండు భయముతో

భావము : సిగ్గులో మునిగిపోకు, సిగ్గును నెట్టివేసి, కన్నీరు కొనగోళ్లలో చిమ్ముచు, నిశ్చలముగా చూచుచున్న చంద్రరేఖను చూచి ఆమె చెలులు మిక్కిలి భయముతో,

ఉ॥ స్వట్పరిపోషణోద్విలయ శాలుర ధైర్యము సర్వదేవతా
రాట్పతి హస్త ధైర్యమును రాగముఖాఖిల దోషసంఘసం
తృట్పటు మౌని ధీరత మథించు రమాతను జేక్షుకృద్ధనున్
షట్పద శింజినీ కుసుమసాయకు పంక్తుల కింతు లోర్తురే 301

అర్థాలు : స్వట్(స్వల్)+పరిపోషణ+ఉద్+విలయశాలుర= సృష్టి, స్థితి, లయములు చేయు శక్తిగల బ్రహ్మవిష్ణురుద్రుల (ధైర్యము), సర్వదేవతా

రాట్పతి= దేవేంద్రుని, హస్త= చేయూత, రాగముఖ+అఖిల దోష సంఘసంతృట్+పటు= రాగము మొదలైన సమస్త దోషములను త్రుంచివేయగల శక్తిమంతులైన, మథించు= కలచివేయు, రమాతనుజ+ ఇక్షుకృత్+ధనున్= లక్ష్మీదేవి కుమారుడైనట్టియు, చెఱకు విలుకాడైనట్టియు, షట్+పదశింజినీకుసుమ సాయకుపంక్తులకు= తుమ్మెదల అల్లెత్రాడును, పువ్వుల అమ్ముల వరుసలను కలిగిన మదనుని దెబ్బలకు, ఇంతులు= అబలలు, ఓర్తురే= ఓర్చుకొనగలరా!

భావము : ''త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణురుద్రుల ధైర్యమును, వజ్రాయుధ హస్తుడు ఇంద్రుని ధైర్యమును రాగద్వేషములాది దోషములను అధిగమించ గల మునుల దృఢత్వమును కలచివేయు మదనుని చెఱకువింటి నుండి వెలువడు ఆయుధముల ధాటికి బలహీనలైన కోమల కాంతలు ఓర్చుకొనగలరా!''

''రాగముఖాఖిల........మౌనిధీరత'' యనుటలో విశ్వామిత్రుడు మొదలగు మహర్షుల గాథలు సూచితములు.

'దేవతారాట్పతిహస్తధైర్యము' అనుటలో దేవేంద్రుడు సాధారణముగ మునుల తపోవిచ్ఛిత్తికై రంభాదులను ప్రయోగించును. అట్టి ఇంద్రుడు కూడ మౌనము వహించినను, మన్మథుడూరకుండడు- అని భావము.

ఉ॥ వేలుప వంచు నిన్ను పదివేయి విధంబుల పూజ చేసి యే
లీలల వేడుకొన్న మది లేశమునుం దయపుట్టదక్కటా
హాళిని పాంథ హింసను కృతార్థతగా మదినెంచి తెంతయున్
బాలి శకుండు నీగుణము మానునె యెన్నిట నైన మన్మథా! 302

అర్థాలు : వేలుపువు+అంచు= దేవతవు అనుచు, హాళిని= విలాసముగ, ప్రొద్దుపుచ్చుటకు, పాంథహింసను= బాటసారులను బాధించుట, మా (బాలిశు)= మూర్ఖునికి

భావము : "ఓ మన్మథా! దేవతవని నిన్ను పదివేల(అనేక) విధముల పూజించి, ఎంత వేడుకొన్నను, నీ మనసులో జాలి కలుగదు. ఔరా! కాలక్షేపమునకు బాటసారులను బాధించుటే నీ జన్మకు ధన్యతగా ఎంచి మూర్ఖునికుండు ఎంత చేసినను ఆ గుణము మాసిపోవునా?" విరహిణీ నాయిక మన్మథుని నిందించుట కూడ ప్రబంధ కవితా పితామహుడైన అల్లసాని వారి 'స్వారోచిషమనుసంభవ' మను ప్రబంధము నుండి సంప్రదాయమైనది.

చ॥ ఫణిధరు నంబకంబులను బాయు నుపాయము మాని మానినీ
మణుల జయింపనెంచు పలుమాయల మాయెలనాగ రాగ దా
రుణ మిదిమాను మానుటకు రోయవు రో యన నీతి వీడు నీ
గుణరవమార, మార! విరిగోలల గోలల నేయ నాయమా! 303

అర్థాలు : ఫణిధరు+అంబకంబులను= పాములను సొమ్ములుగా ధరించు శివుని కన్నులను, పాయు= తప్పించుకొను, ఎలనాగ= యువతి, రాగ= అనురాగవతిని, మానుపనె= మానుటకు, రోయవు= వెదకవు, రో= అపనింద, గుణరవము+ఆర= ధనుష్టంకారము(అనగా, బాణములు వేయుట) మాసిపోను! విరికోలల= పూలబాణములతో, గోలలన్= అమాయకపు యువతులను.

భావము : "ఓ మారుడా! (బాధించువాడా!) ఆ విషసర్పములను ధరించు శివుని బాణప్రయోగముల నుండి కలుగు అపాయమును తప్పించుకొను ఉపాయమును, ఆలోచించుట వదలిపెట్టి గొప్పవారైన యువతులను వశము చేసికొనుటకై ఆలోచించు పెక్కు వంచనలను, మానుము. మా యౌవనవతి, అనురాగము కలది. నీప్రయత్నము క్రూరమైనది. మానుటకై ప్రయత్నింపవు. నీవు చేయుపని రోత అగుటచే ధర్మమును వీడు నీ అల్లెత్రాడు రవము నశించుగాక (మూర్ఖగుణము) పూల బాణాలను బాలపై వేయుట న్యాయమా!"

విశేషము : ముందెప్పుడో మన్మథుడు శరీరములేని 'అతను'డైనాడు. దానినిప్పుడు మాన్పుటెట్లు? ఈ ప్రసంగమప్రస్తుతము కాదా? యనిపించును. కాని, శివజ్ఞాన సంపన్నులై మన్మథుని అశరీరునిగ జేయుచున్న మహాత్ములెందఱో నేటివఱకు కలుగుచునే యున్నారు. ఈనాటి శ్రీరామకృష్ణ పరమహంసయే అట్టివారికి ఉదాహరణ మనవచ్చును. వీరిని జయించు ఉపాయము ఇచట ప్రసక్తమని భావింపదగును. శివుని మూడవకన్ను జ్ఞాననేత్రము కనుక అట్టి జ్ఞానమును సాధించినవారు శివస్వరూపులే. 'గుణ' మనగా వింటి నారియని అర్థము. ఇక్కడ అన్వయము. కాని పై పద్యమున 'బాలిశగుణము' అనుటలో "మూర్ఖత" అను అర్థము కలదు. ఇట్లు రెండు పద్యముల సమన్వయములో ఇచ్చటి 'గుణరవము'నకు మూర్ఖతయొక్క సందడిగా మదనుని వింటి నారియొక్క శబ్దమావిష్కృతమై ధ్వనించుచున్నది.

ఉ॥ మాయెలనాగనెంతయును మార్కొని వారిజబాణ నైపుణిన్
మాయలనాగ చూచెద విమర్శన సేయవు లెస్సగాను కా
మాయెలనాగ మానవతి మానవు భీతిల వేల దెల్ప నీ
మాయెల నాగకంతునకు భక్తయు నీ బ్రతుకంత నేమగున్ 304

అర్థాలు : (ప్రథమపాదము) మా నాగ= మా సుకుమారి, **(ద్వితీయ పాదము)** మాయలన్ ఆగ= వంచనలచే అణచుటకు, **(ద్వితీయ, తృతీయపాదములు)** కామాఎలనాగ= ఓ కాముడా, లేత వయసు గల నాగుపాము.**(చతుర్థపాదము)** నీ మాయల= నీ మందబుద్ధి చేయు చెడ్డపనులను, నాగకంతునకు= పాములను మెడయందు ధరించు శివునకు

భావము : "మా యౌవనవతిపై పూర్తిగా దాడిచేసి నీ పద్మబాణాల నైపుణ్యముతో మోసము చేయుటకు అవకాశమును వెదకుచున్నావు. ఇది మంచిదా? ఏల సరియైన ఆలోచన చేయవు? ఓ కాముడా! ఆ లేత వయసు గల నాగుపాము అభిమానము కలది. నీవు గౌరవించుటకు యోగ్యురాలు. నీపై పగతో నిన్ను

నాశము చేయును. ఆమెను బాధించుటకు నీవు మానుట లేదు. నీవు భయపడుటలేదు. నీ మంద బుద్ధితో చేయు చెడ్డపనులను తెల్పవలెనా? నీ శరీరమును కాల్చిన ముక్కంటి భక్తురాలు ఇప్పుడు నీవు శరీరము లేకపోయినను ఆకాశమున జీవముతో ఉన్నావు. ఆ జీవమును కూడా మారిపోవును. కనుక నీ బ్రతుకు ఏమగునో యోచించుమా? ఇది నీకు హెచ్చరిక సుమా.''

విశేషము : ఈ పద్యమందు శబ్దములలోని అక్షరములను వేఱుచేయుటచే, మఱియును అర్థశ్లేషము, అద్భుతముగా అమరి ఆస్వాదనీయమై ఉన్నది.

చ. చిలకలు గానపాలు శరవృద్ధియు మాలల పాలు నీదుమూ
కలు పలుచెట్ల పాలు సురగాలియు పాలు ధ్వజంబు మేనునుం
చెలువము వహ్నిపాలుగ వసించియు పాండురసాల భూతమై
చలమున నొంచ జొచ్చితివి చచ్చియు చావవిదేమి మన్మథా! 305

అర్థాలు : కాన= చెఱ, (పంజరపు బ్రతుకు), మూకలు= సైన్యము, సురగాలి= సుడిగాలి, వహ్ని= అగ్ని, పాండురసాలభూతమై= ఎండిన చెట్టున వసించు భూతమై, చలమున= చంచలమతివై

భావము : ''నీ వాహనమైన చిలుకలు పంజరముల పాలైనవి. నీ బాణములైన పూలు దండలలో బంధింపబడినవి. నీ సైన్యమైన వసంతపరివారము చెట్లు గుట్టలను ఆశ్రయించినవి. నీ పతాకము సుడిగాలి పాలైనది. నీ శరీరము, అందము అగ్గిలో కాలి బూడిదైనది. ఇంకను నీవు వృక్షమందు పిశాచమువలె చలించు మనసు కలవాడై అబలలపై నీ ప్రతాపమును చూపుచుంటివి. నీవు శివుని కంటి మంటలో చచ్చినావు. ఐనను బ్రతికియే ఉన్నావే!''

విశేషము : మన్మథప్రేరకములైన వాని సహజవర్ణనయే యిది.

తే॥ అనుచు మారుని గడుదూఱి యబల జేరి
యురులు కన్నీరు పయ్యెద నొత్తియెత్తి

యక్కునను జేర్చి వెఱవకో యబ్జపాణి
నీ మనోహరు గూర్తునా నేర్పు చూడు 306

అర్థాలు : దూఱి= నిందించి, ఉరులు= పొంగివచ్చు, అక్కున= ఒడిలో

భావము : ఇట్లు మన్మథుని చాలాసేపు నిందించి, చంద్రరేఖను సమీపించి, పొంగివచ్చుచున్న ఆమె కన్నీటిని పైటకొంగుతో తుడిచి, ఒడిలో కూర్చుండచేసి, ''భయపడకు తల్లీ! నీవు కోరిన నీ మనసు దోచిన ఆ రాజకుమారుని నీకు కూర్చెదను. నా నేర్పును చూడుమా!'' అని ఊఱడించెను.

వ॥ అనుచు నూఱడం బలికి యా ప్రోడచేడియ తోడి చెలులతో నిట్లనియె 307

భావము : అని ఓదార్చుచు చెలులకు ఒక ప్రౌఢ ఇట్లు వచించెను.

చ॥ ఇది మనచేతనైనది యిదంతయు తల్లికి విన్నవించి యా
ముదితయు సమ్మతింప వెస ముద్దియ మానసచోరు ధీరునిం
మదికరగించి తెత్తు ననుమానము లేదిక జాగునేల వే
పద పదమంచు గోమల కృపామతి తోడ్కొనిపోయి రింటికిన్ 308

భావము : ''మన చేతనైన పని మనము చేయుదము. వెంటనే పోయి మనము చంద్రరేఖ తల్లికి ఈ విషయమంతయు విన్నవించెదము. ఆమె అనుజ్ఞ తీసికొని ఆ రాజకుమారుని కలిసి, వాని మనసు కరగునట్లు చంద్రరేఖ ప్రేమను వానికి చెప్పి, వానిని తీసికొని వచ్చెదను. పద పదండి'' అనుచు వారు ఆ కోమలిని ఇంటికి తీసికొని పోయి,

మ॥ చని మాయాంగనతోడ నంతయు సువిస్తారంబుగా జెప్పినన్
విని యమ్మానిని దానెఱుంగని గతిన్ వే వచ్చి యమ్ముద్దుకూ
తును మాధుర్యవచోవిశేషముల చేతోమోదముం జేయుచున్
నెనరుం గూరిమి మీర కల్కి తనమున్ నేర్పొప్పగా నిట్లనున్ 309

భావము : అట్లు ఆ ప్రౌఢ చంద్రరేఖతో ఇల్లుజేరి ఆమె తల్లియైన మాయాంగనకు వృత్తాంతమంతయు దాచక చెప్పెను. అప్పుడామె తానేమియు ఈ విషయ మెఱుగనట్లు తన ముద్దుల కూతురును చేరి స్నేహము, ప్రేమ కనబఱచుచు మనసును వశము చేసుకొనునట్లు నేర్పుతో నిట్లనెను.

శా॥ ఏమే కూతుర చిన్నబోవుటకు నీకెగ్గెవ్వరో జేసిరే
నీమోమిట్టుల మంచు బిందువులతో నెత్తమ్మి యట్లుండగా
నా ముద్దున్ లతకూన నీ మనసులోనం గల్గు కోర్కెమియో
నామోదాన వచింపు దాచక తగన్ నాళీక పత్రేక్షణా! 310

అర్థాలు : ఎగ్గు= కష్టము, నాళకపత్ర= తామరాకుల వంటి చూపులు కలదానా!

భావము : "చక్కని కన్నులు కలదానా! నీ కెవరైనా కష్టము కలిగించిరా? నీ ముఖమంతా చెమటతో తడిసి మంచులో తడిసిన తామరపువ్వువలె నున్నదేమి? నీ మనసులోని కోరికను దాచక చెప్పుమా!"

ఆ॥ ఏమివలయు నన్న నిచ్చెద వేగంబె
ఏమి సేయుమన్న నిపుడు చేతు
నెట్టిదానినైన గట్టిగ నేదెత్తు
నేల! యింత తలప తలకు నీకు 311

భావము : "నీవేమి కోరిన, దానిని ఇచ్చెదను. ఏమి చేయుమన్న దానిని చేసేదను. ఎట్టి కోరికైనను తీర్చగలను. నీకు చింతయేల?"

తే॥ ఎన్ని నోముల నోచితి నిచ్చలోన
ఎన్నిదేవుళ్ల వేడితి నెల్లపొద్దు
ఎన్ని వ్రతములు సల్పితి, సన్నుతాంగి
యిడుమ లెన్ననెన్నో నిన్ను బడయుటకును! 312

భావము : నిన్నుకోరి ఎన్నో నోములు నోచినాను. ఎందఱు దేవుళ్లకో మ్రొక్కినాను. ఎన్ని వ్రతములో చేసినాను. నిన్ను పొందుటకై నేను పడిన (ఇడుములు) కష్టములు లెక్కకురావు.

శా॥ నీవొక్కించుక చిన్న బోవ నశనీ నిర్ఘాత పాతంబుతో
గ్రావం బట్టులనట్ల గుండెపగులన్ కల్పాంతమై తోచు నీ
రావంబెచ్చుకమైన వేళ, సకల బ్రహ్మాండ మేనేలి నే
నావిర్భావము నొందు వేడ్క కను బామై యెంతురా కూతురా 313

అర్థాలు : అశనీనిర్ఘాతపాతంబుతో= పిడుగుపాటుతో, గ్రావంబు= కొండ, కల్పాంతమై= ప్రళయమైనట్లు

భావము : "నీవు ఏకొంచెము చిన్నపోయినను పిడుగుపడి కొండ పగిలినట్లు నా గుండె పగిలి యుగము అంతమైనట్లు నాకు తోచును. నీ కంఠస్వరము ఖంగున మ్రోగిన వేళ, ఈ విశ్వానికి నేనే యేలికనని, నా జన్మధన్యమైనట్లు భావింతునమ్మా!"

సీ॥ గొజ్జంగి పూనీరు మజ్జన మాడంగ
దెచ్చిరి కైకొను మచ్చెకంటి
చలువదువ్వలువ ముచ్చటమీర నెరిపెట్టి
కట్టవె నాముద్దుపట్టి కడక
సారంపు నాభికస్తూరి తే వేవేగ
తిలకంబు నుదుటను దిద్దు కలికి
పచరించిరిదె కలపంబు గుబ్బలనిండ
పూయవే చల్లగ పూవు బోడి!

తే॥ మొల్ల సరులివె కొప్పుల ముడువు బాల!
తళుకు సొమ్ములు దాల్పు వేతమ్మి కంటి!
భోజనము సేయవే పైడి బొమ్మ సరగ
కపుర విడియయు సేవింపు కాంచనాంగి! 314

అర్థాలు : మజ్జనమాడంగ= స్నానము చేయుటకు, నెఱిపెట్టి= కుచ్చిళ్ళుపెట్టి, కలపంబు= చందనము, గుబ్బలనిండ= చన్గవనిండ, విడియము= తాంబూలము, పైడి= బంగారము

భావము : "పన్నీట స్నానమాడుము. చలువచేసిన చీరను కుచ్చిళ్లు పెట్టి కట్టుకో. కస్తూరితిలకపు బొట్టు పెట్టుకో. చందనగంధము తీసి తెచ్చినారు, చన్గవనిండుగా చల్లగా పూసుకో. పూలుపెట్టుకో. సొమ్ములు సింగారించుకో. భోజనము చేసి తాంబూలము సేవించుమా!"

విశేషము : మచ్చెకంటి, ముద్దుపట్టి, కలికి, పూవుబోడి బాల, తమ్మికంటి, పైడిబొమ్మ, కాంచనగంగ సంబోధనలు ఎనిమిది ఉన్నవి.

శా॥ మేనెల్లం కడుకందెనే మొగము తమ్మిన్ వాడి సొల్పొందెనే
తేనెల్ చిందెడు మోవి యూర్పుసెగలన్ తెల్పొందెనే మిక్కిలిన్
వానంబోలె శ్రమంబు జెందెనె సఖీ వర్గంబు సల్లాపముల్
వీనుల్ చేరక డిందెనే! యిక కటా వేగింపు నెట్లుండునో! 315

అర్థాలు : సొలుపు(సొలపు)= మై మఱపు, డిందెన్= వినబడకపోయిన

భావము : "శరీరమంతయు కందిపోయినదా? తమ్మివంటి మొగము వాడిపోయినదా? పలుకు తేనెలు వర్షించు పెదవి ఎఱ్ఱదనము మార్పుల వేడిమితో తెల్లబడినదా? వానలో నున్నట్లు శ్రమకలిగినదా? చెలులు మాటలు వినబడక అణగిపోయినదా? అయ్యో! ఈ వేదన ఇంక ఎట్లు బాధించునో కదా!"

వ॥ అని వగచుచున్న జనని నును బలుకులను చెవుల నెలకొలిపి తన మనంబున 316

భావము : అని బాధపడుచున్న తల్లి మెత్తని మాటలను శ్రద్ధగా విని మనసులో

క॥ నా మీద యింత దయయును
ప్రేమయు మోహమును నెనరులుం పెనగొనగన్
నామనసు కోర్కె దెలుపని
చో మన్మథుడేల కరుణ జూచును నన్నున్ 317

భావము : "నా మీద యింత దయ, ప్రేమ, మోహము, స్నేహము పెంచుకొని యున్న నాతల్లికి నా మనసులోని కోరికను చెప్పకపోయినచో, ఇంక ఆ మదనుడు నన్నెట్లు కరుణించును?"అని తలచెను.

ఉ॥ ఏమని, చెప్పుదున్ దెలుప కించుక తాలితినేని నేనికన్
నా మహనీయ మూర్తి నగరాంతర మేగినయంత నెవ్వరున్
నామదిలోని కోరికయు నంత నెఱింగి ఘటించు వారలో
కాముని ఖడ్గధారహతి ఖండలు గాదె శరీరమంతటన్ 318

అర్థాలు : తాలితినేని= ఆలసించినచో, ఘటించువారలో= కూర్పువారో!, ఖడ్గధారహతి= కత్తివాదర దెబ్బ

భావము : "ఏమని నా బాధ చెప్పగలను? చెప్పుటకు ఆలసించినచో, ఆ రాకుమారుడు తన పట్టణమునకు పోయినచో, నా మనసులోని కోరిక తెలిపినను, నన్ను ఆ మహాశయునితో కూర్పగల వారెవరు? లేనిచో, నా కాముని కత్తి దెబ్బలకు నా శరీరము ముక్కలైపోదా?"

వ॥ అని వితర్కించి దినప్రభునస్తమయంబున నాప్రోఢ అండజయాన మాయాంగన డాయ నరుగుదెంచి యించుక తడవాలసించిన చంచలాక్షి యించువిలుకాని బారి సహింప జాలదని యిట్లనియె 319

అర్థాలు : దినప్రభు= సూర్యుని, తడవు= సమయము, ఇంచువిలుకాని= చెఱకువిల్లు కలవానిని

భావము : అని ఆలోచించి, సాయంకాలమందు ఆ ప్రౌఢ, ఆమె తల్లిని సమీపించి చూచుటకు, ఆలసించిన చంద్రరేఖ విరహవేదన సహింపదని ఇట్లు అనెను.

మ॥ వినుమో యమ్మ! వనీవిహారమున కీవిద్యుల్లతాంగిన్ సఖీ
జనముల్ దోడుక పోయి యచ్చట విలాసక్రీడలన్ తేలుచున్
దినముల్ ప్రొద్దులు పుచ్చుచుం ద్రటుల నందే క్రమ్మరంగా చనన్
గను రాయంచను వెంబడించి కయికో కాంక్షించి యెంతేనియున్ 320

అర్థాలు : విద్యుల్లతాంగిన్= మెఱపు తీవెవంటి శరీరముగల దానిని, క్రమ్మరంగా= తిరుగగా

భావము : "వినమమ్మా! వనవిహారమునకు చంద్రరేఖతో చెలులందఱము వెడలినాము. అక్కడ విలాసముగ ఆడుచు ప్రొద్దుపుచ్చుచుండగా - ఇది ఎప్పుడును మేము చేయుచుందుము కదమ్మా!- ఒక రాజహంస కన్పడినది. ఎట్టులనైనను పట్టుకొనుటకు చంద్రరేఖ దానిని వెంబడించినది."

చ॥ చనునెడ పెంపు డంబులగు చందము నున్నది యాస గొల్పుచో
నెనసిన దూరమేగుచు నొకించుక నిల్చిన నిల్చుచుం గడున్
మన సురికొల్పగన్ నడల మక్కువ చూపుచు కల్కిచేష్టలం
దనరుచు సంచరించు నెడ దాని పయిం గడు హాళి నేగగన్ 321

అర్థాలు : డంబులగు చందమున= దర్పము, డాబు, ఎనసిన= దగ్గఱైన, ఉరికొల్పగన్= కవ్వింపగా, పురికొల్పగా

భావము : ఆ హంస మురిపించుచు, చేరువకు పోగానే దూరమునకు పోవుచు, తన నడకల సోయగముతో ఆకర్షించుచు పురికొల్పినది. దానిని పట్టుకొనుటకు చంద్రరేఖ ఉత్సాహముతో ముందుకు నడువగా,

సీ॥ రవిసుతాక్రాంతనారంగ రంభాక్రాంత
విమలకుంజ నితాంత వీథికాంత
రాళ సికతద్వీప హేలోత్సుకోన్నీప
సుస్థలచంద్రోపల స్థలోప

రి వసిత సుకుమార నవయౌవనాకార
సవనభుగ్వరమార చైత్రమార
విజయ సుందర మూర్తి, భుజబల విస్ఫూర్తి
సుజనానువర్తి విశ్రుత సుకీర్తి

తే॥ చారు కరుణాకటాక్ష విశాలవక్షు
సర్వ శుభలక్షణాకారు సద్విహారు
రమ్య శృంగారు చక్కని రాకుమారు
కాంచె నది మొద లీరీతి గలిగె నాతి 322

అర్థాలు : రవిసుత= సూర్యుని కుమారుడైన శనిదేవునిచే, ఆక్రాంత= ఆక్రమింపబడిన, నారంగ= నారింజ, రంభా= అరటి, వీనిచే, ఆక్రాంత= ఆక్రమింపబడిన, విమల= నిర్మలమైన, కుంజ= పొదలందు, నితాంత+ వీథికాఅంతరాళ= గొప్పప్రదేశమధ్యమున గల, సికతద్వీప= ఇసుక తిన్నెలపై, హేలా+ఉత్సుకఉత్+నీపసుస్థల= విలాసక్రీడలందుత్సాహము గల వారిని ఆకర్షించు కదంబ వృక్షములున్న చోట గల, చంద్ర+ఉపలస్థల+ఉపరివసిత= చంద్రకాంత శిలావేదికపై నున్న, సవనభుగ్వర= ఇంద్రకుమారుడైన జయంతుని, మార= గెలుచునట్టి, చైత్రమార= వసంత మదనులను, విజయ= గెలుచునట్టి, చారు= అందమైన,

భావము : వనమున చంద్రకాంత శిలావేదికపై నున్న ఒక చక్కని రాజకుమారుని చూచినది మొదలు చంద్రరేఖకు ఈ వేదన కలిగినది.

క॥ ఇంతకు మిక్కిలి మఱి యీ
చింతకు మూలంబు లేదు శీఘ్రముగ నది
స్వాంతము చెందిన రుజ కా
వింతుము దగ నానతిమ్ము వేగం బనినన్ 323

భావము : "ఇంతకంటె ఈమె చింతకు మఱొక కారణము లేదు. ఇది ఈమె (రుజ) మనోవ్యాధి. దీనికి తగు చికిత్స చేయవలెను. మీ ఆజ్ఞకై వేచి యున్నాము. తర్వగా పని తెల్పండి" అనగా

ఉ॥ ఎక్కడినుండి వచ్చె కులమెయ్యది యెందు వసించియుండునో
ఎక్కడి రాకుమారుడిట వేటకు వచ్చెనె వచ్చి యిచ్చటన్
నెక్కొన నేమి కారణము నీవె వడింజని యన్ని కార్యముల్
చక్కగ నారయందగుదు చయ్యన నేగుము పంకజాననా! 324

భావము : "తల్లీ పద్మముఖీ! "ఈ రాజకుమారుడు ఏ దేశపు రాజు? ఇక్కడకు వేటకు వచ్చుటకు కారణమేమి? నీవే వెళ్లి ఆలస్యము చేయక ఆ వివరముల న్నియు తెలిసికొనిరమ్ము."

క॥ కులమును గోత్రము గుణమును
తెలియక, కలియంగరాదు ధీమంతులకున్
కలిసి తెలియంగ పోదగు
కలకంఠి నొసంగుచోట కడువివరమునన్ 325

భావము : "బుద్ధిమంతులైన వారు కులగ్రోతశీలములు తెలియని వారితో కలియరాదు. ఆడపిల్లను ఇచ్చుకొనుచోట అన్నియు వివరములను తెలిసికొనియే మనము ముందుకు పోవుట మంచిది."

క॥ అన చంద్రరేఖ వినియును
తన మనమెరియంగ గుంది తనకోర్కెదగన్
వినిపించకున్న గాదని
తనుకుచు మాయావి వనితకును దాననియెన్ 326

అర్థాలు : ఎరియంగ= మండుచుండగా, కుంది= బాధపడి, తనుకుచు= భయపడి

భావము : అనుచున్న మాయాంగన మాటలు విని తన మనసులోని మాట ఇప్పుడు చెప్పకపోవుట మంచిది కాదని భయపడుచు చంద్రరేఖ ఇట్లనెను.

ఉ॥ దాపురమేలనమ్మ విను తథ్యము నామనసాన్నృపాలుపై
చూపుల వెంటనేగి కడు చొక్కుచు మక్కువ యెక్కువై తగన్
కాపురమున్న దమ్మ యిది గాదని వేఱొక చింత చేసితే
నీ పదమాన ప్రాణములు నిల్చుట లేదు మనోజవేదనన్ 327

భావము : "దాచకుండా నా మనసును నీకు చెప్పెదను అమ్మా. ఆ రాజకుమారునిపై మరులుగొన్నాను. ఇది అసాధ్యమని వేఱొక యోచన చేసినట్లయితే మదన వేదనచే ప్రాణములు నిల్వవు."

ఉ॥ కావున నెన్నిరీతులను కానమి వేఱొక చింత సేయగా
భావజ మూర్తిపై మనసు బాయ దొకించుక జాగుచేసితే
భావజు డెట్టు లోర్చు నికప్రాణము లింతకు దాల్చినిల్చితే
పోవుదు నగ్ని కాహుతిగ బొందుదు వేఱొక మేన వానినే 328

భావము : "కనుక ఏ విధముగా ప్రయత్నించినను ఆ రాజకుమారుని పైకల మనసు మరలకున్నది. ఒకవేళ ప్రాణములు మొండివై శరీరమును వదలిపోకయున్నను, నేను బలవంతముగా నైన అగ్నిలో దేహమును వదలి మరుజన్మమున నైన వానినే భర్తగా పొందుదును."

వ॥ అన నందులకుం దగిన యత్నంబు చింతిపుచుండ నక్కడ 329

భావము : అనగా, వానికై తగిన యత్నమును వారు ఆలోచించుచుండగా,

క॥ కన్నియ జూచిన మొదలును
కన్నది విన్నదియు తెలియగా నేరక న
త్యున్నత చింతాభరమున
నున్న యెడన్ మంత్రి నిద్దురొయ్యన లేచెన్ 330

భావము : చంద్రకేతు మహారాజు ఆ కన్యను చూచినప్పటి నుండి తాను కన్నది విన్నది యేమో తెలియక ఎక్కువగు చింతతో నుండు సమయమందు మంత్రి మేల్కొనెను.

తే॥ లేచి నల్దిక్కులల్లన, జూచి ప్రొద్దు
చాల వాలెను యిందుండ జనదు భూప!
లేచి పట్టణంబున కరుగుట పాడి యనిన
మాట విని యుత్తరం బియ్య మఱచియున్న 331

భావము : నిద్ర మేల్కొనిన మంత్రి నాలుగు దిక్కులను పరికించి "ప్రొద్దువాలుచున్నది. ఇంక ఇక్కడ ఉండుట క్షేమము గాదు. మన పట్టణమునకు పోవుదము" అనగా ఆతని మాటను విని సమాధానమీయక మఱచియున్న

చ॥ నిబిడ తుషారబిందుయుతనీరజమైన ముఖంబు మిక్కిలిన్
ప్రబలు మనంబులో నెగులు సారములేని పరాకు మేనిపై
కబళితమై నలంత గడు కందినమేనును జూచి యింత యే
ల బడలె మేను, చింతను దలంకుట కేమికతంబు భూవరా! 332

అర్థాలు : నిబిడ= దట్టమైన, తుషారబిందుయుతనీరజమైన= మంచు బిందువులతోడి పద్మసమానమైన, నెగులు= దిగులు, బాధ, దుఃఖము

భావము : మంచు బిందువులతో తడిసిన తామరపువ్వు వలె నున్న చెమటతో తడిసిన మీ ముఖము మనసులోని ఆ బాధ, శరీరమును గూర్చి జాగరూకత తొలగిన బడలికచే నీరసపడిన శరీరమును చూచి మంత్రి- "ఇంత విచారమునకు కారణమేమి రాజా!?" అని ప్రశ్నించెను.

ఉ॥ ఆనతి యిమ్ము వేగ మృగయాపన వేళల నింత లేదు మీ
మానసమెందునో తవిలి మళ్లక యున్నది వింతలిక్కడన్

గానగ నయ్యె నేమి కడుగైకొన రానిదొకండు కల్గనే
పూని యొనర్తు నీకరుణ బోవగ నిత్తునె యెట్టి కార్యమున్ 333

అర్థాలు : ఆనతి= ఆజ్ఞ, మృగయాపనవేళల= వేటాడు సమయమున, తవిలి= తగులుకొని, మళ్ళక= విడిచిపోక,

భావము : "ఈ బడలిక వేటాడినప్పుడు లేదు కదా! తమ మనస్సును ఏదో పట్టుకొని వదలక పీడించుచున్నది. ఇక్కడ మిమ్ము అంతగా బాధించిన వింతయేమి ఉన్నది? మీరు కోరితే పొందలేనిది ఏమి? మీరు ఆజ్ఞాపించిన ఎట్టి పనియైనను మీ కరుణతో చేయకుందునా?"

మ॥ అని ధైర్యంబును నూలుకొల్పి వెసతో నయ్యామునా తోయమున్
ఘనపద్మచ్ఛద సంపుటిన్ గొనుచు వేగన్ వచ్చి తానల్ల నా
ననపద్మంబును కన్నుదోయి నలతం బాయంగ బ్రక్షాళనం
బును గావించి నయంబునన్ మఱియు నాభూపాలుతో నిట్లనున్ 334

అర్థాలు : నూలుకొల్పి= నిలువలేక, వెసతో= వెంటనే, ఘనపద్మచ్ఛదసంపుటిన్= పెద్దతామరాకు దొన్నెలో

భావము : ఇట్లని ఆరాజునకు నిలుకడ కలిగించి, నిద్రమత్తు వదలునట్లుగా ఆ యమునా నదీ జలమును ఒక పెద్ద తామరాకు దొప్పలో దెచ్చి, దానితో రాజు పద్మమువంటి ముఖమును రెండు కన్నులను అలసట పోవునట్లు కడిగి తుడిచి, వినయముతో రాజుతో ఇట్లు వచించెను.

క॥ ఎక్కడి తలపెక్కడికల
నెక్కడి తహ తహ వినంగ నెదనాటగనే
గ్రక్కున నానతి యిచ్చిన
నిక్కము సాధింతు ననగ నృపు డిట్లనియెన్ 335

భావము : "మీ ఆలోచన ఏమో!, బాధయేమో ఆరాటమేమో! నాకు తెలియచెప్పిన వెంటనే సాధితును" అని మంత్రి చెప్పగా రాజు ఇట్లు అనెను.

సీ॥ శ్రమసిక్త కుంకుమాచ్ఛాదిత మగు చిన్న
పాపిట చేర్చుక్కకోపులెత్త
కడుకెంపు కెమ్మోవి కాంతిరక్తిమచెంది
ముత్యంపు ముంగర నృత్యమాడ
నపరంజి నిక్కుల నెపమెంచు చెక్కులు
ధగధగల్ తాటంక యుగళి కమ్మ
కక్షభాగ ద్యుతుల్ వక్షోజముల మీద
సారె సారెకు మీరి చౌకళింప

తే॥ జిలుగు పయ్యెద వెడజార చికిలిగుబ్బ
చన్నుగవ తళ్కు జిగిమీర శ్రమము జార
నడుము వడకంగ నడుగులు తడబడంగ
వచ్చె నొకహంస వెనుకొని మచ్చెకంటి 336

అర్థాలు : శ్రమసిక్త= శ్రమతో తడిసిన, కుంకుమ+ఆచ్ఛాదిత= కుంకుమ అలమిన, చేర్చుక్క= పాపిట బొట్టు అనబడు ఆభరణము, కోపులెత్త= కాంతులు చిమ్మగా, ముంగర= ముక్కఱ అనబడు ఆభరణము, అపరంజి= బంగారు, నిక్కుల= కాంతుల, నెపము+ఎంచు= తప్పుబట్టు, తాటంకయుగళి= చెవికమ్మల జోడు, కక్షభాగద్యుతుల్= చంకయొక్క కాంతులు, చౌకళింప= కదలియాడ, వెనుకొని= వెంటబడి

భావము : "అలసట వలన పట్టిన చెమటకు తడిసి చెదరిన కుంకుమతో కలసిన పాపిటబొట్టు కాంతులు చిమ్మగా, ఎఱ్ఱని పెదవుల కాంతితో ముత్యాల ముక్కఱ నాట్యమాడగా, బంగారమును తప్పుపట్టు చెక్కిళ్ల కాంతులు రెండు చెవి కమ్మలపై ప్రసరింపగా, చంకల కాంతులు పాలిండ్లపైపడి మాటిమాటికి ఉబ్బి చలింపగా, సన్నని పైట మెల్లగా జాఱగా, చన్నులు తళుకు మనగా, నడకల శ్రమముతో నడుమూగి అడుగులు తడబడగా, ఒక హంసవెంట నంటి ఒక మీననేత్రి వచ్చినది."

క॥ వచ్చియట మ్రోల నిల్చిన
యచ్చపలవిలోల లోచనాంగద్యుతిచే
పచ్చటి భూరుహజాలము
లచ్చపు బంగారు తరువులై వెలుగొందెన్ 337

అర్థాలు : మ్రోల= ఎదురుగ, చపలలోచనాంగద్యుతిచే= ఆ చంచలాక్షి శరీర కాంతిచే

భావము : "ఆ యువతి వచ్చి ఎదుట నిల్చినప్పుడు, ఆమె శరీరకాంతి సోకి అక్కడి పచ్చని చెట్లు బంగారు వన్నెను పొందిన చెట్లయినవి."

ఉ॥ ఇంతియెకాదు మోహన నిరీక్షణ పంక్తులు కల్వరేకుల
త్యంతము గ్రుమ్మరించ మదనాస్త్రములై మదిగ్రుచ్చి పారగా
పంతు విలాసముల్ తెలుపు భావము దోప మెలంగి కల్కి దా
నంతట నెచ్చెలుల్ గదియ నవ్వలి కేగె వనంబు లోనికిన్ 338

అర్థాలు : నిరీక్షణపంక్తులు= చూపులు, పంతు= పంతముతో

భావము : "ఇంతే కాదు, ఆమె చూచిన చూపులు సమ్మోహనములు. మదనుని బాణములై నా గుండెలో గ్రుచ్చుకొనగా, ఆమె పంతముతో విలాస భావములు (సాత్త్వికభావములు) తోచునట్లు ప్రవర్తించు చుండగా, అంతలో చెలులు రాగా ఆ సుందరి వారితో కలసి అడవిలోనికి పాఱిపోయినది."

విశేషము : విలాస(సాత్త్విక) భావములెనిమిది : 1. స్తంభము, 2.స్వేదము, 3.రోమాంచము, 4.స్వరభంగము, 5.కంపము, 6.వైవర్ణ్యము, 7.అశ్రులు, 8.ప్రళయము. ఇవి విరహదశలో చంద్రరేఖ యందు, చంద్రకేతునందును కన్పట్టినవి.

ఉ॥ ఆచెలి చూచినంతటనె యాత్మభవుండు మెఱుంగు మొల్లనా
రాచము నారిగూర్చి చిగురాకు విలుం దెగ నిండ చేసి పె

ల్లేచిగురుంచి చేకొలది వేసిన యేటున డిల్లనొందితిన్
ఆచపలాయతాక్షి గను నట్టి యుపాయము చేయుమియ్యెడన్ 339

అర్థాలు : ఆత్మభవుండు= మదనుడు, మెఱుంగు= కాంతిమంతమైన, మొల్లనారాచము= మొల్లపూవు అనెడు బాణమును, చేకొలది= లాగి

భావము : "ఆ సుందరి చూపు తగిలినంతనే, మదనుడు తన పూల బాణములను వింటిలో సంధించి బలముగా వేసెను. ఆ దెబ్బకు తల్లడిల్లితిని. ఆమె ఎవరో, ఆమె దర్శనము లభించు ఉపాయము ఇప్పుడు ఆలోచింపుమా!"

క॥ ఏమని చెప్పుదు నహహా
తామరసదళాక్షి కనుల తళుకున్ బెళుకున్
గోమును బిత్తరమును దగ
కాముని శరములగు తూపుగమి నిక్కంబున్ 340

భావము : "ఏమని చెప్పగలను? ఆహాహా! ఆశ్చర్యము. ఆమె చూపులు, వాని తళుకుబెళుకులు, ప్రేమ, తత్తరపాటు- మన్మథాస్త్రముల సమూహమే"

క॥ నగు మొగము తేలు కన్నుల
జిగిబిగి నిగ నిగని మేని శృంగారంబున్
సొగసగు రూపవిలాసము
తగుదగు నీ చెలువ చెలువు తగుదగు ననగన్ 341

అర్థాలు : తేలుకన్నుల= మత్తైన కన్నుల, చెలువచెలువు= యువతితో స్నేహము.

భావము : నవ్వు గల ముఖము, మత్తైన కంటిచూపుల తెల్లదనము, నిగనిగయని మెఱయు శరీర సౌందర్యము, రూప విలాసపు ఒయ్యారము. ఈ కోమలితో స్నేహము (చెలువు) తగినదే! నేను దానికై తగినవాడనే అనుట న్యాయమే!"

ఉ॥ ఆ కమలాస్య ముద్దు మొగమా నవమోహన రూప విభ్రమం
బా కరియాన కుల్కు నడలా మధురాధరిమోవి సౌరభం
బాకలకంఠి ముద్దుపలు కామధురాక్షి విలోకనోత్సుకం
బాకుటిలాలకొప్పు కురులందము డెందము బాయ దెంతయున్ 342

అర్థాలు : కరియాన= ఏనుగు వలె నడచునది, కుటిలాలకొప్పుకురుల= వంకరలైన జడముడిలోని వెంట్రుకల

భావము : "పద్మము వలె ముద్దుగా నుండు ముఖము, క్రొత్తదై ఆకర్షించు రూపము, ఏనుగు నడకవలె మందముగ కులుకుచున్న నడకలు, పెదవుల సొంపు, ఆమె కోకిల పలుకులు, ఆమె కంటి చూపుల ప్రసారము, జడముడిలోని వంకరలైన వెంట్రుకల అందము అన్నియును నా ఎదనుండి తొలగుట లేదు."

సీ॥ ఇరులతో నీలంపుసరులతో కాటుక
గిరులతో సరిమించు కురులతోడ
పరపుతో నెత్తమ్మి హొరపుతో జోడగు
మెఱపుతో నెమ్మోము మురువుతోడ
దరముతో గ్రముక సుందరముతో జిగి శుభ
కరముతో మెఱయు కంధరముతోడ
కాలితో మంకెన పూవుతో తేనియ
చవితోన నలరు కెమ్మోవి తోడ

తే॥ చిలుకతో కేరు ముద్దుల పలుకు తోన
కన్నుల కలువతో రాయు చెలువుతోన
చెండ్లతో బోరుగుబ్బ పాలిండ్ల తోన
నలరు తొయ్యలి గవయ కెట్లలరు నొందు 343

అర్థాలు : ఇరులు= చీకటి, మురువు= అందము, దరము= శంఖము, చవి= రుచి, చెండ్లతో= బంతులతో, కవయక= కూడక, పొందక, అలరునొందు= ప్రీతిని పొందదగునా?

భావము : చీకట్లతో నీలిమి వన్నెగల సరములతో కాటుక కొండలతో సమానములై అతిశయించు నల్లదనముండు వెంట్రుకలతో, విరివిరిగా అందమైన తామరపూవుల సొబగుతో సాటియైన విలాసముల మెఱయు కాంతుల అందమైన ముఖముతో, శంఖముతో ముడివక్కల సోకుల జిగిజిగితో శుభ్రమైన కాంతితో(కిరణము) ప్రకాశించు మెడతో, మంకెన పూవుల వంటి ఎఱ్ఱని పాదములతో, తియ్యని తేనె రుచిగల ఎఱ్ఱని పెదవులతో, చిలుకలను నిరసించు ముద్దు పలుకులతో, కలువతో సాటి యగు కన్నుల సోగసుతో, బంతులతో పోరాడ గల ఉబ్బి బలసిన చన్నులతో, చక్కగా నుండు యువతిని కౌగలించక ఎట్లు సంతోషము పొందగలను?"

విశేషము : చూపులకు కనబడు సౌందర్యము సరియే, కాని తాకిన గాని తెలియని గుణములు, ముద్దిడిన గాని తెలియని పెదవి రుచి- అల్లంత దూరమునుండి చూచినంతనే ఈ రాజునకెట్లు తెలిసినవి? అను ప్రశ్న రావచ్చును. ఆ రాజునకు గల పూర్వానుభముచే తెలిసినదనవచ్చును, లేక, యౌవనాకర్షణలో ప్రకృతిసహజమగు ఊహామాత్రానుభవమనియు భావించవచ్చును.

చ॥ మొదల ప్రవాళ మంత్రజపముల్ పఠియించి తదాఖ్య నొందుచో
నదనున జైత్ర వేళల కుజాగ్రమునన్ వసియించు కొన్ననల్
సుదతి పదంబులస్మరిచి సుస్థితి నిల్పి తదేక చింతచే
పదిలము నొందగానె కద పల్లవనామము దాల్చె నిద్ధరన్ 344

అర్థాలు : ప్రవాళ= పగడపు,చిగురాకు, తత్+ఆఖ్య= ఆ పేరును, అదనున= సరియైన సమయమున, చైత్ర= వసంతకాలపు, క్రొన్ననల్= క్రొత్తమొగ్గలు

భావము : "మొదట ప్రవాళమంత్రమును (పగడముల వన్నెకై) ఉపాసించి, చెట్లపై క్రొత్తచిగుళ్ళు ఆ పేరు పొందుటకు వసంతాగమన వేళల, ఈ యువతి పాదముల రూపమును ఎఱ్ఱదనమును తలచి వానిపై మనసును నిల్పి ధ్యానించుటవలన కదా చిగుళ్ళకు "పల్లవము" అను పేరు పగడపు వన్నె సిద్ధించినది.

క॥ శీతశిలా గుణ మాత్రము
బలియులతో రాయునటుల పగకై కాదే
లలనా మణి మీ గాళ్లకు
తలపూర్వగవెఱపు నొందె తాబేళ్లెపుడున్ 345

అర్థాలు : శీతశిల= చలువఱాయి, బలియులతో= బలవంతులతో, మీగాళ్ళు= పాదముల పైభాగములు, తలపుఊర్వగ= ఊహకలిగించగా,

భావము : "చల్లని చలువరాయి వలె గట్టిదనము కలిగిన ఆ లలన యొక్క కాళ్ల పైభాగములు దానిపై పగగొని దానివలె నుండుటకు ప్రయత్నించుట లేదు. తాబేళ్లు మాత్రము ఆ యువతి కాళ్లను గుఱించి తలపులలో ఊపిరి విడుచుచు తమ పై చిప్పలు అంత గట్టివి కావని చింతించినవి".

విశేషము : చంద్రరేఖ పాదముల పైభాగములు చలువరాళ్ల వలెను, తాబేళ్ల పైనుండు చిప్పల వలెను చాలా గట్టివని భావము.

క॥ మతిశాలియయ్యు నకటా
ప్రతిరా బెనగుచును నీటి పాలయ్యు మహో
న్నతి నెడలుచు దలపదు
శతపత్ర విశాల నయన జంఘల కెందున్ 346

అర్థాలు : పెనగుచు= పోరాడుచు, శతపత్రవిశాలనయన= పద్మమువలె విశాలమైన కన్నులు గల దానియొక్క, జంఘలకు= పిక్కలకు

భావము : "తాబేలు తెలివిగలది. వానితో సమానమగుటకు ప్రయత్నించుచు, నీటిలో చేరి, గొప్ప స్థితిని పొంది, వసించుచు ఆ విశాల నయన పిక్కలను కూడా తలచుకొనదు."

విశేషము : పిక్కలు గట్టివని భావము.

తే॥ చెఱకు విలుకాని సాధన గరిడి మ్రోల
పచ్చి పవడంపు కంబముల్ పడతి తొడలు
అంత నిచ్చలు పెనగుచో నలుపు దీర
సరవి కూర్చుండు తిన్నెలు జఘన మరయ 347

అర్థాలు : సాధనగరిడి= వ్యాయామశాల, మ్రోల= ముంగిట, కంబముల్= స్తంభముల, పెనగుచో= కలియబడునప్పుడు, అలుపు= అలసట, జఘనము= పిఱుదులు

భావము : "ఆమె తొడలు మదనుడు సాధన చేసికొను వ్యాయామశాలలో ముంగిట నున్న పచ్చి పగడాల స్తంభములు. అవి ఒకదానితో నొకటి కలహించినప్పుడు అలసట పోవుటకు కూర్చుండుటకు అరుగులుగా ఆమె పిఱుదులు ఉన్నవి."

చ॥ పడతి శరీర మించు విలు బంభరవేణి గుణంబు చేసి యీ
పుడమిని పాంథ చిత్తధృతి పొల్పరగా నతనుండు మధ్యముం
బిడికిట నంటబట్టి సుమభీషణ బాణము వేయబూనుటే
కడునిజ మట్లు కానియెడ కన్పడ కుండునే కౌనొకింతయున్ 348

అర్థాలు : ఇంచువిట= చెఱకు విల్లుగను, బంభరవేణి= తుమ్మెదలను పోలిన నల్లని జుట్టు, గుణంబు= వింటినారి, పాంథచిత్తధృతి= బాటసారుల మనోనిబ్బరము, పొల్పరగా= ధైర్యము చెడునట్లు, అతనుండు= మన్మథుడు, మధ్యమున్= నడుమును, సుమభీషణబాణము= పూవుల బలమైన బాణములచే

భావము : "ఆమె శరీరము చెఱకువలె విల్లుగా వంచి, ఆమె నల్లని జడను ఆ వింటికి నారిగా పూన్చి, బాటసారుల మనస్సులు చలించునట్లుగా పూల బాణములను సంధించి వేయుట వలనే ఆమె నడుము కనబడుటలేదు. అట్లు కానిచో ఏల కన్పట్టదు?"

మ॥ తరుణీరత్నము నాభి యౌవన లసద్గంగాంతరావర్తమౌ
నరయంగా నటు గానిచో జలజ ముఖ్యాబ్జాత సత్సైకతో
త్కరశైవాలతరంగ చక్రములు తథ్యం బందు నెట్లుండు కం
ధర హస్తాంఘ్రినితంబ వేణి వళి సద్వక్షోజ నామంబులన్ 349

అర్థాలు : తరుణీరత్నము= ఆ శ్రేష్ఠురాలైన యౌవనవతి చంద్రరేఖ, నాభి= బొడ్డు, యౌవనలసత్+గంగా+ఆవర్తము= యౌవనము అనెడి గంగా జలమందు సుడిగుండము, అరయంగా= పరిశీలన చేయగా, జలజముఖ్య+ అప్‌జాత= శంఖము మొదలైన గొప్పవైన నీటిలో పుట్టిన (శంఖము, పద్మము, నాచు, అలలు, సుడిగుండములు), సత్+సైకత= చక్కని ఇసుక తిన్నెలు, ఉత్కరశైవాల= ఎక్కువైన నాచుతీగెలు, తరంగ= అలలు, చక్రములు= చక్రవాక పక్షులు, తథ్యంబు= వీడక, కంధర= మెడ, హస్త= చేతులు, అంఘ్రి= పాదములు, నితంబ= పిఱ్ఱలు, రోమ= బొడ్డుపై వెంట్రుకలు, వళి= ముడుతలు, సత్‌వక్షోజ= గుండ్రని చన్నులు, నామంబులన్= పేర్లతో,

భావము : "ఆ చంద్రరేఖ, నాభి గంగా నదియందు యౌవనమనెడి జలమందు సుడిగుండము, అట్లు కాకపోయినచో, శంఖము మొదలగు ముఖ్యములైన నీటిలో పుట్టిన వస్తువులు మఱియు చక్కని ఇసుకతిన్నెలు మిక్కుటమగు నాచు తీగలు, అలలు చక్రవాక పక్షులు, ఆమె మెడ చేతులు పాదములు, నూగారు (బొడ్డుపై వెంట్రుకలు), పిఱుదులు, ముడుతలు, రోమావళి, చన్నులు ఆపేర్లతో ఏల కన్పట్టును."

ఉపమేయములు - ఉపమానములు
నాభి (బొడ్డు) - సుడిగుండము
యౌవనము - గంగాజలము
మెడ - శంఖము
పద్మము - చేతులు, కాళ్ళు,
పిఱుదులు - ఇసుకతిన్నెలు
రోమావళి - బొడ్డుపై వెండ్రుకలు
బొడ్డుపై ముడుతలు - నీటిఅలలు

చ॥ పొలతుక యౌవనంపు మడి పువ్వులతోటను కాలకర్షకుం
డిలదమినారు పెంపు ఘటియింప గనెన్ వళులట్లు గానిచో
నలరు వియోగ జాతపులకాంకురజాతము పాయు పక్షులున్
దలరగ కాలసర్పమయ తంత్రము బోల్చునె యారు పేరిటన్ 350

చ॥ రమణి గభీరనాభి కుహరంబున వెల్వడి వచ్చి గుబ్బచ
క్రములకు బొంచి యానడుమ రంజిలు మోహన హారవల్లికా
గ్రమణి ఖగేంద్ర రత్నమును గన్గొని నిల్చిన కాలసర్పమై
కమల దళాయతాక్షి కొడికంబగు నట్టిమనోహరాకృతిన్ 351

అర్థాలు : కుహరంబున= గుహలోనుండి, గుబ్బచక్రములకు= చన్నులు అనెడి చక్రవాక పక్షులకై, పొంచి= దాగి, కాచుకొని, ఖగేంద్రరత్నమును= గరుడపచ్చ యను రత్నమును, ఒడికంబగు= అందమైన.

భావము : "ఆ యువతి నాభియను గుహనుండి వెడలివచ్చి, చనుగుబ్బలు అనెడి చక్రవాకములను పట్టుటకై వేచియున్న నల్లత్రాచు అనిపించునట్లున్న నూగారు ఆమె ఱొమ్ములపై వ్రేలాడుచున్న హారములో తలమానికమై యున్న గరుడపచ్చను చూచి, గరుత్మంతుని చూచిన పామువలె నిల్చిపోయినది. అదెంత మనోహర దృశ్యము!"

ఉ॥ ఆవిరిబోడి తావి కమలాంతరమందు వసించి వేడ్కమై
యౌవనలక్ష్మి మన్మథునకై తగనిల్చిన కందుకంబులౌ
నావనజాక్షి గుబ్బచనులందము డెందమునందు విందులై
యూవిళులురనౌ కమలజోద్భవ శంకరముఖ్యు లేయెడన్ 352

అర్థాలు : తావి= సువాసన, కమల+అంతరమందు= పద్మమునందు, కందుకంబులే= బంతులైనవి

భావము : "ఆ యువతి యౌవనలక్ష్మి. కనుక ఆమె పద్మమున వసించును. అందుచేతనే ఆమె శరీరమునకు పద్మగంధము అబ్బినది. ఆమె మన్మథుడు కేళీలోలుడైనప్పుడు ఆడుకొనుటకై అమర్చిన బంతులట్లున్నవి ఆమె చన్నులు. వాని అందము మనసున ఊహలను రేపి, అవి ఉవ్విళులూరునట్లు చేసినవి. బ్రహ్మ, శంకరులాది దేవత లైనను ఇట్లు తప్పక చలింతురు."

చ॥ సరసిజ పాణియంచు కవి సన్నుతిగాదు నిజంబు గానిచో
కరముల నానెపంబు బిసకాండము కంకణవృత్తి నెంతయున్
మెరయుచు రాజహంస మదిమెచ్చగు చెల్వము నొందనేర్చునే
యరుణ రుచి ప్రకాశతల నంచిత వైభవ రూపసంపదల్ 353

క॥ నునుగెఱుపు పెసర కాయలు
వనితామణి వేళ్లు మేలి వజ్రపు రుచులై
మొన వేలిగోళ్లు శుభలాం
ఛనములు వర్ణింపనగునె చతురాస్యునకున్ 354

అర్థాలు : నును+ఎఱుపు= మెత్తని లేత ఎఱ్ఱనిరంగు, రుచులై= కాంతిగలవియై,

భావము : "ఆమె వేళ్ళు మెత్తని లేత ఎఱ్ఱరంగు గల పెసరకాయలవలె మేలి వజ్రములవలెను మెఱయుచున్నవి. మొనదేలిన వేలిగోళ్ళ శుభసూచకములు. వాని అందమును వర్ణించుటకు సాధ్యమా!"

క॥ గళమును సుందరము నడక
గ్గలమును మందరము గరిమ క్రముకమునకు వె
గ్గలమును మృదుకాంతులమం
గళమునునై యొప్పు దరమె గణుతింపంగన్ 355

అర్థాలు : గళమును= కంఠము, గొంతు, అగ్గలమును= అధికమును, గరిమ= ఠీవి, విలాసము, క్రముకమునకు= పోకచెట్టుకు, వెగ్గలమును= అధికము.

భావము : "సుందరము ఆమె మెడ. మందర పర్వతమును మించియున్న నడక. పోక చెట్టును మించియున్న ఠీవి. మంగళకరములై మెత్తని కాంతులు కలదై కన్పట్టు రూపము. వానిని వర్ణించుట వీలగునా?"

చ॥ పలుచని తేనె తేటలును పానకముల్ నవఖండ శర్కరం
బలరు మరందముల్ రసరసాయనముల్ కదళీ ఫలంబులున్
కలిత సుధారసంబును చొకాటపు ద్రాక్షల పోల్కిగల్గునా
యలికులవేణి ముద్దుపలు కంటిన మాధురి గాదె యన్నిటన్ 356

అర్థాలు : శర్కరంబు= చక్కెర, కదళఫలంబులు= అరటిపండ్లు

భావము : "ఆమె పసందైన పలుకులను తేనె తోను, చక్కెరతోను, అరటిపండు తీపితోను, ద్రాక్షపండ్ల తోను విడివిడిగా పోల్చరాదు. ఈ మధుర పదార్థములన్నిటితోను ఆమె మాటలను పోల్చవలెను. ఏలన, ఆ మాధుర్య లక్షణములన్నియు ఆమె పలుకులలో మెండుగా ఉన్నవి. ఆ యా వస్తువులలో ఆమె మాధుర్య చ్ఛాయ కొంచెమే కనబడును."

ఆ॥ ఇంపు తేనె తెరలు నీగలందియు రోత
కెంపురవలు నీరసంపురాలు
మఱియు దొండపండు మందబుద్ధి గుణంబు
మోవి సాటిగలదె సుదతి తీరు 357

భావము : "తేనె తుట్టెలు ఈగలు కలవగుటచే రోత (సహింపరాదు) గుణము. కెంపులు ఎఱ్ఱనివే, కాని అవి ప్రాణములేని ఱాళ్ళు. దొండపండు ఎఱ్ఱనిదే. కాని అది మందబుద్ధి కలది. ఈ దోషాలు లేని తియ్యని, ఎఱ్ఱని ఆమె (మోవి) పెదవికి పోలికే లేదు. దానికదే సాటి.

క॥ కుందము లింతిరదంబులు
కుందము లుప్పతిల సాటి గోరుచు మదిలో
కుంద ముదమంది వెస దను
కుందము దా విరిసిపడియె కుత్సితమతితోన్ 358

భావము : "మొల్ల పూలమొగ్గలు చంద్రరేఖ పలువరుసలు. ఆ మొల్ల మొగ్గలు వికసించి మొల్లతీగ ఆ దంతములవలె లేకపోవుటచే సంతోషము తక్కువగుటచే (ముందుండుటచే) వేగముగా ఆ అందమును పొందుటకై తన నీచబుద్ధి కలదైనది. అందువలన దాని పూలన్నియు క్రింద పడినవి"

చ॥ తెలినిడు వాలు కన్నుగవ తీర్చిన కాటుకరేఖ లెంతయున్
తళుకు మిటారి చూపు గమి దారుచు దిక్కుల పిక్కటిల్లగా
వలపులరాజు భూరివిలు వర్గము మానస భేదనోక్తి యై
నిలిపిన మారయంత్రమన నీటు వహించు మనోహరాంగికిన్ 359

అర్థాలు : తెలి= తెల్లని,నిర్మలమైన, నిడువాలు= పొడవైన, మిటారి= విలాసవతి, భూరి= పెద్దదైన, గొప్ప, మానసభేదన+ఉక్తియై= మనస్సును వగులగొట్టుటయందు చెప్పబడినదై, మారయంత్రము+అన= మన్మథయంత్రము అనునట్లు,

భావము : "తెల్లని పొడవైన కన్నుల జంట, ఆ కన్నులను దిద్దిన కాటుక గీతలు ఆమె తళుకు చూపుల మొత్తముతో సంచరించుచుండ, దిక్కులన్నియును నిండగ మన్మథుడు తన పెద్ద విల్లు, సేనలను మనస్సును గాయపఱచుటకై, అన్నింటితో నిల్పిన యంత్రమనునట్లు మనోహరమైన శరీరము గల ఆమెలో అన్నియు చక్కగా అమరినవి."

చ॥ కమలమరందపాన ఘనకాంక్షల షట్పదపంక్తి వచ్చి సం
భ్రమ మతినంది చంపక సుమంబును గన్గొని వెన్క నిల్చె నా
కమలదళాయతాక్షికి వికాసపుమోమును నాసికంబునున్
గమకపునీలవేణియు చొకాటములై విలసిల్లు నెంతయున్ 360

అర్థాలు : కమలమరందపాన= తామరపూదేనె త్రాగుటకు, షట్పదపంక్తి= తుమ్మెదల బారు, సంభ్రమమతినందు= మతిపోయి, చంపక= సంపంగి, నాసికంబునున్= ముక్కును.

భావము : "ఆమె ముఖ పద్మమును చూచి, తామరపూదేనె త్రాగవలెనను కోరికతో వచ్చిన తుమ్మెదల బారు ఆమె ముక్కును చూచి, ఇది సంపంగిపూవు కదా, ఇందు తేనెలుండవని, మతిభ్రమణముతో మరలినవి. ఆ కమల వత్రముల వంటి కన్నులు గల ఆమె, వికసించెడి ముఖము, చక్కని ముక్కు అందమైన నల్లని జడ, ఆకర్షణీయమైనవిగా ప్రకాశించినది".

విశేషము : ఈ పద్యము నంది తిమ్మనగారి పేరును ముక్కు తిమ్మనగా మార్చివేసిన "పారిజాతాపహరణ" పద్యము "నానాసూనవితానవాసనల నానందించు సారంగమేలా నన్నొల్లదటంచు" అనుదానిని గుర్తుకు తెచ్చును. ఇది కవికి పూర్వకవులపై గల గౌరవమునకు నిదర్శనము.

ఆ॥ సఖియ నుదురు పూర్ణ చంద్ర ఖండం బౌట
తథ్యమట్లు గాక దక్కెనేని
తిలక మనెడు కందు తిలకింప సగమంట
వేడ్కరాహు మ్రింగ వెలయుటెట్లు 361

అర్థాలు : కందు= నల్లని మచ్చ, సగము+అంటున్= అర్ధచంద్రుడు

భావము : "ఆ చంద్రరేఖ నుదురు పూర్ణచంద్రునిలోని ఒక ముక్క, ఒక భాగము. (ముఖము పూర్ణచంద్రుడని భావము). కాకున్న, ఆ నుదుటిపై

గల తిలకమనెడు అర్ధచంద్రాకారపు మచ్చను చూచి, ఆ చంద్రునిలోని మచ్చగా భావించి, రాహువు మింగవచ్చెను కదా, అదెట్లు పొసగును?"

విశేషము : రాహువును సర్పముగా భావించినను, మొండెములేని తల మాత్రముగ ఎంచుట సంప్రదాయము. అందుకే వానికి తలగాము (తల గ్రహము) అను పేరు వచ్చినది. దీనికి అనుగుణముగ కవి యిచట నుదురుపైనున్న నల్లని తలకట్టును రాహువుగ భావించినట్లు తోచుచున్నది. చంద్రరేఖ వెనుకభాగమున కోడెత్రాచు వంటి జడ యున్నను, ముందు నుండి చూచువారికి ఆ త్రాచు తలమాత్రమే కనబడును. కనుక దానిని తలగ్రహము (రాహువు)గా భావించుట సముచితమే.

చ॥ అలికులవేణి మానసమునందు వసించి నిరంతరంబుగా
చిలుక పఠాణిరౌతు వడి సింగిణి వెంటను నారి కూర్చి పూ
ములుకులచే విటావళిని మూర్ఛత వేయు విధంబు దోప బొ
మ్మలు దిగి ఱెప్పలన్ బెళికి మర్మము నాటెడు చూపు లొప్పెడిన్ 362

అర్థాలు : చిలుకపఠాణిరౌతు= చిలుకవాహనము గల మన్మథుడు, సింగిణి= విల్లు, నారి= అల్లెత్రాడు, పూ ములుకులుచే= పూల బాణములతో, బొమ్మలు= కనుబొమ్మలు, ఱెప్పలన్బెళికి= కనుఱెప్పలలో ప్రకాశించి, మర్మము= ఆయువుపట్టు.

భావము : "తుమ్మెదల వలె నల్లని జట్టు గల చంద్రరేఖ మనసులో నుండి ఎప్పుడును మదనుడు నారి సంధించి తన పూల బాణములను వేసి విటులను బాధించు విధమున, ఆమె కనుబొమ్మలనుండి వెల్వడి ఱెప్పలలో వెలిగి ఆయువుపట్టున నాటునట్లు ఆమె చూపులు ఉన్నవి."

ఉ॥ నీరును పాలు వేర్పరుప నేర్చిన యానపునంచబోడి యొ
య్యారి మనోహరాంగి కమలాకరమందు సరోజ చక్రముల్
మీరి మహోన్నతిన్ నెఱయు మిక్కిలి పోరున రాయుచుండగా
వారణసేయ కెత్తి విడువం దగె వాదము చూడ వేడుకై 363

అర్థాలు : యానపునంచబోడి= నడకల హంస సుందరి, నెరయు= నిండు, రాయుచుండగా= కలహించుచుండగా, వారణసేయక= అడ్డుకట్టవేయక,

భావము : "చంద్రరేఖ నడకల రాజహంస. మనోహరమైన ఒక సరస్సు. అందు పద్మములు, చక్రవాక పక్షులు ఒకదానిని మించి మఱొకటి తానేయని పోటీపడి, కలహించుటను చూడ ముచ్చటగ ఉండుటచే వాని వాగ్వాదమునకు అడ్డు తగులక ఊరకుండుట తగును". పద్మములు (ముఖము, కన్నులు), చక్రములు (చన్నులు) వీనిలో ఏది గొప్పయో చెప్పక, మురియుచు, ఈ అంగములు గల సరస్సు కదా (చంద్రరేఖ) గొప్పది, అని అవి భావించి రాజహంస మిన్నక ఉండెనని భావము.

మ॥ కలకంఠీ మణి కుంకుమాగురు మృగాంక వ్రాతమున్ మేనిపై
నలుగుంబెట్టి జలంబు లాడ నవియుం గ్రోలంగ మేఘంబులున్
గలిగెం జంచల నానలుంగు మహి బంగారై వెలుంగొందె గా
వలయున్ గాక ఘటిల్లునే మహిత భావ్యత్కాంతులా కాంతకున్ 364

అర్థాలు : మృగాంక= కస్తూరి, జలంబుల+ఆడ= స్నానముచేయగా, క్రోలంగ= త్రాగుట వలన, ఘటిల్లునే= కలుగునా, చంచల= మెఱుపు

భావము : "ఆ చంద్రరేఖ కుంకుమ, అగురు, కస్తూరి కలిసిన నలుగు పెట్టి స్నానము చేసిన నీటిని త్రాగుట వలన మేఘమునకును మెఱపులు ఆ నలుగు బంగారు కాంతులై వెలిగెను. కానిచో మేఘములు అట్లుండునా?"

క॥ అళుకా బెళుకా తళుకా
కలికి తనంబునకు మెఱపుగ మురువున యా
కలకలన తలప మది నా
కలకు లకై యిట్టులాత్మ కాకను చెందున్ 365

అర్థాలు : అళుకు= బెదురు, బెళుకు= తళతళలు, కలికితనంబునకు= మనోజ్ఞతకు, మెలుపుగ= సుకుమారమగా, మురువున= శృంగార గర్వమున, కలకలన= ఆ కంఠధ్వని, కలకులకై= కామవికారము వలన, కాకన్‌చెందున్= తపించును.

భావము : "ఆమె బెదురు చూపులు, తళతళల మెఱపు, మనోజ్ఞత, సౌకుమార్యము, శృంగారగర్వము, తియ్యని కంఠధ్వని, వీనిని తలచుటచే నా మనస్సు కామవికారము చెంది ఇట్లు తపించుచున్నది."

ఉ॥ కావున నమ్మనోహరి కనుం గొనునట్టి యుపాయమెట్టిదో
భావము లోపలం దలపు పారము లేని మనోజ వేదనా
భావన నోర్వరాదు పటు తంత్ర వినిర్మిత కౌశల ప్రియా
భావనిరూఢి సంపదల బర్వుచు మిత్రుడ నీవె కావటే 366

భావము : "అందువలన మిత్రమా! ఆమెను తెలిసికొని మరల చూచుటకేమి ఉపాయము చేయుదువో! నాకు రాజ్యతంత్రములను నడపుచు, ప్రియ వచనములతో అలరించు మంత్రివి నీవే కదా! ఈ విరహ వేదనను ఓర్వలేను"

చ॥ అనిన మహాప్రసాదమని యాయనుగా సచివాగ్రణిట్లనున్
మనుజన లోకమందు నృపముఖ్యుల కన్యల రూపధన్యలన్
వినియు బటంబులం గనియు వీనుల కన్నుల కింపుకామియున్
వనరుహపత్రనేత్రి యెడ వాంఛ జనించుట భాగ్యమయ్యెడిన్ 367

భావము : అనిన రాజు మాటలు విని ఆ ముఖ్యమంత్రి ప్రీతితో ఇట్లనెను- "మానవ లోకమున రాజకుమార్తెలైన అందగత్తెల పటములను చూచి, వారిని గూర్చి వినియును, ఆ వర్ణనలు చెవికెక్కక, ఆ రూపములు కంటికి పట్టక వానిని రాజకుమారులు నిరాకరించుట సాధారణము. కాని, చూచి చూడగనే ఈ యువతిపై మీరు మనసు పడుట మహాభాగ్యము సుమా!"

క॥ ఇది యెంత కార్యమోహో
పదరక భూపాల దివిజ పతి కన్యైనా

తుదనాగ కన్యనైనా
నిదె సాధించెదను చింతనింతకు దగునా! 368

భావము : "ఇదెంత పని మహారాజా! ఎట్టి ఆక్షేపము లేక మీరు మనసు పడిన కన్య, రాజకన్యయైనను, ఇంద్రుని కుమార్తెయైనను, నాగరాజు కుమార్తెయైనను సాధించి మీకు గూర్తును. ఇది నా ప్రతిజ్ఞ. ఈ చింత ఈ మాత్రము పనికి తగునా? చింతను మానండి."

వ॥ అని యిట్లు విన్నవింపుచున్న సమయంబున 369

వచనము : ఈ విధముగా విన్నవించు సమయమందు

క॥ హరిమాయ జగములన్నియు
హరి కనుసన్నలను మెలగనగు దనకంచున్
సరసిజ మిత్రుడు చేరెను
సరగన్ చరమాచలంబు చాటుకునంతన్ 370

అర్థాలు : సరసిజమిత్రుడు= సూర్యుడు, చరమ+అచలంబు= పడమటి కొండ, అస్త్రాద్రి, కనుసన్నలను= ఆజ్ఞననుసరించి,

భావము : "జగములన్నియు విష్ణుమాయావిలసితములు. నేను విష్ణుని ఆజ్ఞనునసరించి ప్రవర్తించుట నా కర్తవ్యము" అని ఇట్లు నిశ్చయించి, సూర్యుడు అస్త్రాద్రి చాటునకు చేరెను, అనగా, సూర్యాస్తమయమైనది.

ఉ॥ అచ్చపువేడ్క పశ్చిమ దిగంగన భానుడు పెండ్లి యాడియున్
మచ్చిక తోడనస్తగిరి మాటున కూడ దలంచి పోవుచో
మెచ్చుటకై దిగంగనలు మేన నలందిన కుంకుమోయనన్
హెచ్చిన సాంధ్యరాగరుచి యింపులు నింపె దిగంతరంబులన్ 371

అర్థాలు : దిక్+అంగన= దిక్కు అను స్త్రీ, అలందిన= పూసిన

భావము : మంచి వేడుకగా పడమటి దిక్కు అనుస్త్రీని పెండ్లాడి, సూర్యుడు అస్త్రాద్రి చాటున ఆమెను కలిసికొన పోవునప్పుడు, ఆమె చెలులైన మిగిలిన

దిక్కులు అనెడి యువతులుసంబరముగా శరీరముపై పూసికొనిన కుంకుమ యనిపించునట్లు సంధ్యాకాలపు ఎఱుపుకాంతి దిక్కులన్నిటను ముచ్చట కొలిపినది.

ఉ॥ కాటుక రేఖలై పొలిచి కన్బొమలై వికసించి యారులై
నీటు వహించి కస్తురి వినీలిమ నొందియు నంత కొప్పులై
తేట నొసంగి నీలిజిగి తేరెడు చీరల సొంపు దాల్చి ది
క్పాటల గంధులం దలరి భాసిలె చీకటులంత కంతకున్ 372

అర్థాలు : ఆరులై= రోమములు, దిక్+పాటలగంధులందు= దిక్కులు అనబడు యువతులలో.

భావము : చీకట్లు క్రమముగ దట్టమైనవి. అదెట్లున్నదనగా, ముందు కాటుక రేఖవలె సన్నగనుండి, ఆపై కనుబొమలంతగా పెద్దవై తరువాత తలకట్టుల వలె పెరిగి, క్రమముగా చీకట్లు దిక్కాంతలు గట్టిన నల్ల చీర వలె విస్తరించినవి.

విశేషము : చీకట్లు క్రమ్మిన విధమును దిక్కాంతల భావనతో ముడిపెట్టి పరిణామక్రమమును జెప్పుటలోను, పై పద్యముతో కూడా కలసి, శృంగారరస పోషణము మనోజ్ఞముగ ఉన్నది.

క॥ ఎక్కడ చూచిన తానై
క్రిక్కిరియుచు సర్వదృగ్వికీర్ణంబగుచున్
మిక్కిలి యజాండ భాండము
చిక్కని చీకటులు ముంచి చేకొనె జగముల్ 373

అర్థాలు : క్రిక్కిరియుచు= దట్టమగుచు, సర్వదృక్+వికీర్ణంబు+అగుచున్= దృష్టి (చూపు) ప్రసరించినంత వఱకు వ్యాపించినదై, అజాండభాండము= బ్రహ్మాండమంతయు.

భావము : చూపు పారినంత దూరము ఎక్కడ చూచినను చీకట్లు దట్టములై అన్ని దిక్కులలో విశ్వాంతరాళమును వ్యాపించి ముంచి వేసినవి.

క॥ ఆ చీకటి దృఙ్నిచయము
నేచక్కటి మెదలనీక నెనసిన గాదా
వాచస్పతి శ్రవణేంద్రియ
సూచన కల్పించి యెఱుక చొప్పు ఘటించెన్ 374

అర్థాలు : దృక్+నిచయము= చూపులు, చక్కటి= ప్రదేశమున, ఎనసిన= వ్యాపించుటచే, వాచస్పతి= బ్రహ్మ, శ్రవణ+ఇంద్రియసూచన= వినికిడి యను ఇంద్రియమును, ఎఱుకచొప్పు= జ్ఞాన(తెలిసికొను) పద్ధతిని

భావము : ఇంత చిక్కని చీకటిలో చూపులు ఎక్కడికి పోనీయక పోవుటచే బ్రహ్మదేవుడు చెవులిచ్చి వినికిడి శక్తిని కల్పించి తెలిసికొను పద్ధతిని యేర్పఱచెను.

ఉ॥ అప్పుడు చూడ నొప్పెసగె నంబరవీథిని తారకాగణం
బొప్పుగ రాజుతో గవయు నూహ చెలంగ నజాండవాసియై
యెప్పుడు వచ్చెనో యనుచు నింతి నిశాంగన మేల్ముసుంగుగా
గప్పిన నీలి దుప్పటిని కన్పడ గూర్చిన మౌక్తికంబనన్ 375

అర్థాలు : రాజుతో= చంద్రునితో, కవయు= కూడుకొను, చేరు, నిశా+అంగన= రాత్రియను యువతి, మేల్+ముసుంగుగా కప్పిన= మేలి ముసుగుగా కప్పుకొనిన

భావము : అప్పుడు ఆకాశమున చుక్కలు చంద్రునితో చెలిమి చేయు ఊహరాగా రాత్రియను కాంత కప్పుకొనిన మేలి ముసుగు వస్త్రము నీలవర్ణ రత్నము గల దుప్పటివలె నుండగా ఇట్లు ఆ నిశ యందు చుక్కలు చంద్రుడు కన్పట్టిరి.

క॥ పక్షులు గూళ్ల వసించెను
వృక్షంబులు తరుచరములు విడిసెను మఱి హ
ర్యక్షాది మృగచయంబులు
రక్షితమౌ కుధరగుహల రహిని వసించెన్ 376

అర్థాలు : హర్యక్షాది= సింహము మొదలైన, కుధరగుహల= కొండ గుహలలో, రహిని= సంతోషముగా

భావము : పక్షులు గూళ్లను చేరినవి. వృక్షములును వానిలో తిరుగు జంతువులును (కోతులు మొ॥) విశ్రమించినవి. మఱియు సింహము మొదలైన జంతువులు సంతోషముతో, భద్రమైన తమ కొండ గుహలలో నివసించినవి.

చ॥ అట కలహాశికైన వికృతాంగములన్ విరహాగ్ని నొందినన్
కటము కనుంగొనందలచి కాలరిపుండరుదెంచు వేళ వా
కిట మును మున్నుగాను వెలిగింపగ నెత్తిన చంద్ర కాంతి నా
పటుతరదీధితిన్ కుముదబంధుడు దోచెను తూర్పుదిక్కునన్ 377

అర్థాలు : కలహ+అశి= నారదుడు, కటము= శ్మశానము, కాలరిపుండు= యముని శత్రువు శివుడు, కలభ= ఏనుగు.

భావము : ఈ విధముగా నారదునిలో మార్పును పొందిన అవయవములు విరహవేదన పొందగా, చూచుటకై శ్మశానమును చేరుటకు శివుడు వచ్చు వేళలో, తూర్పుదిక్కు అనెడి ఇంటి వాకిట వెలిగించిన దీపము వలె కిరణములతో చంద్రుడు కనబడెను.

విశేషము : విష్ణువు నారదుని గర్వమణచెదనని శివునకు మాట యిచ్చెను. వనితా రూపమున నున్న నారదుని విరహవేదనను స్వయముగా చూచుటకు ప్రయత్నించెనని చెప్పబడినది.

క॥ చివుకుచివుకున దాటుచు
కవయుచు వెలివిసరు మిన్నుకడ కెగయుచు మ
క్కువమీరి పొదువుచు ది
గ్వివరములో చెంగలించె వెన్నెల గుంపుల్ **378**

అర్థాలు : వెలివిసరుమిన్నుకడకు= దూరముగ నున్న ఆకాశము చెంతకు, పొదువుచు= హెచ్చుచు, దిక్+వివరములో= దిక్కుల సందులలో

భావము : వెన్నెల కిరణములు గంతులు వేయుచు, కలియుచు, దూరమున మింటి కెగయుచు, హెచ్చుగుచు, దిక్కుల సందులలో వ్యాపించినవి.

ఉ॥ కొంత తమాలకారంతితతి కొంతి మహాద్రి గుహాంతరంబులన్
కొంత నిశాంధ నేత్రముల కొంత సుధాకరు మేనిచిహ్నాలో
కొంత వయోవిలాసినుల కొప్పుల దాగ దమంబు దోచి తా
నెంత యజాండ భాండమును నించెను మెండుగ నిండు వెన్నెలల్ **379**

అర్థాలు : తమాలకుంజతల= తమాల వృక్షముల గుంపులో, మహా+అద్రి= మహాపర్వతముల, గుహాంతరంబులన్= గుహల లోపల భాగములందును, నిశా+అంధ= రాత్రి చూడలేని గ్రుడ్డివారిలో, సుధాకరు= చంద్రుని, మేనిచిహ్నాలో= శరీరములోని మచ్చలో, వయోవిలాసినుల= యౌవనవతుల, కొప్పుల= తలకట్టులో, సిగలలో, తమంబు= చీకటి.

భావము : నిండు వెన్నెలలు బ్రహ్మాండమంతయు పఱచుకొన్నవి. నిలువ చోటులేక, చీకటి కొంత తమాల వృక్షముల నీడలలో మఱికొంత కొండ గుహలలో, ఇంకను కొంత రాత్రి చూపులు లేని గ్రుడ్డివారి కన్నులలో, కొంత చంద్రుని మచ్చలో, మిగిలిన కొంత యువతుల కొప్పులలో దాగినవి.

విశేషము : తమాలమునకు తెలుగులో చీకటి చెట్టు అనిపేరు.

వ॥ మఱియు నఖండిత పాండురప్రభా మండిత పుండరీకభవాండంబు నిండు కప్పురంపు కరాటరూపంబును విడంబించుచు మించి దశదిశలు ముంచిన

రంధ్రంబై పరిపూర్ణత వహించి జార జోర విహారంబులక నివారణంబై తెల్లచాయవేల్పు తెల్లకలువల్ విరియక తారకంబు లితర బహువిధ కుసుమ విసరంబును, తమాల తరుజాలంబు శైవాలంబును మఱి మఱి తొరుగుచుం బొరలు మంచు తెరలు తఱగలుగా నలరుచు చదలం బొదలు జలధరంబు జలజోదరుండుగా పాల వెల్లియును బోలె వెల్లివిరిసి యెల్లదిశలు కలయ నల్లికొని మును దినకరపరితప్త తనువులగుట మును ముందుగా చెన్నగు సన్నజాజి రేకుల మిన్నయౌ లేత వెన్నెల నీటితేటులు దప్పులు తీర గ్రోలి ప్రోదియై సేదలు తీర్చుకో యాదట నాహ్లాదంబులం జుట్టి గట్టి వెన్నెల తిట్టల కుఱికి కొఱికి కఱకు చెఱకు కణికల హవణిక నమరి యమృతరసంబులు గ్రోలి పిప్పులు తుప్పున నుమిసి తృప్తియై హజ్జున త్రేఞ్చి చక్కటి ప్రదరంబు లప్పు లంగప్పి కుప్పలు తెప్పలుగా మై కప్పుల నొప్పి దప్పి తీరి తేఱు బారులై తూలి దొర్లాడు చకోరపరివారంబును మును సంజల రంజిలు కంబు కుంజంబుల కుంజనికుంజ కెంజాయలను మంజుతర మకరంద బిందు బృంద పానానందంబుల మందంబులగు డెందంబుల డిందు పడి మత్తిలి యున్న ప్రపుల్లారవిందంబులు ముకుళితంబైన యాలోన చిక్కుపడి యున్న భ్రమర మణుల క్రమము దెలియక కమల సముపాంతము లందు బ్రమయుచు సుమహిత, స్వరంబుం రవళించు భ్రమరనము దాయంబుల గానంబుల ననుసరించి పగలు వగలుకొని మొగములు చూపక మొగిన్ గదియు భీకర కాకానీకంబుల ఢాకకు నాకులపడి మాకుల మధువులురలు మఱుంగున నొదిగి పొదలి పొదలు వెడలి బడలిన వెడలం గడువడిన దలిరాకు జొంపముల దలంపులు గొన మెసలి సొంపుల పెంపు వహించి మూకలు గొని వీక తేకువ మీరిన కోకిలా నీకంబుల పంచమస్వర విలాసంబులును సోకనాళీకాకర తీర శీకర పరంపరానీత కైరవ మరంద బిందు తుందిల సందోహ కందళితా నందంబునుం కుందక కురవక మల్లికా కుసుమ పరిమళ మిళితంబును మాకంద చందన మందార తరు బృందంబుల కందువల నందంద క్రందు కొనుచు మందయానంబుల మెలంగు మలయానిల కలభ విలసనంబైన యౌవనంబున నిండువెన్నెల గండు మిగిలి మెండుకొను నవసరంబున **380**

భావము : నిండువెన్నెల మఱియు వెలుగు వెన్నెల వన్నెలచే, అలంకృతమైన బ్రహ్మాండము(విశ్వము) కర్పూరము నిండిన బరణిని(పాత్రము) పోలుచు, అతిశయించి పది దిక్కులను ముంచి వేయగా, గొప్ప బిలమై వెలితిలేక, పూర్తిగా విటులు, చోరులు నిర్భయముగా తిరుగుటకు అనుకూలమై, చంద్రుడు తెల్లని కలువలు విరియ చేయగా నక్షత్రములు అనేకములైన పూల గుంపులలో చీకటి మాకులను, నాచు మొక్కలను క్రమముగా సంచరించు మంచినీటి బిందువులు చిన్న చిన్న అలలై అందమై అలరగా ఆకాశమందు విస్తరించు మేఘము బొడ్డున తమ్మిగల వెన్నుడు పాల సముద్రమైనట్లు (సర్వవ్యాపి) వెల్లువలై, ప్రసరించి, దిశలందు అలమికొనగా (అంటగా) పగటిపూట సూర్యుని వేడిమిచే వాడిపోయిన సన్నజాజి పూల రెక్కలను అతిశయించిన వెలసిన లేత వెన్నెల యందు, నీటిపై గల తేనెటీగలు తమ దాహములు తొలగునట్లు త్రాగి గుంపులుగా అలసట తీర్చుకొనుటకై పిమ్మట ఆహ్లాదములతో కూడి వెన్నెల రాశులకు గాను ఎగురుచుపోయి, చెఱకుగడల కొఱకుచు ఇంపుగా వానిపై నిలిచి చల్లని రసమును పీల్చి, పిప్పలను ఉమిసి, తృప్తిచెంది, హాయిగా తేపుచు, చక్కటి గుంటలలో (గోయి) నీటిపై చేరుకొని, కుప్పలన్నియు, చిన్న తెప్పలవలె (నీటిపై పోవు ప్రయాణసాధనము) ఉండగా తమ మేని నల్లని రంగులచే అందముగా కన్పట్టుచు దృష్టి తొలగుటచే, ఉల్లాసముచే వరుసలుగా మైకముచే దొర్లు చక్రవాక పక్షులు ముందే సాయంకాలమున ప్రకాశించు వెదురు చెట్ల పొదలందు సన్నజాజి తీగెల గుంపులతోను, పూవుల ఎఱ్ఱదనముతోను మృదువైన పూదేనెల తుంపరల మొత్తమును త్రాగిన ఆనందముచే తెలివి తగ్గి క్రుంగిన మనస్సులచే, మదముచే మైమఱచుటచే, వికసించిన పద్మములు, ఆ వెన్నెల సమయమందు ముడుచుకొనగా అందు చిక్కుకొన్న ఆడ తుమ్మెదలు ఎచ్చట ఉన్నావో తెలియలేక, ఆ కమలముల దగ్గర తారాడుచు గొప్ప నాదములు కావించు మగ తుమ్మెదల గీతములను

అనుసరించి, పగలంతయు, చింతలో తమ మొగములను చూపక క్రమముగా సమీపించెడి భయంకరములైన కాకుల కూతల కలత చెంది చెట్లలో తేనెలు స్రవించు మఱుగులలో దాగి కదలక యుండినవై, వెన్నెలలు కురియగా, పొదలనుండి వెడలి అలసిన కష్టముచే మిక్కిలి వేగముతో, లేత ఆకులు గుత్తులు తలపుల మెదలగా మొనయు (తిరుగు) నడకల ధైర్యము కలవై కోయిల యొక్క పంచమ స్వరముల రాగములు వినబడుచుండగా పద్మములు గల సరోవర తీరమందు గల నీటి తుంపరల వరుసలచే తీసికొనబడిన తెల్లకలువలు, తేనెబొట్లు నిండినవాని మొత్తములచే ఉప్పొంగిన ఆనందముతో అందుగు ఎఱ్ఱగోరింట మల్లెపూవుల సువాసలతో కూడినవై మామిడి, చందన, దేవదారు చెట్ల జాడలను అచ్చటచ్చట ఆశ్రయించుచు మెల్లమెల్లగా వీచు మలయ వాయువులు అనెడి ఏనుగులతో విలసిల్లుచు అప్పుడే వెలుగులు చిమ్ము లేత వెన్నెల పిండు, నిండుగా దట్టమై ఎక్కువగుచున్న సమయమందు,

శా॥ కాలాతీతముగాక మున్నె ధరణీకాంతుండునా మంత్రియున్
నాళీకాకర తీర శీకర మిళన్నవ్యప్రవాళ స్ఫుర
ద్హేలా చూత పరీత సంస్థలి తగన్ నిత్యంబులౌ కృత్యముల్
వేళన్ దీర్చి యొకింత నిల్చునెడ నా విశ్వంభరాధీశుతోన్ 381

అర్థాలు : నాళీక+ఆకర= తామరలకు నెలవైన సరస్సు యొక్క, శీకరమిళత్+నవ్యప్రవాళస్ఫురత్+హేలాచూతపరీతసంస్థలి= తుంపురులతో కలిసిన క్రొత్త చిగురులతో ప్రకాశించుచున్న విలాసముగల మామిడి చెట్టు చుట్టుకొనిన ప్రదేశమున, విశ్వంభర+అధీశుతోన్= రాజుతో

భావము : ప్రొద్దుపోక ముందుగనే ఆ రాజు మంత్రి, ఆ తామర కొలను సమీపమందు ఉదయకాల నిత్యకృత్యములు తీర్చుకొనిరి. రాజు కొంచెము అలసట తొలగి యుండగా మంత్రి రాజుతో ఇట్లు వచించెను.

మ॥ అనియెన్ మంత్రి నృపాలమౌళి! నగరం బత్యంత దూరంబు నొ
య్యన తేయిక్కడ నిల్చి వేగ భవదీయంబైన చిత్తాబ్జమున్
గొనిచన్నంబుజనేత్రి చొప్పరసి గైకోనైన సూత్రంబు సా
ధనసంపత్తి ఘటింపగా వలదె యుద్య త్ప్రీతి సంధిల్లగన్ 382

అర్థాలు : భవదీయంబైన= మీదైన, చిత్తఅబ్జమున్= మనస్సు అనెడి పద్మమును, చొప్పు+అరసి= జాడదెలిసి, సూత్రంబు= కార్యము,

భావము : మంత్రి ఇట్లనెను- “రాజా! మన నగరము చాల దూరమున ఉన్నది. రాత్రి ఇక్కడనే ఉండి, మీ మనసును ఆకర్షించిన ఆ యువతి జాడ తెలిసికొని, ఆమెను మీరు పొందుటకు తగిన సాధనములను ఆలోచింప వలసియున్నది”

తే॥ అనిన నౌగాక యని సచివాగ్రగణ్యు
గూడి పుష్పిత పున్నాగ కురవకాళి
విశదమగు సైకతస్థలి విశ్రమించి
రనిన నవ్వలి కథ తెల్పుమనుచు పల్క 383

అర్థాలు : సచివాగ్రగణ్యు= మంత్రిని, విశదమగు= విశాలమైన

భావము : అని మంత్రి యనగా, ‘ఔను కదా’ యని రాజు మంత్రితో కలిసి పూచిన పున్నాగ ఎఱ్ఱగోరింటలతో విశాలమైన ఇసుక పఱచిన చోట రాజును మంత్రియు విశ్రమించిరి. వెంటనే సూతమహర్షిని ఆపై కథను విన్పింపుమని శౌనకాది మునులు కోరిరి.

ఉ॥ అభ్రగనీల! సచ్చరణ! హారకిరీటముఖ ప్రభూషణా!
శుభ్రకరాంగుళాభరణ! సూరిజనోత్తమ! మత్తవారిజా
తభ్రమర ప్రచారణ సదాభవతారణ! కాంతినీల! నీ
లాభ్రమదాపహారణ! సదార్య విచారణ! మూలకారణా! 384

అర్థాలు : సత్+చరణ= గొప్పపాదములు కలవాడా!, అభ్రగనీల= మేఘము వలె నీలవర్ణము కలవాడా!, హారకిరీటముఖప్రభూషణ= మాలలు, తలపై కిరీటము గలవాడా!, శుభ్రకర+అంగుళ+ఆభరణ= శుద్ధమైన చేతులు, వ్రేళ్ల యందు నగలు కలవాడా!, సూరిజన+ఉత్తమ= పండితులలో శ్రేష్ఠుడా!, మత్తవారిజజాతభ్రమరప్రచారణ= పూతేనె త్రాగుటచే మదించి పద్మములందు, సంచరించు తుమ్మెదలవలె నుండు వారిని (భక్తులను), సదాభవతారణ= ఎల్లప్పుడును సంసారమను బంధము నుండి తరింపజేయువాడా!, కాంతినీల= నీలకాంతులను కలవాడా!, నీల+ అభ్రమదఅపహరణ= నల్లని మేఘముల వంటి ఏనుగుల మదములు అణచినవాడా!, సత్+ఆర్యవిచారణ= సత్పురుషులచే వేదాంత చర్చలు కావించువాడా!, మూలకారణా= సృష్టి స్థితి లయములకు మొట్టమొదటి కారణమైనవాడా!

(ఈ పద్యము మొదలుకొని ఆశ్వాసాంతపద్యములు. ఇందు కవి తన ఆరాధ్యదైవమగు శ్రీ బిట్రగుంట వేంకటేశ్వరస్వామిని స్మరించుటే విషయము. ఆశ్వాసాంతమున కవినుండి కావ్యమునంకితము గొనిన రాజును ఆశీర్వదించు రూపమున గాని లేక ఆరాధ్యదేవతాస్తుతి పరముగ గాని పద్యములుండుట సంప్రదాయము.)

క॥ అవిరళ సంతత కరుణా!
ప్రవిమల ఘన పద్మరాగ రత్నాభరణా!
భవవినుత భద్రచరణా!
నవనీత ధనాపహరణ నయగుణవరణా! 385

అర్థాలు : అవిరళసంతతకరుణా= విరివియైన ఎడతెగని దయకలవాడా!, ప్రవిమలపద్మ రాగరత్నఆభరణా= చాలా నిర్మలమైన పద్మరాగ మనెడి రత్నమును ఆభరణమైనవాడా!, భవవినుతా= శివునిచేత స్తుతింపబడువాడా!,

భద్రచరణా= శుభముల నిచ్చు పాదములు కలవాడా!, నవనీతధన+ అపహరణ= వెన్న అనెడి ధనమును దొంగిలించినవాడా!, నయగుణవరణా= నీతి ధర్మము న్యాయము అనెడి గుణములచే కోరదగినవాడా(ఆ గుణాలున్న వారిని రక్షించును)

విశేషము : వెన్న యనునది భౌతికార్థమున వ్రేపల్లెలోని వారి ధనసంపద. దానిని కృష్ణావతారమున అపహరించినవాడు. ఆధ్యాత్మికమున, మనో మథనమునకు ఫలమైన కరుణను చూపువాడు. ఆ కరుణ వెన్నయే! భక్తుల మనసులను వెన్నవలె హరించువాడని భావము.

గోమూత్రికాబంధము

చ॥ పరమదభంగ దీనజనపక్షదయాకర వారిజేక్షణా!
కరదరపూర్ణ దైత్యమదఖండన గోధన మూలకారణా!
వరమదనాంగదీన జనపక్ష నిరంకుశ వైరి శిక్షణా!
శరదర వర్ణ నిత్యపదచందన గోధరశైల ధారణా! **386**

అర్థాలు : గోమూత్రికాబంధము : పరమదభంగ= గర్వించువారి నెల్లను అణచువాడా!, దీనజనపక్షదయాకర= దిక్కులేక అలమటించు వారియెడ దయకు స్థానమైనవాడా!, వారిజ+ఈక్షణా= పద్మమువంటి కన్నులచే చూచువాడా!, కరపూర్ణ= శంఖముచే నిండిన చేయి కలవాడా!, దైత్యమదఖండనా!= రాక్షసుల మదమును నాశము చేసినవాడా, గోధనమూలకారణా= గోవులనెడి సంపద (అనేకార్థములు కలది) పరమమైన కారణమైనవాడా!, వరమదన+అంగ= శ్రేష్ఠమైన మన్మథుని వంటి శరీరము కలవాడా!, దీనజనవారిద= దుర్బలులైన జనులకు మేఘమైనవాడా! (తాపమును హరించువాడా), వైరిసమూహశిక్షణా= శత్రువుల గుంపును శిక్షించువాడా!, శరదరవర్ణ= తెల్లు శంఖముల శుభ్రమైన వన్నెకలవాడా!, నిత్యపదచందన= శాశ్వతమైన పాదముల పరిమళాలు కలవాడా!, గోధరశైలధారణా= గోవర్ధన గిరిని ధరించినవాడా!

విశేషము : సర్వమునకు మూలమైన ప్రధానమైన కారణమును పురుషులలో ఉత్తముడును కనుక ప్రధాన పురుషుడుడని ప్రయోగము. ఈ పద్యము గోమూత్రికాబంధమున నిబద్ధమైనది. గోమూత్ర మనగా ఎద్దు మూత్రము. ఎద్దు నడచుచు మూత్రమును విసర్జించునప్పుడు, ఆ మూత్రము అలలను పోలిన ఒక రేఖగా చిత్రితమగును. ఇట్టి రేఖాచిత్రమున ఈ పద్యము నందలి అక్షరములను నిర్ణీత ప్రదేశములందు అమర్చుటకు వీలుగా వ్రాయబడినది. ఇది చిత్రకవిత్వమున ఒక రీతి.

గోమూత్రికాబంధము

తోవక వృత్తము

ఆనన సద్దరహాసవిలాసా!
మౌనిజనాంచిత మానసవాసా!
భాను శతాయుత భాతను భాసా!
భూనుత సంతత పోషిత దీపా! **387**

భావము : ముఖమందు చక్కని చిఱునవ్వు విలాసము కలవాడా! మునుల నిర్మలమైన మనస్సులలో ఉండువాడా! నూఱులకొలది సూర్యుల వలె ప్రకాశించు దేహకాంతి కలవాడా! భూమి యందు ఎల్ల వేళలా స్తుతులచే పోత్సహించు జ్యోతియైన వాడా!

విశేషము : భగవంతునకు సత్+చిత్+ఆనందము అను గుణములు చెప్పబడినవి. సత్ అనగా ఉనికి. చిత్ అనగా జ్ఞానము, ఆనందము చిత్తవికాసము. ఎట్టి వికారము లేని 'రస' స్థితి. అన్ని వికారములకు పర్యవసాయి అయిన స్థితి. ఈ స్థితిని ఛాయామాత్రముగ నిత్యానుభవమున చూడవచ్చును. కావ్యమునకు రసము ఆత్మ. వేదాంతము గూడ 'రసో వైసః' అనుచున్నది. రసమనగా 'సారము'. ఇది ఆహార విషయమున షడ్రసములుగా అనుభూతమగు చున్నది : 1.కటు, 2.తిక్క, 3.ఆమ్ల, 4.మధుర, 5.లవణ,

6. కషాయ రసములు. కావ్యపఠనముల అనుభూతమగు రసములు తొమ్మిది: 1.శృంగార, 2.హాస్య, 3.కరుణ, 4.రౌద్ర, 5.వీర, 6.భయానక, 7.బీభత్స, 8.అద్భుత, 9.శాంత రసములు. వాత్సల్యము కూడా రసముగ పదియనుటయు కద్దు. ఈ సర్వవిధ రసములకును పర్యవసాయి రసము ఆనందము. ఇవన్నియు ఆనందరసమునకు ప్రాకృతిక వికారములు. కనుక ఈ కవి ఆనందమునకు ప్రతీకయైన దరహాసమును ప్రస్తావించెను.

పరమాత్ముడనగా ఉనికి. కనుక మునుల మనస్సులందు ఈ ఉనికి తెలియవచ్చును. మునులు చిత్తవికారములను శాంతింపజేసికొన్న మహాత్ములు. అందువలన వారి మనుస్సులందు పరమాత్మ సత్ప్రకాశము కన్నుల పండుగగును పరమాత్ముడు జ్ఞానప్రకాశుడు. జ్ఞానము (చిత్) సమస్తమును దీపింపజేయునది. కనుక కవి ఆశ్వాసమును పరమాత్మను సచ్చిదానంద రూపుని ప్రస్తుతించినాడు.

ఇది సంస్కృతచ్ఛందమున, త్రిష్టుప్ ఛందమున పుట్టిన తోదకవృత్తము. ఇందు ప్రతిపాదమున 11 అక్షరములు, భ భ భ గగ అను గణములతో 6-5 అక్షరముల విరామముతో సాగు నాలుగు పాదముల వృత్తము. తెలుగు ఛందస్సులో దీనిని తోవకవృత్తము అనుట కద్దు. ఇందు విరామ స్థానమైన 7వ అక్షరమున స్వరమైత్రిని, ప్రతిపాదమున ప్రాసాక్షర నియతిని తెలుగువారు కూర్చిరి. అట్లే ఆశ్వాసాంతములలో ఉపయోగించినప్పుడు అంత్యప్రాసను కూడా పాటింతురు. ఇదంతయు శ్రావ్యతను కలిగించును.

గద్యము

ఇతి శ్రీమద్వేంకటేశ్వర వరలబ్ధ కవిత్వ రచనా చమత్కార సుజన భజనాచార భారద్వాజగోత్ర పవిత్ర నరసనామాత్యపుత్ర సకల కవిజన సఖ్య వేంకటార్య ప్రణీతంబైన

విష్ణుమాయా విలాసంబను
మహా ప్రబంధము నందు చతుర్థాశ్వాసము

పంచమాశ్వాసము

శ్రీరామానుజ! గోపకు
మారక! నవనీతచోర! మన్మథజనకా!
నారాయణ! దామోదర!
వీరాసురదర్ప హరణ! వేంకటరమణ! 1

అర్థాలు : శ్రీరామ+అనుజ= బలరాముని తమ్ముడవైన, గోపకుమారక= గోపాలనందన! నందగోపుని కుమారుడా! కృష్ణా!, నవనీతచోర= వెన్నదొంగా!, మన్మథజనకా= మన్మథుని తండ్రీ!, వీర, అసురదర్పహరణ= వీరులైన రాక్షసుల గర్వమును మాపినవాడా!

విశేషము : శ్రీ శబ్దానికి బలతేజములు అర్థములు కనుక శ్రీరామ యనగా బలరాముడను నర్థము సాధ్యము. గోవులు యదువంశసంపద కనుక వారు గోపాలకులను వాడుక యేర్పడినది. అదిగాక గో శబ్దానికి వేదములను అర్థమున వేదపాలకుడైన విష్ణువు గోపాలుడగుచున్నాడు. ఇట్లే గో శబ్దమునకు కాంతికిరణమను అర్థమున్నందున కాంత్యభిమానిదేవతయైన లక్ష్మీదేవిని పాలించువాడనియు అర్థమున్నది. మఱియు గో శబ్దమునకు భూమి, ఆకాశము అను అర్థములున్నందున భూనభంబులకు నాయకుడైన విష్ణువును గోపాలశబ్దము సూచించును.

మనస్సులను మథించువాడు మన్మథుడు. ఈ మథనశక్తికి మూల శక్తియైనవాడు విష్ణువు. ఈ మథనమున మనస్సు అనెడి క్షీరసముద్రము నుండి వెలువడు సారభూతమైన ఆత్మదర్శనమే నవనీతము, అనగా, క్రొత్తగా తీసికొనిరాబడినది. దీనిని స్వీకరించువాడు ఆ విష్ణువే. ఇట్లే శబ్దములకు భౌతికమగు కృష్ణావతారపరమైన ప్రసిద్ధార్థముతో బాటు ఆధ్యాత్మిక సంకేతార్థములు గూడ పొసగుచున్నవి. 'విష్ణుమాయావిలాసము'నకు

లక్ష్యము జీవాత్మకు పరమాత్మ దర్శనము లభించు మార్గమును బోధించి నడిపించుటే కనుక ఈ శబ్దముల ప్రయోగము సార్థకము. ఆశ్వాసాది ప్రార్థనమిట్లు కావ్యప్రయోజనముతో సంగతమైయున్నది.

ఆ॥ అవధరించు శౌనకాదిసన్మునులకు
సూతుడిట్టులనియె ప్రీతితోడ
సంయమీంద్రులార చంద్రరేఖాలగ్న
విభ్రమాత్ముడగుచు విశ్వవిభుడు 2

అర్థాలు : సంయమీంద్రులార= మునులారా!, చంద్రరేఖాలగ్న= చంద్రరేఖయందు తగిలిన, విభ్రమ+ఆత్ముడు+అగుచు= భ్రమజెందిన మనసు గలవాడై, విశ్వవిభుడు= ఆ రాజు

భావము : ప్రీతితో వినుచున్న శౌనకుడు మొదలైన శ్రేష్ఠులైన మునులకు సూతుడు ఇట్లు వచించెను. "మునులారా! చంద్రరేఖపై మనసుకలిగి భ్రమచెంది, ఆ రాజు మోహము చెందిన వాడయ్యెను."

సీ॥ కందునా తన్వి నా కందునా పల్కులు
విందునా వీనుల విందుగాను
పల్కునా దయ మారు చిల్కునా
దలకు నామనసు చింతలకు బాపి
మరలునా యింతగా మరులు నాహృదయంబు
నలరంగ నిచటికి నలరు బోడి
పొందునా కేలికిం పొందునా చక్కని
లికుచంబులన తొయ్యలి కుచయుగము

తే॥ తలముగన్గొందు నెట్టులుత్తలము దీర
కులము దెలియుదు నెట్టు లాకులము నెడల
వేగు నందాక తాళదు వేగిరంబె
చలము సాధించు మరుడు నిశ్చలముగాను 3

అర్థాలు : తన్వి= స్త్రీ, లికుచంబులు= గజనిమ్మకాయలు, ఉత్తలము= పరితాపము, ఆకులము= కలత.

భావము : "చూడగలనా? ఆమె నాకు లభించునా? ఆమె తియ్యని మాటలు వినగలనా? ఆమె మారు మాట్లాడునా? ఇంతగా నామనస్సును మరులు గొల్పిన ఆమె మరల వచ్చునా? ఆ వనితను కాముని క్రీడకై పొందగలనా? గజనిమ్మకాయల వంటి చన్నుల జంటను అంటగలనా? నా మదన తాపము తొలగునట్లు ఆమె ఎచట నున్నదో ఎట్లు కనుగొనగలను? నా కలత పోవునట్లు ఆమె కులమును ఎట్లు తెలిసికొనగలను? తెల్లవాఱువఱకు సహింప సాధ్యము కాదు. త్వరగా మదనుడు తప్పక, పట్టుదలతో చెలరేగును." ఇది అంతయు స్త్రీపై గల వ్యామోహముతో మనస్సులో చెలరేగిన భావపరంపర. ఇది గాఢమైన కోరికను ఆతురతను తెలియజేయును.

సీ॥ కరుణాకటాక్షవీక్షణలవం బిచ్చెనా
కడమయై మైతాప మెడయుటకును
తేటమాటల నెద దీర్పంగ గల్గెనా
సందియంబే పున ర్జన్మమునకు
అధరాధరామృతం బానంగ గల్గెనా
యనుమానమే సుధాశనము గొనుట
నెదజేర్చి కౌంగిట నెలయింప గల్గెనా
భ్రాంతియే త్రిజగతీరాజ్యమహిమ

తే॥ కలుగనేర్చునె యెంతటి ఘనునకైన
కలనుగన్నట్టు మేలు లోకములయందు
యేల సిద్ధించు నను బోటి కేలకలుగు
కలుగనుండిన నిలువదే కలికి యిచట 4

అర్థాలు : మైతాపము+ఎడయుటకు= శరీరతాపమును చల్లార్చుటకు, సుధాశనము= అమృతమను ఆహారము

భావము : "ఆమె కడగంటి చూపులు నా శరీరతాపమును పోగొట్టును. ఆమె మాటలు నాకు పునర్జన్మమును ప్రసాదించును. (అనగా, నన్ను బ్రతికించును, లేకున్న మరణింతునని భావము) ఆమె అధరామృతము రుచి చూడగలిగినచో, ఇక నాకు అమృతము అక్కఱలేదు. ఆమె కౌగిలి ముల్లోకముల నేలినంత ఘనత. కాని, కలలో కన్పించినట్లు ఇలలో మేలు కన్పించదు కదా. ఒకవేళ కల నిజమగుచో, ఈ పాటికామె నా ముందు నిలువకుండునా?"

**మ॥ అని నిట్టూరుపు నించు నుస్సురను చింతాంభోధిలో మగ్నుడౌ
వనజాక్షేగిన త్రోవ చూచు నొగులున్ వాక్రుచ్చు నప్పల్కులున్
వినునట్లై నను వేచు కాదనుచు నిర్విణ్ణత్వమున్ంబొందుఁ నా
జననాథాగ్రణి భామినీతను విలాసశ్రీఫలాకాంక్షియై** 5

అర్థాలు : నొగులున్= బాధపడు, వేచు= వేధించు, నిర్విణ్ణత్వమున్= నిశ్చేష్టతను, భామినీ= ఆ స్త్రీ దేహసౌందర్య, తనువిలాసశ్రీకాంక్షియౌచున్= సంపదను చూడగోరినవాడై

భావము : అని నిటూర్చును, చింతించుచు, ఆమె వెళ్ళిన త్రోవవైపు చూచును, నొచ్చుకొనుచు, మాట్లాడును. ఆమె మాటలను వినుచున్నట్లు తోచి తన్ను తపింపజేయుచున్నది కదా అనుకొని, అంతలో తెలిసికొని నిశ్చేష్టుడగును. ఇట్లు ఆ వనిత శరీరసౌందర్యసంపద చూడదలచిన వాడైన,

**ఉ॥ ఉన్ననృపాలమౌళి గని యుల్లము ఝల్లన డిల్లనొంది తా
దిన్నగ బల్కె మంత్రి జగతీవర! గుల్మలతాప్రవాళస
చ్ఛన్నము నీస్థలంబు పటు సైకతశీతలవాతపోతసం
పన్నముయామునాతటము భాసిలు నందుల జేరబోదమే** 6

భావము : విరహాన వ్రేగుచున్న రాజును చూచి దిగులు జెంది మెల్లగ మంత్రి "ఓ రాజా! పొదలు తీగెలు, చిగుళ్లు కలవి. చల్లనిగాలి వీచు యమునా నదీ

తీరాన ఉన్న ఇసుక తిన్నెల కడకు పోదమా?" అనెను. ప్రశాంతమైన ప్రకృతిదృశ్యాలు సేదదేర్చి, రాజుగారి విరహతాపాన్ని శమింపజేయునని మంత్రిగారి ఆశ.

**మ॥ అని యచ్చోనెడబాసి వాసిగల చైత్రావాసభాసప్రసూ
ననితాంతాతిమరందకందళితపున్నాగాళిరాణించుపె
న్నును సన్నంపు సుసైకత స్థలి దగన్ ప్రొద్దుచ్చుచున్ చక్కగా
మనుచర్యల్వినుపింపుచున్మతియుసమ్యక్రీడలం దేల్చుచు** 7

అర్థాలు : చైత్ర+ఆవాసభాసప్రసూననితాంతమరందకందళితపున్నాగాళిరాణించు= చైత్రమాసములో వికసించే పువ్వుల తేనెసోనలతో పున్నాగములు శోభించు

భావము : ఆ చోటు విడిచి, ప్రసిద్ధిగల వసంతకాలమందు ప్రకాశించు స్రవించుచున్నట్టియు, పున్నాగపూల తేనెలు శోభకలిగినట్టియు, మృదువైన, సన్నని ఇసుక తిన్నెలుగల చోట్లలో, ప్రొద్దు పుచ్చుచు చక్కగా వినోదమునిచ్చు నాట్యముల చేతను, పాటలను వినిపించుచు, మెప్పించు ఆటల చేతను ఆ రాజును ఉల్లాస పరచుచుండెను.

**ఉ॥ ఎన్నివిధంబులం మనసొకించుక శాంతివహింప దక్కటా
వెన్నెలవెల్లికిం గుసుమవేల్లితపల్లవవృక్షవాటికిన్
క్రొన్నెలరాలపేటికిని గూడకయుండిన నేమిసేయ ని
ట్లన్నిటికన్న మేటిమలయానిలధాటికి మాటికుల్కెడున్** 8

అర్థాలు : వెన్నెలవెల్లి= వెన్నెల ప్రవాహము, కుసుమవేల్లితపల్లవవృక్షవాటికన్= పువ్వులు వ్రేలాడుచుండు, చివురులుగల వృక్షములుండు వనమునకు, క్రొన్నెలరాలపేటికిన్= చంద్రశిలామండపమునకును, మాటికి+ఉల్కెడున్= మాటిమాటికి ఉలికిపడుచున్నాడు.

భావము : "విరహతాపోపశమనమునకు ఏమి చేసినను ఫలము లేకున్నది కదా, ఇంకేమి చేయగలను? చల్లని వెన్నెల గాని, పుష్పవృక్షవనము గాని, చంద్రశిలా వేదికగాని నిష్ప్రయోజనమైనవి చల్లని గాలికే ఉలికిపడుచున్నాడే!"

వ॥ ఇందులకేమి సేయువాడనని వితర్కింపుచు 9

భావము : ఇట్లుండగా, తానేమి చేయగలననిమంత్రి తర్కించుకొను చున్నాడు.

చ॥ ఇది సమయంబటంచు మరుడేపున గోవులమించి డాయగా
నుదుట మదాళినెల్ల జననొయ్యన ముందరబంపి యొక్కమై
గొదగొని మిన్నుపిక్కటిల గోయనికోయిల కంచుగొమ్ములు
న్మదగతి మ్రోయనంచ మొన మందమరుత్తులు బారులై చనన్ 10

అర్థాలు : కోవుల వించి= కొప్పులతో, గొదగొని= అతిశయించి, అంచమొన= రాజహంసల ముందుగా, మందమరుత్తులు= పిల్లవాయువులు.

భావము : ఇదే మంచి సమయమనుకొని మన్మథుడు అతిశయించి వింటికొప్పులతో ఆరాజు దరిజేరగా మున్ముందు గండు తుమ్మెదల బంపి, ఒకేసారి అతిశయించి ఆకాశము దద్దరిల్లునట్లు 'కో' యని కోయిల కంచు కొమ్ము ఊదినట్లు కూయగా, రాజహంసలు ముందుగా, పిల్లవాయువులు క్రమక్రమముగా వీచుచుండగా.

విశేషము : తుమ్మెదల నాదములు, కోయిలల కూతలు, హంసల గమనములు, పిల్ల వాయువుల ప్రసారము విరహుల కామమును ఉద్దీపింపజేయునవి.

చ॥ చిలుకపఠాణినెక్కిననసింగిణి షట్పదనారిపూన్చి పూ
ములుకులు మేననించి పనిబూనియ వేయుచుజేరవచ్చి తా
వలగొని వెంట నంటి గొరవంకభటుల్ బిరు దుగ్గడింపగా
కలువమెరుంగు నేస సరిగట్టగ దా నెదనేసె నార్చుచున్ 11

అర్థాలు : చిలుకపఠాణిన్= చిలుక గుఱ్ఱమును ఏస (వాహనము), ననసింగిణి= పూల విల్లును, షట్పదవారి= తుమ్మెదల అల్లెత్రాడును, ఏస= అతిశయము, ప్రకాశము.

భావము : మన్మథుడు చిలుక నెక్కి, పూలవిల్లు పూని, తుమ్మెదల నారి సారించి, పూల బాణాలు సంధించి, గోరువంకలు వాని బిరుదులు చదువగా కలువ పూలతో ప్రకాశించు బాణమును రాజు గుండెపై గుఱిచూచి సరిగా తాకునట్లు అఱచుచు వేసెను.

ఉ॥ ఏసిన సొమ్మసిల్లి ధరణీశ్వరు డల్లన దెల్వినొంది లో
గాసిలి దిక్కులం గలయ గన్గొని మంత్రిపయిన్ శరీరమున్
తోసినయట్ల వ్రాలికడు దొట్రిలి యంతను కన్ను విచ్చుచో
హా సుమగంధి! హా కలికి! హానవమోహిని యంచుబల్కుచున్ 12

భావము : మన్మథుడట్లు పుష్పబాణము వేయగా, ఆరాజు తెల్వి దప్పి మూర్ఛిల్లి, మరల తెల్విరాగా, దిక్కులు కలయజూచి, ఎవరో త్రోసినట్లు పట్టుదప్పి మంత్రిపై బడి, తొట్రుపడి, కండ్లు విప్పి చూచి "అహో పూవుల వాసనలు కలదానా! కలికీ (సుందరీ), క్రొత్తదైన మోహింపజేయు రూపము కలదానా!" అని పలవరించెను.

ఉ॥ వేదననొందుచున్ మొగము వెల్వెలబారగ దీనవక్త్రుడై
యూదినధైర్యమున్ సడలి యోర్వగరాని మనోజధాటి తా
నాదట డిల్లనొందు తెలివందును గుందును మంత్రిమోము దా
పేదయుబోలె గన్గొనును బెగ్గిలు వేగిన గుండెతో గడున్ 13

భావము : వేదనతో మొగము పాలిపోగా, దీనుడై, తెచ్చికొనిన ధైర్యము తప్పగా మన్మథుని దాడికి తాళలేక తెలివి తప్పుచు మరల తెలివి రాగా బాధపడుచు, మంత్రి ముఖమును ఒక పేదవాడు భాగ్యవంతునివైపు చూచినట్లు వేడెక్కిన గుండెతో దీనముగ చూచెను.

వ॥ ఇట్లు మదన ప్రదరవిదళితహృదయుండైన యమ్మేదినీనాథువేదనం గనుంగొని మనసుపొందక కందర్పునుద్దేశించి యిట్లనియె 14

అర్థాలు : మదన ప్రదర ప్రదళిత హృదయుండై= మన్మథ బాణములచే కొట్టబడిన హృదయము గలవాడై, కందర్పున్= మన్మథుని

భావము : ఈ విధముగా మదనుని బాణములచే బాధితుడైన హృదయము గలవాడైన రాజు వేదనను చూచి, నిలుకడ లేని మనస్సుతో కామునితో ఇట్లు అనెను.

శా॥ **మిత్రత్వానకు మేనమామ మఱి సామిద్రోహి చంద్రుండయో**
పాత్రుండే గురుతల్ప గుం డహిభయప్రాప్తుండు తల్లింటికిన్
శత్రుం డంతియకాదుసూ సకల దోషావాసి బోనాడి యా
చైత్రుం గూడుము జాతిహీనుడని యెంచన్‌రాదు పుష్పాశుగా! 15

అర్థాలు : గురుతల్పగుండు= గురువుగారి భార్యతో వ్యభిచరించినవాడు, అహిభయప్రాప్తుండు= పామువలన భయము చెందినవాడు, తల్లిఇంటికిన్= పుట్టినింటికి శత్రువు, చైత్రున్= వసంతుని, పుష్పాశుగా= పూవుల బాణములు గలవాడా!

భావము : స్నేహమునకు మేనమామ, స్వామి ద్రోహి, గురుని భార్యతో వ్యభిచరించినవాడు, సర్పదోషము గలవాడు, పుట్టినింటికి శత్రువు, అన్ని దోషాలకూ నిలయమైనవాడు, చంద్రుడు. కనుక వానిని విడిచి వసంతునితో స్నేహము చేయుము. మన్మథా! అతడు కులము తక్కువవాడు అనుకోవద్దు.

విశేషాలు : చంద్రుని అందఱును మామ యనియే పిలుతురు. మేనమామ చంద్రుడైనచో, కన్నతల్లి శ్రీ మహాలక్ష్మియే యని భావము. చంద్రుని ప్రభువు ఇంద్రుడు. బృహస్పతి దేవతల గురువు. అతని భార్యతో సంగమించి, ఇంద్రుని మోసము చేసిన వాడై స్వామి ద్రోహి, మఱియు పరస్త్రీ లోలుడైన పాపియయ్యెను. ఈతడు అనసూయ, అత్రిమహాముని దంపతుల సుతుడు. అమృతపానము చేయుచున్న రాహుకేతువులను మోహినికి చూపుటచే వారు పాములై చంద్రుని భక్షింతురు.బహుభార్యలు గల చంద్రుడు రోహిణియందే

అధికానురాగమును ప్రదర్శించి, ఇతరుల యందు ఉదాసీనుడైన అపరాధి. కనుక ఇట్లు సర్వ దోషములకు నెలవైనవాడు. తల్లింటికి శత్రువు. బుధుడు తారకు చంద్రునికి కల్గెను. బుధుని కొఱకు దేవతలు, బృహస్పతి పక్షమున, రాక్షసులు చంద్రుని పక్షమున యుద్ధము చేసిరి. కనుక తల్లియిల్లైన అమరావతికి శత్రువు చివఱ బుధుడు చంద్రునితో, తార బృహస్పతితో చేరిరి.

వ॥ **అని మఱిమఱి పెచ్చు పెరుంగు పచ్చవిలుకాని మచ్చరం బిచ్చ నెఱింగి క్రమ్మర నిట్లనియె 16**

అర్థాలు : పచ్చవిలుకాని= మన్మథుని, క్రమ్మఱ= మరల

భావము : అని, మిక్కిలి ఎక్కువగుచున్న మదనుని తాపమును తెలిసికొని, మరల ఇట్లు వచించెను.

శా॥ **నీచుండుం బహుళక్ష యుుండు శశినెంతో పొందు గాదన్నచో**
నాచండాలిగుణంబుమానునె కటా! యార్తార్తికిట్లెంతగా
వాంఛింపం దయబుట్టునే ప్రకటదుర్వ్యాపారివంచుం గదా
నీ చొప్పార లలాటలోచనుడు మున్నిర్మూలముం జేయడే 17

అర్థాలు : చొప్పు+ఆర= పద్ధతి మాసిపోగా, చండాలగుణము= ఉద్రేకము కలిగించు స్వభావము, లలాటలోచనుడు= శివుడు

భావము : "చంద్రుడు నీచుడు, క్షీణించే గుణము గలవాడు, వానిని విడువుమని ఎంత ఆర్తితో నేను చెప్పినప్పటికిన్నీ, నీ పద్ధతి మారదు. నీవిట్టి చెడు స్నేహములు గల వాడవనియే కదా ఆ శివుడు నిన్ను బూడిద చేసినాడు."

విశేషాలు : చంద్రునకు పక్షము రోజులు క్షీణించుట యున్నది కదా అది ఎంత పర్యంతమనగా అమావాస్యనాడు అసలే కనబడక పోవునంతవఱకు. కనుక అతడు బహుళ క్షయుడు, క్షయవ్యాధి గ్రస్తుడు. ఈ పక్షానికి కృష్ణపక్షమని పేరు. దీనినే బహుళ పక్షమనికూడ అందురు, కనుక బహుళ క్షయరాజు, బహుళ పక్షమున క్షీణించువాడు.

దక్షయజ్ఞ సందర్భములో శివపత్ని సతీదేవి యోగాగ్నిలో దగ్ధకాగా, విరక్తితో శివుడు హిమసానువులను జేరి తపస్సు చేయుచుండగా, హిమవంతుని కూతురుగా పుట్టి పార్వతియైన సతీదేవి వానికి సపర్యలు చేయుచున్న సమయమున ఇంద్రుని ఆజ్ఞతో మన్మథుడు శివునిపై తన బాణములు ప్రయోగించి పార్వతిపై మరులు కొనునట్లు చేయుటకై ప్రయత్నించును. శివుడు ఆగ్రహించి తన మూడవదైన జ్ఞాననేత్ర జ్వాలతో మన్మథుని దహించివేయును. దేవతల ప్రార్థనలతో ప్రసన్నుడై మరల అతడు తన భార్యకు సతనుడే యైనను లోకులకు మాత్రము అతనుండు, అనంగుడు కాగలడని అనుగ్రహించును. ఈ కథ ఇచట సూచితము.

క॥ చచ్చీచావని బ్రతుకే
ముచ్చువగన్ పాంథజనుల మొగమోడకయో
మచ్చరము చేసె దీబిగు
వెచ్చట జనె మదన యుగ్రు నెదుట నిలువగన్ 18

అర్థాలు : ముచ్చువగన్= దొంగ సానుభూతితో, పాంథజనుల= బాటసారుల

భావము : "విరహముతో వేగుచు చావు బ్రతుకుల మధ్యనున్న బాటసారులపై దొంగ సానుభూతి చూపుచు మాత్సర్యముతో వారిని వేధించెదవు కదా. ఆశివుని విషయములో ఈ శక్తి అంతా ఏమై పోయినది మన్మథా!"

పై పద్యములో విశేషముగా చెప్పిన కామదహన కథ ఇట అనుసంధించుకో దగును.

వ॥ అని చంద్రునాలోకించి 19

భావము : అని, చంద్రుని చూచి.

మ॥ కలశాంభోనిధి లక్ష్మితో నొదవి శృంగారంబు సత్కాంతియున్
నలు వొందం ద్విజరాజువై కువలయానందంబు గావించి ని

శ్చలసద్వృత్తి సుధాకరుండవుగదా చర్చింప బాంథాహితో
జ్జ్వల భానుండవుగాగ నేమిటికయో వద్దయ్యానిందల్ శశీ! 20

అర్థాలు : కలశాంభోనిధి= పాలసముద్రమున, కువలయానందంబు= కలువలకు సంతోషము, సుధాకరుండవు= అమృతహస్తుండవు, పాంథ+అహిత+ఉజ్జ్వల= బాటసారులకు బాధకలిగించునంత జ్వాలామయుడైన, భానుండవు= సూర్యుడవు.

భావము : "శ్రీమహాలక్ష్మి తోబుట్టువుగా పాలసముద్రమున పుట్టినావు. అందము, తేజస్సు కలిగినవాడవు. క్షత్రియులకు ప్రభువైనావు. (రెండుసార్లు పుట్టినవాడవు). నీ ఉదయముతో కలువలు వికసించును. ఎంత అలసిన ప్రాణికైనా నీ కిరణములు సోకినచో అమృతము త్రాగినట్లు పోయిన ప్రాణము తిరిగి వచ్చును. ఇంత మంచి వాడవుకదా చంద్రుడా! బాటసారులను బాధించే సూర్యునివలె విరహిజనులను బాధించి నిందమోయుట మేలా? వద్దు."

వ॥ అని మలయపవనుం గనుంగొని 21

భావము : అని, మలయ పర్వతమునుండి వీచు వాయువులతో ఇట్లు వచించెను.

ఉ॥ వ్యాళముఖోగ్రఘోరవిషవహ్నిహతిం గడముట్టు ప్రాణియౌ
నాలివుడెందుసర్వజన నాశన కారియు నేటి శాస్త్రవా
గ్జాలమదేల తప్పు నదిగాక మహాగ్నిసఖుండవెందు నీ
వోలిని పాంథమానస పయోధరఘాతము గాలిభూతమా 22

భావము : "పాము యొక్క నోటియందుండి వెల్వడు భయంకరమైన విషమనెడి నిప్పు యొక్క తాకుచే నాశము చేయు విధమున పంచభూతాలలో నాల్గవవాడవు. సర్వజన నాశనకారియగు నిన్ను నిందించు శాస్త్రమందలి వాక్కుల సమూహము ఏల తప్పు అగును?

నీవు గొప్పవాడైన అగ్నిదేవుని ఎచ్చటనైనను సహాయుడవు. క్రమము తప్పక బాటసారుల మనసులనెడు మబ్బులను(పాలకుండలను) చెదరగొట్టు గాలి దయ్యమా! (పృథ్వి, అప్పు(నీరు), తేజస్సు వాయువు, ఆకాశములు అనెడి వరుసలో నాల్గవవాడు.)

విశేషాలు : పయోధర శబ్దమునకు పాలను ధరించు కుండ యనియు, నీటిని ధరించు మేఘమనియు గూడా అర్థము. ఇల్లు చేరబోవు బాటసారులకు మేఘములను వర్షింపజేయు వాయువు మాటిమాటికి విఘ్నములు కలిగించుచు, ప్రియురాండ్రను కలువబోవు వారి పాలకుండలవంటి మనస్సులను భగ్నము చేయుననియు సూచ్యార్థము. 'గాలిభూతమా' అను సంబోధనలో, గాలి పంచభూతములలో నొకటియను గౌరవమునొకప్రక్క, ఇంకొకప్రక్క "నీకు భూతమను మాటయే సరియైనది, నీవు భయంకరుడవు, కనుక దేవుడనుట సరిపోదు" అను నిష్ఠురమున్నది.

వ॥ **అని యిట్లు మదనచంద్రమలయానిలుల వెండియు నిరసించియు నెన్ని విధంబుల శాంతింగానక యక్కన్యకారత్నంబుచన్న నెళవు నున్నను నికియు నెరుంగక రాజు నొంటి విడిచి చన ననువుగాక సాకరింపలేక కాక నొందు రాకుమారు ననేక ప్రకారంబుల వివేకంబు దెలుపుచుండె నటమున్నె యక్కడ** **23**

అర్థాలు : వెండియు= మఱియును, నెలవు= తావు, సాకరింపలేక= సహాయపడలేక, కాక= తాపము.

భావము : ఇట్లు మన్మథుని, చంద్రుని, మలయానిలమును మరల తూలనాడియును, శాంతించక, ఆ చంద్రరేఖ వెడలిన తావు గాని నివాసముగాని తెలియక, రాజును విడిచి పోలేక సహాయపడలేక మదన తాపముతో నున్న ఆ రాజునకు వివేక వాక్యములను బోధించు చుండెను. అంతకు ముందే అక్కడ,

ఆ॥ **మగువ చంద్రరేఖ స్మరశరఘాతల**
చంద్రికానలప్రసక్తినడరి
వీచు మలయపవనవేదన కోర్వక
మిగుల నొగిలి విసిగి మేనురోసి **24**

అర్థాలు : స్మరశరఘాతల= మన్మథుని బాణముల దెబ్బకు, చంద్రికానలప్రసక్తిన్= వెన్నెల మంటల ప్రసంగమునకు

భావము : చంద్రరేఖ మదన తాపమున వెన్నెలతోను మలయమారుత స్పర్శతోను ఎక్కువగా చాల బాధపడి, విసిగి, శరీరముపై రోత కలిగి,

సీ॥ **పంజరముననున్న పల్కురాచిల్కను**
కొలుకులబాష్పంబు లొలుక జూచు
పొలతుక మెకమొగమును మారుమూర్కొన
హరిణపోతమ్మును నక్కుజేర్చు
ననుగునెచ్చెలి నెద నదుముక నామీది
దయ మరువకయుండుతరుణి యనును
తానాడు బొమ్మల తనతోడి చెలికత్తె
యలకు మీరాడు కొమ్మనుచు నొసగు

తే॥ **మావిమోకకుజముల నేమరకు మనును**
చెలుల నందరిపనులు వచించి పనుపు
యువిదలను జూచు తాదల యూచుకొనుచు
సారె వెన్నెల గనుగొను చపలనయన **25**

అర్థాలు : హరిణపోతము= జింకపిల్ల, సారె= మాటిమాటికి

భావము : పంజరములోని చిలుకను నీరు నిండిన కనులతో చూచును. జింకపిల్లను ఒడిలోనికి తీసుకొని, దాని ముఖమునకు ముఖమును చేర్చును.

ప్రియసఖిని కౌగిలించి, తన్ను మఱవవద్దు అనును. తన బొమ్మలను చెలికత్తెలకిచ్చి, మీరు ఆడుకొనండి అని ఇచ్చును. మామిడి మొక్కల మఱవక పోషింపుడు అనుచు స్నేహితురాండ్రందఱికిని పనులు చెప్పి పంపించును. వారిని చూచి, తలయూచుచు వెన్నెలను చూచును. ఇవి చంద్రరేఖ విరహ వికారములు

క॥ తెగువమది నిశ్చయంబున
నొగి పీఠాసనమువేయు నుపచారిక లొ
మగువల తొలంగు డనుచును
బిగువును బిడియంబునుడిగి ప్రియసఖి కనియెన్ 26

భావము : తెగింపుతో, మనసున నిశ్చయించి తనకై ఆసనమును సిద్ధముచేయు పరిచారికలను ప్రక్కకు తప్పుకొనుడనుచు, బిగువును, సిగ్గును వదలి, ప్రియసఖితో ఆ చంద్రరేఖ ఇట్లనెను.

చ॥ మరుడు శరాసనాశుగసమన్వితుడై చనుదేరనిమ్ము భీ
కరశమనాశ మారుతము కమ్ముకొ మిక్కిలి వీవనీ మతిన్
సరసిజవైరిమింట నురుచంద్రిక వేడిమి జూప నిమ్మయో
తరుణిది యేమి పాపమని తట్టెడొ పుట్టెడొ చింత యేటికిన్ 27

అర్థాలు : శరాసన+ఆశుగసమన్వితుడై=అంబులపొది, బాణములు ఉంచెడి గొట్టము, భీకర మారుతము= భయంకరమైన, శాంతిని నశింపజేయుగాలి, సరసిజవైరి= పద్మముల శత్రువగు చంద్రుడు, చంద్రిక= వెన్నెల.

భావము : "మన్మథుడు తన ఆయుధాలతో రానీ, అన్ని దిక్కులనుండి భయంకరమైన గాలులు వీవనీ, ఆకాశములో చంద్రుడు వెన్నెలమంటలు రగుల్పనీ, అనుభవించ వలసినదే. తట్టెడైనను పుట్టెడైనను తప్పనిదైనప్పుడు చింతయేమున్నది? అయ్యో! యౌవనవతికి ఇది ఏ పాపఫలమో!"

చ॥ దుమికెద పండువెన్నెలను తోరపుమన్మథకేతకీకటా
రమునను మేను నొక్కెదను ప్రాకటకాలదిశానిలంబునే
భ్రమయక దీర్చెదన్ చెలులు పట్టక రావలదమ్మతాపభా
రమును సహింపజాల నటరా జిగురెండగుమీద నెన్నగన్ 28

అర్థాలు : కేతకీకటారమునను= మొగలిపూవు అను కత్తిపై, కాలదిశా అనిలంబున్= ఋతుధర్మము ననుసరించి ఏదేని యొక్క దిక్కునుండి వీచుగాలి, అట్టురాన్= అచ్చటికి పోగా, చిగురెండ= లేత ఎండ,అగు.

భావము : "నాకు అపకారము చేసేదే అయినప్పటికిన్నీ పండు వెన్నెలలో నిండార స్నానము చేసెదను. అది నీకు ప్రాణాంతకమగునని అంటారేమో! అయితే కానీ, ఉంటే ఉంటాను, పోతే పోతాను. మన్మథుడు నాపై గురిబెట్టేదాకా ఆగను. నేనే వెళ్ళి మన్మథుని ఆయుధమైన మొగలిపూవు అనెడి కత్తి మొనపై నా శరీరమును నొక్కెదను. కాలధర్మమును అనుసరించి తీవ్రముగా గాలులు వీచినను చలింపక ఎదుర్కొనెదను. అయ్యో! యౌవనవతికి ఇది ఏమి పాపమో? ఓ చెలులారా! నన్ను పట్టుకొనుటకై రావద్దు. ఈ తాపభారమును సహింపలేను. అట్లు ముందుకు పోగా లేతయెండ పైనుండి నన్ను తలపగా మాడ్చును కదా!"

పై పద్యముతో కలిపి అన్వయము "తట్టెడొ పుట్టెడొ చింతయేటికిన్" అన్న భావన విశేషమే ఇది కూడా.

విశేషము : కేతకీ పుష్పం మన్మథుని బాణాలలో ఒకటి.

ఆ॥ అనుచు చెంతనున్న యనుగునెచ్చెలిమీద
వ్రాలిహస్తపల్లవము భుజమున
వైచి బాష్పజలము వరదయై దొరుగంగ
నేడ్చుకొనుచు మఱియు నిట్టులనియె 29

భావము : ఇట్లని వాపోవుచు, చంద్రరేఖ తన ప్రియసఖి భుజము మీద వాలి చిగురుటాకు వంటి చేతిని ఉంచి కన్నీరు మున్నీరుగా విలపించుచు ఇట్లు పలికెను.

ఉ॥ ఏగతినోర్తు నే చెలియ యింతయు నాకును ప్రాణమౌదుగా
వేగ విషంబొకింత మనవిన్ విని తేవె సహింపజాల నే
మేగుడిగట్టుపై శిఖరమెత్తినపుణ్యమునీకు జేకురున్
బాగగుమారవాయుసితభానులకుం బగ దీరు నంతటన్ 30

అర్థాలు : మారవాయుసితభానులకు= మన్మథుడు, మలయమారుతము, సితభానుడు= చంద్రుడు

భావము : "నే తాళలేనే, నీవు నాకు ప్రాణసఖివి కదా! నాకింత విషము తెచ్చిపెట్టవే, ఈ తాపము భరింపలేను. నీకు గుడి కట్టుపై శిఖరము నిర్మించిన పుణ్యము కలుగును. నేను ప్రాణాలు వదిలితే ఈ మన్మథునికీ మలయమారుతానికీ, చంద్రునికి నాపై పగ తీరిపోవును."

తే॥ అనుచు నయ్యింతి తెగువతో నాడునట్టి
పలుకులకు జాలగుండియల్ బిగిలి చెలులు
భయము నొందిన జూచి యా ప్రౌఢకలికి
యబల నక్కున జేర్చి యిట్లనియె కూర్మి 31

భావము : ఆ విధముగా విసిగిపోయి, పలవరించుచున్న చంద్రరేఖ పలుకులకు, మిగుల గుండెలు చెదరి చెలులు భయము పొందగా, ఆ నిపుణురాలైన చెలికత్తె అబలను అక్కున చేర్చి ఇట్లు అనెను.

ఉ॥ తాళుకొనంగదమ్మ పరితాపమొకించుక పీటబెట్టగన్
కాలమిటుండ దమ్మ కొఱగాములు దల్పకు మమ్మ దేవుడె
ట్లోలలితాంగి కన్ దెరవకుండగ శత్రుడ టమ్మ మించి తే
మేలిక నేల కిన్క పతిమీద శరింపడె మారుడెంతయున్ 32

అర్థాలు : పీటపెట్టంగన్= నిలిచి పోవుటకు, కొఱగాములు= ఉపయోగపడనివి.

భావము : "తీవ్రతాపము నీయందు నిలుకడగా నుండుటచే, ఎట్లో కొంత సహింపవలసినదే! కాలము ఒకే విధముగా నుండదు. పనికిరాని ఆలోచనలను వదలి పెట్టుమమ్మా! ఆ దేవుడు నిన్ను కరుణింపకుండుటకు, నీకు కీడు తెచ్చుటకు పగవాడా? ఇంక ముందు ముందు మేలు కలుగును. కోపమేల? నీ పతి మీదను మదనుడు తాను చెడ్డవాడై కామమును కలిగించును."

క॥ ఏల వెతనొందెదవె మన
పాలిటిదైవంబునొకరిపాలిటి బంటే
దాలిమి దన్నున్ నెదురును
వాలాయము గాచునన్న వార్తలు వినవే 33

అర్థాలు : వెత= దిగులు, బంటు= సేవకుడు, తాళుము= ఓర్పువహించుము, వాలాయము= అవశ్యము

భావము : "ఎందుకమ్మా దిగులు? మనకు కోరినదిచ్చే దేవుడు మఱొకరికిని సాయము చేయగలడు కొంత ఓర్పుతో నుండుము. మీ ఇద్దరిని తప్పక కాపాడగలడు. పెద్దల వాక్కును వినలేదా?"

మ॥ అని యేరీతిని నూరడం బలుక నింతైనన్ శమంబందకే
తనుతాపంబున కోర్వజాలకమదిన్ తాల్మింతయుంలేక మో
మున సామంటగ చీరకొంగిడి తగన్ పుంస్కోకిల ప్రాకట
ధ్వనితో నేడిచె నశ్రువుల్ చనులమీదన్ దోరమైపారగన్ 34

భావము : అని ఇట్లెంత ఊరడించినను, శాంతించక, తాపము నోర్వలేక, ముఖమును సగము తాకునట్లు చీరకొంగును కప్పుకొని, మగకోయిల కంఠముతో(పంచమ శ్రుతి) కన్నీరు, చన్నులపై ఎక్కువగా స్రవించుచుండగా చంద్రరేఖ విలపించెను.

విశేషము : అల్లసానివారి వరూధిని కూడా ప్రవరుడు త్రోసివేయగా, “నీవు త్రోవ నిచ్చోట భవన్నఖాంకురము సోకె కన్గొనుమంచు చూపి చనుమిట్టల నశ్రులు చిందువందగన్” ఏడ్చెను కదా! పోతనగారు దర్శించిన సరస్వతీమూర్తి గూడ, “కాటుక కంటి నీరు చనుకట్టుపయిం బడ” ఏడ్చెను కదా. ఆ దృశ్యమే ఇదీను.

వ॥ ఇట్లునిలుపోపకున్న సమయంబున ఆమె తల్లి 35

భావము : ఈ విధముగా ఓర్పులేని సమయమందు చంద్రరేఖ తల్లి

క॥ ఆమాయాంగనతాపస
భామిని యీరీతి మిగుల బరితపియింపన్
గామసలుట కిక గాదని
తామదిలో నిశ్చయించి రమణికి ననియెన్ 36

భావము : మాయలాడియైన ఆ తపస్విని, చంద్రరేఖ పరితాపమును చూచి ఇక ఆలస్యము చేయరాదని భావించి, ఆ ప్రౌఢస్త్రీతో ఇట్లనెను.

ఉ॥ పోవె మనోహరాంగి నిను బోలిన నేర్పరి లేదు వీరిలో
లేవె మదీయ పుత్రిమదిలీల గ్రహించిన మోహనాంగునిన్
దేవె నిమేష మాత్రమున దెప్పరమౌ నిక నాలసించితే
నావల దీని భాగ్యమెటులైనను లెస్సనుమాన మేటికిన్ 37

భావము : “అందమైన శరీరము కలదానా! నీవంటి నేర్పరి ఈ చెలికత్తెలలో లేరు. కనుక నీవు పోయి, నాకూతురు కోరిన వానిని ఒక్క నిమిషములో తేవే ఆలస్యము చేసిన, ఆపద కలుగును. తర్వాత, ఆ కన్య భాగ్యము తప్పక పండును. మేలగును. నాకు ఎట్టి అనుమానము(సందేహము) లేదు.”

ఆ॥ రాకుమారకుండు కాకున్నచో సార్వ
భౌమచిహ్న లేల పొడుకొనును

నాకుమారికేలనాకాంక్ష జనియించు
ఘనుడు నిజము చనవె కమలనయన 38

అర్థాలు : ఆకాంక్ష= కోరిక,

భావము : “అతడు రాజకుమారుడు కానిచో రాజచిహ్నాలు ఉండవు కదా. మఱియు వానిపై ప్రేమ పుట్టదు. కనుక అతడు రాజకుమారుడే!”

క॥ అని మాయాంగన బంచిన
వనరుహదళనేత్రి మునుపు వచ్చిన త్రోవం
జని యచటవారి గానక
తనమది జింతించి చనె పదంబుల జాడన్ 39

భావము : ఇట్లు చెప్పగా, ఆ మాయాంగనతో కూడా, ఆ కమలనయన తాను మునుపు వచ్చిన త్రోవబోయి అచట ఎవరును లేకపోవుటచే యోచించి, వారి అడుగుల గుర్తును బట్టిపోయెను.

ఉ॥ పోవుచు సన్నకప్పురపుబోదెల పుప్పొడి తిప్పలంగడున్
సావిమరందకర్దమవిశాలవనీస్థలి యామునీతటిన్
మావులసైకతాద్రులను మండితవజ్రగదాసికుంభరా
జీవవిలాస చిహ్నముల జెన్నగు జాడలజోడు గాంచుచున్ 40

అర్థాలు : కప్పురపు బోదెలు= కర్పూరపు అరటిచెట్ల బోదెలను, తిప్పలన్= కుప్పలను (నడుములు), సావి= సాగి (నిడివియై), మరందకర్దమ విశాలవనస్థలిన్= పూవుల తేనెలతో తడిసి బురదయై ఉన్న వెడల్పైన ఆ వనస్థలమందు, యామునీతటిన్= యమునానదీ తీరమందు, మావుల= మామిడి చెట్లను, సైకత+అద్రులన్= ఎత్తైన ఇసుక తిన్నెలను, మండిత వజ్ర= ప్రకాశించుచున్న వజ్రాలతో పొదిగిన, అసి= కత్తి, కుంభరాజీవవిలాసచిహ్నముల్= కుండలపై పద్మముల వలె నిర్మింపబడిన వినోద వస్తువుల గుర్తులను

భావము : కర్పూరపు అరటిపూల పుప్పొడి కుప్పలను, పూవుతేనెలు నిండిన బురదగా నుండు నేలను, యమునా తీరమందున్న ఇసుకతిన్నెలను రాజులు ఉపయోగించు, వజ్రాల ప్రకాశమును ప్రసరించు గదలు, కత్తులు, పద్మములు చిత్రింపబడిన బంగారు వెండికుండలను మొదలైన వానిని రాజుల ఉనికి పట్టుల గుర్తులుగా వెదకుచు వెళ్లి

చ॥ నిలిచినచోటు పుష్పశరనిష్ఠుర బాణపరంపరాహతిన్
గలగినచోటు నెత్తములు గైకొని తీర్చినచోటు వేదనన్
మెలగినచోటు తాపశిఖిమించిన పల్లవశయ్య మీదమే
నొలసినచోటు గాంచి మదినుత్సవమంది మనంబులోపలన్ 41

అర్థాలు : పుష్పశరబాణపరంపరాహతిన్= పూ విలు కాడైన మదనుని బాణముల వరుసల తాకిడిచే, తాపశిఖి= తాపమనెడి అగ్ని

భావము : మదనుని బాణములచే కలత చెంది తాపమును పోగొట్టుటకై తామరలను అమర్చిన చోటును, వేడిమి అతిశయింపగా, చిగురుటాకుల పాన్పు మీద పరుండిన చోటును చూచి సంతోషించెను.

ఉ॥ ఆనలినాయతాక్షి విరహంబునకంటెను నద్భుతంబహో
యీనరనాథమాళి మదినెచ్చిన మోహమునెన్న నీయెడన్
బూనిన కార్యముంజయము పొందొడగూడు నిజంబు చిహ్నముల్
గానగ సార్వభౌముడగు గట్టిగ నాయమమాట గల్లయే 42

భావము : "చంద్రరేఖ విరహవేదన కంటె, రాజు మదిలో అధికమైన మోహము చెందెను. ఆహా! ఇట్లగుట ఆశ్చర్యము. ఈ స్థితి జయమును సాధించుటకు అనుకూలముగా ఉన్నదనుట నిజము. ఆ యా ఉపకరణములైన వానిని చూడగా, ఆతడు గొప్ప చక్రవర్తి అగును, అనెడి ఆయమ(యువతి) గట్టిదైన మాట కల్ల అగునా?"

క॥ కులశీల మానుషంబులు
లలితవయోరూపసుగుణ లక్షణముల నా
లలనారత్నము నీ నృప
తిలకుని దగగూర్చి నట్టి దేవుడె నేర్చున్ 43

భావము : "కులము, ప్రవర్తనము, వయస్సు, రూపము, సుగుణములు ఈ లక్షణములన్నియు సరిచూచి చంద్రరేఖను ఈ రాజకుమారుని జతగూర్చిన దైవమే నేర్పుగలవాడు."

చ॥ అని తనమానసాబ్జమున నద్భుతసంభ్రమముల్ బెనంగగా
చని చని పండువెన్నెలల జాడలు గాంచుచు నాలకింపుచున్
కనకరసాలపూగముల గమ్మిన దట్టపు మాధవీలతల్
మొనసిన ద్రాక్షపందిరుల మూగినకానలలోన బోవుచున్ 44

భావము : అని తలంచి తన మనసనెడి పద్మమందు ఆశ్చర్యము తత్తరపాటు పెనగులాడు చుండగా పయనించుచు నిండు వెన్నెలందు జాడలను చూచుచు , ఏవైన మాటల వినబోవు, ఏమో అని శ్రద్ధతో చెవులొగ్గి వినుచు, సురపొన్న మామిడి, పోకచెట్లు విరివిగానున్న, దట్టముగా గురివింద తీగ విస్తరించిన, ద్రాక్షపందిరులు గుంపులై యున్న, అడవిలో పోవుచు

మత్త॥ నిండబూచినచాలు జొన్నలనీడ జాడలుగానమిన్
పండివాలినమావిమోకల పజ్జగొజ్జగి పూబొదల్
నిండబర్విన మంచుసోనల నీటికాలువవెంటబో
నొండురెండడుగుల్ గనుంగొని యొయ్య నొయ్యన బోవగాన్ 45

భావము : నిండుగా వికసించిన పూలవరుసలు గల జొన్న మొక్కల నీడలో గుర్తులు కానరాలేదు. పండి వాలిపోయిన మామిడి మొక్కల సమీపములో గొజ్జగి పూల ప్రవాహములు గల నీటి కాలువల వెంట నంటిపోగా, రెండు అడుగులు కన్పట్టగా వానిని గుర్తించుచు మెల్లగా ముందుకు నడచినది.

మాలిని॥ వెన్నెలలోయమునా తటసైకతవేదికపైగడు బూచినమేల్
పొన్నల చక్కటిబైటవసించిన భూపశిఖామణిమంత్రివరున్
తిన్నగ గాంచి తమాలకుజస్థలి నిల్చి కనుంగొనుచున్నయెడన్
సన్నముగా మలయానిల మానృపచంద్రునిపై మలయంగ వడిన్ 46

భావము : వెన్నెలలో యమునా నదీతీరమందు ఇసుకతిన్నెల మీద, బాగుగా పూచిన మేలైన పొన్నలు గల చదునైన చోట వెలుపల కూర్చున్న గొప్పరాజును, వివేకియైన మంత్రిని చక్కగా చూచి, చీకటి వలనున్న నేలపై నిలిచి, వారిని తీక్ష్ణముగా పరిశీలించు చుండగా మందముగా మలయపవనము ఆ చంద్రుని వలె నున్న రాజుపై ప్రసరించెను.

మాలినీ వత్తము : 7 భ గణములు, గురువు కలది. 13వ అక్షరము యతి.

క॥ ఉలికిపడిలేచి యల్లన
నలుదిక్కులు చూచి మదిని నాటిన మోహం
బలవోక నుస్సురనుచును
తలకుచు హా మోహనాంగి డాగితె యనుచున్ 47

భావము : మలయపవనపు చల్లదనము సోకగనే ఆ రాజు ఉలికిపడి లేచి, దిక్కులు చూచి మోహముతో తేలికగా నిట్టూర్పులతో, కలత చెందుచు "అహా మోహనమైన శరీరము కలదానా దాగినావా" అనెను.

ఆ॥ పలువరింపుచున్నపార్థివుదన్మంత్రి
తెలియజూచి మదిని తెలివినొంది
సమయమిప్పుడనుచు చపలవిలోచన
పొదమరుంగు వెడలి ముదముతోడ 48

భావము : పలవరించుచున్న రాజును, దగ్గఱనున్న మంత్రిని చూచి, తెలివితో అది తగిన సమయమని, ఆ చెలి పొద చాటున నుండి ముదముతో ముందుకు వచ్చెను.

క॥ కనిగానమిగా నచ్చట
కనకక్రముకామ్రనారికడములలోనన్
వనిత మెలంగుచు నుండగ
కనుగొని యమ్మంత్రి ధరణికాంతున కనియెన్ 49

అర్థాలు : కనిగానమిగా= కనబడి కనబడకుండుగ, కనకక్రముకఆమ్రనారి కడములలోన= సురపొన్న, పోక, మామిడి, కొబ్బరిచెట్లలో

భావము : కనిపించీ కన్పించని విధముగ అక్కడి పొన్న, పోక, మామిడి, కొబ్బరిచెట్లలో తిరుగుచున్న కాంతను చూచినవాడై మంత్రి, రాజుతో ఇట్లనెను.

మ॥ ధృతినిల్పోప విదెంత కార్యమహహా ధీమంతు లీరీతులన్
వెతలం గూరుట మెత్తురేమి క్రియలర్థిన్ వే విచారింపకీ
గతి నుండం దగ దేను బోదు తెలియన్ గాంతా నివాసంబు సం
గతి సంచారముసేయుముద్దియిల యిక్కంబాకలన్నంతయున్ 50

అర్థాలు : ధృతి= ధైర్యము, నిశ్చలత్వము, ఇక్కంబు= ఉనికి, ఆకలన= కోరిక,

భావము : "నీ నిశ్చలత్వమును నిల్పుకొనకున్నావు. ఇది ఎంతపని? (సులభమగును). ఆశ్చర్యము, ఆహా! బుద్ధిశాలురు ఈ వెతలను పొందు నిన్ను చూచి యీ నీ చర్యలను ఎట్లు మెచ్చెదరు? చేయదగిన ప్రయత్నమును బాగుగా వేగముగా ఆలోచింపక ఈ విధముగా చింతించుట తగదు. నేను ఆ వనిత నివాసమును, వారి విషయము కన్నియలు ఉండుచోటు అంతయును తెలిసికొనెదను."

ఉ॥ దేవయనుజ్ఞ సేయుమన తెల్వి యొకింత వహించి యిట్లనున్
పావనశీల నీమహిమభావనిరూఢి యెరుంగనే కటా
నీవు మనస్కరించు పని నేటికిగానిది యొండు గల్గునే
యేవిధి సంఘటించెదవొ యేదియొ తెల్పగదేమి యియ్యెడన్ 51

అర్థాలు : మనస్కరించు= తలపెట్టు

భావము : "ఓ రాజా! అనుమతిమ్ము" అని కోరిన మంత్రితో రాజిట్లనెను. "మంత్రివర్యా! నీవు తలపెట్టిన పని కాకపోవుట యనునది లేదు. ఎట్లు సాధించెదవో! ఆవిధ మెట్టిదో ఇపుడు తెల్పుమా!"

క॥ వేవేగకార్య ఘటనా
ప్రావీణ్యముచూపు ఘడియ రాకుండినచో
భావజుశరములపాలై
పోవుదు సంశయములేదు పొమ్మనఘాత్మా! 52

భావము : "వెంటనే నీ కార్యకుశలతను చూపుము. "ఒక్క ఘడియలో నీవు రాకపోయినచో నేను మన్మథుని తాపముతో ప్రాణములు వదలుదును. సందేహములేదు. పొమ్ము పుణ్యాత్మా!"

చ॥ అనవిని యెంత కార్యమిది యర్ధనిమేషములోన వచ్చెదన్।
గనుగొను మంచు లేచి సుభగక్రియసూచనలంత లంతగా।
గనుగొనుచుం బయోజముఖి గాంచిన యవ్వన వాటిబోవుచున్
దనుగని చేరవచ్చు వనితామణి గాంచి మహోత్సుకాత్ముడై 53

భావము : అని రాజు అనగా మంత్రి, "ఇదెంతపని, ఉన్నట్లే వత్తు"నని మంచి శకునములను గుర్తించుచు అంతకుముందు చెట్లసందుల నడయాడు ఆ సుందరి యున్న దిక్కుగా నడచి, తనవైపునకే చేరవచ్చు ఆమెతో ఉత్సాహముతో ఇట్లనెను.

ఉ॥ ఎవ్వరి దానవీవు గతమెయ్యది నీవిట కేగుదేరగా
దవ్వులగాని పట్టణము దాపున లేదు మహానిశిం గటా
యివ్వనవీధి నేకతమ యిట్లు చరించుట కేమి కార్యమో
జవ్వని నీవిధంబు దగ జాగొనరింపక మాకు దెల్పుమా! 54

భావము : "నీవు ఎవరు? నీ విధమేమి? నీవు ఇచటికి ఏల వచ్చితివి? దూరముననే గాని సమీపములో ఏ పట్టణము లేదు కదా! అయ్యో! గొప్ప చీకటిలో ఈ అడవుల త్రోవలలో ఒంటరిగా తిరుగుటకు ఏమి పని కలిగెనో కదా! ఓ జవ్వనీ! అంతయును ఆలస్యము చేయక తెల్పుము."

విశేషము : ఇది పెద్దనగారి కావ్యములో వరూధినిని ప్రవరుడు "ఎవ్వతెవీవు?" అని సంబోధించినట్లున్నది.

చ॥ అనవిని యోమహాత్మక యనంతుడనందగు రాజమౌళికిన్
యనిమిష కన్యకున్ గలిగి యద్భుత రూపవిలాససంపదన్
గనలెడు చంద్రరేఖకును గాదిలినెచ్చెలి నేడు దానివెం
టను వనకేళి దేలుచు నిటం గడు వేడుక సంచరింపగన్ 55

భావము : అని యడుగగా ఆ స్త్రీ అతనితో "మహాత్మా! అనంతుడను రాజునకు దేవకన్యయందు బుట్టిన చంద్రరేఖయను సుందరికి నేను ప్రియసఖిని. వనకేళికి వేడుకతో ఇచ్చటికి వచ్చినాము."

చ॥ మనసిజుడో జయంతు డొకొ మాధవుడో నలకూబరుండొ నా
ననుపమరూపయౌవన శుభాన్వితమూర్తి భవత్సహాయుడై
జనవరమౌళియొక్కరుడు చంద్ర శిలోచ్చవితర్దినున్నచోన్
వనరుహపత్రనేత్రి నృపవర్యుని జూచినచూపు వెంబడిన్ 56

అర్థాలు : నాన్= అనగా, భవత్సహాయుడై= తమతోకూడ

భావము : అనగా విని "ఓ మహాత్మా! మన్మథుడో! జయంతుడో (ఇంద్రుని సుతుడు మాధవుడో, వసంతుడో లేక నలకూబరుడో (కుబేరుని కుమారుడు). సాటి అందగాడైన, మీ సహాయముతోనున్న ఒక రాజకుమారుని, చంద్రశిలలతో నిర్మితమైన వేదికమీద నున్నవానిని చూచిన వెంటనే

విశేషము : ఇదియును వరూధిని పల్కిన, "ఇంద్రజయంతవసంతకంతులన్" అన్నమాటలను గుర్తునకు తెచ్చుచున్నది.

ఉ॥ మానసమేగి తత్ స్మృతులమంజుల సుందరశోభనాంగక
స్థానములన్ వసించి విడజాలక కాపురమున్న నెంతయున్
మానినియందునేరమిడి మారుడు దారుణ శాతకేతకీ
సూనకరాసి నేసినను సొమ్మసిలెన్ హృదయంబు బెగ్గిలన్ 57

అర్థాలు : శాతకేతకీసూనకరాసిన్= వాడియైన, మొగలిపూవుల ఖడ్గములతో, బెగ్గిలన్= చలింపగా

భావము : "ఆ సుందరుని శోభించు అవయవ రూపములు ఆమె మనస్సులో నిలిచి వదలక యున్నవి. ఆ మానినిదే దోషమని, మదనుడు, క్రూరములైన వాడియైన మొగలిపూరేకుల బాణములను ఆమెపై ప్రయోగింపగా, ఆమె హృదయము చలించి కలత నొందెను."

ఉ॥ అందుకు కాంతకై చెలులమందఱముం బెగడంది చేరి యా
చందనగంధి కెన్ని యుపచారములన్ ఘటియింప శాంతిమై
నొందకయున్న నేమొ యని యుల్లములం గడు తల్లడిల్లుచో
మందిరమందు జేర్చి నిజమాతకు దెల్పిన జూచి కూర్మిమై 58

భావము : "అట్లగుటచే మేము చెలులము భయపడి ఆమె మనస్సు చల్లబడుటకు సేవలు చేసితిమి. కాని ఆమె శాంతిని పొందక పోవుటచే మనస్సులు ఆందోళన చెందినవి. మేము ఆ కాంతను ఆమె మందిరమునకు చేర్చి ఆమె తల్లికి తెల్పగా ప్రేమతో"

క॥ ఎన్నివిధంబుల నాయమ
కన్నియు బోధింప దెలియగా నేరక న
త్యున్నత మన్మథవేదన
ఖిన్నత మైమఱచియున్న కిసలయపాణిన్ 59

భావము : "ఆమె చంద్రరేఖ కెన్ని విధముల చెప్పినను కారణము తెలియక అతిశయమైన మదనుని తాపముచే బాధపడుచు ఆయువతి శరీరమును మఱచియుండగా"

ఉ॥ చూచి తదీయ వేదనకు చోద్యమునొందుచు నన్ను బిల్చి నీ
వీచపలాయతాక్షి మనసెల్లను జూరలు గొన్న సుందర
ప్రాచురదేహునిం దెలిసి రమ్మన వచ్చితి మీర లెవ్వరో
రాచకుమారులార యిటురా గతమేమి వచింపు డొంటిగాన్ 60

అర్థాలు : చూరలుకొన్న= తగుల్గొన్న

భావము : "ఆమె తల్లిచూచి, ఆశ్చర్యపడి, నాతో నిట్లన్నది. 'నీవు ఈ పిల్ల మనసు నాకర్షించిన సుందరుడెవరో తెలిసికొని రమ్ము" అనగా వచ్చినాను. అయ్యా! మీరెవ్వరు? రాజకుమారులు కదా, ఒంటరిగా ఇక్కడ నెందుకు ఏకాంతముగా నున్నారో తెల్పుము."

చ॥ అనవిని యోమృగాక్షి విను మంతయు సత్యపురాధినాయకుం
డనుపమకీర్తిశాలి కరుణాకరు డాశ్రితరక్షణుండు స
జ్జననుత సూర్య వంశమణి సర్వధరాతలవల్లభుండు మా
రనిభుడు చంద్రకేతునృపరత్నము నమ్మహనీయు డెంతయున్ 61

అర్థాలు : మారనిభుడు= మన్మథుడంతటి అందగాడు

భావము : "ఓ లేడి కన్నులు గలదానా! వినుమా! సత్యపురమును ఏలువాడు, కీర్తిగలవాడు, దయకు నెలవైనవాడు, ఆశ్రయించిన వారిని రక్షించువాడు, మంచివారిచే నుతింపబడువాడు, సూర్యవంశమున శ్రేష్ఠుడు, భూమికంతటికిని ప్రభువు, మదనుని వంటి అందగాడు. చంద్రకేతుడను రాజకుమారుడు. చాలా గొప్పవాడు."

క॥ ఆయన కనుగున్ మంత్రిని
యీయడవికి వేట మార్గమిటు వచ్చితి మో
తోయజలోచన బలములు
పాయం జన నలసి యిచట బరవసియింపన్ 62

అర్థాలు : బలములు= సైనికులు, పాయన్‌చనన్= విడిపోగా, పరవసియింపన్= విడిది చేయుటకై

భావము : "నేను ఆ రాజునకు ఇష్టుడైన మంత్రిని. మేము వేటకై ఈ అడవికి వచ్చినాము. మా సైనికులు మానుండి తప్పిపోగా, అలసిపోయి మేమిక్కడ విశ్రమించుటకు వచ్చినాము."

శా॥ మీ రాచంచలలోచనా సహితలై మేలొప్ప గ్రీడింపగా
నీ రాజన్యుడు చూచి యాతరుణిపై నెంతే మనంబూన తా
గారామొప్ప వివాహ మాడ దలచెన్ కళ్యాణి యీకార్యమి
ట్లేరీతిన్ యొనగూర్పు నీకు హృదయాభీష్టంబులున్ జేకురున్ 63

భావము : "మీరు ఆ సుందరితో కలసి వనక్రీడలోనుండగా చూచి, మా రాజు ఆమెపై మనసుపడి, ఆమెను పెండ్లియాడ తలచినాడు. ఈ కార్యము సిద్ధించునట్లు నీవు తోడ్పడినచో, నీ యొక్క కోరికలును సిద్ధింపగలవు."

క॥ కులశీలపౌ రుషోజ్జ్వల
బలయౌవనరూపవిభవ భాగ్యములందున్
తెలియగ ధర నింతకు మి
క్కిలినృపవర్యుండు లేడు కిసలయపాణీ! 64

అర్థాలు : కిసలయపాణీ= చివురుటాకువంటి చేయిగలదానా!

భావము : "ఓ అమ్మాయి! కులము, గుణము, పౌరుషము, బలము, యౌవనము, సౌందర్యము, సంపదలు మొదలగు వానిలో మా రాజును మించిన నృపతిలేడు."

ఆ॥ రాజకన్య యువతి రాజేంద్రుడీతడు
యుభయమోహపరవశోన్నతులును
దనర నింతకన్న దగిన సంబంధంబు
గలుగ నేర్చునే జగంబునందు 65

భావము : "మీ చెలి రాజకన్య. ఇతడు రాజరాజు. ఇద్దఱును అన్యోన్యము మోహపరవశులు. ఇంక ఇంతకంటె మంచి జంట జగమందు ఉండదు కదా!"

ఉ॥ కాంత ధరిత్రి గల్గు నృపకన్యల ధన్యల రూపరేఖలే
కాంతమునందు చారులగు నంగనలున్ గడువృద్ధవిప్రుల
శ్రాంతము చూచుచో పటములందు లిఖించుకు వచ్చి చూపినన్
స్వాంత మొకింత సమ్మతము చాలకనే నిరసించె నెంతయున్ 66

అర్థాలు : చారులగు= విషయాలను రహస్యముగ సేకరించు, స్వాంతము= మనస్సు, సమ్మతముచాలకనే= ఇష్టపడకపోగా, నిరసించె= నిరాకరించె.

భావము : "ఓ కాంతా! మా రాజుగారి చారులు, వృద్ధబ్రాహ్మణులు, నిరంతరము వెదకుచు, చూచిన రాజకన్యల రూపురేఖలను చిత్రపటములందు వ్రాయించి తెచ్చి, చూపగా, మా రాజు గారి మనస్సు వారిపై లగ్నము కాలేదు. వలదని త్రోసివేసినారు."

క॥ ఈతరుణి భాగ్య మేమన
భూతలపతి మనసు పట్టు పొలతుక వింటే
యీతఱి నాలస్యము తగ
దాతతమతి జేయుకార్య మనుకూలముగాన్ 67

అర్థాలు : భూతలపతి= రాజు, పొలతుక= యువతి, ఈతఱిన్= ఈ సమయమును, ఆతతమతి= విశాలమైన బుద్ధితో

భావము : "మా రాజుగారి మనసును ఆకర్షించిన ఈ యువతి అదృష్టవంతురాలు సుమా! ఈ సమయమును వృథా చేయరాదు. పెద్ద మనసుతో వారి పెళ్లికి అనుకూలమైన పనిని ఉపకార బుద్ధితో కావింపుము."

చ॥ సకియ శుభస్యశీఘ్రమను శాస్త్రములుం దలపోయుమా నృపా
త్మకములు చంచలంబు లభిమానవశంబులు ధైర్యవాసముల్

ప్రకటితమన్మథాశుగవిపాటనమానసుడైన యిష్టుడే
చకితవిలోలనేత్రి నృపసత్తమునిన్ కవగూర్పు శీఘ్రతన్ 68

అర్థాలు : నృపాత్మకములు= రాజుల మనోభావములు, అభిమానవశంబులు= స్వాతిశయముతో నిండినవి, ప్రకటితమన్మథ+ఆశుగ విపాటమానసుడైన= చక్కగా వ్యక్తమగుచున్న మదనుని బాణములచే చెదరిన మనసు కలవాడైన, చకితవిలోలనేత్రి= ఆశ్చర్యముతో చలించుచున్న కన్నులు గలదానా!, కవగూర్పు= జతచేయుము.

భావము : "ఓ స్నేహితురాలా! ఆశ్చర్యముతో దిక్కుతోచనట్లు అటూ ఇటూ చూడకు. మా రాజు మన్మథ మోహముతో పరవశించినాడు. మీ రాజకుమారికి ఇష్టుడే. శాస్త్రాలు 'శుభస్య శీఘ్రమ్' (శుభకార్యమును ఆలస్యము చేయరాదు) అంటున్న సంగతి నీకు తెలుసు కదా. కనుక మా రాజును మీ రాకుమారిని, ప్రేయసీ ప్రియులను జతచేసి, భార్యాభర్తలుగా చేయుము."

క॥ అక్కడి కిక్కడికిని దగ
నెక్కొనుహితురాలవీవె నిజముగ నీవే
మక్కువ దలచిన నటువలె
చక్కటు గావించి వేగ సమకూర్పుమనన్ 69

అర్థాలు : ఇక్కువ= ఆశ్రయము, చక్కటుకావించి= షయమును సానుకూలము జేసి,

భావము : "పిల్ల పక్షానికి, పిల్లవాని పక్షానికి ఇరువురికి క్షేమము కోరేదానవు నీవు. ఈ పనిని నీవే ప్రేమతో, నిర్ణయించి తగినట్లు పనిని సానుకూలముగా వేగముతో సాధించుము" అని కోరగా

చ॥ వనిత ముదంబునొంది తనవచ్చినకార్యము చేకురెన్ సతిన్
మనసుగలంచు మన్మథుని మార్గణముల్ నృపుమీదబార నా
యినకులరాజమౌళికిని యిందునిభానన కిట్లు బూనగా
వనజభవుండె నేర్చునె యవశ్యము కార్యము సంఘటించెదన్ 70

భావము : "మదనుని బాణాలు చంద్రరేఖను బాధించినవి. చంద్రకేతువు మీద ప్రయోగింపబడిన దగుటచే తన కార్యము సిద్ధించినదని సంతోషించెను. ఇట్లు రాజునకును, ఆ రమణికిని, పెళ్లిని నిర్ణయించిన ఆ బ్రహ్మ నేర్పును ఏమన వచ్చును? కావున ఆపనిని తప్పక చేయగలను."

క॥ కావున నీసచివాగ్రణి
వేవేగమె తోడుకొనుచు వేశ్మమునకు నే
బోవలయు గాని యొంటిం
బోవుట తగ దనుచు మంత్రి పుంగవుకనియెన్ 71

అర్థాలు : సచివ+అగ్రణి= మంత్రిశ్రేష్ఠుడు, వేశ్మము= భవనము

భావము : "ఈ మంత్రిగారిని కూడా వెంట బెట్టుకొని రాకుమారి భవనమునకు పోవుట సముచితముగాని నేను ఒంటరిగా తిరిగి పోరాదు" అని, మంత్రితో ఇట్లనియెను.

శా॥ సర్వజ్ఞుండవు సర్వకార్యవహనాచాతుర్యచిత్తుండ వీ
నిర్వాహక్రియ నీకు నబ్బురమె నీనేర్పున్ వచోనైపుణిన్
గీర్వాణార్యునకైననుం గలదె యుక్తిం జూడ మీరెందునన్
సర్వంబున్ సమకూరు శోభన మగున్ సందేహమిందెందుకున్ 72

భావము : "నీవు సర్వము తెలిసినవాడవు, అన్ని పనులను చేయగల నేర్పుగల బుద్ధిగలవాడవు. నీకు ఈ కార్యము నెఱవేర్చు శక్తి ఆశ్చర్యమా! నీ నేర్పు, వాక్కు యొక్క నైపుణ్యము, బృహస్పతికిని లేదు. సర్వము సిద్ధించును, మంగళమగును. సందేహములేదు."

మ॥ మది నేమో యని యెంచగా వలదు సన్మంత్రీంద్ర నీవచ్చుటే
పదివే లీపనియెంతమాత్ర మిది మాభాగ్యంబు లీడేరు నె
మ్మది మీరాజ్యములోన నే యిడుమలున్ మమ్మంటకుండంగ నీ
ముద మొప్పన్ వ్రతచర్యలుం జరుగు సంపూర్ణబుగా మీదయన్ 73

అర్థాలు : ఇడుమలు= కష్టములు, వ్రతచర్యలు= చేయవలసిన వైదికమైన వ్రతకర్మలు.

భావము : "నేను తమరు రావలిసినదని కోరినందుకు తప్పుగా భావించకుడు. మీరు వచ్చినట్లయితే మా భాగ్యము పండును. మీ రాజ్యములో మాకిటుపై ఏ కష్టాలు రాకుండుటకై, ఆ యా వ్రతాలు ఆచరింపవలసినవి, మీ దయతో జరుపగలరు."

ఉ॥ కావున నింతకన్న హితకార్యము నింకొక టెందుగల్గునే
ధీవర యిట్లుదోచినది దేవరచిత్తమునందు నేక్రియో
యావిధ మానతిచ్చిన రయంబున నాగతి బోవుదాన న
న్నావిధమాత్మకొప్పిదమునై కనుపట్టిన మంత్రి యిట్లనున్ 74

భావము : "ఓ దేవా! ఇంతకంటె హితకార్యము మఱి ఏమున్నది? నాకు తోచిన పద్ధతి చెప్పినాను. మీ మనసుకేది మంచిదని తోచునో అదియే నాకును సమ్మతమే" అని ఆ ప్రౌఢ చెప్పగా విని, ఆమె సూచించిన పద్ధతి మంచిదని తనకు తోచగా మంత్రి ఇట్లనియెను.

ఆ॥ రమణి! బుద్ధిమంతురాలవు నీయుక్తి
తిన్ననాయె నింతకన్నను కార్య
మేమి వచ్చెద పద మింతకు నీవుండ
ననుచు సుదతి వెంట జనియె నతడు 75

అర్థాలు : సుదతి= చక్కని దంతములు కలది

భావము : "నీవు బుద్ధిమంతురాలవు. నీవు చెప్పినది బాగున్నది నేనే నీ వెంట వచ్చెదను. ఇంతకు మించిన పని ఏమున్నది? పోదము పద" అనుచు ఆ మంత్రి ఆమె వెంట పోయెను.

ఉ॥ ఆసచివేంద్రు దోడుకొని యంబుజలోచన మానసంబు ను
ల్లాసముతోడుతన్ జని విలాసవితర్దిక పైన కన్యకా

వాసము నందునున్న మునివల్లభి కీవివరంబు దెల్పె నా
యాసము జెందు కన్నియకు నాత్మ యొకించుక శాంతిజెందగన్ 76

అర్థాలు : విలాసవితర్దిక= విశ్రాంతి మండపము, కన్యకావాసము= యువతి ఇల్లు, మునివల్లభి= మునిపత్ని, ఆయాసము= శ్రమ.

భావము : ఆ మంత్రిని వెంటబెట్టుకొని ఆ ప్రౌఢస్త్రీ సంతోషముగా పోయి చంద్రరేఖ ఇంటిలో విశాంత్రి మండపముపైనున్న ఆ మునిపత్నిని చూచి, ఈ వివరములు చెప్పెను. ఇది వినిన చంద్రరేఖకు బాధోపశమన మయ్యెను.

క॥ ఆమాయాంగన వేగమె
యామంత్రిని జేర నరిగి యరమర సేయం
గా మీకు నుచితమగునా
నీమందిరమిదియుగాదె నిర్మలచరితా! 77

అర్థాలు : అరమర= సందేహము

భావము : "భేదభావముకలిగి యుండుట తగునా? ఇదియు మీ ఇల్లేకదా?"

ఉ॥ రమ్మనితోడి తెచ్చి కడురమ్య విశాలవిలాసమధ్యరం
గమ్మున దర్భ చాపను సుఖమ్మ్ముననుంచి యకాలమౌట నా
కొమ్మ ప్రియోపచారముల గూరిమిచేసి మదీయభాగ్యసా
రమ్మ్ము వచింపగా దరమె రాసచివోత్తమ నీవు వచ్చుటన్ 78

అర్థాలు : రమ్యవిశాలవిలాసమధ్యరంగమ్మున= అందముతో విశాలముగ నున్న విశ్రాంతి స్థలము నడుమ, అకాలము+ఔట= ప్రొద్దెక్కినందున, కొమ్మ= స్త్రీ, రాసచివోత్తమ= రాజుగారి మంత్రులలో శ్రేష్ఠుడా!

భావము : రాజు మంత్రులలో ఉత్తమునికి స్వాగతము బలికి, లోనిక దెచ్చి, విశాంత్రి మందిరమున మధ్యభాగమున దర్భగడ్డితో నేసిన చాపను పఱచి, చాల ప్రొద్దెక్కి పోవుటచే అతని అలసట తీరగా సేవలు చేసి, "మంత్రిగారు! మీరు వచ్చుట మాకు మహాభాగ్యముకదా."

ఉ॥ కోరికలెల్ల నేడు సమకూరెను సర్వశుభంబులబ్బె నీ
వారిజనేత్రి దెల్పగ భవద్విధమంతయు విన్నదాన నీ
తీరున కన్యకన్గనుట ధీమతిగా కులగోత్రపౌరుష
శ్రీరమగా బరామరిక చేసి వివాహము సేయనే కదా **79**

అర్థాలు : పరామరిక= చక్కగా విచారించి తెలిసికొనుట

భావము : "నేడు కోరికలన్నియు తీరినవి. శుభములు కలిగినవి. ఈమె చెప్పగా మీ విషయము విన్నాను. బుద్ధిమంతురాలైన కన్యకను ఇట్లు పొందుటచే, ఆ బాల కులము, గోత్రము, పౌరుషము సంపద గల లక్ష్మిగా భావించి, తగిన వరునకిచ్చి పెళ్లి చేయుంచుటేకదా!"

ఉ॥ మాకులగోత్రపౌరుషసమంచిత చర్యలు సర్వమున్ మృగా
లోకన విన్నవింప మదిలోపల సమ్మతమందినారె సు
శ్లోక! వచింపగావలయు చొప్పొకకార్యము విన్నవింతు మీ
రాకడ నేమిచెప్పిన రయంబున మాకది సమ్మతంబగున్ **80**

అర్థాలు : మృగాలోకన= లేడిచూపుల యువతి, సుశ్లోక= మంచికీర్తి గలవాడా! చొప్పు= పద్ధతి, విధానము, రాకడ= వచ్చుట, రయంబున= త్వరగా.

భావము : "మాకు సంబంధించిన వివరములు చర్యలు ఈమె చెప్పగా విన్నారు కదా! మీకు సమ్మతమేనా? విషయమొకటి విన్నవింతును. మీ సమాధానము మాకు సమ్మతమగును (అంగీకరించెదము) కార్యపద్ధతిని వచింపవలెను."

శా॥ బాలారత్నము గన్న తండ్రి వినుమత్ప్రాణేశ్వరుండుం దప
శ్శీలుండైన యనంతు డాఘనుని సంసేవానురక్తిన్ గడుం
గాలంబే భజియింప తత్కరుణ నీకన్యాలలామంబునే
నోలిం గాంచితి కోరికల్ దనర సద్యోగర్భమందంత నా
వేళన్ మద్విభు డిట్టు లంచనియె తన్వీ! నీవు నాయాజ్ఞచే **81**

అర్థాలు : ఓలిన్= కాలక్రమమున, సద్యోగర్భమందు= వెంటనే కలిగిన గర్భధారణము, తన్వీ= ఓ యువతి.

భావము : చంద్రరేఖను కన్నతండ్రి అనంతుడు, తపశ్శాలి. ఆతని నాశ్రయింపగ చాలాకాలమునకు నాకీమె సద్యోగర్భముగా పుట్టినది. ఆ సమయములో నాభర్త నాతో నిట్లనినాడు. "ఓ యువతీ! నీవు నాయాజ్ఞ ప్రకారము"

విశేషము : 'ఓలి' అన్న పదానికి కన్యనిచ్చినందుకు ప్రతిఫలముగా కన్యతండ్రికి ఇచ్చే కానుక అని సాధారణ అర్థము. కాలక్రమమున అని కూడా చెప్పవచ్చును. ఇక్కడ భార్య తన కన్యాత్వాన్ని (స్త్రీత్వాన్ని) ఇచ్చినందుకు భర్త ఆమె కిచ్చిన కానుక సద్యోగర్భము అని చమత్కారము ఇట్లే, 'సద్యోగర్భము' (సద్యః గర్భము) అనగా, ప్రథమ సంగమముతోనే కలిగిన గర్భధారణమని వాక్యార్థము. కాని, వాడుకగా చెప్పుకొను అర్థము మాత్రము, సంగమానంతరము కాలవ్యవధి లేకయే వెనువెంటనే కలుగు సంతానమని. గర్భధారణము, శిశుప్రసవము వెంటవెంటనే పదినెలలు మోయనక్కఱలేకయే జరిగినదనిభావము.శార్దూల వృత్తమునకు సాధారణముగ నాల్గు పాదములేయైనను ఇందు అయిదు పాదములుండుటచే శార్దూలమాల అగును.

ఉ॥ కన్నియ బ్రోదిచేసి తగుగాలమునందు వయోవిలాససం
పన్నుని రాకుమారు గుణభాసురు సత్కులపౌరుషక్రియా
త్యున్నతుగాగ నారసి తదున్నత పట్టపురాణిగా దగన్
మన్నన నిచ్చి నీవు నట మామకసన్నిధి కేగుదె మ్మొగిన్ **82**

అర్థాలు : ప్రోదిచేసి= పెంచి, పెద్దజేసి, మామక= నాదైన, ఏగుదెమ్ము= రమ్ము, ఒగిన్= విధిననుసరించి

భావము : "ఈ బాలను పెంచి పెద్దజేసి, తగిన వయస్సురాగా తగిన వరునిచూచి, అందము, వయస్సు, సంపద, కులము కలవానిని చూచి

క్రియావంతుడైన రాజకుమారునికిపట్టపురాణిగా నిచ్చి పెళ్లి చేసి నా యొద్దకు రమ్ము"

విశేషము : రాజుకు భార్యలు ఎందఱైన ఉండవచ్చు. వారిలో పట్టపు రాణిగా రాజ్యపాలన విషయము కార్యకలాపములను నిర్వహించు సమయములలో అర్హత యుండును. మిగతా భార్యలు ప్రియురాండ్రు మాత్రమే. కనుక ఈ సూచనలోని ప్రత్యేకత. ఇదియొక మెలిక. ప్రియురాలిగా (పదిమందిలో ఒకతెగా) కాక అధికారము గల భార్యగా సమర్పించుమని అనంతుని ఆజ్ఞ. అనంతునకు సంసార సుఖము కంటే తపశ్చర్యపై ప్రీతి మెండు కనుక భార్యకు బిడ్డను పెద్దచేసి పెండ్లిచేసి పంపు అధికారము నప్పగించినాడు. ఆ బాధ్యతలు తీర్చిన తర్వాత ఆమె భర్తను చేరుకొనుట విహితకార్యము. ఈ ధర్మమిచ్చట ప్రతిపాదితము.

క॥ అని యానతిచ్చి యంతన్
మునివర్యుడు చనియె వినుము ముద్దియ యిది నా
తనుజ మదీయతపఃఫల
మును సఫలంబయ్యె నేడు ముద మలరారన్ 83

భావము : "అని ఆజ్ఞాపించి మునియైన నాభర్త తపశ్చర్యకై వెడలిపోయెను. ఇది నాచరిత్ర. ఈ చంద్రరేఖ నాకుమార్తె. నేటికి నా కర్తవ్యము పూర్తయినది."

క॥ ఈబాలను నేనెంతయు
శ్రీబలపరిపూర్ణ రాజశేఖరు నెదిరిం
చే బలిమిపెళ్లిసేయుదు
నీబుద్ధిదలంచి పలుకు నిజముగ నన్నన్ 84

అర్థాలు : శ్రీబలపరిపూర్ణరాజశేఖరున్= సిరి, బలము, పుష్కలముగా గల మహారాజును, ఎదిరించి= తిరస్కరించి

భావము : "ఈ బాలను, సౌభాగ్యవంతుడైన మహారాజకుమారుని (చంద్రకేతుని) వలదని, ఏ బలమైన కారణముచే, మఱొకనికి ఇచ్చి పెళ్లి చేయవలెనో, నీవే నీ బుద్ధితో విచారించి, నా నిర్ణయము సరియైనదో కాదో నిజమును వచింపుము."

విశేషము : ఇందులో జాలి, బెదిరింపు కలిసి యున్నవనవచ్చు. 'ఎంతయు' అన్నమాటను 'శ్రీబలపూర్ణరాజశేఖరా' అన్నదానితో కలిపి అన్వయించవచ్చు. లేదా, 'బలిమి' తో అన్వయించవచ్చు. 'పెండ్లి సేయుదు' అన్నది ప్రశ్నార్థముగను, ప్రకటనముగను కూడా చెప్పవచ్చును. అనగా, రాజు నెదిరించి నేనీమెకు పెండ్లి చేయగలనా? యని జాలిగొల్పు దైన్యమును, మఱియు 'ఇంత బలము సంపద ఉన్న రాజును ఎదిరించి కూడా దానికి వ్యతిరేకముగా నేను నా బిడ్డకు ఇంతకు మించిన వరుని తెచ్చి పెండ్లి చేయగలను' అని కూడా అర్థము సంగతమగును. ఎదిరించే బలిమి అని నీ బిడ్డ నాపై మనసుపడినది కదా నన్నెట్లు తిరస్కరించగలవు' అని ఆలోచించవద్దు, వలదనినచో బలవంతముగా నైనా దాని మెడలు వంచి నేను చేయగలను, అని ధ్వని. ఇదంతా అవసరమా? అంటే, ముందు జాగ్రత్త అనవచ్చు. తన బిడ్డను పట్టపురాణినిగా చేయక తప్పదని హెచ్చరిక. బిడ్డల విషయములో తల్లులెంత తెలివిగా మాట్లాడగలరో, ఈ పద్యము ఉదాహరణముగా ఉన్నది. తెలుగుభాషలో సహజముగా ఉన్న వ్యంగ్యధ్వని సంభాషణలో ప్రకటమగు రీతికిని ఇది ఉదాహరణము.

చ॥ తరుణి యిదేవిచారము వృథా తలపిట్టుల చింతసేతువా
నిరుపమసర్వసంపదలు నీయవిగావె తపోమహత్త్వమే
సిరియునుగాక మా సిరులు ఛీయివి నీవొక లెక్కసేతువే
పరమవివేక సంపదలభాసిలు నీకును దెల్ప నేటికిన్ 85

భావము : "ఇదేమి ఆలోచింపక ఈ తలపు తగదు. ఇట్లు చింత లేకుండా చేయగలవా? సాటిలేని సర్వసంపదలు తపస్సంపదలు చింతలేకుండా

చేయగలవా? మీ తల్లి మహిమతో మా లోక సంపదలు ఎట్లు విలువ కట్టెదవు? అవి అల్పములు. గొప్ప విజ్ఞానము నిండిన నీకు తెల్పవలెనా?"

ఉ॥ ఇక్కడ బెండ్లిసేయ మది నెంచితివేని సమస్తవస్తు వే
నొక్కనిమేషమాత్రమహిమోన్నతిగా సమకూర్తుగాక నీ
వక్కడగా దలంప మఱియెంతయు లెస్సగు నీవిచారమే
చక్కటియొప్పినట్టుల ప్రసన్నత నయ్యెడు నానతిమ్మనన్ 86

భావము : "ఇక్కడే పెళ్లి చేయుటకు నిశ్చయించినట్లయిన అన్ని వస్తువులను నేను ఒక్కనిమిషములో తెప్పింపగలను. మా యింటిలో అయితే చాలా మంచిదే. అంతయూ నీ విచారమే (నిర్ణయమే). ఎక్కడైనను ఈ కార్యము (ఉత్సవము) చక్కగా, మనోహరముగా జరుగును. ఆజ్ఞ యిమ్ము."

ఉ॥ అంటివిగాక తాపసుల కారయసంపద లేమిసేయ మీ
వంటినృపాలశేఖరు లవశ్యముగా మముబోటి మౌనులన్
మంటిని శాత్య వన్యమృగమంటకయుండ నిరంతరంబువూ
వెంటను బ్రోదిసేయదగు విశ్రుతసంపద పొంది కాదటే 87

అర్థాలు : మంటిని= పుడమి, శాత్యవన్యమృగము= క్రూరములైన, అడవి జంతువులు, ప్రోది= రక్షణ.

భావము : "తాపసులకు సంపదలతో పని యేమి అని అంటివి కదా! మీ వంటి రాజులు తప్పక మునులను, ప్రజలను (పుడమిని) , అడవిజంతువులు మమ్ము బాధింపకుండు నట్లు ఎల్లప్పుడు విలువైన సంపదలను పొంది కదా మా వెంటనుండి రక్షణ చేయదగినవారు."

విశేషము : మనుసంభవ ప్రబంధములో యతి ప్రవరాఖ్య సంవాద ఘట్టమున ప్రవరునకు సమాధానముగ గృహస్థునిపాత్రను పొగడుచు యతి పలికిన మాటలు ఇట స్మరణీయములు.

క॥ కావున నానృపశేఖరు
తో వేగమె వచ్చి కన్యదోడ్కొని చని సు
శ్రీవిభవోన్నతి నచటనె
గావింపుడు శోభనంబు గడు ముదమొప్పన్ 88

భావము : 'కావున వెంటనే ఆ రాజుతో వచ్చి మాకన్యను కొని పోయి వైభవముగ మీ రాజుగారింటిలోనే వివాహ శుభకార్యము(శోభనము) చేయించండి."

వ॥ అని యక్కూతుం దోడితెచ్చి యాయన సన్నిధి చేసినం జూచి సర్వసౌభాగ్య లక్షణ సౌందర్యవయోవిలాస సంపన్నత్వంబునకు సంతోషచిత్తుండై మున్ను దనచేతనున్న రాజముద్రిక యక్కన్నియ వేలం గీలించి యమ్మాయ మునికాంత చేత ననుజ్ఞాతుండై త్వరితగతి నరిగియంతయు నాచంద్రకేతుభూకాంతున కెఱింగించిన సంతోషించి కౌగిలించుకొని యాకలికి శుభలక్షణరేఖావిలాసంబులు తజ్జననప్రకారంబును వినుచున్న సమయంబున 89

అర్థాలు : కీలించు= లోతుగా, తత్+జన్యప్రకారము= ఆ పుట్టినవిధము

భావము : అని చెప్పి చంద్రరేఖను తెచ్చి ఆ మంత్రి ఎదుట నిల్పగా, ఆమెను చూచి, ఆమె సర్వ సౌభాగ సౌందర్య సంపన్నతకు సంతోషించినవాడై తన చేతిలో నున్న రాజముద్రికను ఆమె చేతికి తొడిగి మాయా మునికాంత అనుమతితో వేగముగా వెడిలిపోయి చంద్రకేతునకు అంతయు తెల్పగా సంతోషించి ఆతడు కౌగిలించుకొని ఆమె వృత్తాంతమును విన్నవించు సమయమున

చ॥ పులుగులనెచ్చరింప ఘన భోగులకాకలి నుజ్జగింప జా
రులమది భీతినింప కడురుగ్ములచిత్తము తల్లడింప చో
రులకును నుల్కుబెంప నితరుల్ పని బాటల సంచరింప శీ
తలయుతవాతపోతములు దట్టముగా జనుదెంచె నయ్యెడన్ 90

అర్థాలు : పులుగులన్= పక్షులను, ఎచ్చరింప= హెచ్చరిక చేయ, ఉజ్జగింప= నిరసింపగా, జారుల= వ్యభిచారుల, విటుల, కడురుగ్మల= మొండి రోగుల, తల్లడింప= బాధపెట్టగా, చోరులకు= దొంగలకు, ఉల్కుపెంప= ఉలికిపాటును పెంచగా, వాతపోతములు= పిల్లగాలులు.

భావము : పక్షులకు హెచ్చరికగా, భోగులకు ఆకలి మందగించగా, విటులకు భయము కలుగగా, మొండి రోగులు బాధపడగా దొంగలకు ఉలికిపాటు మిగతావారు తమ తమ పనులలో నిమగ్నులు కాగా, మంద మందముగా చల్లని వాయువుల వీచినవి. పక్షులకు గూళ్ళు చేరుకొమ్మని హెచ్చరిక, చలిగాలివలన ఆకలి తగ్గును కదా. చల్లగాలికి ప్రియురాండ్ర భర్తలు ఇంటనుందురు కదా యని భయము వ్యభిచారులకుండును. ఉబ్బసము రోగుల భాద చల్లగాలికి పెరిగిపోవును, దొంగలకు, చల్లగాలి వలన జనులు ఇండ్లలోపల పరుండుదురు కదాయని ఉలుకు. చల్లదనమునకు ఇతరులు ఆహ్లాదమును పొందిరి.

ఆ॥ మఱచి మాయమునిగి మల్లడిగొను మౌని
కాంతజూడ వైజయంతమునను
తొలగి చూచెడి శశిముంగరముత్యంబు
సోయగమున వేగుచుక్క యొలసె 91

అర్థాలు : మల్లడిగొను= పరితపించు, వైజయంతమునను= ఇంద్రుని రథముపై జెండాలోనుండి, తొలగిచూచెడి= తొంగి చూచెడి, శశి= చంద్రుని, ముంగరముత్యంబు= ముక్కరలోని ముత్యముయొక్క, సోయగమున= అందముతో, ఒలసెను= పొందెను, కన్పట్టెను.

భావము : మఱపున మాయలోబడి పరితపించు తాపసకాంతను చూచుటకు ఆకాశమందు ఇంద్రుని తేరుపైగల వైజయంతమను టెక్కము నుంచి ఆమెను చూచుచున్న చంద్రుని ముక్కున గల రత్నము అందముతో వేగుచుక్కగా తోచెను. సూర్యుడు చుక్కవలె తోచి కన్పట్టెను.

చ॥ తరణి రథంబు నిల్పుటకు దాయు మహాసురనాథు నేటితో
నరిమురి వంచు పూనిక మహాసిని వేసిన ఖడ్గధారతో
శిరమెగయంగ వెంబడిని చిల్లిన మీదికి జారురక్తమై
ఖరకరజాతరక్తకరకాండము మింటికి బ్రాకె తూర్పునన్ 92

అర్థాలు : తరణి= సూర్యుని, దాయు= చేరవచ్చు, మహా+అసురనాథు= రాక్షసుని, అరిమురిన్= నిశ్చయముగా, వెంటనే, వంచు= ఓడించు, పూనిక= పట్టుదల, లక్ష్యముతో, మహా+అశని= గొప్ప వజ్రాయుధమును, ఖడ్గధారతో= కత్తివాదర, పదునైన మొనతో, ఖరకరజాతరక్తకరకాండము= సూర్యుని నుండి పుట్టిన ఎఱ్ఱని కిరణముల సమూహము.

భావము : సూర్యుని తేరును అడ్డగించుటకై చేరవచ్చు రాక్షసరాజును నిశ్చయముగ ఓడించవలెనన్న లక్ష్యముతో గొప్ప ఆయుధమును ఆరాక్షసుని పై వేయగా ఆ ఖడ్గము తాకున వాని తల తెగి పైకి చిమ్మి కాఱెడి రక్తమువలె సూర్యుని ఎఱ్ఱని కిరణముల కాంతి పుంజము ఆకాశమందు తూర్పున మొలచెను.

మహారక్కసుడు చీకటి, రాత్రి రాజ్యమేలి, ప్రొద్దున ఉదయించపోవుచున్న సూర్యునిపైకి దాడిచేయరాగా, సూర్యుడు వానిపైకి విసిరిన ఆయుధము దెబ్బకు తలతెగి ఆ చీకటిరక్కసుని రక్తము పైకి చిమ్మినట్లున్న ఉదయ సూర్యుని ఎఱ్ఱదనము కన్పట్టెనని, ఉత్ప్రేక్ష.

చ॥ కమలిని సేదదేరె శశికాంతులు వెల్వెల బారె తుమ్మెదల్
కమలపుటీవికాసముల కాంతలచెంతల జేరె నెంతయున్
కుముదిని కాత్మలో వెతలుగూలె గృహాంతరభాసదీపికా
రమణము జారె మిక్కిలిని రాగ(ము దిక్కుల మీరె నెంతయున్ 93

అర్థాలు : కమలిని= తామరకొలను, సేదతీరె= అలసట తీరెను (నిద్ర మెల్కొనెను), కమలపుటీవికాసములు= ముడుచుకొన్నతామర దొప్పలు

తెఱచుకొనుటచే (తామర విప్పారుటచే), కాంతలచెంతల= ప్రియురాండ్ర దగ్గఱ, కుముదిని= కలువల సమూహము, వెతలు= దిగులు, గృహ+ అంతరభాసదీపికారమణము= ఇండ్లలోని దీపముల వెలుగు, రాగము= ఎఱ్ఱదనము.

భావము : సూర్యోదయము కాగా, తామరకొలను నిద్రమేల్కొన్నది. వెన్నెల వెలుతురు వెలవెల పోయినది. వికసించుచున్న తామర పూవులలో బంధింపబడిన గండు తుమ్మెదలు తమతమ ఆడు తుమ్మెదలతో జతగూడినవి. కలువల సమూహమునకు దిగులు పుట్టినది. ఇండ్లలోని దీపముల వెలుగు జారిపోయినది. దిక్కులంతటను ఎఱ్ఱనిసూర్యకాంతి అలముకొన్నది.

విశేషాలు : సూర్యోదయముతో పద్మాలు వికసించినవి, కనుక తుమ్మెదల సందడితో తామరకొలను నిద్రమేల్కొన్నట్లు రాత్రంతా ముకుళించిన పద్మాలతో మధులోభము వలన బందీలుగా ఉన్న గండుతుమ్మెదలు సూర్యోదయముతో వికసించిన పద్మాల నుండి వెలువడి, విడుదలైన ఖైదీలవలె, తమతమ ప్రియురాండ్రను కలుసుకొన్నవి. ఎఱ్ఱనిరాగము అనురాగానికీ జీవచైతన్యానికీ ప్రతీక. ఇది ఆకాశాన అలమికొన్నది. భూమీమ్మదనూ ప్రసరించినది. కాని, ఈ చైతన్యానికి ఆభాసము అదే సమయములో జరిగినది. ఆకాశాన వెన్నెల పాలిపోయింది. కలువలు దిగులుతో ముకుళించికొన్నవి. ఇండ్లలోని దీపకాంతి తగ్గింది. ఇది దీప పరముగా అశుభం కావచ్చుకాని ఇండ్లలోని వారికి శుభోదయమే. అనగా శుభాశుభముల కలయిక. ఈ భావమే పద్మముల వికాసము, కలువల ముకుళనములలో ప్రతిఫలించినది.

ఆ॥ శక్రవరుణరాజ సౌధాగ్రమాణిక్య
చంద్రకాంతశకలసదృశమగుచు

నుదయచరమభూధరోపరివసియించె
పృథులసూర్యచంద్రబింబయుగళి **94**

అర్థాలు : ఉదయచరమభూధర+ఉపరివసియించె= ఉదయ సమయము అంతమగునప్పుడు, పృథుల= పెద్ద

భావము : పెద్ద సూర్యచంద్ర బింబములు రెండును, ఒకే సమయమందు ఇంద్రుని (తూర్పుదిక్పతి) వరుణుని (పడమటి దిక్పతి) మేడలపై, క్రమముగా పద్మరాగ, చంద్రకాంత మణుల ఖండముల వలె(ముక్కలు) చంద్రాస్తమయము, సూర్యోదయకాలము, క్షణకాలము గోచరించినవి.

విశేషము : ఇంద్రుడు తన మేడమీద పద్మరాగములను, వరుణుడు తనమేడ మీద చంద్రకాంత మణులను అమర్చుకొన్నారు. క్షణము చంద్రాస్తమయ, సూర్యోదయ శోభచూపఱులకు అమితానందము కల్గించినది.

వ॥ ఇట్లు సూర్యోదయంబగుటకు పూర్వంబున నృపసచివవరులు కాలోచితంబులు
నిర్వర్తించి సేవకజనాగమన నిరీక్షకులై యున్నయెడ **95**

భావము : అందముగా, సూర్యోదయమగుటకు ముందే, రాజు మంత్రియు, ఉదయకాల కర్మలను కావించుకొని, సేవకుల రాకకై ఎదురుచూచు చున్నపుడు

సీ॥ తొలునాటివేటలోనిలరేని మంత్రిని
గనలేక పురమునకరిగిబలము
లిచటికి రాకుండుటాత్మలో గలగుచు
నారేయి గడపుచో నఖిలబలము
లరుణోదయాత్పూర్వమచటికినల్లన
కొలకులదరుల నెక్కొనుచు వెదకి
యూడిగంబులు నెడ బోడికలందంద
జాడలుగన్గొని జాడవెంట

తే॥ జనుచు యమునానదీతీరవనముమధ్య
సైకతోపరివాసులై యేకతమున
నున్నరాజును మంత్రీంద్రు నొయ్య గాంచి
వచ్చి నిలిచిన మంత్రి యవ్వారికనియె 96

అర్థాలు : బలములువ సైనికులు, కలగుచువ బాధపడుచు, కొలకులవ కొలనుల చెంత, దరులవ గుహలలో

భావము : తొలిరోజు వేటలో రాజును, మంత్రిని కోల్పోయి, సైనికులు పురమునకు పోయి, వారక్కడ లేకుండుటను చూచి, మిక్కిలి చింతతో ఆరాత్రిని గడుపు చుండగా అందరు సైనికులు అంతట వెదకి వెదకి, చివఱకు కొన్ని జాడలను బట్టిపోయి, యమునాతీరపుటిసుకపై నున్న వారిని జూచి వచ్చి నిలువగా, మంత్రి వారితో నిట్లనెను.

చ॥ సరగున బోయి పట్టణము చాలనలంకరణంబు సేయగా
పురపరిపాలకాగ్రణికి బోరన దెల్పి పురోహితద్వయిన్
త్వర నిటు దోడితెమ్మనిన వాడు చనం గని సర్వసేనలున్
నరపతి జేరె నంత నరనాథుడు మంత్రి ముదంబుతోడుతన్ 97

అర్థాలు : సరగున= త్వరగా, బోరన్= త్వరగా

భావము : త్వరగా వెళ్లి, పురపాలకునకు పట్టణమును బాగుగ అలంకరించుమని ఇద్దఱు పురోహితులను ఇక్కడకు తీసికొని రమ్మని చెప్పగా, ఒకడు వెళ్ళెను. సేనలన్నియు రాజును చేరినవి. రాజు, మంత్రి సంతోషముతో

ఉ॥ పట్టపుదంతి నెక్కిహయభద్రకరీంద్రరథప్రయుక్తిగా
జుట్టు బలంబులుం నడువ సూరెలపేటు రుమాలువేయగా
బెట్టుగ భేరికాపణవిభీషణనాదములుప్పతిల్లగా
నెట్టన బర్ణశాలలకు నెమ్మి గడల్కొన నేగి యచ్చటన్ 98

అర్థాలు : పట్టపుదంతి= పట్టపుటేనుగు, హయభద్రకరీంద్రరథప్రయుక్తిగా= గుఱ్ఱములు, ఏనుగులు, రథములు, చుట్టును కాల్బలములతో నడువగా, సూరెల= ఇరుప్రక్కల

భావము : పట్టపుటేనుగునెక్కి, చతురంగబలములు చుట్టు నడువగా, ఇరుప్రక్కల నుండి శ్రేష్ఠమైన రుమాలు పఱచగా, భేరీనాదాల మధ్య పర్ణశాలలకు ప్రీతితో వెళ్లెను.

విశేషము : పేటు రుమాలు గౌరవసూచకముగా మార్గమందు దుపట్టాలను అమర్చుటచే అవి నిడుపైన చాపలవలె మెత్తగా అందమై ఒప్పుచు కాంతులను వెదజల్లెను.

చ॥ విడిసి యమాత్యశేఖరుడు విశ్వవిభుండును కేలుగేలు సం
గడి గదియించి పోవునెడ కన్నియ నెచ్చెలు లిద్ద రొయ్యన
య్యెడ నెదు రేగుదెంచి మదినెచ్చినవేడుక తోడ్కొపోవ న
క్కడికి పురోహితుల్ గలయ గైకొనిపోయి తదాలయంబునన్ 99

అర్థాలు : విడిసి= విడిది చేసి, అమాత్యశేఖరుడు= మంత్రి, సంగడికదియించి= స్నేహముతో ఒకదానితో మఱొకటి చేర్చి

భావము : విడిదిచేసి, మంత్రి చేయి చేయి కలిపి, పోవుచుండగా, చంద్రరేఖ చెలికత్తెలిద్దఱు ఎదురుగ వచ్చి వారిని కలిసి, అప్పుడక్కడకు వచ్చిన పురోహితులతో వారి ఆలయమందుండగా,

క॥ ఉన్నెడ మాయాంగన తగ
నన్నులతో వచ్చినృపున కమ్మంత్రికి న
త్యున్నతమోదము సంధిల
గ్రన్నన విహితోపచారకములు ఘటించెన్ 100

అర్థాలు : అన్నులు= యువతులు, మాయా+అంగన= వంచించు వనిత,

భావము : అప్పుడు ఆ మాయలాడి చెలికత్తెలతో తగిన మర్యాదలను వారు సంతోషించునట్లు నిర్వర్తించినది.

చ॥ మఱియును కామధేనువు సమంచితలీలల సంస్మరించినం
గరమరుదార వచ్చి నిజకల్పితషడ్రసయుక్తభోజ్యముల్
కరిహయమానవార్హ ముగ ఖాణతృణాన్నముఖ ప్రభోజ్యముల్
పరిపరిరీతి సేనలకు పార్థివమంత్రుల తృప్తి చేసినన్ 101

అర్థాలు : కరమరుదార= మిక్కిలి అపురూపముగ, కరిహయమానవ+ అర్హముగ= ఏనుగులకు, గుఱ్ఱాలకు, మనుజులకు, తగినట్లుగా, ఖాణతృణాన్నముఖ ప్రభోజ్యముల్= ఉలవలు మొ॥ దాణా, గడ్డి, అన్నము మొ॥ భోజన పదార్థము లను, పార్థివ= రాజు

భావము : ఆ మాయాంగన కామధేనువును స్మరించగా, ఆ ధేనువు వచ్చి వారికి, జంతువులకు తృప్తియగునట్లు ఆహారమిచ్చి విందు చేసినది.

ఆ॥ సచివవరుడు మౌని సదనంబునకు పురో
హితయుగంబు బనుప నేగుతరిని
మాయవనిత వారిమన్నన గావించి
వారు దాను చెలులు గూరిమలర 102

అర్థాలు : సదనంబు= నివాసము,ఇల్లు,

భావము : మంత్రి ముని నివాసమునకు ఇద్దఱు పురోహితులను పంపుటకై పోవు సమయమున వారిని మాయలాడి గౌరవించి, వారు, తాను, చెలికత్తెలు ప్రేమ నిండగా,

క॥ శుభవేళలక్షణాన్విత
నభినవశృంగారమహిమ నతులితతేజో
విభవాభిరామకన్యక
రభసంబున దోడితెచ్చి రాజున కనియెన్ 103

అర్థాలు : లక్షణాన్వితన్= శుభలక్షణములు కలిగిన దానిని, అభినవశృంగార మహిమన్= క్రొత్తయైన శృంగార కాంతి గలదానిని, అతులితతేజోవిభవా భిరామకన్యకన్= సరిలేని తేజస్సుతే వెలుగుచున్న కన్యను, రభసంబున= వేగముగ.

భావము : శుభలక్షణములు, తేజస్సు కలిగిన నవయౌవనాకర్షణగల కన్యను తెచ్చి రాజుతో నిట్లన్నది.

క॥ రాజ! ఋషికన్య బాలిక
రాజశిఖామణివి మౌని రాజానుమతిన్
రాజవని నీకు నిత్తున్
శ్రీజయవిభవాభివృద్ధి జేకొను మనుచున్ 104

భావము : "రాజా! ఈమె ఋషికన్య, చిన్నది, నీవు రాజవు. ఈ వివాహమునకు ఈమె తండ్రి ముని శ్రేష్ఠుని అనుమతి ప్రకారము ఈమెను రాజువని నీకు ఇచ్చుచున్నాను. నీవు సౌభాగ్యము, విజయము, సంపద, ఉన్నతులను పొందుము."

ఆ॥ బాలకేలుదమ్మి పార్థివశేఖరు
పాణిపల్లవపుటిబాదుకొల్పి
పుత్రపౌత్రవిభవభోగభాగ్యంబుల
వెలయు మనుచు బలికి వీడుకొలిపి 105

భావము : ఆ పద్మము వంటి చేతిని శ్రేష్ఠుడైన రాజుయొక్క చిగుర్లవలె ఎఱ్ఱనైన చేతిలో చక్కగా అమర్చి పుత్రులు, పౌత్రులు విలాసము, సుఖము, సంపదలతో జీవింతువుగాక అని ఆశీర్వదించి పంపుచు,

మ॥ అనుగుంగూతురు కౌగిలించుకొని నేత్రాబ్జంబులం బాష్పముల్
చినుకం జెక్కులు ముద్దు వెట్టుకొని యో శీతాంశుబింబాస్య నీ

జనకుం డానతియిచ్చినట్టులను రాజస్వామి నీచంద్రకే
తుని నిన్నుం దగ గూర్చె బ్రహ్మ మదిసంతోషంబునున్ జెందుమీ 106

భావము : ప్రియమైన పుత్రిని కౌగిలించుకొని, కమలముల వంటి కన్నుల నుండి కన్నీరు వెల్వడుచుండగా ఆమె చెక్కిళ్లను ముద్దాడి "చంద్రబింబము వంటి ముఖము కలదానా! నీ తండ్రి ఆజ్ఞాపించినట్లు, రాజశ్రేష్ఠుడైన చంద్రకేతునకు, బ్రహ్మ భార్యగాచేసెను. మదిలో సంతోషమును నింపుకొనుము."

తే॥ బాల యిన్నాళ్లవలె నీవు బాల్యచేష్ట
లడరి చెలికత్తియలగూడి యాడబోక
మగనితలలోని నాల్కవై తగ మెలంగు
మత్తమామల సేవింపు మనవరతము 107

అర్థాలు : అడరి= ఎక్కువగా కలిగి, అనవరతము= ఎల్లకాలము

భావము : "ఇన్నాళ్ల వలె, చెలికత్తెలతో కలిసి చిన్నతనపు చిలిపి పనులతో ఆట్లాడవద్దు. నీపతి తలలోని నాలుకవలె, అతని మనసునందు ఆలోచనలకు అనుకూలముగా, నీ అత్తమామలను సేవింపుము."

విశేషము : భర్త కార్యములలో "కరణేషు మంత్రీ" గా ప్రవర్తింపుము.

వ॥ అని యనేకవిధంబులం గూడుకొని కూతురికి బుద్ధులు చెప్పి వెంటబోవు చెలికత్తియల కప్పగించి తన మనోరథ మీడెరెనని సంతోషింపుచు నిజమందిరంబున కరిగె 108

భావము : ఈ విధముగా పదిలముగా ఆమె మనస్సులో నిలుచునట్లు కూతురికి, నీతులు చెప్పి, ఆమె వెంటపోవు చెలికత్తెలను, ఈమెను జాగ్రత్తగా చూడుడని చెప్పి, తనకోరిక ఫలించినందుకు సంతసించుచు, తన మందిరమునకు వెడలిపోయెను.

ఉ॥ ఆ సమయంబునందున సుఖాసన మొక్కటి తెచ్చి నిల్పినన్
భాసురలీల నెచ్చెలులు పాలకిలోపల మోదమొప్పగా
నా సుమగంధి నుంచి తగనావరణంబుఘటింపబాలకి
న్నా సచివాగ్రగణ్యుని నియామకమై దనరార నయ్యెదన్ 109

అర్థాలు : ఆసనము= పీట, పాలకి= పల్లకి

భావము : ఆ సమయమందు కన్య కూర్చుండుటకై మెత్తని వస్త్రములు కప్పిన మూడుకాళ్ళు గల పీటను తీసికొనివచ్చి అమర్చగా, ఆమె చెలికత్తెలు, ప్రకటమగు ఉల్లాసముతో, పల్లకీలో పీటపై కూర్చుండబెట్టి తగినట్లు చుట్టును గుడ్డలతో ప్రాకారమువలె కప్పగా, ఆ పల్లకి, ఆ మంత్రివర్యుని ఆజ్ఞచే అలంకరించబడి వెలుగులు చిమ్మెను.

క॥ దిట్టలగు వేత్రహస్తులు
చుట్టి బరాబరులుసేయ సుదతులు కెళవుల్
బట్టుకొ చను దేరగ ముని
పట్టిని కొని పర్ణశాల బైటికి జనగన్ 110

అర్థాలు : వేత్రహస్తులు= బ్రద్దలవారు, బరాబరులు చేయ= హెచ్చరికలు చేయగా, కెళవుల్= ప్రక్కల

భావము : బలాఢ్యులు దండములను చేతులందు కల సేవకులు హెచ్చరికలు చేయగా, ఆమె ప్రక్కలను యువతులు వచ్చుచు ముని కన్యను పట్టుకొని పర్ణశాల వెలుపలికి వెళ్ళగా,

చ॥ ధరణివిభుండు మంత్రియు బుధప్రకరంబును నొయ్యవచ్చు న
త్తరి నొకభద్రదంతిని ముదంబున మ్రోలను దెచ్చిపెట్టినన్
నరపతి మంత్రితోన మదనాగము నెక్కి మహోత్సుకాత్ముడై
గురుతరభేరికాపటహఘోషలు మిన్నును ముట్టి మ్రోయగన్ 111

అర్థాలు : మ్రోలను= ఎదుట, మదనాగము= మదించిన ఏనుగు

భావము : రాజు, మంత్రి, పెద్దలు వచ్చుచుండ, ఒక భద్రగజమును ముందుంచగా, రాజు మంత్రితో ఆ ఏనుగునెక్కి ఉత్సాహముతో దుందుభులు, తప్పెటలు మ్రోగుచుండగా

క॥ **చతురంగబలసమన్విత**
నతివైభవమొప్ప పాఠకావలిబహుసం
గతుల నుతింపగ కాంతా
యుతుడై పట్టణముఁజొచ్చి యుజ్జ్వలమహిమన్ 112

అర్థాలు : పాఠకావలి= స్తోత్రపాఠకులు, సంగతులు= చక్కని గమకములతో

భావము : చతురంగబలములతో రాజు, తేజస్సు గోచరించుచుండగా శ్రావ్యములైన నుతులు వినుచు కన్యతో గూడి పట్టణమును చేరెను.

మ॥ **పురవీథిం జనుదేర సౌధముల నంభోజాక్షులెంతేని శ్రీ**
కరలాజాక్షతపుష్పముల్ గురియ మాంగల్య క్రియావాచక
స్ఫురణల్ మీర గృహాంగణంబుల దగన్ బుణ్యాంగనల్ హారతుల్
వరుసం బట్టగ వేదపాఠములు క్రేవన్ భూసురుల్ సేయగన్ 113

భావము : వారు పురవీధులలో పోవునపుడు మేడమీద నుండి అందగత్తెలయిన యువతులు శుభప్రదములైన పేలాలు, అక్షతలు (బియ్యము), పూలు విరివిగా చల్లగా, మంగళకరమగు పన్నీరు నిండగా ముత్తైదువలు హారతులు ఇయ్యగా, బ్రాహ్మణులు వేదపాఠములు వరుసగా చదువగా,

సీ॥ **మహదుత్సవంబున మానినీమణితోన**
మందిరంబున జేరి మనుజవిభుడు
శుభముహూర్తంబున సురలకచ్చెరువైన
సకల వైభవములచంద్రరేఖ

బరిణయమై భోగభాగ్యసంపన్నత
భూసురాశీర్వాదములు దనర్ప
సకలార్థి జనముల సంతుష్టిగావించి
బంధుమిత్రామాత్యపరిజనముల

తే॥ **కాంచనాంబరభూషణకనక వృష్టి**
గజతురంగాదివాహనోత్కరయుతముగ
సర్వజనముల బహుమానపూర్వకముగ
తృప్తిగావించె నిరుపమ తేజుడగుచు 114

అర్థాలు : అర్థిజనములకు= యాచకులకు, నిరుపమ= సాటిలేని

భావము : ఆ రాజు శుభముహూర్తమున చంద్రరేఖను పెండ్లాడి, బంధుమిత్రులను, పరివారమును బహుమానములిచ్చి సంతోషపెట్టెను.

వ॥ **ఇట్లు సకలసంభ్రమంబులం బరిణయంబై బ్రాహ్మణసంతర్పణంబు గావించి చంద్రరేఖాగాఢాలింగన కుతూహలాయమానమానసుండును త్రియామాగమన కాంక్షితుండును నై యున్నసమయంబున** 115

అర్థాలు : త్రియామ+ఆగమన= రాత్రిరాకకై

భావము : పెండ్లియైన తర్వాత చంద్రరేఖతో శృంగారమునకై చీకటి పడుటకై రాజు తహతహలాడెను.

తే॥ **అమరమునికాంతయై మదనాగ్ని వేగి**
గాఢరతులకు గవయు దుష్కర్మ మెట్లు
చూతునని రోసి పోయిన రీతి దనర
నరుణకిరణుండు చరమాద్రి నస్తమించె 116

అర్థాలు : అమరమునికాంత= దేవముని కుమార్తె, మదనాగ్ని= మదనతాపము, చరమాద్రి= పడమటికొండ,అస్తాద్రి.

భావము : ఇంతలో, చంద్రరేఖ దేవముని కుమార్తెయై యుండి కూడ, మన్మథబాధతో మానవమాత్రునితో శృంగారానుభవమునకు సిద్ధమైనది కదా, ఈ కానిపని చూడలేక యన్నట్లు సూర్యుడు అస్తమించెను.

చ॥ తనపతిరాకకై యరుణ ధాతుపటంబులు మేలుకట్లుగా
వనజభవాండగేహమును వాసి నలంకరణంబు చేసెనో
మునుమును రాత్రికాంత యన మోహనలీలల సాంధ్యరాగముల్
దనరెను సర్వదిక్కుల సుదారత శోభనచిహ్నముల్ దగన్ 117

అర్థాలు : వనజభవాండగేహమును= బ్రహ్మాండమను ఇంటిని, మేలుకట్లు= చాందినీలు.

భావము : తన మగని రాకకోసము ఎఱ్ఱని చాందినీలు అలకరించినదేమో యామినీదేవి (చీకటి అను స్త్రీ) అన్నట్లుగా సంజకాంతుల ఎఱ్ఱదనము దిక్కులన్నిట మంగళములను కలిగించునదై ప్రసరించినది.

క॥ ఆమాయ తనదుచేష్టల
నే మాయెనో చంద్రరేఖ యిపుడని చూడం
దా మొనయునట్ల మొనసెను
భూమిం జీకటులు సర్వపూర్ణంబగుచున్ 118

భావము : ఆ మాయయే తన చర్యలచే చంద్రరేఖ ఎన్ని బాధలు పడి ఎట్లగునో చూచుటకు ఇష్టపడక, పుడమిపై దట్టమైన నిండుగచీకట్లను నింపెను.

అలంకారము : ఉత్ప్రేక్ష మాయయే చీకట్లను చల్లెనని ఊహ.

క॥ డెందంబులను చకోరక
బృందము లానందమొంద బిసరుహతతులున్
గందగజాదులు గుందగ
చందురు డుదయించె విరహిజనదవశిఖియై 119

అర్థాలు : డెందంబులను= మనసులలో, చకోరకబృందములు= చకోర పక్షులగుంపులు, బిసరుహతతులున్= తామర తంపరలు, గంధగజాదులు= మదపుటేనుగులు మొ॥, కుందగ= బాధపడగ, విరహిజనదవశిఖయై= విరహముతో తపించు జనులకు తీవ్రమైన అగ్నిజ్వాలయై.

భావము : వెన్నెల రాకకై చకోర పక్షుల ఎదలలో ఆనందము ఉప్పొంగినది. పద్మముల సమూహములు, తమ దళములను మూసికొనుటకై, మఱియు మదించిన ఏనుగులు తమ తమ ఆడ ఏనుగులకై, అట్లే సర్వ ప్రపంచమందు, విరహి జనులు తపించునట్లు వారికి తీవ్రమైన అగ్ని జ్వాలయై(నిప్పుసెగగా) చంద్రుడు ఉదయించెను.

వ॥ ఇట్లు నక్తంబు ప్రసక్తంబైన సంతోషానురక్తుండై సకలవిధశృంగారంబులను బహువిధపరికరపరిపూర్ణంబుననైన కేళికామందిరంబు శుభముహూర్తం బునం బ్రవేశించి చంద్రరేఖా సమాగమ నాసక్తుండై హంసతూలికా తల్పంబున నున్న యటమున్ను సకల విధాలంకరణంబుల కలంకరణం బైన యక్కన్నియను మన్నన నన్నులు మదగజంబునుం బదిలంబున నొత్తుకుని వచ్చు రాహుత్తుల పగిది యెత్తుకుని తెచ్చికేళికాగృహంబునం జేర్చికవాటంబు డగ్గఱ దార్చి చనిన దలవాంచి పాదాంగుష్ఠంబు నేల వ్రాయుచు నిలిచియుండి 120

భావము : ఇట్లు రాత్రి శోభిల్లగా, సంతోషముతో, అన్ని అలంకరణములతో, పరికరములతో కూడిన, కేళీగృహమును శుభసమయమందు ప్రవేశించి చంద్రరేఖను చూచుటకు సిద్ధమై చక్కని శయ్య యందుండగా, ముందే అలంకారములతో నిండియున్న కన్యను, చెలికత్తెలు మదగజమును నడిపించు మావటీలవలె, కన్యను ఎత్తుకొని ఇంటిలోచేర్చి తలుపుమూసి వెడలిపోగా, ఆ సుదతి తలవంచి కాలిబొటన వ్రేలిని గీటుచు నిలువగా,

శా॥ ధీరోదాత్తుడుగాన పార్థివుడు సందీప్తాంగజోద్రేకమున్
పారావారమువేలబోలె తమి నిల్పం జూచి యక్కొమ్మ దా

రా రమ్మంచును గారవించి తను జేరం దియ్యడేమో కదా
మారు డింతకు తాళునే కదిసి మర్మంబెల్ల భేదింపగన్ 121

అర్థాలు : పార్థివుడు= రాజు, సందీప్త+అంగజ+ఉద్రేకమున్= ప్రేరేపింపబడిన మదనావేశమును, పారావారము= సముద్రమును, వేల= చెలియలికట్ట (తీరభూమి), తమి= కోరిక

భావము : ధీరోదాత్తుడు రాజు రేగుచున్న కామోద్రేకమును, కోరికను వశము చేసుకొని, ఎదుట నిల్వగా చూచి, కన్య తన్ను తనయొద్దకు రమ్మనదేమి, రహస్యస్థానములను చేరనీయక మదనుడు ఇంక ఆలస్యము చేయునా అని తలచుచుండెను.

విశేషము : కావ్యనాయకులలో ధీరలలిత, ధీరశాంత, ధీరోద్ధత, ధీరోదాత్తులను నాల్గువిధములలో ఉత్తముడు ధీరోదాత్తుడు. వీని ప్రవర్తనము ఆవేశపూరితము కాదు. కనుక ఈ రాజు లోపల మదనాతిరేకము సముద్రమంతైనను, వాని ధీరోదాత్తత దానికి చెలియలికట్టయైనదను పోలిక సార్థకము. 'మర్మంబెల్లి భేదింపగన్' అనుటలో సంభోగశృంగారము ధ్వనితము.

వ॥ అని యువ్విళ్లూరుచు లజ్జయనుసరించుచున్న సన్న వలిపెదుప్పటి తెరచాటున నున్న యన్నలిన గంధి నల్లన కరపల్లవంబు బట్టి శయ్యకు దార్చి తాంబూలంబు నొసంగి శిరంబు నిమిరి లాలింపుచు 122

అర్థాలు : వలిపెదుప్పటి= తెల్లని గుడ్డ

భావము : ఇట్లు ఆశతో సిగ్గుతో తెల్లని దుప్పటితెర చాటున నిల్చిన ఆ చంద్రరేఖ చెయ్యిబట్టి, పక్కపై జేర్చి, తాంబూలమిచ్చి, తలనిమిరి, లాలింపుచు

సీ॥ చెక్కిలికొనగోళ్ల నొక్కిన సీత్కార
రవమున వస్త్రంబు వివృతమైన

తమ్ములం బిడి వెంట కెమ్మోవి మొనపంట
నొక్కింత చురుకున నొక్కి కుంకు
మాగరుపంకంబు నలదుచో పయ్యెద
సడలించి రవికె క్రొమ్ముడి వదల్చి
కరముల నొండొక కడ జిమ్మి గుబ్బల
నెరయ బూయుచు నఖాంకురము లునిచి

తే॥ నీవి సడలింప గరముల భావభవుని
మందిరము గప్ప గిలిగింత గ్రందుకొలిపి
సరసరతికేళి నెమ్మది చల్లగాను
ప్రథమసురతంబు గావించె పార్థివుండు 123

అర్థాలు : వివృతమైన= ఊడిన, తమ్ములంబిడి= తాంబూలమిచ్చి, కెమ్మోవి= ఎఱ్ఱని పెదవులను, మొనపంట= ముందున్నపన్నులతో, నఖాంకురములు ఉంచి= గోళ్లగుర్తులు పెట్టి, నీవి= పోకముడి(చీరముడి), భావభవుని మందిరమున్= మన్మథుని ఇల్లు(ఆడగుఱి, జననాంగము)ను

భావము : ఆమె చెక్కిలిని కొనగోళ్లతో నొక్కగా చీత్కారధ్వనితో ఆమె ధరించిన చీర జాఱినది. వెంటనే తాంబూలమును నోటిలో ఉంచి ఆమె ఎఱ్ఱని పెదవిని ముందు పళ్లతో కొంచెము మెత్తగా నొక్కి కుంకుమ, వాసన ద్రవ్యములను పూయుటకై పైటను వదులుగా జేసి రవికకు కట్టిన క్రొత్తముడిని రెండు చేతులతో విడదీసి, రవికెను మఱొకచోట పడవేసి చనుగుబ్బలకు చుట్టును పూయుచు గీతలు పెట్టుచు చీరముడిని కూడా విడదీయగా చేతులతో ఆమె తన రహస్యాంగమును మూయుచుండ, చక్కిలిగింతలచే ఆమెను అచ్చటచ్చట తాకుచు, ఉత్సాహమును కల్గించుచు రసవంతమైన సంభోగ క్రియలో నెమ్మదిగా చల్లదనము కలుగునట్లు రాజు మొదటిసారిగా పాల్గొనెను.

**చ॥ అళుకొకయింత తీరి పతికల్లన నాకులు చుట్టి యిచ్చుచున్
తళుకుమెఱుంగుగుబ్బలకు దార్చిన హస్తము నంట నొత్తుచున్
కొలుకుల సిగ్గు దార్కొనెడు కూరిమిచూపుల నాథు జూచుచున్
సెలవుల చిన్నినవ్వొలయ చిత్తము మెత్తదనంబు దెల్పుచున్ 124**

అర్థాలు : అళుకు= భయము, శంక, కొలుకుల= కంటిచివఱల, సెలవుల= పెదవులమూలల

భావము : కొంతభయము తీరిన తర్వాత భర్తకు తానే తమలపాకులు చుట్టియిచ్చుచు, తన చన్నులు పట్టిన భర్త చేతులను తానును గట్టిగ నొక్కుచు, సేవించు విధమున సిగ్గు నిండిన ప్రేమతో పతిని క్రీగంట చూచుచు, పెదవుల మూలలు చిఱునవ్వు కలవై ఆమె సానుకూలతను తెలియజేసినది.

**ఉ॥ పైటచెరంగుచే శ్రమము బాయగ వీచును మోముజూచి యా
నోటికి మోవిచేర్చు గడు నొక్కినపంటికి కంటగించ కే
పాటిగసేయ గిల్లు పరిపాటిగ కౌగిటజేర్ప గుబ్బలున్
నాటగ నంటనొక్కు రతి నాతికి నాస్థలుపెక్కులుబ్బగన్ 125**

అర్థాలు : ఆస్థలు= అవస్థలు, (ఈ పదము రూపాంతరముకావచ్చు. పదకోశములో లేదు), పెక్కులు+ఉబ్బగన్= మిక్కిలి సంతోషించగా.

భావము : రాను రాను ప్రౌఢయైెన తీరు వర్ణితము. రతిశ్రమలో చిఱుచెమటలు పట్టినప్పుడు పైటకొంగుతో విసరును. భర్త ముఖము చూచినప్పుడు, ముద్దులకు సిద్ధపడును. తన పెదవిని భర్త పంటితో గట్టిగ నొక్కినను కాదనక (బాధను వ్యక్తము చేయక) తానును సరిసాటిగ ప్రవర్తించుచు గిల్లును. కౌగిలించినచో చన్నులను భర్త శరీరమునకు గట్టిగ అదుముకొనును. ఇట్లు పెక్కు విధములుగా రతిక్రియలందు ఆమె ఆసక్తిని పొందినది.

**చ॥ మఱిమఱి చేర రేగి పలుమాఱును మారునికేళి దేలుచో
నరమరలేని కూర్మి నధరాధరపానముదంబు నొందుచున్
పరిపరిబంధభేదముల భావజకేళికి నుత్సహింపుచున్
సురతవిలాససౌఖ్యముల జొక్కిరి మిక్కిలి ప్రేమ నెంతయున్ 126**

అర్థాలు : రేగి= చెలరేగి,మిక్కిలి ఉద్రేకముతో, అరమర= దాపరికము, పరిపరి= పెక్కువిధములు

భావము : మరల మరల ఉద్రేకపూరితులై చాలాసార్లు మదన క్రియలలో తేలునప్పుడు ప్రకటమైన ప్రేమతో పెదవులను అంటుకొని ముద్దాడుచు, బహుప్రకారములుగా పెక్కురీతుల భేదములతో సంభోగసుఖమును ఉత్సాహముతో మిక్కిలి ప్రేమతో అనుభవించుచు ఒడలు మఱచిరి.

విశేషము : వివిధములైన రతి భంగిమలు కామశాస్త్రమున చెప్పబడినవి. వానిని ఎఱిగిన రాజు వానిని ప్రథమముననే ప్రయోగించి సంతృప్తిని పొందెను.

**సీ॥ తమి నిలుపోప కాతరలాయతేక్షణ
ప్రౌఢిన జివ్వన పైకి నుఱికి
గళరవవిస్ఫూర్తి కలరవంబులు మీర
ఘనతారహారముల్ గునిసియాడ
పదముల నందియల్ గొదగొని మ్రోయంగ
కంకణఝుంకృతుల్ కలయబర్వ
తాటంకమణిరుచుల్ తళుకుల నీనంగ
విభునిపై నెఱవేణి విరులు గురియ**

**తే॥ మేల్మిబంగరు నెమ్మేను మెఱుగు లీన
సొలపు నెమ్మోము చమటల సోన గురియ
కళల గరగుచు సొలయుచు కణకమెఱయ
చతురలోచన యుపరతి సలిపె నపుడు 127**

అర్థాలు : తమి= తృప్తి, గునిసియాడ= కులుకుచు కదలగా, గొదగొని= అతిశయించి, నెఱవేణి= ఒత్తైనజుట్టు, విరులు= పూలు, సొలపు= అలసటతో, సోన= అల్పవర్షము, కణక= మిక్కిలి, ఉపరతి= పురుషాయితము, తాటంకములు= చెవికమ్మలు

భావము : తృప్తి చెందని కోరికతో ఆ చలించు కన్నులు గల చంద్రరేఖ, నిపుణతతో తటాలున పైకి లేచి, చంద్రకేతుని పైదూకి గొంతు నుండి మధురధ్వని వెల్వడు చుండగా మైమఱచి మాటలు మించగా, వీనితో కూడా, ఎక్కువగా ధరించిన రత్నాల దండలు నాట్యము చేయగా, కాళ్లలో అందెలును మెలగు చుండగా, చేతులోని బంగారుగాజులు ఝుంకారనాదములు చేయగా, చెవికమ్మలలో గల మణులు తళుకులను ప్రసరింపజేయగా, పతిమీద ఆమె అందమైన జడ నుండి పువ్వులు వర్షింపగా, బంగారు కాంతులు ఆమె శరీరము కుప్పింపగా, అలసట ముఖమంతయు చెమట నీటివాన వెల్వడ చేయగా,

విశేషము : తృప్తి నిలువక, ఆ చంద్రరేఖ పురుషాయితము చేసినది. ఇందు పురుషుని స్థానమున స్త్రీ పై బడి సంభోగము చేయును. ఆమె ప్రౌఢతనపు వర్ణన. కళల కరగుచు అనుటలో తన శరీరమునగల కళాస్థానములను ప్రియు డంటినపుడెల్ల అమిత సుఖమును పొందెనని భావము. చన్నులపై పచ్చిగోళ్ళ గుర్తులు, పెదవులపై పండ్ల నొక్కులు కన్నులజంటల ఎఱ్ఱదనము, ఆమె బడలిక తెలియజేయగా

ఆ॥ బహువిధములరతుల పరవశులై చొక్కి
చాల నలసి వేగుజాము నపుడు
కదిసి యొక్కరొకరి కౌగిళ్ల సడలగా
తెల్లవారి లేచి తెల్లముగను 128

అర్థాలు : చొక్కి= అలసి,సుఖించిన అలసట, కదిసి= దగ్గఱచేరి

భావము : అనేక భంగిమలలో సంభోగశృంగారమనుభవించి, బాగుగా అలసిపోయిరి. తెల్లవారుజామున మరల పెక్కుసారులు కౌగిళ్లలో మెలగుచు, తృప్తిగా, తెల్లవారినంతనే నిద్రలేచిరి.

ఉ॥ మంగళ శీతవాతమును మానిని యంత సహించి చీరమున్
కొంగొక కట్టు గట్టు మఱికోకకుచంబులనొత్తి పట్టుకే
లం గడ లొయ్యబట్టు రతిలంపటగుబ్బల పచ్చిగోళ్లక
న్నుంగవకెంపు మోవి పలునొక్కులతో బడ లిట్లు వెల్వడెన్ 129

అర్థాలు : కెంపు= ఎఱ్ఱదనము

భావము : ఆ మానిని చల్లని వాయుస్పర్శను సహించుచు చీర ముందు కొంగును ఒక కట్టుగా చేసి చన్నులను అది ఒత్తునట్లు పట్టుకొనెను. చేతితో చన్నుల నంతయు మెల్లగా పట్టుకొనెను. రతిక్రియలో కాముని కళలచే తమ చర్యలు సంతసమియ్యగా అలసిపోవుచు అందమైన కన్నులు గల ఆమె ఉపరతి కావించెను. చతురలోచన ఇది సార్థకము. ఆమె స్వయముగా, పురుషుని అవయవముల సొంపును నేర్పుతో చూచినదని భావము.

చ॥ సకియలు చూచి నవ్వు చెకసక్కములాడగ నమ్రతాస్యయై
యొకయెడ జేరి చీర కురు లొయ్యన దా సవరించుచోటునన్
ముకురము చూచి సిబ్బితము మోమున వ్రేలగ విస్మితాస్యయై
ప్రకటశుచి ప్రయుక్తి గడుభాసిలె నిద్దురముంపు తోడుతన్ 130

అర్థాలు : నమ్రతాస్యయై= తలవంచినదై, ముకురము= అద్దము, సిబ్బిత= సిగ్గు, శుచి= శృంగారము

భావము : చంద్రరేఖ అట్లు అలసటతో బయల్పడగా చెలులామెను చూచి నవ్వి ఆటలు పట్టించిరి. ఆమె తలవంచుకొని, ఒకచోట నిల్చి అద్దముచూచి చీరను, జుట్టును సవరించుకొనుచు, తన ముఖమున గల సిగ్గను, స్పష్టముగ

నున్న శృంగార చేష్టల గుర్తులతో నిద్రించిన మొగము యొక్క అందముతో గోచరించెను.

క॥ **పలి మేలుకాంచి నిత్యో**
చితములు తగ దీర్చి సర్వశృంగారవిలా
సితమూర్తి యగుచు తనుగని
సతి సిబ్బితి తొలగ మెలగుసరణికి నగుచున్ 131

అర్థాలు : సరణి= వైఖరి, విధము

భావము : రాజు, నిద్రలేచి, నిత్యకృత్యములు తీర్చుకొని, సింగారించుకొని వచ్చుచు చంద్రరేఖ సిగ్గును వదలి తిరుగుచుండుటను చూచి నవ్వెను (సంతోషించెను).

వ॥ **ఇవ్విధంబున దినదినప్రవర్ధమానంబులైన మోహాతిశయంబుల నహంబులు**
బహువిలంబంబులై దుర్వహంబులుగా నిశలు నిమేష ప్రమాణంబు లుగా
జరుగుచు మమతలం బ్రవర్తిల్లుచున్న సమయంబున 132

అర్థాలు : అహములువ పగటివేళలు, విలంబంబులువ పొడవైనవి, నిశలువ రాత్రులు

భావము : ఇట్లు రోజురోజుకు ఆ దంపతుల శృంగారవిలాస మతిశయింపగా పగటివేళలు పొడవై, రాత్రివేళలు పొట్టివై వాని ప్రేమ వృద్ధియగు చుండగా

ఆ॥ **నిశలు కొద్దులయ్యె నిడుదలయ్యె పగళ్లు**
ఖరకరుండు వేయి కరములందు
జగతి నీరు గ్రోలె సంతసించెను జీవ
వితతి తొలుత గ్రీష్మ ఋతువుగాగ 133

అర్థాలు : ఖరకరుండు= సూర్యుడు

భావము : అంతలో గ్రీష్మర్తువు వచ్చినది. ప్రకృతిలోని రాత్రుల సమయము తగ్గినది. పగటివేళలు సూర్యుడు తన వేడి కిరణములతో భూమీమ్మద నున్న నీటిని త్రాగనారంభించెను. ఎండకాలము మొదలగుటచే ప్రాణులు సంతసించినవి.

క॥ **నీరము నీరముగోరగ**
నారయగా నీడనీడనరయుచునుండన్
మారుతము మారుతంబును
జేరన్ వేసంగి వెట్ట చెప్పం దరమే 134

అర్థాలు : వెట్ట= వేడిమి,తాపము, వేసవి= ఎండకాలము

భావము : వేసవి వేడిమికి నీరు ఆవిరికాగా, వానలెప్పుడు నీటిని ఇచ్చునా అని సరస్సులు తపించినవి. నీడలేక ఎండలు మండింపగా, తామే నీడలను పొంద తలచెను. అందఱును నీడకై తపించిరి. వాయువు చల్లదనముకై తానును తపించెను. ఎండాకాలము వేడిమిని వర్ణింప సాధ్యమా?

వ॥ **అమ్మహనీయనిదాఘసమయంబున నవ్వధూవరులు** 135

భావము : అట్టి తీవ్రమైన వేడిమి గల గ్రీష్మఋతుకాలమందు ఆ క్రొత్త దంపతులు.

సీ॥ **యంత్రనిర్మితతుషారావృతమగుపూల**
చప్పరంబుల పూలశయ్యలందు
పన్నీటికొలకులపజ్జ గొజ్జగినీటి
కాల్వల చందనాగములయందు
పూదేనెసోనల పొదికట్టు నడుచక్కి
చంద్రకాంతోపలస్థలములందు
మలయమారుతములలముకొంచనలరెడి
కేళికామందిర డోలికలను

తే॥ మఱియు నిరుపమకృత్రిమదరులగిరుల
కలితహిమజలవిలసితకమలభవన
ములను వివిధోపచారసంకలితు లగుచు
గడిపి రొకరీతి వేసవి కడుభరమున 136

అర్థాలు : యంత్రనిర్మితతుషారఅమృతము= యంత్రములు చిమ్మిన తుంపరులు చుట్టుగల, చప్పరంబుల= పందిళ్లలో, కొలకుల= సరస్సుల, సజ్జ= దగ్గఱ, గొజ్జగి= చేమంతి, పచ్చమొగిలి, పొదికట్టు= ఇంటి ముందఱి పంచపాక, నడుచక్కి= మధ్యప్రదేశము, చందనాగములు= గంధపు చెట్ల గుంపులు, చంద్రకాంతోపలస్థలము= చంద్రకాంత శిలావేదిక

భావము : యంత్రాలు చిమ్ము నీటి తుంపరలు చుట్టును పడునట్లు చేసిన పూల పందిళ్లలో గల పూల పాన్పులలోను పన్నీరు చల్లిన సరస్సుల చెంత చేమంతి రేకలు, మొగలి వాసనలు నీటికాల్వలు ఉండు గంధపు చెట్ల తోపులలోను పూవు తేనెల జల్లు నిండిన పంచపాక లందు అమర్చిన చంద్రకాంత శిలల వేదికలమీదను, మలయ పర్వతమునుండి వెల్వడు చల్లని వాయువును పొంది, వికసించు క్రీడా మందిరముల ఊయెలలోను మఱియు సాటిలేని గుహలు, కొండలు గల చల్లని నీటిచే ప్రకాశించు ఇండ్లయందును అన్ని సేవలను పొందుచున్నవారై శ్రమతో వేసవిని గడిపిరి.

వ॥ అట్టి వేసవి కడచఁను సమయంబున 137

భావము : ఆ విధమైన ఎండకాలము ముగియు కాలమందు,

ఉ॥ అప్పులు బుచ్చు కొన్న సరసాగ్రణి నీకనుసన్న మళ్లని
మ్మొప్పదె మిన్నుముట్టిన మహోన్నతి దా బగలెంత చేసినా
తప్పునె యంచు నవ్వరుణదైవము వేసినపాశమో యనన్
విప్పుగ జుట్టె సూర్యపరివేషము చూపఱు సంతసింపగన్ 138

అర్థాలు : సూర్యపరివేషము= సూర్యుని చుట్టు గుండ్రని ఆకారము

భావము : “ఓ నీటిని పుచ్చుకొన్న శ్రేష్ఠుడా! నీకంటి చూపును ఇట్లు మరల్పుము (తిప్పి చూపుము). ఆకాశము నీ తాకిడికి (ఎక్కువైన) నీ గొప్పతనమునకు తగదు. నీవెంత చేసినను, నీవు గ్రహించినది తప్పక తీర్చవలసినదే. అనుచు వరుణదేవుడు (వర్షదేవత), ఆతని మెడచుట్టు తన తాటిచే బంధించినట్లు వెడల్పుగా సూర్యుని చుట్టును గుండ్రని ఆకారము కలిగి చూపఱులకు సంతసమిచ్చినది.

ఉ॥ దోసమనాక పాంథులకు ద్రోహముసేయుచు సర్వజీవసం
త్రాసకఠోరభావుడగు దారుణ కర్మ నిరంతరుండునౌ
వేసవిమీద దాడి దగ వెళ్లెడు వేళను మ్రోయునట్టి న
వ్వాసవభేరికానినదవైఖరి గర్జిలచొచ్చె మేఘముల్ 139

అర్థాలు : దోసమనాక= పాపము తలచకుండ, పాంథులకు= బాటసారులకు, సర్వజీవసంత్రాసకఠోరభావుడగు= ప్రాణులు అన్నిటికిని గొప్ప భయము కలిగించు కఠినమైన స్వభావముగలవాడవు, వాసవభేరికావైఖరి= ఇంద్రుని యుద్ధభేరివలె.

భావము : ఈ వేసవి అనేవాడు పాప చింతన లేకుండా బాటసారులకు కీడు చేయుచు, అన్ని ప్రాణులకు ఎడతెగక క్రూరమైన బాధలు కల్పించుచున్నాడు, వానిని శిక్షించుటకు దాడి వెడలు వేళ ఇంద్రుని భేరులు మ్రోగినట్లుగా మబ్బులు ఉఱిమినవి (సింహము వలె గర్జించినవి).

చ॥ పరుషనిదాఘసంహరణభారధురంధరఘోరమూర్తియై
సురపతి దాడివచ్చు నని సూచకముల్ దెలుపంగ వేడ్కతో
డ రయమునన్ మునున్ వెలిగుడారములెత్తి రనంగ దూర్పునన్
గురుతరమై చిగుర్మొగులు గుంభితలీల లనంగ నయ్యెడన్ 140

అర్థాలు : పరుషనిదాఘసంహరణభారధురంధరఘోరమూర్తియై= కఠినమైన వేసవిని సంహరించు కార్యభారమును వహించు రుద్రమూర్తియై, సురపతి=

ఇంద్రుడు గురుతరమై= పెద్దవైన, చిగుర్మొగులు= ఎఱ్ఱమబ్బులు, గుంఫితలీల= కూర్చినట్లు.

భావము : కఠినుడైన వేసవిని సంహరించు కార్యభారమును వహించి ఇంద్రుడు దాడి వెడలి వచ్చు సూచనగా వేగముగ ముందుగా బైట గుడారము వేసిరన్నట్లు తూర్పున ఎఱ్ఱని మబ్బులు కూర్చినట్లు గుమిగూడి కనబడినవి.

విశేషము : ఇంద్రుడు తూర్పు దిక్పాలకుడు. కనుక తూర్పున ఎఱ్ఱమబ్బులు సైనికుల గుడారాలవలె కన్పట్టినవని భావము

క॥ **తొలుకరులు గురియ జొచ్చెను**
మొలకలు దగమొదవె కృష్ణ మోహనకాంతిన్
గలమేఘములను గన్నను
పులకలు భూకాంతుమేన బొడమె ననంగన్ 141

భావము : తొలకరి వానలు కురియ నారంభించినవి. మొలకలు మొలిచినవి. నల్లని కాంతితో నున్న మబ్బులను చూచిన రాజునకు శరీరమందు పులకలు కలిగెనేమో అన్నట్లు అవి ఆకాశమందు తోచెను.

క॥ **కుడుపూడ్పు పనులు కడయై**
సడలంగా జొచ్చె జనుల జఠరాగ్ని కడున్
వడిగొన తమ్ములు సడలెను
జడి విడువక కురియ జొచ్చె జాజులు పూచెన్ 142

అర్థాలు : కడయైనపరిశ్రమలన్= దూరమైన కష్టకార్యములచే, జఠరాగ్ని= కడుపులో చిచ్చు (ఆకలి), వడి= వేగమును, సడలెన్= తగ్గినది.

భావము : పనులు లేకపోవుటచే జనుల ఆకలి మందగించినది. వేగముతో వానలు కురియుటచే పద్మములు బలహీనములై సూర్యరశ్మి లేకపోవుటచే పూయలేదు. జడివాన విరామములేక కురియుచుండెను. జాజులు పూచినవి.

క॥ **ధరసస్యవృద్ధి నొందెను**
చెఱువులు పరిపూర్ణమయ్యె సింధుజలంబుల్
సరవి నల స్వాతికొంగలు
బరగెన్ ధవళాంబరములు బఱచిన రీతిన్ 143

అర్థాలు : సస్యవృద్ధి= గడ్డి, ధాన్యముపండుట, సరవిన్= క్రమముగా, ధవళాంబరములు= తెల్లని గుడ్డలు

భావము : భూమి మీద పంటలు బాగుగా పండినవి. చెఱువులలో, నదులలో నీళ్లు నిండినవి. క్రమముగా స్వాతి కార్తెలో కన్పట్టు కొంగలు(ఆకాశమందు) తెల్లని గుడ్డలు పఱచినట్లు సమూహములై కన్పించినవి.

వ॥ **అట్టి వర్షాగమసమయంబున** 144

భావము : ఆవిధమైన వాన కురియు కాలమందు.

సీ॥ **మాణిక్యదీపికామయఘనసాంద్రాణి**
దారుసంఘటిత చిత్రప్రయుక్త
తాళపత్రాచ్ఛాదిత నివాత కేళికా
భవననిర్మిత సూత్రభర్మపుత్రి
కల యుపచారసంగతులకు నలరుచు
జాజిలవంగప్రసక్తమహిత
తాంబూలచర్వణోత్కటముఖపరిమళ
వర్ధిత వ్యసన ప్రవర్తు లగుచు

తే॥ **సొరిది తాడనపీడనచుంబకాది**
చైవులను బంధనైపుణి సంగతులను
నోలలాడుచు సతిపతు లురుతరంపు
జల్లు గడిచిరి బహువిధచర్య లలర 145

అర్థాలు : దారు= సాంబ్రాణి, చిత్ర= విగ్రహము, తాళపత్రము= తాటి ఆకు, సూత్రము= దారము, భర్మపుత్రి= బంగారుబొమ్మ, వ్యసనము= ఆసక్తి, చైవులు= చేష్టలు, పనులు.

భావము : పద్మరాగ మణులు వెలుగులు చిఱు దీపములవలె వెదజల్లుచున్నవి. పెద్దవైన సాంబ్రాణి దేవదారు కొయ్యలచే తయారైన చిత్తరువులను, తాటి ఆకులచే కప్పబడిన గాలి చొచ్చుటకు వీలులేని క్రీడా భవనములందు దారములందు కూర్చబడి కన్పట్టు బంగారు బొమ్మల్ప చక్కని కదలికలను చూచి సంతోషించుచు, జాజి, లవంగము కలిసిన మేలైన తాంబూలము సేవించుటచే ముఖమందు వెల్వడు సువాసనలచే అతిశయించు ఆసక్తి కలవారై మెలగుచు, వరుసగా పతి పాలిండ్లను మృదువుగా కొట్టుచు పిసుకుచు ముద్దాడుచు, నోటితో పీల్చుచు మొదలైన వివిధ రతిభంగిమల కామ క్రియల కావించుచుండ, ఆదంపతులు జడివానల సమయమును పెక్కువిధములుగా కడపిరి.

సీ॥ పద్మ తా తనయింటి పగమానసైతోడు
జేరినక్రియ శశి సిరి వహించె
సిరిరాక కలరిన చెలువమో యన చంద్ర
కిరణజాలంబు విస్ఫురణ దనరె
చంద్రకరస్ఫూర్తి సంతతులన భూమి
తఱచుగా శరపుష్పతతి దనర్చె
శరసుమప్రతిబింబసంభృతి నయ్యె నా
ననునట్లు నిర్మలం బయ్యె వారి

తే॥ వారిపూర్ణత సడలెను వాహినులను
వాహినుల వెడలిరి నృపుల్ వైరియాత్ర
యాత్రలకు బోవ నతిరమ్యమగుచు దనరె
తనకు శరదాగమంబున ధరణియందు 146

అర్థాలు : పద్మ= లక్ష్మి, సైదోడు= తోబుట్టువు, విస్ఫురణ= విశేష కాంతితో, చంద్రకరస్ఫూర్తిసంతతులు+అన= వెన్నెల సంతానములనగా, శరపుష్పవతి= రెల్లుపూలను, శరసుమప్రతిబింబసంభృతి= రెల్లుపూల ప్రతిబింబములు దట్టముకాగా, వాహినులను= నదులలో, వాహినుల= సైన్యముతో, వైరియాత్ర= దండ్రయాత్ర.

భావము : లక్ష్మి చంద్రుని చేరుటచే చంద్రుడు సంపన్నుడైన్నాడు. లక్ష్మిరాకకు మురిసిన వెలుగువలె వెన్నెల అతిశయించినది. రెల్లుపూల ప్రతిబింబమువలె నీరు నిర్మలమైనది. నీరు నిండి నదులు ప్రవహించినవి. రాజులు సైన్యముతో యుద్ధానికి బయలుదేరినారు. విహారయాత్రలకు మంచి సమయమై శరత్కాలము వచ్చినది.

విశేషము : భావ నిర్మాణము భవన నిర్మాణమువలె ఒకదానికొకటి అనుసరించుచు సమకూరినది. క్రమాలంకారము, శబ్దాలంకారము పుష్కలము.

ఉ॥ ఆగత చంద్రికాసమయ మంత పురోపవనాంతరాళపు
న్నాగకుజాళినీడలను నవ్యసుమాంచితశయ్యలన్ గుఱిన్
రాగములుం జిగుర్పగ నిరంతరమోహవివర్ధమానసం
యోగములన్ క్షణంబులుగ నొంది దినంబు లతిక్రమింపగన్ 147

అర్థాలు : ఆగత= వచ్చిన, చంద్రికాసమయ= వెన్నెల కాలపు, యాత్ర= కదలిక, పురోపవనాంతరాళ= పురము యొక్క ఉపవనములోపల, కుజాళి= చెట్ల గుంపుల, పున్నాగ= సురపొన్న

భావము : శరత్కాలమందు వెన్నెల సమయమంతయు పురమందు గల తోటలందు సురపొన్నల చెట్ల నీడలందు క్రొత్త పూలు చల్లిన పడకలపై కామకేళికై కోరిక ఉప్పొంగ, పరస్పరము ప్రేమ మొలకెత్తుచుండ, ఎడతెగక కామోద్రేకము అతిశయము ఎక్కువగుచుండ, కలయికలలో (సంభోగక్రీడలలో) ప్రతిదినము క్షణముగ కడపిరి.

మ॥ మొనసెన్ పెక్కువ సస్యమందు జనసమ్మోహంబు లయ్యగ్ని యం
దును మంచుం ధరయందు నా విజలమందున్ దీపనంబున్ మహీ
జనమందున్ గడు శీతమున్ సకలవిశ్వంబందు సంపూర్ణతన్
మనిపెన్ దా నరుదెంచి లోకమున హేమంతంబు నత్యంతమున్ 148

అర్థాలు : పెక్కువ= వృద్ధి, సస్య= పంటఫలము, సమ్మోహము= కోరిక, విజలము= నీరులేకపోవుట

భావము : ఆ సమయమందు పంటఫలములు వృద్ధిపొందెను. జలము లేని చోటులలో చలి నుండి రక్షణకై జనులు అగ్నిని కోరిరి. అప్పుడు భూమిపై మంచు, నీళ్ళులేని చోట్లు ఏర్పడినవి. భూమిపై గల జనులందు ఆకలి అధికమైనది. సకల ప్రపంచమందు చల్లదనము పూర్తిగా వ్యాపించెను. హేమంత ఋతువు వచ్చుటచే లోకమందు, ప్రకృతి యిట్లు స్పందించెను.

క॥ అనుపమమగునా శీతం
బినవహ్నులతీక్ష్ణమణచి యేపున జగముల్
తనమయముగ జృంభించెను
మనుజావలివంచుటెంత మాత్రముతలపన్ 149

అర్థాలు : ఇనవహ్నులు= సూర్యుడు, అగ్ని, వంచుట= లోబఱచుకొనుట, విజృంభించెను= చెలరేగెను.

భావము : ఆ శీతకాలమందు సూర్యుడు, అగ్ని చల్లబడినారు. ప్రపంచమంతయు తానే అయి చల్లదనము ఆక్రమించినది. ఇక మనుష్యులను వంచుట దాని కెంతపని?

విశేషము : వంచుట అను శబ్దప్రయోగము ఇచ్చట వశపఱచికొను అను అర్థముతో బాటు శారీరకముగ ముడుగుకొనుట యను అర్థము సమయోచితముగనున్నది

చ॥ అతులిత శీతమున్ ఘనగృహాంతరనిర్మితవజ్రమందిర
స్థితనవచంపకప్రసవ దివ్యశయానములన్ మృగీమదా
న్వితతనులేపనంబులు నవీనలవంగసుజాజిమిశ్రితాం
చితమగువీడియంబులును చిక్కెను గోర్పడ కంబళంబులన్ 150

అర్థాలు : అతులిత= సాటిలేని, నవచంపకప్రసవ= క్రొత్తసంపగిపూవుల, మృగీమదాన్విత= కస్తూరితో కూడిన, తనులేపనంబుల= మైపూతలతో, నవీనలవంగసుజాజిమిశ్రితఅంచితమగు వీడియంబులును= క్రొత్తగా (అప్పుడే) చేసిన లవంగము చక్కని జాజిపత్రి కలిసిన, విశిష్టమగు తాంబూలములను, గోర్పడకంబళంబులున్= కంబళ్ళు అంగ వస్త్రములు (పైపంచ), చిక్కెను= లభించినవి

భావము : చలికాలము, ఇండ్లలోని పూలపాన్పులు, కస్తూరి మేళవించిన మైపూతలు, లవంగాలు, జాజికాయ జాపత్రి మొ॥ కలిసిన ప్రత్యేక తాంబూలములను, కంబళ్లను, చక్కని ఉత్తరీయములను పొందిరి.

మ॥ ధర నీరీతిని మిక్కిలిన్ మెఱయు శీతంబున్ గడుం దంపతుల్
సరిరాగప్రతిబద్ధచిత్తయుగళీసంఘట్టనాచారుమో
హరసానందితమై తనర్చు ఘనగాఢాలింగనన్ కంచుకా
వరణోత్కర్షను మాన్చిరింతె మఱిపోవన్నేర్చునే యన్నిటన్ 151

అర్థాలు : సచిరాగప్రతిబద్ధ= సమాన అనురాగముచే కట్టబడిన, చిత్తయుగళ= రెండు మనస్సులతో, సంఘటనాచారుమోహ= సంభోగములందు ప్రీతినిచ్చు కామోద్రేకముచే

భావము : భూమి మీద ఈ విధములుగా ఎక్కువగా కలిగిన చల్లదనమును, మిక్కిలి సమానములైన ప్రేమనిండిన రెండు మనసులు, సంభోగములందు, ప్రీతినిచ్చు కామోద్రేక భావము వలన కలిగిన ఆనందముతో, బిగికౌగిళ్లచేతను, కప్పుకొన్న వస్త్రముల చిక్కదనము చేతను తొలగించుకొనిరి. చల్లదనము అన్ని చేసినను సులభముగా తగ్గునా?

మ॥ తలవంచెన్ కమలంబులున్ జలములున్ దగ్గెన్ తటాకంబులన్
చలి యొక్కించుక మోము ద్రిప్పె జలధుల్ సద్ఘోషలం బొంగె న
త్తొలిపైరుల్ మఱినూళ్లునుం కలుపులున్ దోరంబుగా బండె కే
వలకాంక్షన్ శిశిరాగమంబు దినముల్ వర్తించి రాదంపతుల్ 152

అర్థాలు : ఘోషలు= కలకలారావములు, కేవలము= ఒక

భావము : శిశిర ఋతువు వచ్చుటచే కమలములు వాడిపోయినవి. సరస్సులలో నీరు తగ్గినది. చలియు తన ముఖమును త్రిప్పినది. తీవ్రత తగ్గినది. జలాశయములు పక్షులు కలకలారావములతో విలసిల్లినవి. తొలిపైరులు, నువ్వులు ఎక్కువగా పండినవి. సంభోగమందే కోరికతో దంపతులు శిశిర కాలమందు దినములను కడపిరి.

సీ॥ వెడవిల్తు జయధాటివిడిదల సవరించు
పనులతో నాకులపాటుజేసి
తలిరులడెక్కెముల్ తరువుల తుదనెత్తి
యలరుపొదలు గుడారులు ఘటించి
మావిలేగుమురులు మఱి పందిరులు దీర్చి
పూదేనెకాల్వలు బొందుపరచి
కోకిలధ్వనికంచుగొమ్ములు సవరించి
సారంగగాణిక్యసమితినుంచి

తే॥ చిగురులును తూళ్లమధువులు తగుఫలములు
మీఱుకలకంఠహంసాళికీరముఖర
బలమునకు జాలదవనసంపత్తివెలయ
సంభ్రమంబున గావించె చైత్రుడనగ
నపుడు గనుపట్టె నా వసంతాగమంబు 153

అర్థాలు : వెడవిల్తు= మన్మథునియొక్క, విడిదల= విడిసిన చోటును, విజయధాటికి= దండయాత్ర విజయమునకై, సవరించు= చక్కబెట్టు,

ఆకులపాటు= కలత, తలిరులటెక్కెముల్= పూవులజెండాలు, సారంగగాణిక్యసమితిన్= తుమ్మెదలను వెలయాండ్ర సమూహములను, దవనము= నూలిపోగువలె సన్నని వాసన గల పూవులు (దీనికి జతగా మరువము సన్నని పత్రములు కలిగియుండును), చైత్రుడు= వసంతుడు.

భావము : (మదనుని విడిదికై వసంతుడు చైత్ర మాసమందు చేసిన ఏర్పాట్లు) మదనుని దండయాత్ర కొఱకు విడిదికై ఏర్పాటు చేయు సమయమందు తత్తరపాటుతో (కలతతో) చెట్ల పైభాగములందు చిగుళ్లనెడి పతాకములందు అమర్చిన పొదలనెడి గుడారములను కూర్చి నిర్మించి లేతమావి చిగుళ్ల, గుత్తులతో పందిళ్లు, పూవుల నుండి స్రవించు తేనెకై కాలువలను సిద్ధము చేసి, కోకిలరవములనెడి కంచు బూరలు, తుమ్మెదలనెడి గణికలను (నర్తకీమణులను చేర్చి) అందమైన వేర్వేఱు చెట్ల చిగుళ్లను తామరతూళ్లను తేనెను(మద్యము), చక్కని పండ్లను, అతిశయించు కోకిలలు, హంసలు, గండుతుమ్మెదలు, చిలుకలు మొదలగువాని, చక్కని కూతలు కూయు సైన్యమును, మిక్కిలి దవనములనెడి వైభవము (సౌభాగ్యము) ప్రకటమగుచుండగా వసంతుడు స్వాగతములకై చేసినట్లు వసంత ఋతువు యొక్క ప్రారంభము కన్పట్టెను.

ఉ॥ అట్టి విచిత్రచైత్రసమయంబుల గేలివనాంతరంబులన్
నెట్టుక పుష్పవాటికల నిర్మితపర్వతకందరంబులన్
తొట్టిన నీటిచెంగలువ తోయరుహాకరకేళిలోలతన్
పట్టగు కేళికా భవన పంక్తుల డోలల గ్రీడ సల్పుచున్ 154

అర్థాలు : తొట్టిన= నిండిన, తోయరుహ+ఆకరకేళిలోలతన్= పద్మములున్న సరస్సులలో జలక్రీడలలో మైమఱచి, డోలల= ఊయెలలో

భావము : అట్టి చైత్రమాసమున ఆ దంపతులు కేళివనాలలోను, పుష్పవాటికలలోను, కల్పితములయిన క్రీడాపర్వతముల గుహలలోను, ఎఱ్ఱ

కలువలుగల సరస్సుల నీటిలో ఆడుచు ఆసక్తితోను, మఱియు, వేర్వేఱు క్రీడలలో మెలగిరి. ఆటల స్థానములందు, వినోదకేళికై యున్న ఊయలలో ఊగిరి.

క॥ దినమొకనిమిషోపమమై
కని కనివత్సరము నొక్కగడియై చనగా
చనిచని మమతల మెలగిరి
మునివనితయు రాజు వర్షములు నూరెలమిన్ 155

అర్థాలు : నిముష+ఉపమమై= నిమిషముతో సమానమై

భావము : ఈ రీతి దినము ఒక నిమిషముగ, సంవత్సరము ఒక గడియగా తోచినది. ఇట్లు నూరు సంవత్సరములు చంద్రరేఖయు చంద్రకేతుడును ప్రేమతో కాలగమనము తెలియక కడపిరి.

వ॥ ఇట్లు శతసంవత్సరంబులు తనియని సురతసామ్రాజ్యసౌఖ్యంబునం బొందుచున్న సమయంబున పూర్వశాపనిమిత్తంబుల నరువదిసంవత్సరంబులు క్రమంబున నరువదితనూభవులై యాదంపతు లకు నుదయించి దినదినప్రవర్ధమానులై పరిపూర్ణయౌవనంబుల తేజరిల్లుచున్న కుమారుల నతిసుకుమారులం గని యత్యంత సంతోషభరితాంతరంగయగుచు నాచంద్రరేఖ పతి మనోహరాకృతికి తన్మన్ననలకు నలరుచున్న చంద్రకేతుండును తనప్రాణవల్లభి నెడబాయం జాలని మోహంబున సర్వంబును మఱచి మత్తుండైయున్న సమయంబున్ 156

అర్థాలు : తనియని= తృప్తిపడని, తనూభవులై= బిడ్డలై,

భావము : ఇట్లు తృప్తి చెందక నూరు సంవత్సరములు శృంగార జీవితము సాగించగా, ఆ దంపతులకు పూర్వశాపము వలన, అరువది మంది కుమారులు కలిగిరి. వీరు సంవత్సరమున కొకరుగ జన్మించుట వలన వీరే ప్రభవాది యరువది సంత్సరములైరి. పెరుగుచున్న కుమారులను చూచి

సంతోషించుచు పతి సుందర రూపము, ఆతని ఆదరమునకు ఉల్లాసమును పొందుచుండ, ఆమెను రాజు వదలిపెట్టలేక సర్వమును మఱచి మత్తుడైయుండెను.

క॥ వెనకటిపగ పృథుబాహుం
డను భూపతి సమయమరసి యత్యంతాప్తుల్
జనపతులగూర్చుకొని తన
యనుజులు నరువదియుతోన నరు దేరంగన్ 157

భావము : పాత శత్రుత్వముతో పృథుబాహుడను రాజు తనకు చాలా ఆప్తులైన రాజులను, తన అరువది మంది తమ్ములను కూడుకొని, చంద్రకేతుని పై యుద్ధమునకు రాగా

మ॥ పరమోత్సాహముతోన సర్వబలసంపత్తిన్ వడిన్ రాగ వి
స్ఫురశౌర్యంబున జంద్రకేతు డలుకం బూర్ణాహుతింగొన్న భీ
కరవహ్నిన్నిరసించు కోపమున వీకన్ సర్వసన్నాహసం
భరితుండై రథదంతివాజిభటశుంభత్సేనతో ధీరుడై 158

భావము : మిక్కిలి ఉత్సాహముతో అధిక సైన్యముతో వేగముగా యుద్ధమునకు రాగా, చంద్రకేతుడు తీవ్రరోషముతో వింతగా హవ్యద్రవ్యములను పొందిన అగ్నివలె చెలరేగి కోపముతో, పట్టుదలతో అన్ని ప్రయత్నములను కావించి, చతురంగ బలముతో ధైర్యముతో శత్రువుల బలమును ఎదుర్కొనెను.

చ॥ వెడలగ బుత్రులందరును వ్రేల్మిడి నన్నిరథంబు లెక్కి తో
నడువగ భేరికాపటహనాదములుం జెలగంగ మిక్కిలిన్
సిడములు మింట దేజరిల సింహనినాదము లుల్లసిల్లగా
కడలియుబోలె వాహిను లకంపిత వృత్తిని విక్రమింపగన్ 159

అర్థాలు : వ్రేల్మిడి= చిటికెలో, సిడములు= జెండాలు

భావము : చంద్రకేతుడు పుత్రులరువది మందియును రాగా చిటికెలో రథము లెక్కి వెంట నడువగా యుద్ధభేరుల నినాదములు మ్రోగుచుండగా, రథముల టెక్కెములు మింట రెపరెపలాడగా, సముద్రము పొంగినట్లు సేనలు భయము లేనివారై విక్రమము చూపిరి.

చ॥ కదలి మహోగ్రమై యెదురుగా నొకయోజనయుగ్మ మేగి యా
హ్రదముసమీపభూమిని రయంబున వైరినృపాలసేనలన్
గదిసిన వారు వీరు సరిగా చనె సందడికయ్య మయ్యెడన్
గొదగొని భీషణంబుగను కొంతవడిం గలహించి యంతటన్ 160

అర్థాలు : యోజనయుగ్మము= రెండు యోజనములు, హ్రదము= సరస్సు, సందడికయ్యము= సంకుల సమరము

భావము : అట్లు కదలిన సేన, శత్రుసేనతో సరోవర సమీపమందు ఎదుర్కొని కొంతసేపు సంకుల సమరము కావించిరి. తర్వాత కొంతసేపు ప్రయత్నించి భయంకరముగా, తీవ్రముగా యుద్ధము చేసిరి.

ఉ॥ బారులు మొగ్గరంబులుగ బంటును బంటును రౌతురౌతునుం
తేరును తే రిభంభమ్ములును ఢీకొని కుంతకరాసికార్ముకో
దారగదావిజృంభణల దారుణలీల రణంబు సేయుచో
పోరు మహోగ్రమయ్యె సురపుంగవులున్ వెఱగంది చూడగన్ 161

అర్థాలు : మొగ్గరంబులుగ= వ్యూహములుగ, రౌతు= గుఱ్ఱమునెక్కి యుద్ధము చేయువాడు, ఇభము= ఏనుగు, కుంతకరాసికార్ముక+ఉదారగదా= ఈటె, చేతి కత్తి, విల్లు, గొప్పగద, వెఱగంది= భయపడి, ఢీకొని= ఢీకొని (ఎదుర్కొని)

భావము : వ్యూహములు పన్నియును, ముఖాముఖిగను, అనేకాయుధములను ఉపయోగించి దేవతలు భయపడునట్లు ఉగ్రమైన గొప్ప యుద్ధము చేసిరి.

ఉ॥ రాజును రాజునున్ మఱియు రాజసహోదరరాజసూనుల
ట్లాజి గణంగి యొక్కటబరాక్రమవిక్రమలీల తేరుతే
రోజ గదించి సారథుల నొయ్యన నయ్యెడ నెచ్చరింపుచున్
నైజము లుగ్గడింపుచు ఘనంబుగ బోరిరి పౌరుషంబులన్ 162

అర్థాలు : ఆజి= యుద్ధము, ఓజ= ఉత్సాహముతో, కదించి= సమీపించి

భావము : రాజును రాజు, రాజు తమ్ములను రాకుమారులు, రథమును రథము, నిలువరించుచు, సారథులను హెచ్చరించుచు, వారి వారి స్వభావములు బైటపడునట్లు తెగించి యుద్ధము చేసిరి.

చ॥ ధనువులు దుంచ నొండు వడి దాల్చుచుశాతశిలీముఖంబులన్
తనువులు నాటినన్ దెరలి తార్కొని మర్మము లంట నేయుచున్
మొనయుచు సారథుల్ బడ సముద్ధతి సారథియోధరీతులన్
దనరుచు యుద్ధరంగమున దారుణలీలను గేలి సల్పగన్ 163

అర్థాలు : త్రుంచ= విఱిచివేయగా, తెరలి= తప్పించుకొని, తార్కొని= పైనపడి

భావము : శత్రువులు విండ్లు త్రుంచగా వేగముగా మఱియొక బాణముతో ఆయువు పట్లను చూచి కొట్టుచు, కలయచూచుచు, సారథులు మరణించగా, తామే రథికులు సారథులునై, ఇట్లు దారుణముగా యుద్ధము చేసిరి.

మ॥ పృథు బాహుండును చంద్రకేతునృపుడున్ భీమాట్టహాసంబులన్
ప్రథనోర్విన్ శరచాప కౌశలములన్ బాహాబలోద్దాములై
రథ సూతాశ్వరథాంగకేతనవిదారప్రౌఢిమం బేర్చి వీ
రధురీణత్వముమీఱ నిద్ద ఱసిచర్మంబుల్ వడిఁ దాల్చుచోన్ 164

అర్థాలు : ప్రథన+ఉర్విన్= యుద్ధరంగమందు, విదారప్రౌఢి= చీల్చునేర్పు, సూత= సారథి, చర్మము= కవచము, తాల్చుచున్= ధరించుచు.

భావము : పృథుబాహుడు, చంద్రకేతుడును భయంకరముగ, బిగ్గఱగా నవ్వుచు, బాహుబలమును, ధనుర్విద్యాకౌశలము చూపుచు రథమును,

సారథిని, గుఱ్ఱములను, పడగొట్టుటలో నేర్పును చూపుచు ఇద్దరు ఖడ్గధారులై కవచములు ధరించుచు,

చ॥ ధరణికి గుప్పునం దుమికి దార్కొని వీరవిహారధుర్యులై
నఱుకుచు దప్పు చుప్పరమునం దెగ నేయుచు కుంగుచున్ వడిన్
దిరుగుచు దాటుచున్ కెళవు దీర్చుచు నార్చుచు చౌకళింపుచున్
నెరకలు గాడ జిమ్ముచును నిష్ఠురలీలనదల్చి రొప్పుచున్ 165

అర్థాలు : ఉప్పరమునన్= పైభాగమున, కెళవు= దూరము, చౌకళింపుచున్= గుఱ్ఱము వలె ఎగురు, దుముకు, నెఱకలు= వెంట్రుకలు, కాడన్= నష్టమగునట్లు, చిమ్ముచున్= ఎగకొట్టుచు, అదల్చుచు= బెదిరించుచు, రొప్పుచున్= అఱచుచు

భావము : భూమి మీదకు దుమికి దాడిచేసి నఱకుచు, తప్పుకొనుచు, ఎగిరి తెగవేయుచు, వంగుచు, వేగముగ తిరుగుచు దాటిపోవుచు, దూరమునకు పోవుచు, ఆయాసపడుచు, గుఱ్ఱమువలె ఎగురుచు, వెంట్రుకలు నష్టమగునట్లు ఎగకొట్టుచు, క్రూర విలాసాలతో అఱచుచు

క॥ తలపడనా పృథుబాహుడు
మెళుకువ పైవేసి యార్చి మెడ దెగవ్రేయం
తలమింటి కెగసి మకుటో
జ్జ్వలితంబై భూమిబడియె శత్రులు పొంగన్ 166

అర్థాలు : తలపడన్= యుద్ధము చేయగా, మెలకువ= జాగ్రతతో

భావము : అట్లు యుద్ధము చేయగా పృథుబాహుడు జాగరూకత గలిగి దెబ్బపై దెబ్బ వేసి, హుంకరించి చంద్రకేతుని తల తెగ వేయగా, ఆ తల పైన కిరీటమున నుండు మణులు వెలుగులు చిమ్ముచు, నేలపై పడెను. శత్రుబలములు సంతోషించిరి.

చ॥ జనకునిపాటు చూచి దశషట్కకుమారులు కోపఘూర్ణులై
కినిసి విరోధిసోదరుల గీటణగింతు మటంచు నుద్ధతిన్
మొనసిన నందఱందఱిని మోహనదివ్యశరాళి గూల్చినన్
తనువుల బాసి స్వర్గమును దార్కొని రొక్క ముహూర్త మాత్రలోన్ 167

అర్థాలు : గీటు= గర్వము, స్వర్గము= దేవలోకము

భావము : తండ్రి మరణమును చూచి, చంద్రకేతుని అరువది మంది కుమారులును కోపమున పృథుబాహుని అరువది మంది తమ్ములను ఎదుర్కొనగా, వారు సమ్మోహనాస్త్ర ప్రయోగముచే వారి నందఱిని చంపిరి. వారు దేవలోకమును చేరిరి. ఇదంతయు రెప్పపాటు కాలంలో జరిగిపోయెను.

వ॥ ఇట్లు చంద్రకేతుండు సపుత్రకుండైన రణోర్వింబడిన హతశేషులైన బలంబులు పారినపు డా హర్తుండు జయభేరి మ్రోయించి రణంబు చాలించి సత్యకపురంబాక్రమించి చంద్రరేఖ మొదలైన యంతః పురకాంతలపురంబు వెలువడ నెడలించిన 168

అర్థాలు : పారిన= పారిపోయిన, హర్తుడు= చంపినవాడు, శత్రువు, ఎడలించిన= వెళ్లగొట్టగా

వచనము : అట్లు చంద్రకేతుడు పుత్రులు రణరంగమందు మరణింపగా, బ్రతికిన సైన్యములు పారిపోగా, వారిని చంపిన పృథుబాహుడు, జయసూచకముగా భేరిని మ్రోగించి, యుద్ధమును మానుకొని సత్యపురమును ఆక్రమించుకొని చంద్రరేఖతో కూడా అంతఃపుర స్త్రీలను వెడలగొట్టగా

ఆ॥ చంద్రరేఖతోడి సకియలందఱు నపుడు
మాయమైన సుదతి మగనిజాడ
బోయి రణమునందు భూరజోవృతిబడి
యున్నమగనిమస్త ముఖిద జూచి 169

అర్థాలు : భూరజోవృతి= దుమ్ముతో చుట్టబడిన (నిండిన), మస్తము= తల

భావము : చంద్రరేఖతో వెళ్లగొట్టబడిన అంతఃపురస్త్రీలు తనకు కన్పట్టక పోవుటచే ఆమె ఒంటరిదై భర్తను వెదకుచు పోయి, పతి తలను చూచి,

ఉ॥ హా మనుజేంద్రమౌళిమణి! హా నవమన్మథ! హా మనోహరా!
హా మహనీయకీర్తిరత! హా జగదేకపరాక్రమోన్నతా!
హా మనువంశవార్ధి శశి! హా కరుణారసపూరితేక్షణా!
హామదశత్రుసంహరణ! హా రమణా నను డించిపోయితే! 170

భావము : "మహారాజుల"కు శిరోమణి!(రాజులలో శ్రేష్టుడా) క్రొత్తయైన పూవిలు కాడా! మనస్సు హరించినవాడా! గొప్ప కీర్తియందు ఆసక్తి కలవాడా! జగత్తులో గొప్ప పరాక్రమముచే అభివృద్ధి పొందినవాడా! మను వంశమనెడి సముద్రానికి చంద్రుడా! హా కరుణ రసముతో నిండిన చూపులు కలవాడా! మదించిన పగవారిని చంపువాడా! రమింప చేయువాడా! నన్ను విడిచిపోయితివే"

వ॥ అని మఱియును 171

వచనము : అని మఱియును ఏడ్చుచు

సీ॥ ప్రాణవల్లభుమీద బడి మోదుకొనుచును
పలవరింపుచు దిశల్ కలయ జూచి
పతిపూర్వచర్యలు పలుమాఱు నంకించి
యెలకోకిలధ్వని నేడ్చుకొనుచు
లేచి యారణ మెల్లజూచి పుత్రకళేబ
రంబులు గాంచి ఘోరంపుదుఃఖ
మడరి యొ క్కొక్కని యొడలు పై బడి
మోము బద్దలుగాను మోదుకొనుచు

ఆ॥ రొమ్ము గుద్దుకొనుచు రోదనధ్వని దిశల్
పిక్కటిల్ల కుతిక డొక్క చెదర
పలవరించుకొనుచు పతిచెంత జేరి యా
చంద్రరేఖ దుఃఖజలధి మునిగె 172

అర్థాలు : అంకించి= స్తుతించి

భావము : భర్త శవముపైబడి తల బాదుకొనుచు, పలవరింపుచు, భర్త చర్యలను గుర్తు చేసుకొనుచు, పొగడుచు, కోకిల కంఠముతో ఏడ్చుచు, లేచి రణరంగము నంతయు వెదకి తన బిడ్డల శవములను చూచి, వారిపై పడి ముఖము పగులునట్లు బాదుకొనుచు రొమ్ము కద్దుకొనుచు, గొంతు, డొక్క చలింపగా, తన ఏడ్పు ధ్వనిచే దిక్కులు చెదరగా వెఱ్ఱిదానివలె మాట్లాడుచు పతి దగ్గఱ కూర్చుండి దుఃఖమనెడి సముద్రములో మునిగెను.

విశేషము : 'ఎల కోకిలధ్వని నేడ్చుకొనుచు', అనుటచే ప్రబంధ నాయికల ఏడ్పును గూర్చి తెనాలి రామకృష్ణుని చమత్కృతి గుర్తుకురాక మానదు. ముక్కు తిమ్మన్న నాయిక ముద్దు ముద్దుగ నేడ్చెను. భట్టుమూర్తి నాయిక బావురుమని యేడ్చెననెను. అల్లసాని పెద్దన నాయిక అటట్లు ఏడ్చెనట. వారికంటె పూర్వము నాచన సోమన ఆడులకుముకి పిట్టలవలెను ఏడ్చిరనెను. బహుశా తరువాతి కవులు సోముని అనుసరించిరేమో!

వ॥ ఇట్లు కడలేనిదుఃఖంబున విలపించుచు ధరణింబడి పొరలుచు ధూళి ధూసరిత దేహయు తృణచ్ఛన్నధరాపరాగసంకలితదీర్ఘ కుంతలయు విచ్ఛిన్నతరాధరపల్లవయు విచ్ఛిన్నభూషణయునై మూర్ఛనొందుచు లేచుచు శోషిలుచు నిర్మనుష్యంబును పరిపూర్ణమేదో మాంసమస్తిష్కరుధిరచర్మాస్థిక కబంధ బంధురంబును భూతప్రేతపిశాచ ఢాకినీ పరివృతంబును తత్కోలాహలకల కలమహార్భటీ భీకరంబునునైన రణరంగమధ్యంబున నిర్భయాంతరంగయై క్షుధాపీడనంబున నలుదిక్కులు కలయం గనుంగొను

నప్పుడు తత్సమీపస రోవరతింత్రిణీతరువుగాంచి దానిం జేరి తత్పల్లవంబులు గోసుకతిన నిశ్చయించి పోయి వేలుడు గొమ్మకు చేయి చాచి నది కించిన్మాత్రంబు పొడవుగా నందకయున్న తపియింపుచు 173

భావము : తగ్గని దుఃఖముతో ఏడ్చుచు, నేలమీద పడి పొరలుచు దుమ్ము నిండిన శరీరము గడ్డి, దుమ్ము నిండిన పొడవైన వెంట్రుకలు తెగిన చిగుళ్ళ వంటి పెదవులు, తెగిపోయిన నగలు కలదై మూర్ఛను పొందుచు, లేచుచు, వేడిమిని పొందుచు, మనుష్యులు లేని అచ్చట శరీరములు లేని మెదడు మాంసము కల తలలు, రక్తముతో తడిసిన చర్మములు, ఎముకలు, తలలు లేని మొండెములు కలదై పిశాచములతో సందడిచేతను కేకలచేతను భయంకరమై యున్న యుద్ధభూమి నడుమ భయము లేనిదై ఆకలి బాధచే అన్ని దిక్కులను చూచుచుండగా అప్పుడు సమీపమందున్న సరోవరమందు చింతచెట్టును చూచి, దాని దగ్గఱకు వెళ్లి దాని చిగుళ్లు కోసి, ఆకలిని పొగొట్టుకొనుటకై నిశ్చయించి కొమ్మను అందుకొన యత్నింప చేతిని పైకెత్తగా, అది కొంత పొడవై దానిన అందుకొనలేక పోవుటచే, బాధపడుచు

చ॥ తనుజుకళేబరం బొకటి దా గొని వ చ్చట దించి యెక్కినన్
తనకది యందకున్న మఱి తానొకటందుకొమీద జేర్చి యె
క్కిన నది యందకున్న పరికింపుచు పుత్రశవంబులన్నియున్
మొనపిన నందకున్న పతి భూరికబంధము జేర్చి యెక్కినన్ 174

అర్థాలు : మొనసిన= పెట్టినను, భూరికబంధము= పెద్దదైన తలలేని శరీరము

భావము : తన కుమారులు శవములను ఒకదానిపైనొకటి పెట్టి ఎక్కినను, కొమ్మ అందకున్న, తన భర్త మొండెమును సైతము తెచ్చి వానిపై వేసి ఎక్కినను, (అందలేదు)

క॥ అందకయుండిన నాకట
గుందుచు తలముడువ పైటకొంగున గూర్పం

డెందమున దోచ కార్తిని
సుందరి దుఃఖింప మధునిషూదను డంతన్ 175

అర్థాలు : మధునిషూదనుడు= మధువను రక్కసుని చంపిన విష్ణువు

భావము : అప్పటికి అందకపోవుటచే బాధపడుచు, తలపైన పైటకొంగును ఆచ్ఛాదనముగా కప్పుకొనుట మఱచి, బాధచే దుఃఖింపగా అప్పుడు విష్ణువు

క॥ వేదబ్రాహ్మణరూపున
సైదలి జే రెవ్వరీవు పడతీ నీవీ
ఖేదము నొందెద వేటికి
నీ దారుణ కదనభూమి నేకతమహహా 176

అర్థాలు : పైదలి= స్త్రీని, కదనభూమి= యుద్ధము జరిగిన చోటున

భావము : వేదబ్రాహ్మణుని రూపముతో ఆమెను చేరి “ఎవరమ్మా నీవు? ఈ భయంకరమైన యుద్ధభూమిలో ఏ కారణమున దుఃఖించుచున్నావు?”

తే॥ అనిన దలయెత్తి చూచి యోయార్యవర్య!
మగడు కొడుకులు రణమున మ్రగ్గి రిదిగొ
దిక్కుదెసమాలి యొక్కతె జిక్కినేను
దాపుగానక దుఃఖించుదాన ననిన 177

భావము : అనిన తలయెత్తి చూచి, “ఆర్యా! నా మగడు కొడుకులు యుద్ధములో చచ్చినారు. నేనొక్కతెను రక్షించువారు లేక పోవుటచే దారిలేక దుఃఖించుచున్నాను” అనగా

క॥ ఐన పతిపుత్రశవములు
మానిని పోగిడుటకేమి మర్యాద నినన్
పూనినక్షుధ నాకు దినం
గా నిట్లిది యెక్కి నందు గొనను విప్రా! 178

భావము : "ఓ మానిని!" మగని, కొడుకుల శవములను పోగుపెట్టుట ఏమి మర్యాద" అనగా ఆమె "ఓ విప్రా! ఆకలి కల్గుటచే చింత చిగురు తినుటకై ఈ పోగునెక్కి కొమ్మనందుకొన తలచినాను" అని

వ॥ అనిన వారిజాక్షితో 179

భావము : దుఃఖించుచున్న ఆమెతో

క॥ తరుణీ పృథులాశుచివై
ధర నుపకృతిబరగు ధర్మతరువులనంటన్
దరమగునే యాపావన
సరసిన్ స్నానంబు సేయ సమ కూరు ననన్ 180

అర్థాలు : పృథుల+అశుచివై= అతిశయించి మలినము కలదానివై, ఉపకృతి= ఉపకారము

భావము : "చాలా శుభ్రత లేని దానివై, లోకానికి ఉపకారము చేయు ధర్మబుద్ధి గల ఈ వృక్షమునంటుట, సాధ్యమగునా? పవిత్రమైన ఈ సరస్సులో స్నానము చేసినట్లయితే శుభమగును."

ఉ॥ ఆకలికాకదుఃఖమను టాత్మను దోపక వారిజా క్షి ప
ద్మాకర మందునన్ మునిగి దా వడి లేచిన విప్రు డిట్లనెన్
కోకిలవాణి తోయముల గ్రుంకుచు నొక్కకరంబు నీరునన్
జోకక యుండనె త్తి పరిశుద్ధివి గమ్మననట్ల సేయుచున్ 181

అర్థాలు : ఆకలికాకదుఃఖము= ఆకలిమంటవలన కలిగిన తాపము, సోకక= అంటక

భావము : ఆకలి మంటలవలన తాపము అంతయు మఱచి ఓ కమలాక్షి ఆ సరస్సులో మునిగి వేగముగా పైకి లేవగా ఆ విప్రుడనెను. "కోకిల వంటి వాక్కు కలదానా! నీటిలో మునుగుచు నీ ఒక్క చేతిని నీరు అంటనీయక పైకెత్తుకొని పరిశుద్ధవు కమ్ము" ఆమె అట్లు చేయుచు

ఆ॥ మునిగి లేచు నంత వనితాకృతి దొలంగి
పూర్వదేహసహితమున దనర్చి
బయలు చూచు నంత పద్మాయతాక్షుని
తీరమందు గనియె నారదుండు 182

భావము : మునిగి లేవగా స్త్రీ రూపము తొలగి పూర్వశరీరము పొంది నారదుడు బయలును చూచుచుండగా, విష్ణువు కాన వచ్చెను.

చ॥ కనుగొని చెంతనున్న నునుకావిపటంబులు వ్యాఘ్రచర్మముం
దనరు కమండలంబు మఱిదండెయు దాళములన్ని జూచి తన్
గొని చనుదెంచి భాసిలెడు గోపవధూజనజారు జూచి నె
మ్మనమున దోచె నప్పు డటు మజ్జనమాడగ వచ్చు నట్లుగన్ 183

అర్థాలు : నునుకావిపటంబులు= లేత కావిరంగు వస్త్రములు, వ్యాఘ్రచర్మమున్= పులితోలును, దండెయు= వీణయును, తాళములు= చిఱుతలు, గోపవధూజనజారుడు గోపికాప్రియుడు, మజ్జనము= స్నానము

భావము : చూచి, దగ్గఱలో లేత కావిరంగు వస్త్రములను, పులితోలును, కమండలమును, వీణను, కరతాళములను చూచి, తీసికొని వచ్చిన కృష్ణునిచూచి, అప్పుడే స్నానముచేసి తాను వచ్చుచున్నట్లు తోచగా,

ఉ॥ దోచిన యంత నారదుడు దోవతి గట్టగ గట్టు కెక్కినన్
జూచి మురారి యిట్లనియె సూరిజనస్తుత చండభాస్కరుం
డేచె మహాతపశ్చరణనర్ప పురంబును జేరబోదమా
యాచమనాదికృత్యము రయంబున దీర్పుము మౌనిశేఖరా 184

అర్థాలు : సూరిజనస్తుత= పండితులచే స్తుతింపబడు, ఏచెను= కాల్చుచున్నది.

భావము : నారదుడు దోవతి కట్టుకొనుటకు సరస్సు గట్టునెక్కిన, కృష్ణుడు చూచి, "ఎండ మండుచున్నది. తపశ్చర్యకు నగరానికింక పోదము.

ఆచమనముతో త్వరగా ప్రాతఃకాల జపము మొదలగు పనులన్నియు పూర్తిచేయుము మునివరా

ఆ॥ కరము నొకటి హేమకంకణోజ్జ్వలితమై
మెఱయుచున్న దేమి సురమునీంద్ర!
నీటిగుణమొకాక నీతపోమహిమంబొ
యింతలోన చిత్రమేమి యనిన 185

అర్థాలు : హేమకంకణ+ఉజ్జ్వలితమై= బంగారుకంకణముతో మెఱయుచు, సురమునీంద్ర= శ్రేష్ఠుడైన దేవముని

భావము : "ఓ మునివరా! తమ చేతిలో బంగారు కంకణము మెఱయుచున్నది. ఈ సరస్సులో నీటి మహిమయా? లేక, తమ తపోమహిమయా? అదెట్లు నీకు కలిగినది? చిత్రముగా నున్నదే?"

క॥ తనకరము చూచి వనితా
తనువున తనపడినపాట్లు దలపోసి మదిన్
వనకేళికిగా నప్పుడు
చనుదెంచుట యంతయును నిజంబై యున్నన్ 186

భావము : తన చేతిని చూచి నారదుడు తాను స్త్రీరూపము ధరించి పడినపాట్లు గుర్తుకు తెచ్చుకొని తాము వనవిహారమునకు వచ్చిన విషయము నిజమని తలచెను.

ఉ॥ కావులు గట్టి కృష్ణపదకంజ యుగంబు లలాటదేశమున్
మోవగ జాగి మ్రొక్కి కరముల్ ముకుళించి విరించిపట్టి యో
శ్రీవనితామనోరమణ! చిన్మయరూప జగద్విలక్షణా!
దేవ పరేశ సర్వమయ దీనజనావన భక్తపాలనా 187

అర్థాలు : కావులు= కాషాయవస్త్రములు, లలాటదేశమున్= నుదురుభాగము, మోవగా= తాకగా, జాగి= సాగిలపడి, విరించిపట్టి= బ్రహ్మదేవుని కుమారుడైన నారదుడు,

భావము : కాషాయ వస్త్రములు ధరించిన వాడై కృష్ణుని పాదములకు తన నుదురు తాకునట్లు సాగిలపడి నమస్కరించి, చేతులు జోడించి నారదుడు ఇట్లనెను, "లక్ష్మీనాథా! జ్ఞానస్వరూపా! జనులందు గొప్పగుణములు గలవాడా!పరమేశ్వరా! సర్వము నీవైనవాడా! దీనజనులను రక్షించువాడా! భక్తులను పాలించువాడా! (ప్రభువు)"

క॥ కించిత్జ్ఞుండను గర్విని
వంచకుడను దుర్విచార వర్తనుడను నీ
వంచించునట్టి మాయను
కాంచన గర్భాదులైన గందురె యెలమిన్ 188

అర్థాలు : కించిజ్ఞుండను= చాలా తక్కువైన జ్ఞానముకలవాడను, వంచకుడను= మోసకాడను, దుర్విచారవర్తనుడను= చెడ్డతలంపులు, ప్రవర్తనము గలవాడను, కాంచనగర్భాదులైన= బ్రహ్మాదులైన, ఎలమిన్= స్పష్టముగా, చక్కగా

భావము : "నేను అల్పజ్ఞానిని, గర్వము కలవాడను. చెడ్డనడవడిక కలవాడను. భ్రమింప చేయు నీ మాయను బ్రహ్మ మొదలైన దేవతలు చక్కగా తెలుసుకొనగలరా?"

క॥ నీమాయ సర్వజగములు
గా మూర్తీభవమునొంది కడునటియింపన్
నీమాయ దెలియుటకు నా
తామర సంభవునకైన దర మెట్లగునో 189

అర్థాలు : మూర్తీభవమునొంది= రూపమును పొందగా

భావము : "నీ మాయయే, ఇన్ని లోకములు, కన్పించునదంతయు నీ మాయయే. ఇక దీనిని తెలియుట, గెల్చుట ఎవరికి సాధ్యము?"

తే॥ అట్టి బహుజగంబులం దొక్కజగమున
నధమవృత్తినుండు నట్టివాడ
మందబుద్ధి నీదుమాయామహత్వంబు
నెట్లు దెలియువాడ నీశ్వరేశ 190

అర్థాలు : మందబుద్ధి= తెలివితక్కువవాడను, మహత్వంబున్= గొప్పతనమున, ఈశ్వరేశా= పాలకులందఱకి ప్రభువా!

భావము : "నీ ప్రకటిత జగములందు ఒక్క లోకములో ఉన్న నేను, తెలివి లేనివాడను, నీ మాయను తెలియక అల్పకార్యములు చేయుచున్నాను. ఎట్లు నీ మాయను తెలిసికొనగలను?"

ఉ॥ దేవరసత్కటాక్షమున దేవమునిత్వము గల్గి సర్వలోకా
వలి ద్రిమ్మరం గలుగునంతటి మాత్రనె క్రొవ్వి గర్వమున్
భావమునందు దొట్టి యటపడ్డ యవస్థ లదేమిచెప్పుదున్
కావరమెల్ల దీరె మది గర్వమణంగెను స్రుక్కితిన్ గడున్ 191

అర్థాలు : క్రొవ్వి= మదించి, తొట్టి= అతిశయించి, కావరము+ఎల్ల= గర్వమంతయు, స్రుక్కితిన్= కృశించినాను

భావము : "మీ దయవలన దేవమునినై లోకములన్నిట తిరుగగల్గిన మాత్రమున మదించి గర్వము తలకెక్కి, నేను పడిన పాట్లు చెప్పనలవిగాదు. ఇప్పుడు నా అహంకారమంతయు తొలగినది. చాలా అలసిపోయి బలము లేనివాడనైతిని".

ఉ॥ ఇంతటనైన మీకరుణ కించుక పాత్రుడనౌదునో కడున్
వంతల సర్వదుఃఖముల వర్తిల నర్హుడనౌదునో రమా
కాంత దయాసముద్ర గతకల్మష సర్వశరణ్య! కృష్ణ! ధీ
మంతుల పంచ జేర్చినను మన్నన గావవె కంసమర్దనా 192

అర్థాలు : వంతల= బాధలతో, ధీమంతుల పంచన్= బుద్ధిమంతుల, పండితుల నివాసాలలో, మన్ననన్= ప్రేమతో

భావము : "ఇప్పుడైనా మీ కరుణకు కొంచెమైనా తగుదునా? చాలా బాధలతో, దుఃఖాలతో మునిగియున్న నేను యోగ్యుడనా? లక్ష్మీపతి! దయకు సముద్రుడా! మలినము లేనివాడా! అందఱిచే ఆశ్రయింపబడువాడా! ఓ కృష్ణా! కంసుని సంహరించినవాడా! బుద్ధిమంతుల నివాసాలలో చేర్చి నన్ను కాపాడుము!"

ఉ॥ ఎక్కడిభామినీతనువు యెక్కడి తాపసకాంత చూడగా
నెక్కడి నెచ్చెలుల్ మఱియు నెక్కడిరాజకుమారు డట్లు నా
కెక్కడి మోహతాపము లదెక్కడిపెండిలి యేడపుత్రు ల
ట్లెక్కడి దుఃఖముం బొరసె నేమనవచ్చును చిత్రమచ్యుతా 193

భావము : "కృష్ణా! ఇదేమి చిత్రము స్వామీ! ఆ స్త్రీరూపమేమిటి? ఆ తపస్విని ఎవరు? ఆ చెలికత్తెలు ఎవరు? రాజకుమారుడెవరు? వాని కొఱకు నా తాపమేమి? పెండ్లి, బిడ్డలు, అందఱు మరణించినారని నేను దుఃఖించుట ఏమి? దీనికంతటికి ఏమి కారణము? ఆశ్చర్యముగా నున్నదే"

చ॥ ఇదియు నిజం బనాగదగు నిప్పుడు వచ్చినచిహ్నా లిన్నియున్
విదితములై కనంబడ నవీనముగా కరకంకణంబున్
గదనధరిత్రియుం శవనికాయము లిట్ల సమక్షమై నిజం
బెదుటనెయుండ కల్లయన నెట్లగునో పరమాత్మ యెంతయున్ 194

అర్థాలు : నిజంబనాగ= నిజమనునట్లు, విదితములై= స్పష్టమగుచుండ, కల్ల= నిజముకాదనుట

భావము : "సర్వము నిజమనుటకు ఇప్పుడు నీవును స్పష్టమైన ఈ కంకణము, యుద్ధభూమి, శవములు, ఎదుటనే ఉన్నవి కదా! ఇవన్నియు గుర్తులై కనబడుచున్నవి నిజము కాదనుటకు ఎట్లు వీలగును?"

ఆ॥ కావుకావుమనుచు కడు దీన చిత్తుడై
పాదయుగళిమీద బడిమహర్షి
లేవకున్నయట్టి దేవమునీంద్రుని
కరుణజూచి పల్కె కమలధవుడు 195

అర్థాలు : కావు= రక్షించు, కమలధవుడు= లక్ష్మీదేవిపెనిమిటి

భావము : "నన్ను రక్షించుము, నన్ను రక్షించుము" అని దీనముగా పాదములపై బడి విలపించుచున్న దేవర్షిని కరుణతో చూచి విష్ణువు ఇట్లు వచించెను.

క॥ పొడమినగర్వం బడగెను
కడువిస్మయ మగుచు బుద్ధికణగెనె యహహా
పుడమి నహంకారముసరి
యిడుములకున్ మూలమొక్కొ టెందును గలదే 196

అర్థాలు : పొడమిన= కలిగిన, ఇడుమలకున్= కష్టములకు

భావము : "కలిగిన గర్వము పోయినది. అదంతా ఆశ్చర్యముగా ఉన్నది. బుద్ధికి వశమైన అహంకారము దానికి సమానమైన ప్రధానమైన కారణము ధరణిలో మఱొకటి కలదా!"

క॥ లేవోయి వత్స నీదగు
భావమహంకారవృత్తి బరిహరపెట్టన్
గావించితి నీచిత్రము
లేవోయి భయంబు వలదు లెస్సగు మీదన్ 197

అర్థాలు : పరిహరపెట్టన్= తొలగించుటకై, లెస్స+అగు= శుభమగు

భావము : "వత్సా! లేవయ్యా! నీ గర్వమును తొలగించుటకు నేను ఇదంతా కల్పించినాను. భయము లేదు. లెమ్ము. ఇకమీద శుభమగును".

ఉ॥ లెమ్మని లేవనెత్తి బడలించితి నంచును నీమనంబులో
నుమ్మలికంబు దక్కు నలినోద్భవు నంతటివారికైన లో
గమ్మిన యాయహంకృతియె కారణమౌ బహుదుఃఖవార్ధికిన్
ఇమ్ములసర్వసంస్కరణ హేతుక మింతనిజంబు నారదా! 198

అర్థాలు : బడలించితిని+అంచును= కష్టపెట్టితినని, ఉమ్మలికంబుతక్కు= శోకమును వదలుము, నలినోద్భవున్= బ్రహ్మను, ఇమ్ముల=అనుకూలముగా, సర్వసంస్కరణ=మంచిగుణములన్నింటిని మార్చివేయుటకు (దహించుటకు), హేతుకము= కారణమగును

భావము : "అహంకారము వలన బ్రహ్మకైనను దుఃఖము తప్పదు. ఓ నారదా! సత్యము విచారించినచో ఈ దుఃఖానికి కారణమైనదంతయు అహంకారభావమే. అదియే సర్వమును దహించివేయును. నిన్ను బాధపెట్టితినని మనస్సులో చింత పెట్టుకొనవద్దు." అనుచు నారదుని కృష్ణుడు లేవనెత్తెను.

'నేను' అను భావన 'నాది' అను భావనకు మాతృక. 'నాది' అనే భావమే కోరికలకు మూలము. ఈ కోరిక ఫలించిన సుఖము, లేకున్న దుఃఖము. తీరిన కోరికలును శాశ్వత సుఖము నివ్వవు కదా! 'నాది' అనుకొనగనే అది ఉన్నందున సుఖము, పోయినందున దుఃఖము. ఉన్నది పోక తప్పదు గదా ఇక దుఃఖమే. సర్వ గుణములు మార్పు చెందును

క॥ కావున నికనైనను నీ
భావమహంకరణవృత్తి బడనియ్యకు మ
ద్భావన నిరంతరంబును
గావింపుచునుండు మది నకల్మషవృత్తిన్ 199

భావము : "అందుచేత, ఇక నెప్పుడును నీ మనస్సును అహంకారమునకు లొంగనియ్యకుము నన్నే మనస్సులో ప్రతిష్ఠించుకొనుము. 'నేను' జీవుడను అను భావనను రానీయకు. జీవుడవైన 'నీవు' దేవుడవే. ఏ మలినములు అంటక నేను "దేవుడు" అనే భావనను పెంచుకొనుము. (అహం బ్రహ్మాస్మి")

వ॥ అన పునఃపునః ప్రణామంబు లాచరించి ముకుళిత హస్తుండై
నారదుండిట్లనియె 200

భావము : అని కృష్ణుడు వచింపగా చేతులు జోడించి నమస్కరించుచు నారదుడు ఇట్లనెను.

క॥ సర్వేశ! సర్వకారణ
సర్వాత్మక సర్వసాక్షి సర్వాతీతా!
సర్వశరణ్య! దయాకర!
సర్వోత్తమ సర్వరూప సర్వోద్ధారా! 201

భావము : "సర్వానికి నాయకుడా! కారణుడా! ఆత్మయైనవాడా! అన్నింటిని చూచువాడా! మించిన వాడా! (అందనివాడా) అందఱిచే ఆశ్రయింపబడువాడా! దయచూపువాడా! శ్రేష్ఠుడా! అందఱి రూపమైనవాడా! వృద్ధి చేయువాడా! (అన్నియు సంబోధనలు)"

ఆ॥ సర్వసముడవయ్యు సర్వంబు రక్షింఁచు
సర్వకర్త వీవు జలధిశయన
సర్వజీవులకును సాధింపరాని యీ
మాయ నింతపెంపు సేయనేల! 202

అర్థాలు : జలాధిశయన్= సముద్రమును పాన్పుగా కలవాడా!, పెంపు= వృద్ధి, పెరుగుదల

భావము : "నీవు అన్నిటియందును సమభావము కలవాడవు, అన్నిటిని రక్షించువాడవు, అన్నిటిని సృష్టించినవాడవు. ఐనను ఏ స్థాయిలోని జీవికి గాని అర్థముగాని, దాటరాని, మాయను ఇంతగా వృద్ధి చేయుటకు ఏమి కారణము?"

ఉ॥ ఎందుకు బుట్టె మాయ నెళవెయ్యది దీనికి నిచ్చ యుండగా
నెందుకు మాయచేత భ్రమయించెదు వెంతటివారినైన నీ

కిందు ప్రయోజనంబు నొకయించుక యేనియు గల్గనే జగ
ద్వంద్వమునుం సృజింప కడు పేర్చిన మాయనుముంప నేటికిన్ 203

అర్థాలు : నెళవు= నివాసము, ఇచ్ఛ= కోరిక, జగత్+ద్వందము= రెండు ప్రపంచములను, ముంప= ముంచుట

భావము : "మాయ ఎందుకేర్పడినది? దాని నివాసమేది? దానికొక ఇచ్ఛాశక్తి యుండుటకు కారణమేమి? ఎంతటి వారినైనా మాయచే భ్రమింప చేయుదువు కదా, అందువలన నీకేమైనా ప్రయోజనమున్నదా? ఈ రెండు జగత్తుల సృష్టి ఎందుకు?"

విశేషము : మాయకు ఇచ్ఛాశక్తి యున్నది. లేకున్న భావన లేదు. క్రియాశక్తి యున్నది. లేకున్న వ్యాపారము సాగదు. ఈ రెండును ప్రకృతి నడతలో సుస్పష్టములే. ప్రకృతి మాయయే. "ప్రధానం ప్రకృతిర్మాయా" అని అమరము. జగద్ద్వంద్వమనగా, ప్రాకృతికమైన (మాయికమైన) అనుభవ ప్రపంచమొకటి, జ్ఞానపూర్ణమైన తాత్త్విక ప్రపంచమొకటియును కలిసి రెండు. ఈ రెండును ఎంతో కొంత వ్యక్తికి అందినవే. ఇదిగాక ద్వంద్వముతో కూడిన జగత్తనియు అర్థము. ఈ కారణ కార్యప్రపంచమును సాగించునది ఈ ద్వంద్వభావమే. ప్రేమ-ద్వేషము, దానము-పిశునత్వము, స్వార్థము-పరార్థము, ఇట్లే ద్వంద్వములు వ్యతిరేకములును కలవు. జగత్ ద్వంద్వము ఒక్కటే (ఇది వేఱు)

శా॥ నీవే కర్తవు భోక్త వంచును శ్రుతుల్ నిక్కంబుగా బల్కగా
నీవే సర్వమునయ్యు మాయ యనగా నిర్మించి యామాయచే
జీవాలిం గడు దుఃఖపెట్టుటకు నాజీవంబులుం నీవకా
గా వర్తించు సుఖంబు దుఃఖమును నిక్కంబెవ్వరిం జెందునో 204

అర్థాలు : భోక్తవు= అనుభవించువాడవు, శ్రుతుల్= వేదములు

భావము : "అన్నియు కల్పించు పరమకర్తవు నీవు. (తక్కినవారు నిమిత్తకర్తలు) అన్నియు అనుభవించు వాడవు నీవు. (అనుభవమనెడి భావన మాత్రమే జీవులది). నీవు గాక మఱేమియు లేదని వేదములు ఘోషించుచున్నవి. ఈ జీవులు గూడ (నిమిత్త కర్తలు, అనుభవించు భోక్తలు) నీవే కదా. మఱి సుఖము, దుఃఖము ఎవరికి చెందినవి?"

విశేషము : సాధారణముగ ఎవరైనను అడుగుప్రశ్న "కర్తవు నీవైతే, భోక్తవు నీవైతే, మధ్య నన్నెందుకు ఏడ్పించుట?" అని. కాని ఇక్కడ ప్రాశ్నికుడు నారదుడు దేవర్షి. కనుక లోకములో సుఖ, దుఃఖానుభవము జీవులదే అన్నట్లు కనబడుచుండగా, భోక్తవు నీవని వేదోక్తి. అటైన, సుఖదుఃఖములు నీవి, అనవచ్చునా? నీవు ద్వంద్వాతీతుడవని వేదాంతశాస్త్రము. మఱి ఈ సుఖదుః ఖములు ఉన్నవా? లేవా? అని తోచును కదా? ఎవరివి? జీవునివా? దేవునివా?"

క॥ కావునసంశయ మిదినా
భావంబున దోచె దీనిపద్ధతి దెలియం
గా వివరింపుము దయ దీ
నావన సద్భక్తవరద! యన దయతోడన్ **205**

భావము : "ఈ సంశయము తొలగజేయుము. నీవు దీనులను రక్షించువాడవు (దీన అవన). నేను దీనుడను. నీవు భక్తులు కోరినదిచ్చువాడవు. (సత్ భక్త వరద) నేను సద్భక్తుడను. నీవు నా కోరిక మన్నింపవలసినవాడవు" అనగా దయ గలవాడై

వ॥ భగవంతుడైన శ్రీకృష్ణుండు నారదునకిట్లనియె **206**

భావము : భగవంతుడు నారదునకు ఇట్లు సమాధానమిచ్చెను.

ఉ॥ మాయ శరీరముల్ భువనమండలి మాయ సమస్తవస్తువుల్
మాయ చరాచరంబులును మాయ వియన్ముఖపంచభూతముల్

మాయ శ్రుతుల్ తదర్థములు మార్కొను కర్మములెన్ని యన్నియున్
మాయగు నస్మదాదులును మాయయుగాక యొకండు గల్గునే **207**

అర్థాలు : చర+అచరంబులును= కదలునవి (ప్రాణమున్నవి), కదలనివి (ప్రాణము లేనివి), వియద్+ముఖ= ఆకాశము మొదలైన, అస్మద్+ ఆదులు= నాబోటివారు

భావము : శరీరములు మాయ. లోకములు మాయ. వస్తుజాలమంతయు మాయ. ప్రాణులు, అప్రాణులు మాయ. ఆకాశాది భూతములైదును మాయ. వేదములు, వేదార్థ ప్రతిపాదకములగు స్మృతులు ఏయే కర్మలను ప్రతిపాదించుచున్నవో, అవి అన్నియు మాయ. మాబోటి వారును మాయయే. మాయకానిది ఒక్కటికూడా లేదు.

విశేషాలు : భువనమండలి అనగా చతుర్దశభువనములుగా (పదునాలుగు లోకములుగా) పేర్కొనబడిన భూ, భువ, స్వర్లోక, జనర్లోక, మహర్లోక, తపోలోక, సత్యలోక, అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళములు.

పంచభూతములు : భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము. ఇవి సృష్టికి ఆద్యములు, మూలకణములు. ఐరోపీయ తత్త్వశాస్త్రము ఆకాశమును గుర్తించలేదు. ఆకాశమే లేకున్న మిగతవాటికిని అవకాశమే లేదనునది తార్కిక సత్యము. కనుక భారతీయులు ఆకాశమును గుర్తించి సృష్టిమూలకములు ఐదనిరి. అస్మదాదులు అనగా కృష్ణుని బోటివారు. ఐన కృష్ణుడు పరమేశ్వరుడు కాడా? నారదుని వలె, నీవలె, నావలె మాయయేనా? అని ప్రశ్నవచ్చును. ఇక్కడ తాత్త్విక భావమున, సత్యమనునది శుద్ధసత్త్వచైతన్యమైన బ్రహ్మవిష్ణురుద్రులు కూడా మాయా కల్పితములే అనగా ప్రాకృతులే. ఈ జ్ఞానము కృష్ణునకున్నది. కనుక గీతలో, అర్జునునితో "నీకును నాకును ఇంతకు ముందెన్నియో జన్మలైనవి, అవి నే నెఱుగుదును, నీవెఱుగవు" అని చెప్పుట శుద్ధసత్త్వము నిర్గుణ బ్రహ్మమే.

క॥ మాయామహిమము దెలియగ
నా యజరుద్రాదిసురలకైనను దరమా
మాయామహిమమె కాదా
పాయని సంసారఘోరబంధం బరయన్ 208

అర్థాలు : అజరుద్రాదిసురలకైనను= బ్రహ్మ, రుద్రుడు మొ॥ దేవతలను, పాయని= విడువని

భావము : "మాయను గుర్తించుట బ్రహ్మరుద్రులకైనను అసాధ్యము. ఈ సంసారమనెడి గట్టిబంధము విడిపోకుండుటకు కారణము మాయయే!"

ఆ॥ మాయ యనగ వేఱె మఱియొక్కచో నుండి
పుట్టి వచ్చి జనుల బొందలేదు
ఆది దెలియనట్టి యజ్ఞానమే మహా
మాయగాని వేఱు మాయలేదు 209

భావము : "మాయ యనునది ఎక్కడో పుట్టి లోకానికి వచ్చి అందఱిని ఆవహించినదికాదు. జీవికి తన మూలము తెలియక పోవు స్థితియే మాయ. అదియే ఆజ్ఞానమనునది. అంతకు మించి మాయలేదు."

జీవి పుట్టినది మొదలు 'నేను', 'నేను' అనుచునే యుండును. మాటలు రాని జీవుడు సైతము తన్ను కాపాడుకొనుచునే యుండును. కానీ ఈ 'నేను' అను చైతన్యమునకు మూలమేది? అను ఆలోచన రానీయక ఇది శరీరమనియే భావించును. ఇది అజ్ఞానము. అనగా తెలియనితనము.

మ॥ దురహంకారవికారవాసనయె యెందున్ జూడదోషంబు దు
ష్కరసంసారమహాబ్ధికారణము దుఃఖప్రాప్తిజీవత్వసం
భరణోత్కర్షము సర్వజీవనిచయప్రారంభముం జన్మనా
శరథాంగద్వయసూత్రధారిరిపురా ట్సంజీవి నిక్కంబుగన్ 210

అర్థాలు : దురహంకారవికారభావనయె= చెడ్డదైన అహంకారమనెడి (నేను నాది) భావ సంస్కారమే ఏ విధముగా చూచినను దోషమే, దుష్కర సంసార మహాబ్ధికారణము= దాటరాని సంసారజీవితము అనెడి మహాసముద్రమందు మునుగుటకు కారణము, దుఃఖప్రాప్తిజీవత్వసంభరణ+ఉత్కర్షము= దుఃఖములు కలుగుటకు జీవితమును తృప్తిగా అనుభవించుటకు రథాంగద్వయము= రెండు చక్రాలు, రిపురాట్ సంజీవి= ఆఱుశత్రువులను జీవింపజేయును.

భావము : అహంకారము వికృతమైన బుద్ధి మాంద్యము. అది దోషమే. దాటరాని సంసార సముద్రములో మునిగిపోయి చింతించుటకు, కష్టాలను దుఃఖాలను పొందుటకు కారణము. జీవులు పుట్టుట నశించుట అనెడి రెండు చక్రాలను నడిపించునది (సూత్రధారి) ఆ అహంకారమే, కామక్రోధము లను లోభమోహములను మదమాత్సర్యములను ప్రోత్సహించునది.

సీ॥ అగణితంబైన పుట్టగు మొల్కలకువిత్తు
చెడుగు సంసారంపుచెట్లపాదు
మమకారతోయసంభరితోరు కుంభంబు
స్వల్పవివేకమూషకబిడాల
మలరు కోర్కెవలకు ప్రాకుడుమండయు
బహువిడంబపు గుండ్ల పందిరరయ
పటుతరసుఖదుఃఖఫలపాకభాండంబు
తదనుభవ వివృత వదనసీమ

తే॥ యగుచు నంతయు దానయై నెగిడినిగడె
బ్రహ్మవిష్ణుశివాదిరూపములు దాల్చి
దుష్టిలేక చరాచరసృష్టి యగుచు
తగు నహంకారమహిమంబు దరమె పొగడ 211

అర్థాలు : అగణితంబైన= లెక్కలేనన్ని, ప్రాకుడుమండ= విస్తరించిన, బహువిధవిడంబపుగూండ్ల= పెక్కు మోసములనెడి (పక్షులు కట్టుకొను) గూండ్లు , పటుతరసుఖదుఃఖఫలపాకభాండంబు= బలమైన సుఖదుఃఖముల ఫలములనెడి వంటలు వండు పెద్దకుండ, తదనుభవ= ఆ సుఖదుః ఖఫలములను అనుభవించునట్టి, వివృతవదనసీమ= తెఱచిన నోరు, నెగడినిగిడి= చెలరేగి వ్యాపించినది, తుష్టి= తృప్తి

భావము : 1. ''పుట్టుకలు'' అనెడి మొలకలు మొలుచుటకు విత్తనము

2. చెడ్డ సంసారమనెడి చెట్టునకు, పాదు(నీళ్లు పోయుటకు ఏర్పాటు చేసిన పాదము చుట్టునుండ పల్లము)
3. నాది అనెడి నీరుగల పెద్దకుండ
4. అల్పమైన, తెలివి అనెడి ఎలుకను తిను పిల్లి
5. ఎక్కువగు కోర్కె అనెడి వలను అల్లుకొనుటకై చేరు కొమ్మ
6. అనేకములైన మోసాలనెడి పక్షుల గూళ్లు నిర్మించుకొన్న పందిరి
7. భరింపరాని బలమైన సుఖదుఃఖ ఫలములనెడి వంటలు గల పెద్ద బాన(కుండ)
8. సుఖదుఃఖములనెడి అనుభవములను మ్రింగివేయు వెడల్పైన నోరు

ఈ విధముగా అంతయు తానే అయి చెలరేగి త్రిమూర్తుల రూపములు ధరించి తృప్తిలేనిదై సర్వసృష్టియై అహంకారము ప్రవర్తించును దాని మహిమను పొగడుట సాధ్యమా?''

విశేషము : ఈ సంసారానికి విత్తనము 'నేను' అను భావన. అది మమకారముగా వృద్ధి పొందును. మమకారము లేని అహంకారములో 'అహం' అనునది కూడా ఉండదు. కనుక అది పరమము. 'మమ'(నాది) అన్న భావనయే దానిని విస్తరింపజేయునది. ఇక్కడ వివేకమనునది

తలయెత్తిన వెంటనే దానిని నశింపజేయునది కూడా అహంకారమే. 'నేను' అను భావన లేనిచో కోరికలు లేవు. సుఖదుఃఖాలను సిద్ధముచేయు జీవాహంకారము చరాచరమన్నిట నున్నది. నిర్జీవ పదార్థములలో కూడా ఈ అహంకారము ఆ యా పదార్థలక్షణములతో వ్యక్తమగుచున్నది. దేవతలు, మూర్తిత్రయము, వ్యక్తమైన దంతయు అహంకారపూరితమే.

క॥ నేనట సర్వజ్ఞుండను
నేనట కించిత్ జ్ఞుడగుదునే మదిభేదం
బే నిక్కమహంకారము
తా నీదేహేంద్రియముల తాదాత్మ్యమునన్ 212

అర్థాలు : సర్వజ్ఞుండను= అన్నియు తెలిసినవాడను, కించిజ్ఞుండను= కొద్దిగ తెలిసినవాడను, దేహేంద్రియములతాదాత్మ్యమునన్= దేహము ఇంద్రియములు 'నేను' అను భావనతో

భావము : ''నేను అన్ని తెలిసిన వాడను. నేను కొంచెమే తెలిసిన వాడను. అనే భేద భావన అహంకారము, కారణము. అట్టి భావనవలన శరీరము ఇంద్రియాలు అంతా ''నేనే'' అను భావన కలుగుచున్నది.

విశేషము : సాధారణముగా నాకన్నియు తెలుసు, అనే వానిని గర్విష్ఠి అనుట పరిపాటి. కాని, నిజమునకు ఇద్దఱును అహంకారులే. ఈ భేదానికి కారణము ఏమి? ఉపాధిభేదము అన్నారు పెద్దలు. ఉపాధి ఏమిటి? అంటే, శరీరము, ఇంద్రియాలు మనస్సు అనేవి 'నావి' అనే భావముతో బాటు, ఇవియే 'నేను' అనే భావము స్థిరమగుచున్నది. ఈ భావ ద్వయము సంసారానికి మూలము. ''ఇవి నావికావు, ఇది నేనుకాదు'' అనెడి వివేకము కలిగినను, దానిని ఈ అహంకారము మ్రింగివేయుచున్నది.

తే॥ ఆయహంకారమే సర్వమైన జీవ
తతికి సుఖదుఃఖ కర్మసంధానకరణి

దాని నిర్జింపగలిగిన దానితెలివి
వర్ణనకు నెక్కు డది సర్వపూర్ణకారి 213

అర్థాలు : తతికి= సమూహమునకు, సుఖదుఃఖకర్మసంధానకరణి=సుఖదుః ఖములను కలిగించు కర్మలను జోడించునది, నిర్జింపగలిగిన జయించగలిగిన, తెలివి= వివేకము, వర్ణనకు నెక్క= గుర్తించబడును, సర్వపూర్ణకారి= పూర్ణత్వమును ఎఱిగించును.

భావము : "అహంకారము అనునది జీవులచే సుఖదుఃఖాలను కలిగించే పనులను చేయించును. వివేకము మాత్రమే దానిని గెలువగలదు. పూర్ణత్వమేదో తెలియచేయును".

విశేషము : "పూర్ణమదః పూర్ణమిదం, పూర్ణాత్పూర్ణముదచ్యతే, పూర్ణస్య పూర్ణమాదాయ, పూర్ణమేవావశిష్యతే" అను ఉపనిషద్వాక్యమును అనుసరించి ప్రకృతి, పురుషుడు ఒక్కటే

క॥ కాన నహంకారము నె
వ్వారికి కొఱగాదు మౌనివల్లభ వింటే
తాను న్నేనను టెడయుచు
తానేతాననుట నిజము తానై యుందున్ 214

అర్థాలు : ఎడయుచు= విడిచి

భావము : "కావున అహంకారము ఎవరికిగాని ఉపకారికాదు. నారదా! నీవు, నేను అను భేదభావమును వదలి, 'నేనే నేను' అనుకున్నచో అది సత్యమగును. ఆ 'నేనే' నేను సుమా!"

విశేషము : 'నేను' అనుదానికి చాలా స్థితులున్నవి. అందు ప్రధానమైనవి పై పద్యములో జెప్పినట్లు, శరీరము తత్సంబంధులన్నియు, "నేను" అనుకొనుట. ఈ భావము వలన తన శరీరము కంటే వేఱుగా కొన్ని ఉన్నవనియు అవి

తాను కాదనియే తోచును. ఇది విడువదగిన భావన. ఈ భావనయే సంసారమునకు సుఖదుఃఖములకు మూలము. ఇదికాక, 'నేను' అనియే కదా ప్రతి ప్రాణియు తన్ను తాను చెప్పికొనును. ప్రాణము లేనివి కూడా తమ తమ ప్రత్యేకతలతో వ్యక్తిత్వమును చాటుకొనుచున్నవి కదా! కనుక అన్నిట నున్న ఈ 'నేను' నాలో నున్న 'నేను' ఒక్కటే. నాలోని 'నేను' అను చైతన్యమే అన్నిటనున్న 'నేను' అనునది. దీని వలన అహంకారము సంకుచితముగాక విశ్వమంతయు విస్తరించి, జీవాహంకారము విశ్వాహంకారముగా విస్తరించును. అటనుండి పరమాహంకారమై 'అహం' (నేను) అను స్పృహ మాసిపోయి విశుద్ధచైతన్య దర్శనము, స్పర్శనము తాదాత్మ్యము సంభవించును. ఇదియే సత్యము. కనుక శ్రీకృష్ణుడిచ్చట 'తానైయుందున్' అనుట ఆ సత్యస్వరూపపుడను నేనగుదును, అని చెప్పుట. ఈ వాక్యము బైబిలు గ్రంథములో మోసెస్ అడిగిన 'నీవెవరు?' అను ప్రశ్నకు దేవుడిచ్చిన "అయామ్ దట్ అయామ్" అను జవాబును గుర్తుకు తెచ్చును. దీనినే, హెబ్రూ భాషలో (యెహోవా) అందురు. ఇది 'తదహమ్' అను మహావాక్యమునకు సమానార్థకము. ఇది తత్త్వార్థము.

వ॥ అనిన నారదుండిట్లనియె 215

భావము : ఆ మాటలు విని మఱియు నారదుడు ఇట్లు అనెను.

ఆ॥ విష్ణుమాయ యనుచు విఖ్యాతమైయుండి
విష్ణు వీవె కావె వేదవేద్య!
నీదుమాయ దెలియనేర్చితి నన్నంత
కాదె యిన్నిపాట్లు గలిగె నాకు 216

భావము : "వేదములచే తెలియబడినవాడా! లోకమున విష్ణుమాయ అని యొక నానుడి యున్నది కదా. ఆ మాయను నే నెఱుగుదునని గర్వించి మాట్లాడినందులకే కదా నాకు ఇట్లు స్త్రీరూపము, సంసారము, దుఃఖము,

ఇవి అన్నియు కలిగినవి. నీవే విష్ణువు కనుక ఈ మర్మము చక్కగా వివరింపుము''.

చ॥ హరిహరపద్మజాదులగు నందరహంకరణంబుమాత్రగా
బరవశియించి నారనుచు బల్కితి రిందున సంశయంబు దా
మఱిమఱి విస్తరించె నికమాయ దరింపగ జేయు వారలె
వ్వరు కరుణాప్రపూర్ణ ననువంచనసేయక నానతీయవే 217

భావము : ''బ్రహ్మవిష్ణుమహేశ్వరులు మొదలగువారు అందఱును అహంకారవశులై మైమఱచిరని తమరంటిరి. ఇచ్చట నాకొక సందేహము. అటైన మాయను దాటించగల వారెవ్వరు''?

విశేషము : ''త్రిమూర్తులును మాయావర్తులే యైనచో, ఇక యే దేవుని నమ్మిన ఈ మాయను దాటవచ్చును?'' అనినారద ప్రశ్న. ''మోక్షముకొఱకు అలమటించువారికి నారాయణాత్ మోక్షమిచ్ఛేత్'' అని చెప్పినారు కదా. నారాయణుడు కూడ మాయవశుడైనప్పుడు ఇంక గతియేమి? అని ప్రశ్నించుచున్నాడు.

క॥ నాగర్వమణప మీరే
యీగతి మాయాబ్ధిముంచి యిడుమలకెల్లన్
లోనుగ జేసితి రని మది
లో గుఱిగా దోచినది యలుబ్ధవితీర్ణా! 218

అర్థాలు : గుఱి= లక్ష్యము, నిర్ణయము, అలుబ్ధవితీర్ణ= లోభములేని వారిని దాటించువాడా!, మోక్షమిచ్చువాడా!

భావము : ''నా గర్వమును తొలగించి తెలివి తెల్పుటకే తమరు నన్నిట్లు మాయలో ముంచి కష్టముల కలిగించితిరని మనసులో నాకు గట్టిగ తోచుచున్నది. దయతో నిజము చెప్పండి''. 'అస్మదాదులును మాయ' అని చెప్పితిరి కదా. నీవే మాయయైనచో నాకీ మాయను నీవెట్లు కలిగించితివి?''

ఆ॥ నీవె మాయవైతె నీమాయ యను సర్వ
శ్రుతుల కేదిగతి విశుద్ధచరిత
నీవెమాయవైతె నిను మాయివ న నెట్లు
మాయమాని కరుణ సేయవయ్య! 219

భావము : ''వేదోపనిషత్తులన్నియు నిన్ను మాయి, అనగా, మాయను నియమించువాడవని చెప్పుచున్నవికదా. మఱి నీవే మాయవైతే, నీవు కల్పించెడి మాయ (నీ మాయ) వేఱు అగును కదా! రెండును నీవేనా?''

క॥ నీవే దైవమ వంచును
భావింపగ నీదుమాయ ప్రబలం బనుచున్
శ్రీవల్లభ! నిక్కమ నా
భావంబున దోచె నింక భ్రమయింపకుమా! 220

భావము : ''ఓ లక్ష్మీపతి! నిజముగ దేవుడవు నీవే యనియు, నీ మాయ బలమైనదనియు నా అభిప్రాయము. నన్ను భ్రమలో నుంచక, నిజము చెప్పుము.''

తే॥ అనిన దరహాసచంద్రికాననముతోడ
నారదుని జూచి యిట్లనె గారవించి
యనఘ నీమది నిర్మ లంబాయె గనక
వినుము వినుపింతు తేటగా విమలహృదయ 221

అర్థాలు : దరహాసచంద్రికా ఆననము= చిఱునవ్వు గల ముఖము, అనఘ= పాపములేనివాడా!, గారవము= ప్రేమ

భావము : అని నారదుడడుగగా ప్రేమతో చిఱునవ్వు గల ముఖము కలవాడై ఇట్లు పల్కెను. ''మనసు పరిశుద్ధమైనది. కనుక చెప్పెదను, వినుము.'' అనెను. మనస్సు నిర్మలము కానిదే ఎంత చెప్పినను, చదివినను తత్త్వ రహస్యము తెలియదని భావము.

ఆ॥ దేహతత్త్వమెఱిఁగి దేహిని బరికించి
దేహికైన యట్టి దేహబంధ
కారణంబు లెస్సగా దెలిసిన కాని
మాయ దెలియరాదు మౌనివర్య! 222

భావము : "ఓ మునివరా! ఈ దేహము యొక్క స్వభావమును తెలిసికొని, జీవుని గుర్తించి, ఆ జీవునికి వాని దేహమునకు గల సంబంధము ఎట్టిదో ఎఱిగినప్పుడే, మాయయన నేమో తెలియును సుమా!"

క॥ ఆమాయాశబ్దార్థము
యామాసా మాయయనగ నది లేనిదియై
వ్యోమాదిపంచభూత
గ్రామచరాచరవికారకారిణి యగుచున్ 223

అర్థాలు : యా= ఎవతె, మా= తల్లియో, సా= ఆమె, మాయా= మాయ, (యా= ఏది, మా= లేదో, సా= అది , మాయా= మాయ), వ్యోమ+ఆది= ఆకాశము మొదలైన

భావము : "మాయకు మూడు నిర్వచనములున్నవి : (1) మీయతే అనేన ఇతి మాయా, అనగా, దీనిచే కొలువబడును కనుక ఇది మాయ అనబడును. జీవి లోకములోనికి వచ్చినప్పటి నుండి తనచుట్టు గల సమస్తమును అంచనా వేసి గ్రహించుటకు యత్నించును. అంచనాకు ఆధారమేది? కొలబద్దయేది? అహంకారమే. కనుక అహంకారమే మాయ. (2) యా మా సా మాయా సృష్టికి కారణమైనది మాయ. ఈ కారణమేమి? అహంకారము. కనుక అహంకారమే మాయ. (3) యా నిషిద్ధా సా మాయా, అనగా ఏది నిషేధింపబడినదో (అనగా లేదో) అది మాయ. నిజముగా తత్త్వార్థమున లేనిదేది? నిషిద్ధమేది? అహంకారమే. కనుక అహంకారమే మాయ. ఇట్లు 'మాయ' యను మాటకు అర్థము తెలిసిన, ఇదియే పంచభూతములకు వాని నుండి యేర్పడిన సమస్త సృష్టికి కారణమైనది."

క॥ మొనసెన్ ఘనీభవించిన
యనువున దను దెలిసి వెదక నణుమాత్రమునున్
గనబడదు వినుము లెస్సగ
ననుపమసాధనచతుష్టయాన్విత మతివై 224

అర్థాలు : మొనసెన్= అయినది. (ఈ పదము పైపద్యముతో అన్వయము), ఘనీభవించిన= గడ్డకట్టిన, అనువున= రీతిలో, అనుపమసాధనచతుష్టయ+ అన్వితమతివై= సాటిలేని నాల్గురీతుల సాధనములతో కూడిన బుద్ధిమంతుడవై

భావము : "ఇట్లు కరుడు గట్టిన స్వరూపమై యున్న మాయ లోకరీతిలో వెదకినను అది కొంచమైనను కనబడదు. దానిని తెలిసి జయించుటకు సాధనములు నాలుగున్నవి. కనుక శ్రద్ధగా వినుము. వాని యందు బుద్ధిని నిల్పినప్పుడే,"

సీ॥ వరుస నిత్యానిత్యవస్తువివేకంబు
నెనయుట మొదటిసాధనము సుమ్ము
యిహపరలోకసుఖేచ్ఛను దొలగుట
చర్చింప రెండవసాధనంబు
సంయమీంద్ర శమాదిషట్కసంపత్తియే
మూడవసాధనంబుగ దనర్చు
సుమహితంబగు ముముక్షుత్వంబు నాలవ
సాధన మీచతుష్టయ సమృద్ధి

తే॥ గలుగు నిను జూచి తగు నధికారి వనుచు
మున్ను నీకు సనాతనమునివరుండ!
తెలియజెప్పిన తత్త్వంబు తెలివియెల్ల
మది నహంకార మొదవిన మాసిపోవు 225

అర్థాలు : నిత్య+అనిత్యవస్తువివేకంబు= శాశ్వతమైన వస్తువేదో, అశాశ్వత వస్తువేదో తర్కించి తెలియుట, ఇహపరలోక+ఇచ్ఛ= ఈ లోకముపై గాని పరలోకముపై గాని కోరిక, సంయమీంద్ర= మునిశ్రేష్ఠా!, శమ+ఆది షట్కసంపత్తి= శమము మొ॥ ఆఱు లక్షణములు, సుమహితంబు+అగు= చాల గొప్పనైన, ముముక్షత్వంబు= మోక్షము పొందవలెనను తాపము, అధికారివి+అనుచు= అర్హుడవని, మున్ను= పూర్వము,

భావము : సాధన చతుష్టయము (నాలుగు సాధనములు)

1. **నిత్యానిత్య వివేకము** : శాశ్వతమైనది యేదో కానిదేదో తెలిసికొను తెలివి.

2. **వైరాగ్యము** : ఇహలోక సుఖాలనుగాని పరలోక సుఖాలనుగాని కోరకుండుట.

3. **శమాదిషట్కము** : శమము, దమము మొదలగు అఱు గుణాలను వరించి పొందుట.

4. **మముక్షుత్వము** : మోక్షమందు స్థిరమైన కోరిక వీని సాధనకు నీవు అర్హుడవు అని పూర్వమే బోధించితిని అహంకారము కలిగిన యెడల నీలో తెలివి నశించును.''

''శమము (బాహ్యేంద్రియ నిగ్రహము), దమము (అంతరింద్రియ నిగ్రహము), తితీక్ష (ఓర్పు), ఉపరతి (దేవుని యందు మనస్సును స్థిరముగ నుంచి అన్యవిషయములను విడుచుట), శ్రద్ధ (వేదము, గురువు వీనిపై విశ్వాసము), సమాధానము (పరమ సత్యము నందు స్థిరబుద్ధి), ఈ ఆఱు శమాదిషట్కమనబడును. ఇవిగాని, మిగతా మూడు సాధనలుగాని, అప్రయత్నములుగ గాని, అల్ప ప్రయత్నముతోగాని అలవడవు. నిరంతర శ్రమ, శ్రద్ధతో సాధన చతుష్టయమును అభ్యసింపవలెను.''

ఉ॥ నిత్యమనిత్యముం దనకు నిక్కముగా దెలియంగ తా నెట్లున్
నిత్యసుఖంబునొందక యనిత్యపులోకసుఖాప్తి నొందునే

నిత్యముగాని వాని తగ నిర్వృతి సేయక షట్క మెట్లగున్
సత్యముగా శమాదిగుణసంపద ముక్తికి వేగిరింపదే 226

అర్థాలు : నిర్వృతి= నాశము, షట్కము= ఆఱింటి కూటమి (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు)

భావము : నిత్యమనిత్యమును వేఱుచేసిన వానిని తెలిసినప్పుడు ఎవడైనా శాశ్వతమైన సుఖమును గాక నశించు సుఖమును పొందగోరునా? ఎవడైనా అనిత్య సుఖములను తప్పక కోరడు. కనుక వస్తు స్వభావమును తెలిసికొనుట జ్ఞానమనెడి సూర్యుడు ఉదయించునట్టిది. అనంతరము శమదమాది ఆఱు గుణములను సాధించు యత్నముచే తుదియైన మోక్షమందు ఆకాంక్ష వేగవంతమగును.

క॥ కావున నిత్యానిత్యం
బే వివరింపంగవలయు పేశలమతియై
యావెనక కొదువ మూడును
వేవే సమకూరు వెంటవెంటనె కణకన్ 227

అర్థాలు : పేశలమతియై= సమర్థుడై, కణకన్= పూనికతో

భావము : కావున నిత్యమైనది, కానిది యేదో విచారించి నేర్పుతో తెలిసికొన వలయును. ఇది కష్టమైన పనియే. అన్ని బాధలను, అడ్డంకులను నిశ్చలమైన మనస్సుతో భరించినట్లయితే, తర్వాత మిగిలిన మూడును తగు ప్రయత్నము కావించిన వశమగును.

మ॥ కరపాదాదిసమస్తదేహయుతునింగా లోకనాథుఃగా
హరధాత్రాదిగసర్వజీవతతిలో నన్నన్యుగా లోకసం
భరితోత్సాహునిగా గడున్ మదిని సంభావించి నాసన్నిధే
పరమోత్కృష్టతగా దలంపుమిదియె భక్తిక్రమంబిందులన్ 228

అర్థాలు : కరపాదాదిసమస్తదేహయుతునింగా= చేతులు, కాళ్లు మొ॥ అన్ని అంగములు గల శరీరధారిగా, లోకనాథాఢ్యుగా= లోకాలకు యజమానిగా, హరధాత్రాదిసర్వజీవతతిలో= శివుడు, బ్రహ్మ మొ॥ జీవులందరిలో, అన్యుని= వేఱుగా (ఆత్మ), లోకసంభరిత= ఉత్సాహునిగా= లోకములను మోయు ఉత్సాహము గలవానిగా, పరమోత్కృష్టత= మిక్కిలి ఉత్తమమైనది

భావము : నన్ను సగుణ పరమాత్మగా శరీరధారిగా, అంతరాత్మగా, లోకములను ధరించువానిగా, నా సన్నిధి పరమపదముగా (ఉతమమైనదిగా) భావింపుము. ఇట్లు నీ భక్తిలో సగుణభావము నుండి నిర్గుణభావమును సాధింపుము.

శా॥ నాలోకంబున నస్మదీయభజనానందస్థితిన్ గాంచి నా
నాలోకైకవిహారభూరిమహిమన్ సంప్రీతితోపొంది యా
లీలాప్రాభవమే మహామహిమగా లెక్కించి సంతుష్టిచే
నీలోమాయవరించినాడవనుటే నిక్కం బహంకారమౌ 229

అర్థాలు : అస్మదీయ= నాయొక్క, నానాలోక+(ఏక)= అనేకలోకములను, లీలాప్రాభవమే= ఆటవంటి శోభ (విలాసమే)

భావము : "నా లోకమందు నన్ను భజించు ఆనందములో, లోకములన్నియు విహరించు శక్తిని సంపాదించి, ఆ సంతోషములో నుండి కూడ, ఆ ఆటయే గొప్ప శక్తియని భావించి, తృప్తి పడి, అదంతయు నీవే, నీదే అని తలంచుటయే అహంకారము. అదియే మాయ".

క॥ ఇటువంటి భేదమానస
నటనె యహంకార మనగ నలినజముఖులన్
బటుబాముల భ్రమయించెను
కటకటహంకారమహిమ గణనకు దరమే! 230

అర్థాలు : భేదమానసనటన= నిలుకడ లేని మనసు యొక్క నడవడియే, పటుబాముల= గట్టివైన కష్టముల, కటకట= ఔరా!, అయ్యో!

భావము : "ఇట్టి భేదబుద్ధియే మాయయై, దేవతలను సైతము దుఃఖములలో ముంచినది. అహంకార మహిమ వర్ణించుటకు వీలగునా?"

క॥ అరయనహంకారము దా
నికి కుదురై మానసమున నిగుడుచునుండున్
పరమజ్ఞానాజ్ఞాన
స్ఫురణనునది దెలియవినుము భూరివివేకా! 231

అర్థాలు : అరయన్= తెలిసికొనగా, కుదురై= ఉనికియై, పరమ= కడపటిదైన, జ్ఞానాజ్ఞాన= జ్ఞానము, అజ్ఞానము అనువాని, స్ఫురణ= ప్రకటనము, భూరివివేకా= గొప్పవివేకము గలవాడా!

భావము : "తర్కించి చూచినచో అహంకారము మాయకు ఉనికియై మనసున నిలిచిపోవును. ఆ పరమమైన జ్ఞానము, అజ్ఞానము అనువాని యొక్క ప్రకటనమును గుఱించి వివరించెదను. వినుమా!"

క॥ జ్ఞానాజ్ఞానవిభేదము
తానెఱుగక తెలియవశమె తత్తత్స్ఫురణం
బే నెళవులలో మనునో
జ్ఞానక్రమమెల్ల వినుము సమ్మతితోడన్ 232

అర్థాలు : తత్తత్స్ఫురణంబు= ఆ యా ప్రకటనము, నెళవులలో= తావులలో, మునుప= ముంచగా

భావము : జ్ఞానమునకు అజ్ఞానమునకు వ్యత్యాసములను తెలుసుకొనక వాని ప్రకటనము (ప్రభావము) ఏ తావులలో నుండునో ఎఱుగుట సాధ్యముకాదు. కాన జ్ఞానమును గుర్తించు విధము తెల్పెదను.

తే॥ నిర్గుణంబును సత్యంబు నిర్మలంబు
నిర్వికారంబు నిష్క్రియ నిరుపమంబు
నమితము నఖండ మద్వితీయం బచంచ
లంబు పరమంబు నగుచు బ్రహ్మంబు దనరు 233

అర్థాలు : నిర్గుణంబున్= ఏ గుణము లేనిది, నిష్క్రియ= ఏ కార్యమును చేయనిది, అమితము= పరిమితము కానిది (అనంతము, కొలువరానిది) అఖండము= విభజించుటకు వీలుకానిది, అద్వితీయంబు= దానిని బోలిన రెండవది లేనిది, అచంచలంబు= నిలుకడయైనది, పరమంబుదానికావల ఏమియు లేనిది.

భావము : బ్రహ్మము అనునది గుణము లేనిది నిజమైనది. మలినము లేనిది. మార్పులేనిది. క్రియ లేనిది. సాటిలేనిది. కొలువరానిది, విభజించుటకు వీలులేనిది, అట్టిది మఱియొకటి లేనిదై, నిలుకడయైన కడపటిదియై, విలసిల్లును. గుణము లేనిది అనగా ఏ ఒక్క గుణము చేతను కట్టబడనిది. ఎట్టి కర్మఫలము అంటనిది. కనుక నిర్మలము. నిర్వికారమనగా ఉద్రేకములు అతిరేకములు లేక శాంతముగ నుండునది. క్రియ గుణ సంబంధము కనుక నిర్గుణ స్థితిలో క్రియారాహిత్యము. పోలిక లేనిది. దేశము, కాలము అను పరిమితులకు లొంగనిది. అంతట నిండియున్నందున చలించుటకు అవసరము, అవకాశము లేనిది. సత్యము సర్వాధారము కనుక దానిని వెదకుచు పోయిన చివఱకు మిగులునది బ్రహ్మమట్టిది.

సీ॥ ఆనిర్గుణాత్మను లేనిదియై యనా
దియును ననిర్వాచ్యమయిన యట్టు
యవ్యక్తమన త్రిగుణాత్మకమై తోచు
నదియు బ్రకృతియన నజ్జగతియు
నగునందు జీవులు నణురూపములను మై
నంపుటుం డను కాంచనంపురజము

వలె నుండు వినుపూర్వవాసనాపరిపక్వ
కాలంబునను సత్త్వగతిదనర్చి

తే॥ మాయయన నొప్పు దర్పణప్రాయమగుచు
నందు ప్రతిబింబితంబైన యాత్మ యీశ్వ
రాఖ్య దనరెను సర్వజ్ఞతాదిగుణము
లలర సగుణత్వమన నొప్పు నతివిభూతి 234

అర్థాలు : అనిర్వాచ్యము+అయిన= లక్షణములను వర్ణించుటకు వీలుకాని, అవ్యక్తము+అయిన= ప్రకటము కాని, త్రిగుణ+ఆత్మకము+ఐ= మూడు గుణములను కలిగినదిగా, రజము= పొడి, పూర్వవాసనాపరిపక్వకాలంబున= గతానుభవముల సంస్కారములు ఫలించు వేళ

భావము : ఏ గుణమును ఆత్మలో లేకున్నను, దాని ఆరంభమెప్పుడో తెలియని, వర్ణింపరాని, అవ్యక్తము అనుబడు మూడు గుణములు కలిగి ప్రకృతి యనబడు మైనపు ముద్దలకు బంగారుపొడి అంటినట్లు వాసనలు ఫలించు వేళ, మాయ యను పేరుతో నుండును. అది అద్దము వంటిది. దానిలో నీడవలె ఆత్మయుండి, ఈశ్వరుడను పేరుతో సర్వజ్ఞుడై, గుణములు కలిగి యుండును. ఇది తొల్లిటి నిర్గుణ బ్రహ్మయొక్క విభూతి, లేక ప్రకటనమే.

విశేషాలు : త్రిగుణాలు 1. సత్త్వము, 2. రజస్సు, 3. తమస్సు ఈ పై వర్ణనలో రజోగుణోద్రేకము గల మహత్ తత్త్వము, హిరణ్యగర్భుడు, ప్రసక్తులు ఇక్కడ వచ్చు ప్రశ్న నిర్గుణబ్రహ్మములో సగుణప్రకృతి ఎట్లు ఉన్నది? సగుణ ప్రకృతి అందు అప్రకటమై యున్నది. కనుకే ఇది నిర్గుణబ్రహ్మకు అతిరేకమైన విభూతిగా చెప్పబడినది. కనుక గుణములున్నను, అందేయొకటిగాని అతిశయింపక సమతౌల్యమున నున్న స్థితి నిర్గుణము. ఈ సమతౌల్యము నుండి అతిరేకమున ప్రకృతి తొలుత సూక్ష్మస్థితిలో ఏర్పడినది.

సీ॥ వీక నాయీశ్వరాలోకనంబున మాయ
సత్వాంశమున నాకసంబు గలిగె

నాకాశసత్త్వాంశ ననిలంబు జనియించె
నవిలసత్త్వాంశచే నగ్ని గలిగె
నగ్నిసత్త్వాంశచే నప్పులు జనియించె
నప్పుసత్త్వాంశచే నాయె ధరణి
యివి సూక్ష్మభూతంబు లిందభ్రసత్త్వాంశ
నెసగ జన్మించె శ్రోత్రేంద్రియంబు

తే॥ అనిలసత్త్వమున త్వగింద్రియంబు గలిగె
నగ్నిసత్త్వాంశ నేత్రేంద్రియంబు గలిగె
అప్పుసత్త్వాంశ జిహ్వేంద్రియంబు గలిగె
నవని సత్త్వాంశఘ్రాణేంద్రియంబు గలిగె 235

అర్థాలు : వీకన్= విజృంభించి, సత్త్వాంశమున= సత్త్వగుణ భాగమువలన, అనిలంబు= గాలి, అప్పులు= నీరు, అభ్ర= ఆకాశము, శ్రోత్ర+ఇంద్రియంబు= చెవి, త్వక్+ఇంద్రియంబు= చర్మము, జిహ్వ+ఇంద్రియంబు= నాల్క, ఘ్రాణ ఇంద్రియంబు= ముక్కు

భావము : ''ఈశ్వరుని చూపు సోకగా, మాయ విజృంభించెను, మాయలో ఒక భాగము నుండి ఆకాశము, దాని నుండి గాలి, దాని నుండి నిప్పు, దాని నుండి నీరు, దాని నుండి భూమి, ఇట్లు సూక్ష్మ భూతములు ఏర్పడినవి. వీని నుండి వరుసగా, ఆకాశాంశ నుండి చెవి, గాలి నుండి చర్మము, అగ్ని నుండి కన్ను, నీరు నుండి నాలుక, భూమి నుండి ముక్కు అను జ్ఞానేంద్రియములు ఏర్పడినవి. ఈ విషయమును వేదాంతశాస్త్రము పంచతన్మాత్రులుగా వర్ణించినది. ఇది పంచభూతముల, వాని గుణముల ప్రకటన క్రమము. ఇవి సూక్ష్మస్థితిలోనివే''.

క॥ జ్ఞానేంద్రియంబులివి యా
యేనిటు సత్త్వాంశముల జనించెను దెలియం

గా నంతఃకరణము నా
లైన మనశ్చిత్తబుద్ధ్యహంకారములై 236

అర్థాలు : ఏను= ఐదు

భావము : ''ఇవి ఐదును జ్ఞానేంద్రియములు. మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము, అను నాల్గిటితో అంతఃకరణమేర్పడినది. ఇది లోపలి పరికరము''

విశేషము : మనస్సు అనునది జ్ఞానేంద్రియముల ద్వారా గ్రహించు అంతరింద్రియము, సుఖదుఃఖములను అనుభవించునది. చిత్తమనునది ఆలోచించు అంతరింద్రియము, బుద్ధి అనునది మనస్సుతో గ్రహించి, చిత్తముతో యోచించిన విషయమున మంచి చెడులను వివేకించి కర్తవ్య నిర్ణయము చేయును. ఈ మూడును మనస్సు చేయు పనులు, ఈ పనులను బట్టి ఈ పేర్లు కల్గినవి. ఆహంకారము వ్యక్తిగతమైన స్పందనము.

సీ॥ ఈశ్వరాలోకన నెనసి నభోరాజ
సాంశను వాగింద్రియము గడంగె
పవనరాజసమున పాణీంద్రియము నగ్ని
నెనయు రజోంశపాదేంద్రియంబు
పాథో రజంబున బాహ్యేంద్రియంబయ్యె
నిలరాజసమున గుహ్యేంద్రియంబు
నగు నివి కర్మేంద్రియము లైదు వీటి ర
జంబునప్రాణపంచకముగలిగె

తే॥ నవియు ప్రాణ మపానంబు వ్యానమును ను
దానమును సమానము నైదుప్రాణములును
మరియు నింద్రియదశకంబు మనసు బుద్ధి
జేరి పదియేడు లింగశరీరమయ్యె 237

అర్థాలు : ఎనసి= ప్రసరించి, నభోరాజసాంశను= ఆకాశపు రజోగుణాంశమున, పాణి= చేయి, బాహ్య+ఇంద్రియము=పాయువు, గుదము, గుహ్య+ఇంద్రియము= ఉపస్థ, జననేంద్రియము

భావము : "ఈశ్వరుని చూపు సోకి ఆకాశపు రజోగుణాంశలో వాక్కు, వాయువు యొక్క రాజసమున, చేతులు, అగ్ని యొక్క రాజసమున పాదములు కలిగినవి. నీటి రజోగుణాంశలో పాయువు (గుదము) అను విసర్జనేంద్రియమైనది. భూమి రాజసమున జననేంద్రియమైనది. ఇవి ఐదును కర్మేంద్రియములు. వీని రజోగుణాంశలో ఐదు ప్రాణములేర్పడినవి. అవి ప్రాణము. అపానము, వ్యానము, ఉదానము, సమానము. మఱియు వీనితో, ఐదు జ్ఞాన, ఐదు కర్మ ఇంద్రియములతో మనస్సు, బుద్ధి, కలిసి 17 తత్త్వములతో లింగశరీరము లేక సూక్ష్మశరీరము ఏర్పడినది".

సీ॥ ఆభూతములు తామసాంశలు సమముగా
పంచి సగము కడనుంచి కొదవ
సగములు నాలుగంశలు చేసి తనుగాక
కడనాల్గుసగములకలయ గలప
పంచీకరణపంచకృతంబైన
భూతపంచకమున బొడమియొప్పె
బ్రహ్మాండమందు లోపల చతుర్దశభు
వనములు చతుర్విధక్రమము లైన

తే॥ భూతసంఘాతములు గ్రామములును మొదలు
స్థూలసూక్ష్మశరీరప్రసూతి యిట్టు
లగును రెంటికి కారణమైన కతన
నరయ నజ్ఞానమై కారణాంగమయ్యె **238**

అర్థాలు : కడన్= ప్రక్కన, కొదవ= మిగిలిన, పంచీకరణపంచకృతంబైన= ఐదుగా చేయుట యను ప్రకియవలన ఐదైన, భూతసంఘాతములు= ప్రాణులు, గ్రామములు= ఇతర వస్తువులు, ఓలిన్= క్రమమున, కతన= కారణమున, కారణ+అంగము+అయ్యె= కారణ భాగమయ్యె, లేక కారణము అను అంగముగనైనది.

భావము : "తన్మాత్రలు సూక్ష్మములు. వానినుండి స్థూల సృష్టి జరిగిన క్రమమే పంచీకరణము. ఈ ప్రక్రియలో, పంచభూతములను (సూక్ష్మ), ఒక్కొక్క దానిని రెండు భాగములు చేసి, ఒక భాగము నట్లే యుంచి, మిగతా సగమును నాలుగు భాగములు చేసి, అట్లేయుంచిన ప్రతి భూతార్ధమునకు ఒక్కొక్క 1/8 భాగము కలిపి స్థూలము చేయబడును. కనుక స్థూల భూతము లైదింటిలోను స్వాంశ 1/2 మిగత నాల్గిటి 1/8 కలిసి 1/2 యగును. ఇట్లు సూక్ష్మస్థూల ప్రకృతులకు అజ్ఞానము కారణమైనది".

ఉ॥ ఇందుల బ్రహ్మవిష్ణుగిరిజేశ్వరు లంతరసృష్టి నైపుణిన్
జెందినవారు వారి దగ జేరి భజించిన వారిలోకముల్
పొందుట చిన్నకాపురముబో నిది తానొక పెద్ద కాపురం
బందుటగాక మాయ విడనాడుటలే దిట మౌనిశేఖరా! **239**

అర్థాలు : అంతరసృష్టి= లోపలి సృష్టి(సూక్ష్మ సృష్టి)

భావము : "ఈ సృష్టిలో బ్రహ్మ, విష్ణువు, శివుడు అనువారు అంతరసృష్టికి చెందినవారు. వారికి భక్తులై సేవించిన వారు వారి వారి లోకములను మరణము తర్వాత పొందుదురు. దాని అర్థము ఈ స్థూలప్రకృతి అనబడు చిన్న కాపురమును విడిచి ఇంతకంటె పెద్ద సంసారమున పడుటే యగును. అంతమాత్రమే తప్ప మాయనుండి తప్పించుకొనుట కాదు, నారదా!" ఈ స్థూలము కంటె సూక్ష్మమే మఱింత విశాలము, దుస్తరము అని భావము.

క॥ ఆయజ్ఞానంబే కద
మాయావిద్యలు ననంగ మాయగనాత్మ
చ్ఛాయే యీశ్వరు డనగా
నాయాత్మచ్ఛాయ జీవుడాయె నవిద్యన్ **240**

భావము : ''మాయ, అవిద్య అనునవి ఆ అజ్ఞానమే. ఆ మాయలో ఆత్మయొక్క ప్రతిబింబమే ఈశ్వరుడు. ఆతడే జీవుడు''.

విశేషాలు : అజ్ఞానమనునది జ్ఞానములేని స్థితి మాత్రమే కాదు. తనంత తాను జ్ఞానమును పొందలేని స్థితి కూడ. ఇది బుద్ధియొక్క జడత్వము. అవిద్య యనగా జీవాత్మ పరమాత్మల ఏకత్వము నెఱుగలేనితనము. ఇది సత్వరజస్తమోగుణముల స్వరూపము. దీనికే భ్రాంతి, మాయ, ప్రకృతి, అవ్యక్తము, అక్షరము, ఆకాశము, కారణము, తమస్సు, మహాసుప్తి, శక్తి, లయము అను పేర్లు కూడ కనబడుచున్నవి.

క॥ ఈరీతి భేదసృష్టికి
కారణ మజ్ఞానమనుట కమలభవాదుల్
ఘోరతరాగాధపుసం
సారాంబుధిలోన వెడలజాలరు సుమ్మీ 241

భావము : ''ఈ ద్వంద్వ ప్రకృతికి అజ్ఞానము కారణమనుట ఇందులకే. ఈ లోతు తెలియని భయంకరమైన సంసారము అను సముద్రమునుండి బ్రహ్మ మొదలైన దేవతలు కూడా బైటబడలేరు''.

విశేషము : భేదసృష్టి కార్యము, కారణము అను భేదము, నిజమునకు ప్రతికార్యము వేఱొక కార్యమునకు కారణమును, ప్రతి కారణమును మఱొక కారణమునకు కార్యమును, శృంఖలగా సాగునదే ఈ సంసారము లేక ప్రకృతి.

శా॥ ఆయజ్ఞాననియుక్తమానసమె బ్రహ్మాండంబు పిండాండ మి
ట్లై యీసర్వజగత్ప్రపంచమును నిత్యంబట్ల కల్పింపుచున్
పాయంజాలని మోహపాశముల సంబంధించి భేదోక్తి దా
నాయాత్మన్ కడుగమ్మె దేహమును దానేయిట్లహంకారమై 242

అర్థాలు : అజ్ఞాననియుక్తమానసమె= అజ్ఞానముచే నియోగింపబడిన మనస్సే, నిత్యంబు+అట్ల= శాశ్వతమైనట్లు, పాయ చాలని= విడువలేని

భావము : ''అజ్ఞానముచే వర్తించు మనసు బ్రహ్మాండము(విశ్వము) పిండాండము (జీవము) అనెడి రూపములతో నుండు సర్వజగత్తును శాశ్వతముగా తలంచుచు, విడువలేని మమతతో ''నేను, నాది''? అను అజ్ఞానమనెడి తాళ్ళచే బంధింపబడి శరీరమున గల జీవాత్మను కప్పివేయుచున్నది. అజ్ఞానమే అహంకారమై వర్తించును''.

క॥ ఇదియజ్ఞానాహంకృతి
గదియును మది నిజము కల్ల కల్లనిజంబై
యిదిలెస్స తెలియనేర్చిన
గద నిజమే నిలిచి కల్లకల్లైపోవున్ 243

భావము : ''అజ్ఞానమనెడి అహంకారముచే మనస్సున కలిగెడి నిజము కల్లయనెడి భ్రమను తెలుసుకొన్నపుడే నిజమేదో నిలుచును, కల్ల అను భ్రమ నశించును''.

విశేషము : లెస్స తెలియనేర్చిన అనుటలో, వినికిడి వలనను చదువువలనను తెలిసి నట్లనిపించును కాని ఆ తెలియుట ఏ మాత్రము ఉపకారికాదు. ఆచరణ లేనప్పుడు 'అబద్ధమాడరాదు' అని తెలిసి లాభమేమి? ఆ జ్ఞానము ఆచరణలో సుప్రతిష్ఠితము కావలెనని భావము.

ఉ॥ నేనును నాది యన్న క్రియ నిక్కముగా వివరించి యందులో
తానె నిజంబొ యాతనది తథ్యమొ లెస్సగ జన్మజన్మముల్
మేనును పుత్రదారధనమిత్రజనంబుల జింతచేసి తా
నైన నిజంబె పట్టు విడనాడుట యొప్పు నసత్యమంతయున్ 244

భావము : ''నేను, నాది అన్న భావనలోని నిజమేపాటిదో వివేకించి, అసలు 'నేను' ఎవరో గుర్తించి, అసత్యమైన ఈ మాయ పట్టునుండి తప్పించుకొనుట సరియైన మార్గము''.

అసలైన 'నేను' ఆత్మయని అది ఈ అశాశ్వతమైన శరీరముతోను శరీర సంబంధులతో చేరి ఎన్నో జన్మలెత్తుట, ధనాదులను సంపాదించుట అనునది అశాశ్వతమైన భ్రమయనియు, దానికి కారణము అజ్ఞానమనియు తెలియవలెను. కనుక తాను (జీవుడు) నిజమను భావనను వదలవలెను. తాను జీవుడు నిజము కానే కాదు (అశాశ్వతము).

క॥ ఇది యజ్ఞానాహంకృతి
యిది సద్గురుకరుణగాని యెసగదు మదికిన్
విదితముగ నట్లు దోచిన
నదియె కదా ముక్తి యనగ నమలచరిత్రా! 245

భావము : "మలినము లేని నడవడిక కలవాడా! ఈ అజ్ఞానమనెడి అహంకారము, సద్గురువు కరుణ లేకపోయిన మనస్సునకు గోచరము కాదు. స్పష్టముగా మదిలో స్వరూపము తెలిసికొన్నచో (గురు కరుణచే) అదియే కదా ముక్తి యనబడును". మదిలో అహంకారమున్నది. గురుబోధచే తెలిసిన వెంటనే అది గురు కరుణచే మాయమగును. చిత్తమున తానే బ్రహ్మయను జ్ఞానోదయము కలుగును. అదియే ముక్తి.

ఆ॥ ముక్తి ముక్తి యనగ మొనసిన వేఱొక్క
స్థలముగాదు తత్పదమునకర్థ
మఖిలబంధముక్తి యది ముక్తి యనదగు
ముక్తి దేహిగామి మునివరేణ్య 246

అర్థాలు : మొనసిన= కలిగిన, దేహి= శరీరము గలవాడు

భావము : "ముక్తి యనగా "ఒక చోటును వదలిపెట్టి పోవుట" అని ఆమాటకు అర్థము కాదు తగుల్కొనిన సంకెళ్ల నుండి విడిపించుకొనుట అని అర్థము. అనగా వ్యక్తిని శాసించు ఉద్రేకములు, భ్రమలు ఇవన్నియు మనస్సునకు సంబంధించివని. శరీరముతోనే అవన్నియు నశించును. ముక్తి జీవునకు

కాదు మనస్సునకు. పూర్వజన్మ కర్మల వలన అనుభవింప వలసిన ఫలము నుండి మఱియు ప్రస్తుత జన్మబంధముల నుండి విడుదల. యోగులు సర్వబంధ ముక్తిని "విముక్తి" అని ప్రశంసింతురు".

ఆ॥ ముక్తి యనగ విషయములు చచ్చియమనస్క
సుఖముజెంది యితరసుఖము మఱచి
యుండు టదియు జీవ్య ఖండపూర్ణబ్రహ్మ
మునకు బద్ధుడగుట మునివరేణ్య! 247

అర్థాలు : విషయములు= ఇంద్రియాసక్తులు, అమనస్క= మనస్సునకు సంబంధించని, జీవి+అఖండపూర్ణబ్రహ్మమునకు= పూర్ణమునుండి విడివడిన జీవుడు పరిపూర్ణమైన బ్రహ్మము అనబడు విశుద్ధచైతన్యమునకు.

భావము : "ఇంద్రియాసక్తులతో తదితర బంధములు తెగి, మనస్సంబంధము లేని సుఖమును పొందుచు తదితర సుఖములను మఱచిన స్థితికే మోక్షమని పేరు. ఇట్టి సుఖమే జీవుడనుభవించు అఖండ బ్రహ్మానందము".

మనోవ్యాపారములను స్తంభింపజేసినప్పటి సుఖము అమనస్క సుఖము. దీనికి ముందుగ సాధించవలసినది జ్ఞానేంద్రియ విషయములైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల ఆకర్షణ మాసిపోవు స్థితి. ఇది ముక్తి. తాను జీవినను ధ్యాస, తన జీవావరణ స్పృహ, రెండును తొలగగా అఖండ పూర్ణబ్రహ్మానందము కలుగును.

ఆ॥ నేతినేతివాక్యనియతిని సర్వంబు
విడువబడుటె ముక్తి కడు నిజంబు
నదియె సుమ్ము జ్ఞప్త్యహంకృతియనగాను
నదియులేదు నిర్గుణాత్మయందు 248

అర్థాలు : నేతి (న+ఇతి)= కాదు అని, నియతిని= నియమములో, జ్ఞప్తి, అహంకృతి= చైతన్యము యొక్క అహంభావము.

భావము : 'ఇది కాదు', 'ఇది కాదు' అనుచు బాహ్యలౌకిక, ఆంతర మానసిక వస్తు భావానుభవములనన్నింటిని విడచుటే ముక్తి. ఈ విడుచు క్రియకే జ్ఞప్త్యహంకారమని పేరు, అనగా 'నేను' 'దీనిని' 'విడుచుచున్నాను' అను స్పృహ. ఇది కూడా లేని స్థితి నిర్గుణాత్మస్థితి, అనగా నిర్గుణమై యున్న 'నేను' యొక్క స్థితి.

విశేషము : 'నేతి నేతి వాక్యనియతి'. వేదాంత శాస్త్రములోని 'నిషేధావధిస్సాక్షీ' అను వాక్యానుసారము, జీవి ఈ ప్రపంచమను ఇంట జొరబడిన దొంగ. తనకు కావలిసిన సత్యవస్తువును వెదకుటలో ప్రాపంచిక వస్తువులను, ఆంతరంగిక విషయములను, ఒక్కొక్కటిగ చూచి 'ఇదికాదు, ఇదికాదు' అని వదలుట. ఇట్లు వదలిన దాని ఫలముగ మిగులునదేదో అది సాక్షి, అనునదియే నేతి నేతి వాక్యనియతి.

"కేనోపనిషత్తు" ఇచ్చట స్మరింపదగియున్నది. కేనోపనిషత్తు : -34 శ్లోకాలు. నాలుగు ఖండాలు. దీనికి తలవకార ఉపనిషత్తు అనిపేరు. సామవేదానికి చెందినది. గురుశిష్య సంవాద రూపమైన పరబ్రహ్మమేదను ప్రశ్నకు సమాధానమిది.

క॥ **జ్ఞానాజ్ఞానములంద**
జ్ఞానమున ప్రపంచమెల్ల జనియించును సు
జ్ఞానంబున నశియించును
జ్ఞానమును నణగునఖండసంపూర్ణమునన్ **249**

భావము : "జ్ఞానము, అజ్ఞానము అను రెండింటిలో అజ్ఞానములో ఈ ప్రపంచము పుట్టుక, సుజ్ఞానములో నశింపు. ఇక జ్ఞానముకూడ, అఖండమైన (విడివిడిగా భాగింపరాని) సంపూర్ణత్వభావము ఉదయించగానే దానిలో అణగిపోవును".

జీవునకు స్వస్వరూప జ్ఞానము లేనిది అజ్ఞానదశ. బాహ్యాంతర ప్రపంచము ఆ దశలో అనుభవమునకు వచ్చును. కాని స్వస్వరూప జ్ఞానము

కలుగగనే అది రూపు మాసిపోవును. ఈ భావము స్థిరము కాగనే జ్ఞానము-జ్ఞాని అను స్పృహ కూడ అణగిపోవును.

శా॥ **ప్రారబ్ధంబుల మర్త్య తిర్యగమరవ్రాతాఖిలస్థావరా**
కారంబై కలజీవకోటులు గడున్ గల్పావసానంబులన్
తీరంజాలని కర్మవాసనలచే తీరంబులేనట్టి సం
సారాంభోనిధి మున్గుచుం దనువులే సౌఖ్యంబుగా నెంచుచున్ 250

అర్థాలు : ప్రారబ్ధంబు= ఈ జన్మలో అనుభవించక తప్పని కర్మఫలము, అమర్త్య= మానవులు కాని, తిర్యక్= చరములు, అమర= దేవతలు, స్థావర= అచరములు, అవసానంబుల్= ముగిసినప్పుడు

భావము : "ఎన్ని కల్పములైనను, సృష్టిలోని మానవులు, దేవతలు, ప్రాణులు, అప్రాణులు, అన్నియు యుగాంతములలో కర్మవాసనలు వదిలించుకొన కుండా మోక్షమును పొందలేవు".

విశేషాలు : కర్మ, అనగా, జీవి చేయు పని. ఇది శరీర కర్మ, వాచక కర్మ, మానసిక కర్మ అను మూడు విధములు. మఱియొక కోణములో విహితకర్మ (చేయదగిన కర్మ), నిషిద్ధకర్మ (చేయరాని కర్మ), అకర్మ (కర్మ కాని కర్మ). కర్మలకు ఫలము సిద్ధము. ఈ ఫలము, అనుభవించినది నశించగా, క్రొత్తగా సిద్ధమగుచు జన్మజన్మల వెంట ప్రోగుపడి సంచితకర్మ సిద్ధమగును. ఇందు తత్క్షణమే అనుభవించవలసినది ప్రారబ్ధము (అనగా, ముందుగనే లభించియున్నది, లేక ప్రారంభమైనది.). ఇది క్రైస్తవులు చెప్పుచుండు పురాతనపాపము (ఒరిజినల్ సిన్) భావమునకు సమానమైనదనవచ్చు.

కల్పము : దీనినే బ్రహ్మకల్పమనియు అందురు. బ్రహ్మదినము, ప్రళయము అనికూడా పేరు. ఇదియే కల్పాంతము.

వాసనలు : సంస్కారములని కూడ అందురు. జీవితములో జీవి అనుభవించిన విషయ సుఖములు, దుఃఖములు ఇత్యాదుల జ్ఞాపకములు. ఇవి

మూడువిధములు : 1. లోకవాసనలు, 2. దేహ వాసనలు, 3. శాస్త్ర వాసనలు. ఇవి జ్ఞానము(అనగా స్వస్వరూపజ్ఞానము)నకు ఆటంకములని శాస్త్రవచనము.

ఆ॥ పుణ్యపాపకర్మములు చేసి తద్వాస
నావశముల స్వర్గనరకలోక
వాసులగుచు సుఖమువలె దోచు దుఃఖముల్
కటికి దుఃఖసమితి గమ్మి కాల్ప 251

అర్థాలు : కమ్మి= చుట్టుముట్టి

భావము : "నానా విధముల కర్మలు చేసి, ఆ జ్ఞాపకముల కారణముగా స్వర్గనరక లోకములను చేరి అక్కడ స్వర్గమున సుఖము వలె కన్పట్టు దుఃఖములను, కఠినములైన దుఃఖములు చుట్టుముట్టి బాధింపగా అనుభవించి"

విశేషము : పుణ్యము : ధర్మసమ్మతమైన పని. పాపము : ధర్మసమ్మతము కాని పని. పుణ్యము వలన స్వర్గప్రాప్తి, భోగానుభవము. పాపము వలన నరకప్రాప్తి, దుఃఖానుభవము.

ఉ॥ పుట్టుచుగిట్టు చెందు గడముట్టని కర్మములట్లుసేయుచున్
మట్టగు మిశ్రకర్మముల మానవజన్మము లెత్తుచోట లో
బుట్టిన సాత్త్విక ప్రబలపుణ్యవిశేషత భక్తి గల్గి యే
పట్టున నాశమంద కది బ్రస్ఫుటమై కడునిర్మలాత్ముడై 252

అర్థాలు : కడముట్టని= నశింపని, గిట్టుచు= చచ్చుచు, మట్టు+అగు= కుదురైన, సాత్త్వికపు= సత్త్వగుణ సంబంధియైన, ఏపట్టున= ఏ రీతిగను,

భావము : "జన్మకారణమైన పుణ్యపాప కర్మములను చేయగల నరజన్మ లభించక ముందు జీవుడు పశుపక్షికీటాది జన్మలలో కర్మము చేయుచునే

యున్నాడు. అట్లు జన్మజన్మల నెత్తిన తర్వాత నరజన్మమున గూడ మిశ్ర కర్మలను చేసి, స్వర్గ నరకములను అనుభవించి మరల జన్మపరంపరలో బడి ఎప్పుడో ఒకప్పుడు జీవునిలో సాత్త్విక లక్షణము ప్రబలి, దాని వలన భక్తి కుదురుకొని జన్మల వెంట అదికూడ బలపడుచు, అట్లు జీవి నిర్మలుడు, పవిత్రుడగును".

పుణ్యపాపముల మిశ్రకర్మ మానవునకు మాత్రమే. తదితర ప్రాణులకు కర్మయున్నది కాని పుణ్యపాప వివక్ష లేదు. దీనిని బట్టి మిశ్ర కర్మయైనను కాకున్నను కర్మవలన వాసనలేర్పడి, వాని వలన మరల జన్మలు కలుగుట, ఆపై మానవ జన్మ. ఇట్లు స్పృహాభేదము జన్మభేదకారణ మగుచున్నది.

ఉ॥ కాయమనిత్యహేయములు గట్టిగ ద్రోచి సమస్త భోగముల్
హేయము దుఃఖమై కణగు టెంతయురోసి శమాదిషట్కసం
శ్రీయుతుడయ్యు మోక్షమును జెంద నిజాలయవహ్నికీలలున్
కాయము సోకి కాక జలకాంక్షను గ్రుమ్మరు నట్ల నార్తుడై 253

అర్థాలు : కణగుట= పూనుట, నిజ+ఆలయవహ్నికీలలన్= తన నివాసమైన ప్రపంచములోని అనుభవములే నిప్పుమంటలై, కాకన్= వేడిమికి,తపనకు,

భావము : "శరీరము అనిత్యము, హేయము అని గాఢవిశ్వాసముతో దాని విచారమును ప్రక్కన బెట్టి, అనగా భోగములను దుఃఖకారణముగ తెలిసి, రోత కలిగి, శమదమాది గుణములను సాధించి, మోక్షమును సాధించవలయును అనెడి తపన కలిగి ఎండలో మాడుచున్నవాడు నీటికై తపించునట్లు దీనుడై వేదనతో తిరుగుచు"

క॥ తాపమున వెడలి గురురా
ట్ఛ్రీ పాదము లాశ్రయించి చిరతరభక్తిన్
దా పరిచర్యలు సేయుచు
నాపూర్ణునివలన ముక్తుడగు నిక్కముగాన్ 254

భావము : "ఒక సద్గురువు పాదములను ఆశ్రయించి స్థిరమైన భక్తితో సేవించి ఆ పూర్ణ పురుషుని కరుణ వలన ముక్తుడగును".

వ॥ అనిన విని భగవంతునికి నారదుం డిట్లనియె 255

విశేషము : పూర్ణ పురుషుడనగా పరమాత్మ తానే అనెడి భావము కల భక్తుడు.

భావము : నారదుడు భగవంతునకు ఇట్లనెను.

క॥ జ్ఞానముచే నజ్ఞానము
దానెటుల నశించు గురుడు తథ్యముగాగన్
జ్ఞానం బెటువలె దెలుపును
జ్ఞానంబును దెల్పునట్టి సద్గురుడెవడో 256

భావము : "జ్ఞానముచే అజ్ఞానము ఎట్లు నశించును? గురుడు జ్ఞానమును గుఱించి సమర్థముగా బోధించు పద్ధతి ఏది? జ్ఞానము గుఱించి బోధించు సద్గురువు లెవరో కదా!"

అజ్ఞానమనగా జ్ఞానము లేకపోవుటకాదు, అని ముందే చెప్పబడినది. కనుక వెలుగు రాగనే చీకటి పోవును అను సూత్రమిక్కడ వర్తించదు. అందుచే ఈ ప్రశ్న. అంతటి మహావిషయమును గ్రహించు శిష్యుడు యోగ్యుడే యైనను, బోధించు విధము గూడ మహిమాన్వితమే కావలయును. లేకున్న లౌకికునకు మనసునకు చేరదు. అంతటి సమర్థుడైన గురుని గుర్తించుటెట్లు?

క॥ నీకన్న గురుడు వేఱొక
లోకంబున నున్నవాడె లోకాధిపతీ!
నాకన్న దీనహృదయుడు
నేకరణి గణించిచూడ నెందును గలడే 257

భావము : "లోకనాయకా! నీకంటె గొప్పవాడైన సద్గురువు వేఱొక లోకమందు లేడు. నా కంటె దీనుడైన, ఆర్తుడు ఏ విధముగా చూచినను లేనే లేడు".

శా॥ మూలాజ్ఞానమువల్ల సర్వమును సంభూతంబులై యందులో
నీలోకంబులు లోకపాలకులునై యిందంతకున్ రాజవై
పాలింపన్ సృజియింపగా నణప నీభారంబునుం దాల్పగా
శ్రీలక్ష్మీధవ నీవె కారణమునై సిద్ధంబు వర్తింపగన్ 258

అర్థాలు : అణప= నశింపజేయగా,

భావము : "ఓ లక్ష్మీపతి! మూలమైన అజ్ఞానము వలన విశ్వములన్నియును ఏర్పడి, అందు అనేక లోకములు, లోకపాలకులు కలిగి, దీని నంతటిని పాలించు రాజు నీవే అగుచు, ఈ సృష్టిస్థితిలయములకు నీవే కారణమై వర్తించుచున్నావు కదా!"

శా॥ నీమాయాబ్ధిజగంబు లెల్లను గడున్ నిర్మగ్నమైయుండగా
నీమాయన్ విడనాడలేక పశువుల్ నిన్నేభజింపంగ నా
నీమాయం గడ ద్రోయుటెట్లు లగునో నీవే కదా మాయ వి
ట్లేమార్గంబున మాయవైన నిను మాయింపం దగుం దెల్పవే 259

అర్థాలు : పశువుల్= జీవులు, మాయింపదగున్= జయించవచ్చును

భావము : "నీ మాయ యనెడి మహాసముద్రములో లోకములు మునిగియుండగా, నీ మాయను తప్పించుకొనలేక జీవులు నిన్ను సేవించు చుండగా, నేను మాత్రము నీ మాయను ఎట్లు నెట్టివేయగలను? నీవే మాయ కదా! నిన్ను ఎట్లు జయింపవచ్చును?"

క॥ కమలజుడు సృజనసేయగ
కమలావర! నీవుపోషకత్వముసేయన్
తమమున శివుడు హరింపగ
క్రమమున నీక్రియల నీవె కారణమగుచున్ 260

అర్థాలు : కమలజుడు= బ్రహ్మ, కమలావర= లక్ష్మీపతి, తమమున= తమోగుణోద్రేకమున

భావము : "నీవే క్రమముగా కారణము కాగా బ్రహ్మ సృష్టించును. నీవు పోషింతువు. శివుడు హరించును".

శా॥ వర్ణింపంగ ను నిన్నుమాయ వని త్రోవన్ శక్యమే మాయినిన్
కర్తృత్వాదిగుణుండవౌ టెఱుఁగుదున్గాదా యటన్నంత లో
కర్తృత్వాదిగుణాత్మకంబగు నహంకారంబు గల్గెం నిజం
బార్తత్రాణపరాయణా! వరద! మాయాతీత! రక్షింపవే 261

భావము : "దీనజన రక్షక! మాయను మించిన వాడా! వరములు ఇచ్చువాడా! నీవు మాయ గలవాడవు. మాయవు కూడ. కాని నీవు లేవని త్రోసివేయుట అసాధ్యము. 'నీవే కర్తవు భోక్తవు అని నేనెఱుగుదును'. అని తలంచినంతలోనే నాకు కర్తృత్వాది గుణములకు మూలమైన అహంకారము కలిగినది, స్వామీ! రక్షింపవే"!

తే॥ అనిన గరుణార్ద్రచిత్తుడై యమ్మునీంద్రు
చిత్తమున నున్నభీతి దా చిత్తగించి
వెరవ కిట్టివివేకంబు విహితమగును
నేక వస్తువు కీర్ష్యగా నెందు గలదు 262

అర్థాలు : చిత్తగించి= తెలిసికొని, వెఱవకు= భయపడకు, వివేకము= సత్యాసత్య నిర్ణయము, విహితము= గొప్ప మేలు, ఈర్ష్య= ద్వేషము

భావము : అనిన నారదుని మాటలు విని లక్ష్మీపతి కరుణతో అతని మనసులో నున్న భయము నెఱిగి "భయము లేదు. ఇప్పుడు నీకు కలిగిన వివేకము గొప్ప మేలు చేయును. ఉన్నది ఒకే వస్తువైనప్పుడు అసంతృప్తికి (ద్వేషమునకు) తావులేదు" అనెను. సత్యమొక్కటే. ఏకత్వమే తప్ప బహుళత్వము సత్యము కాదు అను అద్వైతతత్త్వము నెఱిగిన వానికి ద్వేషము, అసంతృప్తి, భయము ఇత్యాది అనేక వికారములు కలుగుటకు అవకాశము ఉండదు.

ఉ॥ సర్వముదానె యంచను విచారము జ్ఞానముతో నహంకృతిన్
సర్వము దా నిజంబగుట సర్వము దానగు టెట్టులన్నచో
సర్వము లేనిదయ్యు మఱిసర్వము రజ్జునబుట్టినట్లుఁగా
సర్వజగత్ప్రపంచ మిది సత్తున బుట్టె బ్రసన్నలీలచేన్ 263

అర్థాలు : రజ్జు= త్రాడు, సత్తు= (సత్) ఉనికి, పరబ్రహ్మ, ప్రసన్నలీలచేన్ = నిర్మలమైన విలాసముచే

భావము : "సర్వము నేనే అను భావము కలిగినప్పుడు అహంకారము కలుగును. ఈ అహంకార భావముతో మాయ చేరును. అనగా, ఉపాధియు తానే అనెడి సంకుచిత భావము. దానితో 'నేను-నీవు-వాడు' అను విభక్త జ్ఞానము కలుగుటచే మఱియు సర్వము తానెట్లగును? అని ప్రశ్న. సర్వము లేదు, ఉన్నది నేనే. ఐనను యదార్థమైన త్రాటిలో లేని పాము ఉన్నట్లు (రజ్జుసర్పభ్రాంతి) సత్(సత్తు) అను ఉనికిలో భ్రాంతియై జగత్తు ఏర్పడినది.

క॥ కననయ్యె విషువ్యాప్తౌ
యను ధాతుస్థితి విష్ణు వన వ్యాపకుడౌ
టను విష్ణువాత్మకర్థము
గనుకను దగ విష్ణుమాయగా నెగడొందెన్ 264

అర్థాలు : విషువ్యాప్తౌ= వ్యాప్తియందు విష్ అను ధాతువు (క్రియా శబ్దమూలము) నుండి, నెగడొందెన్= ప్రయోగము కలిగినది.

భావము : "విను నారదా! సంస్కృతములో శబ్దములన్నియు ధాతువుల నుండి పుట్టినవే. అందు, విష్ అను ధాతువు నుండి 'విష్ణు' శబ్దమేర్పడినది. దీని అర్థము, సర్వవ్యాపియని. సర్వవ్యాపి ఆత్మ మాత్రమే కనుక 'ఆత్మమాయ' అని 'విష్ణుమాయ' కు అర్థము. కాగా, త్రిమూర్తులలోని విష్ణువు పేరే ప్రసిద్ధమైనందునను, పై జెప్పిన వ్యుత్పత్త్యర్థము జనబాహుళ్యమునకు తెలియకపోవుట చేత గూడ, దానికి విష్ణుదేవుని మాయ యను అర్థము

వాడుకయైనది. నిజమునకు విష్ణుదేవుడు తానే మాయా కల్పితమైన లోకములోనివాడు. విష్ణులోకాధిపతి. ఈలోకము లోకాధిపతి కూడ అందఱితో బాటు విష్ణుకల్పాంతమున మాయలో గలిసి పోవువారే.

క॥ మనసే సర్వము గావున
మనసే భక్తుండు వేల్పు మరి యాఫలముల్
మనసే యనుభవి గావున
మనసింతకు జాలి సుఖియు మరి దుఃఖి యగున్ 265

అర్థాలు : వేల్పు= దేవత, అనుభవి= అనుభవించువాడు (భోక్త)

భావము : మనసే, అన్నింటికి కారణము. మనసే భక్తుడు. మనసే దేవత. ఆ భక్తికి ఫలము అనుభవించునది మనసే. కనుక మానవులలోని సుఖి, దుఃఖి మనస్సే, శరీరము కాదు, ఆత్మకాదు. అదియే ఇహపరములు, స్వర్గనరకములు అనుభవించును.

వ॥ మఱియు సజాతీయవిజాతీ యస్వగతభేదరహితమైన నిర్గుణ పరబ్రహ్మంబునందున జాతీయ విజాతీయస్వగతభేదాత్మకంబైన ప్రపంచంబు సజాతీయ విజాతీయ స్వగతభేదయుక్తంబుగా నుండుటంజేసి నామరూపంబులులేని నీకు నామరూపవికారంబులును సజాతీయ విజాతీయ స్వగతభేదరహితుండవైన నీకు సజాతీయ విజాతీయ స్వగతభేదంబులజ్ఞానంబులం బ్రసక్తంబగుటవలన సజాతీయాది విరహితంబై బ్రహ్మంబు నేనె యని యనుట యదిదురహంకారంబుగాదు గావున సద్గురూపదేశక్రమంబున శ్రవణమనన నిధిధ్యానలు సేయుచున్నంగాని యీదేహేంద్రియాది ప్రపంచంబు నీవుగానిది నీవనుటకు నెటువలె దృఢనిశ్చయమై యున్నయదియో యట్టులనే నిజంబైన బ్రహ్మంబు నే ననుట దృఢనిశ్చయంబయ్యెడు పర్యంతంబు శ్రవణ మననోత్తరంబున నిధి ధ్యానంబుసేయవలయుం గావున

నవశ్యంబును నేనె బ్రహ్మంబన వలయు ననిన భగవంతునితో నారదుండిట్లనియె 266

అర్థాలు : సజాతీయ= తన జాతికి చెందిన, విజాతీయ= తన జాతికి చెందని, స్వగత= తనలోనిది.

భావము : "నిర్గుణ పరబ్రహ్మములో నేను, నాది, నాదికాదు అను భేదభావము లేదు. ఐనను వానిలో ఈ భేదబుద్ధి గల ప్రపంచమున్నది. కనుక నామ రూపములు లేని జీవికి నామరూపములు, నేను-నాది-నాదికానిది అను భేదములు ఏర్పడుచున్నవి. ఇది అహంకారము కాదు. ఈ భేదము ఉన్నంతవఱకు బ్రహ్మము తానే యను భావము జీవికి కలుగదు. కనుక సద్గురువు నాశ్రయించి, సుశిక్షితుడైన గాని జీవికి తాను కానట్టి ప్రపంచము తానుగ తోచుట తొలగి తానైన బ్రహ్మము తానే యనుట స్థిరముకాదు. ఈసత్యము సుస్థిరమగు నంతవఱకు నియమపూర్వకముగా విహిత మార్గమున సాధన కావించవలెను, అనిన నారదుడిట్లనియెను.

విశేష వివరణ : శ్రవణము,మననము, నిధిధ్యాసము ఇవి ధ్యానయోగ శిక్షణలో భాగములు. జ్ఞానార్జనలో చేయవలసిన క్రమము. శ్రవణమనగా వినుట. మననమనగా పదే పదే చింతన చేయుట. ఈ రెండు మెట్ల ఫలితార్థముగ నిధిధ్యాసనము, అనగా దృఢమైన ధ్యానము. ఇవి ఆత్మ జ్ఞానమును సంపాదించుటకు ఎక్కవలసిన మూడు మెట్లు.

శ్రవణము : బ్రహ్మ స్వరూప మెట్టిదో తెలియజేయు వేదాంత వాక్యములను పలుమాఱు వినుట. అభిప్రాయము గట్టి పడుటకు ఆఱు విధములైన పద్ధతులు కలవు. వానికి షడ్విధములని పేరు.

మననము : విన్న వేదాల, వేదాంత సారముల మాటి మాటికి ఋషుల సూక్తములను వల్లించుచు చింతన చేయుట.

నిధిధ్యాసనము : శత్రువులైన కామక్రోధాదులను నెట్టివేసి "అహం బ్రహ్మాస్మి" అను భావము మనస్సులో గట్టిపడుటయే నిరంతర భగవద్ధ్యానము వినుటచే సంశయములు తొలగును. మననము వలన చెడ్డ ఆలోచనలు నశించును. బ్రహ్మమందు మనస్సు నిలుకడగా నుండును.

సీ॥ మొనయు సజాతీయమును విజాతీయము
స్వగతభేదముల వివరములు దెల్పు
జాతియెయ్యదియొ సజాతి యెయ్యదియొ వి
జాతియెయ్యది మరి స్వగత మెద్ది
తద్భేద మేరీతి తద్రహితులనెట్టు
లాత్మ నేనగు టెట్టు లరసిచూడ
సర్వంబు నీవని సర్వంబుగావని
పలికితిరది యెట్లు భవవిదూర

తే॥ సర్వమును నేనయైన విచారమేల
లేని సర్వంబు గడ ద్రోయగా నదేమి
నామ రూపంబు లవిలేని నాకుతెలియ
నాత్మ నేనను టిది నామ మగుటకాదె **267**

అర్థాలు : మొనయు= కలుగు, ఏర్పడు, భవవిదూర= సంసారబంధము లేనివాడా!

భావము : భవవిదూర! సజాతీయ, విజాతీయ స్వగతములనగా నేమి? జాతి యననేమి? ఈ భావము లేని ఆత్మలో ఈ భావమెట్లు కలుగుచున్నది? అన్నీ నీవే యనియు, ఏదియు నీవు కావనియు చెప్పితివి కదా. ఇందలి వైరుధ్యమునకు పరిష్కారమేమి? అన్ని నేనైనచో, విచారమునకు తావెక్కడ? నేను తప్ప మఱేమియు (ఈ ప్రపంచమంతయు) లేదంటిరి కదా, లేని దానిని త్రోసివేయుట ఎట్లు సాధ్యము? ఆత్మకు నామరూపములు లేవు కదా,అట్టి ఆత్మలో నేను అను జ్ఞానము కలిగినచో ఆత్మకు నామము కలిగినట్లే కదా? ('నేను' అను దానికి 'ఆత్మ' అని పేరు పెట్టినట్లే కదా?)

క॥ ఈసంశయంబు లన్నియు
భాసురమతి లెస్సదెలియ బలుకుము దయతో
దాసుల యిడుమల తీర్పుట
మీసంకల్పంబుగాదె మిథ్యానటనా **268**

అర్థాలు : ఇడుమలతీర్చుట= బాధల నుండి రక్షించుట

భావము : "ఓ కపట నటనా! నాకు కలిగిన ఈ అనుమానము తీరునట్లు చక్కగా చెప్పుము. భక్తుల బాధల నుండి ముక్తులను చేయుట కదా మీ ఉద్దేశము".

వ॥ అనిన నారదునకు సవిస్తరంబుగా దెలుపం దలంచి భగవంతు డిట్లనియె **269**

భావము : పూర్తిగా నారదునికి విషయములన్నింటిని తెల్పుటకు భగవంతుడు ఇట్లనెను.

సీ॥ వినుము సజాతీయమును విజాతీయము
స్వగతభేదంబుల సరణిలెస్స
అయ్యాత్మకును సజాతీయవిజాతీయ
ములును స్వగత భేదములును లేవు
అయ్యనాత్మకు సజాతీయవిజాతీయ
ములు స్వగతభేదములును గలవు
అద్వితీయుడు సచ్చిదానందరూపి స్వ
యంప్రకాశుండును నగుట కతన

తే॥ నాత్మయందున దెలుపంగ నలవిగాద
నాత్మయంచు వచింతు దృష్టాంతముగను

నిశ్చలత లెస్స విను మని నెమ్మితోన
ననియె భగవంతు డక్కలహాశనునకు 270

అర్థాలు : అద్వితీయుడు= రెండవది లేనివాడు, ఒకే ఒక్కడు, సచ్చిదానంద రూపి (సత్+చిత్+ఆనంద)= ఉనికి,జ్ఞానము, ఆనందము అను మూడును రూపమైన వాడు, స్వయంప్రకాశుండును= తనంత తాను వెలుగు (ప్రకటమగు) వాడును, కతన= కారణము వలన, దృష్టాంతముగను= ఉదాహరణముగ, కలహాశనునకు= జగడములను పెట్టుటే భోజనముగా గల నారదుడు, అనాత్మ= ప్రకృతి.

భావము : ''నారదా! నీ వడిగిన ప్రశ్నలకు సమాధానములు శ్రద్ధగా వినుము. ఆత్మకు భేదాలు లేవు. అది అద్వితీయత, సచ్చిదానందత, స్వయంప్రకాశత అను లక్షణములు కలది కనుక పరమాత్మయందు నీ ప్రశ్నలకు ఉదాహరణములతో సమాధానము చెప్పట అసాధ్యము. అనాత్మలో, అనగా ప్రకృతిలో (ఆత్మ కానిదానిలో) చెప్పెదను''.

తే॥ తరువునకు సజాతీయంబు తరువుసుమ్ము
తరువునకు విజాతీయంబు గిరియు శిలయు
నలరు స్వగతంబు పత్రపుష్పాదికంబు
గాన నివియు ననాత్మకు గలవు నిజము 271

అర్థాలు : తరువు= చెట్టు, గిరి= కొండ, శిల= ఱాయి, పత్రపుష్పాదికంబు= ఆకులు పువ్వులు మొదలైనవి.

భావము : ''చెట్టుకు సజాతీయము (తన జాతిది) చెట్టు. చెట్టుకు విజాతీయము (తన జాతిది కానిది) కొండ, ఱాయి, చెట్టుకు ఆకులు, పూలు మొ॥ స్వగతము (తనయందున్నవి). ఇవన్ని ఆత్మకానిదైన ప్రకృతి లోనివి.

సీ॥ సత్తైన యాత్మకు సత్తు సజాతీయ
మగుగాని చెప్పంగ దగ దసత్తు
సత్తునకును బ్రతిసత్తునుం దగదెల్ప
నద్వైతమునకును హానివచ్చు
నద్వైతహానికినై కదా ప్రతిసత్తు
జెప్పగూడదటంచు చెప్పవలయు
నద్వైతమును దెల్పు నాగమాంతములకు
వైయర్థ్యమగు నిందువలన మఱియు

తే॥ సత్తుదాను స్వయంప్రకాశంబు గాన
నట్టిస్వయంప్రకాశమునైనట్టి సత్తు
తానెయగు గానిమరియు భేదంబులేదు
గాన సత్తొక్కటని చెప్ప గానువలయు 272

అర్థాలు : ప్రతిసత్తు= సమానమైన సత్తు (సత్), అద్వైతము= రెండవది లేనిది, హాని= విరోధము, ఆగమాంతములు= ఉపనిషత్తులు, వైయర్థ్యము=అర్థము లేని దగుట, ఉపయోగము లేనివగుట.

భావము : ''సత్తు ఆత్మయే. ఆత్మకు ఆత్మ (సత్తుకు సత్తు) సజాతీయము. కాని అనాత్మ (ప్రకృతి) కాదు. అనాత్మకూడా సత్తే (ఆత్మయే) అన్నచో, ఆత్మ అనాత్మయే అనినట్లగును. కనుక అది పొసగదు. ఆత్మ, ప్రకృతి సమానము కావు. అనాత్మ కానిది, ఆత్మతో సమానమైనది మఱియొకటి ఉన్నదన్నచో, ద్వైతమే తప్ప అద్వైతము దర్శనము కాదు. కేవలము, అద్వైతవాదమునకు ఎదురుదెబ్బ తగులునని ప్రతిసత్తును అంగీకరించకుండుట కాదు. ఉపనిషత్తులు కూడ అద్వైతమునే చెప్పుచున్నవి కదా, అవి కూడ అర్థరహితములై పోవును. ఇదికాక, సత్తు స్వయంప్రకటన శక్తి కలది. దాని ప్రకటనమే కదా ప్రకృతి. అట్టిచో, మఱియొక సత్తు (ఆత్మ) ఉన్నదనినట్లు, 'మఱియొక ప్రకృతి ఉన్నది' అనినట్లే కదా! అట్లనుటకు ఆధారమే లేదు. కనుక సత్తు (ఆత్మ) ఒక్కటే యను అద్వైతతత్త్వమును అంగీకరింపవలయును''.

తే॥ అరయరెండవసత్తుస్వయంప్రకాశ
మగుటలేకున్ననే మాయనదిమఱొకట
దాప్రకాశించి ప్రతియుగాదగు నటన్న
దానికిని స్వప్రకాశత తగదుగాన 273

భావము : స్వప్రకాశతలేనిది, మఱియొక దానినుండి ప్రకాశతను పొందినది, ప్రతిసత్తు (సత్తునకు సమానమైనది) కావచ్చుననుట పొసగదు.

క॥ ప్రకాశము దానికి కిన్నిడి
గాక యది సత్తని చెప్పగానగు మదియున్
ప్రకాశముదానికి నిడక
దానిన్ సత్తుగను చెప్పదగుగా నచ్చేన్ 274

భావము : "మాయకు స్వప్రకాశతను గూర్చియే అప్పుడు దాని సత్తని చెప్పవలెను. స్వప్రకాశతతో యున్నట్లు తలంపక దానిని "సత్తు" అనుట తగునా?" స్వయంప్రకాశత అంటని మాయని 'సత్తు' అనుట ఏమాత్రము తగదని భావము.

క॥ ఈరీతి బరంపరముగ
వారక వచియింపగను నవస్థాదోషం
బారోపణమగు గావున
నేరీతిని సత్తువొకటే యన నయ్యేన్ 275

అర్థాలు : వారక= బెదరక, నిశ్చయముగా

భావము : "ఇట్లు బెదురులేక సత్తు అసత్తు ఒకటే అనుటచే అవస్థాదోషమును కలిగించుట యగును. కనుక సత్తు ఒక్కటే కదా!".

విశేషము : అవస్థాదోషము అనగా ఒకదోషమును ఖండించినంతనే మఱియొక దోషము తలయెత్తుట. ఆరోపణము అనగా లేనిదానిని ఉన్నట్లు చెప్పుట. ఇంత బాధపడి సత్యమైన అద్వైతమున ద్వైతమును ఏల ఆరోపించవలెను?

క॥ ఎయ్యెడ సత్తునకు సజా
తీయము లేకున్నగానితెలియంగ విజా
తీయము లేదా యన విను
మయ్యదియును కలదొ లేదొ యరయుదము దగన్ 276

అర్థాలు : ఎయ్యెడ= ఎటైన, అరయుదము= తెలిసికొందము

భావము : "ఎటైనను సత్తునకు (ఆత్మకు) సమానమైనది మఱియొకటి లేదు అన్నది నిజమే యైనను, విజాతీయము తనకు సమానము కాని వేఱొకటి కూడ లేదా? అన్నట్లయిన, ఉన్నదో లేదో ఆలోచించి తెలిసికొందము".

తే॥ సత్తునకు విజాతీయమసత్తు గాదె
గాన నదియు నసత్తనగాదు లేని
దౌట నదియు విజాతీయ మవుట యెట్లు
సత్తునకు విజాతీయ మేసరణి లేదు 277

భావము : "సత్తునకు అసత్తు విజాతీయమే కదా అనుట కూడ పొసగదు. ఏలన, అసత్తు (ఉనికి లేనిది) అసలు లేనిదే కదా, అసలే ఉనికి లేనిది తానే ఉనికి యైనదానికి సమానము కాదు సరికదా విజాతీయము అనుటయు కుదురదు". (చెట్టుకు కొండ విజాతీయ మనుటలో చెట్టువలె కొండయు వేఱుగా ఉన్నదే, లక్షణములు మాత్రము విపరీతము, కనుక సరిపోవును.)

క॥ స్వగతము లేదా యన్నను
యొగినిర్గుణమునకు స్వగతమొనగూడునటే
సగుణంబునట్లన్నను
తగ నారదు డనియె కంసదమనునితోడన్ 278

అర్థాలు : ఒగి= లెస్సగా, ఒప్పిదముగా, ఒనగూడు= కలుగు, ఏర్పడు, కంసదమనునితోడన్= కంసుని చంపిన కృష్ణునితో

భావము : "సత్తునకు విజాతీయము లేదని తేల్చినను, మఱి స్వగతము గూడ లేదా అన్నట్లయితే, ఆత్మకు స్వగతము (తనకు చెందినది) మాత్రము సగుణమున ఉన్నట్లు ఉండుటకు వీలులేదు కదా!" అని కృష్ణుడు అనగా నారదుడిట్లనెను. ప్రకృతి (అనాత్మ) సగుణము. ఉదాహరణమునకు చెట్టు ప్రకృతిలోనిది. ఆకులు, పూలు ఇత్యాదులు చెట్టుకు స్వగతము. ఇట్లే ఇతరము లందును స్వగతము. ఇది ఆత్మ విషయమున కుదురదు.

క॥ మరి యాత్మనిర్గుణంబని
అరయంగా మీరె సచ్చిదానందు డనన్
మరిసత్తును చిత్తానం
దరసమ్మున గుణములగుట తథ్యము గాదే 279

భావము : "ఆత్మ నిర్గుణమంటిరి, సచ్చిదానందుడనియు అంటిరి. మఱి ఆ ఆనందములో సత్తు, చిత్తు అనునవి గుణములే కదా!"

క॥ గుణములుగలయాత్మను ని
ర్గుణమని యిటులానతియ్యగూడునె యన్నన్
గుణములవలె భేదంబై
కనుగుణమే యేకరూపు గణుతింపంగన్ 280

భావము : "ఇట్లు సగుణమైన ఆత్మను నిర్గుణము అనిన ఎట్లు పొసగును"? అని నారదుడడుగగా, "గుణములవలె మూడు భేదములుగా కనబడుచున్నను పరిశీలింపగా నిజముగ అది ఒక్కటే", అని కృష్ణుడు సమాధానమిచ్చెను.

ఆ॥ అనిన యేకరూపమగుటెట్లు కరపాణి
హస్తములువచించునట్టిరీతి
పలుకుభేదమైనపర్యాయపదములే
యేకరూపమెట్టులీశ్వరేశ! 281

భావము : నారదుడు ఇట్లనెను "ప్రభువులకు ప్రభువా!" కరము, పాణి, హస్తము అను పదములు ఒకే వస్తువును బోధించునవే, ఐనను పలుకు భేదమే కదా! అవి సమానార్థకములు. గుణములు గల ఆత్మ ఒక్కటే ఎట్లగును?

ఉ॥ ఇన్నిటికర్థభేదములు వెల్వడియుండగ నేకరూపముల్
చెన్నుగ వచ్చు నేగుణములెట్టులగావివి సర్వజీవకో
ట్లన్నియు బ్రహ్మమౌట దగనన్నియు నీత్రితయాన్వితంబులే
కొన్ని యనిత్యముల్ మఱియు కొన్ని జడంబులు కొన్ని దుఃఖముల్ 282

అర్థాలు : చెన్నుగ= ఒప్పుగ, త్రితయ= మూడు, జడంబులు= అచేతనములు,

భావము : "దేనికి దానికే అర్థములు వేఱుగా చెప్పబడియున్నప్పుడు, అన్నీ ఒకటే అనుట సరికాదు కదా. జీవులన్ని బ్రహ్మమే కనుక, సత్, చిత్, ఆనందము మూడును అన్ని జీవులలో నున్నవేయగును. ఐనను వీనిలో కొన్ని అశాశ్వతములు, కొన్ని అచేతనములు, కొన్ని దుఃఖ స్వరూపములు".

క॥ ఈరీతిని బ్రహ్మమునకు
నారయ స్వగతంబు భేదమడరగ రాదే
వారిజలోచన యన్నను
నారదునకు కృష్ణు డనియె నయ మేర్పడగన్ 283

భావము : "ఇట్లు బ్రహ్మమునకివి స్వగత భేదములే అనవచ్చును కదా కృష్ణా!", అని నారదుడనగా కృష్ణుడు ఇట్లు వచించెను.

ఆ॥ గుణములేని యాత్మకును సచ్చిదానంద
ములును గుణముగాను బలికితీవు
అయిన వినుము సచ్చిదానందములకు దృ
ష్టాంతమును వచింతు నమరమౌని! 284

భావము : "ఓ దేవముని నారదా! గుణము లేని (నిర్గుణమైన) ఆత్మకు సత్ చిత్ ఆనందములు గుణములే కదా యంటివి. సచ్చిదానందములకు ఉదాహరణములను వచించెదను వినుమా!"

తే॥ జ్వలనునందున లోహితోష్ణప్రకాశ
లేకరూపంబుగానున్న వీకవినుము
యందు నాత్మకుసచ్చిదానందములు స్వ
రూపమగుగాని గుణముల ప్రోవుగాదు 285

అర్థాలు : జ్వలనునందున= అగ్నిలో, రోహిత+ఉష్ణ+ప్రకాశ= ఎఱ్ఱదనము, వేడిమి, వెలుగు, ప్రోవు= కుప్ప

భావము : "అగ్నికి ఎఱ్ఱదనము, వేడిమి, వెలుగు అను మూడు ఒకే రూపమున నున్నవి. ఇట్లే ఆత్మకు సత్ చిత్ ఆనందములు స్వరూపమే కాని వేర్వేఱు గుణముల కుప్పకాదు."

వ॥ అనిన నారదుండు ఇట్లనియె 286

భావము : అనగా నారదుడు ఇట్లు అనెను.

సీ॥ ఎయ్యెడలను సజాతీయవిజాతీయ
ములును స్వగత రిక్తముగ నజుండు
మొనయ నెట్టులు భేదములు గల్గుగాన స
జాతీయముఖ్యదోషములు లేక
సత్తైన యాత్మయే స్వప్రకాశానంద
మాయాత్మ నీవుగా కన్యమగునె
అన్యంబులేని నీకాసజాతీయాద్య
నాత్మధర్మములు డాయంగ గలవె

తే॥ కావునను సజాతీయాదికరహితుడవు
సర్వమైనప్రపంచం బసత్తుమిథ్య

యగుట నెవ్వరు శేషించి రరసిచూడ
నీవె కావటె పూర్ణత నిలిచినావు 287

అర్థాలు : డాయంగ= చేరగా, మిథ్య= సత్యముకాని దృశ్యము, భ్రాంతి,

భావము : స్వగతములు లేకుండా సజాతీయ విజాతీయములుండునా? అనకుము. దానిలో భేదములుండక తప్పదు కనుక సజాతీయము మొ॥ దోషములు లేని సత్తైన ఆత్మయే స్వప్రకాశమైన ఆనందము. అట్టి ఆత్మవు నీవు గాక వేఱెవ్వరు? వేఱేదియు లేని కేవలుడవైన నీలోనికి సజాతీయాది ప్రకృతి ధర్మములు చేరలేవు. కనుక ప్రపంచము అసత్యదృశ్యము. దీనిని చూడగలవారు నీవు గాక ఎవర్వును లేరు. నీవు సర్వపూర్ణుడవు".

తే॥ ఇట్టు నీయందు లేనిదేహేంద్రియాద్య
మగు ప్రపంచంబు రజ్జువునందు లేని
పామువలెదోచు నట్టివిభ్రాంతి కెవ్వ
రైరధిష్ఠాన మీవుగా కన్య మగునె 288

అర్థాలు : అధిష్ఠానము= ఆధారమైన మూలపదార్థము.

భావము : "ఇట్లు త్రాడులోని పామును చూచినట్లు, నీలో లేని దేహము, ఇంద్రియములు మొ॥ వానిని చూచుట "భ్రాంతి" అన్నట్లయిన, ఈ భ్రమకు నీవేకదా ఆధారమైన కారణము. వేఱొకటి కలదా?"

ఉ॥ కానని దెల్ల నీవె యగుగాక మఱొక్కటి వేఱుగల్గునే
యైనను నాది నభ్యసన మప్పు డనాదిగ గల్గినట్టి య
జ్ఞానమువల్లచక్షువు లసత్యము రీతిని దోచునట్టి యీ
లేని జగంబు భావ మెడలింపగ నీవది గాదనం దగున్ 289

అర్థాలు : అభ్యసనము= అలవాటు,వాడుక, ఎడలింపగ= తీసివేయగా,

భావము : "కనుక ఇదంతయు నీవే. ఐనను నాకు రోజు అలవాటైన అజ్ఞానము వలన కన్నులకు సత్యమువలె తోచును. ఈ మిథ్యా ప్రపంచమును, నీవు కాదని నిరాకరించుట తగును."

ఉ॥ లేనిది లేదుగా మదిని లెస్సగదోచుటయెంతదాక దా
మానసమందు దోచిన సమస్తము దానిలనామరూపముల్
లేనిదిగా దలంచినను లీనములయ్యు స్వరూపమాత్రమై
కానగ వచ్చు నంతయును గానగవచ్చుముముక్షువుల్ దగన్ 290

అర్థాలు : లెస్సగా= స్పష్టముగా, లీనములయ్యు= కలిసిపోయి.

భావము : "లేనిదేమో లేదు, కాని ఉన్నట్లు మనసుకు తోచును. ఇది ఎంతవఱకు ఇట్లు సాగును? ఒకవేళ తన మనసులో తోచినదంతయు లోకములో నామరూపాలు లేనిదని అనుకొన్నను, వస్తువులు మాయమైకూడ, సూక్ష్మముగా గోచరించును, ముముక్షువులు (మోక్షము కోరువారు) ఇదంతయు దర్శించవచ్చును".

తే॥ బ్రహ్మమునకును నామరూపములు లేవు
బ్రహ్మ మిట్టిది యనగ ప్రపంచగుణము
లరసి బ్రహ్మంబునకును లేవనగవలసి
పలుకవలసెను పర్యాయపదములుగను 291

భావము : "బ్రహ్మమునకు నామరూపములు లేవు. కాని వర్ణించి చెప్పవలసి వచ్చినపుడు, ప్రపంచములోని గుణములను పరికించి, ఈ గుణములు బ్రహ్మమునకు లేవనియే చెప్పవలయును. కాని వ్యవహారములో అవి పర్యాయపదములు అయినవి. అంత మాత్రముననే బ్రహ్మకు నామరూపములున్నట్లు తలంపరాదు".

వ॥ అని యెట్లన్నను అనాత్మైనట్టి ప్రపంచంబుమిథ్యయు జడంబును దుఃఖ స్వరూపంబును సగుణంబును సవికారంబును నామరూప సంకలితంబును

ననిత్యంబును నచ్యుతంబును నపరిమితంబును నానాత్వంబును పరిచ్ఛేదంబును నగుట నాత్మసత్యంబును స్వయం ప్రకాశంబును ఆనందస్వరూపంబును నిర్గుణంబునుసవికారంబును నామరూపసహితంబును నిత్యంబును నచ్యుతంబును నపరిమితంబును ఏకంబును త్రివిధపరిచ్ఛేదరహితంబును నైన బ్రహ్మంబు నీవయ్యును అనాదిసంసారంబైన ప్రపంచవాసనాబాహుళ్య ంబున నిన్ను నీవు మఱచి నీవిన్నింటితోగూడుకొని దేహేంద్రియాది ప్రపంచంబు కొంత నేనును కొంత నీవును కొంత నాదియు కొంత నీదియు కొంత తనవారును కొంతపరవారునుఅనుకొను అజ్ఞానంబున భ్రమయుటచేతను సద్గురుబోధంబున నిన్ను నీవె తెలిసికొనియును అనాది సంసక్త ప్రపంచ వాసనానువర్తనాధ్యానంబునయాదే హేంద్రియాదికంటె తానవి తోచు అధ్యాసను పరిహరించుటకు నేనె బ్రహ్మంబనని తన స్వరూపంబు తనకు దృఢనిశ్చయంబు పర్యంతంబు నిధి ధ్యాసనంబు సేయవలయు నని భగవంతుండు మఱియు నిట్లనియె 292

భావము : "ప్రపంచము, అనాత్మ మిథ్య, జడము, దుఃఖస్వరూపము సగుణము. నామరూపములు కలది. కనుక వికారము గలది. ఇది పరిణామశీలము. ఎప్పటికప్పుడు మారుచుండునది. అనేకత్వము దీని లక్షణము. ఆత్మ సత్యము, తనకు తానై ప్రకటమగునది. ఆనందమైనది, నిర్గుణము, నిర్వికారము, శాశ్వతము, మారనిది. స్థూలసూక్ష్మ కారణములనెడి మూడు విధములుగా బ్రహ్మము విభజింపరానిది. ఐనను అనాదియైన ప్రపంచముతో సంగమము వలన మైమఱచి ఈ జీవుడు ప్రపంచమే నేను, నాది ఇత్యాది భావములతో భ్రమచెందును. తర్వాత జీవుడు సద్గురు బోధనచే మేల్కొని ఆ భ్రమ తొలగిపోవు నందాక తన స్వరూపమైన పరమాత్మను ఏమఱక ధ్యానించవలెను" అని చెప్పి మరల కృష్ణుడిట్లనియె.

సీ॥ ఆత్మసన్నిధినిమాయాజన్యమై మన
సజ్ఞానకలితమైయదుద్భుతప్ర

పంచంబు సృజియించు పరమసద్గురుబోధ
సుజ్ఞానయుక్తమై సుమహితముగ
నతినిర్మలంబగునమ్మాన సోపాధి
చేతసర్వంబునశింపజేసి
మనసున దాఁగ్రీంగి మఱియెదురేమియు
లేక సంపూర్ణత నేకమయ్యు

తే॥ నెప్పుడెటువలెనట్లనై యింతయంత
యనుచు పరిమితమును లేక నంతరంబు
గాక నిండిన యాత్మకు కాలదేశ
వస్తుముఖ భేదములు లేవు వరమునీంద్ర! 293

అర్థాలు : సన్నిధి= సమక్షమున, మాయాజన్యమై= మాయలో పుట్టి, అమ్మానస ఉపాధిచేత= ఆ మనస్సు అనబడు ఉపాధి ఆధారముచేత, అంతరంబు= మధ్యదూరము, ఎడము,

భావము : "ఆత్మముంగిట మాయలో పుట్టిన ప్రపంచమును మనస్సు సృష్టించును. మరల సద్గురుని బోధవలన నిర్మలమైన ఈ మనస్సు సర్వమును నశింపజేసి, ఏకమై సంపూర్ణమగును. ఇట్లు మనస్సు చేష్టలుడిగిన ఆత్మకు కాలము, దేశము, వస్తువు ఇత్యాది పరిమితులుగాని భేదములు గాని ఉండవు".

వ॥ అనిమరియుపూర్వంబునసనాతనమునీంద్రుండుపదేశించిన మహా
వాక్యంబునుదెలిపితదర్థంబుజహదజహల్లక్షణచేతదిస్పష్టంబుగానిట్లనియె294

భావము : అని చెప్పి వ్యాసుడు ఉపదేశించిన తత్త్వమసియను వాక్యమును చెప్పి దాని అర్థమును ఇట్లు వివరించెను.

విశేషము : జహదజహల్లక్షణ : వాచ్యార్థము అన్వయము కానప్పుడు వాచ్యార్థమును విడిచి గౌణార్థమును చెప్పుట (గుణమునకు

సంబంధించినది) ఉదాహరణమునకు, "గంగాయాం ఘోషః" అను వాక్యమును 'గంగాయాం' అను శబ్దమునకు వాచ్యార్థమందు ముఖ్యమైన అర్థము, 'గంగయందు' అని యగును. అప్పుడు 'గంగలో పల్లె' అని అర్థము. "గంగలో పల్లె యుండునా?" ఇది సరికాదు కనుక, సప్తమీ విభక్తిలో నున్న 'గంగాయాం' శబ్దమునకు అప్రధానమైన అర్థము (రూఢి కానిది) అర్థము చెప్పకొనవలెను. ఈ వృత్తిని 'జహదజహల్లక్షణ' అందురు.

తే॥ తెలిపితివి మున్ను జీవేశ్వరుకభేద
మనుచు మాయకవిద్యకు నట్లయనుచు
కణక మాయనవిద్యను కడకు ద్రోయ
నీశ్వరుడు జీవుడను భేద మింతలేదు 295

అర్థాలు : కణక= పూనికతో, కడకుద్రోయన్= దూరముగా త్రోసివేయగా, తొలగించగా

భావము : "జీవుడు, ఈశ్వరుడు ఒక్కడే, భేదము లేదని ముందే తెలిసికొంటివి. అట్లే మాయ, అవిద్య అనునవి ఒక్కటే, రెండుకాదు. ప్రయత్న పూర్వకముగ, ఈ మాయను, లేదా, అవిద్యను నిరాకరించి (గుర్తించక) నెట్టివేసినట్టయితే, అప్పుడింక జీవుడు-ఈశ్వరుడు భేదము మాసిపోయి, ఇద్దఱు ఒక్కరే యని తెలియును. అనగా, వీరు వీర్వేఱుగ నున్నారను భావము మాయ లేక అవిద్యవలన ఆరోపితమని తెలియును".

మహా వాక్యాలు

యజుర్వేదము : అహం బ్రహ్మాస్మి
ఋగ్వేదము : ప్రజ్ఞానం బ్రహ్మ
సామవేదము : తత్ త్వమసి
అధర్వణవేదము : అయమ్ బ్రహ్మ

వృత్తులు : అభిధావృత్తి : లోక వ్యవహారమున గల అర్థము

లక్షణావృత్తి : ముఖ్యమైన అర్థమునకు విరోధము కలిగినపుడు ముఖ్యార్థము విడువక దానికి సరిపోవు మఱొక అర్థమును గ్రహించుట. ఇవి రెండు విధములు. ఉదాహరణ జహత్‌లక్షణ : గంగ యందు గొల్లపల్లె. గంగ యొడ్డున నున్న గొల్లపల్లె

అజహత్‌లక్షణ : ముఖ్యార్థమును విడువక గుణమునకు సంబంధము గల అర్థమును గ్రహించుట. ''శోణో ధావతి'' రక్తవర్ణము పరుగెత్తుచున్నది. ఎఱ్ఱదనము గుణవాచకము. అది పరుగెత్తదు. కాని ఎఱ్ఱదనముగల గుఱ్ఱముపరుగెత్తుచున్నదని పదమును జోడించుటచే అర్థము కుదిరినది.

తే॥ ఇంటిలోపల కుండలో నెనసియున్న
యాకసము భేదమైయుండి నట్ల యుండి
యిల్లుకుండయుగడ ఱ్రోయ నింటిలోను
కుండలోనున్న గగనంబు కూడినట్ల 296

అర్థాలు : ఎనసి= లభించి, కూడినట్లు= కలిసిపోయినట్లు

భావము : ఇంటిలో కుండలోని నీటిలో కన్పించు ఆకాశము మఱొక ఆకాశము వలె తోచినను, నిజమునకు ఆకాశము ఒక్కటే. కుండలోనిది దాని ప్రతిబింబము. కుండనీరు ఆ నీడ కాధారము. ఆ ఆధారము తొలిగినప్పడు బింబ ప్రతిబింబములు ఒక్కటిగ కలిసిపోవును. కుండ పగిలిపోగా ఇంటిలోని ఆకాశము, కుండలోని ఆకాశము కలిసిపోయి ఒక్కటే అగును''.

తే॥ చెఱువులో నీరు మరచుట్టు చేతికుండ
ముంచినను నీరు వేఱు కల్పించి నట్లు
నగును మరచెంబుకుండయు నొగిలి పోవ
నీర మెప్పటివలెనుండు నిండి కలసి 297

అర్థాలు : నొగిలపోవ= ఎడమైనచో(తొలగిపోయిన)

భావము : ''చెఱువులోని నీరే పొలములో, చేతికుండలో ఉన్నది. వేఱుగా తోచినను అది చెఱువులోనిదే. పొలము, చేతి కుండలోని నీరు వెలుపలికి వచ్చినట్లయితే అదొక్కటియే అగును. వేఱను భేదభావమునకు ఉపాధులే (ఆధారములే) కారణము.

క॥ ఆ రీతిని మాయావి
ద్యారోపము లణగి యీశ్వరారోపణమున్
వారనిసంసారము జీ
వారోపణమణగి యొక్కయాత్మయె నిలుచున్ 298

అర్థాలు : వారని= ఎడతెగని, ఆరోపణము= లేని దానిని ఉన్నట్లుగ కన్పింపచేయుట

భావము : ''అదే విధముగ, మాయ అవిద్య అను ఆరోపణములు తొలగి (నశించి)నప్పడు, ఈశ్వరుడు, జీవుడు అను ఆరోపిత భావములు నశించి ఆత్మకేవలమై యుండును''.

విశేషము : అవిద్య యనగా, జీవిలోని ఆత్మ (నేను), పరమాత్మ (పరమము, చరమము అయిన 'నేను') వేఱను భావము. ఇది సత్త్వరజస్తమో గుణముల స్వభావము.

ఉ॥ ఈగతి నీకు నీశ్వరున కింతయు భేదములేదు నీవ యే
లాగున నాత్మ సిద్ధము తలంపున లెస్సగజూచుచున్న నా
భాగవతోత్తముండు హరిపల్కులరీతి సనాతనాఖ్యుడౌ
యోగివరేణ్యుబోధ నిజయుక్తులునుం దలపోసి చూచినన్ 299

అర్థాలు : సనాతన ఆఖ్యుడౌ= సనాతనుడని చెప్పబడుచున్న, నిజ ఉక్తులు= తనమాటలు, తలపోసి= ఆలోచించి

భావము : ఇట్లే ఈశ్వరునకు తనకును భేదములేదు, తానే ఆత్మ, అని నిశ్చయించుకొని సత్యమును గ్రహించిన నారదుడు కృష్ణుని సమాధానములను సనాతనముని మాటలను సమన్వయించి చూచెను.

ఉ॥ నిక్కము తానె బ్రహ్మమను నిశ్చయమున్ మది దోచి భేదమే
చక్కటి గానరాక సురసంయమి కన్నులు మూసిపూర్ణతన్
బొక్కుచు నాసికాద్వయము మూసికడు న్నిరుపాధికంబునై
నెక్కొను నా స్వకీయ సుఖనీరధిదేలిమహాద్భుతాత్ముడై 300

అర్థాలు : నిక్కము= నిజము, చక్కటి= విధానమున, సురసంయతి= దేవర్షి నారదుడు, పొక్కుచు= విచారించుచు, నాసికాద్వయము= రెండు ముక్కురంధ్రములు, నిరుపాధికంబునై= ఆధారములేనిదై, నెక్కొను= సిద్ధించు, వ్యాపించు, ప్రసరించు= అతిశయించు, స్వకీయ= తనదైన, సుఖనీరధిన్= సుఖ సముద్రమున, తేలి= ఓలలాడుచు.

భావము : తానె బ్రహ్మమను భావము సత్యమని గట్టిగ తోచి, నారదుడు కన్నులు మూసికొని, పూర్ణత్వభావనలో అతిశయించి, ముక్కులు మూసికొని, శరీరము మనస్సు అను ఆధారము (ఉపాధి) తొలగి పూర్ణుడై అతిశయముగ వ్యాపించిన స్వస్వరూపదర్శన సుఖ సముద్రములో ఓలలాడుచు, మహాత్ముడై,

క॥ కనుగవ బాష్పము లొలుకగ
దనువుం బులగాంకురిత మొదవనొయ్యన దా
కనువిచ్చి లేచి హరిపద
వనజంబుల కెరగి వినయవశగతుడగుచున్ 301

అర్థాలు : బాష్పములు= కన్నీరు, ఎఱగి= నమస్కరించి

భావము : కన్నుల ఆనందబాష్పములు జాలువారగా శరీరము పులకరించగా, కన్నులు తెఱచి, లేచి, హరి పాదములకు నమస్కరించి వినయము నిండగా

తే॥ అచ్యుతానంతవాసుదేవాఖిలాత్మ!
ఆదిమధ్యాంతరహితనారాయణాప్ర

మేయభక్తానుపాలనోపాయనిర్వి
కారనిగమాంతవేద్య నిష్కపటకృష్ణ! 302

అర్థాలు : భక్తానుపాలన+ఉపాయ= భక్తులను పాలించు ఉపాయము కలవాడా!, నిర్వికార= మార్పు లేనివాడా, నిగమాంతవేద్య= ఉపనిషత్తులచే తెలియబడువాడా!, అచ్యుత= చలనము లేనివాడా, నిష్కపట= వంచనము లేని, అనంత= అంతములేనివాడా!, వాసుదేవా= వసుదేవకుమారా!, ఉనికికి కారణమైన దేవా!, అఖిలాత్మ= అన్నిటికి ఆత్మయైనవాడా!, నారాయణ= నరులకు నెలవైనవాడా!, అప్రమేయ= మితిలేని వాడా!

విశేషము : 'చ్యుతి' అనగా ఉన్న స్థానము నుండి జారుట, చలనము. కనుక 'అచ్యుత' యనగా స్థిరుడు, శాశ్వతుడు అని అర్థము. 'నారాయణ' అనగా 1. అవతారములలో మానవశరీరమును ధరించువాడు, 2. జలము స్థానముగా గలవాడు, 3. శబ్దగమ్యుడు, 4. నరులను ప్రవర్తింపజేయువాడు- అని వ్యుత్పత్తులున్నవి. 'వాసుదేవ' శబ్దమునకు గూడ 1. జగములన్ని తనయందే గల దేవుడు, 2. జగము నందంతటనుండు దేవుడు, 3. అందఱి మనసులలో నుండువాడు, 4. ప్రళయాంతమున ప్రకాశించువాడు, 5. శుద్ధమైన మనస్సులో ప్రకాశించువాడు అని వ్యుత్పత్తులు.

ఉ॥ నీవె కదయ్య పూర్ణమును నిర్గుణమున్ నిజమాత్మ సత్యమున్
నీవె కదా ప్రపంచమును నిన్నెడగా నొకవస్తు వేనియున్
భావమునందు జూడగ కణంబును లేదగు గాన నందులో
నేది వరింపభేద మగునే మఱి నీదయ రిత్తవోవునే 303

అర్థాలు : నిన్ను+ఎడగా= నిన్ను విడిచి, రిత్తపోవునే= వృథయగునా.

భావము : "ఓ దేవా! "పూర్ణము, నిర్గుణము, సత్యము నీవేకదా! ఈ ప్రపంచము కూడ నీవే. నీవు కానిది ఒక్క అణువైనను లేదు. దేనిని చూచినను అది నీవు. కానిదగునా? మఱియు నీ దయ వ్యర్థమగునా?"

క॥ ఈ తెలివిలెస్సమున్ను స
నాతనముని దెలిపినపుడు నామది దోచెన్
శ్రీతరుణీవర మరచితి
నాతెఱ గిక నెట్టులగు సనందనవినుతా! 304

అర్థాలు : శ్రీతరుణీవర!= లక్ష్మీనాథా! తెఱగు= మార్గము (జీవితము)

భావము : "ఈ జ్ఞానము మున్ను ప్రాచీనముని బోధించినపుడు ప్రకాశించినది. మఱచితిని, ఇకపై నా మార్గమెట్లుండునో! సనందమునిచే నుతింపబడువాడా తెల్పుమా!"

క॥ ఈయానందం బెప్పుడు
పాయకనిలుపంగనగు నుపాయము నాకున్
శ్రీయువతీవర! తెలుపుము
శ్రేయోన్నతపదవి నిలువజేయుము కృష్ణా! 305

భావము : "ఓ లక్ష్మీపతి! నాకు కలిగిన ఈ బ్రహ్మానందస్థితి తప్పిపోక నిల్చిపోవు ఉపాయము చెప్పుము. మేలు చేయు పదవిలో నిల్పవే కృష్ణా!" అనగా, కొండొకచో, ఏ బలముచేనైన, ఆత్మదర్శనానందము కలిగినను, అది శాశ్వతమై నిలిచి యుండుట అసాధారణమనియు, ఆ స్థితిని విశేషసాధనలచే పొందదగుననియు సూచితము.

వ॥ అని బహుప్రకారంబుల వేడుచుతన తెలివితేటపడునట్లుగా విన్నవించిన
భగవంతుండు సంతసించి నారదున కిట్లనియె 306

భావము : ఇట్లు బహు విధములుగా వేడుచు తన తెలివి తేటయైనదిగా తెల్పుచు విన్నపముచేయగా భగవంతుడు సంతసించి నారదునకు ఇట్లు వచించెను.

ఉ॥ మేలు మునీంద్ర నీ తెలివి మెచ్చితి ముక్తుడవౌదు సిద్ధమున్
మూలము ముట్టగాను నిజముం దెలియన్నిక నిందు సంశయం

బేల తరించినాడవిక నీతెలివిన్ మదిబాయకుండగా
నోలి సమాధిసేయదగునున్న నిషిద్ధ గుణంబు నంతటన్ 307

భావము : "ఓ మునివరా! మంచిది. నీ తెలివికి మెచ్చితిని. తప్పక ముక్తి సిద్ధించును. జ్ఞానమునకు మూలమైన సత్యమైన బ్రహ్మమును తెలిసికొనగలవు. సందేహములు ఏల? ధన్యుడవైతివి. నీ జ్ఞానోదయము నిన్ను వదలక నీలోనే గట్టిపడును. నీలో నిన్ను త్రోసివేయదగిన కారణములను నీవు క్రమముగా అణచివేయ వలెను (సమాధిచేయవలెను).'

క॥ ఇటుల స్వరూపము నీకున్
స్ఫుటమగుచును నింక పండిపూర్ణతవెలయన్
పటుమతి సమాధి లెస్సగ
ఘటియింపుము నిన్ను నీవె కననగు లెస్సన్ 308

భావము : "ఇట్లు స్వస్వరూపము నీకు సుస్పష్టమై, నీలో వ్యాపించి, పరిపక్వమైన, పూర్ణత్వమును సాధించుటకు, నీవు స్థిరమైన బుద్ధితో చక్కగా సమాధి స్థితుడవు కావలయును. అప్పుడు నిన్ను నీవే చూడగలవు. అనగా, ఆత్మదర్శనమగును. అదియే పరమాత్మదర్శనము".

విశేషము : సమాధి అనునది మనస్సు స్తంభింపజేయుట. కొందఱు మనస్సును నశింపజేయుట అందురు. దేనిని లేక దేని కొఱకు ధ్యానింతుమో అందులో ఐక్యమైపోవు స్థితి.

ఆ॥ నిన్ను నీవె కనుచు నిర్వికల్పసమాధి
సేయగ నమనస్కసిద్ధి యగును
అంత నిత్యమును నిరతిశయంబును, నీకు
సాధియగు సుఖంబు ప్రాప్తమగును 309

భావము : "ఆ సమాధి స్థితి వికల్పము లేనిది. దానిలో అమనస్కత కలుగును. అప్పుడు ఎడలేని, హెచ్చుతగ్గులు లేని ఆనందము, సుఖము కలుగును."

విశేషము : నిర్వికల్పసమాధి యనగా, స్వస్వరూప(ఆత్మ స్వరూప) దర్శనము వలన చిత్తవృత్తులు, (మనస్సు యొక్క చంచల ప్రవర్తనము) ఆగిపోయి, తెఱపిలేక, హెచ్చుతగ్గులు లేక, స్థిరమైన సుఖము, సంతోషము కలుగును. అమనస్కస్థితి యనగా మనస్సుతో సంబంధము లేని స్థితి. జీవులు పొందు సుఖదుఃఖములు మనస్సంబంధులు. చంచలత్వము మనోలక్షణము కనుక అవి అశాశ్వతములు. మనస్సును మూసివేసినప్పుడు కలుగునది సుఖము మాత్రమే. అది నిశ్చలము, దృఢము, స్థిరము''.

వ॥ అనిన నారదుండిట్లనియె 310

భావము : నారదుడు ఇట్లు అనెను.

క॥ నిలిపినచోటను నిల్వదు
నిలిపినయున్నట్ల యుండి నిమిషములోనన్
తలగును బహురూపంబుల
మెలగుచును సమాధి నెట్లు మెలపుదు మనసున్ 311

అర్థాలు : తలగును= చలించును, కదలును, మెలపుదు= నిలుపగలను

భావము : నారదుడు మరల ఇట్లడుగుచున్నాడు ''మనస్సు నిలిపిన చోట నిలువదు. ప్రయత్నించి నిలిపిన, ఉన్నట్లుండి తృటిలో కదలిపోవును, ఎన్నో విధముల పరుగులు పెట్టును. సమాధిని సాధించ వలెననిన మనసును నిలుపవలెను కదా, అదెట్లు సాధించగలను?''

ఉ॥ అక్కఱలేకనే తిరుగు నంటగ ముట్టగరాని చోటులన్
నెక్కొను దుర్ఘటంబయిన నీతి నికృత్యము లొందబోవు పెం
పెక్కువకొద్ది తుష్టిచనదెన్నటికిన్ ముదమింతలేదు చే
చిక్కదు పట్టబోయినను చిత్తమునిల్వ నుపాయమెట్టిదో 312

అర్థాలు : అక్కఱ= పని, ఆవసరము, నెక్కొను= నిల్చిపోవుట, నీతి కృత్యములు= వ్యాప్తి, పెంపు= పెరుగుదల, వృద్ధి, తుష్టిచనదు= తృప్తిపడదు, ముదిమి= ముసలితనము.

భావము : ''మనస్సు పోరాని చోట్లకు పోవును. నిలుపుట కష్టము. పరుగు లెక్కువ. విష్ణు సేవలు చాల కష్టము. వానికై ఉత్సాహమెక్కువ అయినను తృప్తి కలుగదు. ఆ ఉత్సాహము ఎప్పుడును బలముగ నుండును. దానికి తఱుగులేదు''.

క. **ఏగతిని మనసు నిలుపుదు**
నేగతిని సమాధిసేయ నెసగును నదియే
యోగమగు నిర్వికల్పం
బే గతియగు విస్తరముగ నెరిగింపుమనన్ 313

భావము : ''మనసును నిల్పుటెట్లు? సమాధిస్థితిని పొందుటెట్లు? అది ఏయే యోగము? నిర్వికల్ప సమాధిని సాధించుటెట్లు? వివరింపుము'', అనగా,

వ॥ భగవంతుండిట్లనియె 314

వచనము : భగవంతుడు ఇట్లు వచించెను.

చ॥ మనసును నిల్పగా దలచి మౌనములున్ హఠముఖ్యయోగముల్
వనపరివాసమింద్రియనివారణనిష్ఠ దిగంబరత్వమ
య్యనుపమమౌ వ్రతంబులును యాగములం బహుతీర్థయాత్రలున్
కనికని లేచియు న్నిలుపగానరు దాని మహత్త్వమెట్టిదో 315

అర్థాలు : హఠముఖ్య= హఠయోగము మొ॥, వనపరివాసము= అడవులలో నివసించుట, ఇంద్రియనివారణనిష్ఠ= ఇంద్రియములను జయించువ్రతము.

భావము : ''మనస్సు శక్తి ఏమో గాని, దానిని కదలకుండ ఉంచుటకు వ్రతము, హఠయోగము మొ॥ యోగములు, వనవాసము, ఇంద్రియ నిగ్రహము, దిగంబరత్వము కలవారై ఇట్లెన్నియో వ్రతములు, యాగములు, తీర్థయాత్రలు చేసినను, సాధకులు మనస్సును నిలుపలేకపోయిరి. దాని శక్తిని వర్ణింపలేము''.

విశేషము : హఠయోగము భారతీయ వేదాంతశాస్త్రమునందు పతంజలి చెప్పిన యోగశాస్త్రమున నొక భాగము. ఇది రాజయోగమున కంటె భిన్నమైనది. చాలా కష్టసాధ్యమైన భంగిమలలో రీతులలో మనస్సును నిల్పుటకు చేయు సాధన. ఉదాహరణకు, ఒంటికాలిపై నిల్చి, చేతులు రెండును పూర్తిగా పైకెత్తి, తలక్రిందులుగ నుండి, ఇట్టి భంగిమలలో నుండి యోగసాధన చేయుట హఠయోగ ప్రాశస్త్యము. ఇదియును ధ్యానమార్గమే.

చ॥ మరియు నుపాసనావశతమానసమున్ నిలుపంగ గోరిబం
ధురతరలక్ష్యభేదనియతుల్ గనుగొంచు బహు ప్రయాసచే
స్థిరముగ జేసి నిల్పి నివసించిన లక్ష్యము నామరూపముల్
పరిహరపెట్టి యాత్మ పరిపాటిగ జూతురు తత్త్వవేత్తలై 316

అర్థాలు : ఉపాసనావశత= ఒకదేవతను మంత్రజప, పూజన నిష్ఠలతో భక్తితో సేవించు మానసిక క్రియకు పూనుకొని, బంధురతరలక్ష్యభేదనియతుల్= కష్టతరమైన లక్ష్య భేదములు గల సాధన నియమములను, తత్త్వవేత్తలై= సత్యమును తెలిసికొని.

భావము : "కొందఱు ఉపాసన మార్గముననుసరింతురు. వీరు ఏదేని ఒక దేవతను బీజాక్షరయుతమైన మంత్రమును జపించు నిష్ఠబూని, ఆ దేవతా మూర్తికి పూజాది క్రియాకలాపమును నిర్వర్తించుచు, మనస్సులను నిర్మలము చేసికొని పదిల పఱచుటకు యత్నించి క్రమముగా ఆ దేవతా నామరూపాలను వదలివేసి పరమాత్మను, ఆత్మతత్త్వమును ఎఱిగినవారై దర్శించి ఆనందించెదరు."

చ॥ ఖగము మనంబు కన్నుగవకాళ్లగు రెక్కలు ప్రాణవాయువుల్
యెగయకయుండ రెక్కలు చరింపకయుండను పాదయుగ్మమున్
తగ నణగింప గల్గినను దానెటు బోవను శక్తిలేక నె
మ్మొగమున నున్నచోట గరమున్నివసించును నిశ్చలంబుగన్ 317

అర్థాలు : ఖగము= పక్షి, కరమున్= మిక్కిలి

భావము : "మనస్సు పక్షి. రెండు కన్నులే, దాని రెండు కాళ్లు. రెండు ఱెక్కలు దాని ప్రాణవాయువులు. ఎగురునప్పుడు దాని రెక్కలు కదలవు, కాళ్ళును కదలవు. కనుక ఉచ్ఛ్వాసనిఃశ్వాసలు అనబడు ఱెక్కలను బంధించి,కన్నులు మూసినట్లయితే, మనస్సను పక్షి కదలదు, ఎగురదు. అది తుష్టిగలదై నిలిపిన చోటనే గట్టిగా నిలిచిపోవును".

చ॥ ఇదియు బహుప్రయాసమను టంతియెకాని విచారసంగతిన్
గదిసిన సాధనంబగునుగాని వృథా యనరాదె యింతకున్
మదినిలుపంగనౌ సుకరమార్గము నొక్కటి నీకు దెల్పెదన్
సదమలచిత్త! మిక్కిలిని సారరహస్యము చిత్తగింపుమీ 318

అర్థాలు : సారరహస్యము= బలమైన రహస్యము

భావము : "పై జెప్పిన ప్రక్రియగూడ చాల కష్టము. ఐనను అది ఫలవంతమగు మంచి ఉపాయము. కాని, మదినిలుపుటకు సులభ మార్గము నొక్కటి నీకు చెప్పెదను. ఈ రహస్యము నిర్మలమైన చిత్తముతో గ్రహించుము".

ఆ॥ నీవు పూర్ణమైన నిర్గుణాత్మవటంచు
శ్రుతులు పాడిచెప్పువితతలీల
ముని సనాతనుండు నినుగూర్చికడు బోధ
చేసెనటుల నేను చెప్పితిపుడు 319

అర్థాలు : శ్రుతులు= వేదములు, వితతలీల= విరివియైన ఉత్సాహముతో

భావము : "వేదములు జీవుడు పూర్ణుడైన నిర్గుణమైన ఆత్మయని చెప్పినవి. పూర్వము సనాతన ముని కూడా అట్లే నీకు చాల బోధించెను. నేనింత వఱకు చెప్పినదియును అదే విషయము. ఇప్పుడు మఱొక ఉపాయమును చెప్పెదను."

చ॥ ఇటువలె పూర్ణమై మఱియు నిక్కడనక్కడగాక నిండియం
తట నెడలేకయున్న నను దప్పి వసింపగ తావుగల్గునే
యెటు చననందు నీ వగుట నెంతయు నన్నెడబాయ నేర్చునే
యెటుచన నెందునున్న నదియేనని జూచినయంత నెంచగన్ 320

అర్థాలు : నినుతప్పి= నీ నుండి తొలగి, తావు= చోటు, చనన్= పోయినను, ఏను= నేను

భావము : "ముందే చెప్పినట్లు తత్ త్వమ్, నీవు ఆత్మవు. ఆత్మ పూర్ణము. అంతట నిండి యున్నది. అనగా నీవు అంతట, అన్నిట నిండి యున్నావని అర్థము కదా, మఱి నిన్ను తప్పించి యేదైన యుండుటకు వీలుండదనియే కదా. నీ మనస్సు ఎటు పోయినను, నిజమునకు నిన్ను కాదని ఎక్కడికిని పోదు. ఏలన, అది ఎక్కడికి పోయినను, దేనిలో లగ్నమైనను, అది నీవే. అనగా, నేను ఆత్మనను భావమున స్థిరతను సాధించి, నీ పూర్ణతను నీవు మనసా దర్శించినచో, మనస్సు ఇంక చలింపదు. అన్నిట నిన్ను నీవు దర్శించుటే రహస్యము సుమా! నీ (ప్రత్యగాత్మను) జీవాత్మను విశ్వాత్మలో లీనము చేయుటే కర్తవ్యము".

క॥ ఈరీతి మనసు నెంతయు
ధీరతతో నిల్పి మరియు దృష్టులు తనకున్
చేరన్ వహించి లోపల
మీరంగానీక మతిని మెలకువతోడన్ 321

భావము : "అంతయు నేనే యను భావమును మనస్సు నందు గట్టిగ నిలిపి, నీ చూపును కూడా (అంతర్దృష్టి) నీలో (ఆత్మపై) నిలిపి, చలింపనీయక, బుద్ధిని జాగరూకతతో నుంచుము".

సీ॥ నిర్మలినంబును నిర్మనుష్యంబును
వర్షవాతాతపవర్జితంబు

నగు విశదస్థలి దగు మృదులాసన
వాసియై భిక్షాశనాశియగుచు
స్థిరతపద్మాసనాసీనుడై కడు నిర్వి
కారుడై నియతి నేకాకియగుచు
వ్యాపారశూన్యత నేపారి సమశిరో
గ్రీవాంగయష్టియై భావశుది

తే॥ దేశికోక్తప్రకాశుడై ధీరుడగుచు
తనరి తనపూర్ణతాధ్యానతత్పరమున
నచలుడై యుండిన సమాధి యండ్రు దీని
క్రమము లెస్సగ వినుము నిష్కపటహృదయ! 322

అర్థాలు : విశదస్థలి= విశాలమైన ప్రదేశమున, మృదుల+ఆసనవాసియై= మెత్తని ఆసనముపై కూర్చుండి, భిక్షా+అశన+అశి= బిచ్చపు కూటిని తినుచు, నియతి= నియమముతో, వ్యాపారశూన్యతన్= క్రియాకలాపములు లేకుండ, ఏపారి= వర్ధిల్లి, సమశిరఃగ్రీవ+అంగయష్టియైవ శిరస్సును, మెడను, శరీరమును సమరేఖ (సరళరేఖ)గా నిటారుగా కట్టెవలె నుంచి, దేశిక ఉక్తప్రకారుడై= గురువు చెప్పిన పద్ధతిననుసరించి

భావము : "మలినము మనుష్య సంచారము వాన గాలి ఎండ లేనిదియును అయిన విశాల ప్రదేశమందు మెత్తని పీఠముపై భిక్షచే పొందిన తిండియే తినుచు, పద్మాసన స్థితిలో ఎట్టి ఆలోచనలు లేక ఒంటరియై పనులు ఏమియు చేయుటకు ప్రయత్నింపక ఒకే పంక్తిలో, శిరస్సు, మెడ, మొండెమును ఉంచి పరిశుద్ధ భావము కలవాడై గురువు చెప్పినట్లు పట్టుదల కలవాడై తన పూర్ణత్వమునే ఏకాగ్రతతో ధ్యానించుచు చలనము లేక యుండుట సమాధి. సమాధిని నిర్వర్తించు క్రమమెట్టిదో తెల్పెదను వినుము.

తే॥ పరగ లేనిది యయ్యు ప్రపంచమంత
దృశ్యశబ్దానుగుణమునై తెలియబడును

అందుదృశ్యానువిద్ధశబ్దానువిద్ధ
నిర్వికల్పసమాధులై నిగుడు మూడు **323**

భావము : "నిజముగ లేకపోయినను, ప్రపంచము దృశ్యము, శబ్దము అనువానికి అనుగుణముగ తాను ఇట్లే ప్రకటమగును. దృశ్యము కలది, శబ్దము కలది, నిర్వికల్ప సమాధి అని మూడు విధములుగా గోచరమగు చున్నది".

క॥ అవి మూడును బాహ్యాంతర
వివరంబుల షడ్విధములవెలయు సమాధుల్
దవిలిన బాహ్యాంతరములు
వివరించికదా సమాధివిధ మెఱుగదగున్ **324**

అర్థాలు : బాహ్య+అంతర= వెలుపల, లోపల, షట్+విధములు= ఆఱు విధములు, తవిలిన= తగిలిన

భావము : "ముందే చెప్పిన మూడును బాహ్యము, ఆంతరము అను భేదముల వలన సమాధి ఇట్లు ఆఱు విధములగును". 1. దృశ్యానువిద్ధ (బాహ్యము), (ఆంతరము), 2. శబ్దానువిద్ధ (బాహ్యము, ఆంతరము), 3. నిర్వికల్పసమాధి (బాహ్యము, ఆంతరము).

సీ॥ బాహ్యంబన వినుము బ్రహ్మాండకటహంబు
పంచభూతంబులు పర్వతాది
స్థావరములు లోక సంఘముల్ గ్రామముల్
చరజంతుకోటి నక్షత్రముఖ్య
సర్వంబు బాహ్య దృశ్యప్రపంచంబగు
నంతరంబనగ దేహంబునందు
ప్రాణ పంచకమును పదియింద్రియంబులు
పంచకోశములు షడ్భావములును

ఆ॥ సప్తధాతువులును సప్తభూమికలును
సప్తచక్రములును సత్త్వమాది
త్రిగుణములును మరియు దేహేంద్రియములాది
యంతరప్రపంచ మనగ దగును **325**

అర్థాలు : బ్రహ్మాండకటాహంబు= బ్రహ్మాండమనెడి పెద్దబాన, స్థావరములు= కదలనివి

భావము : బాహ్యప్రపంచమనగా, ఈ కంటికి కనబడు విశ్వము. అంతర ప్రపంచమనగా, శరీరములోని ఐదు ప్రాణవాయువులు, పది ఇంద్రియములు, ఐదు కోశములు, ఆఱు భావములు, ఏడు ధాతువులు, ఏడు భూమికలు, ఏడు చక్రములు, మూడు గుణములు.

విశేషాలు : **పంచభూతములు** : 1. భూమి, 2. నీరు, 3. నిప్పు, 4. గాలి, 5. ఆకాశము. **స్థావరములు** : కొండలు, ఱాతిగుట్టలు, చెట్లు, గ్రామములు, శిలలు (అన్ని రకములు కలిసి), వృక్షములు (గడ్డి భేదములు కూడ) చరజంతు కోటి వానరులు (కోతి, కొండముచ్చు, చింపాంజి, గొరిల్లా మొదలగున్నవి), మానవులు (అన్ని జాతులు) మఱియు ఎన్నియో కలవు.

ప్రాణపంచకము : 1. ప్రాణ, 2. అపాన, 3. వ్యాన, 4. ఉదాన, 5. సమాన.

ఇంద్రియములు : **జ్ఞానేంద్రియములు ఐదు** : 1.దృశ్య, 2. శ్రవణ, 3. ఘ్రాణ, 4. రసన, 5. స్పర్శ. **కర్మేంద్రియములైదు** : 1. కన్ను, 2. చెవి, 3. ముక్కు, 4. నాలుక, 5. చర్మము. **ఐదు కోశములు** : 1. అన్నమయ, 2. ప్రాణమయ, 3. మనోమయ, 4. విజ్ఞానమయ, 5. ఆనందమయ కోశములు. **షడ్భావములు** : 1. జని, 2. సత్త్వము, 3. వృద్ధి, 4. పరిణామము, 5. క్షయము, 6. మరణము. **సప్తధాతువులు** : 1. త్వక్, 2. అసృక్, 3. మాంస, 4. మేధస్, 5. అస్థి, 6. మజ్జా, 7. శుక్రములు. **సప్తచక్రములు** : 1. మూలాధార,

2. స్వాధిష్ఠాన, 3. అనాహత, 4. మణిపూర, 5. విశుద్ధ, 6. ఆజ్ఞ, 7. సహస్రారములు. **త్రిగుణములు** : 1. సత్త్వము, 2. రజస్సు, 3. తమస్సు

సప్త ధాతువులు : 1. బంగారము, 2. వెండి, 3. రాగి, 4. తగరము, 5. కాంస్యము, 6. సీసము, 7. ఇనుము,

సప్త భూమికలు :వాయువు, వరుణుడు, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రములు, అగ్ని, జ్యోతిర్మయము.

దేహేంద్రియములు : 1. మనస్సు, 2. చిత్తము, 3. బుద్ధి.

క॥ విను మీబాహ్యాంతరముల
నెనసి దనువిడు మలుచూపు నెయ్యది కలదో
ఘనమగు సమాధి యదియే
మునిమత మీరాజయోగమునకుం దెలియన్ 326

అర్థాలు : ఎనసిన= కలిసిన, తను= తాను,వ్యక్తి, విడ= విడువగా, మలుచూపు= మరలిన చూపు, మునిమతము= మునుల విశ్వాసము.

భావము : "పై జెప్పిన బాహ్యము, అంతరము అను వానితో కలిసిన 'వ్యక్తి' (నేను) వాని నుండి విడివడి చూపు మరల్చినచో, అదియే సమాధి యను రాజయోగము".

విశేషము : **రాజయోగము** : హఠయోగము కంటె వేఱైన యోగపద్ధతి. యోగి తన సత్త్వమును దేహమనోబుద్ధ్యహంకారములనుండి తప్పించి వేఱుగా చూచు ప్రక్రియ.

వ॥ ఈషడ్విధంబులగు సమాధులెయ్యవి యనినబాహ్యదృశ్యానువిద్ధయు బాహ్యశబ్దానువిద్ధయు బాహ్యనిర్వికల్పంబును అంతర దృశ్యాను విద్ధయు అంతరశబ్దానువిద్ధయు నంతరనిర్వికల్పంబును నన షడ్విధంబునై నొప్పు నందు బాహ్యదృశ్యానువిద్ధయనంగ నీ చెప్పిన బ్రహ్మాండకటాహపంచభూత

స్థావరజంగమాదినకల ప్రపంచంబును అస్తిభాతిప్రియనామరూపంబులై యుండుట నందు తుది రెండును ప్రపంచరూపంబై యుండు, అవి మూడును సచ్చిదానందంబులై యాత్మస్వరూపంబై యుండు నటు గావున మున్ను నే జెప్పిన సంస్థానా సనాహారాదినియమంబున సమాధికి గూర్చుండి బాహ్యంబునయు కన్న విన్న ప్రపంచంబును నామరూపంబులు వినా అస్తిభాతి ప్రియాత్మకంబైన సచ్చిదానందంబులు నేనేయని చూచుట బాహ్యదృశ్యానువిద్ధ బాహ్యశబ్దాను విద్ధ యనంగ గురువేదాంతసిద్ధాంత వాక్యంబులు నీవె బ్రహ్మమని బోధించెం గావున సర్వప్రపంచంబునందు భేదరూపంబున నీవు నేనున్నానని ఉన్నావు ఉన్నది ఉన్నవి ఉన్నారని సర్వంబునందును నన్నున న్ననెడు శబ్దంబు కలదు గావున ఆ నచ్ఛబ్దార్థము నేనె యని చూచునది బాహ్యశబ్దానువిద్ధయగు బాహ్యనిర్వికల్పంబన నీ చెప్పిన దృశ్యశబ్దానుగతస్వరూపసంధాన బాహుళ్యంబున దృశ్యశబ్దంబు లడంగి స్వరూపమాత్రంబుగా సంధానంబున నుండుట బాహ్యనిర్వికల్పంబగు నిది బాహ్యసమాధిత్రయంబు నింక నంతర దృశ్యానువిద్ధయనంగ దేహేంద్రియ ప్రాణమనోబుద్ధిచిత్తాహంకారంబులాది యేకాంతర ప్రపంచంబునందు మనంబునకు దోచు దానినామరూపంబులు ద్రోసి నిలిచిన అస్తిభాతిప్రియంబులు సచ్చిదానందంబులు గావున ఆసచ్చిదానందస్వరూపంబైన బ్రహ్మాడంబునేనె యనిడంత చూచుట యంతర దృశ్యానువిద్ధ అంతరశబ్దానువిద్ధ యనంగా నీవు సర్వసాక్షివి దేహేంద్రియవిలక్షణుండవు అని గురువేదాంతసిద్ధాంతవాక్యంబులు గలుగుటవలన నేనె బ్రహ్మంబని చూచు నదియె యంతరశబ్దాను విద్ధయగు నంతరనిర్వికల్పం బనంగ అంతరమందు దోచు దృశ్యశబ్దంబు లడంగి స్వరూపమాత్రంబులుగా దోచునప్పుడు ఈశ్వరరూపంబు నేనె యని చేయు భావన యంతరనిర్వికల్పంబు ఇవి షడ్విధ సమాధులు ఈషడ్విధ సమాధులనుండునప్పుడు విఘ్నంబులుగలవు వానిని వివరించెదను. 327

భావము : ఈ చెప్పిన ఆఱు విధముల సమాధులేవి యనగా- 1. బాహ్యదృశ్యానువిద్ధ, 2. బాహ్యశబ్దానువిద్ధ, 3. బాహ్యనిర్వికల్పము,

4. అంతరదృశ్యానువిద్ధ, 5. అంతరశబ్దానువిద్ధ, 6. అంతరనిర్వికల్ప. వీనిలో **బాహ్యదృశానువిద్ధసమాధి** : ప్రపంచము అస్తి, భాతి, ప్రియ మను మూడు లక్షణములు గలది. వానిలో భాతి, ప్రియ అను రెండు ప్రపంచరూపము. మూడును కలిసి సచ్చిదానందములైన ఆత్మస్వరూపములు. కావున నివాస ఆహారాది నియమములు పాటించి సమాధికి గూర్చుండి బాహ్యదృశ్యమాన ప్రపంచమున నామరూపములు కాక సచ్చిదానందరూపు డనగు నేనే సర్వమను దృష్టి బాహ్యదృశ్యానువిద్ధసమాది. **బాహ్యశబ్దానువిశుద్ధసమాధి** : తత్త్వమసి (అదినీవే, సత్యము నీవే), అహం బ్రహ్మాస్మి (నేను బ్రహ్మనై యున్నాను) అను గురుబోధను బట్టి నేనే భేదరూపమున అన్నిట ఉన్నానను భావము, దృష్టి. **బాహ్యనిర్వికల్పము** : దృశ్యశబ్దప్రపంచము మాసిపోయి స్వరూపమాత్ర దర్శనముతో నుండుట. **అంతరదృశ్యానువిద్ధసమాధి** : మనస్సునకు దేహ ఇంద్రియ ప్రాణమనోబుద్ధి చిత్త అహంకారములలో ఏది తోచినను దానిని 'నీవు' 'రూపములు' విడిచి నేనే అను భావములో నిమగ్నమగుట. **అంతరశబ్దానువిద్ధసమాధి** : నేనే సాక్షినని, నేనే బ్రహ్మము నను భావమున మగ్నమగుట. **అంతరనిర్వికల్పసమాధి** : అంతరమున దృశ్యశబ్దములు మాసిపోయి స్వరూపమాత్రముగ తోచు ప్రపంచము నేనే, ఈశ్వరుడను నేనే అను భావనలో మగ్నమగుట. ఈ సమాధులకు విఘ్నములున్నవి. వాని వివరము లిట్లున్నవి.

క॥ **మతినికషాయావస్థయు**
ప్రతిబంధత్రయముగాన బహువిఘ్నములున్
కృతపూర్వబహులదుష్కృత
గతిఘటియించును సమాధి గడునుద్ధతమై **328**

అర్థాలు : మతి= బుద్ధియొక్క, నికషాయ+అవస్థ బుద్ధిని= గీటురాయి పై సానబట్టునప్పుడు దానికి కలుగు స్థితి. ప్రతిబంధము= విఘ్నము, కృతపూర్వ బహుళదుష్కృతగతి= పూర్వము చేయబడిన అనేక చెడ్డపనుల విధానము, ఉద్ధతమై= విజృంభించినదై

భావము : "సమాధిస్థితిలో బుద్ధికి పరీక్ష కలుగును. కనుక పూర్వము ఆ జీవి చేసిన చెడ్డపనులన్నియు మనసులో విజృంభించును. మనసు నిర్మలముగాక పోవును".

ప్రతిబంధత్రయము : 1. భూతప్రతిబంధము, 2. వర్తమాన ప్రతిబంధము, 3. ఆగామి ప్రతిబంధము- రాబోవు కాలము గుఱించి చింత. 4. వర్తమాన బంధత్రయము 1. పుత్రైషణ, 2. దారైషణ, 3. మిత్రైషణ (లోకైషణ)

క॥ **మఱియుకషాయావస్థన**
బరగుప్రపంచంబునందు బ్రహ్మమునందున్
దొరగి మఱియూరకుండెడు
తరిమనమును నెచ్చరించి తను జూడదగున్ **329**

భావము : "ఈ చేదుగల స్థితి బ్రహ్మాన్వేషణలో కలిగినప్పుడు హెచ్చరికగా నుండి స్వస్వరూపమును ధ్యానింపవలయును".

సీ॥ **బంధురంబగు ప్రతి బంధత్రయంబన**
బరగు భూతప్రతి బంధమనగ
జ్ఞానపూర్వంబున సంసారవార్ధిలో
నెందున స్నేహంబు నెరసియుండు
నదియు సమాధిప్రత్యక్షమైతోచుట
మోహమణపసాధనమ్ము వినుము
యెయ్యది మదిదోచె నెచ్చరికను దాని
నామరూపములివి నాగకొదవు

తే॥ **యస్తిభాతిప్రియంబుల నైనయట్టి**
సచ్చిదానందమైన నిజంబు దానె
కాగ బాధింపదొలగు నిక్కంబుగాను
బలిమియై ఘనభూతి ప్రబంధమనఘ! **330**

అర్థాలు : బంధురంబగు= ఒప్పిదమైన, నాగ= అనగ, భూతి= అనుభవము

భావము : "బంధత్రయములో భూతప్రతిబంధమును గూర్చి వినుము. పూర్వ సాంసారిక స్నేహబంధములు ప్రత్యక్షమై సమాధిలో తోచును. అట్లది ప్రతిబంధకమగును. మోహపెట్టును. దానికి పరిహారము మనసులో తోచినదాని నామరూపములు, వానికి సంబంధించిన అస్తి, భాతి, ప్రియము (అనగా సత్+చిత్+ఆనందము) వీని రూపమైన ఆత్మ తానేయను మనస్సు నిల్పుట".

విశేషము : అస్తి అనగా ఉనికి ఇదియే సత్ (సత్తు). మన అనుభవములోని, భావములోని ప్రతి అంశమునకు ఇది వర్తించును. ఇది ఆత్మరూపమే కనుక ఈ భావనలో మనసు నిల్పుట. భాతి అనగా ప్రకాశము. ఇదే చిత్ (చిత్తు). మన అనుభవములోని, భావములోని ప్రతి అంశమునకు ఇది వర్తించును. ఈ ప్రకాశము, ప్రకటనము కూడ ఆత్మరూపమే కనుక, ఈ భావనలో మనసు నిల్పుట. ప్రియము అనగా ఆనందమే. (అందఱికి ప్రియమైనది ఆనందము కదా.) ఈ భావనలో మగ్నమగుట.

ఆ॥ అరయ విషయసక్తి యనగబ్రజ్ఞామాంద్య
మన గుతర్కమనగ విను విపర్య
యపుదురాగ్రహంబు న ననాలుగగువర్త
మానవిఘ్నబంధమహిమ దనరు 331

అర్థాలు : విషయసక్తి= ఇంద్రియ విషయములందు మనస్సు పోవుట, ప్రజ్ఞామాంద్యము= అతిశయించిన జ్ఞానము, ప్రజ్ఞానము మసక బడుట, కుతర్కము= వాదనలోని దోషము, విపర్యయపు= పట్టుదప్పిన.

భావము : "వర్తమాన ప్రతిబంధములు నాలుగు రీతులు 1. విషయసక్తి, 2. ప్రజ్ఞామాంద్యము, 3. కుతర్కము, 4. విపర్యయదురాగ్రహము".

1. విషయసక్తి : ఇంద్రియ సుఖమందు కోరిక (శమము దమముచే శమించును)

2. ప్రజ్ఞామాంద్యము : గురుబోధను విశ్వసింపక, ఆచరింపకపోవుట. (గురుబోధ వలన దుశ్చర్య తొలగును.)

3. కుతర్కము : వేదాంతార్థములను తగని సంశయములతో నిరసించుట (వ్యాఖ్యానములను మననము చేయుటచే ఈ వాదన తొలగును.)

4. విపర్యయదురాగ్రహము : నాలుగు వర్ణములు, నాలుగు ఆశ్రమముల యెడ మిక్కిలి ప్రీతి ప్రగాఢధ్యానముచే ఈ దోషము పరిహరింపబడును.

సీ॥ ఆ విషయాసక్తియది విషయేచ్ఛగు
మానునదిశమదమములచేత
గురుబోధ తెలివిగైకొనమి ప్రజ్ఞామాంద్య
మదియుశ్రవణమున నంతరించు
అలరు వేదాంతార్థములకు దుశ్శంకలు
తోచ గుతర్కంబు తొలగు మనన
మిహ విపర్యయదురాగ్రహమును వర్ణాశ్ర
మాభిమానము నిధి ధ్యాసననగు

తే॥ సరవినాగామిదయతోటి సంగమంబు
గాన నేవస్తువును దాను కరుణజూడ
జన్మరాశుల నిచ్చుట సత్యమగుట
సర్వసమబుద్ధి మెలగుచు సంగముడుగు 332

అర్థాలు : దుశ్శంకలు= కూడని అనుమానములు, సంగము= బంధము

భావము : "ఇంద్రియ విషయములలో ఆసక్తి క్రమముగా కోరికగా మారును. శమదమాది గుణముల సాధనచేత అది సమసిపోవును. ప్రజ్ఞామాంద్యము గురుబోధలను శ్రద్ధగవినుట వలన తొలగును. వేదాంతర్థాములకు త్రోవదప్పిన వాదములు, రాకూడని అనుమానములు కలిగిన, అది మననముచేత మానును. విపర్యయదురాగ్రహము అనగా వర్ణాశ్రమములందు ప్రేమ. ఇది

నిధిధ్యాస అను దానిచే తొలగును.ఆగామి ప్రతిబంధమను దానికి మూలము దయ. దేనినైన దయతో చూచినప్పుడు, అది జన్మపరంపరకు కారణమగును. అందుచే అన్నిటిని సమముగ చూచుటవలన ఆగామి ప్రతిబంధము తొలగును''.

విశేషాలు : నిధిధ్యాస అనగా ప్రగాఢమైన ధ్యానము. ఇది మననము ఫలించినప్పుడు కలుగు స్థితి.

క॥ ఈరీతిని విఘ్నంబులు
దూరముగా దొలగ ద్రోసి తుర్యక్రమతన్
ధీరత సమాధిచేసిన
నారూఢపదంబు నొందుటాశ్చర్యంబే 333

అర్థాలు : తుర్యక్రమత= క్రమముగా పరమాత్మను చేరు రీతిలో, ధీరత= చలింపక, ఆరూఢపదము= పరమపదము.

భావము : ''ఇట్లు క్రమముగా విఘ్నములను దాటుచు, చలింపక, సమాధిని సాధించినచో, పరమపదమును పొందగలవు''.

వ॥ మహానిర్వికల్పంబన బాహ్యాభ్యంతరదృశ్య శబ్దంబు లణంగి బ్రహ్మాండ పిండాండంబులు లేక జీవేశ్వరులనెడు భేదంబు లుడిగి పరిపూర్ణమై దేశకాలవస్తుపరిచ్ఛేదశూన్యంబునైన బ్రహ్మంబు నేనే యని చేయుభావన మహానిర్వికల్పసమాధి యనం దగునని మరియునిట్లనియె 334

వచనము : ''మహానిర్వికల్ప సమాధి యనగా వెలుపల లోపల దృశ్యశబ్దాను విద్ధములు తొలగి జీవుడు, దేవుడు అన్న భేదబుద్ధి నశించి, దేశకాల వస్తు భేదములు లేని బ్రహ్మమును (ఆత్మను) నేనే యను భావమున స్థిరపడుట మహానిర్వికల్ప సమాధి.

సీ॥ కణక మహానిర్వికల్పసమాధిగా
వింప నా నాటనువృద్ధియగుచు

తన్మయావస్థచిత్తంబున వర్ధిల్లు
నప్పుడుదాత్తత్వమగుట సుమ్ము
అంతంత నుత్సాహమతిశయింపుచు సర్వ
పరిపూర్ణతానంతపదవిజెందు
నెందును నెడలేక నెక్కడ తానయై
కదిసి యింతింతన గానియట్టి

తే॥ పూర్ణత వహించి యించుక పొరపులేక
జ్ఞానమనుటయు జ్ఞేయంబు జ్ఞాతృతయును
లేక మనసాత్మయందున లీనమగుచు
యుండు నత్తరిగద ముక్తినొందురీతి 335

అర్థాలు : నానాటను= రోజురోజుకు, పొరపు= భేదము, తఱి= సమయమందు,

భావము : ''మహానిర్వికల్ప సమాధిని సాధించు యత్నమున దినదినాభివృద్ధిగ పారవశ్యము కలుగునప్పుడు, ఉత్సాహము మీరుచు పూర్ణమైన ఆనందమును సాధించి, జ్ఞానము-జ్ఞేయము-జ్ఞాత అను భేదబుద్ధి లేక ఆత్మలో మనసు లీనమైపోవుటే ముక్తి''.

విశేషము : జ్ఞానము= తెలియబడునది, జ్ఞాత= తెలిసికొనువాడు, జ్ఞేయము= తెలియదగిన విషయము

తే॥ అరయ నిత్యంబు నిరుపాధి నిరతిశయము
నైన యానందము ప్రకాశమైతనర్చు
ననఘ! యీయోగమునకును నది ఫలంబు
నదియ యమనస్కసుఖమని యంద్రు బుధులు 336

భావము : ''శాశ్వతము, దేనిపై ఆధారపడనిది, అంతకంటె అధికము లేనిది, ఇట్టి ఆనందము ఈ సమాధిలో కలుగును. దీనినే అమనస్కసుఖము అనికూడా అందురు''.

చ॥ అదియును కాకనంతనిజమయ్యు నియా మక నిర్ణయక్రియా
స్పదములు లేక సర్వసమభావనచే విధియున్ నిషేధమున్
మదినొకయింత దోచక సమాననిరంతరతృప్తినొంది స
మ్ముదమున సంచరించు పరమున్నిహమున్నను భేదశూన్యుడై 337

అర్థాలు : నియామకనిర్ణయక్రియాస్పదములు= శాసించునది, నిశ్చయించునది యైన క్రియలకు ఆధారములు, విధియున్= తప్పక చేయవలసిన కార్యము, నిషేధమున్= చేయరాని కార్యము, సమ్ముదమున= ఆనందముతో, పరమున్= స్వర్గనరకాది మరణాంతర లోకప్రాప్తి, ఇహమున్= ఈ ప్రస్తుత భూలోక జీవనము.

భావము : ''తర్వాత దేనియందు మనసును నిలుపక, తనదైన కార్యమును నిశ్చయించుట చేయుట అను వానియెడ కూడ మనస్సును వదలి, అన్నియును సమానమైనవే అనెడి భావనలో, చేయవలసినది, చేయరానిది అనెడి ఆలోచనను వదలి చలింపని తృప్తితో ఇహలోక పరలోక సుఖముల విషయమును వ్యత్యాసమును పాటించక ఆనందముతో సంచరించువాడే, ''యోగి''.

సీ॥ యొకచోట బ్రహ్మచర్యోన్నతి విహరించు
నొకటగృహస్థన నుండు మఱియు
నొకట వానప్రస్థుడోయన దనరారు
నొక సన్యాసంబు నుద్ధరించు
నొకట నుపరమహంసకు డనవర్తించు
నొక్కట నవధూత చక్కటెసగు
నొకట దిగంబరయుక్తిని జరియించు
నొకట నేమియులేక నూరకుండు

తే॥ వెఱ్ఱివలెనుండు బాలునివిధము నొందు
మత్తుడై యుండు మౌనియై మలయుచుండు

చెప్ప నెట్లగు నమనస్కసిద్ధుడైన
యోగివర్యున కెట్లున్న నొప్పిదములు 338

భావము : ''అట్టి యోగి ఒకప్పుడు బ్రహ్మచారివలె, ఒకప్పుడు గృహస్థునివలె, ఒకప్పుడు వానప్రస్థుడై, ఒకచో సన్యాసివలెను, ఒకప్పుడు పరమహంస యన్నట్లు, మఱొకప్పుడు అవధూతగా, ఒకసారి దిగంబరుడై, ఒకప్పుడు నిష్క్రియుడై, పిచ్చివానివలె, బాలునివలె, మైమఱచి, మునివలె, ఇట్లెన్ని రీతులనైన కన్పించును. ఇదేదియు వానియందు దోషము కాదు. ఇది అమనస్కయోగి స్థితి.

అవధూత, పరమహంస అనువారు సన్యాసులే. అవధూతలు దిగంబరులుగ నుండుట పరిపాటి. వీరిరువురును ఆత్మజ్ఞానమున సదా స్థిరులైన వారే. పరమహంస దిగంబరుడుగ నుండనక్కఱలేదు. శ్రీ సదాశివబ్రహ్మేంద్రుడు అవధూత. శ్రీరామకృష్ణుడు పరమహంస.

మ॥ అమనస్కుండగు రాజయోగి గడు వెంటాడించి యెల్లప్పుడా
యమరేంద్రాజశివాబ్జనాభులు మహాహ్లాదంబుతోగాచుచున్
నిమిషంబున్నెడబాయకే మెలగగా నెక్కొన్నవర్ణాశ్రమో
త్క్రమణుండయ్యును సంచరించు గడుశాంతస్వాంతుడై యెల్లచోన్ 339

అర్థాలు : వర్ణాశ్రమోత్క్రమణుండు= వర్ణాశ్రమధర్మములను తప్పనివాడు

భావము : ''ఈ అమనస్క రాజయోగిని ఇంద్రుడు, త్రిమూర్తులు చాలా సంతోషముతో వెంటనుండి కాపాడుచుందురు. ఈతడు వర్ణఆశ్రమ ధర్మములను పాటింపక శాంతితో ఎక్కడైన ఎప్పుడైన సంచరించగలడు''. వర్ణాశ్రమ ధర్మములనగా, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులములకు మతగ్రంథములలో చెప్పబడిన జీవనవిధానములు, అట్లే బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసములను ఆశ్రమములకు నియమింపబడిన ధర్మములు. ఇవి వారివారికి విధింపబడిన ప్రవర్తన నియమావళి.

ఆ॥ అట్టియోగివర్యు నరసి భిక్షామాత్ర
మన్నమిడిరయేని యతులవిప్ర
లక్షశతము బూర్ణదక్షిణపూర్వంబు
గాగ నన్నమిడుట గడమఫలము 340

అర్థాలు : అరసి= తెలిసికొని, ఇడిరయేని= ఇచ్చినట్లయిన, అతుల= సమానములేని, విప్ర= బ్రాహ్మణ

భావము : "అట్టి యోగిని గుర్తించి బిచ్చముగ అన్నము పెట్టినను అది పదికోట్ల మంది (లెక్కలేనంతమంది, అని భావము) బ్రాహ్మణులకు పూర్ణ దక్షిణలిచ్చి అన్నము పెట్టినంత ఫలము లభించును.

క॥ ఆయోగివరశిఖామణి
యేయెడ వసియించె నటకు నెటుచూచిన చు
ట్టాయవనియె పంచక్రో
శాయతముగ వారణాసి యైవర్తిల్లున్ 341

అర్థాలు : ఏయెడ= ఏ ప్రదేశమున, ఆ అవనియె= ఆ భూమియే, పంచక్రోశాయుతము= ఐదుక్రోసుల వైశాల్యము, వారణాసి= కాశీక్షేత్రము

భావము : "ఆ యోగి ఎక్కడ నుండునో ఆ ప్రదేశము చుట్టూ ఐదుక్రోసుల దూరము అన్ని దిక్కులందు కాశీక్షేత్రమంత పుణ్యస్థలమగును".

ఉ॥ ఆ మహనీయమూర్తిమహిమాతిశయంబును లెక్కబెట్టగా
తామరచూలికిం బలుకుతన్వికి శేషునకైన శక్యమే
యామహితాత్ముడే హరిహరాబ్జభవాదిపిపీలికాది జీ
వామితమౌప్రపంచనిచయాశ్రయకారణ మౌను నిక్కమున్ 342

అర్థాలు : తామరచూలి= బ్రహ్మ, పలుకుతన్వి= సరస్వతి, శేషుడు= ఆదిశేషుడు, హరిహర+పిపీలికాదిజీవఅమితమౌ= విష్ణువు, శివుడు, బ్రహ్మాది

దేవతలతో, చీమ మొదలగుజీవులచేచాలాపెద్దదైన, ప్రపంచనిచయాశ్రయకారణమౌను= లోకముల సమూహములకు ఆధారమైనవాడు.

భావము : "ఆ యోగి మహిమ ఇంతయని చెప్పుటకు వీలులేదు. బ్రహ్మాది దేవతలకును, లోకములోని సమస్త జీవులకును వారివారి ఉనికికి కారణము, ఆధారము ఆ యోగియే సుమా!"

క॥ ఇంతయు నిజమగు నిది వే
దాంతార్థము నీవు నిశ్చయాత్ముడవై యే
కాంతస్థలి నియమితసు
స్వాంతుడవై సలుపు మాత్మసంధానంబున్ 343

భావము : "ఇది సత్యము. మనోనిశ్చయముతో నీవు ఏకాంత స్థలమున మనసును, ఇంద్రియములను వశము జేసికొని ఆత్మయోగమును సాధించి చూడుము. ఇదియే వేదములు చెప్పు సత్యము".

వ॥ అని యిట్లుపదేశించు వాసుదేవబోధపరితృప్తమానసుండై మహదానందంబున నర్తింపుచు గీతంబులుబాడి పునఃప్రణామంబు లాచరించి నారదుడు భగవంతునకిట్లనియె 344

భావము : కృష్ణుని ఉపదేశమును విని నారదుడు ఆనందముతో పాడుచు నాట్యమాడి మరల మరల నమస్కరించుచు ఇట్లనెను.

క॥ పరమాత్మ! భక్తవత్సల!
తరియించితి మీదయాసుధాసంప్లుతిచే
మరియొక్కవిన్నపము సా
దరమున, వినుమా! అనంత తామరసాక్షా! 345

అర్థాలు : దయాసుధాసంప్లుతిచే= వెల్లువయైన దయామృతము వలన,

భావము : "స్వామీ! మీ దయచేత సంసారమును తరించినాను. నాది మఱొక విన్నపమున్నది".

క॥ ఈమేనేకద యిప్పుడు
భామాకారంబు దాల్చి బాముల బడుటల్
భామాకృతిసుతమోహం
బీ మేనను పాయకున్న దేమన నేర్తున్ 346

అర్థాలు : బాముల= బాధలలో, భామాకృతి= స్త్రీరూపమున

భావము : "ఈ శరీరమే కదా స్త్రీ రూపమున ఇన్ని కష్టముల పాలైనది. ఆ స్త్రీ రూప సంబంధమై కొడుకులపై అప్పుడు కలిగిన పిచ్చిప్రేమ ఈ నారద శరీరములో కూడ విడువక నిల్చియున్నది. దీని నేమనవలె?"

ఆ॥ వీరి కేదిగతియొ విశ్వవిభుండగు
చంద్రకేతు డెట్టిసరణి నగు
యానతీయవే దయాంభోనిధి యనన్
మౌని కిట్టులనియె మాధవుండు 347

భావము : "నేను స్త్రీ రూపమున జన్మనిచ్చిన ఆ అరువది మంది సుతుల గతియేమి? నా కప్పుడు భర్తయైన చంద్రకేతు మహారాజు స్థితియేమి? దయతో చెప్పండి" లక్ష్మీపతి ఇట్లనియె

చ॥ వెనకటి మౌనిశాపమున వ్రేల్మిడి నర్వదివత్సరంబులున్
తనయులుగా జనించియు పదంపడి నీదగు కారణాంగనా
తనువున శాపముక్తులిక ధాతనియామకకార్యవర్తులై
యనుపమకాలనిర్ణయవిహారులు వారికి చింతయేటికిన్ 348

అర్థాలు : వెనుకటి= పూర్వపు, వ్రేల్మిడి= చిటికెలో, పదంపడి= తర్వాత, కారణాంగనాతనువున= ఒకానొక కారణమువలన కలిగిన స్త్రీ దేహమున,

భావము : "పూర్వము ముని శాపము కారణముగ నీకు కుమారులై నీకు ఒకానొక కారణము వలన కలిగిన స్త్రీ దేహములో జన్మించి, తర్వాత వారు

శాపముక్తులై, బ్రహ్మ నియమించినట్లు కాలమును విభజించు పనిలో నిమగ్నులై యున్నారు. వారిని గూర్చి చింత యెందులకు"? ప్రభవాది అరువది సంవత్సరములే ఆ నారదకుమారులు.

మ॥ భగవద్భక్తుడవైన నీదు తనుసంపర్కప్రభావంబునన్
జగతీనాథుడు చంద్రకేతుడు దగన్ స్వర్గస్థుడై మీదటన్
భగవద్భక్తిపరాయణుం డగుచు భూభాగంబునం బుట్టె నీ
జగతీభారముదాల్చి తాతుడను సుజ్ఞానస్థితిం జెందె డిన్ 349

అర్థాలు : తనుసంపర్కప్రభావంబునన్= శరీరస్పర్శయొక్క మహిమచేత, సుజ్ఞాన= గొప్ప తెలిపి

భావము : "నీవు భగవద్భక్తుడవు కనుక, నారదా! నీ శరీరస్పర్శ చేత ఆ చంద్రకేతు మహారాజు స్వర్గమును పొంది, ఆపై, భగవద్భక్తుడై భూమిలో పుట్టి రాజై సుజ్ఞానియగును". సుజ్ఞాని యనగా ఆత్మ-పరమాత్మలకు భేదములేదని స్వస్వరూప దర్శనము ద్వారా తెలిసికొనిన యోగి.

వ॥ అని యానతిచ్చిన సంతోషితాంతరంగుండై వందనం బొన చిన యరవిందభవనందనుం దోడ్కొని నందనందనుండు నిజసుందరా నందవనంబు కందువకు వచ్చు నంతకు ముందర 350

అర్థాలు : అరవిందభవనందనుడు= బ్రహ్మకుమారుడైన నారదుడు, కందువకు= తన నివాసమునకు

భావము : అని కృష్ణుడు వచింపగా నారదుడు ఆనందించి, నమస్కరించెను. కృష్ణుడు నారదునితో తన నివాసమునకు రాకముందే అచ్చట,

ఉ॥ రాముడు విప్రసంఘమును రాజలలామలు కూడి కేళినా
రామవిహారకౌతుకవిరాజితులై శ్రమదీర మల్లికా
దామశశాంకరత్న సువితర్ధికయందున విశ్రమించి శ్రీ
కామునిరాకకై యెదురు గాంచుచు నుండగ వారిచేరువన్ 351

అర్థాలు : రాముడు= బలరాముడు, విప్రసంఘము= బ్రాహ్మణులును, రాజలలామలు= అంతఃపురస్త్రీలు, రామవిహారకేతుకవిరాజితులై= ఆనందముగా వనవిహారము కావించిన కుతూహలముతో, మల్లికాదామశశాంకరత్నసువితర్దికయందున= మల్లికాపుష్పములున్న చంద్రకాంత శిలావేదికపై, శ్రీకాముని= కృష్ణుని.

భావము : బలరాముడు బ్రాహ్మణులును రాజకన్యనలను గూడి వనవిహారము కావించి చంద్రకాంత శిలావేదికపై సేదదీరుచు శ్రీకృష్ణుని రాకకై ఎదురుచూచు చుండగా వారికి సమీపమున

శా॥ **ప్రొద్దున్ వ్రాలుటెరుంగకే వనములో పూబోళ్లు గ్రీడింపుచో**
హద్దుల్ మీఱిన యన్నగళ్ల విపులాహాసానుకూలక్రియలన్
నిద్దాపొన్నమెరంగు మందిరములో నీలాంబుదశ్యాము మేల్
సుద్దుల్ జెప్పుచు సత్యరుక్మిణియు యించుంబోళ్లు వర్తింపగన్ 352

అర్థాలు : నిద్దా= మనోహరమైన, పూబోళ్లు= పూవులవలె సుకుమారమైన స్త్రీలు, అన్నగళ్ళ= కొజ్జాల, విపులఆహాసఅనుకూలక్రియానిద్దా= నవ్వులతో ఇష్టములైన పనులతో తగిన, పొన్నమెరుంగు= పొన్నల మెఱుపుగల, నీలాంబుదశ్యాము= కృష్ణుని, సుద్దుల్= ముచ్చటలు, ఇంచుంబోళ్ళ= అందగత్తెలు

భావము : ప్రొద్దుక్రుంకుట నెఱుగక వనములో ఆడుచు, నపుంసకులు హాస్యక్రియలతో అందమైన మందిరములో కృష్ణుని ముచ్చటలు చెప్పుకొనుచు సత్యభామ, రుక్మిణి, తక్కిన స్త్రీలునుండగా,

శా॥ **హేరాళంబుగ బోనపుట్టికలతో నిష్టాన్నపానాదిసం**
భారానేకసహస్రభారవహసంపన్నంబుతో వచ్చి శృం
గారారామసరోరుహాకరతటిం కల్పావనీజాంతరా
గారాస్థానము సత్యరుక్మిణుల కీయన్ సాత్యకేతెంచినన్ 353

అర్థాలు : హేరాళము= అధికముగ, బోనపుట్టికలతో= అన్నము మొ॥ తినుబండారముల బుట్టలతో, ఇష్ట+అన్నపాన+ఆది= రుచికరమైన అన్నము, పానీయము మొదలైన, సంభార+అనేక= బరువైన ఆహార పదార్థములు మోయుచు వేలకొలది సేవకులు మెండుగా, శృంగార+ఆరామసరోరుహ ఆకరతటిన్= కేళీవనమందు సరస్సు యొక్కతీరమందు. కల్ప+అవనీజ+ అంతర అగార స్థానమున్= కల్పవృక్షముల మధ్యనున్న మందిరమున

భావము : సాత్యకి ఆహారపదార్థములు గల బంగారు బుట్టలందు పెట్టుకొని కేళీగృహ సరస్సు యొక్క తీరమందు కల్పవృక్షముల మందిరమున మధ్య ఉండు సత్యభామ, రుక్మిణులకు ఇచ్చుటకు తెచ్చెను.

క॥ **పొంచి బలరామముఖ్యుల**
గాంచి తదీయానుమతినికడువినయమునన్
మించి వసియించి హరిరా
కంచితగతి నరయుచున్న యవసరమందున్ 354

అర్థాలు : పొంచి= చాటుగ లేచి, వసియించి= శ్రద్ధతో నిలుచుచున్న

భావము : వేచి, బలరామాదుల చూచి, వారి అనుమతితో వినయముగా నుండి కృష్ణుని రాకకై ఎదురుచూచు చుండగా,

చ॥ **మురరిపునారదుల్ గణగి ముచ్చటలాడుచు జేరి వచ్చి వి**
స్ఫురతరపల్లవామ్ర తరుపుంజవిశాలవిలాసశీతలో
త్కరమృదులావనీస్థలి ముదంబున రామసుహృజ్జనాప్తభూ
సురపరివేష్టితోన్నతిని శోభనలీల వసించియుండగన్ 355

అర్థాలు : విస్ఫురతర+పల్లవ ఆమ్రతరుపుంజవిశాలవిలాసశీతల+ ఉత్కరమృదులఅవనీస్థలిన్= వికసించిన చిగుళ్లు గల మామిడిచెట్ల గుంపులతో విశాలమైన గుబురులతో చల్లదనము గల మెత్తని నేలపై,

బలరామసుహృత్ ఆప్తభూసురపరివేష్టిత= బలరాముడు బంధువులు బ్రాహ్మణులు చుట్టు నుండగా

భావము : కృష్ణుడు నారదునితో మాటలాడుచు మామిడి చెట్ల గుంపుగల విశాలమైన విలాసవంతమైన చల్లగానుండు చోటున సంతోషముతో బలరామాదులు చుట్టును వైభవముతో నిల్చియుండగా,

ఉ॥ అల్లన వచ్చిసాత్యకి నయస్థితి నమ్మునిరాజరుక్మిణీ
వల్లభపాదపద్మముల వ్రాలి మురాంతకు నెచ్చరించి నం
తల్లన మౌనిరాజసుహృదాప్తజనంబులతోన వచ్చియా
చల్లనిచూతపందిరుల చక్కటిగోడ సరాదులోపలన్ 356

అర్థాలు : నయస్థితి= వినయము కలవాడై, ఎచ్చరించి= సూచించుటచే,

భావము : మెల్లగా కృష్ణ నారదులు లోపలికి రాగా సాత్యకి వారి పాదములపై వ్రాలి మొక్కి కృష్ణుని లోనికి రమ్మని సూచించుటచే నారదుడు పరిజనముతో చల్లని మామిడి పందిరిలో గుండ్రని ఆవరణములైన తెరల నడుమ,

శా॥ లీలాబ్జాకరతీరమందు లలి నోలిం దీర్చుచున్ మిక్కిలిన్
బాళిన్ పంక్తులు జాగి సన్మృదులరంభాపత్రపాత్రంబులన్
హాళిన్ రుక్మిణిసత్యభామయును నెయ్యంబొప్ప వడ్డింపగా
మేలౌ షడ్రసమిశ్రితాన్నములు సంప్రీతిన్ మహోత్సాహులై 357

అర్థాలు : బాళిన్= కోరికతో, లీలా+అబ్జాకర= విలాసవంతమైన సరస్సు, సత్‌మృదుల రంభాపత్ర పాత్రంబులన్= మెత్తని అరటి యాకుల పాత్రలలో, హాళిన్= సంతోషముతో, లలిన్= క్రమముగా.

భావము : విలాసవంతమైన సరస్సు యొక్క తీరమందు క్రమముగా, వరుసగా ఏర్పడి ఎక్కువ కాంక్షతో, చాలా మృదువైన అరటి ఆకులపై గల పాత్రలలో రుక్మిణి సత్యభామయు మిక్కిలి ప్రీతితో గొప్ప ఉత్సాహముతో ఆరు రసములుగల భోజనము వడ్డించిరి.

షడ్రసములు : తీపి, పులుపు, కారము, ఉప్పు. ఒగరు, చేదు.

క॥ భుజియించి వార్చి నారదు
భజనాపూర్వంబుగాను పంపినయంతన్
నిజరథము దారకుడు దే
గజవరదుడు భైష్మిమొదలుగా భామలతోన్ 358

అర్థాలు : దారకుండు= సారథి, భైష్మి= భీష్మకపుత్రి రుక్మిణి

భావము : భోజనము అయిన పిమ్మట, సాయం సంధ్యావందనము కావించిన నారదుని సగౌరవముగ సాగనంపి, తర్వాత తన రథమును సారథి తీసుకొని రాగా, కృష్ణుడు రుక్మిణి మొ॥ వారితో,

ఉ॥ స్యందనమెక్కి రాముడును సాత్యకి సర్వసుహృజ్జనంబు లా
నందముతోన వాజిమదనాగరథాదుల నెక్కి చుట్టురా
క్రందుకొ భూరిలీలచతురంగబలంబులు గొల్వగా గడున్
దుందుభినిస్వనంబులును దూర్ణముగామొరయంగ వేడుకన్ 359

అర్థాలు : స్యందనము= రథము, వాజి= గుఱ్ఱములు, మదనాగ= మదించిన ఏనుగులు, భూరి= గొప్ప, తూర్ణముగా= వేగముగా, మొరయంగ= మ్రోగగా,

భావము : బలరాముడు, సాత్యకి, మిత్రులు గుఱ్ఱములు, ఏనుగులు, రథములు ఎక్కి చుట్టిరాగా, ఆనందముతో చతురంగ బలములు సేవించగా, దుందుభులు మ్రోగగా, రథమునెక్కి,

మ॥ పురవీథిన్ జనుదేర మేడలను పూబోండ్లున్ ముదం బొప్పగా
విరులున్ లాజలు నక్షతంబులు శుభావిర్భావలీలాగతిన్
గురియన్ పాఠకవర్గమున్ బొగడగా కోట్యర్కతేజంబులన్
పరమోద్దీపితరత్నహారతులొగిన్ వారాంగనల్ బట్టగన్ 360

అర్థాలు : లాజలును= పేలాలు, బొరుగులు, పాఠకవర్గము= స్తోత్రపాఠకులు, కోటి అర్క= కోటిసూర్యుల, శుభ ఆవిర్భావలీలాగతిన్= శుభములను కలిగించు విలాస గమనములతో,

భావము : నగరవీథులలో పోవుచుండగా మేడలపై అందమైన స్త్రీలు పువ్వులు, పేలాలు, అక్షతలు శుభప్రదముగా చల్లుచుండగా, స్తోత్రపాఠకులు పొగడగా, కోటి సూర్యులకాంతితో వెలుగులు చిమ్ము రత్నహారతులను వేశ్యలు ఇచ్చుచుండగా,

క॥ పరిపూర్ణవైభవంబున
హరి నిజమణిహేమమందిరావాసుండై
నిరతిశయభోగభాగ్య
స్ఫురణన్ సుఖముండె నంత సురముని కణకన్ 361

భావము : అటు వెడలిపోయి కృష్ణుడు అమితమైన వైభవముతో తన కాంచన మణిమయ మందిరమందు భోగభాగ్యముల తేలుచు సుఖముగా నుండెను. తర్వాత దేవముని ప్రయత్నముతో,

క॥ హిమశైలకందరస్థలి
క్రమమున సవికల్పనిర్వికల్పసమాధుల్
సమతనొనరించి వ్రేల్మిడి
నమనస్కసుఖంబు బడసె నని తెల్పి తగన్ 362

భావము : హిమాలయపర్వత గుహలలో వరుసగా సవికల్ప సమాధి, నిర్వికల్ప సమాధి సమముగా సాధించి, నారదుడు అమనస్క సుఖమును పొందెను. సవికల్పసమాధి అనగా కర్త-కర్మ, జ్ఞానము-జ్ఞాత అను తెలివి కలది.

క॥ ఈరీతి విష్ణుమాయా
చారిత్రము లెన్నియనుచు సరవి వచింపన్

నీరజభవముఖ్యులకును
నేరంగారాదటన్న నేనెంతరయన్ 363

భావము : సూతుడు ఇట్లనెను "ఇట్టి విష్ణుమాయావిలాసములు క్రమముగా చెప్పుటకు బ్రహ్మాదులకే అశక్యమనగా, వానిని చెప్పుటకు నేనెంత? అనెను.

క॥ ఈచారిత్రము లెవ్వరు
వాంఛ చదువ వినిన లెస్స వ్రాసిన జనులన్
బ్రోచును హరి యాకీర్తులు
ఆచంద్రార్కములు ముక్తు లగుదురుతుదలన్ 364

భావము : ఈ కథలను శ్రద్ధతో చదివిన, వినిన వ్రాసిన జనులను హరి కాపాడును. వారి కీర్తులు సూర్యచంద్రులున్నంత కాలము నిలిచియుండును. వారు కడకు ముక్తులగుదురు.

మ॥ అనుచున్ శౌనకముఖ్యమౌనులకు నెయ్యం బొప్ప సూతుండు చె
ప్పిన యీపుణ్యచరిత్ర సర్వజగతిన్ పెంపొందు సత్యంబునై
యినచంద్రస్థితిలోకపావనమునై యిష్టార్థసంధాయిమై
వనజాతాక్షకృపాకటాక్ష వశతన్ వర్ధిల్లు నెల్లపుడున్ 365

అర్థాలు : నెయ్యంబు ఒప్పన్= స్నేహభావముతో

భావము : స్నేహముతో సూతుడు శౌనకాది మునులకు చెప్పిన కథ లోకములన్నింటిలో సత్యమైనదిగా వృద్ధి పొందును. సూర్యచంద్రులు ప్రకాశించునంత వఱకు పవిత్రమై జనులు కోరెడిదంతయును విష్ణువు ఇచ్చును. ఆ దేవుని దయగల చూపులు వారిపై వికసించు చుండును. వారెల్లరు విష్ణుపదమున నుందురని భావము పై రెండు పద్యములు ఫలశ్రుతి. ఇందు సర్వజనులకు శుభముల ఆకాంక్ష ప్రధాన భావము.

శా॥ భద్రేభార్తినివారణా సకలభూభారైకసంహారణా
చిద్రూపాఖిలకారణా!! బుధలసచ్చిత్తాబ్జసంధారణా

రుద్రాత్మీయవిచారణా! ఖగవరారూఢానుసంచారణా!
హృద్రోగాంబుధి తారణా! సుజనవాంఛాజాల సంపూరణా! 366

అర్థాలు : భద్ర+ఇభ+ఆర్తి నివారణా= గజేంద్రుని దైన్యమును తొలగించిన వాడా! సకలభూభార ఏకసంహారణా= భూమికి భారములై బాధలన్నంటిని నశింపజేయువాడా!, చిత్+రూపా= జ్ఞానస్వరూపా!, అఖిలకారణా= సృష్టికి ప్రధానకారణమైన వాడా!, బుధజనచిత్త+అబ్జ+సంధారణా= సజ్జనుల (పండితుల) మనస్సుల అనెడి పద్మములలో వారి ధ్యానముచే నుండువాడా! రుద్ర ఆత్మీయవిచారణా= తనలో భాగమైన రుద్రుని యోగసమాధి యందు విశేషముగా చరించువాడా! ఖగవర+ఆరూఢ+అనుసంచారణ= పక్షీంద్రుడైన గరుడునిపై చక్కగా కూర్చుండి సంచరించువాడా! హృద్+రోగ+అంబుధి తారణా= హృదయమునకు చెందిన మమత అనెడి మహా సముద్రమును దాటించువాడా!, ఇక్కడ మమకారము రోగమనియు భావము, సుజన వాంఛాజాల సంపూరణా= మంచివారి కోర్కెలన్నింటిని తీర్చువాడా!

మానిని॥ శ్రీరమణీవరశిష్ట జనావన సింధు శయాన! విశేషగుణా
ధార పరా పర దానవ సంహర! తామరసేక్షణ దైత్యహరా!
వారిజనాభ! దవానలభక్షణ వారణపాలక వైరిజయా!
మారకుమార కుమారగురుస్తుత మన్మథ మన్మథ మౌనినుతా! 367

అర్థాలు : శ్రీరమణీవర= లక్ష్మీపతి!, శిష్టజన+అవన= మంచివారిని కాపాడువాడా!, సింధుశయాన= సముద్రమే శయ్యగా కలవాడా!, విశేషగుణ+ఆధారా= సద్గుణములకు ఆధారమైనవాడా!, పర+అపర= (పరలోకము+ఇహలోకము) అన్నింటికి దూరమై నీవే సృష్టియు అయినవాడా! దానవసంహార= దనువు సంతానములగు రక్కసులను నశింపజేయువాడా!, తామరస+ఈక్షణ= పద్మము వలె సుఖప్రదములైన చూపులు గలవాడా!, దైత్యహరా= దితియొక్క సుతులగు దైత్యులను నశింపచేసినవాడా!, వారిజనాభ= పద్మమును బొడ్డున కలవాడా! దవ+అనల భక్షణవారణ= కాలకూట విషమను అగ్నిని

మ్రింగిన శివుని గర్వమును అణచినవాడా!, పాలకవైరిజయా= పరిపాలించు శత్రువులను జయించినవాడా!, మారకుమార= మనథ్మని కుమారుడైనవాడా!, కుమారగురుస్తుత= కుమారస్వామి తండ్రియైన శివునిచేత స్తోత్రము చేయబడువాడా!, మన్మథమన్మథ= కామచింత కల మనస్సులను త్రెచ్చువాడా! (పరిశుద్ధము చేయువాడా), మౌనినుతా= మునులచే స్తుతింపబడువాడా!.

అక్షర గుణింతము

చ॥ కలిహరకాంతినీల కిటి గౌరవ కీర్తిరతా కుభృద్వరో
జ్జ్వల కరకూర్మరూప పరివర్ధిత కేశవకైటభారి కో
మలపద పద్మ కౌశల రమారత కంస విమర్ద వైరి హృ
జ్జలరుహ మిత్ర భక్తజన చారు చకోరక పూర్ణ చంద్రమా! 368

అక్షరగుణింతము : పద్యరచనలో ఒక చమత్కారము. ఏదైనా ఒక హల్లును తీసికొని దానిపై అన్ని అచ్చులు చేరునట్లుగా అక్షరములను క్రమమున ఇమిడ్చి పద్యమల్లుట. ఈ పద్యములో క మొదలు కం వఱకు గల 'క' గుణింతము మొదటి మూడు పాదములలో స్పష్టముగా కూర్పబడినది.

అర్థాలు : 1. కలిహర= కలిని నశింపజేయువాడా!, 2. కాంతినీల= నీలకాంతి గలవాడా (నల్లనివాడా), 3. కిటిగౌరవ= వరాహావతారా!, 4. కీర్తిరతా= స్తోత్రములందు ఆసక్తి కలవాడా!, 5.కుభృత్+వర+ఉజ్జ్వలకర= కొండచే శోభించు కరము గలవాడా (గోవర్ధనోద్ధార), 6. కూర్మరూపపరివర్థిత= కూర్మ (తాబేలు) రూపమున వృద్ధియైన వాడా!, 7. కేశవ= కేశియను రాక్షసుని చంపినవాడా!, అందమైన కేశములు (వెంట్రుకలు) కలవాడా!, క+ఈశ, అనగా బ్రహ్మరుద్రులు ముప్పురును నీయందు గలవాడా! క+అ+ఈశ, అనగా బ్రహ్మవిష్ణురుద్రులు ముప్పురును నీ యందు గలవాడా!, 8. కైటభ+అరి= కైటభుడను రాక్షసునికి శత్రువైన వాడా!, 9. కోమలపద్మ= మృదువైన కమలముల వంటి పాదములు కలవాడా!, 10. కౌశలరమారత= కామశ్రాస్త

కౌశలముతో (నేర్పుతో) లక్ష్మియందు సురత సంభోగ సుఖము కలవాడా!, 11. కంస విమర్దన= కంసుని చక్కగా దండించినవాడా!, వైరిహృద్+ జలరుహమిత్ర= శత్రువుల మనస్సులు అనబడు పద్మములకు సూర్యుని వంటివాడా! (శత్రువుల హృదయపద్మములు వానిని చూడగనే వికసించుట రెండు కారణముల వలన జరుగను. 1. ఎప్పుడును దొరకని శత్రువు దొరికెను కదా యను సంతోషము కారణముగా, వైరభక్తి వలన, 2. నారాయణుని చేతిలో మరణించిన శత్రువు నారాయణునిలో లీనమగును గాన ఆ బ్రహ్మానందము వలన శుద్ధాత్మగా ఆనందించును), భక్తజనచారుచకోరకపూర్ణచంద్రమా!= భక్తులు అను చకోరపక్షులకు పోషకమైన వెన్నెల కిరణములను (ఆనందమును) ప్రసాదించు పున్నమి చంద్రుడా!

చతుర్విధకందము

శౌరీ! వనరుహలోచన!
భూరత నిహత దితిసుత బుధవినుత విష్ణూ!
ధీరా ఘనవర్ణ హరీ!
శ్రీరత కనకవసనధరా! చిరతరకరుణా! **369**

అర్థాలు : చతుర్విధ కందము : 1. శౌరీ= (వసుదేవుని తండ్రియైన శూరుని వంశమువాడు), శూరుని మనుమడా! 2. వనరుహలోచన= కమలము వంటి కన్నులు కలవాడా! 3.భూరత= భూదేవితో సుఖించువాడా!, 4. నిహతదితిసుత= దితి పుత్రులైన దైత్యులను హతమార్చినవాడా!, బుధవినుత= పండితులచే, జ్ఞానులచే కీర్తింపబడువాడా!, విష్ణూ= వ్యాపకత్వము లక్షణమైన సర్వవ్యాపీ! ధీరా= ధైర్యము కలవాడా!, ఘనవర్ణ= మేఘము వలె నల్లనివాడా!, హరీ= పాపములను హరించువాడా!, శ్రీరత= లక్ష్మియందు ఆసక్తి కలవాడా! కనకవసనధరా= బంగారు కాంతిగల వస్త్రము ధరించువాడా!, చిరతరకరుణా= స్థిరమైన దయ కలవాడా!,

గద్య॥ శ్రీమద్వేంకటేశ్వర వరలబ్ధ కవిత్వరచనా చమత్కార సుజనభజనాచార భారద్వాజగోత్ర పవిత్రనరసనా మాత్యపుత్ర సకల కవిజన సఖ్య వేంకటార్య ప్రణీతంబైన విష్ణుమాయావిలాసంబను మహాప్రబంధంబునందు సర్వంబును పంచమాశ్వాసము.

శ్రీహనుమత్సీతా భరతలక్ష్మణ శత్రుఘ్న సమేత శ్రీరామచంద్రార్పణమ్